# సమకాలీన ప్రపంచ చరిత్ర 1919-

## ఎం.ఏ., చరిత్ర, రెండవ సంవత్సరము, పేపరు-4


రచయితలు

శ్రీ ఎం. సోమశేఖరరావు, M.A., M.Phil.
డిపార్ట్‌మెంట్ ఆఫ్ హిస్టరీ
హిందూ కాలేజి పి.జి. సెంటర్
గుంటూరు.

డా॥ వి. కె. మోహన్, M.A., Ph.D.
రీడర్
డిపార్ట్‌మెంట్ ఆఫ్ హిస్టరీ
ఎస్.వి.ఆర్.ఎం. కాలేజి, నగరం

శ్రీ ఎం. దాసు, M.A., M.Phil.
కౌన్సిలర్ ఇన్ ఏ.పి.ఓ.యు.

సంపాదకులు మరియు అకడమిక్ కో-ఆర్డినేటర్ :
ప్రొఫెసర్ డి. భాస్కరమూర్తి, M.A., Ph.D.
డిపార్ట్‌మెంట్ ఆఫ్ హిస్టరీ & ఆర్కియాలజి
ఆచార్య నాగార్జున యూనివర్శిటి
నాగార్జున నగర్

**Director**
**Dr.Nagaraju Battu**
M.H.R.M., M.B.A., L.L.M., M.A. (Psy), M.A., (Soc), M.Ed., M.Phil., Ph.D.
Centre for Distance Education
Acharya Nagarjuna University
Nagarjuna Nagar-522510



**దూర విద్యా కేంద్రము**
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్ - 522 510
Ph : 0863 - 2293299, 08645 - 211023, 211024, Cell : 98482 85516
E-mail : anucde@yahoo.com
Website : www.anucde.com

**History of Contemporary World Since 1919,**

Edition : 2022

No. of Copies : 80

**(C) Acharya Nagarjuna University**

**This book is exclusively prepared for the use of students of Second Year M.A., Centre for Distance Education, Acharya Nagarjuna University and this book is meant for limited circulation only.**

Published by

**Dr.Nagaraju Battu**

Director

Centre for Distance Education

Acharya Nagarjuna University

Nagarjuna Nagar-522510

*Printed at :*

**M/s.Romith Technologies**

**Guntur**

# ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ 2016 నాటికి NAAC చే A గ్రేడును సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయటానికి సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, ప్రకాశం జిల్లాలోని 447 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిగ్రీ, పి.జి. స్థాయి విద్యాబోధనను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అందిస్తోంది.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉన్నత విద్యను అందరికి అందించాలన్న లక్ష్యంతో 2003-04లో దూర విద్యా కేంద్రాన్ని స్థాపించింది. పూర్తి స్థాయిలో కళాశాలకు వెళ్ళి విద్యనభ్యసించలేనివారికి, వ్యయ భరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరికవున్న గృహిణులకు ఈ దూర కేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటికే డిగ్రీ స్థాయిలో బి.ఏ., బి.కాం., బి.ఎస్.సి., పి.జి. స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్.సి., ఎం.బి.ఏ., ఎల్.ఎల్.యమ్ కోర్సులను ప్రారంభించిన విశ్వవిద్యాలయం ఈ సంవత్సరం కొత్తగా 'జీవన నైపుణ్యాలు' అనే సర్టిఫికేట్ కోర్సును కూడా ప్రారంభించింది.

ఈ దూర విద్యా విధానం ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు, సులభంగాను, సరళంగాను, విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసుకొనేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి రచనా వ్యాసంగంలో అనుభవంగల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించడం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో, నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలపై విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు నిష్ణాతులైన వారు ఇచ్చే సలహాలు, సూచనలు సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలను గ్రహించి మున్ముందు మరింత నిర్దిష్టంగా, అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, సంశయాల నివృత్తి కోసం వారాంతపు తరగతులు, కాంటాక్టు క్లాసులు ఏర్పాటు చేయటం జరిగింది.

దూర విద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేస్తున్న విద్యార్థులు, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమేగాక, చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని, తద్వారా దేశ పురోగతికి దోహదపడాలని కోరుకుంటున్నాను. రాబోయే సంవత్సరాలలో దూర విద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దిన దినాభివృద్ధి చెంది ప్రజలందరికి అందుబాటులో ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ ఆశయసాధనకు సహకరిస్తున్న, సహకరించిన దూర విద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు, ఎకడమిక్ కోఆర్డినేటర్లకు, ఎకడమిక్ కౌన్సిలర్లకు మరియు అధ్యాపకేతర సిబ్బందికి నా అభినందనలు.

**ఆచార్య రాజశేఖర్ పి.**
వైస్ - ఛాన్సలర్ (ఎఫ్ఎసి)
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

# M.A. History 2nd Year
## SYLLABUS
## PAPER - IV : HISTORY OF CONTEMPORARY WORLD SINCE 1919

**Unit - I :** Paris Peace Conference of the year 1919 - The Fourteen Points of President Woodrow Wilson - The Role of Britain France and Italyin the Conference - Treaties with Axis Powers - reparations - The Daws Plan and young Plan - French Occupation of Saar Valley - Turkey After the War - Post - War Political Re-arrangements in Europe.

**Unit - II :** Internal Developments of Germany - Political and Economic - Foundation of Republic - Its Function and Failure - French Quest for security - The Geneva Protocal and the Locarno pact - League of Nations - Its Organs and Function - Shortcomings and Weakness - Disarmanent conferences and efforts - The Great Economic Depression of 1928 and its effects on Europe.

**Unit - III :** Rise of Hitler and Nazism in Germany and Fascism in Italy - Policies and Programmes - aggression on Poland and Czechoslovakia - Italian Impreialism and Aggression on Ethiopia - The Spanish Civil War - Soviet Russia and its position in the International Developments during the world wars - Great Britian and the Policy and Appeasement.

**Unit - IV :** Rise of Japan as an Imperialist Power - Manchurian Crisis - Aggression on China and Expansion into Indo-China - The Kuomintang Government in China and Rise of Communism - Causes and Course of the Second World War - U.S.A. in the War - Atlantic Charter and Foundation of the United Nations organization - Function of the United Nations Organization - Its strength and Weakness.

**Unit - V :** Foreign Policy of U.S.A. after the second World War - Marshall Plan and Truman Doctrine - Millitary pacts of NATO, SEATI, CENTO, ANZUS etc. - USSR and the Warsaw pact - Cold War - Non-Aligned Movement - European Economic Community - Disintegraption of USSR - Globalization of Economy Community - Disintegraption of USSR - Globalization of Economy and its Prospects for International Peace and Co-operation.

**Suggested Books :**


1. Kettlebey C.D.M. : A History of Modern Europe
2. Thompson, David : Europe Since Napolean
3. Fisher, H.A.L. : A History of Europe, Vol. II.
4. Hayes. C.J.H. : Modern Europe to 1870
5. Hayes. C.J.H. : Contemporary Europe Since 1870
6. Louis Gottschalk and Donald Lach : Europe and Modern World, 2 Vols.
7. Lipson E. : Europe in the 19th and 20th Centuries
8. Grant and Tamperly : History of the Far East in Modern Times
9. Harold M. Vinacke : International Politics between the World Wars.
10. Carr, E.H.

**M.A. (Final) DEGREE EXAMINATION, DECEMBER 2005.**

Second Year

History

Paper **IV - HISTORY OF CONTEMPORARY WORLD SINCE 1919**

Time: Three hours | Maximum : 100 marks

Answer ALL questions.

All questions carry equal marks.

1. Discuss the impact of the treaty of Versailles, 1919 on European Politics.
   ఐరోపా రాజకీయాలపై 1919 నాటి వర్సైల్స్ సంధి ప్రభావాన్ని చర్చించుము.
2. Examine the importance of 'Daws Plan' and 'Young Plan' in the reconstruction of Germany.
   జర్మనీ పునర్నిర్మాణంలో 'డాన్ ప్రణాళిక' 'యంగ్ ప్రణాళికల' ప్రాముఖ్యతను వివరింపుము.
3. Examine the internl political developments in Germany after the World War I.
   మొదటి ప్రపంచ యుద్ధానంతరం జర్మనీలో సాగిన అంతర్గత మార్పులను వివరింపుము.
4. Trace the causes for the failure of League of Nations.
   నానాజాతి సమితి వైఫల్యానికి కారణాలను వివరింపుము.
5. Discuss the external policy of Hitlor.
   హిట్లర్ విదేశాంగ విధానాన్ని వివరింపుము.
6. Analyse the causes and results of Spanish Civil War.
   స్పానిష్ పౌర యుద్ధ కారణాలను, ఫలితాలను విశ్లేషించుము.
7. Trace the rise of Japan as imperial power in Asia.
   ఆసియాలో సామ్రాజ్యవాద దేశంగా జపాన్ ఆవిర్భావాన్ని గూర్చి వివరింపుము.
8. Discuss the causes and results of World War II.
   రెండవ ప్రపంచ యుద్ధ కారణాలను, ఫలితాలను వివరింపుము.
9. Examine the foreing policy of America after the World War II.
   రెండవ ప్రపంచ యుద్ధానంతరం అమెరికా విదేశాంగ విధినాన్ని వివరింపుము.
10. Critically examine India's foreign policy with special reference to non-alignment.
    భారతదేశ విదేశాంగ విధానాన్ని ముఖ్యంగా అలీన విధానాన్ని నిశితంగా పరిశీలించుము.

**M.A. (Final) DEGREE EXAMINATION, MAY 2006.**

History

**Paper IV - HISTORY OF CONTEMPORARY WORLD SINCE 1919**

Time : Three hours Maximum : 100 marks

Answer any FIVE questions

All questions carry equal marks.

1. Critically examine the fourteen points of Woodrow Wilson.
   ఉడ్రో విల్సన్ పద్నాలుగు అంశాల్ని విమర్శనాత్మకంగా పరిశీలించుము.

2. Give an account of Kemal Pasha.
   కెమాల్ పాషా గురించి వ్రాయుము.

3. Write a note on the Geneva Protocol and Locarno Pact.
   జెనీవా ఒడంబడిక, లొకార్నో అంగీకారాల గురించి వ్రాయుము.

4. Discuss the Great Economic Depression of 1928 and its effects on Europe.
   1928 నాటి ఆర్థిక మాంద్యం, యూరపుపై దాని ప్రభావం గురించి చర్చించుము.

5. Write a note on Facist Italy.
   ఫాసిస్టు ఇటలీ గురించి వ్రాయుము.

6. Examine the Great Britain's policy of appeasement.
   గ్రేట్ బ్రిటన్ ఊరడించు విధానం గురించి పరిశీలించుము.

7. Discuss the achievements of the Kuomintang Government.
   కొమిన్‌టాంగ్ ప్రభుత్వ ఘనకార్యాల గురించి చర్చించుము.

8. Estimate the achievements of the U.N.O.
   ఐక్యరాజ్య సమితి ఘనకార్యాల గురించి అంచనావేయుము.

9. Give an account of the foreign policy of USA after the World War II.
   రెండవ ప్రపంచ యుద్ధానంతర అమెరికా విదేశాంగ విధానం గురించి వ్రాయుము.

10. Write a note on the European Economic Community.
    యూరపు ఆర్థిక సమాఖ్య గురించి వ్రాయుము.

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | పారిస్ శాంతి సమావేశం - శాంతి సంధులు | 1.1 - 1.21 |
| 2. | యుద్ధ నష్ట పరిహారం | 2.1 - 2.11 |
| 3. | వైమార్ రిపబ్లిక్ - జర్మనీ | 3.1 - 3.21 |
| 4. | నానాజాతి సమితి | 4.1 - 4.17 |
| 5. | నిరాయుధీకరణ సమస్యలు | 5.1 - 5.16 |
| 6. | జర్మనీ - నాజీనియంతృత్వము | 6.1 - 6.21 |
| 7. | ఇటలీ - ఫాసిస్ట్ నియంతృత్వము | 7.1 - 7.17 |
| 8. | సోవియట్ రష్యా : 1917-1945 | 8.1 - 8.26 |
| 9. | 1 స్పానిష్ అంతర్యుద్ధం .... | 9.1 - 9.9 |
| 10. | సామ్రాజ్య తత్త్వ దేశంగా జపాన్ అవతరణ | 10.1 - 10.19 |
| 11. | చైనాలో కొమిన్‌టాంగ్ ప్రభుత్వం - కమ్యూనిజం వ్యాప్తి | 11.1 - 11.27 |
| 12. | రెండో ప్రపంచ యుద్ధం | 12.1 - 12.15 |
| 13. | ఐక్యరాజ్య సమితి | 13.1 - 13.18 |
| 14. | ఆసియా, ఆఫ్రికా ఖండాలలో జాతీయోద్యమాలు | 14.1 - 14.12 |
| 15. | ప్రచ్ఛన్న యుద్ధం | 15.1 - 15.9 |
| 16. | అలీనోద్యమము, యూరప్ ఆర్థిక సంఘము | 16.1 - 16.13 |
| 17. | ప్రపంచీకరణ - ఆర్థికం, అంతర్జాతీయ శాంతి సహకారాల్లో దాని పాత్ర | 17.1 - 17.11 |
| 18. | యూనియన్ ఆఫ్ సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్ విచ్ఛిన్నం | 18.1 - 18.11 |

పాఠం - 1

# పారిస్ శాంతి సమావేశం - శాంతి సంధులు

## 1.1. పరిచయం :

1914 సం॥లో ప్రథమ ప్రపంచ సంగ్రామం ప్రారంభమయినది. మానవజాతి చరిత్రలో ప్రథమ ప్రపంచ సంగ్రామం అంత యుద్ధం ఇంతకు పూర్వం ఎన్నడూ జరుగలేదు. ప్రథమ ప్రపంచ సంగ్రామం ఐరోపాలో ప్రారంభమై క్రమక్రమంగా ప్రపంచంలోని అన్ని దేశాలు ఈ యుద్ధంలో ఒక దాని తరువాత ఒకటి చేరాయి. ఈ యుద్ధం హఠాత్తుగా ప్రారంభమయినదికాదు. ఐరోపాలో కొన్ని సంవత్సరాలుగా జరుగుతూ ఉన్న పరిణామాలు ఈ యుద్ధానికి దారితీసినాయి. వాటిలో ముఖ్యంగా పేర్కొనదగినవి.

### విషయ క్రమం

1.1. ఐరోపాలో విరుద్ధ రాజ్య కూటాల ఏర్పాటు

1.2. ఐరోపా దేశాల సైనిక విధానం

1.3. ఉధృతమవుతున్న జాతీయతా భావము

1.4. సామ్రాజ్య తత్వము, ఆర్థిక విషయ సంబంధమైన స్పర్థలు

1.5. దేశాల మధ్య వివాదాలను పరిష్కరించడానికి అంతర్జాతీయ సాధనం లేక పోవడం

1.6. జర్మన్‌లు యుద్ధాన్ని ఒక ఉన్నత ఆదర్శంగా భావించడం

1.7. ప్రాచ్య సమస్యకు సంబంధించిన సన్నిహిత కారణం మొదలగునవి.

## 1.2 యుద్ధ స్వరూపం :

మొదటి ప్రపంచ సంగ్రామం ప్రపంచ చరిత్రలో నూతన శకాన్ని ప్రవేశపెట్టినది. ఈ యుద్ధానికి, అంతటి మునుపు జరిగిన యుద్ధాలకు ఎంతో స్వరూప భేదం ఉంది. ఎనిమిది అగ్ర రాజ్యాలతో కలసి 27 రాజ్యాలు ఈ యుద్ధంలో పాల్గొన్నాయి. త్రైపక్ష కూటమికి చెందిన మిత్ర రాజ్యాల (Allied Powers) తరపున నాలుగుకోట్ల సైన్యం, మధ్య ఐరోపా రాజ్యాల (Central Powers) పక్షాన రెండుకోట్ల పది లక్షల సైన్యం ఈ యుద్ధంలో పాల్గొన్నవి. ఇంతవరకు ఉపయోగించని యుద్ధ సాధనాలు, ఆయుధాలు విషవాయువులు, మరఫిరంగులు, యుద్ధ టాంకులు, జలాంతర్గాములు, విమానాలు మొదలైనవి విస్తృతంగా ఉపయోగించబడ్డాయి. వేలమైళ్ళ కొలది రక్షక కందకాలు త్రవ్వబడ్డాయి. సాంప్రదాయ యుద్ధ పద్ధతులు విడనాడబడినాయి. ప్రతి దేశంలో నిర్బంధ సైనిక శిక్షణ ప్రవేశపెట్టబడింది. యుద్ధ పరిశ్రమలు ఒక్కుమ్మడిగా వృద్ధి చెందినాయి. ఈ యుద్ధం వల్ల అపార జన నష్టం, ధన నష్టం జరిగింది. యుద్ధంలో కోటిన్నర ప్రజలు నిహతులైనారు. యుద్ధ ఖర్చు 1500 కోట్ల డాలర్లుగా అంచనా వేయబడింది. ఈ యుద్ధం వలన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన సంక్షోభానికి గురి అయింది.

## 1.3. యుద్ధ విరమణ

ప్రథమ ప్రపంచ సంగ్రామం 1914 సం॥ నుండి 1918 సం॥ వరకు జరిగింది. బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, రష్యా, రుమేనియా, సెర్బియా మొదలగునవి మిత్ర రాజ్యాలు. జర్మనీ, ఆస్ట్రియా - హంగరీ, టర్కీ, బల్గేరియా మొదలగునవి కేంద్ర రాజ్యాలు. యుద్ధ కాలంలో రష్యాలో విప్లవ పరిస్థితులు ఏర్పడటంవలన రష్యా జర్మనీతో 1917లో బ్రెస్ట్ లిటోవస్క్ సంధి చేసుకొని యుద్ధం నుండి విరమించింది. జర్మనీ యుద్ధాన్ని ముమ్మరం చేసి 1918 మార్చి నెలలో మిత్ర రాజ్యాలపై పెద్ద పెట్టున దాడులు చేసింది. 1917 ఏప్రియల్ 6వ తేదీన యుద్ధంలో ప్రవేశించిన అమెరికా మిత్ర రాజ్యాల సహాయార్థం 10 లక్షల సైన్యాన్ని పంపింది. జర్మనీ దాడులను

ఎదుర్కొన్నది. 1918 సెప్టెంబర్ నాటికి ఆస్ట్రియా, బల్గేరియాలు ఓడిపోయి మిత్ర రాజ్యాలకు లొంగిపోయినాయి. నాలుగు సంవత్సరాల నిరంతర యుద్ధం జర్మనీని బలహీన పరచింది. ఒక్క జర్మనీయే మిత్ర రాజ్యాల ధాటిని ఎదుర్కొన వలసి వచ్చినది. జర్మనీలో సైనిక సంక్షోభం కూడ ఏర్పడింది. తూర్పు రంగంలో పని చేసిన జర్మన్ సైన్యం రష్యాలోని విప్లవ భావాలతో ప్రేరేపితమైంది. నిస్సహాయుడైన జర్మన్ చక్రవర్తి హాలెండ్ పారిపోయాడు. గత్యంతరం లేని జర్మనీ 1918 సెప్టెంబర్ 29వ తేదీన యుద్ధ విరమణ చేసింది. మిత్ర రాజ్యాలు యుద్ధ విరమణకై నవంబర్ 8వ తేదీన తమ షరతులు ప్రకటించాయి. అమెరికా అధ్యక్షుడు ఉడ్రో విల్సన్ 14 సూత్రాల ఆధారంగా శాంతి సంధి చేసుకోవడానికి సిద్ధమేనని జర్మన్ ఛాన్సలర్ మాక్స్ ఉడ్రోవిల్సన్‌కు తెలియపరిచాడు. అయితే యుద్ధ విరమణకు షరతులుగా జర్మనీ మిత్ర రాజ్యాలనుండి తన సైన్యాలను ఉపసంహరించుకోవాలని, జర్మనీలో నిరంకుశ ప్రభుత్వ స్థానే ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడవలెనని ఉడ్రో విల్సన్ జర్మనీకి సమాధానమిచ్చాడు. ఈ షరతులకు 1918 అక్టోబర్ 20వ జర్మనీ అంగీకరించడంతో నవంబర్ 11వ తేదీన మిత్ర రాజ్యాల సైన్యాధిపతి మార్షల్ ఫోక్, జర్మనీ ప్రతినిధులు ఒడంబడిక పై సంతకాలు చేయడంతో యుద్ధ విరమణ జరిగింది.

**యుద్ధ విరమణ ఒప్పందం ప్రకారం :**

1. మిత్ర రాజ్యాల భూ భాగాల నుండి జర్మనీ తన సైన్యాలను ఉపసంహరించింది.
2. రైన్ భూభాగాన్ని నిస్సైనిక మండలంగా ప్రకటించింది.
3. జర్మనీ తన యుద్ధ సామాగ్రిని మిత్ర రాజ్యాల వశం చేసింది.
4. రష్యాతో చేసుకొన్న బ్రెస్ట్-లిటో వస్క్ సంధిని రద్దు చేసుకొన్నది.
5. రుమేనియాతో చేసుకొన్న బుకారెస్ట్ సంధిని రద్దు చేసుకొన్నది.

## 1.4. యుద్ధానికి జర్మనీ బాధ్యత :

వర్సేశాంతి ఒప్పందంలోని 231వ నిబంధన ప్రకారం యుద్ధానికి సర్వ బాధ్యత జర్మనీపైన, జర్మనీ మిత్ర రాజ్యాలపైన మోపబడింది. కొన్ని సంవత్సరాల నిరంతర ప్రచారానికి జర్మనీ పట్ల ద్వేషానికి ఫలితం ఈ తీర్పు. యుద్ధం ముగిసిన కొన్ని సంవత్సరాల తరువాత ప్రశాంతంగా పరిశీలిస్తే ఈ తీర్పు వలన జర్మనీకి కొంత అన్యాయం జరిగినమాట వాస్తవమని అంగీకరించక తప్పదు. యుద్ధానికి ముందు ప్రతి రాజ్యం చాణక్య నీతిని అవలంభించింది. స్వప్రయోజనాలకై ఎన్నో అనర్థాలకు పాల్పడ్డది. వాతావరణం అంతా యుద్ధోన్మాదంతో కలుషితమయింది. అందువలన ఈ యుద్ధానికి అన్ని రాజ్యాల బాధ్యత కలదు. కాకపోతే జర్మనీ బాధ్యత కొంత అధికం.

## 1.5. పారిస్ శాంతి సమావేశం :

యుద్ధానంతరం శాంతికి సంబంధించిన విషయాలు చర్చించి నిర్ణయాలు చేయడానికి యుద్ధ విరమణ ఒడంబడిక ప్రకారం పారిస్‌లో శాంతి సమావేశం ఏర్పాటు చేయబడింది. ఈ శాంతి సమావేశంలో పాల్గొనడానికి ప్రపంచంలోని వివిధ రాజ్యాల ప్రతి నిధులు 1918 డిసెంబర్ నుండి పారిస్ చేరుకోవడం ప్రారంభించారు. 1919 జనవరి 18న మొదటి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అమెరికా తరపున ఉడ్రో విల్సన్, ఇంగ్లాండ్ తరపున లాయిడ్ జార్జి, బేల్ఫర్; ఫ్రాన్స్ తరపున క్లిమెన్సో; ఇటలీ తరపున ఆర్లెండో; దక్షిణాఫ్రికా తరపున జనరల్ స్మట్స్; గ్రీసు తరపున వెనిజిలోస్ మొదలయిన ప్రముఖులు పాల్గొన్నారు. యుద్ధంలో ఓడిపోయిన రాజ్యాలయిన జర్మనీ, ఆస్ట్రియా, హంగరీ, టర్కీ, బల్గేరియా దేశాలకు సమావేశంలో పాల్గొనే హక్కు నిరాకరించబడ్డది. పారిస్ శాంతి సమావేశం 1815లో జరిగిన వియన్నా కాంగ్రెస్‌వలె నిరంకుశులైన పాలకుల నియంత్రణలో లేదు. పారిస్ శాంతి సమావేశం ప్రజాస్వామ్య ప్రాతిపదికగా, స్వేచ్ఛగా ఎన్నుకున్న ప్రజా ప్రతినిధుల అదుపులో వుంది. కాని బహిరంగ చర్చల ద్వారా సమస్యల పరిష్కారం అసాధ్యమని సమావేశంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు భావించడంతో పారిస్ సమావేశ చర్చలు బహిరంగ సమావేశాలలో జరుగలేదు. అంతేగాక సమస్యలు చర్చించి పరిష్కారాలు సూచించే అధికారం అంతా అగ్ర రాజ్యాలయిన అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, జపాన్ దేశాలకు అప్పగించారు. ఈ అగ్ర రాజ్యాలు రహస్యంగా సమావేశాలు జరిపి వారి నాయకుల మధ్య రాజీకి అనేక ఒడంబడికలు జరిగాయి. ఈ ఒడంబడికల ఆధారంగా తుది పరిష్కారం జరిగింది. సంధి షరతులు పూర్తిగా నిర్ణయించబడ్డ తరువాత జర్మనీ ప్రతినిధుల అంగీకారానికి ప్రవేశపెట్టబడ్డాయి. జర్మనీ ప్రతినిధులు సంధి

షరతులు బహు కఠినంగాను అన్యాయంగాను ఉన్నాయని, విల్సన్ 14 సూత్రాలకు అనుగుణంగా లేవని వాదించారు. కాని మిత్ర రాజ్యాల బలవంతం మీద గత్యంతరంలేక జర్మన్ ప్రతినిధులు సంధి పత్రాలమీద 1919 జూన్ 28న వర్సై అద్దాల భవనంలో సంతకాలు చేసినారు. దీనినే వర్సే శాంతి ఒప్పందం అంటారు.

**పారిస్ శాంతి సమావేశ నాయకులు :** అనేకమంది రాజ్యాధి నేతలు దౌత్య వేత్తలు పాల్గొన్న ఈ సమావేశంలో అమెరికా అధ్యక్షుడు ఉడ్రో విల్సన్, ఫ్రాన్స్ అధ్యక్షుడు క్లిమెన్సో, బ్రిటిష్ ప్రధాని లాయిడ్ జార్జి, ఇటలీ సచివుడు ఆర్లెండో అతి ముఖ్యమైన పాత్ర నిర్వహించినారు. శాంతి ఒప్పందము రూపొందించే బాధ్యత ఈ నాలుగు దేశాలతో కూడిన ఒక ఉప సంఘానికి ఇవ్వబడింది.

**ఉడ్రో విల్సన్ :** ప్రథమ ప్రపంచ సంగ్రామం కాలంనాటి అమెరికా అధ్యక్షుడు ఉడ్రో విల్సన్ ఆదర్శవాది, ప్రజాస్వామ్యవాది, మంచి వక్త. పారిస్ శాంతి సమావేశంలో అతి ముఖ్యమైన పాత్ర నిర్వహించినాడు. పీడిత ప్రజలను విముక్తి చేయ సంకల్పించిన ఉడ్రో విల్సన్ రాకకు ఐరోపా ప్రజలంతా ఎదురు చూశారు. విల్సన్‌కు పారిస్ పట్టణంలో ఘన స్వాగతం లభించింది. అయితే విల్సన్‌కు అమెరికా ప్రజలందరి మద్దతు లేదు. డెమొక్రటిక్ పార్టీ అధ్యక్షుడైన విల్సన్ విధానాలను రిపబ్లికన్ల మెజారిటీ ఉన్న సెనేట్ ఆమోదించడం లేదు. తనతో పారిస్‌కు ఏ ఒక్క రిపబ్లికన్ సెనేట్ ప్రతినిధిని తీసుకొని వెళ్ళ లేదు. పారిస్ శాంతి సమావేశంలో విల్సన్ చేసిన ఏ ప్రతిపాదననైనా సెనేట్ వ్యతిరేకించడానికి సిద్ధంగా ఉంది. అమెరికన్ రాజ్యాంగం ప్రకారం అధ్యక్షుడు ఇతర దేశాలతో చేసుకొనే ఒప్పందాలుగాని, సంబంధాలుగాని సెనేట్ అంగీకారం కావలసి వుంది. విల్సన్ ఆదర్శవాదాన్ని అనేకమంది ప్రతినిధులు అర్థం చేసుకోకపోవడం, ఐరోపా అగ్ర రాజ్య నాయకులవలె విల్సన్ దౌత్య వ్యవహారాలలో ఆరితేరిన వాడు కాకపోవడం, ఐరోపా సమస్యల పట్ల విల్సన్‌కు అవగాహన లేకపోవడంవలన విల్సన్ తన ఆదర్శాలను ఆచరణలో పెట్టలేకపోయాడు. చతుర రాజకీయ వేత్తలైన ఐరోపా అగ్ర రాజ్యాధినేతల ముందు విల్సన్ ఆదర్శ వాదం పనికిరాకుండా పోయింది.

**లాయిడ్ జార్జి :** పారిస్ శాంతి సమావేశంలో కీలకమైన పాత్ర వహించిన బ్రిటిష్ ప్రధాని లాయిడ్ జార్జి బహుముఖ ప్రజ్ఞా వంతుడు, దౌత్య వ్యవహారాలలో ఆరితేరినవాడు. వాస్తవిక వాది అయిన లాయిడ్ జార్జికి బ్రిటిష్ ప్రజల సంపూర్ణ అండదండలున్నాయి. లాయిడ్ జార్జికిగల దూరదృష్టి, ఐరోపా సమస్యలపట్ల అవగాహన పారిస్ శాంతి సమావేశంలో ప్రముఖ పాత్ర వహించేటట్లు చేసినాయి.

**క్లిమెన్సో :** ఫ్రాన్స్ నుండి విదేశాంగ మంత్రి క్లిమెన్సో పారిస్ శాంతి సమావేశంలో పాల్గొన్నాడు. దౌత్య వ్యవహారాలలో, రాజకీయ విషయాలలో అనుభవం గడించిన రాజనీతికోవిదుడు క్లిమెన్సో. చతుర రాజకీయవేత్త. అమెరికన్ అంతర్యుద్ధ కాలంలో పత్రికా విలేఖరిగా పనిచేసి యుద్ధ విషయాలలో అనుభవం గడించినవాడు. జర్మనీ పతనం ద్వారా ఫ్రెంచి ఆధిక్యతను, పేరు ప్రతిష్ఠలను పెంపొందించుకోవాలనే లక్ష్యం కలవాడు. సంధి షరతులను రూపొందించడంలో ఎక్కువ ప్రభావాన్ని చూపించాడు. అందుకనే పార్క్స్ పండితుడు "సంధి షరతులు విల్సన్ భావములకంటే క్లిమెన్సో భావములకు దగ్గరగా ఉన్నాయి" అన్న మాటల్లో సందేహం లేదు.

**విట్టోరియో ఆర్లెండో :** ఇటలీ ప్రతినిధి వర్గానికి ప్రాతినిధ్యం వహించినవాడు. ఇటలీ సచివుడు ఆర్లెండో. ఇతడు మంచి వక్త, విద్యావంతుడు, దౌత్య వ్యవహారాలలో ఆరితేరినవాడు. రహస్య సంధులకు ప్రాధాన్యతనిచ్చిన ఆర్లెండో భావాలను విల్సన్ తీవ్రంగా ఖండించినాడు.

పైన ఉదహరించిన అగ్ర రాజ్యాల నాయకులతోబాటు జపాన్, గ్రీస్, పోలండ్ ప్రతినిధులు కూడా సమావేశంలో ముఖ్య పాత్ర నిర్వహించినారు.

## 1.6 పారిస్ శాంతి సమావేశ నిర్వహణ :

యుద్ధ విరమణకు ముందు నుంచే ముఖ్యమైన మిత్ర రాజ్యాలు ముందు జరగబోయే శాంతి సంధికి కావలసిన విషయ సామాగ్రిని, గణాంకాలను సేకరించడం ప్రారంభించినాయి. అందువలననే దాదాపు అందరు ప్రతినిధులు కావలసిన విషయ సామాగ్రితో పారిస్ శాంతి సమావేశానికి హాజరయినారు. పారిస్ శాంతి సమావేశం లాంఛన ప్రాయంగా 1918 జనవరి 18న ప్రారంభమయింది. అత్యధిక ప్రపంచ

రాజ్యాలకు సంబంధించిన ప్రతినిధులతో బాటు ఈ సమావేశానికి అనేకమంది కార్యదర్శిలు, సలహా దారులు, పత్రికా విలేఖరులు హాజరయినారు. బహిరంగ సమావేశాల ద్వారా అనేక సమస్యలను చర్చించడంలో ఇబ్బందులు ఉన్నాయని హాజరయిన అనేక మంది ప్రతినిధులు భావించడంతో అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, జపాన్‌లకు సంబంధించిన ఇద్దరేసి ప్రతినిధులతో ఒక ఉన్నత సంఘాన్ని ఏర్పాటు చేసారు. సమస్యలను చర్చించి పరిష్కార మార్గాలను సూచించే అధికారాన్ని ఈ ఉన్నత సంఘానికి ఇచ్చారు. ఈ ఉన్నత సంఘం తన సిఫార్సులను పూర్తి సమావేశం ముందు ఉంచవలె. దూర ప్రాచ్యానికి సంబంధించిన సమస్యలను జపాన్ ప్రతినిధుల చేతిలో ఉంచడంతో వారు ఐరోపాకు సంబంధించిన విషయాలను పూర్తిగా పట్టించుకోలేదు. ఇటలీ ఏడ్రియాటిక్ సముద్ర ప్రాంత సమస్యల విషయంలో జరిగిన చర్చలలో విభేదించి సమావేశం నుండి కొంత కాలం వైదొలగగా ప్రధాన విషయాలకు సంబంధించిన నిర్ణయాలన్నీ లాయిడ్ జార్జి, క్లెమెన్సో మరియూ విల్సన్‌లే చేయవలసి వచ్చింది. చిన్న చిన్న రాజ్యాలు తమ కోర్కెలను ఉన్నత సంఘం ముందు ఉంచడానికి మాత్రమే అనుమతించ బడినాయి.

## 1.7. పారిస్ శాంతి సమావేశం ఎదుర్కొన్న మౌలిక సమస్యలు :

పారిస్ శాంతి సమావేశం సమావేశం కాక పూర్వమే తన పనిని ప్రారంభించింది. పారిస్ శాంతి సమావేశం అనేక విస్తృతమైన, క్లిష్టమైన సమస్యలను ఎదుర్కొనవలసి వచ్చినది.

**1. నిర్ణయాలు తీసుకోవడంలో ఇబ్బందులు :** ఈ శాంతి సమావేశంలో నిర్ణయాలు చేయడం 1815 నాటి వియన్నా సమావేశంలో వలె సులభమైనది కాదు. వియన్నా సమావేశానికి హాజరయిన ప్రతినిధుల సంఖ్య కన్నా ఈ సమావేశానికి హాజరయిన ప్రతినిధుల సంఖ్య చాలా ఎక్కువ. సమావేశానికి పత్రికా విలేఖరులను కూడ అనుమతించడంతో వారు ముందుగా, రహస్యంగా సమాచారాన్ని సేకరించి, పత్రికలలో ప్రకటించి సమస్యలను మరింత కఠినం చేసినారు. సమావేశంలో పాల్గొన్న నిపుణులు కూడా అనేక సమస్యల విషయంలో ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. అందువల్ల పారిస్ శాంతి సమావేశంలో సమస్యలు పరిష్కరించి సరిఅయిన నిర్ణయాలు చేయడం కష్టం అయింది.

**2. నిర్దుష్టమైన సూత్రాలు లేకపోవడం :** యుద్ధానంతర ఐరోపా రాజకీయ పునర్నిర్మాణ విషయంలో అనేక చర్చలు జరిగినప్పటికీ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు ఒక నిర్దుష్టమైన ప్రణాళికను తయారు చేయలేకపోయినారు. ఒక్కో సమయంలో ఈ విషయంలో ఒక నిర్ణయానికి రాకపోవడంతో ఒక్కో రాజ్యానికి చెందిన ప్రతినిధులు విసుగు చెంది సమావేశం నుండి వైదొలగడానికి ప్రయత్నించినారు. ఈ విధమైన అసంగ్దతకు వివిధ రాజ్యాల ప్రతినిధుల మధ్యగల స్వార్థ ప్రయోజనాలే కారణం.

**3. వివిధ రాజ్యాల మధ్య పరస్పర విరుద్ధమైన స్వార్థ ప్రయోజనాలు : 1815** నాటి వియన్నా సమావేశం యుద్ధ నష్టపరిహార సూత్ర ఆధారంగా ఐరోపా రాజ్యాల పునర్నిర్మాణాన్ని చేపట్టగా పారిస్ శాంతి సమావేశంలో పాల్గొన్న నాయకులు పరస్పర విరుద్ధమైన వారి స్వప్రయోజనాల సాధన కోసం పాటు పడినారు. విల్సన్ ఎట్టి పరిస్థితుల్లోను ఏ రాజ్యంగాని, ప్రజలు గాని మరొక రాజ్య ఆధీనంలో ఉంచకూడదని నొక్కిచెప్పినాడు. ప్రపంచంలో ప్రజాస్వామ్య పరిరక్షణే తన ముఖ్య ధ్యేయంగా పెట్టుకొన్నాడు. కాని వివిధ దేశాల అగ్ర నాయకుల విరుద్ధమైన స్వప్రయోజనాలకు విల్సన్ ఆదర్శ భావాలకు సంఘర్షణ ఏర్పడి సమస్యా పరిష్కారం కష్టతరమైనది.

**4. పారిస్‌ను శాంతి సమావేశ స్థానంగా ఎన్నుకోవడం :** శాంతి సమావేశానికి అనువైన వాతావరణంలేని పారిస్ పట్టణాన్ని స్థానంగా ఎన్నుకోవడం ఒక అవరోధంగా కనిపించింది. పారిస్ ప్రజలకు జర్మనులంటే ఏహ్య భావమున్న రోజులవి. పారిస్ పత్రికలు కూడా జర్మన్ ప్రజల పట్ల వ్యతిరేకతను ప్రదర్శించి ఉద్రిక్త పూరితమైన వాతావరణాన్ని సృష్టించినాయి. ఈ పరిస్థితుల్లో శాంతియుతంగా చర్చలు జరిగే వాతావరణం పారిస్‌లో లేదు. తటస్థ పట్టణాలయిన జెనీవా లేక లోజేన్‌లను సమావేశ స్థానంగా ఎన్నుకొని ఉంటే సమావేశాలు సజావుగా జరిగి ఉండేవి. 1814లోనే కాజల్రీ ప్రభువు ముఖ్యమైన విషయాలను చర్చించి పరిష్కారం కనుగొనడానికి పారిస్ సరి అయిన స్థానం కాదని చెప్పిన మాట గమనించ దగినది. కాని ఫ్రెంచి నాయకుల పట్టుదలవలన పారిస్‌నే సమావేశ స్థానంగా నిర్ణయించడం జరిగింది.

**5. అగ్ర రాజ్య నాయకులలో ఆదర్శాల విషయంలో ఏకాభిప్రాయం లేకపోవడం :** సమావేశంలో పాల్గొన్న అగ్రరాజ్య నాయకులలో ఆదర్శాల విషయంలో ఏకాభిప్రాయం లేకపోవడం సమస్యలను పరిష్కరించి సరి అయిన నిర్ణయాలు తీసుకోవడంలో అవరోధమయింది. జర్మనీ జాతీయంగాను, ఆర్థికంగాను నాశనమయినా సరే ఫ్రాన్స్ దేశానికి భద్రత చేకూర్చడమే క్లిమెన్సో ప్రధాన ఆశయం. బ్రిటిష్ శ్రేయస్సుకు భంగం కలగకుండా సత్యము, ధర్మము అనే సూత్రాల ప్రాతిపదికగా అంతర్జాతీయ శాంతి స్థాపన లాయిడ్ జార్జి లక్ష్యమైంది. ఆర్లేండోకు కావలసినది ఇటలీ ప్రాదేశిక రక్షణే గాని ప్రపంచ శాంతి స్థాపన కాదు. ఉడ్రో విల్సన్ సుస్థిర శాంతి స్థాపనే తన ఆదర్శంగా పెట్టుకొన్నాడు. ఓడిపోయిన రాజ్యాల పట్ల పగ సాధింపు ధోరణి వదలి ధర్మము, తాటస్థ్యము అనే సూత్రాల ప్రాతిపదికగా శాంతి స్థాపన జరుగవలెనని విల్సన్ భావించినాడు. ఐరోపా రాజ్యాల పునర్నిర్మాణము ప్రజాభిప్రాయ సేకరణ ప్రాతిపదికగా జరుగవలెనని విల్సన్ భావించినాడు. ఈ విధంగా అగ్ర రాజ్యాల నాయకులలో విరుద్ధమైన ఆదర్శాలు ఉండటంవలన సమావేశంలో సరియైన నిర్ణయాలు చేయడం కష్టతరమైనది.

**6. ఐరోపాలో జరిగిన రహస్య సంధుల విషయంలో విల్సన్ వ్యతిరేకత :** ప్రథమ ప్రపంచ సంగ్రామం జరుగుతున్న సమయంలో వివిధ దేశాల మధ్య అనేక రహస్య సంధులు జరిగినాయి. ఈ రహస్య సంధులకు విల్సన్ 14 సూత్రాలకు సంఘర్షణ ఏర్పడింది.

ఈ విధంగా శాంతి సమావేశం అనేక సమస్యలను ఎదుర్కొనవలసి వచ్చినది. మొత్తం మీద పారిస్ శాంతి సమావేశంలో ప్రస్ఫుటంగా కనిపించేది రెండు సిద్ధాంతాల మధ్య సంఘర్షణ. ఒకటి మానవత్వం, సత్యం, ధర్మం, తాటస్థ్యం అనే సూత్రాల ప్రాతిపదికగా సుస్థిరమైన అంతర్జాతీయ శాంతి స్థాపన జరుగవలెననే విల్సన్ ఆదర్శ వాదము రెండోది ఓడిపోయిన శత్రు రాజ్యాల మీద పగసాధించవలెననే మిత్ర రాజ్యాల అవకాశ వాదము. ఈ సమావేశంలో అవకాశ వాదమే విజయం సాధించింది.

## 1.8 శాంతి సాధనకు ప్రాతిపదికలు :

కొన్ని సూత్రాల ప్రాతిపదికలుగా పారిస్ శాంతి సంధులవల్ల ఐరోపా దేశాల పునర్విభజన జరిగింది. పారిస్‌లో జరిగిన శాంతి సంధులు ఈ క్రింది వాటి ప్రాతిపదికగా జరిగినవి :

**ఉడ్రో విల్సన్ 14 సూత్రాలు :** అమెరికా ప్రథమంలో యుద్ధంలో చేరక తటస్థంగా వుంది. కాని జర్మనీ జలాంతర్గాములను విచక్షణా రహితంగా ఉపయోగించడంతో  అమెరికన్ ప్రజాభిప్రాయం యుద్ధానికి సంసిద్ధత వ్యక్తం చేయడంతో ఇరు పక్షాల మధ్య ఉద్రిక్తతను తగ్గించి యుద్ధాన్ని విరమింపజేసి శాంతిని స్థాపించడానికి విల్సన్ ప్రయత్నాలు చేసినాడు. కాని జర్మనీ జలాంతర్గాములను విచక్షణా రహితంగా ఉపయోగించడం, అమెరికా తటస్థ రాజ్య హక్కులను జర్మనీ ఉల్లంఘించడం మొదలగు కారణాలవల్ల తటస్థ విధానాన్ని అనుసరిస్తున్న అమెరికా అధ్యక్షుడు ఉడ్రో విల్సన్ ప్రజాస్వామ్య పరిరక్షణకు యుద్ధంలో చేరవలెనని "యుద్ధాన్ని అంతం చేయడానికే యుద్ధం" అనే నినాదంతో అమెరికన్ కాంగ్రెస్‌చే ఆమోదం పొంది ప్రపంచ సంగ్రామంలో మిత్రరాజ్యాలకు సహాయంగా చేరినాడు. యుద్ధ కాలంలోనే ఉడ్రోవిల్సన్ ఐరోపాలో సుస్థిర శాంతిని నెలకొల్పడానికి ఉభయ పక్షాలకు ఆమోదం యోగ్యంగా నుండు 14 సూత్రాలను 1918 జనవరి 8న కాంగ్రెస్‌లో ప్రకటించినాడు. ఇవియే ప్రసిద్ధి చెందిన విల్సన్ 14 సూత్రములు అవి :

1. దేశాలు రహస్యంగాకాక బాహాటంగా ఒడంబడికలు చేసుకోవలె.
2. అన్ని దేశాలకు స్వేచ్ఛా సముద్రయాన హక్కులుండవలె.
3. అంతర్జాతీయ వర్తకం స్వేచ్ఛగా జరుగవలె.
4. అన్ని దేశాలు ఆయుధ బలం తగ్గించుకోవలె.
5. జాతీయ స్వయం నిర్ణయాధికార సిద్ధాంతాన్ని అనుసరించి వలస రాజ్యాలకు తమకిష్టమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకొనే హక్కు ఉండవలె.
6. రష్యా భూభాగం నుండి సేనలు ఉపసంహరించవలె.
7. బెల్జియం యధాస్థితికి రావలె.

8. ఫ్రెంచ్ రాజ్య భూభాగాలయిన ఆల్సేస్ - లొరెయిన్‌లను ఫ్రాన్స్‌కు ఇవ్వవలె.
9. ఇటలీ దేశ సరిహద్దులు జాతీయతా సిద్ధాంతాన్ని అనుసరించి నిర్ణయం కావలె.
10. ఆస్ట్రియా-హంగరీలోని అనేక జాతులకు స్వయం పాలన ఇవ్వవలె.
11. బాల్కన్ రాజ్యాల జాతీయతను గుర్తించవలె.
12. టర్కీలోని కొన్ని జాతులకు స్వయం పాలన ఇవ్వవలె. టర్కీకి శేష సామ్రాజ్య భాగాలలో సార్వభౌమత్వం ఉండవలె.
13. పోలెండ్ స్వతంత్ర రాజ్యం కావలె.
14. అంతర్జాతీయ శాంతి సంస్థ ఏర్పడవలె.

**విల్సన్ నాలుగంశాల సూత్రాలు :**

శాంతి స్థాపనకు ప్రాతిపదికగ 1918 ఫిబ్రవరి 11వ నాలుగంశాల సూత్రాలను మరొక ప్రకటనలో విల్సన్ చేసినాడు. అవి :

1. సుస్థిర శాంతి స్థాపన కోసం ప్రతి సమస్యనూ ధర్మము, సత్యము అనే సూత్రాల ఆధారంగా పరిష్కరించవలె.
2. రాజ్యాల తుల్య ప్రాభల్య స్థితిని కాపాడే మిషతో ఒక దేశానికి చెందిన భూభాగాలను మరొక దేశానికి బదిలీ చేయరాదు.
3. ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని వివిధ రాజ్య భూభాగాల భవిష్యత్తును నిర్ణయించవలె.
4. ఐరోపాలో శాంతి స్థాపన కోసం జాతీయ రాజ్యాల ఆశయాలను సంతృప్తి పరచడానికి చేయవలసిన అన్ని ప్రయత్నాలు చేయవలె.

ఈ సూత్రాలకు తోడుగా విల్సన్ 1918 జులై 4న, 1918 సెప్టెంబర్ 27న మరో రెండు ప్రకటనలు శాంతి స్థాపనకు ప్రాతిపదికలుగా ప్రకటించినాడు. వాటిలోని ముఖ్యాంశాలు :

1. దురాక్రమణ విధానాన్ని అనుసరిస్తూ ప్రపంచ శాంతికి భంగం కలిగించే ఏ దేశాన్ని అయినా ప్రపంచ దేశాలన్నీ కలిసి కట్టుగా ఎదుర్కొనవలె.
2. వివిధ రాజ్య భాగాల భవిష్యత్తును నిర్ణయించేటపుడు ప్రజాభిప్రాయాన్ని ప్రాతిపదికగా తీసుకోవలె.
3. నాగరిక దేశాలకు చెందిన న్యాయ శాస్త్రాన్ని అనుసరించి వివిధ దేశాల మధ్య మైత్రి సంబంధాన్ని నెలకొల్పవలె.
4. నానాజాతి సమితి సభ్య రాజ్యాల మధ్య ఏ విధమైన ఇతర ఒడంబడికలు జరుగరాదు.
5. అంతర్జాతీయ ఒడంబడికలన్నీ ప్రపంచంలోని అన్ని రాజ్యాలకు తెలియజేయవలె.

విల్సన్ సూత్రాల ప్రాతిపదికగా శాంతి సంధులు తయారు చేయడం కష్ట సాధ్యం అయింది. విల్సన్ ప్రతిపాదించిన సూత్రాలు చాలా వరకు అస్పష్టంగానూ, ఆదర్శవంతంగానూ ఉన్నాయి. విల్సన్ సూత్రాలకు యుద్ధ కాలంలో దేశాల మధ్య జరిగిన రహస్య సంధులకు పొత్తు కుదరలేదు.

## 1.9 పారిస్ శాంతి సమావేశాన్ని ప్రభావితం చేసిన అంశాలు :

ప్రథమ ప్రపంచ సంగ్రామం సమయంలో వివిధ దేశాల మధ్య జరిగిన రహస్య సంధులు, రష్యాలో సంభవించిన బోల్షివిక్ విప్లవం, తీవ్ర రూపం దాల్చిన జాతీయ భావం, మిత్ర రాజ్యాల జాతీయ ప్రయోజనాలు మొదలైన అంశాలు పారిస్ శాంతి సమావేశంలో జరిగిన సంధులను అత్యంతంగా ప్రభావితం చేసినాయి.

**1. రహస్య సంధులు :** యుద్ధ కాలంలో వివిధ దేశాల మధ్య పరస్పర శ్రేయస్సు కోసం అనేక రహస్య సంధులు జరిగినాయి. వాటిలో కాన్‌స్టాంటినోపుల్ సంధి (1915), లండన్ సంధి (1915), సైక్స్‌పికో సంధి (1917), ఫ్రాన్స్-రష్యాల మధ్య సంధి (1917) మొదలైనవి ముఖ్యమైనవి. ఈ రహస్య సంధుల్లో అమెరికా భాగస్వామ్యం కానందువల్ల ఆ సంధులలోని నిబంధనలను పాటించవలసిన బాధ్యత అమెరికాకు లేదు. * గా విల్సన్ రహస్య సంధులకు వ్యతిరేకి. ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఇటలీ, జపాన్‌లు రహస్య సంధులను పాటించవలెనే

ఆతురతతో ఉండటం వలన పారిస్ సమావేశంలో శాంతి సంధులను రూపొందించేటప్పుడు రహస్య సంధులలోని కొన్ని భాగాలు ఆమోదం పొందినాయి.

**2. రష్యాలో సంభవించిన బోల్షివిక్ విప్లవం :** 1917లో రష్యాలో జరిగిన బోల్షివిక్ విప్లవ ప్రభావాన్ని పారిస్ శాంతి సమావేశం చాలా వరకు లోనయింది. విప్లవ అనంతరం కమ్యూనిస్ట్ రష్యా యుద్ధం నుండి విరమించుకొని జర్మనీతో నూతన సంబంధాలను పెట్టుకొన్నది. ఫలితంగా రష్యాపట్ల మిత్ర రాజ్యాల విధానంలో కూడా మార్పు అవసరమయింది. ఐరోపాలోని తూర్పు భాగం కమ్యూనిస్టు ప్రభావానికి లోనుకాకుండా చూసే బాధ్యత మిత్ర రాజ్యాలదయింది. జర్మనీతోను, ఓడిపోయిన ఇతర రాజ్యాలతోను శాంతి సంధులు చేసుకొన్న తరువాత కమ్యూనిస్ట్ రష్యా సృష్టించిన సమస్యలను ఎదుర్కోవడానికి అవకాశం కలుగుతుందని మిత్ర రాజ్యాలు భావించడం జరిగింది.

**3. ప్రపంచంలోని వివిధ జాతుల ప్రజలలో తీవ్రరూపం దాల్చిన జాతీయతా భావం :** విల్సన్ ప్రతిపాదించిన 14 సూత్రాలలో జాతీయ స్వయం నిర్ణయ సిద్ధాంతం మంచి ప్రచారంలోకి వచ్చి ప్రపంచంలోని వివిధ జాతుల ప్రజలలో జాతీయతా భావాన్ని రేకెత్తించింది. ఇంత వరకు విదేశీ పరిపాలనలో పీడుతులైన ప్రజలు జాతీయ స్వయం నిర్ణయ సిద్ధాంతం ప్రకారం జాతీయ రాజ్యాలు ఏర్పడవలెనని పట్టుదల చూపసాగారు. పీడిత ప్రజల కోరికలకలకు అనుగుణంగా పారిస్ శాంతి సమావేశం పోలెండ్, చెకొస్లొవాకియా, యుగోస్లావియా, లిథూమేనియా లాట్వియా మొదలైన జాతీయ రాజ్యాలను ఏర్పాటు చేసింది. జాతీయ భావ ప్రభావం వల్లనే అదిష్ట రాజ్యాల పద్ధతి కూడా రూపొందింది. అనేక దేశాలలో ఉన్న అల్ప సంఖ్యాక ప్రజల రక్షణకు కూడా ఏర్పాట్లు జరిగినాయి. ఒక్కో సమయంలో జాతీయ భావానికి రహస్య సంధులకు సంఘర్షణ ఏర్పడటం వలన పారిస్ శాంతి సమావేశం కొన్ని చిక్కు సమస్యలను ఎదుర్కొనవలసి వచ్చినది.

**4. మిత్ర రాజ్యాల జాతీయ ప్రయోజనాలు :** అమెరికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఇటలీ మొదలైన మిత్ర రాజ్యాల జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా పారిస్ శాంతి సమావేశం శాంతి సంధులలోని నిబంధనలను రూపొందించింది.

బ్రిటిష్ నౌకా బలాన్ని బలహీనపరచి ఐరోపా రాజకీయాలలో తన ఆధిక్యతను నెలకొల్పడం, తన స్వప్రయోజనాలకు అనుగుణంగా ప్రపంచ మంతటిలో ఆర్థిక ప్రయోజనాలను పొందడం, చైనాపట్ల జపాన్ దురాక్రమణ విధానాన్ని అరికట్టడం మొదలైనవి అమెరికా జాతీయ ప్రయోజనాలు. అయితే ప్రపంచ నాయకత్వం కోసం అమెరికా చేసిన ప్రయత్నాలను ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌లు వమ్ము చేసినా తత్ఫలితంగా అమెరికా ఏకాంత విధానాన్ని అనుసరించవలసి వచ్చినా అమెరికా తన స్వప్రయోజనాలను కాపాడుకోగలిగింది. శాంతి సమావేశంలో అమెరికా పాల్గొనడం నిష్ప్రయోజనం కాలేదు.

ప్రపంచ రాజకీయాలలో రాజ్యాల మధ్య తుల్య ప్రాభల్య స్థితి కాపాడటం, సామ్రాజ్య విస్తరణా కార్యక్రమాన్ని ఎటువంటి ఆటంకాలు లేకుండా కొనసాగించడం, తమ దేశంలో పారిశ్రామిక ఉత్పత్తికి కావలసిన ముడి పదార్థాలను ప్రపంచంలో ఇతర ప్రాంతాల నుండి సేకరించడం బ్రిటిష్ ప్రయోజనాలు. పారిస్ శాంతి సమావేశంలో బ్రిటిష్ లక్ష్యాలు : జర్మనీని వ్యాపార వలస రంగాలలో తనకు పోటీ లేకుండా చేయడం, తన సముద్రాధిపత్యాన్ని కాపాడుకోవడం, ఆఫ్రికా, మధ్య ప్రాచ్యము, పసిఫిక్ ప్రాంతాలలో జయించిన భూ భాగాలను తన సామ్రాజ్యంలో కలుపుకోవడం మొదలైనవి. తన లక్ష్యాలను సాధించుకోవడంలో బ్రిటన్ చాలావరకు విజయం పొందింది.

ఐరోపాలో తన ఆధిక్యాన్ని నెలకొల్పడం, ఫ్రెంచ్ భూ భాగాలను రైన్ నది ఎడమ తీరం వరకు విస్తరింప జేసుకోవడం, తన ప్రాదేశిక భద్రతకు భంగం కలుగజేయకుండా జర్మనీని బలహీన పరచడం, తన అధికారాన్ని ఆల్సేస్ - లోరెయిన్, సార్‌లోయ, రూర్ ప్రాంతాలలో స్థాపించడం, జర్మనీ ఆస్ట్రియాల ఏకీకరణ జరుగకుండా చూడటం ఫ్రెంచ్ వారి జాతీయ ప్రయోజనాలు. పారిస్ శాంతి సమావేశంలో తన లక్ష్యాలకు అనుగుణంగా ఫ్రాన్స్ యూరప్‌లోని ఖనిజ ప్రాంతాలను పొందగలిగింది. కాని రైన్ నది ఎడమతీరం వరకు తన భూభాగాలను విస్తరింపజేసుకోలేక పోయింది. అయితే తన ప్రాదేశిక భద్రతకు అమెరికా, ఇంగ్లాండుల నుండి హామి ఫ్రాన్స్ పొందగలిగింది.

సరిహద్దు భూభాగాలను ఇటలీ ప్రజలతో నింపడం, ఏడ్రియాటిక్ ప్రాంతంలో తన పలుకుబడిని విస్తరింపజేసుకోవడం, సెర్బియాకు వ్యతిరేకంగా తన భద్రతకు హామి పొందటం, తన వలస సామ్రాజ్యాన్ని విస్తరింప జేసుకోవడం ఇటలీ జాతీయ ప్రయోజనాలు. తన లక్ష్యాలను సాధించుకోవడంలో ఇటలీ చాలా వరకు విఫలమయింది. పారిస్ శాంతి సమావేశానంతరం ఇటలీ పూర్తిగా అసంతృప్తి చెందింది.

ఈ విధంగా పారిస్ శాంతి సమావేశం మిత్ర రాజ్యాల స్వప్రయోజనాల ప్రభావానికి గురి అయింది.

## 1.10 వర్సై సంధి ముసాయిదా తయారు చేయడం :

వర్సై సంధి ముసాయిదాను ఖరారు చేయడంలో కొన్ని సమస్యలు ఉత్పన్నమయినాయి. నానాజాతి సమితి స్థాపన, ఫ్రెంచ్ భద్రత, ఇటలీ, పోలెండ్ల రాజ్యకాంక్ష, ఓడిపోయిన రాజ్యాల వలసల సమస్య, జర్మనీ చెల్లించవలసిన యుద్ధ నష్ట పరిహారం, యుద్ధకాల ఋణాలు, మొదలైన విషయాలపై సుదీర్ఘమైన చర్చలు జరిగినాయి. ఈ కాలంలో అనేక బహిరంగ, రహస్య సమావేశాలు జరిగినాయి. జర్మనీ చెల్లించవలసిన యుద్ధ నష్ట పరిహారం విషయంలో ఒక కమీషన్ వేయబడింది. ఓడిపోయిన రాజ్యాల వలసల విషయంలో వాటినన్నింటినీ ఏదో ఒక రాజ్య పాలన క్రింద అధిష్ట ప్రాంతాలుగా (Mondatory States) ప్రకటించారు.

చివరకు 1919 మే నాటికి సంధి ముసాయిదా పత్రాలు తయారయినాయి. 230 పేజీల సంధి ముసాయిదా 15 భాగాలుగా, 439 ప్రకరణాలుగా విభజితమయింది. 20 అనుబంధ పట్టికలుకూడా చేర్చబడినాయి. అయితే ఈ సంధి ముసాయిదాను పారిస్ పట్టణం చేరుకొన్న జర్మన్ ప్రతినిధుల ముందు సంతకాల కోసం ఉంచారు. జర్మన్ ప్రతినిధులు సంధి షరతులు కఠినంగా ఉన్నాయని, విల్సన్ 14 సూత్రాలకు అనుగుణంగా లేవని సంధి పత్రాల మీద సంతకాలు చేయ నిరాకరించినారు. ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు చేసినారు. కాని మిత్ర రాజ్యాలు బలవంతం చేయడంతో గత్యంతరంలేక జర్మన్ ప్రతినిధులు సంధి పత్రాలమీద 1919 జూన్ 28న వర్సైలో సంతకాలు చేసినారు. ఇదే మిత్ర రాజ్యాలు జర్మనీతో చేసుకొన్న శాంతి సంధి. దీనినే వర్సై సంధి అంటారు.

ప్రథమ ప్రపంచ సంగ్రామానంతర వివిధ శాంతి సంధులు :

పారిస్ శాంతి సమావేశాల నిర్ణయాల ఫలితంగా శాంతి సాధన కోసం మిత్ర రాజ్యాలు యుద్ధంలో ఓడిపోయిన ముఖ్య రాజ్యాలతో చేసుకొన్న సంధులు, ఇతర అనేక ఒడంబడికలు శాంతి సంధులలో భాగమే. అవి స్థూలంగా :

1. 1918 నవంబర్ 11న మిత్ర రాజ్యాలు జర్మనీతో చేసుకొన్న యుద్ధ విరమణ ప్రకటన.
2. 1919 జూన్ 28న మిత్ర రాజ్యాలు జర్మనీతో చేసుకొన్న వర్సైసంధి.
3. 1919 సెప్టెంబర్ 10న ఆస్ట్రియాతో జరిగిన సెయింట్ జర్మన్ సంధి.
4. 1919 నవంబర్ 27న బల్గేరియాతో జరిగిన న్యూల్లీ సంధి.
5. 1920 జూన్ 4న హంగరీతో జరిగిన ట్రియానాన్ సంధి.
6. 1920 ఆగస్టు 20న టర్కీతో జరిగిన సెవెర్స్ సంధి.
7. మైనారిటీకి సంబంధించిన సంధులు.
8. నష్ట పరిహార కమీషన్ చేసిన నిర్ణయాలు.

### 1. వర్సై సంధి షరతులు :

మిత్ర రాజ్యాల ఆదేశానుసారం జర్మనీ ప్రతినిధులు 1919 జూన్ 28న సంధి పత్రాలమీద వర్సై సంతకాలు చేసినారు. దీనినే పారిస్ శాంతి సమావేశానంతరం జరిగిన వర్సై సంధి అంటారు.

ఎ) రాజకీయ షరతులు - ప్రాదేశిక ఏర్పాట్లు : భిన్న దేశాల ప్రతినిధులు ఐరోపా దేశాల పునర్వ్యవస్థీకరణకు సంబంధించి అయిదు సందర్భాలలో నిర్ణయాలు తీసుకొన్నారు. ఫ్రాన్స్ తూర్పు సరిహద్దు సర్దుబాటు చేయడం, ఇదివరిలో ప్రష్యా ఆక్రమించిన పోలిష్, డేనిష్ ప్రాంతాలను విముక్తి చేయడం, హాప్స్ బర్గ్ సామ్రాజ్యాన్ని విచ్ఛిన్నం చేయడం, ఇటలీ రాజ్య భూ భాగాల విషయంలో న్యాయం చేకూర్చడం, ఐరోపాలో టర్కీ సామ్రాజ్యాన్ని పూర్తిగా రూపు మాపడం మొదలగు విషయాలకు సంబంధించిన నిర్ణయాలకు ఒప్పందాలు జరిగినాయి. జర్మనీకి చెందిన వలసల విషయంలో కూడా నిర్ణయం జరిగింది.

1. 1871 ఫ్రాంకో -ప్రష్యన్ యుద్ధానంతరం ఫ్రాన్స్ కోల్పోయిన ఆల్సేస్ - లోరేయిన్ భూభాగాలు తిరిగి ఫ్రాన్స్‌కు ఇవ్వబడినాయి. ఫ్రెంచి వారే ఇక్కడ అగిక సంఖ్యలో ఉండటం వలన ఈ నిర్ణయం జాతీయ సిద్ధాంతాన్ని అనుసరించి జరిగింది.

2. పోసెన్, పామరేనియా, తూర్పు ప్రష్యాల మధ్య అరువది మైళ్ళ నిడివి భాగం పోలెండ్‌కు ఇవ్వబడింది.

3. డాన్‌జింగ్ రేవు పట్టణం గురించి వివాదమేర్పడింది. విస్చులానది సముద్రంలో కలసే చోట డాన్‌జింగ్ ఉంది. విస్చులా పై పోలండ్ చాలావరకు ఆధారపడి ఉంది. కాని డాన్ జింగ్‌లోని అధిక సంఖ్యాకులు ప్రష్యన్‌లు. అందువలన జర్మన్ పట్టణమైన డానిజింగ్ దాని పరిసర 700 మైళ్ళ భూభాగం నానాజాతి సమితి ఆధ్వర్యంలో స్వేచ్ఛానగరంగా ప్రకటించబడినది.

4. ప్రజాభిప్రాయం తీసుకొనబడి ఉత్తరష్లేస్ విగ్‌ను డెన్మార్క్‌కు, ఎగువ సైలీషియాను పోలండ్‌కు ఇవ్వబడినాయి.

5. బెల్జియంకు న్యాయం జరిగింది. యూపెన్, మాల్‌మెడి, మొర్సెనెట్, న్యూట్రిమాక్ నెట్‌లో ప్రష్యా భాగం బెల్జియంకు దత్తం చేయబడినాయి. బెల్జియంకు తూర్పు దిక్కునుండి దండయాత్ర భయం లేకుండా భద్రత చేకూరింది. లక్జంబర్గ్‌పై జర్మనీ హక్కు వదలుకుంది.

6. సార్ లోయలో జర్మన్ జాతివారు చాలామంది ఉన్నప్పటికినీ దానిని నానాజాతి సమితి ఆధీనంలో ఉంచినారు. దానిలోని బొగ్గు గనులను ఫ్రాన్స్‌కు 15 సం॥ల కాలం పాటు ఇవ్వబడినాయి. తరువాత జనవాక్య సేకరణ ప్రాతిపదికగా సార్‌లోయ భవిష్యత్తు నిర్ణయించబడుతుంది.

7. మెమెల్ పట్టణం, మెమెల్ పట్టణానికి ఈశాన్య దిక్కున ఉన్న కొంత భూభాగం మిత్ర రాజ్యాల ఆధీనంలో ఉంచబడినది.

8. ఎగువ సైలీషియాలో కొంత భాగం చెకొస్లోవాకియాకు ఇవ్వబడినది.

9. సంధిలోని 80వ నిబంధన ప్రకారం ఆస్ట్రియాను సంపూర్ణ స్వతంత్ర దేశంగా జర్మనీ గుర్తించింది.

10. జాతీయతా సిద్ధాంతాన్ని అనుసరించి పోలండ్ ఒక స్వతంత్ర రాజ్యంగా గుర్తింపు పొందింది. ఈ సంధివల్ల 260 మైళ్ళ పొడవు, 80 మైళ్ళ వెడల్పు ఉన్న జర్మన్ కారిడార్ (German Carridor) పోలండ్ ఆధీనంలోకి వచ్చింది. ఫలితంగా జర్మనీ రెండు భాగాలుగా విభజితమయినది.

11. రైన్ నదికి ఎడమ వైపున ఉన్న భూభాగమంతా 15 సంవత్సరాల వరకు మిత్రమండలి ఆధీనంలో ఉంచబడింది.

12. రష్యాకు చెందిన బాల్టిక్ ప్రాంతాలు రష్యా సామ్రాజ్యం నుండి వేరుపడి ఫిన్‌లాండ్, ఎస్తోనియా, లాట్వియా, లిధుమేనియాలనేవి జాతీయ సిద్ధాంతాన్ని అనుసరించి స్వతంత్ర రాజ్యాలుగా ఏర్పడినాయి.

13. జర్మనీ ఖండాంతర వలసలన్నింటిపైన అధికారాన్ని వదులుకుంది. ఒక లక్షా ఇరువై ఏడువేల చదరపు మైళ్ళ విస్తీర్ణమున్న జర్మన్ వలసలు నానాజాతి అధిష్ట ప్రాంతాలుగా ఇంగ్లాండ్, ఫ్రాన్స్, బెల్జియం, జపాన్ మొదలగు దేశాల పర్యవేక్షణలో ఉంచబడ్డాయి. టోగోలాండ్, టాగనీకాలు బ్రిటీష్ పరిపాలనలోకి వచ్చినాయి. జర్మన్ నైరుతి ఆఫ్రికా పరిపాలనాధికారం దక్షిణాఫ్రికా ప్రభుత్వానికిచ్చినారు. జర్మన్ సమోవా దీవులు న్యూజీలాండ్ ఆధీనంలో ఉంచినారు. మార్షల్ దీవుల పరిపాలన జపాన్‌కు అప్పగించినారు. జర్మన్ న్యూగయానా పరిపాలన ఆస్ట్రేలియాకు అప్పగించినారు. సయామ్, లిబేరియా, ఈజిప్టు, చైనా, మొరాకో మొదలైన దేశాలలో జర్మనీకిగల ఆర్థిక సదుపాయాలు అన్నీ రద్దు చేయబడినాయి. చైనాలోని కియాచౌ, షాన్‌టుంగ్ రాష్ట్రాలు జపాన్‌కు ఇచ్చినారు. వర్సై సంధివలన జర్మనీ చాలా భూభాగాన్ని, వలసలను కోల్పోయినది.

**బి) సైనిక షరతులు :** వర్సై సంధిలోని సైనిక నిబంధనలు జర్మనీకి చాలా బాధాకరంగాను, అవమానకరంగాను ఉన్నాయి. ఈ సంధివలన జర్మనీ సైనిక పరంగా అణచివేయబడ్డది.

1. జర్మనీలో నిర్బంధ సైనిక విధానం రద్దు చేయబడినది. జర్మనీ సైన్యం లక్షకు పరిమితం చేయబడినది.

2. జర్మనీ నౌకా బలం గస్తీ ఏర్పాట్లుకు మాత్రమే పరిమితం చేయబడినది. ఆరు యుద్ధనౌకలు, ఆరు చిన్న యుద్ధ నౌకలు, 12 నౌకా విధ్వంస నావలు, మాత్రమే జర్మనీ ఉంచుకోవాలి. జలంతర్గాముల ఉపయోగం నిషేధించబడినది.

3. రైన్ నదికి పశ్చిమ ప్రాంతమంతా, తూర్పు ప్రాంతంలో 40 మైళ్ళ వరకు ఎలాంటి సైనిక సమీకరణ జర్మనీ చేయకూడదు. రైన్ భూభాగం 15 సం॥ల వరకు మిత్ర రాజ్యాల సైనిక ఆక్రమణలో ఉంటుంది.

4. జర్మనీ యుద్ధ టాంకులు, యుద్ధ విమానాలు, మిగతా యుద్ధ పరికరాలు తయారు చేయకూడదు. మామూలు యుద్ధ పరికరాల తయారీపై కూడా మిత్ర రాజ్యాల పర్యవేక్షణ ఉంటుంది.

5. జర్మనీలోని రక్షణ నిర్మాణాలు, యుద్ధ సామాగ్రి పూర్తిగా ధ్వంసం చేసినారు. హెలిగోలాండ్ నౌకా నిర్మాణ కేంద్రం నాశనం చేయబడి కీల్ కాలువ నిస్సైనికరణ చేయబడినది.

6. జర్మన్ నదులు, కాలువలు అంతర్జాతీయ కమీషన్ అధికారంలో ఉంచడం జరిగినది.

బి) ఆర్థిక షరతులు : వర్సై సంధివలన జర్మనీ ఆర్థికంగా ఎంతో నష్టపోయినది. జర్మనీని బలహీన పరచడమే మిత్ర రాజ్యాల లక్ష్యం అనిపిస్తుంది.

1. జర్మన్ వాణిజ్య నౌకలు ఫ్రాన్స్‌కు, జర్మన్ యుద్ధ నౌకలు బ్రిటన్‌కు బదిలీ చేసినారు. యుద్ధ కాలంలో మిత్ర రాజ్యాలు నష్టపోయిన నౌకల స్థానే కొత్త నౌకలను జర్మనీ తన ఖర్చులతో తయారు చేసి ఇవ్వవలెను.

2. చైనా, సయామ్, లిబేరియా, మొరాకో, ఈజిప్టు, టర్కీ, బల్గేరియాలలో జర్మనీకున్న ఆస్తి హక్కులు, అధి రాజ్య హక్కులు (Extra-Territorial Rights) రద్దు చేయబడినాయి.

3. విదేశాలలో ఉన్న జర్మన్ పౌరుల ఆస్తులను జప్తుచేసే అధికారం మిత్ర రాజ్యాలకు ఇవ్వబడినది.

4. రాబోయే పది సంవత్సరాలలో అధిక పరిమాణంలో బొగ్గును ఫ్రాన్స్, ఇటలీ, బెల్జియం దేశాలకు జర్మనీ సరఫరా చేయవలెను.

5. ఐయిదు వేల రైలు ఇంజన్లు, ఒక లక్షా ఏభైవేల మోటారులను జర్మనీ మిత్ర రాజ్యాలకు ఇవ్వవలెను.

6. జర్మన్ ఎగుమతి, దిగుమతి వ్యాపారాల మీద మిత్ర రాజ్యాలకు ప్రత్యేక అధికారాలు ఇవ్వబడినాయి.

డి) యుద్ధ నష్ట పరిహారం : జర్మనీ మిత్ర రాజ్యాలకు చెల్లించవలసిన యుద్ధ నష్ట పరిహార సమస్య అతిక్లిష్టమైనది. జర్మనీ చెల్లించవలసిన యుద్ధ నష్ట పరిహారాన్ని నిర్ణయించడానికి అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, జపాన్ దేశాల ప్రతినిధులతో కూడిన నష్టపరిహార నిర్ణాయక సంఘాన్ని (Reporation commission) ఏర్పాటు చేసినారు. ఈ సంఘం యుద్ధ కాలంలో మిత్ర రాజ్యాలలోని పౌరుల ఆస్తులకు కలిగిన నష్టాన్ని, మిత్రరాజ్యాలు తమ సేనలకు ఇచ్చిన సైనిక భత్యాలను, బెల్జియం మిత్ర రాజ్యాలకు ఇవ్వవలసిన యుద్ధకాలపు ఋణాలను పరిగణలోనికి తీసుకొని నష్ట పరిహార మొత్తాన్ని నిర్ణయిస్తుంది. జర్మనీ 1921 మే నుండి 30 సంవత్సరాల కాలంలో వాయిదాల పద్ధతి మీద నిర్ణయించిన మొత్తాన్ని చెల్లించవలెను. ఈలోగా జర్మనీ మిత్ర రాజ్యాలకు 1,000,000,000 పౌనులను చెల్లించవలెను. దీనికి హామీగా మిత్ర రాజ్యాల సైన్యాలు 15 సం॥ల కాలం జర్మనీ ఖర్చుతో జర్మనీ భూభాగంలో ఉంటాయి.

ఇ) యుద్ధ నేరస్థుల విచారణ : వర్సైసంధిలోని 231వ నిబంధన ప్రకారం జర్మన్ చక్రవర్తిని యుద్ధ నేరస్థునిగా ప్రకటించినారు. జర్మన్ చక్రవర్తి రెండో విలియంతో సహా వంద మంది యుద్ధ నేరస్థులను విచారించడానికి ఈ సంధి ప్రకారం ఏర్పాటుచేసినారు. అయితే జర్మన్ చక్రవర్తి హాలెండ్ పారిపోయి ఆదేశ రక్షణలో ఉండటం వలన అతనిని విచారించడానికి కుదరలేదు.

ఎఫ్) ఇతర షరతులు :

1. వర్సైసంధి షరతులు ప్రకారం నానాజాతి సమితి స్థాపనకు సంబంధించిన నిబంధనలను వర్సైసంధిలో భాగంగా చేసినారు.

2. యుద్ధం ముందు, యుద్ధకాలంలో జర్మనీ-రష్యాలు చేసుకొన్న సంధులు రద్దయినాయి.

3. బెల్జియం, పోలెండ్, యుగోస్లావియా, చెకోస్లావాకియా దేశాలను స్వతంత్ర దేశాలుగా గుర్తించడం జరిగింది.

వర్సై సంధి ఫలితంగా జర్మనీ 8వ వంతు భూభాగాన్ని, పదోవంతు జనాభాను 70 శాతం ఖనిజ సంపదను, నూటికి నూరుపాళ్ళు విదేశీ పెట్టుబడులను కోల్పోయింది. ఆర్థికంగా తీవ్రమైన నష్టానికి గురి అయింది.

## వర్సేసంధి - విమర్శ :

ఆధునిక కాలానికి సంబంధించి వర్సేసంధి ఒక వివాదస్పదమైన, విమర్శనాత్మకమైన సంధి. ఇది పరాజిత రాజ్యాలపై విజేతలైన రాజ్యాలు "నిర్దేశించిన సంధి" (Dictated peace) అని, "బలవంతంగా రుద్దబడిన శాంతి ఒప్పందం" అని, జర్మనీ పై జరిగిన కుట్ర అని జర్మన్‌లు భావించినారు. ఓడిపోయిన రాజ్యాలపై కఠిన షరతులు విధించడం అప్పటికి సమంజసంగా కనిపించినా, దీర్ఘకాల ప్రయోజనాలకు, సుస్థిర శాంతిస్థాపనకు అనుచితం. ఈ సంధివలన జర్మనీ దయాదాక్షిణ్యాలు లేకుండా అవమానకరంగా శిక్షింపబడినది. అత్యంత భూభాగాన్ని, జనాభాను, పరిశ్రమలు, పశుసంపద, ఖనిజ సంపద ఈ సంధివలన జర్మనీ కోల్పోయినది. జర్మనీ ఆర్థిక దుస్థితినైనా గమనించక తీవ్రమైన యుద్ధ నష్ట పరిహారాన్ని జర్మనీ పై విధించడం జరిగినది. నిరుద్యోగ, వర్తక మాంద్యాలతో సతమతమవుతున్న జర్మనీ ఈ పెద్ద మొత్తాన్ని ఏ విధంగా చెల్లించగలుగుతుందనే భావన కూడా మిత్ర రాజ్యాలకు లేదు. మిత్ర రాజ్యాలు పరాజిత రాజ్యాల పట్ల ముఖ్యంగా జర్మనీపట్ల పగ సాధింపు ధోరణితో వ్యవహరించినాయి. ఐరోపా శాంతి కంటే స్వీయ ప్రయోజనాలే ముఖ్యమని మిత్ర రాజ్యాలు భావించినాయి. వర్సే సంధి విల్సన్ 14 సూత్రాలకు అనుగుణంగా రూపొందింపబడలేదని, 14 సూత్రాలు 14 నిరాశలుగా మిగిలినాయని, నిరాయుధీకరణ చెదరిన కలగా మిగిలిపోయిందని కార్విన్ పండితుడు వ్యాఖ్యానించినాడు. ఈ సంధి మరొక యుద్ధ ప్రకటన వంటిదని ఫిలిప్ స్నోడెన్ అభిప్రాయ పడినాడు. జర్మనీపై విధించిన కఠినాతి కఠినమైన షరతులే ఆ రాజ్యంలో విపరీతమైన జాతీయతా భావానికి, నిరంకుశ సైనికత్వానికి దోహదం చేసి రెండో ప్రపంచ సంగ్రామానికి పురికొల్పినవి. అందువలననే రెండవ ప్రపంచ సంగ్రామానికి సంబంధించిన విత్తనాలు వర్సే సంధిలో నాటబడినాయి అనే అభిప్రాయం ఉంది. మొత్తం మీద వర్సే సంధి చాలా అసంతృప్తికరమైనది. తాత్కాలిక శాంతిని మాత్రమే నెలకొల్పగలిగినది. వర్సే సంధికి సంబంధించిన విమర్శను ఈ క్రింది విధంగా వివరించవచ్చు.

**1. పగ, ద్వేషంతో కూడిన సంధి :** మిత్ర రాజ్యాలు జర్మనీపట్ల పగ, ద్వేషంతో వ్యవహరించినాయి. సంధి షరతుల్లో దయా దాక్షిణ్యాలు లోపించినాయి. మిత్ర రాజ్యాలు జర్మనీ పట్ల కనీస మర్యాదలు కూడా పాటించలేదు. మిత్ర రాజ్యాల పగసాధింపు ధోరణివలన జర్మన్ ప్రజలలో తీవ్రమైన అసంతృప్తి, ద్వేషము పెరిగినాయి.

**2. అవమానకరమైన సంధి :** మిత్ర రాజ్యాలు జర్మనీ ప్రతినిధులపట్ల చాలా అవమానకరంగా వ్యవహరించినారు. జర్మనీ ప్రతినిధులను సమావేశ ప్రాంగణంబయటనే ఉంచినారు. సంధి రెండు ముఖ్యమైన సిద్ధాంతాల ప్రాతిపదికగా తయారయింది. ఒకటి యుద్ధానికి కారణమైన జర్మనీని కఠినంగా శిక్షించడం, రెండు భవిష్యత్ ఐరోపాను జర్మనీ దురాక్రమణ నుండి కాపాడటం. సంధి సంప్రదింపుల తయారీలో జర్మనీని సంప్రదించక మిత్ర రాజ్యాలవారు షరతులు తయారుచేసి బలవంతంగా జర్మనీ ప్రతినిధులతో సంతకాలు చేయించినారు.

**3. ఆర్థికంగా జర్మనీ విపరీతంగా నష్టపోయింది :** ఈ సంధివలన జర్మనీకి ఆర్థికంగా అన్యాయం జరిగి తీవ్ర నష్టానికి గురి అయింది. ఈ సంధి ద్వారా జర్మనీ చాలా భూభాగాన్ని, ప్రజలను, ఖనిజ సంపదను, రసాయనాలను, విదేశీ పెట్టుబడులను, వలసలను కోల్పోవడమేగాక శక్తికి మించిన నష్ట పరిహారాన్ని చెల్లించవలసి వచ్చినది.

**4. జాతీయ సిద్ధాంతం, స్వయం నిర్ణయ సిద్ధాంతం సంపూర్ణంగా అన్వయింపబడలేదు :** ఈ సిద్ధాంతాలను అనుసరించి చెకొస్లావాకియా, యుగొస్లావియా, పోలండ్ మొదలైన స్వతంత్ర రాజ్యాలు ఏర్పడినాయి. కాని దేనికి భిన్నంగా జర్మన్ జాతి ప్రజలు పోలండ్, బొహీమియా, ఇటలీ మొదలైన దేశాల ఆధిపత్యంలో ఉండిపోయారు. నాలుగోవంతు హంగరీ ప్రజలు పరాధీనులైనారు. తత్ఫలితంగా అల్ప సంఖ్యాక ప్రజల సమస్య ఆవిర్భవించి భవిష్యత్తులో అనేక అనర్థాలకు దారితీసింది.

**5. అమలుకాని నిరాయుధీకరణ సూత్రము :** వర్సే సంధి పత్రాలమీద సంతకాలు చేసిన రాజ్యాలన్నీ నిరాయుధీకరణ సూత్రాన్ని ఆమోదించినాయి. మిత్రరాజ్యాలు నిరాయుధీకరణ సూత్రాన్ని తమ విషయంలో అమలులో పెట్టలేదు. కాని జర్మనీ పై ఈ సూత్రాన్ని బలవంతంగా అమలుపరచి సైనిక, నౌకా బలాలను తగ్గించడమేకాక చాలా మేరకు నాశనం చేసినారు. ఈ సూత్రాన్ని నిష్పక్షపాతంగా అమలు చేయకపోవడం వలన సంధిలోని సైనిక నిబంధనలను జర్మనీ అవకాశం వచ్చినప్పుడు ఉల్లంఘించి దురాక్రమణకు పాలుబడి రెండో ప్రపంచ యుద్ధానికి కారణభూతమైంది.

6. వర్సేసంధి విరుద్ధ భావాల సంఘర్షణతో కూడుకున్నది : వర్సే సంధిలో మూడు విరుద్ధమైన భావాల మధ్య సంఘర్షణ స్పష్టంగా కనిపిస్తుంది. అవి విల్సన్ ఆదర్శవాదం, క్లిమెన్సో జాతీయవాదం, లాయిడ్ జార్జి అవకాశవాదం. ఫలితంగా అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్ దేశాల మధ్య స్వప్రయోజనాల మధ్య సంఘర్షణ ఏర్పడింది. ప్రపంచ నాయకత్వం కోసం బ్రిటన్, ఫ్రాన్స్‌లు పోటీపడగా, అమెరికా, జపాన్‌ల మధ్య వ్యాపార రంగంలో పోటీ ఏర్పడింది.

7. వర్సేసంధి విల్సన్ 14 సూత్రాలకు అనుగుణంగా లేదు : స్వేచ్ఛా వ్యాపార సిద్ధాంతం, స్వేచ్ఛా నౌకాయాన సిద్ధాంతం నిస్సాక్షికంగా అమలులోకి రాలేదు.

8. వర్సేసంధి నైతికంగా సమర్థనీయం కాదు : సంధి సూత్రాలు న్యాయ సూత్రాలకు అనుగుణంగా రూపొందింపబడలేదు. జర్మనీపై మోయలేని యుద్ధ నష్టపరిహారాన్ని విధించినారు. ఈ సంధివలన జర్మనీ ఆర్థికంగా, సైనికంగా తీవ్రమైన నష్టానికి గురి అయి బలహీనమైనది. అటువంటి జర్మనీ యుద్ధ నష్ట పరిహారాన్ని ఎలా చెల్లించగలదో మిత్ర రాజ్యాలు ఆలోచించలేదు. జర్మనీ వలసలను ఆధిష్ట ప్రాంతాలుగా ప్రకటించి మిత్ర రాజ్యాల పరిపాలనలో ఉంచడం జరిగింది. ఆధిష్ట ప్రాంతాలలో మిత్రరాజ్యాల పాలన జర్మనీ పరిపాలనకన్నా ఏ విధంగా మెరుగుగాలేదు. అందువలన నైతికంగా ఈ ఏర్పాటు సమర్థనీయంకాదు. జాతీయ సిద్ధాంతం, స్వయం నిర్ణయ సిద్ధాంతం జర్మనీ విషయంలో సరిగా అన్వయింపబడలేదు. ఈ విధంగా మిత్ర రాజ్యాలు జర్మనీ పట్ల నైతికంగా సమర్థనీయంగాని విధానాన్ని అనుసరించారు.

9. వర్సే సంధిలోని అంశాలు ఆచరణ సాధ్యం కానివి : వర్సే సంధిలో అనేక ఆచరణ సాధ్యంకాని అంశాలున్నాయి. జర్మనీ ఒక అగ్ర దేశానికి చెందినరాజ్యం. అటువంటి రాజ్యాన్ని ఎక్కువ కాలం బలహీన పరిస్థితిలో ఉంచడం సాధ్యం కాదు. అందువలననే మిత్ర రాజ్యాలు జర్మనీని ఎంతగా అణచివేశారో అంత త్వరితగతిన బలం పుంజుకొన్నది. జర్మనీకి చెందిన ప్రాంతాలను వివిధ దేశాలకు బదిలీ చేయడం, జర్మనీలో పోలిష్ కారిడార్ సృష్టించడం, జర్మనీ బొగ్గు గనులు, ఇనుప ఖనిజాలు ఉన్న ప్రాంతాలను ఫ్రెంచ్ వారి ఆధీనంలో ఉంచడం, ఆర్థికంగా బలహీన పరచడం, మోయలేని యుద్ధ నష్టపరిహారాన్ని విధించడం మొదలగు అంశాలు జర్మనీని తీవ్రంగా అవమాన పరచినాయి. జర్మనీ తనకు జరిగిన అవమానాన్ని ఎంతో కాలం భరించలేకపోయింది. ప్రతీకారంగా నాజీపార్టీ ఆధ్వర్యంలో హిట్లర్ అవమానకరమైన సంధి షరతులను ఒకదాని తరువాత ఒకటి ఉల్లంఘిస్తూ దురాక్రమణలు చేసి రెండో ప్రపంచ సంగ్రామానికి కారణ భూతుడయినాడు. అందువలననే రెండో ప్రపంచ సంగ్రామ బీజాలు వర్సే సంధిలోనే ఉన్నాయని చెప్పవచ్చు. వర్సే సంధి 20సం॥ల కాలం మాత్రమే అమలులో ఉన్న తాత్కాలిక సంధి అని కొందరి అభిప్రాయం.

పై కారణాలవలన జర్మన్‌లు ఈ సంధిని "అన్యాయమైన సంధి" (Unjust treaty) అని భావించినారు. ఇ.హెచ్.కార్ చెప్పినట్లుగా మొత్తం మీద వర్సేసంధి జర్మన్‌ల మీద "బలవంతంగా రుద్దిన శాంతి" (Dictated peace) అని చెప్పవచ్చును.

**వర్సేసంధి - అనుకూల వాదాలు :** వర్సే సంధి సంపూర్ణంగా విఫలమైనదని చెప్పలేము. పారిస్ శాంతి సమావేశంలో పాల్గొన్న అగ్ర నాయకులు అనేక క్లిష్టమైన సమస్యలు ఎదుర్కొన్ననూ ఐరోపాలో శాంతి స్థాపన చేయవలెననే ఆతురత వారిలో కనిపిస్తుంది.

1. ప్రథమ ప్రపంచ సంగ్రామ కాలంలో ఉడ్రోవిల్సన్ శాంతి స్థాపనకు సంబంధించిన ప్రణాళికలు, ప్రకటనలు శాంతి సమావేశంలో సంపూర్ణంగా అన్వయింపబడినవో లేదో చెప్పడం కష్టమే అయినా వర్సేసంధి దాదాపు 14 సూత్రాలకు అనుగుణంగా రూపొందింపబడినది.

2. మిత్ర రాజ్యాలు జర్మనీ పట్ల దయాదాక్షిణ్యాలు లేకుండా వ్యవహరించిన మాట వాస్తవమే. వర్సే సంధి నిబంధనలను తయారు చేసే సమయంలో పారిస్ సమావేశ నాయకులకు జర్మనీ పట్ల ఐరోపా ప్రజలకున్న కోపాన్ని, ద్వేషాన్ని కప్పి పుచ్చడం సాధ్యం కాలేదు.

3. ఉడ్రో విల్సన్‌గాని, మిత్ర రాజ్యాలుగాని జర్మనీ బ్రెస్ట్-లిటోవస్క్ సంధిలో రష్యాపట్ల చూపించిన పగ సాధింపు ధోరణి మరువలేదు. జర్మనీ జయించేఉంటే అటువంటి విధానాన్నే మిత్రరాజ్యాలపట్ల జర్మనీ అనుసరించేదనే భావన వారిలో ఉంది.

4. వర్సే సంధిలోని ఆస్ట్రియా - హంగరీకి సంబంధించిన షరతులు చూసినట్లయితే విల్సన్ 14 సూత్రాల ప్రకటన తరువాత యుద్ధ గమనంలో వచ్చిన మార్పును గమనించిన విల్సన్ ఆస్ట్రియా-హంగరీకి సంబంధించిన తన ప్రణాళికలో మార్పు చేసుకోవలసి వచ్చినది. ఆస్ట్రియా ఎటువంటి నిబంధనలు పెట్టకుండా లొంగిపోయినది. అందువలన జర్మనీ లొంగిపోవడానికి సంబంధించిన షరతులు ఆస్ట్రియా విషయంలో అన్వయింపకుదరలేదు. అంతేగాక 1915 లండన్ సంధి ప్రకారం ఇటలీ మిత్ర రాజ్యాలలో చేరడంతో విల్సన్ ఆస్ట్రియా విషయంలో తన ప్రణాళికను మార్చుకోవలసి వచ్చినది.

5. విల్సన్ 14 సూత్రాలు ప్రపంచ శాంతి స్థాపన కోసం సాధారణంగా ప్రకటించినవి. ప్రపంచంలోని వివిధ జాతుల రాజ్యాల ఆమోదం లేకుండా అవి ఆచరణ సాధ్యం కావు.

6. ఎక్కడైతే జాతీయ భావం, స్వయం నిర్ణయాధికారం సూత్రాలకు వ్యతిరేకంగా భూ భాగాలను జయించిన రాజ్యాలకు బదిలీ చేయడం జరిగిందో (మెల్మడి, మొర్స్ నెట్ (ప్రాంతాలు) ఆ ప్రాంతాలలో ప్రజాభిప్రాయ సేకరణ ప్రకారం పునరాలోచన చేసి నిర్ణయం మార్చుకోవడానికి వర్సేసంధి అవకాశం కల్పించింది. సార్‌లోయ విషయంలో తాత్కాలికంగా అమలుచేసిన ఏర్పాట్లు కేవలం జర్మనీ నుండి యుద్ధ నష్ట పరిహారాన్ని పొందడానికి మాత్రమే. 15 సం॥ల తరువాత ప్రజాభిప్రాయ సేకరణ అనుసరించి సార్ రాజకీయ భవిష్యత్తుకు నిర్ణయం తీసుకొనే ఏర్పాట్లు కూడా చేసినారు. జర్మనీ సంధి షరతులను విధిగా అనుకరించడానికి మాత్రమే రైన్ లాండ్‌పై మిత్ర రాజ్యాల అధికారాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.

7. జర్మనీ-ఆస్ట్రియా అనుసంధానాన్ని వ్యతిరేకించడం తప్పకుండా జాతీయ భావాన్ని, స్వయం నిర్ణయాధికార సిద్ధాంతాలను మిత్ర రాజ్యాలు వ్యతిరేకించడమే. అదే సమయంలో స్లావ్, ఇటలీ, చెకోస్లావాక్స్ మొదలగు వివిధ జాతుల వారిని మిత్ర రాజ్యాలవారు విదేశీ పాలన నుండి విముక్తి చేయవలసిన బాధ్యత కూడా ఉంది. అంతేగాక జర్మనీ ఆస్ట్రియాలు కలవడం అనేది శాశ్వత శాంతి స్థాపనకు విఘాతం అవుతుంది.

8. వర్సే సంధికి సంబంధించిన అనేక నిబంధనలు తాత్కాలికమైనవే. వీటిలో ఏమన్నా లోపాలుంటే వాటిని సరిచేయడానికి అంతర్జాతీయ సంస్థ అయిన నానాజాతి సమితి స్థాపించబడినది. అంతేకాకుండా అతి కాఠిన్యత కలిగిన షరతులు అవి అమలుపరచే సమయంలో వాటి తీవ్రతను తగ్గించడం జరిగింది.

వర్సే సంధిని సమర్థిస్తూ లిప్సన్ మహాశయుడు చెప్పినట్లు "మొత్తం మీద నూతన ఐరోపా చిత్ర పటము పూర్వపు ఐరోపాకంటే అనేక రెట్లు న్యాయ సమ్మతమైన ప్రాతిపదికగా నిర్మింపబడినదనటం వ్యతిరేకించవలసిన విషయం కాదు."

## 1.11 వర్సేసంధి "బలవంతంగా రుద్దబడిన శాంతి" (Dictotee Peace) :

వర్సే సంధి జర్మన్‌లు తమ మీద బలవంతంగా రుద్దిన శాంతి అని వర్ణించినారు. ఈ సంధి యుద్ధంలో గెలిచిన రాజ్యాలు ఓడిపోయిన రాజ్యాల మీద దయాదాక్షిణ్య రహితంగా విధించిన శిక్ష అని జర్మన్‌లు, చాలామంది ఇతర ఐరోపా ప్రజలు భావించినారు. జర్మన్‌ల వ్యతిరేకమైన మనో భావాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

1. జర్మన్‌లు ఈ సంధిని అన్యాయమైన సంధి (Unjust treaty) అని తలచినారు. అయితే ఏ సంధి అయినా న్యాయమైనదో, అన్యాయమైనదో నిర్ణయించడం సులభంకాదు. అంతేగాక ఒక భయంకరమైన యుద్ధం తరువాత న్యాయమైన సంధి నిబంధనలను తయారు చేయడం అంత సులభంకాదు. ముఖ్యంగా ఆశ, ద్వేషాలతో ఉన్న సమయంలో న్యాయమైన సంధికి గురి అయిన నిర్వచనం చెప్పడంగాని, న్యాయమైన సంధి ముసాయిదాను తయారు చేయడంగాని సాధ్యపడే విషయం కాదు.

2. మిత్ర రాజ్యాలు పారిస్ శాంతి సమావేశంలో తమపట్ల పగసాధింపు ధోరణి ప్రదర్శించి తీవ్రంగా అవమానించారని జర్మన్‌లు భావించినారు. అతి చిన్న స్థానిక యుద్ధాలలోనే ద్వేష భావం, ప్రతీకార భావం, ఉద్రేకం మొదలగు భావాలు ఉత్పన్నమవుతాయి. ఈ కోణంలో ఆలోచిస్తే ఒక మహా సంగ్రామ ఫలితంగా ఏ మేరకు ద్వేష భావం, ప్రతీకార భావం, ఉద్రేకాలు ఉత్పన్న మవుతాయో అర్థం

చేసుకోవచ్చు. వర్సే సంధి ముసాయిదాను తయారుచేస్తున్న సమయంలో జర్మనీమీద ఐరోపా ప్రజలలో ఉన్న ద్వేషాన్ని, ప్రతీకారాన్ని, కోపాన్ని కప్పిపుచ్చలేక పోయారు. అందువలన మిత్ర రాజ్యాలు జర్మనీ విషయంలో కఠినంగా పగసాధింపు ధోరణితో ఉండడం సర్వసాధారణం.

3. సాధారణంగా అన్ని సంధులు ఓడిపోయిన వారికి అన్యాయంగాను, భరించలేనివిగాను ఉంటాయి. చరిత్రలో ఓడిపోయిన ఏ రాజ్యం అయినా సంధిని సంతోష పూర్వకంగా ఆమోదించిన సందర్భాలు లేవు. అంతేకాదు ఏ ఓడిపోయిన రాజ్యంకూడా తాను బాధ్యురాలుగా చెప్పుకోలేదు. మరియూ సంధి న్యాయ సమ్మతంగా ఉందని అభినందనలు తెలుపనూలేదు.

4. మిత్ర రాజ్యాలు పగసాధింపు ధోరణిని అనుసరించారని జర్మన్‌లు భావించినారు. కాని జర్మనీ బ్రెస్ట్-లిటివస్క్ సంధిలో రష్యాపట్ల, బుకారెస్ట్ సంధిలో రుమేనియాపట్ల అనుకరించిన పగసాధింపు ధోరణి మిత్ర రాజ్యాలు మరచిపోలేదు. జర్మనీ పాలకుల కఠినమైన మనస్సును ఈ సంధులు తేటతెల్లం చేసినాయి.

5. విల్సన్ 14 సూత్రాలకు అనుగుణంగా వర్సే సంధిని రూపొందించలేదని జర్మన్‌లు వాపోయినారు. విల్సన్ సూత్రాలలో స్వయం నిర్ణయాధికార సిద్ధాంతాన్ని విస్మరించి పోలండ్, చెకొస్లావాకియా మొదలగు రాజ్యాలలో జర్మన్‌లను విదేశీ పాలన క్రింద ఉంచినారు. దీనికి జవాబుగా విల్సన్ స్వయం నిర్ణయాధికార సిద్ధాంతాన్ని తు.చ. తప్పకుండా అన్ని సందర్భాలలోను అన్వయింపజేయడం కుదిరేపనికాదు. ఒకే రాజ్యంలో విభిన్న జాతులు ఒకే భూ భాగంలో కలసి ఉన్న సందర్భాలలో జాతి, భాష, సంస్కృతి ప్రాతిపదికన వారి మధ్య స్పష్టమైన గీతగీసి వారిని వేరుచేయడం సాధ్యమైన పనికాదు. అంతేగాక వివిధ దేశాలలో ఉన్న అల్ప సంఖ్యాక వర్గం వారిని సంరక్షించే బాధ్యత తీసుకొన్న మిత్ర రాజ్యాల వారు అందు నిమిత్తం పోలండ్, చెకొస్లావకియా, గ్రీసు, రుమేనియా, యుగొస్లావియా మొదలగు దేశాలతో మైనారిటీ సంధులు చేసుకొన్నాయి.

6. జర్మనీ -ఆస్ట్రియాల స్వచ్ఛంద కలయికను వ్యతిరేకించడం ద్వారా మిత్ర రాజ్యాలు విల్సన్ స్వయం నిర్ణయాధికార సిద్ధాంతాన్ని ఉల్లంఘించారని జర్మనీ అభియోగం. మిత్ర రాజ్యాలకు అనుకూలంగా ఈ విషయానికి సంబంధించి చెప్పవచ్చు. ఈ రకమైన జర్మనీ-ఆస్ట్రియా కలయిక ఐరోపాలో మిత్ర రాజ్యాల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా ఉండి చివరకు బలవత్తరమైన జర్మనీ ప్రపంచ శాంతికి భంగం కలిగించవచ్చు. ఈ కారణంగానే జర్మనీ ఆస్ట్రియాల కలయికను మిత్ర రాజ్యాలు వ్యతిరేకించి ఉంటారు.

7. వర్సే సంధి షరతులలోగల కాఠిన్యము వాటిని అమలుచేసే సమయంలో వాటి తీవ్రతను తగ్గించినారు. ఉదాహరణకు :

ఎ) యుద్ధ నష్టపరిహారం జర్మనీ నుండి సంపూర్ణంగా వసూలు చేయబడలేదు. బి) జర్మన్ భూ భాగాలనుండి మిత్ర రాజ్యాల సైన్యాలను 15 సం॥లలోపలే ఉపసంహరించడం జరిగింది. సి) జర్మన్ చక్రవర్తి కైజర్ రెండవ విలియం పై నేర విచారణ జరుపలేదు. కొద్ది మంది జర్మన్ అధికారులను జర్మన్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కోర్టు ద్వారా శిక్షించడం జరిగింది.

8. వర్సే సంధిలోని షరతులన్నీ దాదాపు తాత్కాలికమైనవేగాక వాటిలో తరువాత లోపాలు వస్తే సరిచేయడానికి ఒక అంతర్జాతీయ సంస్థ నానాజాతి సమితిని ఏర్పాటు చేయడం కూడా జరిగింది.

9. జర్మన్‌లు వర్సే సంధిని "బలవంతంగా రుద్దబడిన శాంతి" అని వర్ణించినారు. ఈ విధమైన భావనలో కొంత సత్యం లేకపోలేదు. ఇ.హెచ్.కార్ చెప్పినట్లు యుద్ధాన్ని ముగించిన ఏ సంధి అయిననూ ఏదో మేరకు బలవంతంగా రుద్దబడిన శాంతి అనిపిస్తుంది. ఎందువలనంటే ఓడిపోయిన రాజ్యం ఎట్టి పరిస్థితుల్లోను ఓటమి పరిణామాలను మనస్ఫూర్తిగా అంగీకరించలేదు. అయితే వర్సే సంధిలో రుద్దబడిన అంశం ఆధునిక కాలంలో పూర్వపు సంధుల కన్నా ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఈ సంధిని తయారు చేసే సమయంలో జర్మన్ ప్రతినిధులతో మిత్ర రాజ్యాలు సంప్రదించలేదు. అంతేగాక మిత్ర రాజ్యాలు జర్మనీ ప్రతినిధులను బెదిరించి వారిచేత సంతకాలు చేయించినారు.

## 1.12 వర్సేసంధి – రెండో ప్రపంచ సంగ్రామం :

కొంతమంది విమర్శలు రెండో ప్రపంచ సంగ్రామ బీజాలు వర్సే సంధిలోనే ఉన్నాయని భావించినారు. అనేక కోణాలలో పరిశీలిస్తే ముఖ్యంగా జాతీయ గౌరవం, రాజకీయ భద్రత, ఆర్థిక దుస్థితి మొదలగు విషయాలు దృష్టిలో పెట్టుకొన్న ఒక ఆత్మ గౌరవం కలిగిన

బలవత్తరమైన జర్మనీ లాంటి దేశాలు వర్సేసంధి లాంటి సంధిని అన్ని కాలాలలో గౌరవించే అవకాశం లేదు. ఎప్పుడైతే ఈ అవమానకరమైన సంధి షరతులను జర్మనీ ఉల్లంఘించడానికి ప్రయత్నించిందో అప్పుడే మరొక ప్రపంచ యుద్ధం ప్రారంభమయినది.

ముఖ్యంగా రెండు ప్రపంచ యుద్ధాల మధ్య కాలాన్ని జర్మనీ సంధి షరతులను ఉల్లంఘించిన చరిత్ర అని వర్ణిస్తారు. వర్సే సంధిలోని కొన్ని నిబంధనలు ఎప్పుడూ అమలు పరచలేదు. మరికొన్ని నిబంధనలు జర్మనీ ఉల్లంఘించగా మిత్ర రాజ్యాలు ఎట్టి ఆక్షేపణ చెప్పలేదు. ప్రపంచ చరిత్రలో ఏ సంధి షరతులు వర్సే సంధి షరతులవలె సవరణ చేయబడలేదు. పునః పరిశీలన జరుపబడలేదు. ఉల్లంఘింపబడలేదు. 1926 సం॥లో జర్మనీ నానాజాతి సమితిలో సభ్యత్వం పొందగానే వర్సేసంధిలోని మొదటి భాగాన్ని సవరించినారు. తదనంతరం జర్మనీ ప్రత్యక్షంగా సైనిక, నౌకా, వైమానిక నిబంధనలకు సంబంధించిన వర్సే సంధి 5వ భాగాన్ని ఉల్లంఘించింది. యుద్ధ నేరస్థులకు సంబంధించిన 7వ భాగాన్ని అన్ని రాజ్యాలు వదలివేసినాయి. జర్మనీ ఉత్తర, తూర్పు సరిహద్దులకు సంబంధించిన వర్సే సంధికి చెందిన 2, 3 భాగాలను మిత్ర రాజ్యాల సమ్మతితో జర్మనీ ఉల్లంఘించింది. అంతేగాక జర్మనీ నూతన సైనికశాసనాలను రూపొందించడం 1935లో జర్మనీ ఇంగ్లాండుతో నౌకా సంధి చేసుకోవడం, 1938లో జర్మనీ ఆస్ట్రియాను ఆక్రమించుకోవడం, 1939లో బొహిమియో, మొరీలియాలను జర్మనీ ఆక్రమించడం మొదలగు చర్యల ద్వారా జర్మనీ పదే పదే వర్స్ సంధిని ఉల్లంఘించడంతో వర్స్ సంధి నిర్మాణం నెమ్మదిగా పటాపంచలయింది.

**వర్సే సంధి వైఫల్యానికి కారణాలు :**

అన్ని విధాల వర్సే సంధి ఉద్దేశాలు పూర్తిగా వైఫల్యం చెందినవి.

1. ఈ సంధి వలన యుద్ధంలో గెలిచిన రాజ్యాలు ఓడిపోయిన రాజ్యాలు కూడా సంతృప్తి చెందలేదు.

2. ఈ సంధి రూపొందించిన వారికి అనుభవ పూర్వకమైన దృష్టి లేదు.

3. సంధి షరతులను ఖచ్చితంగా అమలు పరచే శక్తి మిత్ర రాజ్యాలకు లేదు. అందువల్ల సంధిని ఉల్లంఘించడానికి జర్మనీకి ఉత్సాహము, ప్రేరణ లభించినది. ఈ కోణంలో వర్సే సంధి రెండో ప్రపంచ యుద్ధానికి పరోక్ష కారణమైనది.

4. జర్మనీ వంటి బలవత్తరమైన దేశాన్ని సైనికంగా బలహీన స్థితిలో ఉంచడం సాధ్యమయ్యే విషయంకాదు. అంతేకాదు జర్మనీ వంటి శక్తివంతమైన రాజ్యం తన పొరుగున గల శక్తివంతమైన బెల్జియం వంటి రాజ్యం ముందు సైనికంగా బలహీనంగా ఉండలేదు. అందువలన ఈ సంధిలోని నైతికమైన లోపాలతోబాటు ఆచరణ సాధ్యం గాని అంశాలు పరోక్షంగా రెండో ప్రపంచ యుద్ధానికి దారితీసినాయి.

5. బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికాల మధ్యగల ఆదర్శాల సంఘర్షణ జర్మనీ తిరిగి విజృంభించడానికి దోహదం చేసినాయి. జర్మనీ దురాక్రమణ నుండి భద్రతకై రైన్ లాండ్‌పై మిత్ర రాజ్యాల అధికారం ఉండాలని ఫ్రాన్స్ ఆశించింది. కాని దీనిని బ్రిటన్, అమెరికాలు వ్యతిరేకించడంతో రక్షణ విషయంలో ఫ్రాన్స్ ఆశలు సఫలీ కృతం కాలేదు.

ఈ విధంగా నైతికమైన, ఆచరణ సాధ్యంకాని లోపాలు వర్సే సంధిలో ఉండి జర్మనీ విజృంభణకు అవి దోహదపడినా రెండో ప్రపంచ సంగ్రామానికి ఈ సంధి ప్రధాన కారణం అని చెప్పలేము. వర్సే సంధిలోని షరతులు ఒక దాని తరువాత ఒకటి జర్మనీ ఉల్లంఘిస్తూ సైనికంగా బలపడింది. అయిననూ జర్మనీ మిత్ర రాజ్యాల నుండి ఎట్టి వ్యతిరేకతను ఎదుర్కొనలేదు. హిట్లర్ నాయకత్వంలో జర్మనీ దురాక్రమణలు ప్రారంభించింది. మిత్ర రాజ్యాలు అనుసరించిన సంతుష్ట విధానం కూడా జర్మనీని దురాక్రమణలకు ప్రోత్సహించి అది సామ్రాజ్యవాద దేశంగా మారడానికి దోహదం చేసింది. ఈ సంతుష్ట విధానమే ఇటలీ, జపానులు చురుకుగా దురాక్రమణలు చేయడానికి ప్రోత్సహించింది. జర్మనీ అనేక విదేశీ రాజ్యాలను ఒకదాని తరువాత ఒకటి ఆక్రమించి పోలండ్‌పై దండయాత్ర చేయడంతో రెండో ప్రపంచ సంగ్రామం ప్రారంభమయినది.

**వర్సేసంధి - విల్సన్ 14 సూత్రాలు :**

ప్రధమ ప్రపంచ సంగ్రామ కాలంలో అమెరికా యుద్ధంలో ప్రవేశించక ముందు, ప్రవేశించిన తరువాత కూడా యుద్ధంలో పాల్గొన్న ఇరుపక్షాల మధ్య ఉద్రిక్తత తగ్గించి, యుద్ధాన్ని విరమింపజేయుటకు విల్సన్ అనేక శాంతి ప్రయత్నములు చేసినాడు. ఇరుపక్షాలవారికి సంపూర్ణ విజయం సాధింపనిదే యుద్ధాన్ని విరమింపజేసే యోచన లేకపోవడంతో అమెరికా అధ్యక్షుడు ఉడ్రోవిల్సన్ ఐరోపాలో సుస్థిర శాంతిని నెలకొల్పడానికి ఉభయ పక్షాలకు ఆమోదయోగ్యంగా నుండు 14 సూత్రాలను 1918 జనవరి 8వ తేదీన అమెరికన్ కాంగ్రెస్‌లో మాట్లాడుతూ ప్రతిపాదించినాడు. వీటినే విల్సన్ 14 సూత్రాలు అంటారు. యుద్ధంలో జర్మనీ ఓడిపోయిన తరువాత ఈ 14 సూత్రాల ప్రాతిపదికగా సంధికి అంగీకరించింది. తదనుగుణంగా సంధి నిర్ణయాలు రూపొందించడానికి మిత్ర రాజ్యాలు పారిస్‌లో సమావేశమయినాయి. ఆదర్శవాది అయిన విల్సన్‌కు విశ్వమానవ శాంతియే లక్ష్యంగా ఉంది. కాని బ్రిటన్, ఫ్రాన్స్ దేశాల ప్రతినిధులు విజేతలకే లాభాలు అనే ధోరణితో వ్యవహరించి పరాజిత రాజ్యములపట్ల ముఖ్యంగా జర్మనీపట్ల పగసాధింపు ధోరణి అనుసరించారు. వీరికి ఐరోపా శాంతి కన్నా స్వీయ రక్షణ, స్వీయ ప్రయోజనాలే ముఖ్యమయినాయి. ఈ విధానం వలన జర్మనీ ప్రాదేశికంగా, సైనికంగా ఆర్థికంగా, నైతికంగా పతనం చెందింది. అందువలన వర్సేసంధి విల్సన్ సూత్రాలకు ప్రాతిపదికగా రూపొందింపబడలేదని జర్మన్‌లు వాపోయినారు. విల్సన్ 14 సూత్రాలకు, వర్సే సంధికి మధ్య పొంతన సరిగా లేదని ఈ క్రింది విషయాల ద్వారా చెప్పవచ్చును.

1. వర్సే సంధి ముసాయిదాను బహిరంగంగా తయారు చేయకపోవడం, రహస్య సంధులపట్ల ఆక్షేపణ తెలియజేయక పోవడం వంటి వాటివలన విల్సన్ 14 సూత్రాలలో మొదటి సూత్రం సరిగా పాటించలేదని తెలుస్తున్నది.
2. స్వేచ్ఛా వ్యాపార సిద్ధాంతం, స్వేచ్ఛా నౌకాయాన సిద్ధాంతం నిష్పాక్షికంగా అనుసరించకపోవడం.
3. జాతీయ సిద్ధాంతం, స్వయం నిర్ణయ సిద్ధాంతం నిష్పాక్షికంగా అమలు చేయకపోవడం.
4. నిరాయుధీరణ జర్మనీపట్ల కఠినంగా అనుసరించి మిత్ర రాజ్యాలు అనుసరించక పోవడం.
5. విల్సన్ సూత్రాలలోని వలసల నిబంధన ఆస్ట్రియా, జర్మనీలకు అన్వయింపజేసి ఐరోపా రాజ్యాలకు సంబంధించిన వలస రాజ్య ప్రజల అభిప్రాయానికి ఏమాత్రం గౌరవం ఇవ్వక పోవడం.
6. రష్యా భూ భాగంలోని జర్మన్ సైన్యాన్ని ఉపసంహరింపజేసారు గాని రష్యాలోని బోల్షివిక్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి మిత్ర రాజ్యాలు తమ సైన్యాన్ని పంపడానికి వెనుకాడలేదు.
7. మిత్ర రాజ్యాల సైన్యాన్ని ఫ్రాన్స్, బెల్జియంల నుండి ఉపసంహరించారు. కాని ఆల్సేస్-లోరేయిన్ ప్రాంతాన్ని ఫ్రాన్స్‌కు తిరిగి ఇచ్చారు.
8. ఇటలీ దేశ సరిహద్దులు జాతీయ సిద్ధాంతాన్ని అనుసరించి నిర్ణయం కావలెను. ఈ సూత్రాన్ని ఖచ్చితంగా అన్వయింపలేక పునర్నిర్మిత ఇటలీలో అనేక మంది ఆస్ట్రియన్‌లు, స్లావ్‌లు ఉంచబడినారు.
9. ఆస్ట్రియా, హంగరీలలో అనేక జాతులకు స్వయంపాలన ఇవ్వవలెను. ఈ నిబంధనను అమలు పరచకపోవడం వలన అనేకమంది ఆస్ట్రియన్‌లు, మాగియర్‌లు విదేశీపాలనలో ఉండిపోయారు.
10. విల్సన్ 11వ సూత్రాన్ని అనుసరించి మిత్ర రాజ్యాల సైన్యం రుమేనియా, మాంటినీగ్రో, సెర్బియాలనుండి ఉపసంహరించడం జరిగింది.
11. విల్సన్ 12వ సూత్రం అనుసరించి టర్కీలో వివిధ జాతులకు స్వయం పాలన ఇవ్వవలెను. ఈనిబంధన అమలు కాలేదు.
12. విల్సన్ 13వ సూత్రం అనుసరించి పోలండ్ స్వతంత్ర రాజ్య మయింది.
13. విల్సన్ 14వ సూత్రం అనుసరించి నానాజాతి సమితి ఆవిర్భవించింది.

వర్సే సంధి షరతులు నిశితంగా పరిశీలించిన ఆచార్య పార్క్స్ చెప్పినట్లు "సంధి షరతులు విల్సన్ భావములకంటే క్లిమెన్సో భావనలకు దగ్గరగా వున్నాయి." అందుకనే కైన్స్ అను చరిత్రకారుడు" విల్సన్ తన ధర్మ సూత్రములను కొన్నింటిని సాగరములోను మరికొన్నింటిని సభా భవనం వెలుపల విడచి శాంతి సంధి ప్రాంగణమున ప్రవేశించినాడని" విమర్శించినాడు. మోసెస్ పది ఆజ్ఞలతో సంతృప్తి చెందగా విల్సన్‌కు 14 ఆజ్ఞలు కావలసి వచ్చినదని అవహేళన చేసినారు.

అయిననూ వర్సే సంధిలో విల్సన్ సూత్రాలు పూర్తిగా విస్మరింపబడలేదు. విల్సన్ 14 సూత్రాలలో చాలా వాటిని అనుకరించుట జరిగినది. అవి శాంతి స్థాపనకు చాలా వరకు దోహదం చేసినాయి.

1. విల్సన్ సూత్రాల ప్రాతిపదికగా నానాజాతి సమితి అనే అంతర్జాతీయ శాంతి సంస్థ నెలకొల్పడం జరిగింది.
2. విల్సన్ సూత్రాల ఆధారంగా ప్రపంచ నిరాయుధీకరణ సాధించడానికి కొన్ని ప్రయత్నాలు జరిగినాయి.
3. మొట్టమొదటి సారిగా స్వయం నిర్ణయాధికార సిద్ధాంతాన్ని అనుసరించి పోలండ్, చెకొస్లావాకియా, యుగోస్లావియా బాల్టిక్ రాజ్యాలయిన ఎస్తోనియా, లిధూనియా మొదలగునవి జాతీయ రాజ్యాలుగా ఆవిర్భవించినాయి. ఈ సిద్ధాంతాన్ని అనుసరించి సార్, రైన్ భూభాగము, డాన్‌జింగ్‌ల భవిష్యత్తు నిర్ణయించడం జరిగింది. జాతీయ సిద్ధాంతాన్ని ఇంతకు ముందు 1815లో జరిగిన వియన్నా కాంగ్రెస్ లక్ష్య పెట్టలేదు. ఇపుడు దానిని గుర్తించడం జరిగింది. వివిధ జాతులవారికి ఈ పద్ధతివలన అనుకూల జీవన విధానం లభించింది.
4. క్లిమెన్సో తన దేశ రక్షణార్థము రైన్‌నది పశ్చిమ ప్రాంతమును అంతస్థ రాజ్యంగా (Buffer state)చేయ ప్రయత్నింప దానిని నిస్సైనిక మండలంగా మార్చడం జరిగింది.
5. జర్మనీ వలసలను తమ స్వాధీనము చేసుకొనవలెనని బ్రిటన్, ఫ్రాన్స్‌లు ప్రయత్నించగా వాటిని అధిష్ఠ ప్రాంతములుగా మార్చడం జరిగింది
6. ఇటలీ కోరిన డాల్మేషియా ఇవ్వడానికి అంగీకరించక బ్రెన్నర్ కనుమ మాత్రమే ఇవ్వడం జరిగింది.
7. మిత్ర రాజ్యాలు జర్మనీ పట్ల అనుసరించిన పగ సాధింపు విధానంలో చాలా వరకు విల్సన్ సూత్రాలు మార్పు తెచ్చాయి.

## 1.13 మిత్ర రాజ్యాలు - ఇతర రాజ్యాలతో సంధులు :

1) సెయింట్ జర్మన్ సంధి : 1919 సెప్టెంబర్ 10న మిత్ర రాజ్యాలు ఆస్ట్రియాతో చేసుకొన్న సంధిని సెయింట్ జర్మన్ సంధి అంటారు. ఈ సంధి అన్ని విధాల వర్సే సంధిని పోలి వుంది. ఈ సంధిలో మొదటి భాగం నానాజాతి సమితికి సంబంధించినది. రెండో భాగం ఆస్ట్రియా సరిహద్దులకు సంబంధించినది. ఈ సంధి ప్రకారం హాప్స్ బర్గ్ సామ్రాజ్యమయిన ఆస్ట్రియా-హంగరీ సామ్రాజ్యం విచ్ఛిన్నమయింది. 400 సంవత్సరాలు వర్ధిల్లిన సామ్రాజ్యం గభాలున కూలిపోయింది. ఈ సామ్రాజ్యంలో వివిధ జాతుల వారుండేవారు. జర్మన్‌లు, మాఘియర్లు, జెక్‌లు, పోల్‌లు, రుమేనియన్‌లు, కోట్సు, స్లావ్‌లు, ఇటాలియన్‌లు మొదలగువారు ఈ సంధి ప్రకారం :

1. ఆస్ట్రియా-హంగరీ సామ్రాజ్యాన్ని రెండు భాగాలుగా చేసి హంగరీ స్వతంత్ర రాజ్యంగా గుర్తింపబడ్డది.
2. కొత్త ఆస్ట్రియా రాజ్యం ఎక్కువ భూభాగాన్ని, జనాభాను పోగొట్టుకున్నది. ట్రిస్టి, ఇస్ట్రియా, బ్రెన్నర్ కనుమ, డాల్మేషియాలో కొన్ని భాగాలు ఇటలీకి ఇచ్చినారు. బోస్నియా, హెర్జిగోవినా, డాల్మేషియా తీరం యుగోస్లావియాకు ఇచ్చినారు. బొహీమియా, మొరేవియా, స్లొవాకియాలను చెకొస్లావాకియాలో చేర్చినారు. బుకోవినా, ట్రాన్సిల్వేనియాలను రుమేనియా కిచ్చినారు.
3. ఆస్ట్రియా సైన్యం 30 వేలకు, నావికాబలం 3 నౌకలకు పరిమితం చేయబడ్డది.
4. హంగరీ, చెకొస్లావాకియా, పోలండ్, యుగోస్లావియా స్వాతంత్ర్యాన్ని ఆస్ట్రియా గుర్తించింది.

5. యుగొస్లావియా భూభాగం ద్వారా ఆస్ట్రియాకు ఏడ్రియాటిక్ సముద్రంతో సంబంధాలు ఏర్పరచినారు.

ఈ సంధి ద్వారా ఆస్ట్రియా తన వలస సామ్రాజ్యాన్ని, వ్యాపార సదుపాయాలను కోల్పోయి అతి చిన్న రాజ్యంగా **రూపొందించబడింది.**

**2) నియూలీ సంధి :** 1919 నవంబర్ 27న మిత్ర రాజ్యాలు బల్గేరియాతో చేసుకొన్న సంధిని నియూలీ సంధి అంటారు. ఈ సంధి ద్వారా బల్గేరియా 3 లక్షల జనాభాను పోగొట్టుకొని బాల్కన్ ప్రాంతంలో బలహీనమైన రాజ్యంగా రూపొందింపబడింది. ఈ సంధి ప్రకారం.

1. బల్గేరియన్‌లు అధికంగా ఉన్న పశ్చిమ బల్గేరియాను (మాసిడోనియా) యుగోస్లావియాకు ఇచ్చినారు.
2. గ్రీస్‌కు పశ్చిమ థ్రేస్, ఈజియన్ కోస్తా తీరాన్ని బదిలీ చేయడం జరిగింది.
3. రుమేనియాకు డోబ్రూజా ఇవ్వబడింది.
4. బల్గేరియా సైనిక బలం 20వేల సైనికులకు పరిమితం చేయబడింది.
5. బల్గేరియా పెద్ద మొత్తం యుద్ధ నష్ట పరిహారంగా చెల్లించవలసి వచ్చింది.

**3) ట్రియనాన్ సంధి :** 1920 జూన్ 4న నూతనంగా అడ్మిరల్ హర్తి నాయకత్వంలో ఏర్పడిన హంగరీతో మిత్ర రాజ్యాలు చేసుకొన్న సంధి ట్రియనాన్ సంధి. ఈ సంధి ప్రకారం :

1. హంగరీ ఆస్ట్రియా నుండి విడదీయబడి స్వతంత్ర రాజ్యంగా గుర్తింపు పొందింది.
2. ట్రాన్సిల్వేనియాను రుమేనియాకు ఇచ్చినారు.
3. క్రోషియాను యుగోస్లావియాకు ఇచ్చినారు.
4. స్లొవేకియా రాష్ట్రమును చెకొస్లావాకియాకు ఇచ్చినారు.
5. ఫ్యూమ్ (Fiume) రేవు పట్టణాన్ని స్వతంత్ర ప్రతిపత్తిగల నగరంగా ఇటలీకిచ్చినారు.
6. హంగరీ సైనిక బలము 35వేల సైనికులకు పరిమితం చేసినారు.
7. హంగరీ పెద్ద మొత్తంలో యుద్ధ నష్ట పరిహారాన్ని చెల్లించవలసి వచ్చింది.

**4) సెవెర్స్ సంధి :** మిత్ర రాజ్యాలు టర్కీతో 1920 ఆగస్టు 20న చేసుకొన్న సంధి సెవెర్స్ సంధి. ఈ సంధి ప్రకారం :

1. కాన్‌స్టాంటి నోపుల్‌ను దాని పరిసర ప్రదేశాన్ని టర్కీ సుల్తాన్‌కు ఇచ్చినారు.
2. డార్డినెల్స్ జలసంధిపై నియంత్రణాధికారం నానాజాతి సమితికి ఇచ్చినారు. కాన్‌స్టాంటినోపుల్, అలెగ్జాండ్రియా మొదలైన టర్కీ రేవులు అంతర్జాతీయ నియంత్రణలో ఉంచినారు.
3. టర్కీ నుండి ఆసియా మైనర్, థ్రేస్, ఏడ్రియానోపుల్, గాలి పోలి, రోడ్స్ తప్ప మిగిలిన డొడికనీస్ దీవులు విడదీసి గ్రీస్ కిచ్చారు. రోడ్స్ ఇటలీ ఆధీనమయింది.
4. అధిష్టాన పద్ధతి ప్రకారం సిరియా ఫ్రాన్స్ ఆధీనంలోకి, పాలస్తీనా, మెసపొటేమియా, జోర్డాన్‌లు బ్రిటీష్ ఆధీనంలోకి వచ్చాయి.
5. హెజాజ్ రాజును స్వతంత్రునిగా ప్రకటించారు.
6. టర్కీ సైనిక బలము 50 వేల సైనికులకు పరిమితం చేసారు.

ఈ సెవెర్స్ సంధి ననుసరించి టర్కీ అనేక రాజ్య భాగాలను కోల్పోవడం టర్కీ జాతీయ నాయకులకు అసంతృప్తి కలిగించింది.

ముస్తఫా కెమల్ పాషా నాయకత్వం క్రింద అసంతృప్తి తీవ్రతరంకాగా సెవెర్స్ సంధికి బదులుగా లోజేన్ (Lausanne) సంధికి ఐరోపా రాజ్యాలు ఒప్పుకోవడం జరిగింది.

**5) అల్ప సంఖ్యాక వర్గాలకు సంబంధించిన సంధులు :** పారిస్ శాంతి సమావేశం ఫలితంగా జరిగిన సంధులవలన అనేక నూతన రాజ్యాలు ఏర్పడినాయి. ఈ నూతన రాజ్యాలలోను, అనేక ఇతర రాజ్యాలలోను క్లిష్టమైన అల్ప సంఖ్యాక వర్గాల సమస్యలు ఉత్పన్నమయినాయి. అల్పసంఖ్యాక వర్గాల భద్రతా సమస్యను పరిశీలించడానికి పారిస్ సమావేశం ఒక సంఘాన్ని నియమించింది. ఈ సంఘ సిఫార్సుల ఆధారంగా అల్పసంఖ్యాక వర్గాల సమస్యలను పరిష్కరించడానికి మిత్ర రాజ్యాలు చెకొస్లొవాకియా, యుగొస్లావియా, రుమేనియా, గ్రీస్ మొదలైన దేశాలతో మైనారిటీ సంధులు చేసుకొన్నాయి. ఈ సంధుల ఫలితంగా అల్ప సంఖ్యాక వర్గాల ప్రజల రాజకీయ, సాంస్కృతిక, ఆర్థిక మానవతా హక్కులను చాలా వరకు కాపాడినారు. అంతేగాక అల్ప సంఖ్యాక వర్గాలు నానాజాతి సమితి పర్యవేక్షణలో ఉంచబడ్డాయి.

## ఐరోపా దేశాల పునర్వ్యవస్థీకరణ :

పైన వివరించబడిన వివిధ సంధుల ప్రకారం జర్మనీ, ఆస్ట్రియా, బల్గేరియా, టర్కీలు తమ తమ భూ భాగాలను పోగొట్టుకున్నాయి. పోలండ్, డెన్మార్క్‌లు స్వతంత్రమయినాయి. లక్సెంబర్గ్‌పై జర్మనీ పాలన అంతమయింది. బెల్జియంకు న్యాయం జరిగి స్వతంత్ర రాజ్యమయింది. బాల్కన్ భూభాగంలోని సెర్బియా, కొరింతియా, కోర్నియొల, మాంటినీగ్రో, హెర్జిగోవినియా, స్టిరియా ప్రాంతాలు యుగొస్లావియా అనే స్వతంత్ర్య రాజ్యంగా, హంగరీలోని కొంత భూభాగం, మొరీలియా, రుధేనియాలను కలుపుకొని బొహిమియా చెకొస్లొవాకియా అను రాజ్యాంగా అవతరించినాయి. ఆస్ట్రియా నుండి విడివడ్డ హంగరీ రిపబ్లిక్ అయింది. జర్మనీ వలస రాజ్యాలు మిత్ర రాజ్యాల అధీష్ట ప్రాంతాలుగా మారినాయి. ఈ విధంగా అనేక మార్పులు జరిగి ఐరోపా రాజ్యవ్యవస్థ మొదటి ప్రపంచ యుద్ధ ఫలితంగా పునర్వ్యవస్థీకరింపబడినది. విల్సన్ 14 సూత్రాల ప్రణాళికలో ఆఖరుది, ముఖ్యమైన ప్రతిపాదన అంతర్జాతీయ సంస్థ స్థాపనకు అనుగుణంగా నానాజాతి సమితి స్థాపించబడినది.

## ప్రథమ ప్రపంచ సంగ్రామ ఫలితాలు :

ప్రథమ ప్రపంచ సంగ్రామం ప్రపంచ చరిత్రలో ఒక నూతన అధ్యాయాన్ని ప్రారంభించినది. ప్రపంచ చరిత్రలో మొట్టమొదటి సారిగా ప్రపంచ రాజ్యాలన్నీ పాల్గొన్న యుద్ధమిది. ఈ యుద్ధం అనేక దేశాల రాజకీయ, ఆర్థిక, సాంఘిక వ్యవస్థలను ప్రభావితంచేసింది. ఈ యుద్ధంలో సంభవించిన జననష్టం, ధన నష్టం అంచనాలకు మించినవి. ఈ యుద్ధం వలన అనేక దుష్ఫలితాలతో బాటు సత్ఫలితాలు కూడా సంభవించినాయి.

**1. సామ్రాజ్యాలు విచ్ఛిన్నమయి అనేక చిన్న చిన్న స్వతంత్ర రాజ్యాల ఆవిర్భావం :** ప్రథమ ప్రపంచ సంగ్రామం వలన జర్మనీ, ఆస్ట్రియా, రష్యా, టర్కీ మొదలైన పెద్ద సామ్రాజ్యాలు విచ్ఛిన్నమై వాటి శిధిలాలపై చిన్న చిన్న స్వతంత్ర రాజ్యాలు ఆవిర్భవించినాయి. 1914కు పూర్వం ఐరోపా సామ్రాజ్యాలతోను, పెద్ద దేశాలతోను నిర్మితమై ఉంది. చిన్న దేశాలకు ఎటువంటి ప్రాముఖ్యతలేదు. కాని యుద్ధానంతరం యుగొస్లావియా, చెకొస్లొవాకియా, పోలండ్ మొదలైన రాజ్యాల ప్రాబల్యం ప్రపంచ రాజ్యాలలో ఎక్కువయింది. యుద్ధానికి పూర్వం ఆరు దేశాలు మాత్రమే అంతర్జాతీయ సంబంధాలను నియంత్రణ చేసేవి. కాని జర్మనీ, ఆస్ట్రియా, టర్కీ, రష్యాల తాత్కాలిక పతనం, చిన్న చిన్న రాజ్యాల ఆవిర్భావం అంతర్జాతీయంగా నూతన స్థితిని ఏర్పరచడంతో అంతర్జాతీయ సమస్యలు క్లిష్టతరమైనాయి.

**2. జాతీయతా భావ సిద్ధాంత వ్యాప్తి :** ప్రథమ ప్రపంచ సంగ్రామ ఫలితాలలో ముఖ్యమైనది జాతీయతా భావ సిద్ధాంత వ్యాప్తి చెందడం. జాతీయతా సిద్ధాంతాన్ని పారిస్ శాంతి సమావేశం ఒక అంతర్జాతీయ సిద్ధాంతంగా గుర్తించింది. భిన్న జాతులకలయికతో ఉన్న సామ్రాజ్యాలు అంతమై జాతీయతా సిద్ధాంత ఆధారంగా ఐరోపాలో అనేక నూతన జాతీయ రాజ్యాలు ఏర్పడినాయి. ఒకే జాతి-ఒకే రాజ్యము అనే సిద్ధాంత ప్రాతిపదికగా ఐరోపా రాజ్యాల పునర్వ్యవస్థీకరణ జరిగింది. ఈ సిద్ధాంతం ప్రకారం చెకొస్లొవాకియా, యుగొస్లావియా, పోలండ్, ఫిన్‌లాండ్, లాట్వియా, ఎస్టోనియా, లిథుయేనియాలు స్వతంత్ర రాజ్యాలుగా ఆవిర్భవించినాయి. ట్రాన్సిల్వేనియాను ఆస్ట్రియానుండి వేరుచేసి

రుమేనియాకు చేర్చబడింది. జాతీయ సిద్ధాంతాన్ని ఇంతకు ముందు 1815 వియన్నా కాంగ్రెస్‌లో లక్ష్య పెట్టలేదు. ఇపుడు దానిని గుర్తించడం జరిగింది. వివిధ జాతుల వారికి ఈ విధానం వలన అనుకూల జీవన విధానం లభించింది.

ఉడ్రో విల్సన్ ప్రతిపాదించిన జాతీయ స్వయం నిర్ణయాధికార సిద్ధాంతం ఐరోపాదేశాలనుండి క్రమంగా ఆస్ట్రియా, ఆసియా ఖండాలకు వ్యాపించింది. ఐరోపా రాజ్యాల వలసలలో, ఆధీన దేశాలలో యుద్ధానంతరం ఐరోపావారి అధికారం సడలిపోవడం ప్రారంభమయింది. వలస తత్త్వాన్ని, సామ్రాజ్య తత్త్వాన్ని నిరోధించే శక్తులు ఎక్కువగా పనిచేయడం జరిగింది. అందువలన ఆ ఖండాలలోని దేశాలలో జాతీయ చైతన్యం పెంపొంది ఐరోపావారి అధికారం తొలగించే స్వాతంత్ర్య సమరాలు ప్రారంభమయినాయి.

**3. ప్రజాస్వామ్య సిద్ధాంతాల వ్యాప్తి :** ప్రథమ ప్రపంచ సంగ్రామ **ఫలితంగా జాతీయతాభావ** వ్యాప్తితో బాటు ప్రజాస్వామ్య సిద్ధాంతాలు కూడా వ్యాప్తిలోనికి వచ్చినాయి. నూతన రాజ్యాలు గణతంత్ర రాజ్యాలుగా **ఆవిర్భవించినాయి.** జర్మనీ, ఆస్ట్రియా, రష్యా, టర్కీ, గ్రీస్ మొదలగు దేశాలలో రాచరికాలు రద్దయి ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఏర్పడినాయి. నూతనంగా ఏర్పడిన అనేక ఐరోపా రాజ్యాలలో స్త్రీలకు ఓటు హక్కు గుర్తించబడ్డది.

**4. ఐరోపా రాజ్యాల తుల్య ప్రాభల్య స్థితిలో మార్పు :** ఈ యుద్ధ ఫలితంగా ఐరోపా రాజ్యాల ప్రాభల్యంలోను, ప్రాముఖ్యంలోను చెప్పుకోదగ్గ మార్పు వచ్చి ఐరోపా రాజ్యాల తుల్య ప్రాభల్య స్థితిలోను మార్పు వచ్చింది. యుద్ధానంతరం ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌ల ప్రాముఖ్యం తగ్గింది. అమెరికాకు ప్రపంచ రాజకీయాలలో ప్రాముఖ్యం పెరిగి ప్రపంచ నాయకత్వం వహించడం ప్రారంభమైనది. యుద్ధాన్ని అవకాశంగా తీసుకొని తూర్పు ఆసియాలో జపాన్ తన ప్రాభల్యాన్ని పెంచుకొంది. రష్యాలో బోల్షివిక్ విప్లవం ఫలప్రదమైన తరువాత కమ్యూనిస్ట్ సిద్ధాంతం అంతర్జాతీయ ప్రాముఖ్యంలోకి వచ్చింది.

**5. సర్వాధికారతత్వ నియంతృత్వ రాజ్యాల స్థాపన :** విల్సన్ యుద్ధానంతరం కూడ ప్రజాస్వామ్య లక్ష్యానికే ప్రాధాన్యమిచ్చినాడు. ఈ లక్ష్యం కోసం స్వయం నిర్ణయాధికారంతో ప్రజాభిప్రాయ సేకరణ జరిగి కొత్త రాజ్యాలు ఏర్పడి, రాజరికాలుపోయి, రిపబ్లికన్ సంస్థలు ఏర్పడటం జరిగింది. ప్రజా శ్రేయస్సు కోసమే రాజరికాలుపోయి రిపబ్లిక్‌లు ఏర్పడినా రాజ్యాలలో అల్ప సంఖ్యాకులను గురించిన సమస్య వచ్చింది. రష్యా, జర్మనీ, ఇటలీ, స్పెయిన్ దేశాలలో ప్రజాస్వామ్య ప్రభుత్వాలు యుద్ధానంతర సమస్యలను పరిష్కరించడంలో విఫలమయినాయి. దీనికితోడు ప్రజాస్వామ్యం విజయవంతం కావడానికి కావలసిన పరిస్థితులు లేకపోవడంవలన ఆర్థిక అసంతుష్టి, సాంఘిక దుస్థితులు మొలకెత్తి ఆదేశాలలో ప్రజాస్వామ్యం అట్టే కాలం నిలువ లేక పోయింది. అందువలన అల్ప సంఖ్యాకుల శ్రేయస్సు అనే మిషతో సంఘాభ్యుదయాన్ని సాధించడానికి ప్రజాస్వామ్య సిద్ధాంతాలకు విరుద్ధంగా ఉన్న సర్వాధికార తత్వం (Totalitarian) గల నియంతృత్వ ప్రభుత్వాలు కొన్ని దేశాలలో ఆవిర్భవించినాయి. జర్మనీలో నాజీ నియతృత్వం. ఇటలీలో ఫాసిస్ట్ నియంతృత్త్వం రష్యాలో కమ్యూనిస్ట్ నియంతృత్వం నెలకొన్నాయి.

**6. ఐరోపా సామాజిక రంగంలో మార్పులు :** ప్రథమ ప్రపంచ **సంగ్రామం ఐరోపా** సామాజిక రంగంలో పెను మార్పులు తెచ్చింది. కార్మిక వర్గం యుద్ధంలో ప్రముఖ పాత్ర వహించడంతో వారిలో రాజకీయ చైతన్యం వచ్చింది. కార్మిక వర్గానికి రాజకీయ రంగంలో అధికార ప్రాభల్యాలు పెరగడంతో అభ్యుదయకరమైన సాంఘిక సంస్కరణలు అమలులోకి వచ్చినాయి. అన్ని రాజ్యాలలో కార్మిక సంఘాలు ఏర్పడినాయి. నానాజాతి సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ కార్మిక సంస్థ ఏర్పడింది. కార్మిక వర్గం కన్నా కర్షక వర్గం లాభపడినారు. రష్యాలోను, బాల్టిక్ రాజ్యాలలోను భూస్వాములనుండి భూములు గ్రహించి కర్షకులకు పంచిపెట్టినారు. అనేక రాజ్యాలలో కర్షకుల భూమి హక్కును గుర్తించడం జరిగింది. పురుషులు యుద్ధంలో నిమగ్నమై ఉండగా. స్త్రీలు పరిపాలనా విధులు నిర్వహించినారు. ఫలితంగా స్త్రీలు సాంఘిక ప్రాదాన్యతను సంతరించుకొన్నారు.

**7. నానాజాతి సమితి స్థాపన :** యుద్ధ ఫలితంగా అంతర్జాతీయ భావం పెరిగి విల్సన్ 14 సూత్రాల ఆధారంగా నానాజాతి సమితి అనే అంతర్జాతీయ సంస్థ ఏర్పడింది. రాజకీయ రంగంలో ఈ సంస్థ చెప్పుకోదగ్గ ప్రగతి సాధించలేకపోయిననూ, సాంఘిక, ఆర్థిక రంగాలలో విశేషమైన కృషిచేసింది.

**8. ఆర్థిక సంక్షోభం :** ఈ యుద్ధ ఫలితంగా 1929లో ప్రపంచ ఆర్థిక సంక్షోభం సంభవించి పేదరికము, నిరుద్యోగము, ద్రవ్యోల్బణము, వ్యాపార స్తంభన జరిగింది. ఈ ఆర్థిక సంక్షోభం ప్రపంచ దేశాలమధ్య ప్రత్యక్ష విరోధానికి దారితీసింది.

**9. శాస్త్రీయ, వాణిజ్య రంగాల అభివృద్ధి :** యుద్ధ ఫలితంగా వైద్య రంగం, నౌకా నిర్మాణ రంగం, విమాన నిర్మాణ రంగం బాగా అభివృద్ధి జరిగింది.

ప్రథమ ప్రపంచ సంగ్రామం ఫలితంగా మూడు ముఖ్యమైన పరిణామాలను గ్రహించవచ్చు. అవి.

1. యుద్ధ కాలంలోనే రష్యాలో కమ్యూనిస్ట్ విప్లవం ఫలప్రదమై రష్యా ప్రపంచంలో మొదటి కమ్యూనిస్ట్ రాజ్యంగా అవతరించింది.
2. ఈ యుద్ధ సమయంలోనే అమెరికా ప్రథమంగా మిగతా ప్రపంచ రాజ్యాల విషయాలలో ఆర్థిక, రాజకీయ ప్రమేయం పెట్టుకొన్నది. నాటి నుండి అమెరికా ప్రపంచ విషయాలలో తన జోక్యాన్ని వృద్ధి చేస్తూ వచ్చింది.
3. విల్సన్ ప్రతిపాదించిన జాతీయ స్వయం నిర్ణయాధికార సిద్ధాంతం ఐరోపాకే పరిమితంగాక తరువాత శతాబ్దాలలో ఐరోపా రాజ్యాల ఆసియా-ఆఫ్రికా వలసలకు వ్యాప్తిచెంది అనేక స్వాతంత్ర్య పోరాటాలకు, స్వతంత్ర రాజ్యాల అవతరణకు దోహదం చేసింది.

ఎం. సోమశేఖరరావు

పాఠము - 2

# యుద్ధ నష్ట పరిహారం

2.1 **పరిచయం :** మొదటి ప్రపంచ సంగ్రామం తరువాత యుద్ధ నష్టపరిహార సమస్య ఒక అంతర్జాతీయ సమస్యగా రూపుదాల్చింది. శాంతి స్థాపనకు సంబంధించి ఎదుర్కొన్న విమర్శలతో క్లిష్టమైన యుద్ధ నష్టపరిహార సమస్యను పరిష్కరించడానికి సంబంధిచినదే యుద్ధ నష్ట పరిహార సమస్య. యుద్ధ ఋణాలు ఒక దానితో ఒకటి ముడిపడి 1929 లో ప్రపంచ ఆర్థిక మాంద్యానికి దారి తీసింది. యుద్ధ నష్ట పరిహార సూత్రానికి యుద్ధ బాధ్యతే ప్రాతిపదిక. ఈ సూత్రము హిట్లర్ జర్మనీలో అధికారంలోకి రావడానికి, జర్మనీనుండి ఫ్రాన్స్‌కు అభద్రత పెరగడానికి కారణమయింది. ఇంకోవైపు యుద్ధ నష్ట పరిహార సమస్య, యుద్ధకాల ఋణాల విషయంలో అమెరికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌ల మధ్య బేధాభిప్రాయాలు ఏర్పడినాయి. ఈ యుద్ధ నష్టపరిహార సమస్య వలన జర్మనీ, ఫ్రాన్స్‌ల మధ్య సంబంధాలు చెడిపోయి తత్ఫలితంగా ఐరోపాలో శాంతి భద్రతలకు అనేక సందర్భాలలో ముప్పువాటిల్లింది. యుద్ధ నష్టపరిహార సమస్యలో గల తీవ్రతను గుర్తించి అమెరికా నెమ్మది నెమ్మదిగా ఐరోపా రాజకీయాలనుండి దూరం కావడం ప్రారంభించింది. జర్మనీని ఆర్థికంగా బలహీనపరచినట్లయితే తన రాజ్యానికి భద్రత ఉంటుందని ఫ్రాన్స్ భావించినది. కాని జర్మనీ పెద్ద మొత్తంలో యుద్ధ నష్టపరిహారాన్ని చెల్లించాలంటే జర్మనీలో అధికోత్పత్తి తప్పనిసరి అని భావించడంలో ఫ్రెంచ్ రాజకీయవేత్తలు విఫలులైనారు. ఈ విధంగా ప్రథమ ప్రపంచ సంగ్రామం తరువాత యుద్ధ నష్టపరిహార విషయం ఐరోపా రాజకీయాలలో ఒక మహత్తరమైన సమస్యగా రూపుదాల్చింది.

**యుద్ధనష్టపరిహార స్వభావం :** యుద్ధంలో ఓడిపోయిన వారినుండి, విజేతలు యుద్ధనష్ట పరిహారాన్ని వసూలు చేయడం చరిత్రలో కొత్త విషయం ఏమీ కాదు. నెపోలియన్ యుద్ధాలు, ఫ్రాంకో-ప్రష్యన్ యుద్ధం, రష్యా-జపానీస్ యుద్ధం మొదలగు యుద్ధాల అనంతరం యుద్ధ నష్టపరిహారాల నిబంధనను అమలు పరిచినారు. కాని ఆ సమయంలో విధించిన యుద్ధ నష్టపరిహారాలకు ప్రథమ ప్రపంచ సంగ్రామం అనంతరం విధించిన యుద్ధ నష్ట పరిహారానికి తేడా ఉంది. ఇప్పుడు అత్యధిక మొత్తాన్ని నష్టపరిహారంగా కోరారు. పూర్వపు సంధులలో యుద్ధనష్ట పరిహారం ఎంతకట్టవలెనో నిర్దుష్టంగా పేర్కొన బడితే వర్సేసంధిలో ఎంత మొత్తం నష్టపరిహారంగా చెల్లించవలెనో స్పష్టంగా పేర్కొనబడలేదు.

**యుద్ధనష్ట పరిహారానికి ప్రాతిపదిక :** వర్సే సంధిలో జర్మనీని యుద్ధానికి పూర్తి బాధ్యురాలుగా చేస్తూ విధించిన నిబంధనయే యుద్ధ నష్టపరిహారానికి ప్రాతిపదిక. జర్మనీ దాని మిత్ర రాజ్యాల దురాక్రమణల ఫలితంగా యుద్ధంలో అవి మిత్రరాజ్యాలలోనూ, వాటి మిత్ర రాజ్యాలలోను కలిగించిన నష్టాలకు జర్మనీని దాని మిత్రరాజ్యాలను బాధ్యురాలుగా చేయగా జర్మనీ అందుకు అంగీకరించింది. ఈ సూత్ర ప్రాతిపదికగానే జర్మనీనుండి యుద్ధ నష్టపరిహారాన్ని కోరడం జరిగింది. యుద్ధ సమయంలో కూడా జర్మనీనుండి యుద్ధ ఖర్చులను వసూలు చేయడం జరుగుతుందని బ్రిటిష్ ప్రజలకు ఫ్రెంచి ప్రజలకు అభయం ఇవ్వడం జరిగింది. ఉడ్రోవిల్సన్ కూడ అనేక ప్రకటనలలో జర్మనీ ఆక్రమించిన భూభాగాలనుండి వైదొలుగుతుందని వాటిని కోరుకున్న రాజ్యాలకు బదిలీచేయడం జరుగుతుందని చెప్పినారు. విల్సన్ ప్రకటనలను అనుసరించి మిత్రరాజ్యాలు పూర్తిగ యుద్ధ ఖర్చులను కోరడాన్ని వదిలి కేవలం తమ పౌరులకు, తమ ప్రభుత్వ ఆస్తులకు సంబంధించి జరిగిన నష్టాన్నే పరిహారంగా తీసుకోవడానికి సమ్మతించినారు. జర్మనీ కట్టవలసిన యుద్ధనష్టపరిహారాన్ని ఈ క్రింది విధంగా నిర్ణయించినారు.

1. పౌర ఆస్తులకు జరిగిన నష్టానికి పరిహారం
2. వర్తక ప్రజానీకానికి జర్మనీ కలిగించిన విధ్వంసానికి నష్టపరిహారం
3. మిత్రరాజ్యాలలో పదవీ విరమణ చేసిన అధికారులకు జీవన భృతి ఇచ్చే నిమిత్తం నష్ట పరిహారం
4. ఒక్క బెల్జియంకు మాత్రము సంపూర్ణ యుద్ధ ఖర్చులను నష్టపరిహారంగా చెల్లించుట

**యుద్ధ నష్ట పరిహారం మొత్తాన్ని నిర్ణయించడానికి అనుకరించిన మార్గాలు :** జర్మనీనుండి వేటిద్వారా యుద్ధ నష్టపరిహారాన్ని పొందాలో తెల్పిన తరువాత ఎంతమొత్తాన్ని యుద్ధ నష్టపరిహారంగా నిర్ణయించాలనేది సమస్య అయింది. 1919 లో యుద్ధ నష్ట పరిహార మొత్తాన్ని నిర్ణయించలేక పోయినారు. యుద్ధ నష్టపరిహారం ఎంత చెల్లించాలో నిర్ణయించడానికి ముందుగా జర్మనీ కొంత మొత్తాన్ని చెల్లించవలెనని ఫ్రాన్స్ ప్రతిపాదించింది. అంతేగాక యుద్ధ నష్టపరిహారాన్ని నిర్ణయించడానికి ఒక యుద్ధ నష్టపరిహార సంఘాన్ని ఏర్పాటు చేయవలెనని ఫ్రాన్స్ కోరింది.

ఈ విధంగా వర్సేసంధిలో జర్మనీ వివిధ పద్ధతులలో ఎలా యుద్ధ నష్టపరిహారాన్ని చెల్లించాలో పేర్కొనబడింది. కాని జర్మనీ ఎంత మొత్తాన్ని చెల్లించాలో చెప్పబడలేదు. ఫ్రాన్స్ కోరికననుసరించి యుద్ధనష్ట పరిహార సంఘాన్ని ఏర్పాటుచేశారు. ఈ కమీషన్ జర్మనీనుండి ఎంతయుద్ధ నష్టపరిహారాన్ని వసూలు చేయాలి, 15 సంవత్సరాలలో ఆ మొత్తాన్ని ఎలా వసూలు చేయాలో పేర్కొనాలి. ఈ సంఘంలో అమెరికా, ఇంగ్లాండ్, ఇటలీ, ఫ్రాన్స్‌లకు చెందిన ఇద్దరు శాశ్వత సభ్యులు, బెల్జియం, జపాన్, యుగోస్లావియాలకు చెందిన ఒక సాధారణ సభ్యుడు సభ్యులుగా ఉంటారు. జర్మనీ తన నివేదికను సంఘం ముందుంచడానికి అవకాశం ఇవ్వబడింది. అంతేగాక ఈ సంఘం ఏదైనా నిర్ణయం తీసుకొనేముందు జర్మనీ యొక్క ఆర్థిక స్థితిని పరిగణలోకి తీసుకోవాలి. కాని అమెరికా ఈ సంఘ సమావేశాలలో పాల్గొనక పోవడంతో అన్ని నిర్ణయాలు తీసుకోనే బాధ్యత ఇంగ్లాండ్, ఫ్రాన్స్ సభ్యులపై బడింది. అమెరికా హాజరు కాకపోవడం వలన సమావేశాలకు ఫ్రాన్స్ అధ్యక్షత వహిస్తూ వచ్చింది. యుద్ధంలో బాగా నష్టపోయిన రాజ్యం ఫ్రాన్స్ కనుక ఫ్రాన్స్ అధ్యక్షతన జరిగే ఈ సంఘ సమావేశాలలో ఫ్రాన్స్ జర్మనీ పట్ల ఉదారవిధానాన్ని అనుకరిస్తుందనుకోవడానికి వీలులేదు. సాధారణంగా ఇంగ్లాండ్, ఇటలీలు చేసిన ప్రతిపాదనలను ఫ్రాన్స్, బెల్జియంలు వ్యతిరేకిస్తుండేవి. యుద్ధ నష్టపరిహార సంఘం ఒక నిర్ణయానికి రాకముందే మిత్రరాజ్యాలు 1920 జూలైలో జర్మనీలోని "స్పా" అనే ప్రదేశంలో సమావేశమై జర్మనీనుండి వసూలు చేయబడే యుద్ధ నష్ట పరిహార మొత్తం ఏ ఏ రాజ్యానికి ఎంతెంత రావాలో నైష్పత్తిక శాతాన్ని నిర్ణయించినారు. దీని ప్రకారం రావలసిన మొత్తంలో 52 శాతం ఫ్రాన్స్‌కు, 22 శాతం ఇంగ్లాండ్‌కు, 10 శాతం ఇటలీకి, 8 శాతం బెల్జియంకు, గ్రీస్, రుమేనియా, యుగోస్లావియాలకు 6.5 శాతం ఒకొక్కరికి, జపాన్, పోర్చుగల్‌లకు ఒకొక్కరికి 1.5 శాతంగా నిర్ణయించినారు.

జర్మనీకి యుద్ధ నష్టపరిహారం ఎలా చెల్లించాలో ఒక పెద్ద సమస్య అయింది.

**పారిస్ తీర్మానం :** వర్సేసంధికి జర్మనీ ఆమోదించే సమయంలో మిత్రరాజ్యాలు జర్మనీని యుద్ధ నష్టపరిహార అప్పులను ఎలా తీర్చగలదో ఒక నివేదికను సమర్పించమన్నది. 1920 లో "స్పా" సమావేశంలో జర్మనీ ప్రవేశ పెట్టిన నివేదికను మిత్రరాజ్యాలు అంగీకరించలేదు. అందువలన మిత్రరాజ్యాలు 1921 పారిస్ తీర్మాన నిర్ణయం ప్రకారం జర్మనీ 11,300,000,000 పౌండ్ల ధనాన్ని 22 సాంవత్సరిక వాయిదాల పద్ధతిపై యుద్ధ నష్టపరిహారంగా చెల్లించాలని నిర్ణయించింది. దీనిని జర్మనీ వ్యతిరేకిస్తూ ఈ క్రింది ప్రతిపాదనలు చేసింది.

1. జర్మనీ యుద్ధ నష్టపరిహారం కింద 150 కోట్ల పౌండ్లను మాత్రమే చెల్లిస్తుంది.
2. బదులుగా మిత్రరాజ్యాలు తమ సైన్యాన్ని జర్మనీనుండి ఉపసంహరించుకోవాలి.
3. ఎగువ సైలీషియా జర్మనీ ఆక్రమణలోనే ఉంటుంది.

మిత్రరాజ్యాలు పై ప్రతిపాదనలను తిరస్కరించి కొన్ని జర్మన్ భూభాగాలను ఆక్రమించినారు.

**1921 లండన్ కార్యక్రమం :** జర్మనీ మిత్రరాజ్యాల దురాక్రమణలను వ్యతిరేకిస్తూ నానాజాతి సమితికి ఫిర్యాదు చేసింది. ఈ లోపల యుద్ధనష్టపరిహార సంఘం 1921 మేన తన నిర్ణయాన్ని ప్రకటించింది. జర్మనీ చెల్లించవలసిన యుద్ధనష్ట పరిహార మొత్తాన్ని 6,600,000,000 పౌండ్లకు నిర్ణయించింది. దీనికి అంగీకరించిన అనంతరం మిత్రరాజ్యాలు లండన్‌లో సమావేశమయినాయి. అనేక చర్చల అనంతరం యుద్ధ నష్టపరిహారాన్ని ఎన్ని రకాలుగా వసూలు చేయవలెనో ఒక పట్టిక తయారు చేశారు. దీనినే లండన్ కార్యక్రమం అంటారు. జర్మనీ దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ తాను ఎట్టి పరిస్థితిలోనూ ఇంత పెద్ద మొత్తాన్ని చెల్లించలేనని ప్రకటించింది. కాని

మిత్రరాజ్యాలు జర్మనీ వ్యతిరేకతను లెక్కచేయక లండన్ కార్యక్రమాన్ని ఆమోదించని యెడల రూర్ ప్రాంతాన్ని ఆక్రమిస్తామని బెదిరించినారు. ఏమైననూ 1921 ఆగస్టు నాటికి తన మొదటి వాయిదాను జర్మనీ చెల్లించినది. దీనితో యుద్ధ నష్టపరిహార సమస్యకు సంబంధించిన మొదటి దశ ముగిసింది.

**రూర్ ఆక్రమణ :** లండన్ కార్యక్రమం యుద్ధనష్ట పరిహార సమస్యను సంపూర్ణంగా పరిష్కరించలేకపోయింది. జర్మనీ అంతపెద్ద మొత్తం ఇకముందు చెల్లించలేక పోయింది. రెండవ వాయిదాను చెల్లించడానికి కొన్ని నెలలు కాలవిలంబన జర్మనీ కోరింది. 1922 లో మిత్రరాజ్యాలు ఆరునెలల కాలవిలంబన మంజూరు చేసారు. తిరిగి జర్మనీ 3 సంవత్సరాల కాలవిలంబనను, ఋణాల మంజూరును కోరింది. కాని ఫ్రాన్స్ యుద్ధనష్టపరిహారాన్ని పూర్తిగా చెల్లించమన్నది. యుద్ధ నష్టపరిహారం చెల్లింపబడుతుందనే దృష్టితో ఫ్రాన్స్ తన దేశంలో పునర్నిర్మాణ కార్యక్రమాలకు అధిక మొత్తంలో ఖర్చు చేసింది. మరోవైపు ఇంగ్లాండ్ జర్మనీ పట్ల ఉదార విధానాన్ని అనుకరించడానికి మొగ్గు చూపుతున్నది. యుద్ధానంతరం సంభవించిన ఆర్థిక సంక్షోభం వలన ఇంగ్లాండ్ వర్తక వాణిజ్యాలు దెబ్బతిన్నవి. జర్మనీ లాంటి పారిశ్రామిక దేశం ఆర్థికంగా పునరుద్ధరింపబడితే ఐరోపా ఆర్థిక స్థితి కుదుటపడటమేగాక బ్రిటిష్ వారి విదేశీ వాణిజ్యం అభివృద్ధి చెందుతుందని ఇంగ్లాండ్ భావించింది. రాజకీయంగా జర్మనీ పునరుద్ధరింపబడితే ఫ్రాన్స్ భయపడినట్లుగా ఇంగ్లాండుకు భయంలేదు. యుద్ధానంతరం జర్మనీ తన నౌకాబల పటిష్టతను కోల్పోవడమే దానికి కారణం.

ఇటువంటి పరిస్థితుల్లో మిత్రరాజ్యాలు 1922 లో "కెన్నెస్" లో యుద్ధనష్టపరిహార సమస్య పరిష్కరించడానికి సమావేశమయినారు. ఈ సమావేశంలో మిత్రరాజ్యాలవారు జర్మనీ ఆర్థిక జీవనంమీద గల మితిమీరిన నియంత్రణను తగ్గించినారు. వచ్చే సంవత్సరంలో జర్మనీ చెల్లించవలసిన యుద్ధ నష్టపరిహారాన్ని కూడా తగ్గించినారు. కాని వెనుకటి వాగ్దానం ప్రకారం 1922 లో జర్మనీ యుద్ధనష్ట పరిహారాన్ని చెల్లించలేకపోయింది. ఈ లోపల "కెన్నెస్" సమావేశంలో జర్మనీ పట్ల ఉదార విధానాన్ని అనుకరించిందనే అభియోగంతో ఫ్రాన్స్‌లో బ్రయాండ్ మంత్రివర్గం పడిపోయి జర్మనీకి శత్రువని భావింపబడుతున్న పోయిన్‌కేర్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినాడు. తత్ఫలితంగా ఇంగ్లాండ్‌కు ఫ్రాన్స్‌కు మధ్య తీవ్ర సంఘర్షణ ఏర్పడి యుద్ధ నష్టపరిహారం వసూలు చేసే కార్యక్రమం స్థంభించిపోయింది.

ఫ్రాన్స్ ఒత్తిడిమీద యుద్ధ నష్ట పరిహార సంఘం జర్మనీ యుద్ధనష్ట పరిహార నిబంధనలను ఉల్లంఘించినదనే అభియోగం మోపింది. జర్మనీ పూర్వపు వాగ్దానం అనుసరించి ఫ్రాన్స్‌కు బొగ్గును సరఫరా చేయలేదనే మిషతో ఫ్రాన్స్ బెల్జియంల సంయుక్త సైన్యాలు రూర్‌ను ఆక్రమించినాయి. రూర్ ఆక్రమణ ఏ పరిస్థితిలోను న్యాయ సమ్మతమైనదికాదు. జర్మనీకి యుద్ధ నష్టపరిహారం చెల్లించే శక్తిలేకపోవడం సహజమైనది. జర్మనీలోని ముఖ్య పారిశ్రామిక ప్రదేశాలున్న రూర్ లాంటి ప్రాంతము విదేశీపాలనలోకి తీసుకొని రావడం అంటే జర్మనీ ఆర్థిక వ్యవస్థ విధ్వంసం కావడం తథ్యమే.

దీనికి జవాబుగా జర్మనీ రూర్ ప్రాంతంలో శాంతియుతంగా ఎదుర్కోవడం ప్రారంభించింది. బొగ్గుగనులలో బొగ్గు ఉత్పత్తులను తగ్గించింది. యుద్ధ నష్టపరిహారం క్రింద బొగ్గు, ఇనుము సరఫరాను జర్మన్ ప్రభుత్వం నిషేధించింది. రూర్ ప్రజలు పన్నులు కట్టడం మానివేసారు. గనులు, పరిశ్రమలు నిర్మానుష్యం చేశారు. స్థానిక అధికారులు విదేశీ ఆజ్ఞలను తిరస్కరించారు. ఫ్రాన్స్ ప్రతీకారచర్యలు ప్రారంభించింది. రూర్‌లోని ప్రముఖ వ్యాపార వేత్తలను ఖైదుచేసింది. అన్నిరకాల వినియోగవస్తువులు, బ్యాంకులలోని ముదుపు ప్రభుత్వ పరంచేసింది తత్ఫలితంగా జర్మనీ ఆర్థిక జీవనం స్థంభించిపోయినది. జర్మనీలో మధ్య తరగతి వర్గం పతనం చెందింది. రూర్ ఆక్రమణ ఫ్రాన్స్‌కు భరించలేని ఖర్చుతో కూడుకున్నదయింది. జర్మనీ యుద్ధ నష్టపరిహారాన్ని చెల్లించలేకపోయింది.

**డాస్ పథకము (1924) :** జర్మనీ రూర్‌లో శాంతియుత వ్యతిరేక విధానాన్ని ఉపసంహరించుకొన్నది. పారిశ్రామిక నష్టాలు, ద్రవ్యసమస్య, రైన్‌లాండ్‌లో ప్రారంభమయిన అంతరంగిక ఉద్యమం, జర్మనీలో క్యూనో ప్రభుత్వ పతనం మొదలగునవి ఇందుకు కారణాలు 1923 లో స్ట్రెసెమన్ అధికారంలోకి రావడంతో జర్మన్ గణతంత్ర రాజ్య జీవనం పుంజుకొన్నది. యుద్ధానంతర జర్మనీలో స్ట్రెసెమన్ గొప్ప రాజకీయ వేత్త. ఆదేసమయంలో అమెరికా, ఇంగ్లాండులలోని రాజకీయ నిపుణులు జర్మనీకి సంబంధించిన పారిశ్రామిక వనరులను

ధ్వంసం చేయడం వలన జర్మనీనుండి యుద్ధనష్ట పరిహారం వసూలు చేయడం సాధ్యం కాదని భావించారు. ఫ్రాన్స్ కూడా పరిస్థితిని అర్థం చేసుకొన్నది. ఇటువంటి సమయంలో బ్రిటిష్ ప్రధాన మంత్రి బాల్డ్‌విన్ యుద్ధ నష్టపరిహారం చెల్లించడంలో జర్మనీకి గల శక్తిని పరిశోధించమని అమెరికాను కోరినాడు. వెంటనే అమెరికా ఈ ప్రతిపాదనను అంగీకరిస్తూ 1924 లో అమెరికన్ ఆర్థికవేత్త ఛార్లెస్ డాస్ అధ్యక్షతన ఒక సంఘాన్ని నియమించింది. జర్మన్ ఆర్థిక ప్రణాళికలో సమతుల్యతను సాధించడానికి గల మార్గాలను సూచించడం, జర్మనీ ద్రవ్య సమస్యను పరిష్కరించడం డాస్ సంఘ ప్రధాన విధులు.

**డాస్ సంఘ సిఫార్సులు :**

1. రాజకీయాలకు, నష్టపరిహార సమస్యకు ఎట్టి సంబంధం ఉండరాదు.
2. జర్మనీ అంతరంగిక సంపద దానికే వదలివేయవలెను.
3. జర్మనీకి స్థిరమైన ద్రవ్యస్థితిని, ద్రవ్య ప్రమాణమును, ఋణసహాయాన్ని అందించవలెను.
4. ఎక్కువ కాలపరిమితితో తక్కువ మొత్తంలో యుద్ధ నష్టపరిహారాన్ని సంవత్సర వాయిదాల చొప్పున వసూలు చేయాలి.
5. జర్మనీలో ఆర్థిక జీవనాన్ని పునరుద్ధరించవలెనన్న రూర్ నుండి విదేశీ సైన్యం ఉపసంహరించాలి.

పై విషయాలు అమలు పరచడానికి "రీచ్‌మార్క్" అనునూతన ద్రవ్యమానమును, జర్మనీ అధికారమునకు అతీతమైన "Bank of Issue" అను విదేశీ బ్యాంకు ఏర్పాటు చేయబడెను. 40 కోట్ల అప్పు జర్మనీకి లభించెను. ఆర్థిక స్థిరత్వం పొందిన జర్మనీ ప్రతిఏటా 5 కోట్ల నష్టపరిహారం చెల్లించును. ఈ అంశములన్నీ పర్యవేక్షించుటకు అమెరికన్ ఆర్థికవేత్త గిల్‌బర్ట్‌ను ఏజెంట్ జనరల్‌గా నియమించెను. డాస్ పథకాన్ని జర్మనీ శాసనసభ అంగీకరించడంతో అది అమలులోకి వచ్చింది.

యుద్ధానంతరకాలంలో ఆర్థిక సమస్యలను ఆర్థిక కోణంలో పరిశీలించి పరిష్కరించడానికి పూనుకొన్న మొదటి సంఘం డాస్ సంఘం. నష్టపరిహార సమస్యను రాజకీయాలనుండి తప్పించి ఆర్థిక ప్రాతిపదికగా పరిష్కరించడమే డాస్ పథకం యొక్క ఉద్దేశ్యం. సంవత్సర వాయిదాలను నిర్ణయించడం ద్వారా, ఋణసహాయాన్ని అందించడం ద్వారా డాస్ సంఘం జర్మనీలో ఆర్థిక జీవనాన్ని పునరుద్ధరించడానికి సహాయపడింది. మిత్రరాజ్యాలకు జర్మనీ యుద్ధ నష్టపరిహారాన్ని చెల్లిస్తుందనే నమ్మకం డాస్ సంఘం ఏర్పరచింది. జర్మనీలో ఆర్థిక జీవనాన్ని పునరుద్ధరించడానికి డాస్ సంఘ సిఫార్సులు దోహదపడగా అమెరికా, ఇంగ్లాండ్‌లు మధ్య ఐరోపాలో తమ పెట్టుబడులను పెట్టడం ప్రారంభించినారు. అయిననూ డాస్ పథకంలో లోపాలు లేకపోలేదు. అవి :

1. జర్మనీ తన నష్టపరిహారాన్ని ఎన్ని సంవత్సరాలు చెల్లించవలెనో నిర్ణయించలేదు.
2. ఋణవిముక్తికి జర్మనీ అప్పులు చేయుపద్ధతి వలన జర్మనీ ఋణాలు అపారంగా పెరిగినవి.

యంగ్ పథకము (1928-29) : డాస్ ప్రణాళిక యుద్ధనష్టపరిహార సమస్యను సంపూర్ణంగా పరిష్కరించలేకపోయింది. జర్మనీ చెల్లించవలసిన యుద్ధ నష్టపరిహారం మొత్తం నిర్ణయం కాకుండా ఉండి పోయింది. అందువలన 1928 సం॥లో ఈ విషయాన్ని పునరాలోచించవలసి వచ్చింది. అందుకు కారణాలు :

1. 1924-28 సం॥ల మధ్య కాలంలో జర్మనీ డాస్ ప్రణాళిక ననుసరించి యుద్ధనష్టపరిహారాన్ని చెల్లించింది. కాని కొంతకాలానికి ఆ విధంగా చెల్లించడం ఎంతవరకు న్యాయసమ్మతమని భావించి జర్మనీ ఆ పద్ధతిని వ్యతిరేకించ ప్రారంభించింది.
2. జర్మనీకి పెద్ద మొత్తాలలో ఋణాలు ఇవ్వడంతో అమెరికా కూడా విసుగు చెందడం ప్రారంభించింది.
3. ఈ లోపల ఫ్రాన్స్ యుద్ధ ఋణాలు చెల్లించరావలసినందున తనకు రావలసిన యుద్ధనష్టపరిహారాన్ని వసూలు చేసుకోవడంలో ఆ తరువాత చూపింది.

3)

4. జర్మనీ రైన్‌లాండ్‌ను తిరిగి పొందే ఉద్దేశ్యంతో యుద్ధనష్టపరిహారాన్ని పునరాలోచించవలసినదిగా కోరుతున్నది.

5. అమెరికా కూడా సరి అయిన పరిష్కారం కోసం ఉబలాటపడుతున్నది.

పై కారణాలవలన డాస్ పథకాన్ని పునరాలోచించడానికి, యుద్ధ నష్టపరిహార సమస్యకు తుదిపరిష్కారం సాధించడానికి అమెరికా ఆర్థికవేత్త ఓవెన్‌యంగ్ అధ్యక్షతన ఒక కమిటీ ఏర్పాటయింది. ఈ సంఘంలో యుద్ధనష్టపరిహారం పొందే రాజ్యాల నుండి ఇద్దరేసి ప్రతినిధులు, అమెరికా నుండి ఇద్దరు ప్రతినిధులు ఉన్నారు.

1929 లో యంగ్ సంఘం యుద్ధనష్టపరిహార సమస్యను పరిష్కరించడానికి ఒక ప్రణాళిక తయారుచేసింది.

**యంగ్ ప్రణాళికలోని అంశాలు :**

1. జర్మనీ చెల్లించ వలసిన యుద్ధనష్టపరిహారాన్ని తగ్గించడం జరిగింది.
2. జర్మనీ 37 సాంవత్సరిక వాయిదాలలో 1,000,000,000 పౌండ్ల ధనాన్ని చెల్లించవలెను.
3. మిత్రరాజ్యాలు చెల్లించవలసిన యుద్ధ ఋణాలను చిన్న మొత్తంలో 27 సావత్సరిక వాయిదాలలో అమెరికాకు జర్మనీ చెల్లించవలెను.
4. ఆర్థిక సంక్షోభ సమయాలలో జర్మనీ నష్టపరిహారం చెల్లించడానికి రెండు సంవత్సరాలు కాలవిలంబన మంజూరు చేయవలెను.
5. డాస్ ప్రణాళిక జర్మనీపై విధించిన విదేశీ నియంత్రణ తొలగించాలి.
6. నష్టపరిహార వసూలు, పంపకాల నిర్వహణ ఒక అంతర్జాతీయ బ్యాంకుకు ఇవ్వాలి.
7. మిత్రరాజ్యాల సైన్యాలు 1930 జూన్ 30 లోపల రైన్‌లాండ్ ను ఖాళీ చేయాలి.

యంగ్ ప్రణాళిక పరిశీలించే నిమిత్తం మిత్రరాజ్యాలు, జర్మనీ హేగ్‌లో సమావేశమైనాయి. సమావేశంలో బ్రిటన్ ప్రతినిధి తన దేశానికి యుద్ధ నష్ట పరిహారం చెల్లించడానికి కాలం నిర్ణయించడం జరిగింది. జర్మనేతర రాజ్యాలనుండి రావలసిన యుద్ధ నష్టపరిహారాన్ని కూడా నిర్ణయించడం జరిగింది. యంగ్ పథకము 1930 మే నుండి అమలులోనికి వచ్చింది. Bank of International Settlement ను స్థాపించడం జరిగింది. రైన్ ప్రాంతంనుండి మిత్ర రాజ్యాల సైన్యం ఉపసంహరింపబడింది.

కాని 1929 లో సంభవించిన ప్రపంచ ఆర్థిక మాంద్యం వలన ఈ పథకం తారుమారయింది. ఇప్పటివరకు జర్మనీ నుండి పొందుతున్న యుద్ధ నష్టపరిహారం నుండి మిత్రరాజ్యాలు అమెరికాకు చెల్లించవలసిన యుద్ధ ఋణాలను చెల్లిస్తున్నవి. ప్రపంచ ఆర్థికమాద్యం వలన జర్మనీ యుద్ధనష్ట పరిహారాన్ని చెల్లించలేక పోవడంతో మిత్రరాజ్యాలు అమెరికాకు యుద్ధకాల ఋణాలను చెల్లించలేకపోయినాయి జర్మనీ కూడా విదేశీ ఋణాలను పొందలేక పాయింది. చెల్లించలేకపోయింది. దీనిలో అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నమయింది. ప్రపంచ ఆర్థిక మాంద్య ప్రకంపనలు అమెరికాను కూడా ప్రభావితం చేసినాయి. జర్మనీలో విదేశీ పెట్టుబడులు ఉపసంహరించబడినాయి. తత్ఫలితంగా జర్మనీ ఆర్థిక పరిస్థితి అల్లకల్లోలమై యుద్ధనష్టపరిహారాన్ని చెల్లించలేకపోయింది. ఈ పరిస్థితిలో అమెరికన్ అధ్యక్షుడు హూవర్ 1931 జూలై నుండి ఒక సంవత్సరం ఋణాలు, నష్టపరిహారాలు చెల్లించనవసరంలేదని ప్రకటించినాడు. దీనినే "హూవర్ కాల విలంబనం" అంటారు.

జర్మనీకి నష్టపరిహారం చెల్లించేవిషయంలో కాలవిలంబనం మంజూరు చేసినా జర్మన్ ఆర్థిక పరిస్థితి అనుకున్నంత [illegible] 1932 జనవరిలో జర్మనీ ఎట్టి పరిస్థితిలోనూ యుద్ధ నష్టపరిహారాన్ని చెల్లించలేదని Bank of International Settlement ప్రకటించింది. 1932 జూన్‌లో బ్రిటన్, ఫ్రాన్స్, బెల్జియం, ఇటలీ, జపాన్ మరియు జర్మనీ దేశాలు జర్మనీ ఆర్థిక దుస్థితిని, ప్రపంచ ఆర్థిక మాంద్యాన్ని, యుద్ధ ఋణాలు, నష్టపరిహార సమస్యలను చర్చిండానికి లూసెన్‌లో సమావేశమైనాయి. ఈ సమావేశంలో 1. యంగ్ పథకము రద్దు చేయబడింది. 2. జర్మనీకి ఒక్క వాయిదాలో యుద్ధ నష్టపరిహార మొత్తం క్రింద 15 కోట్ల పౌండ్లను చెల్లించే అవకాశం ఇవ్వడం

జరిగింది. జర్మనీ నుండి ఇంత తక్కువ మొత్తాన్ని మిత్రరాజ్యాలు పొందగలరా అనే అనుమానం కూడా ఉంది. 1932 లో జర్మనీ యుద్ధ నష్టపరిహారాన్ని చెల్లించడం నిలిపివేసింది. 1933 లో హిట్లర్ జర్మనీ అధినేత అయిన తరువాత యుద్ధనష్టపరిహారం చెల్లించనవసరంలేదని హిట్లర్ ప్రకటించడంతో ఈ సమస్య అంతమయింది.

కాని యుద్ధ నష్టపరిహారం సమస్యవలన వివిధ దేశాలమధ్య దురభిప్రాయాలు ఏర్పడి అవి మరొక ప్రపంచ యుద్ధానికి దారితీసినాయి.

# Chapter - III

## యుద్ధానంతర టర్కీ

**పరిచయం :** ప్రథమ ప్రపంచ సంగ్రామ అనంతరం స్వయం నిర్ణయాధికార సిద్ధాంతం, జాతీయ భావాల పై ఆధారపడి రాజ్యాలు ఏర్పడటం, ఐరోపా రాజ్యాలు బెల్జియం, హాలెండ్, నార్వే, స్వీడన్, చెకొస్లావాకియా, డెన్మార్క్‌లలో ప్రజాస్వామ్య వ్యవస్థలు ఏర్పడటం జరిగింది. అయితే ప్రజాస్వామ్యం అన్ని దేశాలకు నచ్చలేదు. కొన్ని దేశాలలో ప్రజాస్వామ్యానికి సవాలు అన్నట్లు నియంతృత్వ ప్రభుత్వాలు ఏర్పడినాయి. ముఖ్యంగా టర్కీలో ముస్తఫాకెమల్ పాషా నాయకత్వంలోను, జర్మనీలో హిట్లర్ నాయకత్వంలోను, ఇటలీలో బెనిటో ముస్సోలిని నాయకత్వంలోను ఏర్పడినాయి. ఒక్కొక్క దేశంలో ఒక్కొక్క విధంగా ఏర్పడినా ఈ అన్ని దేశాలు సర్వాధికార సిద్ధాంతంపై ఆధారపడిన రాజ్యాలు (Totalitarian States) ఈ రాజ్యాలలో వ్యక్తికి స్వాతంత్ర్యం లేదు. రాజ్యమే సర్వాధికారి. అధికారతత్వంపై ఆధారపడిన ప్రభుత్వాధికారం చెలాయింపుకు హద్దు పద్దులు లేనిది.

జాతీయ భావం అనుసరించి సమీప ప్రాచ్యంలో ఉన్న ముస్లిం ప్రాంతాలలో మార్పులు రాసాగినాయి. ఇదివరలోవలె ముస్లిం ప్రాంతాలలో మార్పులు రాసాగినాయి. ఇదివరిలో వలె ముస్లిం ప్రపంచమంతా ఒకటి అనే భావం మొదటి ప్రపంచ యుద్ధానంతరం పోయింది. దాని స్థానంలో టర్కీ, అరబ్, ఈజిప్షియన్, పర్షియన్ జాతుల రాజ్యాలు ఏర్పడినాయి. ఆటోమన్ సామ్రాజ్యంలోని బాల్కన్ రాజ్యాలలో జాతీయతాభావం ఎక్కువై అవి స్వతంత్ర రాజ్యాలుగా ఏర్పడినాయి. ఆటోమన్ సామ్రాజ్య కేంద్రమయిన టర్కీ కూడా ఈ జాతీయ భావ ప్రభావంలో పడింది. టర్కీలో విదేశీయుల ప్రమేయం పెరిగిపోయిందని, దానిని తొలగించవలెనని, పాశ్చాత్య పద్ధతులనుసరించి సంస్కరణలు ప్రవేశపెట్టవలెనని, ఉదార రాజ్యాంగం అమలు కావాలని యువ టర్కీ ఉద్యమం ప్రారంభమయినది. టర్కీ "ఐరోపా జబ్బు మనిషి" గా ఉండటానికి వీలులేదని, శేష సామ్రాజ్య భాగంగా ఉన్న టర్కీనైనా సంరక్షించి సుస్థిరం చేయవలెననే భావన టర్కీ నాయకులలో అధికమయింది. అటువంటి నాయకులలో ముస్తఫాకెమల్ పాషా ముఖ్యుడు. ఇతడు టర్కీలో జాతీయ రిపబ్లిక్‌ను స్థాపించి అంకారాను రాజధానిగా చేసుకొని రిపబ్లిక్ అధ్యక్షుడై టర్కీ గౌరవ ప్రతిష్ఠలను, ఆంతరంగిక భద్రతను కాపాడినాడు.

**టర్కీ 1919 - 1945 :** ప్రథమ ప్రపంచ సంగ్రామానికి పూర్వం సుమారు ఒక శతాబ్దంనుంచి టర్కీ సామ్రాజ్యపతనం ప్రారంభమైనది. మూడు ఖండాలలో విస్తరించి యున్న టర్కీ సామ్రాజ్యం బాల్కన్ యుద్ధాలతో క్షీణించిపోయి కాన్‌స్టాంట్‌నోపుల్ దాని పరిసర ప్రాంతాలకే పరిమితమైపోయింది. అందుకే టర్కీని "ఐరోపా జబ్బు మనిషి"గా పరిగణించేవారు. 1908 సం॥లో టర్కీలో జాతీయ భావాలున్న టర్క్‌లు "యువటర్క్"లనే పక్షంగా ఏర్పడి టర్కీని పునర్జీవనంచేయదలచి ఒక ఉద్యమాన్ని ప్రారంభించినారు. ఈ యువటర్క్‌ల ఒత్తిడి ఫలితంగా టర్కీ ప్రథమ ప్రపంచ సంగ్రామంలో జర్మనీ పక్షం వహించింది. ఈ యుద్ధంలో టర్కీ అన్ని విధాల నష్టపోయింది. యుద్ధానంతరం మిత్రరాజ్యాలు టర్కీని సెవెర్స్ సంధి షరతులకు అంగీకరింపచేసినారు. సెవెర్స్ సంధి షరతులు వర్సే సంధి షరతులకన్నా కఠినమైనవి. ఈ సంధిని ఆనాటి టర్కీ సుల్తాన్ ఆరో మహమ్మద్ అంగీకరించడం యువటర్క్‌లక్షు-కోపకారణమైనది. ముస్తఫాకెమల్ నాయకత్వం క్రింద టర్కీ జాతీయ వాదులు సెవెర్స్ సంధి షరతులను అవమానకరమైనవిగా పరిగణించి తిరస్కరించినారు.

**సెవెర్స్ సంధి షరతులు : 1920 (Treaty of Severes)**

1. కాన్‌స్టాంటినోపుల్ నగరాన్ని తాత్కాలికంగా అంతర్జాతీయ పర్యవేక్షణ క్రింద ఉంచారు.
2. ఏడ్రియానోపుల్, థ్రేస్, గాలిపోలి, ఆసియా మైనర్‌లు గ్రీస్‌కు ఇవ్వబడ్డాయి
3. స్మిర్నాలో గ్రీకు సైన్యాలను ఉంచడం జరిగింది.
4. ఆర్మీనియా క్రైస్తవ రిపబ్లిక్‌గా ప్రకటించబడింది.
5. నల్ల సముద్రం, డార్డినెల్స్ జలసంధులను తటస్థ ప్రాంతాలుగా ప్రకటించడం జరిగింది.
6. మెసపటోమియా, పాలస్తీనా, ట్రాన్స్ - జోర్డాన్‌లను బ్రిటన్‌కు, సిరియా, లెబనాన్‌లను ఫ్రాన్స్‌కు అధిష్ట ప్రాంతాలుగా ఇవ్వబడ్డాయి.
7. టర్కీ సైనిక బలాన్ని 50 వేలకు తగ్గించినారు. టర్కీ వైమానిక దళాలను మిత్రరాజ్యాలు వశపరచుకొన్నాయి.
8. యుద్ధ నష్టపరిహారాన్ని పెద్ద మొత్తంలో విధించడం జరిగింది.

సెవెర్స్ సంధి షరతులవలన టర్కీ సామ్రాజ్యం విచ్ఛిన్నమయింది. టర్కీ పాలననుండి టర్కీ జాతికి చెందిన అన్ని ప్రాంతాలు విడిపోయినాయి. ఋణాల బాధల వల్ల, తన ఆర్థిక వనరులపై విదేశీయుల నియంత్రణ వల్ల టర్కీ కుంగిపోయింది. అమెరికా, యుగోస్లావియా, హెడ్జా దీనిపై సంతకాలు చేయ నిరాకరించినాయి. తీవ్రమైన అభ్యంతరాలు పెట్టి చివరకు టర్కీ దీనిపై సంతకం చేసింది.

**ముస్తఫాకెమల్ పాషా :** ముస్తఫా 1880 లో సెలొనికాలో ఆల్బేనియన్ కుటుంబంలో జన్మించినాడు. చిన్నతనం నుండి సూక్ష్మబుద్ధి, చురుకుతనం ఉన్నవాడు. మొనాస్టిర్‌లో కొంతకాలం సెంకడరీ విద్య నభ్యసించి అక్కడినుండి పారిపోయి కాన్‌స్టాంటినోపుల్ లో సైనిక శిక్షణాలయంలో చేరినాడు. స్కూలులో ఇతడు గణితంలో ప్రావీణ్యం చూపినందువల్ల "కెమల్" అనే బిరుదు వచ్చింది. "కెమల్ అంటె పరిపూర్ణుడు అని అర్థం. ముస్తఫాకెమల్‌ను కెమల్ అటాటర్ అని పిలుస్తారు. అంటే టర్క్‌ల పిత అని అర్థం. కెమల్ ఒక ప్రముఖ సైనికునిగా తయారయి విప్లవ సాహిత్యాన్ని అధ్యయనం చేసినాడు. టర్కీ సుల్తాన్ నిరంకుశ పాలన అతనికిష్టంలేదు. విప్లవం లేవదీస్తున్న యువటర్క్ ఉద్యమంలో చేరినాడు. కాని వారి కుతంత్రాలు నచ్చకే ఫ్రాన్స్‌కు పోయి యుద్ధ తంత్రాలను నేర్చుకొని టర్కీకి తిరిగి వచ్చాడు. 1912-1913 బాల్కన్ యుద్ధంలో పాల్గొని తన సామర్థ్యాన్ని ఋజువు చేసినాడు. ప్రథమ ప్రపంచ సంగ్రామంలో బ్రిటిష్ వారు 1915 లో గాలిపోలిపై దండెత్తినప్పుడు సైన్యాధిపతిగా కెమల్ వారిని తిప్పికొట్టినాడు. యుద్ధానంతరం సెవెర్స్ సంధి జరిగి ఆటోమన్ సామ్రాజ్యంలోని మెసపటోమియా, ఇరాక్, సిరియా, హెడ్జాజ్, ఆర్మీనియా, థ్రేస్, స్మిర్నాలను టర్కీ కోల్పోయింది. టర్కీ సుల్తాన్ ఈ సంధి షరతులకు అంగీకరించకుండా చేయడానికి కెమల్ ఎంతో ప్రయత్నించినాడు. గ్రీకులతో యుద్ధం చేసి అయినా సరే గ్రీస్‌కు సంధివల్ల లభించే టర్కీ సామ్రాజ్య భాగాలు గ్రీస్‌కు చెందకుండా తాను యుద్ధం నడుపుతానన్నాడు. కాని టర్కీ ప్రభుత్వం ధైర్యం చాలకే ఊరుకొన్నది. సెవెర్స్ సంధిని తిరస్కరించిన ముస్తఫా అనటోలియా వెళ్ళి సైన్యాన్ని సేకరించి, జాతీయ పక్షం అనే ప్రజా పార్టీని స్థాపించి " టర్కీ, టర్క్‌లకే" అనే లక్ష్యాన్ని ప్రబోధించినాడు. టర్కీ ప్రజలలో జాతీయ భావం రగుల్కొల్పినాడు. సెవెర్స్ సంధిని తీవ్రంగా వ్యతిరేకించినాడు. 1922 లో సుల్తాన్‌ను పదవీచ్యుతిని చేసి కాన్‌స్టాంటినోపుల్‌ను స్వాధీనం చేసుకొని గ్రీకులను టర్కీ సామ్రాజ్య భాగాలనుండి వెళ్ళగొట్టి 1923 లో రాజధాని అంకారాలో జాతీయ మహాసభను సమావేశపరచి తాను టర్కీకి అధ్యక్షుడుగాను, సర్వసైన్యాధిపతిగాను ఎన్నికయినాడు. సుల్తాన్ మాల్టాకు పారిపోయినాడు. టర్కీ భూభాగాలనుండి విదేశీసేనలను వైదొలగేటట్లు చేయడం ముస్తఫా ప్రథమ కర్తవ్యం అయింది. ఇటలీ, ఫ్రెంచ్ సైన్యాలను టర్కీ భూభాగాలనుండి వైదొలగేటట్లు చేసినాడు. రష్యాతో సంధిచేసుకొని రష్యాకు కోల్పోయిన భూభాగాలను పొందినాడు. గ్రీస్‌ను ఓడించి టర్కీ భాగాలను పొందినాడు.

**లోజేన్ సంధి, 1923 :** టర్కీ విజయపరంపరలను, ఆవిర్భవించిన జాతీయ భావాన్ని గ్రహించిన మిత్రరాజ్యాలు సెవెర్స్‌సంధి షరతులను మార్చడానికి ఒప్పుకొని స్విట్జర్లండ్‌లోని లోజేన్ నగరంలో 1922 నవంబర్‌లో సమావేశమైనాయి. ఈ సమావేశానికి బ్రిటన్,

ఇటలీ, జపాన్, ఫ్రాన్స్, రష్యా, అమెరికా, గ్రీస్, యుగొస్లావియా, రుమేనియా, టర్కీ దేశాల ప్రజలు హాజరైనారు. టర్కీ ప్రతినిధిగా ఇస్మత్ పాషా హాజరైనాడు. ఇక్కడ జరిగిన చర్చల ఫలితంగా 1923 ఏప్రిల్ 24 న లోజేన్ సంధి జరిగింది. ఈ సంధిననుసరించి

1. థ్రేస్, ఏడ్రియానాపుల్‌లు టర్కీ తిరిగి పొందింది.
2. మెసపటోమియా, సిరియా, పాలస్తీనా అర్థియాల మీద టర్కీ ఆధిపత్యం వదులుకుంది.
3. లిబియా, సూడాన్, ఈజిప్ట్‌ల మీద టర్కీ తన హక్కులను వదులుకొన్నది.
4. బ్రిటిష్ వారి సైప్రస్ ఆక్రమణ టర్కీ గుర్తించింది.
5. టర్కీ భూభాగాలనుండి విదేశీ సేనలు వైదొలగాలి.
6. సెవెర్స్ సంధి టర్కీ సైన్యంమీద, నౌకా వైమానిక దళాలమీద విధించిన ఆంక్షలను ఉపసంహరించడం జరిగింది.
7. తన దేశంలోని అల్పసంఖ్యాక వర్గాల హక్కులను పరిరక్షించడానికి టర్కీ హామీనిచ్చింది.

ఈ సంధి ఫలితంగా 764 లక్షల హెక్టార్‌ల వైశాల్యంతో 1,30,000,000 జనాభాగల నవ టర్కీ ఆవిర్భవించింది. టర్కీ ఆంతరంగిక విషయాలలో విదేశీ నియంత్రణ పూర్తిగా తొలగిపోయింది.

టర్కీలో జాతీయ రిపబ్లిక్‌ను ఏర్పరచిన తరువాత ముస్తఫా రాజధానిని కాన్‌స్టాంటినోపుల్‌నుండి అంకారాకు మార్చినాడు. యుద్ధం ద్వారా, దౌత్యపరంగా సెవెర్స్‌సంధిని రద్దుపరచి ఆయన లోజేన్ సంధిద్వారా అనటోలియా, ఏసియా మైనర్, కాన్‌స్టాంటినోపుల్‌తో కొత్త టర్కీని రూపొందించినాడు. టర్కీ అన్నివిధాల జాతీయ రాజ్యమైనది. కొత్త రాజ్యాంగం 1924 సం॥లో అమలులోకి వచ్చింది. ముస్తఫా కెమల్ పాషా టర్కీకి అధ్యక్షుడైనాడు.

**ముస్తఫాకెమల్ ఆశయాలు :** ముస్తఫా సైనిక, రాజకీయ నాయకత్వానికి అర్హుడై దృఢనిశ్చయంతో టర్కీ టర్కులకే అనే భావంతో, పట్టుదలతో పని ప్రారంభించినాడు. అధ్యక్షపదవికి వచ్చేనాటికి కెమల్ వయసు 35 సంవత్సరాలు. టర్కీదేశంలో విదేశీ ప్రమేయం లేకుండా చేసి టర్కీని పాశ్చాత్యీకరించి టర్కీ ప్రజల జీవితంలోనే ఒక మార్పు తీసుకొని రావాలని సంకల్పించినాడు. నిజమైన దేశాభిమానిగ, జాతీయ నాయకుడుగా టర్కీని జాతీయ రాజ్యం చేయవలెననే ఉద్దేశం ఉన్నవాడు. సెవెర్స్ సంధి పునఃపరిశీలన తరువాత తన ఆశయాలను అనుసరించి సంస్కరణలను ప్రవేశపెట్టినాడు.

**సంస్కరణలు :** మధ్యయుగంనాటి టర్కీలోని సనాతన పద్ధతులను, సంస్థలను నిర్మూలించి టర్కీని ఆధునికం చేయదలచినాడు. ముస్తఫా కెమల్ కార్యక్రమం "కెమలిజం" అనే ఆరు సూత్రాలలో ఉన్నది.

1. రిపబ్లిక్ వాదము : టర్కీని రిపబ్లిక్‌గా ప్రకటించడం.
2. జాతీయ భావము : ప్రతి టర్క్ తురుష్క భాషనే అభ్యసించి టర్కీ జాతీయతను పెంపొందించే విద్యలను అభ్యసించుట.
3. ప్రజాధికారవాదము : రాజ్య సార్వభౌమాధికారం ప్రజలదే.
4. ఇటేటిజం : రవాణా, గనులు, ప్రజోపకరమైన సంస్థలు, పరిశ్రమలు మొదలగునవి. ప్రభుత్వ యాజమాన్యంలో ఉండుట.
5 లౌకికవాదం : టర్కీని మత ప్రముయంలేని లౌకిక రాజ్యంగా రూపొందించుట.
6. విప్లవవాదం : దేశము త్వరితగతిన ప్రగతిని సాధించడానికి జాతీయ పక్షం విప్లవాత్మకమైన చర్యలు చేపట్టుట.

**1. టర్కీ రాజ్యాంగము : 1925 లో మౌలిక మార్పులతో** అమలులోకి వచ్చిన రాజ్యాంగం ప్రకారం నాలుగు సంవత్సరాలకొక పర్యాయం సార్వజనిక ఓటు హక్కు ప్రకారం జాతీయ సభను ప్రజలు ఎన్నుకుంటారు. రిపబ్లిక్ అధ్యక్షుడిని జాతీయ సభ నాలుగు

సంవత్సరాలకు ఎన్నుకుంటుంది. కార్య నిర్వాహకవర్గం శాసనసభకు (జాతీయ సభకు) బాధ్యత వహిస్తుంది. కాని ఆచరణలో టర్కీ సర్వాధికారి కెమల్ పాషా. ఆయన ఏర్పరచిన ప్రభుత్వం జాతీయ నియంతృత్వం. 1937 లో ఈ రాజ్యాంగం పరిష్కృతమయి తన ప్రజాపార్టీ లక్ష్యాలు జాతీయత, ప్రజాస్వామ్యం అని ధృడం చేసినాడు.

**2. రాజకీయ సంస్కరణలు :** రాజకీయంగా కొరాన్ అనుసరించి ఉండే న్యాయ పద్ధతులను మానివేసి ఐరోపా పద్ధతుల ప్రకారం కొత్త న్యాయస్మృతిని ప్రవేశ పెట్టినారు. ముస్లిం జడ్జీలు పదవులు కోల్పోయినారు. ముస్లిం కాలండరుకు బదులు గ్రెగేరియన్ కాలండర్ అరబిక్ లిపికి బదులు రోమన్ లిపిని అమలుకు తెచ్చినాడు. టర్కీ నిఘంటువు తయారు చేయించినాడు. స్త్రీలకు ఓటు హక్కునిచ్చి ప్రభుత్వోద్యోగాలలో కూడా వారు అర్హులని ప్రకటించినాడు. స్త్రీల పాఠశాలలు స్త్రీల క్లబ్బులు, సంఘాలు స్థాపితమయేటట్లు చేసినాడు. తూనికలు, కొలతలలో మెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టినాడు.

**3. మత సంస్కరణలు :** టర్కీ సుల్తాన్‌ను రాజ్య భ్రష్టుని చేసి కలీఫా పీఠాన్ని రద్దుచేసినాడు. మతానికి ప్రాధాన్యత ఉండకూడదని, ప్రభుత్వానికి అది లోబడి ఉండవలెనని ఆదేశించినాడు. మతసంస్థలకు ప్రభుత్వమిచ్చే ధన సహాయాన్ని నిలుపుచేసినాడు. మత, విద్యాసంస్థలన్నీ ప్రభుత్వ పరమైనాయి. మత విద్యాలయాలేగాక మతానికి సంబంధించిన సంఘాలను రద్దుచేసి మఠాలను కూడా మూసివేసినాడు. మసీదులలో ప్రవేశించేముందు పాదరక్షలు విడువనవసరం లేదని కెమల్ ఆదేశించినాడు. 1928 లో టర్కీ రాజ్యాంగ సవరణ ఫలితంగా టర్కీ లౌకిక రాజ్యంగా రూపొందింది. ఈ మత సంస్కరణ వలన సనాతన మహమ్మదీయులలో అసంతృప్తి ప్రబలింది. 1924-25 సం॥లలో మత మౌఢ్యానికి పేరుపడ్డ ఖుర్దులు తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటును కెమల్ అతిక్రూరంగా అణచివేసాడు.

**4. విద్యాసంస్కరణలు :** టర్కీ ప్రజలలో దేశభక్తిని పెంపొందించడానికి, జాతీయ పక్షం దాని విధానాలకు ప్రచారం కల్పించడం కోసం కెమల్ విస్తృత విద్యాకార్యక్రమాన్ని, ప్రచార విభాగాన్ని ప్రారంభించినాడు. వయోజనులకు పఠన మందిరాలు, రేడియో కేంద్రాలు ఏర్పాటు చేసాడు. పాఠశాలలో మతసంబంధమైన బోధనలను నిషేధించాడు. రేడియో ద్వారా ఎడతెరిపిలేకుండా ప్రభుత్వం తయారు చేసిన వార్తలు ప్రజలకు అందించబడ్డాయి. వార్తలన్నీ అంకారానుండే వెలువడేవి. పాఠ్య ప్రణాళికలు, పాఠ్యపుస్తకాలు, పాఠ్యాంశాలు కెమల్ పర్యవేక్షణకింద తయారయ్యేవి. అధ్యాపకుల ఎంపిక కూడా ఆయనే చేసేవాడు. కాని ఆనాడు తగినంతమంది ఉపాధ్యాయులు తగినన్ని పాఠశాలలు లేకపోవడంతో ఈ సంస్కరణలు ఎక్కువగా ప్రయోజనం ఇవ్వలేదు. అయిననూ అక్షరాస్యుల సంఖ్య 58% పెరిగింది. వయోజన విద్యావకాశాలు కల్పించడం, పౌరహక్కులు అక్షరాస్యులకే పరిమితం చేయడం, సాంకేతిక విద్యాలయాలను ఏర్పాటు చేయడం, వ్యాయామక్రీడలకు ప్రోత్సాహం ఇవ్వడం మొదలైనవి కెమల్ చేసిన సంస్కరణలు. నిరక్షరాస్యత 95% నుండి 50 % కు తగ్గింది.

ఈ విధమైన విద్యా విధానం, ప్రభుత్వ ప్రచారం వలన టర్కీ ప్రజలు తాము ఉన్నత జాతికి చెందిన హిట్టయిట్‌లకు వారసులమని, తాము పూర్వ కాలంలో ప్రపంచానికే మార్గ దర్శకులుగా ఉన్నామని, "ఘాజి" నాయకత్వం క్రింద తిరిగి తాము ఇప్పుడు ప్రపంచానికే మార్గదర్శకులు కాబోతున్నామని టర్కీలు విశ్వసించసాగినారు.

**5) సాంఘిక సంస్కరణలు :** టర్కీని సాంఘికంగా కూడా ఆధునికం చేయవలెనని కెమల్ సంస్కరణలు ప్రవేశపెట్టినాడు. బహుభార్యత్వం నిషేధించినాడు. పరదా పద్ధతి నిరుత్సాహపరచినాడు. పౌరవివాహాలు జరుగవలెనన్నాడు. టర్కీల మత చిహ్నాలైన ఫేజ్ టోపీలను, తలపాగాలను ధరించనిషేధించి పాశ్చాత్యులవలె దుస్తులు ధరించవలెనని ప్రకటించినాడు. సెలవురోజు శుక్రవారంగాక ఆదివారం చేసినాడు. కుటుంబం పేర్లు తమ పేర్లతో చేర్చి వాడుకొనే పద్ధతి అవలంభించమన్నాడు. జాతీయ మహాసభ కోరికపై అతడు ఆటాటర్క్ అన్న బిరుదు ధరించినాడు.

కెమల్ పురుషులతోబాటు స్త్రీలకు సమానహక్కులిచ్చినాడు. వివాహానికి వయఃపరిమితి పురుషులకు 18 సం॥లు, స్త్రీలకు 17 సం॥లుగా నిర్ణయించినాడు. 1934లో స్త్రీలకు రాజకీయ హక్కులను సంక్రమింప చేసినాడు. మహిళా విశ్వవిద్యాలయాలను స్థాపించినాడు.

ఫలితంగా అనేకమంది స్త్రీలు న్యాయమూర్తులుగా, విశ్వవిద్యాలయాలలో ఆచార్యులుగా నియమింపబడటమేగాక జాతీయ సభలో ప్రతినిధులుగా ఎన్నికయినారు. సర్వసాధారణంగా ఐరోపా నియంతలు తమ పాలన ప్రజలకు హితమయిందని ప్రచారం చేసే యత్నాలన్నీ ముస్తఫాకూడా గావించడం వల్ల దేశానికి నిజమైన నాయకుడుగా గుర్తించబడినాడు.

**6. న్యాయసంస్కరణలు :** కెమల్ టర్కీలోని న్యాయ వ్యవస్థను సంపూర్ణంగా పునర్వ్యవస్థీకరించినాడు. ఐరోపా దేశాల న్యాయవ్యవస్థల పద్ధతులను టర్కీలో ప్రవేశపెట్టాడు. 1926 లో సివిల్, క్రిమినల్, కమర్షియల్ న్యాయస్మృతులు తయారు చేయించి ఆమోదింపచేసినాడు. ఒక సుప్రీంకోర్టు, 700 న్యాయస్థానాలను దేశంలో స్థాపించినాడు.

**7. ఆర్థిక సంస్కరణలు :** టర్కీ ప్రజలు వ్యవసాయదారులైనా ఆర్థికంగా అంత శ్రీమంతులుకారని కెమల్‌కు తెలుసు. అందుచేత ఆర్థికాభివృద్ధికి పరిశ్రమల స్థాపనయినా, వ్యవసాయమైనా చేపట్టడానికి తగిన మూలధనం ప్రభుత్వమే అందజేయవలెనని గ్రహించి ప్రభుత్వ సామ్యవాదాన్ని అనుసరించి ఆర్థికాభివృద్ధికి పాటుపడినాడు. 1920 లో 12 సంవత్సరాల ప్రణాళిక ప్రకారం రైల్వేల విస్తరణ, నౌకాశ్రయ నిర్మాణం, నీటి పారుదల ఏర్పాట్లు, సాగుభూమి సేకరించడం మొదలైన పనులు చేసినాడు. విదేశీయులను వృత్తులనుండి వర్తక వ్యాపారాలనుండి తొలగించినాడు. టర్కీ పౌరులకే ఉద్యోగాలిచ్చినాడు. ప్రభుత్వం ద్వారా వ్యవసాయ దారులకు అన్నివిధాల సహాయం అందజేసినాడు. కెమల్ ఇతర రైతులకు మార్గదర్శకుడై రైతుల ఆదరాభిమానాలు పొందినాడు.

అనేక ప్రణాళికల ద్వారా టర్కీ ఆర్థికాభివృద్ధిని సాధించినాడు. వ్యవసాయ అభివృద్ధి కోసం చతుర్వర్ష ప్రణాళిక, పారిశ్రామిక అభివృద్ధికి పంచవర్ష ప్రణాళిక, ఖనిజాభివృద్ధికి త్రివర్ష ప్రణాళిక, రహదారుల నిర్మాణానికి దశవర్ష ప్రణాళికలను చేపట్టినాడు. తత్ఫలితంగా కర్మాగారాలు స్థాపించినాడు. ఇవన్నీ జాతీయం చేయబడినవే. రైలు మార్గాల విస్తరణ జరిగింది. నౌకాశ్రయాలను అభివృద్ధి చేసినాడు. బొగ్గు, రాగి, చమురు గనుల ఉత్పత్తిని పెంచగలిగినాడు. ఈ అభివృద్ధి పథకాలకయ్యే ఖర్చులకు గాను కెమల్ విదేశీ సహాయంమీద ఎక్కువ ఆధారపడకపోవడం వలన టర్కీ ఆర్థిక వ్యవస్థ మీద విదేశీ నియంత్రణ లేకుండా పోయింది. ఈ సంస్కరణల ఫలితంగా టర్కీ స్వయం సమృద్ధిని సాధించగలిగింది. రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, అమెరికాలతో టర్కీ వాణిజ్య ఒప్పందాలు చేసుకొన్నది. స్వదేశీ వస్తువుల వాడకం ప్రోత్సహించినాడు. సమర్థవంతమైన బ్యాంకింగ్ పద్ధతి ప్రవేశపెట్టినాడు. ప్రజారోగ్య, సాంఘిక సంక్షేమ కార్యక్రమాలవల్ల ప్రజల జీవన ప్రమాణం పెరిగింది.

ఈ విధంగా వివిధ రంగాలలో ముస్తఫా సంస్కరణలు చేసి టర్కీ జాతీయ జీవనంలోనే నూతన ఉత్తేజాన్ని కల్పించినాడు. టర్కీ జాతి ప్రజలు భగవంతుని బిడ్డలని, వారికి గొప్ప భవితవ్యం ఉందని చెప్పి తనపై ప్రజలకు విశ్వాసం ఉండేటట్లు వర్తించేవాడు. కెమల్ టర్కీలోని కొన్ని నగరాల పేర్లను మార్చినాడు. రాజధాని అంగోరాను అంకారాగాను, కాన్‌స్టాంటినోపుల్‌ను ఇస్తాంబుల్ గాను, స్మిర్నాను ఇజ్మీర్ గాను మార్చినాడు. ఈ నగరాలు అత్యాధునిక సౌకర్యాలతో కూడి పాశ్చాత్యానగరాలుగా భాసిల్లినాయి.

**టర్కీ విదేశాంగ విధానం :** టర్కీ కెమల్ పాషా కాలంలో విదేశాలతో సమాధాన పూర్వకంగా సంబంధాలు పెట్టుకొన్నది. శాంతియుత వాతావరణాన్నే రూపొందించవలెననుకొన్నది. కెమల్ విదేశాంగ విధానంలో లోజేన్ సంధి గొప్ప విజయం. యుద్ధానంతర సంధులలో పునఃపరిశీలన చేయబడి టర్కీకి ఇష్టమయిన విధంగా మార్పుపొందిన సంధి ఇది ఒక్కటే. టర్కీ దేశానికి సరిహద్దు సమస్య లేకుండా చేయడం, అతని విదేశాంగ విధాన ప్రధానలక్ష్యం. టర్కీ దేశ రాజకీయం భద్రతను పరిరక్షించడం, పాశ్చాత్య దేశాలకు వ్యతిరేకంగా రష్యాతో మైత్రిని చేసుకోవడం, మధ్య ప్రాచ్య దేశాలతో స్నేహసంబంధాలు పెంపొందించుకోవడం, బాల్కన్ ప్రాంతంలో ఇటలీ దురాక్రమణ అరికట్టడం మొదలగునవి టర్కీ విదేశాంగ విధానంలోని ముఖ్యాంశాలు.

కెమల్ రష్యాతో సౌహార్థ సంబంధాలు పెట్టుకోగలిగినాడు. 1922-23 సం॥లనుండి రెండు దేశాలు దౌత్యసంబంధాలు ఏర్పరచుకొన్నాయి. 1925 లో టర్కీ, రష్యాల మధ్య మైత్రి సంధి కుదిరింది కాని 1939 లో రష్యా, జర్మనీలు ఏర్పరచుకొన్న నిర్యుద్ధ సంధి టర్కీని ఆందోళన పరచింది. 1941 లో జర్మనీ రష్యామీద దండెత్తినప్పుడు టర్కీ తటస్థంగా ఉండిపోయింది. రెండో ప్రపంచ యుద్ధపు చివరి దశలో టర్కీ మిత్రరాజ్యం పక్షం చేరింది.

మోసూల్ విషయంలో టర్కీకి, బ్రిటన్‌కు మధ్య సంబందాలు చెడినాయి. 1926 లో తగాదా పరిష్కారమయి మోసూల్ మీద టర్కీ తన హక్కులను వదులుకున్నది. 1932 లో టర్కీ నానాజాతి సమితిలో చేరింది. 1936 లో ఇంగ్లాండ్ రష్యా, ఫ్రాన్స్, గ్రీస్, జపాన్, బల్గేరియా, రుమేనియా, యుగొస్లావియాల మధ్య జరిగిన మాంట్రే సంధి ద్వారా టర్కీ డార్డినెల్స్ మీద రక్షణ స్థావరాలు నిర్మించుకోవడానికి అనుమతి పొందింది. 1936 తరువాత ఐరోపా రాజ్యాల సంబంధాలు ఉద్రిక్తత పొందినప్పుడు ప్రతిదేశము టర్కీతో సంబంధాలు పెట్టుకోవడానికి ఇష్టపడింది. టర్కీ 1937 లో బ్రిటన్, ఫ్రాన్స్‌తో ఆర్థిక ఒప్పందాలను కుదుర్చుకొన్నది.

ఈ విధంగా సుమారు 20 సంవత్సరాల కాలం టర్కీ సర్వవిధాల అభివృద్ధి చెందేటట్లు కృషిచేసిన "అటాటర్క్" ముస్తఫా కెమల్ పాషా 1938 సంవత్సరంలో దివంగతుడయినాడు. కెమల్ చరిత్ర పురుషుడు.

ఎం. సోమశేఖరరావు

పాఠము - 3

# 1. వైమార్ రిపబ్లిక్ - జర్మనీ

# 2. అంతర్జాతీయ భద్రతకు ఫ్రాన్స్ అన్వేషణ

**లక్ష్యం**

మొదటి ప్రపంచ యుద్ధానంతరం జర్మనీలో ఏర్పడిన వైమార్ రిపబ్లిక్ గురించి, అంతర్జాతీయ భద్రతకు ఫ్రాన్స్ చేసిన ప్రయత్నాల గురించి తెలియజేయడమే ఈ పాఠం లక్ష్యం.

**విషయ సంగ్రహం :**

I వైమార్ రిపబ్లిక్ - జర్మనీ

3.1 పరిచయం

3.2 మొదటి ప్రపంచయుద్ధానంతరం జర్మనీ పరిస్థితి

3.3 వైమార్ రిపబ్లిక్

3.3.1 విదేశీ వ్యవహారాలు

3.3.2 రష్యా, జర్మనీల మధ్య సంబంధాలు

3.3.3 ఫ్రాన్స్ రూర్‌ను ఆక్రమించుకోవడం

3.3.4 జర్మనీకి సమితిలో సభ్యత్వం

3.3.5 వైమార్ రిపబ్లిక్ పతనానికి కారణాలు

3.3.5.1 కమ్యూనిజం వ్యాప్తి చెందడం

3.3.5.2 ఆర్థిక సంక్షోభము

3.3.5.3 యూదు వ్యతిరేక ప్రచారం

3.3.5.4 ఇతర కారణాలు

II అంతర్జాతీయ భద్రతకు ఫ్రాన్స్ అన్వేషణ

3.1 పరిచయం

3.2 ఫ్రాన్స్ భద్రత సమస్య

3.3 ఇంగ్లాండ్ అమెరికాలు ఫ్రాన్స్‌తో సంధులు చేసుకోవడం

3.4 ఫ్రాన్స్ రూర్‌ను ఆక్రమించుకోవడం

3.5 సమితి ద్వారా భద్రతకై ఫ్రాన్స్ ప్రయత్నం చేయడం
3.5.1 పరస్పర సంధి ముసాయిదా
3.5.2 జెనీవా సంధి ముసాయిదా
3.5.3 లొకర్నో ఒడంబడికలు
3.5.4 పారిస్ ఒడంబడిక (క్రెల్లాంగ్ - బ్రియాండ్ ఒడంబడిక)
3.5.5 సాధారణ చట్టము
3.6 సమితి ప్రయత్నం లేకుండా భద్రతా స్థాపనకు జరిగిన ప్రయత్నాలు
3.6.1 ఫ్రాన్స్ బెల్జియం మైత్రి సంధి
3.6.2 ఫ్రాన్స్ పోలండ్‌ల మైత్రి సంధి
3.6.3 ఫ్రాన్స్, చెకొస్లొవేకియాల మధ్య సంధి
3.6.4 ఫ్రాన్స్, రుమేనియాల మధ్య, ఫ్రాన్స్, యుగోస్లావియాల మధ్య సంధులు
3.6.5 చిన్న రాజ్యాల సౌహార్ద కూటమి
3.6.6 ఇటలీ మైత్రి సంధులు
3.6.7 బాల్కన్ ఒప్పందము
3.6.8 మధ్య ప్రాచ్యంలో భద్రతా స్థాపనకు జరిగిన సాద్‌బాద్ ఒడంబడిక
3.6.9 స్కాండినేవియా రాజ్యాల కూటమి
3.6.10 బాల్టిక్ ఒడంబడిక
3.6.11 రోమ్ ఒప్పందము
3.6.12 లండన్ ఒడంబడిక
3.6.13 జర్మనీలో హిట్లర్ అధికారంలోకి వచ్చిన తరువాత ఏర్పడిన నూతన సంధులు
3.6.14 ఫ్రాన్స్ రష్యాల మధ్య సంధి
3.6.15 రెండు రకాల ఒడంబడికలను ఏర్పాటు చేయడానికి ఫ్రాన్స్ చేసిన విఫల ప్రయత్నాలు
3.6.16 ఫ్రాన్స్, ఇటలీల మధ్య సంధి
3.6.17 రష్యా, చెకొస్లొవేకియా మధ్య సంధి

## వైమర్ రిపబ్లిక్ - జర్మనీ

**1.1 పరిచయం :** యూరప్ ఖండంలో జర్మనీ భౌగోళికంగా కీలక స్థానంలో ఉన్నది. అయితే ఆధునిక ప్రపంచ చరిత్రలో అనేక క్లిష్ట సమస్యలను సృష్టించిన ఘనత దీనికే దక్కుతుంది. గత 25 సంవత్సరాల కాలంలో జర్మనీ తన తీవ్ర సైనిక వాదంవల్ల రెండు ప్రపంచయుద్ధాలను తెచ్చి పెట్టిందని పశ్చిమ రాజ్యాలు భావించినాయి. యూరప్‌లోని తూర్పు పశ్చిమ ప్రాంతాలమధ్య తేలికైన

రాకపోకల మార్గాలన్నీ జర్మనీ గుండా మాత్రమే ఉన్నాయి. తూర్పు పశ్చిమ యూరప్‌లకు మధ్య ఉన్నందువల్ల జర్మనీ యూరప్‌లోని వర్తక వ్యాపారాలకు కేంద్రస్థానమైంది. అంతేగాక భౌగోళికంగా కీలక స్థానములో ఉన్న జర్మనీ యూరప్ దౌత్యరంగంలో కూడా అతి ప్రధానమైన పాత్ర వహించటానికి వీలైంది. క్రీ.శ. 1870-1871 లలో ఏకీకరణం చెందిన జర్మనీ క్రీ.శ. 1914 నాటి అపరిమితమైన సహజవనరులు, పెరుగుతున్న జనాభా, పారిశ్రామిక సైనిక రంగాలలో సాధించిన అభివృద్ధి మొదలైన కారణాల వల్ల పారిశ్రామిక వాణిజ్య సైనిక రంగాలలో అసాధారణమైన విజయాలను సాధించింది. జర్మనీ సహజ సంపద ఎక్కువగా ఉన్న దేశము. రూర్, ఎగువ సైలీషియా, శాక్షనీ (Saxony) లలో విలువైన బొగ్గు గనులున్నాయి. నూనెగనులు చాలా తక్కువగా ఉన్నప్పటికీ జర్మనీ జనబాహుళ్యంగల దేశం కాబట్టి మానవ శక్తిని ఉపయోగించుకోగల్గింది. అందువల్ల జర్మనీ నూనె కొరతవల్ల అంతగా ఇబ్బంది పడలేదు. మొదటి ప్రపంచ యుద్ధానంతరం ఆల్సేస్ - లోరేయిన్‌లను ఫ్రాన్సుకివ్వడం వల్ల జర్మనీ ఇనుప గనులున్న ప్రదేశాన్ని పోగొట్టుకొన్నది. అయినప్పటికీ విదేశాలనుంచి దిగుమతి చేసుకొని జర్మనీ ఇనుప ఖనిజం కొరత సమస్యను అధిగమించగల్గింది.

పైన పేర్కొనట్లుగా అనేక సహజ సంపదలున్న జర్మనీ ప్రపంచ రాజకీయాలలో అతిముఖ్యమైన దేశము. మధ్యయూరప్ ఆగ్నేయ యూరప్‌లోని రాజ్యాలన్నీ ఆర్థికంగా జర్మనీ మీద ఆధారపడి ఉన్నాయి. అంతేకాక బాల్కన్ రాజకీయాలలో జోక్యం చేసికొని ఆ ప్రాంతంలో విప్లవాలను ప్రోత్సహించటం వలన తన పలుకుబడిని నెలకొల్పుకోవటానికి జర్మనీ శతవిధాల ప్రయత్నించసాగింది. తన సైనిక బలాన్ని విపరీతంగా పెంచుకొంటున్న జర్మనీకి బ్రిటన్, ఫ్రాన్సులతో తీవ్రవిరోధం ఏర్పడింది. తన సరిహద్దుల రక్షణ సాకుతో జర్మనీ చేస్తున్న సైనిక సన్నాహాల వల్ల ఇరుగు పొరుగు దేశాలు ఆందోళన చెందినాయి. సైనిక బలమున్న జర్మనీ రాజ్యవిస్తరణ కార్యక్రమాన్ని చేపట్టినందువల్ల యూరప్‌లో అనేక సమస్యలు తలెత్తినాయి. ముఖ్యంగా జర్మనీ రాజ్యకాంక్ష రెండో ప్రపంచ యుద్ధానికి దారితీసింది.

**3.2 మొదటి ప్రపంచ యుద్ధానంతరం జర్మనీ పరిస్థితి** : మొదటి ప్రపంచ యుద్ధంలో జర్మనీ వీరోచితంగా పోరాడినప్పటికి విపరీతమైన అనగా లెక్కతెలియని విధంగా నష్టమును చవిచూచింది. మరీముఖ్యంగా ఆర్థికంగా, సైనికంగా పూర్తిగా దెబ్బతిన్నది. యుద్ధ విరమణ సంధి మీద సంతకం చేసిన జర్మనీ అనేక క్లిష్టమైన సమస్యలను ఎదుర్కోవలసి వచ్చినది. యుద్ధం తొలిదశలోనే అనేక సైనిక విజయాలను సాధించిన జర్మనీ చివరికి పూర్తిగా ఓడిపోయి మిత్ర రాజ్యాలకు లొంగిపోవలసి వచ్చింది. అంతేకాక జర్మనీ అంతరంగిక సంక్షోభాన్ని కూడా ఎదుర్కోవలసి వచ్చినది. అయినప్పటికి యుద్ధానంతరం ఒక క్రమశిక్షణ ఉన్న జాతిగా అనేక క్లిష్ట సమస్యలకు ధైర్యంగా ఎదుర్కొవడమేగాక అంతరంగిక అరాచక పరిస్థితులను అధిగమించి సుస్థిర రాజకీయ వ్యవస్థలను కూడా జర్మనీ ఏర్పాటు చేయగల్గింది.

**3.3 వైమర్ రిపబ్లిక్ (Weimar Republic)** : మొదటి ప్రపంచ యుద్ధంలో ఓడిపోయిన జర్మనీ అంతరంగిక రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. పరాజయం వలన జర్మన్‌ల నైతిక బలం దిగజారింది. ఆహార పదార్థాల కొరత ఏర్పడటంతో జర్మనీలు రష్యన్ కమ్యూనిస్ట్ విప్లవ భావాల ప్రభావానికి లోనుకాసాగినారు. సోవియట్ రష్యానుంచి స్వదేశానికి తిరిగి వచ్చిన జర్మన్ ఖైదీలు తమ దేశప్రజలకు కమ్యూనిస్ట్ విప్లవ సిద్ధాంతాలను బోధించసాగినారు. యుద్ధంలో జర్మనీ సైన్యం ఓడిపోవడానికి యుద్ధానంతరం దేశం అస్థిరకాలైన దుస్థితిని ఎదుర్కోవడానికి కైజర్ కారణమని అతనిపట్ల ఆగ్రహాన్ని పెంచుకోవడంతో దేశంలో రాచరిక వ్యతిరేక ఉద్యమం చెలరేగింది. క్రీ.శ.1918 అక్టోబర్‌లో కీల్ నౌకా స్థావరంలో కార్మికులు ప్రభుత్వం మీద తిరుగుబాటు చేసినప్పుడు దేశవ్యాప్తంగా విప్లవం వచ్చింది. బవేరియాలోను, బెర్లిన్‌లోను, తిరుగుబాట్లు సమ్మెలు జరిగినాయి. క్రీ.శ. 1918 నవంబర్ 8న కైజర్ రెండోవిలియమ్ సింహాసనాన్ని త్యజించి కుటుంబ సమేతంగా దేశం విడిచి పెట్టిపోయి హాలెండ్‌లో ఆశ్రయం పొందాడు. అంతవరకు ఛాన్స్‌లర్‌గా పనిచేసిన ప్రిన్స్‌మాక్స్ (Prince Max) తన పదవీ బాధ్యతలను మెజారిటీ సోషలిస్ట్‌ల (Majority Socialists) నాయకుడైన హెర్ ఎబర్ట్‌కు అప్పగించినాడు. వీరినే సోషల్ డెమోక్రట్స్ అంటారు. జర్మనీని రిపబ్లిక్‌గా

ప్రకటించటం జరిగింది. ఎబర్ట్ అతని సహచరులు మార్క్సిజమ్‌లో నమ్మకమున్నవారు. స్పార్టకస్‌లు అనే జర్మన్ బోల్షివిక్‌లు దేశవ్యాప్తంగా సోవియట్‌లను నెలకొల్పి శ్రామిక వర్గ నియంతృత్వం స్థాపితమైనట్లుగా ప్రకటించినారు. దేశమంతటా అరాచక పరిస్థితులు ఏర్పడినాయి. ఆ పరిస్థితులలో సోషల్ డెమాక్రట్‌లు సైన్యం సహాయంతో దేశంలోని ధనిక వర్గం సహాయంతో స్పార్టకస్‌లను అణచి వేయడానికి ప్రయత్నించినారు. క్రీ.శ. 1919 జనవరిలో దేశవ్యాప్తంగా సమ్మెను నిర్వహించి బెర్లిన్‌లో కమ్యూనిస్ట్ విప్లవాన్ని సాధించడానికి స్పార్టకస్‌లు ప్రయత్నించినారు. అయితే కమ్యూనిస్ట్ తిరుగుబాటును రిపబ్లిక్ ప్రభుత్వము సైన్యం సహాయంతో అణచివేసింది. కార్ల్‌లిబ్‌నెక్, రోసలగ్జెంబర్గ్, అనే కమ్యూనిస్ట్ నాయకులను చంపినారు. కమ్యూనిస్ట్ విప్లవాన్ని అణచివేసిన సోషల్ డెమాక్రట్‌లు సైనిక నాయకుల సహాయంతో రిపబ్లిక్ నాయకత్వాన్ని స్వీకరించినారు.

సార్వత్రికమైన ఓటుహక్కు ప్రకారం జాతీయ ప్రతినిధుల సభ రాజ్యాంగాన్ని తయారు చేయడం కోసం వైమర్ చారిత్రాత్మక పట్టణంలో సమావేశమైంది. శాసనసభలో మెజారిటీ స్థానాలను గెలుచుకోలేక పోయిన సోషల్ డెమాక్రటిక్ పార్టీ, డెమాక్రాట్స్, సెంటర్ పార్టీ, మొదలైన ఇతరపార్టీల సహకారంతో ఫిలిప్‌షీడ్‌మన్ నాయకత్వంలో మిశ్రమ ప్రభుత్వాన్ని స్థాపించింది. మిత్రరాజ్యాలు తయారు చేసిన వర్సై సంధిమీద సంతకం చేయడం మిశ్రమ ప్రభుత్వం ప్రథమ కర్తవ్యమైంది. క్రీ.శ. 1920 జూలైలో ప్రాథమిక హక్కులు జనవాక్య సేకరణ ఇనీషియేటివ్ (Initiative) మొదలైన ప్రజాస్వామ్య లక్షణాలతో కూడిన నూతన రాజ్యాంగాన్ని శాసనసభ ఆమోదించింది. దీనినే వైమర్ రాజ్యాంగం అంటారు. ఈ రాజ్యాంగం ప్రకారం జర్మనీలో రాచరికం రద్దయి ప్రజాస్వామ్యం ఏర్పడింది. సోషల్ డెమాక్రట్ల నాయకుడైన హెర్‌ఎబర్ట్ వైమార్ రిపబ్లిక్ ప్రథమ అధ్యక్షుడుగా ఎన్నికైనాడు. వైమర్ రిపబ్లిక్ క్రీ.శ. 1920 నుంచి క్రీ.శ. 1933 వరకు కొనసాగింది. రిపబ్లిక్ తొలి సంవత్సరాలలో ప్రభుత్వం అనేక క్లిష్టసమస్యలను ఎదుర్కోవలసి వచ్చినది. అవమానకరమైన వర్సైసంధిని ఆమోదించిన ప్రభుత్వమనే ఆరోపణను వైమర్ రిపబ్లిక్ మీద చేసినారు. అంతేకాక జర్మనీని మిత్రరాజ్యాలు దోషులుగా పరిగణించినాయి. దేశములో అనేక భూభాగాలను వలసలను పోగొట్టుకోవడమేగాక జర్మనీ ఎక్కువ మొత్తంలో నష్టపరిహారాన్ని కూడా మిత్రరాజ్యాలకు చెల్లించవలసి వచ్చినది. రైన్ భూభాగం శత్రుసేనల ఆక్రమణలో ఉంది. పరిశ్రమలన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రజలు కనీ విని ఎరుగని అష్టకష్టాలను చవిచూడవలసి వచ్చినది. మొత్తం మీద జర్మనీ దుర్భరమైన దురదృష్టకరమైన పరిస్థితిలో ఉన్నది. ఈ విధంగా వైమర్ రిపబ్లిక్ లోగడ ఏ జర్మన్ ప్రభుత్వము ఎదుర్కొనని విపరీత పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చింది. దేశ ఆంతరంగిక పరిస్థితులను చక్కదిద్దటానికి ముందుగా తప్పనిసరియైన పరిస్థితులలో ప్రభుత్వం మిత్రరాజ్యాల ఆదేశాలను పాటించి నష్టపరిహార సమస్యను పరిష్కరించవలసి వచ్చింది.

**3.3.1 విదేశీయ వ్యవహారాలు :** విదేశీ వ్యవహారాల్లో వైమర్ రిపబ్లిక్ కొంత విజయాన్ని సాధించింది. క్రీ.శ. 1919 నుంచి క్రీ.శ.1923 వరకు జర్మనీ కొన్ని గడ్డు సమస్యలను ఎదుర్కొనవలసి వచ్చింది. జర్మనీ ఫ్రాన్స్‌ల మధ్య సంబంధాలు పూర్తిగా చెడిపోవడమేగాక ఫ్రెంచి సైన్యాలు జర్మన్ భూభాగంలోకి ప్రవేశించినాయి. రైన్ భూభాగంలో ఫ్రాన్స్ విభజనోద్యమాన్ని ప్రేరేపించినందువల్ల రెండు దేశాల మధ్య వైషమ్యాలు పెరిగినాయి. ఎగువ సైలీషియా తనకు పూర్తిగా రావలెనని జర్మనీ కోరింది. నిజానికి క్రీ.శ 1921 లో జరిగిన జనవాక్య సేకరణ ప్రకారం సైలీషియాను పూర్తిగా జర్మనీలో విలీనం చేయవలసింది. కానీ పోలెండ్ జర్మన్ కోరికను వ్యతిరేకించి సైలీషియా సమస్యను సమితి ముందుంచింది. సమితి ఎగువసైలీషియాలో మూడింట రెండువంతుల భాగాన్ని జర్మనీకిచ్చి ప్రధానమైన పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ఖనిజ సంపద ఉన్న భాగాన్ని పోలండ్‌కిచ్చింది. ఈ ఏర్పాటును జర్మన్‌లు హర్షించలేదు. ఈ కాలంలో జర్మన్ విదేశాంగ విధానంలో మరొక ముఖ్యమైన విషయము మనము ఇంతకు ముందు ప్రస్తావించిన నష్టపరిహార సమస్య.

**3.3.2 రష్యా జర్మనీల మధ్య సంబంధాలు :** 1922 లో జర్మనీ సోవియట్ రష్యాతో రాపెల్లో సంధి చేసికొన్నది. ఈ సంధి ప్రకారం రెండు దేశాలమధ్య సాధారణ దౌత్య సంబంధాలు నెలకొన్నాయి. రెండు దేశాలు పరస్పరం ఒకదేశం నుంచి మరొక దేశం ఆశించిన కోరికలను విడనాడి వాణిజ్య సంబంధాలను కూడా నెలకొల్పుకోవడానికి అంగీకరించినాయి. ఈ సంధి

ద్వారా జర్మనీ రష్యాలు తమ చుట్టూ ఉన్న విరోధ వలయాన్ని ఛేదించడానికి ప్రయత్నించినాయని చెప్పవచ్చు. ఈ సంధి జరిగిన తరువాత పశ్చిమ రాజ్యాలు ముఖ్యంగా ఫ్రాన్స్ విపరీతంగా ఆందోళనకు గురైంది.

**3.3.3 ఫ్రాన్స్ రూర్‌ను ఆక్రమించుకోవడం :** రష్యాతో రాపెల్లో సంధి చేసికొన్న జర్మనీ మీద పగతీర్చుకోవడానికి ఫ్రాన్స్ 1923లో జర్మనీకి చెందిన రూర్‌ను ఆక్రమించుకొన్నది. ఫ్రాన్స్ చేసిన రూర్ ఆక్రమణకు జర్మనీ విముఖత వెల్లడించింది. ఈ పరిస్థితులలో జర్మనీ ఫ్రాన్స్‌ల మధ్య రాజీని సాధించడానికి బ్రిటన్ ప్రయత్నించింది. ఫ్రాన్స్‌కు మిత్రరాజ్యమైనప్పటికి బ్రిటన్‌కు జర్మనీపట్ల సానుభూతి ఉంది. ఫ్రాన్స్‌లో ప్రభుత్వం మారినందువల్ల పరిస్థితులు జర్మనీకి అనుకూలంగా మారినాయి.

నూతన ఫ్రెంచి ప్రభుత్వము తన సైన్యాలను రూర్‌నుంచి ఉపసంహరించుకోవడానికి అంగీకరించింది. ఫ్రెంచి విదేశాంగమంత్రి బ్రీయాండ్ జర్మన్ విదేశాంగ మంత్రి స్ట్రెస్‌మన్ తమ రెండు దేశాలమధ్య సామరస్యాన్ని, సహకారాన్ని, వాంఛించినారు. తన ఏకాంతాన్ని ఛేదించుకోవడం ద్వారా జర్మనీ ప్రపంచ రాజకీయాలలో పోగొట్టుకొన్న ప్రతిష్ఠను తిరిగిపొందడం స్ట్రెస్‌మన్ ప్రధాన లక్ష్యము. ఈ లక్ష్యసాధనకోసం జర్మనీ ఫ్రాన్స్‌తో రాజీపడడం అత్యవసరమైంది.

**3.3.4 జర్మనీకి సమితిలో సభ్యత్వం :** క్రీ.శ. 1925 లో జర్మనీ బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, బెల్జియమ్‌లతో ఒడంబడికను చేసుకొన్నది. ఈ సంధి కారణముగా ఫ్రాన్స్ జర్మనీల మధ్య సంబంధాలు అభివృద్ధి చెందడమేకాక క్రీ.శ. 1926లో జర్మనీ సమితిలో సభ్యరాజ్యంగా కూడా చేరింది. ఫ్రాన్స్ తన భద్రతకు హామీ చేకూరినట్లు భావించి సంతృప్తి చెందింది. ఈ విధంగా 1926 నాటికి ప్రపంచములో సుస్థిర శాంతి స్థాపనకు అనువైన వాతావరణము ఏర్పడింది. 1927 నాటికి వివిధ జర్మన్ భూభాగాల నుంచి విదేశ సైన్యాలను ఉపసంహరించడం జరిగింది. మిత్రరాజ్యాల సైనిక కమీషన్ కూడా రద్దుచేయడం జరిగింది. 1928లో ఇతర యూరప్ రాజ్యాలతో సమాన స్థాయిలో జర్మనీ ప్యారీస్ ఒడంబడిక మీద సంతకం చేసింది. యంగ్ కమీషన్ సిఫారసులను అనుసరించి జర్మనీ మిత్రరాజ్యాలకు చెల్లించ వలసిన నష్టపరిహారం మొత్తాన్ని చాలావరకు తగ్గించి 58 సంవత్సరాలలో కట్టేటట్లు నిర్ణయించడం జరిగింది. ఆర్థికంగా జర్మనీ మీద విధించిన అన్నిరకాల అంతర్జాతీయ ఆంక్షలను రద్దుచేయడం జరిగింది. ఒక్క నిరాయుధీకరణ సమస్య మాత్రం అపరిష్కృతంగా ఉండిపోయింది. అయితే ఆయుధాలను కూర్చుకొనే హక్కు జర్మనీకి పరోక్షంగా ఇవ్వడం జరిగిందని చెప్పవచ్చు.

**3.3.5 వైమర్ రిపబ్లిక్ పతనానికి కారణాలు :** వర్సే సంధి : కఠినమైన షరతులతో కూడిన వర్సేసంధి వైమర్ రిపబ్లిక్ పతనానికి తద్వారా నాజీల విజయానికి తోడ్పడుతుందని చాలామంది విమర్శకుల అభిప్రాయము. వర్సే సంధిలోని అవమానకరమైన షరతులు జాతీయ భావమున్న జర్మన్‌లను గాయపరచటమేకాక మిత్రరాజ్యల పట్ల జర్మన్లకు పగసాధింపు ధోరణి ఏర్పడటానికి కూడా కారణమైనాయి. ఈ పరిస్థితులలో జర్మన్‌లు కోల్పోయిన ప్రతిష్ఠను తిరిగి సంపాదించడానికి ప్రయత్నించి హిట్లర్ జర్మన్ ప్రజల అభిమానాన్ని చురగొన్నాడు. వైమర్ రిపబ్లిక్‌ను రద్దుచేసి దానిస్థానే ప్రతిష్ఠమైన ప్రభుత్వాన్ని స్థాపించినప్పుడు మాత్రమే జర్మనీ అవమానం నుంచి విముక్తి పొందగలదని ప్రజలలో ప్రచారం చేసినాడు. కానీ వర్సేసంధి కారణముగా మాత్రమే హిట్లర్ విజయాన్ని పొందగల్గినాడని చెప్పడం పూర్తిగా సమంజసం కాదు. వర్సేసంధి జరిగిన 14 సం॥ల తరువాత మాత్రమే జర్మనీలో హిట్లర్ విజయాన్ని సాధించి అధికారంలోకి వచ్చినాడు. యుద్ధం ముగిసిన వెంటనే నాజీ విప్లవం జరుగలేదు. అంతేకాక జర్మనీ కోల్పోయిన ప్రతిష్ఠను సంపాదించుకొన్న తరువాత దాదాపు పది సంవత్సరాలకు గాని వైమర్ రిపబ్లిక్ పతనమైపోయి నాజీపార్టీ అధికారంలోకి రావడం జరుగలేదు. 1932 నాటికి జర్మన్ భూభాగాలనుంచి విదేశ సైన్యాలను ఉపసంహరించడమేకాక నష్టపరిహార సమస్యను కూడా పరిష్కరించడం జరిగింది. నిజానికి నాజీపార్టీ బలప్రయోగం చేసి వైమర్ రిపబ్లిక్‌ను అంతంచేసి అధికారాన్ని హస్తగతం చేసికొన్నది. కాబట్టి నాజీపార్టీ విజయానికి వర్సేసంధి కొంతవరకు మాత్రమే కారణమని చెప్పవచ్చు. వర్సేసంధిని సాకుగా తీసికొని నాజీలు తాము దేశభక్తులుగాను రిపబ్లికన్ ప్రభుత్వాన్ని దేశానికి వ్యతిరేకమైనవిగాను చిత్రించినారు.

**3.3.5.1 కమ్యూనిజం వ్యాప్తి చెందడం :** జర్మనీలో వైమర్ రిపబ్లిక్ పతనం కావడానికీ నాజీ విప్లవము విజయం చెందడానికి మరొక ముఖ్యకారణము దేశములో కమ్యూనిజం వ్యాప్తి చెందడం. 1930 లో జర్మన్ శాసనసభలో (Reichstag) కమ్యూనిస్ట్ సభ్యుల సంఖ్య 77. అయితే 1932 నాటికి శాసన సభలో కమ్యూనిస్టుల సంఖ్య కమ్యూనిస్టుల కంటే తక్కువ. ప్రభుత్వానికి ప్రధాన ప్రతిపక్షమైన కారణంగా చాలామంది జర్మన్‌లు కమ్యూనిస్టులను సమర్థించినారు. కాని నిజానికి జర్మన్ ప్రజలకు కమ్యూనిస్టుల పట్ల ద్వేషమెక్కువ. జర్మన్ ప్రజల మనోభావాలను అవగాహన చేసికొన్న నాజీలు జాతీయ సామ్యవాదపార్టీ (National Socialist Party) పతనం కమ్యూనిస్టుల వ్యాప్తికి తోడ్పడుతుందనే నినాదాన్ని ప్రచారము చేసినారు. కమ్యూనిస్ట్ సిద్ధాంతాల వ్యాప్తివల్ల భీతిచెందిన పారిశ్రామిక వేత్తలు ఇతరసంపన్న వర్గ ప్రజలు నాజీపార్టీకి ఇతోధిక సహాయం చేసినారు. మొత్తం మీద జర్మన్ ప్రజలలో అధిక సంఖ్యాకులకు జర్మనీని కమ్యూనిస్టుల భారినుండి నాజీలు మాత్రమే కాపాడగలరనే నమ్మకం కలిగింది. కాబట్టి నాజీపార్టీ విజయానికి వైమర్ రిపబ్లిక్ పతనానికి జర్మన్ ప్రజలకు గల కమ్యూనిస్ట్ భీతి ఒక ముఖ్యకారణమని చెప్పవచ్చు.

**3.3.5.2 ఆర్థిక సంక్షోభము :** మొదటి ప్రపంచ యుద్ధానంతరం జర్మనీలో ఏర్పడిన ఆర్థిక సంక్షోభాన్ని నాజీ పార్టీ స్వప్రయోజనాలకు ఉపయోగించుకొన్నది. వ్యవసాయం బాగా దెబ్బతిన్నందువల్ల వ్యవసాయ దారుల పరిస్థితి సోచనీయంగా ఉంది. ప్రభుత్వ సహాయాన్ని అందచేసి రైతుల పరిస్థితిని మెరుగు పరుస్తామని వాగ్దానం చేసి నాజీలు రైతువర్గంలో తమ పలుకు బడిని పెంచుకొన్నారు. పెద్దవ్యాపారస్తుల పోటీనుంచి చిన్న వ్యాపారస్తులను రక్షించి ప్రభుత్వ సహాయాన్ని అందజేసి వారి పరిస్థితిని మెరుగుపరుస్తామని నాజీలు ప్రచారం చేసినారు. నిరుద్యోగులైన జర్మన్ యువకులను నాజీ సిద్ధాంతాలు బాగా ఆకర్షించినాయి. అందుచేత వారు వైమర్ రిపబ్లిక్ పతనాన్ని వాంఛించినారు. దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి వెంటనే విముక్తి చేస్తామని ప్రజలందరికి కావలసిన అన్ని సౌకర్యాలను కలుగ జేస్తామని నిరుద్యోగులైన 5 మిలియన్‌ల జర్మన్‌లకు ఉద్యోగాలిప్పిస్తామని నాజీలు హామీ ఇచ్చినారు. జర్మనీ ప్రజలలో అధిక సంఖ్యాకులు నాజీ ప్రచారాన్ని పూర్తిగా నమ్మి వైమర్ రిపబ్లిక్‌ను పడగొట్టడంలో నాజీ పార్టీకి తమ మద్దతు నిచ్చినారు. అదృష్టవశాత్తు జర్మనీ ఆర్థిక సంక్షోభం నుంచి విముక్తి చెందుతున్న తరుణంలోనాజీ పార్టీ అధికారంలోని వచ్చింది.

**3.3.5.3. యూదు వ్యతిరేక ప్రచారము:** జర్మనీలో వైమర్ రిపబ్లిక్ అంతమై నాజీ విప్లవము విజయం పొందటానికి మరొక ముఖ్య కారణము యూదులకు వ్యతిరేకంగా (Anti-Senitic) నాజీలు చేసిన విరామము లేని ప్రచారము జర్మన్‌లు యూదులను విదేశస్తులుగా భావించి ద్వేషించేవారు. జర్మనీలో యూదులు సంపన్న వర్గానికి చెందినవారు. జర్మనీ ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితులకు ముఖ్యంగా ఆర్థిక దుస్థితికి యూదులు కారణమనే ప్రచారాన్ని కొనసాగించి నాజీలు జర్మనీ ప్రజలకు యూదుల పట్ల ద్వేషాన్ని పెంపొందించినారు. ఈ విధంగా యూదు వ్యతిరేక ప్రచారం చేసి ప్రజలలో పలుకుబడి సంపాదించుకొని నాజీలు వైమర్ రిపబ్లిక్‌ను అంతం చేసినారు.

**3.3.5.4. ఇతర కారణాలు :** జర్మనీలో ప్రజాస్వామ్య మెప్పుడూ ప్రజల మన్ననలను చూరగొనలేదు. జర్మనీలు తమ జాతి చరిత్రలో ఎప్పుడూ ప్రజా ప్రభుత్వాన్ని ఆచరణలో పెట్టలేదు. అందువల్ల వైమర్ రిపబ్లిక్‌ను పతనం చేసి నాజీ పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు జర్మన్‌లు ప్రజా ప్రభుత్వాన్ని కోల్పోయినట్లు ఏమాత్రం బాధపడలేదు. యుద్ధం చేసి పెద్ద సామ్రాజ్యాన్ని నిర్మించడంలో నమ్మకమున్న జర్మన్‌లలోనాజీ పార్టీ సైనిక తత్వాన్ని పునరుద్ధరించింది. అంతేకాక నాజీ పార్టీని వ్యతిరేకించే ప్రతిపక్షాల మధ్య ఐకమత్యం కూడా లేదు. ప్రజలను తన సిద్ధాంతాల వైపుకు ఆకర్షించటానికి హిట్లర్ అనేక చిత్రమైన పద్ధతులను అనుసరించినాడు. గోధుమ రంగు చొక్కాల దళాన్ని (Brown Shirts) తయారు చేసి ప్రజలలో హిట్లర్ సైనిక తత్వాన్ని పెంపొందించినాడు. వారి సహాయంతో తన ప్రత్యర్థులను అణచివేసినాడు.

నాజీ పార్టీ చిహ్నంగా ప్రజాదరణ పొందిన స్వస్తిక్ (Swastika) ను ప్రవేశ పెట్టినాడు. జర్మన్ జాతి గొప్పదనే నాజీ సిద్ధాంతము జర్మన్ ప్రజలను ముగ్ధులను చేసింది. అటువంటి అసత్య ప్రచారాల ద్వారా నాజీలు ప్రజలలో తమ పలుకుబడిని పెంపొందించుకొన్నారు.

## (2) అంతర్జాతీయ భద్రతకు ఫ్రాన్స్ అన్వేషణ :

**3.2.1 పరిచయం :** 1918 లో మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత అంతర్జాతీయ పరిస్థితులు సుస్థిర శాంతి స్థాపనకు అనుకూలంగా ఉన్నాయి. యుద్ధాలను నివారించి అంతర్జాతీయ శాంతిని నెలకొల్పవలెనని సదుద్దేశంతో ప్రపంచ నాయకులు పారిస్ శాంతి సంధులను రూపొందించినారు. రాజ్యాల మధ్య సహకారమూ, సదవగాహనా అభివృద్ధి చెంది అంతర్జాతీయ శాంతి భద్రతలు నెలకొని, ఒక నూతన శకం ప్రారంభమవుతుందనే ఆశ ప్రపంచ ప్రజలందరిలోనూ అంకురించింది. యుద్ధాలను నివారించడానికి, అంతర్జాతీయ వివాదాలను శాంతియుతంగా పరిష్కరించడానికి, దురాక్రమణను సమిష్టిగా ఎదుర్కోడానికి నానాజాతి సమితి అనే అంతర్జాతీయ సంస్థను నెలకొల్పడం జరిగింది. ప్రపంచ శాంతి భద్రతలను పరిరక్షిస్తూ మానవజాతి శ్రేయాభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవడం నానాజాతి సమితి ప్రధానోద్దేశము. అంతేకాక సమితికి ఒడంబడిక పత్రంలో తుల్య ప్రాభల్యము అనే సిద్ధాంతం ప్రాముఖ్యం తగ్గి సమిష్టి అంతర్జాతీయ సహకారము అనే సిద్ధాంతానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వడమైంది. నానాజాతి సమితి వంటి ప్రపంచ సంస్థ అవసరాన్ని ఉపయోగాన్ని ప్రపంచ దేశాలన్నీ గుర్తించడమేకాక సమిష్టిగా అంతర్జాతీయ భద్రతను కాపాడవలసిన అవసరాన్ని కూడా గుర్తించినాయి.

పారిస్ శాంతి సమావేశము ఎదుర్కొన్న సమస్యలు చాలా వరకు 1924 నాటికి పరిష్కారమైనాయి. యూరప్ రాజ్యాల, సమీప ప్రాచ్యం పునర్వ్యవస్థీకరణ దాదాపుగా పూర్తి అయింది. క్లిష్టమైన నష్టపరిహార సమస్య తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగింది. 1917 లో రష్యా లో జరిగిన కమ్యూనిస్ట్ విప్లవం ఫలితంగా పశ్చిమ దేశాలకు రష్యాకు మధ్య ఉన్న సంబంధాలు దెబ్బతిన్నాయి. అయితే 1924 నాటికి రష్యాలో ఏర్పడిన నూతన ప్రభుత్వాన్ని పశ్చిమ రాజ్యాలు గుర్తించడం ప్రారంభమైంది. ఈ విధంగా అంతర్జాతీయ పరిస్థితులు శాంతి భద్రతల స్థాపనకు అనుకూలంగా ఉన్నాయి.

**3.2.2 ఫ్రాన్స్ భద్రత సమస్య :** ప్రపంచ యుద్ధము ఇంకా పూర్తిగా ముగియక ముందే భవిష్యత్తులో జర్మనీ దురాక్రమణ బారినుంచి తన రక్షణకు హామీ కోసం ఫ్రాన్స్ అన్వేషించడం ప్రారంభించింది. యుద్ధం ముగిసిన తరువాత యూరప్ దేశాలన్నింటిలో ఫ్రాన్స్ భద్రతా సమస్యకు ఎక్కువ ప్రాధాన్యము ఇచ్చింది. మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత కూడా భవిష్యత్తులో జర్మన్ దురాక్రమణ బారినుంచి తమ దేశ భద్రతకై హామీ కోసం ఈ కింది కారణాల వల్ల ఫ్రెంచి నాయకులు అన్వేషించడం ప్రారంభించినారు. 1870-1871 లలో జరిగిన ఫ్రాంకో - జర్మన్ యుద్ధ కాలంలో జర్మన్ చేతులలో తమ ఓటమిని 1914-1918 లలో జరిగిన మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో జర్మనీ చేసిన దురాక్రమణను ఫ్రాన్స్ దేశ నాయకులు, ప్రజలు మరచిపోలేదు. ప్రపంచమంతా ఏకమైనందు వల్లనే జర్మన్ దురాక్రమణ నుంచి తాను రక్షించబడినాననే విషయాన్ని కూడా ఫ్రాన్స్ మరవలేదు. మొదటి ప్రపంచ యుద్ధంలో పూర్తిగా ఓడిపోయినప్పటికీ భవిష్యత్తులో జర్మనీ తిరిగి తమ దేశంమీద దురాక్రమణ చేస్తుందనే భయము ఫ్రెంచి నాయకులకు, ప్రజలకు కూడా ఎక్కువగా ఉంది. ఫ్రాన్స్‌లో అనేక రాజకీయ పార్టీలున్నప్పటికీ, రాజకీయ సుస్థిరత లేకపోయినప్పటికీ తమ దేశ భద్రతకు హామీ లభించవలెననే విషయంలో మాత్రం ఫ్రెంచి ప్రజలంతా ఏకాభిప్రాయంతో ఉన్నారు. యుద్ధంలో ఓడిపోయినా ప్రజా బలము, సహజసంపద, పారిశ్రామికాభివృద్ధి, సైనిక బలము, మొదలైన విషయాలలో జర్మనీ ఫ్రాన్స్‌కంటే పైచేయిగా ఉంది. రష్యాలో కమ్యూనిస్టు విప్లవం జరగడం, అమెరికా నానాజాతి సమితిలో సభ్యరాజ్యంగా చేరకపోవడం, జర్మన్‌పట్ల ఇంగ్లాండ్ సానుభూతితో వ్యవహరించడం, ఇటలీ, జపాన్‌లు దురాక్రమణ విధానం అనుసరించడం

వంటి యుద్ధానంతర పరిణామాల వల్ల భవిష్యత్తులో జర్మన్ దురాక్రమణ బారినుంచి తమదేశ భద్రతపట్ల ఫ్రెంచి ప్రజలకు భయాందోళనలు ఎక్కువైనాయి. పాయింకెర్, హెరియట్, బ్రేయాండ్ మొదలైన ఫ్రెంచినాయకుల మధ్య ఆంతరంగిక వ్యవహారం విషయాలలో భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ, దేశ భద్రత విషయంలో మాత్రం ఒకే విధమైన భయాందోళనలు ఉన్నాయి. ఇ.హెచ్.కార్ చెప్పినట్లు మొదటి ప్రపంచ యుద్ధానంతరం యూరప్ రాజకీయాలలో ఫ్రాన్స్ భద్రతకు అన్వేషించడం ఒక ముఖ్యమైన విషయమని చెప్పవచ్చు. యుద్ధానంతర సమస్యలలో అతి ప్రధానమైన సమస్య ఫ్రాన్స్ భద్రత సమస్య అని కూడా చెప్పవచ్చు.

**3.3.3 ఇంగ్లాండ్, అమెరికాలు ఫ్రాన్స్‌తో సంధులు చేసుకోవడం :** స్వదేశ భద్రతకు హామీగా తమ దేశ భూభాగం రైన్‌నది వరకు విస్తరింప చేసుకోవడానికి మిత్రరాజ్యాలు అంగీకరించవలెనని పారిస్ శాంతి సమావేశంలో ఫ్రెంచి నాయకులు కోరినారు. అయితే మిత్ర రాజ్యాలు అందుకు అంగీకరించకుండా 15 సంవత్సరాల కాలం వరకు రైన్ నది ఎడమవైపు ప్రదేశము ఫ్రెంచి ఆక్రమణలో ఉండటానికి సమ్మతించినాయి. అంతేకాక భవిష్యత్తులో జర్మనీ దురాక్రమణ జరిపినట్లయితే తమ పూర్తి సహాయాన్ని అందచేస్తామని ఇంగ్లాండ్, అమెరికాలు ధ్రువపరచకపోవడంవల్ల ఇంగ్లాండ్ - అమెరికాలు సంయుక్తంగా ఫ్రాన్స్‌కు ఇచ్చిన హామికి విలువ లేకుండాపోయింది. అందువల్ల 1921 లో ఫ్రాన్స్ పోలండ్‌లలో భద్రతకు సంబంధించిన ఒక ఒడంబడికను చేసుకొన్నది. పారిస్ శాంతి సంధులలోని షరతులను పరీక్షించవలెననే కోరిక ఉన్న ఫ్రాన్స్ పోలండ్‌ల స్వప్రయోజనాలు ఒకే మాదిరిగా ఉండటం వల్ల రెండు దేశాల మధ్య ఈ రక్షణ ఒడంబడిక జరిగింది. అయినప్పటికీ ఫ్రాన్స్‌కు భయం తగ్గలేదు. తన భద్రతకు ఇంగ్లాండ్ హామీని మళ్ళీ ఫ్రాన్స్ కోరింది. 1922 లో ఫ్రెంచి భద్రతకు ఇంగ్లాండ్ హామీ ఇచ్చింది. కాని ఫ్రాన్స్ ఇంగ్లాండ్‌ను సైనిక సహాయాన్ని కోరింది. అయితే సైనిక సహాయం విషయమై వాగ్దానం చేయడానికి ఇంగ్లాండ్ నిరాకరించింది. అందువల్ల ఫ్రాన్స్‌కు సంతృప్తి కలగలేదు, భయం తగ్గలేదు.

**3.3.4 ఫ్రాన్స్ రూర్‌ను ఆక్రమించుకోవడం :** జర్మనీ నుంచి నష్టపరిహారం వసూలు చేసుకోవడానికీ, జర్మన్ పారిశ్రామిక బలాన్ని ధ్వంసం చేయడానికీ ఫ్రాన్స్ 1922 లో జర్మన్ పారిశ్రామిక కేంద్రమైన రూర్‌ను ఆక్రమించుకొన్నది. అయితే రూర్ ఆక్రమణకు ఫ్రాన్స్ అధిక వ్యయం చేయవలసి వచ్చింది. దీనిని జర్మన్‌లు స్వాభావికంగా ప్రతిఘటించినారు. ఫ్రాన్స్ చేసిన పనిని ఇంగ్లాండ్ హర్షించలేదు. మొత్తం మీద ఫ్రాన్స్ రూర్‌ను ఆక్రమించుకోవడంవల్ల ఏ విధమైన లాభము పొందలేకపోయింది.

**3.3.5 సమితి ద్వారా భద్రతకై ఫ్రాన్స్ ప్రయత్నం చేయడం :** ఈ పరిస్థితిలో శాంతిసంధులలో చేసిన ఏర్పాట్లన్ని ఏ విధమైన మార్పులు చేయకుండా యధాతధంగా అమలు కావలెనని ఫ్రాన్స్ ఒక ప్రతిపాదనను చేసింది. సమితిద్వారా నిరాయుధీకరణ జరగవలెనని కూడా ఫ్రాన్స్ ప్రతిపాదించింది. అంతే కాక సమితి ద్వారా సమిష్టి భద్రతను అమలుపరచవలెనని మరొక ప్రతిపాదనను ఫ్రాన్స్ చేసింది. సమితి ఒడంబడికలోని 10వ, 16వ ప్రకరణాల సమిష్టి భద్రతకు సంబంధించినవి. పదో ప్రకరణం ప్రకారం సమితి సభ్యరాజ్యాలన్నీ వివిధ దేశాల ప్రాదేశిక సమగ్రతను, స్వాతంత్ర్యాన్ని, భద్రతను పరిరక్షించవలె. దురాక్రమణకు గురి అయిన సభ్యరాజ్యానికి సమితి సభ్యరాజ్యాలన్నీ సహాయం చేయవలె పదహారో ప్రకరణం ప్రకారం దురాక్రమణ జరిపిన రాజ్యాలతో సభ్యరాజ్యాలు ఆర్థిక, వర్తక, సాంస్కృతిక సంబంధాలు తెంచి వేసుకొన్నది. దురాక్రమణకు గురి అయిన రాజ్యానికి సైనిక సహాయం అందజేయవలె. కాని జేనీవాలో జరిగిన సమితి సాధారణ సమావేశంలో సమితి ఒడంబడికలోని 10వ, 16వ ప్రకరణాలకు సవరణలు చేయడం జరిగింది. ఈ సవరణల ప్రకారం దురాక్రమణ జరిపిన దేశాలమీద ప్రతి సభ్య రాజ్యము ఏ విధమైన చర్యలు తీసుకోవలెనో తనంతట తాను స్వేచ్ఛగా నిర్ణయించుకోవచ్చు. సమితి ఒడంబడికలోని సమిష్టి భద్రతా విధానం మీద ఫ్రాన్స్ ఆధారపడటం తగ్గింది. అందులేకాక ఫ్రాన్స్ సమితి యొక్క సమిష్టి భద్రత విధానాన్ని పటిష్టం చేయవలెననే నిశ్చయానికి వచ్చింది. ఆ ప్రయత్నం విఫలమైన తరువాత యుద్ధానికి పూర్వం దేశాలు అనుసరించిన మైత్రికి సంబంధించిన పద్ధతి మీద ఫ్రాన్స్ ఆధారపడటం

జరిగింది. కాబట్టి సమితిద్వారా అంతర్జాతీయ సమిష్టి భద్రతా పరిరక్షణకు, సమితి ప్రమేయం లేకుండా ప్రాంతీయ ఒడంబడికల ద్వారా ఫ్రాన్స్ ఏకకాలంలోనే అనేక ప్రయత్నాలు చేసింది.

**3.5.1 పరస్పర సంధి ముసాయిదా 1923 :** ఫ్రెంచి ప్రయత్నాల ఫలితంగా 1923 లో పరస్పర సహాయక సంధి ముసాయిదాను తయారు చేయడం జరిగింది. సమితి పటిష్టం చేయడానికి చేసిన మొదటి ముఖ్యమైన ప్రయత్నంగా ఈ సంధి ముసాయిదాను భావించవచ్చు. ఈ సంధి ముసాయిదా దురాక్రమణతో కూడుకున్న యుద్ధాన్ని అంతర్జాతీయ నేరంగా ప్రకటించింది. ఏదైనా ఒకరాజ్యం దురాక్రమణ జరిపిన నాలుగు రోజులలో సమితి మండలి దురాక్రమణ చేసిన రాజ్యాన్ని పేర్కొని, దానిమీద కొన్ని ఆంక్షలు విధించవలె. సమితి సభ్యరాజ్యాలు దురాక్రమణకు గురి అయిన రాజ్యానికి ఆర్థిక సహాయం చేయవలె. అయితే యుద్ధం జరుగుతున్న ప్రాంతానికి దూరంగా ఉన్న సభ్యరాజ్యాలు మాత్రం దురాక్రమణకు గురి అయిన రాజ్యానికి సైనిక సహాయం చేయనక్కరలేదు.

పరస్పర సహాయక సంధి ముసాయిదా 18 దేశాల ఆమోదాన్ని మాత్రమే పొందగలిగింది. అంతర్జాతీయ భద్రతకై అన్వేషిస్తున్న ఫ్రాన్స్, ఫ్రాన్స్ మిత్రరాజ్యాలు ఈ సంధి ముసాయిదాను బలపరిచినాయి. అయితే ఇంగ్లాండ్ ఈ సంధిని వ్యతిరేకించింది. అమెరికన్ రష్యాలు కూడా ఈ సంధిని ఆమోదించలేదు. అందువల్ల సమితిని పటిష్టం చేయడానికి చేసిన మొదటి ప్రయత్నము ఈ విధంగా విఫలమైంది.

**3.5.2 జనీవా సంధి ముసాయిదా 1924 :** 1924 నాటికి ఫ్రాన్స్ చేసిన రూర్ ఆక్రమణ పూర్తిగా విఫలమైనట్లు తేటతెల్లమయ్యింది. అయితే 1924 నాటికి భద్రతకు సంబంధించిన శాశ్వతమైన ఏర్పాట్లు చేయడానికి అనువైన అంతర్జాతీయ వాతావరణము ఏర్పడింది. ఫ్రాన్స్ విదేశాంగ మంత్రిగా యథాతథ స్థితివాది, జర్మన్ విరోధి అయిన పోయింకార్ స్థానే ఉదారస్వభావుడైన హెరియట్‌ను నియమించడం జరిగింది. ఇంగ్లాండ్‌లో మాక్‌డొనాల్డ్ నాయకత్వంలో లేబర్ పార్టీ అధికారంలోకి వచ్చింది. నష్టపరిహార సమస్యకూడా చాలావరకు డాస్ ప్రణాళిక ద్వారా పరిష్కారమైంది. ఈ విధంగా భద్రత పరిరక్షణకు నూతన ప్రయత్నాలు చేయడానికే అనువైన అంతర్జాతీయ వాతావరణము ఏర్పడింది. జెనీవా సమావేశంలో గ్రీస్, చెకోస్లోవేకియా దేశాల ప్రతినిధులు జెనీవా సంధి ముసాయిదాను తయారుచేసినారు. ఈ జెనీవాసంధి ముసాయిదాను సమితి సభ్యరాజ్యాల ఆమోదానికి పంపింది.

జెనీవా సంధి ముసాయిదాలో ఈ క్రింది నిబంధనలున్నాయి.

1. ప్రాంతీయ భద్రతా పరిరక్షణకు బదులుగా ప్రపంచ భద్రతా పరిరక్షణకు అన్ని విధాలైన ప్రయత్నాలు జరుగవలె.
2. ఈ సంధి ముసాయిదాను మండలిలోని మెజారిటి సభ్యులు ధ్రువపరచినట్లయితే రాజ్యాల మధ్య ఆయుధాల పోటీని నివారించడానికి ఒక అంతర్జాతీయ న్యాయస్థానానికి నివేదించవలె.
3. అంతర్జాతీయ వివాదాలన్నింటిని తప్పని సరిగా మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించవలె. న్యాయ సంబంధమైన వివాదాలు అంతర్జాతీయ న్యాయస్థానానికి నివేదించవలె.
4. రాజకీయ వివాదాలను సమితి మండలికి నివేదించవలె.
5. వివిధ రాజ్యాల అంతరంగిక వివాదాలను సమితి మండలి పరిశీలించవలె.
6. వివాదాల పరిష్కారానికి మధ్యవర్తులు చేసిన నిర్ణయాలను అంగీకరించని రాజ్యాన్ని దురాక్రమణ జరిపిన రాజ్యంగం ప్రకటించవలె. దురాక్రమణ జరిపిన రాజ్యాలమీద ఆర్థిక, సైనిక ఆంక్షలను సమితి మండలి మాత్రమే విధించవలె.
7. దురాక్రమణ విధానాన్ని అనుసరించి యుద్ధాన్ని సృష్టించిన దేశం మీద నష్టపరిహారం విధించవలె.

4)

జెనీవా సంధి ముసాయిదాను చిన్నరాజ్యాలు బలపరిచాయి. కాని అగ్రరాజ్యాలు తిరస్కరించాయి. ఇంగ్లాండ్, ఇంగ్లాండ్‌కు చెందిన వలసలు ఈ సంధిని తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ సంధి ముసాయిదా తయారైన కొద్ది రోజుల తరువాత ఇంగ్లాండ్‌లో లేబర్ ప్రభుత్వం స్థానే కన్సర్వేటివ్ ప్రభుత్వము ఏర్పడింది. నూతన బ్రిటిష్ ప్రభుత్వము సంధిని పూర్తిగా ప్రతిఘటించింది. సభ్యరాజ్యాల ఆంతరంగిక వివాదాలను సమితి పరిశీలించవలెననే ఈ సంధిలోని నిబంధనను బ్రిటిష్ అధీన దేశ రాజ్యాలు వ్యతిరేకించాయి. అమెరికా అనుసరిస్తున్న తటస్థ విధానాన్ని ఈ రాజ్యాలు కూడా అనుసరించి యూరప్ రాజకీయాలకు దూరంగా ఉండటానికి నిర్ణయించుకొన్నాయి. అంతర్జాతీయ వివాదం పరిష్కారానికి తప్పనిసరిగా సభ్యరాజ్యాలు మధ్యవర్తిత్వాన్ని అంగీకరించవలెననే సంధిలోని నిబంధన చాలా రాజ్యాలకు ఆమోదయోగ్యంగా లేదు. దురాక్రమణకు గురిఅయిన రాజ్యానికి సభ్యరాజ్యాలు సైనిక సహాయం చేయవలెననే సంధిలోని నిబంధనను ఇంగ్లాండ్ పూర్తిగా వ్యతిరేకించింది. దురాక్రమణకు గురి అయిన రాజ్యానికి తప్పనిసరిగా వివిధ సభ్యరాజ్యాలు సైనిక సహాయం చేయవలెననే నిబంధన ఈ సంధిలో లేకపోవడం వల్ల ఫ్రాన్స్ అసంతృప్తి చెందింది. మొత్తం మీద జెనీవా సంధి ముసాయిదాను తిరస్కరించడం జరిగింది.

జెనీవా సంధి ముసాయిదాను తిరస్కరించినప్పటికీ దానిలో కొన్ని హర్షించదగిన విషయాలున్నాయి. అంతర్జాతీయ భద్రతను సుస్థిరంగా స్థాపించడానికి సూచించబడిన ఒక ముఖ్యమైన పథకంగా ఈ సంధిని పేర్కొనవచ్చు. ఈ సంధి ప్రకారం 1) రాజ్యాలమధ్య యుద్ధం నిషేధించడం జరిగింది. 2) అన్నిరకాల వివాదాలను పరిష్కరించడానికి మధ్యవర్తిత్వం నిర్బంధం చేయడం జరిగింది. మధ్యవర్తుల నిర్ణయాలను రాజ్యాలు తప్పక అంగీకరించవలె. 3) మొట్టమొదటి సారిగా యుద్ధము న్యాయ విరుద్ధమని ప్రకటించడం జరిగింది. 4) ఈ సంధి ముసాయిదా సమితి ఒడంబడికలోని కొన్ని లోపాలను తొలగించడానికి ప్రయత్నించింది. అంతర్జాతీయ వివాదం పరిష్కారానికి సమితి ఒడంబడికలో కొన్ని నిబంధనలు ఉన్నాయి. కాని సమితి మండలిలో అంతర్జాతీయ వివాదాల పరిష్కార విషయంలో భేదాభిప్రాయాలు వచ్చినప్పుడు అవలంభించవలసిన పద్ధతుల ప్రస్తావన సమితి ఒడంబడికలో లేదు. అటువంటి పరిస్థితులలో మధ్యవర్తిత్వ సిద్ధాంతాన్ని అనుసరించవలెనని జెనీవాసంధి నిర్ణయించింది. అంతేకాక మధ్యవర్తుల తీర్పును వివాదాలతో సంబంధమున్న పక్షాన తప్పనిసరిగా అంగీకరించవలెనని కూడా ఈ సంధి ముసాయిదా నిర్ణయించింది. 5) సభ్యరాజ్యాలలో ఆంతరంగికమైన క్లిష్ట పరిస్థితులేర్పడినప్పుడు సమితి మండలి జోక్యం కలుగజేసుకోవడానికి అధికారం లేదు. అట్లాంటి పరిస్థితులలో సమితి మండలి మధ్యవర్తిత్వాన్ని తిరస్కరించిన రాజ్యం దురాక్రమణ జరిపినట్లుగా పరిగణించవలెనని గూడా ఈ సంధి ముసాయిదా నిర్ణయించింది. 6) దురాక్రమణ జరిపిన రాజ్యాలమీద సకాలంలో సరి అయిన చర్యలు తీసుకోవడానికి సమితి మండలికి అన్ని వేళలా వీలుకాదు. అట్లాంటి పరిస్థితులలో యుద్ధ విరమణ జరగవలెనని జెనీవా సంధి ముసాయిదా నిర్ణయించింది. 7) అంతర్జాతీయ శాంతి భద్రతల స్థాపనకోసం నిరాయుధీకరణను సాధించడానికి ఒక నిరాయుధీకరణ సమావేశాన్ని సమావేశ పరచవలెనని కూడా జెనీవా సంధి ముసాయిదాలో ఉంది.

మొత్తం మీద జెనీవా సంధి ముసాయిదా సమితి ఒడంబడిక పత్రంలోని అనేక లోపాలను తొలగించడానికి ప్రయత్నించింది. అంతేకాక సమితి మండలిని పటిష్టం చేయడానికి ఈ సంధి ముసాయిదా మొదట మనఃపూర్వకమైన ప్రయత్నం చేసిందని చెప్పవచ్చు.

**3.5.3 లొకర్నో ఒడంబడికలు 1925 :** జెనీవా సంధి ముసాయిదాను తిరస్కరించినప్పటికీ అంతర్జాతీయ శాంతి భద్రతల పరిరక్షణకు ఏదో ఒక రూపంలో హామీ ఉండవలెననే విషయం మాత్రం తేటతెల్లమయింది. యూరప్ ఖండమంతటిలోను సమిష్టి భద్రతను సాధించడం కష్టమని కూడా తేలిపోయింది. అందువల్ల ప్రాంతీయ భద్రత ఒడంబడికలనే పాత పద్ధతిని పునరుద్ధరించడం జరిగింది. కాని ప్రాంతీయ ఒడంబడికల ఫలితంగా వైరుధ్యంతో కూడిన అనేక ఒడంబడికలు జరిగే ప్రమాదముంది. అయితే ఒక ప్రాంతంలోని రాజ్యాలు పరస్పర రక్షణ ఒడంబడికలు చేసుకొన్నప్పుడు మాత్రమే ప్రాంతీయ భద్రతను పరిరక్షించడం

జరుగుతుందని చాలామంది రాజకీయవేత్తలు అభిప్రాయ పడసాగిరి. 1925 లో జర్మనీ ప్రాంతీయ భద్రతా ఒడంబడికల ప్రతిపాదనను చేసింది. కాని జర్మనీ ఈ ప్రతిపాదనను కొత్తగా చేయలేదు. జర్మని ఫ్రాన్స్ రాజ్యాల మధ్య రైన్ సరిహద్దు రక్షణకు ఒక ఒడంబడిక జరుగవలెనని 1922 లోనే జర్మనీ ప్రతిపాదించింది. అంతేకాక రైన్ భూభాగంలో సంబంధమున్న దేశాలన్నింటితోను జర్మనీ, ఫ్రాన్స్‌లు పరస్పర రక్షణ ఒడంబడికలు చేసుకోవలెనని కూడా జర్మనీ ప్రతిపాదించింది. ప్రాంతీయ భద్రతకు సంబంధించిన ఒడంబడికల ప్రతిపాదనేకాక నిర్యుద్ధ ఒడంబడిక ప్రతిపాదన కూడా జర్మన్ చాన్స్‌లర్ హెర్‌స్ట్రెస్‌మన్ తిరిగి 1923 డిసెంబర్‌లో చేసినాడు. రైన్ భూభాగాన్ని ఆక్రమించుకొనే ఉద్దేశమున్న ఫ్రాన్స్, జర్మన్ ప్రతిపాదనలను ప్రతిసారి తిరస్కరించింది. అయితే 1924 నాటికి యూరప్‌లో పరిస్థితులు చాలా వరకు మారినాయి. ఫ్రాన్స్ చేసిన రూర్ ఆక్రమణ వల్ల జర్మనీ ఫ్రాన్స్‌లు గుణపాఠం నేర్చుకొన్నాయి. జర్మనీని రష్యా ప్రభావానికి లోనుకాకుండా నివారించవలెననే అభిప్రాయము యూరప్ దేశాలన్నింటిలోను ముఖ్యంగా ఇంగ్లాండ్‌లో ఏర్పడింది. పారిస్ శాంతి సమావేశం తరువాత జర్మనీ రష్యాలపట్ల పశ్చిమ రాజ్యాలు విరోధ భావంతో కూడిన విధానాన్ని అనుసరిస్తున్నాయి. అందువల్ల పరస్పర రక్షణకోసం జర్మనీ రష్యాలు 1922లో రపెల్లో సంధిని చేసుకొన్నాయి. అప్పటినుంచి జర్మనీ మీద రష్యా పలుకుబడి ప్రభావాలు ఎక్కువైనాయి. రష్యా ప్రభావం నుంచి జర్మనీని విడదీయడానికి సమయంకోసం ఇంగ్లాండ్ ఆసక్తితో ఎదురు చూడసాగింది.

ఫిబ్రవరి 1925 లో జర్మనీ ప్రాంతీయ భద్రతా ఒడంబడిక ప్రతిపాదనను ఇంగ్లాండ్ ఫ్రాన్స్‌ల ముందు ఉంచింది. అంతేకాక రైన్ భూభాగంలో సంబంధమున్న వివిధ దేశాలతో పరస్పర రక్షణ ఒడంబడికలు చేసుకోవడానికి కూడా జర్మనీ ఆసక్తిని చూపింది. ఇంగ్లాండ్ ఫ్రాన్స్‌లు ఈ ప్రతిపాదనను పరిశీలిస్తున్న సమయంలో ఆల్సేస్ - లొరేయిన్ ల మీద తన హక్కును వదులుకోవడానికీ లేక అనేక ప్రాంతీయ రక్షణ ఒడంబడికను చేసుకోవడానికి కూడా తాను సిద్ధమేనని జర్మనీ మరోక ప్రతిపాదనను చేసింది. తూర్పు, పశ్చిమ సరిహద్దుల భద్రతకు సమిష్టి హామీకోసం ఫ్రాన్స్ ప్రయత్నం చేసింది. కాని తూర్పు సరిహద్దు భద్రత హామీ విషయంలో ఇంగ్లాండ్ ఆసక్తిని చూపెట్టలేదు. అందువల్ల గత్యంతరం లేక పశ్చిమ సరిహద్దు భద్రతకు ఇచ్చిన హామీని ఫ్రాన్స్ అంగీకరించింది. అయితే భేషరతుగా జర్మనీ సమితితో సభ్యరాజ్యంగా చేరవలెనని ఫ్రాన్స్ కోరింది. ప్రాంతీయ భద్రతా ఒడంబడికల మీద సంతకాలు చేయడంతో బాటు భేషరతుగా సమితిలో సభ్యరాజ్యాంగా చేరితే రష్యాతో మైత్రి సంధిని చేసుకొన్న తాను క్లిష్టపరిస్థితులను ఎదుర్కొనవలసి వస్తుందని జర్మనీ భయాన్ని వెలిబుచ్చింది. భవిష్యత్తులో సమితి రష్యామీద సైనిక ఆంక్షలు విధిస్తే సభ్యరాజ్యాంగా తాను పాల్గొనవలసి వస్తుందని జర్మనీ వాదించింది. అట్లాంటి పరిస్థితులలో రష్యాతో మైత్రిసంధిని చేసుకొన్న తాను క్లిష్టపరిస్థితిలో పడవలసి వస్తుందని కూడా జర్మనీ వాదించింది. నిరాయుధీకరణ జరిగిన జర్మనీ సమితి సైనిక ఆంక్షలలో పాల్గొనవలసిన అవసరం లేదని పశ్చిమ రాజ్యాలు జర్మనీకి వ్రాతపూర్వకంగా తెలియజేసినాయి. అయినప్పటికీ లోకర్నొ ఒడంబడికను రష్యా అనుమానించి ద్వేషించింది.

వివిధ రాజ్యాల ప్రతినిధులు స్విట్జర్లాండ్‌లోని లొకర్నోలో 1925 అక్టోబర్ 5 న చరిత్రాత్మకమైన సమావేశం జరిపినారు. పదిరోజుల సమావేశం ఫలితంగా ఏడు సంధులను చేసుకోవడం జరిగినాయి. ఈ సంధుల మీద ప్రతినిధుల సంతకాలు లండన్‌లో 1925 డిసెంబర్‌లో జరిగినాయి. ఈ సంధులన్నింటినీ కలిపి లొకర్నో ఒడంబడికలంటారు. లొకర్నో ఒడంబడికలో ముఖ్యమైన సంధులు. 1) జర్మనీ, ఫ్రాన్స్, ఇంగ్లాండ్, ఇటలీ, బెల్జియమ్‌ల మధ్య జరిగిన పరస్పర హామీసంధి 2) జర్మనీతో ఫ్రాన్స్, బెల్జియమ్, పోలండ్, చెకోస్లోవేకియాలతో చేసుకొన్న నాలుగు మధ్యవర్తిత్వ సంధులు 3. ఫ్రాన్స్, పోలండ్, చెకొస్లొవేకియాలతో చేసుకొన్న రెండు హామీల సంధి, ఈ సంధుల ఫలితంగా ఫ్రాన్స్, జర్మనీల మధ్య, బెల్జియమ్ జర్మనీల మధ్య సరిహద్దుల రక్షణకు హామీ చేకూరడమే కాక రైన్ భూభాగము సైనిక మండలంగా ధృవపరచడం జరిగింది. జర్మనీ, ఫ్రాన్స్, బెల్జియంలు తమ సరిహద్దుల రక్షణకు ముప్పు ఏర్పడిన పరిస్థితులలో తప్ప యుద్ధాలను తలపెట్టమని హామీ ఇచ్చినాయి. జర్మనీ పశ్చిమ సరిహద్దు భద్రతకు

ముప్పు ఏర్పడినప్పుడు ఈ మూడు రాజ్యాలు సమిష్టిగా ఎదుర్కొంటాయి. ఈ మూడు రాజ్యాలు మధ్య సరిహద్దు అతిక్రమణలు జరిగినది, లేనిది సమితి మండలి నిర్ణయిస్తుంది. తన తూర్పు సరిహద్దు రక్షణకు హామీ కోసం జర్మనీ పోలండ్ చెకోస్లోవేకియాలతో విడివిడిగా రెండు సంధులు చేసుకొన్నది. ఈ సంధులు ప్రకారం వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వాన్ని అంగీకరించడం జరిగింది. పరస్పర భేదాభిప్రాయలతో కూడిన సమస్యలను శాంతియుత పద్ధతుల ద్వారా పరిష్కరించుకొవడానికి జర్మనీ, బెల్జియమ్ ఫ్రాన్స్‌లు అంగీకరించినాయి.

లొకర్నో ఒడంబడికల మీద సంతకాలు చేసిన రాజ్యాలు సమితిద్వారా నిరాయుధీకరణ సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టడానికి ఒప్పుకొన్నాయి. 1926 లో జర్మనీ సమితిలో శాశ్వత సభ్య రాజ్యంగా చేరింది. ప్రపంచ నిరాయుధీకరణ సమావేశానికి ఏర్పాట్లు చేయడానికి ఒక సంఘాన్ని కూడా నియమించడం జరిగింది.

పారిస్ శాంతి సమావేశం తరువాత అంతర్జాతీయ దౌత్యరంగంలో ఒక ముఖ్యమైన సంఘటనగా లొకర్నో ఒప్పందాలను పేర్కొనవచ్చు. జర్మనీ సమితిలో శాశ్వత సభ్యరాజ్యాంగా చేరినందువల్ల డాస్ పథకం ప్రధానలక్ష్యం నెరవేరింది. ఈ ఒప్పందాల ఫలితంగా వర్సైసంధి షరతులను పునః పరిశీలించవలెనని జర్మనీ కోరిక, తన భద్రతకు హామీ కావలెననే ఫ్రాన్స్ కోరిక కూడా సఫలమైనట్లు చెప్పవచ్చు. అంతేకాక యూరప్‌లో యధాతధ రాజకీయ పరిస్థితులను కాపాడటం జరిగింది. అందువల్లనే యుద్ధకాలం నుంచి శాంతికాలాన్ని లొకర్నో ఒడంబడికలు ప్రస్ఫుటంగా వేరు చేసినాయని బ్రిటిష్ ప్రధాని ఛాంబర్లేన్ విమర్శించినాడు. ఈ ఒడంబడిక వల్ల ఇంగ్లాండ్ ఫ్రాన్స్‌ల మధ్య తిరిగి మైత్రి ఏర్పడటంతో ఫ్రాన్స్ సంతృప్తి చెందింది. జర్మనీ ఫ్రాన్స్‌ల మధ్య తిరిగి మైత్రి ఏర్పడడంతో ఫ్రాన్స్ సంతృప్తి చెందింది. జర్మనీ ఫ్రాన్స్‌ల మధ్య వివాదం పరిష్కారానికి ఇంగ్లాండ్ మధ్యవర్తిత్వము ఈ ఒడంబడికవల్ల అంగీకరించ బడటంతో ఇంగ్లాండ్ సంతృప్తి చెందింది. మొత్తం మీద లొకర్నో ఒడంబడికల ఫలితంగా ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జర్మనీల మధ్య సద్భావగాహన ఏర్పడింది. ఇంగ్లాండ్ విదేశాంగ విధానంలో కూడా నూతన శకం ప్రారంభమైంది. ఇంతవరకు ఇంగ్లాండ్ అనుసరించిన కఠిన వైఖరివల్లనే అంతర్జాతీయ భద్రత రక్షణకు చేసిన ఏర్పాట్లన్నీ విఫలమైనాయి. 1919 లో జరిగిన పారిస్ శాంతిసంధి, 1923 లో జరిగిన పరస్పర సహాయక సంధి, 1924 లో జరిగిన జెనీవా సంధి ముసాయిదా మొదలైన సంధులు ఇంగ్లాండ్ వ్యతిరేకించిన కారణంగానే విఫలమైనాయి. ఫ్రాన్స్ ఇంతవరకూ జర్మనీని శాశ్వతంగా బలహీన పరిస్థితులలో ఉంచడానికి ప్రయత్నించింది. అయితే లోకర్నో ఒడంబడికల ఫలితంగా తానూ ఇంతవరకూ అనుసరించిన జర్మన్ వ్యతిరేఖ విదానాన్ని ఫ్రాన్స్ స్వస్తి చెప్పింది. జర్మనీ ఇతర సభ్యరాజ్యాలతో సమాన స్థాయిని పొందలేక పోయినప్పటికీ సమితిలో శాశ్వత సభ్యరాజ్యంగా చేరడం ఒక ఘన విజయమని చెప్పవచ్చు. అంతర్జాతీయ భద్రతా ఒడంబడికలను వ్యతిరేకించిన ఇంగ్లాండ్ ప్రాంతీయ భద్రతా ఒడంబడికలైన లొకర్నో ఒడంబడికలను ఆమోదించింది. ఈ ఒడంబడికలు జరిగిన తరువాత తన భద్రతకు హామీ ఇచ్చినట్లు భావించి ఫ్రాన్స్ భద్రతాన్వేషణను విరమించింది. వర్సై సంధిని వ్యతిరేకించిన జర్మనీ లొకర్నో సంధులను హర్షంతో ఆమోదించింది. అంతర్జాతీయ శాంతి సహకారాలు అభివృద్ధి కావడానికి లొకర్నో ఒడంబడికలు చాలా వరకు దోహదం చేసినాయి. మొత్తం మీద లొకర్నో ఒడంబడికల ఫలితంగా అంతర్జాతీయ రంగంలో ఒక నూతన వాతావరణము - లొకర్నో ధోరణి ప్రవేశపెట్టడం జరిగింది.

లొకర్నో ఒడంబడికలో కొన్ని లోపాలు కూడా ఉన్నాయి. జర్మనీ ఫ్రాన్స్‌లు ఆల్సేస్ - లొరేయిన్ రైన్ భూభాగాలమీద తమ హక్కులను విడనాడినప్పటికీ జర్మనీ తూర్పు సరిహద్దు సమస్య ఈ ఒడంబడికల వల్ల పరిష్కారం కాలేదు. ఇంగ్లాండ్, జర్మనీ తూర్పు సరిహద్దు రక్షణ విషయంలో ఆసక్తిని చూపలేదు. దీనినిబట్టి అంతర్జాతీయ సమిష్టి భద్రత స్థాపనకు బాధ్యత వహించడానికి ఇంగ్లాండ్ నిరాకరించినట్లు చెప్పవచ్చు. దీని పర్యవసానంగా సమితి ఒడంబడికలో పొందుపరచిన సమిష్టి భద్రత అనే సిద్ధాంతం విఫలమైనట్లు కూడా చెప్పవచ్చు. ఈ ఒడంబడికలు జరిగిన తరువాత కూడా అనేక అంతర్జాతీయ సమస్యలు అపరిష్కృతంగానే

ఉండిపోయినాయి. పోలాండ్ చెకోస్లోవేకియాలతో తీసుకున్న సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవలసిన బాధ్యత జర్మనీ మీద ఉంది. అయితే పోలండ్ చెకొస్లొవేకీయా సరిహద్దులు అతిక్రమించడానికి వీలులేదనే భావన జర్మనీకి లేదు. అందువల్ల జర్మనీ దురాక్రమణపట్ల ఫ్రాన్సుకున్న ఆందోళన తగ్గలేదు. ఫ్రాన్స్ జర్మనీలమధ్య సహకారమూ, సదవాగహన ఏర్పడినందువల్ల లోగడ ఫ్రాన్స్ పోలండ్‌తో చేసుకున్న మైత్రి సంధిని బలహీనపరచడం జరిగింది. లొకర్నో ఒడంబడికలు తనమీద పగ సాధించడానికి పశ్చిమరాజ్యాలు చేసిన కుట్ర అని రష్యా అనుమానించింది. వర్సే సంధి సమితి ఒడంబడికవల్ల బలహీనమైనాయి. సమితి ఒడంబడిక పత్రంలో సమిష్టి భద్రతకు కొన్ని నిబంధనలు చేసినప్పటికీ అవే నిబంధనలు లొకర్నో ఒప్పందాలలో తిరిగి చేర్చడం జరిగింది. అందువల్ల సమితిపట్ల సభ్యరాజ్యాలకు గౌరవం తగ్గి సమితి బలహీనమైంది. దురాక్రమణ జరిపిన రాజ్యంమీద సమితి సైనిక ఆంక్షలు విధించినప్పటికీ అవి తమకు వర్తించవనే అభిప్రాయము ఈ ఒడంబడికల ఫలితంగా సభ్యరాజ్యాలలో ఏర్పడింది. పరస్పర సహాయక సంధుల ప్రాముఖ్యము ఎక్కువైంది. అన్ని రాజ్యాల సరిహద్దులను కాపాడవలెననే నిబంధన వర్సేసంధిలో ఒక ముఖ్యాంశం. అదే విషయాన్ని మళ్ళీ లొకర్నో ఒడంబడికలో చేర్చడం జరిగింది. దీనివల్ల వర్సేసంధి బలహీనమైంది. ఇ.హెచ్. కార్. చెప్పినట్లుగా లొకర్నో సంధి భవిష్యత్తులో వర్సేసంధి, సమితి ఒడంబడికలను నాశనం చేయడానికి దారితీసింది.

ఇంగ్లండ్ లొకర్నో ఒడంబడికలను గొప్పవిజయంగా భావించింది. తూర్పు యూరప్ భద్రత బాధ్యతను స్వీకరించకుండా ఉండడం, జర్మనీని ఇతర పశ్చిమరాజ్యాల స్థాయికి తేవడం, అనే తన విదేశాంగ విధానంలోని రెండు ప్రధాన లక్ష్యాలను లొకర్నో ఒడంబడికల ద్వారా ఇంగ్లండ్ సాధించింది. జర్మనీపట్ల మిత్రరాజ్యాలు న్యాయమైన, ఉదారమైన వైఖరి అవలంభించని పక్షంలో కమ్యూనిస్టు రష్యా ప్రభావం జర్మనీమీద వ్యాప్తి చెందుతుందని ఇంగ్లండ్ భావించింది. నిజానికి 1922 లో జర్మనీ రష్యాలు రపెల్లో మైత్రి సంధిని చేసుకొన్నప్పటినుంచి ఇంగ్లండ్ ఆందోళన పడసాగింది. అందువల్ల ఫ్రాన్స్ జర్మనీలమధ్య నూతన మైత్రి సంబంధాలు నెలకొల్పి తద్వారా యూరప్ రాజ్యాలను కమ్యూనిస్ట్ రష్యా ప్రచార ప్రభావంనుంచి కాపాడే ఉద్దేశంతో ఇంగ్లాండ్ జర్మనీపట్ల ఉదార విధానాన్ని అనుసరించ సాగింది. లొకర్నో ఒడంబడికల ఫలితంగా జర్మనీని కమ్యూనిస్ట్ రష్యా ప్రభావంనుంచి తప్పించే విషయంలో ఇంగ్లండ్ విజయం సాధించింది. అంతేగాక ఒడంబడికల ఫలితంగా ఫ్రాన్స్ జర్మనీలమధ్య నూతన మైత్రి సహకారాలు ఏర్పడినందువల్ల ఇంగ్లండ్ ఘన విజయాన్ని సాధించినట్లు చెప్పవచ్చు.

లొకర్నో ఒడంబడికలు ముఖ్యంగా జర్మనీకి ఘనవిజయమని చెప్పవచ్చు. ఈ ఒడంబడికల ఫలితంగా ఫ్రాన్స్ రైన భూభాగాన్ని జర్మనీకి ఇవ్వడమేకాక భద్రతకై అన్వేషించడం కూడా చాలావరకు విరమించింది. అంతేకాక జర్మనీ తిరిగి సైనికబలం పెంపొదించుకోవడానికి అవకాశమేర్పడింది. పశ్చిమ రాజ్యాలతో సమానస్థాయిలో జర్మనీ సమితిలో సభ్యరాజ్యంగా చేరింది. మొత్తంమీద లొకర్నో ఒడంబడికవల్ల జర్మనీ పోగొట్టుకున్న ప్రతిష్ఠను తిరిగి పొందగలిగిందని చెప్పవచ్చు.

**3.5.4 పారిస్ ఒడంబడిక లేదా కెల్లాగ్ - బ్రేయాండ్ ఒడంబడిక (1928) :** లొకర్నో ఒడంబడికల తరువాత పేర్కొనదగిన మరొక అంతర్జాతీయ సంధి పారిస్ ఒడంబడిక, దీనినే కెల్లాగ్ - బ్రేయాండ్ ఒడంబడిక అనికూడా అంటారు. ఈ పారిస్ ఒడంబడిక ఫ్రాన్స్ సౌజన్యంతో, అమెరికా భావంతో రూపొందించడం జరిగింది. దురాక్రమణతో కూడిన యుద్ధాలను పూర్తిగా నిషేధించవలెననే ఉద్యమము కొంత కాలంగా అమెరికా బాధ్యతతో రూపొందించడం జరిగింది. దురాక్రమణతో కూడిన యుద్ధాలను పూర్తిగా నిషేధించవలెనని ఉద్యమము కొంత కాలంగా అమెరికాలో కొనసాగుతూ ఇతర దేశాలకు కూడా వ్యాపించింది. అంతర్జాతీయ సుస్థిర శాంతి స్థాపనకోసం యుద్ధాలద్వారా సమస్యల పరిష్కారం కావలెననే పాత విధానాన్ని నిషేధించవలెననేది ఈ ఉద్యమ నాయకుల అభిప్రాయము. 1927 లో సమితి మహాసభ దురాక్రమణతో కూడుకొన్న యుద్ధాలను పూర్తిగా నిషేధిస్తూ ఏకగ్రీవంగా ఒక తీర్మానాన్ని చేసింది. ఫిబ్రవరి 1927 లో జరిగిన అఖిల - అమెరికాని సమావేశం కూడా యుద్ధాలను నిషేధిస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఫ్రాన్స్ అమెరికాలమధ్య భవిష్యత్తులో యుద్ధం రాకుండా నివారించడానికి యుద్ధమనే విధానాన్ని

నిషేధించవలెననే ప్రతిపాదనను ఫ్రెంచి విదేశాంగ మంత్రి బ్రియాండ్ చేసినాడు. అమెరికా విదేశాంగ మంత్రి కెల్లాగ్ బ్రేమాండ్ చేసిన ప్రతిపాదనను కేవలం ఫ్రాన్స్ అమెరికాలకు పరిమితం చేయకుండా అంతర్జాతీయ ఒడంబడికగా మార్చి యుద్ధాలను పూర్తిగా నిషేధించవలెనని కొత్త ప్రతిపాదనను చేసినాడు. కాని సమితిలో సభ్యరాజ్యమైన ఫ్రాన్స్ కొన్ని పరిస్థితులలో తాను యుద్ధంలో పాల్గొనడం కాని, లేదా యుద్ధాన్ని సమర్ధించవలసిన అవసరంగాని ఏర్పడుతుందని భయపడింది. అందువల్ల కెల్లాగ్ ప్రతిపాదించినట్లు అగ్రరాజ్యాలన్నీ ఒక ఒడంబడికను చేసుకోవలెనని, అయితే ఆత్మరక్షణకై ఏ రాజ్యమైనా యుద్ధం చేయవచ్చునని బ్రేయాండ్ ఒక సవరణను ప్రతిపాదించినాడు. బ్రేయాండ్ ప్రతిపాదించిన సవరణతో కెల్లాగ్ కూడా ఏకీభవించినాడు. 1928 ఏప్రియల్‌లో కెల్లాగ్‌సంధి ముసాయిదాను ఇంగ్లండ్, జర్మనీ, ఇటలీ, జపాన్ దేశాలకు పంపినాడు. ఈ నాలుగుదేశాలు ఆమోదాన్ని పొందిన తరువాత 1928 జూన్‌లో కెల్లాగ్ ఈ సంధి ముసాయిదాను 14 దేశాలకు పంపినాడు. 14 రాజ్యాల ఆమోదాన్ని పొందిన తరువాత చిట్టచివరికి 15 రాజ్యాల ప్రతినిధులు పారిస్‌లో 1928 ఆగస్ట్ 29 న సమావేశమై కెల్లాగ్ -బ్రేయాండ్ ఒడంబడికమీద సంతకాలు చేసినారు. ఈ ఒడంబడికమీద సంతకాలు చేసిన రాజ్యాలు ఇంగ్లండ్, ఫ్రాన్స్, జర్మనీ, అమెరికా, ఇటలీ, బెల్జియం, ఆస్ట్రేలియా, కెనడా, న్యూజీలాండ్, చెకోస్లొవాకియా, పోలాండ్, ఐరిష్ ఫ్రీస్టేట్, ఇండియా, జపాన్, దక్షిణాఫ్రికా, రష్యాలు కూడా ఈ ఒడంబడికను ఆమోదించారు. 1930 నాటికి రాజ్యాలు ఒడంబడికను ఆమోదించాయి.

కెల్లాంగ్ - బ్రేయాండ్ ఒడంబడికలో ఈ క్రింది నిబంధనలున్నాయి. 1) ఒడంబడికలో భాగస్వాములైన రాజ్యాలు యుద్ధాలను విరమించి జాతీయాభివృద్ధికోసం పాటుపడవలె. 2) రాజ్యాలు తమమధ్య తలెత్తే వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవలె. 3) ప్రపంచంలోని అన్ని రాజ్యాలు ఈ ఒడంబడికలో భాగస్వాములుగా చేరవచ్చు.

పారిస్ ఒడంబడికను ప్రపంచమంత ప్రశంసించింది. అంతర్జాతీయ శాంతి భద్రతల స్థాపన విషయంలో ఈ ఒడంబడిక ముఖ్యమైన సోపానమని చెప్పవచ్చు. యుద్ధాలను నిషేధించిన ఈ సంధిమీద ప్రపంచంలోని అనేక రాజ్యాలు సంతకాలు చేయడం ఒక విశేషము మొదటి ప్రపంచ యుద్ధానంతరం మొదటిసారిగా అమెరికా రష్యాలు ఒక సంధి పంత్రంమీద సంతకాలు చేసినాయి. ఈ విధంగా అమెరికా రష్యాలు అంతర్జాతీయ రాజకీయాలలో పరస్పరం సంప్రదించుకోవడం ప్రారంభించాయి. అంతర్జాతీయ శాంతి భద్రతల స్థాపన విషయంలో ప్రపంచ ప్రజల ఆందోళన ఈ సంధివల్ల వెల్లడయ్యింది. అందువల్ల పారిస్ ఒడంబడిక చాల ముఖ్యమైనదని చెప్పవచ్చు. ఈ ఒడంబడిక జరిగిన తరువాత వివిధ రాజ్యాల మధ్య పరస్పర మైత్రి సంధులు, నిర్యుద్ధ ఒడంబడికలు చేసుకోవడం జరిగింది. కాబట్టి పారిస్ సంధి అంతర్జాతీయ శాంతి స్థాపనకు దోహదంచేసిన ఒక ముఖ్యమైన ఒడంబడికగా పరిగణించడం జరిగింది.

ప్రపంచమంతా ప్రశంసించిన పారిస్ ఒడంబడికలో కొన్ని ముఖ్యమైన లోపాలు కూడా ఉన్నాయి. ఈ ఒడంబడికలోని నిబంధనలు అమలు పరచడానికి కావలసిన యంత్రాంగాన్ని కాని లేదా ఒడంబడికలోని నిబంధనలకు భాష్యం చేప్పే యంత్రంగాన్ని కాని సూచించడం జరుగలేదు. ఇది పారిస్‌లోని ఒక ముఖ్యమైన లోపమని చెప్పవచ్చు. దురాక్రమణ జరిపిన రాజ్యంమీద తీసుకోవలసిన చర్యలను గురించికాని, విధించవలసిన ఆంక్షలను గురించికాని ప్రస్తావించకపోవడం ఈ ఒడంబడికలోని ఘోర లోపము. అంతేకాక రాజ్యాలమధ్య వివాదాల శాంతియుత పరిష్కారానికి సరియయిన మార్గాలు కూడా చూచించడం జరుగలేదు. ఈ ఒడంబడిక "దురాక్రమణకు" స్పష్టమైన నిర్వచనాన్ని ఇవ్వలేదు. పారిస్ ఒడంబడికమీద సంతకాలు చేసిన రాజ్యాలు సంధిలోని నిభందనలు ఉల్లంఘించకుండా, అంటే యుద్ధ ప్రకటన చేయకుండా దురాక్రమణ చేయడానికి అవకాశం ఉంది. ఈ ఒడంబడిక జరిగిన కొద్ది సంవత్సరాలలోనే జపాన్, ఇటలీ రాజ్యాలు యుద్ధ ప్రకటన చేయకుండా బలహీనమైన రాజ్యాలమీద దురాక్రమణ చేసాయి. అయినప్పటికి సంధిమీద సంతకాలు చేసిన ఇతర సభ్యరాజ్యాలు ఏ విధమైన అభ్యంతరంగాని వ్యతిరేకతగాని చూపలేదు. ఈ ఒడంబడిక యుద్ధాన్ని గర్హించి పరిత్యజించింది. కాని యుద్ధమనే విధానము న్యాయ విరుద్ధమనే ప్రకటించలేదు.

అంతేకాక సభ్యరాజ్యాలు ఏ పరిస్థితులలోను ఆత్మరక్షణకోసం యుద్ధం చేసుకోవచ్చునో స్పష్టంగా విశదపరచడం జరుగలేదు. ఈ ఒడంబడిక యుద్ధ పరిత్యాగమనే సిద్ధాంతాన్ని పూర్తిగా ఆమోదించలేదు. ఆత్మరక్షణ కోసం దురాక్రమణ జరిపిన రాజ్యాలమీద సైనిక ఆంక్షలు విధించడానికి యుద్ధపద్ధతి ద్వారా రాజ్యాలు ఈ ఒడంబడికను ఉల్లంఘించినప్పుడు, వివిధ సంధులను అమలుపరచడానికి వలసల రక్షణకోసం ప్రత్యేక ప్రయోజనాల రక్షణకోసం సంధి పత్రంమీద సంతకాలు చేసిన రాజ్యాలు యుద్ధాలు చేయడానికి పారిస్‌సంధి అనుమతించింది. అందువల్ల ఈ ఒడంబడికవల్ల యుద్ధ ప్రమాదం పూర్తిగా తొలగిపోలేదని చెప్పవచ్చు. పారిస్ ఒడంబడిక సమితిని పటిష్టంచేయడానికి బదులు బలహీన పరిచిందని ఇ.హెచ్.కార్ అభిప్రాయపడినాడు. ఈ ఒడంబడిక యుద్ధాలను గర్హించింది కాని, దురాక్రమణ జరిపిన రాజ్యాన్ని శిక్షించే నిబంధనలను సూచించలేదు. దురాక్రమణ జరిపిన రాజ్యాలమీద విధించవలసిన ఆంక్షలు ప్రస్తావన కూడా ఈ ఒడంబడికలో లేదు. ఇందుకు భిన్నంగా సమితి ఒడంబడిక పత్రంలో దురాక్రమణతో కూడిన యుద్ధాలను ఎదుర్కోడానికి కొన్ని నిబంధనలను సూచించడం జరిగింది. అందువల్ల ఈ ఒడంబడిక నిష్ప్రయోజనమైనదే కాక సమితికి ఒక సవాలు వంటిదని చెప్పవచ్చు.

పైన చెప్పినట్లు అనేక లోపాలునప్పటికీ పారిస్ ఒడంబడిక అంతర్జాతీయ సంబంధాల చరిత్రలో ఒక ముఖ్యమైన సంఘటన అని చెప్పవచ్చు. సార్వత్రిక యుద్ధనిషేధము ఒడంబడికలోని గొప్ప విశేషము. ఈ ఒడంబడిక జరిగిన తరువాత వివిధ రాజ్యాల మధ్య మధ్యవర్తిత్వ సంధులు, మైత్రిసంధులు, నిర్యుద్ధ సంధులు, పరస్పర సహాయక సంధులు జరిగినాయి. ఈ ఒడంబడికల ఫలితంగా సమితి ప్రమేయంలేకుండా సమిష్టి భద్రతను సాధించడానికి అవకాశము ఏర్పడింది. పారిస్ ఒడంబడిక జరిగిన తరువాత అమెరికా తను ఇంతవరకూ అనుసరిస్తున్న ఏకాంత విధానాన్ని విడనాడి ప్రపంచ రాజకీయ వ్యవస్థలో తన నాయకత్వాన్ని నెలకొల్పే ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ ఒడంబడికలో భాగస్వాములైన అమెరికా, రష్యాల మధ్య సహకారమూ, సుహృద్భావన సామరస్యమూ నెలకొన్నాయి. అమెరికా, రష్యాలమధ్య ఏర్పడిన నూతన సంబంధాలు అంతర్జాతీయ శాంతి భద్రతల స్థాపనకు దోహదం చేసినాయి.

**3.5.5 సాధారణ చట్టము 1935 :** 1935 లో సమితి సాధారణ చట్టాన్ని ఆమోదించి అంతర్జాతీయ సమిష్టి భద్రత స్థాపనకు చివరి ప్రయత్నం చేసింది. ఈ చట్టములోని నిబంధనల ప్రకారం న్యాయ సంబంధమైన వివాదాన్ని అంతర్జాతీయ న్యాయస్థానానికి నివేదించవలె. న్యాయస్థానము ఇచ్చిన తీర్పును సభ్యరాజ్యాలు శిరసావహించవలె. న్యాయబద్ధమైన వివాదాలుగా ఇతర వివాదాలు సమితి మధ్యవర్తిత్వం కమిటీకి నివేదించవలె. కాని ఈ చట్టాన్ని 1935 వ సంవత్సరాంతరానికి 35 రాజ్యాలు మాత్రమే ఆమోదించాయి. ఈ విధంగా సమిష్టి భద్రతా స్థాపనకు సమితి చేసిన చివరి ప్రయత్నం కూడా విఫలమైంది.

**3.6 సమితి ప్రమేయం లేకుండా భద్రతా స్థాపనకు జరిగిన ప్రయత్నాలు :** సమితి భద్రతా స్థాపన విషయంలో సమితి విఫలమైన తరువాత సమితి ప్రమేయం లేకుండా భద్రత స్థాపన హామీకై ప్రాంతీయ ఒడంబడికలద్వారా అనేక ప్రయత్నాలు జరిగినాయి. రాజ్యాలమధ్య ఒడంబడికల ఫలితంగా ప్రాంతీయ భద్రత స్థాపన జరగడానికి సమితి ఒడంబడిక ఏ విధంగానూ అవరోధం కాదు. 1923 లో జరిగిన పరస్పర సహాయక సంధి ప్రాంతీయ భద్రతా స్థాపన కోసం చేయబడిన మొదటి ప్రయత్నము అని చెప్పవచ్చు. మొదటి ప్రపంచ యుద్ధనాంతరం ఫ్రాన్స్ భవిష్యత్‌లో జర్మన్ దురాక్రమణను ఎదుర్కొనడానికి సమితిద్వారా సమిష్టి భద్రత స్థాపన కోసం ఇంగ్లండ్ అమెరికా సహాయాన్ని అభ్యర్థించింది. అయితే భద్రతా స్థాపన విషయమై హామీ ఇవ్వడంలో సమితి విఫలమైంది. సమిష్టి భద్రత స్థాపన విషయంలో సమితి విఫలమైన తరువాత యూరప్ దేశాలన్నింటిలో ఫ్రాన్స్ ఎక్కువగా ఆందోళన చెందింది. అందువల్ల ప్రాంతీయ ఒడంబడికల ద్వారా భద్రతకు హామీ కోసం ఫ్రాన్స్ అన్వేషణ ప్రారంభించింది.

ఫ్రాన్స్ మొదటి ప్రపంచ యుద్ధంలో విజయం పొందినప్పటికీ జర్మనీ తిరిగి బలపడి తనపై బలప్రయోగం చేస్తుందని భయపడసాగింది. రెండు ప్రపంచ యుద్ధాల మధ్య కాలంలో జర్మన్ దురాక్రమణ లేకుండా హామీ కావలెనని ఫ్రాన్స్ అన్వేషించడం యూరప్ రాజకీయాలలో ఒక ముఖ్యమైన విషయమని చెప్పవచ్చు. యుద్ధాలలో ఓడిపోయినప్పటికీ జర్మనీ ప్రజాబలంలోను, ఆర్థిక పారిశ్రామిక వనరులలోను ఫ్రాన్స్‌కంటే అనేక రేట్లు పై చేయిగా ఉంది. అందువల్ల యుద్ధంలో విజయాన్ని సాధించినప్పటికీ ఫ్రాన్స్ భయాందోళనలు కలిగి భద్రతకై అన్వేషించడం మొదలుపెట్టింది. జర్మనీ దురాక్రమణ నివారణకోసం రైన్ భూభాగం శాశ్వతంగా తన అధీనంలో ఉండవలెనని మొదటి ప్రపంచ యుద్ధానంతరం ఫ్రాన్స్ ప్రతిపాదించింది. కాని ఇంగ్లండ్, అమెరికాలు ఈ ప్రతిపాదనను వ్యతిరేకించినాయి. జర్మనీ దురాక్రమణకు వ్యతిరేకంగా ఇంగ్లండ్, ఫ్రాన్స్, అమెరికాలు త్రి రాజ్య మైత్రిసంధిని చేసుకోవలెనని మరొక ప్రతిపాదనను ఫ్రాన్స్ చేసింది. ఈ ప్రతిపాదనను కూడా ఇంగ్లండ్ అమెరికాలు వ్యతిరేకించాయి. అందువల్ల ఫ్రాన్స్ తన భద్రతకై అన్వేషించడం మరింత తీవ్రమైంది. సమిష్టి భద్రత నెలకొల్పడంలో సమితి విఫలమైన తరువాత తన భద్రతపై ఫ్రాన్స్ ఇతర ప్రయత్నాలు చేయసాగింది. అంతేగాక మొదటి ప్రపంచ యుద్ధానికి పూర్వం ఫ్రాన్స్ రష్యాల మధ్య మైత్రిసంబంధాలు ఉండేవి. 1921 లో జర్మనీ రష్యాలు రపెల్లో సంధిని చేసుకున్న తరువాత ఫ్రాన్స్‌కు తన భద్రత విషయమై ఆందోళన మరీ ఎక్కువైంది. అందువల్ల ఫ్రాన్స్ జర్మనీకి చుట్టు ప్రక్కలనున్న చిన్న చిన్న రాజ్యలతో పరస్పర రక్షణ ఒడంబడికలు చేసుకోవడానికి సంసిద్ధమయింది. ఈ ప్రాంతీయ ఒడంబడికల ద్వారా జర్మన్ దురాక్రమణ బారినుంచి తనను రక్షించుకోవడానికి ఫ్రాన్స్ ప్రయత్నించింది. అంతేకాక ఈ ఒడంబడికల ఫలితంగా జర్మనీని శత్రురాజ్యాలు చుట్టి వస్తాయని ఫ్రాన్స్ ఆశించింది.

**3.6.1 ఫ్రాన్స్ బెల్జియమ్ మైత్రిసంధి 1920 :** ఫ్రాన్స్‌వలెనే బెల్జియమ్ కూడా భవిష్యత్తులో జర్మనీ తనమీద దురాక్రమణ చేస్తుందని భయపడింది. అందువల్ల ఫ్రాన్స్, బెల్జియమ్ 1920 లో పరస్పర సహాయక సంధిని చేసుకొన్నాయి. ఈ సంధి ప్రకారం జర్మనీ తనమీద దురాక్రమణ జరిపినప్పుడు పరస్పరం సహాయం చేసుకోవడానికి ఫ్రాన్స్, బెల్జియమ్‌లు అంగీకరించినాయి. ఈ సంధివల్ల రైన్ భూభాగానికి సైనిక మండలాలుగా ప్రకటితమైన పశ్చిమ సరిహద్దు రక్షణకు హామీ చేకూరినట్లు ఫ్రాన్స్ సంతృప్తి పడింది.

**3.6.2 ఫ్రాన్స్ పోలండ్‌ల మైత్రిసంధి 1921 :** మొదటి ప్రపంచ యుద్ధానంతరం యూరప్ రాజకీయాలలో పోలండ్ కూడా ముఖ్యపాత్ర వహించడం మొదలుపెట్టింది. అయితే పోలండ్ యొక్క ప్రాదేశిక సమగ్రతా రక్షణ వర్సైసంధి అమలుమీద ఆధారపడి ఉంది. పోలండ్‌కు ముఖ్యమైన విరోధి రాజ్యాలు పశ్చిమం వైపున జర్మనీ, తూర్పు వైపున రష్యా పోలిస్ కాండార్‌ను సృష్టించడంవల్ల జర్మనీ విభజితమైంది. అందువల్ల జర్మనీ, పోలండ్ పట్ల విరోధ భావంతో ఉంది. తనకు అతి సమీపంలో ఉన్న రష్యా చర్యలవల్ల కూడా పోలండ్ దేశభద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదముంది. అంతేకాక పోలండ్ అనేక విధాలుగా ఫ్రాన్స్‌కు ఋణపడి ఉంది. యుద్ధానంతరం పోలండ్ పునర్నిర్మాణానికి ఫ్రాన్స్ తోడ్పడింది. పారిస్ శాంతి సమావేశంలో పోలండ్ కోరికలను ఫ్రాన్స్ సమర్పించింది. అంతేకాక యుద్ధానంతరం ఫ్రాన్స్ పోలండ్‌లకు జర్మనీ, రష్యాలవల్ల ప్రమాదము ఏర్పడింది. అందువల్ల జర్మనీ భీతిచెందిన ఫ్రాన్స్, జర్మనీ రష్యాల వల్ల భీతి చెందిన పోలండ్ ఫిబ్రవరి 1921 లో ఒక రక్షణ సంధిని చేసుకున్నాయి. ఈ సంధి ప్రకారం పోలండ్ దేశ సైనిక పునర్నిర్మాణానికీ, ఆర్థికాభివృద్ధికి, ఫ్రెంచి సహాయం అందజేయడం జరుగుతుంది. అంతేకాక ఈ సంధి ప్రకారం దురాక్రమణకు వ్యతిరేకంగా పరస్పరం సహాయం చేసుకోవడానికి, అంతర్జాతీయ సమస్యల పరిష్కారానికి ఒకరినొకరు సంప్రదించుకోవడానికి ఏర్పాట్లు చేయడం జరిగింది.

**3.6.3 ఫ్రాన్స్, చెకోస్లావాకియాల మధ్య సంధి 1924 :** భవిష్యత్తులో ఆస్ట్రియా జర్మనీ దేశాలు యూనియన్‌గా ఏర్పడిన పక్షంలో తన భద్రతకు ముప్పువాటిల్లుతుందని భయపడిన చెకోస్లావాకియా ఫ్రాన్స్‌తో రక్షణ ఒప్పందానికి సంసిద్ధతను

వెల్లడించింది. జనవరి 1924 లో ఫ్రాన్స్ చెకొస్లావాకియాలు ఒక మైత్రి సంధిని చేసుకొన్నాయి. ఈ సంధి ఫలితంగా చెకొస్లావాకియాలో ఏర్పడిన నూతన రాజకీయ వ్యవస్థ రక్షణకు, ప్రాదేశిక సమగ్రత రక్షణకు హామీ ఏర్పడింది. అంతేకాక దురాక్రమణకు వ్యతిరేకంగా పరస్పరం సహాయం చేసుకోవడానికి ఏర్పాటు చేయడం జరిగింది.

**3.6.4 ఫ్రాన్స్ రుమేనియాలమధ్య ఫ్రాన్స్ - యుగోస్లావియాల మధ్య సంధులు 1926, 1927 :** జూన్ 1926 లో ఫ్రాన్స్, రుమేనియాలు ఒక మైత్రి సంధి చేసుకున్నాయి. నవంబర్ 1927 లో ఫ్రాన్స్, యుగోస్లావియాలు ఒక మైత్రి సంధి చేసుకొన్నాయి. దురాక్రమణను ఎదుర్కొనడానికి పరస్పరం సహాయం చేసుకోవడానికి ఈ సంధులలో ఏర్పాట్లు చేయడం జరిగింది. అంతేకాక ఈ సంధుల ప్రకారం సంధి పత్రంమీద సంతకాలు చేసిన రాజ్యాలు తమమధ్య వివాదాలను శాంతియుతంగా మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవడానికి అంగీకరించాయి.

పైన పేర్కొన్న ఒడంబడికలన్నీ జర్మనీ దురాక్రమణను ఎదుర్కోవడానికి ఫ్రాన్స్‌చేసిన ప్రయత్నాలని చెప్పవచ్చు. ఈ ఒడంబడికల ఫలితంగా జర్మనీ విరోధి రాజ్యాలు చుట్టివేసినాయి అని భావించి ఫ్రాన్స్ సంతృప్తి చెందింది. అంతేకాక తూర్పు యూరప్ రాజ్యాలతో ఒడంబడికలు జరిగిన తరువాత వర్సేసంధి అమలుకు తద్వారా యూరప్‌తో శాంతి భద్రతల స్థాపనకు ఫ్రాన్స్ ఎక్కువ ప్రాధాన్యమిచ్చింది. ఈ ఒడంబడికలన్నీ సమితి ఒడంబడికకు అనుగుణంగానే ఉన్నాయి. కాని పరిమితమైన సైనిక బలమున్న తూర్పు యూరప్‌లోని చిన్న చిన్న రాజ్యాలు అవసరం వచ్చినప్పుడు ఫ్రాన్స్‌కు ఎంతవరకు ఉపయోగపడతాయి అనేవి సందేహించవలసిన విషయము. అంతేకాక ఫ్రాన్స్ తూర్పు యూరప్ దేశాలలో సంధులు చేసుకోవడం ఇటలీకి లోపకారణమైంది.

**3.6.5 చిన్న రాజ్యాల సౌహార్ద కూటమి :** మొదటి ప్రపంచ యుద్ధానంతరం చెకొస్లావాకియా, యుగోస్లావియా, రుమేనియా రాజ్యాలు ఫ్రాన్స్ మైత్రి సంధులు చేసుకోవడమే కాక, ఆ మూడు రాజ్యాలు సమిష్టిగా చిన్న రాజ్యాల సౌహార్ద కూటమిగా ఏర్పడినాయి. వర్సేసంధి మొదలైన అంతర్జాతీయ సంధులవల్ల శాంతి భద్రతలు కాపాడడం, జర్మనీ, ఆస్ట్రియాల దురాక్రమణ బారినుంచి తమ సరిహద్దులను కాపాడుకోవడం, ఆస్ట్రియా హబ్స్‌బర్గ్ వంశ పునరుద్ధరణను ఎదుర్కోవడం మొదలైనవి చిన్న రాజ్యాల సౌహార్ద కూటమి ప్రధాన లక్ష్యాలు. యుద్ధానంతర కాలంలో ముఖ్యంగా 1922 నుంచి 1933 వరకు చిన్న రాజ్యాలమధ్య సహకారము సంప్రదింపులు అభివృద్ధి చెందినాయి. 1921 లో చెకొస్లోవేకియా రూమేనియాల మధ్య, యుగోస్లావియా రూమేనియాల మధ్య సంధులు జరిగాయి. 1922 లో చెకొస్లావాకియా, యూగోస్లావియాల మధ్య ఒక సంధి జరిగింది. తూర్పు యూరప్‌లోని ఈ చిన్న రాజ్యాలు పరస్పరం సంప్రదించుకుంటూ సమితిలో కూడా ఒక సమైఖ్య కూటమిగా పనిచేయసాగింది. ఈ కాలంలో చిన్న రాజ్యంమీద ఫ్రాన్స్ ఎక్కువ పలుకుబడి సంపాదించింది. చెకొస్లావాకియా, యుగోస్లావియా, రూమేనియా దేశాలకు ఫ్రాన్స్ అనేక విధాలుగా సహాయపడి జర్మనీ, ఆస్ట్రియా యూనియన్ ఫలితంగా దురాక్రమణ జరగకుండా ఎదుర్కోవడానికి ప్రయత్నాలు చేసింది. పారిస్ శాంతి సంధుల పునఃపరిశీలన జరగవలెననీ ఆస్ట్రియా హంగేరీల ప్రయత్నాలు కూడా ఫ్రాన్స్ ఒడంబడికలద్వారా ఎదుర్కోవడానికి ప్రయత్నించింది. 1933 లో జర్మనీలో నాజీ నియంతృత్వం స్థాపన జరిగిన తరువాత చిన్నరాజ్యాల సౌహార్ద కూటమి, ఐకమత్యము ఉండవలసిన అవసరము మరీ ఎక్కువైంది. కానీ జర్మనీ దురాక్రమణసను ఎదుర్కొనే శక్తినీ, సామర్థ్యాన్ని తూర్పు యూరప్‌లోని చిన్న రాజ్యాలు మొత్తంమీద పొందలేకపోయినాయి.

**3.6.6 ఇటలీ మైత్రి సంధులు :** 1919 తరువాత ఫ్రాన్స్ తూర్పు యూరప్‌లోని చిన్నరాజ్యాలు కలిసి వర్సేసంధి ప్రవేశపెట్టిన వ్యవస్థను ప్రాతిపదికగా చేసుకొని యూరప్‌లో శాంతిభద్రతల స్థాపనకు ఒకవైపున ప్రయత్నాలు చేస్తుండగా, వేరొకవైపున యుద్ధంలో ఓడిపోయిన దేశాలు ఆస్ట్రియా, హంగరీ, బల్గేరియాలు వర్సేసంధిని సవరించడానికి ప్రయత్నాలు చేయసాగాయి.

యుద్ధంలో గెలిచిన ఇటలీకూడా ఓడిపోయిన రాజ్యాలతో కలిసి వర్సేసంధి సవరణకు ప్రయత్నాలు చేసింది. ఈ విధంగా వర్సే సంధి సవరణకు రాజ్యాలన్నింటిని కలిపి పరిహృత సమూహంగా పేర్కొనవచ్చు. యుద్ధంలో గెలిచినప్పటికీ తనకు తగినంత ప్రతిఫలం ముట్టలేదని నిరాశ చెందిన ఇటలీ వర్సేసంధి సవరణకు కోరుతున్న రాజ్యాలతో మైత్రి సంధులు చేసుకోవడానికి సన్నద్ధమైంది. ఏడ్రియాటిక్ తీరంమీద తన ఆధిపత్యం స్థాపించడం, తన నాయకత్వంలో మధ్య యూరప్‌లో రాజకీయమైన మార్పులు సాధించడం ముస్సోలినీ నాయకత్వంలో ఉన్న ఇటలీ విదేశాంగ విధానంలో ముఖ్యమైన రెండు అంశాలు అని చెప్పవచ్చు. 1920 లో జరిగిన ఒక సంధి ప్రకారం ఇటలీ యుగోస్లావియా నుంచి ఫ్యూమ్ రేవుపట్టణాన్ని పొందింది. 1926 లో ఇటలీ తన అధికారాన్ని అల్బేనియా మీద స్థాపించింది.

ఏడ్రియాటిక్ తీరంమీద తన ఆధిపత్యం స్థాపితమైన తరువాత యుగోస్లావియాను బలహీన పరచి డాన్యూబియన్ రాజ్యాల సహాయంతో మధ్య యూరప్‌లో తన ఆధిపత్యం స్థాపించడానికి ప్రయత్నించింది. జర్మనీ ఆస్ట్రియాలు ఏకమై ఒక యూనియన్‌గా ఏర్పడినట్లయితే జర్మన్ సరిహద్దు బ్రిన్నర్ కనుమ వరకు విస్తరించడమేగాక ఇటలీ, ఆస్ట్రియానుంచి పొందిన రక్షణ టైరోల్‌ను పోగొట్టుకోని పరిస్థితికూడా ఏర్పడుతుంది. అందువల్ల ఆస్ట్రియామీద జర్మనీ ఆధిపత్యం నెలకోల్పడాన్ని ఇటలీ వ్యతిరేకించింది. 1934 లో ఇటలీ, ఆస్ట్రియా, హంగరీలు రోమ్‌సంధిని చేసుకొన్నాయి. ఇది ఇటలీ ఘన విజయమని చెప్పవచ్చు. ఈ సంధి ప్రకారం అంతర్జాతీయ శాంతిని కాపాడి, స్వాతంత్ర్య రాజ్యం ఆర్థికాభివృద్ధి జరుగవలె. అంతేకాక ఈ సంధిమీద సంతకాలు చేసిన రాజ్యాలమధ్య వర్తక, వాణిజ్య సంబంధాలు అభివృద్ధి చెందవలె. ఈ సంధివల్ల ఆస్ట్రియా స్వతంత్ర ప్రతిపత్తిని గుర్తించి జర్మనీ ఆస్ట్రియాల కలయికపట్ల వ్యతిరేకతను ఇటలీ స్పష్టంగా బయటపెట్టింది.

**3.6.7 బాల్కన్ ఒప్పందము 1934 :** పారిస్ శాంతి సంధుల ప్రకారం హంగరీ బల్గేరియాలకు చెందిన కొన్ని భూభాగాలు రుమేనియా, చెకొస్లొవాకియా, యుగోస్లావియాలకు ఇవ్వడం జరిగింది. అందువల్ల బల్గేరియా హంగరీలు పారిస్ సంధి సవరణకు ప్రయత్నాలు చేయసాగాయి. తూర్పు యూరప్‌లోని చిన్న రాజ్యాలైన చెకొస్లొవాకియా, యుగోస్లావియా, రుమేనియాలు ఒక కూటమిగా ఏర్పడి ఫ్రాన్స్‌తో మైత్రిని నెలకొల్పుతున్న తరువాత దీనికి ప్రతీకరాంగా హంగరీ, గ్రీస్, బల్గేరియా, టర్కీలు ఒక కూటమిగా ఏర్పడి ఇటలీతో మైత్రి నెలకొల్పుకొన్నాయి. ఈ విధంగా బాల్కన్ ప్రాంతములో ఆధిపత్యం కోసం ఫ్రాన్స్ ఇటలీలు తీవ్రమైన పోటీకి దిగినాయి. బాల్కన్ ప్రాంతంలో పలుకుబడి ఉన్న టర్కీ చొరవవల్ల టర్కీ, గ్రీస్, బల్గేరియాల మధ్య ఉన్న స్థానిక తగాదాలు పరిష్కారమైనాయి. అంతేకాక జర్మన్ నియంత అయిన హిట్లర్ దురాక్రమణవల్ల రుమేనియా, యుగోస్లావియాలకు ఆందోళన ఎక్కువైంది. కాబట్టి 1934 లో రుమేనియా యుగోస్లావియాలు గ్రీస్ టర్కీలతో కలిసి బాల్కన్ ఒడంబడికమీద సంతకాలు చేసినాయి. ఈ సంధి ప్రకారం సంధి పత్రంమీద సంతకాలు చేసిన రాజ్యాల ప్రాదేశిక సమగ్రతకు హామీ ఇవ్వడం జరిగింది. తన ఇరుగుపొరుగు రాజ్యాలనుంచి భూభాగాలను దురాక్రమణద్వారా కాజేయవలెనని ఉవ్విళ్లూరుతున్న బల్గేరియా ఈ సంధిలో భాగస్వామిగా చేరలేదు. బాల్కన్ ఒడంబడికలో సభ్యులైన యుగోస్లావియా, రుమేనియాలు చిన్నరాజ్యాల సౌహార్ద కూటమిలో కూడా సభ్యులైనందువల్ల రెండు కూటములమధ్య దగ్గర సంబంధాలు ఏర్పడినాయి. ఈ విధంగా బాల్కన్ ప్రాంత భద్రతా విధానము అమలులోనికి వచ్చింది.

ఫాసిస్ట్ రాజ్యాల రాజ్యకాంక్షవల్ల బాల్కన్ ప్రాంతంలో భద్రతా స్థాపనకు అంతరాయమేర్పడింది. రోమ్‌సంధిమీద సంతకాలు చేసిన ఇటలీ, ఆస్ట్రియా, హంగరీలు కూడా భద్రతా విషయంలో విజయాన్ని సాధించలేకపోయినాయి. 1935 లో ఇటలీ ఇథియోపియా మీద దురాక్రమణ జరపడం 1936 లో జర్మనీ, ఇటలీలు ఒక అక్షరాజ్యకూటమిగా ఏర్పడటం 1938 లో ఆస్ట్రియామీద 1939 లో చెకొస్లొవాకియామీద జర్మనీ దురాక్రమణలు జరపడం వంటి పరిణామాలవల్ల పైన పేర్కొన్న ప్రాంతీయ భద్రతా ఒడంబడికలు

నిరుపయోగమైనాయి. 1939 ఇటలీ ఆల్బేనియాను ఆక్రమించడంతో టర్కీ యుగోస్లావియాల భద్రతకు ప్రమాదము ఏర్పడింది. బాల్కన్ రాజ్యాలమధ్య ఐకమత్యాన్ని, సహకారాన్ని పెంపొందించడానికి టర్కీ అనేక ప్రయత్నాలు చేసింది. కాని ప్రయోజనం లేకపోయింది. టర్కీ, గ్రీస్, రుమేనియా రాజ్యాల భద్రతయే ఇంగ్లండ్ ఫ్రాన్స్‌లు హామీనిచ్చినాయి. అయినప్పటికి 1939 లో రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమైన కొద్దికాలం తరువాతనే బాల్కన్ ఒడంబడిక రద్దయిపోయింది.

**3.6.8 మధ్య ప్రాచ్యంలో భద్రతా స్థాపనకు జరిగిన సాదబాద్ ఒడంబడిక 1937 :** ప్రాంతీయ భద్రతా స్థాపన కోసం బాల్కాన్ ఒడంబడికను ఏర్పాటు చేసినప్పటికీ టర్కి పూర్తిగా సంతృప్తి చెందలేదు. అందువల్ల మధ్యప్రాచ్యంలోని దేశాలమధ్య కూడా ఐకమత్యాన్ని, సహకారాన్ని స్థాపించడానికి టర్కీ అనేక ప్రయత్నాలు చేసింది. టర్కీ ప్రయత్నాల వల్ల 1937 ఆఫ్ఘనిస్థాన్, ఇరాన్, ఇరాక్, టర్కీలు సాదబాద్ ఒడంబడికమీద సంతకాలు చేసాయి. ఈ ఒడంబడిక ప్రకారం సంధిమీద సంతకాలు చేసిన రాజ్యాల ప్రాదేశిక సమగ్రతను కాపాడడం జరుగుతుంది. అంతేకాక ఒక రాజ్యం ఆంతరంగిక వ్యవహారాలలో మరొక రాజ్యం జోక్యం చేసుకోవడాన్ని నివారించడం జరుగుతుంది. కాని ప్రాంతీయ భద్రతా స్థాపనకు చేసిన ఇతర ప్రయత్నాలవల్లనే మధ్య ప్రాచ్యంలో భద్రత స్థాపనకు చేసిన ప్రయత్నం కూడా విఫలమైంది.

**3.6.9 స్కాండినేవియా రాజ్యాల కూటమి 1938 :** స్కాండినేవియా రాజ్యాలైన నార్వే, డెన్మార్క్, స్వీడన్, ఐస్‌లాండ్, ఫిన్‌లాండ్‌లు మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో తటస్థ విధానాన్ని అనుసరించాయి. యుద్ధానంతరం ఈ రాజ్యాలమధ్య ఆర్థిక, సాంస్కృతిక సహకారం పెంపొందించడం జరిగింది. కాని జర్మనీ, ఇటలీ మొదలైన అగ్రరాజ్యాల దురాక్రమణవల్ల చిన్న రాజ్యాల మనుగడకు ప్రమాదము ఏర్పడడంతో నార్వే, డెన్మార్క్, స్వీడన్, ఫిన్‌లాండు 1938 లో ఒక రక్షణ ఒడంబడికను చేసుకొన్నాయి. ఈ సంధి ప్రకారం భవిష్యత్తులో అగ్రరాజ్యాలమధ్య యూరప్‌లో యుద్ధం వచ్చినట్లయితే స్కాండినేవియా దేశాలు తటస్థంగా ఉండటానికి నిర్ణయించుకొన్నాయి. కాని 1939, 1940 లలో రష్యా, ఫిన్‌లాండ్‌ను, జర్మనీ నార్వే, డెన్మార్క్‌లను ఆక్రమించడంతో ప్రాంతీయ భద్రతా స్థాపనకు స్కాండినేవియా దేశాల ప్రయత్నాలు విఫలమైనాయి.

**3.6.10 బాల్టిక్ ఒడంబడిక 1934 :** నాజీ జర్మనీ దురాక్రమణను ఎదుర్కోవడానికి బాల్టిక్ రాజ్యాలైన లాట్వియా, లిథూయేనియా, ఇస్టోనియాలు 1934 లో బాల్టిక్ ఒడంబడిక మీద సంతకాలు చేసినాయి. ఈ ఒడంబడిక ప్రకారం సంధిమీద సంతకాలు చేసిన రాజ్యాలు తమమధ్య ఆర్థిక, సాంస్కృతిక సహకారం పెంపొందించుకొని పరస్పరం సంప్రదింపులు ద్వారా తమ విదేశాంగ విధానాలను తయారు చేసుకోవడానికి అంగీకరించినాయి. అంతేకాక యుద్ధకాలంలో తటస్థంగా ఉండటానికి కూడా నిర్ణయించుకొన్నాయి.

**3.6.11 రోమ్ ఒప్పందము 1933 :** యూ దేశాలలో ఆర్థిక మాంద్యము ఏర్పడటం జర్మనీలో హిట్లర్, అధికారంలోనికి రావటం వంటి పరిణామాలు ఫలితంగా యూరప్‌లోని వివిధ రాజ్యాలమధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. యుద్ధ ప్రమాదాన్ని నివారించి, కొంత నిర్ణీతకాలం వరకు శాంతిని కాపాడటం కోసం ముస్సోలినీ ఒక ప్రతిపాదన చేసాడు. ముస్సోలినీ ప్రయత్నాల వల్ల ఇంగ్లండ్, ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీ దేశాలు 1933 లో ఒక సంధిమీద రోమ్‌నగరంలో సంతకాలు చేసినాయి. దీనినే "రోమ్ ఒప్పందము' అంటారు. ఈ ఒడంబడికమీద సంతకాలు చేసిన రాజ్యాలు తమకు సంబంధించిన అన్ని ముఖ్యమైన రాజకీయ వ్యవస్థలను పరస్పరం చర్చించుకోవడానికి అంగీకరించినాయి. అంతేకాక నిరాయుధీకరణ సమస్యను పరిష్కరించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడానికి కూడా అంగీకరించినాయి.

**3.6.12 లండన్ ఒడంబడిక 1933 :** రోమ్ ఒడంబడిక పశ్చిమ రాజ్యాలు తనమీద ప్రయోగించడానికి చేసిన కుట్ర అని రష్యా అనుమానించింది. అందువల్ల ఎంతమాత్రం కాలయాపన చేయకుండా తన ఇరుగుపొరుగు రాజ్యాలతో రక్షణ ఒడంబడికలు చేసుకున్నది. రష్యా, ఆఫ్ఘనిస్తాన్, చెకొస్లొవాకియా, ఇస్టోనియా, లాట్వియా లిథుయోనియా, ఇరాన్, పోలాండ్, రుమేనియా, టర్కీ, యుగోస్లావియా దేశాలు 1933 లో మూడు లండన్ ఒడంబడికలమీద సంతకాలు చేసింది. ఈ ఒడంబడికమీద సంతకాలు చేసిన రాజ్యాలు దురాక్రమణకు వ్యతిరేకంగా పరస్పరం సైనిక సహాయం చేసుకోవడానికి, పారిస్ ఒడంబడికను మార్పులకు లోను గాకుండా కాపాడటానికి అంగీకరించినాయి. కాని ఈ లండన్ ఒడంబడికలు కూడా ఇతర ప్రాంతీయ భద్రత ఒడంబడికవలె నిరుపయోగమైనాయి.

**3.6.13 జర్మనీలో హిట్లర్ అధికారంలోకి వచ్చిన తరువాత ఏర్పడిన నూతన మైత్రి సంధులు :** జర్మనీలో హిట్లర్ నాయకత్వంలో నాజీ ప్రభుత్వము అధికారములోనికి వచ్చిన తరువాత జర్మన్ దురాక్రమణను ఎదుర్కోవడానికి యూరప్ దేశాలు కొత్తమైత్రి సంధులు చేసుకోవడం మొదలుపెట్టాయి. వర్సేసంధిని ఉల్లంఘించి జర్మనీకి జరిగిన అవమానాన్ని తొలగించడం వివిధ రాజ్యాలను జయించి జర్మన్ సామ్రాజ్యాన్ని స్థాపించడం నాజీపార్టీ ఆశయాలు. హిట్లర్ నియంతృత్వాధికారంలో ఉన్న జర్మనీ అనుసరిస్తున్న దురాక్రమణ విధానంవల్ల భీతి చెందిన రాజ్యాలు నూతన మైత్రిసంధులు చేసుకోవడానికి ఆసక్తితో ఉన్నాయి.

**3.6.14 ఫ్రాన్స్, రష్యాల మధ్య సంధి 1935 :** జర్మనీలో హిట్లర్ అధికారంలోకి వచ్చిన తరువాత ఫ్రాన్స్, రష్యాల మధ్య తిరిగి స్నేహ సంబంధాలు ఏర్పడినాయి. హిట్లర్ ప్రారంభించిన కమ్యూనిస్టు వ్యతిరేఖ ప్రచారంవల్ల రష్యా ఆందోళన చెందింది. "మైన్‌కాంఫ్" నా పోరాటము అనే గ్రంథములో హిట్లర్ రష్యాను ఆక్రమించవలెనని తన కోరికను వెల్లడించినాడు. అందువల్ల వర్సేసంధిలోని షరతులను రక్షించవలెననే ఆందోళన రష్యాకు ఎక్కువైంది. ఫ్రాన్స్ ప్రోద్బలంతో రష్యా తన భద్రతకోసం 1934 లో సమితిలో సభ్యరాజ్యాంగా చేరింది. కాని సమితిలో సభ్యరాజ్యంగా చేరడంతో సంతృప్తి చెందక రష్యా ఫ్రాన్స్‌తో మైత్రిసంధిని చేసుకోవడానికి ఆసక్తిని చూపింది. ఫలితంగా 1935 మేలో రష్యా, ఫ్రాన్స్‌లు పరస్పర సహాయక సంధిని చేసుకొన్నాయి.

**3.6.15 రెండురకాలైన ఒడంబడికలను ఏర్పాటు చేయడానికి ఫ్రాన్స్ చేసిన విఫల ప్రయత్నాలు :** ఇటలీ ప్రయత్నాల ఫలితంగా 1933 లో రోమ్ ఒడంబడికమీద ఇటలీ, ఇంగ్లండ్ జర్మనీ, ఫ్రాన్స్ దేశాలు సంతకాలు చేసాయి. అయితే తూర్పు యూరప్‌లోని చిన్న రాజ్యాలను సంతృప్తి పరచడానికి రోమ్ ఒప్పందాన్ని సవరించడం జరిగింది. సవరించినందువల్ల దాని ప్రాముఖ్యం తగ్గిపోయింది.

రష్యాతో మైత్రి సంధితోను, రోమ్ ఒప్పందంతోను సంతృప్తి చెందని ఫ్రాన్స్ జర్మన్ దురాక్రమణను ఎదుర్కోవడానికి కొత్త ఒడంబడికలకోసం అన్వేషణ ప్రారంభించింది. రెండు రకాలైన ఒడంబడికలు సహాయంతో జర్మనీని చుట్టు ముట్టివేసి అదుపులో ఉంచడానికి ఫ్రాన్స్ ప్రయత్నించింది. మొదటిది రష్యా, పోలండ్, చెకొస్లొవాకియా బాల్టిక్ రాజ్యాల కూటమి రెండోది బాల్కన్ రాజ్యాల కూటమి. మొదటి కూటమిని పోలండ్ వ్యతిరేకించింది. రెండో కూటమిని యుగోస్లావియా వ్యతిరేకించింది. అందువల్ల రెండు కూటములను ఏర్పాటు చేయడంలో ఫ్రాన్స్ విఫలమైంది. అంతేకాక యుగోస్లావియా, పోలండ్, రుమేనియాలు హిట్లర్‌ను ఎదిరించడానికి నిరాకరించినాయి. కాబట్టి హిట్లర్ జర్మనీలో నాజీ నియంతృత్వాన్ని స్థాపించిన తరువాత చిన్న రాజ్యాల సౌహార్ద కూటమి బలహీన పడింది అని చెప్పవచ్చు.

**3.6.16 ఫ్రాన్స్, ఇటలీలమధ్య సంధి 1935 :** బాల్కన్ ప్రాంతంలో నూతన ఒడంబడికలను ఏర్పాటు చేయడానికి ప్రయత్నించి ఫ్రాన్స్ విఫలమైంది. నూతన బాల్కన్ ఒడంబడికలను ఏర్పాటు చేయడంలో విఫలమైన ఫ్రాన్స్ జర్మన్ దురాక్రమణను

ఎదుర్కోడానికి ఇటలీతో ఒడంబడిక చేసుకోవడానికి నిశ్చయించుకొన్నది. ఆస్ట్రియా మీద జర్మన్ ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తున్న ఇటలీ కూడా ఫ్రాన్స్‌తో సంధికి ఇష్టపడింది. జనవరి 1935 లో ఫ్రాన్స్, ఇటలీలు ఒక సంధిమీద సంతకాలు చేసాయి. ఈ సంధి ప్రకారం ఫ్రాన్స్, ఇటలీలు పరస్పరం తమకు ఆసక్తిఉన్న విషయాలను భేదాభిప్రాయలతో సహా చర్చించుకోవడానికి అంగీకరించినాయి. అంతేకాక ఆస్ట్రియాకు ఇరుగుపొరుగున ఉన్నదేశాలు ఆస్ట్రియాతో నిర్యుద్ధ సంధులు చేసుకొనేటట్లు ప్రోత్సహించడానికి కూడా ఫ్రాన్స్, ఇటలీలు అంగీకరించాయి.

**3.6.17 రష్యా, చెకొస్లావాకియాలమధ్య సంధి 1935 :** నాజీ జర్మనీ దురాక్రమణ విధానంవల్ల భీతి చెందిన చెకోస్లావాకియా రష్యాతో మైత్రి సంధిని చేసుకోవడానికి ఆసక్తిని చూపించింది. 1935 మేలో చెకొస్లావాకియా రష్యాలు పరస్పరం సహాయం చేసుకోవడానికి ఒక సంధిమీద సంతకాలు చేసినాయి.

పైన పేర్కొన్న విధంగా జర్మనీతో హిట్లర్ స్థాపించిన నాజీ నియంతృత్వానికి వ్యతిరేకంగా అనేక ప్రాంతీయ భద్రతా ఒడంబడికలు జరిగినాయి. కాని ఈ ప్రాంతీయ భద్రతా ఒడంబడికలు అంతర్జాతీయ ఉద్రిక్తతను నివారించడానికి బదులు మరింత తీవ్రంచేసి రెండో ప్రపంచ యుద్ధానికి దారితీసింది.

**యం. దాసు**

పాఠం - 4

# నానాజాతి సమితి

**లక్ష్యం :**

మొదటి ప్రపంచ యుద్ధానంతరం స్థాపించబడిన నానాజాతి సమితి నిర్మాణము, సమితి కార్యకలాపాలు, సమితి విఫలం కావడానికి కారణాలు గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

**విషయ సంగ్రహం**


4.1 పరిచయం

4.2 సమితి ఉద్దేశాలు, లక్ష్యాలు

4.3 సమితి ఒడంబడిక

4.4 సమితి నిర్మాణము

4.4.1. సమితి మహాసభ

4.4.2. సమితి మండలి

4.4.3 సమితి సచివాలయము

4.4.4 శాశ్వత అంతర్జాతీయ న్యాయ స్థానము

4.4.5 అంతర్జాతీయ కార్మిక సంస్థ

4.5 సమితి కార్యకలాపాలు

4.6 సమితి సాధించిన రాజకీయ విజయాలు

4.6.1 ఆలండ్ దీవుల వివాదము

4.6.2 ఆల్బేనియా సరిహద్దు వివాదము

4.6.3 ఎగువ సైలీషియా తగాదా

4.6.4 పోలండ్ లిథువేనియాల మధ్య తగాదా

4.6.5 కార్ఫ్యూ వివాదము

4.6.6 జర్మనీ, బెల్జియంల మధ్య తగాదా

4.6.7 గ్రీస్, బల్గేరియాల మధ్య సరిహద్దు తగాదా

4.6.8 మోసుల్ వివాదము

4.6.9 బొలీవియా, పరాగ్వేల మధ్య తగాదా

4.7 ఆర్థిక, సాంఘిక మానవతా రంగాలలో సమితి కార్యకలాపాలు

4.8 సార్ పరిపాలన

4.9 డాన్‌జిగ్ పరిపాలన

4.10 ఆదిష్ట పద్ధతి

4.11 అల్పసంఖ్యాక వర్గాలు

4.12 సమితి క్షీణదశ

**4.12.1** మంచూరియా మీద జపాన్ దురాక్రమణ

**4.12.2** ఇథియోపియా మీద ఇటలీ దురాక్రమణ

4.12.3 స్పెయిన్ అంతర్యుద్ధము

4.12.4 నిరాయుధీకరణ

**4.12.5** నౌకాదళాయుధాల తగ్గింపు ప్రతిపాదన

4.13 నానాజాతి సమితి విఫలం కావడానికి కారణాలు

## 4.1. పరిచయం :

19వ శతాబ్దంలో ప్రపంచ దేశాల మధ్య అనేక యుద్ధాలు జరగడమేకాక మానవ జాతి నాగరికతనంతా విధ్వంసంచేయగల మారణాయుధాలు కూడా కనుగొన్నారు. అయితే ఇదే కాలంలో ప్రపంచ దేశాలమధ్య సహకారమూ సదవగాహనము ఐకమత్యమూ పెంపొందించి యుద్ధాలను నివారించటానికి కొన్ని ప్రయత్నాలు కూడా జరిగినాయి. అంతర్జాతీయ వివాదాలు శాంతియుతంగా పరిష్కారం కావాలని యూరప్ దేశాల ప్రయత్నాల ఫలితంగా మొదటి ప్రపంచ యుద్ధానంతరం నానాజాతి సమితి (League of Nations) అనే ఒక అంతర్జాతీయ సంస్థను నెలకొల్పడం జరిగింది.

మొదటి ప్రపంచ యుద్ధం జరిగే కాలంలో ప్రపంచ దేశాలన్నీ ముఖ్యంగా యూరప్ దేశాలు చెప్పలేని బాధలకు గురైనాయి. ఈ యుద్ధ కాలంలో జరిగినటువంటి విశేష జన నష్టమూ ధన నష్టమూ మారణాయుధాల ఉపయోగమూ ప్రపంచ ప్రజలలో విపరీతమైన భయాందోళనలు కలుగజేసినాయి. వివిధ దేశాలమధ్య సహకారం పెంపొంది తద్వారా ప్రపంచ శాంతి నెలకొనవలెనని ప్రపంచ ప్రజలు ఆతురతను చూపసాగినారు. అంతర్జాతీయ సమస్యలను చర్చించి పరిష్కార మార్గాలను అన్వేషించటానికి ఒక అంతర్జాతీయ సంస్థ ఏర్పడవలెనని యుద్ధకాలంలోనే ఇంగ్లాండ్, ఫ్రాన్స్, అమెరికా, జర్మనీ మొదలైన దేశాలలోని రాజకీయ వేత్తలు గుర్తించినారు.

ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌లు, హోరాహోరీగా జర్మనీతో యుద్ధం చేస్తున్న రోజులలో సుస్థిర శాంతి స్థాపన కోసం అమెరికాలో అనేక ప్రయత్నాలు జరిగినాయి. అమెరికాలో 1915లో శాంతి పరిరక్షణ కోసం ఒక సంస్థను ఏర్పాటు చేయడం జరిగింది. 1916లో జరిగిన వాషింగ్‌టన్ సమావేశంలో అధ్యక్షుడు ఉడ్రోవిల్సన్ పాల్గొని ప్రపంచ మంతటిలోను శాంతిని ధర్మాన్ని నెలకొల్పటానికి ఒక అంతర్జాతీయ వ్యవస్థ అవసరమని ప్రకటించినాడు. అయితే ఈ సమావేశం జరిగిన కొద్ది కాలం తరువాతనే అమెరికా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సుస్థిర శాంతి స్థాపన కోసం మిత్ర రాజ్యాల తరఫున యుద్ధంలో చేరింది. చివరికి క్రీ.శ. 1919 జనవరి 8న ఉడ్రోవిల్సన్ తన 14 సూత్రాల పథకాన్ని ప్రకటించినాడు. అమెరికా అధ్యక్షుని 14 సూత్రాలలోని చివరి సూత్రం ఆధారంగా నానాజాతి సమితిని ఏర్పాటు చేయడం జరిగింది.

బ్రిటీష్ విదేశాంగ మంత్రి బాల్‌ఫూర్ (Balfour) కూడా ప్రపంచ శాంతి స్థాపనకోసం అంతర్జాతీయ వ్యవస్థ అవసరాన్ని గుర్తించి ఫేబియన్ సొసైటీ ఆఫ్ ఇంగ్లాండ్ (Fabian Society of England) ను ఈ కృషి సాధనకు 1915లో నియమించినాడు. ఈ సంధులలో బ్రైస్ అనే అతడు ఒక ప్రముఖ సభ్యుడు. అమెరికా అధ్యక్షుడు సూచించినటువంటి పథకం వంటిదానినే బ్రైస్ కూడా సూచించినాడు. డిసెంబర్ 1916లో సర్‌వాల్టర్ ఫిల్లిమోర్ (Sir Walter Phillimore) అధ్యక్షతన ప్రపంచ సంస్థ స్థాపనకు సంబంధించిన విషయాలు అధ్యయనముచేసి ఒక ముసాయిదా పథకాన్ని తయారు చేయడానికి బాల్‌ఫూర్ ఒక సంఘాన్ని నియమించినాడు. వివిధ రాజ్యాల మధ్య వివాదాలు శాంతియుతంగా మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారం కావలెనని ఈ సంఘం తన నివేదికలో సిఫారసు చేసింది.

అంతర్జాతీయ శాంతి స్థాపనకోసం ప్రపంచ సంస్థకు సంబంధించిన వివరాలను రూపొందిస్తూ ఫ్రాన్స్ కూడా ఒక పథకాన్ని తయారు చేసింది. దీనికి బూర్జువా పథకము (Bourgeois Scheme) అని పేరు. యుద్ధాలను నివారించటానికి సుస్థిర శాంతిని స్థాపించటానికి

దక్షిణాఫ్రికాకు చెందిన జనరల్ స్మట్స్ (General Smuts) కూడా ఒక పథకాన్ని తయారు చేసినాడు. అంతర్జాతీయ సంస్థ నిర్ణయాలు అమలు పరచటానికి ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేయాలని జనరల్ స్మట్స్ సూచించాడు. ఈ విధంగా యుద్ధ కాలంలోనే అమెరికా ఇంగ్లాండ్, ఫ్రాన్స్ మొదలైన దేశాలలో అంతర్జాతీయ వివాదాల పరిష్కారానికి ప్రపంచ సంస్థ అవసరాన్ని గుర్తించడం జరిగింది. అయితే దేశాలమధ్య యుద్ధాలు నివారించబడి వివాదాలు శాంతియుతంగా పరిష్కారము కావలెననే కోరిక యూరప్ దేశాల నాయకులలో యుద్ధానంతరం ఎక్కువైంది. అంతేకాక ప్రపంచ సంస్థ అవసరాన్ని యూరప్ నాయకులందరు యుద్ధం ముగిసిన తరువాత బాగా గుర్తించినారు.

ఉడ్రోవిల్సన్ 14 సూత్రాలలోని చివరి సూత్రం ఆధారంగా నానాజాతి సమితి అనే ప్రపంచ సంస్థను ఏర్పాటు చేయడం జరిగింది. నానాజాతి సమితి స్థాపనకు సంబంధించిన వివరాలు రూపొందించటానికి పారిస్ శాంతి సమావేశం ఉడ్రోవిల్సన్ అధ్యక్షుడుగా 19 మంది సభ్యులతో కూడిన ఒక సంఘాన్ని నియమించింది. సమితి ఒడంబడికను (League Covenant) సమితి రాజ్యాంగాన్ని (League Constitution), 1919 ఫిబ్రవరి నాటికి ఈ సంఘం తయారు చేసింది. అన్ని రాజ్యాలకు సమాన హక్కులు ఇవ్వవలెననే జపాన్ ప్రతిపాదనను అమెరికా, ఇంగ్లాండ్‌లు తిరస్కరించినాయి. కొన్ని సవరణలు చేసిన తరువాత పారిస్ శాంతి సమావేశము 26 ప్రకరణలతోను ఒక ప్రణాళిక (Preamble) తోను కూడిన సమితి ఒడంబడిక పత్రాన్ని ఆమోదించి వర్సే సంధిలో మొదటి భాగంగా చేర్చింది. నానాజాతి సమితి 1920 జనవరి నుంచి అమలులోకి వచ్చింది.

నానాజాతి సమితి, జాగ్రత్తగా పరిశీలిస్తే నిజానికి పూర్తిగా కొత్త సంస్థకాదని చెప్పవచ్చు. ప్రాచీన యుగంలో రోమన్ సామ్రాజ్యము మధ్య యుగంలో పవిత్ర రోమన్ సామ్రాజ్యము రోమన్ కాథలిక్ చర్చి ప్రపంచ దేశాలమధ్య సార్వత్రిక సహకారము వుండవలెననే ఆదర్శాన్ని ప్రబోధించినాయి. ఆధునిక యుగంలో ముఖ్యంగా పారిశ్రామిక విప్లవం తరువాత, శాస్త్ర పరిశోధనలు జరిగిన తరువాత అంతర్జాతీయ సహకారమనే ఆదర్శము ఎక్కువగా ప్రాముఖ్యములోకి వచ్చింది. నెపోలియన్ పతనానంతరం స్థాపితమైన యూరప్, రాజ్యాల బద్ధకూటమి (Concert of Europe) అగ్ర రాజ్యాలమధ్య సహకారం పెంపొందించటానికి ప్రయత్నించింది. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలోనూ యుద్ధము ముగిసిన తరువాత జరిగిన ప్రయత్నాల ఫలితంగా నానాజాతి సమితిని స్థాపించడం జరిగింది. నానాజాతి సమితి ప్రొఫెసర్ టయిన్బీ చెప్పినట్లుగా ఆస్ట్రియా ఛాన్సలర్ మెటర్నిఖ్, రష్యా చక్రవర్తి మొదటి అలెగ్జాండర్‌లు నెలకొల్పిన యూరప్ రాజ్యాల బద్ధకూటమి స్థానే నెలకొల్పినటువంటి సంస్థ అని చెప్పవచ్చు. అయితే యూరప్ రాజ్యాల బద్ధకూటమి యూరప్‌కు చెందిన కొన్ని అగ్ర రాజ్యాలకు మాత్రమే పరిమితమైన సంస్థ. నానాజాతి సమితిలో సభ్యత్వము ఒడంబడికలోని షరతులను అంగీకరించిన దేశాలన్నింటికీ ఇవ్వవచ్చు. అందువల్ల నానాజాతి సమితి నిజమైన ప్రపంచ సంస్థ అని చెప్పవచ్చు. సమిష్టి భద్రతకు ప్రాముఖ్యము ఇవ్వడం సమితి విషయమై చెప్పుకోదగిన ప్రత్యేకత అని కూడా చెప్పవచ్చు.

## 4.2. సమితి ఉద్దేశాలు, లక్ష్యాలు :

సమితి ముఖ్యోద్దేశాలను లక్ష్యాలను సమితి ఒడంబడికలో ప్రవేశికగా చేర్చినారు. అంతర్జాతీయ సహకారం పెంపొందించి అంతర్జాతీయ శాంతి భద్రతలు సాధించడం సమితి ప్రధాన లక్ష్యంగా పేర్కొనడం జరిగింది. ఈ సంస్థ ఇతర లక్ష్యాలు : 1) యుద్ధము తలపెట్టక బాధ్యతలు నిర్వహించడానికి వివిధ దేశాలు అంగీకరించేటట్లు చేయడం. 2) దేశాల మధ్య బహిరంగంగా న్యాయంగా ఉండే సంబంధాలు నెలకొల్పడం. 3) ప్రభుత్వాల మధ్య అంతర్జాతీయ న్యాయ రీత్యా సత్సంబంధాలు ఏర్పరచడం 4) సమితి ఒడంబడిక పత్రాన్ని ప్రపంచ దేశాలన్నీ అంగీకరించేటట్లు చేయడం.

సమితి ఒడంబడిక పత్రంమీద సంతకాలు చేసిన సభ్యరాజ్యాలు కొన్ని బాధ్యతలకు కట్టుబడి ఉండటానికి అంగీకరించినాయి. సభ్య రాజ్యాల మధ్య తగాదాలు వచ్చినపుడు యుద్ధానికి దిగక శాంతియుతంగా పరిష్కారం చేసికోవటానికి ప్రయత్నాలు చేయవలె. ఇందుకు భిన్నంగా ప్రవర్తించిన రాజ్యాల మీద తక్కిన సభ్యరాజ్యాలు తగిన చర్య తీసుకోవలె. అవసరాన్ని బట్టి ఆచర్య ఆర్థిక దిగ్బంధంగా గాని, సైనిక ప్రయోగంగా గానీ ఉండవచ్చు. సభ్య రాజ్యాల మధ్య తగాదాలు వచ్చినపుడు సమితి మధ్యవర్తిత్వాన్ని శిరసావహించవలె. సభ్యరాజ్యాల మధ్య జరిగే సంధి పత్రాల ప్రతులు సమితికి అందజేయవలె. తమ ఆధీనంలో ఉంచబడిన అధిష్ఠ రాజ్యాల (Mandatory States) పరిస్థితుల మీద వార్షిక నివేదికను సభ్య రాజ్యాలు సమితికి నివేదించవలె.

సమితి రెండు ముఖ్యమైన విధులను నిర్వహించవలెను.

1) అంతర్జాతీయ శాంతి భద్రతలను కాపాడటం

2) రాజకీయ, సాంఘిక, ఆర్థిక, విజ్ఞాన రంగాలలో అంతర్జాతీయ సహకారం పెంపొందించడం ఈ రెండు సమితి ముఖ్య విధులను సమితి ప్రవేశికలో చేర్చడం జరిగింది.

పైన పేర్కొన్న ముఖ్య విధులు కాక సమితికి ప్రత్యేకమైన విధులు కూడా ఉన్నాయి. అవి. 1) అల్ప సంఖ్యాక వర్గ ప్రజల రక్షణకు హామీ ఇవ్వడం 2) విద్య, ఆరోగ్యము రాకపోకలు, ఆర్థికాభివృద్ధి శ్రామిక ప్రజల పరిస్థితులు మొదలైన విషయాలలో అంతర్జాతీయ సహకారం పెంపొందించడం 3) దేశాల మధ్య వివాదాలను శాంతియుతంగా పరిష్కరించి యుద్ధాలను నివారించడం.

## 4.3 సమితి ఒడంబడిక :

సమితి ఒడంబడికలోని 26 ప్రకరణాలలోను మొదటి ఏడు ప్రకరణాలు సమితి నిర్మాణము, అధికారాలు, విధులకు సంబంధించినవి. 14వ ప్రకరణము అంతర్జాతీయ న్యాయస్థానం ఏర్పాటుకు సంబంధించిన నియమాలను పొందుపరచింది. 8, 9 ప్రకరణాలు ఆయుధాల తగ్గింపుకు సంబంధించినవి. 11, 12, 13, 15, 17 ప్రకరణాలు దేశాలమధ్య వివాదాలు శాంతియుత పరిష్కారానికి సంబంధించినవి. 10, 16, 17 ప్రకరణాలు సమిష్టి భద్రతకు సంబంధించినవి. 18, 19, 20, 21 ప్రకరణాలు అంతర్జాతీయ సంధుల ప్రచురణకు పునఃపరిశీలనకు సంబంధించినవి. 22వ ప్రకరణము యుద్ధంలో ఓడిపోయిన రాజ్యాలనుంచి తీసుకున్న వెనుకబడిన వలస ప్రాంతాల పరిపాలనకు అంటే అధిష్ఠ ప్రాంతాల పరిపాలనకు సంబంధించినది. 23వ ప్రకరణము సభ్య రాజ్యాలలోని కార్మికుల పరిస్థితులను మెరుగు పరచడానికి సంబంధించింది. 24వ ప్రకరణము సభ్య రాజ్యాల మధ్య ఆర్థిక సంబంధాలకు సంబంధించినది. 25వ ప్రకరణము అంతర్జాతీయ రెడ్ క్రాస్ సంస్థ స్థాపనకు సంబంధించినది. 26వ ప్రకరణము సమితి ఒడంబడిక సవరణకు సంబంధించినది. ఈ ప్రకరణం ప్రకారం సమితి మండలి ఏకగ్రీవామోదం సమితి మహాసభ మెజారిటీ ఆమోదంతో మాత్రమే ఒడంబడికలో సవరణలు చేయవచ్చు.

## 4.4. సమితి నిర్మాణము :

జనవరి 1920లో సమితి ప్రారంభమైనపుడు సభ్య రాజ్యాల సంఖ్య 24 మాత్రమే. క్రీ.శ. 1934 నాటికి సభ్య రాజ్యాల సంఖ్య 60కి పెరిగింది. 1946లో అంటే సమితి చివరి సంవత్సరంలో సభ్య రాజ్యాల సంఖ్య 43. జర్మనీ 1926 వరకు సమితిలో సభ్యరాజ్యం కాదు. రష్యాకు సమితిలో సభ్యత్వము 1934లో ఇచ్చినారు. అమెరికా సమితిలో సభ్యరాజ్యంగా చేరలేదు.

నానాజాతి సమితిలో మూడు ప్రధానాంగాలున్నాయి.

1) సమితి మహాసభ (The League Assembly)

2) సమితి మండలి (League Council)

3) సమితి సచివాలయం (League Secretariat)

సమితికి సంబంధించిన మరి రెండు స్వయం పరిపాలనాధికారాలున్న అంగాలున్నాయి. 1) శాశ్వత అంతర్జాతీయ న్యాయస్థానము. (The Permanant Court of Internation Justice) 2) అంతర్జాతీయ కార్మిక సంస్థ (The International Labour Organisation).

పైన పేర్కొన్న ప్రధానమైన అంగాలు, స్వయం పరిపాలనాధికారమున్న అంగాలు కాక సమితిలో ఈ క్రింది సహాయక అంగాలు కూడా ఉన్నాయి.

1) అధిష్ఠ ప్రాంతాల సంఘము 2) అంతర్జాతీయ జ్ఞానాభివృద్ధి సంస్థ 3) అంతర్జాతీయ టారిఫ్ సంఘము 4) అంతర్జాతీయ ఆర్థిక సంఘము 5) అంతర్జాతీయ ఆయుధాల సంఘము 6) అంతర్జాతీయ రాకపోకల సంఘము మొదలైనవి.

5)

**4.4.1. సమితి మహాసభ :** మహాసభ నానాజాతి సమితికి చెందిన శాసనాధికారమున్న సంస్థ. సమితి సభ్యరాజ్యాల ప్రతినిధులు మహాసభలో సభ్యులు. ప్రతి సభ్యరాజ్యమూ మహాసభకు ముగ్గురు ప్రతినిధులను పంపవచ్చు. కాని ఓటింగ్ హక్కు ఒక్కరికే ఉంటుంది. అంటే ఒక సభ్య రాజ్యానికి ఒక ఓటు మాత్రమే ఉంటుంది. మహాసభ సమావేశాలకు వార్షికంగా ఎన్నుకోబడిన అధ్యక్షుడు అధ్యక్షత వహిస్తాడు. మహాసభ ఒక అధ్యక్షుని 8మంది ఉపాధ్యక్షులను ఎన్నుకొంటుంది. మహాసభ వార్షిక సమావేశాలు జెనీవాలో ప్రతి సంవత్సరం సెప్టెంబర్ నెలలో జరుగవలె. కొత్త సభ్యులను చేర్చుకొనే విషయంలో తప్ప మహాసభ తీర్మానాలన్నీ ఏకగ్రీవంగా జరుగవలె. మహాసభలో కొన్ని స్థాయీ సంఘాలు (Standing Committees) ఉప సంఘాలు (Sub Committees) ఉంటాయి. ఈ స్థాయీ సంఘాల ఉప సంఘాల సహాయంతో మహాసభ కార్యక్రమాలు రూపొందించడం జరుగుతుంది.

మహాసభ విధులు : మహాసభలు నిర్వహించవలసిన విధులు

**1) ఎన్నికకు సంబంధించిన విధులు :** మూడింట రెండు వంతుల మెజారిటీతో కొత్త సభ్యులను మహాసభలో చేర్చుకోవడం. 2) సమితి మండలికి తాత్కాలిక సభ్యులను వార్షికంగా కన్నుకోవడం. 3) మండలి చేసిన ప్రధాన కార్యదర్శి (Secretary General) నియామకాన్ని ధ్రువపరచడం 4) అంతర్జాతీయ న్యాయస్థానానికి 15 మంది న్యాయమూర్తులను నిర్ణీత కాలానికి మండలితో కలసి సంయుక్తంగా ఎన్నుకోవడం.

**2) సమితి రాజ్యాంగ సవరణకు సంబంధించిన విధులు :** సమితికి సంబంధించిన నియమాలను నిబంధనలను మార్చే అధికారము మహాసభకు వుంది. సమితి ఒడంబడిక ప్రకారం మహాసభకు ఒడంబడికను సవరించే అధికారం కూడా వుంది. అయితే మహాసభ చేసిన సవరణలన్నీ మండలి ఆమోదాన్ని పొందవలె.

**3) పర్యాలోచక విధులు :** మహాసభ ఈ క్రింది పర్యాలోచక విధులు నిర్వహించవలె 1) అంతర్జాతీయ ప్రయోజనాలున్న రాజకీయ, ఆర్థిక, సాంకేతిక సమస్యలను చర్చించడం. 2) అంతర్జాతీయ శాంతికిగాని సభ్య దేశాల అంతరంగిక శాంతికిగాని భంగం కలిగినపుడు ఆయా పరిస్థితుల మీద సమగ్రమైన చర్చలు జరపడం 3) సమితి వార్షిక బడ్జెట్ తయారుచేసి ఆమోదించడం.

**4) పర్యవేక్షక విధులు :** మహాసభ నిర్వహించవలసిన పర్యవేక్షక విధులు 1) మండలి పనిచేసే విధానాన్ని పర్యవేక్షించడం 5) బడ్జెట్ పనిచేసే విధానాన్ని పర్యవేక్షించడం.

**5) సలహా సంబంధమైన విధులు :** మహాసభ విధులు చాలావరకు సలహా పూర్వకమైనప్పటివే సభ్య రాజ్యాలకు శాసనాలను రూపొందించే అధికారం గాని, తన నిర్ణయాలకు సభ్య రాజ్యాలు కట్టుబడి ఉండేటట్లు నిర్బంధించడానికిగానీ మహాసభకు అధికారం లేదు. కానీ కాలం గడచిన కొద్దీ మహాసభ ప్రతిష్ఠ పెరిగింది. కాల క్రమేణ మహాసభ అనేక అంతర్జాతీయ సమస్యలను చర్చించి పరిష్కరించే చర్చావేదికగా తయారైంది.

పైన పేర్కొన్నట్లుగా మహాసభ విధులు చాలా ఎక్కువేకాక భిన్నమైనట్టివి కూడా అని చెప్పవచ్చు. అనేక అంతర్జాతీయ వివాదాల పరిష్కారానికి మహాసభ ఒక చర్చావేదికగా పరోక్షంగా తన పలుకుబడిని ఉపయోగించింది. ఒక శాసన సభకు కూడా మహాసభ అద్వితీయమైన పాత్ర నిర్వహించింది.

**4.4.2. సమితి మండలి :** మండలి సమితి రాజ్య నిర్వాహణాధికారాలను నిర్వహించే సంస్థ. మండలిని అగ్రరాజ్యాలకు మాత్రమే ప్రాతినిధ్యము వహించే శక్తివంతమైన సంస్థగా తయారు చేయడానికి అగ్రరాజ్యాలు ప్రయత్నించినాయి. కానీ చిన్న రాజ్యాలు గట్టిగా వ్యతిరేకించడం వల్ల అగ్ర రాజ్యాల పథకం విరమించడం జరిగింది. మండలిలో ఐదు అగ్రరాజ్యాలు శాశ్విత స్థానం పొందేటట్లు నాలుగు తాత్కాలిక రాజ్యాలు మహాసభ ఎన్నుకొనేటట్లు అంతిమ నిర్ణయమైంది. కాబట్టి మండలిలో శాశ్వత సభ్యులు (Permanent Members) నలుగురు ఉండే ఏర్పాట్లు చేయడం జరిగింది. మండలి శాశ్వత సభ్య రాజ్యాలు ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఇటలీ, జపాన్‌లు 1926 తర్వాత జర్మనీ తాత్కాలిక సభ్యరాజ్యాలు 1922 వరకు 4, ఆటు తరువాత 6, 1926 తరువాత 9, 1936 తరువాత 11 ఉండేవి.

మండలి సంవత్సరానికి కనీసం 3 పర్యాయాలు జెనీవాలో సమావేశం కావలె అంతేకాక ఏదైనా ఒక సభ్య రాజ్యము విజ్ఞప్తి చేసినపుడు గానీ లేదా అత్యవసర పరిస్థితులు ఏర్పడినపుడు గానీ మండలి సమావేశం కావచ్చు. ప్రతి సమావేశం ప్రారంభంలోనూ అధ్యక్షుని, ఉపాధ్యక్షులను

మండలి ఎన్నుకోవలె. సాధారణంగా అధ్యక్షుని అక్షర క్రమ పద్ధతిని అనుసరించి ఎన్నుకోవలె. మండలి ముఖ్యమైన నిర్ణయాలు ఏకగ్రీవంగా జరగవలె. మండలి సమావేశాలు సాధారణంగా బహిరంగంగా జరగవలె. అయితే కొన్ని పరిస్థితులలో మండలి రహస్య సమావేశాలు కూడా జరపవచ్చు.

మండలి విధులు : మండలి నిర్వహించవలసిన వివిధ రకాలైన విధులను ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చు. తనకు నివేదించిన తగాదాలను విచారించి వాటి పరిష్కారానికి మహాసభకు సలహా ఇవ్వడం మండలి ముఖ్య విధి. స్వతంత్రంగా వ్యవహరించడానికి మండలికి అధికారం లేదు.

మండలికి ఈ క్రింది ప్రత్యేకాధికారాలు విధులు కూడా ఉన్నాయి. మండలి డాన్‌జింగ్ పట్టణ పరిపాలనకు సార్ ప్రాంత పరిపాలనకు బాధ్యత వహించవలె. అధిష్ఠ ప్రదేశాల సంఘం సహాయంతో మండలి అధిష్ఠ ప్రాంతాల పరిపాలనను పర్యవేక్షణ చేయవలె. సమితి ఒడంబడికను ఉల్లంఘించిన సభ్య రాజ్యాన్ని సమితినుంచి బహిష్కరించే అధికారం కూడా మండలికి ఉంది. ఆయుధాల తగ్గింపుకు సమితి ప్రణాళికలు తయారు చేయవలె. సభ్య రాజ్యాలమధ్య వివాదాలను శాంతియుతంగా మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించవలె. ఇందుకోసం అవసరమైన అంతర్జాతీయ సమావేశాలకు కావలసిన ఏర్పాట్లు చేయవలె. సచివాలయం పనిచేసే విధానాన్ని పర్యవేక్షణ చేయవలె. సభ్య రాజ్యాల ప్రాదేశిక సమగ్రతను కాపాడవలె. ఈ విధంగా మండలి కార్యనిర్వాహక విధులకు తోడుగా పరిపాలనా విధులు మొదలైన అనేక ఇతర బాధ్యతలను కూడా నిర్వహించింది.

4.4.3. సమితి సచివాలయము : సమితి మూడో ముఖ్యమైన అంగము సచివాలయము. ఇది సమితి మూడు ప్రధాన అంగాలలోను ముఖ్యమైనదని చెప్పవచ్చు. సచివాలయానికి కేంద్ర స్థానము జెనీవా పట్టణము. సచివాలయం ప్రధాన కార్యదర్శి అతడు నియమించిన దాదాపు 600 మంది సిబ్బంది ఆధిపత్యములో ఉంటుంది. ప్రధాన కార్యదర్శి మహాసభ ఆమోదంతో మండలిచేత నియమితుడవుతాడు. సచివాలయ సిబ్బందిని ప్రధాన కార్యదర్శి మండలి ఆమోదంతో నియమిస్తాడు. సచివాలయ నిర్వాహణకయ్యే ఖర్చులు సభ్య రాజ్యాలు విరాళాల రూపంలో భరించవలె. సచివాలయ సిబ్బందిలోని స్త్రీ పురుష ఉద్యోగస్తులందరూ అంతర్జాతీయ తత్వాన్ని అలవాటుచేసుకొని విధి నిర్వహణలో మంచి పేరు ప్రతిష్ఠలు సంపాదించినారు. సచివాలయ పరిపాలనా యంత్రాంగము అధిష్ఠ ప్రాంతాలు, నిరాయుధీకరణము, అల్ప సంఖ్యాక వర్గ ప్రజలు, ఆర్థిక సమస్యలు మొదలైన 11 భాగాలుగా విభజితమైంది. సచివాలయ సిబ్బంది నేర్పుతో పనిచేసి మంచి పేరు సంపాదించుటయేగాక సమితి సభ్య రాజ్యాల విశ్వాసాన్ని చూరగొన్నది. మహాసభ మండలి చేసిన తీర్మానాలను సచివాలయము అమలు పరచవలె. సచివాలయం పని చేసిన తీరుతెన్నులు మొత్తంమీద చాలా సంతృప్తికరంగా ఉన్నాయి. సమితి మొదటి ప్రధానకార్యదర్శి అయిన సర్ ఎరిక్‌డ్రమండ్ నిష్పాక్షికమైన పరిపాలకులు అని మంచి పేరు ప్రఖ్యాతులు పొందినాడు. చివరి ప్రధాన కార్యదర్శి అయిన స్టీన్ లెస్టర్ (Stean Lester) కూడా మంచి పేరు ప్రతిష్ఠలు ఉన్నవాడు.

## 4.4. శాశ్వత అంతర్జాతీయ న్యాయస్థానము :

సమితి ఒడంబడికలోని 14వ ప్రకరణం అనుసరించి సభ్యరాజ్యాలమధ్య తగాదాలను పరిష్కరించడానికి ఒక అంతర్జాతీయ న్యాయస్థానం నెలకొల్పడం జరిగింది. ఈ ప్రకరణాన్ని అనుసరించి 1920లో సమితి మండలి అంతర్జాతీయ న్యాయస్థాపనకు పథకాన్ని తయారు చేయడానికి న్యాయశాస్త్రవేత్తల సంఘాన్ని (Commission of Jurists) నియమించింది. ఈ సంఘం సమర్పించిన పథకాన్ని కొద్ది సవరణలతో సమితి మహాసభ 1920 డిసెంబర్ 13న ఆమోదించి చట్టంగా రూపొందింది. దీని ఫలితంగా 1921 సెప్టెంబరులో న్యాయమూర్తులు ఎన్నికై 1922 ఫిబ్రవరి నాటికి అంతర్జాతీయ న్యాయస్థానము హేగ్ (Hague) లోని శాంతిభవనంలో పనిచేయడం ప్రారంభించింది.

అంతర్జాతీయ న్యాయస్థానంలో 15 మంది న్యాయమూర్తులుంటారు. వీరిని మహాసభ మండలికలసి మెజారిటీ ఓటు పద్ధతిద్వారా 9 సంవత్సరాల కొకసారి ఎన్నుకొంటాయి. వివిధ దేశాలకు చెందిన, అంతర్జాతీయ న్యాయశాస్త్రంలో ప్రావీణ్యమున్న పేరు ప్రఖ్యాతులున్న న్యాయ వేత్తలను మాత్రమే న్యాయమూర్తులుగా ఎన్నుకోవడం జరుగుతుంది. న్యాయమూర్తులను మహాసభగాని మండలిగాని తొలగించటానికి వీలులేదు. ఈ న్యాయస్థానానికి చెందిన న్యాయమూర్తులు మాత్రమే ఏకగ్రీవ నిర్ణయం ద్వారా ఒక న్యాయమూర్తిని తొలగించగలరు. న్యాయ

మూర్తులు తిరిగి ఎన్నికకావచ్చు. అంతర్జాతీయ న్యాయస్థానానికి అధ్యక్ష ఉపాధ్యక్షులను న్యాయమూర్తులే 3 సంవత్సరాల కాలపరిమితికి ఎన్నుకొంటారు. ఈ న్యాయ స్థానానికి ఒక రిజిస్ట్రార్ కూడా ఉంటాడు. అంతర్జాతీయ న్యాయస్థానము సాధారణంగా మెజారిటీ తీర్పు ఇస్తుంది. న్యాయస్థానం తీర్పు రాజకీయ బలాబలాలమీదకాక న్యాయ సూత్రాల మీద ఆధారపడి వుంటుంది. ఈ న్యాయ స్థానం కనీసం సంవత్సరానికికొకసారి సమావేశం కావాలి.

సమితి సభ్య రాజ్యాల మధ్య తగాదాలను సమితి ఒడంబడికకు జతపరచిన జాబితాలోని రాజ్యాల మధ్య తగాదాలను మాత్రమే అంతర్జాతీయ న్యాయస్థానం స్వీకరించి తీర్పు ఇస్తుంది. తమకు సంబంధించిన కేసులను అంతర్జాతీయ న్యాయస్థానానికి సమర్పించడం, ఆయా రాజ్యాల ఇష్టాఇష్టాలమీద ఆధారపడి ఉంటుంది. 1922లో సమితి చేసిన ఒక నిర్ణయం ప్రకారం సమితిలో సభ్యత్వం లేని రాజ్యాలు కూడా తమ కేసులను అంతర్జాతీయ న్యాయస్థానానికి నివేదించవచ్చు. అయితే న్యాయస్థానం ఇచ్చిన తీర్పును తప్పనిసరిగా అంగీకరించి అమలు పరచవలె. అంతర్జాతీయ న్యాయస్థానం అధికార పరిధి రెండు రకాలు. ఒకటి స్వచ్ఛందము, రెండవది నిర్బంధము. రెండుగాని అంతకంటే ఎక్కువ రాజ్యాలుగాని తమ తగాదాను అంతర్జాతీయ న్యాయస్థానానికి నివేదించినప్పుడు న్యాయస్థాన మిచ్చిన తీర్పును ఆ రాజ్యాలు స్వచ్ఛందంగా ఆమోదించవచ్చు లేక వ్యతిరేకించవచ్చు. అంటే అంతర్జాతీయ న్యాయస్థానము ఇచ్చిన తీర్పును అమలు పరచడం రాజ్యాల ఇష్టాయిష్టాలమీద ఆధారపడి ఉంటుంది. అయితే అంతర్జాతీయ న్యాయస్థానానికి నిర్బంధ అధికార పరిధి కూడా ఉంది. ఈ నిబంధన ప్రకారం సమితి సభ్య రాజ్యాలు, ఒడంబడికకు జతపరచబడిన జాబితాలోని రాజ్యాలు తప్పని సరిగా సంధుల అమలుకు, అంతర్జాతీయ బాధ్యతల అమలుకు సంబంధించిన తగాదాలను అంతర్జాతీయ న్యాయస్థానానికి నివేదించడమే కాక న్యాయస్థానమిచ్చిన తీర్పును, తుది పరిష్కారంగా పరిగణించి అంగీకరించవలె. తనకు నివేదించిన తగాదాలను పరిశీలించి పరిష్కరించేటప్పుడు అంతర్జాతీయ న్యాయస్థానం నియమిత న్యాయస్థానాలు అనుసరించే విధానాన్నే అనుసరిస్తుంది. తగాదాలను పరిష్కరించేటప్పుడు అంతర్జాతీయ న్యాయస్థానము అంతర్జాతీయ సంప్రదాయాన్ని పరిగణలోనికి తీసుకోవలె. అంతర్జాతీయ ఆచారాలను కూడా ఈ న్యాయస్థానము అనుసరించవలె. నాగరిక దేశాలు అంగీకరించిన సాధారణ న్యాయ సూత్రాలు అంతర్జాతీయ న్యాయస్థానం అనుసరించవలసిన మరొక సిద్ధాంతము. లోగడ చేసిన న్యాయ నిర్ణయాలు కూడా అంతర్జాతీయ న్యాయస్థానం అనుసరించవలె.

ఒడంబడికలోని 14వ ప్రకరణం ప్రకారం మహాసభగాని, మండలిగాని తనకు నివేదించిన సమస్యలమీద అంతర్జాతీయ న్యాయస్థానము సలహాలు ఇవ్వవలె. అయితే అంతర్జాతీయ న్యాయస్థానమిచ్చిన సలహాలను మహాసభగాని, మండలిగాని, తగాదాతో సంబంధమున్న పక్షాలుగాని విధిగా పాటించవలసిన అవసరం లేదు.

అంతర్జాతీయ న్యాయస్థానము చాలా ఉపయోగకరమైన పని చేసింది. నిష్పాక్షికమైన న్యాయ స్థానంగా గొప్పపేరు ప్రతిష్ఠలను సంపాదించుకున్నది. అంతర్జాతీయ న్యాయస్థానము సుమారు 200 ఉత్తరువులు జారీ చేసింది. 65 కేసులను విచారించింది. 32 తీర్పులు ఇచ్చింది. 27 విషయాలలో సలహాలు ఇచ్చింది. అంతర్జాతీయ న్యాయస్థానం ఉత్తరువుల, తీర్పులు, సలహాలు చాలా వరకు మంచి విశ్వాసంతో ఆమోదించడం జరిగింది. దీనికి కారణం న్యాయ మూర్తుల సామర్థ్యము, పక్షపాత రహితమైన వైఖరి అని చెప్పవచ్చు.

**4.4.5. అంతర్జాతీయ కార్మిక సంస్థ :** అంతర్జాతీయ కార్మిక సంస్థ సమితికి చెందిన మరియొక స్వయంపాలనాధికారమున్న సంస్థ. సమితిలో సభ్యులందరూ అంతర్జాతీయ కార్మిక సంస్థలో కూడా సభ్యులు. సాంకేతికంగా అంతర్జాతీయ కార్మిక సంస్థ సమితిలో భాగంకాదు. ఇది వర్సై సంధిలోని 13వ భాగం వల్ల అమలులోనికి వచ్చింది. సమితిలో సభ్యరాజ్యాలేకాక సభ్యత్వం లేని రాజ్యాలు కూడా అంతర్జాతీయ కార్మిక సంస్థలో చేరవచ్చు. సమితిలో సభ్య రాజ్యంగా చేరకముందే జర్మనీ కార్మిక సంస్థలో ప్రాతినిధ్యం పొందింది. సమితిలో సభ్య రాజ్యంగా చేరడానికి నిరాకరించిన అమెరికా అంతర్జాతీయ కార్మిక సంస్థలో 1934లో చేరింది. సమితినుంచి తన సభ్యత్వాన్ని ఉపసంహరించుకొన్న తరువాత కూడా బ్రెజిల్ అంతర్జాతీయ కార్మిక సంస్థలో సభ్య రాజ్యంగా కొనసాగింది.

అంతర్జాతీయ కార్మిక సంస్థ ముఖ్య లక్ష్యము ఒడంబడికలోని 23వ ప్రకరణం ప్రకారం వివిధ దేశాలలోని కార్మికుల మధ్య, కార్మికులకు యజమానులకు మధ్య సహకారం పెంపొందించడం, అంతర్జాతీయ కార్మిక సంస్థ ఇతర లక్ష్యాలు కార్మికులపని స్థితి గతులను మెరుగుపరచడం, కార్మికుల పనికాలాన్ని న్యాయంగా నిర్ణయించడం, కార్మికులకు సబబైన జీతభత్యాలు, పెన్షన్, బోనస్ మొదలైన సౌకర్యాలు

కలుగజేయటం, రోగగ్రస్తులైన కార్మికులకు వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయడం, స్త్రీలు, శిశువుల యోగ క్షేమాల రక్షణకు ఏర్పాట్లు చేయడం, కార్మికులను యాజమాన్యంలో పాల్గొనేటట్లు చేయడం, కార్మిక సంఘాలు ఏర్పరచుకొనే స్వేచ్ఛను కార్మికులకు కలుగ జేయటం మొదలైనవి.

అంతర్జాతీయ కార్మిక సంస్థ తన విధులను ఒక రాజ్యాంగం ప్రకారం నిర్వహించింది. దీని రాజ్యాంగము సమితి రాజ్యాంగాన్ని పోలి వున్నది. అంతర్జాతీయ కార్మిక సంస్థలో ముఖ్యంగా మూడు విభాగాలు ఉన్నాయి. 1. సాధారణ సమావేశము, 2. పాలక వర్గము, 3. అంతర్జాతీయ కార్మిక కార్యాలయము.

**సాధారణ సమావేశము :** ప్రతి సభ్య రాజ్యము అంతర్జాతీయ కార్మిక సంస్థ సాధారణ సమావేశానికి 4గురు ప్రతినిధులను పంపవచ్చు. ఇందులో ఇద్దరు ప్రభుత్వ ప్రతినిధులు, ఒకరు కార్మిక ప్రతినిధి, మరొకరు యాజమాన్య ప్రతినిధి. సాధారణ సమావేశము కనీసం సంవత్సరానికి ఒకసారి జరగవలె. అవసరమైతే ఒకటి కంటే ఎక్కువ పర్యాయాలు కూడా సమావేశం కావచ్చు. దీనిని అంతర్జాతీయ కార్మిక సంస్థ శాసన విభాగమని పేర్కొనవచ్చు. సాధారణ సమావేశము జెనీవా పట్టణంలో జరగవలె. దీని నిర్ణయాలు సాధారణంగా ఏకగ్రీవంగా జరుగుతాయి. అయితే అవసరమైనప్పుడు మెజారిటీ నిర్ణయాలు కూడా చేయవచ్చు. కార్మిక సంస్థ రాజ్యాంగ సవరణకు మూడింట రెండు వంతుల మెజారిటీకావలె. సాధారణ సమావేశం చేసిన రాజ్యాంగ సవరణకు పాలక వర్గము ధ్రువపరచవలె. సాధారణ సమావేశం చేసే సిఫారసులు మూడింట రెండు వంతుల మెజారిటీతో జరగవలె. సభ్య రాజ్యాలు కార్మిక చట్టాలు చేయడానికి కావలసిన సిఫారసులను సాధారణ సమావేశం చేయవలె.

**పాలక వర్గము :** 32 మంది సభ్యులున్న పాలకవర్గాన్ని సాధారణ సమావేశము మూడు సంవత్సరాల కాలపరిమితికి ఎన్నుకొంటుంది. పాలక వర్గములోని 32 మంది సభ్యులలో 16 మంది ప్రభుత్వ ప్రతినిధులు ఉంటారు. 16 మంది ప్రభుత్వ ప్రతినిధులలో సగం మందిని పారిశ్రామికంగా ప్రాముఖ్యమున్న రాజ్యాల నుంచి ఎన్నిక చేయవలె. మిగిలిన 8 మంది ప్రభుత్వ సభ్యులను సాధారణ సమావేశానికి చెందిన ప్రభుత్వ ప్రతినిధులు ఎన్నుకొంటారు. పాలక వర్గము 8 మంది ప్రతినిధులను ఉద్యోగులు మరి 8 మంది ప్రతినిధులను యాజమాన్యం వారు ఎన్నుకొంటారు. పాలక వర్గము సాధారణ సమావేశ కార్యక్రమాల పట్టికను నిర్ణయించడమేకాక అంతర్జాతీయ కార్మిక కార్యాలయానికి ఒక డైరెక్టర్‌ను కూడా నియమిస్తుంది. పాలక వర్గము కనీసం మూడు నెలలకొక పర్యాయం సమావేశమవుతుంది.

**అంతర్జాతీయ కార్మిక సచివాలయము :** అంతర్జాతీయ కార్మిక కార్యాలయానికి కేంద్రము జెనీవా పట్టణము. ఇది అంతర్జాతీయ కార్మిక సంస్థ సచివాలయమని చెప్పవచ్చు. దీనిలో సిబ్బంది సుమారు 350 మంది ఉంటారు. ఈ సచివాలయ సిబ్బంది డైరెక్టర్ జనరల్ ఆధ్వర్యంలో ఉంటుంది. డైరెక్టర్ జనరల్‌ను పాలక వర్గం నియమిస్తుంది. కార్మిక సచివాలయము కార్మికులకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి ప్రచురిస్తుంది. సాధారణ సమావేశం కార్యక్రమాల పట్టికను - తయారు చేయడంలో పాలకవర్గానికి సహాయం చేస్తుంది. అంతేకాక సచివాలయము కొన్ని ముఖ్యమైన దర్యాప్తులు చేయడం, జర్నల్ ప్రచురించడం, క్రమమైన కార్మిక శాసనాల తయారుకు సహాయం చేయడం మొదలైన పనులు కూడా చేయవలె.

అంతర్జాతీయ కార్మిక సంస్థ ఒక ప్రపంచ చర్చావేదికగా పని చేసింది. ఈ సంస్థలో కార్మిక సమస్యలన్నింటినీ చర్చించిన తరువాత ప్రపంచ కార్మిక విధానాన్ని ఒక విధంగా రూపొందించడం జరుగుతుంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ స్వయం పాలనాధికారమున్న సంస్థ. అయినప్పటికీ సమితిలో అంతర్భాగమేనని చెప్పవచ్చు. దీని ఖర్చులన్నింటినీ సమితి భరిస్తుంది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన రాజ్యాలలో ఉత్పన్నమైన కార్మిక సమస్యలను చాలా వరకు అంతర్జాతీయ కార్మిక సంస్థ పరిష్కరించగలిగింది. సామాజిక న్యాయము అనే సిద్ధాంతాన్ని ఒక ఆదర్శ సిద్ధాంతంగా అంతర్జాతీయ కార్మిక సంఘము అనుసరించింది. అంతర్జాతీయ కార్మిక సంస్థ చేసిన సిఫారసుల ఫలితంగా పిల్లలచేత పనిచేయించడం దాదాపు నిషేధించడం జరిగింది. మహిళా కార్మికుల పరిస్థితులు మెరుగుపరచడం జరిగింది. కార్మికుల పనికాలం, కనీస వేతనాలు, సక్రమంగా నిర్ణయించడం జరిగింది. నిరుద్యోగ సమస్యను కూడా కొంతవరకు పరిష్కరించడం జరిగింది.

పైన పేర్కొన్న స్వయం పాలనాధికారమున్న అంగాలు కాక సమితికి ఈ క్రింది ఇతర సహాయక సంస్థలు కూడా ఉన్నాయి. (1) ఆర్థిక సంఘము (2) రాకపోకల సంఘము 3) భద్రతా సంఘము, 4) జ్ఞానాభివృద్ధి సంఘము. 5) నల్లమందు మొదలైన మత్తు పదార్థాలను గురించి సలహాలనిచ్చే సంఘము. 6) స్త్రీ, శిశు సంక్షేమ సంఘము 7) శరణార్థుల సంఘము 8) ఆయుధాల సంఘము 9) ఆదిష్ట రాజ్యాల సంఘము, 10) బానిసత్వ నిర్మూలన సంఘము మొదలైనవి.

## 4.5 సమితి కార్యకలాపాలు :

సమితి తొలి దశలో అంటే 1920 నుంచి 1923 వరకు చెప్పుకోదగిన ప్రగతిని సాధించలేదు. ఈ కాలములో సమితి సహాయ కార్యక్రమాలను మాత్రమే నిర్వహించి తన మనుగడను నిలబెట్టుకోగలిగింది. 1925 నుంచి 1930 వరకు సమితి కొన్ని ఘన విజయాలను సాధించి తన ప్రతిష్ఠను పెంచుకొన్నది. 1923 వరకు సభ్య రాజ్యాలు సమితి కార్యకలాపాలలో పాల్గొనడానికి తమ ప్రతినిధులుగా సాధారణ ఉద్యోగులను మాత్రమే పంపేవి. 1922 నుంచి సభ్య రాజ్యాలు తమ ప్రతినిధులుగా విదేశాంగ మంత్రులను పంపడం ప్రారంభించిన తరువాత సమితి ప్రతిష్ఠ బాగా పెరిగింది. ఈ కాలములోనే జర్మనీని సమితిలో సభ్య రాజ్యంగా చేర్చుకోవడం జరిగింది. ఇదే కాలములో కొన్ని అంతర్జాతీయ తగాదాలను సమితి శాంతియుతంగా పరిష్కరించగలిగింది. ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక రంగాలలో కూడా సమితి చెప్పుకోదగిన ప్రగతిని సాధించింది. సమితి ఈ కాలములో సాధించిన విజయాలన్నింటిని పరిగణనలోనికి తీసుకొని ఈ కాలం (1924 నుండి 1930) సమితి ప్రతిష్ఠ పరాకాష్ఠనందుకొన్న కాలము అని ఇ.హెచ్. కార్ వర్ణించినాడు. అయితే 1931లో మయూరియా మీద జపాన్ దురాక్రమణ జరిపిన తరువాత సమితి క్షీణదశ ప్రారంభమైందని చెప్పవచ్చు.

## 4.6. సమితి సాధించిన రాజకీయ విజయాలు :

సమితి ఒడంబడిక ప్రకారం సభ్యరాజ్యాలన్నీ అంతర్జాతీయ శాంతి పరిరక్షణకు కావలసిన చర్యలు తీసుకోవడంలో సమితికి సహాయపడవలె. సమితి రాజకీయ, ఆర్థిక, సాంఘిక, మానవతా కార్యకలాపాలన్నీ శాంతి భద్రతలు పెంపొందించడానికి నిర్దేశించినవేనని చెప్పవచ్చు. ఒడంబడిక ప్రకారం సభ్య రాజ్యాలు యుద్ధాలు తలపెట్టక తమ ఆయుధాలను తగ్గించుకోవలె. అంతర్జాతీయ వివాదాలను శాంతియుతంగా సమితి సూచించిన పద్ధతులననుసరించి సభ్యరాజ్యాలు పరిష్కరించుకోవలె. అందువల్ల రాజ్యాల మధ్య తగాదాలను శాంతి యుతంగా పరిష్కరించుకోవడానికి సమితి ఒక సవివరమైన పద్ధతిని ప్రవేశపెట్టింది. దురాక్రమణను సభ్యరాజ్యాలు సమిష్టి ప్రయత్నం ద్వారా అరికట్టవలె. అవసరమైతే దురాక్రమణ జరిపిన రాజ్యాలమీద సమితి ఆర్థిక సైనిక ఆంక్షలను విధించవలె.

సమితి 20 సంవత్సరాల కాలంలో దాదాపు 40 అంతర్జాతీయ వివాదాలను పరిశీలించింది. వీటిలో 20 వివాదాలు జటిలమైనవి. 11 వివాదాలు దురాక్రమణకు సంబంధించినవి. 9 వివాదాలు మాత్రం ఏ విధంగాను దురాక్రమణకు సంబంధించినవి కావు. సమితి 7 ముఖ్యమైన రాజకీయ వివాదాలను విజయవంతంగా పరిష్కరించగలిగింది. సమితి సాధించిన రాజకీయ ప్రగతిని ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చు.

**4.6.1. ఆలండ్ దీవుల వివాదము :** 1920లో ఆలండ్ దీవుల విషయంలో ఫిన్‌లాండ్, స్వీడన్‌ల మధ్య తగాదా వచ్చింది. స్వీడన్ జాతికి చెందిన ఆలండ్ దీవులలోని ప్రజలు స్వీడన్‌తో తమ దీవులను కలపవలెను అని ఆందోళన చేసినారు. అయితే ఆలండ్ దీవులు ఫిన్‌లాండ్ ఆధీనంలో ఉన్నాయి. ఫిన్‌లండ్‌లు సమితిలో సభ్య రాజ్యాలు కానందువల్ల ఈ సమస్యను ఇంగ్లండ్ సమితికి నివేదించింది. ఆలండ్ దీవుల సమస్యను సమగ్రంగా దర్యాప్తు చేయడానికి సమితి ఒక దర్యాప్తు సంఘాన్ని నియమించింది. ఈ దర్యాప్తు సంఘము ఆలండ్ దీవుల మీద ఫిన్‌లండ్ సార్వభౌమాధికారాన్ని గుర్తించి, స్వీడన్ జాతి ప్రజల రక్షణకు కొన్ని సిఫారసులను చేసింది. అంతేకాక ఆలండ్ దీవులను తటస్థ మండలంగాను, నిస్సైనిక మండలంగాను ప్రకటించవలెను అని సూచించింది. దర్యాప్తు సంఘం చేసిన సిఫారసుల నన్నింటినీ ఫిన్‌లండ్, స్వీడన్‌లు ఆమోదించడంతో ఆలండ్ దీవుల తగాదా శాంతియుతంగా పరిష్కారమైంది. ఇది సమితి సాధించిన మొదటి విజయం.

**4.6.2. అల్బేనియా సరిహద్దు వివాదము :** 1921లో యుగోస్లోవియా, అల్బేనియామీద దురాక్రమణకోసం తన సైన్యాలను పంపింది. అల్బేనియా విజ్ఞప్తిని పురస్కరించుకొని సమితి జోక్యం చేసుకొని యుగోస్లోవియా దురాక్రమణ బారినుండి అల్బేనియాను కాపాడింది. ఇది సమితి సాధించిన మరొక రాజకీయ విజయము.

**4.6.3. ఎగువ సైలీషియా తగాదా :** 1921లో ఎగువ సైలీషియా విషయాలలో పోలండ్, జర్మనీల మధ్య తగాదా వచ్చింది. ఫ్రాన్స్ పోలండ్‌ను, ఇంగ్లండ్ జర్మనీని సమర్థించడంతో ఈ సమస్య జటిలంగా తయారైంది. చివరికి సమితి ఒక అంతర్జాతీయ సంఘాన్ని నియమించి దాని సలహా ప్రకారం ఎగువ సైలీషియాను పోలండ్ జర్మనీలకు పంచిపెట్టింది.

**4.6.4. పోలండ్ లిథుయేనియాల మధ్య తగాదా :** 1920లో పోలండ్ బల ప్రయోగం చేసి లిథుయేనియాలో భాగమైన విల్నాను ఆక్రమించుకొన్నది. ఫ్రాన్స్ సహాయంతో పోలండ్ సమితి మధ్య వర్తిత్వాన్ని వ్యతిరేకించింది. ఈ విషయంలో సమితి ఏమీ చేయలేకపోయింది. 1923 నాటికి విల్నాను పోలండ్‌లో భాగంగా గుర్తించడం జరిగింది. అయితే పోలండ్ లిథుయేనియాల సరిహద్దులను వివాదరహితంగా సమితి నిర్ణయించింది.

**4.6.5 కార్ఫూ వివాదము :** 1923లో ఇటలీ గ్రీస్‌కు చెందిన కార్ఫూ దీవిని ఆక్రమించుకొన్నది. ఇటలీ ప్రభుత్వోద్యోగులను కొంత మందిని గ్రీస్‌లో హత్య చేయడం ఈ సంఘటనకు దారితీసింది. గ్రీస్ సమితికి విజ్ఞప్తి చేసింది. ఇటలీ కార్ఫూ సమస్య తమ అంతరంగిక వ్యవహారమని వాదించింది. చివరికి కార్ఫూను గ్రీస్‌కు ఇవ్వడం జరిగింది. గ్రీస్ ఇటలీకి పెద్ద మొత్తంలో పరిహారం ఇచ్చింది. ఈ విధంగా ఇటలీ గ్రీస్‌ల మధ్య యుద్ధం నివారించడం జరిగింది. అయితే ఈ విజయం సమితి సాధించినది కాదు. పై ఏర్పాటు అగ్ర రాజ్యాల రాయబారులు చేసినది. ఈ సంఘటనతో సమితి బలహీనత బయట పడిందని చెప్పవచ్చు.

**4.6.6. జర్మనీ బెల్జియంల మధ్య తగాదా :** జర్మనీ బెల్జియమ్‌ల మధ్య యూపెన్, మాల్మెడీ అనే సరిహద్దు జిల్లాల విషయాలలో తగాదా ఏర్పడినప్పుడు ఆ జిల్లాలు బెల్జియంనకు చెందవలెను. అని సమితి తీర్మానించింది. ఇది సమితి సాధించిన మరొక రాజకీయ విజయము.

**4.6.7. గ్రీస్, బల్గేరియాల మధ్య సరిహద్దు తగాదా :** 1925లో గ్రీస్ బల్గేరియాల మధ్య సరిహద్దు వివాదమేర్పడి గ్రీస్ సైన్యాధిపతిని సలోనికా అనే ప్రదేశంలో చంపివేసినారు. దర్యాప్తు సంఘం నియామకానికి బల్గేరియా సమ్మతించినప్పటికి గ్రీస్ సంతృప్తి పడక తన సైన్యాలను బల్గేరియాపైకి పంపింది. ఒడంబడికలోని 11వ ప్రకరణం ప్రకారం బల్గేరియా సమితి జోక్యం కోసం విజ్ఞప్తి చేసింది. రెండు దేశాలు యుద్ధాన్ని విరమించవలసిందిగా సమితి మండలి ఆదేశించి ఒక దర్యాప్తు సంఘాన్ని నియమించింది. సమితి నియమించిన దర్యాప్తు సంఘము గ్రీస్ చేసిన దురాక్రమణను ఖండించి గ్రీస్ బల్గేరియాకు 42 వేల పౌండ్లను పరిహారంగా ఇవ్వవలెను అని సిఫారసు చేసింది. దర్యాప్తు సంఘం చేసిన సూచనలను గ్రీస్ ఆమోదించడంతో గ్రీస్ బల్గేరియాల మధ్య తగాదా పరిష్కారమైంది. ఇది సమితి సాధించిన మరో ముఖ్యమైన విజయం.

**4.6.8. మోసుల్ వివాదము :** 1924లో టర్కీ, ఇంగ్లండ్, ఇరాక్‌ల మధ్య మోసుల్ జిల్లా విషయమై తగాదా ఏర్పడింది. టర్కీకి చెందిన మోసుల్ జిల్లా సెవెర్స్ సంధి ప్రకారం ఇరాక్‌కు ఇవ్వడం జరిగింది. అయితే టర్కీ ఇరాక్‌ల మధ్య సరిహద్దుల నిర్ణయం పరస్పర సంప్రదింపుల ద్వారా జరగవలసిన నిబంధనను లోజన్ సంధిలో చేర్చడం జరిగింది. టర్కీ, ఇంగ్లండ్, ఇరాక్‌ల మధ్య సంప్రదింపులు విఫలం కావడం వల్ల ఇంగ్లండ్ ఈ వివాదాన్ని సమితికి నివేదించింది. మోసుల్ జిల్లా ఇరాక్‌కు సరిహద్దు రక్షణ దృష్ట్యా అవసరమని ఇంగ్లండ్ వాదించింది. మోసుల్ జిల్లాలోని ప్రజలు టర్కీలోనే చేరడానికి సుముఖంగా ఉన్నారు. కాబట్టి ఆ ప్రాంతం తనకు చెందవలెను అని టర్కీ వాదించింది. మోసుల్ జిల్లా వివాదము దర్యాప్తు చేయడానికి సమితి ఒక తటస్థ విచారణ సంఘాన్ని నియమించింది. సంఘము మోసుల్

జిల్లామీద టర్కీ సార్వభౌమాధికారాన్ని గుర్తించింది. కాని మోసుల్ జిల్లాలోని ప్రజల క్షేమం దృష్ట్యా ఆ ప్రాంతము ఇరాక్‌కు చెందవలెను అని సిఫారసు చేసింది. విచారణ సంఘం సమర్పించిన నివేదికను సమితి ఆమోదించింది. జూన్ 26లో ఇంగ్లాండ్, టర్కీ, ఇరాక్‌లను ఒక సంధి మీద సంతకాలుచేసి సమితి సిఫారసులను ఆమోదించినాయి. ఇది సమితికి మరొక విజయము అని చెప్పవచ్చు.

**4.6.9. బొలివియా పరాగ్వేల మధ్య తగాదా :** చాకో భూ భాగం విషయమై 1928 లో సమితి సభ్య రాజ్యాలయిన బొలివియా పరాగ్వేల మధ్య తగాదా ఏర్పడింది. సంప్రదింపుల ద్వారా సమస్య పరిష్కారం లేనందువల్ల సమితి 1933లో ఒక దర్యాప్తు సంఘాన్ని నియమించింది. 1934 సమితి రెండు దేశాలమీద ఆయుధాలు నిషేధించే ఉత్తరువులను విధించింది. అయినప్పటికీ రెండు దేశాల మధ్య 1938 వరకు శాంతి నెలకొనలేదు. 1938లో అమెరికా మధ్యవర్తిత్వం వల్ల బొలివియా పరాగ్వేల మధ్య తగాదా పరిష్కారమయింది.

పైన పేర్కొన్నట్లు సమితి 1930 వరకు గణనీయమైన రాజకీయ విజయాలు సాధించింది. అయితే సమితి సాధించిన విజయాలు చాలా వరకు చిన్న రాజ్యాలకు ఉపయోగపడలేదు. ఈ కాలంలో ఇంగ్లండ్, ఫ్రాన్స్, జర్మనీల మధ్య సహకారం పెంపొందించడం జరిగింది. 1929లో యూరప్‌లో ఆర్థిక మాంద్యము ఏర్పడటంవల్ల వివిధ దేశాల మధ్య ఆర్థిక రంగములో సహకారం లోపించింది. అంతేకాక ఇటలీలో ఫాసిస్ట్ నియంతృత్వ స్థాపన, జర్మనీలో నాజీ నియంతృత్వ స్థాపన జరగడం వల్ల ప్రపంచ శాంతికి భంగమేర్పడింది. అందువల్ల 1930 నుంచి సమితి పలుకుబడి తగ్గడం ప్రారంభమయిందని చెప్పవచ్చు.

## 4.7. ఆర్థిక, సాంఘీక, మానవతారంగంలో సమితి కార్యకలాపాలు :

రాజకీయ రంగంలోనే కాక సమితి అనేక ఇతర రంగాలలో కూడా గణనీయమైన ప్రగతిని సాధించింది. వివిధ రంగాలలో అంతర్జాతీయ సహకారంపై పెంపొందించడానికి సమితి ప్రయత్నించింది. రాజ్యాలమధ్య ఆరోగ్యప్రదమైన ఆల్పక సంబంధాలు స్థాపించడానికి సమితి విశేషమైన కృషి చేసింది. వివిధ ఋణాలను విడుదల చేయడానికి పర్యవేక్షణ చేయడానికి సమితి నియమించిన అల్పక సంఘం బాధ్యత వహించింది. రాజ్యాలమధ్య ఎగుమతి, దిగుమతుల మీద ఉన్న సుంకాలను తగ్గించడానికి సమితి అనేక ప్రయత్నాలు చేసింది. రాజ్యాల మధ్య వ్యాపారము సుకరం చేయడానికి 1923లో సమితి అంతర్జాతీయ సుంకాల సమావేశాన్ని ఏర్పాటు చేసింది. యుద్ధానంతరం ఆర్థిక దుస్థితిని ఎదుర్కొంటున్న దేశాలను ఆర్థిక వినాశనం నుంచి కాపాడటానికి సమితి అనేక ప్రయత్నాలు చేసింది. ఆర్థిక దుస్థితికి లోనైన ఆస్ట్రియా హంగరీ దేశాలు సమితి సహాయంతో పెద్ద మొత్తంలో ఋణాలను పొంది తమ ఆర్థిక సమస్యలను కొంత వరకు పరిష్కరించుకో గలిగినాయి. యుద్ధానంతరం ప్రపంచ ఆర్థిక సమస్యలను పరిష్కరించడానికి సమితి 1920లో బ్రసిల్స్ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఆర్థిక రంగములో అగ్రరాజ్యాల మధ్య విరోధంతో కూడిన పోటీని నివారించలేకపోయినప్పటికి చిన్న రాజ్యాల ఆర్థిక సమస్యల పరిష్కారానికి సమితి అనేక విధాలుగా సహాయం చేసింది. ఇది చాలా హర్షించదగిన విషయము.

మొదటి ప్రపంచ యుద్ధము జటిలమైన శరణార్థుల సమస్యను సృష్టించింది. శరణార్థుల పునరావాస సమస్యను పరిష్కరించుకోవడానికి సమితి డాక్టర్ సీన్‌ను 1921లో హైకమీషనర్‌గా నియమించింది. అనేక లక్షలమంది శరణార్థులకు పునరావాసం కల్పించడంకోసం సమితి హైకమీషనర్ చేసిన కృషిని ప్రపంచ వ్యాప్తంగా హర్షించినారు.

సాంఘీక మానవతా రంగాలలో కూడా సమితి గణనీయమైన విజయం సాధించింది. రోగనిరోధక ఔషధాలను సమకూర్చి మలేరియా, కలరా, మశూచి, ప్లేగ్ మొదలైన అంటు వ్యాధులను అరికట్టడానికి సమితి ఎంతో కృషి చేసింది. మానవతా రంగంలో సమితి సాధించిన ఘన విజయము స్త్రీల, శిశువుల అక్రమ రవాణాను అరికట్టడం అని చెప్పవచ్చు. 1927, 1929లలో స్త్రీల అక్రమ రవాణా సమస్యను సమితి సలహా సంఘం దర్యాప్తు చేసింది. శిశువుల హక్కులను కాపాడటానికి సమితి అనేక ఏర్పాట్లు చేసింది. బానిసత్వం నిర్మూలనకోసం, సమితి చాలా ఎక్కువగా పాటుపడింది. 1932లో ఒక శాశ్విత బానిసత్వం సంఘాన్ని నియమించడం జరిగింది. మత్తు పదార్థాల రవాణాను అరికట్టడానికి సమితి ఒక సంఘాన్ని నియమించింది. మత్తు పదార్థాల వాడకాన్ని నిషేధించడానికి అనేక అంతర్జాతీయ సమావేశాలు ఏర్పాటు చేయడం జరిగింది. అన్నింటికంటే ముఖ్యంగా సమితి అంతర్జాతీయ వైజ్ఞానిక సహకారం పెంపొందింప చేసింది. 1926లో పారిస్‌లో అంతర్జాతీయ మేధావుల సహకార సంఘం నెలకొల్పటం జరిగింది. మేధావుల ద్వారా, శాస్త్రవేత్తల ద్వారా వైజ్ఞానిక రంగంలో అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించడం జరిగింది. ఉపాధ్యాయుల, విద్యార్థుల పరస్పర వినిమయం ద్వారా వివిధ విశ్వవిద్యాలయాల మధ్య సహకారాన్ని పెంపొందించడం జరిగింది. ఈ విధమైన వివిధ కార్యకలాపాలను తరువాత ఐక్యరాజ్యసమితి (యు.ఎన్.ఓ.) కొనసాగించింది.

## 4.8. సార్ పరిపాలన :

1920 నుంచి 1935 వరకు సార్ ప్రాంతపు పరిపాలనను సమితి ఐదుగురు సభ్యులతోకూడిన పాలక సంఘంద్వారా కొనసాగించింది. పాలక సంఘంలోని సభ్యులలో అధిక సంఖ్యాకులు ఫ్రెంచ్‌వారు. పాలక సంఘం ప్రథమ అధ్యక్షుడు విక్టర్ రౌలట్ స్థానిక ప్రజలపట్ల కఠినంగా వ్యవహరించి వారి ప్రతినిధులను సంప్రదించకుండా పరిపాలనను కొనసాగించినాడు. స్థానిక సైన్యానికి బదులు ఫ్రెంచి సైన్యాన్ని ఉపయోగించడం వల్ల కూడా సార్ పై ప్రజలలో అసంతృప్తి పెరిగింది. 1926లో ఫ్రెంచివాడైన రౌలట్ స్థానే కెనడా దేశస్థుడైన స్టీవెన్స్ సార్ పాలక సంఘానికి అధ్యక్షుడైనాడు. 1927లో ఇంగ్లీష్‌వాడైన సర్ఎర్నెస్ట్ విల్సన్ అధ్యక్షుడైనాడు. సార్ ప్రాంతం నుంచి సైన్యాన్ని ఉపసంహరించి బ్రిటీష్, బెల్జియమ్, ఫ్రెంచి జాతీయులతో కూడిన సైన్యం ప్రవేశ పెట్టడం జరిగింది. 1932లో సార్ పాలక సంఘం అధ్యక్షుడుగా ఇంగ్లీష్ వాడైన నాక్స్‌ను నియమించడం జరిగింది. వర్సై సంధి ప్రకారం సార్ ప్రాంత భవిష్యత్‌ను నిర్ణయించడానికి 1935లో జనవాక్య సేకరణ జరపవలసి వుంది. జనవాక్యసేకరణ కాలం సమీపించినకొద్దీ సార్ ప్రజలలో ఉద్రిక్తత ఎక్కువయ్యింది. జూన్ 1935లో జరిగిన జనవాక్య సేకరణ ఫలితంగా సార్ ప్రాంతాన్ని జర్మనీలో విలీనం చేయడం జరిగింది. సార్ ప్రాంతంలోని వోటర్‌లలో నూటికి 80 శాతంమంది తమ ప్రాంతాన్ని మాతృదేశమైన జర్మనీలో విలీనం చేయవలెనని నిర్ణయం చేసినారు.

## 4.9. డాన్‌జిగ్ పరిపాలన :

జర్మనీలో భాగమైన డాన్‌జిగ్ పట్టణము పోలండ్‌ను సంతృప్తి పరచడానికి జర్మనీ నుంచి విడదీసి అంతర్జాతీయ పట్టణంగా ప్రకటించి సమితి పరిపాలనాధికారంలో ఉండటం జరిగింది. కాని డాన్‌జిగ్ పట్టణానికి విజయవంతమైన పరిపాలనను సమితి ఏర్పాటు చేయలేకపోయింది.

## 4.10 ఆదిష్ఠ పద్ధతి :

యుద్ధంలో ఓడిపోయిన దేశాలకు ముఖ్యంగా జర్మనీ, టర్కీలకు చెందిన వలస ప్రాంతాలన్ని మిత్ర రాజ్యాల అధీనంలోకి వచ్చినాయి. వలస ప్రజల ప్రయోజనాలు కాపాడటంతో బాటు మిత్ర రాజ్యాల సామ్రాజ్య కాంక్షను సంతృప్తి పరచడానికి ఒక నూతన అంతర్జాతీయ పద్ధతిని రూపొందించి సమితి ఒడంబడిక పత్రంలో 22వ ప్రకరణగా చేర్చడం జరిగింది. ఈ ప్రకరణం ప్రకారం లోగడ జర్మనీ ఆస్ట్రియాలకు చెందిన వలసలను ఆటోమాన్ టర్కీ సామ్రాజ్యం విచ్ఛిన్నమైన ఫలితంగా వచ్చిన కొన్ని ప్రాంతాలను అగ్ర రాజ్యాల ఆధీనంలో ఉంచి వాటిని ఆదిష్ఠ ప్రాంతాలుగా గుర్తించడమయింది. ఆదిష్ఠ ప్రాంతాలు చాలా వరకు ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లకు ఇవ్వటం జరిగింది. ఈ ఆదిష్ఠ ప్రాంతాల మీద సమితికి పర్యవేక్షణాధికారం మాత్రమే వుంది.

ప్రజల అభివృద్ధి దశ భౌగోళిక. ఆర్థిక పరిస్థితులు మొదలైన వాటిని పరిగణనలోకి తీసుకొని సమితి ఒడంబడిక ఆదిష్ఠ ప్రాంతాలను ఎ, బి, సి. అనే మూడు తరగతులుగా వర్గీకరించింది. లోగడ టర్కీ సామ్రాజ్యానికి చెందిన కొన్ని ప్రాంతాలు 'ఎ' తరగతికి చెందిన ఆదిష్ఠ ప్రాంతాలుగా ప్రకటించడం జరిగింది. కొంత వరకు అభివృద్ధి చెందిన ఈ ప్రాంతాల పరిపాలన ప్రజల అభీష్టం ప్రకారం జరగవలె. తాము ఏ అగ్ర రాజ్యం అధీనంలో ఉండవలెనో ఆ ప్రాంత ప్రజలే నిర్ణయించుకొంటారు. కాని నిజానికి ఆదిష్ఠ ప్రాంత ప్రజల అభీష్టంతో ప్రమేయం లేకుండానే అగ్ర రాజ్యాలు వివిధ ప్రాంతాలను తమ వశం చేసుకొన్నాయి. 1920లో జరిగిన సాన్‌రెయో సమావేశం ఫలితంగా 'ఎ' తరగతికి చెందిన ఆధిష్ఠ ప్రాంతాలైన ఇరాక్ పాలస్తీనా, ట్రాన్స్-జోర్డాన్‌లు ఇంగ్లాండుకు, సిరియా, లెబనాన్‌లు ఫ్రాన్స్‌కు ఆదిష్ఠ ప్రాంతాలయినాయి.

మధ్య ఆఫ్రికాకు చెందిన ప్రాంతం 'బి' తరగతి ఆదిష్ఠ ప్రాంతాలుగా ప్రకటించడం జరిగింది. ఈ ప్రాంత ప్రజలకు మత స్వేచ్ఛ ఇవ్వడం జరిగింది. కాని పరిపాలన బాధ్యత పూర్తిగా ఆదిష్ఠ రాజ్యాలకు ఇవ్వడం జరిగింది. 'బి' తరగతికి చెందిన టాంగనీక, కామెరూన్స్‌లో 6వ భాగం, టోగోలాండ్‌లో 3వ భాగం ఇంగ్లండ్‌కు, మిగిలిన కామెరూన్స్, టోగోలాండ్ ఫ్రాన్స్‌కు, రువాండా, ఉరుండి బెల్జియంకు ఆదిష్ఠ ప్రాంతాలయినాయి.

నైఋతి ఆఫ్రికాకు చెందిన భూభాగాలను దక్షిణ పసిఫిక్ దీవులను 'సి' తరగతి ఆదిష్ఠ ప్రాంతాలుగా ప్రకటించడం జరిగింది. విస్తీర్ణంలోను, జనాభాలోను చిన్నవైన ఈ ప్రాంతాలు నాగరిక ప్రపంచానికి దూరంగా ఉన్నాయి. ఆదిష్ఠ రాజ్యాలు ఈ ప్రాంతాల పరిపాలనను

చాలా వరకు హర్షించదగిన విధంగా కొనసాగించినాయి. దాదాపు ఈ ప్రాంతాలు ఆదిష్ట రాజ్యాలలో భాగంగా పరిగణించడం జరిగింది. నైఋతి ప్రాంతాన్ని దక్షిణాఫ్రికాకు ఇచ్చినారు. జర్మన్ సమోవాను న్యూజిలాండ్‌కు, నేరుదీవిని ఇంగ్లండ్‌కు ఇచ్చినారు. భూమధ్య రేఖకు దక్షిణంగా ఉన్నా జర్మన్ వలసలు ఆస్ట్రేలియాలకు, ఉత్తరంగా ఉన్న జర్మన్ వలసలు జపాన్‌కు ఇచ్చినారు.

అగ్ర రాజ్యాల సమితి మండలి ప్రతి సంవత్సరమూ తమ ఆధీనంలో ఉన్న ఆదిష్ట ప్రాంతాల పరిస్థితులను గురించి నివేదికలు పంపవలెను. అగ్రరాజ్యాలు సమర్పించిన నివేదికలను పరిశీలించి సమితి ఎటువంటి చర్యలు తీసుకోవలసి ఉంటుందో తెలియజేయడానికి 1920లో ఒక శాశ్వత ఆదిష్ట రాజ్యాల సంఘం నెలకొల్పడం జరిగింది. ఈ సంఘములో సభ్యుల సంఖ్య 11 ఈ సంఘం సంవత్సరానికి రెండుసార్లు సమావేశమవుతుంది. ఆదిష్ట ప్రాంతాల పరిపాలనాభివృద్ధికి సిఫారసులను మాత్రమే ఈ సంఘం చేస్తుంది. ఆదిష్ట రాజ్యాల సంఘము అధికారాన్ని సలహాపూర్వకమైనట్టిది మాత్రమే. ఆదిష్ట ప్రాంతాలను సందర్శించడానికిగాని, ప్రజలనుంచి అర్జీలు తీసుకోవడానికి గాని ఈ సంఘానికి ఏవిధమయిన అధికారాలు లేవు. మొత్తంమీద ఈ సంఘం పని చేసిన తీరు సంతృప్తికరంగా లేదు. ఆదిష్ట పద్ధతి అనేక లోపాలతో కూడినదని చెప్పవచ్చు. ఆదిష్ట రాజ్యాల సంఘము సలహాలను లక్ష్యపెట్టకుండా అగ్ర రాజ్యాలు తమ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించినాయి. 1922లో నైఋతి ఆఫ్రికాలో ప్రజల అసంతృప్తిని దక్షిణాఫ్రికా ప్రభుత్వము నిర్దాక్షిణ్యంగా అణిచివేసింది. ఫ్రాన్స్ ఇదే విధంగా తన ఆధీనంలో ఉన్న ఆదిష్ట ప్రాంతాల ప్రజల న్యాయమైన కోరికలను కూడా అణచివేసింది. అయినప్పటికీ ఆదిష్ట సంఘము నిస్సహాయంగా చూస్తూ ఉండి పోయింది. సిద్ధాంత రీత్యా అగ్ర రాజ్యాలు తమ ఆధీనంలో ఉన్న ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవలె. కాని అమలులో మాత్రం అగ్ర రాజ్యాలు సమితి పర్యవేక్షణను ఏమాత్రమూ లక్ష్యపెట్టక తమ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించినాయి. ఆదిష్ట పద్ధతివల్ల అగ్రరాజ్యాల రాజ్యకాంక్ష నెరవేరిందని చెప్పవచ్చు. యుద్ధంలో ఓడిపోయిన రాజ్యాలకు చెందిన వలసలన్నీ అగ్ర రాజ్యాలకు ఆదేశించడం వల్ల వెనుకబడిన ప్రాంతాలలో చెప్పుకోదగిన అభివృద్ధి జరుగలేదు. ఆదిష్ట పద్ధతివల్ల సూయజ్ ప్రాంతంలో ఇంగ్లండ్ ప్రాబల్యము, పసిఫిక్ ప్రాంతంలో జపాన్ ప్రాబల్యం నెలకొల్పడం జరిగింది. పైన చెప్పినట్లుగా అనేక లోపాలున్నప్పటికీ ఆదిష్ట పద్ధతిలో కొన్ని మెచ్చుకోదగిన అంశాలు కూడా ఉన్నాయి. అగ్రరాజ్యాల వలస ప్రాంతంలో తమ అధికారాన్ని స్వప్రయోజనం కోసం కాకుండా వెనుకబడిన ప్రజల అభివృద్ధికోసం ఉపయోగించవలసిన విషయాలను ప్రపంచ ప్రజల దృష్టిని ఆకర్షించింది. ఈ పద్ధతివల్ల కొంతవరకు అగ్ర రాజ్యాల దృక్పథంలో మార్పు వచ్చిందని చెప్పవచ్చు. అగ్ర రాజ్యాలు వెనుకబడిన ప్రజల అభివృద్ధికి ధ్యేయంగా పెట్టుకొని వలసలను పరిపాలించడం కొంత వరకు ప్రారంభించినాయని కూడా చెప్పవచ్చు. ఈ ఆదిష్ట పద్ధతిని రెండో ప్రపంచ యుద్ధానంతరం ఏర్పడిన ఐక్యరాజ్యసమితి కూడా కొనసాగించింది.

## 4.11. అల్ప సంఖ్యాక వర్గాలు :

అల్ప సంఖ్యాక వర్గ ప్రజల హక్కుల రక్షణకు కొన్ని ప్రత్యేక అల్ప సంఖ్యాకులను గురించిన సంధులను చేయడం జరిగింది. ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ఒక అల్ప సంఖ్యాక సంఘం నెలకొల్పడం జరిగింది. ఈ సంఘము అల్పసంఖ్యాక వర్గ ప్రజలనుంచి అర్జీలు స్వీకరించడమేగాక ప్రజల ఫిర్యాదులకు గురి అయిన ప్రభుత్వాలనుంచి వివరణలను కూడా స్వీకరిస్తుంది. సుమారు మూడు కోట్ల అల్ప సంఖ్యాక వర్గ ప్రజల హక్కుల రక్షణకు సమితి బాధ్యత వహించింది. అల్ప సంఖ్యాక వర్గ ప్రజల రక్షణ విషయంలో సమితి బాధ్యత చాలా క్లిష్టమైనది. అల్ప సంఖ్యాక వర్గాల సమస్యలు రాజకీయ సమస్యలుగా తయారయి అపార్థాలకు కూడా దారితీయవచ్చు. అల్పసంఖ్యాక వర్గ ప్రజల హక్కుల రక్షణకు ఏర్పాట్లు చేసేటప్పుడు స్వతంత్ర రాజ్యాల సార్వభౌమాధికారానికి భంగం కలగని విధంగా సమితి జాగ్రత్త వహించవలె. అల్ప సంఖ్యాక వర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి సమితి అనుసరించిన విధానము, ఫిర్యాదులకు గురి అయిన రాజ్యాల పట్ల నచ్చచెప్పే విధానం మాత్రమేనని చెప్పవచ్చు. ప్రభుత్వాలతో సంప్రదింపులు జరపడానికి ముగ్గురు సభ్యులతో కూడిన ఒక సంఘాన్ని సమితి నియమించింది. అల్ప సంఖ్యాకవర్గ ప్రజలు తమ కేసును ఈ సంఘం ముందు వాదించుకోవడానికి వీలులేదు. సమస్యల పరిష్కారంలో సంఘం విఫలమైతే మొత్తం విషయమంతా సమితి మండలికి నివేదించడం జరుగుతుంది. సమితి మండలి సమస్యలను అందుకు సంబంధించిన ప్రభుత్వాంతో సంప్రదిస్తుంది. కాని ఎట్లాంటి పరిస్థితులలోను సమస్యలకు సంబంధించిన ప్రభుత్వ సమ్మతితో మాత్రమే అల్ప సంఖ్యాక వర్గ ప్రజల హక్కులను కాపాడటం జరుగుతుంది.

అల్ప సంఖ్యాక వర్గ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో సమితి ఈ కారణాల వల్ల విఫలమైంది. అల్పసంఖ్యాకవర్గ ప్రజలకు సంబంధించిన సంధులను సభ్య రాజ్యాలమీద బలవంతంగా విధించడం జరిగింది. అందువల్ల ఈ సంధులను అనేక రాజ్యాలు మనఃపూర్వకంగా అమలుపరచలేదు. అంతేకాక అల్పసంఖ్యాక వర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి సమితి అనుసరించిన విధానం కూడా లోపభూయిష్టమైనది. అల్పసంఖ్యాక వర్గ ప్రజల సమస్య ఒక ముఖ్యమైన అంతర్జాతీయ విషయమైనప్పటికీ కొన్ని రాజ్యాలు అల్పసంఖ్యాక సంధుల మీద సంతకాలు చేయలేదు. ఈ సమస్యను పరిష్కరించడానికి కావలసిన అర్థ బలము సమితికి లేదు. అల్పసంఖ్యాక వర్గము ప్రజల సమస్యల పరిష్కారానికి సమితి ప్రత్యేక శ్రద్ధ వహించలేదు. నిజానికి ఈ సమస్యను పరిష్కరించడానికి కావలసిన బలంగాని అధికారంగాని సమితికి లేదు.

## 4.12. సమితి క్షీణ దశ (1931-1939) :

చిన్న చిన్న రాజ్యాలమధ్య తగాదాలను సమితి చాలావరకు తీర్చగలిగింది. కాని అగ్ర రాజ్యాలకు, చిన్న రాజ్యాలకు మధ్య తగాదాలు వచ్చినప్పుడు సమితి తీర్పు సాధారణంగా అగ్ర రాజ్యాలకే అనుకూలంగా ఉండేది. అంతేకాక అగ్ర రాజ్యాలు దురాక్రమణ జరిపినప్పుడు సమితి నిస్సహాయ స్థితిలోపడేది. మంచూరియా మీద జపాన్ జరిపిన దాడి దీనికొక ఉదాహరణము.

**4.12.1. మంచూరియామీద జపాన్ దురాక్రమణ :** మంచూరియా సంక్షోభాన్ని పరిష్కరించడంలో సమితి ఘోరంగా విఫలమైంది. మంచూరియా మీద జపాన్ దురాక్రమణకు సంబంధించిన వివరాలు ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చు. 1905లో రష్యా, జపాన్‌ల మధ్య జరిగిన సంధి ఫలితంగా జపాన్ దక్షిణ మంచూరియాలోని తన రైల్వేల రక్షణకోసం ముక్డెన్ సైనిక కేంద్ర స్థానంగా 15వేల సైనికులను సమీకరించింది. 1931 సెప్టెంబర్‌లో చైనీయుల విధ్వంసక చర్యల నుంచి తన రైల్వేలను కాపాడుకొనే సాకుతో జపాన్ మంచూరియాను ఆక్రమించుకొన్నది. అంతేకాక మంచురియాను "మంచూకో" అనే ఒక ఉపరాజ్యంగా సృష్టించి తన ఆధీనంలో ఉంచుకొన్నది. ఇది జపాన్ చేసిన బహిరంగమైన దురాక్రమణ కాక సమితి ఒడంబడికకు ఒక సవాలు వంటిది. చైనా జపాన్ మీద ఫిర్యాదుచేసి సమితి జోక్యాన్ని కోరింది. చైనా పట్ల జపాన్ విదేశాంగ నేత మంచి చెడ్డలు ఇక్కడ అప్రస్తుతము. జపాన్, చైనాలు రెండూ సమితిలో సభ్య రాజ్యాలు. జపాన్ చైనా మీద దురాక్రమణ జరిపినపుడు సమితి జపాన్ మీద ఏమి చర్య తీసుకొన్నది. అనేది ఇక్కడ మనము పరిశీలించ వలసిన విషయము. మంచూరియానుంచి జపాన్ తన సైన్యాలను ఉపసంహరించుకోవలెనని సమితి ఆదేశించింది. కాని జపాన్ సమితి ఆదేశాన్ని లక్ష్యపెట్టలేదు. మంచూరియా వ్యవహారం పూర్తిగా దర్యాప్తు చేసి పరిష్కారానికి సిఫారసులు చేయడానికి బ్రిటిష్ ప్రతినిధి లార్డ్ లిట్టన్ అధ్యక్షుడుగా ఒక సంఘాన్ని సమితి నియమించింది. ఇంతలో 1982లో జపాన్, చైనాకు చెందిన షాంఘై పట్టణాన్ని ఆక్రమించుకొన్నది. చైనా ఫిర్యాదుచేసిన మీదట షాంఘైనుంచి తన సైన్యాలను ఉపసంహరించుకోవలెనని జపాన్‌ను సమితి ఆదేశించింది. కాని సమితి ఆదేశాన్ని జపాన్ తిరిగి లక్ష్య పెట్టలేదు. 1932 నవంబర్‌లో లిట్టన్ సంఘము నివేదికను సమితికి సమర్పించడం జరిగింది. లిట్టన్ సంఘం సమర్పించిన నివేదిక ఆధారంగా 1933 ఫిబ్రవరిలో సమితి జపాన్‌కు దురాక్రమణ జరిపిన దేశంగా తీర్మానించింది. మంచూరియా చైనాలో భాగమేకాని స్వతంత్ర రాజ్యం కాదని కూడా సమితి తీర్మానించింది. మంచూరియా స్వతంత్ర రాజ్యంగా గుర్తించవద్దని సభ్య రాజ్యాలను సమితి ఆదేశించింది. సమితి తీర్మానాలు ఒక నెల తరువాత 1933 మార్చిలో జపాన్ సమితిలో తన సభ్యత్వాన్ని ఉపసంహరించుకొన్నది.

చైనా దేశ ప్రాదేశిక సమగ్రతను చాలా గడ్డు రోజులలో కూడా కాపాడటం జరిగింది. కాని విచిత్రమేమిటంటే నానాజాతి సమితి స్థాపన జరిగిన తరువాత పారిస్ సంధి యుద్ధాలను ఖండించిన తరువాత చైనా తన ప్రాదేశిక సమగ్రతను కోల్పోయింది. అగ్రరాజ్యమైన జపాన్ మంచూరియామీద చేసిన దురాక్రమణను సమితి అరికట్టలేకపోయింది. జపాన్ దురాక్రమణ తరువాత మరికొన్ని రాజ్యాలు దురాక్రమణ విధానాన్ని ధైర్యంగా అనుసరించాయి. మొత్తంమీద మంచూరియా సంక్షోభము సమితి బలహీనతను పూర్తిగా బహిర్గతం చేసిందని చెప్పవచ్చు.

**4.12.2. ఇథియోపియా మీద ఇటలీ దురాక్రమణ :** 1934 నుంచి ఇటలీ నియంత అయిన ముస్సోలిని ఇథియోపియా ఆక్రమణ ద్వారా ఇటాలియన్ సోమాలీలాండ్‌ను, ఇరిట్రియాతో కలపవలెననే ప్రయత్నంలో ఉన్నాడు. 1934 లో ఇటలీ, ఇథియోపియాల మధ్య వాల్ వాల్ సరిహద్దు సంఘర్షణ జరిగినప్పుడు ఇథియోపియా 1934 డిసెంబర్ 14న సమితికి విజ్ఞప్తి చేసి సమితి జోక్యాన్ని కోరింది. హిట్లర్ దురాక్రమణ అరికట్టడానికి ముస్సోలినీ సహాయంపైన ఆధారపడిన ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లు సమితి ఇటలీమీద సత్వర చర్యలు తీసుకోకుండా

అడ్డుపడినాయి. 1935 మార్చిలో మళ్ళీ ఇథియోపియా ఇటలీ మీద సమితికి ఫిర్యాదు చేసినప్పుడు సమితి మండలి ఒక మధ్యవర్తిత్వ సంఘాన్ని నియమించింది. ఈ సంఘము 1935 సెప్టెంబర్ 3న సమితికి సమర్పించిన తన నివేదికలో వాల్‌వాల్ సరిహద్దు సంఘర్షణకు ఇటలీ ఇథియోపియాలు రెండూ కారణమని నిర్ణయించింది.

మధ్యవర్తిత్వ సంఘం నివేదికను సమర్పించిన తరువాత ఇటలీ ఇథియోపియాల సంఘర్షణ ముగియవలసింది కాని ఇటలీ ఇథియోపియా మీద దురాక్రమణ విధానాన్ని విడనాడలేదు. సమితి ఒడంబడిక పత్రంలో 15వ ప్రకరణం ప్రకారం రెండు సంఘాలను నియమించి, సమితి ఇటలీ ఇథియోపియాల మధ్య సామరస్య సాధనకోసం ప్రయత్నించి విఫలమైంది. 1935 అక్టోబర్ 3న ముస్సోలిని సైన్యాలు అబిసినియాను ఆక్రమించుకొన్నాయి. 1935 అక్టోబర్ 19న సమితి మహాసభ ఇటలీని దురాక్రమణ జరిపిన దేశంగా ప్రకటించడమే కాక ఆర్థిక ఆంక్షలు కూడా విధించింది. సమితి ఇటలీమీద సైనిక ఆంక్షలు విధించడాన్ని ఇంగ్లండ్ ఫ్రాన్స్‌లు వ్యతిరేకించాయి. అంతేకాక సమితి ఆర్థిక ఆంక్షలు విధించిన తరువాత అమెరికా ఇటలీకి చమురు సరఫరాను ఎక్కువ చేసింది. 1936 మే 9న ఇటలీ దేశం రాజును ఇథియోపియా చక్రవర్తిగా ప్రకటించడం జరిగింది. ఇది జరిగిన రెండు నెలల తరువాత సమితి ఇటలీ మీద విధించిన ఆంక్షలన్నింటినీ తొలగించింది.

ఇథియోపియా మీద ఇటలీ దురాక్రమణను అరికట్టడంలో సమితి విఫలం కావడానికి ముఖ్య కారణము ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లు ఇటలీని వ్యతిరేకించడానికి తమ అయిష్టాన్ని చూపడమే. సమితి తనకున్న అసంపూర్ణమైన చర్యలవల్ల ముస్సోలిని, హిట్లర్‌కు సన్నిహితుడైనాడు. క్రమ క్రమంగా రొమ్ బెర్లిన్ కూటమి ఏర్పడింది. ఈ విధంగా సమితి బలహీనత మరియొకసారి స్పష్టంగా బయటపడిందని చెప్పవచ్చు.

**4.12.4. స్పెయిన్‌లో అంతర్యుద్ధము :** 1933లో స్పెయిన్‌లో ప్రజాస్వామ్య ప్రభుత్వం యేర్పడింది కాని 1934 నుంచి మితవాద శక్తులు ప్రభుత్వాన్ని కూలదోయడానికి ప్రయత్నాలు చేయసాగాయి. 1936లో స్పెయిన్‌లోని ఫాసిస్ట్ శక్తులు జర్మనీ ఇటలీల ప్రోత్సాహంతో చట్ట సమ్మతమైన ప్రజా ప్రభుత్వానికి వ్యతిరేకంగా విప్లవ వ్యతిరేకోద్యమాన్ని ప్రారంభించాయి. ఫాసిస్టు నాయకుడైన జనరల్ ఫ్రాంకోకు హిట్లర్ ముస్సోలినీల అండదండలున్నాయి. స్పెయిన్‌లోని అంతర్యుద్ధాన్ని ఆపడానికి సమితి ఏ విధమైన చర్యలు తీసుకోలేక పోయింది. సమితిచేత ఏర్పాటు చేసిన తటస్థ సంఘము స్పెయిన్ అంతర్యుద్ధములో భాగస్వాములైన రెండు పక్షాలు ఆయుధాలు కొనుగోలు చేయడాన్ని నిషేధించింది. దీని ఫలితంగా ప్రభుత్వ పక్షము ఇతర దేశాలనుంచి ఆయుధాలను సేకరించలేకపోయింది. కాని తిరుగుబాటు వర్గం మాత్రం అక్షరాజ్యాలైన జర్మనీ ఇటలీనుంచి ఆయుధాలను సమకూర్చుకోగలిగింది. జనరల్ ఫ్రాంకో 1939 నాటికి స్పెయిన్‌లో ప్రజా ప్రభుత్వాన్ని కూలదోసి నియంతృత్వం స్థాపించినారు. స్పెయిన్‌లోని అంతర్యుద్ధం ఫలితంగా సమితి ప్రతిష్ఠ బాగా దెబ్బతిన్నది.

1937లో జపాన్ చైనామీద దాడి జరిపినప్పుడు సమితి బలహీనత పూర్తిగా బయటపడింది. చైనా విజ్ఞప్తికి సమాధానంగా సమితి చైనాపట్ల సానుభూతి సూచకంగా ఒక తీర్మానం మాత్రం చేసింది. ఫాసిస్టు రాజ్యాల దురాక్రమణను సమితి నిస్సహాయమైన ప్రేక్షకునివలె చూస్తూ ఉండిపోయింది. జర్మనీ ఆస్ట్రియాల ఏకీకరణ, చెకొస్లావాకియా పోలండ్‌ల మీద హిట్లర్ దురాక్రమణ ఫలితంగా రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభం కావడం వంటి సంఘటనలను సమితి నిస్సహాయమైన ప్రేక్షకునివలే చూస్తు ఉండిపోయింది. అయినప్పటికీ నానాజాతి సమితి నామమాత్రంగా రెండో ప్రపంచ యుద్ధం ముగిసే వరకూ కొనసాగింది. ఏప్రిల్ 1946లో జెనీవాలో జరిగిన సమావేశంలో సమితి ఒక తీర్మానం ద్వారా తనకు తాను రద్దు చేసుకొన్నది.

**4.12.4. నిరాయుధీకరణ :** నానాజాతి సమితి నెరవేర్చవలసిన ముఖ్య కర్తవ్యాలలో నిరాయుధీకరణ ఒకటి. నిరాయుధీకరణ సిద్ధాంతము యుద్ధంలో ఓడిపోయిన దేశాలైన జర్మనీ, ఆస్ట్రియా, హంగరీ, బల్గేరియా విషయాలలో మాత్రమే అమలు చేయడం జరిగింది. మిత్ర రాజ్యాలు నిరాయుధీకరణను అనుసరించలేదు. మొత్తంమీద ఈ విషయంలో సమితి విఫలమయింది. సమితి ఒడంబడిక పత్రంలోని ఎనిమిదో ప్రకరణం ప్రకారం ప్రపంచ శాంతి కోసం సభ్య రాజ్యాలు తమ ఆయుధ బలాలను తగ్గించుకోవలె. అంటే దేశాలు తమ దేశ భద్రతకు కావలసిన ఆయుధాలను మాత్రమే ఉంచుకొని అంతర్జాతీయ ఒప్పందం ప్రకారం వ్యవహరించవలె. ఇది ఉడ్రోవిల్సన్ 14 సూత్రాలలో ఒకటైన [illegible]లు తమ ఆయుధ బలాలను తగ్గించుకోవలెననే సూత్రానికి అణుగుణంగా ఉంది. కాని సభ్య రాజ్యాలు తమ ఆయుధ

బలాలను తగ్గించుకోవడం జరగలేదు. నిరాయుధీకరణ జరగకపోవడానికి ముఖ్య కారణము వివిధ దేశాల పరస్పర భయ సందేహాలే. ప్రతి దేశము, ముందు ఇతర దేశాలు ఆయుధ బలం తగ్గించుకొంటే తాను కూడా తగ్గించుకొంటాననేది. తమ దేశాల భద్రతకు, సుస్థిరతకు ఆయుధ బలము అవసరమని చాలా సభ్య రాజ్యాలు భావించినాయి. ప్రపంచ శాంతి భద్రతలకు, తద్వారా దేశాల భద్రతకు నిరాయుధీకరణ ముఖ్యమైన హామీ అనే విషయాన్ని ఫ్రాన్స్ మొదలైన అగ్రరాజ్యాలు తిరస్కరించినాయి. ఫ్రాన్స్ తన ఆయుధ బలం తగ్గించుకొంటే జర్మనీ వర్సే సంధి నుల్లంఘించి మరొక ప్రపంచ యుద్ధాన్ని తెచ్చిపెడుతుందనే సాకు చెప్పసాగింది. ఫ్రాన్స్‌వలెనే ఇతర సభ్య రాజ్యాలు కూడా ఆలోచించడం వల్ల సార్వత్రికంగా నిరాయుధీకరణ జరగలేదు.

1920లో నిపుణులతో కూడిన ఒక ప్రత్యేక సంఘాన్ని నిరాయుధీకరణ విషయం పరిశీలించడానికి నియమించడం జరిగింది. దీనికి తాత్కాలిక మిశ్రమ కమిషన్ అనిపేరు. ఈ కమిషన్ 1924 వరకు ఉన్నప్పటికీ ఏమీ సాధించలేక పోయింది. 1924 జెనీవా సంధి ముసాయిదా ప్రకారం దేశాలమధ్య తగాదాలు శాంతియుతంగా పరిష్కారం కావలెననే నిర్ణయం చేయడం జరిగింది. కాని ఆ నిర్ణయం అమలు పరచడం జరుగలేదు. 1925లో జరిగిన లొకర్నో ఒప్పందం ప్రకారం నిరాయుధీకరణ విషయము సమగ్రంగా పరిశీలించి తగిన సిఫారసులను చేయడానికి సన్నద్ధంచేసే కమిషన్ అనే సంఘాన్ని నియమించడం జరిగింది. సంఘము ఆరు సంవత్సరాల కాలం నిరాయుధీకరణ విషయాలను పరిశీలించిన ఒక సంధి ముస్సాయిదా తయారు చేసింది. ఈ సంధి ముసాయిదా ఆయుధాల తగ్గింపును సూత్ర ప్రాయంగా అంగీకరించి విషవాయువు మొదలైన జీవాయక యుద్ధ పద్ధతులను ఖండించింది.

ఫిబ్రవరి 1923 లో ప్రపంచ నిరాయుధీకరణ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బ్రిటీష్ విదేశాంగ మంత్రి ఆర్థర్ హెండర్‌సన్ అధ్యక్షత వహించినాడు. 61 దేశాల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో అనేక చర్చలు జరిగినాయి. సభ్య రాజ్యాలు తమ ఆయుధ బలంలో నాలుగో వంతు బలాన్ని తగ్గించుకోవలెనని, జలాంతర్గాములతో విమానాలతో చేసే యుద్ధాలను నిషేధించవలెనని, రక్షణశాఖ మీద ఖర్చును పరిమితం చేయవలెనని ప్రతిపాదనలు వచ్చినాయి. కాని ఏ విషయంలోనూ అంగీకారం కుదరలేదు. సమావేశము 1933 వరకు వాయిదా పడింది. హిట్లర్ నియంతృత్వాధికారంలో ఉన్న జర్మనీ తక్కిన సభ్య దేశాలతో సమానస్థాయి లభించినందువల్ల సమావేశం నుంచి కోపంతో విరమించుకొన్నది. చివరికి సమితిలో సభ్యత్వాన్ని కూడా జర్మనీ ఉపసంహరించుకొన్నది. 1934లో జరిగిన మరొక నిరాయుధీకరణ సమావేశం కూడా విఫలమైంది.

**4.12.5. నౌకాదళాయుధాల తగ్గింపు ప్రతిపాదన :** 1921లో జరిగిన వాషింగ్టన్ సమావేశం ఫలితంగా అగ్ర రాజ్యాల మధ్య కొన్ని సంధులు జరిగినాయి. అమెరికా, ఇంగ్లండ్, ఫ్రాన్స్, జపాన్, ఇటలీ రాజ్యాలు 10 సంవత్సరాల వరకు యుద్ధ నౌకల నిర్మాణము ఆపివేయవలెనని ఒప్పందం చేసుకొన్నాయి. 1927లో జరిగిన జెనీవా సమావేశము ఏ విధమైన ప్రగతిని సాధించలేక పోయింది. 1930లో జరిగిన లండన్ సమావేశం కూడా విఫలమయింది. ప్రతి దేశము తన భద్రత విషయమై భయపడి అంతర్జాతీయ నౌకా సంబంధం ఒడంబడికలను ఉల్లంఘించడం జరిగింది. ముఖ్యంగా 1935 నాటికి జర్మనీ రష్యా మొదలైన దేశాలు నౌకాబలాన్ని ఎక్కువగా చేసుకొన్నాయి.

అనేక అంతర్జాతీయ సమావేశాలు జరిగినప్పటికీ సార్వత్రిక నిరాయుధీకరణ మాట అటుంచి అసలు ఆయుధాల తగ్గింపు విషయంలోనే ప్రపంచ దేశాల మధ్య ఏ విధమైన అంగీకారమూ కుదరలేదని చెప్పవచ్చు. ఒక పక్క నిరాయుధీకరణ గురించి సభ్య రాజ్యాలు ప్రతినిధులు మాట్లాడుతూ ఉండగా ఇంకొక పక్క అన్ని రాజ్యాలు తమ ఆయుధ బలాన్ని వృద్ధి చేసుకొంటూనే వున్నాయి. నిరాయుధీకరణ సాధ్యంకాక పోవడానికి ముఖ్య కారణము దేశాల మధ్య అనుమానము, భయము ఎక్కువ కావడమే. ఫలితంగా 1939 నాటికి అన్ని దేశాల ఆయుధ బలం 1914లో కంటే అనేక రెట్లు పెరిగింది.

## 4.13. నానాజాతి సమితి విఫలం కావడానికి కారణాలు :

నానాజాతి సమితి రూపొందించిన ఒడంబడికలలోని కొన్ని లోపాలు సమితి విఫలం కావడానికి కారణమైనాయి. సమితి ఒడంబడిక యుద్ధాన్ని నిషేధించింది. కాని దేశాల బలప్రయోగం చేయడాన్ని నిషేధిం చలేదు. జపాన్ యుద్ధ ప్రకటన చేయకుండా తద్వారా సమితి ఒడంబడికను ఉల్లంఘించకుండా చైనామీద బలప్రయోగంచేసి మంచూరియాను ఆక్రమించుకొన్నది. అయినప్పటికీ సమితి ఏమీ చేయలేక

పోయింది. రాను రాను సమితి అంతర్జాతీయ శాంతిని పరిరక్షించే బలమైన సంస్థగాగాక అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించే సంస్థగా మాత్రమే మిగిలింది.

సమితి విఫలం కావడానికి సమితి ఒడంబడికలోని లోపాలు మాత్రమే కాక అనేక ఇతర కారణాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా అగ్రరాజ్యాలు సమితిని సరి అయిన పద్ధతిలో ఉపయోగించడానికి సుముఖంగా లేవు. మొదటి నుంచి సభ్య రాజ్యాలు సమితి ఆదర్శాలకు, లక్ష్యాలను సక్రమంగా అర్థం చేసుకోలేదు. యుద్ధంలో ఓడిపోయిన దేశాలపట్ల అగ్ర రాజ్యాల అనుమానవైఖరీ, జర్మాన్ ప్రతీకారధోరణి సమితి విఫలంకావడానికి కారణాలైనాయి. అగ్ర రాజ్యాలు జర్మనీ వంటి గొప్ప దేశాన్ని శాశ్వితంగా అన్ని విధాల బలహీన పరచడానికి ప్రయత్నం చేయసాగినాయి. ఈ పరిస్థితిలో సమితి ప్రగతిని సాధించడం కష్టమైంది.

సమితి సభ్య రాజ్యాలలో జాతీయభావము మితిమీరి అంతర్జాతీయ సహకార దృష్టి లోపించింది. ఏ ఒక్క సభ్యరాజ్యం కూడా అంతర్జాతీయ ప్రయోజనాల కోసం తన జాతీయ ప్రయోజనాలను త్యాగం చేయడానికి సిద్ధపడలేదు. అంతేకాక సమితి పట్ల సభ్యరాజ్యాలలో విధేయత లోపించింది. అందువల్ల జాతీయభావ ప్రభావమెక్కువై సమితి విఫలం కావడానికి దారి తీసింది.

అగ్ర రాజ్యాలైన అమెరికా, రష్యాలు సమితిలో సభ్య రాజ్యాలు కాకపోవడం వల్ల సమితి ప్రాముఖ్యం తగ్గింది. రష్యా 1934 వరకు సమితిలో సభ్య రాజ్యం కాదు. అమెరికా సమితిలో సభ్య రాజ్యంగా చేరడానికి నిరాకరించి, ప్రపంచ సమస్యల పట్ల ఏకాంత విధానాన్ని అనుసరించసాగింది.

19వ శతాబ్దంలో స్థాపించిన యూరప్ రాజ్యాల బద్ధ కూటమి, పవిత్ర కూటమి, అనే అంతర్జాతీయ సంస్థలు అగ్ర రాజ్యాల స్వార్థం వల్ల విఫలమైనాయి. అదే విధంగా నానాజాతి సమితి కూడా అగ్రరాజ్యాలు సక్రమంగా సహకరించలేక పోవడంవల్ల విఫలమైనది. అగ్రరాజ్యాలలో సమితి కర్తవ్యం గురించి అభిప్రాయ భేదాలు వచ్చినాయి. శాంతి స్థాపనే సమితి ముఖ్య కర్తవ్యమని ఇంగ్లండ్ మొదలైన దేశాలు భావించినాయి. శాంతి స్థాపన విషయంలోను, మధ్యవర్తిత్వ విషయంలోను సమితి బలాన్ని ఉపయోగించవలెనని ఫ్రాన్స్ భావించింది. అంతేకాక జర్మన్‌పట్ల ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లు తృప్తి పరచే విధానం అవలంబించడం వల్ల జర్మనీ దురాక్రమణ చేయడం ప్రారంభించింది.

సభ్య రాజ్యాలు తన నిర్ణయాలను శిరసావహించేటట్లు చేసే అధికారంగాని, బలంగాని సమితికి లేవు. సమితి తీర్మానాలు ఏకగ్రీవంగా జరగవలె. సభ్య రాజ్యాలమధ్య ఏకాభిప్రాయం సాధించడం కష్టమయింది. సమితి నిర్వహణ సభ్య రాజ్యాల స్వచ్ఛంద ధనసహాయం మీద ఆధారపడి ఉంది. తన తీర్మానాలను బలవంతంగా అమలుపరచడానికి సమితికి తగిన సాయుధ బలంగాని, యంత్రాంగంకాని లేవు. అందువల్ల జపాన్, ఇటలీ, జర్మనీ వంటి దేశాలు దురాక్రమణ జరిపినప్పుడు వాటిని సమితి అరికట్టలేకపోయింది. చివరికి దురాక్రమణ జరిపిన జపాన్, ఇటలీ, జర్మనీలు పూర్తిగా విఫలమైనవి. ఫలితంగా జర్మనీ బహిరంగంగా, ధైర్యంగా ఆయుధ బలాన్ని సమకూర్చుకొనడం ప్రారంభించింది.

పైన వివరించినట్లుగా అనేక కారణాలవల్ల సమితి విఫలమైనప్పటికీ అవికొన్ని విషయాలను కూడా సాధించిందనే విషయాన్ని గమనించవలె. అంతర్జాతీయంగా ఆర్థిక, సాంఘిక సాంస్కృతిక, వైజ్ఞానిక రంగాలలో సమితి చెప్పుకోదగిన ప్రగతిని సాధించింది. అంతర్జాతీయ సహకారాన్నీ, సౌహార్థాన్నీ పెంపొందించి తద్వారా సమితి అంతర్జాతీయతా భావాన్ని ప్రపంచ దేశాల్లో పెంపొందించింది. అనేక అంతర్జాతీయ సమస్యలను చర్చించి సమితి ప్రపంచాభిప్రాయాన్ని మొదటిసారిగా సేకరించింది. ఇది సమితి సాధించిన ఘనకార్యమని చెప్పవలె. నానాజాతి సమితి సంపాదించిన అనుభవాన్ని పురస్కరించుకొని రెండో ప్రపంచ యుద్ధానంతరం ఆ సమితి స్వరూప స్వభావాలకు మెరుగులు దిద్ది ఐక్యరాజ్యసమితి రూపొందించడం జరిగింది.

ఎం. దాసు

# 1. నిరాయుధీకరణ సమస్య

# 2. ప్రపంచ ఆర్థిక మాధ్యం - యూరప్‌పై దాని ప్రభావం

**లక్ష్యం:**

సమితిద్వారా, సమితి ప్రమేయం లేకుండా నిరాయుధీకరణ కొరకు జరిగిన ప్రయత్నాలు, నిరాయుధీకరణ ప్రయత్నాలు విఫలం కావడం, ప్రపంచ ఆర్థిక మాధ్యం, యూరప్‌పై దాని ప్రభావం గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

**విషయ సంగ్రహం:**

| | |
|---|---|
| **5.1.** | నిరాయుధీకరణ సమస్య |
| **5.1.1.** | పరిచయం |
| **5.1.2.** | సమితిద్వారా నిరాయుధీకరణకు జరిగిన ప్రయత్నాలు |
| **5.1.2.1** | సన్నాహక సంఘము |
| **5.1.2.2** | నిరాయుధీకరణ సమావేశాలు |
| **5.1.2.3** | రూజ్‌వెల్ట్ ప్రతిపాదన |
| **5.1.2.4** | నిరాయుధీకరణ సమావేశాలు విఫలం కావడానికి కారణాలు |
| **5.1.3** | సమితి ప్రమేయం లేకుండా నిరాయుధీకరణకు జరిగిన ప్రయత్నాలు |
| **5.1.3.1** | వాషింగ్టన్ సమావేశము |
| **5.1.3.2** | నౌకా దళాల నిరాయుధీకరణ సంధి |
| **5.1.3.3** | జెనీవా సమావేశము |
| **5.1.3.4** | లండన్ సంధి |
| **5.1.3.5** | లండన్ నౌకా సమావేశము |
| **5.1.3.6** | మాస్కో నిరాయుధీకరణ సమావేశము |
| **5.1.4** | సమితి ప్రమేయం లేకుండా నిరాయుధీకరణ కోసం జరిగిన ప్రయత్నాలు విఫలం కావడానికి కారణాలు |
| **5.1.5** | సమిష్టి భద్రత స్థాపనకు జరిగిన ప్రయత్నాలు విఫలం కావడానికి కారణాలు |
| **5.2.** | ప్రపంచ ఆర్థిక మాధ్యం - యూరప్‌పై దాని ప్రభావం |
| **5.2.1** | పరిచయం |
| **5.2.2** | అమెరికా స్పెక్యులేషన్ వ్యాపారం |
| **5.2.3** | వాల్‌స్ట్రీట్ పతనం |
| **5.2.4** | కలిమి మధ్య లేమి |

5.2.5 ఆర్థిక సంక్షోభం

5.2.6 సంక్షోభం - రక్షణ చర్యలు

5.2.7 రూజ్వెల్ట్ నవ విధానం

5.2.8 బ్రిటన్

5.2.9 ఫ్రాన్స్

5.2.10 జర్మనీ

5.2.11 ఆస్ట్రియా

5.2.12 చెకోస్లొవాకియా

5.2.13 సోవియట్ రష్యా

## 5.1 నిరాయుధీకరణ సమస్య

### 5.1.1 పరిచయం :

మానవ నాగరికతను పూర్తిగా విధ్వంసం చేయగల మారణాయుధాల ఉత్పత్తి ఫలితంగా 20 వ శతాబ్దంలో నిరాయుధీకరణ సమస్య చాలా ప్రాముఖ్యమున్నదిగా పరిణమించిందని చెప్పవచ్చు. అంతేకాక అంతర్జాతీయ శాంతి భద్రతల సమస్య నిరాయుధీకరణ సమస్యతో ముడిపడి ఉన్నదనే విషయం నిస్సందేహము. అంతర్జాతీయ శాంతి భద్రతల స్థాపన కోసం నిరాయుధీకరణ తప్పనిసరిగా జరిగితీరవలననే విషయము మొదటి ప్రపంచ యుద్ధానికి పూర్వమే గుర్తించడం జరిగింది. 1899 లోను 1907 లోను హేగ్‌లో జరిగిన అంతర్జాతీయ శాంతి సమావేశాలు నిరాయుధీకరణను అమలు పరచడానికి అనేక ప్రయత్నాలు చేసి విఫలమైనాయి. అయినప్పటికీ అంతర్జాతీయ శాంతిభద్రతల స్థాపనకోసం మానవజాతి శ్రేయస్సుకోసం నిరాయుధీకరణ జరిగి తీరవలెననే విషయం మాత్రం నిర్వివాదాంశము. అందువల్ల హేగ్ శాంతి సమావేశాలు విఫలమైనప్పటికీ నిరాయుధీకరణ ప్రాముఖ్యాన్ని, అవసరాన్ని ప్రపంచ దేశాలన్నీ గుర్తించాయి.

మొదటి ప్రపంచ యుద్ధానంతరం నిరాయుధీకరణ సమస్యకు, భద్రతా సమస్యకూ సన్నిహిత సంబంధమేర్పడింది. అంతర్జాతీయ శాంతిని పెంపొందించడానికి రూపొందించబడిన ప్రతి పథకంలోను నిరాయుధీకరణ సూత్రంలో భాగంగా చేర్చడం జరిగింది. దేశాలు తమ ఆంతరంగిక భద్రతకు కావలసిన ఆయుధ బలాన్ని మాత్రమే ఉంచుకొని మొత్తం మీద తన ఆయుధ బలాలను తగ్గించుకోవలెననే సూత్రం ఉడ్రోవిల్సన్ 14 సూత్రాలలో ఒకటి. మొదటి ప్రపంచ యుద్ధానంతరం జరిగిన పారిస్ శాంతి సందుల ప్రకారం నిరాయుధీకరణ సిద్ధాంతము యుద్ధంలో ఓడిపోయిన జర్మనీ, ఆస్ట్రియా మొదలైన రాజ్యాలపట్ల అనుసరించడం జరిగింది. అయితే నిరాయుధీకరణ సిద్ధాంతాన్ని మిత్రరాజ్యాలు విధిగా అనుసరించవలసిన అవసరం లేదు. సమితి ఒడంబడిక ప్రకారం నిరాయుధీకరణ సిద్ధాంతాన్ని అన్ని సభ్యరాజ్యాలు అనుసరించవలె. సమితి ఒడంబడికలోని ఎనిమిదో ప్రకరణం ప్రకారం ప్రతి సభ్యరాజ్యము తన ఆంతరంగిక భద్రతకు కావలసిన ఆయుధ బలాన్ని మాత్రమే ఉంచుకొని, తన ఆయుధ బలాన్ని తప్పనిసరిగా తగ్గించుకోవాలి. ఒడంబడికలోని తొమ్మిదో ప్రకరణం ప్రకారం సైనిక విమాన బలాల తగ్గింపుకు సంబంధించిన సంబంధాలను అమలుపరచడానికి ఒక శాశ్వత సంఘాన్ని నియమించవలె. మొత్తం మీద నిరాయుధీకరణ సిద్ధాంతాన్ని అమలు పరచే బాధ్యత సమితి మండలికి అప్పగించడం జరిగింది. రెండు ప్రపంచ యుద్ధాల మధ్యకాలంలో నిరాయుధీకరణ సమస్య పరిష్కరించడానికి సమితి ద్వారా, సమితి ప్రమేయం లేకుండా కూడా అనేక ప్రయత్నాలు జరిగినాయి.

**5.1.2. సమితి ద్వారా నిరాయుధీకరణకు జరిగిన ప్రయత్నాలు :** జనవరి 1920 లో సమితి పని ప్రారంభించినప్పటినుంచి నిరాయుధీకరణ సిద్ధాంతాన్ని అమలుపరచడానికి సమితి మండలి అనేక ప్రయత్నాలు చేసింది. సైనిక వ్యవహారాలలో సమితి మండలికి సలహాలివ్వడానికి మే 1920 లో ఒక శాశ్వత సలహా సంఘాన్ని నియమించడం జరిగింది. 1921 లో సమితి మండలి ఒక తాత్కాలిక మిశ్రమ

సంఘాన్ని నిరాయుధీకరణ సమస్యను పరిష్కరించడానికి నియమించింది. ఈ సంఘము శాశ్వత సలహా సంఘంతో సహకరించి పనిచేయడం ప్రారంభించింది. ఈ సంఘాల సలహ ప్రకారం సెప్టెంబర్ 1923 లో పరస్పర సహాయక సంధిని సమితి మండలి ఆమోదించింది. ఈ సంధి ప్రకారం నిరాయుధీకరణ సిద్ధాంతాన్ని అమలుపరచవలె. అంతేకాక భద్రత పరిరక్షణకు హామీ ఉండవలె. సమతిలో సభ్యరాజ్యంగా లేని అమెరికా పరస్పర సహాయక సంధిని తిరస్కరించింది. ఇంగ్లండ్ కూడా ఈ సంధిని తిరస్కరించింది. ఈ విధంగా సభ్యరాజ్య సైనిక బలాన్ని తగ్గించడానికి సమితి మండలి చేసిన మొదటి ప్రయత్నం విఫలమైంది.

అక్టోబరు 1924 లో అంతర్జాతీయ సమస్యల శాంతియుత పరిష్కారానికి జెనీవా సంధి ముసాయిదా మీద ఆల్బేనియా, బ్రెజిల్, బల్గేరియా, చిలీఇస్టోనియా, గ్రీస్, ఫ్రాన్స్, పోలండ్, యుగోస్లావియా, చెకోస్లావాకియా దేశాలు సంతకాలు చేసాయి. సమితి ఈ ఒడంబడికను ఏకగ్రీవంగా ఆమోదించింది. అయితే ఈ సంధి సక్రమంగా అమలుకాలేదు.

అక్టోబరు 1924 లో సమితి నిరాయుధీకరణ సమస్యను పరిశీలించడానికి ఒక సమన్వయ సంఘాన్ని నియమించి తాత్కాలిక మిశ్రమ సంఘాన్ని రద్దు చేసింది. కొంతకాలం తరువాత సమన్వయ సంఘాన్ని కూడా రద్దు చేయడం జరిగింది.

**5.1.2.1 సన్నాహక సంఘము :** 1925 లో జరిగిన లొకర్నో ఒడంబడికల ఫలితంగా అంతర్జాతీయ పరిస్థితులు చాలావరకు నిరాయుధీకరణను అమలు పరచడానికి అనుకూలంగా మారినాయి. నిరాయుధీకరణను సాధించడానికి సమితి ఒక సన్నాహక సంఘాన్ని నియమించింది. జనవరి 1926 లో సంఘం తొలి సమావేశం జెనీవాలో జరిగింది. ప్రతినిధుల మధ్య తీవ్రమైన విభేదాలవల్ల ఈ సంఘం విజయాన్ని సాధించలేక పోయింది. "ఆయుధ బలాలు" అనే పదానికి నిర్వచనం చేయడం ప్రతినిధులకు అసాధ్యమైంది. సభ్యరాజ్యాల సైనికబలం తగ్గింపు విషయంలో ప్రతినిధులందరికీ ఏకాభిప్రాయమున్నప్పటికీ "కట్టుదిట్టమైన సైన్యము" అనే పదానికి నిర్వచనం చేయడం విషయంలో ప్రతినిధుల మధ్య తీవ్రమైన విభేదాలు ఏర్పడినాయి. శిక్షణ పొందిన రిజర్వ్ సైన్యాన్నంతా కట్టుదిట్టమైన సైన్యంలో భాగంగా పరిగణించవలెనని ఇంగ్లాండ్, జర్మనీ, అమెరికాలు వాదించినాయి. నిర్బంధ సైనిక విధానాన్ని అనుసరిస్తున్న ఫ్రాన్స్ మొదలైన దేశాలు శిక్షణ పొందిన రిజర్వ్ సైన్యాన్ని కట్టుదిట్టమైన సైన్యంలో భాగంగా పరిగణించకూడదని వాదించాయి. కొన్ని తరగతుల నౌకల ప్రమాణాన్ని మాత్రమే పరిమితం చేస్తే నిర్ణయించవలెనని ఇంగ్లాండ్, అమెరికాలు అభిప్రాయపడినాయి. కాని ఫ్రాన్స్, ఇటలీలు అన్ని దేశాలకు చెందిన నౌకల టన్నేజిని నియమబద్ధం చేయవలెనని అభిప్రాయపడినాయి. సభ్యరాజ్యాలు సైనిక వ్యయాన్ని పరిమితం చేసుకోవలెనని ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌లు సూచించినాయి. కాని ఈ ప్రతిపాదనను అమెరికా తిరస్కరించింది. రాజ్యాల విస్తీర్ణాన్ని , రాజ్యభాగాల పునర్విభజనను బట్టి నిరాయుధీకరణ జరగవలనని రష్యా చేసిన ప్రతిపాదనను చాలా దేశాల ప్రతినిధులు తిరస్కరించినారు. భద్రతా పరిరక్షణకు ఫ్రాన్స్ కోరిన హామీవల్ల నిరాయుధీకరణ సమస్య మరింత జటిలమైంది.

పైన చెప్పినట్లుగా ప్రతినిధుల మధ్యగల తీవ్రవిభేదాల కారణంగా సన్నాహక సంఘము ఒక నిర్ణాయానికి రాలేకపోయింది. అయితే వివిధ దేశాల ప్రతినిధుల ఆమోదాన్ని పొందిన కొన్ని సిద్ధాంతాలు ప్రాతిపదికగా ఈ సంఘము 1927 లో ఒక ముసాయిదా ఒడంబడికను తయారు చేసింది. ఈ ముసాయిదా ఒడంబడికను సన్నాహక సంఘం మొదటి సమావేశంలో చర్చించడం జరిగింది. కాని ఈ సమావేశంలో ఏ విధమైన నిర్ణయం జరగలేదు. 1932 లో జెనీవాలో జరిగిన రెండో సమావేశం కూడా విఫలమైంది.

**5.1.2.2 నిరాయుధీకరణ సమావేశాలు :** నిరాయుధీకరణ సమస్యను పరిష్కరించడంలో సన్నాహక సంఘం విఫలమైన తరువాత సమితి మండలి మొదటి ప్రపంచ నిరాయుధీకరణ సమావేశాన్ని జెనీవాలో ఫిబ్రవరి 1932 లో ఏర్పాటు చేసింది. ఈ సమావేశంలో ఆయా దేశాలు ప్రతినిధులు పాల్గొన్నారు. లోగడ సన్నాహక సంఘం తయారుచేసిన ముసాయిదా ఒడంబడికను ఈ సమావేశం చర్చించి తిరస్కరించింది ఈ సమావేశంలో నిరాయుధీకరణ సిద్ధాంతానికి అన్ని సభ్యరాజ్యాలు తప్పని సరిగా సమానంగా అనుసరించినలెనని జర్మనీ పట్టుబట్టింది. దీనికి భిన్నంగా ఫ్రాన్స్ భద్రతా సమస్యను నిరాయుధీకరణ సమస్యతో జోడించి భద్రతా సమస్యకు ప్రాముఖ్యము ఇచ్చింది. ఈ విధంగా జర్మనీ ఫ్రాన్స్‌ల మధ్య విరోధ కారణంగా నిరాయుధీకరణ సమస్య మరింత జటిలమైంది. శాశ్విత నిరాయుధీకరణ సంఘం అధికారాల విషయంలో కూడా సభ్యరాజ్యాల మధ్య ముఖ్యంగా ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌ల మధ్య అభిప్రాయ భేదాలు ఏర్పడినాయి. దేశాల సైనిక బలము ఆంతరంగిక శాంతి భద్రతలను పరిరక్షించే పోలీస్ విభాగము, విదేశ దురాక్రమణను ఎదుర్కొనే రక్షణ విభాగము అని రెండు

6)

భాగాలుగా విభజించవలెనని అమెరికా అధ్యక్షుడు హువర్ (Hoover) చేసిన ప్రతిపాదనను ఇంగ్లాండ్ ఫ్రాన్స్‌లు వ్యతిరేకించినాయి. అన్ని దేశాల ఆయుధబలం తగ్గించి ఒక్కొక్క దేశానికి ఉండవలసిన సైనిక బలాన్ని నిర్ణయించవలెనని బ్రిటిష్ ప్రధాని మాక్డొనాల్డ్ ఒక ప్రతిపాదనను చేసినాడు. అంతేకాక ఫిరంగి బలము, టాంక్‌ల విషవాయువుల ప్రయోగం కూడా నిషేధించవలెనని బ్రిటిష్ ప్రధాని ప్రతిపాదించాడు. బ్రిటిష్ ప్రధాని చేసిన ప్రతిపాదనలను ఫ్రాన్స్ జర్మనీలు ఆమోదించలేదు. అయితే విషవాయువుల ఉపయోగాన్ని నిషేధించ వలసిన అవసరాన్ని అన్ని దేశాల ప్రతినిధులు గుర్తించినారు.

జూలై 1932 లో జీవాంక యుద్ధ పద్ధతులను నిషేధించడంతోబాటు ఆయుధాల తగ్గింపుకు సంబంధించిన తీర్మానాన్ని కూడా నిరాయుధీకరణ సమావేశం జరిగింది. అయితే ఈ తీర్మానం జర్మనీ, ఫ్రాన్స్‌ల మధ్య ఏర్పడిన పోటీ ధోరణిని నివారించలేక పోయింది. జర్మనీ నిరాయుధీకరణ సమావేశం నుంచి ఉపసంహరించుకొన్నది. జర్మనీతో బాటు రష్యా కూడా నిరాయుధీకరణ సమావేశం చేసిన తీర్మానాన్ని వ్యతిరేకించింది. మొత్తం మీద ఈ తీర్మానాన్ని 41 దేశాలు ఆమోదించాయి. జర్మనీ, ఫ్రాన్స్‌ల పట్టుదల ధోరణివల్ల నిరాయుధీకరణ సమావేశంలో ఒక విధమైన ప్రతిష్టంభన ఏర్పడింది. సెప్టెంబర్ 1932 లో జెనీవాలో ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, అమెరికా, ఇటలీ దేశాల ప్రతినిధుల మధ్య జరిగిన సంప్రదింపుల ఫలితంగా ఈ ప్రతిష్టంభనకు తొలగించడానికి ప్రయత్నాలు జరిగినాయి. ఈ సమావేశంలో జర్మనీ కోరిన విధంగా అన్ని రాజ్యాల భద్రతకోసం అందరికీ సమాన హక్కులు ఇచ్చే తీర్మానం చేయడం జరిగింది. మొత్తం మీద మొదటి నిరాయుధీకరణ సమావేశము ముఖ్యమైన విషయాలలో ఏకగ్రీవంగా నిర్ణయాలు చేయలేక పోయింది.

అక్టోబర్ 1932 లో రెండో నిరాయుధీకరణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఇటలీలు జర్మనీ కోరిన విధంగా అన్ని రాజ్యాల భద్రతకోసం అందరికీ సమాన హక్కులు ఇవ్వడాన్ని ఆమోదించినాయి. మూడో నిరాయుధీకరణ సమావేశాన్ని ఫిబ్రవరి 1933 లో ఏర్పాటు చేసినారు. ఈ సమావేశ ప్రారంభకాలంనాటికి అంతర్జాతీయ పరిస్థితులు చాలావరకు మారిపోయినాయి. జపాన్ 1933 లో సమితి సభ్యత్వం నుంచి ఉపసంహరించుకొన్నది. జర్మనీలో హిట్లర్ నాయకత్వంలో నాజీ ప్రభుత్వమేర్పడింది. వర్సే సంధిని ఉల్లంఘించి జర్మనీ సైనిక బలాన్ని పెంపొందించవలెనని హిట్లర్ నిర్ణయించాడు. అందువల్ల తన భద్రతకు అన్ని దేశాల నుంచి హామీ లభించేందుకు నిరాయుధీకరణ పథకాన్ని తాను ఆమోదించ జాలనని ఫ్రాన్స్ తన భయాన్ని వెలిబుచ్చింది. ఈ పరిస్థితులలో నిరాయుధీకరణ సమావేశంలో ఏర్పడిన ప్రతిష్టంభన తొలగించడానికి బ్రిటిష్ ప్రధాని మాక్డొనాల్డ్ ఒక పథకాన్ని సమావేశం ముందు ఉంచినాడు. మాక్డొనాల్డ్ పథకం ప్రకారం కెల్లాగ్ బ్రేయాండ్ ఒడంబడిక ఉల్లంఘన జరిగినప్పుడు ఒక అంతర్జాతీయ సమావేశం జరగవలె, ప్రతిదేశము సైనిక బలాన్ని తగ్గించవలె, ఒక శాశ్వత నిరాయుధీకరణ సంఘాన్ని అంతర్జాతీయ పరిస్థితులను పర్యవేక్షించడానికి నియమించవలె, దీనిని మాక్డొనాల్డ్ ప్రణాళిక అంటారు. కాని దీనిని నిరాయుధీకరణ సమావేశం తిరస్కరించింది. తరువాత ఫ్రాన్స్ ఒక పథకాన్ని తయారుచేసింది. ఈ పథకం ప్రకారం నిరాయుధీకరణ జరగడానికి ముందుగా అన్ని రాజ్యాల ఆయుధాలమీద, సైనిక బలంమీద అంతర్జాతీయ పర్యవేక్షణ నెలకొల్పవలె. ఫ్రెంచి పథకాన్ని ఇంగ్లాండ్, ఇటలీలు ఆమోదించాయి. కాని జర్మనీ తిరస్కరించింది. ఈ పరిస్థితిలో ఫ్రాన్స్, ఇంగ్లాండ్, జర్మనీ, ఇటలీల మధ్య ఒక ఒడంబడిక జరుగవలెనని ఇటలీ ప్రధాని ముస్సోలిని ఒక ప్రతిపాదన చేసినాడు. అంతేకాక జర్మనీ ప్రయోజనాల దృష్ట్యా పారిస్ శాంతి సంధులను సవరించవలెనని కూడా ముస్సోలిని ప్రతిపాదించినాడు. అయితే ముస్సోలినీ పథకాన్ని కూడా అనేక దేశాలు తిరస్కరించాయి.

**5.1.2.3 రూజ్‌వెల్ట్ ప్రతిపాదన :** ప్రమాదకరమైన ఆయుధాలను పూర్తిగా నిషేధించడం నిరాయుధీకరణ సమావేశం చేయవలసిన ముఖ్యమైన పని అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ ఒక సందేశాన్ని 1933 మేలో నిరాయుధీకరణ సమావేశానికి పంపినాడు. నిరాయుధీకరణ సంధిమీద సంతకాలు జరిగేవరకు ఏ దేశంకూడా తన ఆయుధాలను పెంచుకోకూడదు అని, దేశాలు నిర్యుద్ధ ఒడంబడికలు చేసుకోవలెనని కూడా రూజ్‌వెల్ట్ ప్రతిపాదించాడు. రూజ్‌వెల్ట్ ప్రతిపాదనలు ప్రాతిపదికగా చేసుకొని ఒక ముసాయిదా ఒడంబడికను భవిష్యత్తులో జరిగే సంధికి ఆధారంగా నిరాయుధీకరణ సమావేశము ఏకగ్రీవంగా ఆమోదించింది. అయితే జర్మన్ దురాక్రమణ జరగకుండా తన భద్రతకు హామీ లభించేవరకు తను నిరాయుధీకరణను అమలుపరచజాలనని ఫ్రాన్స్ నిరాయుధీకరణ సమావేశానికి తెలియజేసింది. దీనికితోడు నిరాయుధీకరణ సమస్యను పరిష్కరించడంలో జర్మనీ ఆసక్తిని చూపలేదు. అంతేకాక 1933 అక్టోబర్‌లో జర్మనీ నిరాయుధీకరణ

సమావేశం నుంచి విరమించుకొని అటుతరువాత కొద్దిరోజులలోనే సమితి నుంచి కూడా తన సభ్యత్వాన్ని ఉపసంహరించుకొన్నది. వర్సైసంధిని ఉల్లంఘించి జర్మనీ ఆయుధబలాన్ని పెంచుకోవడం మొదలుపెట్టింది. అంతర్జాతీయంగా ఉద్రిక్తతో కూడిన వాతావరణము ఏర్పడింది. ఈ విధంగా అంతర్జాతీయ నిరాయుధీకరణ కోసం చేసిన ప్రయత్నాలు అన్ని విఫలమైనాయి.

నిరాయుధీకరణ సమావేశం తిరిగి 1934 మేలో జరిగింది. కాని అగ్రరాజ్యాలమధ్య విభేదాల కారణంగా సమావేశంలో ప్రతిష్టంభన ఏర్పడింది. రష్యా, ఫ్రాన్స్‌లు భద్రత సమస్యకు ప్రాధాన్యమిచ్చినాయి. దీనికి భిన్నంగా ఇంగ్లాండ్, అమెరికా, ఇటలీలు నిరాయుధీకరణ సమస్యకు ప్రాధాన్యమిచ్చినాయి. ఈ ప్రతిష్టంభన కారణంగా నిరాయుధీకరణ సమావేశము 1934 జూన్‌కు వాయిదా వేయడం జరిగింది. కాని 1934 జూన్ తరువాత నిరాయుధీకరణ సమావేశాలు అసలు జరగనే లేదు. ఈ విధంగా సమితిద్వారా నిరాయుధీకరణ సమస్యను పరిష్కరించడానికి చేసిన ప్రయత్నాలన్నీ పూర్తిగా విఫలమైనాయి.

**5.1.2.4 నిరాయుధీకరణ సమావేశాలు విఫలం కావడానికి కారణాలు : 1.** నిరాయుధీకరణ సమావేశాలు విఫలం కావడానికి ముఖ్య కారణము అగ్రరాజ్యాల మధ్య సహకారం లోపించడమే. ఈ సమావేశంలో అగ్రరాజ్యాల మధ్య సహకారం లోపించడమే కాక తీవ్రమైన పోటీ కూడా ఏర్పడింది. తత్ఫలితంగా నిరాయుధీకరణ సమావేశాలు విఫలంకావడంలో ఆశ్చర్యమేమి లేదు.

2. ఫ్రాన్స్, జర్మనీల మధ్య ఏర్పడిన తీవ్రమైన విరోధము నిరాయుధీకరణ సమావేశాలను సక్రమంగా పనిచేయకుండా చేసింది. జర్మనీ ఆయుధ బలంకంటే తన ఆయుధ బలము పై చేయిగా ఉండవలెనని ఫ్రాన్స్ కోరింది. తన సైనిక బలము ఫ్రాన్స్‌తో సమానంగా ఉండవలెనని జర్మనీ కోరింది. జర్మనీలో హిట్లర్ అధికారంలోనికి వచ్చిన తరువాత వర్సైసంధి ఉల్లంఘన ప్రారంభమైంది. అందువల్ల జర్మనీ, ఫ్రాన్స్‌ల మధ్య విరోధం తీవ్రమైంది. ఫలితంగా నిరాయుధీకరణ సమస్యను పరిష్కరించడం కష్టమైంది.

3. నిరాయుధీకరణ సమావేశాలలో పాల్గొన్న అగ్రరాజ్యాల మధ్య అనేక సమస్యల విషయంలో తీవ్రమైన విభేదాలు ఏర్పడినాయి. నిరాయుధీకరణ సమస్యకంటే భద్రతా సమస్యకు ఫ్రాన్స్ ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చింది. దీనికి భిన్నంగా ఇంగ్లాండ్, అమెరికా, ఇటలీలు భద్రత సమస్య కంటే నిరాయుధీకరణ సమస్యకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చినాయి. మారణాయుదాలనన్నిటినీ పూర్తిగా నిషేధించవలెనని ఇంగ్లాండ్ చేసిన ప్రతిపాదనను ఇతర రాజ్యాలు తిరస్కరించినాయి. అంతేకాక రక్షణాయుధాలను, మారణాయుధాలనూ నిర్వచించే విషయాలలో కూడా అగ్రరాజ్యాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. అందువల్ల అగ్రరాజ్యాల మధ్య విభేదాలు కారణంగా నిరాయుధీకరణ సమావేశాలు విఫలమైనాయి.

4. నిరాయుధీకరణ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు ఆయుధాల తగ్గింపు పైన మాత్రమే తమ దృష్టిని కేంద్రీకరించి ప్రపంచంలోని వివిధ దేశాలలోని రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులను నిర్లక్ష్యం చేసినారు.

5. యుద్ధంలో గెలిచిన రాజ్యాలమీద ఓడిపోయిన రాజ్యాలు పగసాధింపు ధోరణిని ఆమోదించడం కూడా నిరాయుధీకరణ సమావేశాలు విఫలంకావడానికి ఒక కారణము. అంతేకాక హిట్లర్ నాయకత్వంలో జర్మనీ వర్సైసంధిని ఉల్లంఘించి ఆయుధాలను సమకూర్చుకోవడం ప్రారంభించడంతో నిరాయుధీకరణ సమస్యను పరిష్కరించడం కష్టమైంది.

6. సన్నాహక సంఘం విఫలం కావడంవల్ల నిరాయుధీకరణ సమావేశాలు కూడా విఫలమైనాయి.

7. నిరాయుధీకరణ సమావేశాలు ప్రారంభం కావడానికి ముందుగా జపాన్ మంచూరియా మీద దురాక్రమణ జరపడంతో అంతర్జాతీయంగా ఉద్రిక్తత వాతవరణము ఏర్పడింది. అందువల్ల నిరాయుధీకరణ సమావేశాలు విజయవంతం కావడానికి అనుకూల వాతావరణం లోపించింది.

**5.1.3 సమితి ప్రమేయం లేకుండా నిరాయుధీకరణ కోసం జరిగిన ప్రయత్నాలు :** నిరాయుధీకరణ సమస్యను పరిష్కరించడానికి సమితిద్వారా ప్రయత్నాలు జరిగినట్లుగానే సమితి ప్రమేయం లేకుండా కూడా అనేక ప్రయత్నాలు జరిగినాయి.

**5.1.3.1 వాషింగ్టన్ సమావేశము (1921 - 22) :** మొదటి ప్రపంచ యుద్ధానంతరం దూరప్రాచ్యంలో జపాన్ గొప్ప నౌకబలమున్న దేశంగా రూపొందింది. అంతేకాక పసిఫిక్ ప్రాంతంలో జపాన్ ఆధిపత్యం అమెరికాకు ఆందోళనను కలుగజేసింది. సాధ్యమైనంతవరకు జపాన్ తనకు మధ్య నౌకాదళ యుద్ధాన్ని నివారించవలెనని కోరికగల అమెరికా దూరప్రాచ్యంలో ఆసక్తిగల దేశాల నౌకాబలాన్ని పరిమితం చేయడానికి ప్రయత్నించింది. అమెరికా అధ్యక్షుడు హార్డింజ్ 1921 లో వాషింగ్టన్ సమావేశాన్ని ఏర్పాటు చేసినాడు. చైన జపాన్‌ల మధ్యగల తగాదాలను పరిష్కరించడం, ఇంగ్లాండ్, అమెరికాల మధ్య నౌకాబలాల పోటీని అంతం చేయకుండా వాషింగ్టన్ సమావేశం లక్ష్యాలు అని చెప్పవచ్చు. 1921 లో వాషింగ్టన్‌లో ప్రారంభమైన మొదటి నౌకాదళాల సమావేశం 1922 ఫిబ్రవరి వరకు కొనసాగింది. ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఇటలీ, బెల్జియం, చైనా, జపాన్, పోర్చుగల్, నెదర్లాండ్స్ దేశాలకు చెందిన ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరైనారు.

**5.1.3.2 నౌకాదళాల నిరాయుధీకరణ సంధి :** వాషింగ్టన్ సమావేశం ఫలితంగా చేసుకొన్న ఏడు సంధులలోను రెండు సంధులు నౌకా దళాల నిరాయుధీకరణకు సంబంధించినవి. ఐదు రాజ్యాల మధ్య జరిగిన సంధి ప్రకారం అమెరికా, ఇంగ్లాండ్, జపాన్, ఫ్రాన్స్, ఇటలీ దేశాల నౌకాదళ నిష్పత్తిని నిర్ణయించడం జరిగింది. ఈ సంధి ఐదు రాజ్యాల నౌకలన్నిటిని ఈ క్రింది విధంగా నిర్ణయించింది. అమెరికా నౌకాబలము 525,000 టన్నులు, ఇంగ్లాండ్ నౌకాబలం 525,000 టన్నులు, జపాన్ నౌకాబలం 815,000 టన్నులు, ఫ్రాన్స్ నౌకాబలం 175,000 టన్నులు. ఈ సంధి మీద సంతకం చేసిన ఐదు రాజ్యాలు తమ తీరప్రాంతంలో ఏ విధమైన రక్షణ ఏర్పాట్లు చేసుకోమని కూడా వాగ్దానం చేసినాయి. ఇంగ్లాండ్, అమెరికా, జపాన్, ఫ్రాన్స్, ఇటలీ దేశాలమధ్య జరిగిన మరొక ఐదురాజ్యాల సంధి ప్రకారం విషవాయువుల ఉపయోగం నిషేధించడమే కాక జలాంతర్గామి ఉపయోగం కూడా పరిమితం చేయడం జరిగింది. అయితే ఈ సంధికి ధ్రువపరచడం లేదు కాబట్టి అమలుపరచడం జరగలేదు.

1. వాషింగ్టన్ సమావేశంలో నౌకాబాలల తగ్గింపును చేసిన తీర్మానాలు అంతర్జాతీయ నిరాయుధీకరణ సాధించడానికి తీసుకొన్న ఒక ముఖ్యమైన చర్యగా కనిపించవచ్చు. కాని నిజానికి ఈ క్రింది కారణం వల్ల వాషింగ్టన్ సమావేశం చెప్పుకోదగిన విజయాన్ని సాధించలేక పోయింది. ఫ్రాన్స్ వ్యతిరేకించిన కారణంగా విధ్వంసక నౌకల, యుద్ధ నౌకల, ఇతర రకాల యుద్ధనౌకల సంఖ్యను గాని టన్నేజ్‌గాని పరిమితం చేయడం జరగలేదు. యుద్ధ నౌకల సంఖ్యను మాత్రమే పరిమితం చేసి నౌకాబలాల నిరాయుధీకరణను సాధించడం కష్టము.

2. యుద్ధనౌకల సంఖ్యను మాత్రమే పరిమితం చేసినందువల్ల దేశాల మధ్య నౌకాబలాల పోటీని నివారించడం వీలుపడదు. యుద్ధనౌకలకు తోడుగా ఇతర రకాల ఆయుధాల ప్రభావం కూడా నౌకాయుద్ధం మీద ఉంటుంది. వాషింగ్టన్ సమావేశము నౌకాదళాల బలాన్ని పరిమితం చేయడానికి సమగ్రమైన పథకాన్ని తయారు చేయలేక పోయింది.

3. నౌకాదళాల నిరాయుధీకరణ ద్వారా మాత్రమే ప్రపంచ నిరాయుధీకరణను సాధించడం సాధ్యపడదు. సైనిక దళాలను, విమానదళాలను కూడా పరిమితం చేయనిదే నిరాయుధీకరణ సమస్య పూర్తిగా పరిష్కారం కాదు. అయితే వాషింగ్టన్ సమావేశము నౌకాదళాలను మాత్రమే పరిమితం చేసింది. ఇది వాషింగ్టన్ సమావేశంలోని ముఖ్యమైన లోపము.

4. పసిఫిక్ ప్రాంతంలో జపాన్ నౌకా బలాన్ని ఆధిక్యాన్ని తగ్గించడం జరగలేదు. దాదాపు ఇంగ్లాండ్, అమెరికాలతో సమానంగా జపాన్‌కు నౌకాబలము ఉందని గుర్తించబడమైంది.

5. భవిష్యత్తులో నౌకాదళమును పరిమితం చేయడానికి ఏవిధమైన ఏర్పాట్లను చేయకుండానే సమావేశం ముగిసింది. అంతేకాక వాషింగ్టన్ సమావేశం తరువాత ఇంగ్లండ్, అమెరికాల మధ్య అనుమానము, ద్వేషాలు తిరిగి తెలెత్తినాయి.

వాషింగ్టన్ సమావేశం కొద్దిపాటి విజయాన్నయినా సాధించడానికి ముఖ్య కారణము ఇంగ్లాండ్ అమెరికాల కృషి అని చెప్పవచ్చు. నౌకాబలాల విషయంలో ఇంగ్లాండ్, అమెరికాల మధ్య తాత్కాలికంగా ఒక అవగాహన ఏర్పడింది. ఇంగ్లాండ్ జపాన్‌ల నౌకాబలం పరిమితం చేయడంవల్ల ఫ్రాన్స్, ఇటలీల భయం తొలగిపోయింది. ఇటలీవంటి బీదదేశానికి నిరాయుధీకరణ సాధనకోసం తీసుకొన్న ఏ చర్య అయినా ఆమోదయోగ్యమే.

**5.1.3.3 జెనీవా సమావేశము 1927 :** వాషింగ్టన్ సమావేశము నౌకాదళాలను పరిమితం చేయడంలో పూర్తి విజయాన్ని సాధించలేకపోయింది. అందువల్ల అమెరికా అధ్యక్షుడు కూలిడ్జ్ (Collidge) 1927 లో జెనీవాలో రెండో నౌకాదళాల సమావేశాన్ని ఏర్పాటు చేసినాడు. అమెరికా అధ్యక్షుని ప్రతిపాదనను ఇంగ్లాండ్, జపాన్‌లు బలపరిచినాయి. కాని క్రింది కారణాలవల్ల ఫ్రాన్స్, ఇటలీలు వ్యతిరేకించినాయి. జెనీవా సమావేశానికి చిన్న రాజ్యాలను ఆహ్వానించలేదు. నౌకాదళాలను మాత్రం పరిమితం చేయడంవల్ల అతిక్లిష్టమైన నిరాయుధీకరణ సమస్యను పరిష్కరించడం సాధ్యకాదని ఫ్రాన్స్ ఇటలీలు భావించాయి. నిరాయుధీకరణ సమస్యలను పరిష్కరించడానికి 1925 లోనే సమితి ఒక సంఘాన్ని నియమించింది. అందువల్ల జెనీవా సమావేశము సమితి ప్రయత్నాలకు అవరోధం అవుతుందని కూడా ఫ్రాన్స్ ఇటలీలు భావించినాయి. ఈ పరిస్థితులలో ఇంగ్లాండ్, అమెరికా, జపాన్‌లు మాత్రమే జెనీవా సమావేశంలో పాల్గొన్నాయి. ఇంగ్లాండ్ అమెరికాల మధ్య తీవ్రమైన విభేదాలు ఏర్పడగటంతో జెనీవా సమావేశం పూర్తిగా విఫలమైంది.

వివిధ దేశాల యుద్ధ నౌకల టన్నేజీను కాక సంఖ్యను పరిమితం చేయవలెనని జెనీవా సమావేశంలో అమెరికా కోరింది. అంతేకాక తన తీర ప్రాంతాల రక్షణకు పెద్ద నౌకలు అవసరమని అమెరికా వాదించింది. దీనికి భిన్నంగా సువిశాలమైన బ్రిటిష్ సామ్రాజ్యంలో రాకపోకల సౌకర్యం కోసం చిన్న నౌకల సంఖ్య ఎక్కువగా కావలెనని, అందువల్ల నౌకలసంఖ్యను కాక టన్నేజీను పరిమితం చేయవలెనని ఇంగ్లాండ్ వాదించింది. ఈ విధంగా ఇంగ్లాండ్ అమెరికాల మధ్య ఏర్పడిన తీవ్ర విభేదాల కారణంగా జెనీవా సమావేశం విఫలమై రెండు దేశాల మధ్య సంబంధాలు తాత్కాలికంగా దెబ్బతిన్నాయి.

**5.1.3.4 లండన్ సంధి 1930 :** జనవరి 1930 లో బ్రిటిష్ ఆహ్వానం మీద అమెరికా, ఫ్రాన్స్, ఇటలీ, జపాన్, దేశాల ప్రతినిధులు లండన్ సమావేశానికి హాజరయినారు. మూడు మాసాల సుదీర్ఘమైన చర్చల ఫలితంగా లండన్ నౌకాదళాల సంధిమీద ఇంగ్లాండ్, అమెరికా, జపాన్ దేశాల ప్రతినిధులు సంతకాలు చేసినారు. కాని ఫ్రాన్స్, ఇటలీలు సంధి మీద సంతకాలు చేయలేదు. ఈ సంధి ఫలితంగా ఇంగ్లాండ్ అమెరికాల మధ్యగల వివాదాలు పరిష్కారమైయినాయి. అంతేకాక ఈ సంధి ప్రకారం చిన్న నౌకల సంఖ్యను పెంచుకోవడానికి అమెరికాకు అవకాశము ఏర్పడింది. అయితే రెండుదేశాల నౌకాబలం మాత్రం సమానస్థాయిలో ఉండవలె. చిన్న నౌకలను, విధ్వంసక నౌకలను పెంపొందిచుకోనే స్వేచ్ఛ జపాన్‌కు ఇచ్చినారు. లండన్ నౌకాదళాల సంధి ఫలితంగా ఇంగ్లాండ్, అమెరికా, జపాన్‌లు తమ నౌకాబలాన్ని పెంపొందించుకోవడానికి అవకాశమేర్పడింది. ఈ సంధి ఎట్లాంటి మార్పులు లేకుండా 1936 వరకు అమలులో ఉంటుంది.

లండన్ సమావేశము ఫ్రాన్స్, ఇటలీలు మధ్యగల వివాదాలను పరిష్కరించలేకపోయింది. ఇటలీలో సమానంగా తన నౌకాబలాన్ని పరిమితం చేసుకోవడానికి ఫ్రాన్స్ అంగీకరించలేదు. వలస సామ్రాజ్య రక్షణకోసం తనకు ఎక్కువ యుద్ధనౌకలు, విధ్వంసక నావలు, జలాంతర్గములు అవసరమని ఫ్రాన్స్ భావించింది. మధ్యధరా ప్రాంతంలో ఇటలీ నౌకాధిపత్యాన్ని స్థాపించడం జరిగినట్లయితే తన భద్రతకు ముప్పు వాటిల్లుతుందని కూడా ఫ్రాన్స్ భయాన్ని వెలిబుచ్చింది. తక్కువ తీరప్రాంతమున్న ఇటలీకి ఫ్రాన్స్‌తో సమానమైన నౌకాబలం అక్కరలేదు అని ఫ్రాన్స్ వాదించింది. ఫ్రాన్స్ వాదనలను ఇటలీ తిరస్కరించింది. అందువల్ల లండన్ సంధిమీద ఫ్రాన్స్ ఇటలీదేశాల ప్రతినిధులు సంతకాలు చేయడానికి నిరాకరించినారు. ఫ్రాన్స్, ఇటలీలు సంతకాలు చేయని కారణంగా లండన్ నౌకాదళాల సంధికి ప్రాముఖ్యం లేకుండా పోయింది. అంతేకాక నౌకాదళాల నిరాయుధీకరణ విషయంలో కూడా లండన్ సంధి ఏమాత్రం విజయం సాధించలేక పోయిందని చెప్పవచ్చు.

**5.1.3.5 లండన్ నౌకా సమావేశము 1935- 36 :** నౌకాబలం ఆయుధాలను పరిమితం చేయడం కోసం ఇంగ్లాండ్ అమెరికా, జపాన్ దేశాల ప్రతినిధులు 1935 లో మరొక సారి లండన్‌లో సమావేశమైనారు. కాని అప్పటి అంతర్జాతీయ పరిస్థితి నిరాయుధీకరణ సమావేశానికి అనుగుణంగా లేదు. మంచూరియా మీద జపాన్ దురాక్రమణ వర్సేసంధిని ఉల్లంఘించి జర్మనీ సైనిక బలం పెంపొందించుకోవడంవంటి పరిణామాల కారణంగా ఉద్రిక్తతతో కూడిన వాతావరణము ఏర్పడింది. ఈ పరిస్థితులలో లండన్ సమావేశము 1935 లో ప్రారంభమైంది. అన్నిరాజ్యాలకు సమానమైన నౌకాబలము ఉండవలెనని జపాన్ చేసిన ప్రతిపాదనను ఇంగ్లాండ్ అమెరికాలు వ్యతిరేకించినాయి. రైన్ భూభాగంలో హిట్లర్ సైనిక చర్యలు ప్రారంభించడంతో సమావేశంలో పాల్గొంటున్న ప్రతినిధులకు నౌకాదళాల

నిరాయుధీకరణ పట్ల ఆసక్తి తగ్గిపోయింది. లోగడ చేసుకున్న నౌకాదళాల సంధి ప్రకారం వివిధదేశాల నౌకాదళాల బలాలనిష్పత్తిని కొనసాగించడానికి, యుద్ధనౌకల టన్నేజీని సమాఖ్యానా పాటించడానికి సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు అంగీకరించారు. మొత్తం మీద అంతర్జాతీయంగా ఉద్రిక్తత వాతావరణము ఏర్పడిన ఫలితంగా 1935-36 లలో జరిగిన లండన్ నౌకా సమావేశము పూర్తిగా విఫలమైంది.

**5.1.3.6 మాస్కో నిరాయుధీకరణ సమావేశము 1922 :** 1922 లో రష్యా ఆధ్వర్యంలో మాస్కోలో ఒక నిరాయుధీకరణ సమావేశం జరిగింది. పోలండ్, ఇస్టోనియాలాట్వియా, లిథేనియా, ఫిన్‌లాండ్ దేశాల ప్రతినిధులు మాస్కో సమావేశానికి హాజరైనారు. రష్యా తూర్పు యూరప్‌లోని రాజ్యాలకు మధ్య ఒక శాశ్వతమైన సైన్యాన్ని ఏర్పాటు చేయడం ఈ సమావేశం ముఖ్యలక్ష్యము. కాని మాస్కో సమావేశం కూడా ఇతర నిరాయుధీకరణ సమావేశాల వలె విఫలమైంది.

**1.4 సమితి ప్రమేయం లేకుండా నిరాయుధీకరణ కోసం జరిగిన ప్రయత్నాలు విఫలం కావడానికి కారణాలు :**
పైన పేర్కొన్న విధంగా సమితి ప్రమేయం లేకుండా నిరాయుధీకరణ సమస్యను పరిష్కరించడానికి చేసిన ప్రయత్నాలన్నీ పూర్తిగా విఫలమైనాయి. అగ్రరాజ్యాల మధ్య సదవగాహన లోపించడానికి తోడుగా తీవ్రమైన పోటీదోరణి ఏర్పడటం, సమితి ప్రమేయం లేకుండా నిరాయుధీకరణ సమస్యను పరిష్కరించడానికి చేసిన ప్రయత్నాలు విఫలం కావడానికి ముఖ్యకారణము. అగ్రరాజ్యాలు నిరాయుధీకరణ సమస్యపట్ల సరి అయిన ఆసక్తిని చూపక రాజ్యతుల్య ప్రాభల్యాన్ని కాపాడటం పట్ల ఎక్కువ ఆసక్తిని చూపించినాయి. ఫ్రాన్స్, ఇటలీలు సహకరించక పోవడంవల్ల జెనీవా సమావేశం విఫలమైంది. ఫ్రాన్స్ ఇటలీలు సంతకాలు చేయడంవల్ల లండన్ నౌకాదళాల సంధి ప్రాముఖ్యం తగ్గిపోయింది. నిరాయుధీకరణ సమస్య విషయమై సోవియట్ రష్యా పశ్చిమరాజ్యాల మధ్య తీవ్రమైన విరోధమేర్పడింది. తూర్పు, పశ్చిమ రాజ్యాల మధ్య ఏర్పడిన పోటీకారణంగా నిరాయుధీకరణ సమస్య పరిష్కారం కాలేదు. మిత్రరాజ్యాల పట్ల జర్మనీ పగసాధింపు ధోరణివల్ల, హిట్లర్ నాయకత్వంలో జర్మనీ వర్సేల్స్ సంధిని ఉల్లంఘించి ఆయుధాలను సమకూర్చుకోవడం వల్ల కూడా అంతర్జాతీయ రాజకీయాలలో ఉద్రిక్తత ఏర్పడింది. ఈ పరిస్థితులలో నిరాయుధీకరణ సమస్యను పరిష్కరించడం కష్టమైంది.

**5.1.5 సమిష్టి భద్రత స్థాపనకు జరిగిన ప్రయత్నాలు విఫలం కావడానికి కారణాలు :**

సమిష్టి భద్రత జయాపజయాలు మూడు ముఖ్యమైన పరిస్థితులమీద ఆధారపడి ఉంటాయి. అవి :

1. తాము నిర్వర్తించవలసిన విధులపట్ల ఒడంబడికలలోని సభ్యరాజ్యాల వైఖరి
2. సభ్యరాజ్యాల మధ్య నిజమైన పరస్పర విశ్వాసము
3. సభ్యరాజ్యాల మధ్య రాజ్యతుల్య, ప్రాభల్య, స్థితి ఈ మూడు పరిస్థితులు లోపించడంవల్ల సమిష్టి భద్రత విఫలమైందని చెప్పవచ్చు. మొత్తం మీద సమిష్టి భద్రతా స్థాపనకు చేసిన ప్రయత్నాలన్నీ కింది కారణాలవల్ల విఫలమైనాయి.

1. సభ్యరాజ్యాలు తమ సైన్యాలను సమితి అధీనంలో ఉంచడానికి ఇష్టపడలేదు.
2. దురాక్రమణకు గురి ఆయిన రాజ్యాల రక్షణకు యుద్ధాలు చేయడానికి సభ్యరాజ్యాలు సుముఖంగా లేవు.
3. దురాక్రమణ ఎదుర్కోడానికి సమితి ఒడంబడికలో పొందుపరచబడిన నిబంధనలు లోకర్నో సంధి కెల్లాగ్ - బ్రేయాండ్ సంధి మొదలైన అనేక ఇతర సంధులలో కూడా చేర్చబడినందువల్ల సమితి ప్రాముఖ్యం తగ్గి బలహీనమైంది.
4. ఫ్రాన్స్ అనేక ప్రాంతీయ భద్రతా ఒడంబడికలు తయారుచేయడం వల్ల సమిష్టి భద్రతా విఫలమైంది.
5. జర్మనీ హిట్లర్ నాయకత్వంలో దురాక్రమణ విధానం అనుసరించినప్పుడు ఇంగ్లాండ్, అమెరికాలు జర్మనీ పట్ల తృప్తిపరచే విధానం అనుసరించడం కూడా సమిష్టి భద్రత విఫలం కావడానికి కారణమైంది.

## 5.2. ప్రపంచ ఆర్థిక మాంద్యం (1928) యూరప్‌పై దాని ప్రభావం :

**2.1 పరిచయము :** 1929 నాటికి రాజకీయాల్లో మాదిరి, దౌత్యరంగంలో మాదిరి ఆర్థిక రంగంలో కూడా అంతర్జాతీయ వాదంలో తీవ్ర జాతీయవాదం ఘర్షణ పడటం మొదలు పెట్టింది. యుద్ధానంతరం ఆర్థికంగా కోలుకునేందుకు, ఆర్థికాభివృద్ధికోసం ప్రపంచ దేశాలు దూరదృష్టితో కూడిన అంతర్జాతీయ వ్యాపారాన్ని వదలివేసి, సంకుచిత ఆర్థిక విధానాలను అవలంభించటం మొదలు పెట్టాయి. అంతర్జాతీయ వ్యాపారాభివృద్ధికోసం బాగా పారిశ్రామికంగా అభివృద్ధి అయిన దేశాల వారి జీవన ప్రమాణం, ఆర్థిక శ్రేయస్సుపై ఆధారపడి ఉన్నాయి.

లోకార్నో ఒప్పందం తరువాత ఒక అయిదేండ్ల కాలంపాటు యూరప్ ఆర్థిక జీవితంలో స్వస్థత చేకూరి, యూరోపియన్ల జీవన ప్రమాణాలు బాగా పెరిగాయి. దీనికి ప్రధాన కారణం ప్రపంచ వ్యాపారాన్ని పునరుద్ధరించడం. మధ్య యూరోపియన్ రాజ్యాలకు అమెరికా సంయుక్త రాష్ట్రాలనుంచి బాగా ఋణాలు సమకూరాయి. ఈ రుణాలతో ఆ దేశాలవారు వ్యాపార సంస్థలోనూ, పరిశ్రమల్లోనూ పెట్టుబడులుపెట్టి, ఉత్పత్తులు పెంచారు. ఈ విధంగా ఉత్పత్తి అయిన వస్తువులను ఎగుమతిచేసి తమకు కావలసిన వస్తువులను వారు దిగుమతి చేసుకున్నారు. అంతర్జాతీయ వ్యాపార చక్రాలు తిరిగేకొద్ది వివిధ దేశాల్లో వ్యాపార, పరిశ్రమల చక్రాలు వాటంతటవే తిరిగాయి.

ఉత్పత్తులు పెంచటానికి క్రొత్త క్రొత్త పద్ధతులు అమలులోకి వచ్చాయి. ప్రపంచ వ్యాపారాలలోకి కొత్త వస్తువులు వచ్చి పడ్డాయి. వ్యాపార సరళులలోనూ, ప్రకటన విధానాల్లోనూ ఉత్పత్తి కారకాల్లోనూ విప్లవాత్మక మార్పులు రావటం, ఆటోమొబైల్స్, విమానాలు, రేడియోలు, గ్రామఫోన్ లాంటి కొత్త పరిశ్రమలు అభివృద్ధి కావటం వ్యాపారంలో హఠాత్ సమృద్ధికి మరికొన్ని కారణాలు.

**2.2 అమెరికా - స్పెక్యులేషన్ వ్యాపారం :** ఈ ఆర్థికాభివృద్ధికి అమెరికా సంయుక్త రాష్ట్రాలు కేంద్రం. 1920 నుంచి అమెరికా సంయుక్త రాష్ట్రాలు ఉత్పత్తులలో బ్రహ్మాండమయిన పురోభివృద్ధి సాధించాయి. అమెరికాలో కనిపించిన ఆర్థికవేగం త్వరణం(Economic Acceleration) మరో దేశంలో కనిపించలేదు. ఇక్కడ ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ పరపతి సౌకర్యాలకు అమిత ప్రోత్సాహం ఇచ్చింది. దీనివల్ల స్పెక్యులేటివ్ పెట్టుబడులు పెరిగాయి. అంతవరకూ కనివిని ఎరుగనటువంటి సంచలనం స్టాక్ మార్కెట్‌లో ఏర్పడింది. 1920లో వాల్‌స్ట్రీట్ స్టాక్‌ల ధర నూటికి ఇరువై అయిదువందలు పెరిగింది. 1928 లో అది నూటికి ముప్పై అయిదు వంతులకు పెరిగింది. తక్కువ కాలంలో అధిక లాభాలను గడించుటకోసం ఇదివరకు ఏ విధమైన అనుభవం లేనివారు కూడా స్పెక్యులేటివ్ వ్యాపారానికి దిగారు. స్టాక్‌ల ధరలు పెరిగినంతగా ప్రపంచ వ్యాపారం కానీ, వస్తువులకు యదార్థ సప్లైకానీ పెరగలేదు. 1926-1929 మధ్యకాలంలో పారిశ్రామిక ఉపాధి అవకాశాలు, పారిశ్రామిక ఉత్పత్తులు అసలు పెరగలేదు. స్టాక్ మార్కెట్‌లకు చెందిన పరపతి విధానాల అభిసంధాన దోషాలు వల్లనే స్టాక్ మార్కెట్ విలువలు పెరిగాయి. ఈ పరిస్థితి ఎక్కువకాలం కొనసాగేది కాదు. ఉన్నట్లుండి 1929 అక్టోబర్‌లో ఒక యూరప్‌లోనే కాకుండా మొత్తం ప్రపంచంలో ఈ విధానం ఇదివరకెన్నడూ ప్రజలు అనుభవించని ఆర్థిక మాంద్యాన్ని తెచ్చిపెట్టింది. స్పెక్యులేషన్ వల్ల ఏర్పడ్డ వాల్‌స్ట్రీట్ హఠాత్ సమృద్ధికి, ప్రపంచ వ్యాపారంలో ఏర్పడ్డ స్తబ్దతకు దగ్గర సంబంధం ఉన్నది. ఈ సంబంధాన్ని ఎత్తి చూపించటానికి 1929 లో ప్రపంచ వ్యాపారం ఏ విధంగా సాగించారో గమనించాలి.

మొదటి ప్రపంచ యుద్ధానంతరం అమెరికా సంయుక్త రాష్ట్రాలు పరపతి ద్రవ్యం సమకూర్చే ప్రధాన దేశంగా మారాయి. ఇతర దేశాల్లో ఉత్పత్తి అవుతున్న వస్తువుల అవసరం అమెరికాకు లేదు. అమెరికా సంయుక్తరాష్ట్రాలకు సహజ వనరులు పుష్కలంగా ఉన్నాయి. అమెరికాలో పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పాదన సామర్థ్యం కూడా విపరీతంగా పెరిగింది. అందువల్ల విదేశ ఉత్పత్తులనుంచి స్వదేశ ఉత్పత్తులను రక్షించుకునేందుకు అమెరికా టారిఫ్‌లను అమితంగా పెంచివేసింది. అసలు ఇతర దేశాల వస్తువులంటేనే అమెరికన్‌లకు ఏహ్యాభావం.

ఆనాటి అమెరికన్ ఆర్థిక పరిస్థితి ప్రత్యేకంగా ఉన్నది. అది అమెరికా ఇతర దేశాల్లో విపరీతంగా పెట్టుబడులు పెట్టింది. యుద్ధకాల ఋణాలకు తిరిగి చెల్లింపులు చేయమని అడగటం మొదలు పెట్టింది. తన ఎగుమతి ఉత్పత్తులను ఇతర దేశాల్లో అమ్మదలచుకుంది. అమెరికా ఇచ్చిన ఋణాలకు తిరిగి చెల్లింపులు, అమెరికానుంచి ఎగుమతి అవుతున్న వస్తువులకు చెల్లింపులు రెండు విధాలుగా జరగవచ్చు అవి 1. బంగారంలో చెల్లింపులు జరగటం, 2. వస్తువుల రూపంలో చెల్లింపులు జరగటం, అమెరికన్ టారిఫ్ విధానంవల్ల రెండో విధానం

అసలు వీటుగా ఉంటుందని, ఋణపడ్డ దేశాలు బంగారంలో అమెరికాకు తిరిగి చెల్లింపులు చేశాయి. కానీ, కొద్ది కాలంలోనే ఈ దేశాల బంగారం నిల్వలు అడుగంటాయి.

ఇతర దేశాలకు డాలర్‌లను ఋణాల క్రింద ఇచ్చి, తన ఉత్పాదక వస్తువులను అక్కడ అమెరికా అమ్మించుకోవచ్చు. కానీ, 1914 ముందు మాదిరిగా అమెరికన్‌లు ఇతర దేశాల్లో పెట్టుబడులు పెట్టటానికి సముఖంగా లేదు. దీనికి కారణం యుద్ధకాలంనాటి ఋణాలు ఇంకా వివాదగ్రస్థంగా ఉన్నాయి. బొల్షివిక్ ప్రభుత్వం, జార్ ప్రభుత్వం చేసిన ఋణాలను ఆమోదించలేదని ప్రకటించింది. అందువల్ల దీర్ఘకాలిక ఋణాలుగాక స్వల్పకాలిక ఋణాలు అమెరికా, యూరప్ సంబంధాలలో పరిపాటి అయింది.

ఈ పరిస్థితులవల్ల, యుద్ధ నష్టపరిహార చెల్లింపుల విషయంలో ఏర్పడ్డ వివాదాల వల్ల యూరోపియన్ దేశాలు ఋణాలనే ఊబిలో కూరుకొని పోయింది. చివరికిది బ్రహ్మాండమైన ఆర్థిక సంక్షోభానికి దారి తీసింది.

సామాజిక పరిస్థితులను మెరుగుపరచటానికి, యుద్ధ నష్ట పరిహార చెల్లింపులకు జర్మనీ, అమెరికన్ ఋణాలు మీద ఆధారపడి ఉన్నది. జర్మనీనుంచి వచ్చిన డబ్బుతో బ్రిటన్, ఫ్రాన్స్‌లు యుద్ధకాలంలో చేసిన ఋణాలకు తిరిగి చెల్లింపులు చేశాయి. చివరికిది ఒక విషవలయంగా మారింది. అంతర్జాతీయ వ్యాపార చక్రాలు తిప్పటానికి ఏ దేశం చెప్పుకోదగ్గ చర్యలేమీ తీసుకోలేదు. ఈ చక్రీయ అస్థిరత్వాలవల్ల అమెరికన్ యూరోపియన్ ఆర్థిక పునాదులే కదలిపోయాయి.

ఆర్థిక మాంద్యమనే పెనుతుఫాను తాకిడి మొదలు అమెరికన్ కెనడిమన్ రైతాంగం అనుభవించింది. ఉత్తర అమెరికా ఖండంలో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు 1926 తరువాత పడిపోవడం మొదలుపెట్టాయి. తమ వ్యవసాయ ఉత్పత్తులు.

| ప్రత్తి | ధాన్యం (బుషెల్ ఒక్కంటికి) | |
|---|---|---|
| 1919 - 35.34 | 11.51 | 12.16 |
| 1929 - 16.7 | .79 | 1.03 |
| 1932 - 6.5 | .31 | .38 |

పెరగటంతో యూరోపియన్‌లు అమెరికన్ ఉత్పత్తుల మీద ఆధారపడనవసరం లేకుండా పోయింది. యూరప్ స్వయం సమృద్ధి సాధించుకొన్నప్పటికీ వ్యాకోచత్వమైన డిమాండ్ అమెరికన్ ధాన్యం పోగొట్టుకుంది. తగిన లాభాలు రాకపోయేటప్పటికీ అమెరికన్ రైతులు వ్యవసాయ కార్యక్రమాలను బాగా తగ్గించుకున్నారు. దీని ప్రభావం అమెరికన్ పరిశ్రమల మీద పడింది.

**5.2.3 వాల్‌స్ట్రీట్ పతనం :** స్పెక్యులేషన్ వ్యాపారంలో వచ్చిన సంక్షోభంవల్ల విపత్కర పరిణామాలు సంభవించాయి. 1929 అక్టోబర్‌లో వాల్‌స్ట్రీట్‌లో స్టాక్ హోల్డర్‌లకు విపరీతమైన భయం పట్టుకుంది. అక్టోబర్ 24 న వారు దాదాపు పదమూడు మిలియన్ వాటాలను అమ్మివేసుకున్నారు. అందువల్ల 1929 అక్టోబర్ 24 కు 'చీకటి గురువారం ' అనిపేరు అక్టోబర్ 29 వ తేదీనాటికి మరో 16, 1/2 మిలియన్‌లవాటా మూలధనాలు చేతులు మారాయి. అక్టోబర్ చివరినాటికి అమెరికన్ పెట్టుబడిదారులు 40,000 మిలియన్ డాలర్‌లు పోగొట్టుకున్నారు. న్యూయార్క్ స్టాక్ మార్కెట్ పతనం వల్ల అమెరికాలో వ్యవసాయ ఉత్పత్తులు ధరలు మరీ పడిపోయాయి. దీనివల్ల ప్రపంచం మొత్తంలో భయాందోళనలు చెలరేగాయి. నవంబర్ తరువాత ధరలు ఇంకా పడిపోయాయి.

వ్యవసాయ ఉత్పత్తుల ధరలు, ముడిపదార్థాల ధరలతో బాటు పారిశ్రామిక ఉత్పత్తుల ధరలు కూడా పడిపోయాయి. ఉత్తర అమెరికా రైతులు, ఆస్ట్రేలియా పండ్లతోటలవారు, మాంసం ఉత్పత్తి దారులు, బ్రెజిల్‌మన్ కాఫీ తోటల వారు, జావా చెరుకు రైతులు గిట్టుబాటు ధరలు దొరకనందున చాలా నష్టపోయారు. వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులవల్ల ఉత్పత్తులు పెరిగాయి. అభివృద్ధి అయిన దేశాలలో వీటికి మార్కెట్లు లేకుండా పోయాయి. ఆసియా, ఆఫ్రికాల పేద ప్రజానీకం వీటిని కొనలేకపోయింది. గోధుమ, ప్రత్తి

కోకో, చెరకు, మాంసం ఉత్పత్తి దారులకు ధరలు పడిపోవటం వినాశకరమైంది. వీరందరూ సామాన్య పరిస్థితుల్లో కొనుగోలు చేసుకోగల వస్తువులను ఇప్పుడు కొనుగోలు చేయలేకపోతున్నారు. అందువల్ల ఇతర వస్తువుల డిమాండ్ పడిపోయింది. ఈ కారణంగా ప్రపంచ ఆర్థిక విధానంలో సంక్షోభం ఒకరంగంనుంచి మరో రంగానికి వ్యాపించి ధరలు పడిపోవటం విపరీతమైంది.

**2.4 కలిమి మధ్యలేమి : 1929 నుంచి 1934** వరకు వివిధ దేశాల మధ్య వ్యాపారం కుదించుకొనిపోయింది. రక్షిత టారిఫ్ విధానాలను అమలుచేసి, గిట్టుబాటు ధరలను నిర్ణయించి, తమ వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తి దారులకు రక్షణ కల్పించటానికి వివిధ ప్రభుత్వాలు చేసిన ప్రయత్నాలవల్ల అంతర్జాతీయ వ్యాపారానికి ఇంకా అడ్డంకులు ఏర్పడ్డాయి. ప్రభుత్వాలు దివాలా తీయటం సర్వసాధారణమయింది. ఫ్యాక్టరీలు పూర్తిగానో, పాక్షికంగానో మూతపడటంతో మిలియన్‌ల సంఖ్యలో కార్మికులు ఉపాధి కోల్పోయారు. "కలిమి మధ్యలేమి" పరిస్థితి ప్రపంచంలో వ్యాపించింది. అమెరికా, యూరప్‌లలో అధికోత్పత్తులు జరిగాయి కానీ, మిలియన్‌ల సంఖ్యలో ప్రజలు నిత్యవసర వస్తువులు దొరకక అలమటించారు.

**2.5 ఆర్థిక సంక్షోభం :** యూరోపియన్ భద్రత మీద మొదటి ప్రపంచ యుద్ధం తీసినంతటి దెబ్బ ఆర్థిక శక్తులమని విర్రవీగుతూ వచ్చిన దేశాలు, సంస్థలు మట్టికరిచాయి. మూడేండ్ల కాలంలో అయిదువేల బాంకులు అమెరికాలో మూతపడ్డాయి. ఇతర దేశాలకు పరిమితులను మాని వేయటమే కాకుండా, అమెరికా ఇస్తూవస్తున్న స్వల్పకాలిక ఋణాలను కూడా నిలిపివేసింది. ప్రపంచ యుద్ధాలనుంచి కోలుకుంటున్న యూరప్‌కు ఇది ఘాతుకంగా పరిణమించింది. ముఖ్యంగా 1931 లో జర్మనీ, ఆస్ట్రియాలో ఆర్థిక మాంద్యల తీవ్రంగా ఉంది. ఆస్ట్రియాలో అతిపెద్ద బాంక్ క్రెడిటిన్ స్టాల్స్ 1931 మేలో దివాలా తీసింది. ఆస్ట్రియన్ ప్రభుత్వం దీనితో అన్ని విదాలా సహకరించినా, బాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ ఋణం ప్రకటించినా ప్రయోజనం లేక పోయింది. క్రెడిటిన్ స్టాల్స్ పతనం మధ్య యూరప్ ఆర్థిక పునాదులనే కదిలించి వేసింది. విదేశ పెట్టుబడుల దారులు తమ మూలధనాన్ని జర్మనీనుంచి ఉపసంహరించుకొన్నారు. 1931 మే చివరి నాటికి ఆస్ట్రియా మాదిరి జర్మనీ కూడా విపరీతమైన ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. జర్మనీ అధ్యక్ష్యుడు హిల్టెన్ బర్గ్ ఖర్చులు తగ్గిస్తూ, కొత్త పన్నులు విధిస్తూ శాసనాలు ప్రకటించాడు. చాన్సలర్ బ్రూనింగ్ బ్రిటిష్ సహాయాన్ని అర్థించాడు. ఇతర దేశాలు తమకివ్వవలసిన ఋణాలు చెల్లింపులను ఒక సంవత్సరానికి వాయిదా వేస్తూ అమెరికా అధ్యక్షుడు హువర్, జూన్ 20 న ఒక ప్రకటన చేశాడు. బ్రిటన్, ఫ్రాన్స్‌ల మధ్య కొత్త భేదాభిప్రాయానికి ఇది కారణభూతమైంది. అమెరికన్ ప్రకటన సక్రమంగా ఉందని బ్రిటన్ ప్రకటిస్తే, యుద్ధ నష్టపరిహారాల చెల్లింపులు పూర్తిగా రద్దు చేయటానికి ఇది తొలి చర్య అని అమెరికన్ ప్రకటనను ఫ్రాన్స్ విరసించింది.

1931 జూలై నాటికి బ్రిటిష్ పరపతి సంక్షోభంలో ఉంటుంది. ఫ్రాన్స్ లోటు బడ్జెట్‌ల పరిపాటి, కానీ లోటు బడ్జెట్ బ్రిటిష్ ఆర్థిక విధానంలో సాధారణ విషయం కాదు, రోజుకు 2 1/2 మిలియన్ పౌన్ల బ్రిటిష్ ఖాతాదారులు బాంకులనుంచి తీసివేసుకొనేవారు. అందువల్ల "బాంక్ ఆఫ్ బ్రిటన్" బంగారం నిల్వలు అడుగంటాయి. ఈ పరిస్థితిని అదుపులో పెట్టాల్సిన అగత్యం ఏర్పడింది. రామ్సే మాక్డోనాల్డ్ నాయకత్వంలో బ్రిటన్‌లో జాతీయ ప్రభుత్వ ఏర్పడింది. దానిలో లేబర్, కాన్సర్వేటివ్, లిబరల్ పార్టీల వారు చేరారు. సైనికుల జీతాలు తగ్గిస్తూ, ఇతర ఖర్చులను అదుపులో పెడుతూ మాక్డొనాల్డ్ ప్రభుత్వం అనుబంధ బడ్జెట్‌ను ప్రతిపాదించింది. ఇన్వర్ గార్డెన్ నావికుల జీతాల కోతను తీవ్రముగా నిరసించారు. అక్కడ తిరుగుబాటు పరిస్థితి ఏర్పడింది. దీనితో విదేశీయులకు బ్రిటిష్ ఆర్థిక స్థిరత్వం మీద విశ్వాసము నశించింది. సెప్టెంబర్ 2 వ జాతీయ ప్రభుత్వము బ్రిటన్ స్వర్ణ ప్రమాణమునుంచి తప్పించి ప్రాన్సును 30 వంతులు మూల్య న్యూనీకరణము చేసింది. దీనివల్ల యూరోపియన్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లన్నీ మూతపడ్డాయి. చాలా యూరోపియన్ ప్రభుత్వాలు, కొన్ని ప్రాంతాలు స్వర్ణ ప్రమాణాన్ని వదిలి వేశాయి. స్వర్ణ ప్రమాణాన్ని అంటిపెట్టుకొని ఉన్న దేశాలు ఇక ఫ్రాన్స్, ఇటలీ, స్విట్జర్లాండ్, బెల్జియం, హాలెండ్, రుమేనియా, అమెరికా సంయుక్త రాష్ట్రాలు మాత్రమే కానీ, యూరప్ ఖండంలో బంగారం నిల్వలు అడుగంటటంతో ఈ దేశాల్లో కూడా స్వర్ణ ప్రమాణానికి అర్థంలేకుండా పోయింది.

**2.6 సంక్షోభం - రక్షణ చర్యలు :** ఈ ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడటానికి ప్రభుత్వాలు మూడు రకాలైన చర్యలు తీసుకున్నాయి. 1. వినిమయ రేట్లను, కరెన్సీని నియంత్రణలో ఉంచటానికి ప్రభుత్వాలు విస్తృతమైన అధికారాలు తీసుకున్నాయి. టారిఫ్‌లను

విపరీతంగా పెంచాయి. 2. స్కాండినేవియన్ దేశాలు, తూర్పు యూరోపియన్ వ్యవసాయ దేశాల ప్రాంతీయ ఏర్పాట్లు చేసుకున్నాయి. 1932 లో ఒట్టావా అంగీకారాన్ని బ్రిటిష్ కామన్ వెల్త్ దేశాలు కుదుర్చుకొన్నాయి. 3. ఆర్థిక మాంద్యానికి లోనైన దేశాలు సమగ్ర సమిష్టి చర్యలు తీసుకున్నాయి.

ఉదాహరణకు 1932 లో జరిగిన వాసాన్ కన్వెన్షన్ యుద్ధ నష్టపరిహారపు చెల్లింపులను రద్దు చేసింది. 1933 లో లండన్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సమావేశంలో అరవై ఆరు దేశాలు పాల్గొని ఆర్థిక మాంద్యాన్ని గురించి చర్చించాయి. స్వర్ణ ప్రమాణాన్ని పునరుద్ధరించటానికి, ధరలను స్థిరీకరించటానికి, నియమాలు అడ్డంకులు లేకుండా సాగటానికి సంబంధించిన ప్రతిపాదనలను ప్రపంచ ఆర్థిక సమావేశం చర్చించింది. కానీ, ఈ ప్రతిపాదనలో చాలా వాటిని అమెరికా వ్యతిరేకించినందువల్ల, ఏ విధమైన నిర్ణయాలు చేయకుండానే లండన్ సమావేశం వాయిదా పడింది.

1932 శరత్కాలంలో అమెరికాలో ఫ్రాంక్లిన్ డి. రూజ్వెల్ట్ అధ్యక్షుడుగా ఎన్నిక కావటంతో అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో పరిస్థితి మారటం ప్రారంభించింది. అమెరికన్ రాజకీయాల్లో కొత్త అధ్యక్షుడు చొరవ, ఉత్సాహం, దృఢత్వం ప్రదర్శించాడు. గత ఎనిమిది సంవత్సరాలుగా అంగాంగానికి బలహీనత ఏర్పడి మూలపడి ఉన్న ఆర్థిక వ్యవస్థ మానసిక స్థైర్యం వల్ల, ఏ బాధకైనా ఓర్చి లేచి నిలబడాలనే కృతనిశ్చయం వల్ల కొద్ది కొద్దిగా క్రొత్త శక్తి సంతరించుకుంది. ఈ సమయానికి అవసరమైన ధైర్యం, చొరవ ప్రదర్శిస్తే ఒక అమెరికన్‌లు మాత్రమేగాక మొత్తం ప్రపంచ ప్రజలు ఆర్థిక మాంద్యాన్ని లెక్కలేకుండా ఎదుర్కొవచ్చని రూజ్వెల్ట్ ప్రతిపాదించాడు. అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో ఈ మహమ్మారి మొదట వ్యాపించింది. అందువల్ల దాన్ని అక్కడే మొదట అణచివేయాలనే కృతనిశ్చయాన్ని ఆయన ప్రకటించాడు. "మనం భయపడాల్సింది భయం గురించే" అని ఆయన స్పష్టం చేశాడు.

ఆర్థిక సంక్షోభాన్ని అంతర్జాతీయంగా ఎదుర్కొనటానికి జరిగిన ప్రయత్నాలు విఫలమవటంతో వివిధ ప్రభుత్వాలు జాతీయ స్థాయిలో చర్యలు తీసుకొన్నాయి. క్రమంగా 1934 కల్లా సంక్షోభం తొలగిపోవటం మొదలు పెట్టింది. జాతీయ స్థాయిలోనే సమస్య పరిష్కారమవుతుందనే భావం సర్వత్రా వ్యాపించింది.

**5.2.7 రూజ్వెల్ట్ - నవవిధానం** : 1920 లో ఎంత ఆర్థిక ప్రగతి సాధించిందో అమెరికా 1929 లో అంత ఆర్థిక మాంద్యాన్ని అనుభవించింది. ఉక్కు పరిశ్రమ పదింట తొమ్మిది వంతులు పడిపోయింది. ముడి పదార్థాలు ధరలు సగానికి పడిపోయాయి. అమ్మకాలు లేకుండా వస్తువులు గోతాలలో పడి ఉన్నాయి. అసలు ఉత్పత్తుల విధానం మీద, అమ్మకాలు, కొనుగోలు పద్ధతుల మీద అమెరికన్‌లకు విశ్వాసం సన్నగిల్లింది.

అధ్యక్షుడు హూవర్, రిపబ్లికన్ పార్టీవారు అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో వ్యాపించి ఉన్న ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోలేకపోయారు. స్పెక్యులేషన్ వల్ల ఏర్పడే అనర్థాలను గ్రహించి హూవర్ దాన్ని శాసనాల ద్వారా అదుపులో పెట్టదలచాడు. కానీ, స్టాక్ మార్కెట్‌ల పైన ఆంక్షల విషయంలో అతడు రిపబ్లికన్ శాసన సభ్యులను పెద్ద వ్యాపారస్తులను తన వైపుకు తిప్పుకోలేకపోయాడు. స్వేచ్ఛావాణిజ్య విధానం దీర్ఘకాలిక ప్రయోజనాలను కల్గిస్తుందని అతని భావన.

1930 నాటికి అమెరికన్ ఓటర్లకు ఓపిక నశించి అమెరికన్ కాంగ్రెస్ దిగువ సభ "హౌస్ ఆఫ్ రిప్రజంటేటివ్స్" లో డెమోక్రాట్‌లకు మెజారిటీ తెప్పించారు. వ్యాపార సంస్థలకు, గృహస్తులకు, రైతులకు ఋణ బాధలనుంచి బయటపడటానికి పరపతులు అందించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం సంస్థనొకదాన్ని నియమించింది. నిరుద్యోగ సమస్యను పరిష్కరించుకోవటానికి "కాంగ్రెస్ పబ్లిక్ వర్క్స్" చేపట్టదలచింది. కానీ, హూవర్ వీటో, ప్రయోగించి కాంగ్రెస్ ప్రతిపాదనలను అడ్డుకొన్నాడు. సహాయక చర్యలను రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు చేపట్టాలని, ప్రైవేట్ సంస్థల దాతృత్వంపైన ఈ సమస్య పరిష్కారం చాలావరకు ఆధారపడి ఉన్నదని హూవర్ భావన ప్రైవేట్ దాతృత్వం త్వరలోనే నిండుకుంది. రాష్ట్రప్రభుత్వాలు స్వల్పకాలిక రక్షణ చర్యలు తీసుకున్నాయి. ఫ్రాంక్లిన్ డి. రూజ్వెల్ట్ గవర్నర్‌గా ఉన్న న్యూయార్క్ వృద్ధులకు పింఛన్లు మంజూరు చేసింది. "పబ్లిక్ వర్క్స్" ప్రారంభించింది కానీ దేశవనరుల సమీకరణ చేయగలిగింది ఫెడరల్ ప్రభుత్వం

మాత్రమే. అమెరికన్ ఆర్థిక వ్యవస్థ మలుపు తిరగటానికి సిద్ధంగా ఉందని హూవర్ ప్రకటించాడు. కానీ, 1932, 33 చలికాలంలో అమెరికా ఆర్థిక మాంద్యంలో ఇంకా లోతుగా కూరుకొని పోయింది. దాదాపు 13 మిలియన్‌ల కార్మికులు ఉపాధి పూర్తిగా కోల్పోయారు.

హూవర్ విధానాలపట్ల అమెరికన్‌లకు విశ్వాసం సన్నగిల్లింది. ఉత్పత్తి దారుల కౌన్సిళ్ళు "ఛాంబర్స్‌ఆఫ్ కామర్స్" కన్సర్వేటివ్ రాజకీయవేత్తలు తమను ఆదుకుంటారనే భ్రమ అమెరికన్‌లు వదిలించుకున్నారు. ప్రతిపక్షంలో ఉన్న డెమోక్రటిక్ పార్టీవైపు అమెరికన్‌లు మొగ్గుచూపించటం ప్రారంభించారు. అధ్యక్ష పదవికి 1932 నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి ఫ్రాంక్లిన్ డి. రూజ్వెల్ట్ అత్యధిక మెజారిటీతో ఎన్నికయ్యాడు. 48 రాష్ట్రాలలో 42 రాష్ట్రాలు రూజ్వెల్ట్‌కు మెజారిటీ ఇచ్చాయి. కాంగ్రెస్‌లో కూడా డెమోక్రటీలు మెజారిటీ సాధించారు.

ఎన్నిక జరిగిన తరువాత కొత్త అధ్యక్షుడు పదవీ స్వీకరణకు మధ్య 4 నెలల కాలంలో అమెరికా ఇంకా ఆర్థిక రొంపిలోకి దిగింది ఉపాధి అవకాశాలు, వ్యాపార కార్యక్రమాలు మరింత నీరసించాయి. డిపాజిట్లను ఖాతాదారులు బాంక్‌లనుంచి లాగివేసుకోవటం మొదలుపెట్టేసరికి అమెరికన్ బాంకింగ్ వ్యవస్థ తుడిచిపెట్టుకుపోతుందేమోనన్న భయం వ్యాపించింది. 1933 మార్చి 4 న రూజ్వెల్ట్ పదవీ స్వీకారం చేసేటప్పటికి బాంక్‌లు చాలా వరకు మూతపడ్డాయి. ఉన్న కొద్దిపాటి బాంక్‌లు రాష్ట్ర ప్రభుత్వాలు విధించిన నిర్బంధాలకు లోబడి కొద్దిపాటి లావాదేవీలు సాగించాయి.

ఇట్లాంటి "ఆర్థిక స్మశానంలో నవ విధానం" అవతరించింది. వివిధ తరగతుల ప్రజలకు న్యాయమైన అవకాశాలు సమకూర్చటానికి ఆర్థిక, రాజకీయ రంగాలలో మార్పులు తీసుకురావటమే నవ విధానధ్యేయమని డెమోక్రటిక్ నాయకులు ప్రకటించారు. అమెరికా ఎదుర్కొంటున్న పరిస్థితిని అదుపులోకి తీసుకురావటానికి సరైన నాయకుడు రూజ్వెల్ట్ అని సర్వత్ర అంగీకరించారు. రూజ్వెల్ట్‌కు సమర్థమైన ఉద్యోగ సిబ్బంది కూడా లభించింది. ప్రజాసేవకు అంకితమైన కుటుంబానికి చెందినవాడు రూజ్వెల్ట్. ప్రెసిడెంట్ థియోడర్ రూజ్వెల్ట్‌కు దగ్గర బంధువు పెద్ద వ్యాపార సంస్థలు గడించే లాభాలపట్ల అతనికి విమర్శనాత్మక విశ్లేషణ ఉన్నది. బీదవారిపట్ల, దిక్కులేనివారిపట్ల ఆయన గొప్ప వితరణ ప్రదర్శించాడు. బాల్యంలో పక్షవాతం సోకిన, వయస్సు వచ్చేకొద్దీ అతడు అవసరానికి తగ్గ ధైర్యం శరీర దారుఢ్యం పెంచుకున్నాడు.

అవసరమైన శాసనాలు చేయటానికి, వాటిని అమలు చేయుటానికి రూజ్వెల్ట్ మేధావులను ప్రోగుచేశాడు. వీరికి "రూజ్వెల్ట్ బ్రెయిన్ ట్రస్ట్", అని పేరు వచ్చింది. రూజ్వెల్ట్ నవ విధానానికి చెందిన వారిలో విశ్వవిద్యాలయ ఆచార్యులు, ఆర్థిక శాస్త్రవేత్తలు, సంఘసేవలకు, రాజకీయ సిద్ధాంతవేత్తలు, పాత్రికేయులు అధిక సంఖ్యలో ఉన్నారు. 1932 ఎన్నికల ప్రచార సమయంలో కొలంబియా విశ్వవిద్యాలయానికి చెందిన ముగ్గురు ఆచార్యులు, రెయిమండ్ మాలే రెక్స్‌ఫర్డ్ జి. ఉగ్వెల్ అడాల్ఫ్ ఎ. బిర్లా జూనియర్ రూజ్వెల్ట్ తలపెట్టిన సంస్కరణలకు ముసాయిదా తయారుచేశారు. దీనికి ఇంకా గొప్ప రూపం ఇచ్చి, అమలు జరిపినవారు అధ్యక్షుని సలహాదారు హోర్‌మల్, హాప్కిన్స్ అంతరంగిక కార్యదర్శి హెరాల్డ్ ఏ ఇక్స్ వ్యవసాయ కార్యదర్శి ఎ.వాలెస్, కార్మిక కార్యదర్శి ఫ్రాన్సెస్ పెర్కిన్స్, రూజ్వెల్ట్ సహధర్మచారిణి ఎనా ఎలిమనార్ రూజ్వెల్ట్, అత్యంత ప్రతిభతో రక్షణ చర్యలు చేపట్టింది.

ఈ నవవిధానాలు పట్టాలు తప్పిన అమెరికన్ ఆర్థిక విధానాన్ని పట్టా లెక్కించటానికి భుజం భుజం కలిపారు. ప్రజాస్వామ్యం, సమానత్వాలకు దర్పణం పట్టిన జఫర్సన్, జాక్సన్‌లచేత, థియోడర్, రూజ్వెల్ట్, ఉడ్రోవిల్సన్, పురోగామి విధానాల చేత జాన్‌డేవి సామాజిక, వాస్తవిక వాదంచేత, సామర్థ్యం ఉన్న అమెరికన్ సంపద వృధా అయిపోతుందని విశ్లేషించి చూపించిన థార్‌స్టిన్ వెబ్లెన్ రచనలచేత నవ విధాన వాదులు ఉత్తేజితులయినారు.

నవ విధానవాదులు నిరుద్యోగ సమస్యను వివిధ కోణాలనుంచి ఎదుర్కోవటం మొదలుపెట్టారు. పెద్ద ప్రాజెక్టులు చేపట్టటానికి ప్రభుత్వం "పబ్లిక్ వర్క్స్ అడ్మినిస్ట్రేషన్" అనే సంస్థను స్థాపించింది. ఈ సంస్థ రాష్ట్రస్థానిక ప్రభుత్వాలతో కలిపి బాగా ఎత్తున ప్రభుత్వ భవన నిర్మాణానికి పూనుకుంది. "వర్క్స్ ప్రోగ్రెస్ అడ్మినిస్ట్రేషన్" అనే సంస్థ కార్మికులను ఉపాధి కల్పించటానికి అనేక ప్రాజెక్టులకు సబ్సిడీలను మంజూరు చేసింది. సాంస్కృతిక కళారంగాల్లో కూడా ఈ సంస్థ ప్రవేశించి ఉపాదికోల్పోయిన కళాకారులకు, రచయితలకు,

నటులకు, బుద్ధిజీవులకు పనికల్పించింది. ప్రాంతీయ చరిత్రల రచనలు చేసేవారికి, ప్రభుత్వ భవనాలకు అందచందాలు చేకూర్చేవారికి, కొత్త నాటకాల మీద ప్రయోగాలు చేసేవారికి, కొత్త వాగ్గేయకారులకు ఉపాధి లభించింది. తాత్కాలిక పద్ధతిమీద ఈ విధంగా ప్రభుత్వం నియమించిన కార్మికుల సంఖ్య మిలియన్‌లలో ఉన్నది. "సివిలియన్ కార్పోరేషన్ కార్ప్" అనే మరో సంస్థ వన్య సంరక్షణకు, రహదారుల అభివృద్ధికి వరద నివారణాచర్యలకు లక్షలాదియువకులను నియమించింది. కొన్ని సందర్భాలలో ప్రభుత్వం మిగులు ఆహార పదార్థాలను కొనుగోలు చేసి అవసరమున్నవారికి ఉచితంగా ఆహారం పంపిణీ-చేసింది దీనివల్ల అవసరమున్న వినియోగదారులకే కాకుండా ఉత్పత్తి దారులకు కూడా మేలుకలిగింది.

ఆర్థిక మాంద్యం ప్రారంభం కావటంతోనే యూరప్, అమెరికాలలో వ్యవసాయ ఉత్పత్తులు పెరగటంవల్ల వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోయాయని ఇదివరకే తెలుసుకున్నాం. వ్యవసాయ ఉత్పత్తుల సప్లై డిమాండ్‌ల నిష్పత్తి క్రమబద్ధం చేసేరదుకు కాంగ్రెస్ అగ్రికల్చరల్ అడ్జెస్ట్‌మెంట్ చట్టం చేసింది. దీనివల్ల వ్యవసాయానికి భూముల పరిమితులు తగ్గించుకున్న రైతులకు ప్రభుత్వం సబ్సిడీలు మంజారుచేసింది. 1934, 36 లలో ఏర్పడ్డ వర్షాభావం కారణంగా వ్యవసాయం తగ్గింది. దీనివల్ల కూడా వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పెరిగాయి. అమెరికా బలహీన పడింది.

**5.2.8. బ్రిటన్ :** ఆర్థికమాంద్యం ఎదుర్కొనేందుకు బ్రిటన్‌లో 'జాతీయ ప్రభుత్వం' ఏర్పడింది. ఈ ప్రభుత్వానికి పార్లమెంట్ అత్యవసర అధికారాలిచ్చింది. "ఆర్డర్స్ - ఇన్ - కౌన్సిల్" ద్వారానూ, దిగుమతి సుంకాల చట్టం ద్వారానూ, జాతీయ ప్రభుత్వం టారిఫ్ విధానాన్ని పునర్వ్యవస్థీకరించదలచింది. స్వేచ్ఛా వాణిజ్యంలో నమ్మకమున్న లిబరల్స్‌కు ఈ విధానం నచ్చక వారు మంత్రివర్గం నుంచి 1932 సెప్టెంబర్‌లో వైదొలగారు. కొద్దిమంది లేబర్ పార్టీవారు మాత్రమే "జాతీయ ప్రభుత్వాన్ని" సమర్థించినందు వల్ల దాన్ని నిజమైన జాతీయ ప్రభావం అనటానికి వీలులేదు. "చాన్సలర్ ఆఫ్ ఎక్స్‌చకర్" నైవెల్ చాంబర్లిన్ సంతులిత బడ్జెట్‌ను ప్రవేశపెట్టాడు. ఖర్చును పదింట ఒకవంతు తగ్గించటంవల్ల, కొత్త టారిఫ్ విధానం తెచ్చిపెట్టిన ఆదాయంవల్ల బ్రిటన్‌లో సంతులిత బడ్జెట్‌లు విజయవంతమయినాయి. డెన్మార్క్, జర్మనీ, అర్జంటైనా, సోవియట్ రష్యాతో కుదుర్చుకున్న ఒప్పందాలు బ్రిటిష్ వ్యాపారాన్ని పెంచాయి. యుద్ధకాలం నాటి చెల్లింపుల వాయిదాలు నామమాత్రంగా చెల్లిస్తూ 1934 జూన్‌లో బ్రిటన్ వాటిని పూర్తిగా నిలిపి వేసింది. 1934 చివరి నాటికి నిరుద్యోగుల సంఖ్య రెండు మిలియన్లకు తగ్గింది. నిరుద్యోగ భృతులను ఇవ్వడానికి ప్రభుత్వం "మీన్స్ టెస్ట్" అనే పరీక్షను నిరుద్యోగులకు పెట్టింది. దీనివల్ల నిరుద్యోగులలో తీవ్ర నిరసన ప్రబలింది. సైనిక విభాగాల మీద బ్రిటిష్ ప్రభుత్వం డబ్బు వెచ్చించింది. కానీ, అభివృద్ధి కార్యక్రమాల మీద, పబ్లిక్ వర్క్స్ మీద పెట్టుబడులు పెట్టరాలేదు. నిరుద్యోగుల సంఖ్య అమితంగా ఉన్నా అమెరికా సంయుక్తరాష్ట్రాల్లో మాదిరి బ్రిటన్ కూడా 1934 చివరినాటికి ఆర్థిక దుర్గ్మత నుంచి కోలుకోవటం మొదలు పెట్టింది. ప్రభుత్వం తీసుకున్న గట్టి చర్యలవల్ల బ్రిటిష్ వాణిజ్యం తిరిగి ఊపిరి పీల్చుకుంది. దీనితో ప్రజలు ఆత్మవిశ్వాసం పెరిగింది. ఆర్థిక నిశ్చలత్వానికి ఆత్మ విశ్వాసము ఎంతో అవసరం.

**5.2.9 ఫ్రాన్స్ :** 1931 నాటికి ఆర్థిక సంక్షోభం అంతగా కలవర పెట్టలేదు. వ్యవసాయ పరిశ్రమల మధ్య సంతులనం కుదిరినందువల్లా, బాంక్ఆఫ్ ఫ్రాన్స్ సమకూర్చుకొన్న బంగారం నిల్వలవల్ల ఫ్రెంచ్ ఆర్థిక విధానంలో కొంతవరకూ వ్యాకోచత్వము నెలకొంది. కానీ, 1932 ప్రారంభంనుంచి ప్రపంచ ఆర్థిక మాంద్యపు దుష్ఫలితాన్ని ఫ్రాన్స్‌పై పడటం మొదలుపెట్టాయి. దీనివల్ల ప్రభుత్వాలు తరచూ పడిపోయాయి. నిరుద్యోగుల సంఖ్య బాగా పెరిగింది. ఈ పరిస్థితి ఏర్పడగానే ఇతర ప్రభుత్వాలు ఏ చర్యలు అయితే తీసుకున్నాయో అట్లాంటి చర్యలనే ఫ్రెంచ్ ప్రభుత్వం తీసుకుంది. వేతనాలు, ధరలు, బాటకాల మీద నియంత్రణ తీసుకోవటానికి ప్రభుత్వం అత్యవసర అధికారాలు చేపట్టింది. దీనితో క్లిష్టపరిస్థితుల్లో ప్రజాస్వామ్య విధానాలు పనికిరావని ఫ్రెంచ్ ప్రభుత్వం అంగీకరించినట్లయింది. ఫ్రాన్స్‌లో ఆర్థిక సంక్షోభం రాజకీయ సంక్షోభంగా మారింది. పారిస్ నగరంలో అల్లర్లు చెలరేగాయి. ఈ కాలంలో ఫ్రాన్స్ చాలా ఆర్థిక అపవాదులకు గురైంది. క్రీ.శ. 1934 జనవరిలో సర్జ్ అలెగ్జాండర్ స్టావిస్కీ అపవాదు (Serge Alexandre Stavesky) ఆనాటి ఉద్రిక్తతను మరీ ఉధృతం చేసింది.

స్టావిస్కీ గత ఎనిమిదేండ్లుగా చాలా అపవాదులో ఇరుక్కున్నవాడు. అయినా స్టావిస్కీని ప్రభుత్వం అదుపులో తీసుకోలేదు. ఒక రోజు స్టావిస్కీ తుపాకిగుండుతో చచ్చిపడివున్నాడు. రహస్యాలను బయట పెడతాడేమోనన్న భయంతో పోలీసులు అతడిని మట్టుపెట్టారని

అందరూ భావించారు. ఈ విషయం వల్ల ఫ్రాన్స్ అంతటా ఉద్రిక్తత ఏర్పడింది. కెమెల్‌షావ్‌తేమ్ (Camillic chatemps) ప్రధాన మంత్రి పదవికి రాజీనామా ఇవ్వగా అద్వార్ దలద్యా (Edouard Daladier) ప్రధాని అయ్యాడు. అయినా పారిస్ నగర వీధుల్లో ప్రదర్శనలు ఆగలేదు. ఛాంబర్ ఆఫ్ డిప్యూటిస్‌లో ప్రధానమంత్రిమీద స్టావిస్కీ విషయంపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఎన్నో మోసాలు చేసిన స్టావిస్కీని 1927 నుంచి ఎందుకు విచారణకు పెట్టలేదు ? ఏ కారణం చేత ఎవరివల్ల స్టావిస్కీకి పందొమ్మిది పర్యాయాలు జామీను మంజూరైంది. పెద్ద వ్యాపారస్తులు, పోలీసులు, ఉద్యోగులు, స్టావిస్కీ వెనుక ఉన్నారని ఛాంబర్ ఆఫ్ డిప్యూటీస్‌లో చాలామంది అన్నారు. పారిస్‌లో ప్రదర్శనలు ఉధృతమయ్యాయి. ప్రదర్శనకారుల్లో అతివాదులు, మితవాదులే కాకుండా ఫాసిస్ట్ మూకలు కూడా చేరాయి. 1934 ఫిబ్రవరిలో ఫాసిస్ట్ మూకలు పార్లమెంట్ భవనంపై దాడి చేస్తారనే భయం వ్యాపించింది. ప్రదర్శకులు పోలీసులు మధ్య ఘర్షణలు జరిగాయి. పరిస్థితి చేయిదాటిపోతున్నదని గ్రహించి దలద్యా రాజీనామా చేసాడు వెనుక అధ్యక్షుడుగా పనిచేసిన గాస్తోన్ ద్యూమెర్గ్ (Gastan Doumergue) క్రొత్త ప్రధానిగా జాతీయ ప్రభుత్వం ఏర్పడింది. సోషలిస్ట్ కమ్యూనిస్ట్‌లు తప్ప మిగతా రాజకీయపక్షాలన్నీ జాతీయ ప్రభుత్వంలో చేరాయి. మార్షల్ ఫిలిప్‌పాటన్ (Marshal Phillipe Petain) యుద్ధమంత్రి అయ్యాడు. ఫాసిస్ట్ కార్యక్రమాలకు వ్యతిరేకంగా వామపక్షాల వారు ఫిబ్రవరి 12 న సార్వత్రిక సమ్మెను నిర్వహించారు. కానీ ఈ ఆందోళనలను తట్టుకొని జాతీయ ప్రభుత్వం నిలబడగల్గింది. 1934 నవంబర్ తరువాత ప్రభుత్వం పట్ల ప్రజల్లో కొంత విశ్వాసం కల్గింది.

**5.2.10 జర్మనీ :** ఆర్థిక మాంద్యం వల్ల జర్మనీలో తీవ్రమైన సంక్షోభం ఏర్పడింది. 1929 లో పారిశ్రామిక ఉత్పత్తులు సగానికి పడిపోయాయి. నిరుద్యోగుల సంఖ్య రెండు మిలియన్లనుండి ఆరు మిలియన్లకు పెరిగింది. ఈ పరిస్థితిని అదనుగా తీసుకొని నాజీపార్టీ తన బలమును పెంచుకొంది. 1931 జనవరి 1933 జనవరి మధ్యకాలంలో నాజీపార్టీ సభ్యత్వం రెండింతలైంది. 1933 జనవరి నాటికి నాజీపార్టీ సభ్యుల సంఖ్య 9,00,000 అయిందని అంచనా, రీష్టాగ్‌లో 143 స్థానాలలో అత్యంత సంఖ్యాబలం గల సోషల్ డెమోక్రాట్‌లు నాజీలను అడ్డుకోలేకపోయారు. 1923 నాటి కరెన్సీ పతనం తిరిగి ఏర్పడుతుందేమోనన్న భయం జర్మన్‌లను వేధించింది. దీనికి తోడు తీవ్రజాతీయ వాదం జర్మనీలో విజృంభించింది.

1932 జూన్‌లో మితవాది ఫ్రాంజ్‌వాన్ పాపన్ (Fran von Papen) ఛాన్సలర్ అయ్యాడు. ఇతనికి నాజీల సహకారం లభించింది. జులైలో జరిగిన ఎన్నికలలో నాజీలు 230 స్థానాలు సంపాదించుకొన్నారు. కానీ నవంబర్‌లో తిరిగి ఎన్నికలు జరగ్గా నాజీలు 34 స్థానాలు పోగొట్టుకొన్నారు. డిసెంబర్‌లో వాన్‌సిషీర్ (Von Sehlercher) ఛాన్సలర్ అయ్యాడు. కానీ కుతంత్రాలను గ్రహించకపోయి పాపన్ హిట్లర్‌కు ఛాన్సలర్ పదవి కట్టబెట్టమని అధ్యక్షుడు హిన్డెన్‌బర్గ్‌కు సలహాయిచ్చాడు. జనవరి 30 న హిట్లర్ ఛాన్సలర్ అయ్యాడు. దీనితో ప్రజాస్వామ్యానికి రిపబ్లిక్‌కు జర్మనీలో గొయ్యి తవ్వినట్లైంది.

1933 మార్చి 5 న సార్వత్రిక ఎన్నికలు జరపడానికి నిర్ణయం జరిగింది. ఫిబ్రవరి 7 న రీష్టాగ్ భవనానికి ఎవరో నిప్పుపెట్టారు. నాజీ మంత్రి హెర్మన్ గోరింగ్ దీనికి బాధ్యత కమ్యూనిష్టులదని ప్రకటించాడు. కమ్యూనిష్ట్ నాయకులు అరెస్ట్ అయ్యారు ఇది కేవలం నాజీలకుట్ర తరువాత దొరికిన సమాచారం ప్రకారం నాజీలే రీష్టాగ్‌కు నిప్పంటించి ఆ తప్పు కమ్యూనిష్టులపైన తోసారని తేలిపోయింది. నాజీలు తీవ్రమైన కమ్యూనిష్ట్ వ్యతిరేకతను రెచ్చగొట్టారు. ఇట్లాంటి ఉద్రిక్త వాతావరణంలో జరిగిన ఎన్నికల్లో నాజీలకు 44% ఓట్లు మాత్రమే పడ్డాయి. కానీ నాజీలకు ఆ శాతం చాలు. నాలుగేండ్లకు హిట్లర్‌కు నియంతృత్వ అధికారాలిస్తూ - "ఎనేబ్లింగ్ చట్టం" Enabling act రీష్టాగ్ చేసింది. కొద్దికొద్దిగా ప్రజాస్వామ్యం జర్మనీలో అంతరించి పోవడం మొదలుపెట్టింది. ప్రతిపక్షాలను నిషేధించడమైంది. ప్రతి ప్రభుత్వ శాఖలోనూ నాజీల అధికారం ఎదురులేనిదైంది. 1933 అక్టోబర్‌లో నానాజాతి సమితి నుంచి జర్మనీ వైదొలిగింది. తన చర్యల మీద హిట్లర్ ప్రజాభిప్రాయ సేకరణ తీసికొన్నాడు. 96.3% ఓటర్లు హిట్లర్ చర్యలను ఆమోదించారు. 1934 ఆగస్టులో అధ్యక్షుడు హిండెన్‌బర్గ్ మరణించాడు. "ఫ్యూహ్రార్ రీష్-ఛాన్సలర్‌గా హిట్లరే అధికారాలు చేజిక్కించుకొన్నాడు. ఈ చర్యను కూడా ప్రజాభిప్రాయ సేకరణలో 90% ఓటర్లు బలపరచారు. దీనితో జర్మనీలో ప్రజాస్వామ్యానికి సమాధికట్టడం జరిగింది.

**5.2.11 ఆస్ట్రియా :** ఆర్థిక మాంద్యానికి గురైన మరో మధ్యయూరోప్ దేశం ఆస్ట్రియా. జర్మనీలో జరిగినటువంటి సంఘటనలే ఆస్ట్రియాలో కూడా జరిగాయి. 1929 లో సీపెల్ Seipel రాజీనామా చేసిన తరువాత ఛాన్సలర్ పదవి చాలా చేతులు మారింది. 1931 లో

'క్రెడిటన్ స్టాల్ట్' పతనం తరువాత ఆస్ట్రియాలో ఆర్థిక సంక్షోభం తీవ్రమైంది. 1930 లో ఆస్ట్రియన్ నాజీల సంఖ్య 1,00,000. వీరు జర్మన్ నాజీలతో దగ్గర సంబంధాలు పెట్టుకొన్నారు. వర్సై సంధి షరతులకు వ్యతిరేకంగా ఒకానొక రోజు ఆస్ట్రియాను జర్మనీతో కలిపి వేయడానికి ఆస్ట్రియానే నాజీలు తనతో సహకరిస్తారని హిట్లర్ గ్రహించాడు. 1932 మార్చిలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో చట్టవ్యతిరేక పద్ధతులన్నింటినీ అవలంభించి నాజీల విజయం సాధించారు. ఇట్లాంటి పరిస్థితులలో ఎంజిల్‌బర్ట్ డాల్ఫస్ (Engelbert Dolfuss) మంత్రివర్గాన్ని ఏర్పరచాడు. జర్మనీలో పాపన్ నిర్వహించిన పాత్రనే ఆస్ట్రియాలో డాల్ఫస్ నిర్వహించాడు. 1933 లో జర్మనీలో అధికారానికి వచ్చిన నాజీలు ఆస్ట్రియాలో తమ సోదర నాజీలకు తీవ్రమైన అన్యాయం జరుగుతున్నదని గగ్గోలుపెట్టారు. డాల్ఫస్ అత్యవసర అధికారాలు తీసుకొని మితవాద, మతవాద నియంతృత్వాన్ని సృష్టించాడు. ప్రజాస్వామ్య రిపబ్లిక్ స్థానంలో "జర్మన్ క్రిష్టియన్ ఆస్ట్రియా"ను ఏర్పరచడం తన ధ్యేయమని డాల్ఫస్ ప్రకటించాడు. 1934 ఏప్రియల్ లో క్రొత్త రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. జులైలో నాజీలు డాల్ఫస్‌ను హత్యచేసి పోయి రేడియో కేంద్రాన్ని ఆక్రమించి సైనిక తిరుగుబాటు లేవదీయచూచారు. కానీ నాజీల ప్రయత్నాలు ఫలించలేదు. వియన్నాలో సైనిక శాసనం అమలు చేయడమైంది. డాల్ఫస్ మిత్రుడు కుర్తువాన్‌షుష్నిగ్ (Kurtvon Schusehning) ఛాన్సలర్ అయ్యాడు. అధికారం హస్తగతం చేసుకోవడానికి నాజీలు మరోప్రయత్నం చేసారు ఆస్ట్రియా స్వాతంత్ర్యం తన ధ్యేయమని ఇటలీ నియంత ముస్సోలినీ ప్రకటించి బ్రన్నెర్ కనుమ వద్ద జర్మన్లను అడ్డుకోవడానికి ఇటాలియన్ సైన్యాన్ని తరలించారు. ప్రస్తుతానికి అన్షలస్ వీలుపడలేదు. కానీ ఆస్ట్రియాలో ప్రజాస్వామ్యం అంతరించింది. నాలుగేళ్ళ తరువాత మరోనాజీ తిరుగుబాటు ఫలించనున్నది.

**5.2.12 చెకోస్లోవాకియా :** ఆస్ట్రియా మాదిరే చెకోస్లోవాకియా కూడా ఆర్థిక మాంధ్యపు దుష్ఫలితాలను అనుభవించింది. చెకోస్లోవాకియాలోని పారిశ్రామిక కేంద్రాలు చాలా వరకూ మూతబడ్డాయి. ముఖ్యంగా 3 1/2 మిలియన్ జర్మన్‌లు ఉన్న సుడెటన్‌లాండ్‌లో పరిస్థితి మరీ క్షీణించింది. 1929 తరువాత చెకోస్లోవాకియాలో డిక్రీలద్వారా పాలనసాగించిన వాన్, పాపన్, డాల్ఫన్ లాంటివారు చెకోస్లోవాకియాలో తలెత్తలేదు. కానీ చెకోస్లోవాకియాలో కూడా జర్మన్ నాజీ పార్టీని పూర్తిగా సమర్థించే చెక్‌నాజీపార్టీ కాన్రాడ్ హెన్లీన్ (Konrad Henlein) నాయకత్వంలో ఏర్పడింది. త్వరలోనే ప్రభుత్వం దాన్ని అణిచివేసింది. కానీ హెన్లీన్ రంగు మార్చి పరిపాలనలో వికేంద్రీకరణ అల్పసంఖ్యాకులకు స్వేచ్ఛ కల్పించడం తన ధ్యేయాలని ప్రకటించి నాజీపార్టీని పునర్వ్యవస్థీకరించదలచాడు. సిద్ధాంతపరంగా హెన్లీన్‌పార్టీ నాజీ పార్టీ మాత్రమే. ఫ్రాన్స్‌కు వ్యతిరేకంగా అతడు చెక్ ప్రజాభిప్రాయాన్ని తీవ్రంగా రెచ్చగొట్టాడు. ఆర్థిక మాంధ్యం అతడి ప్రచారానికి బలం చేకూర్చింది. 1930 లో జరిగిన ఎన్నికల్లో మరే ఇతర పార్టీకి పడనన్ని ఓట్లు అతని పార్టీకి పడ్డాయి. దీనితో హెన్లీన్ వ్యతిరేక పక్షాలన్నీ ఏకమయ్యాయి. ఈ కారణం వల్ల చెకోసొవాక్ ప్రజాస్వామ్యం, స్వాతంత్ర్యం పతనం కావడానికి మరికొంతకాలం పట్టింది.

**5.2.13 సోవియట్ రష్యా :** సోవియట్ రష్యా ప్రభుత్వానికి ఆర్థిక నియంత్రణ ఉన్నందువల్ల మిగతా యూరోపియన్ రాజ్యాలు అనుభవించినటువంటి ఆర్థిక మాంద్యాన్ని సోవియట్‌లు అనుభవించలేదు. 1928 లో మొదటి పంచవర్ష ప్రణాళిక అమలులోకి వచ్చింది. దాన్ని నాలుగేండ్లలలో పూర్తి చేసారు. పారిశ్రామిక ఉత్పత్తులు రెండింతలకు పెరిగాయి. సమిష్టి వ్యవసాయ విధానంవల్ల వ్యవసాయం మొదట కుంటుపడినా, 1932 నుంచి బలం పుంజుకుంది. దేశం మొత్తంలో 2,400 మెషిన్ ట్రాక్టర్ స్టేషన్‌లను తెరవడమైంది. ఇది రైతులకు వ్యవసాయక యంత్రాలను సరఫరా చేయడమేగాకుండా, రైతుల శిక్షణా శిబిరాలుగా కూడా పనిచేసాయి. ముడిపదార్థాలను, ఆహార ధాన్యాలను తక్కువధరలకు ఎగుమతి చేసి అధిక ధరలకు యంత్ర సామాగ్రిని యూరప్‌నుంచి సోవియట్ రష్యా కొనుగోలు చేసుకోవలసి వచ్చింది. అయినా, ప్రణాళికాబద్ధమైన ఆర్థిక విధానంలో సోవియట్‌లు ఆర్థిక మాంద్యాన్ని ఎక్కువగా అనుభవించలేదు. సోవియట్‌లు అమలు జరుపుకొంటున్న ప్రణాళికా బద్ధమైన ఆర్థిక విధానం స్వేచ్ఛా ఉద్యమానికన్నా పోటీ పెట్టుబడిదారీ విధానం కన్నా మేలనే భావం మధ్య పశ్చిమ యూరప్‌లలో వ్యాపించింది. సోషలిస్ట్ భావాలు సామాన్య ప్రజానీకంలోనే గాకుండా బుద్ధిజీవుల్లో కూడా వ్యాపించాయి.

ఈ విధంగా 1924-1934 ఆర్థిక మాంద్యం యూరోపియన్ ఆర్థిక, రాజకీయ చరిత్రలో మహత్తర సంఘటన. దీన్ని పరిష్కరించటంలో జర్మనీ, ఇటలీ, స్పెయిన్, పోలెండ్, బల్గేరియా, గ్రీస్ నియంతృత్వాలు కరాళనృత్యం చేశాయి. ఈ ఆర్థిక మాంద్యం సృష్టించిన సంక్షోభం రెండో ప్రపంచ యుద్ధ ప్రధాన కారణాలలో ఒకటంటే అతిశయోక్తి కానేకాదు.

**Dr. V. K. Mohan**

పాఠం - 6

# జర్మనీ - నాజీ నియంతృత్వము

**లక్ష్యం :**

జర్మనీలో హిట్లర్ నాయకత్వంలో నేషనల్ సోషలిస్ట్ల విజృంభణ, వారి సిద్ధాంతాలు, కార్యక్రమాలు, చెకొస్లొవాకియా, పోలండ్ల మీద దురాక్రమణ మొదలగు అంశాలు గురించి వివరించడమే ఈ పాఠం ప్రధాన లక్ష్యం :

**విషయ క్రమం :**


6.1. జర్మనీలో నాజీయిజమ్ (హిట్లర్) విజృంభణ
6.1.1. పరిచయం
6.1.2. హిట్లర్ తొలి జీవితం
6.1.3. నేషనల్ సోషలిస్ట్ (నాజీ) పార్టీ ఆవిర్భావం
6.1.4. నాజీ పార్టీ ప్రచారం
6.1.5. మూనిక్లో బలప్రయోగం
6.1.6. మీన్ కాంఫ్
6.1.7. నాజీల విజృంభణ
6.1.8. నాజీల ప్రభుత్వము
6.1.9. నాజీల విజయానికి తోడ్పడిన అంశాలు
6.1.9.1. వర్సై సంధి
6.1.9.2. కమ్యూనిజం వ్యాప్తి చెందడం
6.1.9.3. ఆర్థిక సంక్షోభము
6.1.9.4. యూదు వ్యతిరేక ప్రచారం
6.1.9.5. ఇతర కారణాలు
6.2. నాజీ పార్టీ సిద్ధాంతాలు, కార్యక్రమాలు
6.2.1. పరిచయం
6.2.2. నాజీ పార్టీ సిద్ధాంతాలు
6.2.3. నాజీ పార్టీ కార్యక్రమం
6.3. హిట్లర్ (నాజీ జర్మనీ) విదేశాంగ విధానం
6.3.1. పరిచయం
6.3.2. సమితి నుంచి జర్మనీ ఉపసంహరించుకోవడం
6.3.3. జర్మనీ సార్‌ను ఆక్రమించడం
6.3.4. సైనిక నిబంధనల ఉల్లంఘన
6.5. బ్రిటన్ - జర్మనుల మధ్య నౌకాసంధి
6.6. రైన్‌లాండ్ ఆక్రమణ
6.7. అక్షరాజ్య కూటమి
6.8. జర్మనీ ఆస్ట్రియాల కలయిక (అన్షలస్)

6.9. చెకొస్లొవాకియా ఆక్రమణ
6.9.1 చెకొస్లొవాకియాను ఆక్రమించుకోవడానికి కారణాలు
6.9.2 చెకొస్లొవాకియా ఆక్రమణకు ప్రయత్నాలు
6.9.3 బ్రిటన్ ఫ్రాన్స్‌ల జోక్యం
6.9.4 మ్యూనిక్ ఒప్పందం
6.9.5 మ్యూనిక్ ఒప్పంద ఫలితాలు
6.9.6. చెకొస్లొవాకియా మీదదాడి
6.9.7. చెకొస్లొవాకియా మీద దాడి ఫలితాలు
6.10 పోలండ్ మీద జర్మనీ దాడి
6.10.1. పోలండ్ మీద హిట్లర్ దాడికి కారణాలు
6.10.2. జర్మనీ పోలండ్‌ల మధ్య దురాక్రమణ వ్యతిరేక ఒప్పందం
6.10.3. పోలండ్ మీద జర్మనీ దురాక్రమ చర్యలు
6.10.4. రష్యా, జర్మనీల మధ్య దురాక్రమణ వ్యతిరేక ఒప్పందం
6.10.5. వ్యతిరేక ఒప్పందం ప్రాముఖ్యం
6.10.6. రష్యా జర్మనీల మధ్య ఒడంబడికకు బ్రిటన్ ఫ్రాన్స్ బాధ్యత
6.10.7. పోలండ్‌పై జర్మనీ దాడిని ఎదుర్కొవడానికి బ్రిటన్ ప్రయత్నాలు
6.10.8. పోలండ్ మీద జర్మని దాడి

## 6.1. జర్మనీలో నాజీయిజమ్ (హిట్లర్) విజృంభణ :

### 6.1.1. పరిచయం :

భౌగోళికంగా యూరప్ ఖండంలో కీలక స్థానంలో ఉన్న జర్మనీ ఆధునిక ప్రపంచ చరిత్రలో అనేక సమస్యలను సృష్టించింది. జర్మనీ తన తీవ్ర సైనికవాదం వల్ల **25** సంవత్సరాల కాలంలో రెండు ప్రపంచయుద్ధాలను (1914 - 1918, 1939 - 1945) తెచ్చిపెట్టింది. యూరప్‌లోని తూర్పు పశ్చిమ ప్రాంతాల మధ్య సులువైన రాకపోకల మార్గాలన్నీ జర్మనీ గుండా మాత్రమే ఉన్నాయి. తూర్పు, పశ్చిమ యూరప్‌లకు మధ్య ఉన్నందువల్ల జర్మనీ యూరప్‌లోని వర్తక వాణిజ్యలకు కేంద్రస్థానమైంది. అంతేగాక భౌగోళికంగా కీలక స్థానంలో ఉన్న జర్మనీ యూరాప్ దౌత్యరంగంలో కూడా అతి ప్రధానమైన పాత్ర వహించడానికి వీలైంది. 1870 - 71 లలో ఏకీకరణ చెందిన జర్మనీ 1914 నాటికి అపరిమితమైన సహజ వనరులు, పెరుగుతున్న జనాభా, పారిశ్రామిక సైనిక రంగాలలో సాధించిన అభివృద్ధి మొదలైన కారణాల వల్ల పారిశ్రామిక, వాణిజ్య సైనిక రంగాలలో అసాధారణమైన విజయాలను సాధించింది. తన సైనిక బలాన్ని విపరీతంగా పెంచుకొంటున్నా జర్మనీకి బ్రిటన్ ఫ్రాన్స్‌లతో తీవ్ర విరోధమేర్పడింది. తన సరిహద్దుల రక్షణ సాకుతో జర్మనీ చేస్తున్న సైనిక సన్నాహాల వల్ల ఇరుగుపొరుగు దేశాలు ఆందోళన చెందినాయి. సైనిక బలమున్న జర్మనీ రాజ్యవిస్తరణ కార్యక్రమాన్ని చేపట్టినందువల్ల యూరప్‌లో అనేక సమస్యలు తలెత్తినాయి. ముఖ్యంగా జర్మనీ రాజ్యకాంక్ష మొదటి ప్రపంచయుద్ధానికి దారితీసింది.

మొదటి ప్రపంచ యుద్ధంలో (1914 - 18) జర్మనీ వీరోచితంగా పోరాడినప్పటికీ పరాజయం చెంది విపరీతమయిన నష్టానికి గురి అయింది. ఆర్థికంగా, సైనికంగా జర్మనీ పూర్తిగా దెబ్బతిన్నది. యుద్ధ విరమణ సంధిమీద సంతకం చేసిన జర్మనీ అనేక క్లిష్టమైన సమస్యలను ఎదుర్కోవలసి వచ్చింది. యుద్ధం తొలిదశలో అనేక సైనిక విజయాలను సాధించిన జర్మనీ చివరికి పూర్తిగా ఓడిపోయి మిత్ర రాజ్యాలకు లొంగిపోవలసి వచ్చింది. అంతేగాక జర్మనీ ఆంతరంగిక సంక్షోభాన్ని కూడా ఎదుర్కోవలసి వచ్చింది. అయినప్పటికీ యుద్ధానంతరం ఒక క్రమశిక్షణ ఉన్న జాతిగా అనేక క్లిష్ట సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవడమేగాక ఆంతరంగిక అరాజక పరిస్థితులను అధిగమించి సుస్థిర రాజకీయ వ్యవస్థను కూడా జర్మనీ ఏర్పాటు చేసుకోగలిగింది.

మొదటి ప్రపంచ యుద్ధానంతరం జర్మనీలో రిప్లబిక్ స్థాపితమైంది. 1919 జనవరిలో జరిగిన ఎన్నికల్లో అటు అతివాదానికి, ఇటు మితవాదానికి చెందిన రాజకీయ పక్షాల వారు గెలిచారు. వారిలో ఎక్కువ మంది సోషలిస్టులు. నేషనల్ అసెంబ్లీ వైమాల్‌లో సమావేశమై వర్సే సంధిని ఆమోదించింది. 1919 ఆగస్ట్‌లో కొత్త రాజ్యాంగాన్ని కూడా అసెంబ్లీ ఆమోదించింది. ఈ విధంగా వైమార్ రిపబ్లిక్ అవతరించింది. ఈ రిపబ్లిక్ 1919 నుండి 1933 వరకు 14 సంవత్సరాలు సాగింది. రెండో విలియం, అడాల్ఫ్ హిట్లర్‌ల మధ్య కాలంలో వైమాల్ రిపబ్లిక్ వంతెన లాగా వ్యవహరించిందని కొందరు చరిత్ర కారులంటారు. యుద్ధానంతరం ఏర్పడ్డ ఇబ్బందుల వల్ల, చెల్లించాల్సి వచ్చిన ఋణాలు, నష్టపరిహారం వల్లా, ద్రవ్యోల్బణం వల్ల, వైమార్ పబ్లిక్ క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంది. సామాన్య జర్మన్ పౌరుల విశ్వాసాన్ని ఈ రిపబ్లిక్ సంపాందించలేక పోయింది. ప్రజాస్వామ్య రాజ్యాంగం ఏర్పడ్డా జంకర్‌ల గుత్తా భూములపై యథాతథంగా ఉన్నది. సోషలిస్ట్ ప్రభుత్వం ఏర్పడింది కాని పెట్టుబడి దారీ విధానమే కొనసాగింది. 1929 లో ప్రబలిన ఆర్థిక సంక్షోభం జర్మనీని కూడా ఇబ్బందులకు గురిచేసింది. ఈ కారణాల వల్ల ప్రజాస్వామ్య విధానాలలో ప్రజలకు నమ్మకం సన్నగిల్లింది. ఈ కాలంలోనే కమ్యూనిస్ట్ ప్రచారం జర్మనీలో ప్రవేశించింది. కమ్యూనిస్ట్ తిరుగుబాట్లు జరుగుతాయేమోననే భయం వల్ల దేశంలో జాతీయ వాదులు, పెట్టుబడి దారులు ఆందోళన చెందసాగినారు. వారందరూ యుద్ధంలో జర్మనీ ఓటమికి సామ్యవాదులు, కాథలిక్‌లు, యూదులు కారకాలని చెప్పసాగినారు. అంతేగాక కమ్యూనిస్టులు సమ్మెలు జరపనారంభించారు. కమ్యూనిస్టు ప్రభావం అట్లా ఉండగా జర్మనీలో జాతీయతా ప్రభావమెక్కువై అప్పటి పరిస్థితుల కనుగుణంగా జర్మనీకి సామ్యవాద విధాన ఆర్థిక వ్యవస్థ, జాతీయత ననుసరించిన రాజకీయ వ్యవస్థ అవసరమనే ధోరణులు వినవచ్చినాయి. ఈ రెండు ధోరణులనూ కలిపి జాతీయ సామ్యావాద వ్యవస్థను స్థాపించే నాయకుడు బయలుదేరిపాడు. అతడే హిట్లర్, జాతీయ సామ్యవాద (నాజీ) పక్షానికి నాయకుడై జర్మనీ నియంత అయినాడు.

## 6.1.2. హిట్లర్ తొలి జీవితము :

హెర్ హిట్లర్ ఆస్ట్రియాలో 1889 లో ఒక మధ్య తరగతి కుటుంబంలో జన్మించాడు. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయినాడు. విద్యార్థిదశలో అతనికి చదువులో కంటే చిత్రలేఖనంలో ఎక్కువ అభిలాష ఉండేది. వియన్నాలోను, మ్యూనిక్‌లోను చిత్రలేఖకుడుగా అనేక చిత్రాలను నిరవధికంగా చిత్రించేవాడు. ఆస్ట్రియన్ చిత్రలేఖనా సంస్థలో ప్రవేశించడానికి ప్రయత్నించి విఫలుడైనాడు. ఆ తరువాత కొన్నాళ్ళు గాయకుడుగా, కళాకారుడుగా జీవనం గడిపినాడు. ఇతనికి యూదులన్నా కమ్యూనిస్ట్‌లన్నా, ఉదారవాదులన్నా, సాత్వికవాదులన్నా పరమద్వేషము. వాగ్నర్ అనే సంగీత విద్వాంసుని కృతులంటే ఇష్టపడేవాడు. నీషే అనే తత్వశాస్త్రజ్ఞుని సిద్ధాంతాలను నమ్మేవాడు. యూదు జాతికి విరుద్ధంగా ఉండే రచనలను పఠించేవాడు కొంత కాలానికి జాతీయాభిమానిగా మారాడు. శాంతియుతమైన జీవితం కంటే సాహసోపేతమైన సైనిక జీవితం పట్ల హిట్లర్‌కు మొదట నుంచీ మక్కువ ఎక్కువ. ఆస్ట్రియా దేశస్థుడైనప్పటికీ జర్మన్ సైన్యంలో చేరి మొదటి ప్రపంచ యుద్ధంలో పోరాడినాడు. సైనికుడుగా ఐరన్ క్రాస్ మొదలైన బహుమానాలు పొందినాడు.

## 6.1.3. నేషనల్ సోషలిస్టు (నాజీ) పార్టీ ఆవిర్భావం :

1919 జనవరిలో స్థాపించబడ్డ 'జర్మన్ వర్కర్స్ పార్టీ' నుంచి 'నేషనల్ సోషలిష్ట్ పార్టీ' ఉద్భవించింది. కార్మికులకు మొదట అనుకూలంగా ఉన్నా కాలక్రమంగా నేషనల్ సోషలిష్ట్ పార్టీ మాజీ సైనికాధికారుల చేతుల్లో పడింది. 1919 జూలైలో, సైన్యంలో కార్పోరల్‌గా పనిచేసిన హిట్లర్ నేషనల్ సోషలిష్ట్ పార్టీలో చేరినాడు. 1920 లోనే డ్రెక్స్లర్ అనే నాయకుని పార్టీ నాయకత్వం నుంచి తొలగించి హిట్లర్ నాజీపార్టీని పూర్తిగా తన నాయకత్వం కిందికి తెచ్చుకొన్నాడు. హెస్, గోరింగ్, ఫీడర్, రోజెన్‌బర్గ్ మొదలగు నాయకుల సహాయంతో హిట్లర్ నాజీ పార్టీని పటిష్ఠం చేసినాడు.

## 6.1.4. నాజీ పార్టీ ప్రచారం :

పార్టీ ప్రచారంలో హిట్లర్ అందెవేసిన చెయ్యి. ఆవేశ పూరితమైన గంభీరోపన్యాసాలతో హిట్లర్ తాను చేప్పే విషయాలను ప్రజలు దృఢంగా నమ్మి ఉద్రేకపూరితులయ్యేటట్లు చేసేవాడు. జర్మనీకి ఇతర దేశాలు చేసిన అన్యాయాలను, దుస్థితిని ప్రజలు మరిచిపోకుండా చేసి మళ్ళీ జర్మనీ తలెత్తుకొని మంచి స్థితిలోకి రావలెనంటే తన కార్యక్రమాన్ని అమలు చేయడమే కర్తవ్యమని ప్రచారం చేసినాడు. నాజీపార్టీ
7)

ప్రతివారికి మంచి జీవనం కల్పిస్తుందనీ, రైతులకు, దుకాణదార్లకు, మధ్యతరగతి ప్రజలకు, సామాన్య జనానికి, అందరికీ లాభకరంగా ఉంటుందని చెప్పేవాడు. రుణాలు విముక్తమవుతాయి. బాంకులు ప్రభుత్వనియంత్రణలోకి వస్తాయి. పరిశ్రమలలో కార్మికులకు బోనస్ ఉంటుంది, వడ్డీ వ్యాపారస్తుల బెడద తప్పుతుంది. పెద్ద వ్యాపార సంస్థలు జాతీయమవుతాయి. ఫ్యాక్టరీ యజమానులకు, భూస్వాములకు వారివారి స్వంత ఆస్తిహక్కు ఉంటుంది. జర్మన్‌లంతా తమ ఆర్థిక సాంఘీక, రాజకీయ విభేదాలు మరిచిపోయి ఒకే జర్మన్ జాతికి చెందిన వారమనే భావం పెంపొందవలె. యూదుల కంటే, తదితర జాతుల కంటే జర్మన్ జాతి ఉత్కృష్టమయిందని ఉద్ఘాటించేవాడు. పార్టీ వ్యవస్థను పటిష్ఠం చేయడమేగాక ప్రజలలో హిట్లర్ తన పలుకుబడిని పెంచుకొన్నాడు.

### 6.1.5. మూనిక్‌లో బలప్రయోగం :

వాక్చాతుర్యం ద్వారా హిట్లర్ చాలామందిని పార్టీ వైపు ఆకర్షించాడు. హెర్మన్ గోరింగ్ నియంత్రణలో ఉన్న 'ఫ్రీకోర్' నాజీ పార్టీలో విలీనమైంది. 'ఫ్రీకోర్' కార్యకర్తలు తరవాత కాలంలో 'స్టామ్‌ట్రూపర్స్' గా నాజీ పార్టీ వ్యతిరేకుల్లో భయభ్రాంతులు కలుగజేసారు. వీరి సహాయంతో హిట్లర్, అతని అనుయాయులు 1923 లో మూనిక్‌లో బలప్రయోగం ద్వారా అధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి ప్రయత్నించి విఫలురయ్యారు. ప్రభుత్వం హిట్లర్‌కు దేశద్రోహనేరానికి 5 సంవత్సరాలు జైలు శిక్ష విధించి తరువాత శిక్షను ఒక సంవత్సరానికి తగ్గించి లాండ్స్ బర్గ్ జైలులో నిర్బంధించింది.

### 6.1.6. మీన్ కాంఫ్ (Mein Kampt) :

కారాగారంలో ఉన్న కాలంలో హిట్లర్ తన జీవిత చరిత్రను 'మీన్‌కాంఫ్' అను గ్రంథం వ్రాసినాడు. ఈ గ్రంథంలోనే హిట్లర్ నాజీపార్టీ ప్రణాళికను, సిద్ధాంతాలను వివరించాడు. వైమార్ రిపబ్లిక్‌ను పడగొట్టడం, వర్సే సంధిని ఉల్లంఘించడం, వలసలను తిరిగిపొందడం, యూదులను దేశం నుండి వెళ్ళగొట్టడం, కమ్యూనిజమ్‌ను అరికట్టడం మొదలైనవి నాజీపార్టీ కార్యక్రమంలోని ముఖ్య భాగాలుగా హిట్లర్ ఈ గ్రంథంలో పేర్కొన్నాడు. 'మీన్ కాంఫ్' నాజీలకు బైబిల్ వంటిది.

### 6.1.7. నాజీల విజయము :

హిట్లర్ కారాగారంలో ఉన్న కాలంలో నాజీపార్టీ సరిఅయిన నాయకత్వం లేనందువల్ల బలహీనపడింది. 1924 లో జరిగిన ఎన్నికల్లో నాజీపార్టీని సమర్థించేవారి సంఖ్య మరింత తగ్గింది. 1924 చివర్లో జైల్ నుంచి విడుదలైన తరువాత హిట్లర్ తాననుకొన్నది సాధించడానికి సమాయత్తమైనాడు. 1925 లో హిట్లర్ నాజీ పార్టీని పునర్వ్యవస్థీకరించి ప్రజలలో పలుకుబడిని సంపాదించగలిగాడు. పూర్వం చేసిన పొరబాట్లను పునరావృతం చేయకుండా, చట్టానికి బద్ధుడుగా ఉంటూ, వర్సే సంధి కన్నా కమ్యూనిజం ప్రమాదకరమని హిట్లర్ ప్రకటించినాడు. ఇందువల్ల పెద్ద పారిశ్రామిక వేత్తల పలుకుబడిని ఇతడు పొందగలిగినాడు, ఎన్నికల ద్వారా 'రీస్టాగ్' (శాసనసభ) పై నియంత్రణ సంపాదించడానికి ప్రయత్నించాడు. కమ్యూనిజం నుంచి రక్షణ కలిగించేది నాజీయిజమ్ మాత్రమేనని ఇతడు పెట్టుబడుదారులను నమ్మించాడు. అందువల్ల వారు నాజీలకు ధన సహాయం చేయసాగినారు. 'స్టామ్ ట్రూ పర్' (బ్రౌన్ షర్ట్) లు కమ్యూనిస్ట్ సభలలో గందర గోళం సృష్టించి వాటిని చెదరగొట్టడం, కమ్యూనిస్టులపై, వారి సానుభూతిపరులపై అకృత్యాలు జరపడం లాంటి కార్యక్రమాలలో పాల్గొన్నారు. వైమార్ ప్రభుత్వం వీరిని అడ్డుకోలేక పోయింది.

1928 లో జరిగిన ఎన్నికలలో నాజీనాయకులైన గోరింగ్, గోబెల్స్‌లు నాజీపార్టీ సభ్యులుగా ఎన్నికై శాసనసభలో ప్రవేశించారు. 1928 ఎన్నికల్లో నాజీలకు 8 లక్షల ఓట్లువచ్చాయి. 1929 నుంచి నాజీ పార్టీ పలుకుబడి బాగా పెరిగింది. 1930 లో జరిగిన ఎన్నికల్లో నాజీలు 65 లక్షల ఓట్లు సంపాదించుకొన్నారు. 1932 లో జరిగిన ఎన్నికల్లో శాసన సభలోని 608 స్థానాలలోను 230 స్థానాలను ఒకకోటి నలభైలక్షల ఓట్లతో నాజీ పార్టీ గెలుచుకోగలిగింది. అధ్యక్షుడు వాన్ హిండెన్ బర్గ్ ప్రత్యామ్నాయం లేక 1933 జనవరి 30న హిట్లర్‌ను ఛాన్సలర్‌గా నియమించి, మంత్రి వర్గం ఏర్పాటు చేయమని కోరాడు. ఈ నియామకం ప్రపంచ చరిత్ర గతినే మార్చి వేసింది.

**6.1.8. నాజీల ప్రభుత్వం :**

శాసనసభ నాజీ పార్టీకి పూర్తిమెజారిటీ లేనందువల్ల హిట్లర్ నాయకత్వంలో మిశ్రమ ప్రభుత్వం ఏర్పడింది. కాని హిట్లర్ అధికారాన్ని పూర్తిగా తనవశం చేసుకోవలెననే కృత నిశ్చయంతో ఉన్నాడు. అందువల్ల 1933 మార్చిలో నాజీల ఒత్తిడి మూలంగా ప్రత్యేక ఎన్నికలు జరిగాయి. ఎన్నికలకు ముందుగా కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు శాసనసభ భవనాన్ని తగల బెట్టినారు. దీనికి బాధ్యులు జర్మన్ కమ్యూనిస్ట్‌లని నాజీ పార్టీ ప్రజలలో ప్రచారం చేసింది. నిజానికి ముందుగా వేసుకొన్నా పథకం ప్రకారం శాసనసభా భవనానికి నిప్పంటించినది నాజీ లేనని చాలా మంది జర్మన్‌లు అభిప్రాయపడినారు, ఈ పరిస్థితులలో వ్యక్తి స్వేచ్ఛ వాక్స్వాతంత్ర్యం, పత్రికాస్వాతంత్ర్యం మొదలైన ప్రాథమిక హక్కులను అధ్యక్షుని ప్రకటన ద్వారా రద్దుచేయడం జరిగింది. కమ్యూనిష్ట్ పార్టీని నిషేధించినారు. 1933 మార్చిలో దేశంలోని రాజకీయ అనిశ్చిత పరిస్థితిని అవకాశంగా తీసుకొని హిట్లర్ మిశ్రమ ప్రభుత్వాన్ని రద్దుచేసి, నాజీపార్టీ నియంతృత్వాన్ని స్థాపించినాడు. దేశంలో నాజీపార్టీని వ్యతిరేకించే పార్టీలన్నీ అణచివేసినాడు. నాజీపార్టీ అభ్యర్థులు మాత్రమే ఎన్నికల్లో పాల్గొనడానికి అర్హులని ప్రకటించాడు. కొత్తగా జరిగిన ఎన్నికల ఫలితంగా ఇటలీలోని ఫాసిస్ట్ నియంతృత్వం వలె, జర్మనీలో నాజీపార్టీ నియంతృత్వం ఏర్పడింది. సైన్యం నాజీల నియంత్రణ కిందకు వచ్చింది. హిట్లర్ అధికారానికి రావడానికి 'స్టామ్‌ట్రూపర్‌లు' ఎంతగానో వెనుక ఉండి ఉపయోగపడ్డారు. వారు ఇప్పుడు తన అధికారానికి అడ్డం తగులు తారేమోనాన్న భయంతో వందలాది 'స్టామ్ ట్రూపర్' లను హతమార్చాడు. 1934 ఆగస్ట్‌లో ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్నా హిండెన్‌బర్గ్ మరణించాడు. దీనితో అధ్యక్షపదవిని, ఛాన్సలర్ పదవిని కలిపివేసి అన్ని అధికారాలను హిట్లర్‌కు మంత్రిమండలి కట్టబెట్టింది. జర్మనీకి హిట్లర్ ఎదురులేని నియంత (ఫ్యూహ్రర్) అయ్యాడు.

**6.1.9. నాజీల విజయానికి తోడ్పడిన అంశాలు :**

**6.1.9.1. వర్సై సంధి :**

ఆధునికి యుగానికి చెందిన ఒక ముఖ్యమైన వివాదాస్పదమైన సంధి వర్సైసంధి. ఈ సంధి తమమీద జరిగిన ఒక పెద్ద కుట్ర అని, బలవంతంగా రుద్దిన శాంతి అని జర్మన్‌లు అభిప్రాయపడినారు. ఈ సంధి వల్ల నిజానికి జర్మనీ దయాదాక్షిణ్యాలు లేకుండా అవమానకరంగా శిక్షితురాలయింది. కఠిన షరతులతో కూడిన ఈ వర్సైసంధి పత్రాలపై వైమార్ రిపబ్లిక్ సంతకాలు చేయడం నాజీల విజయానికి తోడ్పడిందని చాలామంది విమర్శకాల అభిప్రాయం. జాతీయ భావమున్న జర్మన్‌లను ఈ సంధి గాయపరచడమేగాక మిత్రరాజ్యాల పట్ల జర్మన్‌లకు పగసాధింపు ధోరణి ఏర్పడటానికి గాయపరచటానికి కూడా కారణమైనాయి. ఈ పరిస్థితులలో జర్మన్‌లు కోల్పోయిన ప్రతిష్టను తిరిగిసంపాందించడానికి ప్రయత్నించి హిట్లర్ జర్మన్ ప్రజల అభిమానాన్ని చూరగొన్నాడు. వైమార్ రిపబ్లిక్‌ను రద్దుచేసి, దాని స్థానే పటిష్ఠమైన ప్రభుత్వాన్ని స్థాపించినపుడు మాత్రమే జర్మనీ అవమానం నుంచి విముక్తి పొందగలదని ప్రజలలో హిట్లర్ ప్రచారం చేసినాడు.

కాని వర్సైసంధి కారణంగా మాత్రమే హిట్లర్ విజయం సాధించాడని చెప్పడం సరికాదు. వర్సైసంధి (1919) జరిగిన 14 సంవత్సరాలు తరువాత మాత్రమే జర్మనీలో హిట్లర్ విజయాన్ని సాధించి అధికారంలోకి (1933) వచ్చాడు యుద్ధం పూర్తి అయిన వెంటనే నాజీ విప్లవం రాలేదు. అంతేగాక జర్మనీ కోల్పోయిన ప్రతిష్ఠను తిరిగి సంపాదించుకొన్న తరువాత దాదాపు పది సంవత్సరాలకు గాని వైమార్ రిపబ్లిక్ పతనమైపోయి (1933) నాజీ పార్టీ అధికారంలోకి రావడం జరగలేదు. 1932 నాటికి జర్మనీ భూభాగాల నుంచి విదేశీసైన్యాలను ఉపసంహరించడమేగాక నష్టపరిహార సమస్యను కూడా పరిష్కరించడం జరిగింది. నిజానికి నాజీ పార్టీ బలప్రయోగం చేసి వైమార్ రిపబ్లిక్‌ను అంతం చేసి అధికారాన్ని హస్తగతం చేసుకొన్నది. కాబట్టి నాజీపార్టీ విజయానికి వర్సైసంధి కొంతవరకు మాత్రమే కారణమని చెప్పవచ్చు. వర్సైసంధిని సాకుగా తీసుకొని నాజీలు తాము దేశభక్తులమనీ రిపబ్లికన్ ప్రభుత్వాలన్ని దేశానికి వ్యతిరేకమైనవిగాను చిత్రించారు.

**6.1.9.2. కమ్యూనిజం వ్యాప్తిచెందడం :**

జర్మనీలో నాజీల విజయానికి మరొక ముఖ్యకారణము దేశంలో కమ్యూనిజం వ్యాప్తిచెందడం. 1932 నాటికి జర్మన్ శాసన సభలో కమ్యూనిష్టుల సంఖ్య 100. అదే కాలంలో శాసనసభలో నాజీ సభ్యుల సంఖ్య కమ్యూనిష్టుల కంటే తక్కువ. ప్రభుత్వానికి ప్రధాన ప్రతిపక్షమైన కారణంగా చాలామంది జర్మన్‌లు కమ్యూనిష్టులను సమర్థించారు. కాని నిజానికి జర్మన్ ప్రజలకు కమ్యూనిష్టుల పట్ల ద్వేషమెక్కువ. జర్మన్

ప్రజల మనోభావాలను అర్ధం చేసుకొన్న నాజీలు తమ పార్టీ పతనం కమ్యూనిస్ట్ల వ్యాప్తికి తోడ్పడుతుందనే నినాదాన్ని ప్రచారం చేసినారు. కమ్యూనిస్ట్ సిద్ధాంతాల వ్యాప్తి వల్ల భీతి చెందిన పారిశ్రామిక వేత్తలు, ఇతర సంపన్న వర్గ ప్రజలు నాజీ పార్టీకి ఇతోధిక సహాయం చేసినారు. మొత్తం మీద జర్మన్ ప్రజలలో అదిక సంఖ్యాకులకు జర్మనీని కమ్యూనిస్ట్ల బారినుండి నాజీలు మాత్రమే కాపడగలరనే నమ్మకం కలిగింది.

### 6.1.9.3. ఆర్థిక సంక్షోభము :

మొదటి ప్రపంచ యుద్ధం తరువాత జర్మనీలో ఆర్థిక సంక్షోభమేర్పడింది. వ్యవసాయం బాగా దెబ్బతిన్నందు వల్ల వ్యవసాయదారుల పరిస్థితి శోచనీయంగా ఉంది. ప్రభుత్వ సహాయాన్ని అందజేసి రైతుల పరిస్థితిని మెరుగుపరుస్తామని వాగ్దానం చేసి నాజీలు రైతు వర్గంలో తమ పలుకుబడిని పెంచుకొన్నారు. పెద్ద వ్యాపారస్థుల పోటీ నుంచి చిన్న వ్యాపారస్థులను రక్షించి ప్రభుత్వ సహాయాన్ని అందజేసి వారి పిరిస్థితిని మెరుగుపరుస్తామని నాజీలు ప్రచారం చేశారు. నిరుద్యోగులైన జర్మన్ యువకులను నాజీ సిద్ధాంతాలు బాగా ఆకర్షించినాయి. అందుచేత వారు వైమార్ రిపబ్లిక్ పతనాన్ని వాంఛించినారు. దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి వెంటనే విముక్తి చేస్తామని, ప్రజలందరికి కావలసిన అన్ని సౌకర్యాలను కలుగజేస్తామని, నిరుద్యోగులైన 5 మిలియన్ల జర్మన్లకు ఉద్యోగాలిప్పిస్తామని నాజీలు హామీ ఇచ్చినారు. జర్మన్ ప్రజలలో అధిక సంఖ్యాకులు నాజీ ప్రచారాన్ని పూర్తిగా నమ్మి నాజీ పార్టీకి తమ మద్దతు నిచ్చినారు.

### 6.1.9.4. యూదు వ్యతిరేక ప్రచారము :

యూదులకు వ్యతిరేకంగా నాజీలు చేసిన ప్రచారమే నాజీల విజయానికి మరొక కారణము. జర్మన్లు యూదులను విదేశస్థులుగా భావించి ద్వేషించేవారు. జర్మనీలో యూదులు సంపన్న వర్గానికి చెందినవారు. జర్మనీ ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితులకు, ముఖ్యంగా ఆర్థిక పరిస్థితికి యూదులు కారణమనే ప్రచారాన్ని సాగించి నాజీలు జర్మన్ ప్రజలకు యూదుల పట్ల ద్వేషాన్ని పెంపొందించినారు. ఈ విధంగా యూదు వ్యతిరేక ప్రచారం చేసి ప్రజలలో పలుకుబడిని సంపాదించుకొన్నారు.

### 6.1.9.5. ఇతర కారణాలు :

జర్మనీలో ప్రజాస్వామ్యమెప్పుడూ ప్రజల మన్ననలను చూరగొనలేదు. జర్మన్లు తమ జాతి చరిత్రలో ఎప్పుడూ ప్రజాప్రభుత్వాన్ని ఆచరణలో పెట్టలేదు. అందువల్ల వైమార్ రిపబ్లిక్ను కూల్చడానికి నాజీలు ప్రయత్నించినపుడు ప్రజలు ఏమాత్రం బాధపడలేదు. యుద్ధం చేసి పెద్ద సామ్రాజ్యాన్ని నిర్మించడంలో నమ్మకమున్నా జర్మన్లలో నాజీపార్టీ సైనిక తత్వాన్ని పునరుద్ధరించింది. అంతేగాక నాజీ పార్టీని వ్యతిరేకించే ప్రతిపక్షాల మధ్య ఐకమత్యం కూడాలేదు. ప్రజలను తన సిద్ధాంతాల వైపుకు ఆకర్షించడానికి హిట్లర్ అనేక చిత్రమైన పద్ధతులను అనుసరించినాడు. గోధుమరంగు చొక్కాల దళాన్ని, నల్లరంగు చొక్కాల దళాన్ని తయారు చేసి ప్రజలలో హిట్లర్ సైనిక తత్వాన్ని పెంపొందించినాడు. వారి సహాయంతో తన ప్రత్యర్థులను అణచివేసినాడు. నాజీపార్టీ చిహ్నంగా ప్రజాదరణ పొందిన స్వస్తిక్ను ప్రవేశపెట్టినాడు. జర్మన్ జాతి గొప్పదనే నాజీ సిద్ధాంతం జర్మన్ ప్రజలను ముగ్ధులను చేసింది.

## 6.2. నాజీ పార్టీ సిద్ధాంతాలు, కార్యక్రమాలు :

### 6.2.1. పరిచయం :

'నాజీ' అనే పదము జాతీయ సోషలిస్టు అనే దానికి హ్రస్వ రూపము. ఈ పార్టీని 1918 లో డ్రెక్స్లర్ స్థాపించాడు. 1919 లో హిట్లర్ ఈ పార్టీలో చేరి దానిని పటిష్టం చేయడానికి కృషి చేయడమేగాక పార్టీలో తన పలుకుబడి పెంచుకొన్నాడు. 1920 లో హిట్లర్ పార్టీకి అధ్యక్షుడయినాడు. హిట్లర్, అతని అనుచరులు అదే సంవత్సరం అయిదు సూత్రాల నాజీ ప్రణాళికను తయారు చేశారు. గోరింగ్ నియంత్రణలో ఉన్నా 'ఫ్రీకోర్' వు నాజీ పార్టీలో విలీనమైంది. 'ఫ్రీకోర్' కార్యకర్తల (స్టామ్ ట్రూపర్స్) సహాయంతో హిట్లర్ అతని అనుచరులు 1923 లో మూనిక్లో బలప్రయోగం ద్వారా అధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి ప్రయత్నించి విఫలులయ్యారు. హిట్లర్కు దేశద్రోహ నేరానికి ప్రభుత్వం జైలులో నిర్బంధించింది. కారాగారంలో ఉన్న కాలంలో హిట్లర్ 'మైన్ కాంఫ్' (నాపోరాటం) అనే గ్రంథాన్ని రచించాడు. అందులో నాజీ పార్టీ ప్రణాళికను, సిద్ధాంతాలను వివరించాడు. 'మైన్ కాంఫ్' నాజీలకు బైబిల్ వంటిది. జైలు నుంచి విడుదలయిన తరవాత హిట్లర్ రాజ్యాంగ పద్ధతుల ద్వారా

వైమార్ రిపబ్లిక్‌ను విచ్ఛిన్నం చేయడానికి పథకం వేసుకొన్నాడు. **1925** లో పార్టీని హిట్లర్ పునర్వ్యవస్థీకరించాడు. **1920** లో తయారు చేయబడిన నాజీ ప్రణాళిక వైమార్ రిపబ్లిక్‌ను పడగొట్టడం, వర్సే సంధిని ఉల్లంఘించడం, వలసలను తిరిగిపొందడం, యూదులను దేశం నుండి వెళ్ళగొట్టడం, కమ్యూనిజంను అరికట్టడం అను అయిదు సూత్రాలు శాశ్వతమైందని, తిరుగులేనిదని 1926 లో నాజీలు ప్రకటించారు.

### 6.2.2. నాజీ పార్టీ సిద్ధాంతాలు : (Pdiecies of Nazism) :

ప్రణాళికలో నాజీ ధ్యేయాలు ఈ విధంగా ఉన్నాయి :

1. జర్మన్‌లు ఎక్కడున్నా ఆ ప్రాంతాన్నంతా అఖండ జర్మనీలో చేర్పించాలి.
2. తమ జనాభాకు, జనాభాకు తగ్గ ఆహారానికి ఇతరేతర భూప్రాంతాలు అవసరం.
3. జర్మన్‌లు కానివారందర్నీ జర్మనీలో పౌరసత్వం నుంచి తొలగించాలి.
4. యూదులకు పౌరసత్వంకాని, రాజకీయాల్లో స్థానం కానీ లేకుండా చేయాలి.
5. విదేశీయులందర్నీ బహిష్కరించాలి.
6. పౌరులందరికి హక్కులు, విధులు సమానంగా ఉండేటట్లు చేయాలి.
7. ప్రతి పౌరుడు పని చేసి జీవించాలి.
8. పని చేయకుండా సంపాందించిన అస్తులను వశపరచుకోవాలి.
9. 'ట్రస్ట్' లన్నింటిని జాతీయం చేయాలి.
10. పెద్ద పారిశ్రామిక వేత్తలు గడించిన లాభాలలో భాగం తీసుకోవాలి.
11. వయస్సు మళ్ళిన వారికి వృద్ధాప్యపు పింఛన్లు మంజూరు చేయాలి.
12. పటిష్ఠమైన మధ్య తరగతి రూపొందడానికి చర్యలు తీసుకోవాలి.
13. తనఖాలపై వడ్డీలు మాఫీ చేయాలి.
14. చిన్న వ్యాపారస్థులకు రక్షణ కల్పించాలి.
15. భూయాజమాన్యంపై వికేంద్రీకరణ తీసుకురావాలి.
16. భూములపై స్పెక్యులేషన్ వ్యాపారం అంతమొందించాలి.
17. జాతి విద్రోహులపైన మరణ శిక్షలు అమలుపరచాలి.
18. రోమన్ చట్టాలకు బదులు జర్మన్ ఉమ్మడి చట్టాన్ని అమలుపరచాలి.
19. నిత్యావసర జీవితానికి కావలసిన విద్యావిధానాన్ని రూపొందించాలి.
20. ప్రజల ఆరోగ్య విషయంలో కొత్త కార్యక్రమాన్ని చేపట్టాలి.
21. జాతీయ శ్రేయస్సుకు భిన్నంగా వ్యవహరిస్తున్న పత్రికలను మూసివేయించాలి.
22. జాతీయ సమైక్యతకు భంగం కలిగిస్తున్న కళలను అణచివేయాలి.
23. జర్మన్ జాతి నైతిక విలువలకు భంగం కలగజేయని క్రైస్తవ తెగలన్నింటికి మద్దతు ప్రకటించాలి.
24. అతి పటిష్ఠమైన కేంద్ర ప్రభుత్వాన్ని ఏర్పారచాలి.

### 6.2.3. నాజీ పార్టీ కార్యక్రమం : (Programmes of Nazism) :

నాజీలకు అతివాద సిద్ధాంతంలో నమ్మకమెక్కువ. నాజీ పార్టీ కార్యక్రమంలో జాతి అసహనమ్ము, సోషలిస్ట్ రాజకీయాల్ము, కమ్యూనిస్టుల ఎత్తుగడలు ప్రధాన అంశాలు. అంటే వారి కార్యక్రమం చిత్రమైన విభిన్న సిద్ధాంతాల మిశ్రమం అని చెప్పవచ్చు.

1. జర్మన్‌లు స్వచ్ఛమైన ట్యూటానిక్ జాతిని చెందినవారనీ, అందువల్ల ఇతర జాతులన్నింటి కంటే జర్మన్ జాతి ఉత్కృష్టమైనదనీ, ఆర్యులలో జర్మన్‌లు మానసిక చురుకుదనంలో, సాంస్కృతిక వికాసంలో ప్రథమ శ్రేణికి చెందిన వారని నాజీలు ప్రచారం చేసినారు. జర్మన్‌ల సంఘటిత శక్తి, జర్మన్ జాతి ఐక్యత నాజీ నోటి మంచి తరచు వినవచ్చిన మాటలు. తుఫాను దళాలు అనే గోధుమ రంగు చొక్కాదళాన్నీ, ఇలైట్‌గార్డ్స్ అనే నల్లరంగు చొక్కాలదళాన్నీ తయారు చేసి నాజీలు తమను వ్యతిరేకించే వారినందరినీ అణచివేసినారు.

2. రాజ్యంలో సర్వాధికారము నాజీ పార్టీ నాయకుడైన హిట్లర్‌కు అప్పగించడం జరిగింది. హిట్లర్ నాజీ పార్టీకేగాక దేశానికి కూడా 'ఫ్యూరర్' అంటే అధినేత అయినాడు. రిపబ్లిక్ పతాకం స్థానే నాజీ పార్టీ చిహ్నమయిన స్వస్తిక ఆక్రమించింది.

3. రాజ్యం ద్వారా జాతి తన ధ్యేయాలను చేరుకొంటుంది. అందువల్ల ఇతర దేశాల్లో నివసిస్తున్న జర్మన్‌లు కూడా రష్ పట్ల విశ్వాసం ప్రకటించాలి. జర్మన్ పొరుగు దేశాలలో జర్మన్‌లు ఉన్నట్లయితే, వాటన్నిటినీ కలిపి హిట్లర్ నాయకత్వంలో మూడో సామ్రాజ్యాన్ని నిర్మించుకోవలి.

4. రాజ్యం సర్వాధికారాలతో కూడినదనే సిద్ధాంతాన్ని నాజీలు నమ్మినారు. ప్రభుత్వ కార్యకలాపాలకు, అధికారాలకు అవధులు లేవు. గెస్టపో అనే రహస్య పోలీస్ శాఖ దేశంలో ఆంతరంగిక శాంతి భద్రతలను కాపాడేది. వ్యక్తిస్వాతంత్ర్యం రద్దయింది. పత్రికలు, రేడియో, సినిమా, ప్రదర్శన శాలలు మొదలైన ప్రచార సాధనాలన్నీ ప్రభుత్వ నియంత్రణలోకి వచ్చినాయి.

5. నాజీ సిద్ధాంతాల కనుగుణంగా విద్యావిధానం రూపొందింది. నాజీ సిద్ధాంతాల ప్రచారానికి జోసెఫ్ గోబెల్స్ నియమితుడైనాడు. అబద్ధాలను నిజాలని ప్రచారం చేయడంలో ఇతడిని మించినసిద్ధహస్తుడు లేడు. 'గోబెల్స్ ప్రచారం' అనేది అబద్ధాలకు పర్యాయ పదం అయింది. నాజీలకు చెందని పత్రికలు మూతబడ్డాయి. నాజీ వ్యతిరేక పుస్తకాలు దగ్ధమైనాయి. విద్యా శాఖా మంత్రిగా బెర్న్‌హార్డ్ రస్ట్ నియమించబడినాడు. నాజీ సిద్ధాంతాల కనుగుణంగా ఇతడు పాఠ్య ప్రణాళికను మార్చివేశాడు.

6. జర్మనీ ఆర్థిక దుస్థితికి కారణము యూదులనీ, వారిని నమ్మరాదనీ వారిని దేశం నుంచి తరిమివేయవలెనని నాజీలు ప్రచారం చేసినారు. ఈ ప్రచారం సామాన్య ప్రజలలో చైతన్యం కలిగించినా మేధావులు, ప్రసిద్ధి పొందిన ఆచార్యులు జర్మన్ విద్యాలయాలను వదలి ఇతర దేశాలకు పోయినారు. సుప్రసిద్ధ గణితశాస్త్రజ్ఞుడు ప్రొఫెసర్ ఆయిన్‌స్టీన్ వారిలో ఒకడు అంతటితో జర్మన్ విశ్వవిద్యాలయాలు అంతర్జాతీయ విజ్ఞాన కేంద్రాలుగా ఉండే అవకాశం పోయింది.

7. నాజీలు కమ్యూనిజమ్‌కు పూర్తిగా వ్యతిరేకులు. జర్మనీలో కమ్యూనిస్టులను కఠినంగా అణచివేయడం నాజీ కార్యక్రమంలో ఒక భాగము. నాజీలు పెట్టుబడి దారీ విధానానికి కూడా ప్రతికూలురే.

8. క్రైస్తవ చర్చిలు. వాటి ఆస్తులు ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని రావడం జరిగింది. ప్రజలు జర్మన్ భాషలోని మత గ్రంథాలను మాత్రమే పఠించవలెననే నియమం ప్రవేశపెట్టడం జరిగింది. సామ్రాజ్య బిషప్ ప్రొటెస్టంట్ చర్చిలపై అధిపతిగా ఉండవలెను.

9. స్త్రీలు పురుషుల వలె అన్ని రంగాలలో నాయకత్వం వహించరాదు స్త్రీలకు పిల్లలు, చర్చి, వంటిల్లు తో మాత్రమే ప్రమేయం ఉండవలెను.

10. నాజీ పార్టీ నుంచి తన ప్రత్యర్థులను చాలా మందిని వెళ్ళగొట్టి హిట్లర్ పార్టీని ప్రక్షాళన చేసినాడు. నాజీ పార్టీ పర్యవేక్షకుడుగా ఆల్‌ఫ్రెడ్ రోసెన్ బర్గ్ ఉండేవాడు. అతని తరవాత గోబెల్స్ నాజీ పార్టీ పర్యవేక్షకుడైనాడు.

11. తమకు జరిగిన అన్యాయానికి ప్రతీకారం చేసి పగతీర్చుకోవడానికి జర్మన్‌లు సైనికంగా అభివృద్ధి చెందవలెనని హిట్లర్ భావించాడు. ఆహార ఉత్పత్తి కంటే ఆయుధాల ఉత్పత్తికి ఎక్కువ ప్రాధాన్యమిచ్చినాడు.

12. ఆర్థిక మంత్రి షాట్ దేశ ఆర్థిక పరిస్థితులను చక్కదిద్ది ఆయుధ ఉత్పత్తికి, పారిశ్రామికాభివృద్ధికి కావలసిన ముడిపదార్థాలను ఇతర దేశాల నుంచి పొందే ఏర్పాట్లు చేసినాడు. ప్రజల మీద అధికంగా పన్నుల భారం పడకుండానే దేశ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దినాడు. ప్రణాళిక పద్ధతుల ద్రవ్యనియంత్రణ, పొదుపు, విదేశీ వర్తకం పెంపుదల మొదలైన పద్ధతులననుసరించి హిట్లర్ జర్మనీని ఆర్థిక సంక్షోభం నుంచి కాపాడినాడు.

13. పెరుగుతున్న జర్మన్‌ల నివాసానికి అదనపు వలసలు అవసరం. కాబట్టి యుద్ధ విధానాల ద్వారా భూ భాగాలను సంపాదించవలెనని హిట్లర్ భావించాడు. వర్సై సంధిని ఉల్లంఘించి జర్మనీ ఆయుధబలాన్ని వృద్ధిచేశాడు. గోరింగ్ అను సమర్ధుడైన అనుచరుని సహాయంతో హిట్లర్ జర్మన్ సైన్యాన్ని పటిష్టం చేసినాడు.

14. హిట్లర్‌ను ఎదిరించిన జర్మన్‌లను ప్రత్యేక న్యాయస్థానాలలో విచారించి మరణ దండన విధించేవి. శాసన సభలో నాజీ పార్టీ సభ్యులు మాత్రమే ఉండేవారు. వారు హిట్లర్ ప్రసంగాలకు వినడానికి మాత్రమే సమావేశమయ్యేవారు. 1938 నుంచి మంత్రి మండలి సమావేశాలను, చర్చలను రద్దుచేయడం జరిగింది. హిట్లర్ సర్వాధికారి అయ్యాడు. హిట్లర్ యూదులను కఠినంగా అణచివేసి జర్మన్ జాతి ఔన్నత్యాన్ని నెలకొల్పినాడు.

## 6.3. హిట్లర్ (నాజీ జర్మనీ) విదేశాంగ విధానము :

### 6.3.1. పరిచయం :

నాజీ పార్టీ జర్మనీలో అంతరంగికంగా నియంతృత్వాన్ని స్థాపించడానికి అనుసరించిన పద్ధతులనే విదేశాంగ విధానంలో కూడా అనుసరించింది. విదేశ వ్యవహారాలలో సామరస్యంతో కూడిన రాజీమార్గాన్ని అనుసరించడానికి బదులు బలప్రయోగం చేసే పద్ధతిని అనుసరించడం నాజీ పార్టీ ఆశయము. అంతర్జాతీయ సంధులను, ఒప్పందాలను ఉల్లంఘించడం ద్వారా అంతర్జాతీయ రాజకీయాల్లో ఉద్రిక్తతలో కూడిన యుద్ధ వాతావరణాన్ని సృష్టించడం నాజీ పార్టీ అనుసరించిన విదేశాంగ విధానం ప్రధాన లక్ష్యం మరొక విధంగా చెప్పవలెనెనంటే పూర్తిగా సైనికబలం మీద ఆధారపడి మాత్రమే నాజీలు విదేశాంగ విధానాన్ని కొనసాగించారు.

హిట్లర్ సైనిక వాదంలో ముఖ్యమైన అంశాలు : తిరుగుబాటు, యుద్ధము, బలవంతంగా భూభాగాలను ఆక్రమించుకోవడం, శాంతి బలహీనతకు చిహ్నమని నాజీల నమ్మకం. అంతేగాక జాతులన్నింటిలో ఆర్య వంశానికి చెందిన జర్మన్ జాతి చాలా గొప్పదని అందుచేత ప్రపంచంలోని ఇతర జాతులన్నిటి మీద పరిపాలన నెలకొనవలెననీ నాజీ పార్టీ భావించింది. నాజీ విదేశాంగ విధానంలోని ముఖ్య సిద్ధాంతాల ప్రకారం నానా జాతి సమితి, భద్రత, నిరాయుధీకరణ , సంతృప్తి పరచే విధానం మొదలైనవి దేశ పురోభివృద్ధికి అవరోధాలు.

జర్మనీకి ప్రధాన శత్రువు ఫ్రాన్స్ కాబట్టి ఫ్రాన్స్‌ను ఏకాకిని చేయడానికి జర్మనీ తప్పనిసరిగా బ్రిటన్, ఇటలీలతో స్నేహసంబంధాలు నెలకొల్పవలె. పెరుగుతున్న జర్మన్ జనాభా నివాసానికి కావలసిన భూభాగాలను సంపాదించడం నాజీ పార్టీ మరొక ఆశయం. ఆనాడు జర్మనీ రాజ్య విస్తరణ కార్యక్రమానికి వీలైన ప్రదేశము తూర్పు యూరప్ రష్యా, రష్యా సరిహద్దులలో ఉన్నా దేశాలను కబళించడం నాజీ జర్మనీ ఆశయం. తూర్పుకు విస్తరించడం జర్మనీ విదేశాంగ విధానం ముఖ్యలక్ష్యమైంది. కాని జర్మనీ రాజ్యవిస్తరణ విధానానికి ఫ్రాన్స్, ముఖ్యమైన అవరోధమైంది. కాబట్టి మొదట ఫ్రాన్స్‌కు తరువాత రష్యాను పూర్తిగా నాశనం చేయడమే లక్ష్యంగా నాజీ జర్మనీ విదేశాంగ విధానం రూపొందించడం జరిగింది. కాని పైకి మాత్రం హిట్లర్ నాజీ జర్మనీకి కావలసింది శాంతిగాని, యుద్ధం కాదని, యుద్ధమొక ఉన్మాదమని చెప్పేవాడు.

'మీన్ -కాంఫ్' అనే గ్రంథంలో హిట్లర్ పేర్కొన్నట్లు నాజీ జర్మనీ విదేశాంగ విధానం ముఖ్య లక్ష్యాలు మూడు. అవి : 1. స్వయం నిర్ణయ సిద్ధాంతం ప్రాతిపదికగా జర్మన్‌ల నందరినీ ఏకం చేసి ఒకేజర్మన్ రాజ్యంగా రూపొందించడం. 2. వర్సై, సెయింట్ జర్మేయిన్ మొదలైన సంధులను రద్దుచేయడం. 3. పెరుగుతున్న జర్మన్ జనాభాకు కొత్త భూభాగాలను సంపాదించడం.

### 6.3.2. సమితి నుంచి జర్మనీ ఉపసంహరించుకోవడం :

నానాజాతి సమితి నుంచి జర్మనీ ఉపసంహరించుకోవడం హిట్లర్ విదేశాంగ విధానం : మొదటి అంశం. హిట్లర్‌కు సమితి ఆదర్శాలలో ఏ మాత్రం నమ్మకం లేదు. నాజీ విదేశాంగ విధానం విజయానికి సమిలో జర్మ[illegible]త్వం ప్రధాన అవరోధమని హిట్లర్ భావించాడు. హిట్లర్‌కు నిరాయుధీకరణలో కూడా ఏ మాత్రం ఆసక్తిలేదు. జర్మనీకి ఆయుధ బలం తప్పనిసరిగా అవసరమని హిట్లర్ భావించాడు. 1933 అక్టోబర్ లో జెనీవా నిరాయుధీకరణ సమావేశం నుంచి విరమించుకొని సమితి నుంచి కూడా ఉపసంహరించుకొనవలెననే

తన కోరికను హిట్లర్ వెల్లడించాడు. మిత్ర రాజ్యాలలో సమానస్థాయిలో గౌరవ మర్యాదలను పొందవచ్చుననే ఆశయంతో జర్మనీ సమితిలో సభ్యరాజ్యంగా చేరిందనీ, కాని సమితి జర్మనీ పట్ల ద్వేషంతో కూడిన వైఖరిని అవలంబించి అవమానించిందనీ, అందువల్ల జర్మనీ వంటి స్వాభిమానం గల గొప్ప దేశానికి సమితిలో సభ్యరాజ్యంగా ఉండటం ఏ మాత్రం గౌరవప్రదం కాదని హిట్లర్ ప్రకటించినాడు. హిట్లర్ చేసిన ఈ ప్రకటనను ప్రపంచానికి రాబోయే నూతన ప్రమాదానికి ఒక విధమైన సూచన వంటిది.

జర్మనీ అవమానానికి గురి అయినట్లు బాధపడటంలో కొంత న్యాయమున్నదని భావించిన పశ్చిమ రాజ్యాలు జర్మనీ పట్ల 'సంతృప్తి పరిచే' విధానాన్ని అనుసరించ వలసిన అవసరాన్ని గుర్తించాయి. పశ్చిమ రాజ్యాలు కలగజేసిన ఈ అవకాశాన్ని హిట్లర్ పూర్తిగా ఉపయోగించుకొన్నాడు. నానాజాతి సమితి నుంచి జర్మనీ ఉపసంహరించుకోవడం హిట్లర్ విదేశాంగ విధానంలో మొదటి భాగం. సమితిలో సభ్యత్వాన్ని ఉపసంహరించుకొన్నప్పటి నుంచి జర్మనీ యుద్ధ ప్రయత్నాలు చేయడం ప్రారంభించింది. రహస్య యుద్ధ పథకాలను తయారు చేయడం కోసం 1934 లో నాజీ ప్రభుత్వం ఒక రక్షణ మండలిని ఏర్పాటు చేసింది.

'తృప్తి పరిచే' విధానంలో భాగంగా తన నౌకాబలంలో ముప్పయి అయిదవ వంతు బలాన్ని జర్మనీ ఏర్పరచుకోవచ్చుని బ్రిటన్ ప్రకటించింది. దీనిలో వర్సే సంధి ఇంకా ఉల్లఘించినట్లయింది.

### 6.3.3. జర్మనీ సార్‌ను ఆక్రమించడం :

జర్మనీ పోలండ్‌తో 1934 లో దురాక్రమణ వ్యతిరేక ఒప్పందం చేసుకొని ఫ్రాన్స్ - పోలండ్‌ల మధ్య స్నేహసంబంధాలను నివారించింది. అదే సంవత్సరం ఆస్ట్రియా ఆక్రమణకు హిట్లర్ విఫలయత్నము చేసినాడు.

ఆస్ట్రియాను ఆక్రమించు కోవడంలో విఫలమైన హిట్లర్ జర్మనీకి రాజ్యవిస్తరణ కాంక్ష లేదని ప్రకటించాడు. కాని హిట్లర్ యుద్ధ ప్రయత్నాలను ఏ మాత్రం మానలేదు. వర్సే సంధి ప్రకారం జర్మన్ భూభాగమైన సార్ భవిష్యత్తును నిర్ణయించడానికి 1935 లో జనవాక్యసేకరణ జరగవలసి ఉంది. సార్ సమస్య కారణంగా జర్మనీ ఫ్రాన్స్‌ల మధ్య ఉద్రిక్తత తీవ్రమైంది. రెండు దేశాలు సార్ వ్యవహారాలలో జోక్యం చేసుకొని ప్రజాభిప్రాయాన్ని పరస్పరం తమకు వీలుగా ఉండేటట్లు మలుచుకోవడానికి ప్రయత్నించాయి. చివరకు బ్రిటన్, ఇటలీ, నెదర్లాండ్స్, స్వీడన్‌ల పర్యవేక్షణలో 1935 లో సార్‌లో ప్రశాంతంగా జనవాక్య సేకరణ జరిగింది. సార్ ప్రజలు జర్మనీలో కలయికకు తీర్మానించారు. ఫలితంగా 15 సంవత్సరాల తరవాత తిరిగి సార్ ప్రాంతం జర్మనీలో చేరింది. సార్ ప్రాంతాన్ని తిరిగి పొందడంలో విజయం సాధించడం హిట్లర్ విదేశాంగ విధానంలో నాల్గో అంశం.

### 6.3.4. సైనిక నిబంధనలు ఉల్లంఘన :

సార్ ప్రాంతాన్ని తిరిగి పొందిన తరవాత హిట్లర్, జర్మనీ తృప్తి వహించిందనీ, ఇక మీదట జర్మనీకి ఏ మాత్రం రాజ్య విస్తరణ కాంక్ష లేదనీ ప్రకటించాడు. కాని కొద్ది రోజుల తరవాత హిట్లర్ వర్సే సంధిలోని సైనిక నిబంధనలను ఉల్లఘించి జర్మనీలో నిర్బంధ సైనిక విధానాన్ని ప్రవేశపెట్టినాడు. అయితే ఏ విధమైన పరస్పర సహాయక సంధికి కూడా తాను సుముఖుడనుకానని విమానబలానికి సంబంధించినంత వరకు జర్మనీకి ఫ్రాన్స్‌తో సమానంగానూ, నౌకాబలానికి సంబంధించినంతవరకు జర్మనీకి బ్రిటిష్ నౌకాబలంలో 35 శాతం బలము ఉండవలెనని హిట్లర్ బ్రిటన్‌కు తెలియజేశాడు. అంతేగాక ఇతర రాజ్యాలు నిరాయుధీకరణను అనుసరించినప్పుడు మాత్రమే జర్మనీ కూడా నిరాయుధీకరణను అనుసరిస్తుందని హిట్లర్ తెలియజేశాడు. హిట్లర్ వాదనలతో బ్రిటన్ దాదాపుగా ఏకీభవించింది. ఈ విధంగా హిట్లర్ దౌత్యవిజయాన్ని సాధించాడు. అయితే బ్రిటన్ ఫ్రాన్స్‌లు సమితిలో వర్సే సంధిని ఉల్లంఘించినట్లుగా జర్మనీ మీద ఆరోపణ చేసినాయి. సమితి జర్మనీ చర్యను నామా మాత్రంగా గర్హించింది. 1935 లో ఫ్రాన్స్ చెకొస్లావాకియాలు రష్యాతో ఒక పరస్పర సహాయక సంధి చేసుకొన్నాయి. 1935 నాటికి జర్మన్ వ్యతిరేక ఒప్పందము కొంతవరకు బలపడింది.

### 6.3.5. బ్రిటన్ - జర్మనీల మధ్య నౌకా సంధి :

హిట్లర్ తన దేశంలో నిర్బంధ సైనిక విధానాన్ని ప్రవేశపెట్టినందువల్ల పశ్చిమ రాజ్యాలు జర్మనీ పట్ల అనుమానాన్ని, ఆందోళనను వ్యక్తం చేసినాయి. పశ్చిమ రాజ్యాల అనుమానాన్ని తొలగించడానికి అంతర్జాతీయ రంగంలో న్యాయమైన శాంతి స్థాపనకు జర్మనీ ఎల్లప్పుడూ

దోహదం చేస్తుందని హిట్లర్ ఒక ప్రకటన చేశాడు. ఆస్ట్రియా స్వాతంత్ర్యాన్ని వర్సే, లొకర్నో ఒడంబడికలను గౌరవిస్తానని హిట్లర్ వాగ్దానం చేసినాడు. ఈ విధంగా తన సైనిక సన్నాహాల వల్ల పశ్చిమ రాజ్యాలలో ఏర్పడిన అనుమానాన్ని తొలగించడానికి హిట్లర్ ప్రయత్నించాడు. 1935 జూన్ 18న హిట్లర్ ఇంగ్లాండ్‌లో ఒక నౌకా సంధిని చేసుకొన్నాడు. ఈ సంధి ప్రకారం జర్మనీ నౌకాబలాన్ని పెంచుకోవడానికి బ్రిటన్ అంగీకరించింది. జర్మనీ పట్ల బ్రిటన్ అనుసరిస్తున్న 'సంతృప్తి' పరిచే విధానానికి ఈ నౌకా సంధి ప్రబలనిదర్శనమని చెప్పవచ్చు.

### 6.3.6. రైన్‌లాండ్ ఆక్రమణ :

ఇథియోపియాను ఇటలీ ఆక్రమించుకోవడం, ఫ్రాన్స్, సోవియట్ రష్యాల మధ్య 1936 లో ఒక ఒప్పందం జరగడం అవకాశంగా తీసుకొని హిట్లర్ ధైర్యంగా లొకర్నో ఒడంబడికలను ఉల్లంఘించి రైన్ భూభాగాన్ని ఆక్రమించుకోవడానికి సన్నాహాలు చేసినాడు. 1936 మార్చిలో 25 వేల జర్మన్ సైన్యాలు రైన్‌లాండ్‌లోకి ప్రవేశించి సునాయాసంగా ఆ ప్రాంతాన్ని ఆక్రమించుకొన్నాయి. ఫ్రాన్స్ - సోవియట్ రష్యాల మధ్య ఒడంబడిక జరిగిన ఫలితంగా లొకర్నో ఒడంబడికలు రద్దయినాయని, అందువల్ల జర్మనీ ఆ ఒప్పందాలకు కట్టుబడి ఉండవలసిన అవసరం లేదని హిట్లర్ బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీలకు తెలియజేశాడు. సోవియట్ రష్యాతో ఒడంబడిక చేసుకొన్న ఫ్రాన్స్‌ను హిట్లర్ 'యూరప్‌లోని పెద్ద మోసగాడు' అని వర్ణించాడు. బలప్రయోగం చేసి రైన్‌లాండ్‌ను ఆక్రమించుకోవడం వల్ల హిట్లర్ చెప్పుకోదగ్గ ప్రతిఘటన ఎదుర్కోలేదు. తీవ్రమైన చర్యలు తీసుకోవడానికి బ్రిటన్, బెల్జియంలు నిరాకరించాయి. ఫ్రాన్స్‌లో ఎన్నికలు జరిగి లియాబ్లమ్ అధికారానికి వచ్చాడు. శాంతిని ఏదో విధంగా పరిరక్షిద్దాం మనే ఉద్దేశంతో ఇతడు కూడా బ్రిటన్ విధానాన్నే అవలంబించాడు. నానా జాతి సమితి ఇథియోపియా విషయంలో తలదూర్చి ఉన్నందువల్ల కొత్త సమస్యలను తెచ్చిపెట్టుకోదలచలేదు. ఈ కారణాలుగా హిట్లర్ దురాక్రమణలకు నాంది ప్రస్తావన జరిగింది.

### 6.3.7. అక్షరాజ్య కూటమి ఏర్పాటు :

ఆధునిక ప్రపంచ చరిత్రలో 1936 చాలా కీలమైన సంవత్సరం. ఇటాలియన్ ఫాసిస్ట్‌లు, జర్మన్ నాజీలు తమ దురాక్రమణలకు ఒక పథకం వేసుకొని, దాన్ని అమలుపరచడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. చిన్న విజయాలతో వారు సరిపెట్టుకొంటారో లేక ప్రపంచ మొత్తాన్ని తిరిగి యుద్ధంలో ముంచెత్తుతారో ఎవరికీ 1936 లో అంతుపట్టలేదు.

లొకర్నో ఒడంబడికలు రద్దయినట్లు జర్మనీ ప్రకటించిన ఫలితంగా వర్సేసంధి ప్రవేశపెట్టిన సమిష్టి భద్రతా విధానము ఇంచుమించు భగ్నమైంది. పశ్చిమ యూరప్‌లో జర్మనీ రక్షణను పటిష్టంగా చేసుకొన్నందువల్ల ఫ్రాన్స్, రష్యా, పోలాండ్, చెకొస్లొవాకియా, యుగొస్లావియా, రుమేనియాలతో చేసుకొన్న ఒడంబడికలు నిరుపయోగమైనాయి. ఆస్ట్రియా రక్షణ కోసం ఏర్పాట్లు కూడా నిష్ప్రయోజనమైనాయి. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో జర్మనీ సైనిక చర్యల వల్ల దెబ్బతిన్న బెల్జియం మళ్ళీ తటస్థ వైఖరిని అవలంబించడంలో సమిష్టి భద్రత మరింత బలహీనమయింది.

ఫాసిస్ట్, నాజీ దురాక్రమణలను బ్రిటన్, ఫ్రాన్స్‌లు అడ్డుకొనలేకపోయేటప్పటికి నానాజాతి సమితికి చెందిన ఇతర దేశాలు ఆత్మరక్షణను తమ మార్గాలను తామే అన్వేషించు కోవడం మొదలుపెట్టాయి. 1934 తరవాత చాలా యూరోపియన్ దేశాల్లో ఆయుధాల ఉత్పత్తులు మూడింతలయ్యాయి. దౌత్యరంగంలో కూడా మార్పులు వచ్చాయి. చిన్న రాజ్యాలవారు యూరోపియన్ రాజకీయాలకు దూరంగా ఉండటం మొదల పెట్టారు. ఈ విధానం వల్ల భద్రత చేకూరుతుందని వారిభావన. 1936 నుంచి డెన్మార్క్, నార్వే, స్వీడన్‌లు యూరప్ రాజకీయాలలో తటస్థంగా ఉండడానికి నిశ్చయించుకొన్నాయి. పోలాండ్, ఇస్టోనియా, లాట్వియా, లిథువేనియా మొదలైన దేశాలు జర్మనీపట్ల సుహృద్భావంతో ఉన్నాయి. యుగొస్లావియా, బల్గేరియా, హంగరీలు జర్మనీతో వాణిజ్య సంబంధాలను నెలకొల్పుకొన్నాయి. అమెరికా యూరప్ రాజకీయాలకు దూరంగా ఉండి ఏకాంత విధానాన్ని అనుసరించసాగింది. సోవియట్ రష్యాకు పశ్చిమ రాజ్యాలకు మధ్య సరియయిన మైత్రి సంబంధాలు నెలకొనలేదు. బ్రిటన్, ఫ్రాన్స్‌లు జర్మనీ పట్ల సంతృప్తి పరిచే విధానాన్ని అనుసరించినాయి. 1936 నాటికి అంతర్జాతీయ పరిస్థితులు జర్మనీ దురాక్రమణ విధానాన్ని అనుసరించడానికి వీలుగా ఉన్నాయి.

జర్మనీ నాయకత్వంలో రోమ్ - బెర్లిన్ - టాక్యో అక్షాన్ని ఏర్పాటు చేయడం హిట్లర్ విదేశాంగ విధానంలోని ప్రధాన అంశం. హిట్లర్, ముస్సోలినీల మధ్య కోరికల సంఘర్షణ కారణంగా 1935 నాటికి కూడా సౌభ్రాతృత్వ సంబంధం లేదు. ఇటాలియన్ మైత్రిని 'మీన్ కాంఫ్' లో ఆకాశానికెత్తినా హిట్లర్ పట్ల ముస్సోలినికి అనుమానం, భయం ఉండేవి. ఆస్ట్రియా సమస్య కారణంగా ఇరువురి మధ్య భేదాభిప్రాయాలు ఏర్పడినాయి. నాజీల నుంచి రక్షణకు గాను ఆస్ట్రియాకు ముస్సోలిని ఆర్థిక సహాయమందించాడు. 1934 లో బలప్రయోగం ద్వారా ఆస్ట్రియాను కబళించడానికి నాజీలు ప్రయత్నించారు. దీనికి ముస్సోలినీ తీవ్ర అభ్యంతరం చెప్పి, బ్రెన్నెర్ కనుమకు సైన్యాన్ని తరలించాడు. అవసరమైతే కనుమను దాటడానికి కూడా ఇటాలియన్ సైన్యం సిద్ధమేనని ముస్సోలినీ హెచ్చరించాడు. ఆస్ట్రియాను రష్యాతో కలిపి వేయడానికి హిట్లర్ తప్పకుండా ప్రయత్నిస్తాడనే భయంతోనే ముస్సోలిని కనుమకు సేనలను తరలించాడు. అదీగాక ఈ కనుమకు దక్షిణాన రెండున్నర లక్షల జర్మన్‌లు స్థిర నివాసమేర్పరచుకొని ఉన్నారు. జర్మన్‌లు ఎక్కాడున్నా ఆ ప్రాంతాలన్నింటిని జర్మనీలో కలిపివేస్తానని ఇదివరలోనే హిట్లర్ హెచ్చరించి ఉన్నాడు. దీని వల్ల కూడా నాజీలంటే ముస్సోలినికి భయం.

ఇథియోపియా యుద్ధం ఈ పరిస్థితినంతా తారుమారు చేసింది. ఈ యుద్ధం వల్ల యూరప్‌లో సైన్యాన్ని ఉపయోగించుకొనే పరిస్థితి ఇటలీ పోగొట్టుకుంది. ఇథియోపియా విషయంలో బ్రిటన్, ఇటలీల మధ్య విరోధం ఏర్పడటం వల్ల ఇటలీ జర్మనీకి చేరువగా రాసాగింది. ఆస్ట్రియా పట్ల హిట్లర్ అనుసరిస్తున్న దురాక్రమణ విధానానికి ఇథియోపియా సంక్షోభం బలం చేకూర్చింది. క్రమ క్రమంగా ఇటలీ పశ్చిమ రాజ్యాలకు దూరమై జర్మనీతో మైత్రికి సిద్ధమైంది. ఇటలీ మీద విధించిన ఆంక్షలను సమితి రద్దు చేసినందువల్ల తిరిగి ఇటలీ పశ్చిమ రాజ్యాల మధ్య సత్సంబంధాలు ఏర్పాడతాయని హిట్లర్ భయపడినాడు. కాని స్పెయిన్ అంతర్యుద్ధంలో ఇటలీ కలగజేసుకొన్నందువల్ల ఇటలీ పశ్చిమ రాజ్యాల మధ్య విరోధం మరింత తీవ్రరూపం దాల్చింది. ఈ అవకాశాన్ని హిట్లర్ ఉపయోగించుకొన్నాడు. ఇటలీలో స్నేహం నాజీలకు తప్పనిసరి. ఎందుకంటే సోవియట్ రష్యాను ధ్వంసం చేయడానికి, రష్యా చమురు నిక్షేపాలు, రష్యన్ భూభాగాలు పొందడానికి బ్రిటన్ లేక ఇటలీ మైత్రి తప్పనిసరి. జర్మనీ పట్ల బ్రిటన్‌లో వ్యతిరేకత ఉంది. ఈ విధంగా ఇథియోపియా సంక్షోభం, స్పెయిన్ అంతర్యుద్ధం ఇటలీ జర్మనీల మధ్య సంబంధాలు అభివృద్ధి చెందడానికి తోడ్పడింది.

ముస్సోలిని ఆహ్వానం పైన 1934 జూన్ 14న వెనిస్‌లో మొదటిసారిగా ముస్సోలిని, హిట్లర్‌లు సమావేశమైనారు. ఆ తరవాత 1936 జూలై 11న ముస్సోలిని అంగీకారంతో ఆస్ట్రో - జర్మన్ సంధి కుదిరింది. ఆస్ట్రియాలో తన ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరించుకోడానికి జర్మనీకి ముస్సోలిని అంగీకారం తెలిపాడు. ముస్సోలినీతోబాటు హిట్లర్ స్పెయిన్ అంతర్యుద్ధంలో జోక్యం చేసుకుని ఇటలీకి అన్ని విధాలుగా ప్రోత్సాహిచ్చినాడు. కమ్యూనిజంకు వ్యతిరేకంగా సమిష్టి పోరాటం చేయడానికి కూడా వారు పథకం వేశారు. 1936 లో కుదిరిన ఈ అంగీకారానికి రోమ్ - బెర్లిన్ అక్షం అని నామకరణం జరిగింది. యూరప్ యావత్తు తమ అంగీకారం చుట్టూ ప్రదక్షణ చేయనుంది. కాబట్టి దానికాపేరు పెట్టామని ముస్సోలినీ ప్రకటించాడు.

1936 లో జర్మనీ జపాన్‌లు కామిన్‌టర్న్ వ్యతిరేక ఒడంబడిక చేసుకొన్నాయి. ఈ సంధి ప్రకారం కమ్యూనిస్ట్‌ల చర్యలకు సంబంధించిన వివరాలను రెండు దేశాలు పరస్పరం తెలియజేసుకోవడానికే గాక కమ్యూనిస్ట్‌ల మీద కొన్ని చర్యలు తీసుకోవడానికి కూడా పరస్పరం సహకరించుకోవడానికి అంగీకరించినాయి. సోవియట్ రష్యాతో ఏ విధమైన సంధి చేసుకోకుండా ఉండడానికి కూడా ఇరుపక్షాలు అంగీకరించాయి. 1937 లో ఇటలీ కూడా ఈ ఒడంబడికలో చేరింది. ఈ విధంగా రోమ్ - బెర్లిన్ - టోక్యో అక్షము అమలులోకి వచ్చింది. కొమిన్‌టర్న్ వ్యతిరేక ఒప్పందం రష్యాకు వ్యతిరేకంగా జరిగినటువంటి సంధి. అయితే ఇది సరిగా పనిచేయలేదు. కాని ప్రచారానికి మాత్రం బాగా ఉపయోగపడింది. ఈ కమ్యూనిస్ట్ వ్యతిరేక ఒడంబడిక పట్ల పశ్చిమ రాజ్యాలు సంతృప్తి ప్రకటించాయి.

ఈ విధంగా హిట్లర్ అధికారంలోకి వచ్చిన తరవాత నాలుగ సంవత్సరాల కాలంలో గణనీయమైన విజయాలను సాధించి జర్మన్ మూడో సామ్రాజ్యాన్ని పటిష్ఠం చేసినాడు. 1937 నాటికి జర్మనీ బలమైన సైనిక, నౌకా, విమాన దళాలను ఏర్పరచుకొన్నది. ఈ విధంగా పటిష్ఠమైన నూతన జర్మనీ అవతరించింది.

**6.3.8. జర్మనీ, ఆస్ట్రియాల కలయిక (అన్షలన్) :**

మొదటి ప్రపంచ యుద్ధం తరవాత హాప్స్‌బర్గ్ సామ్రాజ్యం విచ్ఛిన్నమై స్వయం నిర్ణయ సిద్ధాంతం ప్రకారం ఆస్ట్రియా రిపబ్లిక్‌గా రూపొందింది. ఆస్ట్రియా రాజ్యాంగ నిర్మాణ సభ ఆస్ట్రియా జర్మనీల కలయిక సిఫారసు చేస్తూ చేసిన ప్రకటనను మిత్రరాజ్యాలు న్యాయ విరుద్ధమని పూర్తిగా వ్యతిరేకించినాయి. 1922 లో జరిగిన జనవాక్య సేకరణ ఫలితంగా ఆస్ట్రియా జర్మనీతో విలీనం కావలెనని ఆస్ట్రియన్‌లు తీర్మానించారు. ఆస్ట్రియా జర్మన్‌ల కలయికను పూర్తిగా వ్యతిరేకించే ఆస్ట్రియా ఛాన్సలర్ డోల్‌ఫూస్‌ను అధికారం నుంచి తొలగించడానికి హిట్లర్ ఆస్ట్రియా ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేసుకోవడమే గాక ఆస్ట్రియన్ నాజీ ఉద్యమాన్ని కూడా బలపరచినాడు. హిట్లర్ దురాక్రమణ చర్యల వలన ఆందోళన చెందిన బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీలు ఆస్ట్రియా ప్రాదేశిక సమగ్రతను స్వాతంత్ర్యాన్ని పరిరక్షించడానికి తాము నిర్ణయించుకొన్నట్లు ఒక సంయుక్త ప్రకటన ద్వారా తెలియజేశాయి. మిత్ర రాజ్యాల మద్దతుతో ఛాన్సలర్ డోల్‌ఫూస్ ఆస్ట్రియన్ నాజీలను కఠినంగా అణచివేయసాగినాడు. దీనితో నాజీలు రెచ్చిపోయి తమ ఉద్యమాన్ని మరింత తీవ్రం చేసినారు. 1934 జూలైన 25న నాజీపార్టీకి చెందిన ఒక ముఠా వియన్నా నగరంలోకి ఆకస్మాత్తుగా ప్రవేశించి ఆస్ట్రియన్ మంత్రులను నిర్బంధించారు. డోల్‌ఫూస్‌ను అతని సహచరుల నుంచి వేరుచేసి చంపినారు. ఈ సంఘటన దేశ వ్యాప్తంగా తిరుగుబాట్లకు దారితీసింది. కాని ఆస్ట్రియా ప్రభుత్వం నాజీల తిరుగుబాటును కఠినంగా అణిచివేసింది. ఆస్ట్రియా ప్రభుత్వానికి ముస్సోలినీ సైనిక సహాయం అందించాడు. అనేకవేలమంది ఆస్ట్రియన్ నాజీలు జర్మనీలో తలదాచుకొన్నారు. తన సలహానుసరించి రక్త రహిత విప్లవాన్ని చాకచక్యంగా నడపనందువల్ల హిట్లర్ తన దేశంలో తలదాచుకొన్న ఆస్ట్రియన్ నాజీ నేరస్తులను ఆస్ట్రియా ప్రభుత్వానికి అప్పగించాడు. పశ్చిమ రాజ్యాలు తమ మద్దతును ఆస్ట్రియా ప్రభుత్వానికిచ్చినాయి. ఈ విధంగా ఆస్ట్రియాను ఆక్రమించుకోవడానికి హిట్లర్ చేసిన తొలి ప్రయత్నం విఫలమయింది.

ఈ సంఘటన వల్ల యూరప్‌లో దాదాపుగా అన్ని చోట్ల నాజీ వ్యతిరేక వైఖరి బలపడింది. జర్మనీ దురాక్రమణకు వ్యతిరేకంగా తన రక్షణ ఏర్పాట్లును పటిష్ఠం చేసుకోవడానికి ఫ్రాన్స్‌కు అవకాశం లభించింది. హిట్లర్ దురాక్రమణ విధానం వల్ల ఆందోళన చెందిన సోవియట్ రష్యా 1934 లో సమితిలో సభ్యరాజ్యంగా చేరింది. 1935 లో ఆస్ట్రియా ఫ్రాన్స్‌ల మధ్య ఒక ఒడంబడిక జరిగింది. ఇటలీ ఫ్రాన్స్‌లో తిరిగి స్నేహ సంబంధాలను నెలకొల్పుకొని జర్మన్ వ్యతిరేక పక్షంలో చేరింది.

1936 లో ఆస్ట్రియా జర్మనీల మధ్య ఒక ఒడంబడిక జరిగింది. ఈ సంధి ప్రకారం ఆస్ట్రియా సార్వభౌమాధికారాన్ని జర్మనీ గుర్తించింది. ఇరుపక్షాలు పరస్పరం ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేసుకోకుండా ఉండడానికి అంగీకరించాయి. ఆస్ట్రియా ఒక జర్మన్ రాజ్యంగా నిర్ణయమైంది. ఈ సంధి ఫలితంగా ఆస్ట్రియ దాదాపుగా జర్మనీ ఆధిపత్యంలోకి వచ్చిందని చెప్పవచ్చు. తన ఇథియోపియా ఆక్రమణకు జర్మనీ సహాయాన్ని పొందడం కోసం ముస్సోలినీ ఆస్ట్రో - జర్మన్ ఒడంబడికకు తన సమ్మతిని తెలియజేశాడు. ఈ సంధి జరిగిన తరవాత హిట్లర్ ఆస్ట్రియన్ నాజీలకు రహస్యంగా తోడ్పడమేగాక ఆస్ట్రియా ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేసుకోసాగినాడు. హిట్లర్ సలహాను పాటించి నాజీలు ఆస్ట్రియాలోని ముఖ్యనగరాలన్నింటిలో అలజడులు ప్రారంభించారు. ఆస్ట్రియా ప్రభుత్వం నాజీ ఉద్యమాన్ని కఠినంగా అణిచివేసి నాజీపార్టీని నిషేధించింది. దీనిని పురస్కరించుకొని హిట్లర్ ఆస్ట్రియా ఛాన్సలర్‌తో ఒక సమావేశం జరిపి ఈ కింది షరతులకు అంగీకరించవలసిందిగా వత్తిడి చేసినాడు. ఆస్ట్రియా ప్రభుత్వం నాజీ పార్టీని జాతీయపార్టీగా గుర్తించవలె. సెయిస్ - ఇన్‌క్వార్ట్‌ను ఆస్ట్రియా దేశ వ్యవహారాల మంత్రిగా నియమించవలె. నాజీలందరినీ విడుదలచేసి లోగడ బర్తరఫ్ చేసిన నాజీఉద్యోగులందరినీ తిరిగి ఉద్యోగాలలో చేర్చుకోవలే. దాదాపుగా ఈ షరతులన్నింటినీ ఆస్ట్రియా ప్రభుత్వం ఆమోదించింది.

ఆస్ట్రియా జర్మనీలో కలిసే అంశం మీద జనవాక్య సేకరణ జరగవలెనని ఆస్ట్రియా ఛాన్స్‌లర్ నిర్ణయించాడు. హిట్లర్ ఈ ప్రతిపాదనను పూర్తిగా వ్యతిరేకించడమేగాక జనవాక్య సేకరణకు వాయిదా వేయవలసిందిగా ఆస్ట్రియా ప్రభుత్వానికి ఒక అల్టిమేటమ్ పంపినాడు. ఆస్ట్రియా ప్రభుత్వం హిట్లర్ అల్టిమేటమ్‌కు తలఒగ్గింది. అయినప్పటికీ హిట్లర్ సంతృప్తి చెందక మరికొన్ని కొత్తషరతులను అంగీకరించవలసిందిగా ఆస్ట్రియా ప్రభుత్వాన్ని ఒత్తిడి చేసినాడు. సెయిస్-ఇన్‌క్వార్ట్‌ను ఆస్ట్రియా ఛాన్స్‌లర్‌గా నియమించవలసిందిగాను, ఆస్ట్రియా మంత్రివర్గంలో మూడింట రెండువంతుల స్థానాలను నాజీపార్టీకి కేటాయించ వలసిందిగాను, నాజీపార్టీమీద విధించిన నిషేధాలన్నింటినీ తొలగించవలసిందిగాను, హిట్లర్ ఆస్ట్రియా ప్రభుత్వాన్ని కోరినాడు. ఈ షరతులన్నింటికీ ఆస్ట్రియా ఆమోదించింది. సెయిస్-ఇన్‌క్వార్ట్‌ను ఛాన్స్‌లర్‌గా నియమించిన

వెంటనే 1938 మార్చి 11న ఆస్ట్రియాను ఆక్రమించుకోవలసిందిగా హిట్లర్ జర్మన్ సైన్యాలకు ఆదేశాలిచ్చినాడు. మార్చి 14న హిట్లర్ విజయవంతంగా వియన్నా నగరంలోని ప్రవేశించి, ఆస్ట్రియా పార్లమెంట్‌ను రద్దుచేసి కొత్త ఎన్నికలను ఏర్పాటు చేసినాడు. ఆస్ట్రియా అధిక సంఖ్యాకులు హిట్లర్‌ను బలపరిచినారు. ఈ విధంగా ఆస్ట్రియా జర్మనీలకలయిక పూర్తి అయి ఏడుమిలియనుల ఆస్ట్రియన్ ప్రజలు జర్మన్ సామ్రాజ్యంలో చేరారు.

ఆస్ట్రియాను ఆక్రమించుకొన్నందువల్ల జర్మనీ కొన్ని సదుపాయాలను పొందగలిగింది. ఇటలీ, హంగరీ, యుగోస్లేవియాలలో జర్మనీ ప్రత్యక్ష సంబంధాలు పెట్టుకోవడానికి వీలైంది. ఆగ్నేయ యూరప్‌లో జర్మనీ ఆర్థిక సైనిక అధికారాన్ని పొందగలిగింది. జర్మనీ సైనిక బలం పెంపొందింది. ఆస్ట్రియాలోని సహజ వనరులను ఉపయోగించుకొని జర్మనీ తన ఆర్థిక పరిస్థితిని మెరుగు పరచుకోగలిగింది.

ఆస్ట్రియా జర్మనీల కలయికవల్ల పశ్చిమరాజ్యాలు అనుసరిస్తున్న సోవియట్ వ్యతిరేక విధానానికి బలం చేకూరినట్లుగాను, స్వయం నిర్ణయ సిద్ధాంతం విజయం పొందినట్లుగాను ఇంగ్లాండ్ భావించింది. జర్మనీని బహిరంగంగా సమర్థించినప్పటికీ హిట్లర్ విజయాలవల్ల ముస్సోలిని ఆందోళన చెందినాడు. పోలండ్‌కూడా జర్మనీ విజయంవల్ల ఆందోళన చెందింది. హిట్లర్ దురాక్రమణ చర్యలవల్ల భీతిచెందిన సోవియట్ రష్యా జర్మనీ వ్యతిరేకంగా పశ్చిమ రాజ్యాలూ ఉమ్మడిగా పటిష్టమైన ఏర్పాట్లు చేయవలెనని సూచించింది. కాని రష్యా ప్రతిపాదనకు పశ్చిమ రాజ్యాల నుంచి ఏ విధమైన ప్రోత్సాహం లభించలేదు.

ఆస్ట్రియాను ఒక జయించిన భూభాగంగా పరిగణించి ఆస్ట్రియా ప్రజల జాతీయ భావాలకు లక్ష్యపెట్టకుండా ప్రవర్తించాడు. వియన్నా పరిపాలనను జర్మన్ పోలీసుల కప్పగించడం జరిగింది. ఆస్ట్రియా జాతీయ బాంక్ నాజీ ఉద్యోగుల అధీనంలో ఉంచడం జరిగింది. కొత్తప్రభుత్వాన్ని వ్యతిరేకించిన ఆస్ట్రియన్‌లను జైళ్ళకు పంపినారు.

ఆస్ట్రియాను ఆక్రమించు కొన్న తరువాత జర్మనీ చెకొస్లావాకియా పట్ల కఠినవైఖరిని అవలంబించడమేగాక బాల్కన్ ప్రాంతంలో తన పలుకుబడిన విస్తరింపజేసుకోగలిగింది.

**6.3.9 చెకొస్లావాకియా ఆక్రమణ :** మొదటి ప్రపంచ యుద్ధానంతరం శాంతి నిర్ణయాల ప్రకారం జాతీయతా సిద్ధాంతాన్ని అనుసరించి చెకొస్లావాకియా అనే కొత్త రాజ్యం బొహిమియా, మొరేవియా, సైలేషియాలోని కొంతభాగము, స్లవేకియా హంగరీలో కొంతభాగమూ కలిపి ఏర్పడింది. చెకొస్లావాకియాను పూర్తిగా నాశనం చేయడం హిట్లర్ విదేశాంగ విధానంలో ఒక ప్రధాన అంశం. ఆస్ట్రియాను ఆక్రమించుకొన్న తరువాత హిట్లర్ తన దృష్టిని చెకొస్లావాకియాపై మరల్చాడు. చెకొస్లావాకియాను ఆక్రమించుకోవడానికి హిట్లర్ జర్మన్ సైనికాధికారుల సహాయంతో 1937లో ఒక పథకాన్ని తయారు చేశాడు.

**6.3.9.1 చెకొస్లావాకియాను ఆక్రమించు కోవడానికి కారణాలు :**

1. చెకొస్లావాకియాలో జర్మన్ జాతివారు అల్పసంఖ్యాకులు. హిట్లర్ జర్మనీ నియంత తరువాత జర్మన్‌వారినందరినీ మూడో సామ్రాజ్యంలోకి తీసికొని రావలెనని సంకల్పించాడు.

2. చెకొస్లావాకియాలోని సుడెటెన్ జిల్లాలో సమారుగా నాలుగు మిలియన్ల జర్మన్ ప్రజల ఉన్నారు. వారి పరిస్థితి మెరుగుగా ఉన్నప్పటికీ వారు చెక్ జాతిపట్ల విరోధంగా ఉండేవారు.

3. జర్మనీలో నాజీ నియంతృత్వ మేర్పడిన తరువాత సుడెటెన్ జర్మన్‌లలో జాతీయభావం పెంపొంది విభజనోద్యమానికి దారితీసింది. హిట్లర్ సహాయ సహకారాలు పొందిన వీరు పూర్తి స్వయం పరిపాలనాధికారాన్ని కోరినారు.

4. ప్రజాస్వామ్య వ్యవస్థగల చెకొస్లావాకియా నానాజాతిసమితిని గట్టిగా బలపరచడమే గాక ఫ్రాన్స్ సోవియట్ రష్యాలకు మిత్రరాజ్యంగా వర్సెసంధి సవరణను కూడా వ్యతిరేకించింది.

5. పటిష్ఠమైన చెకొస్లొవాకియా సైన్యం జర్మనీకి ఆందోళన కలగ జేసింది.

6. యుద్ధ వ్యూహం దృష్ట్యా జర్మనీ కీలకమైన చెకొస్లొవాకియా మీద ఆధిపత్యం పొందదలచు కొన్నది. రష్యాపై దాడి చేయదలచినపుడు చెక్ భూభాగాలగుండా జర్మన్ సైన్యాలను నడిపించవచ్చు.

7. చెక్ పరిశ్రమలు, ముఖ్యంగా పిల్సన్‌లోని స్కోడా ఆయుధ కర్మాగారాలు జర్మనీకి బాగా ఉపయోగపడతాయి.

8. 30 లక్షల మంది జర్మన్‌లు ఉన్న సుడెటెన్‌లాండ్‌ను ఆక్రమిస్తే అంతపెద్ద దురాక్రమణ అని ప్రపంచం భావించదు.

9. దూరంగా ఉన్న కారణంగా బ్రిటన్, ఫ్రాన్స్‌లు చెక్‌కు సహాయం అందించలేవు.

10. రష్యన్ సైన్యం అంటే హిట్లర్‌కు చులకన భావం. అందువల్ల రష్యన్ భయం అతడికి లేదు.

### 6.3.9.2 చెకొస్లొవాకియా ఆక్రమణకు ప్రయత్నాలు :

ఆస్ట్రియాను ఆక్రమించుకొన్న తరువాత హిట్లర్ దృష్టి చెకొస్లొవాకియా వైపుమళ్ళింది. సుడెటెన్ జర్మన్‌లను అన్ని విధాలైన సహాయాన్ని అందజేయడమేగాక, హిట్లర్ వారిని దౌర్జన్యకాండకు పూనుకోవలసిందిగా కూడా ప్రేరేపించాడు. 1938 మార్చి నుండి జర్మన్ చెక్ సరిహద్దుల్లో సైన్య సమీకరణ చేసింది. చెక్ ప్రభుత్వం కూడా సైనిక సన్నాహాలు చేసింది. అయితే ఈ పరిస్థితులలో పశ్చిమ రాజ్యాలలో విరోధాన్ని తగ్గించుకోవలసిన అవసరాన్ని హిట్లర్ గ్రహించాడు. సుడెటన్ జర్మన్‌లు స్వయం పాలనను కోరడం న్యాయమని సమంజసమని హిట్లర్ పశ్చిమరాజ్యాలను ఒప్పించడానికి ప్రయత్నించాడు. సుడెటెన్ జర్మన్‌లకు పోలండ్, హంగరీల మద్దతులను కూడా హిట్లర్ సంపాదించ గలిగాడు. జర్మన్ వ్యతిరేక కూటమిని నివారించడానికి హిట్లర్ పశ్చిమ రాజ్యాలను రష్యాకు చేరువ కాకుండా చేసినాడు. చెక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా హిట్లర్ సుడెటెన్ జర్మన్‌లను రెచ్చగొట్టసాగినాడు. 1938 సెప్టెంబరు 27నాటికి హిట్లర్ చెకొస్లొవాకియాను పూర్తిగా నాశనం చేయడానికి కావలసిన సైనికి సన్నాహాలను కొనసాగించాడు.

### 6.3.9.3 బ్రిటన్ ఫ్రాన్స్‌ల జోక్యము :

సుడెటెన్ జర్మన్‌లు చెక్ ప్రభుత్వంమీద సాయుధ తిరుగుబాటు చేసినారు. సుడెటెన్ లాండ్ అనే పదాన్ని సృష్టించి, సుడెటెన్ లాండ్ ఉద్యమానికి నాయకత్వం వహించినాడు. కాన్‌రాడ్ హెన్లీక్. జర్మనీలో చెకొస్లొవాకియాకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయం తీవ్రరూపంలో వ్యక్తం చేయడం జరిగింది. బ్రిటిష్ ప్రధాని చాంబర్లేన్. హిట్లరును కలుసుకొని చెకొస్లొవాకియా సంక్షోభాన్ని శాంతియుతంగా పరిష్కరించవలెనని ప్రతి పాదించినాడు. సెడెటెన్ జర్మన్‌ల సమస్యను పరిష్కరించడానికి అవసరమైతే యుద్ధం చేయడానికి కూడా తాను వెనుకాడనని హిట్లర్ బ్రిటిష్ ప్రధానికి తెలియజేశాడు. సుడెటెన్ భూభాగాన్ని జర్మనీతో కలిపే సమస్యను బ్రిటన్ సానుభూతితో పరిశీలిస్తుందని బ్రిటిష్ ప్రధాని హిట్లర్‌ను సంతృప్తి పరచినాడు. ఈ విధంగా బ్రిటిష్ ప్రధాని హామీ ఇచ్చినప్పటికీ హిట్లర్ సైనిక సన్నాహాలు కొనసాగించాడు. తిరుగుబాటు చేసి స్వయం పాలనను కోరవలసిందిగా స్లొవక్‌లను హిట్లర్ ప్రేరేపించాడు. పోలండ్, హంగరీలు చెకొస్లొవియాలో కొన్ని భాగాలు కోరినాయి. ఈ పరిస్థితులలో బ్రిటన్, ఫ్రాన్స్‌లు సుడెటెన్ లాండ్‌ను జర్మనీకివ్వవలసిందిగా చెకొస్లొవాకియాకు సలహా ఇచ్చినారు. దీనికి చెక్ ప్రభుత్వము అంగీకరించింది. అయితే 1938 అక్టోబర్ మొదటి తేదీకి ముందుగానే సుడెటెన్‌లాండ్‌ను జర్మనీకి బదిలీ చేయవలసిందిగా హిట్లర్ పట్టుబట్టినాడు. సుడెటెన్‌లాండ్‌లో కొంత భాగం అక్టోబరు మొదటి తేదీకి ముందుగాను, మిగిలిన భాగం అక్టోబర్ పదోతేదీకి ముందుగాను జర్మనీకి బదిలీ చేయడం జరుగుతుందని బ్రిటన్ ఫ్రాన్స్‌లు హిట్లర్‌కు తెలియజేసినాయి. బ్రిటన్ ఫ్రాన్స్‌లు చేసిన ఈ ప్రతిపాదనను ముస్సోలినీ ప్రోద్బలం మీద హిట్లర్ అంగీకరించాడు. ఈ ప్రతిపాదనను అంగీకరించిన హిట్లర్ బ్రిటిష్ ప్రధాని చాంబర్లేన్, ఫ్రెంచి ప్రధాని డలడేర్‌ను మూనిచ్‌కు ఆహ్వానించినాడు.

### 6.3.9.4. మ్యూనిక్ ఒప్పందము (1938) :

1938 సెప్టెంబరు 29, 30 తేదీలలో చాంబర్లిన్, డలడేల్, హిట్లర్ ముస్సోలినీల మధ్య మ్యూనిక్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి చెక్ ప్రతినిధులను ఆహ్వానించలేదు. ఈ సమావేశంలో జరిగిన ఒప్పందం చెకొస్లొవాకియాకు మరణశాసనం వంటిది. మ్యూనిక్ ఒప్పందంలోని ముఖ్యాంశాలు :

1. సుడెటెన్‌లాండ్, జర్మన్‌లు అధిక సంఖ్యలో ఉన్న ఇతర చెక్ ప్రాంతాలు జర్మనీకి అప్పగించాలి.
2. ఆ ప్రాంతాల్లోన్ని అన్ని ఆస్తిపాస్తులు యథాతథంగా జర్మనీకి చెందుతాయి.
3. చెక్ జైళ్ళలో ఉన్న జర్మన్‌లందర్నీ వెంటనే విడుదల చేయాలి.
4. చెకొస్లొవాకియాలోని హంగేరియన్, పోలిష్ అల్ప సంఖ్యాకుల సమస్య పరిష్కరమైన తరవాతనే చెకొస్లొవాకియా సరిహద్దులను జర్మనీ, ఇటలీలు గుర్తిస్తాయి.

తన భద్రత విషయమై అంతర్జాతీయ హామికి బ్రిటన్, ఫ్రాన్స్‌లు బాధ్యత వహించినందువల్ల చెకొస్లొవాకియా మ్యూనిక్ ఒప్పందానికి సమ్మతించింది.

### 6.3.9.5. మ్యూనిక్ ఒప్పంద ఫలితాలు :

బ్రిటన్, ఫ్రాన్స్‌లు జర్మనీ పట్ల అనుసరించిన సంతృప్తి పరిచే విధానానికి మ్యూనిక్ ఒప్పందం ఒక ప్రబల నిదర్శనం. యుద్ధాన్ని వాయిదా వేయడానికి ఈ విధానం అనుసరించక తప్పదని సంతృప్తిపరిచే విధానాన్ని సమర్థించేవారు వాదించారు. ఒకవేళ యుద్ధం అనివార్యమైతే ఈ విధానం వల్ల పశ్చిమ రాజ్యాలకు యుద్ధ సన్నాహాలు చేసుకోవడానికి కావలసిన సమయం దొరుకుతుందని కూడా ఈ విధానాన్ని సమర్థించేవారు వాదించారు.

కాని నిజానికి పశ్చిమ రాజ్యాలు అనుసరించిన సంతృప్తిపరిచేవిధానము హిట్లర్, ముస్సోలినీల దురాక్రమణ చర్యలకు దోహదం చేసింది. అంతేగాక కొమిన్‌టర్న్ వ్యతిరేక ఒడంబడికను తయారు చేసిన జర్మనీ కమ్యూనిజంను నిరోధిస్తుంది. కాబట్టి జర్మనీని సంతృప్తిపరచవలసిన అవసరముందని కూడా పశ్చిమ రాజ్యాలు భావించాయి.

మ్యూనిక్ ఒడంబడికను పురస్కరించుకొని జర్మన్ సైన్యాలు అక్టోబర్ ఒకటిన సుడెటెన్‌లాండ్‌లోకి ప్రవేశించాయి. ఈ ఒడంబడిక ప్రకారం జరగవలసిన జనవాక్య సేకరణను పాటించడం జరగలేదు. ఈ ఒప్పందం ఫలితంగా చెకొస్లొవాకియా 11 వేల చదరపు మైళ్ళ భూభాగాన్ని, కీలకమైన సైనిక స్థావరాలను, పారిశ్రామిక ప్రాంతాలను పోగొట్టుకొన్నది. రష్యా చెకొస్లొవాకియాల మధ్య గల ఒడంబడిక రద్దయింది. టెన్‌కెన్ అనే చెక్ ప్రాంతం పోలండ్‌కివ్వడం జరిగింది.

ఐదు రాజ్యాల సంఘం తన బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమైనందువల్ల చెకొస్లొవాకియా కిచ్చిన అంతర్జాతీయ హామి అర్థరహితమైందని చెప్పవచ్చు. ఈ ఒప్పందం జరిగిన తరవాత హిట్లర్ బలప్రయోగం ద్వారా చెకొస్లొవాకియాను ఆక్రమించుకోవలెననే దృఢనిశ్చయానికి వచ్చినాడు.

1938 నాటికి నానాజాతి సమితి దాదాపుగా రద్దయింది. పశ్చిమ రాజ్యాలు నాజీ జర్మనీ దురాక్రమణను ఎదుర్కొనడానికి సిద్ధంగాలేవు. సోవియట్ రష్యా ఒంటరిదై పోయింది. ఫ్రాన్స్, చెకొస్లొవాకియాలతో మైత్రి సంబంధాలున్నా సోవియట్ రష్యాను మ్యూనిక్ సమావేశానికి ఆహ్వానించడం జరగలేదు.

మ్యూనిక్ ఒడంబడికను బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీలు తనకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసినట్లు రష్యా భావించింది. జర్మన్ దురాక్రమణను అరికట్టడానికి సమిష్టి ఏర్పాట్లు చేయవలెనని రష్యా చేసిన ప్రతిపాదనను పశ్చిమ రాజ్యాలు తిరస్కరించినందువల్ల జర్మనీ పశ్చిమ రాజ్యాల వైఖరిని అవకాశంగా తీసుకొని తన మీద దురాక్రమణ జరుగుతుందని కూడా రష్యా భావించింది. కాబట్టి పశ్చిమ రాజ్యాల పట్ల రష్యాకు అనుమానం కలగడానికి మ్యూనిక్ ఒడంబడిక తోడ్పడింది.

జర్మనీ ఆస్ట్రియాను ఆక్రమించుకోవడం చెకొస్లొవాకియా వినాశనానికి దారితీసినట్లు, మ్యూనిక్ ఒడంబడిక పోలాండ్ వినాశనానికి దారి తీసిందని చెప్పవచ్చు. అంతేగాక మ్యూనిక్ ఒడంబడిక ఫలితంగా హిట్లర్, ముస్సోలినీల రాజ్యవిస్తరణ కాంక్ష అధికం కావడమేగాక వారి దురాక్రమణ వైఖరి కూడా మరింత బలపడింది.

ఈ విధంగా యూరప్‌లో రాజ్యతుల్య ప్రాబల్య స్థితి తారుమారైంది. సుడెటెన్‌లాండ్‌ను పొందిన తరవాత జర్మనీకి ఏ మాత్రం రాజ్యవిస్తరణ కాంక్ష లేదని హిట్లర్ మ్యూనిక్‌లో బ్రిటిష్ ప్రధానికి హామీ ఇచ్చినాడు. కాని కొద్దికాలం తరవాత తన వాగ్దానానికి వ్యతిరేకంగా హిట్లర్ చెకొస్లావాకియాను ఆక్రమించుకొన్నాడు. కాబట్టి మ్యూనిక్ ఒప్పందం వల్ల బ్రిటన్ ప్రతిష్ఠ బాగా దెబ్బతిన్నది.

చర్చిల్ మాటలలో, "అగౌరవము, యుద్ధము అనే రెండింటిలో ఒక దానిని బ్రిటన్, ఫ్రాన్స్‌లు మ్యూనిక్ సమావేశంలో కోరుకోవలసివచ్చింది. వారు అగౌరవాన్ని కోరుకొన్నారు. కనుక యుద్ధం తప్పలేదు".

**6.3.9.6. చెకొస్లావాకియా మీద దాడి :**

మ్యూనిక్ ఒప్పందం తరవాత హిట్లర్ తన దౌత్యచతురతతో ఫ్రాన్స్‌ను ఇంగ్లాండ్ నుంచి వేరుచేసినాడు. ఫ్రాన్స్ జర్మనీల మధ్య జరిగిన ఒక ఒడంబడిక ప్రకారం రెండు దేశాలు పరస్పర తమ సరిహద్దులను ఉల్లంఘించకుండా కాపాడుకోవడానికి అంగీకరించాయి. ఆల్సేస్ - లొరెయిన్‌ల మీద జర్మనీ తన హక్కులను వదులుకొన్నది. తరవాత హిట్లర్ ఇటలీ జర్మనీల మధ్య సన్నిహిత సంబంధాలు ఏర్పాటు చేసినాడు. ఈ విధంగా ముందు జాగ్రత్త చర్యలు తీసుకొన్న తరువాత స్లొవాకియాను చెకొస్లావాకియా నుంచి వేరు చేయడానికి పథకం వేసినాడు.

హిట్లర్ ప్రోత్సాహంతో ఇంతవరకు స్వయం పాలనను అనుభవిస్తున్న స్లొవాకియా తనకు సంపూర్ణ స్వాతంత్ర్యం కావలెనని అలజడి లేవదీసింది. హిట్లర్ సలహాను పాటించి చెక్ అధ్యక్షుడు హకాస్లొవాక్ ప్రధాన మంత్రి టిసోను తొలగించి, చెకొస్లావాకియా స్వాతంత్ర్యోద్యమ నాయకులను నిర్బంధించి దేశంలో సైనిక శాసనాన్ని అమలు చేసినాడు.

1939 మార్చిలో హిట్లర్ స్లొవాకియా నాయకులను బెర్లిన్‌కు రప్పించి స్లొవాకియా స్వాతంత్ర్యాన్ని ప్రకటించవలసిందిగా సలహా ఇచ్చి వారికి జర్మనీ రక్షణ ఉంటుందని హామీ ఇచ్చినాడు. 1939 మార్చి 14వ స్లొవాకియా స్వాతంత్ర్యం పొందినట్లుగా ప్రకటించడం జరిగింది. తరవాత జర్మన్ సైన్యాలు త్వరితగతిని మొరవస్కా, ఓస్ట్రావా, విట్‌కవిస్‌లను ఆక్రమించుకొన్నాయి. ఈ పరిస్థితులలో చెక్ అధ్యక్షుడు హకా బెర్లిన్‌లో హిట్లర్‌ను కలుసుకొన్నాడు. హిట్లర్ బలవంతం మీద హకా ఒక సంధి మీద సంతకం చేసినాడు. ఈ సంధి ప్రకారం చెకొస్లావాకియాను జర్మనీ రక్షణాధికారంలో ఉంచడం జరిగింది.

ఈ విధంగా చెకొస్లావాకియా మీద జర్మనీ చేసిన దురాక్రమణను చెక్ అధ్యక్షుడు ఆమోదించవలసి వచ్చింది. అంతేగాక స్లొవాకియా మీద కూడా జర్మన్ ఆధిపత్యాన్ని నెలకొల్పడం జరిగింది. ఈ లోపల జర్మన్ సైన్యాలు చెక్ రాజధాని ప్రాగ్‌ను ఆక్రమించుకొన్నాయి. ఫలితంగా స్వతంత్ర్య చెకొస్లావాకియా అంతమైపోయి జర్మనీలో విలీనమయింది.

చెకొస్లావాకియాను నాశనం చేయడానికి జర్మనీకి చేసిన యత్నాలు వమ్ము చేయడానికి పశ్చిమ రాజ్యాలు ధైర్యంగా జోక్యం చేసుకోలేదు. చెక్ ప్రాదేశిక సమగ్రతకు, భద్రతకు అంతర్జాతీయ హామి ఇచ్చినందువల్ల చెక్ ప్రభుత్వం పశ్చిమ రాజ్యాల సలహాను పాటించి సెడెటెన్‌లాండ్‌ను జర్మనీకి అప్పగించింది. అయితే స్లొవాకియా స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకోవడం, జర్మనీ చెక్ మీద దాడి జరపడం జరిగినప్పటికీ పశ్చిమ రాజ్యాలు తటస్థంగా ఉండిపోయినాయి. ఫలితంగా చెక్ నాజీల చేతుల్లో బలైంది.

**6.3.9.7. చెకొస్లావాకియా మీద దాడి ఫలితాలు :**

1. చెకొస్లావాకియా మీద జర్మనీ దురాక్రమణ జరిపిన ఫలితంగా మధ్య యూరప్‌లోని ఒక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యం అంతమైంది.
2. చెకొస్లావాకియాలో లభ్యమయ్యే సహజ సంపదను ఉపయోగించుకొని జర్మనీ తన యుద్ధ బలాన్ని పెంపొందించుకొన్నది.
3. స్వయం నిర్ణయ సిద్ధాంతం ప్రకారం జర్మనీ సరిహద్దుల్లో నివసించే జర్మనీ జాతి ప్రజలు జర్మనీతో విలీనం కావలెనని కోరిన జర్మనీ చెకొస్లావాకియాను ఆక్రమించడంతో జర్మనీ రాజ్య కాంక్ష బయటపడింది.
4. చెకొస్లావాకియాను ఆక్రమించడాన్ని అనేక యూరప్ రాజ్యాలు పూర్తిగా వ్యతిరేకించాయి.

5. ప్రజాభీష్టాన్ని తెలుసుకోకుండా దేశ స్వాతంత్ర్యాన్ని త్యాగం చేయడానికి రాజ్యాధినేతకు కూడా అధికారం లేదని సోవియట్ రష్యా తన ఆక్షేపణను వ్యక్తం చేసింది.

6. చెకోస్లొవాకియా మీద జర్మనీ దురాక్రమణ ఫలితంగా ఇంతవరకు జర్మనీ పట్ల సంతృప్తి పరిచేవిధానాన్ని అనుసరిస్తున్న బ్రిటన్‌కు తన విధానాన్ని మార్చుకోవలసిన అగత్యము ఏర్పడినట్లు గుర్తించింది.

7. మొదటి ప్రపంచ యుద్ధం తరవాత బ్రిటన్ అనుసరించిన విధానము పెద్దగా దెబ్బతిన్నది. బ్రిటిష్ ప్రధాని హిట్లర్‌ను మోసగాడనీ, దురాక్రమణ దారుడని విమర్శించాడు.

8. జర్మన్ దురాక్రమణకు వ్యతిరేకంగా పటిష్టమైన చర్యలు తీసుకోవలసిందని చర్చిల్ నాయకత్వంలోని బ్రిటిష్ కన్సర్వేటివ్ పార్టీ ప్రభుత్వాన్ని కోరింది. జర్మన్ దురాక్రమణను అరికట్టడానికి ఫ్రాన్స్, పోలండ్, రష్యాలతో కలిసి సంయుక్త చర్యలు తీసుకోవడానికి ఛాంబర్లేన్ అంగీకరించాడు.

9. హిట్లర్ దురాక్రమణ విధానాల వల్ల భీతిచెందినప్పటికీ ముస్సోలినీ ధైర్యంగా ఆల్బేనియా మీద దురాక్రమణకు పూనుకొన్నాడు.

**6.3.10. పోలండ్ మీద జర్మనీ దాడి :**

చెకోస్లొవాకియా మీద దాడి జరుగుతున్న కాలంలోనే నాజీ నియంత హిట్లర్ పోలండ్ మీద దండయాత్రకు కూడా సన్నాహాలు ప్రారంభించాడు. పోలండ్ పై దృష్టి సారించడానికి చాలా కారణాలున్నాయి.

**6.3.10.1. పోలండ్ మీద హిట్లర్ దాడికి కారణాలు :**

1. పోలండ్ మీదుగా రష్యన్ సరిహద్దుకు, రుమేనియన్ చమురు నిక్షేపాలకు నాజీ సైనికులను తరలించవచ్చు.
2. యుద్ధ కాలంలో పోలిష్ వ్యవసాయ ఉత్పత్తులు జర్మనీకి చాలా అవసరం.
3. పోలండ్‌లో జర్మన్‌లు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు.
4. జర్మన్ ప్రధాన భూభాగం, తూర్పు ప్రష్యాల మధ్య పోలండ్ అడ్డంగా ఉన్నది.
5. బ్రిటన్, ఫ్రాన్స్‌లకు పోలండ్ భౌగోళంగా దూరం.
6. పోలిష్ సహజ వనరులే కాకుండా, సాలుకు రెండు మిలియన్ టన్నులు ఉత్పత్తి చేస్తున్న పోలిష్ కర్మాగారాలు హిట్లర్‌ను ఆకర్షించాయి.

**6.3.10.2. జర్మనీ పోలండ్‌ల మధ్య దురాక్రమణ వ్యతిరేక ఒప్పందము :**

డాన్‌జిగ్ పట్టణము, పోలిష్ కారిడార్‌ల మీద ఆధిపత్యం కోసం పోలండ్ జర్మనీలు పోటీపడుతున్న కారణంగా రెండు దేశాల మధ్య విరోధము ఏర్పడింది. అయినప్పటికీ పోలండ్‌లో సత్సంబంధాలు నెలకొల్పుకోవడం కోసం హిట్లర్ 1934 లో పోలండ్‌లో పది సంవత్సరాలు అమలులో ఉండే దురాక్రమణ వ్యతిరేక ఒప్పందం చేసుకొన్నాడు. జర్మనీ శాంతిని కాంక్షించే దేశమనే అభిప్రాయాన్ని ఇతర దేశాలకు కలగ జేయడం కోసం హిట్లర్ పోలండ్‌తో ఈ ఒడంబడిక చేసుకొన్నాడు. అంతేగాక పోలండ్‌ను ఫ్రెంచి పలుకుబడికి లోను కాకుండా నివారించడానికి కూడా హిట్లర్ ఈ ఒడంబడికను చేసుకొన్నాడు. దీనికి తోడు రష్యాను వ్యతిరేకంగా పోలండ్ సహకారము జర్మనీకి అవసరమైంది. చెకోస్లొవాకియా సంక్షోభము పరిష్కారమైన తరవాత జర్మనీకి మరే విధమైన అంతర్జాతీయ సమస్యలేదని బ్రిటిష్ ప్రధాని ఛాంబర్లేన్‌కు హిట్లర్ నచ్చచెప్పినాడు.

**6.3.10.3. పోలండ్ మీద జర్మనీ దురాక్రమణ చర్యలు :**

1. డాన్‌జిగ్‌ను జర్మనీతో కలపడానికి, తూర్పు ప్రష్యాను జర్మనీతో కలపడానికి కావలసిన అదనపు భూభాగాన్ని ఇవ్వడానికి, సమ్మతించవలసిందిగా జర్మనీ పోలండ్‌ను కోరింది. దీనికి ప్రతిఫలంగా జర్మనీ పోలండ్‌లకు మధ్య లోగడ జరిగిన ఒడంబడికను 25 సంవత్సరాల కాలం వరకు అమలులో ఉండేవిధంగా మార్చడానికి జర్మనీ అంగీకరించింది.

దీనికి జవాబుగా పోలండ్ ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు చేసింది. స్వేచ్ఛా నగరమైన డాన్‌జిగ్ భద్రతకు పోలండ్ జర్మనీలు సంయుక్తంగా బాధ్యత వహించవలె. తూర్పు ప్రష్యాను జర్మనీలో కలిపే ప్రతిపాదనను పునఃపరిశీలించవలె. పోలండ్ చేసిన ఈ ప్రతిపాదనలు హిట్లర్‌కు నచ్చలేదు. అందువల్ల హిట్లర్ పోలండ్ పట్ల తన వైఖరిని మార్చుకొన్నాడు.

ఈ పరిస్థితులలో బ్రిటిష్ ప్రధాని జర్మనీ పట్ల కఠినంగా వ్యవహరించదలచినాడు. 1938 మార్చిలో బ్రిటన్ ఫ్రాన్స్‌లు పోలండ్ భద్రతకు హామి ఇచ్చినాయి. దీనితో ఆగ్రహించిన హిట్లర్ పోలండ్ మీద దాడిని సెప్టెంబర్ ఒకటో తేదీన నిర్ణయించాడు. జర్మనీ దురాక్రమణకు వ్యతిరేకంగా పరస్పరం సహాయం చేసుకోవడానికి బ్రిటన్ పోలండ్‌లు అంగీకరించినాయి. దీనికి సమాధానంగా హిట్లర్ ఆంగ్లో - జర్మనేకా ఒడంబడిక రద్దయినట్లు ప్రకటించినాడు.

2. డాన్‌జిగ్‌లోని నాజీలను పోలిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెచ్చగొట్టి, వారికి ఆయుధసహాయాన్ని అందజేశాడు. పోలండ్ మీద హిట్లర్ దాడికి చేసిన సన్నాహాలలో ఇది మొదటి భాగమని చెప్పవచ్చు.

3. పోలండ్‌ను పశ్చిమ రాజ్యాల నుంచి వేరుచేసి, పోలండ్‌కు వ్యతిరేకంగా రష్యాతో ఒక ఒడంబడిక చేసుకోవడం హిట్లర్ పోలండ్ మీద దాడికి చేసిన సన్నాహాలలో రెండో భాగం.

4. ముస్సోలినీతో ఒక సైనిక ఒప్పందం చేసుకొని పోలండ్‌కు వ్యతిరేకంగా ఇటలీ సహాయాన్ని పొందడం హిట్లర్ చేసిన సన్నాహాలలో మూడో భాగము.

5. పోలండ్‌ను ఒంటరి దేశాన్ని చేయడం కోసం హిట్లర్ హంగరీ, ఇస్టోనియా, లాట్వియా, లిథువేనియాలలో దురాక్రమణ వ్యతిరేక ఒడంబడికలు చేసుకొన్నాడు.

**6.3.10.4. రష్యా, జర్మనీల మధ్య దురాక్రమణ వ్యతిరేక ఒప్పందము :**

రష్యాతో ఒక దురాక్రమణ వ్యతిరేక ఒడంబడిక చేసుకొని పోలండ్‌ను రక్షించడానికి పశ్చిమ రాజ్యాలు చేసే ప్రయత్నాలను వమ్ముచేయడానికి హిట్లర్ నిశ్చయించుకొన్నాడు. రష్యాతో ఒడంబడిక చేసుకొన్నట్టయితే బ్రిటన్ ఫ్రాన్స్‌లు పోలండ్‌ను కాపాడటం అసంభవమని హిట్లర్ భావించాడు. అయితే పశ్చిమరాజ్యాలు కూడా అదే కాలంలో రష్యాతో ఒడంబడిక చేసుకోవడానికి ఆసక్తిచూపాయి. హిట్లర్ కమ్యూనిస్ట్ వ్యతిరేక వైఖరి, స్టాలిన్ నాజీ వ్యతిరేక వైఖరి రెండు దేశాల మధ్య స్నేహ సంబంధాల స్థాపనకు అవరోధమైనాయి. అయినప్పటికీ జర్మనీ రష్యాలు ఒక ఒడంబడిక చేసుకోవడానికి సిద్ధపడ్డాయి. పశ్చిమ రాజ్యాలతోను, సోవియట్ రష్యాతోనూ రెండు రంగాలలో ఏక కాలంలో యుద్ధం చేయడం జర్మనీకి కష్టమవుతుంది. జర్మనీ విదేశ వ్యవహారాల శాఖలో పని చేసే కొంతమంది ఉన్నత ఉద్యోగులు జర్మనీ రష్యాల మధ్య మైత్రి సంబంధాల స్థాపనకు అనుకూలంగా ఉన్నారు. రష్యన్ ముడి పదార్థాలు తన నాల్గు సంవత్సరాల ప్రణాళిక విజయానికి అత్యవసరమని జర్మనీ భావించింది. పశ్చిమ రాజ్యాల సహాయ నిరాకరణ వైఖరి వల్ల విసిగి వేసారిపోయిన రష్యా కూడా జర్మనీతో ఒడంబడిక చేసుకోవడానికి సిద్ధపడింది.

రెండు దేశాల మధ్య 1939 జూలై 25 సంప్రదింపులు ప్రారంభమైనాయి. 1929 ఆగష్టు 24న రష్యా జర్మనీల మధ్య దురాక్రమణ వ్యతిరేక ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం.

1. రెండు దేశాలు పరస్పర దురాక్రమణ చర్యలను అరికట్టడానికి అంగీకరించాయి.

2. ఇరుపక్షాలలో ఒకరిమీద ఏదైనా మూడో పక్షం దురాక్రమణ జరిపినట్టయితే రెండో వారు దురాక్రమణ జరిపిన వారికి ఏ విధమైన సహాయం చేయకూడదు.

3. ఇరుపక్షాలు తమ మధ్యగల సమస్యలను పరస్పర సంప్రదింపుల ద్వారా శాంతియుతంగా పరిష్కరించుకోవడానికి అంగీకరించాయి.

4. ఇద్దరి శ్రేయస్సుకు భంగం కలిగించే ఏ విధమైన ఒడంబడికలలోను పాల్గొన కుండా ఉండటానికి ఇరుపక్షాలు అంగీకరించాయి.

8)

5. ఈ ఒప్పందం పది సంవత్సరాల కాలం అమలులో ఉంటుంది.

ఈ ఒప్పందానికి తోడు రెండు దేశాలు మరొక ముఖ్యమైన ఒడంబడిక మీద సంతకాలు చేసినాయి. దీని ప్రకారం :

1. తూర్పు యూరప్‌లోని ఫిన్‌లాండ్, ఇస్టోనియా, లాట్వియాలు రష్యా పలుకుబడిగల ప్రాంతాలుగాను, అథువేనియా, విల్నాలు జర్మనీ పలుకుబడి గల ప్రాంతాలుగాను విభజితమైనాయి.

2. పోలండ్‌లోని నరేవ్, విస్ట్యులా, సాన్‌నదులు జర్మనీ రష్యాలు మధ్య సరిహద్దులుగా నిర్ణయించడం జరిగింది.

3. బెస్సరేబియా, రుమేనియాలను రష్యా పలుకుబడి గల భాగాలుగా గుర్తించడం జరిగింది.

ఈ విధంగా హిట్లర్ రష్యాతో ఒడంబడికలు చేసుకోవడం ద్వారా పోలండ్ మీదికి దాడికి తన సన్నాహాలు పూర్తిచేసి, ఆగస్టు 26న పోలండ్ మీద దండయాత్ర జరిపే రోజు గాని నిర్ణయించాడు.

### 6.3.10.5 రష్యా జర్మనీల మధ్య జరిగిన దురాక్రమణ వ్యతిరేక సంధి ప్రాముఖ్యం :

1. ఈ ఒడంబడిక హిట్లర్ దౌత్య విజయానికి దోహదం చేసింది. బ్రిటన్, ఫ్రాన్స్‌ల అవాస్తవిక విధానాన్ని వ్యక్తం చేసింది.
2. ఈ ఒడంబడిక హిట్లర్ సైనిక నైపుణ్యాన్ని దూర దృష్టినీ బహిరంగ పరచింది. పోలండ్ ఆక్రమణకు అడ్డురాగలిగిన రష్యాను హిట్లర్ చాకచక్యంగా తటస్థంగా ఉండేటట్లు చేసినాడు. అందువల్ల జర్మనీ పోలండ్‌ను ఆక్రమించుకోవడం సులభమైంది. బ్రిటన్ ఫ్రాన్స్‌లు దూర దృష్టితో వ్యవహరించి రష్యాతో సంధి చేసుకొన్నట్లయితే పోలండ్‌ను ఆక్రమించుకోవడం హిట్లర్‌కు సాధ్యమయ్యేది కాదు.
3. ఈ ఒడంబడిక నిస్సందేహంగా హిట్లర్ దురాక్రమణ విధానానికి ప్రోత్సాహాన్ని కలగజేసింది.
4. ఈ ఒడంబడిక సోవియట్ రష్యాకు కూడా ముఖ్యమైనదే. ఇటలీ, జర్మన్‌లు నెలకొల్పిన కొమిన్‌టర్న్ వ్యతిరేక ఒడంబడికను బ్రిటన్, ఫ్రాన్స్‌లు తమ నైతిక మద్దతును, బ్రిటన్ ఫ్రాన్స్‌లను కమ్యూనిజం పట్ల ద్వేషాన్ని చూపడం వల్లను, రష్యా బ్రిటన్ ఫ్రాన్స్‌లను మనఃపూర్వకంగా నమ్మలేదు. జర్మనీతో మ్యూనిక్ ఒప్పందం చేసుకోవడం ద్వారా బ్రిటన్ ఫ్రాన్స్‌లు పరోక్షంగా జర్మనీ దురాక్రమణ విధానాన్ని, రాజ్య విస్తరణ కాంక్షనూ సమర్థిస్తున్నట్లుగా రష్యా భావించింది. కాబట్టి రష్యా తన రక్షణ కోసం గత్యంతరం లేక జర్మనీతో ఒడంబడిక చేసుకోవలసి వచ్చింది.

5. ఈ ఒడంబడికలోని రహస్య నిబంధనల ప్రకారం రష్యా జర్మనీలు తూర్పు యూరప్‌ను తమ పలుకుబడిగల రెండు భాగాలుగా విభజించుకొన్నాయి. మరొక విధంగా చెప్పాలంటే రష్యా జర్మనీల సామ్రాజ్య విస్తరణ కాంక్షను ఈ సంధి వ్యక్తం చేసింది.

6. ఈ ఒడంబడిక జర్మన్ సైనికీకరణకు ఉన్న అవరోధాన్ని తొలగించి తద్వారా రెండో ప్రపంచ యుద్ధాన్ని అనివార్యం చేసింది

7. ఈ ఒడంబడిక పోలండ్‌కు మరణ శిక్ష వంటిదని, చాలాకాలం నుంచీ నాజీ వ్యతిరేకులమని చెప్తూ వచ్చిన సోవియట్ రష్యా, జర్మనీకి లొంగిపోయిందని కొందరు వ్యాఖ్యానించారు.

8. నిజమైన వ్యతిరేక నాజీ వ్యతిరేక కూటమి ఏర్పరుద్దామని సోవియట్ రష్యా మొదటి నుంచి ప్రతిపాదిస్తూవచ్చింది. కాని బ్రిటన్, ఫ్రాన్స్‌లు ఈ ప్రతిపాదనను తిరస్కరిస్తూవచ్చాయి. వాస్తవానికి నాజీ, ఫాసిస్ట్‌లకు లొంగిపోతూ వస్తున్నది. బ్రిటన్ ఫ్రాన్స్‌లు. నాజీలపై దెబ్బతీయడానికి సరైన అవకాశం కోసం ఎదురుచూస్తూ, ప్రస్తుతానికి జర్మనీతో నిర్యుద్ధ ఒడంబడిక రష్యా చేసుకొందని మరికొందరు వ్యాఖ్యానించారు.

### 6.3.10.6 రష్యా జర్మనీల మధ్య ఒడంబడికకు బ్రిటన్ ఫ్రాన్స్‌ల బాధ్యత :

జర్మనీ దురాక్రమణ బారినుంచి కాపాడేటందుకు బ్రిటన్ ఫ్రాన్స్‌లు యూరప్ రాజ్యాలన్నింటి భద్రతకు హామీ ఇవ్వవలెనని సోవియట్ రష్యా ఒక ప్రతిపాదన చేసింది. కాని ఈ బాధ్యతను స్వీకరించడానికి బ్రిటన్, ఫ్రాన్స్‌లు అంగీకరించలేదు.

అంతేగాక బ్రిటన్, ఫ్రాన్స్, రష్యాల నాయకత్వంలో యూరప్ దేశాలన్నింటి రక్షణ కోసం ప్రతిపాదించిన సమిష్టి భద్రతా పథకాన్ని పోలండ్, బాల్టిక్ రాజ్యాలు పూర్తిగా వ్యతిరేకించాయి. అందువల్ల కొంత వరకు పోలండ్, బాల్టిక్ రాజ్యాల వైఖరి కారణంగా బ్రిటన్, ఫ్రాన్స్‌లు యూరప్ దేశాలన్నింటి భద్రతకు హామీ ఇవ్వడానికి వెనుకాడినాయి.

అయినప్పటికీ రష్యా జర్మనీల మధ్య దురాక్రమణ వ్యతిరేక ఒడంబడిక జరగడానికి బ్రిటన్, ఫ్రాన్స్‌లు బాధ్యత వహించకతప్పదు. 1939 జూలైలో బ్రిటన్, ఫ్రాన్స్‌లు రష్యాతో ఒక రక్షణ ఒడంబడిక చేసుకోవడానికి సంబంధించిన విషయాలను సంప్రదించడానికి తమ ప్రతినిధి వర్గాన్ని రష్యాకు పంపినాయి. కాని సంప్రదింపుల కోసం పంపిన తమ ప్రతినిథులకు రష్యాతోసంధిమీద సంతకాలు చేసే అధికారాన్ని బ్రిటన్, ఫ్రాన్స్‌లు ఇవ్వలేదు. ఈ కారణంగా ఇరుపక్షాల మధ్య సంప్రదింపులలో ప్రతిష్టంభన రావడమే గాక బ్రిటన్ ఫ్రాన్స్‌ల చిత్తశుద్ధిని కూడా రష్యా శంకించింది. బ్రిటన్ ఫ్రాన్స్‌ల వైఖరి వల్ల ఆందోళన చెందిన రష్యా 1939 ఆగష్టులో జర్మనీతో సంధి చేసుకొన్నది.

షూమన్ చెప్పినట్లుగా బ్రిటన్ ఫ్రాన్స్ సోవియట్ రష్యాల మధ్య సంప్రదింపులు విఫలమైన ఫలితంగా రష్యా జర్మనీల మధ్య ఒడంబడికకు తేలికైంది. రష్యా జర్మనీల మధ్య జరిగిన ఒడంబడిక వల్ల బ్రిటన్ ఫ్రాన్స్‌లు పెద్దగా దెబ్బతిన్నాయి. ఈ ఒడంబడికల వల్ల ఏ విధమైన నాజీ వ్యతిరేక ఒడంబడికలోను రష్యా చేరదనే విషయం తేలిపోయింది. అంతేగాక సోవియట్ రష్యా ఒక వైపు బ్రిటన్, ఫ్రాన్స్‌లతోను, మరొక వైపు జర్మనీతోను సంప్రదింపులు జరుపుతూనే మొత్తం మీద తమకు మోసం చేసిందని బ్రిటన్, ఫ్రాన్స్‌లు అభిప్రాయపడినాయి. సోవియట్ రష్యా తమను మోసం చేసిందని బ్రిటన్ ఫ్రాన్స్‌లు రష్యా మీద ఆరోపణలు చేసినాయి. ఈ ఒడంబడిక వల్ల రష్యా సామ్రాజ్య విస్తరణ కాంక్ష కూడా బయటపడిందని బ్రిటన్ ఫ్రాన్స్‌లు భావించినాయి.

**6.3.10.7. పోలండ్ పై జర్మనీ దాడిని ఎదుర్కోవడానికి బ్రిటన్ ప్రయత్నాలు :**

1939 మార్చిలో మెమెల్‌ను జర్మనీ, ఏప్రిల్‌లో ఇటాలియన్‌లు ఆల్బేనియాను ఆక్రమించారు. ఈ రెండు దురాక్రమణలు యూరప్‌లో ఆగ్రహావేశాలు రేకెత్తించింది. దీంతో బ్రిటన్, ఫ్రాన్స్‌లు ఏదో విధంగా హిట్లర్, ముస్సోలినిని తృప్తిపరచాలనే విధానానికి స్వస్తి చెప్పారు. 1939 లో బ్రిటిష్ ప్రధాని ఛాంబర్లేన్ బర్మింగ్‌హామ్‌లో మాట్లాడుతూ ఇక జర్మనీ హామీలను వాగ్దానాలను నమ్మే రోజులు గతించాయని ప్రకటించాడు. బలప్రయోగం ద్వారా ప్రపంచాధిక్యతను సాధించాలనుకొన్న వారిని ప్రతిఘటించాల్సిన సమయం వచ్చిందని మరో రెండు వారాల తర్వాత అతడు కామన్స్ సభలో స్పష్టంగా చెప్పాడు. యుద్ధం అని వార్యమనే భావం బ్రిటన్‌లో సర్వత్రా వ్యాపించింది. ఒక వైపు అక్షరాజ్యాల వ్యతిరేక సంఘటనను ఏర్పరచడానికి ప్రయత్నాలు ప్రారంభమైనాయి. మరో వైపు ఆయుధాల సేకరణ ప్రారంభించారు. నాజీ, ఫాసిస్ట్ దురాక్రమణలకు స్వస్తి చెప్పాలని 1939 మార్చి 21 న బ్రిటన్ ఫ్రాన్స్‌లు పిలుపునిచ్చాయి. పదిరోజుల తర్వాత పోలండ్ దురాక్రమణకు గురైతే పోలండ్‌కు అండగా బ్రిటన్ నిలబడుతుందని ఛాంబర్లేన్ ప్రకటించాడు. ఫ్రెంచి ప్రభుత్వం కూడా ఇదే విధమైన హామి పోలండ్‌కు అందజేసింది. అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్, పోప్ కూడా పోలండ్ మీద హిట్లర్ దురాక్రమణను నివారించడానికి ప్రయత్నించి విఫలులైనారు.

బ్రిటన్ పోలండ్‌తో ఒక పరస్పర సహాయక సంధి చేసుకొని విదేశీ దురాక్రమణకు వ్యతిరేకంగా పోలండ్‌కు సహాయం చేయడానికి వాగ్దానం చేసింది. చివరి ప్రయత్నంగా జర్మనీ పోలండ్‌ల మధ్య ఒక దురాక్రమణ వ్యతిరేక ఒడంబడికను చేయడానికి ప్రయత్నించి బ్రిటన్ విఫలమైంది.

**6.3.10. పోలండ్ మీద జర్మనీ దాడి :**

1939 సెప్టెంబర్ 1న జర్మన్ సైన్యాలు సరిహద్దు దాటి పోలండ్‌లో ప్రవేశించాయి. సెప్టెంబర్ 3న ఫ్రాన్స్, బ్రిటన్‌లు జర్మనీపై యుద్ధం ప్రకటించాయి. దీనితో రెండో ప్రపంచయుద్ధం ప్రారంభమైంది.

**Dr. V.K. Mohan**

పాఠం - 7

# ఇటలీ - ఫాసిస్ట్ నియంతృత్వము

**లక్ష్యం :**

ఇటలీలో ఫాసిస్ట్ విప్లవానికి దోహదం చేసిన పరిస్థితులు, బెనిటో ముస్సోలినీ నాయకత్వంలో ఫాసిస్ట్ రాజ్య స్థాపన, ఫాసిస్ట్ పార్టీ సిద్ధాంతాలు, కార్యక్రమాలు, ఇధియోపియాపై ఇటలీ దురాక్రమణ మొదలగు విషయాల గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

**విషయ క్రమం :**

**7.1. ముస్సోలినీ నాయకత్వంలో ఇటలీలో ఫాసిస్ట్ నియంతృత్వ స్థాపన.**

1.1 పరిచయం

1.2 ఫాసిస్ట్ విప్లవానికి దారితీసిన పరిస్థితులు

1.2.1 ఆర్థిక దుస్థితి

1.2.2 రాజకీయ సంక్షోభము

1.2.3 పారిస్ శాంతి సంధుల వల్ల అసంతృప్తికి చెందిన ఇటాలియన్‌లు

1.2.4 ప్రభుత్వం మీద ఇటాలియన్‌ల విమర్శలు

1.2.5 దేశంలోని అరాచక పరిస్థితులు

1.2.6 బెనిటో ముస్సోలినీ - ఫాసిస్ట్ పార్టీ స్థాపన

1.2.7 ఫాసిజం వ్యాప్తి

1.2.8 ముస్సోలినీ (ఫాసిస్ట్‌లు) రాజ్యాధికార స్వీకరణ

1.2.9 ఫాసిస్ట్ నియంతృత్వము

**7.2. ఫాసిస్ట్ పార్టీ సిద్ధాంతాలు - కార్యక్రమాలు**

2.1 ఫాసిస్ట్ పార్టీ సిద్ధాంతాలు

2.1.1 రాజ్యం సర్వాధికారాలతో కూడిన వ్యవస్థ

2.1.2 పరిపాలన సమర్థులైన వ్యక్తుల చేతుల్లో ఉండాలి

2.1.3 అతివాద పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ

2.1.4 సామ్రాజ్యవాదము

2.1.5 కార్పొరేట్ రాజ్యం

2.2 ఫాసిస్ట్ పార్టీ కార్యక్రమాలు

2.2.1 వ్యవసాయ రంగం

2.2.2 పరిశ్రమల రంగం

2.2.3 విద్యారంగం

2.2.4 కార్మిక చట్టాలు

2.2.5 సైనిక రంగం

2.2.6 మత రంగం

2.2.7 విదేశాంగ విధానం

**7.3. ఫాసిస్ట్ ఇటలీ రాజ్యవిస్తరణ విధానం - ఇథియోపియామీద ఇటలీ దురాక్రమణ**

3.1 ఇథియోపియామీద ఇటలీ దురాక్రమణ

3.1.1 రాజ్యవిస్తరణకు కారణాలు

3.1.2 ఇటలీ-ఫ్రాన్స్‌లమధ్య ఒడంబడిక

3.1.3 వాల్ వాల్ సంఘటన

3.1.4 సమితి మధ్యవర్తిత్వం

3.1.5 ఇథియోపియా ఆక్రమణ

3.1.6 ఫలితాలు

3.1.7 ఇథియోపియాను రక్షించడం సమితి వైఫల్యం

3.2 ఇటలీ - గ్రీస్‌ల మధ్య సంబంధాలు

3.3 ఇటలీ - ఫ్రాన్స్‌ల మధ్య సంబంధాలు

3.4 ఇటలీ - యుగోస్లోవియాల మధ్య సంబంధాలు

3.5 ఇటలీ - ఆల్బేనియాల మధ్య సంబంధాలు

3.6 స్పెయిన్ అంతర్యుద్ధంలో ఇటలీ జోక్యం

3.7 ఇటలీ - జర్మనీల మధ్య ఒడంబడిక

3.8 ఇటలీ - బ్రిటన్‌ల మధ్య సంబంధాలు

3.9 సారాంశము

**7.4. ముస్సోలినీ పతనం**

## 7.1. ముస్సోలినీ నాయకత్వంలో ఇటలీలో ఫాసిస్ట్ నియంతృత్వ స్థాపన

**1. 1. పరిచయం:** ఇటలీదేశ ఆంతరంగిక, విదేశాంగ విధానాలు భౌగోళిక పరిస్థితులమీద ఆధారపడి ఉన్నాయి. ఇటలీ ఐరోపాఖండంలో దక్షిణాన మధ్యధరా సముద్రంలోకి చొచ్చుకొని వచ్చిన చాలా ఇరుకైన ద్వీపకల్పం. అందువల్ల దేశంలోని ముఖ్య భాగాలన్నీ సముద్రతీరానికి దగ్గరగా ఉన్నాయి. సముద్ర తీరాలనుంచి ఇటలీమీద దండయాత్ర చేయడంగాని, ఇటలీని దిగ్బంధనం చేయడంగాని తేలిక. అందువల్లనే ఇటలీని మధ్యధరా సముద్రపు ఖైదీ అని అంటారు. విరోధి రాజ్యాలు మధ్యధరా ప్రాంతంలోని ద్వారాలను స్వాధీనం చేసుకొన్నప్పుడు నూతన మార్గాల కోసం ఇటలీ తప్పక యుద్ధానికి సిద్ధపడవలసిందే. కాబట్టి మధ్యధరా రాజ్యంగా

ఇటలీకి అనేక ఇబ్బందులున్నాయి. ఇటలీ రక్షణకు ఆల్ప్స్ పర్వతాలు ఏ మాత్రం ఉపయోగంగా లేవు. ఈ కారణంగా యూరప్ రాజ్యాలతో కాక మధ్యధరా రాజ్యాలతో సన్నిహిత సంబంధాలు స్థాపించుకోవడం ఇటలీ విదేశాంగ విధానంలో ముఖ్య లక్ష్యము అయింది. అంతేగాక వాణిజ్య నౌకా ప్రయోజనాల దృష్ట్యాకూడా మధ్యధరా ఏడ్రియాటిక్ ప్రాంతాలమీద తన ఆధిపత్యాన్ని స్థాపించుకోవడం చాలా ముఖ్యమైన విషయంగా ఇటలీ భావించింది.

ఇటలీ అధిక జనాభాగల దేశం. పెరుగుతున్న తన జనాభా కోసం ఇటలీ నూతన ప్రాంతాల కోసం అన్వేషించడం తప్పనిసరి అయింది. అంతేగాక ముడి పదార్థాల కోసం కూడా ఇటలీ ఇతర దేశాలమీద ఆధారపడవలసి వచ్చింది. ఆల్ప్స్ పర్వతాలకు అవతలివైపునుంచి నిత్య జీవితావసర వస్తువులను దిగుమతి చేసుకోవడం ఇటలీకి తలకుమించిన భారమైంది. అందువల్ల నైతిక సూత్రాల పరిరక్షణకు గాక కేవలం ఆక్రమణలకు మాత్రమే ఇటలీ మొదటి ప్రపంచయుద్ధంలో ప్రవేశించింది. కాని పారిస్ సమావేశాలలో తగిన పరిహారం ముట్టలేదు. ఏడ్రియాటిక్ తన నియంత్రణ కిందకు వచ్చి, అది తన ఆధీనమవుతుందని ఇటలీ ఆశించింది కాని ఆ విధంగా జరగలేదు. యుద్ధంలో ఆరు లక్షలమంది ఇటాలియన్‌లు మరణించారు. జాతీయ రుణం పెరిగింది. వ్యాపారం కుంటుపడింది. దైనిక వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయి. కార్మికులు, కర్షకులు సమ్మెలు, తిరుగుబాట్లు లేవదీశారు. పరిస్థితిని చక్కదిద్దే శక్తి ప్రభుత్వానికి లేదు. కమ్యూనిస్ట్ ప్రభావం ఎక్కువవుతున్నదని గ్రహించి దేశంలోని భూస్వాములు, ఆస్తిపరులు భీతిచెందారు. కమ్యూనిస్ట్‌ల చర్యలను అరికట్టి దేశంలో అసంతృప్తిని తొలగించి శాంతి భద్రతలను కాపాడటం ఎంతైన అవసరమయింది. ఈ లక్ష్యాలలో ఒక నూతన పక్షం ఇటలీలో అవతరించింది. అదే ఫాసిస్ట్ పార్టీ. దానికి నాయకుడు బెనిటో ముస్సోలిని.

**1. 2. ఫాసిస్ట్ విప్లవానికి దారి తీసిన పరిస్థితులు :**

**1. 2. 1. ఆర్థిక దుస్థితి :** మొదటి ప్రపంచ యుద్ధానంతరం ఇటలీ ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. ఇటాలియన్ కరెన్సీ విలువ 70% పడిపోయింది. నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోయింది. జీవన వ్యయం బాగా పెరిగినందువల్ల ప్రజలు దాదాపుగా కరువు పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చింది. బోల్షివిక్ సిద్ధాంతాలచే ప్రభావితమైన విప్లవోద్యమం వచ్చే సూచన ఏర్పడింది. సోషలిస్ట్ పార్టీమీద కార్మిక సంఘాలమీద కమ్యూనిస్ట్‌ల పలుకుబడి ఎక్కువగా పడింది. మొదటి ప్రపంచ యుద్ధం తరవాత సైన్యంనుంచి చాలామంది సైనికులను తొలగించడం వల్ల నిరుద్యోగ సమస్య తీవ్రమైంది. విదేశాలలో ఇటలీ వర్తకం దెబ్బతిన్నది. దేశంలో ఏర్పడిన అరాజక పరిస్థితి కారణంగా విదేశీ పర్యాటకుల సంఖ్య తగ్గిపోయింది. ఫ్యాక్టరీలలోను, తదితర పారిశ్రామిక సంస్థలలోను సమ్మెలు, లాకౌట్లు సర్వసామాన్యమైనాయి. ఫలితంగా ఇటలీ పారిశ్రామికంగా దెబ్బతిన్నది. దక్షిణ ఇటలీలోని కర్షకులు విప్లవ భావాల ప్రభావానికి లోనై అలజడులు ప్రారంభించారు. నిత్య జీవితావసర వస్తువుల కొరత కారణంగా ధరలు విపరీతంగా పెరిగినాయి. కాని పెరిగిన ధరల కనుగుణంగా కార్మికుల వేతనాలు పెరగలేదు.

**1. 2 . 2. రాజకీయ సంక్షోభం :** మొదటి ప్రపంచ యుద్ధం తరవాత ఇటలీలో రాజకీయ సంక్షోభం ఏర్పడింది. ఆనాటి ప్రభుత్వము దేశాన్ని యుద్ధానంతర పరిస్థితులనుంచి కాపాడలేకపోయింది. అధికారం కోసం వివిధ పార్టీలు పెనుగులాడుకోవడం, ఎన్నికలలో మితిమీరిన లంచగొండితనం; బలమైన ప్రజాస్వామ్య సంప్రదాయాలు లేకపోవడం మొదలైన కారణాలవల్ల ఇటలీ రాజకీయాలలో సుస్థిరత లోపించి అశాంతి ఏర్పడింది. పార్లమెంట్‌లోని వివిధ పార్టీలమధ్య సంఘర్షణల కారణంగా పరిపాలనా యంత్రాంగం సరిగా పని చేయలేదు. తరచుగా మంత్రి వర్గాలు మారుతున్నందువల్ల సంస్కరణలను ప్రవేశ పెట్టడం దుర్లభమైంది. దేశంలో రాజకీయ అశాంతి, పరిపాలనా యంత్రాంగంలో అసమర్థత, లంచగొండితనం ఎక్కువైనందువల్ల పార్లమెంటరీ ప్రభుత్వంలో ప్రజలకు నమ్మకం లేకుండా పోయింది. యుద్ధానంతరం ఇటలీలో ఏర్పడిన ఈ ఘోర పరిస్థితులవల్ల పెట్టుబడిదారీ వర్గం, సంపన్న మధ్యతరగతి వర్గం రష్యాలోవలనే తమ దేశంలో కూడా శ్రామిక వర్గం విజయం పొందుతుందని ఆందోళన చెందినారు.

**1. 2. 3. పారిస్ శాంతి సంధుల వల్ల అసంతృప్తి చెందిన ఇటాలియన్‌లు :** మిత్రరాజ్యాలు రహస్యంగా తనకిచ్చిన వాగ్దానాల కారణంగా త్రిపక్ష మైత్రి సంధిలో సభ్యురాలైన ఇటలీ ఆస్ట్రియా జర్మనీలను విడనాడి 1915 లో జరిగిన రహస్య లండన్ సంధి

ప్రకారం ఇటలీ మిత్రరాజ్యాలలో చేరింది. ఈ సంధి ప్రకారం మిత్రరాజ్యాలు ట్రెంటెనో, టైరోల్, ట్రెయస్టీ, ఇరిట్రియా, డాల్మేషియాలను ఇటలీకివ్వడానికి అంగీకరించినాయి. అంతేగాక ఆఫ్రికాలో జర్మనీ, టర్కీల ఆధిపత్యంలో ఉన్న భూభాగాలను, టర్కీలోని అడాలియాను ఇటలీకివ్వడానికి మిత్రరాజ్యాలు వాగ్దానం చేసినాయి. లండన్ సంధి జరిగిన కొద్ది నెలల తర్వాత ఇటలీ ఆస్ట్రియా జర్మనీలమీద యుద్ధం ప్రకటించింది.

ఈ యుద్ధం ఇటలీకి మోయలేని భారమయింది. యుద్ధంవల్ల ఇటలీకి అధిక జన ధన నష్టం కలిగింది. యుద్ధంలో ఇటలీ 7లక్షల సైన్యాన్ని కోల్పోయింది. 12 మిలియన్‌ల డాలర్లను యుద్ధంకోసం ఇటలీ ఖర్చు పెట్టింది. యుద్ధం కోసం తాను చేసిన యత్నాలకు త్యాగాలకు సరిపడిన ప్రతిఫలం శాంతి సంధులవల్ల పొందవచ్చునని ఇటలీ భావించింది.

కాని యుద్ధానంతరం జరిగిన పారిస్ శాంతి సంధులవల్ల ఇటలీ పూర్తిగా అసంతృప్తి చెందింది. పారిస్ శాంతి సంప్రదింపులలో ఇటాలియన్‌ల కోరికలను మిత్రరాజ్యాలు తోసిపుచ్చినాయి. ముఖ్యంగా పెరుగుతున్న జనాభాకు ఎక్కువ భూభాగాలను సంపాదించడానికి ఇటలీ చేసిన ప్రయత్నాలను మిత్ర రాజ్యాలు వమ్ముచేసినాయి.

ఏడ్రియాటిక్ తీరంలో ఫ్యూమ్ రేవును పొందవచ్చుననే ఇటాలియన్‌ల ఆశలు అడియాసలయినాయి. పారిస్ శాంతి సంధిప్రకారం ఇటలీ సరిహద్దు ట్రెటినో నుంచి బ్రెన్నర్ వరకు విస్తరించింది. డాల్మేషియా రేవు పట్టణమైన సారాలాగో స్టో ద్వీపం ఇటలీకి ఇచ్చినాయి. కాని డాల్మేషియా తీరంలో ఎక్కువ భాగాన్ని ఇటలీ పొందలేకపోయింది. ఆల్బేనియా మీద, వలోనా రేవుమీద తన రక్షణాధికారాన్ని ఇటలీ పొందలేకపోయింది. ఆఫ్రికాలోని జర్మన్ వలసలు కూడా ఇటలీకి లభించలేదు. సమీప ప్రాచ్యంలో వాణిజ్య రాయితీలను మాత్రమే ఇటలీ పొందగలిగింది. ఇటలీకివ్వడానికి వాగ్దానం చేసిన భూభాగాలు చాలావరకు గ్రీస్ టర్కీలకు ఇవ్వడం జరిగింది. ఈ కారణాలవల్ల అసంతృప్తి చెందిన ఇటాలియన్‌లు మిత్ర రాజ్యాలపట్ల ఆగ్రహం పెంచుకొన్నారు.

**1. 2. 4. ప్రభుత్వంమీద ఇటాలియన్‌ల విమర్శలు :** పారిస్ శాంతి సమావేశంలో తాము మోసానికి గురిఅయినట్లు ఇటాలియన్‌లు భావించారు. 1919 తరవాత ఇటాలియన్ ప్రజలలో పూర్తి అసంతృప్తి ఏర్పడింది. యూరప్‌లోనేగాక యూరప్‌కు అవతల కూడా తాము కోరిన భూభాగాలను ఇటాలియన్‌లు పొందలేకపోయినారు. దీనిని ఇటాలియన్‌లు అవమానంగా భావించారు. దేశ రాజకీయ నాయకులవల్ల ఇలా జరిగిందని ప్రభుత్వాన్ని విమర్శించడం ఇటాలియన్‌లు ప్రారంభించారు. జాతీయ వాదులు, దేశభక్తులు అయిన ఇటాలియన్‌లు తమ వృద్ధ రాజకీయ నాయకులను సంఘాన్ని పీడించే చీడ పురుగులని విమర్శించసాగారు. ఇటలీలో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ శాంతియుత సిద్ధాంతాలలో నమ్మకమున్న పార్టీ. యుద్ధంలో గెలిచిన ఇటలీ పారిస్ శాంతి సంధులవల్ల ఏమాత్రం లాభం పొందలేక పోవడానికి కారణము తమ నాయకుల అసమర్థతే అని ఇటాలియన్ ప్రజలందరూ భావించినారు. అందువల్ల ప్రభుత్వ మార్పును ఇటాలియన్‌లు కోరుకున్నారు.

**1. 2. 5. దేశంలోని అరాజక పరిస్థితులు :** వర్సై సంధి జరిగిన తరవాత ఇటలీలోని అరాజక పరిస్థితులు ఫాసిస్ట్ విప్లవానికి దారి తీసినాయి. దేశంలో ఏర్పడిన ఆర్థిక సంక్షోభం కారణంగా కమ్యూనిస్ట్ సిద్ధాంతాలు బాగా వ్యాప్తిలోకి వచ్చినాయి. అతివాద పార్టీల సిద్ధాంతాలు ప్రజలను బాగా ఆకర్షించసాగినాయి. అంతేగాక ప్రజాస్వామ్య సంప్రదాయాల అభివృద్ధికి అనువైన పరిస్థితులు ఇటలీలో లోపించినాయి. 19, 20 శతాబ్దాలలో కూడా ఇటలీ ఐక్యము సైనిక చర్యలవల్ల మాత్రమే నిలవగలిగింది. ప్రాంతీయ విభేదాలు ప్రజలను విడదీసి జాతీయ సమగ్రతను అరికట్టినాయి. మొదటి ప్రపంచ యుద్ధకాలంలోనే ఇటలీలో పార్లమెంటరీ ప్రభుత్వం దెబ్బతిన్నది. ఎన్నికలలో రాజ్యాంగ విధానంలో నమ్మకమున్న పార్టీలు మెజారిటీ స్థానాలను గెలుచుకొంటూ ఉండేవి. అయితే పార్లమెంట్‌లో ఏ ఒక్కపార్టీకి తగిన మెజారిటీ లేనందువల్ల ప్రభుత్వ సుస్థిరతకు తరచు భంగం వాటిల్లేది. 1919 - 1922 మధ్యకాలంలో ఇటలీలో ఆరు ప్రభుత్వాలు మారినాయి. రాజకీయ సుస్థిరత లోపించడమేగాక దేశము ఆర్థిక దుస్థితిని, ప్రజల దౌర్జన్యాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. ఈ అరాజక పరిస్థితుల్లో ఇటలీలో ఏర్పాటైన అనేక విప్లవ పార్టీలలో అతి ప్రధానమైనది మాజీ సోషలిస్ట్ అయిన బెనిటో ముస్సోలినీ స్థాపించిన ఫాసిస్ట్ పార్టీ. ప్రాచీన

రోమ్ వైభవాన్ని, రోమన్ సామ్రాజ్యం ప్రాశస్త్యాన్ని ప్రజలముందించి తద్వారా ఇటాలియన్‌లలో జాతీయ భావాన్ని పెంపొందించడం ముస్సోలినీ ఫాసిస్ట్ పార్టీ ప్రధానలక్ష్యం.

**1. 2. 6. బెనిటో ముస్సోలినీ - ఫాసిస్ట్ పార్టీ స్థాపన :** బెనిటో ముస్సోలినీ (1883 - 1945) రొమాగ్నాలోని ఫోర్లిలో 1883 లో జన్మించాడు. ఇతని తల్లి దండ్రులు చాలా బీదవారు. తండ్రి కుమ్మరి, తల్లి ఉపాధ్యాయిని. ఇతడిది కుశాగ్ర బుద్ధి, చదువులో బాగా రాణించాడు. మాఖియ వెల్లి, నీట్జె, జార్జెస్ సొరెల్ నుంచి రాజకీయ పాఠాలను చిన్నతనంలోనే ముస్సోలినీ వంట పట్టించుకొన్నాడు. ఫలితాలు ముఖ్యంగానీ, వాటిని సాధించడానికి అనుసరించాల్సిన విధానాలు ముఖ్యంకావనేది మాఖియవెల్లి సిద్ధాంతం. మంచి భవిష్యత్ కావాలనుకొనే వారికి 19 వ శతాబ్దపు భావవాదం పనికిరాదని నీట్జె వాదం. పతనావస్థలో ఉన్న ప్రజాస్వామ్యం గట్టిగా దెబ్బతీస్తే అతి తేలికగా నేల కూలుతుంది అని సొరెల్ అంటాడు. ఏ గాలికి ఏ తెరచాప అవసరమో ముస్సోలినీకి బాగా తెలుసు. అందువల్ల స్థిరత్వం అతనిలో సాధారణంగా కనిపించదు. ఏదో విధంగా అధికారాన్ని చేజిక్కించుకోవడమే అతని పరమ ధ్యేయం.

పేదరికాన్ని ఎదుర్కోవలసి వచ్చిన ముస్సోలినీ యువకుడుగా ఉన్నపుడు సోషలిస్ట్ పార్టీలో చేరాడు. తరువాత కొన్నాళ్ళు పత్రికారచయితగా పనిచేసినాడు. 'అవంతి' అనే సోషలిస్ట్ పత్రికకు కూడా సంపాదకుడుగా పని చేసినాడు. ఇటాలియన్ సోషలిస్ట్‌లకు 'అవంతి' మంచి ప్రచార సాధనంగా ఉండేది. పది సంవత్సరాల కాలం స్విట్జర్లాండ్‌లోను, ఇటలీ, ఆస్ట్రేలియాలలో కూడా సోషలిస్ట్ పార్టీ ప్రచారం చేసినాడు. కాని అరెస్టయి కొంత కాలం ప్రవాసంలో గడిపాడు. ఇటలీ మొదటి ప్రపంచ యుద్ధంలో చేరే విషయంలో సోషలిస్ట్‌లు వ్యతిరేకంగా ఉన్నందువల్ల ముస్సోలినీ సోషలిస్ట్ పార్టీని విడిచిపెట్టినాడు. 'అవంతి' పత్రిక సంపాదకత్వానికి రాజీనామా చేసినాడు. అప్పటినుంచి ముస్సోలినీ తీవ్ర జాతీయ భావాన్ని ప్రజలలో రెచ్చగొట్టడం ప్రారంభించాడు. ఫ్రెంచి ప్రభుత్వం రహస్యంగా అందించిన ఆర్థిక సహాయంతో ముస్సోలినీ 'ఇటలీస్ పీపుల్' అనే పత్రిక ప్రారంభించాడు. ఇటలీ యుద్ధంలో ప్రవేశించగానే ముస్సోలినీ సైన్యంలో చేరినాడు. 1917 వరకు ముస్సోలినీ యుద్ధంలో పాల్గొని గాయపడి స్వదేశానికి తిరిగి వచ్చినాడు.

మొదటి ప్రపంచ యుద్ధానంతరం ఇటలీలో ఏర్పడ్డ గందరగోళ పరిస్థితులు ముస్సోలినికి బాగా అనుకూలించింది. యుద్ధం తరవాత ముస్సోలినీ పూర్తి సోషలిస్ట్ వ్యతిరేకి అయినాడు. యుద్ధంలో గాయపడి సైన్యంనుంచి బయటికి వచ్చిన తరవాత ముస్సోలిని మిలాన్ నగరానికి వచ్చి మళ్ళీ పత్రికా సంపాదకుడుగా పనిచేస్తూ యుద్ధం వల్ల ఇటలీ ఏ విధంగా సంక్షోభంలో పడిందో విశ్లేషిస్తూ, ఆనాటి సమస్యలను పరిష్కరించుకోవడానికి ఇటాలియన్‌లు సమాయత్తం కావాలని అనేక వ్యాసాలను ప్రచురించాడు. ఇవి ప్రజలను బాగా రెచ్చగొట్టేవిగా ఉన్నాయి. యుద్ధంలో వివిధ రంగాలలో పోరాడిన సైనికులను, నిరుద్యోగులను ముస్సోలిని బాగా ఆకట్టుకొన్నాడు.

దేశంలోని అరాజక పరిస్థితుల వల్ల తృప్తిచెంది ఇటాలియన్ సమస్యలను పరిష్కరించవలెననే కోరికలున్న నాయకులందరినీ 1919 లో ముస్సోలినీ మిలాన్ లో సమావేశ పరచినాడు. ఈ సమావేశంలోనే ముస్సోలినీ 'ఫాసిస్ట్' పార్టీని స్థాపించాడు. అభివృద్ధి నిరోధక శక్తులైన మితవాదుల బారినుంచి, విధ్వంసక చర్యలలో పాల్గొనే వామ పక్షాల బారినుంచి దేశాన్ని కాపాడటానికి ఫాసిస్ట్ పార్టీని స్థాపించినట్లుగా ముస్సోలినీ ప్రచారం చేశాడు. ఫాసిస్ట్ పార్టీ సిద్ధాంతాలను ముస్సోలినీ చాలావరకు గేబ్రియల్ డి అనున్‌జియో అనే కవినుంచి సంగ్రహించాడు. ఇటాలియన్‌ల భౌతిక నైతిక పరిస్థితులను అభివృద్ధి చేయడం ఫాసిస్ట్ పార్టీ లక్ష్యమని ముస్సోలినీ పేర్కొన్నాడు. ఫాసిస్ట్‌లకు సమస్యలను పరిష్కరించేవారు అని ముస్సోలినీ పేరు పెట్టినాడు.

'ఫాసిస్ట్' అనే పదము ఇటాలియన్ భాషలో 'ఫాసిస్' అనే దానినుంచి ఉద్భవించింది. 'ఫాసిస్ట్' అంటే 'పుల్లల మోపు' అని అర్థం. ప్రాచీన రోమన్ చరిత్ర కాలంలో రోమన్ న్యాయాధికారులకు ముందు అధికార లాంఛనంగా పుల్లల మోపును, ఒక గొడ్డలిని తీసుకొనిపోయేవారు. పుల్లల మోపు ఐకమత్యానికి ప్రతీక, గొడ్డలి అధికారానికి ప్రతీక. ముస్సోలినీ ఈ లాంచనాలనే ఉపయోగించి బలప్రయోగంలో అధికారం కైవసం చేసుకొని ప్రాచీన రోమన్ వైభవాన్ని ఇటాలియన్‌ల స్ఫురణకు తెచ్చి వారి జాతీయతను ఉత్తేజపరిచి తన అధికారం పెంపొందించుకో చూసినాడు.

ఆయుధోత్పత్తి, కర్మాగారాలను జాతీయం చేయడం, శాసనాధికారాలలో కూడిన ఆర్థిక మండలాలను ఏర్పాటు చేయడం, కొన్ని పరిశ్రమల యాజమాన్య బాధ్యతను కార్మికులకు అప్పగించడం, ఫాసిస్ట్ పార్టీ ప్రణాళికలోని కొన్ని ప్రధాన అంశాలు. విదేశ వ్యవహారాలకు సంబంధించినంతవరకు ఫ్యూమ్, డాల్మేషియాలను వెంటనే ఆక్రమించుకోవడం ఫాసిస్ట్ పార్టీ ప్రణాళికలోని ప్రధానాంశము. అయితే లక్ష్యసాధనకు ఫాసిస్ట్‌లు అనుసరించే పద్ధతి ఇతర రాజకీయ పార్టీలు అనుసరించే పద్ధతికి పూర్తిగా భిన్నమైంది. ఎన్నికలలో పాల్గొన్నప్పటికీ ఫాసిస్ట్‌లకు పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపట్ల గౌరవం ఏ మాత్రం లేదు. ఫాసిస్ట్‌లు సంఘటిత దౌర్జన్యకాండలో నమ్మకమున్నవారు.

**1. 2. 7. ఫాసిజమ్ వ్యాప్తి :** ముస్సోలిని తన సిద్ధాంతాలను ప్రచారం చేయడానికి క్లబ్బులు స్థాపించడానికి, రాజ్యాన్ని ఉదారంగా గాక ఫాసిస్ట్ పక్కీలో ఉండేటట్లు చేయడానికి పూనుకొన్నాడు. సోషలిస్ట్‌లు, కమ్యూనిస్ట్‌లు ఇతనికి వ్యతిరేకులయినారు. దేశంలోని పెట్టుబడి శ్రీమంతులు ముస్సోలినీకి మద్దతు ఇచ్చినారు. ఫాసిస్ట్ పక్షాన్ని పునర్వ్యవస్థీకరించి అందులోని సభ్యులకు ఒకే రకమైన వస్త్రధారణ పద్ధతి ప్రవేశపెట్టి వారికి నల్లషర్టుల వారు అని పేరు పెట్టి పుల్లలమోపు, గొడ్డలి చిహ్నాలు, ప్రాచీన రోమ్ వందన పద్ధతి ప్రవేశపెట్టాడు. కమ్యూనిస్ట్, సోషలిస్ట్ సభలను, సమావేశాలను చెదరగొట్టడానికి 'స్క్వాడాద - అజియానో' అనే అల్లరి మూకలు ఫాసిస్ట్ పార్టీ నాయకత్వంలో ఇటలీ అంతటా తలెత్తాయి. ఫాసిస్ట్ దురాగతాలకు ఎంతోమంది కమ్యూనిస్ట్‌లు, సోషలిస్ట్‌లు బలయ్యారు. ఇటలీ ప్రభుత్వరంగంలోను, న్యాయ వ్యవస్థలోను ఫాసిస్ట్ కార్యకర్తలు చొచ్చుకొని పోయినందువల్ల ఫాసిస్ట్ విధానాలను వ్యతిరేకించిన వారికి ఎటువంటి న్యాయం చేకూరలేదు.

మొదటి ప్రపంచ యుద్ధానంతరం ఇటలీ విపరీతమైన రాజకీయ సంక్షోభంలో పడింది. 1919 - 1922 మధ్య కాలంలో 5 మంత్రి వర్గాలు మారాయి. అందువల్ల ప్రజాస్వామ్య విధానంపట్ల ప్రజలలో విశ్వాసం సడలింది. స్వలాభా పేక్షపరులైన మేధావులు ఫాసిస్ట్‌లకు మద్దతు ఇవ్వడంలో ఆ పార్టీ ఒక విధమైన గౌరవం కూడా సంపాదించింది. క్రమంగా కార్మికులు కూడా ఫాసిస్ట్‌లను సమర్థించడం ప్రారంభించారు. 'నల్లచొక్కాలు' ధరించిన ఫాసిస్ట్‌లు ప్రతిచోటా భయభ్రాంతులు సృష్టించారు. మాజీ సైనికులు, భూస్వాములు, పెట్టుబడిదారులు పెద్ద సంఖ్యలో ఫాసిస్ట్ పార్టీలో చేరారు. ఫాసిస్ట్ పార్టీ పట్టణాలకు, పల్లెలకు వ్యాపించింది. ఫాసిస్ట్ పార్టీ సైనికతత్వంతో కూడిన సిద్ధాంతాలు యువకులను ఎక్కువగా ఆకర్షించినాయి. పార్టీలో చేరిన యువకులందరూ నల్ల చొక్కాలను ధరించేవారు. సైనిక శిక్షణకు, క్రమ శిక్షణకు ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. కొద్దికాలంలోనే సుశిక్షితులైన సాయుధ సైన్యాన్ని ఫాసిస్ట్ పార్టీ తయారు చేసింది. 1919 లో ఫాసిస్ట్‌ల సంఖ్య 22 వేలు మాత్రమే, 1921 నాటికి ఫాసిస్ట్‌ల సంఖ్య ఐదు లక్షలకు పెరిగింది. 1921 తరవాత ఫాసిస్ట్‌లకు సోషలిస్ట్‌లకు మధ్య విభేదాలు తీవ్రరూపం దాల్చినాయి. రెండు పార్టీలపట్ల తటస్థ విధానాన్ని అనుసరిస్తూనే ప్రభుత్వం ఫాసిస్ట్‌లను బలపరచసాగింది. జిల్లాలలో పరిపాలకులు, పోలీసులు కూడా కొన్ని సందర్భాలలో ఫాసిస్ట్‌లకు బహిరంగంగా తోడ్పడసాగినారు.

శ్రామికవర్గ ప్రజలు విప్లవవాదుల నాయకత్వంలో 1920 లో బలవంతంగా ఫ్యాక్టరీలను తమవశం చేసుకొన్నారు. రష్యాలోవలెనే ఇటాలియన్ శ్రామికులు సోవియట్‌లను ఏర్పాటు చేసినారు. అయితే ఫ్యాక్టరీలను నియంత్రణ చేయడంలో విఫలమైన విప్లవవాదులు ప్రభుత్వంలో సంప్రదింపులు ప్రారంభించారు. సంప్రదింపుల ఫలితంగా శ్రామికవర్గ నియంతృత్వాన్ని స్థాపించడంలో విప్లవవాదులు విఫలులైనారు. క్రమక్రమంగా విప్లవోద్యమం బలహీనపడి ఇటలీ ఒక పెద్ద విపత్తునుంచి బయటపడింది.

**1. 2. 8. ముస్సోలినీ (ఫాసిస్ట్‌లు) ఇటలీ రాజ్యాధికార స్వీకరణ :** విప్లవోద్యమము విఫలమైనప్పటికీ సనాతనులయిన ఇటాలియన్‌లకు విప్లవ భయం పూర్తిగా తొలగిపోలేదు. అనేక ప్రదేశాలలో విప్లవవాదులు బలవంతంగా భూములను ఆక్రమించుకొన్నప్పటికీ ప్రభుత్వం వారిమీద కఠిన చర్యలు తీసుకోలేకపోయింది. ఈ పరిస్థితులలో ఇటాలియన్‌లలో చాలామందికి పార్లమెంటరీ ప్రభుత్వంమీద నమ్మకం నశించిపోయింది. అనువైన ఈ అవకాశాన్ని ముస్సోలినీ బాగా ఉపయోగించుకొన్నాడు. అధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి ప్రయత్నాలు ప్రారంభించాడు. ప్రభుత్వాన్ని బలహీనమైనదిగా అసమర్థమైనదిగా విమర్శించి, సోషలిస్ట్ వ్యతిరేఖ పార్టీలన్నిటినీ ఫాసిస్ట్ విప్లవంలో చేరవలసిందిగా ముస్సోలినీ ఆహ్వానించాడు. విప్లవవాదుల విధ్వంసక చర్యల బారినుంచి దేశాన్ని ఫాసిస్ట్‌లు మాత్రమే రక్షించగలరని ముస్సోలినీ ప్రచారం చేసినాడు. అనతికాలంలోనే పారిశ్రామిక వేత్తలు, భూస్వాములు పెద్దమొత్తంలో ఫాసిస్ట్ పార్టీకి విరాళాలు ఇవ్వడమేగాక ఫాసిస్ట్ సైన్యంలో సభ్యులుగా కూడా చేరినారు. ప్రభుత్వోద్యోగులు చాలామంది రహస్యంగా ఫాసిస్ట్‌లకు సహాయం చేసినారు. 1921 లో జరిగిన

సాధారణ ఎన్నికల్లో ఫాసిస్టులు పార్లమెంట్‌లోని 535 స్థానాలల్లోను 35 స్థానాలను గెలుచుకొన్నారు. కమ్యూనిస్టులు 16 స్థానాలను మాత్రమే గెలుచుకోగలిగినారు.

ఆనాటి ఇటలీ ప్రధాన మంత్రి ల్యూగి ఫాక్టా. ఇతనికి ఏ మాత్రం రాజకీయ దక్షతగానీ, చొరవ గానీ లేవు. ల్యూగి ఫాక్టా మంత్రివర్గ బలహీనతను ముస్సోలిని బాగా ఆసరాగా తీసుకొన్నాడు. బలప్రయోగం చేసైనా అధికారానికి రావడమే తన ధ్యేయమని ముస్సోలినీ నిస్సంకోచంగా ప్రకటించాడు. 1922 అక్టోబర్‌లో రాజుపట్ల విధేయతను, చర్చిపట్ల గౌరవాన్ని చూపడానికి వాగ్దానం చేసి ముస్సోలినీ రాజు, చర్చి సహకారాన్ని పొందగలిగినాడు. దానికి తోడు సైన్యం తటస్థంగా ఉంది. "ప్రభుత్వాధికారాన్ని అప్పజెప్పండి. లేకుంటే రోమ్‌పైకి దాడిచేసి అధికారాన్ని హస్తగతం చేసుకొంటాం" అని ఫాక్టాకు ముస్సోలినీ తుది హెచ్చరికను పంపించాడు. మరొకవైపు ఫాసిస్ట్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి తనకు అనుమతి ఇవ్వవలసిందిగా ముస్సోలినీ రాజుమీద ఒత్తిడి తెచ్చినాడు. ఫాసిస్టులు నివాదాలు చేస్తూ రోమ్‌లో ప్రవేశించడం మొదలు పెట్టారు. ఇదే సమయంలో ప్రధానమంత్రి ఫాక్టాతో సైనిక పాలనకు సంబంధించిన ప్రకటనకు జారీచేసే విషయంలో రాజు మూడో విక్టర్ ఇమ్మాన్యుయల్‌కు తీవ్ర అభిప్రాయ భేదాలేర్పడినాయి. 1922 అక్టోబర్ 30 న రాజు ఇమ్మాన్యుయల్ ప్రధాన మంత్రి ఫాక్టాను బర్తరఫ్ చేసి ముస్సోలినీని ఇటలీ నూతన ప్రధానమంత్రిగా నియమించాడు. ఫాసిస్ట్ దౌష్ట్యాలకు గడగడలాడిపోతున్న ఇటాలియన్ పార్లమెంట్ ముస్సోలినీకి నియంతృత్వ అధికారాలు కట్టబెట్టింది.

**1. 2. 9. ఫాసిస్ట్ నియంతృత్వము :** అధికారంలోకి వచ్చిన తరవాత ముస్సోలినీ ఒకవైపు ఫాసిస్ట్ పార్టీని పటిష్ఠం చేసుకుంటూ, మరోవైపు కఠినాతి కఠినమైన నిబంధనద్వారా ప్రభుత్వంలో క్రమశిక్షణ నెలకొల్పగలిగినాడు. కఠిన స్వరంతో, నిప్పులు కురిపిస్తున్న కండ్లతో ఆతడు కొద్దికాలంలోనే రాజును, పార్లమెంట్‌ను, జాతిని తన ఆధీనంలోకి తెచ్చుకొన్నాడు. దేశంలో క్రమశిక్షణ నెల్పినాడు. సమ్మెలను నిర్దాక్షిణ్యంగా అణచివేయడం జరిగింది. ప్రతిపక్షాలన్నింటినీ దయాదాక్షిణ్య రహితంగా అణచివేశాడు. సోషలిస్ట్, కమ్యూనిస్ట్ నాయకులు జైళ్ల పాలైనారు. ప్రభుత్వశాఖలు అదా చేయడం మొదలు పెట్టాయి. ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాలవల్ల నిరుద్యోగ సమస్య చాలావరకూ పరిష్కారమైంది. ఫాసిస్టులు తమ నాయకుడు ముస్సోలినీని 'ఇల్‌డ్యూస్' అని పిలిచి, పాత రోమన్ ఫక్కీతో చేయి ముందుకు చాచి వందనం సమర్పించసాగారు.

ప్రజాస్వామ్యం, మానవత్వ విలువలు, ఉదారవాదం, సోషలిజం కాలం తీరిన సిద్ధాంతాలని, ప్రాతినిధ్యం ప్రభుత్వం, అంతర్జాతీయ అంగీకారాలు, యుద్ధ వ్యతిరేకత బలహీనులు వల్లించే సూక్తులని ఫాసిస్ట్ సిద్ధాంత వేత్తలు ప్రచారం చేశారు. 'అధికారం, క్రమశిక్షణ' తమ విధానాలని చెప్పుకుంటూ వారు యుద్ధాన్ని, రాజ్యాధికారాన్ని ఆకాశానికెత్తారు. ఫాసిస్ట్ సిద్ధాంతాల్లాంటి సిద్ధాంతాలు క్రమంగా జర్మనీ, స్పెయిన్, అర్జెంటైనాలలో చోటు చేసుకోవడం మొదలుపెట్టాయి.

సోషలిస్ట్, పాపులిస్ట్, లిబరల్ సభ్యులు ఎంత వ్యతిరేకించినా, ముస్సోలినీ ఎన్నికల పద్ధతిలో పెద్దమార్పు తెచ్చిపెట్టే చట్టాన్ని పార్లమెంట్‌చే ఆమోదింపజేశాడు. దీని ప్రకారం సార్వత్రిక ఎన్నికల్లో ఏ పార్టీకి అధిక సీట్లు వస్తాయో ఆ పార్టీకి 'ఛేంబర్ ఆఫ్ డెప్యూటీస్' లో మూడింట రెండు వంతుల స్థానాలు సంపాదించినట్లవుతుంది. మిగతా స్థానాలను నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతిలో ఇతర పార్టీలు పంచుకొంటాయి. ఈ కొత్త పద్ధతిలో 1924 ఏప్రిల్‌లో ఎన్నికలు జరిగాయి. పటిష్టమైన పార్టీగా రూపొందిన ఫాసిస్ట్ పార్టీ మొత్తం ఏడున్నర మిలియన్ ఓట్లలో నాలుగున్నర మిలియన్ ఓట్లు సంపాదించింది. అందువల్ల ఆ పార్టీ 'ఛేంబర్ ఆఫ్ డెప్యూటీస్' లో మూడింట రెండు వంతుల స్థానాలు సంపాదించింది. సోషలిస్టులు, లిబరల్స్, పాపులిస్టులు, ఇతర పార్టీలవారు మిగతా స్థానాలను పంచుకొన్నారు.

అధికారాన్ని హస్తగతం చేసుకొన్న ముస్సోలినీ భీతావహ పరిపాలన ప్రవేశపెట్టాడు. పత్రికలపై తీవ్ర నిర్బంధాలను విధించడం జరిగింది. రాజకీయ ప్రత్యర్థులు, జైళ్ళపాలు కావడమో, అదృశ్యమై పోవడమో జరిగింది. 1924 చివరినాటికి ఫాసిస్ట్ వలలో ఇటలీ పూర్తిగా చిక్కుకొనిపోయింది. 1925 - 1928 మధ్య కాలంలో ఒక ఫాసిస్ట్ పార్టీ మినహా ఇతర పార్టీలను అణచి వేయడానికి, రాజకీయ ప్రత్యర్థులను విచారించేందుకు ప్రత్యేక న్యాయస్థానాలను ఏర్పాటు చేయడానికి, దేశ ద్రోహులుగా ప్రకటించబడిన వారి ఆస్తులను జప్తు చేయడానికి,

ప్రభుత్వ వ్యతిరేక పత్రికలను మూసివేయడానికి, అధికార కేంద్రీకరణకు పార్లమెంట్ ముస్సోలినీకి అధికారం ఇచ్చింది. స్థానికాధికారులు సైతం ముస్సోలినీకి బాధ్యత వహించాలి. నగర అధికారులను, చివరకు గ్రామాధికారులను సైతం ముస్సోలినీ నియమించేవాడు. అన్నిటికన్నా మించిన భయంకరమైన శాసనం 1928 లో అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం, ఫాసిస్ట్ అభ్యర్థులు మాత్రమే ఎన్నికల్లో పోటీచేయాలి. ఓటర్లు ఫాసిస్ట్ అభ్యర్థులను మాత్రమే ఎన్నుకోవాలి. పేరుకు మాత్రం ఇంకా పార్లమెంట్‌కు బాధ్యత వహించిన మంత్రిమండలి అధికారంలో ఉన్నది. రాజ్యాధినేత రాజు. కానీ, యదార్థంలో అధికారమంతా కేవలం ఫాసిస్ట్ పార్టీదే. దాని అధినేత 'ఇల్‌డ్యూస్' ఈ విధంగా ముస్సోలినీ నాయకత్వంలో ఇటలీలో ఫాసిస్ట్ నియంతృత్వమేర్పడింది.

## 7.2. ఫాసిస్ట్ పార్టీ సిద్ధాంతాలు :- కార్యక్రమాలు :

**2. 1. ఫాసిస్ట్ పార్టీ సిద్ధాంతాలు :** ఫాసిస్ట్ పార్టీ సిద్ధాంతాలు ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చు.

**2. 1. 1. రాజ్యము సర్వాధికారాలతో కూడిన వ్యవస్థ :** ఫాసిస్ట్ పార్టీ సిద్ధాంతాల ప్రకారం రాజ్యంలో వ్యక్తి ప్రాముఖ్యము పూర్తిగా తగ్గి సర్వాధికారాలతో కూడిన రాజ్యం ప్రాముఖ్యం ఎక్కువయింది. ఫాసిస్ట్ సిద్ధాంతం ప్రకారం రాజ్యము సర్వాధికారానికి మూలము. రాజ్యంలో వ్యక్తి అధికారానికి చోటు లేదు. ముస్సోలినీ మాటలలో ప్రతివిషయము రాజ్యంలో భాగమేగాక, రాజ్యానికి వెలుపలగాని రాజ్యానికి వ్యతిరేకంగాగాని ఏ విధమైన అధికారం ఉండదు. రాజ్యానికి వెలుపల ఏ విధమైన రాజకీయ, ఆర్థిక వ్యవస్థ మనజాలదు. కమ్యూనిస్ట్ రష్యాలోవలె ఫాసిస్ట్ ఇటలీలో కూడా ఏకపక్ష నియంతృత్వమనే సిద్ధాంతం అమలు జరిగింది. జాతీయ శ్రేయస్సుకు భంగకరమైన వ్యక్తి స్వేచ్ఛను ఫాసిస్ట్‌లు అనుమతించరు. వ్యక్తి స్వేచ్ఛ ప్రాముఖ్యం స్థానే జాతీయ ప్రాముఖ్యం నెలకొల్పడం జరిగింది. సమిష్టి శ్రేయస్సు కోసం వ్యక్తి స్వేచ్ఛను త్యాగం చేయవలె.

**2. 1. 2. పరిపాలన సమర్థులైన వ్యక్తుల చేతుల్లో ఉండాలి :** ఫాసిస్ట్‌లకు ప్రజాస్వామ్యములో నమ్మకము లేదు. ప్రజాభిప్రాయం, ప్రజాసార్వభౌమాధికారము, సమానత్వము, వయోజన ఓటింగ్ మొదలైన సిద్ధాంతాలలో ఫాసిస్ట్‌లకు నమ్మకం లేదు. ఇటలీ రాజకీయ, ఆర్థిక సమస్యలను పరిష్కరించడంలో ఆనాటి ప్రజాస్వామ్య ప్రభుత్వము ఘోరంగా విఫలమయిందని వారి అభిప్రాయం. అందువల్ల జాతీయ శ్రేయస్సు దృష్ట్యా దేశ పరిపాలనను కొద్దిమంది సమర్థులైన వ్యక్తుల చేతులలో ఉంచవలెనని ఫాసిస్ట్‌లు అభిప్రాయపడినారు.

**2. 1. 3. అతివాద పెట్టుబడిదారి ఆర్థిక వ్యవస్థ :** ఇటలీలో ఏర్పాటైన ఫాసిజం సామ్యవాదానికి వ్యతిరేకంగా జరిగినటువంటి పెట్టుబడిదారి ప్రతిక్రియ అని చెప్పవచ్చు. అయితే ఫాసిజం సంపూర్ణ సామ్యవాదాన్ని, సంపూర్ణ పెట్టుబడిదారీ విధానాన్ని కూడా వ్యతిరేకించింది. స్వామ్యవాదానికి పెట్టుబడిదారీ విధానానికి మధ్య ఒక విధమైన మధ్యే మార్గాన్ని ఫాసిస్ట్ పార్టీ అనుసరించింది. శ్రామిక వర్గ ప్రజలను తృప్తి పరచడానికి కొన్ని సామ్యవాద సిద్ధాంతాలను, ఆస్తి పాస్తులున్న ప్రజలను సంతృప్తిపరచడానికి కొన్ని పెట్టుబడిదారి సిద్ధాంతాలను ఫాసిస్టులు అమలు పరిచినారు. భూమిని, ఉత్పత్తి సాధనాలను జాతీయం చేయకుండా ప్రైవేట్ ఆస్తులకు రక్షణ కలిగించినారు. అయితే ప్రభుత్వం కొంతవరకు కంట్రోళ్ళ పద్ధతిని కూడా ప్రవేశపెట్టింది. వ్యక్తులకు సొంత ఆస్తులు ఉండటాన్ని ప్రభుత్వం గుర్తించినప్పటికీ విదేశ వ్యాపారం మాత్రం ప్రభుత్వాధీనంలోకి తీసుకురావడం జరిగింది. పెట్టుబడిదారీవర్గం వలెనే శ్రామిక వర్గాన్ని కూడా ప్రభుత్వాధీనంలో ఉంచడం జరిగింది. కార్మిక సంఘాలను ప్రభుత్వం క్రమబద్ధం చేసింది. కార్మికుల వేతనాలను ప్రభుత్వమే నిర్ణయించింది. అన్ని రకాలైన సమ్మెలు, లాకౌట్లు నిషేధించడం జరిగింది. ఫాసిస్ట్‌ల అంతిమ ధ్యేయం యుద్ధం కాబట్టి యుద్ధాన్ని దృష్టిలో ఉంచుకొని దేశాన్ని పారిశ్రామికంగా, వ్యావసాయికంగా స్వయం పోషకం చేయడానికి అవసరమైన చర్యలన్నీ తీసుకోవడం జరిగింది. అందువల్ల ఫాసిస్ట్‌ల ఆర్థిక విధానాన్ని అతివాద పెట్టుబడిదారీ విధానమని చెప్పవచ్చు. ఈ కారణంగా ప్రపంచంలోని పెట్టుబడిదారీ వర్గమంతా ఫాసిజాన్ని సమర్థించింది.

**2. 1. 4. సామ్రాజ్యవాదము :** ఫాసిస్ట్‌లు శాంతివాదానికి పూర్తిగా వ్యతిరేకులు. గత చరిత్ర అనుభవం దృష్ట్యా శాంతివాదము ఆధునిక అభ్యున్నతికి అవరోధమని వారు భావించినారు. యుద్ధము జాతీయ జీవనంలో భాగమేగాక ప్రజల సాహసమైన విధి అని, జాతిని ఉత్తేజపరచడానికి యుద్ధమొక్కటే ఏకైక మార్గమని ఫాసిస్ట్‌ల అభిప్రాయం. యుద్ధాల ద్వారా ప్రాచీన రోమన్ వైభవాన్ని తిరిగి నెలకొల్పవలెనని

ముస్సోలినీ ఇటాలియన్‌లను ఉద్రేక పరిచినాడు. స్త్రీకి ప్రసూతి ఎటువంటిదో పురుషుని యుద్ధము అటువంటిదని ముస్సోలిని ప్రచారం చేసినాడు. అంతేగాక ఫాసిజం జాతి ఔన్నత్యాన్ని ప్రబోధించి అనాగరికమైన ఆసియా ఆఫ్రికా రాజ్యాలను నాగరిక రాజ్యాలుగా మార్చవలసిన బాధ్యత ఇటాలియన్‌లమీద ఉందని ప్రచారం చేసింది. ఈ విధంగా ఫాసిజం సామ్రాజ్య వాదాన్ని పూర్తిగా సమర్థించింది.

**2. 1. 5. కార్పొరేట్ రాజ్యము :** తాము స్థాపించినది పెట్టుబడిదారి రాజ్యం కాదనీ, కార్పొరేట్ రాజ్యమనీ నూతన రాజ్యమనే ఫాసిస్ట్‌లు భావించారు. అయితే నిజానికి ఫాసిస్ట్‌లు స్థాపించిన కార్పొరేట్ రాజ్యంలో పెట్టుబడీదారీ లక్షణాలేగాక భయంకరమైన నియంతృత్వ లక్షణాలు కూడా స్ఫుటంగా కనిపిస్తాయి. అన్ని దేశాలలోను ఫాసిస్ట్‌లను పెట్టుబడిదారులే పోషించారు. 1924 లో జరిగిన ఎన్నికల్లో బలాన్ని ఉపయోగించి ఫాసిస్ట్‌లు మెజారిటీని సంపాదించారు. 1926 నాటికి ఇటలీలో చట్ట సమ్మతమైన పార్టీ ముస్సోలినీ నాయకత్వంలోని ఫాసిస్ట్ పార్టియే. ఫాసిస్ట్ పార్టీ ముస్సోలినీ అతని అనుచరులతో కూడిన గ్రాండ్ కౌన్సిల్ ఆధీనంలో ఉండేది. వ్యవసాయం, పరిశ్రమలు మొదలైన సంపద మీదనేగాక కార్మికులమీద కూడా ఫాసిస్ట్ ప్రభుత్వం తన పెత్తనాన్ని నెలకొల్పింది. కార్మిక సంఘాలను రద్దుచేయడం జరిగింది.

## 2. 2. ఫాసిస్ట్ పార్టీ కార్యక్రమాలు :

**2. 2. 1. వ్యవసాయరంగం:** వ్యవసాయరంగంలో ఫాసిస్ట్ ప్రభుత్వము, అభివృద్ధి కోసం ధాన్యం కోసం యుద్ధం అనే నినాదాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. ఇటలీలో గోధుమ ఉత్పత్తి దేశ అవసరాలకు సరిపడేటంత జరిగింది. కర్షకులకు శిక్షణ ఇవ్వడానికి, ఎరువుల ఉత్పత్తిని పెంచడానికి, బంజర్ భూములను సాగులోకి తేవడానికి కావలసిన అనేక చర్యలను ఫాసిస్ట్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఒక వ్యవసాయ పరపతి బ్యాంకును స్థాపించి వ్యవసాయ సహకార సంస్థలలో చేరవలసిందిగా కర్షకులను ప్రోత్సహించింది. గోధుమతో బాటు బియ్యం, ఓట్లు మొదలైన ఇతర ధాన్యాల ఉత్పత్తిని పెంచడానికి కావలసిన చర్యలను కూడా ప్రభుత్వం తీసుకొన్నది. విదేశీ దిగుమతులమీద ఆధారపడడం తగ్గించింది.

**2. 2. 2. పరిశ్రమల రంగం :** పరిశ్రమల స్థాపనకు ఫాసిస్ట్ ప్రభుత్వం ఆర్థిక సహాయమిచ్చింది. మోటారు వాహనాల పరిశ్రమకు సంబంధించినంతవరకు ఇటలీ యూరప్‌లో ఉన్నతస్థానాన్ని సంపాదించింది. యూరప్ అంతటా ఇటాలియన్ కార్లు మంచి పేరు సంపాదించడమేగాక అమెరికాలో తయారైన కార్లతో పోటీకి కూడా నిలబడగలిగినాయి. అనేక దేశాలతో ఇటలీ వాణిజ్య సంధులు చేసుకొన్నది. ఇటలీకి వచ్చే విదేశ వినోద యాత్రికుల సంఖ్య పెరిగింది. ప్రభుత్వ సహాయంతో వాణిజ్య నౌకలు నిర్మితమైనాయి. సోవియట్ రష్యా, టర్కీ, గ్రీస్, దక్షిణ అమెరికా రాజ్యాలు మొదలైన దేశాలకు ఇటలీ యుద్ధ నౌకలను నిర్మించ సాగింది.

పారిశ్రామికీకరణకు కావలసిన ఇనుము, బొగ్గు, నూనె, పత్తి మొదలైన ముడి పదార్థాల కొరతను ఇటలీ ఎదుర్కోవలసి వచ్చింది. విదేశీ మారక ద్రవ్యాన్ని కాపాడటం కోసం ప్రభుత్వం అనేక మార్గాలను అన్వేషించవలసి వచ్చింది. ఇటాలియన్‌లు విదేశాలలో డబ్బు ఖర్చు పెట్టడం చాలావరకు నిషేధించింది. ఇటాలియన్ లైర్ విలువను తగ్గించి విదేశ వాణిజ్యం, బ్యాంకింగ్ వ్యవస్థ ప్రభుత్వ యాజమాన్యం కిందికి తెచ్చింది. కాని పన్నులు పెరిగాయి. 1929 లో ఏర్పడిన ఆర్థిక మాంద్యం వల్ల ఇటలీ బాగా దెబ్బతిన్నది.

**2. 2. 3. విద్యారంగం :** ఫాసిస్ట్ ప్రభుత్వం తన దృష్టిని విద్యారంగంపై కూడా మరల్చింది. పాఠశాలల సంఖ్య పెరిగింది. నిర్బంధ విద్యా విధానం అమల్లోకి వచ్చింది. ముస్సోలినీ అధికారానికి వచ్చేముందు మూడు మిలియన్‌ల పిల్లలు పాఠశాలలకు వెళ్తున్నారు. 1935 నాటికి వారి సంఖ్య నాల్గున్నర మిలియన్‌లకు పెరిగింది. 1921 లో మొత్తం జనాభాలో నాలుగో వంతు నిరక్షరాస్యులు. 1935 లో నిరక్షరాస్యుల సంఖ్య అయిదు వంతులకు తగ్గింది. ఉత్తర ఇటలీలో అసలు నిరక్షరాస్యత లేదనే చెప్పాలి. ఫాసిస్ట్ పౌరసత్వంలో శిక్షణ ఇవ్వడానికి ఈ ప్రయత్నాలు జరిగాయి. ఉపాధ్యాయులందరూ ఫాసిస్ట్ భావాలున్నవారు. పాఠ్య గ్రంథాలన్నీ ఫాసిస్ట్ సిద్ధాంతాల కనుగుణంగా రూపొందాయి. మొత్తం జనాభాలో ఫాసిస్ట్‌ల సంఖ్య తక్కువైనా, యువతరం మాత్రం ఫాసిస్ట్ వాతావరణంలో పెరగడం మొదలు పెట్టింది. జాతీయ వాదానికి ముస్సోలిని అతీత ప్రాముఖ్యాన్ని ఇచ్చాడు. జూలియస్ సీజర్, ఆగస్టస్‌ల జ్ఞాపక చిహ్నాలే ప్రతిచోటా కొట్టవచ్చినట్లు కనిపించాయి.

**2. 2. 4. కార్మిక చట్టాలు :** సాంఘిక సంస్కరణల ద్వారా కార్మికులను తనవైపు తిప్పుకోడానికి ముస్సోలిని ప్రయత్నించాడు. ఫాసిస్ట్ ప్రభుత్వం 1926 లో అమలుచేసిన చట్టం వల్ల ఫాసిస్ట్ కార్మిక సంఘాలు తప్ప మిగతా కార్మిక సంఘాలు రద్దయినాయి. సమ్మెలను, లాక్ అవుట్లను నిషేధించడం జరిగింది. ఆరుగురు యజమానులు ఆరుగురు ఉద్యోగులు, వివిధ వృత్తులకు చెందిన ఒక వ్యక్తి కలసిన 13 సిండికేట్లను ఫాసిస్ట్ ప్రభుత్వం ఏర్పరచింది. వీటి ఆధ్వర్యంలో కార్మిక తగాదాలు పరిష్కరించడానికి ప్రయత్నాలు జరిగినాయి. 1927 లో ఒక కార్మిక చార్టర్ అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం ప్రయివేట్ ఆస్తులకు, ప్రయివేట్ చొరవకు హామీ ఇవ్వడం జరిగింది. యజమానులు కార్మికులచేత రోజుకు ఏడు గంటలకుపైన, వారానికి ఆరురోజులపైన పని చేయించకూడదు. అనారోగ్య కారణంగా కార్మికులను యజమానులు బర్తరఫ్ చేయకూడదు. యజమానులు కార్మికులకు భీమా సదుపాయాన్ని సమకూర్చాలి.

**2. 2. 5. సైనిక రంగం :** ఫాసిస్ట్ ఇటలీకి సైనికతత్వం ప్రత్యేక గుణం. ప్రభుత్వ వ్యతిరేక చర్యలను అరికట్టడానికి రహస్య పోలీస్ దళం ఏర్పడింది. 8 నుంచి 14 సంవత్సరాల వరకు వయసున్న మగ పిల్లలను యంగ్ ఫాసిస్ట్ సంస్థలలో చేర్చుకొన్నారు. 18 నుంచి 33 సంవత్సరాల వయసున్న పురుషులందరికి నిర్బంధ సైనిక శిక్షణ ఇవ్వడం జరిగింది. స్త్రీలకు వంటచేయడానికి మాత్రమే పరిమితమైనారు. దేశ సైనిక సంఖ్యను పెంచవలసిన అవసరం ఉంది కాబట్టి జననాల నియంత్రణ రద్దయింది. సైనిక విన్యాసాలు తరచు జరిగేవి. ఇటాలియన్ నౌకాపాటవం బాగా పెరిగింది. సైన్యానికి, నౌకాదళానికి వాయుసేన సమకూర్చడమైంది. సామ్రాజ్యతత్వం ఫాసిస్ట్ ఆలోచనా విధానంలో చోటు చేసుకొంది. 1911 లో ఇటలీ ఆఫ్రికా ఆక్రమణను సోషలిస్ట్‌గా తీవ్రంగా ఖండించిన ముస్సోలినీ, ఫాసిస్ట్‌గా ఇటలీకి తగ్గ సామ్రాజ్యం కావాలని ప్రచారం చేయడం మొదలు పెట్టాడు.

**2. 2. 6. మతరంగం (లాటెరన్ ఎకార్డ్) :** ఇటాలియన్ ప్రజలలో అధిక సంఖ్యాకులు కాథలిక్‌లు, అందువల్ల కాథలిక్ చర్చి సహకారాన్ని పొందవలసిన అవసరాన్ని ముస్సోలినీ గుర్తించాడు. 1870 నుంచి చర్చికి ప్రభుత్వానికి మధ్య సత్సంబంధాలు లేవు. చర్చికి ప్రభుత్వానికి మధ్య సామరస్యాన్ని సాధించడానికి అనేక సంప్రదింపులు జరిగిన ఫలితంగా 1929 లో పోప్‌కు ఫాసిస్ట్ ప్రభుత్వానికి మధ్య ఒక ఒడంబడిక జరిగింది. ఈ ఒడంబడిక ప్రకారం, వంద ఎకరాల విస్తీర్ణమున్న వాటికన్‌మీద పోప్ సార్వభౌమాధికారాన్ని, కాథలిక్ మతాన్ని ఫాసిస్ట్ ప్రభుత్వం గుర్తించింది. దీనికి బదులుగా సెవాయ్ రాజవంశాన్ని పోప్ గుర్తించాడు. ఈ ఒడంబడికకు లాటెరన్ ఎకార్డ్ అని పేరు. అయితే ఈ ఒడంబడిక జరిగిన తరవాత కూడా చర్చికి ప్రభుత్వానికి మధ్య పూర్తి సదవగాహన ఏర్పడలేదు. ఫాసిస్ట్ ప్రభుత్వం అనుసరిస్తున్న రాజకీయ, ఆర్థిక, మత విధానాలను పోప్ తీవ్రంగా విమర్శించేవాడు.

**2. 2. 7. విదేశాంగ విధానము :** ముస్సోలినీ విదేశాంగ విధాన ముఖ్యలక్ష్యం రాజ్య విస్తరణ. అనువైన అంతర్జాతీయ పరిస్థితులను ఉపయోగించుకొని ఇటలీ పేరు ప్రతిష్ఠలను ఇనుమడింప జేయడం ముస్సోలినీ ముఖ్య ఆశయం. సైనిక, నౌకా, విమాన బలాలను సర్వసన్నద్ధంగా ఉంచడమే ఫాసిస్ట్ ఇటలీ ముఖ్యవిధి అని 1927 లో ముస్సోలినీ ప్రకటించాడు. ఇటలీ రాజ్య విస్తరణను, వలస సామ్రాజ్య స్థాపనకు సమర్థించడానికి ముస్సోలినీ జనాభా ఒత్తిడిని ఒక కారణంగా పేర్కొన్నాడు. అంతేగాక పారిశ్రామికాభివృద్ధికి ముడి పదార్థాలను సంపాదించవలసిన అవసరం కూడా ఇటలీకి ఉంది. అధిక జానాభా ఉన్న ఇటాలియన్‌లు భూమి కోసం ఆకలిగొని ఉన్నారని 1926 లో ముస్సోలినీ ప్రకటించాడు. యుద్ధానంతరం అంతర్జాతీయ వాణిజ్యం క్షీణించడమేగాక ముడి పదార్థాలను సేకరించడం కూడా చాలా కష్టమయిపోయింది. అందువల్ల ఇటలీ వలసల అవసరాన్ని గుర్తించింది. వలసల పోటీలోకి చాలా ఆలస్యంగా ప్రవేశించినందువల్ల ఇటలీ తక్కువ వలసలను మాత్రమే సంపాదించగలిగింది. ఇటలీకి కావలసిన ముడిపదార్థాలు పరిమితమైన ఇటాలియన్ వలసల్లో లభ్యం కావు. పారిస్ శాంతి సంధుల ప్రకారం జర్మన్ వలసలన్నీ మిత్రరాజ్యాల పరమైనాయి. ఇటలీకి లభించిన వాటా చాలా తక్కువ. ఈ కారణంగా ఇటలీ అసంతృప్తి చెందింది. అందువల్ల ఇటలీ శాంతి సంధులను ఉల్లంఘించి రాజ్యవిస్తరణ విధానాన్ని అవలంబించవలెననే నిర్ణయానికి వచ్చింది. ఇటలీ రాజ్యవిస్తరణ విధానానికి ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లు ముఖ్యమైన విరోధులు, అంతేగాక జర్మనీ, సోవియట్ రష్యాలను కూడా విరోధులుగా భావించి ఇటలీ భీతి చెందింది.

అందువల్ల రాజ్య విస్తరణ విధానాన్ని అనుసరిస్తున్న ఇటలీ అంతర్జాతీయ రాజకీయాలలో ఇంగ్లండ్‌ను ఫ్రాన్స్‌మీద, ఇంగ్లండ్ ఫ్రాన్స్‌లను జర్మనీమీద, అన్ని రాజ్యాలను సోవియట్ రష్యాలమీద ప్రయోగించే విధానాన్ని అనుసరించింది. పశ్చిమ యూరప్‌ను బలహీనపరచడానికి ఇటలీ జర్మనీలో కామిన్‌టర్న్ వ్యతిరేక ఒప్పందలో చేరింది. ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లను చీకాకు పరచడానికి ఇటలీ కమ్యూనిజాన్ని అణచి వేసే సాకుతో స్పెయిన్ అంతర్యుద్ధంలో జోక్యం చేసుకొన్నది.

## 7.3. ఫాసిస్ట్ ఇటలీ రాజ్య విస్తరణ విధానం - ఇథియోపియా మీద ఇటలీ దురాక్రమణ :

ముస్సోలినీ 1922 లో అధికారంలోకి వచ్చిన తరవాత ఇటలీని ప్రపంచంలో ఒక అగ్రరాజ్యంగా రూపొందించడం లక్ష్యంగా పెట్టుకొని, గతంలో తన దేశం అనుసరించిన బలహీనమైన విదేశాంగ విధానానికి స్వస్తిచెప్పి రాజ్య విస్తరణ విధానాన్ని చేపట్టినాడు.

పారిస్ శాంతి సమావేశంవల్ల అసంతృప్తి చెందిన ఇటలీ మిత్ర రాజ్యాలు ఆమోదించిన స్వయం నిర్ణయ సిద్ధాంతం వల్ల మరింత అసంతృప్తి చెందింది. స్వయం నిర్ణయ సిద్ధాంతాన్ని అనుసరించి ఇటలీ కోరిన భూభాగాలను ఇవ్వడానికి మిత్రరాజ్యాలు నిరాకరించాయి. మధ్యధరా ప్రాంతంలో ఇటలీ సర్వాధికారాన్ని స్థాపించుకోవడాన్ని ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లు వ్యతిరేకించినాయి. అంతేగాక ఆదిష్ఠ ప్రదేశాలను కూడా ఇటలీకి నిరాకరించాయి.

పారిస్ శాంతి సంధి ప్రకారం ఇటలీకి బ్రెన్నర్ కనుమ, ఇస్ట్రియా, ట్రీస్టే, డాల్మేషియా తీరంలోని జారా, ఏడ్రియాటిక్ తీరానికి సమీపంలో ఉన్న కొన్ని దీవులు ఇచ్చినారు. ఏడ్రియాటిక్ తీరంలోని ఫ్యూమ్ రేవును పొందలేకపోయినందువల్ల ఇటలీ పూర్తిగా అసంతృప్తి చెందింది. అంతేగాక ఏడ్రియాటిక్ ఉత్తర తీరంలో ఏర్పాటు చేసిన ఆల్బేనియాకు స్వతంత్ర రాజ్యంగా ఇటలీ గుర్తించవలసి వచ్చింది. దీనివల్ల ఇటలీ మరింత అసంతృప్తి చెందింది.

మిత్రరాజ్యాల వల్ల తమ జాతీయ ప్రతిష్ఠకు భంగం వాటిల్లినదని ఇటాలియన్‌లు భావించారు. తాము వలస సామ్రాజ్యాన్ని స్థాపించుకోకుండా మిత్రరాజ్యాలు అడ్డు వచ్చినాయని కూడా ఇటాలియన్‌లు భావించినారు. ఆఫ్రికాలో కొన్ని భాగాలను తూర్పు మధ్యధరా ప్రాంతాన్ని పొందవచ్చునని ఇటలీ భావించింది. కాని సెవెర్స్ సంధి ప్రకారం మధ్యధరా ప్రాంతంలో గ్రీస్ అధికారాన్ని ఇటలీ గుర్తించవలసి వచ్చింది. ఆఫ్రికాలోని జర్మన్ వలసలు కూడా ఇంగ్లండ్, ఫ్రాన్స్, బెల్జియంలకు పంచి పెట్టడం జరిగింది.

ఈ విధంగా పెద్ద సామ్రాజ్యాన్ని సృష్టించుకోవలెనని ఇటాలియన్‌లు కన్న కలలు, ఆశలు నెరవేరలేదు. మొదటి ప్రపంచ యుద్ధానంతరం ఇటలీ తీవ్రంగా నష్టపడిన దేశంగానే గాక పూర్తిగా అసంతృప్తి చెందిన రాజ్యంగా పరిణమించింది. అంతేగాక దేశంలో అలుముకొన్న ఆర్థిక మాంద్యం, లంచగొండితనంనుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి ఆధునిక కాలం సీజర్‌లాగా రాణిస్తాననే కోరికతోనూ ముస్సోలినీ ఇథియోపియాపై దురాక్రమణకు పూనుకొన్నాడు.

**3. 1. ఇథియోపియామీద ఇటలీ దురాక్రమణ :** 1929 లో ఏర్పడిన ఆర్థిక మాంద్యము ఇటలీలో తీవ్రమైన పరిస్థితులను సృష్టించింది. ఆర్థిక సంక్షోభానికి తోడు ఇటలీలో సాంఘిక సమస్యలు కూడా తలెత్తినాయి. సాహసోపేతమైన, చురుకైన విదేశాంగ విధానాన్ని అనుసరించి దేశ ప్రజల దృష్టిని ఆంతరంగిక సమస్యలనుంచి విదేశ వ్యవహారాల వైపుకు మళ్ళించడానికి ఫాసిస్ట్ ప్రభుత్వం ప్రయత్నించింది. ఆనాటి అంతర్జాతీయ పరిస్థితి కూడా ఇటలీకి అనువుగా ఉంది. మంచూరియా మీద జపాన్ దురాక్రమణ, పశ్చిమ రాజ్యాల నిర్లిప్త వైఖరి ఇటలీ రాజ్య విస్తరణ విధానానికి ప్రోత్సాహాన్ని కలగజేసినాయి. పైగా ప్రపంచమంతా ఆర్థిక దుస్థితికి లోనై ఉంది. ఈ సదవకాశాన్ని ఉపయోగించుకొని ఇటలీ తన రాజ్య విస్తరణ విధానంలో భాగంగా ఇథియోపియాను ఆక్రమించుకోదలచింది.

**3. 1. 1. రాజ్య విస్తరణకు కారణాలు :**

1) ఆసియా మైనర్‌లో ఇటలీ రాజ్య విస్తరణను పారిస్ శాంతి సమావేశము అడ్డుకొన్నది. అందువల్ల డాన్యూబియన్, బాల్కన్ ప్రాంతాలలోను, ఆఫ్రికాలోను వలస సామ్రాజ్య స్థాపనకు ఇటలీ పూనుకొన్నది.

2) పెరుగుతున్న తన జనాభా ఆహార నివాస అవసరాలను తీర్చడానికి ఇటలీకి కొత్త వలసలను సంపాదించవలసిన అవసరమేర్పడింది.

3) తన పారిశ్రామికాభివృద్ధికి కావలసిన ముడి పదార్థాలను ఇటలీ ఇథియోపియానుంచి పొందడానికి నిశ్చయించుకొన్నది.

4) అభివృద్ధి చెందని అనాగరిక ప్రదేశమైన ఇథియోపియాను నాగరిక ప్రాంతంగా మార్చడం, వెనకబడిన ప్రాంతాలను నాగరిక ప్రాంతాలుగా మార్చడమనే తన విధానంలో భాగంగా ఇటలీ భావించింది.

**3. 1. 2. ఇటలీ - ఫ్రాన్స్‌ల మధ్య ఒడంబడిక (1935) :** ఇటలీ-ఫ్రాన్స్‌లమధ్య ఒడంబడికకు అనేక అంశాలు దోహదపడ్డాయి. అవి:

1) ఆగ్నేయ యూరప్, ఆఫ్రికాలలో ఇటలీ రాజ్యవిస్తరణ విధానానికి ఫ్రాన్స్ అవరోధమయింది. అంతేగాక డాన్యూబియన్ ప్రాంతంలో ఇటలీ ఆధిపత్యాన్ని నాజీ జర్మనీ ప్రతిఘటించింది. అందువల్ల తన అబిసీనియా (ఇథియోపియా) విధానానికి ఇటలీ ఫ్రెంచి మద్దతును సంపాదించదలచుకొన్నది.

2) హిట్లర్ ఆస్ట్రియా విధానంవల్ల ఇటలీ వలెనే ఫ్రాన్స్‌కూడా ఆందోళన చెందింది.

3) అంతేగాక బాల్కన్ ప్రాంతంలోను, ఆల్బేనియాలోను ఇటలీ, జర్మనీలమధ్య రాజ్య విస్తరణ కోసం పోటీ ఎక్కువైంది. జర్మనీని ప్రతిఘటించడానికి ఇటలీకి ఫ్రెంచి సహకారము అవసరమైంది.

మొత్తం మీద హిట్లర్ దురాక్రమణ విధానం ఇటలీ ఫ్రాన్స్‌లమధ్య సన్నిహిత సంబంధాలకు దారి తీసిందని చెప్పవచ్చు. 1935 లో ఫ్రాన్స్ ఇటలీలమధ్య 'లావల్-ముస్సోలినీ ఒడంబడిక' జరిగింది. ఈ సంధి ప్రకారం :

1) జర్మన్ దురాక్రమణకు వ్యతిరేకంగా ఆస్ట్రియా స్వాతంత్ర్యాన్ని కాపాడటం కోసం పరస్పరం సంప్రదింపులు జరుపుకోవడానికి ఫ్రాన్స్ - ఇటలీలు అంగీకరించాయి.

2) సైబీరియాకు సమీపంలోని 45 వేల మైళ్ళ భూభాగాన్ని, ఫ్రెంచి సోమాలీలాండ్ లోని కొన్ని భాగాలను ఫ్రాన్స్ ఇటలీకిచ్చింది.

3) ఆడిస్ - అబాబా రైల్వేలో కొంత భాగాన్ని ఫ్రాన్స్ ఇటలీ పరంచేసింది.

4) ట్యునీషియాలోని ఇటాలియన్‌లకు ప్రత్యేక పౌరసత్వపు హక్కులను, విద్యా సౌకర్యాలను ఫ్రాన్స్ మంజూరు చేసింది.

5) అంతేగాక ఈ సంధి ప్రకారం ఇథియోపియా మీద ముస్సోలినీ దురాక్రమణకు ఫ్రాన్స్ తన రహస్య మద్దతును ఇచ్చింది.

ఇంత వరకు ఇటలీ రాజ్య విస్తరణ విధానాన్ని ఫ్రాన్స్ ప్రతిఘటించింది. కాని హిట్లర్ దురాక్రమణ విధానంవల్ల భీతిచెంది గత్యంతరం లేక ఫ్రాన్స్, ఇటలీతో రాజీ పడవలసి వచ్చింది. హిట్లర్ దురాక్రమణల వల్ల ఆందోళన చెందిన బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీలు 1935 లో జరిగిన స్ట్రెస్సా సమావేశంలో హిట్లర్ చర్యలను గర్హించినాయి. హిట్లర్‌కు వ్యతిరేకంగా బ్రిటన్, ఫ్రాన్స్‌లకు సహాయం చేయడానికి ముస్సోలినీ అంగీకరించినందుకు ప్రతిఫలంగా అబిసీనియాను ఆక్రమించుకోవడానికి ఇటలీకి మద్దతు లభించింది.

**3. 1. 3. వాల్ వాల్ సంఘటన :** ఇథియోపియాను ఆక్రమించుకోవలెననే కోరిక ఇటలీకి చాలాకాలం నుంచి ఉంది. కాని 1906 లో ఎడోవా యుద్ధంలో ఇథియోపియా ఇటాలియన్ సైన్యాలను పూర్తిగా ఓడించింది. ఫాసిస్ట్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత ఇథియోపియాతోటి యుద్ధంలో పరాజయంవల్ల లోగడ కోల్పోయిన ప్రతిష్ఠను ఇటలీ తిరిగి సంపాదించుకోవలెననే కృత నిశ్చయంతో ఉన్నది. ఆర్థిక వలస సదుపాయాల కోసమే గాక ప్రతిష్ఠ కోసం కూడా ఇథియోపియాను జయించవలెననే కోరిక ముస్సోలినీకి కలిగింది. మొదట్లో శాంతియుత పద్ధతుల ద్వారా తన ప్రయోజనాలను పరిరక్షించుకోవడానికి ఇటలీ 1928 లో ఇథియోపియాతో ఒక సంధి చేసుకొన్నది. కాని అంతరంగిక ఆర్థికదుస్థితి, జర్మన్ దురాక్రమణ విధానము మొదలైన కారణాలవల్ల ఇథియోపియాపెట్ల తన విధానాన్ని మార్చుకొని ఇటలీ అబిసీనియాను ఆక్రమించుకోడానికి నిశ్చయించుకొన్నది.

ఇథియోపియాపై దండెత్తడానికి ఏదో ఒక చిన్న సంఘటన ముస్సోలినికి చాలు. 1934 డిసెంబర్‌లో వాల్ వాల్ అనే చోట ఇటాలియన్, ఇథియోపియన్ సైనికులకు ఘర్షణ జరిగింది. వందమంది ఇథియోపియన్‌లు మరిణించారు. ఇది జరిగింది ఇథియోపియా సరిహద్దుకు వందమైళ్ళ లోపు అయినా ముస్సోలిని ఇథియోపియా దురాక్రమణ జరిపిందని ప్రకటించి, దాని ఆక్రమణకు సైనిక సన్నాహాలు ప్రారంభించాడు. అబిసీనియా వాల్ వాల్ సంఘటనను సమితికి నివేదించి, మధ్య వర్తిత్వాన్ని కోరడమేగాక, సమితి నిర్ణయానికి కట్టుబడి ఉండడానికి కూడా అంగీకరించింది. వాల్ వాల్ సంఘటనకు బాధ్యత ఎవరిదనే విషయాన్ని మాత్రమే మధ్యవర్తిత్వ సంఘం దర్యాప్తు చేస్తుంది. కాని వాల్ వాల్ ఇరుపక్షాలలో-ఎవరికి చెందవలెననే సమస్య జోలికి పోదని సమితి స్పష్టం చేసింది.

**3. 1. 4 సమితి మధ్యవర్తిత్వము :** ఇథియోపియా సమస్యను పరిష్కరించడానికి సమితి సలహా ననుసరించి బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీలు పారిస్‌లో సమావేశమైనాయి. ఇటలీకి ఇథియోపియాలో కొన్ని ఆర్థిక సదుపాయాలను కలగజేయడానికి ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లు అంగీకరించాయి. అయితే ఈ ప్రతిపాదనకు అంగీకరించక ముస్సోలినీ తూర్పు ఇథియోపియాను ఆక్రమించుకోవడానికి నిశ్చయించుకొన్నాడు. ముస్సోలినీ వైఖరి తెలుసుకొన్న సమితి బ్రిటన్, ఫ్రాన్స్, పోలండ్, స్పెయిన్, టర్కీల ప్రతినిధులతో కూడిన దర్యాప్తు సంఘాన్ని నియమించింది. కాని ఇథియోపియా రంగంలో తన సైనిక చర్యలను తగ్గించడానికి ఇటలీ నిరాకరించింది. అంతేగాక తటస్థ పరిశీలకుని నియమించవలెననే ఇథియోపియా రాజు హెయిలీ సెల్లాసీ ప్రతి పాదనను అమలు పరచడానికి సమితి అంతగా ఆసక్తి చూపలేదు.

సమితి నియమించిన దర్యాప్తు సంఘం ఇథియోపియా అభివృద్ధికి ఒక పథకాన్ని తయారు చేయడమేగాక ఇథియోపియాలో ఇటలీ ప్రత్యేక హక్కులను కూడా గుర్తించింది. ఈ పథకాన్ని హెయిలీ సెల్లాసీ ఆమోదించాడు. కాని ముస్సోలినీ తిరస్కరించాడు. 15రాజ్యాలతో కూడిన మరొక సంఘాన్ని నియమించడానికి సమితి నిశ్చయించుకొన్నది. ఈ సంఘం సమావేశంలో ఉండగానే 1935 లో ఇటలీ ఇథియోపియా మీద దాడి చేసింది. ఇటలీని దురాక్రమణ జరిపిన దేశంగా సమితి మండలి పేర్కొన్నది. మండలి నిర్ణయాన్ని ఆమోదించిన సమితి మహాసభ ఇటలీమీద కొన్ని ఆర్థిక సైనిక ఆంక్షలను విధించడమే గాక అవసరమైతే ఇటలీమీద సైనిక ప్రయోగాన్ని కూడా చేయవచ్చని సిఫారసు చేసింది. 1935 నవంబర్ 18 నుంచి సమితి ఆంక్షలు అమలులోకి రావలసి ఉంది. సమితి చేసిన సిఫారసులను ఇటలీ తీవ్రంగా గర్హించడమే గాక సమితి సభ్యులకు హెచ్చరిక కూడా చేసింది.

**3. 1. 5. ఇథియోపియా ఆక్రమణ (1936) :** ఇటలీ ఇథియోపియాపైకి 1935 నవంబర్‌లో సైన్యాలను పంపింది. ఏడు నెలల పోరాటం ఫలితంగా ఇటలీ సైన్యము ఇథియోపియా రాజధాని అడిస్ - అబాబాలోకి 1936 మేలో ప్రవేశించింది. హెయిలీ సెల్లాసీ ఇథియోపియా నుంచి యూరప్‌కు పారిపోయినాడు. ఇథియోపియా ఇటలీలో భాగమయింది. కొంత కాలం తరువాత యూరప్ రాజ్యాలు ఇటలీ ఇథియోపియా ఆక్రమణను గుర్తించినాయి.

**3. 1. 6. ఫలితాలు :**

1) ఇథియోపియా ఆక్రమణవల్ల ఇటలీ అంతగా లాభాన్ని పొందలేకపోయింది. ఇథియోపియామీద యుద్ధం జరుగుతున్న కాలంలో ఇటలీలో ధరల పెరుగుదలవల్ల ఆర్థిక సమస్య ఏర్పడింది.
2) ఈ యుద్ధ ఫలితంగా జర్మనీ దురాక్రమణకు వ్యతిరేకంగా స్ట్రెస్సా సమావేశం తీసుకొన్న రక్షణ చర్యలు దెబ్బతిన్నాయి.
3) ఆస్ట్రియా మీద దురాక్రమణ జరపడానికి హిట్లర్‌కు స్వేచ్ఛ లభించింది.
4) ఈ యుద్ధం వల్ల సమితి బలహీనపడటమేగాక యూరప్‌లో ఫాసిజం బలపడింది.
5) జర్మనీ ఇటలీలమధ్య ఏర్పడిన మైత్రి ఫ్రెంచి ఆందోళనకు కారణమైంది.

**3. 1. 7. ఇథియోపియాను రక్షించడంలో సమితి వైఫల్యం :** ఇటలీ దురాక్రమణ జరపగానే ఇథియోపియన్‌లు సమితికి ఫిర్యాదు చేశారు. ఇథియోపియన్‌లు అనాగరికులని వారితో చర్చలు జరిపే ప్రసక్తి లేదని చెప్పి ఇటాలియన్ ప్రతినిధులు సమితిమంచి

వెళ్ళిపోయారు. ఇటలీ దురాక్రమణ చేసిందని సమితి ప్రకటించింది. ఇటలీపై ఆంక్షలు విధించడానికి సమితిలో ప్రయత్నాలు జరిగాయి. కానీ బ్రిటన్, ఫ్రాన్స్‌లు ఇటలీపై ఆంక్షలు విధించడానికి సిద్ధంగా లేవు.

జర్మనీని అదుపులో పెట్టడానికి ఇటలీ అవసరం ఎంతైనా ఉందని ఫ్రెంచి విదేశాంగ మంత్రి పియరి లవా భావన. ఇటలీపై ఆంక్షలు విధించే విషయంలో బ్రిటన్‌కు కూడా చాలా భయాలు, అనుమానాలు ఉన్నాయి. అమెరికా సమితి విధించే ఆంక్షలను ఖాతరు చేయక పోవచ్చునని, ఇటలీలో ఫాసిస్ట్ ప్రభుత్వం పతనమైతే కమ్యూనిస్టులు అక్కడ అధికారంలోకి రావచ్చునని బ్రిటన్ ఆంక్షలను అమలు జరిపేవిషయంలో తట పటాయించింది. ఈ పరిస్థితులలో ముస్సోలినీ ఇథియోపియాను కబళించి ఇథియోపియన్‌లను చిత్రహింసలకు గురిచేసింది.

ఫాసిస్ట్ ప్రభుత్వాన్ని తృప్తిపరిచే బ్రిటన్, ఫ్రాన్స్‌ల కార్యక్రమం అంతటితో ఆగలేదు. సమితి సభ్యత్వంనుంచి ఇథియోపియాను తొలగించడానికి రెండు దేశాలు సిద్ధపడి, రెండు నెలల తర్వాత ఇథియోపియా ఇటలీకి చెందుతుందని అధికార పూర్వకంగా ప్రకటించాయి. దురాక్రమణ చేసిన ఇటలీపై ఆంక్షలు విధించడంలో వైఫల్యం చెందిన సమితి పూర్తిగా నీరసించిపోయింది. అంతేగాక, దీనివల్ల జర్మన్-ఇటాలియన్ భాగస్వామ్యం ప్రారంభమైంది.

**3. 2. ఇటలీ - గ్రీస్‌ల మధ్య సంబంధాలు :** ముస్తఫా కెమల్ పా షా మిత్రరాజ్యాలలో సెవర్స్ సంధి (1920) బదులు లాజేన్ సంధి చేసుకొన్నాడు. ఈ సంధి (1923) లో భాగంగా డోడ్ కనీస్ దీవుల మీద ఇటలీ ఆధిపత్యాన్ని గ్రీస్ గుర్తించింది. దీనివల్ల తూర్పు మధ్యధరా ప్రాంతంలో ఇటలీ పలుకుబడి విస్తరించింది. గ్రీస్ - ఆల్బేనియాల మధ్య సరిహద్దులను నిర్ణయించే సంఘంలోని ఇటాలియన్ సభ్యులను గ్రీస్ దేశస్థులు హత్య చేసినారనే నేరాన్ని గ్రీస్‌మీద మోపి గ్రీస్‌నుంచి ఇటలీ నష్ట పరిహారాన్ని కోరింది. గ్రీస్ ప్రభుత్వం అందుకు సమ్మతించినందువల్ల ఇటలీ గ్రీస్‌కు చెందిన కోర్ఫు దీవిని ఆక్రమించుకొన్నది. ఇటలీమీద గ్రీస్ సమితికి ఫిర్యాదు చేసింది. అయితే గ్రీస్ నష్టపరిహారాన్ని చెల్లించిన తరవాత మాత్రమే ఇటలీ సైన్యం కోర్ఫు దీవినుంచి వైదొలిగింది. ఈ విజయం కారణంగా ముస్సోలినీ ప్రతిష్ఠ పెరిగింది.

**3. 3. ఇటలీ - ఫ్రాన్స్‌లమధ్య సంబంధాలు :** ఇటలీ - ఫ్రాన్స్‌ల మధ్య సంబంధాలు తృప్తికరంగా లేవు. రెండు దేశాల రాజకీయ సిద్ధాంతాలు పరస్పరం విరుద్ధంగా ఉండటం, ఫాసిస్ట్ వ్యతిరేకులకు ఫ్రాన్స్ ఆశ్రయమివ్వడం, ఫ్రాన్స్‌కు చెందిన ప్రాంతాలపై తనకు హక్కుందని ఇటలీ వాదించడం, పారిస్ శాంతి సమావేశంలో తన హక్కులకు ఫ్రాన్స్ అడ్డుతగలడం, ఫ్రెంచి అభీష్టానికి వ్యతిరేకంగా శాంతి సంధుల సవరణను ఇటలీ కోరడం మొదలైన కారణాల వల్ల ఇటలీ - ఫ్రాన్స్‌ల మధ్య విరోధ మేర్పడింది. ఈ కారణాలవల్ల ఫ్రాన్స్‌ను వ్యతిరేకించే దేశాలలో 1933 వరకు ఇటలీ మైత్రి చేయడం సాగించింది. కాని 1933 లో జర్మనీలో హిట్లర్ అధికారంలోకి రావడంతో ఫ్రాన్స్ ఇటలీలమధ్య సంబంధాలలో మార్పు వచ్చింది. నాజీ దురాక్రమణ విధానాల వల్ల భీతిచెందిన ఫ్రాన్స్- ఇటలీలు 1935 లో ఒక సంధి చేసుకొన్నాయి. ఈ సంధి ప్రకారం రెండు దేశాలమధ్య వలసల కోసం లోగడ ఏర్పడిన విరోధం తొలగించడమేగాక, ఆస్ట్రియా స్వాతంత్ర్యానికి నాజీ జర్మనీ వల్ల ప్రమాదమేర్పడినపుడు పరస్పరం సంప్రదించుకోవడానికి ఏర్పాటు చేయడం జరిగింది. అంతేగాక ఆఫ్రికాలో తనకు చెందిన కొన్ని ప్రాంతాలను ఇటలీకివ్వడానికి ఫ్రాన్స్ అంగీకరించింది.

1935 లో ఇటలీ ఇథియోపియా మీద దురాక్రమణ చేసినందువల్ల రెండు దేశాలమధ్య సంబంధాలు తిరిగి క్షీణించినాయి. కాని చివరకు నాజీ జర్మనీవల్ల భీతిచెందిన ఫ్రాన్స్, ఇంగ్లండ్‌లతో బాటు ఇటలీని సంతృప్తి పరిచే విధానాన్ని అనుసరించింది. ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లు అనుసరించిన సంతృప్తి పరిచే విధానంవల్ల ఇటలీ ధైర్యంగా ఇథియోపియాను బలప్రయోగం చేసి ఆక్రమించుకొన్నది. అయితే 1939 లో ఇటలీ జర్మనీలు ఒక సైనిక కూటమిగా ఏర్పడినపుడు తిరిగి ఫ్రాన్స్ ఇటలీల మధ్య సంబంధాలు క్షీణించాయి. ఫ్రాన్స్ భద్రతకు నాజీ జర్మనీ వల్ల ప్రమాద మేర్పడింది. అంతేగాక వర్సెసంధిని ఉల్లంఘించడానికి ఇటలీ జర్మనీకి మద్దతు ఇచ్చింది. కార్సికా, సెవాయ్, నైస్‌ల మీద తనకు హక్కున్నదని ఇటలీ తిరిగి వాదించ సాగింది. 1940 లో జర్మనీతో కలిసి ఇటలీ ఫ్రాన్స్‌మీద దాడిచేసింది.

9)

**3. 4. ఇటలీ - యుగోస్లావియాలమధ్య సంబంధాలు :** పారిస్ శాంతి సమావేశంలో ఫ్యూమ్ రేవు విషయమై ఇటలీ - యుగోస్లావియాలమధ్య వివాద మేర్పడింది. విల్సన్ స్వయం నిర్ణయ సిద్ధాంతం ప్రకారం ఫ్యూమ్ తనకు చెందవలెనని ఇటలీ కోరింది. పారిస్ శాంతి సమావేశం ఫ్యూమ్‌ను ఇటలీకి ఇవ్వలేదు. అందువల్ల ఇటలీ 1919 లో ఫ్యూమ్ రేవును ఆక్రమించింది. కాని 1920 లో ఇటలీ యుగోస్లావియాలమధ్య జరిగిన సంధి ప్రకారం ఫ్యూమ్‌ను స్వేచ్ఛానగరంగా గుర్తించడం జరిగింది.

ముస్సోలినీ అధికారంలోకి వచ్చిన తరవాత 1924 లో జరిగిన ఒడంబడిక ప్రకారం ఇటలీ ఫ్యూమ్‌ను మూడు సంవత్సరాల వరకు ఆక్రమించుకొని ఉండటానికి యుగోస్లావియా సమ్మతించింది. ఫ్యూమ్ రేవులో వాణిజ్య హక్కును, ఫ్యూమ్‌కు సమీపంలో ఉన్న బారోస్ రేవు యుగోస్లావియాకు ఇవ్వడం జరిగింది. ఈ సంధి జరిగిన తరవాత రెండు దేశాలమధ్య సంబంధాలు మెరుగుపడినాయి. 1925 లో జరిగిన నెట్టినో సమ్మేళనం ప్రకారం ఇటలీ యుగోస్లావియాలు పరస్పరం ఆర్థిక సౌకర్యాలు కలగజేసుకోవడానికి అంగీకరించినాయి.

1927 లో యుగోస్లావియా ఫ్రాన్స్‌ల మధ్య మైత్రి సంధికి సమాధానంగా ఇటలీ ఆల్బేనియాతో ఒక సంధి చేసుకొన్నది. అదే సంవత్సరం ఇటలీ హంగరీ బల్గేరియాలతో మైత్రి సంబంధాలు నెలకొల్పుకొన్నది. దీనివల్ల యుగోస్లావియా భీతి చెందింది. బాల్కన్ ప్రాంతంలో రాజ్య విస్తరణ విధానాకు ముస్సోలినీ విదేశాంగ నీతిలో భాగమనే సంగతిని యుగోస్లావియా అవగాహన చేసుకొన్నది. 1929 లో జరిగిన సంధి ప్రకారం యుగోస్లావియామీద ఇటలీ దౌత్య విజయం సాధించింది.

హిట్లర్ దురాక్రమణ విధానం వల్ల ఆందోళన చెందిన ఇటలీ ఫ్రాన్స్‌ల మధ్య సహకారం పెంపొందించి 1934 లో రెండు దేశాలమధ్య సంప్రదింపులు జరిగినాయి. దీనివల్ల యుగోస్లావియా ఆందోళన చెందింది. యుగోస్లావియా రాజు అలెగ్జాండర్ 1934 లో మార్సెల్స్ అనే చోట హత్యచేయబడినపుడు ఇటలీ యుగోస్లావియాలమధ్య సంబంధాలు మరింత క్షీణించాయి. ఈ హత్యానేరాన్ని యుగోస్లావియా ఇటలీమీద మోపింది. రెండో ప్రపంచయుద్ధం ప్రారంభమయ్యే వరకు ఇటలీ యుగోస్లావియాల మధ్య సంబంధాలు మెరుగుపడలేదు.

**3. 5. ఇటలీ - ఆల్బేనియాల మధ్య సంబంధాలు :** పారిస్ శాంతి సమావేశానంతరం ఆల్బేనియాలో తాత్కాలిక ప్రభుత్వ మేర్పడింది. కాని కొద్ది కాలంలోనే ప్రభుత్వాన్ని కూలదోసి అహమ్మద్ జోగు అధికారంలోకి వచ్చినాడు. 1924 లో అహమ్మద్ జోగును దేశంనుంచి తరిమివేసి బిషప్‌నోలి అధికారంలోకి వచ్చాడు. కాని తిరిగి జోగు అధికారాన్ని హస్తగతం చేసుకోగా నోలి ఇటలీలో తలదాచుకొన్నాడు. ఆల్బేనియా రిపబ్లిక్‌గా ప్రకటించడం జరిగి జోగు రిపబ్లిక్ ప్రథమ అధ్యక్షుడుగా ఎన్నికైనాడు.

1925 లో జోగు ఇటలీ సహాయంతో ఆల్బేనియాలో ఒక జాతీయ బాంక్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. కొద్ది కాలంలోనే ఇటలీ ఆల్బేనియామీద తన ఆధిపత్యాన్ని స్థాపించుకోవడమే గాక ఒట్రాంటో జలసంధిని తన అధికారంలోనికి తెచ్చుకొన్నది. 1926 -27 లలో ఇటలీ సహకారంతో ఆల్బేనియా అనేక అభివృద్ధి ప్రాజెక్ట్‌లను అమలుపరచడం జరిగింది. ఇటాలియన్ సైనికాధికారుల సహాయంతో ఆల్బేనియా సైన్యం పూర్తిగా పునర్వ్యవస్థీకరించడం జరిగింది.

1926 లో ఆల్బేనియాలో ఒక తిరుగుబాటు వచ్చినపుడు జోగు ఇటలీ సహాయాన్ని అర్థించాడు. ఫలితంగా రెండు దేశాలమధ్య టిరానా సంధి జరిగింది. ఈ సంధి ప్రకారం 1) ఆల్బేనియామీద ఏ విధమైన దురాక్రమణ జరిగినప్పటికీ దానిని రెండు దేశాలకు సంబంధించిన అపాయంగా పరిగణించవలెనని ఇటలీ ఆల్బేనియాలు అంగీకరించాయి. 2) ఇరుపక్షాల ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ విధమైన సంధులను ఇతర రాజ్యాలతో చేసుకోకుండా ఉండటానికి రెండు దేశాలు అంగీకరించాయి. 3) ఆల్బేనియా సమ్మతితో ఇటలీ ఆల్బేనియా ఆంతరంగిక విదేశ వ్యవహారాలలో జోక్యం కలిగించుకొంటుంది.

టిరానా సంధివల్ల ఆందోళన చెందిన యుగోస్లావియా 1927 లో ఫ్రాన్స్‌లో ఒడంబడిక చేసుకొంది. దీంతో ఇటలీ ఆల్బేనియాలు 20 సంవత్సరాల కాలం అమలులో ఉండే ఒక సైనిక ఒప్పందాన్ని చేసుకొన్నాయి. 1927 లోనే జోగు తనను ఆల్బేనియా రాజుగా ప్రకటించుకొన్నాడు. ఇటలీ ఆల్బేనియాలమధ్య లోగడ జరిగిన టిరానా సంధిని 1931 లో తిరిగి చేసుకోవడం జరిగింది. కాని 1931 నుంచి ఆల్బేనియాలో ఇటాలియన్ వ్యతిరేక వైఖరితో అభివృద్ధి చెందింది. 1932 లో ఇటలీ ఆల్బేనియాలమధ్య సుంకాల సంఘం స్థాపనకు ఇటలీ

చేసిన ప్రతిపాదనకు రాజా జోగు తిరస్కరించాడు. 1934 లో ఆల్బేనియా సైన్యంలో ఇటాలియన్ ఉద్యోగుల అధికారాన్ని తగ్గించి ఆల్బేనియాలో ఇటాలియన్‌లు వలస రావడాన్ని అరికట్టడానికి రాజా జోగు ప్రయత్నించి విఫలుడైనాడు.

1939 లో ఇటాలియన్ సైన్యాలు ఆల్బేనియామీద దాడిచేసి టిరానాలోకి ప్రవేశించాయి. ఇటాలియన్ సైన్యాన్ని ఆల్బేనియా ఎదుర్కోలేక పోయింది. రాజా జోగు దేశం వదలి పారిపోయాడు. ఆల్బేనియా ఇటలీలో విలీనం చేయడం జరిగింది. ఇటలీ ఆల్బేనియాల యూనియన్ యూరప్ రాజ్యాలు గుర్తించాయి.

**3. 6. స్పెయిన్ అంతర్యుద్ధంలో ఇటలీ జోక్యము :** 1936 లో స్పెయిన్‌లో జనరల్ ఫ్రాంకో నాయకత్వంలో తిరుగుబాటు జరిగింది. తిరుగుబాటు దారులకు ఫాసిస్ట్ ఇటలీ నాజీ జర్మనీలు ఆర్థిక సైనిక సహాయం చేశారు. ప్రభుత్వ పక్షానికి సోవియట్ రష్యా మద్దతు ఇచ్చింది. బ్రిటన్ ఫ్రాన్స్‌లు రిపబ్లిక్‌కు సానుభూతి చూపినాయి. స్పెయిన్‌లో జరిగే అంతర్యుద్ధంలో విదేశాలు జోక్యం చేసుకోకూడదని బ్రిటన్ ప్రకటించింది. బ్రిటన్‌తోబాటు ఇతర యూరప్ రాజ్యాలు కూడా అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ స్పెయిన్ అంతర్యుద్ధంలో విదేశాల జోక్యం కొనసాగింది. ముఖ్యంగా ఇటలీ జర్మనీలు భారీ ఎత్తున తిరుగుబాటు దారులకు సహాయపడినాయి. 1936 జూలైలో ప్రారంభమైన స్పెయిన్ అంతర్యుద్ధం 1939 వరకు కొనసాగింది. చివరకు జనరల్ ఫ్రాంకో పక్షం గెలిచి స్పెయిన్‌కు ఫ్రాంకో నియంత అయినాడు. మధ్యధరా ప్రాంతంలో ఇటలీ ఆధిపత్యాన్ని స్థాపించడంకోసం ముస్సోలినీ స్పెయిన్ అంతర్యుద్ధంలో జోక్యం చేసుకొన్నాడు.

**3. 7. ఇటలీ జర్మనీల మధ్య ఒడంబడిక (1939) :** స్పెయిన్ అంతర్యుద్ధంలో జోక్యం కలిగించుకొన్నప్పటినుంచీ ఇటలీకి పశ్చిమ రాజ్యాలతో పోరాటం ప్రారంభమైంది. అందువల్ల తన రక్షణకోసం ఇటలీ ఆస్ట్రియా పట్ల దురాక్రమణ విధానాన్ని అనుసరిస్తున్న జర్మనీకి మద్దతు ఇవ్వడానికి నిశ్చయించుకొన్నది. 1937 సెప్టెంబర్‌లో ముస్సోలినీ బెర్లిన్ సందర్శించి హిట్లర్ చేస్తున్న సైనిక సన్నాహాలను చూసి భవిష్యత్తులో జరగబోయే యుద్ధంలో జర్మనీ తప్పక విజయాన్ని సాధిస్తుందని అభిప్రాయ పడినాడు. 1937 నవంబర్‌లో ముస్సోలినీ కొమిన్‌టర్న్ వ్యతిరేక టోక్యో - బెర్లిన్ ఒప్పందంలో చేరి సమితినుంచి ఉపసంహరించుకొని జర్మనీలో తన సంబంధాలను పటిష్ఠం చేసుకోసాగినాడు. 1938లో బలప్రయోగంచేసి హిట్లర్ ఆస్ట్రియాను ఆక్రమించడాన్ని ముస్సోలినీ సమర్థించాడు. కాని ముస్సోలినీ జర్మనీపట్ల అనుసరించిన విధానాన్ని ఇటాలియన్‌లు వ్యతిరేకించారు. ఇటలీ భద్రతకు స్వప్రయోజనాలకు స్వతంత్ర ఆస్ట్రియా మనుగడ అవసరమని ఇటాలియన్‌లు భావించారు. అంతేగాక ఆస్ట్రియాను కలుపుకొన్నందువల్ల జర్మనీ మితిమీరిన బలమైన దేశంగా మారుతుందని ఇటాలియన్‌లు భీతిచెందినారు.

ముస్సోలినీ ఆహ్వాన మీద ఇటలీ సందర్శించడానికి వచ్చిన హిట్లర్ కొమిన్‌టర్న్ ఒడంబడికను సైనిక ఒడంబడికగా మార్చవలెననే ప్రతిపాదనను చేసినాడు. ఈ ప్రతిపాదనకు మొదట ముస్సోలినీ అంగీకరించకపోయినప్పటికీ జర్మనీ ఫ్రాన్స్‌ల మధ్య సైనిక ఒడంబడిక జరుగుతుందనే వదంతి వ్యాపించినందువల్ల చివరకు ముస్సోలినీ హిట్లర్ ప్రతిపాదనను అంగీకరించాడు. జర్మనీ సైనిక బలము బాగా గొప్పదని నమ్మిన ముస్సోలినీ హిట్లర్‌తో 1939 మే 22 న ఒక సైనిక ఒప్పందం చేసుకొన్నాడు. ఈ ఒప్పందం ప్రకారం ఇరుపక్షాలు రాజకీయ, ఆర్థిక, దౌత్య రంగాలలో పరస్పరం సహకరించు కోవడానికి, అవసరం వచ్చినపుడు ఒకరికొకరు సైనిక సహాయం చేసుకోడానికి అంగీకరించాయి.

**3. 8. ఇటలీ - బ్రిటన్‌లమధ్య సంబంధాలు :** జర్మనీకి మద్దతు ఇవ్వడానికి ఇటలీ నిశ్చయించుకొన్నా, బ్రిటన్‌తో మైత్రికి ప్రయత్నాలు మానుకోలేదు. 1937 లో ఆంగ్లో - ఇటాలియన్ పెద్ద మనుష్యుల ఒప్పందం జరిగింది. దీని ప్రకారం మధ్యధరా ప్రాంతంలో పరస్పర ప్రయోజనాలను కాపాడుకోవడానికి ఇరుపక్షాలు అంగీకరించాయి. జర్మనీతో ఆస్ట్రియా కలయికను ఇటాలియన్‌లు వ్యతిరేకించడమేగాక, భీతిచెందినారు. తన దేశ ప్రజల ఆందోళనను తొలగించడానికి ముస్సోలినీ 1938 లో బ్రిటన్‌తో సియానో - పెర్త్ ఒడంబడికను చేసుకొన్నాడు. దీని ప్రకారం అబిసీనియా ఆక్రమణను బ్రిటన్ గుర్తించింది. స్పెయిన్‌నుంచి ఇటాలియన్ సైన్యం ఉపసంహరించడం జరిగింది.

8.9 **సారాంశము :** రెండు ప్రపంచ యుద్ధాల మధ్యకాలంలో ముస్సోలినీ ప్రయత్నాల ఫలితంగా ఏడ్రియాటిక్ ప్రాంతంలో ఆధిపత్యాన్ని, యూరప్ రాజకీయాలలో సముచిత స్థానాన్ని, తూర్పు యూరప్‌లో రాజకీయ వాణిజ్య సదుపాయాలను ఇటలీ సంపాదించగలిగింది. అంతర్జాతీయ రాజకీయాలలో కూడా ఇటలీ ప్రతిష్ఠ పెరిగింది.

## 7.4. ముస్సోలినీ పతనం :

ముస్సోలినీ విధానమెట్లయినా వ్యయంతో కూడుకొన్నదయింది. ప్రజలపై పన్నుల భారమెక్కువయింది. 1929 - 1932 సంవత్సరాల మధ్య ప్రపంచ ఆర్థిక మాంధ్యమేర్పడి ఇటలీ కూడా దెబ్బతిన్నది. 1939 లో ముస్సోలినీ జర్మనీతో సైనిక సంధి చేసుకొన్నాడు. రెండో ప్రపంచ యుద్ధానికి హిట్లర్‌తోబాటు తాను కూడా కారకుడయ్యాడు. యుద్ధక్రమంలో 1943 లో మిత్రరాజ్య సేనలు సిసిలీలో ప్రవేశించినపుడు ఫాసిస్ట్ మహాసభ ముస్సోలినీ నాయకత్వాన్ని విస్మరించింది, తిరస్కరించింది. ఇటలీ రాజు మూడో విక్టర్ ఇమాన్యూల్ మార్షల్ పీట్రో బడాగ్లియోను ప్రభుత్వాధికారిగా నియమించినాడు. చివరకు 1945 ఏప్రిల్ 28 న ముస్సోలినీ ఉత్తర ఇటలీలో తుపాకి గుండ్లవల్ల హతుడయినాడు. ఇటలీ మిత్ర రాజ్యాలకు లొంగిపోయింది. ముస్సోలినీ మరణంతో ఫాసిజం కూడా అంతమయింది.

ప్రాచీన రోమ్‌లో నియంతృత్వమున్నప్పటికీ అది తాత్కాలికమేననే చారిత్రక విషయాన్ని ముస్సోలినీ గ్రహించలేక పోయినాడు. నియంతృత్వము అత్యయిక పరిస్థితులను ఎదుర్కొనడానికి ఏర్పడి కొనసాగించే తాత్కాలిక ప్రభుత్వ విధానమే. ఇటలీ సౌభాగ్యానికి తగిన కృషి చేసి ముస్సోలినీ 1929 లోనే పదవీ విరమణ చేసి ఉంటే చరిత్ర ప్రసిద్ధుడయ్యేవాడు. కాని నెపోలియన్ వలెనే అధికార కాంక్ష అమితంగా గల నియంత పతనం ఎప్పుడో ఒకప్పుడు తథ్యమని ముస్సోలినీ వల్ల తెలుస్తుంది.

డాక్టర్. వి. కె. మోహన్

పాఠం - 8

# సోవియట్ రష్యా : 1917-1945

## లక్ష్యం :

1917 రష్యా విప్లవము, లెనిన్ నూతన ఆర్థిక విధానము, స్టాలిన్ నియంతృత్వం, రెండు ప్రపంచ యుద్ధాల మధ్య కాలములో సోవియట్ రష్యా విదేశాంగ విధానము మొదలగు అంశాల గురించి వివరించడమే ఈ పాఠం ముఖ్య లక్ష్యం.

## విషయ క్రమం


8.1 పరిచయం

8.2 రష్యా విప్లవానికి కారణాలు

8.2.1. చక్రవర్తుల నిరంకుశత్వం

8.2.2. ఆర్థిక పరిస్థితులు

8.2.3 పారిశ్రామిక విప్లవ ప్రభావం

8.2.4 మేధావుల ప్రభావం

8.2.5 వివిధ పార్టీల వైఖరి

8.2.6 మొదటి ప్రపంచ యుద్ధంలో రష్యా

8.3 విప్లవ గమనం

8.3.1 మార్చి విప్లవం

8.3.2 నవంబర్ విప్లవం

8.3.3 నవంబర్ విప్లవ ప్రాముఖ్యం

8.4. లెనిన్

8.4.1 ఆంతరంగిక విధానము

8.4.2 రష్యా జర్మనీల మధ్య జరిగిన బ్రెస్ట్ ఆటోవస్క్ సంధి

8.4.3 రష్యాలో విదేశీ జోక్యం

8.4.4 రష్యన్ విప్లవ వ్యతిరేక శక్తులు (అంతర్యుద్ధం)

8.4.5 సోవియట్ రాజ్యాంగం

8.4.6 శుద్ధ కమ్యూనిజం

8.4.7 నూతన ఆర్థిక విధానం

8.4.8 లెనిన్ ఘనత

8.5 స్టాలిన్ నియంతృత్వము

8.5.1 ట్రాట్స్కీ-స్టాలిన్‌ల మధ్య సిద్ధాంతపరమైన భేదాలు

8.5.2 ఆంతరంగిక వ్యవహారాలు

8.5.3 మొదటి పంచవర్ష ప్రణాళిక

8.5.4. పారిశ్రామికీకరణ

8.5.5 సమిష్టి వ్యవసాయ విధానం

8.5.6 గుణదోషాలు

8.5.7 రెండో పంచవర్ష ప్రణాళిక

8.5.8 మూడో పంచవర్ష ప్రణాళిక

8.5.9 నూతన రాజ్యాంగము

8.6. సోవియట్ రష్యా విదేశాంగ విధానము

8.6.1 సోవియట్ రష్యా విదేశ వ్యవహారాలు (1914-1921)

8.6.1.1. ప్రపంచ విప్లవం ద్వారా కమ్యూనిజాన్ని సాధించడం

8.6.1.2. సోవియట్ రష్యాకు పశ్చిమ రాజ్యాలకు మధ్యగల సంబంధాలు

8.6.2. సోవియట్ రష్యా విదేశ వ్యవహారాలు (1921-1932)

8.6.2.1 ఆంగ్లో-సోవియట్ వాణిజ్య ఒప్పందం

8.6.2.2 జెనీవా సమావేశము

8.6.2.3 విదేశాలు సోవియట్ రష్యాను గుర్తించడం

8.6.2.4 దురాక్రమణ వ్యతిరేక ఒడంబడికలు

8.6.2.5 సోవియట్ రష్యా -పశ్చిమ రాజ్యాల మధ్య సంబంధాలు

8.6.3. సోవియట్ రష్యా విదేశ వ్యవహారాలు (1933-1938)

8.6.3.1 దురాక్రమణ వ్యతిరేక ఒప్పందాలు

8.6.3.2 సోవియట్ రష్యా-ఫ్రాన్స్‌ల మధ్య సంధి

8.6.3.3 సోవియట్ రష్యా-అమెరికాల మధ్య సంధి

8.6.4. సోవియట్ రష్యా విదేశ వ్యవహారాలు (1938-1939)

8.6.4.1 జర్మనీతో దురాక్రమణ వ్యతిరేక ఒడంబడిక

8.6.5. సోవియట్ రష్యా విదేశ వ్యవహారాలు (1939-1945)

8.6.5.1 సోవియట్ రష్యామీద జర్మనీ దురాక్రమణ

8.6.6 సారాంశము

8.7. సోవియట్ రష్యా మధ్య ప్రాచ్య విధానము

8.7.1. మధ్య ప్రాచ్యంలో సోవియట్ విదేశాంగ విధాన ముఖ్య లక్ష్యాలు

8.7.2. మధ్య ప్రాచ్యంలో నాటి పరిస్థితులు

8.7.3. సోవియట్ రష్యా-పర్షియా (ఇరాన్)ల మధ్య సంబంధాలు

8.7.4. సోవియట్ రష్యా-టర్కీల మధ్య సంబంధాలు

8.8. సోవియట్ రష్యా దూర ప్రాచ్య విధానము

8.8.1. చైనా-సోవియట్ రష్యాల మధ్య సంబంధాలు

8.8.2. సోవియట్ రష్యా, జపాన్‌ల మధ్య సంబంధాలు

## 8.1. పరిచయం :

మొదటి ప్రపంచ యుద్ధకాలంలో జార్ చక్రవర్తుల నిరంకుశ పాలనను అంతం చేయడానికి రష్యాలో ఒక చారిత్రాత్మకమైన విప్లవం జరిగి సామ్యవాద ప్రభావంవల్ల బోల్షివిక్‌లు అనే రాజకీయ పార్టీ ఆధ్వర్యంలో రిపబ్లిక్ ప్రభుత్వమేర్పడింది. రష్యాలో 1917లో జరిగిన ఈ విప్లవాన్ని బోల్షివిక్ విప్లవమని, కమ్యూనిస్ట్ విప్లవమని అంటారు. ఈ విప్లవము 1789లో జరిగిన ఫ్రెంచి విప్లవం వలె ఆధునిక ప్రపంచ చరిత్రలో గొప్పమార్పులు తెచ్చింది. మానవుని రాజకీయ, ఆర్థిక, సాంఘిక వ్యవస్థలు విపరీతంగా తీవ్రంగా మార్పు చెందినాయి. ఈ విప్లవం నేటికి మానవ జీవితంపై ప్రభావం చూపుతుంది.

## 8.2. రష్యా విప్లవ కారణాలు :

1917లో రష్యాలో సంభవించిన విప్లవానికి అనేక కారణాలు గలవు. అవి :

**8.2.1. చక్రవర్తుల నిరంకుశత్వము :** 17వ శతాబ్దం నుంచి రష్యాను పాలించిన చక్రవర్తులు రోమనోవ్ వంశస్థులు. పీటర్ ది గ్రేట్, కాథరిన్ ది గ్రేట్‌ల కాలంలో రష్యా ఒక గొప్ప రాజ్యంగా పేరు ప్రతిష్ఠలు సంపాదించింది. అయితే వారి తరువాత రష్యాను పాలించిన చక్రవర్తులందరూ ప్రజాభిప్రాయాన్ని పాటించకుండా పరిపాలన సాగించారు. అయితే ఒక్క రెండో అలెగ్జాండర్ చక్రవర్తి మాత్రం ప్రజాక్షేమాన్ని కోరి కొన్ని ఉదార సంస్కరణలు ప్రవేశపెట్టినాడు. 1861లో అలెగ్జాండర్ కర్షకులకు బానిసత్వం నుంచి విముక్తి కలిగించినాడు. కాని పోలండ్‌లో తిరుగుబాటు ఫలితంగా రెండో అలెగ్జాండర్ రహస్య పోలీస్ సహాయంతో ఉదార విధానానికి స్వస్తి చెప్పి కఠిన వైఖరి అవలంభించినాడు. చక్రవర్తి కఠినవైఖరికి వ్యతిరేకంగా దేశంలో శూన్య వాదులు, అరాజకవాదులు ఆందోళనలు సాగించారు. 1881లో రెండో అలెగ్జాండర్ చక్రవర్తిని ఒక శూన్యవాది హత్య చేసినాడు. రెండో అలెగ్జాండర్ తరువాత రష్యాను పరిపాలించిన మూడో అలెగ్జాండర్ కూడా ఉదార ఉద్యమాలను అణచివేసి నిరంకుశంగా పరిపాలించాడు. ఓక్‌రానా అనే పోలీస్ వ్యవస్థ సహాయంతో మూడో అలెగ్జాండర్ విప్లవ వాదులలో కొంతమందిని జైళ్ళలో నిర్బంధించాడు. కొంతమంది విప్లవాదులను దేశంనుంచి బహిష్కరించి సైబీరియాకు పంపినారు. కొంతమందిని చంపివేసినారు.

1894లో రాజ్యానికివచ్చిన రెండో నికోలస్ తన పూర్వులవలె తెలివి తేటలు, శక్తి సామర్థ్యాలున్న చక్రవర్తికాదు. ఇతడు తన సలహాదారులను, మంత్రులను కూడా ద్వేషించి ఈర్ష్య భావంతో చూసేవాడు. ఇతని కాలంలో వ్యవసాయం నిర్లక్ష్యం చేయడంవల్ల కర్షకుల బాధలు ఎక్కువైనాయి. దేశంలో విద్యావ్యాప్తి దాదాపుగా నిరోధించడం జరిగింది. రహస్య పోలీసు దళము విప్లవ వీరులను వెంటాడుతూ ఉండేది. దీనికితోడు రష్యాలో పరిస్థితులు విషమించడానికి మరొక కారణం దేశ పరిపాలన చక్రవర్తి భార్య చేతులలో ఉండటమే. రస్‌పుటిన్ అనే సైబీరియా రాజకీయవేత్త ప్రభావానికిలోనైన మహారాణి కొనసాగించిన నిరంకుశ అంతరంగిక పరిపాలన ఫలితంగా ప్రజలలో అసంతృప్తి ఎక్కువైంది. అసంతృప్తి చెందిన ప్రజలను సంతృప్తి పరచడానికి రెండో నికోలస్ పరిమితమైన అధికారాలతో కూడిన డ్యూమాను (శాసనసభ) సమావేశపరచడానికి ఏర్పాట్లు చేసినాడు. కాని దీనివల్ల ప్రజలలో అసంతృప్తి ఏమాత్రం తగ్గలేదు. దీనికితోడు జార్ విదేశాంగ విధానం కూడా విఫలంకావడంవల్ల రష్యన్ ప్రజలలో అసంతృప్తి తీవ్రరూపం దాల్చింది. 1904-1905లలో జరిగిన యుద్ధంలో జపాన్ చేతిలో రష్యా ఓడిపోయింది. ఈ ఓటమిని రష్యా ప్రజలు దేశ ఓటమిగా కాక చక్రవర్తి ఓటమిగా భావించారు. అంతేగాక మొదటి ప్రపంచ యుద్ధంలో రష్యా నిర్వహించిన పాత్ర కూడా దేశానికి అపఖ్యాతి తెచ్చిపెట్టింది. అందువల్ల రష్యాలో పరిస్థితులు విప్లవానికి అనుకూలంగా ఉన్నాయి.

**8.2.2. ఆర్థిక పరిస్థితులు :** 1917కు ముందు రష్యా ఆర్థిక వ్యవస్థ భూస్వామ్య వ్యవస్థమీద ఆధారపడిఉంది. భూ స్వాములు, సేద్య బానిసలు అనే రెండు వర్గాలు రష్యాలో ఉండేవి. భూస్వాముల పొలాలలో సేద్య బానిసలు పనిచేసేవారు. సేద్య బానిసలకు ఏ విధమైన హక్కులు ఉండేవికావు. రెండో అలెగ్జాండర్ సేద్రబానిసలకు విముక్తి కలగజేసినప్పటికీ కర్షకులుగా వారిస్థితిగతులు ఏ విధంగానూ బాగుపడలేదు. కర్షకులకు తినడానికి చాలినంత తిండి కూడా ఉండేదికాదు. దేశ ప్రజలలో ఐదింట నాలుగోభాగం వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నప్పటికీ వ్యవసాయం మాత్రం వెనకబడి ఉండేది. కర్షకులమీద పన్నుల భారము ఎక్కువగా ఉండేది. ధనిక వర్గానికి చెందిన భూస్వాములు, ప్రభువులు మొదలైన వారిమీద పన్నుల భారమేమి ఉండేదికాదు. వీరంతా స్వాధికార వర్గంవారు భూస్వామ్య వర్గానికి,

కార్మిక వర్గానికి మధ్యగల అసమానత్వము రష్యన్ ప్రజలలో చాలా అసంతృప్తికి దారితీసింది. కర్షకులు వ్యవసాయానికి కావలసిన పెట్టుబడి సొమ్ములేక గ్రామాలలో ఉండే కులక్‌లనే వడ్డీ వ్యాపారస్తుల వద్ద హెచ్చు వడ్డీరేటుకు అప్పు తీసుకోవలసి వచ్చేది. కర్షకులకు ఋణాలను తిరిగి చెల్లించే మార్గం కనిపించేది కాదు. అందువల్ల సేద్య బానిసలు భూస్వాముల, కులక్‌ల దౌర్జన్యాలను ఎదుర్కోవడానికి సిద్ధపడసాగినారు.

**8.2.3. పారిశ్రామిక విప్లవ ప్రభావం :** పశ్చిమ రాజ్యాలలో కంటే రష్యాలో పారిశ్రామికాభివృద్ధి ఆలస్యంగా జరిగినప్పటికీ 20వ శతాబ్దం ప్రారంభం నాటికి ఫ్యాక్టరీలు స్థాపించడం, యంత్రాలు ప్రవేశపెట్టడం, రైలు మార్గాల నిర్మించడం మొదలైన పనులు జరిగాయి. అంతేగాక విదేశాల పెట్టుబడి ఫలితంగా రష్యాలో పారిశ్రామికీకరణ వేగంగా జరిగింది. కార్మికుల సంఖ్య పెరిగింది. విప్లవం నాటికే దేశ ప్రజలలో పదింట ఒక భాగం కార్మిక వర్గానికి చెందినవారు. పెట్టుబడిదారులు ఉత్పత్తిని ఎక్కువచేసి అధిక లాభాలు గడించినప్పటికీ కార్మికుల వేతనాలు మాత్రం చాలా తక్కువగా ఉండేవి. పని గంటలు ఎక్కువ ఉండేవి. బాలబాలికలను కూడా పనిలో నియోగించేవారు. పట్టణాలలోని కార్మికులు మురికిపేటలలో అనారోగ్యకరమైన పరిస్థితులలో నివసించేవారు. ప్రభుత్వానికి ఒక నిర్దిష్టమైన కార్మిక విధానం లేదు. ఈ కారణాలవల్ల పెట్టుబడిదారి వర్గానికి వ్యతిరేకంగా కార్మిక వర్గం వారు ఆనాడు ప్రచారంలోనికి వస్తున్న సామ్యవాద సిద్ధాంతాల ప్రభావాలకులోనై కార్మిక సంఘాలు స్థాపించి తద్వారా తమ పరిస్థితులను మెరుగుపరచుకోవడానికి విప్లవోన్ముఖులైనారు. పెట్టుబడిదారి వర్గానికి, కార్మిక వర్గానికి మధ్య ఉధృతమైన ఘర్షణ ఏర్పడింది.

**8.2.4. మేధావుల ప్రభావము :** రష్యాలో శ్రామిక వర్గంలో విప్లవ భావాలు రేకెత్తినాయి. రాజకీయ ఆర్థిక పరిస్థితులు మార్పుకు కావలసిన అనుకూల వాతావరణాన్ని సృష్టించినాయి. ఈ పరిస్థితులను గమనించిన మధ్య తరగతికి చెందిన మేధావులు, విద్యావేత్తలు తమ రచనల ద్వారా చక్రవర్తుల నిరంకుశత్వాన్నీ, ప్రభుత్వంలోని లంచగొండితనాన్ని, భూస్వాముల, పెట్టుబడిదారుల స్వార్థాన్ని ప్రజల దృష్టికి తీసుకువచ్చి వారిని చైతన్యవంతులను చేసినారు. వారు మొదట శూన్యవాద ఉద్యమాన్ని ప్రచారం చేసినారు. శూన్యవాద ఉద్యమం విఫలమైన తరువాత రష్యాలో మేధావి వర్గం వారు సామ్యవాద సిద్ధాంతాలవైపు మొగ్గినారు. రష్యామేధావి వర్గంలో ముఖ్యులు టాల్‌స్టాయ్, గోర్కీ, టర్గినోవ్, చెకోవ్ మొదలైనవారు.

సామ్యవాదాన్ని ఒక పద్ధతిగాను, ఉద్యమంగాను రూపొందించినవారు జర్మనీకి చెందిన కార్ల్‌మార్క్స్, ఫ్రెడరిక్ ఏంజిల్స్ అనేవారు. సంఘంలో పెట్టుబడిదారీ వర్గానికి, శ్రామిక వర్గానికి అధికారం కోసం వర్గ సంఘర్షణ తప్పక జరిగి తీరుతుందని చివరికి పోరాటంలో శ్రామిక వర్గానికి విజయం లభించి సమానత్వం ప్రాతిపదికగాగల వర్గ రహితమైన కమ్యూనిస్ట్ వ్యవస్థ ఏర్పడుతుందని చెప్పినారు. మార్క్స్ సిద్ధాంతాల ప్రభావంవల్ల 1864లో మొదటి కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్ అనే సమావేశం జరిగింది. కాని ఈ సమావేశం విఫలమైంది. రెండో కమ్యూనిస్ట్ సమావేశం కూడా విజయాలను సాధించలేదు. కాని వివిధ దేశాల ప్రతినిధులు పరస్పరం ఒకరి అభిప్రాయాలను మరొకరు తెలుసుకోగలిగినారు. మార్క్స్ సిద్ధాంతాలను అమలు పరచడానికి రాజకీయ పక్షాలు కూడా ఏర్పడినాయి. ప్రజలలో అసంతృప్తి ఉన్నపుడు దానికి జీవం పోయడానికి మేధావుల రచనలు సహాయపడతాయి. రష్యా విషయంలో ఇదే జరిగింది.

**8.2.5. వివిధ పార్టీల వైఖరి :** మేధావుల, విద్యావేత్తల రచనల ప్రభావం వల్ల రష్యాలో అనేక పార్టీలేర్పడి చక్రవర్తుల నిరంకుశ పరిపాలనను ఖండిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక కార్యకలాపాలు సాగించినాయి. రష్యాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏర్పాటైన మొదటిపార్టీ శూన్య వాదుల పార్టీ. తరువాత అరాజకవాదుల పార్టీ ఏర్పడింది. శూన్యవాదులు, అరాజకవాదులు కూడా సంఘంలో అమలులో ఉన్న సంస్థలు పనికిరావని, వాటిని నిర్మూలించవలెనని ఆందోళన సాగించినారు. క్రైస్తవ సామ్యవాదులు అనే పార్టీవారు టాల్‌స్టాయ్ వంటి రచయితల ప్రభావం వల్ల సంఘ సంస్కరణలు జరగవలెనని ఆందోళన సాగించారు. వీరికి తోడు ఉదారవాదులు, తీవ్రవాదులు అనేవారు డ్యూమాను సమావేశపరచి రాజ్యాంగ పద్ధతుల ప్రకారం పరిపాలన జరగవలెనని ఆందోళన ప్రారంభించినారు. రెండో నికోలస్ కాలంలో మార్క్స్ సిద్ధాంతాలననుసరించి సాంఘిక విప్లవ పార్టీ ఏర్పడింది. 1904-1905లలో రష్యా జపాన్‌ల మధ్య జరిగిన యుద్ధంలో రష్యా ఓటమివల్ల చక్రవర్తి పరిపాలనలోని అసమర్థత ప్రజలకు బాగా అర్థమయింది. దీనికి తోడు సైన్యంలో తిరుగుబాట్లు, పెట్రోగ్రాడ్ వంటి నగరాలలో విప్లవ భావ ప్రభావంవల్ల శ్రామిక వర్గం తిరుగుబాట్లు చెలరేగినాయి. లెనిన్ నాయకత్వంలో ఉన్న సాంఘిక విప్లవ పార్టీ 1903లో రెండు చీలికలై మెన్షివిక్‌లు (మితవాదులు), బోల్షివిక్‌లు (అతివాదులు)గా ఏర్పడినారు. అత్యధిక సంఖ్యలో ఉన్న బోల్షివిక్‌లు లెనిన్ నాయకత్వంలో నిరసన ప్రదర్శనలు, సమ్మెలు ప్రారంభించినారు.

**8.2.7. మొదటి ప్రపంచ యుద్ధంలో రష్యా :** మొదటి ప్రపంచ యుద్ధంలో రష్యా ఫ్రాన్స్ ఇంగ్లండ్‌లలోచేరి జర్మనీ మీద యుద్ధం చేసింది. 1914 ఆగస్టులో టానెన్‌బర్గ్ యుద్ధంలో రష్యా సైన్యాలు ఘోర పరాజయాన్ని పొందాయి. ఈ ఓటమితో ప్రజలలో అసంతృప్తి తీవ్రమైంది. ఈ యుద్ధం అంతర్జాతీయ పెట్టుబడి దారీ విధానం వల్ల ఏర్పడ్డ సంఘర్షణ అని, ఈ సంఘర్షణలో కార్మికులు బలైపోతున్నారని లెనిన్ వ్యాఖ్యానించాడు. 1917 సంవత్సరం మొదట్లో యుద్ధంలో రష్యన్‌లు లక్షల సంఖ్యలో మరణించినారు. యుద్ధ కారణంగా ఆర్థిక సంక్షోభం ఏర్పడింది. నిత్యావసరాల కొరత ఏర్పడింది. మాస్కోలోని బ్రిటిష్, ఫ్రెంచి రాయబారులు రష్యాలో విప్లవ పరిస్థితి ఏర్పడిందని భయపడ్డారు. కాని, జార్‌నికోలస్ మాత్రం పరిస్థితిని సరిచేయడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. కార్మికులు, కర్షకులు, సైనికులు సామ్యవాదం వల్ల ప్రభావితులై ప్రభుత్వం మీద తిరుగుబాటు చేయడానికి సిద్ధంగా ఉన్నారు.

## 8.3. విప్లవ గమనం :

రష్యాలో 1917లో రెండు విప్లవాలు సంభవించాయి. అవి మార్చి విప్లవం, నవంబర్ విప్లవం. వీటిని రష్యాలో ఫిబ్రవరి, అక్టోబర్ విప్లవాలంటారు. దీనికి కారణం ఆనాటికి రష్యన్‌లు పాత జూలియన్ కాలండర్‌ను ఉపయోగించేవారు. యూరప్ ఉపయోగిస్తున్న గ్రెగేరియన్ కాలెండర్ కన్నా ఇది 13 రోజులు వెనక ఉండేది. 1918లో రష్యా కూడా గ్రెగేరియన్ కాలెండర్‌ను ఉపయోగించడం మొదలు పెట్టింది.

**8.3.1 మార్చ్ విప్లవం :** 1917 మార్చి 8న రష్యా రాజధాని పెట్రోగ్రాడ్‌లో తిరుగుబాటు బయలుదేరింది. రష్యన్ మహిళలు ఎర్ర జెండాలలో 'జార్ నిరంకుశత్వం నశించాలి' అన్న నినాదాలతో పెట్రోగ్రాడ్ వీధుల్లో ఊరేగింపులు లేవనెత్తారు. 90 వేల మంది కార్మికులు సమ్మె ప్రారంభించారు. ఈ పరిణామాలపట్ల మధ్య తరగతివారు తమ సానుభూతి వ్యక్తం చేశారు. ప్రజా ప్రదర్శనలు చెదరగొట్టడానికి జార్ ప్రభుత్వం కొసక్‌లను నియమించింది. పెట్రోగ్రాడ్ సైనిక గవర్నర్ ఖబలావ్ తిరుగుబాటును అణచడానికి అన్ని ప్రయత్నాలు చేయసాగాడు. కానీ అతడి ప్రయత్నాలు ఫలించక మార్చి 10న పెట్రోగ్రాడ్ అన్ని ప్రాంతాలలోనూ సమ్మె వ్యాపించింది. విద్యార్థులు, న్యాయవాదులు, సన్నకారు వ్యాపారులు, కార్మికులు కలసి రెండు లక్షల నలభైవేల మందితో ఊరేగింపు జరిగింది. కాయురోవ్ అనే బోల్షివిక్ నాయకుడు కొసక్‌ల వద్దకు వెళ్ళి కనీసావసరాలకై పోరాటం చేస్తున్న కార్మికులపై కాల్పులు జరపవద్దని అర్థించాడు. ఈ సంఘటన కొసక్‌లలో గొప్ప మార్పు తెచ్చింది. కొసక్‌లు ప్రజలకు మద్దతు ఇవ్వడం ప్రారంభించారు. ప్రత్యామ్నాయం లేకపోయేసరికి ప్రభుత్వం సైన్యాన్ని దించింది. కానీ ప్రదర్శకులు ఎటువంటి కవ్వింపు చర్యలకు దిగకుండా జాగ్రత్తగా వ్యవహరించారు. మార్చ్ 10న ప్రదర్శకుల సంఖ్య ఎక్కువైంది.

బోల్షివిక్, మెన్షవిక్, సోషలిస్ట్, రివల్యూషనరీ పార్టీల నాయకులు సమైక్యంగా వ్యవహరించి ఒక కమిటీగా ఏర్పడ్డారు. ఈ కమిటీ మూడు రోజుల సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చింది. మార్చ్ 11న ప్రజలు పెట్రోగ్రాడ్ పోలీస్ స్టేషన్‌లపై దాడిచేశారు. పెద్ద సంఖ్యలలో ఆయుధాలను ప్రజలు స్వాధీనం చేసుకొన్నారు. మొత్తం మీద ఆనాడు నగరంలో నాలుగుచోట్ల కాల్పులు జరిగాయి. ఈ కాల్పులలో నలభైమంది నేలకొరిగారు. కానీ ప్రజలు అప్రమత్తంగా ఉండి తమ సోదరులమీద కాల్పులు జరపవద్దని సైనికులను అర్థించారు. సైనికులకు కూడా జార్ ప్రభుత్వ బలహీనత బాగా అర్థమై పోయింది. మార్చి 11న పావ్లోవ్స్క్ రెజిమెంట్‌లో ఒక కంపెనీ తిరుగుబాటు చేసింది. మాస్కోలోని కొన్ని రెజిమెంట్‌లు కూడా తిరుగుబాటు చేశాయి. విప్లవ గీతం గానం చేస్తూ సైనికులు మాస్కోనగర వీధులలో ఊరేగారు. అంతేగాక వారు జార్ అధికారులను కాల్చి చంపారు. మార్చి 14న మాస్కో విప్లవ కారుల స్వాధీనమైంది. అనేక నగరాలలో విప్లవకారులు నియమించిన కమిటీలు అధికారాన్ని స్వాధీనం చేసుకొన్నాయి. జార్ నికోలస్ పెట్రోగ్రాడ్‌నుస్వాధీనం చేసుకోవడానికి కొత్త సైనిక దళాలను పంపించాడు. కానీ, అవి కూడా తిరుగుబాటు దారులతో కలసి పోయాయి. పెట్రో గ్రాడ్‌లో సోవియట్ ఉద్భవించింది.

1917 మార్చి 15న పరిస్థితి చేయిదాటి పోయిందని గ్రహించిన జార్ నికోలస్ రాజ్య పరిత్యాగ పత్రంపై సంతకం చేసినాడు. రాజ్య పరిత్యాగం చేస్తూ నికోలస్ సింహాసనాన్ని తన సోదరుడు గ్రాండ్ డ్యూక్ మైఖేల్‌కు బదలాయించాడు. కాని, మైఖేల్ సింహాసనాన్ని నిరాకరించాడు. మార్చి 17న నికోలస్ రాజ్యపరిత్యాగ విషయం, మైఖేల్ సింహాసనాన్ని తిరస్కరించిన విషయం పత్రికలలో ప్రముఖంగా ప్రకటించబడ్డాయి. మూడు రోజుల తరువాత నికోలస్, అతని కుటుంబ సభ్యులను పెట్రోగ్రాడ్ సోవియట్‌లో గృహ నిర్బంధంలో ఉంచింది.

1917 మార్చి 16న రష్యాలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. తాత్కాలిక ప్రభుత్వానికి ప్రిన్స్ ల్వావ్ ప్రధాన మంత్రి అయ్యాడు. దీనినే మార్చి విప్లవమంటారు. ఈ విప్లవ ఫలితంగా జారిస్ట్ నిరంకుశత్వం అంతమై రష్యాలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. ఈప్రభుత్వం

విప్లవం వల్ల ఏర్పడినప్పటికీ, దీనిలో అధిక సంఖ్యాకులు మధ్యతరగతి ఉదారవాదానికి ప్రాతినిధ్యం వహించినవారు. ఈ ప్రభుత్వంలో పాల్ మిల్యుకోవ్, కెరెన్స్కీ ప్రముఖపాత్ర వహించారు. దేశంలో శాంతి నెలకొల్పడానికి, జర్మనీతో యుద్ధం కొనసాగించడానికి తాత్కాలిక ప్రభుత్వం ప్రయత్నించింది. సామ్యవాద సిద్ధాంతాన్ని అనుసరించి నూతన ప్రభుత్వం అనేక ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టింది. పత్రికలకు స్వేచ్ఛ ఇవ్వడం జరిగింది. ప్రజలకు మత స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యము ఇచ్చినారు. రష్యాలోని మండలాలన్నీ సోవియట్‌లుగా విభజితమైంది. సోవియట్‌లలో సైనికులకు, కార్మికులకు, కర్షకులకు ప్రాతినిధ్యమివ్వడం జరిగింది. రష్యాను గణ రాజ్యంగా ప్రకటించడం జరిగింది. తాత్కాలిక ప్రభుత్వాన్ని అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సులు గుర్తించాయి.

8.3.2 నవంబర్ విప్లవం : పెట్రోగ్రాడ్, ఇతర చోట్ల ఏర్పడ్డ సోవియట్‌లు కార్మికుల పనివేళలు తగ్గించాలని, రైతులకు భూమి పంచి పెట్టాలని, జార్ ప్రభుత్వం చేసుకొన్న రహస్య సంధులను గర్హించాలని, యుద్ధం నుంచి త్వరగా బయటపడాలని కోరాయి. ఈ లోపలవేల సంఖ్యలో రష్యన్ సైనికులు యుద్ధ రంగాలను వదలిపెట్టి ఇండ్లకు తిరిగి వచ్చారు. సైబీరియా ప్రవాసంలోను, ఇతర దేశాలలోను నివసిస్తున్న విప్లవకారులు తిరిగి స్వస్థలాలకు చేరుకోసాగారు. రష్యన్‌లు పెట్రోగ్రాడ్ సోవియట్‌ను పూర్తిగా సమర్థించాలని, పోలీసుల స్థానంలో పీపుల్స్ మిలీషియా' ఏర్పాటు కావాలని, మిత్ర రాజ్యాలతో రష్యా చేసుకొన్న సంధులను పెట్రోగ్రాడ్ సోవియట్ బహిరంగంగా రద్దు చేయాలని, జర్మనీతో వెంటనే సంధి చేసుకోవాలని స్విట్జర్లాండ్‌లో 'ప్రవాసంలో ఉంటున్న లెనిన్ ప్రకటించాడు. లెనిన్ ప్రత్యేక రైలులో బయలుదేరి ఏప్రిల్ 16న పెట్రోగ్రాడ్ చేరుకొన్నాడు. పెట్రోగ్రాడ్‌లో సైనికులతో సహా వేలాది ప్రజలు లెనిన్‌కు స్వాగతం పలికారు.

లెనిన్ 'ఏప్రిల్ థీసిస్' ను రూపొందించాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచంలో చివరి ఘట్టానికి చేరుకొందని, అదే సామ్రాజ్య వాదమని, ఈ సామ్రాజ్యవాదం వల్ల ప్రపంచంలో విప్లవాలు రగుల్కొంటున్నాయని, రానున్న ప్రజావిప్లవానికి మార్క్సిస్ట్‌లు, సోషలిస్టులు నాయకత్వం వహిస్తారని, మార్చ్ విప్లవం బూర్జువా విప్లవమని, రెండో ఘట్టంలో తాత్కాలిక ప్రభుత్వం నుంచి కార్మికులు, కర్షకులు, సైనికులు సోవియట్ ప్రభుత్వాన్ని ఏర్పరుస్తారని 'ఏప్రిల్ థీసిస్' లెనిన్ విశదీకరించాడు.

ఒకవైపు, రష్యా యుద్ధం కొనసాగించాలని ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లు తాత్కాలిక ప్రభుత్వంపై వత్తిడి తేగా మరొకవైపు యుద్ధాన్ని త్వరగా ముగించాలని సైనికులు బ్రహ్మాండమైన ప్రదర్శన లేవదీశారు. జూలైలో రాజకీయ సంక్షోభం మరీ పెరిగింది. జూలై 17న క్రాన్ స్టాడ్ నౌకా స్థావరానికి చెందిన 6వేల మంది నావికులు విప్లవోద్యమానికి సహాయపడడానికి నౌకలలో పెట్రోగ్రాడ్ చేరుకొన్నారు. లిటెనీ వంతెన వద్ద తాత్కాలిక ప్రభుత్వాన్ని సమర్థిస్తున్న కొసక్‌లు నావికుల మీద కాల్పులు జరిపారు. ఈ ఘర్షణలలో అనేకులు మరణించారు. ఇటువంటి పరిస్థితులలో ల్వవ్ రాజీనామా చేయగా విప్లవ నాయకుడైన కెరెన్స్కీ 1917 జూలై 25న ప్రభుత్వాధినేత అయినాడు.

1917 అక్టోబర్‌లో జర్మన్ సైన్యాలు పురోగమనం, పెట్రోగ్రాడ్ సోవియట్‌ను బలహీనపరచడానికి కెరెన్స్కీకి మంచి అవకాశం దొరికింది. పెట్రోగ్రాడ్‌ను కాపాడాలనే మిషతో సైనికులను కెరెన్స్కీ యుద్ధ రంగానికి బదలాయించాడు. ఈ చర్యను బోల్షివిక్‌లు గర్హించారు. లెనిన్ నాయకత్వంలో బోల్షివిక్‌లు రహస్య సమావేశం ఏర్పాటుచేసి, సాయుధ సంఘర్షణ నవంబర్ 7న ప్రారంభించి, కెరెన్స్కీ ప్రభుత్వాన్ని కూలదోయడానికి నిర్ణయించారు. పెట్రోగ్రాడ్ సైనిక గవర్నర్‌గా పాల్కొవ్నికోవ్ నియమించబడ్డాడు. ట్రాట్స్కీ, ఇతర బోల్షివిక్ నాయకులను అరెస్ట్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 'ఎంటర్ పాలెస్' ముందు అదనపు దళాలను మోహరించాడు. రాజ్య పరిత్యాగం చేసిన జార్‌ను, అతడి కుటుంబ సభ్యులను సైబీరియాకు తరలించారు.

బోల్షివిక్‌లు నవంబర్ 6న సాయుధ చర్యలు ప్రారంభించారు. వారు రైల్వే స్టేషన్‌లను, టెలిఫోన్ ఎక్స్చేంజీలను, బాంకులను, ముద్రణాలయాలను ఆక్రమించారు. నవంబర్ 7న తాత్కాలిక ప్రభుత్వం పతనమైంది. ప్రభుత్వాధికారాన్ని సైనిక విప్లవ కమిటీ, సోవియట్‌లు హస్తగతం చేసుకొన్నాయని ట్రాట్స్కీ ప్రకటించాడు. దీనినే బోల్షివిక్ లేదా కమ్యూనిస్ట్ విప్లవ మంటారు. నవంబర్ చివరకు అన్ని నగరాలు సోవియట్‌ల ఆధీనంలోకి వచ్చాయి. బోల్షివిక్ ప్రభుత్వం అనేక శాసనాలు ప్రకటించింది. భూమిపై వ్యక్తులకున్న హక్కు రద్దయింది. పారిశ్రామిక సంస్థలు, బాంక్‌లు, నౌకలు జాతీయం చేయబడ్డాయి. చర్చి భూములు ప్రభుత్వ పరమయింది. విద్యాలయాలలో మతబోధన నిషేధించడం జరిగింది. గ్రెగేరియన్ కాలెండర్ అమలుకు వచ్చింది.

**8.3.3. నవంబర్ విప్లవం ప్రాముఖ్యము :** 1917 నవంబర్ విప్లవం ఫలితంగా రష్యాలో ఏర్పడిన కమ్యూనిస్ట్ ప్రభుత్వము ఆధునిక ప్రపంచ చరిత్రలో ఒక చారిత్రాత్మకమైన ఘట్టము దీనిలో ప్రపంచ చరిత్రలో నూతన శక మారంభమయింది. నవంబర్ విప్లవ ఫలితంగా రష్యాలో శ్రామిక వర్గ నియంతృత్వం స్థాపితమై నిరంకుశ జార్ చక్రవర్తుల పరిపాలన అంతమొందింది. రష్యాలో నూతనంగా స్థాపితమైన శ్రామికవర్గ నియంతృత్వము నిజానికి కమ్యూనిస్ట్ పార్టీ నియంతృత్వమని చెప్పవచ్చు. పార్టీ నియంతృత్వము ప్రజాస్వామ్య సిద్ధాంతానికి విరుద్ధము. ఏకపక్ష నియంతృత్వమున్నచోట ప్రతి పక్షాలను గుర్తించడం ఉండదు. అందువల్ల పార్టీ నియంతృత్వమున్న రాజ్యాన్ని సంపూర్ణాధికార రాజ్యం అంటారు. వ్యక్తికీ, రాజ్యానికి మధ్య తేడాను నియంతృత్వ ప్రభుత్వం అంగీకరించదు. రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలన్నీ ప్రభుత్వాధీనంలోనే పనిచేయవలె. ప్రజా జీవితానికి సంబంధించిన ప్రతి విషయం మీదా ప్రభుత్వ అజమాయిషీ నెలకొల్పడం జరుగుతుంది.

1917 నవంబర్ విప్లవం అంతర్జాతీయ ప్రాముఖ్యమున్న పరిణామాలకు దారితీసింది. 1789లో జరిగిన ఫ్రెంచి విప్లవం నాటి రాచరికాలను హడలు గొట్టించగా, 1917 నవంబర్‌లో రష్యాలో జరిగిన విప్లవం పెట్టుబడిదారీ రాజ్యాలలోని పరిపాలనకు భయోత్పాతాన్ని కలగజేసింది. రష్యాలో శ్రామిక వర్గ నియంతృత్వం నెలకొన్నందువల్ల ప్రపంచంలోని శ్రామిక వర్గానికి చెందిన ప్రజలేగాక కమ్యూనిస్ట్ పార్టీలు కూడా ఉత్సాహాన్ని, స్ఫూర్తినీ పొందాయి. మూడో కమ్యూనిస్ట్ ఇంటర్ నేషనల్ స్థాపితమైనందువల్ల విప్లవం ఒక్క రష్యాకే పరిమితమైనది కాదని ప్రపంచంలోని ఇతర దేశాలకు కూడా వ్యాప్తి చెందుతుందనే అనుమానం ధృవపడింది. రష్యన్ విప్లవం వివిధ దేశాల పాలక వర్గాల్లో అనుమానాన్ని అనిష్టాన్నీ కలగజేసింది. రష్యాలో జరిగిన విప్లవం వలస రాజ్యాలలో జాతీయ విమోచనోద్యమాలకు కూడా దోహదం చేసింది. ఆసియా ఆఫ్రికాలలోని కోటానుకోట్ల ప్రజలలో విప్లవ భావాలు రేకెత్తినాయి. రష్యాలో కమ్యూనిస్ట్ ప్రభుత్వమేర్పడిన ఫలితంగా ప్రపంచంలోని దేశాలన్నింటిలో సామ్రాజ్యవాదం బలహీనమయింది. పశ్చిమ రాజ్యాలలో కూడా వర్గపోరాటం తీవ్రరూపం దాల్చే పరిస్థితి వచ్చింది. రష్యాలో ఏర్పడిన కమ్యూనిస్ట్ ప్రభుత్వాన్ని కూలదోయడానికి పెట్టుబడిదారీ వ్యవస్థగల అగ్ర రాజ్యాలు ప్రయత్నించసాగినాయి.

## 8.4. లెనిన్ (1870-1924) :

1917 న నవంబర్‌లో బోల్షెవిక్ విప్లవం నడిపి రష్యాలో శ్రామికవర్గ నియంతృత్వాన్ని స్థాపించిన లెనిన్ అసలు పేరు వ్లాడియర్ ఇలిచ్ ఉల్యనోవ్. ఇతడు 1870 ఏప్రిల్‌లో సింబర్క్ అనే గ్రామంలో జన్మించాడు. మూడో అలెగ్జాండర్‌ను హత్య చేయడానికి ప్రయత్నించినాడనే నేరంమీద అతని అన్నగారిని 1887లో ప్రభుత్వం ఉరితీసింది. అందువల్ల విప్లవ సమయంలో పోలీసుల బారినుంచి తప్పించుకోవడానికి ఉల్యనోవ్ లెనిన్ అని పేరు మార్చుకొని విప్లవోద్యమంలో చేరినాడు. కజన్ విశ్వ విద్యాలయంలో విద్యార్థిగా ఉన్న రోజుల్లో విప్లవోద్యమాలలో పాల్గొనడంవల్ల ఇతనిని విశ్వ విద్యాలయం నుంచి వెళ్ళగొట్టినారు. ఆ తరువాత సెంట్ పీటర్స్ బర్గ్ విశ్వ విద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో పట్టభద్రుడైనాడు. 1895 నాటికి సామ్యవాదాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవడానికి లెనిన్ యూరప్‌లో అనేక దేశాలలో పర్యటించినాడు. విదేశాల నుంచి తిరిగి వచ్చిన తరువాత కార్మికుల విముక్తికోసం కార్మికోద్యమాలు నడపడం ప్రారంభించాడు. ప్రభుత్వము అతనిని నిర్బంధించి 14 మాసాలు కారాగారంలో ఉంచి, తరువాత సైబీరియాకు ప్రవాసం పంపించింది. సైబీరియాలో క్రుప్స్ కయా అనే వనితను వివాహమాడినాడు. తరువాత 1900 నుంచి 1917 వరకు విదేశాలలో గడిపి ఇస్క్రా అనే పత్రికను నడిపి రహస్యంగా రష్యా ప్రజలకు దాని ప్రతులను అందేటట్లుచేసినాడు. రష్యాలో 1917 మార్చిలో విప్లవం జరిగిన సమయంలో లెనిన్ స్విట్జర్లాండ్‌లో ఉన్నాడు. జర్మన్‌ల సహాయంతో లెనిన్ రష్యాకు తిరిగి రాగలిగినాడు. 1917 నవంబర్‌లో ప్రజా సహకారంతో కెరెన్స్కీ ప్రభుత్వాన్ని కూలదోసి లెనిన్ శ్రామిక వర్గ నియంతృత్వాన్ని స్థాపించి నూతన సోవియట్ మండలికి అధ్యక్షుడైనాడు.

**8.4.1. ఆంతరంగిక విధానం :** శ్రామికవర్గ నియంతృత్వ స్థాపన చేసిన తరువాత ప్రభుత్వాధినేతగా లెనిన్ రెండు అతి ముఖ్యమైన సమస్యలను ఎదుర్కోవలసి వచ్చింది. అవి 1) రష్యా ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేసుకోవడానికి సిద్ధమవుతున్న విదేశ శత్రువులను ఎదుర్కోవడం, 2) దేశంలోని విప్లవ వ్యతిరేక శత్రువులను అణచివేసి విప్లవ సిద్ధాంతాలను అనుసరించి రష్యాను పునర్వ్యవస్థీకరించడం. అంతేగాక ఇతర దేశాల కంటే రష్యా ముఖ్యంగా శాంతినికోరి జర్మనీతో యుద్ధాన్ని పరిసమాప్తం చేయడానికి నిశ్చయించుకొన్నది.

**8.4.1.1. రష్యా జర్మనీల మధ్య జరిగిన బ్రెస్ట్ - లిటోవస్క్ సంధి (1918) :** శ్రామిక వర్గ నియంతృత్వ స్థాపన చేసిన తరువాత ప్రభుత్వాధినేతగా ఎదుర్కొన్న ఒక ముఖ్య సమస్య యుద్ధం నుంచి రష్యాను ఉపసంహరింపచేయడం. ప్రఖ్యాతి వహించిన 'శాంతి ప్రకటనను'

1917 నవంబర్ 8న శ్రామిక వర్గ ప్రభుత్వం జారీచేసి జర్మనీతో శాంతి చేసుకోవడానికి ప్రయత్నించింది. 1917 డిసెంబర్‌లో రష్యా, మధ్య రాజ్యాల వారిలో కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకొంది. ఆతరువాత జరిగిన చర్చలలో రష్యా బలహీన పరిస్థితిని అర్థం చేసుకొన్న జర్మనీ సంధికి కఠినమైన షరతులు విధించింది. తమ డిమాండ్‌లను తగ్గించుకోమని ట్రాట్స్కీ మధ్య రాజ్యాలను అర్థించాడు. కానీ, జర్మన్‌లు దానికి అంగీకరించలేదు. 1918 మార్చిలో రష్యాకు జర్మనీలకు మధ్య బ్రెస్ట్ - లిటొవస్క్ సంధి జరిగింది. ఈ సంధి ప్రకారం ఇస్తానియా, లివోనియా, కోర్‌లాండ్, లిథువేనియా, పోలండలపై రష్యా తన సార్వభౌమాధికారాన్ని వదులుకొంది. ఈ ప్రాంత ప్రజల అంగీకారంతో మధ్య రాజ్యాలవారు వాటి భవిష్యత్తును నిర్ణయిస్తారు. యుక్రెయిన్ స్వతంత్ర రాజ్యంగా గుర్తించారు. కాకసస్‌లోని బాతూమ్, ఆర్థహాన్, కార్స్‌లను స్వతంత్ర ప్రతిపత్తిగల రాజ్యాలుగా గుర్తించడం జరిగింది. ఫిన్లాండ్, జార్జియాలు స్వతంత్ర రాజ్యాలయ్యాయి. జర్మనీకి నష్ట పరిహారం చెల్లించడానికి రష్యా అంగీకరించింది.

బ్రెస్ట్‌లిటోవస్క్ సంధివల్ల అయిదు లక్షల చదరపు మైళ్ళ భూభాగాన్ని, అరవై ఆరు మిలియన్‌ల జనాభాను, నూటికి ముప్పైరెండు వంతుల వ్యవసాయ భూములను, నూటికి యాభై నాలుగు వంతుల పారిశ్రామిక ప్రాంతాలను, నూటికి ఎనభై తొమ్మిది వంతుల బొగ్గు గనులను, కొద్దిపాటి కోస్తాతప్ప బాల్టిక్ కోస్తా అంతటిని రష్యా కోల్పోయింది. యుద్ధం నుంచి రష్యా వైదొలిగినందువల్ల మధ్య రాజ్యాల వారు తమ సైన్యాలను తూర్పునుంచి ఉపసంహరించుకొని, వత్తిడి అధికంగా ఉన్న పశ్చిమ రంగాలకు తరలించు కోగలిగారు.

బ్రెస్ట్ లిటోవస్క్ సంధిని కమ్యూనిస్ట్ పార్టీలోని అతివాదులు వ్యతిరేకించారు. కాని విప్లవ రక్షణకోసం జర్మనీలో సంధి చేసుకోవడం తప్పనిసరి లెనిన్ భావించాడు. జర్మనీలో విప్లవం సంభవిస్తుందని, అపుడు రష్యా పోగొట్టుకొన్న భాగాలను తిరిగి సంపాదించుకోవచ్చునని లెనిన్ ఆశించాడు. మొత్తం మీద శాంతి కోసం బోల్షివిక్‌లు చాలా త్యాగమే చేశారు.

అయితే ఈ సంధి జరిగిన తరువాత కూడా జర్మనీ రష్యా ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేసుకోవడం మానలేదు. 1918లో మొదటి ప్రపంచ యుద్ధంలో జర్మనీ ఓడిపోవడంలో రష్యాకు జర్మనీ వల్ల బెడద తగ్గిపోయింది.

**8.4.1.2. రష్యాలో విదేశీ జోక్యం :** జర్మనీతో బ్రెస్ట్ లిటో వస్క్ సంధి చేసుకొన్న తరువాత రష్యా మిత్ర రాజ్యాల సైనిక జోక్యాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. 1918 ఏప్రిల్ 4న జపాన్ సైన్యాలు వ్లాడివోస్టక్‌ను ముట్టడించడంతో రష్యా ఆంతరంగిక వ్యవహారాలలో విదేశీ సైన్యాల జోక్యం ప్రారంభమయింది. ఆనాటి నుంచి రెండున్నర సంవత్సరాల పాటు సోవియట్ ప్రభుత్వము విదేశీ సైన్యాల సహాయం పొందుతున్న విప్లవ వ్యతిరేక రష్యన్ శ్వేత సైన్యం మీద హోరాహోరీ పోరాడవలసి వచ్చింది. ఇది సోవియట్ రష్యాకు మిత్ర రాజ్యాలకు జరిగిన ఒక విధమైన ప్రకటన లేకుండా జరిగిన యుద్ధము అని చెప్పవచ్చు.

**మిత్ర రాజ్యాలు రష్యా ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేసుకోవడానికి కారణాలు :**

1) రష్యాలో జరిగిన విప్లవం వర్గ పోరాటాన్ని ప్రోత్సహించడంతో తమ రాజ్యాల మీద కూడా విప్లవ ప్రభావం ప్రసారమవుతుందని మిత్ర రాజ్యాలు భీతి చెందాయి. అందువల్ల నూతన సోవియట్ ప్రభుత్వాన్ని అంతంచేసి తమ దేశాలలోని పెట్టుబడిదారీ విధానాన్ని కాపాడుకోవడం కోసం మిత్ర రాజ్యాలు కృతనిశ్చయంతో ఉన్నాయి.

2) మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో మిత్ర రాజ్యాలు రష్యాలోని వివిధ ప్రాంతాలలో ఆయుధాలు, మందుగుండు సామాగ్రి ఉంచడం జరిగింది. జర్మనీతో రష్యా సంధి చేసుకొన్నందువల్ల ఈ మందు గుండు సామగ్రిని జర్మనీగాని, సోవియట్ రష్యాగాని తమమీద ఉపయోగించవచ్చుననే భయం మిత్ర రాజ్యాలకు ఏర్పడింది.

3) తాను మిత్ర రాజ్యాలకు ఇవ్వవలసిన ఋణాలను చెల్లించబోనని సోవియట్ ప్రభుత్వం ప్రకటించింది. అందువల్ల రష్యాలో పెద్ద మొత్తం పెట్టుబడులు పెట్టిన ఇంగ్లండ్, ఫ్రాన్స్, అమెరికా మొదలైన దేశాలు నష్టానికి గురి అయ్యే ప్రమాదం ఏర్పడింది.

ఈ కారణాలవల్ల మిత్ర రాజ్యాలు రష్యా ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేసుకొన్నాయి. బ్రిటిష్ సైన్యాలు ఉత్తర రష్యాలోని ముర్‌మన్‌స్క్ అనే ప్రదేశాన్ని ముట్టడించినాయి. అంతేగాక బ్రిటిష్ సైన్యాలు ముట్టడించి డాన్‌వద్దనున్న జనరల్ డెన్‌కిన్‌తో సహకరించడానికి

సిద్ధంగా ఉన్నాయి. ఊరల్ పర్వత ప్రాంతంలో ఉన్న రష్యన్ సైన్యాలు చెక్ సహాయాన్ని పొందినాయి. సైబీరియాలో అడ్మిరల్ కోలెహక్ ఆధ్వర్యంలో శ్వేత సైన్యాలు పనిచేయడం ప్రారంభించాయి.

మిత్ర రాజ్యాల సైనిక జోక్యం వల్ల సోవియట్ ప్రభుత్వాన్ని అంతం చేయడం జరగలేదు. సోవియట్ రక్షణ మంత్రి ట్రాట్స్కీ, ఎర్ర సైన్యాన్ని తయారుచేసి విదేశీ సైన్యాల బారినుంచి దేశాన్ని కాపాడినాడు. దీనికితోడు ఆ రోజులలో యూరప్ వస్తువులకు రష్యాలో మంచి గిరాకీ ఉన్న కారణంగా సోవియట్ రష్యాతో వాణిజ్య సంబంధాలు నెలకొల్పుకోవడానికి పశ్చిమ రాజ్యాలు ఆతురతలో ఉన్నాయి. అందువల్ల పశ్చిమ రాజ్యాలు తమ సైన్యాలను రష్యానుంచి ఉపసంహరించుకొన్నాయి. చివరకు వ్లాడి వోస్టక్‌లో ఉన్న జపాన్ సైన్యాలు మాత్రమే రష్యా భూభాగంలో మిగిలిన విదేశీ సైన్యాలు. అయితే జపాన్ సైన్యాలు వ్లాడివోస్టర్ రేవు పట్టణాన్ని పట్టుకోవడంలోను, చైనా తూర్పు రైల్వేను వశం చేసుకోవడంలోను మాత్రమే ఆసక్తి చూపినాయి. కాని రష్యా ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేసుకోవడంలో ఆసక్తి చూపలేదు.

8.4.1.3. రష్యన్ విప్లవ వ్యతిరేక శక్తులు (అంతర్యుద్ధం) : శ్రామిక వర్గ నియంతృత్వ స్థాపన చేసిన తరువాత లెనిన్ రష్యా ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేసుకోవడానికి సిద్ధమవుతున్న విదేశీ శత్రువులను ఎదుర్కోవడమేగాక, దేశంలోని విప్లవ వ్యతిరేక శత్రువుల ప్రతిఘటనను ఎదుర్కోవలసి వచ్చింది. బోల్షెవిక్ విప్లవ వ్యతిరేక సైన్యాలకు తెల్ల సైన్యం అని పేరు. ఈ సైన్యాలకు బ్రిటిష్, ఫ్రెంచ్, అమెరికన్, జపనీస్ ప్రభుత్వాలు ఆయుధాలను, ఆర్థిక వనరులను సమకూర్చి పెట్టాయి. స్వదేశీ తెల్ల సైన్యాలతో బాటు విదేశీయులను ప్రతిఘటించడానికి బోల్షెవిక్‌లు ఎర్ర సైన్యాన్ని నిర్మించుకొన్నారు. ఎర్ర సైన్యాన్ని ఏర్పాటు చేయడంలోనూ, పటిష్ఠం చేయడంలోనూ ట్రాట్స్కీ ప్రముఖపాత్ర నిర్వహించాడు. అంతర్యుద్ధం ప్రజ్వరిల్లిన ప్రతిచోటికి ట్రాట్స్కీ స్వయంగా వెళ్ళి ఆత్మ స్థైర్యాన్ని, ఉత్సాహాన్ని ఎర్ర సైనికులకు ఇతోధికంగా సమకూర్చాడు. ఎర్ర సైన్యంలో సెమ్యాన్ బుదెని, క్లైమెంట్ వొరాషిలావ్, స్టాలిన్ ముఖ్యాధికారులుగా వ్యవహరించారు.

ఎడ్మిరల్ కొల్చాక్ సైబీరియాలో 'తెల్ల ప్రభుత్వాన్ని' ఏర్పాటు చేశాడు. ఇతడు గతంలో నౌకాదళాధిపతిగా వ్యవహరించాడు. జనరల్ డెనికిన్ కాకసస్‌లో బోల్షెవిక్ ప్రభుత్వాన్ని అణచడానికి తెల్ల సైన్యంతో సిద్ధమయ్యాడు. కెరెన్స్కీ ప్రభుత్వ కాలంలో జర్మన్‌లను వ్యతిరేకంగా పోరాటం చేసి ఉన్న 'చెకోస్లవాక్ లీజియన్' అనబడే నలభైవేల సైనికులు ఓమ్స్క్ ప్రాంతంలో ట్రాన్స్-సైబీరియన్ రైల్వేలో చాలా భాగాన్ని ఆక్రమించుకొన్నారు. బోల్షెవిక్‌లపైన, వారిని సమర్థించే వారిపైన తెల్ల సైన్యాలు భీతావహాన్ని సృష్టించారు. 1919 ప్రారంభంలో ఎడ్మిరల్ కొల్చాక్ సోవియట్‌ల కొత్తరాజధాని మాస్కోకు మూడు సైన్యాలను తరలించాడు. బోల్షెవిక్‌ల పతనానంతరం కొల్చాక్ బోల్షెవిక్ వ్యతిరేక ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తాడని భావించారు.

ఈ పరిస్థితులలో రక్షణ మంత్రి ట్రాట్స్కీ, ఎర్రసైన్యాన్ని పునర్నిర్మాణం చేసి పటిష్ఠం చేసినాడు. ఈ ఎర్రసైన్యం మంచి క్రమశిక్షణ ప్రదర్శించి కొల్చాక్ సైన్యాన్ని వెనకకు నెట్టి వేశాయి. కొల్చాక్ ఎర్రసేన చేతిలో హతుడయ్యాడు. డెనికిన్ ఆధ్వర్యంలో 'చెక్ లీజియన్'ను కూడా ఎర్ర సైన్యం ఓడించింది. అతడు బ్రిటీష్ వారి సహాయంలో రష్యానుంచి పారిపోయాడు. మాతృ దేశము అపాయంలో ఉంది' అనే నినాదాన్ని ప్రయోగించినందువల్ల ఎర్రసైన్యం విశేషమైన సైనిక విజయాలను సాధించింది. 1919 చివరినాటికి రష్యాలో సంభవించిన అంతర్యుద్ధం అంతమైంది. తెల్ల సైన్యాలు పూర్తిగా ధ్వంసం అయినాయి.

అంతర్యుద్ధంలో బోల్షెవిక్ ప్రభుత్వం సాధించిన విజయానికి చాలా కారణాలున్నాయి. తెల్ల సైన్యాలకు మంచి వ్యవస్థకానీ, క్రమ శిక్షణ కానీ లేవు. కొల్చాక్, డెనికిన్‌ల మధ్య సమన్వయమే కుదరలేదు. బోల్షెవిక్ వ్యతిరేకలకు కర్షకులలో సహకారం లభించలేదు. బోల్షెవిక్ వ్యతిరేకులు తిరిగి అధికారానికివస్తే తమకు లభించిన హక్కులు, భూములు తిరిగి వదులు కోవలసివస్తుందని కర్షకులు భావించారు. లెనిన్, ట్రాట్స్కీ నాయకత్వంలో ఎర్రసైన్యం బ్రహ్మాండమైన క్రమశిక్షణ ప్రదర్శించింది. అవసరానికి సరిపడిన చర్యలు తీసుకోగల సామర్థ్యం లెనిన్‌కు ఉన్నది. పెద్ద పరిశ్రమలు జాతీయం అయినాయి. పెద్ద భూకమతాలను రైతులకు పంచి పెట్టారు. ప్రజా న్యాయస్థానాల ద్వారా దుర్మార్గులు, ప్రజావ్యతిరేకులు శిక్షింపబడ్డారు. ఈ చర్యల వల్ల బోల్షెవిక్‌లు ప్రజాదరణ పొందగలిగినారు. విదేశీయుల జోక్యాన్ని ఎదుర్కొంటూ తమదే జాతీయ ప్రభుత్వమని లెనిన్ ప్రజలకు నచ్చ చెప్పగలిగాడు. విదేశాలతో పెట్టుకొన్న సంబంధాలవల్ల తెల్ల సైన్యాల నాయకులు విదేశీ తొత్తులనే అభిప్రాయం సామాన్య రష్యన్ జనసందోహానికి కలిగింది. అంతేకాక తెల్ల సైన్యం ప్రతిచోటా భీతావహాన్ని సృష్టించింది. దీనితో ప్రజలలో వీరిపట్ల ఏహ్య భావం జనించింది.

**8.4.1.4. సోవియట్ రాజ్యాంగం :** సోవియట్ యూనియన్‌లో 1918 జూలై 10న కొత్త రాజ్యాంగం అమలుకు వచ్చింది. ఈ రాజ్యాంగం రష్యాను 'కార్మిక, కర్షక, సైనిక డెప్యూటీల రిపబ్లిక్'గా ప్రకటించింది. అప్పటినుంచి రష్యాను 'రష్యన్ సోషలిస్ట్ ఫెడరేటెడ్ సోవియట్ రిపబ్లిక్' గా వ్యవహరిస్తారు. రష్యా సంధియుగంలో ఉన్నదని, అందువల్ల దేశాన్ని శ్రామిక వర్గ నియంతృత్వం పాలిస్తుందని, బూర్జువ వ్యవస్థను పూర్తిగా అణచివేస్తుందని, పీడిత ప్రజానీక వ్యతిరేక శక్తులను అణచివేయడమే సోవియట్ కర్తవ్యమని రాజ్యాంగం ప్రకటించింది. ప్రతివ్యక్తి పని చేయాలని రాజ్యాంగం స్పష్టపరచింది. రోమనావ్ రాజవంశ సభ్యులు, పోలీస్ ఏజెంట్లు, మతాధికారులు, వ్యాపార వర్గాల ప్రతినిధులు, పిచ్చివారు, నేరస్థులు ఓటు చేయడానికి వీలు లేదు. కమ్యూనిస్ట్ పార్టీ తప్ప ఏ ఇతర రాజకీయ పక్షాలు ఉండ కూడదు.

కమ్యూనిస్ట్ పార్టీ 9మంది సభ్యులతో కూడిన రాజకీయ సమితికి ఉన్నతాధికారమున్నది. దానినే పొలిట్ బ్యూరో అంటారు. అదే పార్టీ విధానాలను తయారుచేసి ప్రభుత్వం చేత అమలులో పెట్టిస్తుంది. ఈ పద్ధతిలో పార్టీ, ప్రభుత్వం ఏకైక విధానంలో నడవవలె. అందుచేత ఈ కమ్యూనిస్ట్ పార్టీననుసరించి జరుగుతున్న ప్రభుత్వానికి కమ్యూనిస్ట్ నియంతృత్వము అనే పేరు వచ్చింది. తమ ప్రభుత్వం ప్రజా స్వామ్యానికి వ్యతిరేకమనే విమర్శను రష్యన్ కమ్యూనిస్ట్‌లు అంతగా పట్టించుకోలేదు. పెట్టుబడిదారీ వర్గ నియంత్రణలో ఆర్థిక వ్యవస్థను కాపాడడమే లక్ష్యంగా లోగడ రష్యాలో చక్రవర్తులు పాలించినారు. దేశ ప్రజలలో అధిక సంఖ్యాకులైన శ్రామికవర్గ ప్రజల శ్రేయస్సు, లక్ష్యంగా శ్రామికవర్గ నియంతృత్వాన్ని నెలకొల్పినామని రష్యన్ కమ్యూనిస్టులు గర్వంగా చెప్పుకొన్నారు.

1948లో రష్యన్ సోషలిస్ట్ ఫెడరేటెడ్ సోవియట్ రిపబ్లిక్‌గా పరివర్తన చెందిన రష్యాను 1923లో పునర్వ్యవస్థీకరించి 'యూనియన్ ఆఫ్ ది సోవియట్ సోషలిస్ట్ రిపబ్లిక్'గా ప్రకటించారు. 1936లో మానవ హక్కులు, సమ న్యాయపాలన మొదలైన పార్లమెంటరీ ప్రజాస్వామ్య పద్ధతులతో కూడిన నూతన రాజ్యాంగాన్ని స్టాలిన్ ప్రవేశపెట్టినాడు. అయితే ఈ నూతన రాజ్యాంగం వల్ల లోగడ రష్యాలో ఏర్పాటు చేసిన కమ్యూనిస్ట్ నియంతృత్వ పాలనా వ్యవస్థలో చెప్పుకోదగిన మార్పులేమీ జరగలేదు.

**8.4.1.5. శుద్ధ కమ్యూనిజమ్ (కఠినమైన రాజకీయ ఆర్థిక విధానాల అమలు) (1918-1921) :** జర్మనీతో 1918లో బ్రెస్ట్ లిటోవస్క్ సంధి చేసుకొన్న తరువాత రష్యా శ్వేత సైన్యం నాయకత్వంలో నడిచిన ఆంతరంగిక విప్లవ వ్యతిరేక శక్తులతో అంతర్యుద్ధం చేయడంతో బాటు విదేశీ సైన్యాల జోక్యాన్నికూడా ఎదుర్కోవలసి వచ్చింది. ఈ కాలంలో దేశం ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా తయారయింది. అందువల్ల దేశాన్ని ఆర్థిక దుస్థితి నుంచి కాపాడటానికి సోవియట్ ప్రభుత్వం ప్రజల ప్రాణాలమీద, ఆస్తులమీద పూర్తి ప్రభుత్వ నియంత్రణను ఉంచవలసి వచ్చింది. దేశ ఆర్థిక విధానమంతా ఉన్నత ఆర్థిక మండలి ఆధీనమయింది. రాజకీయ రంగంలో ప్రభుత్వ విరోధుల చర్యలను అరికట్టడానికి 'చెకా' అనే రహస్య పోలీస్ దళాన్ని వినియోగించినారు. నూతన శ్రామికవర్గ నియంతృత్వాన్ని ప్రపంచ పెట్టుబడిదారి ధాటినుంచి కాపాడటానికి సోవియట్ ప్రభుత్వం తప్పనిసరిగా కఠినమైన రాజకీయ, ఆర్థిక విధానాలను అనుసరించవలసి వచ్చింది. శుద్ధ కమ్యూనిజాన్ని అనుసరిస్తున్న ఈ కాలంలో (1918-21) రష్యా వర్గ రహిత సమాజ స్థాపనకు స్వాధికార వర్గ నిర్మూలనకు కొన్ని చర్యలు తీసుకొన్నది. అయితే అత్యవసర పరిస్థితులున్న కారణంగా శ్రామిక వర్గ నియంతృత్వము తప్పనిసరి అయింది.

1918-1921 మధ్య కాలంలో రష్యాలో వస్తువుల పంపిణీ మీద ప్రభుత్వ నియంత్రణ ఏర్పడింది. జాతీయీకరణ పెద్ద ఎక్కువ కొనసాగింది. విదేశీ వ్యాపారమంతా ప్రభుత్వ పరం చేసినారు. రష్యా విదేశాల కివ్వవలసిన రుణాల బారినుంచి విముక్తి చెందినట్లు ప్రకటించారు. చర్చి సంపద అంతా ప్రభుత్వ పరమయింది. నిర్ణీతమైన ధరలకు రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వానికి మాత్రమే అమ్మవలెను. ఈ చర్యల ఫలితంగా అనతికాలంలోనే రష్యా ఆంతరంగిక శత్రువులబారి నుంచి, విదేశీ జోక్యం బెడదనుంచి రక్షణ పొందింది.

**8.4.1.6. నూతన ఆర్థిక విధానము (1921-1924) :** 1921 నాటికి సోవియట్ ప్రభుత్వం తన అధికారాన్ని పూర్తిగా పటిష్టం చేసుకోగలిగింది. అయినప్పటికీ సోవియట్ వ్యవస్థ ఇంకా ఎన్నో బాలారిష్టాలను ఎదుర్కొంది.

1) ప్రథమంలో సోవియట్ ప్రభుత్వం అనుసరించిన ఆర్థిక విధానాల ఫలితంగా దేశంలో అలజడీ, అశాంతి ఏర్పడినాయి.

2) నూతన సోవియట్ ప్రభుత్వం అనుసరిస్తున్న కఠిన విధానాలను కర్షకులు హర్షించకపోవడమేగాక వ్యతిరేకించసాగారు. ఆహార పదార్థాలను ప్రభుత్వం నిర్బంధంగా వసూలు చేయడంవల్ల రైతులు తమకు అవసరమైన దానికన్నా ఎక్కువ పండించడం మానివేశారు.

3) సోషలిస్ట్ తత్వం అబ్బినందువల్ల కార్మికులు కూడా తమ బాధ్యతలను విస్మరించారు. పారిశ్రామికోత్పత్తి 15% పడిపోయింది.

4) ఒకవైపు మొదటి ప్రపంచ యుద్ధం వల్లా, అంతర్యుద్ధం వల్లా, విదేశీ జోక్యంవల్లా మరొకవైపు వర్షాభావంవల్ల దేశ వ్యాప్తంగా కరువు పరిస్థితులేర్పడినాయి. కర్షకులు కమ్యూనిస్ట్ ప్రభుత్వ స్థాపనను వ్యతిరేకించసాగినారు.

5) ప్రభుత్వ ఆర్థిక విధానం విఫలమైనందువల్లనే అనేక లక్షలమంది ఆకలి చావులకు గురికావలసి వచ్చిందనే విమర్శకూడా బయలుదేరింది. కరువు నివారణకోసం విదేశాలనుంచి ముఖ్యంగా అమెరికానుంచి సోవియట్ ప్రభుత్వం ఆహార ధాన్యాలను అర్థించవలసి వచ్చింది. అమెరికా సాయం కోసం మాక్సిమ్ గోర్కీచేసిన అభ్యర్థనను సోవియట్ ప్రభుత్వం దాదాపుగా సమర్థించవలసి వచ్చింది.

ఇటువంటి పరిస్థితులలో పదవ కమ్యూనిస్ట్ కాంగ్రెస్ సమావేశమయింది. ఉత్పత్తులను పెంచే విషయం గురించి కాంగ్రెస్ చర్చించింది. దీనితో లెనిన్ చాలా సూచనలు చేసినాడు. వెనుకబడి వ్యవసాయక దేశంగానే ఉన్న రష్యా పారిశ్రామిక దేశంగా మార్చాలని లెనిన్ సూచించాడు. విద్యుత్తు, సోవియట్ శక్తి కలిపితే కమ్యూనిజమవుతుందని లెనిన్ ప్రకటించాడు.

దేశ ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దడానికి సోవియట్ ప్రభుత్వం నూతన ఆర్థిక విధానాన్ని అనుసరించవలసిన అవసరమేర్పడింది. వాస్తవిక వాది అయిన లెనిన్ కమ్యూనిస్ట్ సిద్ధాంతాల అమలు కొంతకాలం పాటు వాయిదావేసి 1921లో నూతన ఆర్థిక విధానాన్ని ప్రారంభించాడు. జనవరి 1924లో లెనిన్ మరణించేవరకు రష్యాలో ఈ విధానం అనుసరించడం జరిగింది. ఉత్పత్తిని పెంచడం ద్వారా సామ్యవాద మార్గాన్ని సుకరంచేయడం నూతన ఆర్థిక విధానం ముఖ్య లక్ష్యము.

లెనిన్ 1921లో ప్రవేశ పెట్టిన నూతన ఆర్థిక విధానం ప్రకారం : 1) భారీ పరిశ్రమలను, ప్రజోపయోగకరమైన సంస్థలను ప్రభుత్వాధీనంలో ఉంచి కొంత వరకు ప్రైవేట్ రంగంలో పరిశ్రమలను, వ్యాపారాన్ని లెనిన్ ప్రోత్సహించాడు. ఈ విధానం ఫలితంగా దేశ ప్రజలలో వ్యక్తిగత శ్రద్ధకు ప్రోత్సాహం వచ్చి దేశంలో ఖాళీగా ఉన్న మార్కెట్లన్నీ తిరిగి వస్తువులతో నిండినాయి.

2) రైతుల వద్ద నుంచి నిర్బంధంగా ధాన్యం సేకరించడాన్ని ప్రభుత్వం విరమించుకొన్నది. రైతులు తమ వద్ద ఉన్న మిగులు ధాన్యాన్ని బహిరంగ మార్కెట్లలో అమ్ముకోవచ్చుననే ఆజ్ఞను ప్రభుత్వం జారీచేసింది. తాము చెల్లించవలసిన పన్నులను మాత్రం రైతులు కొంత వరకు ధాన్యరూపంలో ప్రభుత్వానికి ఇవ్వవలసి ఉండేది. ఈ విధానం వల్ల రష్యాలో ఆహార ధాన్యాలను పెద్ద మొత్తంలో పండించడానికి రైతులకు ప్రోత్సాహం లభించింది. దీని ప్రకారం ప్రణాళికాబద్ధమైన ఆర్థిక విధానానికి తోడు పెట్టుబడిదారీ ఆర్థిక విధానం కూడా సోవియట్ ప్రభుత్వం ప్రోత్సహించినట్లయింది.

3) చిన్న పరిశ్రమలు లాభార్జనకోసం వస్తువులను ఉత్పత్తి చేయడాన్ని, మార్కెట్లలో పాత పద్ధతుల ప్రకారం విక్రయించుకోవడాన్ని కూడా ప్రభుత్వం అనుమతించింది.

4) రష్యాలో పరిశ్రమల స్థాపనకు విదేశ పెట్టుబడిదారులకు అనుమతి ఇచ్చింది. ఇంగ్లండ్, ఇటలీ, ఆస్ట్రియా, నార్వే మొదలైన దేశాలలో సోవియట్ ప్రభుత్వం వాణిజ్య ఒప్పందాలను చేసుకొన్నది.

5) కరెన్సీ ద్రవ్యాన్ని పటిష్టం చేయడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకొన్నది. నోట్ల ముమ్మరాన్ని తగ్గించడానికి 1921 నాటికి ప్రభుత్వం పదివేల పాతరూబుల్‌లకు సమానమైన ఒక కొత్త రూబుల్‌ను ప్రవేశపెట్టింది. నూతన కరెన్సీ విధానాన్ని అమలుపరచిన ఫలితంగా రష్యా ద్రవ్యోల్బణ పరిస్థితుల నుంచి విముక్తి పొందగలిగింది.

6) వివిధ తరగతులకు చెందిన ఉద్యోగులకు వివిధరకాలైన జీతభత్యాలు నిర్ణయించడం జరిగింది.
7) రేషనింగ్ పద్ధతిలో కొన్ని మార్పులు చేయడం జరిగింది.
8) నిత్యావసరవస్తువులను ప్రజలు బహిరంగ మార్కెట్లలో కొనుగోళ్లు చేయవచ్చు.
9) సహకార సంస్థలు స్థాపితమైనాయి.

పై చర్యలు సోషలిజంను సాధించడానికి వెనుకంజలాంటివి అయినా, ఇవి ఆనాటి పరిస్థితికి అనుకూలమైనవనీ, కేవలం తాత్కాలికమైనవని లెనిన్ స్పష్టపరిచాడు కంట్రోళ్ళు సడలించిన ఫలితంగా కర్షకులు తమ భూములకు కౌలుకిచ్చుకోడానికి, ధాన్యాన్ని ప్రైవేటు వర్తకులకు అమ్ముకోవడానికి అవకాశమేర్పడి వారి పరిస్థితులు మెరుగైనాయి. గ్రామీణ ప్రాంతాలలోని భాగ్యవంతులైన రైతులు ఒక విధమైన నూతన ఉత్తేజాన్ని పొందడమేగాక దేశ వ్యవసాయోత్పత్తిలో ప్రముఖ పాత్ర వహించడం ప్రారంభించారు. రష్యాలో పెట్టుబడి దారీ విధానం పునరుద్ధరించడం జరిగిందని పెట్టుబడిదారీ రాజ్యాలు హర్షాన్ని వెలిబుచ్చినాయి.

నూతన ఆర్థిక విధానం అమలు పరచడమనేది రష్యన్ కమ్యూనిస్ట్ చరిత్రలో వాస్తవానికి తాత్కాలికమైన వెనుకంజ మాత్రమే. లెనిన్ చెప్పినట్లుగా నూతన ఆర్థిక విధానాన్ని అనుసరించడానికి కారణం ఒక అడుగు వెనకకు వేసి రెండడుగులు ముందుకు వేయడానికేనని చెప్పవచ్చు. అంతర్యుద్ధం, విదేశ సైన్యాల జోక్యం వల్ల దెబ్బతిన్న రష్యా నూతన ఆర్థిక విధానం వల్ల చాలా వరకు కోలుకొన్నది. ఆర్థికంగా దేశం పటిష్టం చేయడం జరిగింది. ఈ కాలంలో ఆర్థిక రంగంలోనేగాక ఇతర రంగాలలో కూడా నూతన విధానం అనుసరించడం జరిగింది. 1922లో రష్యా జర్మనీతో రపెల్లో మైత్రి సంధి చేసుకొన్నది. 1923లో సనాతన చర్చికి మత కార్యక్రమాలు చేపట్టడానికి అనుమతి ఇవ్వడం జరిగింది.

8.4.1.7. **లెనిన్ ఘనత :** పదవ సోవియట్ కమ్యూనిస్ట్ పార్టీ మహాసభ జరిగిన కొద్దికాలానికే లెనిన్ ఆరోగ్యం క్షీణించడం మొదలు పెట్టింది. 1922లో లెనిన్‌కు పక్షపాతం వచ్చింది. 1924 జనవరి 21న తిరిగి పక్షవాతం వచ్చి లెనిన్ గోర్కీ అనేచోట మరణించాడు. కమ్యూనిస్ట్ పార్టీ అధినేత, రష్యన్ విప్లవ ప్రభుత్వాధినేత అయిన లెనిన్ మరణించడం రష్యన్ విప్లవానికి గొడ్డలిపెట్టువంటిది. 1917 నాటికి రష్యాలోని పరిస్థితులను సక్రమంగా అంచనావేసి జార్ చక్రవర్తుల నిరంకుశ పాలనను అంతం చేయడానికి, విప్లవాన్ని సాధించడానికి వీలైన పథకాన్ని, వ్యూహాన్ని లెనిన్ రచించినాడు. మార్క్స్ సిద్ధాంతాలను ఉపయోగించి సామ్రాజ్యవాదము బలంగా ఉన్న కాలంలో జార్ చక్రవర్తుల పాలనను లెనిన్ అంతం చేసినాడు. ఒక దేశంలో విప్లవాన్ని సాధించిన విజేతగానే గాక లెనిన్ శ్రామిక వర్గ విమోచకుడుగా ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు పొందినాడు. రష్యాలో పరిస్థితులు పరిపక్వంగా ఉన్నదశలో బోల్షివిక్‌లకు నాయకత్వం వహించి అధికారాన్ని హస్తగతం చేసుకోవడమేగాక లెనిన్ రష్యాకు ఆర్థిక, రాజకీయ పునరుజ్జీవనం కల్పించినాడు. అనేక విషమ పరిస్థితులను ఎదుర్కొంటూనే లెనిన్ కమ్యూనిస్ట్ పార్టీని, దేశాన్ని కూడా అంతర్యుద్ధం, విదేశ సైన్యాల జోక్యం మొదలైన ఆపదల నుంచి కాపాడినాడు. నూతన ఆర్థిక విధానాన్ని అనుసరించి దేశాన్ని ఆర్థికంగా పునర్నిర్మాణం చేసి తగిన సమయంలో సముచితమైన నిర్ణయం చేయగల మహానాయకుడుగా లెనిన్ ప్రసిద్ధి చెందినాడు.

## 8.5. స్టాలిన్ నియంతృత్వము :

స్టాలిన్ అసలుపేరు జోసెఫ్ జుగాష్విలి. బోల్షివిక్‌లతో చేతులు కలిపిన తరువాత ఇతను 1904లో స్టాలిన్ అని పేరు పెట్టుకొన్నాడు. స్టాలిన్ అంటే ఉక్కు మనిషి అని అర్థం. స్టాలిన్ 1879లో జార్జియాలోని చిన్నగ్రామం గోరిలో జన్మించాడు. తండ్రి చెప్పులు కుట్టేవాడు. బహుబీద కుటుంబం. స్టాలిన్ పూజారి కావాలని తల్లి ఆశించి అతనిని 'టిఫ్లిస్ థియోలాజికల్ సెమినరీ' లో చేర్పించింది. అక్కడి వాతావరణం స్టాలిన్‌కు గిట్టలేదు. సామ్యవాద సిద్ధాంతాలను సహచరులలో ప్రచారం చేసినందువల్ల స్టాలిన్ సెమినరీ నుండి వెళ్లగొట్టబడ్డాడు. 1904లో స్టాలిన్ బోల్షివిక్‌లతో చేరినాడు. 1917 తరువాత కమ్యూనిస్ట్ పార్టీ నిర్మాతగా స్టాలిన్ బోల్షివిక్‌లతో చేరినాడు. 1917 తరువాత కమ్యూనిస్ట్ పార్టీ నిర్మాతగా స్టాలిన్ పేరు తెచ్చుకొన్నాడు. 1924లో లెనిన్ మరణించే కాలం నాటికి స్టాలిన్ సోవియట్ కమ్యూనిస్ట్ పార్టీకి సెక్రటరీ జనరల్‌గా ఉన్నాడు. ప్రభుత్వ విధానాలను నిర్ధారించే పొలిట్‌బ్యూరోలో కూడా స్టాలిన్ సభ్యుడు. స్టాలిన్ పార్టీలో శక్తిమంతుడవుతాడని ఆనాడు ఎవ్వరూ ఊహించలేదు. స్టాలిన్ మొరటు మనిషి అనీ పార్టీ నాయకత్వం నుంచి ఆయనను తొలగిస్తే మంచిదనీ తన వీలునామాలో లెనిన్ సూచించాడు. కాని సైద్ధాంతికపరమైన సంఘర్షణలో చివరకు స్టాలిన్‌కు విజయం లభించింది.

8.5.1. **ట్రాట్స్కీ - స్టాలిన్‌ల మధ్య సిద్ధాంతపరమైన భేదాలు :** లెనిన్ మరణించిన తరువాత అతని అనుచరుల మధ్య అధికారం కోసం దాదాపు వారసత్వ యుద్ధం ప్రారంభమైంది. కమ్యూనిస్ట్ పార్టీలోని నాయకులంతా రెండు ముఠాలుగా చీలిపోయినారు. దేశ బహిష్కృతులై

విదేశాలలో పది సంవత్సరాలు గడిపినటువంటి ట్రాట్స్కీ, కమనెవ్, జినోవీవ్ మొదలైన నాయకులు ఒక కోవకు చెందినవారు. స్టాలిన్, మాలటోవ్, వొరొషిలోవ్ మొదలైన రెండ కోవకు చెందిన నాయకులు రష్యాలో పది సంవత్సరాల కాలం అజ్ఞాత వాసంలో ఉండి అరెస్టులను, జైలు శిక్షలను భరించిన వారు. ప్రపంచ విప్లవం అనే లక్ష్యంలో కమ్యూనిస్టులందరికీ నమ్మకమున్నప్పటికీ లక్ష్య సాధనకు అనుసరించవలసిన మార్గం విషయంలో అభిప్రాయ భేదాలేర్పడినాయి.

స్టాలిన్‌కు ప్రత్యర్థి స్థానంలో ఉన్న ట్రాట్స్కీ బ్రహ్మాండమైన వక్త, మేధావి, ఎర్ర సైన్యాన్ని సృష్టించినవాడు. కమ్యూనిస్ట్ ప్రపంచంలో లెనిన్ తరువాత ఉన్నత స్థాయిలో ఉండి గౌరవాన్ని పొందిన వ్యక్తి ట్రాట్స్కీ. అందువల్ల లెనిన్ తరువాత ట్రాట్స్కీ కమ్యూనిస్ట్ పార్టీ నాయకత్వాన్ని స్వీకరిస్తాడనే అభిప్రాయం ఏర్పడింది. కాని ఊహించడానికి వీలులేని కొన్ని కారణాలవల్ల ట్రాట్స్కీ లెనిన్ అంత్య క్రియలకు హాజరుకాక పోవడమేగాక తరువాత 1924 మే లో జరిగిన 13వ కమ్యూనిస్ట్ పార్టీ సమావేశానికి కూడా హాజరు కాలేదు. లెనిన్ మరణానంతరం పార్టీ వేదికలలో జరిగిన సిద్ధాంతపరమైన చర్చలలో స్టాలిన్‌కే విజయం లభించింది. ట్రాట్స్కీ మేధస్సు ఆతడికి శాపంగా పరిణమించింది: ట్రాట్స్కీ అధికారానికి వస్తే పార్టీలో సమిష్టి బాధ్యత నశిస్తుందని పొలిట్ బ్యూరో సభ్యులు భావించారు. స్టాలిన్ ప్రదర్శించిన దక్షతను చూసి ఇతర పార్టీ నాయకులు లెనిన్ సూచనలను పట్టించుకోలేదు.

కమ్యూనిస్ట్ పార్టీ సెక్రటరీగా జనరల్‌గా ఉన్న స్టాలిన్ తన స్థానాన్ని బలపరచుకొన్నాడు. మరణించిన లెనిన్ స్థానంలో పొలిట్ బ్యూరో అధ్యక్షుడుగా స్టాలిన్ ఎన్నికైనాడు. ఆనాటి పార్టీ నాయకత్వంలో అతివాద, మితవాద శక్తుల మధ్య పోరాటం జరిగింది. అతివాదులకు ట్రాట్స్కీ నాయకత్వం వహించగా, బుఖారిన్ మితవాదులకు నాయకత్వం వహించాడు. లెనిన్ అమలు పరచిన కొత్త ఆర్థిక విధానాన్ని కొనసాగించాలని బుఖారిన్ వాదించగా, అతడి ప్రత్యర్థులు దానికి కాలం తీరిందని, త్వరితగతిని రష్యాలో పారిశ్రామికీకరణ ప్రారంభించాలని వాదించారు. మొదట రష్యాలో సోవియట్ శక్తిని పటిష్టం చేయాలని ప్రస్తుతం 'ఒకే దేశంలో సోషలిజం' అనేనినాదం ఇచ్చాడు బుఖారిన్. ట్రాట్స్కీ దీనిని వ్యతిరేకించి, రష్యా బయట కూడా బోల్షెవిక్‌లు విప్లవాన్ని ప్రోత్సహించాలని 'శాశ్వత విప్లవం' అనే నినాదం ఇచ్చాడు. స్టాలిన్ మొదటి మితవాదులను బలపరిచాడు. తన ప్రత్యర్థులందరినీ స్టాలిన్ కమ్యూనిస్ట్ పార్టీ నుంచి బహిష్కరించినాడు. తన మీద కుట్రపన్ని పార్టీ అధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి ప్రయత్నించిన ప్రత్యర్థులందరినీ స్టాలిన్ రక్తపూరిత క్షాళన విధానాన్ని అనుసరించి పార్టీనుంచి తొలగించినాడు. 1927లో ట్రాట్స్కీతో సహా జనవీద్, కమనేవ్‌లను పొలట్ బ్యూరోనుంచి స్టాలిన్ బహిష్కరించగలిగాడు. 1929లో ట్రాట్స్కీ దేశంనుంచి బహిష్కృతుడైనాడు. 1941లో టాట్స్కీని మెక్సికోలో స్టాలిన్ ఏజంట్లు హత్యచేసినారు. 1928లో లెనిన్ నూతన ఆర్థిక విధానానికి స్వస్తి చెప్పి, 1929లో దానిని సమర్థిస్తున్న బుఖారిన్‌ను కూడా స్టాలిన్ పార్టీనుంచి బహిష్కరించినాడు. ఈ సంఘటనల వల్ల 1929లో దానిని సమర్థిస్తున్న బుఖారిన్‌ను కూడా స్టాలిన్ పార్టీనుంచి బహిష్కరించినాడు. ఈ సంఘటనలవల్ల 1929 నాటికి కమ్యూనిస్ట్ పార్టీలో స్టాలిన్ ఎదురులేని నాయకత్వం సంపాదించాడు. స్టాలిన్ నాయకత్వంలో సోవియట్ శక్తి అన్ని రంగాలలో బ్రహ్మాండమైన ప్రగతి సాధించింది.

**8.5.2. ఆంతరంగిక వ్యవహారాలు :** లెనిన్ అనుసరించిన నూతన ఆర్థిక విధానము దేశ ఆర్థిక పునర్నిర్మాణానికి తోడ్పడినప్పటికీ కమ్యూనిస్ట్ సిద్ధాంతానికి వ్యతిరేకమైన విధానము. అందువల్ల సమగ్ర ఆర్థిక విధానం ద్వారా లాభదృష్టితో కాక ప్రజా అవసరాలు ప్రాతిపదికగా ఉత్పత్తి, పంపిణీ జరగడానికి ప్రణాళికా పద్ధతులకు అనుసరించవలెననే అభిప్రాయం లెనిన్ మనస్సులో మొదటినుంచీ ఉండేది. పారిశ్రామికీకరణ ద్వారా రష్యాను ఆర్థికంగా అభివృద్ధి చేయవలెననే కోరిక లెనిన్‌కు ఉండేది. పట్టణ ప్రాంతాలలో పరిశ్రమల స్థాపనకుతోడు గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయాన్ని ఆధునిక శాస్త్రీయ పద్ధతుల ద్వారా అభివృద్ధి చేయవలెననే కోరిక కూడా లెనిన్‌కు ఉండేది. రాజకీయ, ఆర్థిక పారిశ్రామికాభివృద్ధిని ఏకకాలంలో సాధించవలెననే లెనిన్ ఆశయము. అయితే 1928 అక్టోబర్ వరకు రష్యాలో పంచవర్ష ప్రణాళికలు అమలు పరచడం జరగలేదు.

**8.5.2.1. మొదటి పంచవర్ష ప్రణాళిక (1928-33) :** కమ్యూనిజమ్‌ను ద్వేషిస్తున్న పశ్చిమ యూరోపియన్ దేశాలు ఏదో ఒక రోజ రష్యాపై తప్పకుండా దాడిచేస్తాయని, ఆ ప్రమాదం నుంచి తప్పించుకోవడానికి రష్యాకు భారీ పరిశ్రమలు ఎంతో అవసరమని స్టాలిన్ గ్రహించాడు. అంతేగాక కార్మికులు సామ్యవాదానికి ప్రాణంవంటివారు. ఎంతమంది కార్మికులు ఎక్కువైతే సామ్యవాద దేశం అంత బలం పుంజుకుంటుందని ఆయన భావించాడు. కానీ, భారీ ఎత్తున రష్యాలో పారిశ్రామికీకరణ ప్రారంభించడానికి చాలా అవరోధాలున్నాయి.

ముఖ్యంగా మూలధనం ప్రధాన సమస్య. పశ్చిమ దేశాల పెట్టుబడిదారులు సోషలిస్ట్ దేశంలో పెట్టుబడులు పెట్టడానికి వెనకాడుతున్నారు. అంతేగాక, వ్యవసాయకంగా కూడా రష్యావెనకబడి ఉన్నది. పెరుగుచున్న జనాభాకే గాక మిగులు వ్యవసాయక ఉత్పత్తులను ఎగుమతిచేసి విదేశమూల ధనం సంపాదించడానికి అనువైన వ్యవసాయం కూడా రష్యాలో లేదు. ఈ అవరోధాలన్నింటిని అధిగమించి రష్యాను పారిశ్రామిక దేశంగా మార్చడానికి స్టాలిన్ నిశ్చయించాడు. రష్యాలో బ్రహ్మాండమైన మార్పులు కావాలి, అవి కూడా అతి స్వల్పకాలంలో కావాలి. అభివృద్ధి చెందిన దేశాలకంటే రష్యా చాలా వెనకబడి ఉన్నది. ఈ పరిస్థితిని కేవలం పది సంవత్సరాలలో అధిగమించాలి. దీన్ని మనం సాధించి తీరాలి. లేకపోతే మనల్ని వారు తొక్కి వేస్తారు అని స్టాలిన్ నిష్కర్షగా ప్రజలను హెచ్చరించాడు. పరిశ్రమలు, వ్యవసాయం ప్రభుత్వ నియంత్రణ కిందకు రావాలని స్టాలిన్, కమ్యూనిస్ట్ పార్టీ నిర్ణయించాయి.

**8.5.2.1.1 పారిశ్రామికీకరణ :** నిపుణులతో కూడిన గోస్ప్లాన్ అనే ప్రణాళిక సంఘం మొదటి పంచవర్ష ప్రణాళికను తయారు చేసింది. ప్రణాళిక సంఘం దేశ రక్షణ, శ్రామిక మండలుల ప్రత్యక్ష పర్యవేక్షణాధికారానికి లోబడి పనిచేసేది. దేశాన్ని శీఘ్రంగా పారిశ్రామికీకరణ చేయడం మొదట పంచవర్ష ప్రణాళిక లక్ష్యము. మొదటి పంచవర్ష ప్రణాళికా కాలంలో భార్కోవ్‌లో ట్రాక్టర్‌ల ఉత్పత్తి ఫ్యాక్టరీలు, మాస్కో, గోర్కీలలో మోటారు వాహనుల ఫ్యాక్టరీలు, స్టాలిన్‌గ్రాడ్, రోస్ టోవ్‌లలో భారీ ట్రాక్టర్ల ఫాక్టరీలు, డాన్ బేసిన్‌లో ఉక్కు ఫ్యాక్టరీలు, ఊరల్ ప్రాంతంలో ఎరువుల ఫాక్టరీలు నెలకొల్పడం జరిగింది. అనేక పెద్ద ఆనకట్టలను కట్టడం జరిగింది. ఈ విధమైన పారిశ్రామికీకరణ కయ్యే పెద్ద మొత్తం ఖర్చును పెట్టుబడిదారీ రాజ్యాలైతే తమవలసలను దోచుకోవడం ద్వారా లేదా విదేశీ ఋణాలను పొందడం ద్వారా సమకూర్చు కొంటాయి. కాని రష్యాకు అటువంటి వనరులు లేవు. దేశీయమైన పరిమితమైన వనరులను ఉపయోగించి, పొదుపు చేసి, ప్రజల అవసరాలను కొంతవరకు త్యాగంచేసి రష్యాలో స్టాలిన్ ప్రభుత్వం భారీ పరిశ్రమలను స్థాపించకలిగింది.

**8.5.2.1.2. సమిష్టి వ్యవసాయ విధానము :** సమిష్టి వ్యవసాయ పద్ధతిద్వారా వ్యవసాయ పరిశ్రమను సమాజ పరం చేయడం మొదటి పంచవర్ష ప్రణాళికలోని మరో ముఖ్య అంశము. సమిష్టి వ్యవసాయ క్షేత్రాలను ఏర్పరచడానికి స్టాలిన్‌కు రెండు ప్రధాన కారణాలున్నాయి. అవి 1) చిన్న చిన్న భూములు నిరుపయోగంగా ఉన్నాయి. వాటన్నింటిని కలిపి వేసి ప్రభుత్వ నియంత్రణ కిందకు తీసుకొని వస్తే ప్రయోజనం కలుగుతుంది. ట్రాక్టర్‌ల ద్వారా, కంబైన్ హార్వెస్టర్‌ల ద్వారా వ్యవసాయ ఉత్పత్తులను పెంచవచ్చు. 2) ధనికులైన భూస్వాములు (కులక్‌లు) విప్లవం తరువాత కూడా రష్యాలో భూములపై పెత్తనం చెలాయిస్తున్నారు. వారందరూ అభివృద్ధి నిరోధకులు, కమ్యూనిస్ట్ వ్యతిరేకులు. మళ్ళీ తలెత్తకుండా వారిని సమిష్టి వ్యవసాయం ద్వారా కులక్‌లను స్టాలిన్ అణచివేయ నిశ్చయించాడు.

సమిష్టి వ్యవసాయ విధానం 1929లో ప్రారంభమయింది. కొంతమంది కర్షకుల క్షేత్రాలను కలిపి ఒక సమిష్టి వ్యవసాయ క్షేత్రంగా రూపొందించడం జరిగింది. సమిష్టి వ్యవసాయ క్షేత్రాన్ని కర్షకులంతా కలిసి సమిష్టిగా పనిచేయవలె. సమిష్టి వ్యవసాయ క్షేత్రాన్ని సభ్యులందరితో కూడిన సాధారణ సమావేశాలు, వార్షికంగా ఎన్నుకోబడిన కార్యనిర్వాహక సంఘం నిర్వహించవలె. సమిష్టి వ్యవసాయ క్షేత్రానికి కావలసిన ట్రాక్టర్లను, వ్యవసాయానికి కావలసిన ఇతర సామగ్రిని ప్రభుత్వం సరఫరా చేస్తుంది. దీనికి ప్రతిఫలంగా సమిష్టి వ్యవసాయ క్షేత్రం ప్రభుత్వంలో ఒక ఒప్పందాన్ని చేసుకోవలె. ఈ ఒప్పందం ప్రకారం క్షేత్రంలోని సభ్యుల అవసరాలకు, వారి పశువుల అవసరాలకు సరిపోగా మిగిలిన ధాన్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వవలె. సమిష్టి వ్యవసాయ విధానాన్ని తీవ్రంగా ప్రతిఘటించిన కులక్‌లను అంతం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నించింది. సమిష్టి వ్యవసాయ క్షేత్రాలలో చేరడానికి అంగీకరించని కులక్‌లను, పేద కర్షకులను సైబీరియాకు బహిష్కరించడం ప్రారంభించింది. కాని కులక్‌లతోబాటు కర్షకులు తమకు వచ్చే రాబడి తక్కువైనందువల్ల సమిష్టి వ్యవసాయ క్షేత్రాల పద్ధతి పట్ల తమ వ్యతిరేకతను వ్యక్తం చేసినారు. కొన్ని పరిస్థితులలో ప్రభుత్వం కర్షకులకు కొన్ని రాయితీలు ఇవ్వవలసి వచ్చింది. 1939 నాటికి ప్రభుత్వం అవిరళ కృషిచేసి దేశంలోని కర్షకులలో 90 శాతాన్ని సమిష్టి వ్యవసాయ క్షేత్రాలలో సభ్యులుగా చేర్పించింది. రష్యాలోని నియంతృత్వ పరిపాలన సమిష్టి వ్యవసాయ విధానాన్ని కఠిన చర్యల ద్వారా అమలు పరచింది.

**8.5.2.1.3. గుణ దోషాలు :** మొదటి పంచవర్ష ప్రణాళిక ద్వారా రష్యాలో జరిగిన పారిశ్రామికీకరణంలో కొన్ని గుణ దోషాలున్నాయి. పోటీతో కూడిన ఉత్పత్తి విధానంలో ఉండేటటువంటి మితిమీరిన వ్యయం తొలగించడమేగాక, వ్యక్తిగత ప్రోత్సాహం కూడ పూర్తిగా తొలగలేదు. అయితే సామర్థ్యానికి సంబంధించినంతవరకు రష్యాలో జరిగిన పారిశ్రామికీకరణ ఉన్నత ప్రమాణాలను నెలకొల్పలేక పోయింది. పెద్ద మొత్తంలో ఉత్పత్తిని సాధించడం కోసం చాలా వరకు వస్తువుల నాణ్యతను తగ్గించడం జరిగింది.

మొదటి పంచవర్ష ప్రణాళికలో భారీ పరిశ్రమలకు ప్రాధాన్యమిచ్చి నిత్య జీవితావసర వస్తువుల ఉత్పత్తిని అశ్రద్ధ చేసినందువల్ల సామాన్య ప్రజలలో అసంతృప్తి ప్రబలడమేగాక ప్రజల జీవన ప్రమాణం కూడా చెప్పుకోదగినంతగా పెరగలేదు. రష్యాలో కార్మికులకిచ్చిన వేతనాలు బొత్తిగా చాలా చాలని వేతనాలనే విమర్శ ఉండేది. రష్యాలో బలవంతపు నౌకరీ పద్ధతి అమలులో ఉండేదనే విమర్శ కూడా ఉండేది. అయితే తిండి కావలసిన ప్రతి వ్యక్తి ఏదో ఒక పని చేయవలసిందే అనే సూత్రం కమ్యూనిస్ట్ సిద్ధాంతంలో భాగమే. సంఘ వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొన్న వ్యక్తులను సైబీరియాకు ప్రవాసం పంపేవారు. ఎన్నో కఠిన చర్యలు తీసుకొన్నప్పటికీ మొదటి పంచవర్ష ప్రణాళికా కాలంలో నిర్ణయించిన లక్ష్యాలను ప్రభుత్వ సాధించలేకపోయింది. అయినప్పటికీ మొత్తం మీద 1914లో కటిన పేదరికాన్ని అనుభవించిన వ్యవసాయక దేశమైన రష్యా మొదటి పంచవర్ష ప్రణాళికాంతానికి ప్రసిద్ధి చెందిన పారిశ్రామిక దేశంగా రూపొందింది.

**8.5.2.2. రెండో పంచవర్ష ప్రణాళిక (1933 - 1938) :** మొదటి పంచవర్ష ప్రణాళికా కాలంలో అనేక విజయాలు సాధించినప్పటికీ కొన్ని ముఖ్యమైన లోపాలను సరిదిద్దవలసిన అవసరం కూడా ఏర్పడింది. రవాణా సౌకర్యాలు, నిపుణులైన సిబ్బంది సరిగా లేనందువల్ల పారిశ్రామికాభివృద్ధి కొంత వరకు కుంటుపడింది. గృహవసతి సమస్య తీవ్రంగా ఉండేది. సమిష్టి వ్యవసాయ క్షేత్రాలవల్ల అసంతృప్తి చెందిన కర్షకులు కొన్ని తీవ్రమైన సమస్యలను సృష్టించారు. ముఖ్యంగా నిత్యజీవితావసర వస్తువుల కొరత ఏర్పడినందువల్ల ప్రణాళికల మీద విమర్శలు ఎక్కువయినాయి. అందువల్ల మొదటి పంచవర్ష ప్రణాళికలోని లోపాలను అధిగమించి వేతనాల పెంపు, నిత్య జీవితావసర వస్తువుల ఉత్పత్తి పెంపు అనే లక్ష్యాలలో రెండో పంచవర్ష ప్రణాళిక 1933లో ప్రారంభించారు. రెండో పంచవర్ష ప్రణాళిక కాలంలో సంతృప్తికరమైన అభివృద్ధి జరిగింది. ఈ ప్రణాళికా కాలంలో ప్రజల జీవన ప్రమాణం పెరిగింది. పారిశ్రామికాభివృద్ధి కూడా ఏ విధమైన అడ్డంకులు లేకుండా వేగంగా జరిగింది. ప్రజలకు కావలసిన నిత్యావసర వస్తువుల ఉత్పత్తి భారీ ఎత్తున జరిగింది.

రష్యాలో ప్రారంభించబడిన సాంకేతిక సంస్థలలోనూ, ఫ్యాక్టరీల ఆవరణలలోనూ, శిక్షణా సంస్థలలోనూ పారిశ్రామికీకరణకు అవసరమైన నిపుణులు తయారయ్యారు. ఉత్పత్తులలో రికార్డ్‌లను స్థాపించిన వారికి పతకాలను ఇచ్చారు. 1935 ఆగస్టులో ఒకే షిఫ్ట్‌లో అలెగ్జాయి స్టాకనోవ్ 102 టన్నుల బొగ్గును వెలికితీయగలిగాడు. అదే కాలంలో జర్మనీలోని రూర్‌లో సమర్థుడైన గని కార్మికుడు 10 టన్నుల బొగ్గును మాత్రమే వెలికి తేగలిగాడు. అందువల్ల రష్యాలో స్టాకనోవ్ ఉద్యమం ప్రారంభమయింది. రికార్డులు సృష్టించినవారిని స్టాకనొవైట్‌లని పిలిచారు. పారిశ్రామికాభివృద్ధితో బాటు కార్మికుల వసతులు, విద్య, ఆరోగ్య, పరిస్థితులు బాగా మెరుగుపడ్డాయి.

**8.5.2.3. మూడో పంచవర్ష ప్రణాళిక (1938-1943) :** సాంకేతికాభివృద్ధిని సాధించే లక్ష్యంలో 1938 జనవరిలో మూడో పంచవర్ష ప్రణాళిక ప్రారంభమయింది. సాంకేతికాభివృద్ధి విషయంలో అమెరికాను అధిగమించి ప్రపంచంలో ప్రథమ స్థానాన్ని పొందవలెనని సోవియట్ ప్రణాళికా రచయితలు ఆశించారు. కాని రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమైనందువల్ల సోవియట్ ప్రభుత్వం శాంతి కాలపు ప్రణాళికను యుద్ధ కాలపు ప్రణాళికగా మార్చవలసి వచ్చింది. అయితే అప్పటికే పారిశ్రామిక రంగంలో విశేషమైన అభివృద్ధి జరిగిన ఫలితంగా రష్యా దేశపు శక్తి స్వరూపాలు పూర్తిగా మారిపోయినాయి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన రష్యా వనరులను, శక్తిని తక్కువగా అంచనావేసిన జర్మన్‌లు రష్యామీద దండయాత్ర జరిపి తమ పతనాన్ని తామే కొని తెచ్చుకొన్నారు.

స్టాలిన్ నాయకత్వం కింద సోవియట్ బృహత్ ప్రణాళికలను అమలు జరిపి ప్రపంచంలోని రెండు అగ్ర దేశాలలో ఒకటైంది. బాగా అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాలలో నిరక్షరాస్యులు, బిచ్చగాళ్ళు నేటికీ కనబడుతుంటే అవి రష్యాలో ఏనాడో నిర్మూలించబడ్డాయి. విద్య ఏ కొద్దిమందికో పరిమితంగాక అది అందరికి అందుబాటులోకి వచ్చింది. కార్మికుల పరిస్థితులు కూడా బాగా మెరుగయ్యాయి. నిరుద్యోగ సమస్య పూర్తిగా పరిష్కరింపబడింది. జీవితంలో పైకి రావడానికి తగిన అవకాశాలు అందరికి సమకూర్చబడినాయి. ద్రవ్యోల్బణం సమస్య తలెత్తలేదు.

**8.5.3. నూతన రాజ్యాంగము (1936) :** 1936లో స్టాలిన్ రాజ్యాంగాన్ని క్షుణ్ణంగా పరిష్కృతం చేసి నూతన రాజ్యాంగం రూపొందించాడు. ఈ రాజ్యాంగం సోవియట్ యూనియన్ సోషలిస్ట్ రాజ్యాంగం, కార్మికుల కర్షకుల సోషలిస్ట్ ప్రభుత్వం. ఇది ఒక సమాఖ్య రాజ్యం. ప్రధాన

యంత్రాంగం సుప్రీమ్ సోవియట్. ఇదే శాసనసభ ఇది సమావేశం కానప్పుడు దానిస్థానే ప్రెసిడియమ్ సమావేశమవుతుంది. ఉన్నత కార్యనిర్వాహక కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధుల మండలి అనేది వుంది. దీనిలో ప్రధాని ఉంటాడు. అతడు నియంత అని చెప్పవచ్చు. సోవియట్ మహాసభకు ప్రాంతీయ సోవియట్లనుంచి ఎన్నికయిన ప్రతినిధులు హాజరవుతారు. ప్రాంతీయ సోవియట్లను కార్మికులు, కర్షకులు ఎన్నుకొంటారు. వాటినుంచి 'కమిసార్లు' అనేవారు ఎన్నికవుతారు. 1936లో ఏర్పడిన సోవియట్ యూనియన్ సోషలిజం కమ్యూనిజానికి మొదటి మెట్టు మాత్రమే అని స్టాలిన్ అన్నాడు. ప్రజాస్వామ్య సూత్రాలను రాజ్యాంగంలో పేర్కొన్నందువల్ల అది సరియైన ప్రజాస్వామ్యమని కూడా అన్నారు. కమ్యూనిస్ట్ పార్టీ మాత్రమే ప్రభుత్వానుమతితో గుర్తింపు పొందిన పార్టీ. పార్టీ సభ్యత్వం కోరేవారు మార్క్స్ సిద్ధాంతాలను లెనిన్, స్టాలిన్‌లు అనుసరించే విధంలో అంగీకరించవలెను.

స్టాలిన్ నాయకత్వంలో సోవియట్ యూనియన్ సైనికంగా పటిష్టమైంది. సైన్యంలో చాలా మందిని కుట్రదారులనే నెపంపై రహస్య విచారణ జరిపి కాల్చివేయించినాడు. ఆగ్పూ అనే రహస్య పోలీస్‌శాఖ విపరీతంగా పనిచేసింది. ఆర్థ డాన్స్, చర్చికి, ప్రభుత్వానికి సంబంధం లేకుండా చేయడమయింది. చర్చి ఆస్తి ప్రభుత్వం తీసుకొంది. గట్టి క్రమశిక్షణ, సిద్ధాంతపరమైన విశ్వాసం కలిగి ఉన్నందువల్ల రెండో ప్రపంచ యుద్ధంలో ఫాసిజం, నాజిజంలపై సోవియట్ సైన్యం సంపూర్ణ విజయం సాధించగలిగింది.

## 8.6. సోవియట్ రష్యా విదేశాంగ విధానము (1917-1945) :

1917 తరువాత సోవియట్ రష్యా తానింతవరకు అనుసరించిన పశ్చిమ రాజ్యాల పట్ల విరోధంతో కూడిన విధానము, సామ్రాజ్య విస్తరణ విధానము అనే సూత్రాలను విడనాడి వాటికి బదులు దేశ ఆంతరంగిక పటిష్ఠత కోసము, భద్రతకోసం పెట్టుబడిదారీ రాజ్యాలపట్ల వ్యతిరేకతతో కూడిన విధానాన్ని, కమ్యూనిస్ట్ సిద్ధాంతాలను ప్రచారం చేసే విధానాన్ని అనుసరించసాగింది. నిజానికి సోవియట్ రష్యా ఆంతరంగిక విధానము, విదేశాంగ విధానము కూడా కమ్యూనిస్ట్ సిద్ధాంతాల ప్రాతిపదికగా రూపొంది అమలు జరిగింది.

**8.6.1. సోవియట్ రష్యా విదేశీ వ్యవహారాలు (1917-1921) :** 1917-1921 సంవత్సరాల మధ్య కాలంలో సోవియట్ రష్యా అనుసరించిన విదేశాంగ విధానంలో ముఖ్య అంశాలు : 1) ప్రపంచ విప్లవం ద్వారా కమ్యూనిజాన్ని సాధించడానికి రష్యా చేసిన ప్రయత్నం 2) పశ్చిమ రాజ్యాల మద్దతుతో రష్యాలో విప్లవ వ్యతిరేకోద్యమం జరగడం, రష్యామీద దురాక్రమణ జరపడానికి పశ్చిమ రాజ్యాలు చేసిన ప్రయత్నం.

8.6.1.1. ప్రపంచ విప్లవం ద్వారా కమ్యూనిజాన్ని సాధించడం : బోల్షెవిక్ విప్లవం ప్రపంచ సామ్యవాద విప్లవానికి నాంది అని రష్యన్ కమ్యూనిస్ట్ నాయకులు భావించారు. కమ్యూనిస్ట్ దేశాలకు, పెట్టుబడిదారీ దేశాలకు 1919 తరువాత సంఘర్షణ తప్పదని రష్యన్ కమ్యూనిస్ట్ నాయకులు ప్రచారం చేయసాగినారు. పశ్చిమ యూరప్‌లోని పెట్టుబడిదారీ వ్యవస్థను మొదటి ప్రపంచ యుద్ధం అంతమొందిస్తుందని లెనిన్ నమ్మినాడు. సోవియట్ రష్యాలో కమ్యూనిస్ట్ ప్రభుత్వ స్థాపనను వ్యతిరేకిస్తున్న రాజ్యాలన్నీ నాశనమైనపుడు మాత్రమే ప్రపంచ శాంతి భద్రతల పరిరక్షణ జరుగుతుందని మార్క్స్, లెనిన్‌లు భావించారు. ప్రపంచ దేశాలన్నింటిలో శ్రామిక వర్గ ప్రభుత్వాలేర్పడినప్పుడు మాత్రమే రష్యాలో కొత్తగా ఏర్పడ్డ కమ్యూనిస్ట్ ప్రభుత్వం సుస్థిరంగా ఉంటుందని సోవియట్ నాయకులు భావించారు. దీనిని సాధించడానికి సోవియట్ రష్యా మూడు మార్గాలను అనుసరించడానికి ప్రయత్నించింది. అవి :

1) పెట్టుబడిదారీ వ్యవస్థగల రాజ్యాలలో ఆంతరంగికంగా గందరగోళాన్ని సృష్టించి, శ్రామిక వర్గం ప్రజలలో విప్లవ భావాలను ప్రచారం చేయడం.

2) వలస ప్రాంతాలలోని ప్రజలను రెచ్చగొట్టడం ద్వారా యూరప్ రాజ్యాలను బలహీనపరచడం.

3) పశ్చిమ రాజ్యాల మధ్య విభేదాలను, తగాదాలను సృష్టించడం.

ప్రపంచ విప్లవం ద్వారా కమ్యూనిజాన్ని సాధించడానికి 'థర్డ్ ఇంటర్నేషనల్' 1919లో ఏర్పాటు చేయడం జరిగింది. (మొదటి ఇంటర్నేషనల్ 1864లో, రెండో ఇంటర్నేషనల్ 1889లో స్థాపితమైంది). 1919లో మాస్కోలో సమావేశమైన థర్డ్ ఇంటర్నేషనల్ లేదా కొమిన్‌టర్న్

ప్రపంచ కమ్యూనిస్ట్ ప్రచార సంస్థగా రూపొందింది. సమిష్టి విప్లవం ద్వారా పెట్టుబడి దారీ వ్యవస్థను నాశనం చేసి వర్గరహిత సమాజాన్ని నెలకొల్పవలసిందిగా ప్రపంచ శ్రామికవర్గ ప్రజలందరికీ 'థర్డ్ ఇంటర్నేషనల్' పిలుపునిచ్చింది. మొదట్లో కమ్యూనిస్ట్ ప్రచారానికనువైన వాతావరణము ఏర్పడింది. హంగరీ కమ్యూనిస్ట్ దేశంగా మారింది. ఇటలీ, జర్మనీలలో కూడా విప్లవానికి అవసరమైన పరిస్థితులేర్పడినాయి. పర్షియా, ఆఫ్ఘనిస్థాన్, మంగోలియా, మంచూరియా, భారతదేశం, చైనా, జపాన్ మొదలైన దేశాలలో రష్యన్ ఏజెంట్లు విప్లవ ప్రచారాన్ని ప్రారంభించినారు. థర్డ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు జినోవ్వెన్ ఒక్క సంవత్సర కాలంలో యూరప్ దేశాలన్నీ కమ్యూనిస్ట్ దేశాలుగా మారతాయని 1919లో ప్రకటించినాడు.

అయితే ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్ట్ వ్యవస్థ స్థాపనకు చేసిన ప్రయత్నాలన్నీ చివరకు విఫలమైనాయి. మొదటి ప్రపంచ యుద్ధంలో ఓడిపోయిన దేశాలలో కూడా విప్లవాదర్శాలు విజయాన్ని సాధించలేకపోయినాయి. హంగరీ, ఇటలీలలో విప్లవాదర్శాలు విఫలమయినపుడు రష్యా తన విధానాలను మార్చుకోవలసి వచ్చింది. చైనాలో విప్లవాదర్శాలు తాత్కాలికంగా విజయం పొందడమేగాక అచటి కొమింటాంగ్ పార్టీ సోవియట్ రష్యా పలుకుబడి కిందికి వచ్చింది. కాని ఛియాంగ్ -కై-షెక్ అధికారంలోకి వచ్చిన తరువాత చైనా రష్యాతో తనకుగల సంబంధాలను తెగ తెంపులు చేసుకొని కమ్యూనిస్ట్ పలుకుబడిని అణచివేసింది.

**అంతర్జాతీయ విప్లవం విఫలం కావడానికి కారణాలు : 1)** ప్రపంచ విప్లవం విఫలం కావడానికి ముఖ్య కారణం రష్యాలో వలె ఇతర దేశాలలో విప్లవానికి అనువైన ఆంతరంగిక పరిస్థితులు లోపించడమే. థర్డ్ ఇంటర్నేషనల్ ఏజెంట్లు, సోవియట్ రష్యా ఏజెంట్లు కలసి సంయుక్తంగా ప్రచారాన్ని కొనసాగించినప్పటికీ తూర్పు యూరప్‌లో పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా విప్లవాన్ని సాధించలేకపోయినారు.

2) చైనా, జపాన్, భారత దేశము మొదలైన దేశాలలోని ప్రజలకు యూరప్‌కు చెందిన పెట్టుబడిదారీ వ్యవస్థను అంతమొందించడంలోనే గాక సామ్రాజ్యవాదాన్ని అంతమొందించడంలో ఆసక్తి ఉన్నది.

3) ప్రపంచ విప్లవం విఫలం కావడానికి మరొక ముఖ్య కారణం 1919 తరువాత రష్యాలో ఏర్పడిన అరాజక పరిస్థితులని చెప్పవచ్చు. కరువు కాటకాలు, విప్లవ వ్యతిరేకోద్యమం, విదేశాల జోక్యం మొదలైన ఆంతరంగిక సమస్యలను ఎదుర్కొంటున్న సోవియట్ రష్యాకు అంతర్జాతీయ విప్లవాన్ని సాధించడం కష్టమైంది.

అంతర్జాతీయ విప్లవాన్ని సాధించడానికి చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో సోవియట్ కమ్యూనిస్ట్ పార్టీ నాయకులలో అభిప్రాయ భేదాలు ఏర్పడినాయి. వారిలో ట్రాట్స్కీ, శాశ్వత విప్లవాన్ని సమర్థించగా, స్టాలిన్ సోవియట్ రష్యాలో మాత్రమే సామ్యవాద విప్లవాన్ని సాధించడాన్ని సమర్థించాడు.

1) పెట్టుబడిదారీ వ్యవస్థకు చెందిన రాజ్యాలు సోవియట్ రష్యా పట్ల దురాక్రమణతో కూడిన విధానాన్ని అనుసరించడం వల్ల సామ్యవాద వ్యవస్థకు చెందిన సోవియట్ రష్యా ఒంటరిగా మనజాలదని ప్రపంచ విప్లవం ఆవసరాన్ని ట్రాట్స్కీ సమర్థించాడు. ఆర్థికంగా ప్రపంచ దేశాలన్నీ ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉన్నందువల్ల అంతర్జాతీయంగా కమ్యూనిస్ట్ విప్లవం జరిగి తీరవలసిందే లేకపోతే పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా రష్యాలో ఏర్పాటైన కమ్యూనిస్ట్ సమాజాన్ని పరిరక్షించడం కష్టం. అందువల్ల ట్రాట్స్కీ, శాశ్వత విప్లవాన్ని సమర్థించాడు.

2) ట్రాట్స్కీ, సిద్ధాంతానికి వ్యతిరేకంగా సోవియట్ రష్యాలో మాత్రమే సామ్యవాద విప్లవాన్ని సాధించడాన్ని స్టాలిన్ సమర్థించాడు. తన సొంత ప్రయత్నాల ద్వారా సోవియట్ రష్యా ఆర్థిక పురోగతిని సాధించగలదని, సోవియట్ రష్యా మనుగడకు అంతర్జాతీయ విప్లవం అవసరం లేదని స్టాలిన్ అభిప్రాయము. అంతేగాక రష్యా ఆంతరంగిక అభివృద్ధికి పశ్చిమ రాజ్యాల సహకారం తప్పక అవసరమని కూడా స్టాలిన్ భావించినాడు. ప్రపంచంలోని వివిధ దేశాలలోని పరిస్థితుల ప్రభావంవల్లనే విప్లవం రావచ్చు కాని విదేశాల జోక్యం వల్ల దుష్ఫలితాలు సంభవిస్తాయని స్టాలిన్ భావించాడు.

లెనిన్ మరణానంతరం స్టాలిన్ అధికారంలోకి వచ్చిన తరువాత సోవియట్ రష్యా విదేశాంగ విధానంలో మార్పు వచ్చి ట్రాట్స్కీ, సిద్ధాంతాన్ని త్యజించడమైంది.

**8.6.1.2. సోవియట్ రష్యాకు పశ్చిమ రాజ్యాలకు మధ్యగల సంబంధాలు :** 1917-1921 సంవత్సరాల మధ్య కాలంలో పశ్చిమ రాజ్యాలకు, సోవియట్ రష్యాకు మధ్యగల సంబంధాలు దెబ్బతిన్నాయి. అందుకు కారణాలు :

1) రష్యాలో శ్రామిక వర్గ నియంతృత్వము స్థాపితమైనందువల్ల పెట్టుబడి దారి వ్యవస్థగల దేశాలలో భయాందోళనలు ఏర్పడినాయి. రష్యన్ విప్లవాదర్శాల ప్రభావంవల్ల పెట్టుబడిదారీ వ్యవస్థగల దేశాలలో కూడా శ్రామిక వర్గం ప్రజల నాయకత్వంలో విప్లవాలు రావచ్చునని పశ్చిమ రాజ్యాలు భయపడసాగినాయి. రష్యన్ విప్లవం ప్రపంచ సామ్యవాద విప్లవానికి నాంది అని పశ్చిమ రాజ్యాలు అభిప్రాయపడినాయి.

2) రష్యా మొదటి ప్రపంచ యుద్ధం నుంచి ఉపసంహరించుకొని జర్మనీతో బ్రెస్ట్‌లిటొవస్క్ సంధి చేసుకొన్న తరువాత పశ్చిమ రాజ్యాలకు రష్యాపట్ల అనుమానము, అపనమ్మకము ఎక్కువైనాయి. ఈ సంధి జరిగిన తరువాత జర్మనీ బ్రిటీష్ వ్యతిరేక విధానాన్ని అనుసరించడం తీవ్రం చేసింది. అందువల్ల రష్యాపట్ల పశ్చిమ రాజ్యాల ఆందోళనలు ఎక్కువైనాయి. కాని నిజానికి జర్మనీతో ఈ సంధి చేసుకోవడానికి కారణం రష్యా తన ఆంతరంగిక పరిస్థితులను చక్క దిద్దుకోవడానికే.

3) రష్యా విదేశాల కివ్వవలసిన ఋణాలను చెల్లించడానికి నిరాకరించడమేగాక విదేశ పరిశ్రమలను, వ్యాపారాన్ని కూడా జాతీయం చేయడంవల్ల పశ్చిమ రాజ్యాలకు రష్యాకు మధ్య విరోధం తీవ్రరూపం దాల్చింది.

4) పశ్చిమ రాజ్యాలు రష్యా ఆంతరంగిక వ్యవహారాలలో సైనికంగా జోక్యం చేసుకొని, రష్యాలోని విప్లవ వ్యతిరేక శక్తులకు తమ మద్దతు ఇచ్చి, రష్యా మీద ఆర్థిక ఆంక్షలు విధించడం పశ్చిమ రాజ్యాలకు సోవియట్ రష్యాకు మధ్యగల సంబంధాలు దెబ్బతినడానికి మరొక ముఖ్య కారణం.

1917లో ఇంగ్లండ్, ఫ్రాన్స్, అమెరికాలు సోవియట్ రష్యామీద ఆర్థిక ఆంక్షలు విధించినాయి. ఆ తరువాత మిత్ర రాజ్యాలకు, జపాన్‌కు చెందిన సైన్యాలు రష్యాలోని అనేక భూ భాగాలను ఆక్రమించుకోవడమేగాక కమ్యూనిస్ట్ విప్లవ వ్యతిరేక శక్తులకు తోడ్పడసాగినాయి. పశ్చిమ రాజ్యాల సైనిక జోక్యాన్ని ఎదుర్కొంటున్న రష్యామీద ఫ్రాన్స్ మద్దతుతో పోలండ్ యుద్ధం ప్రకటించింది. సోవియట్ రష్యా తన శక్తినంతా ఉపయోగించి పశ్చిమరాజ్యాల సైనిక జోక్యాన్ని విజయవంతంగా ఎదుర్కోవడమేగాక దేశంలోని ఆంతరంగిక విప్లవ వ్యతిరేక శక్తులను కూడా అంతమొందించింది. 1920 నాటికి అంతర్యుద్ధం, విదేశాల జోక్యం అనే రెండు ప్రమాదాలను రష్యా అధిగమించగలిగింది.

1921 తరువాత సోవియట్ రష్యా ఆంతరంగిక వ్యవహారాలలో పశ్చిమ రాజ్యాల జోక్యం అంతమైంది. అందుకు కారణాలు :

1) సోవియట్ రష్యా సైనిక బలాన్ని అణచివేయడం పశ్చిమ రాజ్యాలకు సాధ్యపడలేదు. ఆంతరంగిక విప్లవ వ్యతిరేక శక్తులను అణచివేయడంలో సోవియట్ ప్రభుత్వం విజయం పొందింది.

2) ఆనాడు యూరపు వస్తువులకు రష్యాలో మంచి గిరాకీ ఉన్న కారణంగా సోవియట్ రష్యాలో వాణిజ్య సంబంధాలు నెలకొల్పుకోవడానికి పశ్చిమ రాజ్యాలు ఆతురతతో ఉన్నాయి. అందువల్ల పశ్చిమ రాజ్యాలు తమ సైన్యాలను రష్యానుంచి ఉపసంహరించుకొన్నాయి.

రష్యా ఆంతరంగిక వ్యవహారాలలో పశ్చిమ రాజ్యాల సైనిక జోక్యం వల్ల అనేక ఫలితాలు వచ్చాయి అవి :

1) రష్యన్ ప్రజలు అనేక బాధలకు గురి అయినారు.

2) విప్లవ వ్యతిరేక శక్తులను అణిచివేయడానికి సోవియట్ ప్రభుత్వం కొన్ని కఠినమైన శాసనాలను అమలుపరచినందువల్ల రష్యాలో కమ్యూనిస్ట్ విప్లవం బలపడింది.

3) పశ్చిమ రాజ్యాల పట్ల సోవియట్ రష్యా అనుమానం, అపనమ్మకం మరింత బలపడినాయి.

4) విప్లవ వ్యతిరేక శక్తులను అణచివేయడంలో విజయాన్ని సాధించిన సోవియట్ ప్రభుత్వం రష్యన్ విప్లవాన్ని పటిష్టం చేయడానికి తగిన చర్యలు తీసుకోవడం ప్రారంభించింది.

సోవియట్ రష్యాలో కమ్యూనిస్ట్ ప్రభుత్వం విజయం సాధించడానికి, విప్లవ వ్యతిరేక శక్తులు, పశ్చిమ రాజ్యాలు పరాజయం చెందడానికి అనేక కారణాలు గలవు. అవి :

1) విప్లవ వ్యతిరేక ఉద్యమ నాయకులలో సంఘీభావము, సమన్వయము లోపించినందువల్ల అంతర్యుద్ధం ఎక్కువ కాలం కొనసాగలేదు. విప్లవ వ్యతిరేక ఉద్యమాన్ని నడిపిన రాజకీయ నాయకులు సైనిక నాయకులకు మధ్య పొత్తు కుదరనందువల్ల కమ్యూనిస్ట్ ప్రభుత్వం విప్లవ వ్యతిరేకోద్యమాన్ని తేలికగా అణచివేయగలిగింది.

2) కమ్యూనిస్ట్ ప్రభుత్వానికి రష్యన్ కర్షకులు తమపూర్తి మద్దతును ఇచ్చినారు.

3) మొదటి ప్రపంచ యుద్ధానంతరం తమ దేశాలలో అనేక అంతరంగిక సమస్యలను ఎదుర్కోవలసి వచ్చిన పశ్చిమ రాజ్యాలు రష్యా మీద ఎక్కువ కాలం యుద్ధాన్ని కొనసాగించడానికి తమ శక్తి యుక్తులను ధారపోయడానికి సిద్ధంగాలేవు. 1919లో పశ్చిమ రాజ్యాలు తమ సైన్యాలను సోవియట్ రష్యానుంచి ఉపసంహరించుకొన్న తరువాత రష్యాలో విప్లవ వ్యతిరేకోద్యమం పూర్తిగా పతనమైపోయింది.

**8.6.2. సోవియట్ రష్యా విదేశ వ్యవహారాలు (1921-1932) :** 1921-1932 సంవత్సరాల మధ్య కాలంలో సోవియట్ రష్యా విదేశాంగ విధానంలో గమనించదగిన ముఖ్య లక్ష్యాలు : 1) జర్మనీని పశ్చిమ రాజ్యాల పలుకుబడి ప్రభావాలకు లోనుకాకుండా నివారించడం 2) పశ్చిమ రాజ్యాల సహకారంతో తన ఆర్థికాభివృద్ధిని శీఘ్రగతిని సాధించడం.

**8.6.2.1 ఆంగ్లో-సోవియట్ వాణిజ్య ఒప్పందం :** 1921లో సోవియట్ రష్యా బ్రిటన్‌తో ఒక వాణిజ్య ఒప్పందం చేసికొన్నది. ఈ ఒప్పందం ప్రకారం సోవియట్ రష్యామీద లోగడ విధించిన ఆర్థిక ఆంక్షలను బ్రిటన్ తొలగించింది. బ్రిటన్‌లో కమ్యూనిస్ట్ ప్రచారాన్ని ఆపడానికి సోవియట్ రష్యా వాగ్దానం చేసింది. అయితే బ్రిటన్ సోవియట్ ప్రభుత్వాన్ని గుర్తించలేదు. అంతేగాక ఈ సంధిలో రష్యా, ఇంగ్లండుకు ఇవ్వవలసిన ఋణాల ప్రస్తావన కూడా లేదు. అందువల్ల ఈ ఒడంబడిక వల్ల ఇంగ్లండ్, రష్యాల మధ్య సత్సంబంధాలు నెలకొనలేదు.

**8.6.2.2. జెనీవా సమావేశము :** బ్రిటీష్ ప్రధాని లాయిడ్ జార్జి ప్రయత్నాల ఫలితంగా సోవియట్ రష్యాను 1922 జెనీవా సమావేశానికి ఆహ్వానించినారు. విదేశాలలో ఉన్న వ్యక్తుల ఆస్తులను సోవియట్ ప్రభుత్వం జాతీయం చేసింది. అందుకు రష్యానుండి నష్ట పరిహారాన్ని బ్రిటన్ ఈ సమావేశంలో కోరింది. దీనికి బదులుగా రష్యా ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేసుకొని రష్యాకు విపరీతమైన నష్టం కలగజేసిన పశ్చిమ రాజ్యాల నుంచి సోవియట్ రష్యా నష్టపరిహారాన్ని కోరింది. అందువల్ల ఈ సమావేశం పూర్తిగా విఫలమైంది.

**8.6.2.3. విదేశాలు సోవియట్ రష్యాను గుర్తించడం :** ఇటలీ సోవియట్ ప్రభుత్వాన్ని గుర్తించడమేగాక 1924లో రష్యాతో ఒక వాణిజ్య ఒప్పందాన్ని కూడా కుదుర్చుకొన్నది. సోవియట్ రష్యా 1922లో జర్మనీలో రాపెల్లో మైత్రి సంధిచేసుకొన్నది. ఈ సంధి ప్రకారం జర్మనీ సోవియట్ రష్యాల మధ్య మామూలు సంబంధాలు నెలకొన్నాయి. ఇరు పక్షాలు పరస్పరం ఒకరి దగ్గర మరొకరు ఆపేక్షించిన రాయతీలను వదులుకొన్నాయి. రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు నెలకొన్నాయి. ఈ సంధి ఫలితంగా సోవియట్ రష్యా బ్రిటన్, ఫ్రాన్స్‌ల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉండవలసిన అవసరం తగ్గిపోయింది. అంతేగాక జర్మనీ వంటి అగ్ర రాజ్యం సోవియట్ ప్రభుత్వాన్ని గుర్తించడం సోవియట్ రష్యాకు ఘన విజయమని చెప్పవచ్చు. 1924 ఫిబ్రవరిలో సోవియట్ ప్రభుత్వాన్ని ఇంగ్లండ్ గుర్తించింది. ఆ తరువాత చైనా, డెన్మార్క్, స్వీడన్, మెక్సికో, గ్రీస్ మొదలైన దేశాలు సోవియట్ ప్రభుత్వాన్ని గుర్తించినాయి. అయితే ఈ కాలంలో ముఖ్యంగా 1926-27 సంవత్సరాలలో ఫ్రాన్స్ రష్యాల మధ్య వైరుధ్యమేర్పడింది.

**8.6.2.4. దురాక్రమణ వ్యతిరేక ఒడంబడికలు :** పశ్చిమ రాజ్యాల సైనిక బలము తన మీద ప్రయోగించడం జరుగుతుందని భయపడిన సోవియట్ రష్యా 1925-1932 సంవత్సరాల మధ్య కాలంలో టర్కీ, జర్మనీ, పోలండ్, ఇరాక్, లాట్వియా, లిథూయేనియా, ఇస్టోనియా దేశాలతో దురాక్రమణ, వ్యతిరేక ఒడంబడికలు చేసుకొని నూతన మైత్రి సంబంధాలు నెలకొల్పుకొన్నది.

**8.6.2.5. సోవియట్ రష్యా-పశ్చిమ రాజ్యాల మధ్య సంబంధాలు :** 1921-1932 సంవత్సరాల మధ్య కాలంలో సోవియట్ రష్యా ప్రపంచ దేశాలన్నిటితో స్నేహ పూర్వకమైన సంబంధాలు నెలకొల్పుకొని తన వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకొని విదేశీ ఋణాలను సంపాదించడానికి ప్రయత్నించింది. అయితే, ఈ కాలంలో కూడా పశ్చిమ రాజ్యాలకు సోవియట్ రష్యాకు మధ్యగల సంబంధాలు చెప్పుకోదగినంతగా మెరుగుపడలేదు. రష్యాపట్ల పశ్చిమ రాజ్యాలకు, అనుమానము, అపనమ్మకము ఇదివరకటివలె కొనసాగుతూనే ఉన్నాయి. దీనికి కారణము కొమింటర్న్ కార్యకలాపాలను తగ్గించిన సోవియట్ రష్యా కమ్యూనిస్ట్ రాజ్యలు కాని వాటిలో రహస్య విప్లవ ప్రచారాన్ని కొనసాగించడమే. వివిధ దేశాలలో కమ్యూనిస్ట్ పార్టీలతో థర్డ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడైన జినోవ్యిక్ రహస్యంగా ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగించినాడు. బల్గేరియా, లాట్వియా, ఇస్టోనియాలలో సోవియట్ సైనికాధికారులు ప్రజల తిరుగుబాటుకు ప్రోత్సాహించ సాగినారు. బ్రిటిష్ కమ్యూనిస్ట్ పార్టీ కార్య కలాపాలు లేబర్ పార్టీ ప్రభుత్వాన్ని సందిగ్దావస్థలో పెట్టినాయి. 1925-1928ల మధ్య చైనాతో కమ్యూనిస్ట్ కార్యకలాపాల ఫలితంగా సోవియట్ రష్యా పశ్చిమ రాజ్యాల మధ్య సంబంధాలు తిరిగి దెబ్బతిన్నాయి.

ప్రపంచ శాంతి భద్రతల పరిరక్షణకోసం స్థాపించిన నానాజాతి సమితిలో సభ్య రాజ్యంగా చేరడానికి 1921-32 సంవత్సరాల మధ్య కాలంలో రష్యా అనేకసార్లు తన కోరిక వెలిబుచ్చింది. మొదటి ప్రపంచ యుద్ధానంతరం అంతర్జాతీయ ఉద్రిక్తతను తొలగించి యుద్ధాన్ని నివారించడానికి పశ్చిమ రాజ్యాలకంటే తాను ఎక్కువ ఆసక్తితో ఉన్నట్లు సోవియట్ రష్యా కనిపించింది. పశ్చిమ రాజ్యాలతో శాంతియుత సహజీవనాన్ని కొనసాగించడానికి తాను చిత్త శుద్ధితో ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, పశ్చిమ రాజ్యాలు తన అంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేసుకొని కమ్యూనిస్ట్ విప్లవాన్ని అణచివేయడానికి సిద్ధపడినాయని రష్యా అభిప్రాయము. అంతేగాక పశ్చిమ రాజ్యాల ప్రోత్సాహం వల్లనే జర్మనీ తనపట్ల కఠినంగా వ్యవహరించసాగిందని కూడా సోవియట్ రష్యా భావించింది. ఈ కారణాలవల్ల ఆందోళన చెందిన రష్యా తన భద్రత కోసం ఏకాంత విధానాన్ని అనుసరించసాగింది.

**8.6.3. సోవియట్ రష్యా విదేశ వ్యవహారాలు (1933-1938) :** దేశ రక్షణ దృష్ట్యా సోవియట్ రష్యా 1933 నుండి పశ్చిమ రాజ్యాలతో మనఃపూర్వకంగా సహకరించే విధానాన్ని ప్రారంభించింది. అందుకు కారణాలు :

1) పోలండ్‌లోని సోవియట్ రాయబారిని ఒక రష్యన్ విప్లవవాది హత్య చేసినాడు. చైనాలోని సోవియట్ దౌత్య కార్యాలయాన్ని చైనా జాతీయులు ముట్టడించినారు.

2) దూర ప్రాచ్యంలో దురాక్రమణ విధానాన్ని ప్రారంభించిన జపాన్ 1932లో మంచూరియాను ఆక్రమించుకొన్నది. హిట్లర్ నియంతృత్వాధికారంలో జర్మనీ విజయాలను సాధించడం సోవియట్ రష్యాకు ఒక పెద్ద సమస్య అయింది. రష్యాతో తూర్పు యూరప్‌ను జర్మనీ జయించవలెననే ప్రచారాన్ని జర్మనీ నాజీ నాయకులు చేయసాగినారు. కాబట్టి జపాన్, జర్మనీల దురాక్రమణ విధానాలవల్ల సోవియట్ రష్యా ఆందోళన చెందింది. అందువల్ల జర్మనీ, జపాన్‌ల దురాక్రమణ విధానానికి వ్యతిరేకంగా పశ్చిమ రాజ్యాల సహకారాన్ని పొందవలసిన అవసరాన్ని సోవియట్ రష్యా గ్రహించింది.

3) పంచవర్ష ప్రణాళికల విజయంలో రష్యాలో ఉదార సిద్ధాంతాలు ప్రజాదరణను పొందినాయి. ఫాసిస్ట్ రాజ్యాల బారినుంచి కమ్యూనిస్ట్ ఉద్యమాన్ని కాపాడటం కోసం సోషలిస్ట్ దేశాలలోనేగాక ఉదార విధానాలను అనుసరిస్తున్న పశ్చిమ రాజ్యాలతో కూడా దురాక్రమణ వ్యతిరేక ఒప్పందాలను, మైత్రి సంధులను చేసుకోవడానికి సోవియట్ రష్యా ఆసక్తి చూపసాగింది.

**8.6.3.1. దురాక్రమణ వ్యతిరేక ఒప్పందాలు :** సోవియట్ రష్యా 1933లో పోలండ్, టర్కీ, ఇస్టోనియా, లాట్వియా, పర్షియా, ఆఫ్ఘనిస్థాన్‌లతో దురాక్రమణ వ్యతిరేక ఒప్పందాలు చేసుకొన్నది. 1933లోనే చైనాతో దౌత్య సంబంధాలను సోవియట్ రష్యా నెలకొల్పుకొన్నది. వర్సే సంధివల్ల జరిగిన యూరప్ భూభాగాల పునర్విభజన ఫలితంగా కొన్ని సరిహద్దు ప్రాంతాలను పోగొట్టుకొన్న సోవియట్ రష్యా మొదట్లో వర్సే సంధిని వ్యతిరేకించింది. కాని 1933 తరువాత వర్సే సంధి ప్రవేశపెట్టిన యూరప్ భూభాగాల పునర్విభజనను సోవియట్ రష్యా గుర్తించింది. అందువల్ల 1933 తరువాత వర్సే సంధిని కాపాడటం కోసం పశ్చిమ రాజ్యాలు అనుసరిస్తున్న సమిష్టి భద్రతా విధానాన్ని తాను కూడా అనుసరించడానికి రష్యా సన్నద్ధమైంది. అంతేగాక 1933లో జపాన్, జర్మనీలు సమితి నుంచి ఉపసంహరించుకొన్న తరువాత సోవియట్ రష్యా సమితిలో శాశ్వత సభ్య రాజ్యంగా చేరి సమిష్టి భద్రతా విధానాన్ని సమర్థించసాగింది.

**8.6.3.2. సోవియట్ రష్యా ఫ్రాన్స్‌లమధ్య సంధి :** 1933 తరువాత జర్మనీలో హిట్లర్ నియంతృత్వం ఏర్పడినందువల్ల ఫ్రాన్స్ రష్యాలు ఒకే విధంగా ఆందోళన చెందినాయి. జర్మనీ దురాక్రమణకు వ్యతిరేకంగా ఫ్రాన్స్ రష్యాల భద్రతా సమస్య ప్రముఖంగా తయారైంది. అంతేగాక జర్మనీ వర్సేసంధి సవరణను కోరుతున్నది. అందువల్ల జర్మన్ దురాక్రమణ విధానానికి వ్యతిరేకంగా తప్పనిసరి అయిన పరిస్థితులలో ఫ్రాన్స్ రష్యాలు సమిష్టి భద్రతా పరిరక్షణ కోసం పరస్పరం సహకరించుకోవడానికి నిశ్చయించుకొన్నాయి. 1935లో ఫ్రాన్స్ రష్యాలు పరస్పర సహాయక సంధి చేసుకొన్నాయి. అదే సంవత్సరంలో రష్యా చెకొస్లొవాకియాలు కూడా పరస్పర మైత్రి ఒడంబడిక చేసుకొన్నాయి.

**8.6.3.3. సోవియట్ రష్యా-అమెరికాల మధ్య సంధి :** అమెరికాకివ్వలసిన ఋణాలను చెల్లించడానికి రష్యా నిరాకరించడం, రష్యాలోని అమెరికన్ పౌరులకు తమ స్వేచ్ఛ నివ్వడానికి రష్యా నిరాకరించడం, పశ్చిమ రాజ్యాలలో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయడానికి రష్యా ప్రయత్నించడం కారణాలుగా 1917 తరువాత సోవియట్ రష్యా అమెరికాలు మధ్య విరోధ మేర్పడింది. అయితే 1933 తరువాత దూర ప్రాచ్యంలో అమెరికా, రష్యాలకు జపాన్ ఉమ్మడి శత్రువుగా తయారైంది. అంతేగాక సోవియట్ రష్యాతో వాణిజ్య సంబంధాలను తిరిగి స్థాపించవలెనని అమెరికన్ వ్యాపారస్థులు అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ మీద ఒత్తిడి చేయసాగినారు. రష్యా విదేశ వ్యవహారాల మంత్రి లిటో వినోవ్‌ను సంప్రదింపుల కోసం అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ వాషింగ్టన్‌కు ఆహ్వానించినాడు. వాషింగ్టన్ సంప్రదింపుల ఫలితంగా సోవియట్ రష్యా అమెరికా ప్రభుత్వాల మధ్య ఒక మైత్రి సంధి జరిగింది. ఈ సంధి ప్రకారం రెండు ప్రభుత్వాలు తమ ప్రాదేశిక సమగ్రతను పరిరక్షించుకోవడానికి అంగీకరించినాయి. అంతేగాక పరస్పర విద్రోహక చర్యలను, ప్రచారాన్ని నిషేధించడానికి ఇరు పక్షాలు అంగీకరించాయి. రష్యాలోని అమెరికన్ పౌరులకు మత స్వేచ్ఛ ఇవ్వడానికి సోవియట్ ప్రభుత్వం అంగీకరించింది. ఈ సంధికారణంగా అమెరికా రష్యాల మధ్య దౌత్య సంబంధాలు స్థాపితమైనాయి.

**8.6.4. సోవియట్ రష్యా విదేశీ వ్యవహారాలు (1938-1939) :** 1938-1939 సంవత్సరాలలో సమష్టి భద్రత కోసం సోవియట్‌రష్యా ప్రయత్నాలు చేసింది. జర్మనీ ఆస్ట్రియాను ఆక్రమించినపుడు జర్మనీ పట్ల కఠినవైఖరి అవలంభించవలెనని రష్యా చేసిన ప్రతిపాదనను మిత్ర రాజ్యాలు తిరస్కరించాయి. మ్యూనిక్ సమావేశానికి ఆహ్వానించనందువల్ల సోవియట్ రష్యా పశ్చిమ రాజ్యాల చిత్తశుద్ధిని శంకించి అనుమానించ సాగింది. మ్యూనిక్ ఒడంబడిక తరువాత జర్మనీ తన మీద దాడిచేస్తుందని రష్యా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌ల మధ్య త్రైపాక్షిక మైత్రి సంధి జరగవలెనని రష్యా చేసిన ప్రతి పాదనను కూడా పశ్చిమ రాజ్యాలు తిరస్కరించాయి.

**8.6.4.1. జర్మనీతో దురాక్రమణ వ్యతిరేక ఒడంబడిక :** ఇటువంటి పరిస్థితులలో తన భద్రతకోసం సోవియట్ రష్యా జర్మనీతో 1939లో దురాక్రమణకు వ్యతిరేకంగా ఒక ఒడంబడిక చేసుకొన్నది. ఈ ఒడంబడిక ప్రకారం పశ్చిమ రాజ్యాలకు జర్మనీకి యుద్ధం వచ్చినపుడు సోవియట్ రష్యా తటస్థంగా ఉండటానికి అంగీకరించింది. అంతేగాక రష్యామీద జర్మనీ దురాక్రమణ జరిపినపుడు పశ్చిమ రాజ్యాల సహకారాన్ని సోవియట్ రష్యా పొందవచ్చు. ఈ ఒడంబడిక ఫలితంగా కమ్యూనిస్ట్ వ్యతిరేక కూటమి విచ్ఛిన్నం కావడమేగాక జర్మనీ, జపాన్, ఇటలీల మధ్య దౌత్య సంబంధాలు కూడా బలహీనపడినాయి.

పశ్చిమ రాజ్యాలతోను, జర్మనీతోనూ విచక్షణ లేకుండా ఏకకాలంలో స్టాలిన్ సంప్రదింపులు జరిపినందువల్ల రష్యాపట్ల తమలో అనుమాన ధోరణి ఏర్పడిందని పశ్చిమ రాజ్యాలు భావించినాయి. 1939లో జర్మనీతో దురాక్రమణకు వ్యతిరేకంగా ఒక ఒడంబడిక చేసుకొన్న రష్యా అంతర్జాతీయ విప్లవానికనువైన పరిస్థితులను సృష్టించ సాగిందని పశ్చిమ రాజ్యాలు భావించినాయి. అంతేగాక జర్మనీతో సంధి చేసుకోవడం ద్వారా సోవియట్ రష్యా ప్రజాస్వామిక రాజ్యాలను వెన్నుపోటు పొడవడమేగాక శాంతిని భంగపరచి రెండో ప్రపంచ యుద్ధాన్ని తెచ్చి -ట్టిందని కూడా పశ్చిమ రాజ్యాలు వాదించినాయి. కాని జాతీయ శ్రేయస్సు దృష్ట్యా తాము జర్మనీతో సంధి చేసుకోవలసి వచ్చిందని సోవియట్ నాయకులు వాదించినారు. అంతేగాని పశ్చిమ రాజ్యాలను వెన్నుపోటు పొడవడానికి గాని, శాంతిని భంగపరచడానికి గాని జర్మనీతో సంధి చేసుకోలేదని సోవియట్ నాయకులు వాదించారు.

**8.6.5. సోవియట్ రష్యా విదేశ వ్యవహారాలు (1939-1945) :** జర్మనీతో దురాక్రమణ వ్యతిరేక సంధి చేసుకొన్న తరువాత సోవియట్ రష్యా దురాక్రమణ విధానాన్ని అనుసరించసాగింది. లోగడ చేసుకొన్న సంధులను ఉల్లంఘించి సోవియట్ రష్యా దాడులు జరిపి ఫిన్‌లాండ్, పోలండ్‌లను, రుమేనియాలో కొంత భాగాన్ని, బాల్టిక్ రాజ్యాలన్నిటినీ ఆక్రమించుకొన్నది. 1940లో ఫ్రాన్స్ పరాజయమైపోయి

ఇంగ్లండ్ కూడా పతనమయ్యే పరిస్థితి ఏర్పడినపుడు తన సరిహద్దులమీద జర్మనీ జపాన్‌లు దాడి చేస్తాయని సోవియట్ రష్యా భయపడసాగింది. అందువల్ల జర్మనీతో స్నేహ సహకారాలను కొనసాగిస్తూనే 1941 ఏప్రిల్ సోవియట్ రష్యా జపాన్‌లో దురాక్రమణ వ్యతిరేక సంధిని చేసుకొన్నది. అంతేగాక ఈ కాలంలో జరుగుతున్న యుద్ధాన్ని సామ్రాజ్యవాద యుద్ధంగా విమర్శించవలసిందిగా ప్రపంచ కమ్యూనిస్టులందరికీ సోవియట్ రష్యా సలహో ఇచ్చింది.

**8.6.5.1. సోవియట్ రష్యా మీద జర్మనీ దురాక్రమణ :** 1939లో జర్మనీతో చేసుకొన్న సంధిని ఉల్లంఘించి రష్యా బాల్టిక్ రాజ్యాలను ఆక్రమించి ఫిన్‌లాండ్ పోలండ్‌ల మీద దాడులు చేయడం, కాన్‌స్టాంటినోపుల్ రష్యా సైనిక స్థావరాలు ఏర్పాటు చేసుకోవడం, అట్లాంటిక్ ఛార్టర్‌పై మిత్ర రాజ్యాలతోపాటు సంతకాలు చేయడం వల్ల జర్మనీ 1941 జూన్ 21న సోవియట్ రష్యామీద దాడిజరిపింది. సోవియట్ రష్యా 1943లో కొమిన్‌టర్న్‌ను రద్దుచేసి ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లతో మైత్రి ఒడంబడికలు చేసుకొన్నది. అంతకుముందే 1942లో కెనడా, దక్షిణ ఆఫ్రికా, నెదర్లాండ్స్, అమెరికా దేశాలలో యూరప్ ఆర్థిక, భద్రతా పరిరక్షణకోసం సోవియట్ రష్యా ఒడంబడికలు చేసుకొన్నది.

సోవియట్ రష్యామీద జర్మనీ దాడి జరిపిన తరువాత మిత్ర రాజ్యాలకు, రష్యాకు మధ్య సహకారం ప్రారంభమైనప్పటికీ పరస్పరం ఒకరిమీద మరొకరికి పూర్తి నమ్మకమేర్పడలేదు. బ్రిటిష్ మంత్రులు సోవియట్ వ్యతిరేక ప్రసంగాలు చేయడం, బ్రిటిష్ సైన్యంలో సోవియట్ వ్యతిరేక సాహిత్యం ప్రచారం చేయడం, సోవియట్ రష్యాకు సకాలంలో మిత్ర రాజ్యాల సైనిక సహాయం అందక పోవడం మొదలైన కారణాల వల్ల సోవియట్ రష్యా మిత్ర రాజ్యాలపట్ల అనుమానాలను పెంచుకొన్నది. స్టాలిన్ గ్రాడ్ యుద్ధంలో రష్యా విజయం పొందడం మిత్ర రాజ్యాల ఆందోళనకు కారణమైంది. అందువల్ల 1943 నవంబర్ నుంచి మిత్ర రాజ్యాలు సోవియట్ రష్యాకు తెలియకుండా అనేక విషయాల్లో రహస్యంగా వ్యవహరించ సాగినాయి. 1943 నుంచి 1945 వరకు మిత్ర రాజ్యాలకు, రష్యాకు మధ్య అగాధం మరింత ఎక్కువైంది. 1945లో జరిగిన యాల్టా, శాన్‌ఫ్రాన్సిస్కో, పోట్స్‌డామ్ సమావేశాలలో కూడా మిత్ర రాజ్యాలకు రష్యాకు మధ్య సరి అయిన అవగాహన ఏర్పడలేదు. అంతేగాక 1945లో జపాన్ మీద అణుబాంబులు వేసినపుడు మిత్ర రాజ్యాల పట్ల రష్యాకుగల అనుమానం మరింత ఎక్కువైంది.

**8.6.6. సారాంశము :** 1917-1945 సంవత్సరాల మధ్య కాలంలో సదవగాహన లోపించిన కారణంగా మిత్ర రాజ్యాలకు సోవియట్ రష్యాకు మధ్య అనుమానము, అపనమ్మకము ఎక్కువైనాయి. 1917 తరువాత పశ్చిమ రాజ్యాలకు సోవియట్ రష్యాకు మధ్య దాదాపు సత్సంబంధాలు ఏర్పడలేదని చెప్పవచ్చు. రెండు ప్రపంచ యుద్ధాల మధ్య కాలంలో గమనించదగిన ముఖ్యమైన విషయము కమ్యూనిస్ట్ సిద్ధాంతాలకు, ప్రజాస్వామ్య సిద్ధాంతాలకు సంఘర్షణ ఏర్పడటమని చెప్పవచ్చు. బహిరంగంగాను, రహస్యంగాను కూడా ఒకరినొకరు నాశనం చేసుకోవడానికి ఇరుపక్షాలవారు ప్రయత్నించినారు. అంతర్జాతీయ రాజకీయాలలో తమ పలుకుబడిని ఎక్కువ చేసుకోవడానికి ఇరుపక్షాలు ప్రయత్నించినాయి. ఫలితంగా అంతర్జాతీయ రంగంలో వైరుధ్యంతో కూడిన కూటములు ఏర్పడినాయి. ఇరుపక్షాలు కూడా ప్రపంచ శాంతి భద్రతల పరిరక్షణ కోసం తమ స్వప్రయోజనాలను త్యాగం చేయడానికి సిద్ధపడలేదు. అందువల్ల 1945 తరువాత కూడా అంతకు పూర్వంవలెనే అంతర్జాతీయ రాజకీయాలలో ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగింది.

## 8.7. సోవియట్ రష్యా మధ్య ప్రాచ్యవిధానము :

**8.7.1. మధ్య ప్రాచ్యంలో సోవియట్ విదేశాంగ విధాన ముఖ్య లక్ష్యాలు :** మొదటి ప్రపంచ యుద్ధం తరువాత సోవియట్ రష్యా మధ్య ప్రాచ్యంలో ముఖ్యపాత్ర వహించడానికి ఆసక్తిని చూపసాగింది. మధ్య ప్రాచ్యంలో సోవియట్ విదేశాంగ విధానం ముఖ్య లక్ష్యాలు :

1) టర్కీ జలసంధిమీద తన ఆధిపత్యాన్ని స్థాపించడం
2) మధ్యధరా సముద్రాన్ని రష్యాకు తెరిచి ఉంచడం.
3) పర్షియన్ సింధు శాఖలో ఒకవేడినీటి రేవును సంపాదించడం
4) పశ్చిమ రాజ్యాలతోబాటు మధ్య ప్రాచ్యంలోని నూనెగ్రనులను పంచుకోవడం.
5) మధ్య ప్రాచ్యంలో పశ్చిమ రాజ్యాల అధికారాన్ని సవాలు చేయడం.

**8.7.2. మధ్య ప్రాచ్యంలో ఆనాటి పరిస్థితులు :** సోవియట్ రష్యా తన లక్ష్యాలను సాధించడానికి మధ్య ప్రాచ్యంలోని పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. ఆనాటి మధ్య ప్రాచ్య పరిస్థితులు :

1) మధ్యప్రాచ్య రాజ్యాలు ఆర్థికంగా వెనుకబడి ఉండడం.
2) మధ్య ప్రాచ్యంలో రాజకీయ పరిస్థితి అనిశ్చితంగా ఉండడం
3) మధ్య ప్రాచ్యంలో తీవ్ర జాతీయవాదము
4) మధ్య ప్రాచ్యంలో పశ్చిమ రాజ్యాలపట్ల ఆగ్రహం
5) మధ్య ప్రాచ్య దేశాల మధ్య పరస్పరం విరోధంతో కూడిన పోటీ

ఈ కారణాలవల్ల మధ్య ప్రాచ్యంలో సోవియట్ రష్యా ఆసక్తి ఎక్కువైంది.

**8.7.3. సోవియట్ రష్యా - పర్షియా (ఇరాన్)ల మధ్య సంబంధాలు :** జార్ చక్రవర్తుల కాలంనుంచి రష్యా మధ్య ప్రాచ్యంలో రాజ్య విస్తరణ విధానాన్ని అనుసరిస్తూ వచ్చింది. 19వ శతాబ్దంలో ఉత్తర పర్షియాలో రష్యా ప్రత్యేక హక్కులను ఇంగ్లండ్ గుర్తించింది. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో ఉత్తర, దక్షిణ పర్షియాలలో జర్మన్ సైన్యాలున్నాయనే సాకుతో రష్యా ఉత్తర పర్షియాలో చాలా భాగాన్ని ఆక్రమించుకొన్నది. 1915లో జరిగిన కాన్‌స్టాంటినోపుల్ ఒప్పందం ప్రకారం మిత్ర రాజ్యాలు ఇస్తాన్‌బుల్‌ను రష్యాకివ్వడమేగాక ఉత్తర పర్షియాలో రష్యా అధికారాన్ని కూడా గుర్తించాయి.

1917లో రష్యాలో జరిగిన బోల్షెవిక్ విప్లవానంతరం, ఆదేశపు విదేశాంగ విధానంలో మార్పు వచ్చింది. సోవియట్ రష్యా పర్షియా పట్ల తన సామ్రాజ్య తత్వ ధోరణిని విడనాడింది. దీనిని అవకాశంగా తీసుకొని బ్రిటన్ పర్షియాతో 1919లో ఒక సంధిచేసుకొన్నది. ఈ సంధివల్ల పర్షియాలోని చమురు పరిశ్రమలలో పర్షియా వారికి శిక్షణ ఇవ్వడానికి బ్రిటన్ అంగీకరించింది. ఈ సంధివల్ల పర్షియా ఇంచుమించు బ్రిటన్ వలసరాజ్యమైంది. పర్షియన్ పార్లమెంట్ ఈ సంధికి తీవ్రంగా వ్యతిరేకించి దానిని ధృవపరచడానికి తిరస్కరించింది. పర్షియాలో జాతీయోద్యమం వృద్ధి చెందసాగింది. దీంతో 1921లో పర్షియానుంచి తన సైన్యాలను బ్రిటన్ ఉపసంహరించుకొన్నది.

అదే సంవత్సరం (1921)లో సోవియట్ సైన్యాలు పర్షియాలోకి ప్రవేశించినాయి. సోవియట్ సైన్యాల సహాయంతో పర్షియన్ కమ్యూనిస్టులు జిలాన్ కేంద్రంగా నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసినారు. క్రమక్రమంగా పర్షియాలో కమ్యూనిస్టులు ప్రజాదరణ పొందసాగినారు. ఈ విధంగా బ్రిటిష్ అనుకూల పర్షియన్ ప్రభుత్వం నూతన అపాయాన్ని ఎదుర్కోవలసివచ్చింది. 1921లో పర్షియన్ సేనాని రిజాఖాన్ పర్షియన్ ప్రభుత్వాన్ని కూలదోసి తాను పర్షియా ప్రధానమంత్రిగా నూతన ప్రభుత్వాన్ని నెలకొల్పినాడు. పర్షియా ఇంగ్లండ్‌ల మధ్య 1919లో జరిగిన సంధిని రద్దుచేసి రిజాఖాన్ రష్యాలో 1921లో ఒక నూతన సంధి చేసుకొన్నాడు. ఈ సంధి ప్రకారం జార్ చక్రవర్తుల కాలం నుంచి పర్షియాలో తాను అనుభవిస్తున్న హక్కులను, అధికారాలను సోవియట్ రష్యా వదులుకొన్నది. ఇరు పక్షాలు ఒకరి సార్వభౌమాధికారాన్ని మరొకరు గుర్తించినారు. అంతేగాక పర్షియానుంచి రష్యా సైన్యాలను ఉపసంహరించడం జరిగింది. 1925లో రిజాఖాన్ వంశ పారంపర్య హక్కుగల రాజైనాడు. ఇతడు 1934 పర్షియా పేరును 'ఇరాన్' గా మార్చాడు.

రెండో ప్రపంచ యుద్ధానికి ముందు ఇరాన్‌లో జర్మనీ తన పలుకుబడిని పెంపొందించుకొన్నది. రెండో ప్రపంచ యుద్ధంలో ఇరాన్ తటస్థతను ప్రకటించినా, ఇరాన్ పాలకులు జర్మనీపట్ల సానుభూతిని చూపించారు. రష్యా మీద జర్మనీ దండెత్తినప్పుడు, రష్యన్ బ్రిటిష్ సైన్యాలను తన భూభాగం గుండా పోనీయడానికి ఇరాన్ అంగీకరించలేదు. దేశంలోని జర్మన్‌లను వెళ్ళగొట్టవలసిందిగా రష్యా, బ్రిటన్‌లు ఇరాన్‌ని కోరగా ఇరాన్ తిరస్కరించింది. అందువల్ల బ్రిటన్, రష్యాలు ఇరాన్‌ను ఆక్రమించాయి. రెండో ప్రపంచ యుద్ధకాలంలో బ్రిటన్, అమెరికా, రష్యాల ఆధీనంలో ఇరాన్ ఉంది. మిత్రమండలి రాజ్యాల ఒత్తిడి ఫలితంగా రిజాషా సింహాసనాన్ని త్యజించి, తన కుమారుడైన మహ్మద్ రజాను ఇరాన్ రాజుగా చేసినాడు. మహ్మద్ రజా 1942లో బ్రిటన్ రష్యాలతో కొత్త సంధి చేసుకొన్నాడు. దీని ప్రకారం బ్రిటన్, రష్యాలు ఇరాన్ సర్వసత్తాక ప్రతిపత్తిని, స్వాతంత్ర్యాన్ని, ప్రాదేశిక సమగ్రతను గుర్తించినాయి. దురాక్రమణ కాలంలో ఇరాన్‌కు సహాయం చేయడానికి వాగ్దానం చేసినాయి. ఇరాన్ మిత్రమండలి రాజ్యాలకు సహాయం చేయడానికి అంగీకరించింది. మిత్ర మండలి రాజ్యాలు తమ సైన్యాలను ఇరాన్‌లో నిలుపుకోవచ్చు. దీని ఫలితంగా 1943 సెప్టెంబర్‌లో ఇరాన్ జర్మనీ మీద యుద్ధాన్ని ప్రకటించింది.

1943లోని టెహరాన్ సమావేశంలో జరిగిన ప్రకటనలో మిత్ర మండలి రాజ్యాలకు ఇరాన్ చేసిన సహాయాన్ని రష్యా, అమెరికా, బ్రిటన్‌లు గుర్తించాయి. యుద్ధం అంతమైన వెంటనే ఇరాన్ నుంచి తమ సైన్యాలను ఉపసంహరిస్తామని వాగ్దానం చేసినాయి. రెండో ప్రపంచ యుద్ధం తరువాత బ్రిటన్, అమెరికాలు ఇరాన్ నుంచి తమ సేనలను ఉపసంహరించుకొన్నాయి. కాని రష్యా సేనలు ఇరాన్ భూభాగం నుంచి వైదొలగలేదు. ఆ సమయంలో ఇరాన్‌లోని అజర్ బైజాన్ రాష్ట్రంలో రష్యా అనుకూలురైన ట్యూడా పక్షం వారు స్వపరిపాలనా ప్రభుత్వాన్ని స్థాపించారు. అందువల్ల రష్యామీద ఇరాన్‌కు భయసందేహాలు కలిగినాయి. ఇరాన్ రష్యామీద ఐక్యరాజ్య సమితిలో ఫిర్యాదు చేయగా రష్యా, సైన్యాలను ఇరాన్ నుంచి ఉపసంహరించవలసిందిగా భద్రతా సమితి ఆదేశించింది. చివరకు సోవియట్ రష్యా, ఇరాన్‌ల మధ్య జరిగిన సంప్రదింపుల ఫలితంగా సోవియట్ సైన్యాలు ఇరాన్‌నుంచి వైదొలగినాయి.

**8.7.4. సోవియట్ రష్యా - టర్కీల మధ్య సంబంధాలు :** మొదటి ప్రపంచ యుద్ధంలో టర్కీ జర్మన్ పక్షం వహించి చాలా విధాలుగా నష్టపడింది. యుద్ధానంతరం మిత్ర మండలి టర్కీని సెవెర్స్ సంధి షరతులకు అంగీకరింపజేసింది. ఈ సంధి షరతులు వర్సే సంధి షరతుల కంటే కఠినమైనవి. అందువల్ల జాతీయ భావాలున్న టర్కీలు ఈ సంధిని తిరస్కరించాయి. వీరు ముస్తఫా కెమల్ ఆటార్క్ నాయకత్వాన టర్కీని రిపబ్లిక్‌గా ప్రకటించి సెవెర్స్ సంధి ప్రకారం టర్కీ పోగొట్టుకున్న ప్రాంతాలను తిరిగి సంపాదించసాగినారు. 1921లో సోవియట్ రష్యాతో ముస్తఫా సంధిచేసుకొని కార్స్, ఆర్థహాన్‌లను తిరిగి సంపాదించాడు. సెవెర్స్ సంధిని కాదని మిత్ర మండలితో ముస్తఫా లొజేన్ సంధిని (1923) చేసుకొన్నాడు. లోజేన్ సమావేశంలో సోవియట్ రష్యా టర్కీని సమర్థించింది. లోజేన్ సంధి వల్ల టర్కీ తిరిగి తాను కోల్పోయిన ప్రాంతాలను పొందగలిగింది. 1922-23 సంవత్సరాలనుంచి టర్కీ సోవియట్‌లు దౌత్య సంబంధాలు ఏర్పరుచుకొన్నా... 1925లో టర్కీని. బ్రిటన్‌కు మోసుల్ విషయంలో తగాదా ఏర్పడినపుడు, టర్కీ సోవియట్‌ల మధ్య మైత్రి సంధి ఏర్పడింది. ఈ సంధి ... రెండు రాజ్యాలు ఒక దానితో ఒకటి యుద్ధాలు చేసుకోకుండాను, తమ మీద దురాక్రమణ జరిపినపుడు, పరస్పరం సహాయం చేసుకోడానికి అంగీకరించినాయి. కాని ముస్తఫా తన దేశంలోని కమ్యూనిస్టులను తీవ్రంగా అణచివేసినాడు. అయినా రష్యా టర్కీతో మైత్రి సంబంధాలను కొనసాగిస్తూ మాంట్రే ఒడంబడికలో టర్కీని సమర్థించింది. ఈ ఒడంబడిక ప్రకారం డార్డినెల్స్ జలసంధికి సంబంధించిన లాజేన్ సంధి సూత్రాలను టర్కీకి అనుకూలంగా సవరించడం జరిగింది. కాని 1939లో రష్యా జర్మనీల మధ్య కుదిరిన దురాక్రమణ వ్యతిరేక ఒడంబడిక వల్ల టర్కీ ఆందోళన చెందింది. బాల్కన్ ప్రాంతంలో తుల్య ప్రాబల్య విధానాన్ని కొనసాగించడానికి టర్కీ రష్యాతో కొత్త సంధినొకదానిని ప్రతిపాదించగా, రష్యా దానిని తోసిపుచ్చింది. దీనిలో రష్యా మీద అపోహలు ఏర్పడి టర్కీ పాశ్చాత్య దేశాలవైపు మొగ్గింది. 1941లో జర్మనీ రష్యా మీద దండెత్తినపుడు టర్కీ తటస్థంగా ఉండిపోయింది. చివరకు రష్యా టర్కీల మధ్య సంబంధాలు బాగా దెబ్బతిని, రష్యా తనంత తానే టర్కీ, రష్యాల మధ్య మైత్రి సంధిని రద్దు చేసుకొన్నది. రెండో ప్రపంచ యుద్ధం చివరి దశలో టర్కీ మిత్ర రాజ్యాలవైపు చేరింది.

## 8.8. సోవియట్ రష్యా దూర ప్రాచ్య విధానము :

ఈ క్రింది పరిస్థితుల మీద ఆధారపడి సోవియట్ దూరప్రాచ్య విధానము రూపొంది కొనసాగింది.

1) రాజకీయంగా అశాంతితో, ఆర్థికంగా వెనకబడి ఉన్న దూర ప్రాచ్యంలో కమ్యూనిస్ట్ విస్తరణకు అనువైన పరిస్థితులున్నాయి.

2) స్వయం నిర్ణయం, అన్ని రాజ్యాల సార్వభౌమాధికారం అనే సోవియట్ సిద్ధాంతాలు దూర ప్రాచ్యంలో ప్రజారంజకమైనాయి.

3) తన భూభాగంలో అధికభాగం ఆసియాలో ఉన్నందువల్ల సోవియట్ రష్యాకు దూరప్రాచ్యంలో ఆసక్తి వుంది.

4) దూర ప్రాచ్యం కీలక స్థానంలో ఉండడం వల్ల ఆ ప్రాంతాలపై ఆసక్తి వహించింది.

5) సోవియట్ రష్యాకు దూర ప్రాచ్యంలో చారిత్రకమైన సంబంధాలున్నాయి.

**8.8.1. చైనా-సోవియట్ రష్యాల మధ్య సంబంధాలు :** ఈ క్రింది చారిత్రక కారణాల ప్రభావానికిలోనై చైనా, రష్యాల మధ్య సంబంధాలు అభివృద్ధి చెందినాయి.

1) జార్ చక్రవర్తుల కాలంలో రష్యా పశ్చిమ రాజ్యాల విధానాలకు భిన్నంగా చైనా పట్ల దురాక్రమణ విధానాన్ని అనుసరించలేదు. చైనాలో రష్యాకు వాణిజ్య సంబంధాలుండేవి.

2) తన ప్రాదేశిక సమగ్రతను కాపాడుకోవడం ఒక పెద్ద సమస్యగా పరిణమించినందువల్ల చైనా రష్యాతో స్నేహ పూర్వకమైన సంబంధాలు స్థాపించుకోవడానికి ఆసక్తి చూపింది.

3) చైనాలో ఏ ఒక్క భాగాన్ని కూడా రష్యా బలప్రయోగం ద్వారా ఆక్రమించుకోలేదు. చైనా మీద పశ్చిమ రాజ్యాలు చేసిన నల్లమందు యుద్ధాలలో రష్యా పాల్గొనలేదు. అందువల్ల రెండు దేశాల మధ్య సుహృద్భావంతో కూడిన వాతావరణం ఏర్పడింది.

4) దూర ప్రాచ్యంలో జపాన్ విజృంభణ కూడా రెండు దేశాల మధ్య సన్నిహిత సంబంధాలేర్పడడానికి ఒక ప్రధాన కారణం.

ఈ విధంగా భౌగోళిక వాణిజ్య కారణాలవల్ల 1917 వరకు చైనా రష్యాల మధ్య సత్సంబంధాలున్నాయి.

రష్యాలో కమ్యూనిస్ట్ విప్లవం ప్రారంభమైనప్పుడు రష్యాలో చైనా తనకుగల దౌత్య సంబంధాలను రద్దు చేసుకొని మిత్ర రాజ్యాలలో వలస సైబీరియామీద దాడి జరిపింది. అంతేగాక చైనా వెలుపలి మంగోలియా, సింకియాంగ్‌లను ఆక్రమించుకొన్నది. అయితే రష్యా, చైనాల మధ్య సత్సంబంధాలను తిరిగి అనతి కాలంలోనే నెలకొల్పడం జరిగింది. చైనా జాతీయ నాయకుడు సిన్‌యాట్‌సెన్ సోవియట్ రష్యా నుంచి ఎక్కువ సహాయాన్ని పొందదలచినాడు. 1920లో సోవియట్ రష్యా జాతీయ చైనాలు పరస్పరం ఒకదానిని మరొకటి అధికార పూర్వకంగా గుర్తించుకొన్నాయి.

**1924లో చైనా రష్యాల మధ్య ఒక మైత్రి సంధి జరిగింది. ఈ సంధి ప్రకారం.**

1) జార్ చక్రవర్తుల కాలంలో రష్యాకు పూర్వపు చైనా ప్రభుత్వానికి మధ్య జరిగిన సంధులన్నీ రద్దయినాయి.

2) రెండు దేశాలలోను పరస్పర ప్రయోజనాలకు భంగం కలిగించే కార్య కలాపాలను అణచివేయడానికి చైనా, రష్యా అంగీకరించాయి.

3) రెండు దేశాల మధ్య సంబంధాలు న్యాయం, సమానత్వం ప్రాతిపదికగా స్థాపించుకోవడానికి ఇరుపక్షాలు అంగీకరించినాయి.

4) వెలుపలి మంగోలియాను చైనా దేశంలో ఒక భాగంగా రష్యా గుర్తించింది.

1924 తరువాత రష్యా చైనాల మధ్య సంబంధాలు మెరుగుపడసాగినాయి. రష్యా నుంచి మైకేల్ బొరొడిన్, భారతీయుడైన యమ్.యన్. రాయ్ మొదలైన నిపుణులు చైనాకు వచ్చి కొమింటాంగ్ పార్టీని పునర్వ్యవస్థీకరించినారు. రష్యన్ సైనిక నిపుణుల సహాయంతో చైనాలో వామ్‌పోవా సైనిక శిక్షణ కేంద్రాన్ని నెలకొల్పడం జరిగింది. చైనాలోని కొమింటాంగ్ పార్టీ, కమ్యూనిస్ట్ పార్టీల రెండింటిలో మైత్రి సంబంధాలు ఏర్పాటు చేసుకోవలెనని స్టాలిన్ భావించాడు. అయితే 1926లో చైనాలో అధికారాన్ని స్వీకరించిన తరువాత చియాంగ్ కైషెక్ కమ్యూనిస్ట్‌లను అణిచివేయసాగినాడు. రష్యన్ నిపుణులను చైనా నుంచి బహిష్కరించడమేగాక చైనాలో రష్యా పలుకుబడి తగ్గసాగింది. 1929 నాటికి చైనా రష్యాల మధ్య సంబంధాలు పూర్తిగా చెడిపోయినాయి. 1931లో జపాన్ మంచూరియా మీద దాడిచేయడంతో రష్యా భయపడిపోయి చైనాతో కలిసి తన ప్రయోజనాలను కాపాడుకోవడానికి తగిన చర్యలు తీసుకోసాగింది. 1932లో తిరిగి రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు నెలకొన్నాయి.

1935లో జపాన్‌కు వ్యతిరేకంగా రష్యా 'యునైటెడ్ ఫ్రంట్' తయారు చేసినపుడు కొమింటాంగ్ ప్రభుత్వంతో చైనా కమ్యూనిస్ట్‌లు కలసి సహకరించినారు. 1936లో జపాన్ ఉత్తర చైనా మీద దాడి ప్రారంభించగా రష్యా చైనాలు దురాక్రమణ వ్యతిరేక సంధి చేసుకొన్నాయి. కాని 1941లో రష్యా జపాన్‌ల మధ్య దురాక్రమణ వ్యతిరేక సంధి జరిగిన తరువాత చైనా తిరిగి భయపడసాగింది. రష్యా మీద జర్మనీ దురాక్రమణ ఫలితంగా 1941 నుంచి తిరిగి రష్యా చైనాల మధ్య సంబంధాలు అభివృద్ధి చెందినాయి. మంచూరియా, పెస్కీడోర్స్, ఫార్మోజాల మీద చైనా హక్కులను రష్యా సమర్థించింది. కానియాల్టా సమావేశంలో రష్యా చైనానుంచి పోర్ట్ ఆర్థర్‌ను, మంచూరియా రైల్వేను కోరింది. దీనికి చియాంగ్ అంగీకరించాడు. అయితే చియాంగ్ జాతీయ ప్రభుత్వాన్ని రష్యాగుర్తించింది.

**8.8.2. సోవియట్ రష్యా - జపాన్‌ల మధ్య సంబంధాలు :** కొరియా, మంచూరియా, పసిఫిక్ ప్రాంతాలమీద ఆధిపత్యం కోసం రష్యా, జపాన్‌ల మధ్య 1904-1905లలో యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో రష్యా ఓడిపోయింది. యుద్ధానంతరం జరిగిన పోర్ట్స్‌మత్ సంధి

ప్రకారం కొరియా, మంచూరియాలలో రష్యా తన పలుకుబడిని పోగొట్టుకోగా జపాన్ పోర్ట్ ఆర్థర్, దక్షిణ సఖాలిన్‌లను పొందగలిగింది. మొదట ప్రపంచ యుద్ధ కాలంలో జపాన్ చైనాలోని అనేక ప్రాంతాలను ఆక్రమించుకొన్నది. జపాన్ దురాక్రమణవల్ల భీతి చెందిన రష్యా 1918లో జపాన్‌తో ఒక సంధి చేసుకొన్నది. అయితే ఈ సంధి జరిగిన తరువాత కూడా దూర ప్రాచ్యంలో తన రాజ్య విస్తరణ కార్యక్రమానికి రష్యా అవరోధమని జపాన్ భావించింది. అంతేగాక రష్యాలో జరిగిన కమ్యూనిస్ట్ విప్లవంవల్ల కూడా భూస్వామ్య వ్యవస్థగల జపాన్ భీతి చెందింది. అందువల్ల రష్యా ఆంతరంగిక వ్యవహారాలలో పశ్చిమ రాజ్యాలు జోక్యం చేసుకొన్నప్పుడు జపాన్ పశ్చిమ రాజ్యాలకు తన సహకారాన్ని అందజేసింది.

పశ్చిమ రాజ్యాలతోపాటు జపాన్ రష్యా ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేసుకొని రష్యాకు చెందిన వ్లాడివోస్టక్ రేవును తరువాత సఖాలిన్‌ను ఆక్రమించుకొన్నది. జపాన్ రాజ్య విస్తరణవల్ల ఆందోళన చెందిన రష్యా 1925లో జపాన్‌తో పీకింగ్ సంధి చేసుకొన్నది. ఈ సంధి ఫలితంగా రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు స్థాపితమైనాయి. పరస్పరం దురాక్రమణ చర్యలు ఆరికట్టడానికి రెండు పక్షాలు అంగీకరించాయి. ఈ సంధి జరిగినప్పటి నుంచి 1931 వరకు రష్యా జపాన్‌ల మధ్య శాంతినెలకొన్నది. అయినప్పటికీ రెండు దేశాల మధ్య పరస్పరం అనుమానం మాత్రం తొలగలేదు.

1932-1939 సంవత్సరాల మధ్య కాలంలో రష్యా జపాన్‌ల మధ్య సంబంధాలు క్షీణించినాయి. జపాన్ మంచుకోను సృష్టించినందువల్ల రష్యా ఆందోళన చెందింది. ఈ కాలంలోనే రష్యా సమితిలో సభ్య రాజ్యంగా చేరింది. జపాన్ దురాక్రమణకు వ్యతిరేకంగా మంచూరియా సరిహద్దుల్లో సైనిక సన్నాహాలు చేయడంతోబాటు రష్యా అమెరికా చైనాలతో తన సంబంధాలను అభివృద్ధి చేసుకోసాగింది. రెండు దేశాలు సైబీరియా, మంచూరియా సరిహద్దులలో సైనిక సన్నాహాలు ఎక్కువ చేసినందువల్ల రష్యా-జపాన్‌ల మధ్య విరోధమెక్కువైంది. 1937లో రష్యాకు చెందిన రెండు యుద్ధ నౌకలను జపాన్ నాశనం చేసినపుడు రెండు దేశాల మధ్య విరోధం తీవ్రరూపం దాల్చింది. మంచూకో వెలుపలి మంగోలియా, సఖాలిన్‌లలో కూడా రెండు దేశాలమధ్య ఘర్షణలు ప్రారంభమైనాయి. ఈ కాలంలో రెండు దేశాల మధ్య ఒక విధమైన ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగింది. 1936లో కొమిన్‌టర్న్‌కు వ్యతిరేకంగా జపాన్ జర్మనీతో ఒక ఒడంబడిక చేసుకొన్నది. దీనికి సమాధానంగా రష్యా చైనాతో 1937లో ఒక దురాక్రమణ వ్యతిరేక ఒప్పందం చేసుకొన్నది.

1939లో రష్యా, జర్మనీల మధ్య దురాక్రమణ వ్యతిరేక ఒప్పందం జరిగినందువల్ల జపాన్ ఆందోళన చెంది జర్మనీ ఇటలీలతో కలసి 1940లో జపాన్ అక్షరాజ్య కూటమిని ఏర్పాటు చేసింది. మరొకవైపు తన భద్రత కోసం జపాన్ రష్యాతో దురాక్రమణ వ్యతిరేక ఒప్పందం చేసుకొన్నది. ఈ సంధివల్ల రష్యా జపాన్‌లు సంతృప్తి పడినాయి. 1945 ఏప్రిల్‌లో తాను లోగడ జపాన్‌తో చేసుకొన్న సంధిని రద్దు చేసి రష్యా జపాన్ మీద యుద్ధాన్ని ప్రకటించింది. సోవియట్ సైన్యాలు కొద్ది రోజులలోనే మంచూరియాలోని ముఖ్య పట్టణాలను ఆక్రమించుకొన్నాయి. 1945 ఆగష్టు 14న జపాన్ మిత్ర రాజ్యాలకు పూర్తిగా లొంగిపోయింది.

డా॥ వి.కె. మోహన్

పాఠం - 9

# 1. స్పానిష్ అంతర్యుద్ధం

# 2. గ్రేట్ బ్రిటన్ - తృప్తి పరిచే విధానము

**లక్ష్యం :**

స్పానిష్ అంతర్యుద్ధం గురించి, గ్రేట్ బ్రిటన్ అనుసరించిన తృప్తిపరిచే విధానము గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

**విషయక్రమం:**


1. స్పానిష్ అంతర్యుద్ధం

9.1.1 పరిచయం

9.1.2. మొదటి విప్లవం (1923)

9.1.3. రెండో విప్లవం (1931)

9.1.4. మూడో విప్లవం (1936-39) స్పానిష్ అంతర్యుద్ధం

9.1.4.1 అంతర్యుద్ధానికి కారణాలు

9.1.4.2. అంతర్యుద్ధంలో విదేశీయుల జోక్యం

9.1.4.3. బ్రిటిష్, ఫ్రెంచి వైఖరి

9.1.4.4. అంతర్యుద్ధంలో సమితి పాత్ర

9.1.4.5. అమెరికా విధానం

9.1.4.6. అంతర్యుద్ధం

9.1.4.7. ఫలితాలు

9.2 గ్రేట్ బ్రిటన్ - తృప్తి పరిచే విధానం

9.2.1 పరిచయం

9.2.2 తృప్తి పరిచే విధానాన్ని బ్రిటన్ అనుసరించడానికి కారణాలు

9.2.3 తృప్తి పరిచే విధానం

9.2.3.1 నానాజాతి సమితి నుంచి జర్మనీ ఉపసంహరించుకోవడం

9.2.3.2 జర్మనీలో నిర్బంధసైనిక విధానాన్ని ప్రవేశపెట్టుట

9.2.3.3 బ్రిటన్‌తో హిట్లర్ నౌకాసంధి చేసుకోవడం

9.2.3.4 రైన్ భూభాగాన్ని హిట్లర్ ఆక్రమించుకోవడం

9.2.3.5 అక్షరాజ్య కూటమి ఏర్పాటు

9.2.3.6 స్పానిష్ అంతర్యుద్ధం

9.2.3.7 ఆస్ట్రియా జర్మనీల కలయిక

9.2.3.8 మ్యూనిక్ ఒప్పందం

9.2.3.9 చెకొస్లొవాకియా మీద జర్మనీదాడి

9.2.3.10 జపాన్ మంచూరియా ఆక్రమణ

9.2.3.11 ఇటలీ ఇథియోపియా ఆక్రమణ

9.2.3.12 సారాంశము.

## 9.1 స్పానిష్ అంతర్యుద్ధం:

**9.1.1 పరిచయం :** రెండు ప్రపంచ యుద్ధాల మధ్యకాలంలో సంభవించిన ఒక ముఖ్య సంఘటన కొన్ని ప్రపంచ దేశాలల నియంతృత్వ ప్రభుత్వాల స్థాపన. జర్మనీలో నాజీ నియంత హిట్లర్, ఇటలీలో ఫాసిస్ట్ నియంత ముస్సోలినీ, స్పెయిన్‌లో ఫ్రాంకో సేనాని అధికారంలోకి వచ్చారు. జపాన్‌లో సైనిక నియంతృత్వము ఏర్పడింది. ఆదర్శాలలో ప్రజాస్వామ్యానికి, నియంతృత్వానికి సంఘర్షణ ఏర్పడింది. బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికాలు ప్రజాస్వామ్య, దేశాలు. ఈ రాజ్యాలు నియంతృత్వ దేశాల దురాశనే బలికాకుండా చిన్నరాజ్యాలకు రక్షణ కల్పించడంలో విఫలమయ్యాయి. దీనికితోడు రష్యా, ఈ రెండు వర్గాలకు దూరంగా ఉంటూ వచ్చింది.

1933లో స్పెయిన్‌లో ప్రజాస్వామ్య ప్రభుత్వ మేర్పడింది. కాని **1934** నుంచి మితవాద శక్తులు ప్రభుత్వాన్ని కూలద్రోయడానికి ప్రయత్నాలు చేయసాగినాయి. 1936లో స్పెయిన్‌లోని ఫాసిస్ట్ శక్తులు నాజీ జర్మనీ, ఫాసిస్ట్ ఇటలీల ప్రోత్సాహంతో చట్టసమ్మత ప్రజాప్రభుత్వానికి వ్యతిరేకంగా విప్లవ వ్యతిరేకోద్యమాన్ని ప్రారంభినాయి. ఫాసిస్ట్ నాయకుడైన జనరల్ ఫ్రాంకోకు హిట్లర్, ముస్సోలనీల అండదండలున్నాయి. స్పెయిన్‌లోని అంతర్యుద్ధాన్ని ఆపడానికిక సమితి ఏవిధమైన చర్యలు తీసుకోలేకపోయింది. 1939 నాటికి జనరల్ ఫ్రాంకో స్పెయిన్‌లో ప్రజాప్రభుత్వాన్ని కూలదోసి నియంతృత్వం స్థాపించాడు.

మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో స్పెయిన్ తటస్థ విధానాన్ని అనుసరించింది. కాని స్పెయిన్‌లో రాజకీయ, ఆర్థిక సంక్షోభము ఏర్పడి అరాచకానికి దారితీసింది. విప్లవ పంథా స్పానిష్ ప్రజల అంతరాళాలలో లేకపోయినా 1923-1939 సంవత్సరాల మధ్య కాలంలో స్పెయిన్‌లో మూడు విప్లవాలు సంభవించాయి. మొదటి రెండు రక్తరహితమైనవి. కాని 1936-1939 సంవత్సరాల మధ్యకాలంలో చెలరేగిన విప్లవంలో ఒక మిలియన్‌కు పైగా ప్రజలు ప్రాణాలు పోగొట్టుకొన్నారు.

**9.1.2. మొదటి విప్లవం (1923) :** 1921లో స్పానిష్ మొరాకోలో జరిగిన రిఫ్స్ అనె తెగ వారి తెరుగబాటును అతికష్టంతో స్పెయిన్ అణచివేయగలిగింది. కాని దీనివల్ల స్పెయిన్ ప్రభుత్వము అసమర్థమైనదనే విమర్శవచ్చింది. 1923లో కటకలోనియా సైనిక గవర్నయిన జనరల్ ప్రియో-డి-రియో తిరుగుబాటు చేసి ప్రభుత్వాన్ని కూలద్రోసి స్పెయిన్‌కు నియంత అయినాడు. కాని అతని నియంతృత్వము ఎక్కువకాలం కొనసాగలేదు. కుట్రలు, ఎదురు కుట్రలు, తిరుగబాట్లు జరిగినందువల్ల దేశంలో ఏర్పడిన అంతరంగిక సంక్షోభాన్ని పరిష్కరించలేక ప్రియో-రియో 1930లో రాజీనామా చేసినాడు.

**9.1.3 రెండో విప్లవం (1931) :** స్పెయిన్‌లో ఏర్పడిన అంతరంగిక సంక్షోభంవల్ల అసంతృప్తి చెందిన ప్రజల భావాలు రిపబ్లికన్ విధానం వైపు మళ్ళినాయి. దేశంలోని పరిస్థితిని అవగాహన చేసుకొన్న స్పెయిన్ రాజు పదమూడో అల్ఫాన్సో తన రాచరికం కొనసాగడం కష్టమని గ్రహించి ఏప్రియల్ 1931న సింహాసనం త్యజించి దేశం విడిచిపోయినాడు. స్పెయిన్ రిపబ్లిక్ గా ప్రకటించి సెనార్ కాబెల్లెరో అధ్యక్షుడయినాడు. 1931 విప్లవం వల్ల రాచరికం రద్దయి స్పెయిన్ రిపబ్లిక్‌గా అవతరించింది. కాని ఈ రిపబ్లిక్ ఎక్కువకాలం మన్నేది కాదని కొద్ది కాలంలోనే తేలిపోయింది. స్పెయిన్‌లో అధికారం కోసం అతివాదులకు, మిత వాదులకు మధ్య అంతర్యుద్ధం ప్రారంభమయింది.

**9.1.4 మూడో విప్లవం (1936-1939) లేదా స్పానిష్ అంతర్యుద్ధం :** 1936 జూలైలో ప్రారంభమైన స్పెయిన్ అంతర్యుద్ధం 1939 వరకు కొనసాగింది. ప్రభుత్వ అనుకూలురకు 'లాయలిస్ట్' లనీ, రిపబ్లికలనీ, మితవాద తిరుగుబాటు దారులకు 'నేషలిస్ట్' లని పేరు.

**9.1.4.1 అంతర్యుద్ధానికి కారణాలు :**

1. సాధారణంగా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే మధ్యతరగతి స్పెయిన్‌లో ఏర్పడలేదు.
2. స్పెయిన్‌లోని స్పెయిన్‌లోని రిపబ్లిక్‌ను చర్చి, సైన్యం భూస్వాములు వ్యతిరేకించారు.
3. స్పానిష్ తీవ్రవాదులు, మితవాదులు మధ్య వైషమ్యం పోరాటస్థాయికి పెరిగింది.
4. కమ్యూనిస్ట్‌లు, సిండికాలిస్టులు, ఎనార్కిస్ట్‌లు, బాస్క్‌వేర్పాటు వాదులు, సోషలిస్టులు, కార్మిక నాయకులు అతివాదులలో ముఖ్యులు. పై శ్రేణి చర్చి అధికారులు, సైనికాధికారులు, భూస్వాములు, ఫాసిస్ట్‌లు, రాజపక్షవాదులు మితవాదుల్లో ముఖ్యులు.
5. 1936 ఫిబ్రవరి ఎన్నికల్లో అతివాదులు విజయం సాధించి అధికారం చేపట్టినారు. కాని అతివాదుల ఎన్నికల ప్రణాళికను అమలు జరపకుండా చేయడానికి మితవాదులు బల ప్రయోగానికి సిద్ధపడ్డారు.

దీనిలో స్పెయిన్‌లో అంతర్యుద్ధం ప్రారంభమైంది.

**9.1.4.2 అంతర్యుద్ధంలో విదేశీయులు జోక్యం :** స్పానిష్ అంతర్యుద్ధం ప్రాబల్యాత్మక రాజకీయులలో ప్రధాన పాత్ర వహించి రెండో ప్రపంచయుద్ధ కారణాల్లో ఒకటైంది. తిరుగుబాటుదారులు తమ సిద్ధాంతానికనుగుణంగా ఉన్నారు కాబట్టి జర్మనీ, ఇటలీలు ఫ్రాంకోకు మద్దతు ఇచ్చాయి. అంతేగాక తమ దేశాల్లో ఉత్పత్తి అవుతున్న ఆయుధాలను స్పానిష్ అంతర్యుద్ధంలో ప్రయోగించి వాటి విలువలను అంచనాగట్టడానికి నాజీలకు, ఫాసిస్ట్‌లకు ఇపుడు మంచి అవకాశం దొరికింది. దీనికితోడు స్పెయిన్‌లో ఫాసిస్ట్ ప్రభుత్వమేర్పడితే మెడిటరేనియన్ పైన, ఉత్తర ఆఫ్రికాపైన తిరుగులేని అధికారం సంపాదించుకోవచ్చని ముస్సోలిని ఆశ. స్పెయిన్ ప్రభుత్వం సోషలిస్ట్, కమ్యూనిక్ట్ సిద్ధాంతాల కనుగుణంగా ఉండటంవల్ల రష్యా సహాయమిచ్చింది.

స్పెయిన్‌లో జోక్య చేసుకొంటే తమకు కలిగే లాభాలను అక్ష రాజ్యాలు గ్రహించాయి. నేషనలిస్ట్‌లు విజయం సాధిస్తే ఫ్రాన్స్‌తో వారు తప్పనిసరిగా శత్రుభావం వహిస్తారు. కనక స్పానిష్-ఫ్రెంచి సరిహద్దుకు ఫ్రెంచిసైన్యం తరలాలి. దీనివల్ల రైన్ వద్ద ఫ్రెంచివారి పరిస్థితి బలహీన పడుతుంది. ముడి ఇనుము, రాగి, తుత్తునాగం, పాదరసం, ఇతర స్పానిష్ నిక్షేపాలుఅక్షరాజ్యాల వారికి లభ్యమవుతాయి. స్పెయిన్‌లో అక్షరాజ్యాల వారికి అనుకూలుడైన నియంత అధికారానికి వస్తే మెడిటరేనియన్‌లో ఫ్రెంచి, బ్రిటిష్ వారికి అన్ని విధాల అంతరాయం కలుగుతుంది. ఈ ఉద్దేశంతో ముస్సోలినీ, హిట్లర్‌లు ఫ్రాంకోకు ఆర్థిక, సైనిక సహాయం చేశారు.

**9.1.4.3 బ్రిటిష్, ఫ్రెంచి వైఖరి :** స్పానిష్ అంతర్యుద్ధం విషయంలో బ్రిటన్, ఫ్రాన్స్‌లలో ప్రజాభిప్రాయం రెండు విధాలుగా చీలి ఉన్నది. లాయలిస్ట్‌ల స్పెయిన్‌లో కమ్యూనిస్ట్ రాజ్య స్థాపకుడు ప్రయత్నిస్తున్నారని మితవాదుల భావించారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ ఫాసిస్ట్‌లను స్పెయిన్‌లో అధికారానికి రానీయకుండా చేయాలని ఉదారవాద రాజకీయ వేత్తలు పట్టుబట్టారు. కాబట్టి ప్రజాభిప్రాయం బ్రిటన్, ఫ్రాన్స్‌లలో ఒక విధంగా లేదు. బ్రిటన్‌లో అధికారంలో ఉన్న స్టాన్లీ బాల్డ్‌విన్, నెవైల్ ఛాంబర్లిన్, ఫ్రాన్స్‌లో అధికారంలో ఉన్న లియోబ్లమ్, ఎడొరాడ్ డాలడీర్‌లు, నాజీలను, ఫాసిస్ట్‌లను, ప్రతిఘటించకుండా, వారినే విధంగనైనా తృప్తిపరచాలనే మనస్తత్వం గలవారు. స్పెయిన్‌లో జరుగుతున్న యుద్ధం అంతర్యుద్ధంగా భావించి, ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగాగానీ, ఏ వర్గానికి ఎట్లాటి సహాయం చేయకూడదనే సిద్ధాంతాన్ని వారు ప్రతిపాదించారు. ఈ సిద్ధాంతాన్ని నాజీలు, ఫాసిస్ట్‌లు గౌరవిస్తే లాయలిస్ట్‌లకు తప్పని సరగా విజయం లభ్యమయ్యేది. కానీ వారు నేషనలిస్ట్‌లకు అన్నిరకాల సహాయాలని కురిపించారు.

**9.1.4.4 అంతర్యుద్ధంలో సమితిపాత్ర :** స్పెయిన్‌లోని అంతర్యుద్ధాన్ని ఆపడానికి నానాజాతి సమితి ఏ విధమైన చర్యలు తీసుకోలేక పోయింది. 'లాయలిస్ట్'లు అనేకానే విజ్ఞాపనా పత్రాలు పంపుకొన్నా, మరణశయ్యపై ఉన్న నానాజాతి సమితి, స్పెయిన్‌లో విదేశీజోక్యం

11

పనికిరాదనే బ్రిటిష్, ఫ్రెంచి ప్రతిపాదనను సమర్థించి, అంతటితో తన పాత్ర ముగిసిందని భావించి ఊరుకొన్నది. సమితిచేత ఏర్పాటుచేసిన తటస్థ సంఘం స్పెయిన్ అంతర్యుద్ధంలో భాగస్వాములైన రెండు పక్షాల ఆయుధాలు కొనుగోలు చేయడాన్ని నిషేధించింది. దీని ఫలితంగా ప్రభుత్వ పక్షము ఇతర దేశాల నుంచి ఆయుధాలను సేకరించలేకపోయింది. కాని తిరుగబాట్లు వర్గం మాత్రం అక్షరాజ్యాలైన జర్మనీ, ఇటలీల నుంచి ఆయుధాలను సమకూర్చుకోగలిగింది.

**9.1.4.5 అమెరికా విధానము :** స్పెయిన్ అంతర్యుద్ధం విషయంలో బ్రిటన్, ఫ్రెంచివారి విధానాన్నే అమెరికా అనుసరించింది. అంతరంగికంగా ఈ విధానంవల్ల అమెరికన్ ప్రభుత్వం విమర్శకు గురిఅయింది. ఫ్రాంకో అధికారం చేపట్టిన నాలుగు రోజులకే అమెరికా ఫ్రాంకో ప్రభుత్వాన్ని గుర్తించింది. దీనిని బట్టి అమెరికన్ ప్రభుత్వ రంగాలలో వారి మనస్సు స్పానిష్ అంతర్యుద్ధంలో ఏ విధంగా ఉన్నదో అర్థమవుతుంది.

**9.1.4.6 అంతర్యుద్ధం :** 1936లో స్పెయిన్‌లో జనరల్ ఫ్రాంకో నాయకత్వంలోని మితవాద తిరుగుబాటురులకు (నేషలిస్ట్‌లు), ప్రభుత్వ అనుకూలురగు 'లాయలిస్ట్' లకు మధ్య అంతర్యుద్ధం ప్రారంభమయింది. రెండు పక్షాలలోనూ విదేశ సహాయకులు చేరి పోరాడినారు. స్పానిష్ ప్రజలు నిస్సహాయులై తమ దేశంలో చిన్న ఐరోపాయుద్ధం జరుగుతూ ఉండటం చూస్తూ ఊరుకోవలసివచ్చింది. ఫ్రాన్స్ బ్రిటన్‌లు స్పెయిన్ రిపబ్లిక్‌కు సానుభూతి చూపినాయి. చివరకు ఈ యుద్ధం ప్రజాస్వామ్య, కమ్యూనిస్ట్ సిద్ధాంతాల సంఘర్షణగా పరిగణితమైంది. స్పెయిన్‌లో జరిగే అంతర్యుద్ధం అక్కడికే పరిమితం కావాలని, విదేశీయుల జోక్య ఉండకూడదని బ్రిటన్ ప్రకటించింది. ఐరోపా రాజ్యాలు అనేక సమావేశాలు జరిపాయి. కమిటీలను నియమించాయి. కాని ఏమీ లాభంలేకపోయింది. స్పెయిన్‌లోని శతఘ్నులను, విమానాలను, మందుగుండు సామాగ్రిని భారీగా ముస్సోలినీ, హిట్లర్‌లు దొర్లించారు. నేషనలిస్ట్‌లకు సహాయం చేయడానికి ఇటలీ, జర్మనీల నుంచి పెద్ద సంఖ్యలో సాంకేతిక నిపుణులు, వాలెంటీరులు స్పెయిన్‌పై వచ్చిపడ్డారు. సెడ్రిక్ సాల్టర్ అనే ఇంగ్లీషు పాత్రికేయుడు రెండు లక్షలమంది ఇటాలియన్ సైనికులు స్పానిష్ అంతర్యుద్ధంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారని రాశాడు. లాయలిస్ట్‌లకు ఒక రష్యాయే సహాయం అందించింది. కాని రష్యన్ సహాయం అక్షరాజ్యాల వారి సహాయంలో సరితూగదు. పశ్చిమయూరప్ దేశాలనుంచి లాయలిస్ట్‌లకు సహాయంగా కొంతమంది ప్రయివేట్ వాలంటీర్‌లు వెళ్ళారు. 'అబ్రహాంలింకన్ బ్రిగేడ్' కు చెందిన వాలెంటీర్‌లు అమెరికా నుంచి లాయలిస్ట్‌లకు మద్దతుగా స్పెయిన్ చేరుకొన్నారు. కానీ వీరందరి పాత్ర చాలా పరిమితమైనటువంటుది. 1939 నాటికి జనరల్ ఫ్రాంకో పక్షం గెలిచి ఫ్రాంకో స్పెయిన్ రిపబ్లిక్‌ను పడగొట్టి తానే నియంత అయినాడు.

**9.1.4.7 ఫలితాలు :** రెండో ప్రపంచ యుద్ధానికి దారితీయించిన ప్రాబల్యాత్మక రాజకీయాల్లో స్పానిష్ అంతర్యుద్ధానికి ప్రముఖస్థానముంది. 1936లో ప్రారంభమై 1939 మార్చి వరకు సాగిన ఈ అంతర్యుద్ధంలో చివరకు తిరుగుబాటుదారులు విజయం సాధించారు.

1. ఫ్రాంకో విజయంతో యూరప్‌లో అక్షరాజ్యాలవారి బలం పుంజుకొంది.

2. నాజీలను తృప్తిపరచే ఫ్రెంచి-బ్రిటిష్ విధానంవల్ల ఆ రెండు రాజ్యాలు బలహీనపడ్డాయి.

3. స్పానిష్ అంతర్యుద్ధంలో తమ ఆయుధాలను, తమసైనిక ఎత్తుగడలను పరీక్షకు పెట్టడానికి జర్మన్‌లకు, ఇటాలియన్‌లకు అవకాశం దొరికింది.

4. రెండో ప్రపంచ యుద్ధం 1936 జూలై 18-19న స్పెయిన్‌లో ప్రారంభమయిందని కొందరంటారు.

## 9.2 గ్రేట్ బ్రిటన్ - తృప్తిపరిచే విధానము :

**9.2.1 పరిచయం :** మొదటి ప్రపంచ యుద్ధానంతరం కొన్ని ప్రపంచ దేశాలలో నియంతృత్వస్థాపన జరిగింది. జర్మనీలో నాజీ నియంత హిట్లర్, ఇటలీలో ఫాసిస్ట్ నియంత ముస్సోలినీ, స్పెయిన్‌లో ఫ్రాంకో సేనాని, జపాన్‌లో సైనిక నియంతృత్వము ముఖ్యమైనది. బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికాలు ప్రజాస్వామ్య దేశాలు. ప్రజాస్వామ్యానికి, నియంతృత్వానికి మధ్య ఆదర్శాలలో సంఘర్షణ ఏర్పడింది. దీనికితోడు రష్యాలో మొదటి ప్రపంచ యుద్ధకాలంలో, నవంబర్ 1917లో బోల్షివిక్ లేదా కమ్యూనిస్ట్ విప్లవం సంభవించింది. ఈ విప్లవం పెట్టుబడిదారీ రాజ్యాలలోని పరిపాలనకు భయోత్పాతాన్ని కలగజేసింది. మూడో కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్ స్థాపితమైనందువల్ల విప్లవం ఒక్క రష్యా దేశానికి పరిమితమైనది కాదని ప్రపచంలోని ఇతర దేశాలకు కూడా వ్యాప్తి చెందుతుందనే అనుమానం ధృడపడింది. దీంతో రష్యాలో ఏర్పడిన కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కూలదోయడానికి పెట్టుబడిదారీ వ్యవస్థగల అగ్రరాజ్యాల ప్రయత్నించసాగినాయి. వాస్తవంగా రెండు ప్రపంచ యుద్ధాల మధ్య కాలంలో గమనించదగిన ముఖ్యమైన విషయము కమ్యూనిస్టు సిద్ధాంతాలకు, ప్రజాస్వామ్య సిద్ధాంతాలకు సంఘర్షణ ఏర్పడింది. బహిరంగంగా, రహస్యంగా కూడా ఒకరినొకరు నాశనం చేసుకోవడానికి ఇరుపక్షాలవారు ప్రయత్నించారు. అంతర్జాతీయ రాజకీయాలలో తమ పలుకుబడిని ఎక్కువ చేసుకోవడానికి ఇరుపక్షాలు ప్రయత్నించాయి. ఈ క్రమంలో పెట్టుబడి దారీ వ్యవస్థగల బ్రిటన్ సోవియట్ వ్యతిరేక దేశాలపట్ల తృప్తిపరిచే విధానాన్ని అనుసరించింది.

**9.2.2 తృప్తిపరిచే విధానాన్ని బ్రిటన్ అనుసరించడానికి కారణాలు :**

1. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత బ్రిటన్ విదేశాంగ విధానంలో మార్పు వచ్చింది. అందుకు ప్రధాన కారణం కమ్యూనిజం పట్ల, సోవియట్ రష్యాపట్ల బ్రిటన్‌కు భయసందేహాలు కలగడమే. యూరప్‌లోనూ, మధ్యప్రాచ్యంలోను, దూర ప్రాచ్యంలోను ఉభయ దేశాలు ప్రయోజనాలకు సంఘర్షణ కలగడం, కొమింటర్న్ చర్యలు, బ్రిటన్‌లో కమ్యూనిస్ట్ విప్లవం వస్తుందనే భయం మొదలగు కారణాలు, బ్రిటన్ రష్యాపట్ల వ్యతిరేక వైఖరిని అవలంభించడానికి దోహదం చేశాయి. అందువల్ల అన్ని విధాలా సోవియట్ వ్యతిరేక దేశాలకు బ్రిటన్ సహాయం చేయడానికి సిద్ధపడింది. బ్రిటన్‌కు రష్యాపట్లగల భయ సందేహాలను జర్మనీ, ఇటలీ, జపాన్‌లు అవకాశంగా తీసుకొని తమతమ దురాక్రమణ చర్యలను నిరాఘాటంగా, విజయవంతంగా కొనసాగించినాయి.

2. అంతర్జాతీయ రాజకీయాలలో సమఉజ్జీ విధానాన్ని పరిరక్షించడానికి బ్రిటన్ ప్రయత్నించింది. సోవియట్ రష్యాకు వ్యతిరేకంగా బ్రిటన్ జర్మనీని ప్రోత్సహించింది. వర్సే సంధిని, లొకార్నో ఒప్పందాలను ఉల్లంఘించడానికి, ఆస్ట్రియా, చెకొస్లావకియాలను ఆక్రమించడానికి జర్మనీకి బ్రిటన్ పరోక్షంగా ప్రోత్సాహమిచ్చింది. ఈ తృప్తి పరచే విధానంవల్ల జర్మనీ బలపడింది.

3. మొదటి ప్రపంచ యుద్ధానంతరం మిత్రరాజ్యాలు జర్మనీతో చేసుకొన్న వర్సే సంధివల్ల జర్మనీ తన భూభాగాలనేగాక వలసలను కోల్పోయింది. ఆర్థికంగా, సైనికంగా జర్మనీని మిత్రరాజ్యాలు నిరాక్షిణ్యంగా అణచివేయడం జరిగింది. నైతికంగా వర్సే సంధి సమర్ధనీయం కాదు. వర్సేసంధి తమమీద బలవంతంగా రుద్దిన శాంతి అని జర్మన్‌లు వర్ణించినారు. వర్సేసంధి షరతులు జర్మనీకి ప్రతికూలంగా ఉన్నాయనే భావంతో బ్రిటన్ వాటి కాఠిన్యాన్ని సడలించడానికి ప్రయత్నించింది. బ్రిటన్ ప్రధాని చాంబర్లేన్ జర్మనీతో మ్యూనిక్ ఒప్పందాన్ని కుదుర్చుకోవడం, చెకొస్లావకియాను హిట్లర్‌కు పరోక్షంగా అప్పగించడం అందుకు తార్కాణాలు.

4. దూర ప్రాచ్యంలో రష్యా ప్రాబల్యాన్ని అరికట్టడానికి, ఆగ్నేఆసియాలో జపాన్ వ్యాప్తిని నిరోధించడానికి, చైనాలోని స్వప్రయోజనాలను పరిరక్షించుకోవడంలో జపాన్‌పట్ల కూడా తృప్తిపరిచే విధానాన్ని అనుసరించింది. జపాన్ మంచూరియాను ఆక్రమించుకోవడానికి బ్రిటన్ పరోక్ష సహకారమిచ్చింది.

5. అదేవిధంగా ఇటలీ పట్ల కూడా బ్రిటన్ తృప్తిపరచే విధానాన్ని అనుసరించింది. ఇథియోపియాను ఇటలీ ఆక్రమించడాన్ని అంగీకరించింది. బ్రిటన్ అనుసరించిన తృప్తిపరిచే విధానం వల్ల అక్షరాజ్యాలైన జర్మనీ, ఇటలీ, జపాన్‌లు బలపడినాయి.

6. బ్రిటన్ వలెనే ఫ్రాన్స్, అమెరికాలు కూడా జర్మనీ, జపాన్ ఇటలీల పట్ల తృప్తిపరిచే విధానాన్ని అనుసరించినాయి. యూరప్‌లో అమెరికా తన ఆర్థిక ప్రయోజనాలకు దృష్టిలో పెట్టుకొని కమ్యూనిజం వ్యాప్తికి ఆందోళనచెంది జర్మనీ, ఇటలీ, జపాన్‌లపట్ల బ్రిటన్ అనుసరించిన తృప్తిపరిచే విధానాన్ని కొనసాగించింది. ఇటలీ ఇథియోపియాను ఆక్రమించినపుడు ఇథియోపియా రాజా హెయిలీసెల్లాసి అమెరికా అధ్యక్ష్యుడైన రూజ్‌వెల్ట్ సహాయం కోరగా అతడు ఆవివాదాన్ని శాంతయుత పద్ధతుల ద్వారా పరిష్కరించుకోవలసిందని సలహా ఇచ్చినాడు కాని ఇటలీకి వ్యతిరేకంగా ఇథియోపియాకు ఎట్లాంటి సహాయం చేయలేదు. అలాగే చైనామీద జపాన్ దురాక్రమణ జరుపుతున్నపుడు అమెరికా జపాన్ మీద ఎట్లాంటి సమర్థమైన చర్యలను తీసుకోవడానికి నిరాకరించింది.

**9.2.3 తృప్తి పరిచే విధానం :** మొదటి ప్రపంచ యుద్ధానంతరం బ్రిటన్ అనుసరించిన తృప్తి పరిచే విధానాన్ని పరిశీలిద్దాం.

**9.2.3.1 నానాజాతి సమితి నుంచి జర్మనీ ఉపసంహరించుకోవడం :** నాజీ నియంత హిట్లర్‌కు సమితి ఆదర్శాలతో ఏమాత్రం నమ్మకం లేదు. నాజీ విదేశాంగ విధానం విజయానికి సమితిలో జర్మనీ సభ్యత్వం ప్రధాన అవరోధమని హిట్లర్ భావించాడు. 1933 అక్టోబర్‌లో జెనీవా నిరాయుధీకరణ సమావేశంనుంచి విరమించుకొని సమితినుంచి కూడా ఉపసంహరించుకోవలెననే తన కోరికను హిట్లర్ వెల్లడించాడు. మిత్రరాజ్యాలతో సమాన స్థాయిలో గౌరవమర్యాదలను పొందవచ్చుననే ఆశయంతో జర్మనీ సమితిలో సభ్యరాజ్యంగా చేరిందని, కాని సమితి జర్మనీ పట్ల ద్వేషంతో కూడిన వైఖరిని అవలభించి అవమానించినదనీ, అందువల్ల జర్మనీవంటి స్వాభిమానంగల గొప్పదేశానికి సమితిలో సభ్యరాజ్యంగా ఉండడం ఏమాత్రం గౌరవప్రదంకాదని హిట్లర్ ప్రకటించాడు. జర్మనీ అవమానానికి గురిఅయినట్లు వ్యథ చెందడంలో కొంత న్యాయమున్నదని భావించిన పశ్చిమరాజ్యాలు ముఖ్యంగా బ్రిటన్ జర్మనీపట్ల సంతృప్తిపరిచే విధానాన్ని అనుసరించవలసిన అవసరాన్ని గుర్తించాయి. పశ్చిమ రాజ్యాలు, కలగజేసిన ఈ అవకాశాన్ని హిట్లర్ పూర్తిగా ఉపయోగించుకొని సమితిలో జర్మనీ సభ్యత్వాన్ని ఉపసంహరించుకొన్నాడు.

**9.2.3.2. జర్మనీలో నిర్బంధ సైనిక విధానాన్ని ప్రవేశపెట్టుట :** జర్మన్ నియంత హిట్లర్ వర్సేసంధిలోని సైనిక నిబంధలను ఉల్లంఘించి జర్మనీలో నిర్బంద సైనిక విధానాన్ని ప్రవేశపెట్టాడు. ఏ విధమైన పరస్పర సహాయక సంధికి సుముఖుడనుకానని, విమాన బలానికి సంబంధించినంతవరకు జర్మనీకి ఫ్రాన్స్‌తో సమానంగాను, నౌకాబలానికి సంబంధించినంతవరు జర్మనీకి బ్రిటిష్ నౌకాబలంతో 35శాతం బలం ఉండవలెనని హిట్లర్ బ్రిటన్‌కు తెలియబరచినాడు. అంతేగాక ఇతర రాజ్యాలు నిరాయుధీకరణను అమసరించినపుడు మాత్రమే జర్మనీ కూడా నిరాయుధీకరణను అనుసరిస్తుందని హిట్లర్ విశదపరిచాడు. హిట్లర్ వాదనలో బ్రిటన్ దాదాపుగా ఏకీభవించింది. ఈ విధంగా బ్రిటన్ అమసరించిన తృప్తిపరచే విధానంవల్ల హిట్లర్ దౌత్య విజయాన్ని సాధించినాడు.

**9.2.3.3. బ్రిటన్‌తో హిట్లర్ నౌకాసంధి చేసుకోవడం :** హిట్లర్ జర్మనీలో నిర్బంధసైనిక విధానాన్ని ప్రవేశపెట్టినందువల్ల పశ్చిమరాజ్యాల అనుమానాన్ని తొలగించడానికి అంతర్జాతీయ రంగంలో న్యాయమైన శాంతి స్థాపనకు జర్మనీ ఎల్లప్పుడూ దోహదం చేస్తుందని హిట్లర్ ఒక ప్రకటన చేసినాడు. 1935 జూన్‌లో హిట్లర్ ఇంగ్లాండ్‌తో ఒక నౌకాసంధిని చేసుకొన్నాడు. ఈ సంధి ప్రకారం జర్మనీ నౌకాబలాన్ని పెంచుకోవడానికి బ్రిటన్ అంగీకరించింది. జర్మనీ పట్ల బ్రిటన్ అనుసరిస్తున్న సంతృప్తిపరిచే విధానానికి ఈ నౌకా సంధి ప్రబల నిదర్శనము.

**9.2.3.4. రైన్ భూభాగాన్ని హిట్లర్ ఆక్రమించుకోవడం :** ఫ్రాన్స్, సోవియట్ రష్యాల మధ్య 1935లో ఒడంబడిక జరిగిన ఫలితంగా లొకర్నో ఒడంబడికలు రద్దయినాయని, అందువల్ల జర్మనీ ఆ ఒప్పందాలకు కట్టుబడి ఉండవలసిని అవసరం లేదని హిట్లర్ బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీలకు తెలయజేశాడు. సోవియట్ రష్యాలకు ఒడంబడిక చేసుకొన్న 'యూరప్‌లోని పెద్ద మోసగాడు' అని వర్ణించినాడు. 1936 మార్చిలో హిట్లర్ బల ప్రయోగం చేసి రైన్‌లాండ్‌ను ఆక్రమించుకొన్నాడు. జర్మన్ సైన్యాలు రైన్‌లాండ్‌లోకి ప్రవేశించి ఆ ప్రాంతాన్ని ఆక్రమించుకొన్నప్పటికి పశ్చిమ రాజ్యాలు హిట్లర్ చర్యల పట్ల నిర్లిప్త వైఖరిని అవలంభించినాయి. లొకర్నో ఒడంబడికలు రద్దయినట్లు జర్మనీ ప్రకటించిన ఫలితంగా

వర్సేసంధి ప్రవేశపెట్టిన సమిష్టి భద్రతా విధానం ఇంచుమించు భగ్నమయింది. ఈ విధంగా బ్రిటన్, ఫ్రాన్స్‌లు జర్మనీపట్ల సంతృప్తిపరిచే విధానాన్ని అనుసరించడంవల్ల జర్మనీ 1936నుంచి పెద్దఎత్తున దురాక్రమణ విధానం అనుసరించడానికి వీలయింది.

**9.2.3.5 అక్షరాజ్య కూటమి ఏర్పాటు :** 1936లో జర్మనీ జపాన్‌లు కొమిన్‌టర్న్ వ్యతిరేక ఒడంబడిక చేసుకొన్నాయి. ఈ సంధి ప్రకారం కమ్యూనిస్ట్‌ల చర్యలకు సంబంధించిన వివరాలను రెండు దేశాలు పరస్పరం తెలియజేసుకోవడానికే గాక కమ్యూనిస్ట్‌ల మీద కొన్ని చర్యలు తీసుకోవడానికి కూడా పరస్పరం సమకరించుకోవడానికి అంగీకరించాయి. సోవియట్ రష్యాతో ఏవిధమైన సంధి చేసుకోకుండా ఉండడానికి కూడా ఇరుపక్షాలు అంగీకరించినాయి. ఇథియోపియా సంక్షోభం, స్పెయిన్ అంతర్యుద్ధం వల్ల ఇటలీ జర్మనీల మధ్య సంబంధాలు అభివృద్ధి చెందాయి. ఫలితంగా 1937లో ఇటలీ కొమిన్‌టర్న్ వ్యతిరేక ఒడంబడికలో చేరింది. దీంతో రోమ్ బెర్లిన్-టోక్యో అక్షము అమలులోకి వచ్చింది. కొమిన్‌టర్న్ వ్యతిరేక ఒప్పందము రష్యాకు వ్యతిరేకంగా జరిగినటువంటి సంధి. ఈ సంధి ప్రచారానికి బాగా ఉపయోగపడింది. ఈ కమ్యూనిస్ట్ వ్యతిరేక ఒడంబడిక పట్ల పశ్చిమరాజ్యాలు సంతృప్తి ప్రకటించాయి. ఈ విధంగా బ్రిటన్, ఫ్రాన్స్‌లు అనుసరించిన సంతృప్తి పరిచే విధానం వల్ల హిట్లర్ అధికారం లోనికి వచ్చిన తరువాత నాలుగ సంవత్సరాల కాలంలో గణనీయమైన విజయాలను సాధించి జర్మన్ మూడో సామ్రాజ్యాన్ని పటిష్ఠం చేసినాడు.

**9.2.3.6 స్పానిష్ అంతర్యుద్ధం :** స్పెయిన్‌లో 1936లోల అతివాదులకు, మితవాదులకు మధ్య అంతర్యుద్ధం ప్రారంభమైంది. జర్మనీ, ఇటలీలు మితవాదులకు మద్దతుఇవ్వగా, సోవియట్ రష్యా అతివాదులకు మద్దతు ఇచ్చింది. ఈ అంతర్యుద్ధంలో బ్రిటన్, ఫ్రాన్స్‌లు జర్మనీ, ఇటలీలను తృప్తిపరచే విధానం అవలంబించాయి. బ్రిటన్‌లో అధికారంలో వున్న స్టాన్లీ బాల్డ్‌విన్, నెవైల్ ఛాంబర్లిన్, ఫ్రాన్స్‌లో అధికారంలో ఉన్న లియాబ్లమ్, ఎడ్వాడలడియా నాజీలను, ఫాసిస్ట్‌లను ప్రతిఘటించకుండా, వారినేవిధంగానైనా తృప్తి పరచాలనే మనస్తత్వం గలవారు. స్పెయిన్‌లో జరుగుతున్న యుద్ధం అంతర్యుద్ధంగా భావించి, ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ ఏ వర్గానికి ఎట్లాంటి సహాయం చేయకూడదనే సిద్ధాంతాన్ని వారు ప్రతిపాదించారు. నానాజాతి సమితి కూడా బ్రిటన్, ఫ్రెంచి ప్రతిపాదనను సమర్థించింది. ఈ ప్రతిపాదనవల్ల ప్రభుత్వ పక్షమైన అతివాదులకు విదేశాలనుంచి సహాయం ఆగిపోగా, ఇటలీ, జర్మనీలు రహస్యంగా మితవాదులకు ఆర్థిక, సైనిక సహాయం చేసాయి. ఫలితంగా మితవాదులు విజయం సాధించి జనరల్ ఫ్రాంకో స్పెయిన్ నియంత అయినాడు. ఈ అంతర్యుద్ధంవల్ల అక్షరాజ్యాల సంఘీభావం దృఢమైతే, జర్మనీ, ఇటలీలను తృప్తిపరిచే విధానంవల్ల ఫ్రెంచి, బ్రిటిష్ పరిస్థితి బలహీనమైంది.

**9.2.3.7 ఆస్ట్రియా జర్మనీల కలయిక :** 1938లో హిట్లర్ ఆస్ట్రియాలో సంక్షోభం కలిగించి అక్కడ ఛాన్స్‌లర్ డాల్ఫస్‌ను హత్యచేయించి చివరికి ఆస్ట్రియాను జర్మనీలో కలుపుకొన్నాడు. ఈ కలయికనే ఆన్లలస్ అని అంటారు. ఆస్ట్రియా జర్మనీ కలయికవల్ల పశ్చిమరాజ్యాలు అనుసరిస్తున్న సోవియట్ వ్యతిరేక విధానానికి బలం చేకూరినట్లుగాను, స్వయం నిర్ణయం సిద్ధాంతం విజయం పొందినట్లుగాను ఇంగ్లండ్ భావించింది. హిట్లర్ దురాక్రమణ చర్యలవల్ల భీతిచెందిన సోవియట్ రష్యా జర్మనీక వ్యతిరేకంగా పశ్చిమరాజ్యాలు ఉమ్మడిగా పటిష్ఠమైన రాజ్యాల నుంచి ఏ విధమైన ప్రోత్సాహం లభించలేదు.

**9.2.3.8 మ్యూనిక్ ఒప్పందము :** ఆస్ట్రియాను ఆక్రమించుకొన్న తరువాత హిట్లర్ దృష్టి చెకొస్లొవాకియా వైపు మళ్ళింది. చెకొస్లొవాకియాలో సుమారు నాలుగు మిలియన్‌ల సుడెటెన్ జర్మన్‌లు అనే జర్మన్ జాతి ప్రజలు ఉన్నారు. హిట్లర్ సహాయ సహకారాలు పొందిన సుడెటెన్ జర్మన్‌లు పూర్తి స్వయం పరిపాలనాధికారిన్ని కోరినారు. సుడెటెన్ జర్మన్‌లు స్వయం పాలనను కోరడం న్యాయమని, సమంజసమని హిట్లర్ పశ్చిమ రాజ్యాలను ఒప్పించడానికి ప్రయత్నించాడు. జర్మనీలో చెకొస్లొవాకియాకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయం తీవ్రరూపంలో వ్యక్తంచేయడం జరిగింది. బ్రిటిష్ ప్రధాని ఛాంబర్లేన్ హిట్లర్‌ను కలుసుకొని చెకొస్లొవాకియా సంక్షోభాన్ని జర్మనీలో కలిపే సమస్యను బ్రిటన్ సానుభూతిలో పరిశీలిస్తుందని ఛాంబర్లేన్ సంతృప్తి పరిచాడు. తిరుగుబాటుచేసి స్వయం పాలనను కోరవలసిందిగా స్లావక్‌లను హిట్లర్ ప్రేరేపించినాడు ఈ పరిస్థితుల్లో బ్రిటన్, ఫ్రాన్స్‌లు సుడెటెన్‌లాండ్‌ను జర్మనీకివ్వవలసిందిగా చెకొస్లొవాకియాకు సలహా ఇచ్చాయి. దీనిని

చెక్ ప్రభుత్వం అంగీకరించింది. సుడెటన్‌లాండ్‌లో కొంతభాగం అక్టోబరు ఒకటో తేదికి ముందుగాను, మిగిలిన భాగం అక్టోబర్ పదోతేదికి ముందుగాను జర్మనీకి బదిలీ చేయడం జరుగుతుందని బ్రిటన్, ఫ్రాన్స్‌లు హిట్లర్‌కు తెలియజేసినాయి. ఈ ప్రతిపాదనను అంగీకరించిన హిట్లర్ బ్రిటీష్ ప్రధాని ఛాంబర్లేన్‌ను, ఫ్రెంచి ప్రధాని డలడేర్‌లను మ్యూనిక్‌ను ఆహ్వానించాడు.

1938లో మ్యూనిక్ సమావేశంలో ఒక ఒడంబడిక మీద బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీలు సంతకాలు చేసినాయి. ఈ ఒడంబడిక ప్రకారం సుడెటన్‌లాండ్ జర్మనీకి ఇవ్వడానికి, చెకొస్లావాకియా భద్రత విషయమై అంతర్జాతీయ హామీకి బ్రిటన్, ఫ్రాన్స్‌లు అంగీకరించాయి. బ్రిటన్, ఫ్రాన్స్‌లు జర్మనీ పట్ల అనుసరించిన సంతృప్తి పరిచే విధానానికి మ్యూనిక్ ఒడంబడిక ఒక ప్రబల నిదర్శనము. యుద్ధాన్ని వాయిదా వేయడానికి ఈ విధానం అనుసరించక తప్పదని సంతృప్తిపరిచే విధానాన్ని సమర్థించేవారు వాదించారు. ఒక వేళ యుద్ధం అనివార్యమైతే ఈ విధానంవల్ల పశ్చిమరాజ్యాలకు యుద్ధ ప్రయత్నాలు సాధించారు. కాని నిజానికి పశ్చిమరాజ్యాలు అనుసరించిన సంతృప్తి పరిచే విధానం హిట్లర్ ముస్సోలినీల దురాక్రమణ చర్యలకు దోహదం చేసింది. అంతేగాక కొమిన్‌టర్న్ వ్యతిరేక ఒడంబడికను తయారు చేసిన జర్మనీ కమ్యూనిజంను నిరోధిస్తుంది. కాబట్టి జర్మనీకి సంతృప్తి పరచవలసిన అవసరముందని కూడా పశ్చిమరాజ్యాలు భావించాయి. మ్యూనిక్ ఒడంబడికను పురస్కరించుకొని జర్మన్ సైన్యాలు 1938 అక్టోబర్‌లో సుడెటన్‌లాండ్‌లోకి ప్రవేశించినాయి.

**9.2.3.9 : చెకొస్లావాకియా మీద జర్మన్ దాడి :** మ్యూనిక్ ఒడంబడిక ఫలితంగా హిట్లర్, ముస్సోలినీల రాజ్యవిస్తరణ కాంక్ష అధికం కావడమేగాక వారి దురాక్రమణ వైఖరి కూడా మరింత బలపడింది. 1939 మార్చిలో హిట్లర్ దాడి జరిపి చెకొస్లావాకియాను ఆక్రమించాడు. జర్మనీ చెకొస్లావాకియా మీద జరపడం జరిగినప్పటికీ పశ్చిమరాజ్యాలు తటస్థంగా ఉండి పోయినాయి. చెకొస్లావాకియా మీద జర్మన్ దురాక్రమణ ఫలితంగా ఇంతవరకు జర్మనీ పట్ల సంతృప్తి పరిచే విధానాన్ని అనుసరిస్తున్న బ్రిటన్‌కు తన విధానాన్ని మార్చుకోవలసిన అగత్యము ఏర్పడినట్లు గుర్తించింది. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత నుంచి బ్రిటన్ అనుసరించిన విధానము పెద్దగా దెబ్బతిన్నది. బ్రిటిష్ ప్రధాని ఛాంబర్లేన్ మోసగాడని, దురాక్రమణ దారుడని బహిరంగంగా విమర్శించాడు. జర్మన్ దురాక్రమణకు వ్యతిరేకంగా పటిష్టమైన చర్యలు తీసుకోవలసిందని చర్చిల్ నాయకత్వంలోని బ్రిటిష్ కన్సర్వేటివ్ పార్టీ ప్రభుత్వాన్ని కోరింది. జర్మన్ దురాక్రమణను అరికట్టడానికి ఫ్రాన్స్, పోలండ్, రష్యాలతో కలిసి సంయుక్త చర్యలు తీసుకోవడానికి ఛాంబర్లేన్ అంగీకరించాడు.

చెకొస్లావాకియాను ఆక్రమించుకొన్న తరువాత హిట్లర్ సోవియట్ రష్యాతో 1939లో దురాక్రమణ వ్యతిరేక ఒప్పందం చేసుకొని పోలండుపై దాడికి నిశ్చయించాడు. పోలండ్ మీద జర్మనీ దురాక్రమణ జరిపినట్లయితే తనశక్తినంతా ఉపయోగించి పోలండ్‌ను కాపాడవలసి వస్తుందని బ్రిటన్ హిట్లర్‌ను హెచ్చరించింది. బ్రిటిష్ హెచ్చరికను లెక్కచేయక హిట్లర్ జర్మన్ సైన్యాలను పోలండుపైకి సెప్టెంబర్ ఒకటో తేదీన పోలండ్‌పైకి దండయాత్రకు పంపినాడు. దీనితో రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది.

**9.2.3.10. జపాన్ మంచూరియా ఆక్రమణ :** జపాన్ మంచూరియా మీద 1931 సెప్టెంబర్ లో దండయాత్ర ప్రారంభించి 1932 నాటికి పూర్తిగా తన ఆధీనంలోనికి తెచ్చుకొని మంచూరియాను మచూకో అనే కొత్త స్వతంత్ర్య రాజ్యంగా ప్రకటించింది. హెన్రీ పూయీ మచుకో రాజ ప్రతినిధి అయినాడు. అమెరికాతో సహా పాశ్చాత్య రాజ్యాలన్నీ ఆ కాలంలో ఏర్పడిన ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కోవడంలో నిమగ్నమై ఉండడంవల్ల జపాన్ సామ్రాజ్య తత్వ విధానాన్ని అరికట్టలేక పోయినాయి. అమెరికా మాత్రం జపాన్ తీసుకొన్న ఈ చర్య వాషింగ్టన్ సమావేశంలో జరిగిన తొమ్మిది రాజ్యాల ఒడంబడికకు, కెల్లాగ్ - బ్రియాండ్ ఒప్పందానికి విరుద్ధమని భావించింది. అంతర్జాతీయ సూత్రాలకు విరుద్ధమయిన జపాన్ మంచూరియా ఆక్రమణ వంటి చర్యలకు అమెరికా గుర్తించదని అమెరికా విదేశాంగ శాఖ కార్యదర్శి స్టింసన్ స్పష్టంగా. దీనిని సమర్థించవలసిందని అమెరికా బ్రిటన్ ఫ్రాన్స్‌లకు కూడా కోరింది. కాని దూరప్రాచ్యంలో తనకు గల ప్రయోజనాల దృష్ట్యా బ్రిటన్ అమెరికా అభ్యర్థనను మన్నించలేదు. అందువల్ల మంచూరియా విషయంలో బ్రిటన్, అమెరికాల మధ్య కలిగిన స్పర్థల కారణంగా నానాజాతి సమితి జపాన్ మీద ఎట్లాంటి చర్యతీసుకోలేక పోయింది.

**9.2.3.11 ఇటలీ ఇథియోపియా ఆక్రమణ :** నాజీ జర్మనీవల్ల భీతి చెందిన బ్రిటన్, ఫ్రాన్స్‌లు ఇటలీని సంతృప్తి పరిచే విధానాన్ని అనుసరించారు. బ్రిటన్, ఫ్రాన్స్‌లు అనుసరించిన సంతృప్తిపరిచే విధానంవల్ల ఇటలీ ధైర్యంగా ఇథియోపియాను 1935లో బలప్రయోగం చేసి ఆక్రమించుకొన్నది. దీనివల్ల ఆస్ట్రియా మీద దురాక్రమణ జరపడానికి హిట్లర్‌కు స్వేచ్ఛ లభించింది. ఇటలీ ఇథియోపియా ఆక్రమణవల్ల నానాజాతి సమితి బలహీన పడటమేగాక యూరప్‌లో ఫాసిజమ్ బలపడింది.

**9.2.3.12. సారాంశము :** మొదటి ప్రపంచ యుద్ధానంతరం బ్రిటన్ అనుసరించిన సంతృప్తి పరిచే విధానం వల్ల అక్షరాజ్యాలు బలపడినాయి. కమ్యూనిజం పట్ల భీతి చెందిన బ్రిటన్ అంతర్జాతీయ రాజకీయాలలో సోవియట్ రష్యా పట్ల వ్యతిరేక వైఖరిని అవలంబించింది. అంతేగాక బ్రిటన్ సోవియట్ వ్యతిరేక దేశాలకు సహాయం చేసింది. సోవియట్ రష్యాకు వ్యతిరేకంగా జర్మనీని ప్రోత్సహించింది వర్సైనందివి. లొకర్నో ఒప్పందాలను ఉల్లంఘించడానికి, ఆస్ట్రియా, చెకొస్లావాకియాలను ఆక్రమించడానికి బ్రిటన్ పరోక్షంగా జర్మనీకి ప్రోత్సాహమిచ్చింది. ఇటలీ ఇథియోపియా ఆక్రమణను కూడా బ్రిటన్ అంగీకరించింది. అలాగే జపాన్ మంచూరియాను ఆక్రమించడానికి పరోక్షసహకారమిచ్చింది. ఈ తృప్తి పరిచే విధానం వల్ల అక్షరాజ్యాలు బలపడి, ధైర్యంగా దురాక్రమణ విధానం కొనసాగించాయి. దాని ఫలితమే రెండో ప్రపంచ యుద్ధము.

డా॥ వి.కె. మోహన్

## పాఠం - 10

# సామ్రాజ్య తత్త్వదేశంగా జపాన్ అవతరణ

**లక్ష్యం :** జపాన్ సామ్రాజ్యతత్త్వ విధానం, మంచూరియా సంక్షోభం, చైనామీద దాడి, ఇండోచైనాలోకి విస్తరణ మొదలగు విషయాలను గురించి వివరించడమే ఈ పాఠం ముఖ్యలక్ష్యం.

**విషయక్రమం :**


**10.1. పరిచయం**

**10.2. జపాన్ సామ్రాజ్యతత్త్వ విధానము**

10.2.1 చైనా-జపాన్ యుద్ధం

10.2.2 ఆంగ్లో-జపాన్ ఒప్పందం

10.2.3 రష్యా-జపాన్ యుద్ధం

10.2.4 చైనా-జపాన్ సంధి

10.2.5 కొరియా ఆక్రమణ

10.2.6 మొదటి ప్రపంచ యుద్ధం

10.2.7 పారిస్ శాంతిసమావేశం

10.2.8 వాషింగ్టన్ సమావేశం

10.2.8.1 నాల్గు రాజ్యాల సంధి

10.2.8.2 ఐదు రాజ్యాల సంధి

10.2.8.3 ఆరు రాజ్యాల సంధి

10.2.8.4 తొమ్మిది రాజ్యాల సంధి

10.2.8.5 చైనా-జపాన్ సంధి

**10.3 జపాన్ విదేశాంగ విధానము (1922 - 1931)**

10.3.1 రష్యా - జపాన్ సంబంధాలు

10.3.2 చైనా - జపాన్ సంబంధాలు - షిదేహారా విధానము

10.3.3 తనాకా విధానము

10.3.4 నానా జాతి సమితిలో జపాన్ పాత్ర

10.3.5 శక్తివంతమైన నౌకాబలరాజ్యంగా జపాన్ రూపొందడం

**10.4 మంచూరియా సంక్షోభం**

10.4.1 చైనా - జపాన్ ఒడంబడిక (1915)

10.4.2 వాషింగ్టన్ సమావేశం

10.4.3 రష్యా - చైనాల మధ్య సంఘర్షణ (1929)

10.4.4 మంచూరియామీద జపాన్ దాడికి కారణాలు

10.4.5. మంచూరియా మీద జపాన్ దండయాత్ర

10.4.6 నానాజాతి సమితి పాత్ర

10.4.7 స్టింసన్ సిద్ధాంతం

10.4.8 మంచూకో అవతరణ

10.4.9 మంచూరియా ఆక్రమణ ఫలితాలు

10.5 చైనామీద జపాన్ దురాక్రమణ

10.5.1 కోమిన్ టర్న్ వ్యతిరేక ఒప్పందం

10.5.2 చైనా - జపాన్ రెండో యుద్ధం

10.5.3 జపాన్ విజయానికి కారణాలు

10.5.4 కీలుబొమ్మ ప్రభుత్వం ఏర్పాటు

## 10.1. పరిచయం :

దూరప్రాచ్యంలో చైనా, జపాన్‌లు అత్యంత ప్రముఖదేశాలు. జపాన్ అనేక చిన్నద్వీపాల సమూహము. దాని విస్తీర్ణము సుమారు 142,000 చదరపు మైళ్లు. 1853 లో అమెరికాకు చెందిన కమొడోర్ పెర్రీ యుద్ధనౌకలతో జపాన్ రేవులలోకి ప్రవేశించడంతో జపాన్ తన ఏకాంత విధానాన్ని విడనాడి పాశ్చాత్య దేశాలతో సంబంధాలను పెంపొందించుకోవడం మొదలు పెట్టింది. ఫలితంగా ప్రజా జీవితంలోను, ప్రభుత్వ రంగంలోను, సాంఘిక, ఆర్థిక వ్యవస్థలోను, సాంస్కృతిక రంగంలోను, ప్రపంచదేశాల పట్ల దాని దృక్పథంలోను అనేక మార్పులు వచ్చినాయి. 1867లో 'మెయిజీ' (ప్రాజ్ఞప్రభుత్వ) పునస్సంస్థాపన జరిగింది. దీని ముఖ్య ఉద్దేశాలు 1. జపాన్‌ను శక్తిమంతమైన రాజ్యంగా రూపొందించడం, 2. పాశ్చాత్య దురాక్రమణ దారులనుంచి జపాన్ స్వాతంత్ర్యాన్ని పరిరక్షించుకోవడం, 3. తూర్పు ఆసియా రాజకీయాలలో ప్రముఖ పాత్రను నిర్వహించడం. వీటి సాధనకోసం జపాన్ పాశ్చాత్య పద్ధతులను అనుసరించింది. మొదట పాశ్చాత్యుల సైనిక వ్యవస్థను జపాన్‌లో ప్రవేశపెట్టి పటిష్ఠమైన సైన్యాన్ని, నౌకాదళాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. పాశ్చాత్య దేశాలనుంచి నమూనాలను, యంత్రాలను దిగుమతి చేసుకొని పారిశ్రామికాభివృద్ధికి కృషి చేయడం జరిగింది. దీనివల్ల జపాన్‌లో అధునాతనమైన బాంకింగ్ పద్ధతిని, కరెన్సీని ప్రవేశపెట్టడం జరిగింది. రైల్వేలను, వాణిజ్య నౌకలను నిర్మించినారు. జపాన్‌వారు పాశ్చాత్య నిపుణుల సహాయంతో అన్ని రంగాలలోను మంచి శిక్షణ పొందినారు. దీనికితోడు జపాన్‌లో షింటో మత పునరుద్ధరణ జరగడం వల్ల ప్రజలలో దేశభక్తి, జాతీయత, చక్రవర్తి పట్ల విశ్వాసం పెంపొందినాయి. ఈ పద్ధతులను అవలంభించటం వల్ల జపాన్ పాశ్చాత్య దేశంవలె రూపొందింది.

మెయిజీ యుగంలో జపాన్ పాశ్చాత్య రాజ్యాల శాస్త్ర విజ్ఞానాన్ని, సాంకేతిక పరిజ్ఞానాన్ని త్వరితంగా గ్రహించి ఒక అగ్రరాజ్యంగా అవతరించింది. మొదటి ప్రపంచయుద్ధానంతరం యూరప్‌లోని జర్మనీ, ఇటలీ దేశాలవలె దూర ప్రాచ్యంలో జపాన్ నియంతృత్వ విధానాలను అనుసరించింది. మంచూరియాను ఆక్రమించి చైనాలో, ఇండోచైనాలో జపాన్ దాడులు ప్రారంభించింది. రెండో ప్రపంచయుద్ధంలో జపాన్ మిత్రరాజ్యాల మీద యుద్ధాన్ని ప్రకటించి దూర ప్రాచ్యంలో చాలా బలమైన శక్తిగా రూపొందింది. చైనా, బర్మాల మధ్యగల ప్రాంతాలన్నింటిని జయించింది. తన కూటమిలోని జర్మనీ, ఇటలీలు పతనమైన తరవాత కూడా జపాన్ ఏకాకిగా నిలిచి మిత్రమండలి రాజ్యాలకు వ్యతిరేకంగా పోరాడింది. ఇది జపాన్ దేశస్థుల జాతీయతకు తార్కాణము.

## 10.2. జపాన్ సామ్రాజ్య తత్త్వ విధానము :

మెయిజీ పునస్సంస్థాపన జరిగిన తరవాత అనతికాలానికే జపాన్ సామ్రాజ్యతత్త్వ ధోరణిని అవలంభించింది. మొదట జపాన్ 1874 లో రియుకియు దీవులు తనకు చెందవలెనని ప్రకటించింది. 1878 లో జపాన్ బోనిన్ దీవులను ఆక్రమించింది. ఆతరవాత జపాన్ చైనాతో, రష్యాతో యుద్ధాలు చేసింది.

**10.2.1. చైనా జపాన్ యుద్ధం :** కొరియా విషయమై చైనా జపాన్‌ల మధ్య 1894-95 సంవత్సరాలలో యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో జపాన్ విజయం సాధించింది. యుద్ధం తరవాత 1895 లో జరిగిన 'షిమొనోసెకి' సంధి ప్రకారం జపాన్‌కు పెస్కెడోర్స్ దీవులు, ఫార్మోజా, లియొటుంగ్ ద్వీపకల్పాలు లభించాయి. జపాన్‌కు చైనా యుద్ధ పరిహారాన్ని చెల్లించడానికి అంగీకరించింది. కొరియా స్వాతంత్ర్యానికి చైనా అంగీకరించింది. ఈ యుద్ధం చైనా, జపాన్‌ల బలాబలాలను ప్రపంచానికి బహిర్గతం చేయడమేగాక, దూరప్రాచ్య రాజకీయాలలో కొత్త పరిణామాలకు దారితీసింది. పాశ్చాత్య సామ్రాజ్యవాదుల చేతిలోనే గాక జపాన్ చేతిలో కూడా చైనా ఓడిపోయింది. జపాన్ పాశ్చాత్య పద్ధతులను అనుసరించి చైనామీద విజయం సాధించడమేగాక, తరవాత అనేక పద్ధతులను ఉపయోగించి పాశ్చాత్య రాజ్యాలతో పోటీపడింది. ప్రపంచ రాజకీయాలలో తమతోబాటుగా జపాన్‌కూడా దూరప్రాచ్యంలో ప్రముఖస్థానం ఆక్రమిస్తున్నదని పాశ్చాత్య రాజ్యాలు గుర్తించాయి. జపాన్ ప్రాబల్యానికి రష్యా ఆందోళన చెందసాగింది. 1898 లో లియోటుంగ్ ద్వీపకల్పాన్ని రష్యా జపాన్ చైనాకు తిరిగి ఇప్పించి, ఆ ప్రాంతాన్ని తాను కౌలుకు సంపాదించింది.

**10.2.2. ఆంగ్లో - జపాన్ ఒప్పందము :** చైనా, జపాన్ యుద్ధానంతరం 1902 జనవరిలో ఆంగ్లో-జపాన్ ఒప్పందం జరిగింది. ఈ సంధి ప్రకారం 1. దూరప్రాచ్యంలో యథాస్థితిని కొనసాగించి, చైనా, జపాన్‌ల స్వాతంత్ర్యాన్ని, ప్రాదేశిక సమగ్రతను కాపాడటం వల్ల ఆ ప్రాంతంలో శాంతిని పరిరక్షించడం, 2. బ్రిటన్, జపాన్‌లు చైనా, కొరియాలలో తమతమ ప్రత్యేక ప్రయోజనాలను గుర్తించినాయి 3. పరస్పర ప్రయోజనాలను పరిరక్షించుకోవడానికి తమకుగల హక్కులను ఉభయదేశాలు గుర్తించాయి 4. బ్రిటన్, జపాన్‌లలో ఏ ఒక్కదేశమైనా తన ప్రయోజనాలను రక్షించుకోవడానికి మూడోదేశంతో యుద్ధం చేయవలసివస్తే, రెండో దేశము తాటస్థ్యాన్ని వహించాలి. 5. ఈ ఒప్పందం కాలపరిమితి 5 సంవత్సరాలు.

పాశ్చాత్య రాజ్యాలలో అతిశక్తివంతమైన ఇంగ్లండ్‌తో సంధిచేసుకోవడం జపాన్ చరిత్రలో ఒక ముఖ్య సంఘటనగా పరిగణించవచ్చు. ఈ ఒప్పందం ఆధునిక ప్రపంచ చరిత్రలో అపూర్వము. ఎందువల్లనంటే పాశ్చాత్య ప్రాచ్యరాజ్యాలు సమాన హోదాలో ఈ సంధిని చేసుకోవడం జరిగింది. ఈ సంధి వల్ల తన ప్రయోజనాలను కాపాడుకోవడానికి ముఖ్యంగా రష్యా ప్రాబల్యంనుంచి, జపాన్‌కు అవకాశం కలిగింది. బ్రిటిష్ వారు కూడా చైనాలో రష్యా ప్రాబల్యాన్ని తగ్గించడానికి జపాన్‌తో సంధిచేసుకొన్నారు.

ఈ సంధి జరిగిన తరవాత రష్యా తన సంబంధాలను చైనాతో మెరుగుపరచుకోవడానికి సంకల్పించింది. 1902 లో రష్యా, చైనాల మధ్య ఒక ఒడంబడిక జరిగింది. దీని ప్రకారం మంచూరియా నుంచి రష్యా 18 నెలలలో వైదొలగవలె. మంచూరియా పూర్తిగా చైనా ఆధీనంలో ఉండడానికి రష్యా అంగీకరించింది.

**10.2.3. రష్యా - జపాన్ యుద్ధము :** మంచూరియాలో రష్యా ప్రత్యేక ప్రయోజనాలను గుర్తిస్తానని, కొరియా విషయంలో రష్యా జోక్యం కలగజేసుకోరాదని జపాన్ ప్రకటించింది. కాని కొరియాలో జపాన్ సైనిక స్థావరాలను ఏర్పరచడానికి వీలు లేదని, కొరియాలో జపాన్ పారిశ్రామిక, వాణిజ్య ప్రయోజనాలను మాత్రమే గుర్తిస్తానని రష్యా పేర్కొన్నది. దీనిలో రెండు దేశాలమధ్య సంబంధాలు క్షీణించినాయి. రెండు దేశాలమధ్య 1904 ఫిబ్రవరిలో యుద్ధం మొదలయింది. జపాన్ సైన్యాలు కొరియాను ఆక్రమించాయి. జపాన్ కొరియా చక్రవర్తితో సంధిచేసుకొన్నది. పోర్ట్ ఆర్థర్ రేవును జపాన్ వశం చేసుకొని ముక్డెన్ వరకు రష్యా సైన్యాలను పారదోలింది. అమెరికా కృషి ఫలితంగా యుద్ధ విరమణ చేయడానికి ఇరుపక్షాలు అంగీకరించాయి. రెండు దేశాలమధ్య 1905 సెప్టెంబర్‌లో పోర్ట్స్‌మువుతో సంధి జరిగింది. ఈ సంధి

ప్రకారం 1. కొరియాలో జపాన్ సర్వసత్తాక రాజకీయ, సైనిక ఆర్థిక ప్రయోజనాలను రష్యా గుర్తించింది. 2. మంచూరియా రైల్వే దక్షిణ భాగాన్ని జపాన్ రష్యా స్వాధీన పరచవలె 3. ఆయోటుంగ్ ద్వీప కల్పంలోని రష్యాకు గల హక్కులన్నింటిని జపాన్‌కు బదిలీ చేయవలె. 4. సఖాలిన్ ద్వీపంలోని దక్షిణ ప్రాంతాన్ని జపాన్‌కు రష్యా దత్తత చేయవలె. 5. మంచూరియా నుంచి, రష్యా, జపాన్‌లు తమ సైన్యాలను ఉపసంహరించుకోవలె. కాని అక్కడ రైల్వే రక్షక దళాలను రెండు దేశాలు నిలుపుకోవచ్చు. 6. అన్ని దేశాలకు చైనా మంచూరియాలో సమానవకాశాలను కల్పించదలచుకొన్నపుడు, రష్యా జపాన్‌లు దానికి అభ్యంతరం చెప్పకూడదు. 7. మంచూరియాలో ఉన్న రైల్వేలను ఉభయ దేశాలు వాణిజ్య పారిశ్రామిక అవసరాలకే వినియోగించవలెను కాని సైనికావసరాలకు ఉపయోగించ కూడదు.

ఈ యుద్ధంవల్ల జపాన్ కొరియాలో తన ప్రాబల్యాన్ని పూర్తిగా వృద్ధి చేసుకొన్నది. రష్యాకు ఉత్తర మంచూరియాలో మాత్రం స్థానం మిగిలింది. జపాన్ చేతిలో రష్యా ఓడిపోవడం వల్ల అంతవరకు పాశ్చాత్య రాజ్యాల శక్తి పట్ల తూర్పు దేశాలకున్న భయం తొలగిపోయింది. దీనివల్ల వలస రాజ్యాలలోని జాతీయోద్యమాలకు ప్రోత్సాహం కలిగింది.

**10.2.4. చైనా జపాన్ సంధి :** 1905 లో జరిగిన పోర్ట్స్ మవుత్ సంధిప్రకారం, రష్యా దక్షిణ మంచూరియాలో ఉన్న తన ప్రాంతాలను రైల్వేలను జపాన్‌కు బదిలీ చేయవలెననే షరతుకు చైనా ఆమోదించవలసి ఉన్నది. జపాన్, చైనా విదేశాంగ మంత్రులు కొమూర, యువాన్‌షికైలు సంప్రదింపులు జరిపి 1905 డిసెంబర్‌లో పీకింగ్ సంధిచేసుకొన్నారు. ఈ సంధి ప్రకారం జపాన్‌కు చైనా ఆమోదముద్ర లభించింది. ఇరుపక్షాలకు జరిగిన మరొక సంధిప్రకారం మంచూరియాలోని 16 నగరాలలో అంతర్జాతీయ వ్యాపారానికి, నివాసాలకు చైనా అనుమతి లభించింది.

రష్యానుంచి తాను సంపాదించిన రైల్వేను, ఇతర ఆస్తులను నిర్వహించడానికి దక్షిణ మంచూరియా రైల్వే కంపెనీని జపాన్ ఏర్పాటుచేసింది. మంచూరియాలోకి జపాన్ క్రమంగా చొచ్చుకొని పోవడానికి ఈ కంపెనీ ఎంతగానో తోడ్పడింది. 1905 లోనే జపాన్-ఫ్రాన్స్‌ల మధ్య, రష్యా-జపాన్‌ల మధ్య ఒడంబడికలు జరిగాయి. రష్యా-జపాన్ ఒడంబడిక ప్రకారం మంచూరియాను ఉత్తర మంచూరియా, దక్షిణ మంచూరియా అనే రెండు ప్రాంతాలుగా రష్యా, జపాన్‌లు విభజించుకొన్నాయి. 1908 లో అమెరికా - జపాన్‌లు కుదుర్చుకొన్న ఒక సంధి ప్రకారం అమెరికా, కొరియా, మంచూరియాలలో జపాన్ ప్రత్యేక ప్రతిపత్తిని గుర్తించింది.

**10.2.5. కొరియా ఆక్రమణ :** జపాన్ రక్షిత ప్రాంతమైన కొరియా 1907లో హేగ్‌శాంతి, సమావేశంలో పాల్గొని జపాన్ ఆధిపత్యం నుంచి విముక్తం కావడానికి ప్రయత్నించింది. కొరియాలోని వ్యవసాయక ఉత్పత్తుల మీద ఆధారపడిన జపాన్ కొరియా చర్యకు ఆగ్రహం చెంది, కొరియ చక్రవర్తిని పదవీ భ్రష్టుని చేసి అతని కుమారుని చక్రవర్తిగా ప్రకటించిన ఒక ఒడంబడిక చేసుకొన్నది దీని ప్రకారం కొరియా అంతరంగిక, విదేశీ వ్యవహారాలన్నీ జపాన్ అధివాసి ద్వారానే జరగవలె. తరవాత కొరియాలోని జైళ్ళు, న్యాయస్థానాలమీద జపాన్ అధికారాలను పొందింది. 1910లో జపాన్ బలవంతంగా కొరియాను ఆక్రమించుకొన్నది.

**10.2.6. మొదటి ప్రపంచయుద్ధం :** ఆంగ్లో - జపాన్ ఒడంబడిక షరతులననుసరించి, ఆసియాలో తన రాజకీయ సైనిక పటిష్ఠతను పెంపొందించుకోవడానికి జపాన్ మొదటి ప్రపంచయుద్ధంలో మిత్రమండలి తరపున ప్రవేశించింది. 1914 నవంబర్‌లో కియాచౌలోని సింగ్‌టావోను తరవాత జర్మనీకి చెందిన మార్షల్ కెరోలిన్ వంటి దీవులను జపాన్ ఆక్రమించింది. ఆ తరవాత జపాన్ షాంటుంగ్ ప్రాంతంలోని జర్మనీకి చెందిన ఆస్తులను స్వాధీనం చేసుకొన్నది.

చైనా ప్రభుత్వ బలహీనతను అవకాశంగా తీసుకొని, చైనాలో తన స్థానాన్ని శాశ్వతం చేసుకోవాలనే ఉద్దేశంతో జపాన్ 1915 లో 21 కోరికలతో ఒక పత్రాన్ని చైనా అధ్యక్షుడైన యువాన్ షికైకు సమర్పించింది. జపాన్‌కు భయపడి యువాన్‌షికై 1915 మేలో ఆ కోరికలను అంగీకరిస్తూ జపాన్‌లో రెండు సంధులు చేసుకొన్నాడు. మొదటి సంధి దక్షిణ మంచూరియా, అంతర్ మంగోలియాలలోని తూర్పు ప్రాంతాలకు, రెండో సంధి షాంటుంగ్‌కు సంబంధించినది. ఫలితంగా చైనామీద జపాన్ ఆధిపత్యం నెలకొన్నది. అంతేగాక రష్యా, ఇంగ్లండ్, ఇటలీ, అమెరికా, ఫ్రాన్స్‌లతో రహస్య ఒడంబడికలను చేసుకొని చైనాలో జపాన్ తన సర్వాధిపత్యాన్ని స్థాపించుకొన్నది.

మొదటి ప్రపంచ యుద్ధ ఫలితంగా జపాన్ ఆర్థికంగాను, సైనికంగాను బలపడింది. దూర ప్రాచ్యంలో జపాన్ తన ఆధిపత్యాన్ని ప్రదర్శించడం మొదలు పెట్టింది. తాను కొత్తగా సంపాదించిన ప్రతిపత్తిని నిలుపుకోడానికి శాంతి సమావేశంలో జపాన్ ప్రయత్నించింది.

**10.2.7. పారిస్ శాంతి సమావేశము :** పారిస్ శాంతి సమావేశములో జపాన్ మూడు కోరికలను వెలిబుచ్చింది. అవి : 1 ఉత్తర పసిఫిక్ మహాసముద్రంలోని జర్మనీకి చెందిన మేరియానా, మార్షల్ దీవులను జపాన్‌కు దత్తం చేయవలె 2. షాంటుంగ్ రాష్ట్రంలో జర్మనీకిగల హక్కులన్నీ జపాన్‌కు బదిలీ చేయవలె 3. సుస్థిర శాంతికోసం ఏర్పరచబోయే నానాజాతి సమితిలో 'జాతి సమానత్వ సిద్ధాంతాన్ని' అమలు జరపవలె.

ఉత్తర పసిఫిక్ మహాసముద్రంలోని జర్మనీకి చెందిన దీవులను ఆదిష్ట ప్రాంతాలుగా జపాన్ కైవసం చేయడానికి అంగీకారం కుదిరింది. కాని జాతి సమానత్వ సిద్ధాంతాన్ని శాంతి సమావేశం ఆమోదించలేదు. అందువల్ల షాంటుంగ్ విషయంలో జపాన్ దృఢనైఖరిని అవలంభించింది. షాంటుంగ్‌ను చైనా కోరడమేగాక 1915 నాటి చైనా జపాన్ ఒప్పందాల నన్నింటిని రద్దు చేయవలెనని వాదించింది. దానితో షాంటుంగ్‌మీద తన ఆధిపత్యాన్ని అంగీకరించకపోతే సమావేశాన్ని బహిష్కరిస్తానని జపాన్ బెదిరించినది. అందువల్ల విల్సన్‌కు జపాన్ కోరికను అంగీకరించడం తప్ప మరో మార్గం లేకపోయింది. చివరికి వర్సేసంధి ఫలితంగా జపాన్‌కు షాంటుంగ్ లభించింది. దీనితో వర్సేసంధిమీద సంతకం చేయడానికి చైనా నిరాకరించింది.

**10.2.8. వాషింగ్టన్ సమావేశము :** 1921 నాటికి జపాన్ ప్రాచ్య దేశాలలో కీలక స్థానం సంపాదించింది. పసిఫిక్ మహాసముద్రం ఉత్తర ప్రాంతం నుంచి దక్షిణానికి గల సముద్రమార్గాలన్నిటిమీదా జపాన్ ఆధిపత్యాన్ని సంపాదించింది. చైనా తీరాన గల చాలా దీవుల మీద కూడా జపాన్ అధికారాన్ని స్థాపించింది. షాంటుంగ్‌ను వశపరచుకొన్న జపాన్ మధ్య చైనా మీద పూర్తి ఆధిపత్యాన్ని పొందగలిగింది. యుద్ధతంత్రంలో జపాన్‌కు చైనామీద పైచేయి అయింది. 1921 నాటికి సైబీరియా, మంచూరియా, షాంటుంగ్‌లలో జపాన్ బలమైన ఆర్థిక ఆధిపత్యాన్ని సంపాదించింది.

అందువల్ల జపాన్ రాజకీయ, ఆర్థిక సామ్రాజ్య తత్వము అమెరికాకు తీవ్ర ఆందోళనను కలగజేసింది. అమెరికా ప్రజలలో కూడా ఆయుధాల పోటీ తగ్గవలెననే భావం ప్రబలింది. నౌకాబలాల పోటి దేశంలో ఆందోళన కలిగించింది. 1920 లో అమెరికాలో రిపబ్లికన్ పక్షము ప్రపంచ శాంతిని సుస్థిరం చేయడానికి అంతర్జాతీయ సమావేశాన్ని ఏర్పాటు చేయవలెనని తీర్మానించింది. అనాటి అమెరికా అధ్యక్షుడు హార్డింజ్, విదేశాంగ కార్యదర్శి ఛార్లెస్ ఇవాన్స్ హ్యూస్ కూడా పై భావాలనే వ్యక్తం చేసినారు.

ఇదే కాలంలో జపాన్ ప్రభుత్వ వర్గాలలో కూడా నౌకాబలాల పోటీని కొనసాగించడంవల్ల విముఖత కలగడం మొదలైంది. యుద్ధనౌకా నిర్మాణము, జపాన్ ఆర్థిక పరిస్థితిని కుంగదీసింది. అంతేగాక సైనికవాదంకంటే శాంతి పద్ధతులైన వ్యాపార దౌత్యాలే జపాన్ జాతి అభ్యుదయానికి తగిన సాధనాలని నాటి జపాన్ నాయకులు భావించారు. ఈ విధంగా జపాన్, అమెరికాలకు నౌకాబలం పోటీ విషయాలమీద ఒకే భావం ఉండెను. అమెరికా, జపాన్‌లలో కలిగిన ఆందోళనను బ్రిటన్, తదితర కామన్‌వెల్త్ దేశాలు కూడా పంచుకొన్నాయి.

1921 జూన్‌లో లండన్‌లో జరిగిన కామన్‌వెల్త్ ప్రధానుల సమావేశంలో ఆంగ్లో-జపనీస్ సంధిని రద్దు పరచవలసిందని సూచించడం జరిగింది. దీని ఫలితంగా బ్రిటన్ అమెరికాను నిరాయుధీకరణ సమావేశం జరపవలసిందని కోరింది. నిరాయుధీకరణ సమావేశం ముఖ్యోద్దేశాలు 1. నౌకాదళ నిర్మాణంలో పోటీని నివారించడం 2. అధిక వ్యయాన్ని తగ్గించుకోవడం కోసం నౌకాదళ నిర్మాణంమీద ఆంక్షలు విధించడం 3. చైనా - జపాన్‌ల మధ్యగల సంబంధాలను మెరుగు పరచడం 4. ఆంగ్లో - జపనీస్ సంధిని రద్దుచేసి, దూరప్రాచ్యంలో జపాన్ దురాక్రమణను అరికట్టడం 5. అమెరికా భావించినట్లుగా చైనాలో అన్నిదేశాల వ్యాపారానికి సమానావకాశాలు ఉండటం.

నిరాయుధీకరణ గురించి, తూర్పు ఆసియా, పసిఫిక్ ప్రాంతాలకు సంబంధించిన సమస్యలను గురించి చర్చించడానికి అమెరికా అధ్యక్షుడు హార్డింజ్ 1921 ఆగస్ట్ 11 న బ్రిటన్, ఫ్రాన్స్, జపాన్, ఇటలీ, చైనా, బెల్జియం, నెదర్లాండ్స్, పోర్చుగల్ దేశాలకు ఆహ్వానాలు పంపినాడు. 1921 నవంబర్ 12 న వాషింగ్టన్‌లోని మెమోరియల్ కాంటినెంటల్ హాలులో అమెరికా అధ్యక్షుడు హార్డింజ్, ఆహూతులైన వివిధ

దేశాల ప్రతినిధులకు స్వాగతం పలికినాడు. అమెరికా విదేశాంగ శాఖ కార్యదర్శి హ్యూస్ సమావేశానికి అధ్యక్షత వహిస్తూ ఈ దేశాలన్నీ తీర్మానాలను ప్రతిపాదించడమేగాక వాటిని అమలు చేయవలసిందిగా అభ్యర్థించినాడు.

వాషింగ్టన్ సమావేశంలో జపాన్ ప్రముఖ పాత్ర వహించింది. ఈ సమావేశంలో నౌకా నిరాయుధీకరణ, దూర ప్రాచ్యాల సమస్యలమీద అనేక ఒప్పందాలను కుదుర్చుకోవడం జరిగింది. అవి :

**10.2.8.1. నాలుగు రాజ్యాల సంధి :** 1921 డిసెంబర్ 13 న బ్రిటన్, ఫ్రాన్స్, జపాన్, అమెరికాల మధ్య ఈ సంధి జరిగింది. దీని ప్రకారం 1. ఆంగ్లో-జపాన్ ఒప్పందం రద్దయింది 2. పసిఫిక్ మహాసముద్రంలోని తమకు చెందిన ప్రాంతాలమీదగల హక్కులను పై రాజ్యాలు ఒండొరులు గుర్తించవలె 3. పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో తమకు కలిగే వివాదాలను శాంతియుతంగా పై రాజ్యాలు పరిష్కరించుకోవలె 4. ఇతరదేశాలనుంచి పై రాజ్యాల ఉనికికి ప్రమాదామేర్పడినపుడు తమలోతాము ఈ రాజ్యాలు సంప్రదించుకోవలె 5. ఈ ఒడంబడిక పదేళ్ళ పాటు అమలులో ఉండవలె.

ఈ సంధి అమెరికా, కామన్‌వెల్త్ రాజ్యాలకు తృప్తి కలిగించింది. అంతేగాక ఫిలిప్పైన్ దీవులమీద జపాన్ దురాక్రమణ భయం కూడా తొలగిపోయింది.

**10.2.8.2. ఐదురాజ్యాల సంధి :** అమెరికా, బ్రిటన్, జపాన్, ఫ్రాన్స్, ఇటలీలమధ్య ఈ సంధి జరిగింది. ఈ సంధి ప్రకారం : 1. భారీయుద్ధ నౌకల నిర్మాణాన్ని పదేళ్ళపాటు నిలిపి వేయవలె 2. నిర్మాణంలో ఉన్న యుద్ధ నౌకలను అమెరికా 8 లక్షల 45 వేల టన్నుల మేరకు, బ్రిటన్ 5 లక్షల 83 వేల టన్నుల మేరకు, జపాన్ 4 లక్షల 35 వేల టన్నుల మేరకు తగ్గించవలె 3. భారీ యుద్ధనౌకలను 30 వేల టన్నుల మేరకు, విమాన వాహక నౌకలను 27 వేల టన్నుల మేరకు మించి నిర్మించరాదు. 4. భారీ యుద్ధ నౌకలమీద 16 అంగుళాలు, విమాన వాహక నౌకలమీద 8 అంగుళాలను మించి శక్తివంతమైన ఫిరంగులను ఏర్పాటు చేయరాదు. 5. అలూషియన్, గువాయ్, పాగో-పాగో, ఫిలిప్పైన్స్‌లలో అమెరికా; హాంకాంగ్ పసిఫిక్‌లోని మరికొన్ని ప్రాంతాలలో బ్రిటన్; కురైల్, బోనిన్, అమామీ ఒషుమా, ఫార్మోజా, రియుకియు, పెస్కడోర్స్ దీవులలో జపాన్ నౌకా స్థావరాలను ఏర్పరచడానికి వీలులేదు. 6. 1936 వరకు ఈ ఒడంబడిక అమలులో ఉంటుంది.

ఈ ఒడంబడిక వల్ల జపాన్ లాభం పొందింది. ప్రపంచ నౌకా బలరాజ్యాలలో జపాన్‌ను మూడో దేశంగా గుర్తించడం జరిగింది. రక్షణ స్థావరాల నిర్మాణంలో ఆంక్షలు విధించడంవల్ల జపాన్ భద్రత పెంపొందింది.

**10.2.8.3. ఆరు రాజ్యాల సంధి :** బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్, ఇటలీ, జపాన్, చైనాలమధ్య ఈ సంధి జరిగింది. దీని ప్రకారం ఈ ఆరు రాజ్యాల మధ్య పసిఫిక్ సముద్రంలోని కేబిల్ మార్గాల విషయంలో అంగీకారం కుదిరింది. ఈ సమావేశంలోనే అమెరికా, జపాన్‌లు, అమెరికా చైనాల మధ్యగల కేబిల్ మార్గాన్ని యాప్ దీవిగుండా ఉపయోగించుకోవడానికి అంగీకరించినాయి.

**10.2.8.4. తొమ్మిది రాజ్యాల సంధి :** అమెరికా, బ్రిటన్, జపాన్, ఫ్రాన్స్, ఇటలీ, బెల్జియం, నెదర్‌లాండ్స్, పోర్చుగల్, చైనాలమధ్య ఈ సంధి జరిగింది. దీని ప్రకారం 1. చైనాకు సంబంధించినంత వరకు, మిగిలిన ఎనిమిది రాజ్యాలు చైనా స్వాతంత్ర్యాన్ని, సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను, పరిపాలన సమగ్రతను గౌరవించవలె 2. చైనా అభివృద్ధికి తోడ్పడటానికి, చైనాలో పై రాజ్యాలన్నిటికీ వ్యాపార పరిశ్రమలలో సమానావకాశాలు కల్పించడానికి అవి అంగీకరించినాయి. 3. పై సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఏ సంధిగాని ఒడంబడికగాని పై రాజ్యాలు చేసుకోగూడదు. 4. పై రాజ్యాల ప్రజలు కూడా ఇదే విధానాన్ని అనుసరించవలె 5. చైనా తటస్థ విధానాన్ని గౌరవించవలె 6. ఈ ఒడంబడికను అమలు చేసేటప్పుడు, పైరాజ్యాలు పూర్తిగా సంప్రదించుకోవలె.

వాషింగ్టన్ సమావేశంలో సుంకాల విషయంలో పూర్తిగా అధికారాన్ని, అతి ప్రాదేశిక తత్వాన్ని చైనా కోరింది. అమెరికా, జపాన్‌లు చైనా కోర్కెలను తిరస్కరించినాయి. కాని సుంకాల విషయంలో కొద్దిపాటి సదుపాయాలు కలిగించడానికి అతి ప్రాదేశిక విషయంమీద ఒక

సంఘాన్ని నియమించడానికి ఈ రాజ్యాలు అంగీకరించినాయి. కాని 1915 లో చైనా జపాన్‌లమధ్య జరిగిన సంధిలోని మంచూరియాకు సంబంధించిన నిబంధనలను తొలగించడానికి ఈ రాజ్యాలు అంగీకరించలేదు. ఈ సంధిని తనమీద బలవంతంగా రుద్దిందనే చైనా వాదనను ఏ రాజ్యామూ అంగీకరించలేదు.

**10.2.8.5. చైనా-జపాన్ సంధి :** చైనా - జపాన్‌ల మధ్య గల వివాదాలను పరిష్కరించడానికి అమెరికా విదేశాంగ కార్యదర్శి హ్యూస్, బ్రిటన్ విదేశాంగ మంత్రి బాల్ ఫర్‌లు కృషి చేసినారు. వారి కృషి ఫలితంగా 1922 లో చైనా-జపాన్‌లమధ్య సంధి జరిగింది. దీని ప్రకారం 1. చైనాకు జపాన్ కియాచౌను ఇచ్చివేసింది. 2. జర్మనీకి కౌలుకిచ్చిన షాంటుంగ్ ప్రాంతాన్నంతటిని జపాన్ చైనాకు తిరిగి ఇచ్చివేయడానికి ఒప్పుకొన్నది. ఆ ప్రాంతంలోని జర్మనీకి చెందిన పబ్లిక్ ఆస్తులన్నీ కూడా జపాన్ చైనాకు ఇచ్చివేయవలె. 3. ఆ ప్రాంతంలో జపాన్ అభివృద్ధి పరచిన ఆస్తుల విషయంలో తప్ప, మిగిలిన ప్రాంతానికి ఎట్లాంటి పరిహారం చైనా జపాన్‌కు చెల్లించనవసరంలేదు. 4. కాని సింగ్ - టావోలోని జపనీస్ దౌత్య కార్యాలయంమీద, కౌలు ప్రాంతంలోని జపాన్ విద్యాలయాలు, దేవాలయాలమీద జపాన్‌కు అధికారముంటుంది. 5. కౌలు ప్రాంతంలోను సింగ్‌టావో - సినాన్ రైల్వే ప్రాంతంలోను గల తన సైనికాలను ఆరు మాసాలలోగా జపాన్ ఉపసంహరించుకోవలె 6. సింగ్‌టావో రేవు పట్టణాన్ని సింగ్‌టావో - సినాన్ రైలు మార్గాన్ని చైనా తన రక్షకదళ పర్యవేక్షణలో ఉంచడానికి సిద్ధపడింది. 7. సింగ్ టావోలోని జపాన్ సుంకాల కార్యాలయాలను చైనాకు అప్పగించవలె 8. చైనా జపాన్‌కు ఇవ్వవలసిన రుణాన్ని 15 సంవత్సరాలలో తీర్చవలె. అంతవరకు సింగ్‌టావో - సినాన్ రైలు మార్గం జపాన్ ఆధీనంలో ఉంటుంది.

ఈ ఒప్పందాన్ని అమలు పరచడానికి చైనా, జపాన్ ప్రతినిధులు టోక్యోలో 1922 జూన్ 26 నుంచి డిసెంబర్ 5 వరకు సమావేశాలు జరిపినారు. 1923 ప్రారంభం నాటికి షాంటుంగ్ ప్రాంతంనుంచి జపాన్ వైదొలగడంలో, ఆ రాష్ట్రానికి సంబంధించిన 1915 సంధి రద్దయినట్లయింది. చైనా, జపాన్ దేశాల సత్సంబంధాలకు అడ్డుగా ఉన్న ఈ సమస్య తీరడంతో, రెండు దేశాలమధ్య 1931 వరకు సుహృద్భావం పెంపొందింది.

## 10.3. జపాన్ విదేశాంగ విధానము (1922-1931) :

1918 - 1931 సంవత్సరాల మధ్య కాలంలో జపాన్‌లోని రాజకీయ పార్టీలు సుస్థిరమైన ప్రజాస్వామ్య ప్రభుత్వాలను నెలకొల్పలేకపోయినాయి. రాజ్యాంగం ప్రకారం జపాన్ పార్లమెంట్ బలహీనం కావడం, రాజకీయ పార్టీలు ప్రజలలో సుస్థిరమైన పలుకుబడిని స్థాపించుకోలేక పోవడం దేశంలోని కార్మికుల, తీవ్రవాదుల ఉద్యమాలవల్ల ప్రజాస్వామ్య ప్రభుత్వాలు భీతిచెందడం మొదలగు కారణాల వల్ల జపాన్‌లో సుస్థిర ప్రజా ప్రభుత్వ స్థాపనకు అవరోధాలు ఏర్పడినాయి. జపాన్‌లో ప్రజాస్వామ్య ప్రభుత్వాల అస్థిరత ఆ దేశవిదేశాంగ విధానాన్ని ప్రభావితం చేసింది.

మొదటి ప్రపంచ యుద్ధానికి పూర్వమే చైనా, మంచూరియాలలో జపాన్ తన సామ్రాజ్య తత్త్వ విధానాన్ని అమలు పరచసాగింది. యుద్ధానంతరం జపాన్‌లోని నాయకులు ప్రత్యక్ష చర్యలస్థానే దౌత్యమార్గాలద్వారా జపాన్ విదేశాంగ విధానానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించుకోవలెనని ఆశించినారు. మంచూరియాలో జపాన్ సంపాదించిన ప్రత్యేక సదుపాయాలను వదులుకోవడానికి వీరు అంగీకరించలేదు. మొదటి ప్రపంచయుద్ధము జపాన్‌ను అగ్రరాజ్యాల శ్రేణిలోకి చేర్చడమేగాక, దూరప్రాచ్య రాజకీయాలలో దానిని ఆర్థికంగాను, రాజకీయంగాను శక్తిమంతమైన దేశంగా రూపొందించింది.

జపాన్ విదేశాంగ విధానం మూడు అంశాల ప్రాతిపదికన రూపొంది అమలు చేయడం జరిగింది. అవి 1. పసిఫిక్ మహాసముద్రంలో తన నౌకాబలాన్ని పెంపొందించుకోవడం 2. సోవియట్ రష్యా ఉపద్రవాన్ని ఎదుర్కోవడం 3. దిన దిన ప్రవర్ధమానమవుతున్న చైనా జాతీయత, దక్షిణ మంచూరియాలోని తన ప్రత్యేక ప్రతిపత్తికి భంగం కలిగిస్తుందన్న భయం. ఈ ఉద్దేశాలతోనే జపాన్ వాషింగ్టన్ సమావేశంలో పాల్గొన్నది. ఈ సమావేశం ఫలితంగా జపాన్ కియాచౌ ప్రాంతాన్ని చైనాకు తిరిగి ఇచ్చివేసింది. అమెరికా, జపాన్‌లు 1917లో చేసుకొన్న లాన్సింగ్ - ఇషి ఒప్పందాన్ని రద్దుచేసుకొన్నాయి.

**10.3.1. రష్యా - జపాన్ సంబంధాలు :** వాషింగ్టన్ సమావేశానంతరం రష్యా, జపాన్‌ల సంబంధాలు మెరుగయినాయి. జపాన్ 1922లో తన సైన్యాలను సైబీరియా నుంచి ఉపసంహరించింది. 1923 మొదలు 1925 వరకు జరిగిన సుదీర్ఘ సంప్రదింపుల ఫలితంగా రష్యా, జపాన్‌లమధ్య సత్సంబంధాలు తిరిగి ఏర్పడినాయి. బోల్షెవిక్ ప్రభావంనుంచి సైబీరియాను రక్షించడం కష్టమని జపాన్ గుర్తించింది. బోల్షెవిక్‌లు చైనా జాతీయ వాదులతో చేతులు కలిపితే తాను ఏకాకి అవుతుందని జపాన్ ఆందోళన చెందింది. అంతేగాక 1902 నాటి ఆంగ్లో-జపాన్ ఒప్పందం వాషింగ్టన్ సమావేశంలో రద్దయింది. అమెరికా సెనేట్ 1924లో ఆమోదించిన వలస చట్టంవలన అమెరికాలోకి జపాన్ ప్రజల వలసను పరిమితం చేయడం జరిగింది. దీనితో తమపట్ల అమెరికా వ్యతిరేక భావంతో ఉందని జపాన్ భావించింది. అందువల్ల రష్యాతో జపాన్ ఒప్పందానికి రావడం జరిగింది.

**10.3.2 చైనా - జపాన్ సంబంధాలు : షిడేహారా విధానము :** వాషింగ్టన్ సమావేశం తరవాత చైనాతో జపాన్ సత్సంబంధాలను పెంపొందించుకొన్నది. చైనాతో జపాన్ విధానాన్ని రూపొందించినవాడు షిడేహారా కిజురో. ఇతడు జపాన్ రాజకీయవేత్త. ఇతని విధానంలోని ముఖ్య లక్షణాలు : 1. జపాన్ సమితి ద్వారా తన ప్రాబల్యాన్ని పెంపొందించడం 2. వాణిజ్య, పారిశ్రామిక ప్రగతిని జపాన్ సాధించడం 3. నౌకాబలాన్ని పరిమితం చేయడం 4. చైనా జాతీయవాదులతో సత్సంబంధాలను పెంపొందించుకోవడం 5. దక్షిణ మంచూరియాలో జపాన్ తన ఆధిపత్యం కొనసాగించడం.

షిడేహారా కిజురో 1924 నుండి 1927 వరకు, తిరిగి 1929 నుంచి 1931 వరకు జపాన్ విదేశాంగమంత్రి పదవిని నిర్వహించాడు. ఇతడు అనుసరించిన పద్ధతులకు 'షిడేహారా విధానము' అని పేరు. జపాన్ పార్లమెంట్‌లో 1927 జనవరిలో షిడేహారా తన విదేశాంగ విధానాన్ని ప్రకటించాడు. అందులోని ముఖ్యాంశాలు 1. జపాన్ చైనా సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను గౌరవించడం 2. జపాన్ చైనాలమధ్య స్నేహాన్ని పెంపొందించడం 3. ఆర్థిక రంగంలో చైనా జపాన్‌లు పరస్పరం సహకరించుకోవడం 4. చైనావారి న్యాయమైన ఆశయాలకు జపాన్ సానుభూతితో గౌరవించడం 3 ఆర్థిక రంగంలో చైనా జపాన్‌లు పరస్పరం సహకరించుకోవడం 4. చైనావారి న్యాయమైన ఆశయాలను జపాన్ సానుభూతితో గౌరవించడం 5 చైనాలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితిని జపాన్ తన స్వప్రయోజనాలకు ఉపయోగించుకోకుండా ఉండడం 6. చైనాలోని జపాన్ ప్రత్యేక ప్రయోజనాలను, హక్కులను, న్యాయ సమ్మతమైన మార్గాలద్వారా పరిరక్షించుకోవడం.

ఇటువంటి ఆశయాలను షిడేహారా ప్రకటించినా, జపాన్ చైనాలో తన ప్రత్యేక ప్రయోజనాలను రక్షించుకోవడానికి సైనిక చర్యలను కూడా తీసుకొన్న సందర్భాలు కూడా ఉన్నాయి. 1925లో మంచూరియాలో చాంగ్ సోలిన్‌మీద తిరుగుబాటు జరిగినపుడు ముక్ డెన్ ప్రాంతానికి జపాన్ తన సైన్యాలను తరలించింది. 1927 ఏప్రిల్‌లో హాంకోవద్ద చైనీయులు జపాన్ ఆస్తులను ఆక్రమించడానికి ప్రయత్నించినపుడు, జపాన్ తన సైన్యాలను అక్కడికి పంపింది. కాని 1927 మార్చిలో ఆంగ్లో - అమెరికన్ దళాలు నాన్‌కింగ్‌ను ముట్టడించినపుడు జపాన్ వారితో కలవలేదు. ఈ సమయంలోనే జపాన్ రాయబార కార్యాలయాన్ని చైనీయులు ముట్టడించినా కొందరు జపాన్ జాతీయులు గాయపడినా, జపాన్ మాత్రం చైనామీద తీవ్ర చర్యలకు దిగలేదు.

**10.3.3 తనాకా విధానము :** షిడేహారా చైనాపట్ల అనుసరించిన విధానాన్ని జపాన్‌లోని సైన్యం ప్రభుత్వోద్యోగులు, వ్యాపారస్తులు బలహీనమైనదిగా పరిగణించి దానిని వ్యతిరేకించినారు. జపాన్ ప్రీవీ కౌన్సిల్ షిడేహారా విదేశాంగ విధానాన్ని తీవ్రంగా ఖండించింది. దీని ఫలితంగా 1927 ఏప్రిల్‌లో వాకట్సూకి ప్రభుత్వము రాజీనామా చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. తరువాత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తనాకా సేనాని చైనాపట్ల శక్తివంతమైన విధానాన్ని అవలంభించినాడు. తనకా, తన విధానాన్ని, విదేశాంగ శాఖ కార్యాలయంలో జరిగిన ఒక సమావేశంలో వెల్లడించినాడు. ఆర్థిక, విదేశాంగ, నౌకా, యుద్ధ శాఖలకు చెందిన ప్రతినిధులు ప్రధాన సైన్యాధికారులు, చైనాలోని జపాన్ రాయబారి ఈ సమావేశానికి హాజరైనారు. ఈ సమావేశంలో తీసుకొన్న నిర్ణయాలనే తనకా స్మృతి అని కూడా అంటారు. జపాన్ చరిత్రలో దీనిని 'జపాన్ మన్రో సిద్ధాంతము' అని కూడా వ్యవహరిస్తారు. ప్రథమంగా దీనిని 1929 లో ప్రకటించడం జరిగింది. 1931 తరువాత దీనికి విశేష ప్రచారం లభించింది. 1931 తరువాత జపాన్ అవలంభించిన విదేశాంగ విధానానికి ఇది ప్రాతిపదిక అయింది.

తనాకా స్మృతిలో చైనాపట్ల, మంచూరియా, తూర్పు మంగోలియాలలోను జపాన్ అనుసరించవలసిన విధానాలను పేర్కొనడం జరిగింది. మంచూరియా, తూర్పు మంగోలియాలలో జపాన్‌కు ప్రత్యేక ప్రయోజనాలున్నాయని తనాకా పునరుద్ఘాటించినాడు. ఈ ప్రాంతాలలో చైనా జాతీయ వాదులవల్ల ఉపద్రవమేర్పడినపుడు, శాంతి భద్రతలను నెలకొల్పే బాధ్యత జపాన్‌కుందని తనాకా తెలియజేసాడు. కొమిన్‌టాంగ్ ఆధ్వర్యంలో చైనా ఏకీకరణవల్ల జపాన్ ప్రయోజనాలు దెబ్బతింటాయని, మంచూరియాలో చైనా నిర్మించే రైలు మార్గాలు, జపాన్ ఆధీనంలో ఉన్న దక్షిణ మంచూరియా రైల్వేకు నష్టాన్ని కలిగిస్తాయని దీనివల్ల మంచూరియాలో జపాన్ ప్రత్యేకమైన ఉనికికి భంగం కలుగుతుందని తనాకా భావించాడు. దీనికి తోడు 1927 వరకు కొమిన్‌టాంగ్‌లోని వామ పక్షీయుల ప్రాబల్యం జపాన్ ప్రభుత్వానికి ఆందోళనకు కారణమయింది.

అందువల్ల మంచూరియాలోని జపాన్ సేనానులు చైనా విషయంలో శక్తివంతమైన విధానాన్ని అవలంబించవలసిందని జపాన్ ప్రభుత్వంమీద ఒత్తిడి తెచ్చినారు. దీని ఫలితంగానే మంచూరియా విషయంలో చైనా జోక్యాన్ని నివారించడానికి, జపాన్ షాంటుంగ్‌కు తన సైన్యాలను తరలించింది. మంచూరియా యుద్ధ ప్రభువైన చాంగ్ సోలిన్ తమకు అనుకూలుడుగా ఉంటాడని కూడా జపాన్ భావించింది. కాని చాంగ్ సోలిన్ స్వతంత్ర విధానాన్ని అనుసరించడంవల్ల మంచూరియాలోని జపాన్ సేనానులు అతనిమీద కుట్రపన్ని అతనిని చంపించినారు. తనాకా ప్రభుత్వం సైన్యంలోని తీవ్రవాదులమీద ఆధిపత్యాన్ని కోల్పోయింది. 1929 జూలైలో తనాకా ప్రభుత్వం రాజీనామా చేసింది. ఆనాటినుంచి జపాన్ విదేశాంగ విధానాన్ని సైన్యంలోని తీవ్రవాదులు నడిపించినారు.

**10.3.4. నానా జాతి సమితిలో జపాన్ పాత్ర :** సమితి సభ్యదేశంగా జపాన్ విశిష్టమైన పాత్ర వహించింది. సమర్థులైన పెక్కుమంది జపాన్ రాజకీయ వేత్తలు, న్యాయశాస్త్రకోవిదులు, దౌత్యవేత్తలు సమితికి గొప్ప సేవ చేసినారు. నిటోబీ ఇనాజో, సుగీమూరాయొటారోలు సమితి ఉప ప్రధాన కార్యదర్శులుగా పని చేసినారు. అంతర్జాతీయ వివాదాలలో జపాన్ మధ్యవర్తిత్వం వహించింది. న్యాయశాస్త్రకోవిదుడైన అడాచిమినీషిరో అంతర్జాతీయ న్యాయ స్థానాన్ని ఏర్పాటు చేయడంలో ప్రముఖపాత్ర వహించినాడు. ఓడాయోరోజా, అడాచిమినీషిరోలు ఈ న్యాయస్థానంలో న్యాయాధిపతులుగా పనిచేసినారు.

**10.3.5. శక్తివంతమైన నౌకాబల రాజ్యంగా జపాన్ రూపొందడం :** వాషింగ్టన్ సమావేశంలో, నౌకాబలాల పోటీ నివారణకు అగ్ర రాజ్యాలయిన అమెరికా, బ్రిటన్, జపాన్‌ల నౌకాబల నిష్పత్తిని 5:5:3 గా నిర్ణయించడం జరిగింది. అయినప్పటికీ బ్రిటన్, జపాన్‌లు నౌకా నిర్మాణాలను కొనసాగించినారు. దీనితో ఆందోళన చెందిన అమెరికా అధ్యక్షుడు కూల్‌రిడ్, జెనీవాలో నిరాయుధీకరణ సమావేశాన్ని ప్రతిపాదించినాడు. ఫ్రాన్స్, ఇటలీ దేశాలు సమావేశానికి హాజరు కావడానికి తిరస్కరించినాయి. జపాన్, అమెరికా, బ్రిటన్‌లు 1927 ఫిబ్రవరిలో జెనీవాలో సమావేశమయినాయి. పై నిష్పత్తి భారీ నౌకలకు మాత్రమేగాక అన్ని యుద్ధ నౌకలకు వర్తింపజేయవలెనని అమెరికా ప్రయత్నించగా అది ఫలించలేదు. ఒప్పందం కుదరని కారణంగా జెనీవా సమావేశం విఫలమయింది. 1929 వరకు బ్రిటన్, అమెరికా, జపాన్‌లమధ్య సంబంధాలు దిగజారిపోవడం కొనసాగింది.

1929 లో తిరిగి షిడేహారా విదేశాంగ మంత్రి కావడంతో జపాన్ విదేశాంగ విధానంలో మార్పు కలిగింది. అమెరికా అధ్యక్షుడు హువర్, బ్రిటిష్ ప్రధాని రామ్‌సే మెగ్డొనాల్డ్‌ల చొరవవల్ల 1929 అక్టోబర్‌లో లండన్‌లో నౌకా నిరాయుధీకరణ సమావేశం జరిగింది. 1930 ఏప్రిల్‌లో బ్రిటన్, అమెరికా, జపాన్‌లమధ్య నౌకాసంధి జరిగింది. ఈ సంధి ప్రకారం అన్ని రకాల యుద్ధనౌకాబలాల మీద పరిమితికి మూడు రాజ్యాలు అంగీకరించాయి. అమెరికా, బ్రిటన్, జపాన్‌ల భారీ క్రూయిజర్‌లను 10:10:6 నిష్పత్తిలోను, తేలిక క్రూయిజర్‌లను 10:10:7 నిష్పత్తిలోను తగ్గించడానికి అంగీకరించినాయి. జలాంతర్గాములను మూడు దేశాలు సమానంగా ఉంచుకోవడనికి అంగీకరించినాయి. దీనివల్ల దూర ప్రాచ్యంలో జపాన్ శక్తివంతమైన నౌకాబల రాజ్యాంగా రూపొందింది.

## 10.4. మంచూరియా సంక్షోభము :

తూర్పు ఆసియా రాజకీయాల్లో మంచూరియా ఒక ప్రముఖపాత్ర వహించింది. ఒకవైపు చైనా మరొక వైపు రష్యా ఇంకా మరోవైపు కొరియా ఆవరించగా వీటిమధ్య భౌగోళికంగా మంచూరియా నెలకొని ఉంది. కాని ఆర్థికంగా ఎంతో వ్యవసాయ ఉత్పత్తిగల రాష్ట్రం అందులో వరి గోధుమ, బార్లి, మొదలైన వనరులు 65 కోట్ల డాలర్ల విలువ వరకు ప్రతి సంవత్సరం పండేవి. ఇంకా బొగ్గు, ఇనుము,

బంగారం, మొదలైన ఖనిజ వస్తువులు విస్తారంగా లభించేవి. ఇలా విశేషంగా వనరులు ఉండటంవల్ల రష్యా, జపాన్‌వంటి పొరుగు దేశాల్లో, అక్కడ పరిశ్రమలు నెలకొల్పి ఆ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి పరిచాయి. చైనా నుంచి రైతులు అ సంఖ్యాకంగా వచ్చి స్థిర నివాసం ఏర్పరచుకున్నారు.

1905 నుంచి చాంగ్ ట్యాలిన్ అనే యుద్ధ ప్రభువు మంచూరియన్‌ను పాలించాడు. అతడు జపాన్‌కు ఎంతో సన్నిహితుడైనా తన రాష్ట్రంపై జపాన్ ఆధిపత్యం వహించడానికి అంగీకరించలేదు. 1928 లో అతడు మరణించిన తరువాత అతని కుమారుడు చాంగ్‌హిపియాంగ్ తండ్రివలె విదేశీయులు ఎవ్వరు మంచూరియాలో స్థిరనివాసం ఏర్పరచడానికి, అంగీకరించలేదు. అయితే చైనా అధ్యక్షుడు అయిన చియాంగ్ కేషేక్ తనకై ఉన్నత అధికారి అని గుర్తించి ప్రభుత్వపు జెండాను చియాంగ్ తన రాజ్యంలో నెలకొల్పాడు. ఈ కాలంలోనే చైనాలోని కొమిన్‌టాంగ్ ప్రభుత్వము మంచూరియాలో తమ పలుకుబడిని పెంపొందించడానికి ప్రయత్నించింది. మంచూరియా చక్రవర్తుల కాలంలోనే (1661-1911) కాక చైనాలో రిపబ్లిక్ ప్రభుత్వం (1911) ఏర్పడిన తరువాత కూడ జపాన్, రష్యాలు మంచూరియాలో తమ, తమ ప్రాబల్య ప్రాంతాలను ఏర్పాటు చేయడం కొనసాగించాయి. ఈ రెండు దేశాల ప్రయోజనాలకు మంచూరియా ప్రముఖ స్థానం అయినది. 1895 తరువాత రష్యా, జపాన్‌లు మంచూరియాను తూర్పు ఆసియా రాజకీయాల్లో కీలక ప్రాంతంగా పరిగణించసాగినాయి. మంచూరియా సహజ సంపదపై రెండు దేశాలను ఆకర్షించింది.

**10.4.1. చైనా, జపాన్ ఒడంబడిక (1915) :** 1915 చైనా, జపాన్ ఒడంబడిక ప్రకారం మంచూరియాలో జపాన్‌కు, కొన్ని సదుపాయాలు లభించాయి. అవి 1) దక్షిణ మంచూరియా రైలు మార్గం ఆంటుంగ్ - ముక్డెన్ రైలు మార్గాల మీద జపాన్‌కు ఆధిపత్యం లభించింది. 2) జపాన్ ప్రజలు మంచూరియాలో వ్యాపారానికి, పరిశ్రమలకు, వ్యవసాయానికీ, భూములను కవులుకు సంపాదించుకోటానికి అధికారం పొందినారు. 3) మంచూరియాలో ప్రవేశించడానికీ, ప్రయాణించడానికీ, నివశించడానికీ, జపాన్ ప్రజలకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వడం జరిగింది. ఈ సదుపాయాలను సంపాదించిన తరువాత జపాన్‌కి మంచూరియాలో సర్వసమున్నతత్వాన్ని పొందింది.

**10.4.2. వాషింగ్‌టన్ సమావేశము :** 1921 లో జరిగిన వాషింగ్‌టన్ సమావేశం ఫలితంగా జపాన్ చైనా పట్ల 1905 నుంచి అనుసరిస్తున్న దురాక్రమణ విధానానికి తాత్కాలికంగా స్వస్థి చెప్పటం జరిగింది. ఈ సమావేశంలో జపాన్, చైనా స్వాతంత్ర్యాన్ని ప్రాదేశిక సమగ్రతను పరిపాలనా సమగ్రతను గుర్తించింది. సమితిలో సభ్య దేశంగా జపాన్ ఇతర సభ్య దేశాల స్వాతంత్ర్యాన్ని గౌరవించడానికీ, అన్ని వివాదాలను శాంతియుత పద్ధతులద్వారా పరిష్కరించుకోడానికీ అంగీకరించింది. ఆనాటి చైనా రాజకీయ అనిశ్చత పరిస్థితిని ఆసరాగా తీసుకొని, అక్కడ తన ప్రయోజనాలను పెంపొందించకుండా ఉండటానికి జపాన్ సమ్మతించింది.

వాషింగ్‌టన్ సమావేశం ఫలితంగా 1902 నాటి ఆంగ్లో జపాన్ సంధి ఆ తరువాత జరిగిన, లాన్‌సింగ్-ఇషి ఒడంబడిక కూడా రద్దు అయినవి. దీనితో దూర ప్రాచ్య రాజకీయాల్లో నవ శకం ఆరంభమైంది. చైనా, జపాన్ సంబంధాలు తాత్కాలికంగా మెరుగైనాయి కాని వాషింగ్‌టన్ సమావేశంలో మంచూరియాలో తనకున్న ప్రత్యేక సదుపాయాలను, వదులుకోననీ, జపాన్ నిర్ద్వందంగా ప్రకటించింది. మొత్తంమీద 1927-1929 సంవత్సరాల మధ్య కాలంలో తప్ప జపాన్ విధానం చైనాపట్ల స్నేహ పూర్వకంగానే కొనసాగింది.

**10.4.3. రష్యా, చైనాలమధ్య సంఘర్షణ (1929) :** మంచూరియా విషయంలో చైనా, రష్యాలమధ్య వివాదం తలెత్తి, యుద్ధ ప్రమాదం ఏర్పడింది. 1929 లో మంచూరియా పాలకుడైన చాంగ్ హుసియె లియారిగ్ మంచూరియాలో సోవియట్ దౌత్య కార్యాలయంమీద దాడిచేసి, కమ్యూనిస్టు ఏజెంట్‌లను అరెస్టుచేసి, సోవియట్ రష్యా, నిగూఢ కార్యకలాపాలను బయటపెట్టినాడు. దీనితో రష్యా, చైనాతో దౌత్య సంబంధాలను తెగ తెంపులు చేసుకొన్నవి. సైబీరియా, మంచూరియా సరిహద్దుల్లో సంఘర్షణలు జరిగాయి. సరిహద్దులలో ఘర్షణ పడటం 1928 లో ప్యారీస్‌లో జరిగిన బ్రియాండ్ - కెల్లాగ్ ఒప్పందానికి విరుద్ధం. అందువల్ల అమెరికా నూతన కార్యదర్శి స్టిమ్‌సన్ రష్యా, చైనా తమ సైన్యాలను వెనుకకు మరలించడానికి ఉల్లంఘించాయి అని, అక్కడ శాంతి భద్రతలు కాపాడటానికీ ఇరు పక్షాలను తీవ్రంగా విమర్శించి శాంతియుతంగా సమస్యలను పరిష్కరించుకోవలిసిందిగా, రెండు దేశాలను ఒత్తిడి చేసారు దానివల్ల ఈ రెండు దేశాలు ఆత్మ రక్షణకు

మాత్రమే, సైన్యాలు ఉపసంహరించుకొంటాము అని హామి ఇచ్చాడు. కాని ఇంతలో బెర్లిన్‌లో రష్యా, చైనాలో మధ్య సంప్రదింపులు విఫలం కావటంవల్ల చైనా, రష్యాలు యుద్ధ ప్రకటన లేకుండగానే యుద్ధం ఆరంభించాయి. రష్యా సైన్యం పశ్చిమ మంచూరియాను ఆక్రమించడంతో చాంగ్ సైన్యాలు వెనుదిరిగాయి. చివరకు 1929 నాటికీ చాంగ్, నాన్‌కింగ్ ప్రభుత్వాలు మంచూరియాలోనే రష్యా ప్రయోజనాలను గుర్తించడం జరిగింది. దీనితో నాన్‌కింగ్ ప్రభుత్వం బలహీనత బహిర్గతమై, జపాన్, మంచూరియామీద దురాక్రమణకు, దోహదం చేసింది.

**10.4.4. మంచూరియా మీద జపాన్ దాడికి కారణాలు :** 1) చైనావారు మంచూరియాను, తమ ప్రధమ రక్షణ సేనిగా భావించగా, జపాన్ ప్రభుత్వం దానిని తన ప్రాణ ప్రధముగా పరిగణించింది. 1921-1931 మధ్య కాలంలో మంచూరియాలోకి చైనీయుల వలస, త్వరితగతిని వృద్ధి చెందింది. చైనాలోని అంతర్ యుద్ధాలు, తరచూ సంభవించే కరువువల్ల, వేలాది చైనా కర్షకులు మంచూరియాకు వలస పోయారు. కానీ మంచూరియాలోకి జపాన్, వలసలు ఎక్కువ కాలేదు. 1930 నాటికి, మంచూరియా మొత్తం జనాభా, 2 కోట్ల 90 లక్షలు కాగా అందులో 2 లక్షల 50 వేలు జపాన్‌వారు, 8 లక్షలు కొరియన్‌లు 1 లక్ష రష్యన్లు మిగిలిన వారంతా చైనావారు. అందువల్ల, నిరంతరం, వృద్ధి చెందుతున్న చైనీయుల జనాభావల్ల, జపాన్‌కు ఆందోళన కలిగింది.

2) 1915 ఒప్పందం ప్రకారం జపాన్‌కు మంచూరియాలో కవులుకు భూమిని సంపాదించడానికి హక్కు, ఉన్న చైనా ప్రభుత్వం దానికి అవరోధాలు కలిగించడం మొదలు పెట్టింది. అందువల్ల, వ్యవసాయ ప్రయోజనాల కోసం మంచూరియాలో జపాన్ భూములను సంపాదించలేకపోయింది. దీనికితోడు జపాన్ కర్షకులు చైనా, కొరియా, కర్షకులతో పోటీకి నిలువలేక పోయారు. దీనితో జపాన్ ఆశించినట్లు మంచూరియా జపాన్‌కు దక్కకుండా ఉండే పరిస్థితి ఏర్పడింది.

3) 1927 తరువాత జపాన్ ఆధిపత్యం ఉన్న దక్షిణ మంచూరియా రైల్వేను, రాజకీయ ప్రమేయంలేని వ్యాపార సంస్థగా చేయవలెనని, చైనా ప్రభుత్వం ప్రయత్నించింది. జపాన్ దేశస్తులైన, రైల్వే గార్డుల కార్యకలాపాలు, జపాన్ దౌత్య కార్యాలయంలోని పోలీసుల కార్య కలాపాలు, అప్పుడప్పుడే, జాతీయ భావం ప్రభలుతున్న మంచూరియా ప్రజలను కల్పించాలి. ఈ జపాన్ పోలీసులు రైల్వే ప్రాంతంలోనే గాక మంచూరియాలోని హర్బిన్, ముంచౌలీ, మొదలగుచోట్ల ఉన్న జపాన్ దౌత్య కార్యలయాల్లో కూడా ఉండేవారు.

4) జపాన్, చైనాలమధ్య మంచూరియాలోని రైలు మార్గాల నిర్మాణం విషయంలో చాలా కాలముగా వివాదము ఉండేది. మంచూరియా రైలు మార్గాలు మీదా, జపాన్ ఆధిపత్యం చైనా జాతీయ వాదులకు, కంటగింపు అయినది. అందువల్ల వారు 1924 తరువాత దక్షిణ మంచూరియా రైలు మార్గాన్ని నిర్మించారు. దీనివల్ల జపాన్ రైల్వేకు నష్టం కలిగింది.

5) జపాన్, 1910 లో కొరియాను ఆక్రమించడంతో మంచూరియాలోని, 9 లక్షలమంది కొరియన్లలను జపాన్ పౌరులుగా, పరిగణించడం జరిగింది. జపాన్‌వలే వీరు కూడా మంచూరియాలో భూమిని సంపాదించుకోవడానికి చైనా ఆంక్షలు విధించింది. ఇది జపాన్‌కు కష్ట కారణం అయినది.

6) చైనా, జపాన్‌కు ఇవ్వవలసిన, రుణము చెల్లించడానికి నిరాకరించింది. చైనాలో రైలు మార్గాల నిర్మాణానికి, జపాన్ చైనాకు, 150 మిలియన్ల, ఎన్‌లను ఋణంగా ఇచ్చింది. 1915 ఒప్పందం ప్రకారం. జపాన్ సలహాదారులను కూడా నియమించడానికి, చైనా తిరస్కరించింది. ఈ ఋణాలు అన్నింటినీ తన రాజకీయ ప్రయోజనాల కోసం జపాన్ ఇచ్చింది అని ఈ రైలు మార్గాలమీద అధిక లాభాలను జపాన్ అప్పటికే ఆర్జించింది అని అందువల్ల తిరిగి ఆ ఋణాన్ని చెల్లించనవసరంలేదు అని చైనా పేర్కొన్నది.

7) చియాంగ్ కే షేక్ జాతీయ సైన్యాలు 1928 లో ఉత్తర రాష్ట్రాలను ఆక్రమించడానికి పురోగమిస్తుండగా వాటిని, షాంటుంగ్ రాష్ట్రంలో జపాన్ సైన్యాలు అడ్డగించాయి. అందువల్ల చైనాలో జపాన్ వ్యతిరేకత ప్రబలింది. చాంగ్‌సోలిన్ సైన్యాలు జాతీయ సైన్యాల చేతిలో ఓడిపోతున్నపుడు, జపాన్ ఆందోళన చెంది. మంచూరియాలో శాంతి భద్రతలు నెలకొల్పే బాధ్యత తనకు ఉన్నది అని ప్రకటించింది. జాతీయ సైన్యాలు మంచూరియాలోకి ప్రవేశించరాదు అని చైనాలోని ప్రముఖ సైన్యాధిపతులను, జపాన్ హెచ్చరించింది. ఈ హెచ్చరిక

చైనా అంతరంగిక వ్యవహారాల్లో జపాన్ కలగజేసుకోవడమేనని చైనా ప్రాదేశిక ప్రతిపత్తిని ఇది ఉల్లంఘించడమేనని చైనా ప్రభుత్వం జవాబు ఇచ్చింది. మంచూరియాలో జపాన్ ప్రత్యేక ప్రతిపత్తి అంతమైతేనేగాని పూర్తిగా చైనా ఏకీకరణ జరగదని కూడా చైనా భావించింది. ఈ కారణాలవల్ల, చైనాలో జపాన్ వ్యతిరేకత మరింత ఎక్కువైయింది.

8) చాంగ్ సోలిన్ మరణానంతరం అతని కుమారుడు చాంగ్‌హుసియా-లియాంగ్ నాన్‌కింగ్ ప్రభుత్వంతో సహకరించి, చైనా ఏకీకరణకు, అంగీకరించాడు. లియాంగ్ మంచూరియా పరిపాలకుడుగా వ్యవహరించినా, విదేశీ వ్యవహారాలు మాత్రం నాన్‌కింగ్ ప్రభుత్వానికి, సంక్రమించాయి. దీనితో చైనా విదేశీ వ్యవహారాలు అన్ని నాన్‌కింగ్ ప్రభుత్వపు, విదేశాంగ శాఖ ద్వారానే జరగవలెననీ, చైనా పట్టుబట్టింది. ఇది జపాన్‌కు కంటక ప్రాయమైంది. మంచూరియాలోని జపాన్‌కుగల హక్కులను తిరిగి సంపాదించుకోవలెననీ, చైనా ప్రయత్నించింది. కోమింగ్‌టాంగ్ ప్రచారకులను, చైనా మంచూరియాలోని జాతీయత ప్రచారానికే పంపింది. విద్యాలయాల్లో జాతీయ పాఠ్య గ్రంథాల ద్వారా పార్టీ ప్రచారం జరిగింది. లియానింగ్ ప్రజా విదేశీ విద్యా సంఘం, మంచూరియాలో ఏర్పడింది. ఇది అక్కడ జాతీయ భావాలను పురికొల్పి, జపాన్ వ్యతిరేక ఉద్యమాన్ని సాగించాయి.

9) జపాన్‌లో అధికారంలోకి వచ్చిన తనాకా ప్రభుత్వం సామ్రాజ్యతత్వ ధోరణిని తిరిగి, అనుసరించదలచింది. 1895 లోనే లియోటుంగ్ ద్వీపకల్పాన్ని తాము సంపాదించాము అని, 1905 లోనే మంచూరియాను, రష్యా ప్రాబల్యంనుంచి రక్షించినాము అని మంచూరియా ప్రగతికి, తమ పెట్టుబడి ముఖ్యకారణం అని, రక్షణ, దేశ శ్రేయస్సు దృష్ట్యా, తాము మంచూరియాలో సంపాదించుకొన్న ప్రత్యేక సదుపాయాలను, హక్కులనుబట్టి మంచూరియాలో తనకు విశిష్ట స్థానం ఉన్నది అని, జపాన్ భావించింది.

10) ఆనాడు ప్రపంచం అంతా ఆర్థిక మాంద్యానికే లోనైంది. యూరప్, అమెరికాలో ఆర్థిక దుస్థితి కారణంగా అవి మంచూరియా వ్యవహారాల్లో, జోక్యం కలుగజేసుకొనే స్థితిలో లేవు. నిరాయుధీకరణను గురించి జరపదలచిన, నిరాయుధీకరణ, సమావేశానికి కూడా, అంతగా ప్రోత్సాహం లభించలేదు. అందువల్ల జపాన్ మంచూరియామీద దురాక్రమణ జరుపటానికి ప్రపంచ పరిస్థితులు అనుకూలించాయి.

11) జపాన్, మంచూరియామీద దండెత్తటానికి, ముఖ్యంగా రెండు సంఘటనలు కారణాలు అవి వాన్‌పామోషాన్, నాకామోరా.

ఇందులో మొదటిది మంచూరియాలోని కొరియన్లు చైనీయుల భూమిని కవులుకు తీసుకొనే విషయంలో ఏర్పడిన వివాదం. ఈ కవులుకు జిల్లా అధికారుల అనుమతిని కొరియన్లు పొందలేదు అని చైనీయులు పేర్కొన్నారు. ఈ భూమిని సాగుచేయడానికి, కొరియన్లు ప్రయత్నించగా, చైనావారు వారిని పారద్రోలినారు. జపాన్ దౌత్య కార్యాలయపు పోలీసు సిబ్బంది. కొరియన్ల సహాయంతో ఆ భూమిని స్వాధీనం చేసుకొన్నవి. ఈ సంఘటనలో ఎవరు మృతి చెందనప్పటికీ, మృతి చెందినట్లు పుకార్లు బయలు దేరాయి ఫలితంగా ఆ దేశాల్లో చైనాకు వ్యతిరేకంగా, అల్లర్లు జరిగాయి. చైనాలో కూడా జపాన్‌కు వ్యతిరేక ప్రదర్శనలు జరిగాయి.

12) నాకామూరాను చైనా సైనికులు అంతర్ మంగోలియాలో సంహరించారు. నాకామూరాను చంపడం సమర్థనీయం కాదు అని ఇది జపాన్ దేశాన్ని, సైన్యాన్ని తీవ్రంగా అవమాన పరచటమేనని దీనికి మంచూరియాలోని చైనా అధికారులే బాధ్యులు అని జపాన్ ఆరోపించింది. నాకామూరా జపాన్ గూఢాచారి శాఖకు చెందిన, తాను వ్యవసాయ శాఖ నిపుణుడను అని మోసగించెనని పారిపోవడానికి, ప్రయత్నించగా చైనా పోలీసులు అతనిని కాల్చి చంపారని చైనా వెల్లడించింది. దీనితో మంచూరియాలోని తన ప్రత్యేక ప్రతిపత్తిని నిలుపుకోటానికి జపాన్ చైనాపట్ల దృఢవైఖరిని అవలంబించాలి అని నిర్ణయించింది.

**10.4.5. మంచూరియామీద జపాన్ దండయాత్ర :** మంచూరియా మీద జపాన్ 1931 సెప్టెంబర్ 18న దండయాత్ర ప్రారంభించినది. ఆనాటి రాత్రి సుమారు 400 మంది చైనా సైనికులు దక్షిణ మంచూరియా రైలు మార్గంలో కొంత భాగాన్నే ధ్వంసంచేసినట్లు, జపాన్ రైల్వే రక్షక దళం, కనుగొన్నది అని ఆరోపణ జరిగింది. కాని తరువాత జరిగిన విచారణవల్ల అది నిజం కాదు అని తేలింది. ఎందువల్లనంటే అదే రైలు మార్గంమీద ఆ తరువాత రైలు నిరాటంకంగా ప్రయాణించింది. ఇరు పక్షాలమధ్య కాల్పులు ప్రారంభమైనాయి జపాన్ మొదట,

ముక్డెన్‌ను ఆక్రమించింది. తరువాత జపాన్ పుషన్, ఆంటుంగ్, చాంగ్‌చున్ వంట ముఖ్య నగరాలను స్వాధీనం చేసుకొన్నది. 1932 ఫిబ్రవరి నాటికి హార్బిన్, చిన్‌చౌ నగరాలను జపాన్ ఆక్రమించింది. ఈ విధముగా 1932 నాటికే జపాన్ మంచూరియానంతటినీ కబలించి వేసింది.

**10.4.6. నానాజాతి సమితి పాత్ర :** జపాన్ దురాక్రమణమీద చైనా ప్రభుత్వం సమితి జోక్యాన్ని కోరింది. జపాన్ మంచూరియాను ఆక్రమించడంతో, వాషింగ్‌టన్ సమావేశంలో జరిగిన 9 రాజ్యాల ఒడంబడికను, కెల్లాంగ్ - బ్రియాండ్ ఒప్పందాన్ని ఉల్లంఘించినట్లు అయా ప్రపంచ రాజ్యాల ముందు జపాన్ ముద్దాయిగా నిలబడింది. జపాన్‌మీద ఆంక్షలు విధించాలి అని సమితిలోని సభ్యులు కొందరు కోరినారు. కాని ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లు దీనిని వ్యతిరేకించాయి. దీనితో జపాన్‌కు ప్రోత్సాహం లభించింది. 1931 అక్టోబర్ 24న దక్షణ మంచూరియా రైల్వే ప్రాంతనుంచి సైన్యాలను, ఉపసంహరించుకోవలసిందిగా, సమితి జపాన్‌ను ఆదేశించింది. కానీ జపాన్, దీనిని తిరస్కరించింది. 1931 డిశంబర్ 10న సమితి మంచూరియా వ్యవహారాల పరిశీలన కోసం, లార్డ్ లిట్టన్ అధ్యక్షతన, ఒక సంఘాన్ని నియమించింది. 1932లో జనవరి అంతానికి చైనా, జపాన్ యుద్ధం, షాంగ్ హై ప్రాంతానికి వ్యాపించింది. షాంగ్‌హై నగరంలో జపాన్ వస్తువులను, పూర్తిగా బహిష్కరించడం జరిగింది. చైనీయుల ప్రతిఘటనను తొలగించడానికి, జపాన్ తన యుద్ధ నౌకలను షాంగ్‌హై నగరానికి పంపగా, చైనా సైన్యం జపాన్ దాడినుంచి రక్షించుకొన్నది. బ్రిటన్, అమెరికాలు జపాన్ నౌకల దాడిని తీవ్రంగా నిరశించి షాంగ్‌హైలోని అంతర్జాతీయ ప్రాంతాలను, రక్షించడానికి, తమ, తమ నౌకాబలాలను తరలించినాయి. దీని ఫలితంగా 1932 మే లో జపాన్, చైనాల మధ్య యుద్ధ విరమణ జరిగి, జపాన్ సైన్యాలు షాంగ్‌హై నుంచి వైదొలగినాయి.

**10.4.7. స్టింసన్ సిద్ధాంతం :** ఈలోగా అమెరికా విదేశాంగ శాఖ కార్యదర్శి స్టింసన్ ఒక ప్రకటనద్వారా, అంతర్జాతీయ ఒప్పందాలకు వ్యతిరేకంగా జపాన్, చైనాలో సంపాదించిన భూభాగాలను, సదుపాయాలను, అమెరికా గుర్తించదు అని తెలియజేశాడు. అంతేగాక చైనా, అమెరికాల మధ్యగల ఒప్పందాలు, చైనాలో అమెరికా పౌరులు, చైనా రిపబ్లిక్ సర్వ స్వతంత్ర ప్రతిపత్తి ప్రాదేశిక సమగ్రతలు వీటికి భంగకరమైన ఎటువంటి విధానాలకు అమెరికా అంగీకరించదు అని తెలియజేశాడు. స్టింసన్ సందేశ సారాంశానికీ, స్టింసన్ సిద్ధాంతం అనే పేరు వచ్చింది. దీనిని "హూవర్ - స్టిమ్సన్" సిద్ధాంతం అని కూడా అంటారు. ఈ సిద్ధాంతాన్ని సమితిలోని ఐరోపా రాజ్యాలు బలపరచలేదు.

**10.4.8. మంచూకో అవతరణ :** జపాన్, మంచూరియాతో తన స్థానాన్ని సుస్థిరం చేసుకొని 1932 ఫిబ్రవరి 18 న ఒక సాహస చర్య తీసుకొంది. మంచూరియాను మంచూకో అనే కొత్త స్వతంత్ర రాజ్యంగా జపాన్ ప్రకటించింది. 1932 మార్చి 4 న ఆర్థరి మంచూ చక్రవర్తి అయిన హెన్రీపూయి మంచుకో రాజ ప్రతినిధి అయినాడు. 1932 సెప్టెంబర్ 15 న జపాన్ ఈ కొత్త రాజ్యాన్ని గుర్తించింది. దీనితో జపాన్ మంచూరియా సమస్యమీద ఇక ఎట్లాంటి పరిష్కారాన్ని ఆమోదించదని ప్రపంచ రాజ్యాలకు వెల్లడి చేయడమైయింది. కానీ చైనా మంచూకోను గుర్తించలేదు.

1932 అక్టోబర్‌లో సమితి నియమించిన, లిట్టన్ సంఘం మంచూరియా సమస్యమీద తన నివేదికను ప్రకటించింది. మంచూకోను ఏ రాజ్యము గుర్తించరాదు అని, చైనా ఆధిపత్యమంతా, మంచూరియాలో ప్రభుత్వ స్థాపన జరుగవలెనని, సమితి ఆధ్వర్యంలో చైనా జపాన్‌లు, ప్రత్యక్ష సంప్రదింపులు జరుపుకోవాలి అని ఈ నివేదిక సూచించింది.

లిట్టన్ నివేదికను జవాబుగా, జపాన్ మంచూరియాలో చమురు సమృద్ధిగా ఉన్న జెహోల్ రాష్ట్రాన్ని ఆక్రమించింది. అంతేగాక, 1933 మార్చి 27న తాను సమితినుంచి వైదొలగుతున్నట్లు జపాన్ ప్రకటించింది. జపాన్ సైన్యాలు పీకింగ్ ప్రాంతంలో కూడా ప్రవేశించాయి. దీనితో 1933 మే 31 న టంగ్‌కు వద్ద చైనా జపాన్‌లమధ్య, యుద్ధ విరమణ జరిగింది. దాని ప్రతిఫలంగా ఆ ప్రాంతాన్ని నిస్సైనికీకరణ ప్రాంతంగా గుర్తించడం జరిగింది.

**10.4.9. మంచూరియా ఆక్రమణ ఫలితాలు :** జపాన్ మంచూరియా ఆక్రమణకు, ముఖ్యంగా దోహదము చేసినది. అగ్రరాజ్యాల, అస్థిర విధానాలే. రష్యా విదేశాంగ-మంత్రి లిట్వినోవౌ జపాన్‌కు వ్యతిరేకంగా సంయుక్త కూటమి ఏర్పాటుకు ప్రతిపాదించగా దానిని అమెరికా బ్రిటన్, ఫ్రాన్స్‌లు వ్యతిరేకించాయి. వాషింగ్‌టన్ సమావేశంలో కుదిరిన 9 రాజ్యాల ఒప్పందం చైనా ప్రాదేశిక సమగ్రతను ఏ విధముగాను

కాపాడలేకపోయింది. మంచూరియా ఆక్రమణ చైనాలోని చియాంగ్ ప్రభుత్వం బలహీనతను, బహిర్గతం చేసింది. జపాన్, మంచూరియా ఆక్రమణ నానాజాతి సమితి బలహీనతను కూడ బయలు పరచింది. ఏమైనప్పటికీ, జపాన్ బల ప్రయోగంతో సుమారు 5 లక్షల చదరపు మైళ్ళుగల ప్రదేశాన్ని చైనా నుంచి ఆక్రమించుకొన్నది. మంచూకో అవతరణవల్ల 100 సంవత్సరాలుగా వ్యాపిస్తున్న పాశ్చాత్య దేశాల సముద్ర వ్యాపార శక్తికీ, ఒక్కసారిగా తూర్పు ఆసియాలో ప్రతిద్వంద్విగా జపాన్ ఒక ఖండాంతర శక్తిని ఏర్పరచినట్లు అయినది. ఏమైనప్పటికీ, అమెరికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌లు గానీ నానాజాతి సమితిగానీ, జపాన్ దురాక్రమణను నిరోధించి మంచూకో విషయంలో చైనా సమగ్రతను కాపాడలేకపోయాయి. నూతనముగా ఏర్పాటు అయిన మంచూకో పూలోచే పరిపాలించబడినప్పటికీ అది కేవలం నామమాత్రం అయింది. అసలు అధికారాలు అచట నియమితుడైన జపాన్, రాయబారి చేతుల్లో కేంద్రీకృతమై ఉన్నాయి.

మంచూకో ఏర్పడిన తరువాత ఆ ప్రాంతం ఆర్థికముగా ఎంతో అభివృద్ధి చెందింది. ఒకప్పుడు వ్యవసాయ రంగముగా ఉన్న ప్రాంతం ఇప్పుడు పారిశ్రామికంగా మారింది. ముఖ్యంగా, రైల్వే సౌకర్యాలు ఎంతో ఆకర్షణీయంగా అభివృద్ధి చెందినాయి. వీటితో పాటు వైమానిక మార్గాలు కూడా, ఏర్పడటంతో మంచూరియాలోని ముఖ్య పట్టణాలు అన్ని కలిసాయి. టెలిఫోన్, టెలిగ్రాఫ్, సౌకర్యాలు ఎంతో అభివృద్ధి చెందాయి. మంచూకోలోని వనరులవల్ల, జపాన్‌కు ఎగుమతులు కూడా, అధికం అయ్యాయి. జపాన్ ఇతర దేశాలపై, పరిశ్రమలకు కావలసిన, సరుకుల కోసం ఆధారపడటం తగ్గింది. జపాన్ నుంచి మంచూకో వలస వచ్చేవారి సంఖ్య రెండింతలు అయింది. మంచూకో ఆర్థిక అభివృద్ధి అంటే జపాన్‌వారికి, రక్షణ కోసం జరిపిన, అభివృద్ధి అనీ, అంతేగానీ అక్కడి ప్రజల కొరియన్ల చైనీయుల శ్రేయస్సు కొరకు జరిగింది కాదు అని గుర్తించాలి.

## 10.5. చైనామీద జపాన్ దురాక్రమణ :

మంచూరియాలో లభించిన విజయంవల్ల, జపాన్ సైనిక అధికారుల సామ్రాజ్య కాంక్ష మరింతగా పెరగసాగింది. దూర ప్రాచ్యంలోనూ ఆసియాలోను, పశ్చిమ రాజ్యాల ప్రాబల్యాన్ని నిర్మూలించి తన రాజకీయ సర్వాధిపత్యాన్ని ఆర్థిక నాయకత్వాన్ని ఆ ప్రాంతాలమీద స్థాపించవలెనని జపాన్ ప్రయత్నించింది. దీనిని సాధించటానికీ, చైనా ద్వారాలను, పాశ్చాత్య రాజ్యాలకు శాశ్వతముగా మూసివేయవలసిన అవసరం ఉంది అని జపాన్ భావించింది. జపాన్ చైనాపట్ల అనుసరించిన ఈ విధానానికి జపాన్ మన్రో సిద్ధాంతం అని కూడా అంటారు. 1934 ఏప్రిల్‌లో జపాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఒకరు చెప్పినట్లు చైనాలోని తూర్పు ఆసియాలోనూ శాంతి భద్రతలను నెలకొల్పే బాధ్యతను జపాన్ స్వీకరించింది. కాని అమెరికా, బ్రిటన్‌లు అందుకు అంగీకరించలేదు. మంచూరియాలో రష్యాకు ఉన్న హక్కులకు పరిహారం చెల్లించి, జపాన్ స్వాధీనం చేసుకుంది. దీనితో ఉత్తర దక్షిణ మంచూరియా రైల్వేలు రెండూ జపాన్ ఆధీనంలోకి వచ్చాయి.

**10.5.1. కామిన్ టర్న్ వ్యతిరేక ఒప్పందం :** హిట్లర్ విధానాలు జపాన్ సైనిక అధికారులను ఆకర్షించాయి. ఇటలీ నియంత ముస్సోలినీతో హిట్లర్ రోమ్ - బెర్లిన్ అక్ష కూటమిని ఏర్పరచినాడు. వీరిద్దరు కమ్యూనిజంకు వ్యతిరేకులు. చైనాలో కమ్యూనిస్టు రష్యా ప్రాబల్యాన్ని అంతం చేయవలెనని, జపాన్ సంకల్పం. ఈ కారణాలవల్ల, జర్మనీ జపాన్‌లు, బెర్లిన్‌లో కోమిన్‌టర్న్ వ్యతిరేక ఒప్పందాన్ని కుదుర్చుకొన్నాయి. ఈ ఒప్పందంలో ఇటలీ కూడా, 1937లో భాగస్వామి అయినది. దీనితో రోమ్, బెర్లిన్, టోక్యో అక్ష కూటమి ఏర్పడింది. ఈ కూటమి ఏర్పడటానికి ప్రధాన కారణం కమ్యూనిస్టుల పట్ల ద్వేషమైన చివరికి ఇది దురాక్రమణ కూటమిగా మారి రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభం కావటానికీ ఒక కారణం అయింది. ఈ విధముగా జపాన్ యూరప్‌లోని శక్తిమంతమైన రాజ్యాలతో సంధి కుదుర్చుకొని చైనామీద దురాక్రమణను కొనసాగించింది.

**10.5.2. చైనా-జపాన్ రెండో యుద్ధం :** 1937లో పీకింగ్ సమీపంలోని లుకొ ఛియావో వద్ద జరిగిన చిన్న సంఘటన రెండో చైనా-జపాన్ యుద్ధానికి దారితీసింది. ఈ సంఘటననే మార్కోపోలో వంతెన సంఘటన, గురించి చైనా జపాన్‌లలో పరస్పర విరుద్ధమైన అభిప్రాయాలను, వెలిబుచ్చడం జరిగింది. బాక్సర్ తిరుగుబాటు అనంతరం జపాన్‌కు ఉత్తర చైనా ప్రాంతంలో సైనిక దళాలను నిలుపుకోడానికి, హక్కు లభించింది. రాజధానిని నాన్‌కింగ్‌కు తరలించినప్పటికీ ఈ హక్కు తనకు ఉన్నది అని జపాన్ భావించింది. అందువల్ల 1936 నుంచి లుకొ చియావో వద్ద జపాన్ సైనిక విన్యాసాలను జరిపింది. జపాన్ సైన్యాలమీదా 1937 జూలై 7 రాత్రి చైనా సైనికులు కాల్పులు జరిపారు అని జపాన్ ఆరోపించింది. మరుసటి రోజా ఉదయం అదనపు సైన్యాలను, తప్పించుకొని జపాన్ చైనా సైనికులమీద కాల్పులు

ప్రారంభించింది. కాని చైనా తాను మొదట కాల్పులు జరపలేదు అని జపాన్ సైన్యాలే కాల్పులను మొదట ప్రారంభించింది అని పేర్కొన్నది. ఈ సంఘటనను విచారించడానికి చైనా జపాన్‌లు ఒక సంయుక్త సంఘాన్ని ఏర్పాటు చేసినాయి. కాని ఒకవంక చర్చలు జరుగుతూ ఉండగనే వేరొకవైపు ఇరుపక్షాలు, కాల్పులను ప్రారంభించాయి. 1937 జూలై 27 నాటికి, జపాన్ సైన్యాన్ని టోజాకి చైనా సేనలను ఉపసంహరించవలసింది అని కోరాడు. దీనికి చైనా తిరస్కరించగా, జపాన్ సైన్యాలు పీకింగ్ - టీన్‌స్టన్ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకొన్నాయి. జపాన్ ప్రధాని కోనోయీ చైనాతో సంప్రదించదలచాడు. కాని నాన్ కింగ్ ప్రభుత్వం దీనిని తిరస్కరించి ఉత్తర చైనాలో తన ఆధిపత్యాన్ని నిలుపుకోటానికీ, యుద్ధం చేయడానికీ నిశ్చయించింది. జపాన్ తన సైన్యాలను యుద్ధ సామగ్రినీ పెద్ద ఎత్తున ఉత్తర చైనాలో దింపింది.

చైనాగాని జపాన్‌గాని అధికార రీత్యా, యుద్ధ ప్రకటన చేయలేదు కాని యుద్ధము సాగింది. జపాన్ ఉప ధృవాన్నే ఎదుర్కొనటానికి తొలిసారిగా, చైనా జాతి మొత్తం ఏకమైంది. కోమిన్‌టాంగ్ కమ్యూనిస్టులమధ్య ఒప్పందం కుదిరింది. ఎర్ర సైన్యాలు జాతీయ సైన్యంలో చేరి ఛియాంగ్ నాయకత్వంలో పోరాడటానికీ సన్నద్ధం అయ్యింది. రెండో చైనా - జపాన్ యుద్ధాన్ని మీరు ఘట్టాలుగా వివరింపవచ్చు. అవి 1) షాంగ్‌హై వద్ద ప్రారంభమైన యుద్ధంమంచి నాన్ కింగ్ పతనం వరకు 2) నాన్‌కింగ్ పతనం నుంచి కాంటన్, హాంకోట జపాన్ స్వాధీనం అయ్యే వరకు 3) హంకోనుంచి చుంకింగ్‌కు చైనా ప్రభుత్వం తరలించినప్పటి నుండి 1945 వరకు.

1) షాంగ్‌హై వద్ద జపాన్ సైన్యాలను చైనా సైన్యాలను ఎదుర్కొన్నాయి కాని చైనా సైన్యాలకు తగిన ఆయుధ సంపత్తిలేదు. జపాన్ వైమానిక దళం చైనా విమానాశ్రయాలను రహదార్లను రైల్వే కూడలులను బాంబులకు గురి చేసింది. చైనా ప్రజలను భీతావహులను చేయడానికి జపాన్ పౌర నివాసాలను కూడా విమాన దాడులకు గురి చేసింది. 1937 నవంబర్ నాటికి జపాన్ సైన్యాలు షాంగ్‌హైని ఆక్రమించాయి. అదే నెలలో జరిగిన బ్రస్సెల్స్ సమావేశంలో అగ్రరాజ్యాలు చైనామీద జపాన్ దురాక్రమణను ఖండించాయి. కాని అవి ఆ దురాక్రమణను అరికట్టలేకపోయాయి. ఒక నెలలోగానే జపాన్ నాన్‌కింగ్‌ను స్వాధీనం చేసుకొన్నది. నాన్‌కింగ్ పతనంతో చైనా కేంద్ర ప్రభుత్వాన్ని హంకోకు తరలించడం జరిగింది. ఉత్తర చైనాలో జపాన్ సైన్యాలు కాల్గాన్‌ను స్వాధీనం చేసుకొని చైనా రష్యాల మార్గాన్ని నిరోధించాయి. సూయీయువాన్ రాష్ట్రం కూడా జపాన్ ఆధీనం అయింది. కాని షాన్‌షీ రాష్ట్రంలో జపాన్‌కు తీవ్ర ప్రతిఘటన కమ్యూనిస్టుల వలన కలిగింది. మొదటి ఘట్టంలో జపాన్ చెప్పుకోదగిన విజయాలు సాధించిన, చియాంగ్ ఆధిక్యాన్ని ఛేదించలేకపోయింది. ఛియాంగ్ ప్రభుత్వంతో తెగతెంపులు చేసుకోనున్నట్లు జపాన్ ప్రకటించింది.

2) రెండో ఘట్టంలో చైనా కొత్త రాజధాని అయిన హంకోను స్వాధీనం చేసుకోటానికి చైనా సైన్యాలను ధ్వంసం చేయటానికీ, జపాన్ ప్రయత్నించింది. 1938లో జపాన్ సైన్యాలు షాంటుంగ్‌ను స్వాధీనం చేసుకొన్నాయి. అయితే చైనీయులు జపాన్‌ను తీవ్రంగా ప్రతిఘటించి, టాయిర్, చుయాంగ్ వద్ద జపాన్ సైన్యాలను ఓడించారు. చైనీయులు, గెరిల్లా యుద్ధ పద్ధతుల ద్వారా, ఉత్తర చైనాలో జపాన్ సైన్యాల పురోగతికి, అవరోధం, కలిగించారు. జపాన్ 1938 అక్టోబర్‌లో కాంటన్‌ను ఆ తరువాత, హంకోను స్వాధీనం చేసుకొంది. హంకో పతనం తరువాత జపాన్ యుద్ధం నిలిపివేయటానికి తన సంసిద్ధతను, ప్రకటించింది. కాని ఛియాంగ్ జపాన్ షరతులను తిరస్కరించాడు.

3) జపాన్ 1939 లో దక్షిణ చైనా తీరంలోని హైనాన్ దీవిని, స్ప్రాట్లీ దీవులను ఆక్రమించింది. హాంకో పతనం తరువాత జాతీయవాదులు, తమ రాజధానిని చుంగ్ కింగ్‌కు మార్చారు. దీనితో చైనాకు, పాశ్చాత్య ప్రపంచానికీ, సంబంధాలు లేకుండాపోయాయి. జపాన్ సేనలు, యుద్ధనగరాలను, రైలు మార్గాలను, తమ ఆధీనంలో ఉంచుకోగా, దేశంలోని గ్రామీణ ప్రాంతాలు అన్ని చైనా గెరిల్లాల, స్వాధీనంలో ఉన్నాయి. చైనా, గెరిల్లాల సైన్యాలు జపాన్ సైన్యాలకు తీవ్ర ప్రతిఘటనను ఇచ్చాయి. జపాన్ యుద్ధాలను జయించింది గాని చైనాను జయించలేదు. ఈ పరిస్థితుల్లోనే రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమైయింది.

**10.5.3. జపాన్ విజయానికి కారణాలు :** 1939 వరకు జపాన్ విదేశాంగ విధానం జయప్రదం కావటానికి కొన్ని కారణాలు ఉన్నాయి. మంచూరియామీద జపాన్ దండయాత్ర చేసినప్పుడు అగ్ర రాజ్యాలు కలిసికట్టుగా వ్యవహరించి ఉంటే జపాన్ దురాక్రమణను అరికట్టగలిగేది. కాని జపాన్‌తో యుద్ధం ఖర్చుతో కూడుకొన్నది కావటంతో అగ్ర రాజ్యాలు అందుకు సాహసించలేదు. దీనితో జపాన్ నవ

సామ్రాజ్యతత్వాన్ని అగ్రరాజ్యాలు పరోక్షంగా, ప్రోత్సహించినట్లు అయింది. దీనికితోడు ప్రపంచ ఆర్థిక మాంద్యమువల్ల అగ్ర రాజ్యాలు ఇతర దేశ వ్యవహారాల్లో కలుగజేసుకోటానికి ఉత్సాహం చూపలేదు. నానాజాతి సమితి సమర్థంగా పనిచేయలేదు. దీనికి కారణం, అమెరికా సమితిలో సభ్య దేశం కాకపోవటమే, చైనాలోని అంతర్ యుద్ధం జపాన్ విజయానికి బాగా తోడ్పడింది.

**10.5.4. కీలు బొమ్మ ప్రభుత్వం ఏర్పాటు :** చైనాలో తమ స్థానాన్ని సుస్థిరం చేసుకోవడానికి ఒక కీలు బొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవలెనని జపాన్ సంకల్పించింది. వాంగ్‌ఛింగ్‌లీ అధినేతగా 1940 మార్చి 30న ఒక ప్రభుత్వం ఏర్పడింది. జపాన్ సహకారంతోనే, చైనా మనుగడ సాధించగలదు అని వాంగ్ విశ్వసించాడు. ఇతని ప్రభుత్వాన్ని జపాన్ అధికార రీత్యా గుర్తించింది. కమ్యూనిస్టులను అణచడానికి, ఆర్థికాభివృద్ధి విషయలో పరస్పరం సహకరించుకోటానికి, వాంగ్ ప్రభుత్వం జపాన్ ఒక ఒడంబడికను కుదుర్చుకొన్నాయి. 1941 జూలైలో వాంగ్ ప్రభుత్వాన్ని జర్మనీ, స్పెయిన్, ఇటలీ రుమేనియాలు గుర్తించాయి. ఈ విధంగా కీలు బొమ్మవాంగ్ ప్రభుత్వం క్రింద దాదాపు, 5 లక్షల చ. మై. విస్తీర్ణం ఉన్న ప్రాంతం ఉంది. ఈ ప్రాంతాన్నంతటినీ ఆర్థికంగా కొల్లగొట్టడానికి జపాన్ నిశ్చయించింది. జపాన్ వ్యతిరేక భావాలను, ఈ ప్రాంతంనుంచి నిర్మూలించడానికి జపాన్ బహుళ ప్రచారం సాగించింది.

## 10.6. జపాన్ రెండో ప్రపంచ యుద్ధం :

1939 సెప్టెంబర్‌లో రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమైనప్పుడు దీనిలో తాను పాల్గొనబోను అని జపాన్ ప్రకటించింది. అంతేగాక చైనా వ్యవహారాన్ని తన శాయశక్తుల ప్రయత్నం చేసి పరిష్కరిస్తాను అని ప్రకటించింది. కాని త్వరలోనే యూరప్ యుద్ధము ఆసియా రాజకీయాలలో కూడా ప్రవేశించింది. 1940 జూన్ నాటికి యూరప్‌లో హాలెండ్ బెల్జియం, ఫ్రాన్స్‌లను జర్మనీ స్వాధీనం చేసుకొని బ్రిటన్‌పై యుద్ధం ప్రారంభించింది. ఈ సంఘటనలో తూర్పు ఆసియాలో తన సామ్రాజ్యతత్వ విధానాన్ని కొనసాగించడానికి జపాన్‌కు అవకాశం కలిగించాయి.

**10.6.1. బ్రిటన్‌తో ఒప్పందం :** హాంకాంగ్, బర్మాలనుంచి చైనాలోని జాతీయ ప్రభుత్వానికి సరఫరాలో నిలుపు చేయడానికి బ్రిటన్‌నుంచి జపాన్ అంగీకారము పొందింది. ఫ్రెంచ్ ఇండో చైనాకు నైఋతి చైనాకు మధ్యగల సరిహద్దును జపాన్ ఒత్తిడి మూలంగా మూసివేయడం జరిగింది. పాశ్చాత్య రాజ్యాలు యూరప్ యుద్ధములో నిమగ్నమై ఉండడంవల్ల దూర ప్రాచ్యంలో తన సైనిక స్థోమతను పెంపొందించుకోవడమేగాక, ఆగ్నేయ ఆసియాలో లభించే చమురు, బాక్సైట్, తగరం, రబ్బరువంటి ముడి సరుకులను సంపాదించి ఆర్థికముగా కూడా బలపడటానికి పథకం వేసింది.

**10.6.2. రష్యా-చైనా దురాక్రమణ వ్యతిరేఖ సంధి :** ఇదే సమయంలో అమెరికా జపాన్‌కు పెట్రోలియం, లోహాలు మొదలగు ఎగుమతులమీద ఆంక్షలు విధించింది. అంతేగాక 1939 నుంచి మంచూకో సరిహద్దులలో రష్యా చర్యలు కూడా జపాన్ ఆందోళనకు కారణం అయినాయి. అందువల్ల జపాన్ రష్యాతో సంప్రదింపులు జరిపి 1941 ఏప్రియల్ 3న రష్యా జపాన్ దురాక్రమణ వ్యతిరేక సంధిని చేసుకున్నది.

**10.6.3. అమెరికాతో స్నేహ సంబంధాల వృద్ధికి కృషి :** 1941 నుంచి జపాన్ అమెరికాతో స్నేహ సంబంధాలను వృద్ధి చేసుకోవడానికి ప్రయత్నించింది. అడ్మిరల్, నోమూరా, అమెరికాలో జపాన్ కొత్త రాయబారిగా నియమితుడైనాడు. ఇతడు జపాన్ అమెరికాల మధ్యగల సంబంధాలను మెరుగు పరచడానికి కృషి చేసాడు. దక్షిణ పసిఫిక్ ప్రాంతంలో సమస్యల పరిష్కారానికి శాంతియుత పద్ధతులను మాత్రమే జపాన్ అనుసరిస్తుంది అని, బర్మామీద దురాక్రమణ జరిగినప్పుడు మాత్రమే ఆ దేశానికి తన దేశం సహాయం చేస్తుంది అని నోమూరా అనధికార ప్రకటన చేసాడు. దీనికి ప్రతి ఫలముగా అమెరికా జపాన్‌లమధ్య తిరిగి మామూలు వ్యాపార సంబంధాలు నెలకొనవలె. దక్షిణ పసిఫిక్‌లో జపాన్ ముడి సరుకులను సంప్రదించుకోవడానికి అమెరికా సహాయపడవలెను. చైనా జాతీయ ప్రభుత్వాలమీద తన పలుకుబడిని ఉపయోగించి అమెరికా చైనా జపాన్‌లమధ్య యుద్ధ విరమణ జరిగేటట్లు చూడవలెను. దీనికి ప్రతిగా అమెరికా విదేశాంగ కార్యదర్శి హాల్

కొన్ని ప్రతిపాదనలు చేసాడు. అవి : జపాన్ ప్రపంచ దేశాల స్వాతంత్ర్యాన్ని ప్రాదేశిక సమగ్రతను గౌరవించవలెను. ఇతర దేశాల ఆంతరంగిక వ్యవహారాలలో ఏ దేశము జోక్యం కలుగజేసుకోకూడదు. అన్ని దేశాలకు వాణిజ్య వ్యవహారాలలో సమానమైన హక్కులు ఉండవలెను. పసిఫిక్ మహా సముద్రములో యధాస్థితి కొనసాగవలెను. హోల్ - నోమూరాల మధ్య సంభాషణలు విఫలమైనాయి. ఈలోగా జర్మనీ రష్యామీద యుద్ధాన్ని ప్రకటించడంతో జపాన్‌లో యుద్ధ ప్రయత్నాలు తీవ్రమైనాయి.

**10.6.4. ఇండో-చైనాలోకి జపాన్ విస్తరణ :** ఇండో - చైనా ఐదు రాజకీయ విభాగాలతో కూడుకున్నది. అవి : కొచ్చిన్, చైనా, టోనేన్, అన్నాం, లావోస్, కాంబోడియాలు; 20వ శతాబ్దంలో చివరి మూడు విభాగాలు ఫ్రెంచి రక్షణ క్రిందికి వచ్చాయి. ఇవి ప్రస్తుత స్వాతంత్ర్య రాజ్యాలు అయిన వియత్నాం, కంబోడియా, లావోస్‌లు. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో జపాన్ దాడుల వల్ల ఇండో-చైనా వలస రాజ్య వ్యవస్థ పునాదులు కదిలి పోయాయి. 1940 నాటికి ఫ్రాన్స్ యూరప్‌లో ఓటమి పాలు అయ్యింది. ఇండో-చైనాలో దాని వలస రాజ్యాలపై కూడా ఈ ఓటమి ప్రభావం పడింది. అమెరికానుంచి సహాయం కోసం ఫ్రాన్స్ చేసిన ప్రయత్నాలు అన్ని విఫలమైనాయి. దీనితో ఇండో-చైనా వనరులు అన్నింటిని జపాన్ చేతిలో పెట్టాల్సి వచ్చింది. 1941 జూలైలో ఫ్రెంచి సైన్యాలు ఇండో-చైనాను ఆక్రమించాయి. జపాన్ పర్యవేక్షణలో టోన్కిన్, అన్నాంలను బావోదాయి విలీనం చేసాడు. అన్నాం సామ్రాజ్యానికి వియత్నాం అనే పేరు మార్చి పూర్తి స్వాతంత్ర్యం ప్రకటించాడు బావోదాయి. అలాగే కాంబోడియా రాజు, లావోస్ అధినేత కూడ తమ దేశాలకు స్వాతంత్ర్యము ప్రకటించడంతో ఇండో-చైనా వియత్నాం, కంబోడియా, లావోస్ అనే మూడు దేశాలుగా రూపాంతరం చెందినవి.

**10.6.5. అమెరికా విధానంలో మార్పులు :** జపాన్ సైన్యాలు ఇండో చైనాను ఆక్రమించి, అమెరికా నౌకా స్థావరమైన పెరల్ హార్బర్‌మీద దండెత్తడానికి నౌకా విన్యాసాలు ప్రారంభించింది. దీనితో అమెరికా విధానంలో మార్పు వచ్చింది. అమెరికాలోని జపాన్ ఆస్తులు అన్నింటిని స్వాధీనం చేసుకోవలసిందిగా అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ ఉత్తరువులు జారీ చేసాడు. జపాన్-అమెరికాలమధ్య శాంతియుత పరిష్కారాన్ని సాధించడానికి జపాన్ ప్రధాని కోనోయీ చేసిన ప్రయత్నాలు విఫలం అయినాయి. యుద్ధ మంత్రి టోజో జపాన్ ప్రధాని అయ్యాడు. అమెరికాతో చర్చలు నవంబర్ 25 లోగా పూర్తి కావాలని అవి విఫలమైతే యుద్ధం తప్పదు అని, పెరల్ హార్బర్, మనిలా, సింగపూర్‌లమీద దాడి జరపాలి అని టోజో మంత్రి వర్గం 1941 నవంబర్ 5న నిర్ణయించింది. అమెరికాతో చర్చలు సాగించడానికి జపాన్ ప్రత్యేక రాయబారి కురుసు నబురోను పంపింది. కాని ఒప్పందమేమి కుదరలేదు. అమెరికా అధికారులు జపాన్ సాంకేతిక రహస్యాలను సంప్రదించి జపాన్ అంతిమ ధ్యేయం తమతో యుద్ధము చేయడమేనని గ్రహించారు. అయినా జపాన్ యుద్ధము ప్రారంభించే వరకు తమకై తాము ఎటువంటి చర్య తీసుకోరాదు అని అమెరికావారు నిశ్చయించినారు.

**10.6.6. పెరల్ హార్బర్‌మీద జపాన్ దాడి :** ఒకవైపు అమెరికా చర్చలు జరుపుతూనే వేరొకవైపు జపాన్ అమెరికాకు చెందిన పెరల్ హార్బర్‌మీద దాడి చేయాలి అని నిశ్చయించింది. 1941 డిసెంబర్‌లో ఎటువంటి యుద్ధ ప్రకటన చేయకుండా జపాన్ విమాన, నౌకా, జలాంతర్గాములు పసిఫిక్ మహాసముద్రములోని అమెరికా ముఖ్య స్థావరమైన హవాయ్ దీవులలోని పెరల్ హార్బర్ మీద ఆకస్మికముగా దాడి జరిపాయి. ఈ దాడిలో సుమారు 3 వేలమంది అమెరికన్‌లు మరణించారు. అనేక అమెరికన్ విమానాలు ధ్వంసం అయినాయి. 8 యుద్ధ నౌకలు, అనేక చిన్న నౌకలు కూడా ధ్వంసం అయినాయి. దీనితో అమెరికా కాంగ్రెస్ జపాన్‌మీద యుద్ధాన్ని ప్రకటించింది. డిశంబర్ 11న ఇటలీ, జర్మనీలు అమెరికా మీద యుద్ధాన్ని ప్రకటించాయి. జపాన్ మీద అమెరికాతోబాటు బ్రిటన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడా, నెదర్‌లాండ్స్ మొదలగు దేశాలు యుద్ధాన్ని ప్రకటించాయి. దీనితో రెండవ ప్రపంచ యుద్ధం ప్రపంచ యుద్ధముగా పరిణమించింది.

**10.6.7. జపాన్ పురోగమనము :** జపాన్ పసిఫిక్ మహా సముద్రములో విజయ పరంపరలను సాధించింది. అమెరికాకు చెందిన గువామ్, వేక్ దీవులను, బ్రిటీష్‌వారి హాంకాంగ్‌ను జపాన్ స్వాధీనం చేసుకున్నది. సింగపూర్ వద్ద బ్రిటిష్ యుద్ధ నౌక ప్రిన్స్ ఆఫ్ వేల్స్‌ను జపాన్ జలాంతర్గములు ముంచివేసినాయి. ముఖ్య పట్టణమైన మనిలాతోబాటు ఫిలిప్పైన్స్ దీవులు కూడా జపాన్ స్వాధీనం అయినాయి. దీనితో డగ్లస్ మెకార్థర్ సేనాని, తన అమెరికన్ సేనలతో ఆస్ట్రేలియాకు తరలి వెళ్ళవలసి వచ్చింది. 1942 మార్చి నాటికి సింగపూర్‌ను

స్వాధీనం చేసుకున్న జపాన్ సేనలు బర్మా, మలయా, డచ్చి, ఇండోనేషియాలను కూడా ఆక్రమించాయి. దీనితో 1942 నాటికి సుమారు 16 లక్షల చ.కి.మీ. వైశాల్యమున్న భూభాగము జపాన్ స్వాధీనం అయ్యింది. దక్షిణ పసిఫిక్ సముద్రములోని న్యూగినే, సాలమన్ దీవులను కూడా జయించి జపాన్ ఆస్ట్రేలియా మీద దాడికి సిద్ధమైంది. 1942 జూన్ నాటికి జపాన్ విజృంభణను అమెరికా అరికట్టగలిగింది. అమెరికన్ నౌకా దళాధిపతి ఆడ్మిరల్ నెమిట్జ్ నౌకా యుద్ధములో జపాన్‌ను ఓడించి తరిమివేశాడు. నెమిట్జ్, మెకార్డర్ సేనానులు ఆస్ట్రేలియన్ల, సహకారంతో క్రమ క్రమముగా న్యూగినే, ఆట్టా, కిస్కా, మకిను, మార్షల్ దీవులను ఆక్రమించారు.

## 10.6.8 : హిరోషిమా - నాగసాకిలమీద అణుబాంబుల ప్రయోగం :-

జపాన్ 1942 నాటికి పసిఫిక్ ప్రాంతములో అనేక విజయాలను సాధించి, భారత సరిహద్దులవరకు చొచ్చుకొని పోయింది. తాను విముక్తి చేసిన పాశ్చాత్య వలస రాజ్యాలలో జాతీయ ప్రభుత్వాలను నెలకొల్పింది. బర్మా, ఫిలిఫ్ఫైన్స్, థాయ్ లాండ్‌లలో ఇటువంటి ప్రభుత్వాలు నెలకొన్నాయి. అంతేగాక భారత జాతీయ ఉద్యమ నాయకుడైన సుభాస్ చంద్రబోస్ జపాన్ సహకారముతో ఆజాద్ హింద్‌ఫౌజ్‌ను ఏర్పరచి, స్వేచ్ఛా ప్రభుత్వాధినేతగా వ్యవహరించాడు. జపాన్ ఉపద్రవం నుంచి రక్షించుకోవడానికి బ్రిటన్, అమెరికాలు సమిష్టి పథకాలను పన్నినాయి. 1944 నుంచి జపాన్ మీద మిత్రమండలి రాజ్యాల దండయాత్రలు ఉధృతమైనాయి. తూర్పున నుంచి మెకార్ధర్ సేనాని అమెరికన్ సేనలతోను, పడమటినుంచి మౌంట్ బాటన్ సేనాని తన ఆంగ్లసేనా సహాయంతో జపాన్ ఆక్రమిత ప్రాంతాలను విముక్తం చేసినారు. 1944 జూన్ నాటికి సైపాన్, గువాయ్ దీవులు వారి వశమయినాయి.

ఈ దీవులు స్థావరంగా చేసుకొని మిత్రరాజ్యాల సేనలు టోక్యోనగరంమీద దాడులారంభించాయి. తరువాత జపాన్‌కు సమీపంలోనె వి-ఓజీయా, బకినావా దీవులను ఆక్రమించడానికి తలపెట్టినారు. జూలైలో జపాన్ ప్రధాని టోజో పదవీచ్యుతుడయినాడు. అతని తరువాత జపాన్ ప్రధాని అయిన కునియాకీ కోయిసో యుద్ధాన్ని కొనసాగిస్తూ అంతిమ విజయము జపాన్‌దే అని ప్రకటించినా, యదార్ధానికి జపాన్, జర్మనీలు రెండు యుద్ధాల్ని విజయవంతంగా కొనసాగించే స్థితిలో లేవని తేలిపోయింది. 1944 అక్టోబర్‌లో లెయిటీ ద్వీప సమీపంలో జరిగిన బ్రహ్మాండమైన నౌకా యుద్ధంలో అమెరికన్ నౌకాదళము జపాన్ నౌకాదళాన్ని సర్వనాశనం చేసింది. దీనితో మెకార్ధర్ సేనాని ఫిలిప్పైన్ దీవులను తిరిగి ఆక్రమించడానికి అవకాశం కలిగింది. 1945 జనవరి నాటికి ఫిలిప్పైన్ దీవులు పూర్తిగా అమెరికా స్వాధీనం అయినాయి. వి-ఓజీయా ఒకినావా ద్వీపాలుకూడా అమెరికా వశమైనాయి. దీనితో జపాన్‌మీద ఎడతెరిపిలేని బాంబుల వర్షాన్ని మిత్రరాజ్యాల సేనాలు మొదలు పెట్టాయి. ఈలోగా బ్రిటిష్ సేనలు బర్మాను విముక్తము చేసినాయి. ఆస్ట్రేలియా బోర్నియోను తిరిగి వశ పరచుకుంది. అమెరికా సహాయంతో చైనీయులు తమ భూగమునుంచి జపాన్ సేనలను త్రిప్పికొట్టినారు. ఈ పరాజయంతో కోయిసో మంత్రివర్గము రాజీనామా చేయగా జపాన్‌లో సుజీకి నాయకత్వములో క్రొత్త మంత్రివర్గం ఏర్పడింది. జపాన్ లొంగి పోవలసింది అని వేలాది కరపత్రాలను జపాన్ భూబాగముమీద అమెరికా విమానాలు వెదజల్లినాయి. అయినా జపాన్ చలించలేదు. జపాన్ లొంగే సూచనలు ఏవి కనిపించకపోవడంతో జపాన్‌లోని ప్రసిద్ధ పారిశ్రామిక నగరమైన హిరోషిమా మీద 1945 ఆగస్టు 6న అమెరికా క్రొత్తగా కనిపెట్టిన అణుబాంబును ప్రయోగించింది. ఈ ప్రయోగముతో నగరమంతా సర్వ నాశనం అయ్యింది. 1945 ఆగస్టు 7న రష్యా జపాన్‌మీద యుద్ధాన్ని ప్రకటించి తన సైన్యాలను మంచూరియా, కొరియాలమీదికి పంపింది. అయిన జపాన్ యుద్ధం విరమించలేదు. అందువల్ల అమెరికా 1945 ఆగస్టు 9న మరొక పారిశ్రామిక నగరమైన నాగసాకిమీద అమెరికా తిరిగి అణుబాంబులను ప్రయోగించింది.

## 10.6.9. జపాన్ లొంగుబాటు :

1945 ఆగస్టు 10న తాము దైవాంశ సంభూతునిగా భావించే తమ చక్రవర్తిని ఆ పదవిలోనే కొనసాగించడానికి అంగీకరించే షరతులమీద జపాన్ మిత్ర రాజ్యాలకు లొంగిపోయింది. ఈ షరతును మిత్ర రాజ్యాలు ఆమోదించాయి. ఫలితముగా 1945 సెప్టెంబర్ 2 న జపాన్‌కు మిత్ర రాజ్యాలకుమధ్య మిస్సోరి అనే అమెరికన్ యుద్ధ నౌకమీద యుద్ధ విరమణ సంధి జరిగింది. దీనితో అధికారికంగా రెండో ప్రపంచ యుద్ధం ముగిసింది.

### 10.6.10. యుద్ధ ఫలితాలు :

రెండో ప్రపంచ యుద్ధములో జపాన్ మొత్తం బూడిదై పోయింది. ఈ ఓటమితో జపాన్ మొత్తం రాజ్యాధికారాన్ని కోల్పోయింది. ఈ ఓటమితో రెండో ప్రపంచ యుద్ధ సమయంలో సాధించిన వలస రాజ్యాలతో బాటు అంతకుముందు పునర్నిర్మాణం దశనుంచి సాధించుకొన్న అన్ని భూభాగాలను కోల్పోయింది. దిగుమతులు పూర్తిగా నిలిచిపోయాయి. పట్టణ ఆస్తులలో 30% ధ్వంసం అయ్యింది. 8 1/2 లక్షలమంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు.

ఈ యుద్ధం చివరకు ప్రపంచములో వలస రాజ్యాలను సామ్రాజ్య వాద ధోరణులకు చరమగీతం పాడింది. భారత్, సిలోన్, బర్మావంటి ఎన్నో రాజ్యాలు ఉద్యమాలు సాగించి స్వాతంత్ర్యము సాధించుకొన్నాయి. జనరల్ మాక్ ఆర్థర్ జపాన్‌లో నిరంకుశత్వానికి స్వస్తి పలికి రాజ్యాంగ బద్ధ, ప్రజాస్వామిక రాజకీయ వ్యవస్థలకు నాంది పలికాడు.

డాక్టర్ వి.కె. మోహన్

పాఠం - 11

# చైనాలో కొమిన్‌టాంగ్ ప్రభుత్వం - కమ్యూనిజం వ్యాప్తి

**లక్ష్యం:**

చైనాలో రిపబ్లిక్ అవతరణ, యువాన్‌షికై పరిపాలన, మొదటి ప్రపంచ యుద్ధంలో చైనా పాత్ర, నవకోమిన్‌టాంగ్ పక్షం, సనయట్‌సేన్ మూడు సూత్రాలు, చియాక్-కే-షేక్, చైనా ఏకీకరణ, చైనాలో కమ్యూనిజం వ్యాప్తి, మావోపాత్ర, కొమిన్ టాంగ్ ప్రభుత్వ పతనం మొదలగు విషయాలను గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

**విషయ క్రమం**


11.1. పరిచయం

11.2. 1911 విప్లవానికి ముందు చైనా చరిత్ర

11.3. 1911 చైనా విప్లవం - రిపబ్లిక్ అవతరణ

11.3.1 సన్‌యెట్‌సేన్

11.3.2 విప్లవం

11.3.3 రిపబ్లిక్ అవతరణ

11.3.4 విప్లవ ప్రాముఖ్యం

11.4 యువాన్‌షికై పరిపాలన

11.4.1 జపాన్ 21 కోరికలు

11.4.2 యువాన్ షికై మరణం

11.5 మొదటి ప్రపంచ యుద్ధంలో చైనా పాత్ర

11.5.1 జర్మనీ మీద చైనా యుద్ధాన్ని ప్రకటించడం

11.5.2 పారిస్ శాంతి సమావేశంలో చైనా

11.5.3 వాషింగ్టన్ సమావేశము

11.6 చైనాలో జాతీయ విప్లవ పురోభివృద్ధి

11.6.1 నవ వికాసము

11.6.2 నవ కొమిన్ టాంగ్ పక్షము - సన్‌యట్ సేన్

11.6.3 సన్‌యట్ సేన్ సిద్ధాంతాలు

11.6.3.1 జాతీయ వాదము

11.6.3.2 ప్రజా ప్రభుత్వము

11.6.3.3 ప్రజా జీవనోపాధి

11.6.4 ఉత్తర దక్షిణ చైనాల ఏకీకరణకు సేన్ విఫలయత్నం

11.6.5 సన్‌యట్ సేన్ మరణవాఙ్మూలము

11.6.6 సేన్‌ఘనత

11.7. చియాంగ్ - కే - షేక్ - చైనా ఏకీకరణ

11.7.1 ఉత్తర చైనా మీద దండయాత్ర

11.7.2 జాతీయ ప్రభుత్వ స్థాపన

11.7.3 చైనా ఆంతరంగిక వ్యవహారాలు

11.7.4 జపాన్ మంచూరియా ఆక్రమణ

11.7.5 దేశములో అంతర్యుద్ధం

11.8. చైనాలో కమ్యూనిజం వ్యాప్తి

11.8.1 కమ్యూనిస్ట్ పార్టీ స్థాపన

11.8.2 మావో - ట్సే - తుంగ్

11.8.3 కొమిన్ టాంగ్ - కమ్యూనిస్ట్‌ల మధ్య ఘర్షణ

11.8.3.1 లాంగ్ మార్చ్

11.8.3.2 సియాన్ సంఘటన

11.8.3.3 రెండో చైనా - జపాన్ యుద్ధం

11.8.3.4 రెండో ప్రపంచ యుద్ధంలో చైనా

11.8.3.5 కొమిన్ టాంగ్ - కమ్యూనిస్ట్‌ల మధ్య అంతర్యుద్ధము (1945-49)

11.9. జాతీయ వాదుల పరాజయానికి - కమ్యూనిస్ట్‌ల విజయానికి కారణాలు

**11.1. పరిచయం :**

దూర ప్రాచ్యములో చైనా, జపాన్లు ప్రముఖమైన దేశాలు. 20 వ శాతాబ్ది ఆరంభానికి చైనా చాలా పెద్ద దేశం అయిన అతి చిన్నదైన జపాన్‌తో పోల్చినప్పుడు ఏమీ ప్రగతిని సాధించలేక పోయింది. చైనా ప్రపంచంలోని పెద్ద దేశాల్లో ఒకటి అయిన, ప్రపంచ జనాభాలో 5 వ వంతు జనాభా ఉన్న తమ నాగరికతే ప్రపంచంలోని అతి ప్రాచీన నాగరికత అని గర్వంగా చెప్పుకొన్న చైనా చక్రవర్తి తనను స్వర్గలోకపు కుమారునిగా కీర్తించు కొన్న, వాస్తవానికీ, 19 వ శతాబ్దానికీ, చైనా అతి బలహీన దేశంగా ఉండేది. ఆనాడు చైనాలో సమర్థమైన, కేంద్ర ప్రభుత్వంలేదు. దేశంలోని అరాచక పరిస్థితులను, అవకాశంగా తీసుకొని పాశ్చాత్య దేశాలు చైనా భూభాగాలను, ధనాన్ని సంగ్రహించినారు. వారు చైనాను తమ పలుకుబడి ప్రాంతాలుగా విభజించి ఇంచు, మించు వలస దేశపు స్థితికి తీసుకోని వచ్చారు.

మొదటి ప్రపంచ యుద్ధానంతరం చైనీయులు డాక్టర్ సన్‌యట్‌సెన్ నాయకత్వంలో విప్లవం సాగించి. తమ దేశాన్ని ఏకం చేసినారు. మళ్ళీ దూర ప్రాచ్య చరిత్రలో చైనా ప్రజల రాజ్యం అయింది. కాని చైనాలోని జాతీయ వాదులకు, కమ్యూనిస్టులకు అంతర్‌యుద్ధం సంభవించి, 1949 వరకు కొనసాగింది. జాతీయ వాదులకు, పాశ్చాత్య రాజ్యాలు కమ్యూనిస్టులకు, సోవియట్

రష్యా సహాయం చేసేవి. 1949 నాటికి, దేశంలో జాతీయ వాదుల ప్రాబల్యం, క్షీణించగా, కమ్యూనిస్టులు, ప్రభుత్వాన్ని హస్తగతం చేసుకొని చైనాను, రిపబ్లిక్‌గా ప్రకటించారు.

## 11.2. 1911 విప్లవానికి ముందు చైనా చరిత్ర :

19వ శతాబ్దం మధ్య భాగం వరకు చైనా ప్రపంచ రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉంటూ వచ్చింది. 1661 లో మింగ్ వంశీయులను పారద్రోలి మంచూ చక్రవర్తులు చైనాను 1911 వరకు పాలించినారు. వీరి కాలంలో చైనా 2 శతాబ్దాల పాటు ప్రపంచ దేశాలతో సంబంధాలు నెలకొల్పుకోలేదు. సముద్రము ఎడారులు, పర్వతాలచే ఆవృతమైన దేశం కాబట్టి చైనా తన నాగరికతకు గర్వపడుతూ ఇతర దేశాలతో ఎటువంటి సంబంధాలు పెట్టుకోలేదు. మంచూ చక్రవర్తుల పరిపాలన చివరి రోజుల్లో దేశం అంతా అవినీతికి లంచగొండి తనానికి, ఆలవాలం అయింది. నైతికంగానూ, ఆర్థికంగానూ చైనా పతనం అయింది.

16 వ శతాబ్దంలో చైనా చక్రవర్తులు ప్రాతికూల్యాన్ని లెక్కచేయకుండా, ప్రోర్చుగీసువారు దక్షిణ చైనాలోని మెకావో ప్రాంతాన్ని స్వాధీన పరచుకున్నారు. కాంటన్ రేవు పట్టణంలో వీరు వర్తక సదుపాయాలను సంపాదించారు. బ్రిటిష్‌వారి వత్తిడి ఫలితంగా, చైనాలోని రేవుపట్టణాలను, విదేశీ వ్యాపారులకు బేరమాడడానికి చైనా చక్రవర్తి 1840 లో అంగీకరించాడు. 1842 లో జరిగిన నల్లమందు యుద్ధఫలితంగా, బ్రిటిష్ వారికి, చైనా కొన్ని రేవులను అప్పగించింది. ఇతర పాశ్చాత్య రాజ్యాలు కూడా, చైనాలో అట్లాంటి హక్కులను పొందటానికి ప్రయత్నించాయి. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, రష్యా, చైనాలో కొంత భాగాన్ని కవులుకు సంపాదించాయి. పాశ్చాత్య దేశాల కంటే జపాన్ చైనాలో ఎక్కువ సదుపాయాలను సంపాదించింది. ఈ విధంగా పాశ్చాత్య రాజ్యాలు, అమెరికా, జపాన్‌లు, చైనా దేశాన్ని తమతమ పలుకుబడి ప్రాంతాలుగా విభజించుకున్నాయి. చైనాలో కేంద్రప్రభుత్వం నామమాత్రమైనదే. విదేశీలందరికీ, చైనా రేవులో సౌకర్యాలు లభించినాయి. దేశంలోని రైలుమార్గాలు తంతి తపాల కార్యలయాలు, వాణిజ్య సుంకాలు, పరిశ్రమలు, పూర్తిగా విదేశీయుల ఆధీనంలోకి వచ్చినాయి. చైనా పూర్తిగా పతనావస్థకు దిగజారింది.

పాశ్చాత్య రాజ్యాల పరస్పర అసూయ, ద్వేషాలవల్ల, పరస్పర విరుద్ధ ప్రయోజనాల వల్ల, చైనా పతనావస్థ నుంచి ఒక విధముగా రక్షింపబడింది. పాశ్చాత్య దేశాలు వర్తకాలిచ్చె చైనాలోని కొన్ని ప్రాంతాలపై, తమ ఆధిపత్యాన్ని నెలకొల్పిన రాజకీయంగా మాత్రం చైనా ఆ రాజ్యాలకు లొంగలేదు. చైనా చాలా పెద్ద దేశం కావటం వల్ల, ఏ ఒక్క పాశ్చాత్య రాజ్యానికైన చైనాను, పూర్తిగా స్వాధీనం చేసుకోవడం అసాధ్యము.

19 వ శతాబ్దపు 2 వ భాగంలో చైనాలో టైపింగ్ తిరుగుబాటు జరిగింది. కాని చైనాలోని మంచూ వ్యతిరేఖశక్తులు అన్నింటినీ, ఈ తిరుగుబాటు దార్లు కూడగొట్టుకోలేక పోయాయి. ఈ తిరుగుబాటును 1864 లో విదేశీయుల సహాయంతో చైనా ప్రభుత్వం అణచివేసింది.

1900 లో చైనాలోని పాశ్చాత్య రాజ్యాల పలుకుబడికి వ్యతిరేకంగా బాక్సర్ ఉద్యమం ఆరంభమైయింది. పీకింగ్‌లోని దౌత్య కార్యలయాలను ముట్టడించడం. విదేశీయులను ఎదుర్కొవడం జరిగింది. ఈ తిరుగుబాటును అణచడానికి, పాశ్చాత్య రాజ్యాలు మంచూ ప్రభుత్వానికి సహాయం చేసినాయి. బాక్సర్ తిరుగుబాటు మంచూ చక్రవర్తుల బలహీనతల సమస్యలను బహిర్గతం చేసింది. మంచూ చక్రవర్తుల పరిపాలన ప్రజాభిమానాన్ని కోల్పోయింది. ఈ విధంగా 1911 లో జరిగిన విప్లవానికి బాక్సర్ తిరుగుబాటు మార్గాన్ని ఏర్పరచింది.

## 11.3. 1911 చైనా విప్లవం - రిపబ్లిక్ అవతరణ :

1911 చైనా విప్లవం ఒక్కసారిగా రాలేదు. అంతకు ముందు ఎన్నో సంచలనాత్మక సంఘటనలు జరిగాయి. 1898 లో చైనా రాజు ప్రవేశ పెట్టిన 'నూరు రోజుల సంస్కరణలు' విఫలమవడం, 1900 లో బాక్సర్ల తిరుగుబాటు చేయడం 1901-11 లో

డొవేజరు రాణి సంస్కరణలు వైఫల్యం, 1908 లో యువాన్ షికైలు వంటి సైన్యాధిపతి తొలగింపబడటం, పొరుగునున్న జపాను వంటి చిన్న దేశం విశాల రష్యాను ఓడించడం, మంచూరియా, కొరియా వంటి సరిహద్దు రాష్ట్రాల్లో చైనా పలుకుబడి తగ్గిపోవటం మొదలైన కారణాల వల్ల మంచూరియా రాజవంశం వారి పేరు ప్రఖ్యాతలు ఏంతో తగ్గిపోయాయి. డొవేజరు రాణి ఎంతో సమర్థవంతమైన పరిపాలకురాలు అయినప్పటికీ, ఆమెకు పరిస్థితులను అదుపులో పెట్టగల చాకచక్యం లేదు. 1908 ఆమె మరణించడంతో పూలో రాజా బాలుడు అవడం. అతని తరువున, రాజకీయ అనుభవం లేని చున్ యువరాజు పరిపాలించడం వల్ల, దేశమంతా అరాచకం పాలు అయింది. యువాన్ షికైలో తొలగింపబడిన తరువాత ఎన్ని రాజశాసనాలు చైనా రాజు జారి చేసినప్పటికీ, సైన్యం పటిష్టం కాలేదు. ప్రజలు కూడా ఇదంతా గమనించి, రాజవంశం వారి శక్తి సామర్థ్యాలను శంకించసాగారు. సంస్కరణలు విఫలం అవుటకు కారణం వారేనని, వీరు విదేశీయులచే తరచూ ఓడిపోయారు బలహీనులు అయ్యారు అని భావించారు. డైవేజర్ రాణి సంస్కరణల వల్ల ఏర్పడిన, జాతీయ శాసన సభ, ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాన్ని పెంపొందించడానికి ప్రయత్నించలేదు. అందులోని సభ్యులే ఆందోళన లేవదీశారు. ఒక వైపు రాజవంశం వారు, కేంద్రీకరణ కోసం ప్రయత్నించగా మరొక వైపు ప్రజలు వికేంద్రీకరణ కోరారు. ఈ రెండిటికి మధ్య దేశం విపత్తర పరిస్థితికి గురి అయింది.

ఇదే కాలంలో కొందరు అభ్యుదయ వాదులు పాశ్చాత్య దేశాలను జపాన్, అమెరికాలను పర్యటించి, స్వదేశానికి తిరిగి వచ్చి ప్రజలలో కొన్ని తీవ్రవాద భావాలను, వ్యాపింపచేశారు. వారిలో చాలా మంది రాణి సంస్కరణలను సమర్థించిన, ప్రజలకు రాజకీయాల్లో పాల్గొనే స్వేచ్ఛ ఉండాలి అని వాదించారు. వారిలో ముఖ్యమైనవారు. కాంగ్‌యువీయు, లియాంగ్, చిహచియె. కాని వీరికంటే మరొకడు ఉన్నాడు అతడే సన్‌యేట్‌సేన్. ఇతడే రిపబ్లిక్ అవతరణకు మూలపురుషుడు.

మంచూ వంశ పతనానికి, రిపబ్లిక్ అవతరణకు, రాజకీయ కారణాలతో పాటు ఆర్థిక కారణాలు కూడా దోహదము చేసాయి. 1911 నాటికి, జనాభా విపరీతంగా పెరిగింది. దానివల్ల ఆహార కొరత ఏర్పడి, కొందరు చైనీయులు మంచూరియా ఇండో చైనా మలయా ద్వీపాలకు వలసపోయారు. అయినప్పటికీ ఆర్థిక సమస్యలు, అనేకం ఏర్పడసాగాయి. జనాభాతో పాటు ఆహార ఉత్పత్తి పెరగక పోవటం, వరదలు రావడం వల్ల, 1910-1911 లో తీవ్రకరువు ఏర్పడింది. అందువల్ల, కొంతమంది మరణించగా, మరికొంతమంది ఆకలితో బాధపడ్డారు. బతికి బయట పడిన వారు. విప్లవ కారులు గాను, లేదా బంది పోటు దొంగలు గాను మారారు. ఇటువంటి పరిస్థితుల్లోనే ప్రభుత్వ అధికార్లు, పన్నులు అధికం చేశారు. అందుకు కారణం కొత్త సైన్యాలను తర్ఫీదు చేయడం, రైలు మార్గాలను నిర్మించడం, విద్యాసంస్థలు నెలకొల్పడం మొదలగునవి.

**11.3.1 డా॥ సన్ యేట్ సేన్ (1866-1925) :** డా॥ సన్ యేట్ సేన్ కాంటన్‌కు సమీపాన, హిషియాంగ్-షాన్ గ్రామంలో 1866 నవంబర్ 12 న ఒక రైతు కుటుంబంలో జన్మించాడు. ఇంగ్లండ్ చర్చ్ పాఠశాలలో ఇంగ్లీష్, గణితశాస్త్రం, చరిత్ర మొదలగునవి చదివి డిగ్రీ తీసుకుని స్వదేశానికి తిరిగి వచ్చాడు. కాని అతని సనాతన కుటుంబ సభ్యులు అతనిలో రూపొందుతున్న తీవ్రవాద భావాలను చూసి, హాంకాంగ్‌కు పంపివేశారు. అక్కడ క్వీన్సు కళాశాలలో చేరి జ్ఞానస్నానం చేయించుకొని క్రైస్తవునిగా మారాడు నాటి నుండి, చైనాకు వచ్చి కొన్ని కొత్త సంస్కరణలు ప్రవేశపెట్టాలి అని తీవ్రంగా ఆలోచించాడు. 1884-1885 లో ఫ్రెంచి వారు చైనా భూభాగామైన ఇండో చైనాను స్వాధీనం చేసుకోగా చైనా వారికి, తీరని అవమానం జరిగినట్లుగా భావించి ఏలాగైనా ప్రజలు స్వేచ్ఛతో జీవించెలా చేయాలి అని, ట్రియాట్ అనే రహస్య సంఘంలో చేరాడు.

సన్‌యేట్‌సేన్ 1887 నుంచి 1892 వరకు వైద్య విద్యను అభ్యసించాడు. కొన్నాళ్ళు, మత ప్రచారంలో పాల్గొని తరువాత వైద్య వృత్తిచేసి 1892 నుంచి విప్లవ కార్యుడుగా మారాడు. నాటినుంచి ఉత్తర చైనా వెళ్లి దేశంలో మత సంస్కరణలు అవసరం అని కరపత్రాలను విడుదల చేశాడు. చైనాలో కొన్ని సంస్కరణలు ప్రవేశపెట్టాలి అని, చక్రవర్తికీ, ఒక జ్ఞాపికను సమర్పించాడు.

సన్ యేట్ సేన్ మంచూ రాజవంశాన్ని, నిర్మూలించడమే లక్ష్యంగా పెట్టుకొన్నాడు. అందుకోసం ఒక రహస్య విప్లవ సంఘాన్ని స్థాపించాడు. దాని పేరు హిసింగ్ చుంగ్‌హుయి అనగా చైనా సంఘాన్ని పునరుద్ధరించడం అని అర్థం. అదే సమయంలో 1885 లో షాంగైలోని చార్లెస్ జోన్స్ అనే ప్రముఖ వర్తకుని ముగ్గురు కుమార్తెలలో ఒకరిని సన్‌యేట్‌సేన్ వివాహం ఆడాడు.

1895 నుంచి సన్‌యేట్‌సేన్ విప్లవకారుల సహాయంతో రాజవంశాన్ని, నిర్మూలించాలి అని నిశ్చయించుకున్నాడు. అందుకు హాంకాంగ్‌ను ఆధారంగా చేసుకొని కాంటన్ ప్రభుత్వాన్ని కూలదోయాలి అని వ్యూహం పన్నాడు. కాని ఆ వ్యూహం బయటపడటంతో కొందరూ విప్లవకారులు దొరికి పోయి ప్రాణాలు కోల్పోయారు. కాని సన్ యేట్ సేన్ తప్పించుకొని పారిపోయాడు. నాటినుంచి సన్ యేట్ సేన్ వివిధ దేశాలకు వెళ్ళి తన రహస్య విప్లవ సంఘం కోసం ధనాన్ని ప్రోగుచేశాడు. జపాన్ ఆగ్నేయ ఆసియా, హవాయి, అమెరికా, ఐరోపా దేశాలను దర్శించాడు. ఇతని ఉపన్యాసాలు ప్రజలను ఆకర్షించలేకపోయాయి కాని, 1905 నుంచి ఇతని పలుకుబడి పెరిగింది. జపాన్‌లోని టోక్యో పట్టణంలో తుంగ్‌మెంగ్ హుయి అనే పేరుతో ఒక రహస్య సంఘం స్థాపించబడింది. ఇందులో 6 వందలు చైనా విద్యార్థులు చేరారు. ఈ సంఘం రహస్యంగా ఎన్నో వ్యూహాలు చేస్తూ, చైనాలో సేన్ స్థాపించిన హిసింగ్ చుంగ్ హుయి సంఘంలో సమాలోచనలు జరిపేవి. ఈ రెండు సంఘాలకూ, సన్ యేట్ సేన్ అధిపతి.

**11.3.2 విప్లవం :** దేశంలో విప్లవ సంఘాలు అన్నిటినీ సంఘటిత పరచి వాటి సహకారంతో సన్ యేట్ సేన్ మంచూ వంశ పాలనను, అంతమొందించాలి అని ప్రయత్నించాడు. 1911 నాటికి చైనాలోని విప్లవ సంఘాలు అన్ని కలసీ, ఒక పటిష్ఠమైన కార్యక్రమాన్ని ఒక సమర్థమైన సంస్థను రూపొందించాయి. ఇదే కాలంలో యాంగిట్స్ నదిలోయ దిగువ భాగం వరదలతో నిండి పోయి కరువు వ్యాపించగా ఎంతో మంది జీవనోపాధి కోసం బందిపోట్లుగా మారారు. రైలు మార్గాల నిర్మాణ విషయంలో సమస్యలు తలెత్తాయి. ప్రభుత్వ విధానానికి నిరసనగా ప్రజలు తిరుగుబాటు చేయగా, కేంద్ర ప్రభుత్వం సైన్యాన్ని రప్పించింది. ఇటువంటి సమయంలో 1911 అక్టోబర్ 9 న హెంకో వద్ద ఒక రష్యన్ కర్మాగారంలో బాంబు పేలింది. అందులో సన్ యేట్ సేన్ అనుచరులు పనిచేస్తున్నారు. బాంబు శబ్దం వినగానే రష్యా, చైనా, పోలీసులు అచటికి వచ్చి, 32 మందిని అనుమానించి ఖైదు చేశారు. వీరిలో నలుగురిని ఉరి తీశారు. దీనితో వూబాంగ్‌లోని విప్లవ కారులు ఉద్రిక్తులు అయి అక్కడి ఒక ఫిరంగిని స్వాధీన పరచుకొనబోయి విఫలమయ్యారు విప్లవకారులు తరువాత కర్నల్ లియూవాన్ హాంగ్‌ను నాయకత్వం స్వీకరించమని అడగడానికీ, అతని ఇంటికీ వెళ్ళారు. విప్లవ కారుల బలవతం మీద అతడు యుద్ధం నడిపించడానికి ఒప్పుకున్నాడు. దానితో హేంకో, హేన్‌యాంగ్, వూచాంగ్, యుద్ధరంగాలుగా మారిపోయి 1911 అక్టోబర్ 10 నుంచి విప్లవం ప్రారంభమైయింది. మంచూ ప్రభుత్వాన్ని కూల దోయడమే వీరి ధ్యేయం.

**11.3.3 రిపబ్లిక్ అవతరణ :** విప్లవం మొదట, వూచాంగ్ నుంచి ప్రారంభమై రెండు వారాలలోనే దక్షిణ చైనా అంతటా, వ్యాపించింది. దానితో ప్రభుత్వం ఈ విపత్కర పరిస్థితి నుంచి బయటపడటానికీ, ఒకప్పుడు పదవినుంచి తొలగించబడి, విశ్రాంతి తీసుకొంటున్న యువాన్‌షికైని ఆహ్వానించింది. ఉత్తర చైనా, సైనికులను నడిపించడంలో సమర్థుడైన యువాన్ అందుకు అంగీకరించాడు. కాని ఇతడు సంపూర్ణ అధికారాలు కావాలి అని, తనను జాతీయ శాసన సభకు ప్రధానమంత్రిగా నియమించాలి అని షరతులు పెట్టాడు. అందుకు ప్రభుత్వం అంగీకరించింది. అన్ని అధికారాలు పొందిన తరువాత యువాన్ సైన్యాన్ని విప్లవ కారులపైకి పంపాడు. తిరుగుబాటు దార్లు, ఉత్తర చైనాలోకి, వ్యాపించకుండా ఉండడానికీ, యాంగిట్సి నదీప్రాంతంలోనే కొందరిని ఓడించి వూహానును ఆక్రమించాడు. దాని తరువాత మనస్ఫూర్తిగా యుద్ధం చేయలేదు. ఇతడు అవకాశవాది. బయటికి, రిపబ్లిక్ అంటే అభిరుచి ఉన్నట్లు కార్యనిర్వహణలో మాత్రం, రిపబ్లిక్ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పనిచేశాడు. ఇతనికి రాజవంశాన్ని నాశనం చేయడం ఇష్టం లేదు. రాజవంశం వారిని ఒప్పించి రాజ్యాంగ బద్ధమైన రాజపాలన ఏర్పరచాలి అనే, ఇతని పథకం, అందుకు షాంగైలో రిపబ్లిక్ విప్లవ సైనిక నాయకుడు వియువాన్ హాంగ్‌తో శాంతి సంప్రదింపులు జరపదలచాడు. విప్లవకారుల్లో

చాలా మంది రిపబ్లిక్ స్థాపనకు అనుకూలంగా ఉన్నారు. ఇదే సమయానికి, సన్‌యేట్‌సేన్ విదేశాల నుండి చైనాకు తిరిగి వచ్చాడు. 1911 డిసెంబర్ 28న నాన్‌కింగ్‌లో సమావేశం అయిన, జాతీయ పరిషత్ సన్ యేట్ సెన్‌ను రిపబ్లిక్ అధ్యక్షుడిగా ఎన్నుకొన్నది. కానీ పీకింగ్ ప్రభుత్వం యువాన్ షికై నాయకత్వంలోనే ఉన్నది. చైనా అంతటిని ఒకే రిపబ్లిక్‌గా రూపొందించడానికి సన్ యేట్ సేన్ అధ్యక్షపదవిని, యువాన్ షికైకు అప్పగించడానికి, సంసిద్ధతను తెలియజేశాడు. చక్రవర్తిని పదవీ పరిత్యాగం చేయవలసింది అనే, యువాన్ షికై సలహా ఇవ్వగా, 1912 ఫిబ్రవరి 12 వ చివరి మంచూ చక్రవర్తి, పూయీ సింహాసన పరిత్యాగం చేశాడు. 1912 మార్చి 10 న యువాన్ షికై తాత్కాలికంగా రాజ్యాంగాన్ని ప్రకటించి చైనా రిపబ్లిక్‌కు అధ్యక్షుడు అయ్యాడు. మంచూ చక్రవర్తికి ఏటా భరణం ఇవ్వటానికి ఏర్పాటు జరిగింది. సన్ యట్ సేన్ తన అధ్యక్ష పదవికి రాజీనామ ఇచ్చాడు. దేశానికి నాన్‌కింగ్ ముఖ్యపట్టణం కావలెనని నాన్‌కింగ్ జాతీయ పరిషత్ నిర్ణయించిన యువాన్ షికై పెకింగ్‌ను వదలడానికి అంగీకరించలేదు. అందువల్ల నాన్‌కింగ్‌లో జాతీయ వాదులు ఒక తాత్కాలిక రాజ్యాంగాన్ని ప్రకటించారు.

**3.4 విప్లవ ప్రాముఖ్యం :** సన్ యట్ సేన్ అనుచరులు మంచి నేర్పు వ్యూహంతో పథకాలేసి విజయవంతంగా రాచరికాన్ని అంతం చేసి, చైనా రిపబ్లిక్‌గా ప్రకటించారు. విదేశీయుల జోక్యం వారివల్ల వచ్చె చెడు ఫలితాలు లేకుండా ఎంతో సామరస్యం చాకచక్యంతో విప్లవకారులు, వ్యవహరించి విజయం సాధించారు. ఈ విప్లవంలో విదేశీయుల ఆస్తి, పాస్తులకు ఎటువంటి నష్టం కలుగలేదు. అలాగే క్రైస్తవులకు కూడా ఎటువంటి ఆపద కలుగలేదు. మంచూ రాజవంశం టైపింగ్ విప్లవ కాలంలో పతనం కావలసింది కాని అలా జరుగక 70 సంవత్సరాలు కృత్రిమంగా నిలబడి చివరికి 1911 అక్టోబర్ 10న ప్రారంభమై 1912 ఫిబ్రవరి వరకు జరిగిన జాతీయ విప్లవంతో మంచూ రాజవంశం అంతమొందింది.

**4. యువాన్ షికై పరిపాలన :** చైనాలో యువాన్‌షికై ఆధిపత్యంలో రిపబ్లిక్ అవతరించినప్పటికీ, రిపబ్లిక్ పాలనకు బదులు సైనిక పరిపాలనే ఏర్పడింది. అందుకు కారణం యువాన్ షికైకి విప్లవకారులకు మధ్య రాజకీయ సమస్యలపై భిన్న అభిప్రాయాలు రావడమే. ఇతని సైన్యం అంతా ఉత్తరాది సైనికులతో నిండి ఉండటం వల్ల, దక్షిణాది వారివలె వారిలో జాతీయతా భావం లేదు. సైనిక అధికారులు, అతని సలహాదారులుగానే వ్యవహరించారు గాని బాధ్యతాయుతమైన దేశ సైన్యాధిపతులుగా, ఎప్పుడు వ్యవహరించలేదు. దక్షిణ చైనాలో జాతీయ భావం అధికంగా ఉన్నప్పటికీ అధికారం ప్రాంతీయ నాయకుల్లో కేంద్రీకృతమై ఉంది. ఈ కారణాల వల్ల సైనిక అధికారం రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగపడేది కాని దేశ శ్రేయస్సు కోసం కాదు. తన అనుయాయులు రాజకీయ బలగం అంతా ఉత్తర చైనాలో ఉండటం వల్ల, యువాన్ షికై, పీకింగ్ వదలడానికి అంగీకరించలేదు. దీనితో జాతీయ వాదులకు, యువాన్‌షికైకు మధ్య అగాధం ఏర్పడింది.

యువాన్ షికై విధానాన్ని బాగా పరిశీలించి, తుంగ్‌మెంగ్ హుయి అనే సంఘ నాయకుడు, సుంగ్ చియెజెన్ మరి నాలుగు కూటమిలతో కలసి 1912 ఆగస్టులో కోమింటాంగ్ లేదా జాతీయ పార్టీ అనే పేరుతో ఒక కొత్త పార్టీని స్థాపించాడు. ఎన్నికలు జరిగిన తరువాత, దేశంలో పార్లమెంటరీ విధానాన్ని ప్రవేశపెట్టాలి అనీ ఇతడు నినాదాలు చేశాడు. ఇది చూసి యువాన్ షికై ప్రతిద్వంద్వగా చిన్ పుతాంగ్ అనే రిపబ్లిక్ పార్టీని స్థాపించి దానికి లియాంగ్ చిచ్‌లతోను నాయకునిగా చేశాడు. 1913 ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికల్లో సుంగ్‌చియెజెన్ నాయకత్వంలోని కోమింటాంగ్ పార్టీ విజయం సాధించింది. ఇతడు యువాన్ అనుసరిస్తున్న నిరంకుశ రాజ్యాంగ వ్యతిరేఖ విధానాలను, బాహాటంగా విమర్శించాడు. దానితో యువాన్‌షికై ఇతనిని అంతమొందించడానికి, పీకింగ్‌కు ఆహ్వానించాడు. సుంగ్ చియెజెన్ ఇతని మాటలు నమ్మి, పీకింగ్‌కు వెళ్ళటానికి, షాంగైలో రైలు ఎక్కుతుండగా యువాన్ అనుచరులు ఇతనిని 1913 మార్చి 20 న హతమార్చారు. ఇతని మరణంతో పార్లమెంటరీ విధానానికి, పెద్ద విఘాతం తగిలింది. ఇతని మరణం తరువాతనే, సన్ యెట్ సేన్ పలుకుబడిలోకి వచ్చాడు.

సుంగ్ చిమెజెన్ మరణించడంతో యువాన్‌షికై మరింత నిరంకుశుడయ్యాడు. కోమింటాంగ్ పార్టి స్థాపన అక్రమమైనది అనీ చట్ట విరుద్ధం అని దానిని 1913 నవంబర్‌లో నిషేధించాడు. అంతటితో తృప్తి చెందక పార్లమెంటును కూడా రద్దు చేశాడు. కొమిటింగ్ పక్షానికి చెందిన సభ్యులందరినీ ఉన్నత ఉద్యోగాలనుంచి తొలగించాడు. తనకు ప్రతిపక్షం వహించే వారందరిని ఏరివేయసాగాడు. సన్ యెట్ సేన్ దీనికి సహించక యువాన్‌పై ఆందోళన లేవతీశాడు. కాని, దేశంలోని అభివృద్ధి నిరోధక శక్తుల ప్రాబల్యం వల్ల సన్‌యెట్‌సేన్ దేశం వదలి, జపాన్‌కు పారిపోయాడు. సన్ యట్ సేన్ నిష్క్రమణతో యువాన్‌షికై అధికారానికి హద్దు లేకపోయింది. రాష్ట్రాలలోనే ప్రజాప్రతినిధుల సభలను స్థానిక సంస్థలను రద్దుచేశాడు. అంతకు ముందే జాతీయ సభను రద్దుచేశాడు. 70 మందిని రాజ్యాంగ పరిషత్ సభ్యులుగా యువాన్ నియమించాడు. రాష్ట్రాలకు విశ్వస్వనీయులైన, సైనిక అధికారులను, గవర్నర్‌గా నియమించాడు. యువాన్ షికై అనుచరులు అంతా ఇతనిని, చైనా చక్రవర్తిగా చేయాలి అని పథకం వేశారు.

**4.1 జపాన్ 21 కోరికలు :** ఇదే సమయంలో 1915 జనవరిలో పీకింగ్‌లోని రాయబారి హియోకి చైనా అధ్యక్షుడు అయిన యువాన్ షికైకీ, 21 కోరికలతో ఒక పత్రాన్ని సమర్పించాడు ఈ పత్రం చైనాలో జపాన్ స్థానాన్ని శాశ్వతంగా స్థిరం చేయడానికి ఉద్దేశింపబడింది. షాంటుంగ్ రాష్ట్రంలో చైనా తీసుకొన్న చర్యలకు నిరసనగా, తాను 21 కోరికలను సమర్పించినట్లుగా జపాన్ ప్రకటించింది. చైనా మీద జపాన్ ఆధిపత్యం స్థాపించుకోవడానికీ మొదటి ప్రపంచ యుద్ధాన్ని అవకాశంగా తీసుకొంటుంది అనీ 1914 లో యువాన్ అమెరికా రాయబారితో చెప్పిన మాట నిజమైంది.

జపాన్ కోరికలు 5 భాగాలుగా ఉన్నాయి. అవి :

1. షాంటుంగ్ రాష్ట్రంలో జర్మనికీ ఇంతకు ముందు ఉన్న హక్కులు అన్ని తొలగించవలె, యుద్ధం తరువాత జర్మనీ, జపాన్‌లు కుదుర్చుకొనే ఒడంబడికను చైనా అమోదించవలెను. షాంటుంగ్‌లోని ఏ భాగాన్ని అయినా చైనా ఇతర రాజ్యాలకు ఇవ్వదు ఛీఫూనుంచి ఆ సింగ్‌టావో సినాన్ రైలు మార్గం వరకు జపాన్ నిర్మించదలచిన రైలు రోడ్డు మార్గానికీ, చైనా అంగీకరించవలె. చైనాలోని కొన్ని నగరాల్లో, జపాన్ దేశస్తులు, నివశించడానికీ, వ్యాపారం చేసుకోవడానికి చైనా అనుమతించవలె.

2. పోర్ట్ ఆర్థర్, డైరన్ రేవుల కవులను 99 సంవత్సరాలవరకు చైనా ఒదిగించాలి. దక్షిణాన మంచూరియా రైల్వే, అంటురింగ్‌ముక్‌డైన్ రైలు మార్గాల ఒప్పందాలను, చైనా ధృవీకరించాలి. ఈ ప్రాంతంలో జపాన్ దేశస్థులు వ్యాపార పరిశ్రమల, వ్యావసాయాల నిమిత్తం భూములను సంపాదించవచ్చు. దక్షిణ మంచూరియాలో ప్రవేశించడానికీ, నివశించడానికీ, ప్రయాణించడానికీ జపాన్ దేశస్థులకు స్వేచ్ఛను కలుగజేయవలెను. మంచూరియాలో రైలు మార్గాల నిర్మాణానికి చైనా ఏ ఇతర దేశాలకైన అనుమతినివ్వాలి అనుకుంటే ముందుగా జపాన్ అనుమతిని చైనా పొందాలి. ఈ ప్రాంతాలలో విదేశీ సలహాదారులను, చైనా నియమించదలిస్తే, జపాన్ అనుమతి పొందాలి.

3. యాంగ్‌ట్సీ నదీలోయలు లభ్యమయ్యే ఇనుపఖనిజం మీద జపాన్‌కు గుత్తాధికారం చైనా ఇవ్వవలెను.

4. చైనా తన తీర ప్రాంతానికీ చెందిన ఏ భూభాగాన్ని రేవు పట్టణాన్ని, అఖాతాన్ని ద్వీపాన్ని ఏ ఇతర దేశానికీ, దత్తం చేయడం గాని, కౌలకు ఇవ్వడంగాని జరుగరాదు.

5. జపాన్ దేశస్థులనే, రాజకీయ, ఆర్థిక, సైనిక సలహదార్లుగా చైనా నియమించుకోవలె. జపాన్ దేశస్థుల విద్యాలయాలకూ, దేవాలయాలకు, వైద్యశాలలకు, చైనా తగినంత భూమిని ఇవ్వవలెను. చైనా, జపాన్ దేశాల మధ్యగల వివాదాస్పదాలైన, ప్రాంతాల్లో చైనా తన పోలీసు దళాన్ని, చైనా జపాన్ సంయుక్త పరిపాలనలో ఉంచవలె. జపాన్ నుంచి చైనా తనకు

13)

కావలసిన ఆయుధాలు కొనవలె. దక్షిణ చైనాలో కొన్ని రైలు మార్గాల్లో జపాన్ నిర్మించడానికి చైనా అంగీకరించవలె. చైనాలో మత ప్రచారానికీ, జపాన్‌కు హక్కును ఇవ్వవలెను.

యువాన్‌షికై చేసేది లేక జపాన్‌కు భయపడి 1915 మే 25 న ఆ కోరికలను అంగీకరిస్తూ, జపాన్‌తో రెండు సంధులు చేసుకొన్నాడు.

మొదటి సంధి ప్రకారం :

1. పోర్టు ఆర్థర్ రేవు కౌలు, దక్షిణ మంచూరియా, రైల్వే, అంటుంగ్ -ముక్‌డెన్ రైల్వేలకు సంబంధించిన ఒప్పందాలను, 99సంవత్సరాల వరకు పొడిగించవలె.
2. జపాన్ జాతీయులకు దక్షిణ మంచూరియాలో నివసించడానికీ, ప్రయాణించడానికీ భూములను కౌలును తీసుకోడానికీ అధికారం ఉండవలెను.
3. చైనా, జపాన్, సంయుక్త సంస్థలను నెలకొల్పడానికి చైనా అనుమతించవలెను.
4. చైనాలోని న్యాయచట్టానికీ, జపాన్ జాతీయులు బద్ధులైన, వారి విచారణ, జపాన్ ప్రభుత్వం అనుమతితో జరుగవలెను.
5. అంతర్ మంగోలియాలోని తూర్పు ప్రాంతంలో అనువైన ప్రదేశాలను విదేశీ వ్యాపారానికీ, నివాసాలకు, చైనా అనుమతించవలెను.
6. కొన్ని నిర్దిష్ట ప్రాంతాల్లో గనులను అన్వేషించి ఉపయోగించడానికీ జపాన్‌కు చైనా అనుమతి ఇవ్వవలెను.
7. మంచూరియాలో రైలుమార్గాలు నిర్మించడానికి విదేశీ పెట్టుబడుల కోసం చైనా భవిష్యత్‌లో ప్రయత్నించదలిస్తే, అందుకు మొదట జపాన్‌తో సంప్రదించాలి.
8. దక్షిణ మంచూరియాలో జపాన్ వారినే, ఆర్థిక, సైనిక, రాజకీయ సలహాదార్లుగా చైనా నియమించవలెను.

రెండో సంధి షాంటుంగ్ ప్రకారం

1. షాంటుంగ్ రాష్ట్రంలోని జర్మనీకి చెందిన ఆస్తిపాస్తులన్నిటిని జపాన్ ఇష్టానుసారం ఉపయోగించుకోవడానికి చైనా అంగీకరించవలె.
2. చెఫూ - వీసిన్ రైలుమార్గాన్ని జపాన్ నిర్మించడానికి చైనా అనుమతించవలె.
3. షాంటుంగ్ రాష్ట్రంలో విదేశీయులు నివసించడానికి, వాణిజ్యం కొనసాగించడానికి మరికొన్ని ప్రాంతాలను చైనా ప్రత్యేకించవలె.
4. షాంటుంగ్ రాష్ట్రంలోని ఏ ప్రాంతాన్నిగాని, ఆ రాష్ట్రతీరం వెంబడిగల చైనా దీవులను గాని ఏ విదేశాలకు ఇవ్వనని చైనా వాగ్దానం చేసింది.
5. జర్మనీనుంచి తనకు సంక్రమించినప్పుడు కియాచౌ అఖాతాన్ని తాను కొన్ని షరతులపై చైనాకు స్వాధీనం చేస్తానని జపాన్ తెలియజేసింది. అవి 1) కియాచౌ అఖాత మంతటిని వాణిజ్య ప్రాంతంగా చైనా ప్రకటించవలె 2) జపాన్ దేశస్థులు నివసించడానికి జపాన్ పూర్తి ఆధిపత్యం కింద అది నిర్దేశించిన ప్రాంతాన్ని చైనా ఇవ్వవలె. 3) ఇతర దేశస్థులు కూడా స్థావరాలను ఆశించే పక్షంలో ఒక అంతర్జాతీయ స్థావరాన్ని అక్కడ చైనా ఏర్పాటు చేయవలె.

ఈ విధంగా చైనా మీద ఆధిపత్యాన్ని 1915 నుంచి జపాన్ స్థాపించుకొన్నది. చైనాలో తాను సంపాదించిన హక్కులను అగ్రరాజ్యాలచేత ఆమోదింప చేయడానికి ప్రయత్నించింది. షాంటుంగ్ రాష్ట్రంలోని జపాన్ ఉనికిని, హక్కులను బ్రిటన్ గుర్తించింది

ఫ్రాన్స్ కూడా జపాన్ హక్కులను అన్నింటిని గుర్తించింది. ఇటలీ కూడా జపాన్ హక్కులను గుర్తించింది. రష్యాలో కూడా జపాన్ 1916 లో ఒడంబడిక చేసుకొన్నది. దీని ప్రకారం చైనాలో జపాన్ హక్కులను రష్యా గుర్తించింది. అయితే అమెరికా మాత్రం జపాన్ చైనాలో చేసుకొన్న సంధికి తన నిరసన తెలియచేసింది. జపాన్, అమెరికాల మధ్య సత్సంబంధాలను పెంపొందించుకొనే ఉద్దేశంతో అమెరికా విదేశాంగ శాఖ కార్యదర్శి లాన్సింగ్, జపాన్ విదేశాంగ మంత్రి ఇషి మధ్య సంప్రదింపులు జరిగాయి. దీని ఫలితంగా లాన్సింగ్ - ఇషి ఒప్పందం జరిగింది. దీని ప్రకారం చైనాలో జపాన్‌కు గల ప్రత్యేక ప్రయోజనాలను అమెరికా గుర్తించింది.

ఈ విధంగా చైనాను తన కోరికలకు అంగీకరింపజేస్తూ రష్యా, ఇంగ్లండ్, ఇటలీ, ఫ్రాన్స్, అమెరికాలలో రహస్య ఒడంబడికలను చేసుకొంటూ చైనాలో తన సర్వాధిపత్యాన్ని జపాన్ స్థాపించుకొన్నది.

**4.2 యువాన్ షికై మరణం :** యువాన్‌షికై అనుయాయులు అతనిని చైనా చక్రవర్తిగా చేయవలెనని పథకం వేసినారు. దీనిలో ప్రజలలో తీవ్ర అసంతృప్తి, వ్యతిరేకత ప్రబలింది. అందువల్ల యువాన్‌వారి అభిమానాన్ని కోల్పోయినాడు. సైనిక గవర్నర్లు కూడా రాజరికం వద్దని కోరారు. దాంతో సైనికాధికారులు ఎదురుతిరిగారు. ఏ సైన్యం అండదండలుచూసి యువాన్ తనకు బలం ఉందని గర్వపడ్డాడో ఇప్పుడు ఆ సైన్యమే తిరగబడింది. ఇలాంటి పరిస్థితులలో యువాన్ తిరుగుబాటు దారులలో సంప్రదింపులు జరిపాడు. కాని సైనిక నాయకులు, పూర్వం పార్లమెంటు నాయకులు కలిసి యువాన్ పదవీ విరమణ చేయాలని పట్టుపట్టారు. కాని ఇంతలో 1916 జూన్ 6 న యువాన్ మరణించాడు.

ఈ విధంగా గర్వంతో యువాన్‌షికై తన పతనానికి తానే కారకుడయ్యాడు. ఇతడు రాజవంశం వారికి, చివరకు రిపబ్లిక్‌కు ఎంతో తీరని ద్రోహం చేసినాడు. ఇతడు మొదటినుంచి జపాన్‌తో వైరంతో ఉండేవాడు. అందువల్ల జపాన్ ఇతడు పాలించేటప్పుడు చైనా శక్తివంతంగా గాకుండా చేసింది. ఇతని సైనికాధికారులు బాగా దురాశాపరులు. మొదటి నుంచి సైనిక బలంపై ఆధారపడడం వల్ల వారి సహాయం చివరిదశలో లేకపోవడంతో యువాన్ ఊహలన్నీ తారుమారు అయ్యాయి. రిపబ్లిక్ బలహీనమవడంతో అతని సైనికులు ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించారు. ఒకవేళ శక్తివంతమైన రాజరికాన్ని అతడు నెలకొల్పితే వారి ఆటలు సాగేవికావు. అందువల్ల వారు రాజ్యాంగ రాజరికం స్థాపించడానికి అయిష్టత చూపారు. ఈ కారణం వల్ల యువాన్ ఒంటరి వాడు అయిపోయాడు. యువాన్ శక్తి సామర్థ్యాల వల్ల పరిస్థితిల్లోని మార్పుల వల్ల, విదేశీ ఋణాలు, తన సైనిక బలం వల్ల సన్‌యట్‌సేన్‌ను అధిగమించి, అధ్యక్షుడయ్యాడని, అక్కడితో తృప్తి చెందక తానే రాజుకావాలని ప్రయత్నించడంలో తన పతనానికి తానే కారకుడయ్యాడని కొందరంటారు.

**5. మొదటి ప్రపంచ యుద్ధంలో చైనా పాత్ర :** మొదటి ప్రపంచయుద్ధం 1914 లో ఐరోపా ఖండంలో ప్రారంభమైంది. ఈ యుద్ధం చైనా రాజకీయాలలో సంచలనం కలిగించింది. 1914-1917 మధ్య ప్రపంచ యుద్ధం ముమ్మరంగా సాగుతున్న రోజులలో చైనా పూర్తి తటస్థ విధానాన్ని అవలంబించింది. ఐరోపా రాజకీయ విషవలయంలో చిక్కుకోకుండ అన్నివిధాలా జాగ్రత్తపడింది. చైన అవలంభించిన ఈ విధానాన్ని అవకాశంగా తీసుకొని జర్మనీ, షాంటుంగ్‌లో తన అధికారాన్ని పటిష్ఠం చేసుకోవడం మొదలుపెట్టింది. చైనా రిపబ్లిక్‌లోని ఇతర ప్రాంతాలపై కూడా తన ఆధిపత్యాన్ని ఎక్కువ చేసుకోవడానికి జర్మనీ హడావుడి పడింది. దీనిని జపాన్ కూడా అనుసరించింది. ఈ రెండు దేశాల అధికార కాంక్షని చూసి చైనా భయపడింది. తన తటస్థ విధానాన్ని పరిరక్షించవలసిందిగా చైనా చేసిన అభ్యర్థనని, ఒక్క అమెరికా తప్ప మిగతా దేశాలు పట్టించుకోలేదు. చివరకు మిత్రమండలి సహాయాన్ని అర్థిస్తూ చైనా ఆగస్టు 14, 1917 న అక్షరాజ్యాలపై యుద్ధం ప్రకటించింది. దేశంలో ఆర్థిక సంక్షోభం, విదేశీ పెట్టుబడిదారుల మధ్య పోటీ కార్యకలాపాలు, రైలు రోడ్డు నిర్మాణంలో జపాన్ ప్రయత్నాలు చైనాను ప్రపంచ యుద్ధరంగంలోకి లాగాయి. చైనాను యుద్ధరంగంలోకి దింపడానికి అమెరికా ముఖ్యపాత్ర వహించింది. జర్మనీ అనుసరిస్తున్న విస్తరణ విధానం వల్ల చైనా యుద్ధంలో పాల్గొనవలసి వచ్చింది. జర్మనీతో తన సంబంధాలను తెగతెంపులు చేసుకొన్నది.

**5.1 జర్మనీ మీద చైనా యుద్ధాన్ని ప్రకటించడం :** 1917 ఫిబ్రవరి 24 వ ఎథోస్ అనే ఫ్రెంచి నౌక చైనా కూలీలతో ప్రయాణిస్తున్నప్పుడు దానిని జర్మనీ జలాంతర్గామి ముంచి వేయగా 543 మంది చైనీయులు ప్రాణాలు కోల్పోయారు. దీనికి నిరసనగా చైనా హుందా తనముతో కూడిన ఒక నిరసన పత్రాన్ని జర్మని ప్రభుత్వానికి పంపింది. మొదటి ప్రపంచ యుద్ధములో పాల్గొనడమా ! వద్దా అనే విషయాల మీద చైనాలో తీవ్రమైన అభిప్రాయ భేదాలు ఏర్పడినాయి. చివరకు చైనా ప్రభుత్వం జర్మని మీద లాంఛనముగా యుద్ధాన్ని ప్రకటించింది. దీనికి వ్యతిరేకులు అయిన కొమిన్‌టాంగ్ పక్షము వారు కాంటిన్ చేరి అక్కడ పోటి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు.

యుద్ధములో భాగస్వామి అయిన చైనా ప్రత్యక్షముగా యుద్ధములో పాల్గొనలేదు. ఫ్రాన్స్, మెసపటోమియా, ఆఫ్రికా ప్రాంతాలకు చైనా కూలీలను సరఫరా చేసింది. చైనా యుద్ధములో పాల్గొనడము వలన కొన్ని సదుపాయాలను సంపాదించింది. పాశ్చాత్య రాజ్యాలు చైనాకు చెల్లిస్తున్న సుంకాన్ని 2 1/2 % నుండి 5 % వరకు పెంచడం జరిగింది. టిమెన్-ట్విన్ మొదలైన రేవు పట్టణాలలో జర్మని, ఆస్ట్రియాలకు చెందిన నివాస ప్రాంతాలను చైనా ఆక్రమించుకోవడానికి వీలు కలిగింది. జర్మని, ఆస్ట్రియాలకు చెందిన ఆస్థులన్నింటిని కూడా చైనా స్వాధీన పరచుకున్నది. బక్సార్ తిరుగుబాటుకు అయిన పరిహారాన్ని జర్మని, ఆస్ట్రియా దేశాలకు చైనా చెల్లించనవసరం లేదు. మిత్ర మండలి రాజ్యలకు ఇవ్వవలసిన ఈ పరిహారాన్ని 5 సంవత్సరములపాటు వాయిద వేయడం జరిగింది. యుద్ధానంతరము జరిగే శాంతి సమావేశములో చైనా పాల్గొనే హక్కుకూడా పొందింది.

**5.2 పారిస్ - శాంతి సమావేశంలో చైనా :** మిత్ర మండలి రాజ్యాలకు చైనా చేసిన సహాయానికి ప్రతి ఫలముగా పారిస్ శాంతి సమావేశములో పాల్గొన్నది. ఈ సమావేశములో పాల్గొనడానికి చైనాలోని పెకింగ్, కాంటిన్ ప్రభుత్వాలు రెండు సమైఖ్యముగా ఒక ప్రతినిధి వర్గాన్ని ఎన్నిక చేసి పంపినాయి. ఈ ప్రతినిధి వర్గములో ముఖ్యులు సి.టి.వాంగ్, వెల్లింగ్‌టన్ కూలు - వేరు సమావేశములో అవలంభించ వలసిన కార్యక్రమాన్ని రూపొందించారు. దీని ప్రకారం దేశములోని జర్మని కౌలు ప్రాంతాలు అన్నింటిని, షాంటుంగ్ రాష్ట్రములోని జర్మనీకి గల హక్కులన్నింటికి చైనాకు తిరిగి ఇవ్వవలెను. అంతే గాకా మొదటి ప్రపంచ యుద్ధకాలములో చైనా, జపాన్‌ల మధ్య షాంటుంగ్ విషయంలో జరిగిన ఒడంబడికలన్నింటిని రద్దు పరచాలి. 1919 జనవరి 27 న జపాన్ షాంటుంగ్ మీద తన హక్కులను శాంతి సమావేశంలో వెల్లడి చేసింది. మరునాడే కియాచౌను, చైనాలోని జర్మని హక్కులను తమస్వాధీనం చేయాలి అని చైనా వాదించింది. యుద్ధ కాలములో మిత్రమండలి రాజ్యాలు జపాన్‌కు ఇచ్చిన హామీల వల్ల చైనా వాదము వీగిపోయింది. సంధి పత్రం మీద చైన సంతకం చేయడానికి నిరాకరించింది.

వర్సేసంధి ప్రకారం బాక్సర్ తిరుగుబాటు సందర్భముగా చైనా జర్మనికి ఇవ్వవలసిన నష్టపరిహారం రద్దయింది. టమెట్‌టిన్స్, హాంకోలలోని జర్మని చైనా నుండి పొందిన రాయితీలు అన్నింటిని రద్దు చేయడమైనది. చైనాలోని జర్మని ప్రభుత్వ ఆస్థులన్నీ చైనాకు సంక్రమించినాయి. యుద్ధకాలములో చైనాలో జర్మన్‌లను నిర్బంధించడంవల్లా కలిగిన బాధ్యతలను చైనాకు లేకుండా చేయడం జరిగింది. బాక్సర్ తిరుగుబాటు కాలంలో పెకింగ్‌నుంచి జర్మనికి కొనిపోయిన ఖగోళశాస్త్ర సంబంధమైన పరికరాలన్నింటిని తిరిగి చైనాకు ఇవ్వటం జరిగింది. ఈ సంధి ప్రకారమే జపాన్ షాటుంగ్‌లో సుస్థిరముగా అధికారాన్ని స్థాపించుకొని భవిష్యత్‌లో ఏప్పుడో ఒకప్పుడు ఆ ప్రాంతంమీద చైనా సార్వభౌమాధికారాన్ని తిరిగి స్థాపించడం జరుగుతుంది. అని నోటిమాటగా వాగ్దానం చేసింది. ఈ వాగ్దానము వల్ల భవిష్యత్‌లో నానాజాతి సమితి కృషివల్ల చైనాకు న్యాయం చేకూరుతుంది. అని మిత్రమండలి రాజ్యాలు ఆశించాయి. 1921 మే లో చైనా - జర్మనీల మధ్య జరిగిన ఒక ప్రత్యేక సంధి ప్రకారం బాక్సార్ తిరుగుబాటు సందర్భములో చైనా జర్మనీకి చెల్లించవల్లసిన నష్టపరిహారం రద్దయింది.

వర్సేసంధి షరతులు చైనాలో గొప్ప ప్రజా ఉద్యమాన్ని లేవదిసినాయి. మొదట విద్యార్థుల అందోళన ప్రారంభం అయ్యింది. వారు చైనా ప్రభుత్వ ఉద్యోగులు జపాన్ చేతిలో కీలుబొమ్మలు అయినారు అని భావించినారు. అంతేగాక చైనాలోని జపాన్ వారి మీద కూడా వారు ధ్వజమెత్తినారు. దేశవ్యాప్తముగా జపాన్ వస్తువులను బహిష్కరించారు.

యుద్ధములో పాల్గొనడం వల్ల చైనాకు కనువిప్పు కలిగి వారికి జాతీయత, రిపబ్లిక్ ప్రభుత్వాల విలువలు బాగా తెలిసాయి. అతి చిన్నది అయిన జపాన్ పారిశ్రామికంగా ఏంత అభివృద్ధి సాధించింది. చైనావారు గ్రహించారు. అందువల్ల జపాన్ ఉపద్రవము నుంచి విజయవంతముగా తమ దేశాన్ని రక్షించుకోవడానికి చైనావారు తాముకూడా జాతీయ, వాణిజ్య పరిశ్రమలను అభివృద్ధి చేసుకోవలసి ఉంటుంది. అని గ్రహించినారు. యువకులు అయిన మేధావులు చైనాలో సనాతన సంప్రదాయాల మీద ధ్వజమెత్తి, కొత్త పద్ధతుల మీద నవ చైనా సమాజ నిర్మాణానికి కృషి చేసారు. యుద్ధ కాలములో పాశ్చాత్య రాజ్యాలకు చైనాకు మధ్య వ్యాపారం బాగా పడిపోయింది. దీని ఫలితంగా చైనీయుల లఘు పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. పరిశ్రమలు వృద్ధిచెంది శ్రామికుల సంఖ్య పెరగడం, గ్రామాలనుంచి నగరాలకు ప్రజలు వలస రావడం, ఫలితంగా గ్రామీణ వ్యవస్థ క్షీణించడం జరిగింది. ఇది భూస్వాములు బలహీనం కావడానికి తోడ్పడింది. ఈ ఆర్థిక, సాంఘిక మార్పులు దేశంలో విప్లవాత్మక భావాలు పెంపొందడానికి కొత్త అవకాశాలను కలుగజేసాయి.

**5.3 వాషింగ్టన్ సమావేశము :** 1921 నవంబర్‌లో వాషింగ్టన్ బ్రిటన్, ఫ్రాన్స్, జపాన్ ఇటలీ, చైనా, బెల్జియం, నెదర్లాండ్స్, పోర్చుగల్ దేశాలు సమావేశమై అనేక ఒప్పందాలు కుదుర్చుకొన్నాయి. వాషింగ్టన్ సమావేశంలో చైనా సైబీరియాలకు సంబంధించినతవరకు 9 రాజ్యాల సంధి చాలా ప్రధానమైంది. ఈ సంధి ప్రకారం చైనా స్వాతంత్ర్యాన్ని సర్వ సత్తాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను, పరిపాలన సమగ్రతను మిగిలిన 8 రాజ్యలు గౌరవించాలి. చైనా అభివృద్ధికి తోడ్పడటానికి చైనాలో పైరాజ్యాలన్నింటికి వ్యాపార పరిశ్రమలలో సమాన అవకాశాలు కల్పించడానికి అవి అంగీకరించాయి. చైన తటస్థ విధానాన్ని గౌరవించాలి. సుంకాల విషయంలో చైనాకు కొద్దిపాటి సదుపాయాలు కల్పించడం జరిగింది.

జపాన్, చైనాల మధ్యగల విభేదాలను తొలగించడానికి అమెరికా విదేశాంగ కార్యదర్శి హ్యూస్, బ్రిటన్‌కు చెందిన బాల్‌ఫర్ లు కృషిచేసారు. ఫలితంగా 1922 ఫిబ్రవరి 4 న చైనా, జపాన్‌లు ఒక అంగీకారానికి వచ్చాయి. దీని ప్రకారం జపాన్ చైనాకు కీయాచీయు ఇచ్చివేసింది. జర్మనీకి కౌలుకిచ్చిన షాంటుంగ్ ప్రాంతాన్ని అంతటిని జపాన్ చైనాకు తిరిగి ఇచ్చివేయడానికి ఒప్పుకున్నది. 1923 ప్రారంభమునాటికి షాంటుంగ్ ప్రాంతము నుండి జపాన్ వైదొలగడంతో ఆ రాష్ట్రానికి సంబంధించిన 1915 సంధి రద్దయింది. చైనా, జపాన్ దేశాల సత్‌సంబంధాలకు అడ్డుగా ఉన్నా ఈ సమస్య తీరడంతో రెండు దేశాలమధ్య 1931 వరకు సుహృద్భావము పెంపొందింది.

మొదటి సారిగా చైనా పాశ్చాత్య రాజ్యం సామ్రాజ్యవాద ధోరణిని నిషితముగా విమర్శించి ధైర్యముగా నిలిచింది. వాషింగ్టన్ సమావేశంలోనే ఇక్కడనే ప్రథమముగా చైనా ప్రతినిధికి గౌరవమైన స్థానం లభించింది. చైనా అగ్రరాజ్యాలతో సమాన ప్రతిపత్తిని పొందడమే గాక దాని సర్వసత్తాక ప్రతిపత్తిని కూడా గుర్తించడం జరిగింది. ఇచ్చటనే మొదటి సారిగా చైనాకు విదేశి జోక్యము లేకుండా తన విదేశాంగ విధానాన్ని స్వాతంత్ర్యముగా రూపొందించుకునే అవకాశం కలిగింది. వర్సై సమావేశం తిరస్కరించిన చైన వాదనలను వాషింగ్టన్ సమావేశం అంగీకరించి చైనాకు న్యాయం చేకూర్చింది. షాంటుంగ్ నుంచి జపాన్ ఉపసంహరించుకోవడంతో చైనా కోల్పోయిన ప్రాంతాన్ని తిరిగి సంపాదించుకున్నది. విదేశీ వార్త సౌకర్యాల నుంచి, విదేశి సేనలనుంచి కూడా చైనాకు విముక్తి కలిగింది. ఈ సమావేశం చైనా, జపాన్ ల మధ్య తాత్కాలికంగా మైత్రి సంబంధాలు ఏర్పడడానికి దోహదం చేసింది. రాబోయే 10సం॥ లోను దూరప్రాశ్చములో తుల్య ప్రాబల్య స్థితి ఏర్పడడానికి వీలు కలిగింది.

**11.6. చైనాలో జాతీయ విప్లవ పురోభివృద్ధి :** 1911 విప్లవం ఫలితంగా మంచూ చక్రవర్తుల పాలన అంతమైయింది. కాని విప్లవ ముఖ్య ఉద్దేశమైన పార్లమెంటరీ రిపబ్లిక్ స్థాపన మాత్రం జరుగలేదు. 1911 విప్లవ ఫలితముగా చైనా రిపబ్లిక్ అధ్యక్షుడైన యువాన్‌షికై నిరంకుశ పాలన సాగించాడు. యువాన్ మరణానంతరం పీకింగ్‌లో లియూవాన్ హంగ్ రిపబ్లిక్ అధ్యక్షుడైనాడు. ఇతడు తిరుగుబాటు జరిపిన దక్షిణ రాష్ట్రవాసుల అభిమాని కావడం వల్ల చైనాలో తిరిగి ఐక్యము సాధించుకోవడానికి ప్రయత్నాలు సాగినాయి. లియూవన్‌హంగ్ 1912 నాటి రాజ్యాంగాన్ని పునఃరుద్ధరించి, 1916 లో అంతకుముందు రద్దుచేసిన పార్లమెంటును మళ్ళీ సమావేశపరచారు. కాని ఈ పార్లమెంట్ ప్రజల అండదండలు లేకపోవడం వల్ల ఏమి సాధించలేక పోయింది. రాష్ట్రాల గవర్నర్లు సర్వాధికారాలు చెలాయించినందువల్ల చైనా కేంద్ర ప్రభుత్వం బలహీనమయింది. చైనాలోని దక్షిణ రాష్ట్రాలు అనాటి పీకింగ్ ప్రభుత్వాన్ని గుర్తించలేదు.

**11.6.1 నవ వికాసము :** మొదటి ప్రపంచ యుద్ధ ప్రమాదము నుంచి బయటపడిన చైనా వర్ణించనలవికాని అల్లకల్లోల పరిస్థితిని తట్టుకొని అద్భుతమైన పునఃరుజ్జీవనాన్ని పొందింది. 1916 - 1931 మధ్య కాలములో చైనా అంతర్‌యుద్ధము నుంచి బయటపడి, కోమిన్‌టాంగ్ ఆధ్వర్యములో దేశాన్ని ఏకము చేసి, పాక్షికమైన స్వాతంత్ర ప్రతిపత్తి నుంచి పరిపూర్ణ స్వాతంత్రాన్ని పొందటానికి ప్రయత్నించింది. ఈ సమయంలోనే చైనాలో **నవవికాసం** ఆవిర్భవించింది. మొదటి ప్రపంచ యుద్ధము తరువాత చైనావారి ఆలోచన సరళిలో కొన్ని క్రొత్త పరిణామాలు గోచరించాయి. అవి

1. యెన్‌ఫూ అన్ చైనా మేథావి సంప్రదాయసిద్ధమైన ప్రభుత్వంలోను, విజ్ఞానములోను తన విశ్వాసాన్ని పునరుద్ఘాటించినాడు.
2. బెన్‌టు హసియు అనే ఇంకొక మేధావి చైనా విషయమై పాశ్చాత్యుల ప్రవర్తనకు నిరాశ చెంది మార్క్స్, లెనిన్‌ల సిద్ధాంతాల వల్ల ప్రభావితుడై చైనాలో కమ్యూనిజమ్ రావాలి అని ఆకాంక్షించినాడు.
3. వీటాషావో దేశములో మార్క్స్ సిద్ధాంతాల వ్యాప్తికి కృషిచేసాడు.
4. హుషి చైనాలో పాశ్చాత్యుల ఉదార సంప్రదాయాల స్థాపనకు కలలుకన్నాడు.
5. ఈ కాలములోనే యువచైన ఆదర్శాలు గ్రామీణ ప్రాంతాలకు వ్యాప్తి చెందనారంభించాయి.
6. చైనాలో అల్లకల్లోలానికి కారకులు అయిన కొందరు యుద్ధ ప్రభువులు కూడా దేశంలో సాంస్కృతిక ఉద్యమానికి దోహదం చేసినారు. వారిలో ప్రముఖుడు యన్. సిషన్. ఇతడు యెన్ భూస్వాములు రైతులమీద జరిపే దౌర్జన్యాలను ఖండించాడు.
7. విద్యార్థులు ధైర్యంగా తమ అభిప్రాయాలను తెలియజేయడం ప్రారంభించారు. వారిలో చాలామంది జపాన్, అమెరికా, యూరప్ దేశాలలో అధునాతన విద్యను అభ్యసించిన పట్టభద్రులు. దేశంలో నిరుద్యోగసమస్య మూలంగా వారికి ఉపాధి లేక ప్రభుత్వాన్ని విమర్శించడం మొదలుపెట్టినారు. దీని ఫలితంగా చైనా ఏకము కావాలి అని, పాశ్చాత్యుల ప్రాబల్యం వైదొలగవలెను అని, నవచైన ఉద్భవించాలి అని విద్యార్థులు నినాదాలు చేసారు.

**11.6.2 నవ కొమిన్ టాంగ్ పక్షమున - సన్ యట్ సేన్ :** చైనాలో ఈ నవచైతన్యము వల్ల కోమిన్ టాంగ్ పక్షము బలపడింది. ఇదే చైనాలోని తొలి జాతీయ పక్షము అంటే దేశము. మిన్ అంటే ప్రజలు కుమిన్ అంటే జాతి లేక జాతీయత, టాంగ్ అంటే పక్షము. కోమిన్ టాంగ్ అంటే చైనా జాతీయ పక్షము అని అర్థము. 1917 కొమిన్‌టాంగ్ సభ్యులు పీకింగ్‌ను విడిచి దక్షిణ రాష్ట్రాలకు పారిపోయినప్పుడు ఈ పక్షం కొంత కాలంపాటు తన ప్రాభల్యాన్ని పోగొట్టుకున్నది. దక్షిణ రాష్ట్రంలో కూడా యుద్ధ ప్రభువులలో ఐక్యము లేని కారణంగా సన్‌యట్‌సేన్ అతని అనుచరులు ప్రగతిని సాధించలేకపోయారు. కోమిన్ టాం/ పక్షము కూడా అంతఃకలహాలతోను, విభిన్న రాజకీయ అభిప్రాయాలతోను నిండి ఉండెను. దీనికి తోడు ఆ పక్షానికి తగిన సైని బలం కూడా లేదు

మొదటి ప్రపంచ యుద్ధానంతరం వర్సేసంధికి వ్యతిరేకంగా చైనాలో విద్యార్థుల ప్రదర్శనలు జరిపినప్పుడు వారి ప్రాముఖ్యాన్ని సన్ యట్ సేన్ గుర్తించాడు. అనేకమంది విద్యార్థులను కొమిన్‌టంగ్ పక్షములో చేర్చుకున్నాడు. ఈ విధముగా యువ మేధావుల సభ్యత్వంతో కోమిన్‌టాంగ్ విప్లవానికి సన్నద్ధమైంది. 1922 లో సన్‌యట్‌సేన్ పీకింగ్ యుద్ధ ప్రభువులకు వ్యతిరేకముగా పాశ్చాత్యరాజ్యాల సహాయాన్ని అర్థించగా దానిని వారు తిరస్కరించిరి. దక్షిణ రాష్ట్రాల యుద్ధ వీరుల సహకారం కూడా సన్‌యట్ సేన్ పొందలేక పోయాడు.

1922 సన్ యట్ సేన్ రష్యా ప్రతినిధి అయిన అబ్రామ్ అడాల్ఫ్ జోఫీని కలుసుకొన్నాడు. 1923 లో వారి ఇద్దరికీ ఒక ఒప్పందం కుదిరింది. దీని ఫలితంగా జాతీయ ఐక్యము స్వాతంత్ర్య సాధనకు చైనాకు రష్యా సహాయసానుభూతులు ఉంటాయి. అని జోఫీ హామి ఇచ్చాడు. చైన కమ్యూనిస్టు పక్షం కోమిన్ టాంగ్‌కు సహాయం చేస్తాను అని వాగ్దానం చేసింది. కమ్యూనిస్టు సన్‌యట్ సేన్ సైన్యములో చేరడానికి అనుమతి వచ్చింది. కొమిన్ టాంగ్, కమ్యూనిస్టు పక్షాల మైత్రివల్ల ఇరుపక్షాల వారు తమకు లాభం ఉంటుంది. అని భావించారు. కాని కోమిన్ టాంగ్ పక్షాన్ని కమ్యూనిస్టు స్వాధీనం చేసుకొంటారు అనే విషయాన్ని సేన్ ఆలోచించలేదు. అతని దృష్టిలో అనాడు కమ్యూనిస్టు అల్ప సంఖ్యాకులు. ఆనాడు చైనాలో కమ్యూనిస్టుల సంఖ్య 300 మాత్రమే. కాని కొమిన్ టాగ్ పక్షములో సుమారు 1,50,000 మంది సభ్యులున్నారు. అందువల్ల కమ్యూనిస్టులు కొమిన్‌టాంగ్ మీద అధికారం సంపాదించడం అసాధ్యం అని సన్‌యట్‌సేన్ భావించాడు.

రష్యన్ సలహాదారుడైన మైకేల్ బొరిడిన్ కృషి వలన రెండు సంవత్సరాల వ్యవధిలోనే కొమిన్‌టాంగ్ నిర్మాణంలోను, క్రమశిక్షణ లోను ఒక సంపూర్ణాధికార పక్షంగా అవతరించింది. బొరిడిన్ కొమిన్ టాంగ్‌ను రష్యా కమ్యూనిస్ట్ పక్షంవలె తీర్చి దిద్దాడు. ఫలితంగా కొమిన్ టాంగ్ క్రమశిక్షణ, ఒకే కార్యక్రమం ఉన్న నూతన పక్షంగా ఆవిర్భవించింది. దీని ప్రకారం కొమిన్ టాంగ్ పక్షంలోని సభ్యులంతా నమోదు చేయించుకోవలెను. దీని ఫలితంగా 1911 విప్లవాన్ని సమర్థించిన వారు, రష్యా కమ్యూనిస్ట్ సిద్ధాంతాలకు వ్యతిరేకులు కొమిన్ టాంగ్‌నుంచి తొలగిపోయినారు. చైనా కమ్యూనిస్ట్ పక్ష సభ్యులకు కొమిన్ టాంగ్ పక్షంలో నమోదు చేయించుకోవడానికి అనుమతినివ్వడం జరిగింది. ఈ మార్పుల అనంతరం కొమిన్‌టాంగ్ పక్షానికి ప్రాంతీయ సంఘము ప్రాతిపదిక అయింది. ఈ సంఘము ప్రతి 15 రోజులకు సమావేశం కావలె. ఈ సంఘము ఒక కార్యనిర్వాహక వర్గాన్ని ఎన్నుకోవలె. పక్ష వ్యవస్థ క్రమశిక్షణ, ప్రచార విభాగాలు దీని ఆధీనంలో ఉండేవి. అకౌంట్లను తనిఖీ చేయడానికి, పక్షకార్యకలాపాలను అదుపులో ఉంచడానికి, టాంగ్ పక్ష క్రమశిక్షణను ఉల్లఘించిన వారిని శిక్షించడానికి ఒక అజమాయిషీ సంఘం కూడా ఉండేవి. ఈ ప్రాంతీయ సంఘం మీద జిల్లాల వారీగా, రాష్ట్రాలవారీగా సంఘాలుండేవి. అన్నిటికీ పైన కేంద్ర సంఘము ఉండేది. ఈ సంఘంలో వార్షిక జాతీయ కాంగ్రెస్, కేంద్ర నిర్వాహక వర్గ సంఘము, కేంద్ర అజమాయిషీ సంఘం ముఖ్యాంశాలు. కొమిన్ టాంగ్ రాజ్యాంగంలోని 21 వ నిబంధన ప్రకారం సన్‌యట్ సేన్ జీవితాంతం టాంగ్ అధ్యక్షునిగా నియమితుడైనాడు. పక్ష సభ్యులు అధ్యక్షుని ఆజ్ఞలను, సలహాలను విధిగా పాటించి కొమిన్‌టాంగ్ అభ్యుదయానికి సహకరించవలె. కొమిన్ టాంగ్ జాతీయ కాంగ్రెస్ ఆమోదించిన తీర్మానాలను అధ్యక్షుడు, తిరస్కరించవచ్చు ఇందువల్ల అధ్యక్షునికి పక్షవిధానాలు మీద సర్వాధికారాలు లభించినాయి. అలాగే కేంద్ర కార్యనిర్వాహక వర్గంలో కూడా అధ్యక్షునికి అన్ని అధికారాలు లభించినాయి. ఈ కొమిన్‌టాంగ్ రాజ్యాంగాన్ని 1924 జనవరి 28 న ప్రథమ జాతీయ కాంగ్రెస్ పక్షం ఆమోదించింది.

**11.6.3 సన్ యెట్ సేన్ సిద్ధాంతాలు :** 1924 లో చైనా ప్రజలకోసం సన్‌యట్‌సేన్ మూడు సిద్ధాంతాలను ప్రవచించినాడు. కొమిన్ టాంగ్ పక్షం మానిఫెస్టోలోను, సన్‌యట్ సేన్ ఉపన్యాసాలలోను, జాతి పునర్నిర్మాణ ప్రధాన సూత్రం లలోను, వీలునామాలోను సేన్ సిద్ధాంతాలు కనిపిస్తాయి. వీటినే శాన్-మిన్ - చుయి (ప్రజల మూడు సిద్ధాంతాలు) అని అంటారు. ఈ మూడు సిద్ధాంతాలు 1) జాతీయ వాదము 2) ప్రజా ప్రభుత్వము 3) ప్రజా జీవనోపాధి.

**11.6.3.1 జాతీయ వాదము :** చైనా వారసత్వమైన సాంస్కృతిక ఐక్యానికి బదులు రాజకీయ ఐక్యము దేశంలో స్థిరపడవలెనని సేన్ వాంఛించినాడు. చైనా ప్రజ పొడి ఇసుకవలె అసంఘిటితంగా ఉన్నదని సేన్ అన్నాడు. అందువల్ల ఇసుక రేణువులలో ధృడత్వం కోసం సిమెంట్ అవసరమైనట్లు, చైనీయులలో ధృడమైన సమైక్యం ఏర్పడవలెనంటే జాతీయత వారిలో పెంపొందడం అవసరం. ఈ జాతీయత ఉద్భవించడానికి ముందుగా చైనాలోని చైనీయులు, మంగోలులు, మంచూలు, టిబెటన్‌లలో ఐక్యం కలుగవలె. వారిలో దేశభక్తి పెంపొందవలె. అందుకోసం వారు పాశ్చాత్యా సామ్రాజ్య శక్తులను దేశంనుంచి వెళ్ళగొట్టడానికి సమైక్యం కావలె. జాతీయత అంటే ఒక్క విదేశ శక్తుల నుంచి దేశాన్ని రక్షించు కోవడం మాత్రమే కాదు. అది తక్షణ కర్తవ్యమైనా, క్రమంగా చైనీయుల భావాలలో జాతీయతా స్ఫూర్తి రావలె. వారు ఆలోచించినా, పనిచేసినా, చైనానంతటిని దృష్టిలో పెట్టుకోవలెనగాని, ఒక ప్రాంతాన్ని గాని, ఒక పక్షాన్ని గాని దృష్టిలో పెట్టుకోరాదు. చైనాలోని విభిన్న వర్గాల మధ్య అంతర్యుద్ధం రాకూడదని, అది జాతి సమైక్యానికి భంగకరమని సేన్ భావించాడు. అంతేగాక జాతీయ గౌరవాన్ని సంరక్షించుకోవడానికి చైనీయులు ఇతరులతో పోరాటంలో తప్పు లేదని కూడా సేన్ ప్రబోధించినాడు.

**11.6.3.2 ప్రజా ప్రభుత్వము :** నాలుగు ఆధారాలనుంచి సేన్ ప్రజా ప్రభుత్వాన్ని గురించి తన అభిప్రాయాలను ఏర్పరచుకొన్నాడు. అవి 1) పాశ్చాత్య రిపబ్లిక్ వాదం 2) స్విట్జర్‌లాండ్ రాజ్యాంగంలోని ప్రత్యక్ష ప్రజాస్వామిక పద్ధతులు 3) సోవియట్ ప్రజాస్వామ్య కేంద్రీకరణము 4) చైనీయుల పరీక్షావిధానము, నియంత్రణలు దీని ప్రకారం ఎన్నికల పద్ధతిద్వారా ప్రజాధికారం ప్రజలకు ప్రవేశపెట్టినా శక్తివంతమైన కార్యనిర్వాహకవర్గం విశేషాధికారాలతో ప్రభుత్వాన్ని నడిపించవలెనని సేన్ భావించాడు. సేన్ దృష్టిలో ప్రజలు మూడు రకాలు 1) గతాన్ని సరిగా అవగాహన చేసుకొని ప్రజలను భవిష్యత్తులో నడిపించగల నాయకులు 2) ప్రజలు నాయకులను అర్థం చేసుకోవడంలో తోడ్పడేవారు. 3) గ్రహణ శక్తి తక్కువ ఉండి తనకు లభించినది ఇష్టమోకాదో మాత్రం చెప్పగలిగినవారు. దేశంలోని ప్రభుత్వ యంత్రాంగము అయిదు అంగాలుగా ఉండవలె. అవి 1. కార్యనిర్వాహక వర్గము 2. శాసన నిర్మాణ సభ 3. న్యాయశాఖ 4. పరీక్షా విధానము 5. నియంత్రణము. ప్రభుత్వము ఒక శకటం వంటిది. అది దేశ ప్రజలందరి సొత్తు. దానిని నేర్పు శిక్షణగల కొద్దిమంది, ప్రజాశ్రేయస్సుకోరి నడపడానికి ప్రత్నించవలె. ప్రజాస్వామ్య స్థాపన మూడు ఘట్టాలలో జరగవలె. 1. మొదటి ఘట్టంలో సైనిక నియంతృత్వం ఉండవలె. 2. రెండో ఘట్టము రాజకీయ సంరక్షణాధికారము ఇందులో ప్రజలకు పరిపాలనా విషయంలో కామిన్ టాంగ్ పక్షము శిక్షణ నివ్వవలె. 3. మూడో ఘట్టములో ప్రజలే ప్రభుత్వ బాధ్యతలన్నిటినీ స్వీకరించవలె.

**11.6.3.3 ప్రజా జీవనోపాధి :** చైనా ప్రజల పేదరికాన్ని అంతంచేసి, చైనా ఆర్థిక స్థోమతను పెంపొందించవలెనంటే దేశంలో సామ్యవాద స్థాపన జరగవలెనని సేన్ ఆశించినాడు. కమ్యూనిస్టుల ముఖ్య సిద్ధాంతము అయిన వర్గ సంఘర్షణ చైనాకు సరిపడదని అతడు భావించినాడు. చైనా ప్రధానంగా వ్యవసాయక దేశం కావడం వల్ల, ప్రజల జీవనోపాధిమీద ప్రభుత్వము ఎక్కువ శ్రద్ధ చూపవలె. సామాన్య ప్రజల సౌభాగ్యమే ప్రభుత్వాశయం కావలె. అందువల్ల ప్రభుత్వము ప్రజలందరికి తగిన జీవనోపాధిని కల్పించవలె. చైనాకు విదేశీయులు ఆర్థికంగా దోపిడీ చేయడం అంతం కావలె. దేశంలో పారిశ్రామికంగా వృద్ధి కావడానికి, సుంకాల విషయంలో చైనాకు సర్వాధికారాలు ఉండవలెనని, శైశవస్థితిలో ఉన్న పరిశ్రమలను అభివృద్ధి పరచడానికి విదేశీ సరుకుల మీద సుంకాలను అధికం చేయవలెనని సేన్ అభిప్రాయపడినాడు. చైనీయుల పెట్టుబడిలోనే చైనా అభివృద్ధి కావలెనని సేన్ అభిప్రయాపడినాడు. అమెరికా ఆర్థికవేత్త అయిన హెన్రీ జార్జి సిద్ధాంతమైన ఏకపక్షపు పన్నులను సేన్ చైనాలో అమలచేయుదలిచినాడు. భూమిశిస్తు దేశమంతటా ఒకేవిధంగా ఉండవలెనని ఆర్థిక అసమానత్వం పోవలెనని సేన్ ఆశించినాడు. అందువల్లనే సేన్ కమ్యూనిస్టుగా గాక, తీవ్రవాది అయినా బూర్జువాగా పరిగణించబడినాడు.

**6.4 ఉత్తర దక్షిణ చైనాల ఏకీకరణకు సేన్ విఫలయత్నం :** 1923 లో యునాన్, క్వాంగ్‌సి రాష్ట్రాలకు చెందిన యుద్ధవీరుల సహకారంతో సన్‌యెట్‌సేన్ తిరిగి కాంటన్‌లో అధికారానికి వచ్చినాడు. ఈ యుద్ధ ప్రభువుల ధ్యేయము ప్రజలను

దోచుకొని తాము ధనవంతులు కావలెనని గాని, ప్రజాశ్రేయస్సుకోసం మంచి ప్రభుత్వాన్ని స్థాపించవలెనని కాదు. వారు ప్రజలనుంచి ఎక్కువ పన్నులు వసూలు చేసినారు. తమను రక్షించుకోవడానికి వర్తకులు, భూస్వాములు సేన్ ప్రోత్సాహంతో 'వర్తకుల స్వచ్ఛంద దళాన్ని' స్థాపించుకొన్నారు. కాని కొద్దికాలంలోనే కొమిన్ టాంగ్ పక్షం తీవ్రవాదం వైపు మొగ్గుచూపడంతో కార్మికులు, కర్షకుల సంఘాలు ఏర్పడటంతో భూస్వామ్య వర్గాలకు సేన్ విధానాలలో అసంతృప్తి కలిగింది. దీని ఫలితంగా వర్తకుల స్వచ్ఛంద దళం సహాయంతో సేన్‌ను పదవినుంచి తొలగించడానికి భూస్వాములు ప్రయత్నించినారు. కాని సేన్ వర్తకుల స్వచ్ఛంద దళానికి చెందిన ఆయుధాలన్నిటినీ స్వాధీనం చేసుకోవడంలో దాని ప్రాబల్యం తగ్గిపోయింది. దక్షిణ చైనాలో మాత్రమే సేన్ తన అధికారాన్ని స్థాపించగలిగినాడు. కాని పీకింగ్ ప్రభుత్వంలో సేన్‌కు ఎటువంటి పలుకుబడిలేదు.

ఉత్తర దక్షిణ చైనాలను ఏకం చేసి, ఒక ఐక్య కేంద్ర ప్రభుత్వాన్ని స్థాపించవలెనని సన్‌యట్‌సేన్ ఆశించినాడు. 1924 సంవత్సరాంతానికి అతని ఆశయం ఫలించే సూచనలు కనిపించినాయి. ఆనాటి పీకింగ్ ప్రభుత్వాధినేత అయిన సాకోకున్ పదవీ భ్రష్టుడు కావడం, ఉత్తర చైనాలోని మరొక నాయకుడు తువాన్ చీజాయి పీకింగ్ అధ్యక్షుడు కావడం జరిగింది. అతనితో ఒప్పందం కుదుర్చుకోవడానికి సేన్ పీకింగ్‌కు వెళ్ళినాడు. కాని అతని ఆశయం ఫలించలేదు. అక్కడ సేన్ వ్యాధిగ్రస్తుడై అతని స్నేహితుడై వెల్లింగ్టన్‌కూ నివాసగృహంలో 1925 మార్చి 12 న మరణించాడు. మరణించిన 4 సం॥ తరువాత అతని శరీరాన్ని నాన్‌కింగ్‌కి తీసుకొచ్చి సమాధి చేసారు.

**11.6.5 సన్ యట్ సేన్ మరణ వాంఙ్మూలము :** సేన్ చనిపోయే ముందు రష్యా కేంద్ర కార్య నిర్వాహక కమిటీకి ఈ విధముగా లేఖ వ్రాశాడు. "పీడిత ప్రజల విమోచన కొరకు జరిగే పోరాటములో ఒక శక్తి వంతమైన స్వాతంత్ర్య చైనా సహాయాన్ని రష్యా ఆహ్వానిస్తూ విజయ సాధన కోసం చేయి చేయి కలుపుకుంటూ ముందుకు సాగిపోయే రోజు తప్పక వస్తుంది. అని ఆశిస్తూ నేను మీ వద్ద సెలవు తీసుకొంటున్నాను."

**11.6.6 సేన్ ఘనత :** సన్ యట్ సేన్ అటు పాత వ్యవస్థల పెట్టుబడి ప్రజాస్వామ్యవాదికాదు. ఇటు బోల్షవిక్ కమ్యూనిస్టు వాది కాదు. అతని జాతీయ సూత్రాలు కాని, ప్రజా జీవనోపాధి సమస్యగాని స్పష్టముగా లేవు. కమ్యూనిస్టుల లాగా వర్గపోరాటాన్ని ఇతడు బలపరచలేదు. వర్గ సమైక్యతను బోధించాడు. ఇతనికి ఒక ఆదర్శంలేదు. వాదనా పటిమ లేదు. పరిపాలనాధ్యక్షుడు కాదు కాని విప్లవం అనేదాన్ని ఒక శక్తివంతమైన ఆయుధము గాను, ప్రజాభిప్రాయాన్ని ప్రజా స్వామ్యముగాను మార్చగలిగాడు. తన నడవడిక చేత, తన అకుంఠిత దేశ భక్తిచేత నిస్వార్థ శ్రేయోభిలాషిగా సేన్ ప్రజాభిమానాన్ని చూరగొన్నాడు. చైనా రాజకీయాలలో కోమిన్‌టాంగ్‌ను అత్యంత శక్తివంతమైన రాజకీయ పక్షముగా రూపొందించాడు. ప్రాచీన చైనాకు కన్‌ఫ్యూషియస్ ప్రవక్త అయినట్లే 20 వ శతాబ్ద చైనాకు సేన్ ప్రవక్త. సేన్ మూడు సిద్ధాంతలను జాతీయ బైబిల్‌గా పరిగణించడం జరిగింది. సేన్ హఠాత్తు మరణం జాతీయ పార్టీకి తీరని నష్టం వాటిల్లింది. సేన్ మరణము తరువాత పార్టీకి సమర్థుడు అయిన నాయకుడు లేడు. పార్టీ నాయకత్వము కొరకు సభ్యులలో వైషమ్యాలు చెలరేగి చివరికి పార్టీ చీలికకు దారి తీసింది. సేన్ సిద్ధాంతాలు పార్టీ సభ్యులకు అస్పష్టముగా గోచరించాయి. సేన్ చారిత్రక, ఆర్థిక సిద్ధాంతాన్ని వారు తమ ఇష్టానుసారముగా విశదీకరించడము వల్ల పార్టీ చిన్నాభిన్నం అయింది. దేశములో అంతర్‌యుద్ధము చెలరేగింది. ఇది కమ్యూనిస్టులకు మంచి అవకాశాన్ని ఇచ్చింది.

## 11.7. చియాంగ్ కై షేక్ - చైనా ఏకీకరణ :

చియాంగ్ కై షేక్ 1888 లో చెకియాంగ్ రాష్ట్రంలో జన్మించాడు. టోక్యోలో 4 సం॥ ల పాటు సైనిక శిక్షణ పొందాడు. 1911 చైనా విప్లవ ఉద్యమంలో పాల్గొన్నాడు. 1913 నుంచి 1920 వరకు సన్ యట్ సేన్‌కు కార్యదర్శిగా పనిచేశాడు. తరువాత కొంతకాలం వ్యాపారము చేసి డబ్బును ఆర్జించి తిరగి రాజకీయాలలో ప్రవేశించాడు. మిలటరీ శాస్త్రములోని ఆధునిక పద్ధతులను

అభ్యసించడానికి చియాంగ్ మాస్కోకి వెళ్ళినాడు. ఈ సమయానికి ఏర్పాటు అయిన వాంపోయా మిలటరీ అకాడమికి అధిపతి అయినాడు. సేన్ మరణానంతరం చైనా జాతీయ సైన్యానికి చియాంగ్ ప్రధాన సైన్యాధిపతి అయ్యాడు.

**11.7.1 ఉత్తర చైనా మీద దండయాత్ర :** పాశ్చాత్య కబంధ హస్తాల నుంచి చైనాను విముక్తము చేసి దానిని ఏకము చేయాలి అని సేన్ మరణించే వరకు ఆశించినాడు. ఈ ఆశయాన్ని సేన్ మరణానంతరం అతని అనుచరులు సాధించ దలచినారు. 1926 లో ఉత్తర చైనామీద దండయాత్రకు సన్నాహం జరిగింది. దీనిలో ప్రధాన పాత్ర వహించినవాడు చియాంగ్ కె షేక్.

రష్యా సలహాదారు అయిన మైకేల్ బోరోడిన్ ఉత్తర చైనా మీద దండయాత్రకు మొదట అంగీకరించలేదు. కాని చియాంగ్ బలపడడం గ్రహించి అతని వల్ల కమ్యూనిస్టుల ఉనికికి భంగము ఏర్పడుతుంది అని భావించి, అతని దృష్టిని మరల్చడానికి చివరకు బోరోడిన్ ఉత్తర దండయాత్రకు అంగీకరించాడు. 1926 వేసవిలో దండయాత్ర ఆరంభమైంది. ఈ దండయాత్రకు పథకాన్ని వేసినవాడు రష్యా ప్రధాన మిలటరీ సలహాదారుడు అయిన బ్లూచర్ దీని ప్రకారం కొమిన్ టాంగ్ సైన్యాలు హునాన్, కియాంగ్ షి రాష్ట్రల గుండాపోయి హాంకో నగరాన్ని వశము చేసుకోవలెను. తరువాత నాన్‌కింగ్, షాంగ్ హై నగరాలను ఆక్రమించవలె. షాంగ్ హై ఆక్రమణ తరువాత పీకింగ్ మీద దాడి చేయవలె. ఈ దండయాత్రకు సర్వ సైన్యాధ్యక్షుడుగా చియాంగ్ నియమితుడైనాడు. దీని కోసం అతనిని పార్టీ కార్యకలపాలనుంచి విడుదల చేయడం జరిగింది.

చియాంగ్ కే షేక్ నాన్‌చాంగ్ పట్టణాన్ని స్వాధీనం చేసుకున్నాడు. ఇదే సమయంలో జాతీయ సైన్యాలు హెంకోను స్వాధీనం చేసుకున్నాయి. జాతీయ సైన్యాల విజయానికి ముఖ్యకారణం సామన్య ప్రజానీకములో కోమిన్‌టాంగ్ ప్రచారము విస్రృతము కావడమే. జాతీయ సైన్యాలు ఉత్తర రాష్ట్రాలను స్వాధీనం చేసుకొంటున్న సమయంలో కోమిన్‌టాంగ్ కమ్యూనిస్టుల మధ్య స్పర్ధలు ఆరంభమైనాయి కోమిన్ టాంగ్ పక్ష కేంద్ర కార్యనిర్వహక వర్గం, కమ్యూనిస్టులెవ్వరు శాఖాధ్యక్షులుగా ఉండరాదు అని నిశ్చయించింది. కాని చియాంగ్ తన సైన్యాలతో యుద్ధరంగములో ఉండటం వల్ల, కోమిన్‌టాంగ్ వామ పక్ష నాయకుడైన వాంగ్ చింగ్ విదేశాలలో ఉండడం వల్లా ఈస్పర్ధలు వెంటనే బయటపడలేదు. హాంకో స్వాధీనం అయిన తరువాత జాతీయ ప్రభుత్వ కేంద్రాన్ని కాంటాన్ నుంచి హాంకోకు మార్చడం జరిగింది. ఇక్కడ రష్యన్ సలహదారుల పలుకుబడి వల్ల కమ్యూనిస్టులు క్రమముగా పార్టీలో చియాంగ్ ప్రాబల్యాన్ని తగ్గించాలి అని ప్రయత్నాలు సాగించారు. ఇది గ్రహించిన చియాంగ్ నాన్‌చాంగ్‌లో పార్టీ కేంద్ర నిర్వహకవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేయాలి అని కోరాడు. కాని సమావేశం హాంకోలోనే జరిగింది. దీనికి చియాంగ్ హాజరు కాలేదు. అందువల్ల అతనిని సైన్యాధ్యక్ష పదవి నుంచి కేంద్ర స్థాయిసంఘ అధ్యక్షపదవి నుంచి తొలగించడం జరిగింది. కాని కేంద్ర కార్యనిర్వాహక వర్గ సంఘ సభ్యుడుగా మాత్రం అతనిని కొనసాగించారు. దీనితో చియాంగ్ ఎదురు తిరిగి నాన్‌కింగ్‌ను వశపరచుకొన్నాడు. అక్కడనుండి అతడు షాంగ్ హే చేరి అక్కడ బాంకర్‌ల వర్తకుల సహాయంతో, పాత కోమిన్‌టాంగ్ సభ్యుల సహకారంతో ఆ నగరాన్ని స్వాధీనం చేసుకున్నాడు. హాంకోలోని కొంతమంది మితవాదులు చియాంగ్‌తో చేతులు కలిపారు. హాంకో ప్రభుత్వం చియాంగ్‌ను భహిష్కరించగా అతడు నాన్‌కింగ్‌లో పోటి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి రష్యా ప్రాభల్యానికి కమ్యూనిస్టులకు వ్యతిరేఖమైన శక్తులనన్నింటిని కూడగట్టుకున్నాడు. అదే సమయంలో పీకింగ్‌లోని సోవియట్ రాయబార కార్యలయం మీద జరిగిన దాడిలో లభించిన కొన్ని పత్రాల వల్లా రష్యా, చైనాను తన స్వప్రయోజనాలకి వినియోగించుకొనదలచినది అని, చైనా విప్లవం పట్ల దానికి ఎటువంటి సానుభూతి లేదు అని బహిర్గతం అయ్యింది. అంతేకాక చైనాకు రష్యా పంపిన యమ్. యన్. రాయ్ విచక్షణారహితమైన కార్యకలాపాలుకూడా భయటపడినాయి. కోమిన్ టాంగ్ వామపక్ష సభ్యులు కూడా కమ్యూనిస్టులతో తెగతెంపులు చేసుకొని మితవాదులతో స్నేహం చేసుకున్నారు. కోమిన్‌టాంగ్‌ల నుంచి కమ్యూనిస్టులను పూర్తిగా తొలగించవలెను అని, బోరోడిన్ మొదలైన రష్యన్ సలహాదారులందరిని పంపించి వేయవలెను అని వారు కోరారు. 1927 లో బోరోడిన్ ప్రధాన సలహాదారు పదవి నుంచి విరమించుకొని రష్యా వెళ్ళినాడు. అదే సంవత్సరం టి.వి. సూంగ్ అనే ప్రముఖ వ్యాపారస్తుని చెల్లెల్ని చియాంగ్ వివాహం చేసుకున్నాడు. ఈమె మధామ్ సన్‌యట్‌సెన్ అక్క చెల్లెళ్ళు. 1928 లో చియాంగ్ కోమిన్ టాంగ్ పార్టీకి

ప్రధాన నాయకుడైనాడు. అంతేగాక స్థాయి సంఘానికి అధ్యక్షునిగాను, సర్వసైన్యాధ్యక్షునిగాను కోమిన్ టాంగ్ అతనిని ఎన్నుకొన్నది. ఆనాటి నుంచి 20 సం॥ పాటు చియాంగ్ పార్టీలో ప్రధాన పాత్ర వహించాడు. 1928 నాటికి వాయువ్య రాష్ట్రంలో హునాన్ రాష్ట్రాన్ని పాలిస్తున్న ఫెంకు, షాంపీ, రాష్ట్ర పాలకుడైన మన్‌సిషాన్ కూడా జాతీయ వాదులతో చేతులు కలిపారు. ఫలితంగా ఆన్ హ్వాయి, చిహ్లి, షాంటుంగ్, చాంగ్ సోలిన్ ఆధీనములోని మూడు మంచూరియా రాష్ట్రాలు తప్ప మిగిలిన భూభాగమంత జాతీయ వాదుల ఆధీనం అయ్యింది. 1928 వసంతములో జాతీయ సైన్యాలు పీకింగ్ వైపుకు పురోగమించాయి. కాని ఈ సైన్యాలను షాంటుంగ్ ప్రాంతములో జపాన్ సైన్యాలు అడ్డగించాయి. అందుకు కారణం ఆ ప్రాంతములోని తమ ప్రయోజనాలను జపాన్ పరిరక్షింపుకోదలచడమే. 1928 జూన్ నాటికి జాతీయ సైన్యాలు పీకింగ్ చేరగా, చాంగ్ సోలిన్ పీకింగ్‌ను విడిచి మంచూరియాకు చేరినాడు. చాంగ్ సోలిన్‌ను వెంబడిస్తున్న జాతీయ సైన్యాలను మంచూరియాలో కూడా జపాన్ సేనాలు అడ్డగించనారంభించినాయి. చాంగ్ సోలిన్ మంచూరియాలో బాంబు పేలుడు వల్ల చనిపోగా అతని కుమారుడు చాంగ్ హుసియె లియాంగ్ కోమిన్‌టాంగ్ అధికారాన్ని అంగీకరించాడు. పీకింగ్ స్వాధీనం కావడంతో చైనా ఏకీకరణ జరిగి సేన్ అభిష్టం నేరవేరినట్లయ్యింది. పీకింగ్‌ను పీపింగ్‌గా పిలవడం జరిగింది. చైనా రాజదాని పీకింగ్‌నుంచి నాన్‌పీకింగ్‌కు మారింది.

**11.7.2 జాతీయ ప్రభుత్వ స్థాపన** : ఉత్తర, దక్షిణ చైనాల ఏకీకరణ జరిగిన తరువాత చియాంగ్ కె. షేక్ తన సర్వ సైన్యాధ్యక్ష పదవికి, సైనిక సలహా సంఘ అధ్యక్ష పదవికి రాజీనామా చేసినాడు. తరువాత చియాంగ్ దేశ పునఃనిర్మాణము పట్ల దృష్టి మరల్చాడు. 1928 ఆగస్టులో జరిగిన కేంద్ర కార్యనిర్వాహక వర్గం ఐదో ప్లీనరీ సమావేశం జాతీయ ప్రభుత్వపు రాజ్యాంగ శాసనాన్ని రూపొందించవలసిందిగా అధికారమిచ్చింది. 1928 అక్టోబరు 10 న చియాంగ్ ప్రభుత్వం ఈ రాజ్యాంగ శాసనాన్ని ప్రకటించింది. దీనితో జాతీయ విప్లవపు రెండోదశ అయిన రాజకీయ సంరక్షణాధికారము ఆరంభమైంది. సేన్ అభిప్రాయం ప్రకారం ఈ దశలో అధికారములు పార్టీ కాంగ్రెస్ చేతిలోనే ఉండవలె. ఈ రాజ్యాంగ శాసనం ప్రకారం ప్రభుత్వ యంత్రాంగాలు అన్ని కేంద్ర రాజకీయ సంఘపు అజమాయిషీలో ఉంటాయి. ఈ సంఘం సభ్యులను పార్టీ కేంద్ర నిర్వాహక వర్గ సంఘం నుంచి, కేంద్రీయ రాష్ట్ర మండలి నుంచి ఎన్నిక చేయడం జరుగుతుంది. దీని వల్ల పార్టీకి ప్రభుత్వానికి వ్యక్తిగత సంబంధాలు ఏర్పడతాయి. ప్రభుత్వ స్థాయిలో అత్యున్నత పరిపాలనాంగం రాష్ట్రమండలి. దీనిలో 12 నుంచి 16 వరకు సభ్యులుంటారు. దీని అధ్యక్షుడు నామ మాత్రపు దేశాధినేత సేన్ అభిప్రాయము ప్రకారమే ప్రభుత్వ యంత్రాంగములో శాసన నిర్మాణ సభ, కార్యనిర్వాహక సభ, న్యాయశాఖ, పరీక్షా విధానం నియంత్రణ అనే ఐదు భాగాలను ప్రవేశ పెట్టడం జరిగింది. ఇదే విధముగా రాష్ట్ర ప్రభుత్వ నిర్మాణాలు జరిగాయి. రాష్ట్రీయ మండలి అధ్యక్షుని, సభ్యులను జాతీయ ప్రభుత్వం నియమిస్తుంది. రాష్ట్రీయ సంఘాలమీద శాఖ రాజకీయ సంఘాలు పీకింగ్, కాంటిన్, హాంకో మొదలగు పట్టణాలలో ఏర్పాటు అయినాయి. ఈ రాజ్యాంగ శాసనం ప్రకారం చియాంగ్ కే షేక్ దేశ అధ్యక్షుడైనాడు.

1931 లో, 1928 నాటి రాజ్యాంగ శాసనానికి కొన్ని సవరణలు చేసి ఒక తాత్కాలిక రాజ్యాంగాన్ని ప్రకటించడం జరిగింది. దీనివల్ల కోమిన్ టాంగ్ కేంద్ర కార్యనిర్వాహక సంఘము, రాష్ట్ర మండలి అధ్యక్షుడు అధికారాలు పెరిగాయి. ఈ రాజ్యంగములో దేశ సరిహద్దులను నిర్వచించడం, ప్రజల హక్కులను, విధులను నిర్దేశించడం, ప్రజా జీవనోపాధి సిద్ధాంతాన్ని అమలు చేయడం విద్యను నిర్వహించడం, కేంద్రాలకు రాష్ట్రాలకు మధ్య అధికారాలను విభాగించడం జరిగింది. 1935 లో రాజకీయ సంరక్షణాధికారం అంతం అయ్యేవరకు చైనాలో జాతీయ ప్రభుత్వ పరిపాలన కొనసాగింది. తరువాత దేశములోని న్యాయశాస్త్ర ప్రవీణులు పాశ్చాత్య రాజ్యాంగాలను పరిశీలించి తమ దేశానికి ఒక ముసాయిద రాజ్యాంగాన్ని తయారు చేసినారు. దీనిని ద్విపంచ సూత్ర రాజ్యాంగ ముసాయిద అని అంటారు. దీనిని ఆమోదించడానికి రాజ్యాంగ సభ 1937 నవంబర్‌లో సమావేశం కాదలచింది. కాని ఈ లోపల చైనా మీద జపాన్ దండయాత్ర మూలంగా రాజ్యాంగ పరిషత్ సమావేశం జరగలేదు.

**11.7.3 చైనా ఆంతరంగిక వ్యవహారాలు :** 1928 లో చైనా ఏకీకరణ జరిగినా, ప్రభుత్వం అనేక అంతరంగిక సమస్యలను ఎదుర్కొవలసి వచ్చింది. అందువల్ల దేశ పునఃనిర్మాణ కార్యక్రమం కుంటుపడింది. దేశాధ్యక్షుడు అయిన చియాంగ్‌కు యాంగ్‌ట్సే నది ముఖద్వార ప్రాంత రాష్ట్రాల మీద మాత్రమే అధికారముండేది. చైనా ఇతర రాష్ట్రాల మీద కేంద్ర ప్రభుత్వ అధికారం యుద్ధ ప్రభువులైన ఫెంగ్, యన్, క్వాంట్సే పాలకుల మైత్రి మీద ఆధారపడి ఉండేది. దక్షిణ మధ్య చైనాలో కమ్యూనిస్టుల ప్రాబల్యం ఇంకా తగ్గలేదు. వారు ప్రభుత్వం మీద నిగూఢ కార్యకాలపాలు సాగించడం మొదలుపెట్టారు. దీనికి తోడు కోమిన్ టాంగ్ పార్టీలో దక్షిణ వామ పక్షాల మధ్య స్పర్థలు ఎక్కువైనాయి. వామ పక్షాలు తమను పునర్వ్యవస్థీకరణ వాదులుగా పిలుచుకొని నాన్‌కింగ్ ప్రభుత్వం పట్ల తటస్థ విధానాన్ని అవలంభించినాయి. వీరు 1929 లో జరిగిన మూడో జాతీయ కాంగ్రెస్ సమావేశ నిర్ణయాలకు తీవ్రవ్యతిరేకతను తెలిపారు. క్వాంట్సే యుద్ధవీరులు తిరుగుబాటు చేయగా వారిని ఫెంగ్ సహాయంతో చియాంగ్ కె షేక్ పారద్రోలినాడు. 1930 వరకు చియాంగ్, ఫెంగ్‌లు ఒకరినొకరు బలహీన పరుచుకోవడానికి ప్రయత్నించినారు. ఇద్దరు కూడా మెన్. మంచూరియాలో అధికారంలో ఉన్న చాంగ్‌ల సహాయం పొందగోరినారు. మొదటి చాంగ్ ఫెంగ్, మెన్లలకు సహాయం చేసిన తరువాత చియాంగ్ పక్షం వహించినాడు. బాంగ్ సహాయంతో చియాంగ్ ఫెంగ్, మెన్‌లను ఓడించి వారి ప్రాంతాలను స్వాధీన పరచుకొని, చాంగ్ పరిపాలన క్రిందకు తెచ్చినాడు. ఈ విధంగా చైనా రాజకీయాలలో బాంగ్ ప్రభలుడై, 1931 లో జపాన్‌ల చేతిలో ఓడిపోయేటంత వరకు ప్రముఖ రాజకీయ వేత్తగా వ్యవహరించాడు. దక్షిణ చైనాలో పునఃవ్యవస్థీకరణ వాదులు క్వాంట్సే యుద్ధ వీరుల సహాయంతో కాంటిన్‌లో ఒక పోటి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసారు. 1931 లో ఈ ప్రభుత్వం చియాంగ్ మీద దాడికి సిద్ధమైయ్యింది. జపాన్ ఉపద్రవము వల్ల ఈ యుద్ధ ప్రయత్నాన్ని విరమించి చియాంగ్‌లో సంప్రదింపులు జరిపింది. ఈ సంప్రదింపుల ఫలితంగా జరిగిన ఒప్పందం ప్రకారం దక్షిణ వామ పక్షాలతో కూడిన ఒక సంఘము ఏర్పడింది. ఇందులో చియాంగ్, వాంగ్, చింగ్‌ని, హుహేన్ మిన్ లు సభ్యులు. కాని ఈ మైత్రి ఎంతోకాలం నిలువలేదు. 1933 నాటికి చియాంగ్ తిరిగి ప్రభలుడైనాడు. కాని ఆనాటికి ఉత్తర చైనాలో జపాన్ దాడివల్ల అతని ప్రాభల్యం క్షీణించింది. కాంటన్‌లో చియాంగ్ వ్యతిరేక ప్రభుత్వం దక్షిణ మధ్య చైనాలో కమ్యూనిస్టుల ఉపద్రవము కూడా చియాంగ్‌ను కలవరపరచినాయి. కమ్యూనిస్టుల మీద చియాంగ్ దృష్టిని కేంద్రీకరించడం వల్ల ఇంచు మించుగా జపాన్ సేనాలకు ప్రతిఘటన లేక పోయింది. ఇదే చియాంగ్ చేసిన ఘోరమైన తప్పిదం.

ఈ అంతర్ యుద్ధాల వల్ల చైనా ఆర్థికస్థితి అధ్వానమై జాతీయ ఋణం పెరిగింది. అయిన అనాటి ప్రముఖ చైన ఆర్థిక వేత్త అయిన టి.వి. సూంగ్ అవలంభించిన ఆర్థిక సంస్కరణల వలన చైనా ఆర్థిక పరిస్థితి కొంత వరకు మెరుగైంది. సుంకం వల్ల అధిక ఆదాయం కలగడం, ఆర్థిక పరిపాలనను కేంద్రీకరించడం, వింత వ్యయాన్ని పాటించడం వల్ల ఇది సాధ్యం అయ్యింది. రవాణా శాఖ ఆధిపత్యంలో రైలుమార్గాలు, రోడ్ల అభివృద్ధి పరచడం జరిగింది. విదేశీ సలహాదారుల సహాయంలో కరెన్సీ సమస్య, విద్యా, ప్రజారోగ్యం నల్లమందు నియంత్రణ మొదలగు సమస్యలను ప్రభుత్వం చేపట్టింది. కార్మిక సంఘాలను వ్యవస్థీకరించడం, కార్మిక వివాద పరిష్కారాలను చేయటం, రోజుకు 8 గంటలు పని చేయడం వంటి విషయాలమీద శాసనాలను చేయడం జరిగింది. దేశములో అనేక న్యాయస్థానాలను స్థాపించడం, ధర్మస్మృతులను పూర్తి చేయడం జరిగింది. జర్మన్ సైనిక సలహాదారుల సహాయంతో చియాంగ్ చైనా సైన్యాన్ని పునఃనిర్మించాడు. నౌకాదళం, వైమానిక దళాల అభివృద్ధి కూడా జరిగింది. కాని పై కార్యక్రమాల వల్ల చైన సామాన్య ప్రజానీకపు ఆర్థిక స్థితిగతులు మెరుగు పడలేదు. రైతులకు రక్షణ కల్పించే భూశాసనాలు అమలు చేయడం జరగలేదు. సైన్యం మీద ఎక్కువ ఖర్చు చేయడం జరిగిందిగాని ప్రజలకు అవసరం అయిన ప్రాజెక్టుల మీద వ్యయము జరగలేదు. దీనివల్ల చియాంగ్ వ్యతిరేకులకు పార్టీమీద ప్రభుత్వము మీద విమర్శలు చేయడానికి అవకాశం కలిగింది. నాన్‌కింగ్ ప్రభుత్వపు కార్యక్రమం సాంఘిక సంస్కరణయేగాని ప్రజా విప్లవము కాదు అని మదాయ్ సన్ యేట్ సేన్ చాలసార్లు ప్రకటించింది. చియాంగ్ ప్రభుత్వాన్ని పెట్టుబడి దారి ప్రభుత్వంగా చిత్రించి కమ్యూనిస్టుల దేశంలో కర్షక విప్లవానికి ప్రయత్నించ సాగిరి.

**11.7.4 జపాన్ చంచూరియా ఆక్రమణ :** 1931 లో జపాన్ మంచూరియా మీద దండయాత్ర ప్రారంభించి 1932 నాటికి దానిని పూర్తిగా కబళించి వేసింది. మంచూరియాను మంచూకో అనే కొత్త స్వాతంత్ర్య రాజ్యముగా జపాన్ ప్రకటించింది. 1932 మార్చిలో ఆకరి మాంచూ చక్రవర్తి అయిన హెన్రి పూయి మంచూలో రాజ ప్రతినిధి అయినాడు. జపాన్ ఈ కొత్త రాజ్యాన్ని గుర్తించింది. ఈ మంచూరియా ఆక్రమణ చైనాలోని చియాంగ్ ప్రభుత్వం బలహీనతను బహిర్గతము చేసింది.

**11.7.5 దేశములో అంతర్ యుద్ధం :** దేశాన్ని కమ్యూనిస్టుల ప్రాభవం నుంచి రక్షించడానికి చియాంగ్ 1934 లో **"నూతన జీవన ఉద్యమం"** ప్రారంభించాడు. ఆంతరంగిక పురోభివృద్ధి, సమజీవనం, జాతీయ భావాన్ని అతడు నొక్కి చెప్పాడు. సాంఘిక సమానత్వాన్ని స్వార్థ త్యాగాన్ని దేశభక్తిని ప్రేరేపించాడు. నల్లమందు, పొగాకు వాడకాన్ని, వర్గవిభేదాలను ఖండించాడు. దేశ విద్రోహక చర్యలను ఖండించినప్పటికి కమ్యూనిస్టుల ప్రభావం నుంచి దేశాన్ని కాపడలేక పోయినాడు. చియాంగ్ దేశములో చెలరేగిన అంతర్ యుద్ధములో మునిగిపోనడం వలన జపాన్ దురాక్రమణను అరికట్టలేక పోయాడు. రెండో ప్రపంచ యుద్ధం తరువాత దేశంలో కమ్యూనిస్టుల విజయం వల్ల 1949 అక్టోబర్ 14 న చియాంగ్ చైనాను విడిచి ఫార్మోసాకు పారిపోవలసి వచ్చింది. అతడు ఫార్మోసాలో అమెరికా రక్షణ క్రింద కొత్త జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పరచి ఐక్యరాజ్య సమితిలో శాశ్వత సభ్యత్వాన్ని సంప్రదించాడు. చియాంగ్ ఒక జాతీయ నాయకుడు. 1949 లో కమ్యూనిస్టులు తలఎత్తే వరకు దేశ సమైక్యతను సంరక్షించిన వ్యక్తిగా పేరు గడించారు.

## 11.8. చైనాలో కమ్యూనిస్టు పార్టీ స్థాపన :

1917 లో రష్యాలో ఉద్భవించిన ప్రఖ్యాత విప్లవము వల్ల మార్క్సిస్టు, లెనినిస్టు సిద్ధాంతాలు రష్యానుంచి చైనాకు వ్యాపించి 1921 లో చైనా కమ్యూనిస్టు పార్టీ స్థాపించబడటానికి కారణం అయ్యాయి. అంతేగాక పీకింగ్ విశ్వవిద్యాలయంలోని ఇద్దరు మేధావులు చిన్ టు హిషిన్, లిటాబా ఈ పార్టీ స్థాపనకు ఎంతో కృషిచేసారు. ఈ పార్టీ తరువాత ప్రపంచములో ఒక శక్తివంతమైన సంస్థగా మారింది. ఈ పార్టీకి మూలపురుషుడు, స్థాపకుడు చిన్‌టుహిషిన్. ఇతడు పీకింగ్ నుంచి షాంగైకు వచ్చి స్థిరపడినప్పుడు అతని చుట్టూ మార్క్సిస్టులు ఉండేవారు వీరు కమ్యూనిజం గురించి తెలుసుకోవడానికి ఒక మేధావిని పంపమని రష్యాను కోరారు. రష్యా 1920 లో గ్రిగోరి వోయిటిన్‌స్కిని చైనాకు పంపింది. ఇతడు చైనాకు వచ్చి కమ్యూనిజముపై ఉపన్యాసాలు ఇచ్చాడు. ఫలితముగా చైనాలో చిన్న చిన్న మార్క్సిస్ట్ సంఘాలు స్థాపించబడ్డాయి. 1921 లో ఈ చిన్న చిన్న సంఘాల స్థాపకులు అంతా కలసి షాంగైలో ఒక బాలికల పాఠశాలలో మొదటి కాంగ్రెస్‌ను ఏర్పరచుకొన్నారు. అప్పుడు ఆ సభకు 15 మంది ప్రతినిధులు హజరైనారు. అందులో 12 మంది చైనాలోని 6 సంఘాలనుంచి ఒకరు జపాన్ నుంచి, ఇద్దరు రష్యా నుంచి వచ్చారు. ఈ విధముగా ఏర్పాటైన మొదటి కమ్యూనిస్టు సమావేశానికి చిన్ టు హిషిన్ గాని, లిటాచోలుగాని హాజరు కాలేదు. కాని చూతే మావో, చౌ ఎన్ లే అను ముగ్గురు ప్రముఖులు హాజరయ్యారు. వీరిలో ఎవరు కూడా శ్రమజీవుల వర్గం నుంచి రాలేదు. అంతకు ముందు వీరిలో ఒకరికి మరొకరికి పరిచయం లేదు. వీరికి రష్యన్ భాషకూడా తెలియదు. ఏమైనప్పటికి చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రథమ కాంగ్రెస్ ఒక రాజ్యాంగాన్ని, చిన్‌టు హిషిన్ నాయకత్వంలో ఒక కేంద్ర కమిటీని ఏర్పాటు చేసుకొన్నది. కాంగ్రెస్ సమావేశానికి హాజరు కాకపోయినప్పటికి చిన్ టు హిషిన్ అంటే పార్టీ సభ్యులకు గౌరవం ఉంది. ఇతడు పార్టీ అభివృద్ధికి కృషి చేయసాగాడు. చైనా కమ్యూనిస్టు పార్టీని పటిష్టం చేయడానికి మైకెల్ బోరోడిన్, అబ్రామ్ ఆడాల్ఫ్ జోఫి అనే వారిని రష్యా కమ్యూనిస్టు పార్టీ చైనాకు పంపింది. 1924 - 1927 సం॥ల మధ్య చైనా కమ్యూనిస్టులు కోమిన్ టాంగ్ పార్టీతో చేతులు కలిపి ఆ పార్టీ మీద ఆధిపత్యాన్ని సంపాదించదలచినారు. కాని 1927 లో కమ్యూనిస్టులు కోమిన్‌టాంగ్ నుంచి వైదొలగినారు. నిజమైన జాతీయ విప్లవం కుట్రలవల్ల, సాయుధ తిరుగుబాటు వల్లనే సంభవిస్తుంది. అనే స్టాలిన్ సిద్ధాంతంలో ఆనాటి చైనా కమ్యూనిస్టులు ఏకీభవించినారు. దీనికనుగుణంగా వారు హునాన్ రాష్ట్రంలో మావో సేటుంగ్ నాయకత్వం సాయుధ విప్లవం జరిపినారు. అది విఫలం అయిన

తరువాత చైనా కమ్యూనిస్టు నాయకుడైన లీలిసాన్ సిద్ధాంతం ప్రకారం చైనా పట్టణాలలోని కార్మికుల తిరుగుబాట్లను లేవదీసారు. కాని ఈ తిరుగుబాటులు కూడా విఫలం అయినాయి. ఈ విధముగా పార్టీ స్థాపన జరిగిన తరువాత 10సం॥లలో చైనా కమ్యూనిస్టు పార్టీ చెప్పుకోదగిన ప్రగతిని సాధించలేదు. అయితే ఈ కాలములోనే కమ్యూనిస్టుపార్టీ క్రమశిక్షణతో కూడిన సుశిక్షితమైన విప్లవ వాదుల సంస్థగా రూపొందింది. ఈ కాలములోనే చైనా కర్షకుల ఆదరాభిమానాలను పొందడం జరిగింది.

**8.2 మావో ట్సేతుంగ్ :** చైనా కమ్యూనిస్టు ఉద్యమంలో ఒక అపూర్వమైన స్థానాన్ని ఆక్రమించిన వ్యక్తి మావో. ఇతడు రైతు వర్గాన్ని శక్తివంతమైన వర్గముగా మార్చి దాని ద్వారా ప్రపంచ చరిత్రలో ఒక గొప్ప మార్పును సృష్టించిన మహామనిషి. అటువంటి మావో 1893 డిసెంబర్ 24 న హునాన్ రాష్ట్రంలో హిషియాంగ్ టాంగ్ అనే జిల్లాలో షోషాన్ గ్రామములో జన్మించాడు. తండ్రిపేరు మావో సేన్ సింగ్. మొదట ఇతడు చిన్న రైతు. క్రమేణ తన పద్ధతిని మెరుగుపరచుకొని ఉన్నత స్థాయిగల రైతు అయ్యాడు. తల్లిపేరు వెన్ చిమియి. ఈమె నిరక్షరాస్యురాలు. కాని మంచి దయార్థహృదయం గల బౌద్ధమతస్తురాలు. అందువల్ల మావో బాల్యములో బౌద్ధమతస్తుడుగా ఉండేవాడు. మావో చదువుకోసం తన గ్రామాన్ని వదలి వ్యాపార కేంద్రమైన హిషియాంగ్ - హిషియాంగ్ పట్టణం వచ్చి జీవించ సాగాడు. 13 వ ఏట వచ్చే సరికి తండ్రి బలవంతం మీద స్వగ్రామానికి వచ్చి పొలం పనులు చూసుకుంటు తీరిక సమయంలో ప్రామాణిక గ్రంథాలు చదివేవాడు. పొలం పనుల మీద కంటే విద్యపట్ల ఆసక్తి పెరగడంవల్ల మావో తన 18 వ ఏట ఇల్లు విడిచి చాంగ్‌షాకు వెళ్ళి అక్కడ ఒక పాఠశాలలో విద్యార్థిగా చేరాడు. ఈ పాఠశాలలో పాశ్చాత్య విద్యను అభ్యసించాడు. ఇచ్చటనే మావో గొప్పగొప్ప దేశనాయకుల జీవిత చరిత్రలను చదివాడు. 1911 లో హునాన్ సైన్యములో చేరాడు. సైన్యములో గడిపిన 6 నెలల కాలములో అనేక గ్రంథాలు చదివాడు 1918 లో పీకింగ్ విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీని పొందాడు. ఆ తదుపరి మావో పీకింగ్ విశ్వవిద్యాలయంలోని గ్రంథాలయంలో ఒక చిన్న ఉద్యోగిగా చేరాడు. 1919 లో హునాన్‌లోని విద్యార్థులను కూడ గట్టుకొని మావో షాంగ్‌షాలో సమ్మె నిర్వహించాడు. అంతేగాక మావో ఒక మాస పత్రికను స్థాపించి ప్రజా ప్రభుత్వం గురించి అందులో వ్యాసాలు ప్రచురించాడు. ఆ తదుపరి మావో పీకింగ్‌కు వెళ్ళి లిటిబా స్థాపించిన మార్క్సిస్టు విద్యా కేంద్రములో చేరి మార్క్స్ గ్రంథం అయిన "కమ్యూనిస్టు మేనిఫెస్టో" చదివాడు. తరువాత మావో నార్మల్ పాఠశాల డైరెక్టర్ అయ్యాడు. 1920 లో యాంగ్ కే హుయిని మావో వివాహమాడినాడు. 1920 లో మావో సామ్యవాద యువదళం అనే సంఘాన్ని స్థాపించాడు. ఈ సంఘం తరుపున ప్రతినిధిగా 1921 జూలైలో షాంగైలో చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రథమ కాంగ్రెస్ ఏర్పరచినప్పుడు మావో వెళ్ళాడు. మావో హునాన్‌లోని కమ్యూనిస్టు పార్టీకి కార్యదర్శి అయ్యాడు ఒక వైపు పాఠశాల విధులు నెరవేరుస్తు, మరోక వైపు కార్మిక సంఘాలు ఏర్పరచాడు. 1922 నాటికి మొత్తం కార్మిక సంఘాలు 22 ఏర్పడ్డాయి. వాటిలోని సభ్యు సంఖ్య 50 వేలమంది. వీరు అంతా ఒక సంఘముగా ఏర్పడగా దానికి మావో చైర్మన్ అయ్యాడు. మావో కోమిన్ టాంగ్ పార్టీ వారి విశ్వాసము పొంది, కోమిన్ టాన్ సభ్యులు కమ్యూనిస్టు సభ్యులు మైత్రితో ఉండాలి అని కోరాడు. 1924 లో కాంటన్‌లో కమ్యూనిస్టులతో కూడిన కోమిన్ టాంగ్ పార్టీ సమావేశమైనప్పుడు అందులో మావో ప్రముఖ పాత్ర వహించాడు. ఆ తదుపరి యుద్ధ ప్రభువుల బారినుండి రైతులను రక్షించడానికి రైతు సంఘాలను స్థాపించాడు. మావో రైతుల విశ్వాసం, అభిమానాన్ని విశేషముగా చూరగొన్నాడు. 1927 నాటి కర్షక విప్లవం విఫలం కావడంతో చూటే‌తో కలసి మావో హునాన్ - కియాంగ్ షి రాష్ట్రాల సరిహద్దు ప్రాంతానికి తరలి వెళ్ళాడు. చైనా కమ్యూనిస్టు ఉద్యమానికి నవజీవనాన్ని ప్రసాదించి సరికొత్త విధానాలను మావో అమలు పరిచాడు. 1928 లో చూటే మావో సైన్యానికి చింగ్ కాంగ్ షాన్‌లో తర్ఫీదు ఇచ్చాడు. అతని శిక్షణలో మావో సైన్యం 50 వేలకు పెరిగింది.

1931 లో మావో కియాంగ్ షి రాష్ట్రములో ఒక సోవియట్ రిపబ్లిక్‌ను స్థాపించాడు. ఇవి కోమిన్‌టాంగ్ ప్రభుత్వానికి ప్రతిస్పర్థి అయ్యింది. ఇక్కడనే మావో ఒక రక్షణ శ్రేణిని ఏర్పరచి చైనా మిగతా ప్రాంతాలకు కమ్యూనిజం వ్యాప్తికి ప్రయత్నించాడు. కమ్యూనిస్టుల ప్రాభల్యంలో ఉన్న ప్రాంతాలు వ్యవసాయక ప్రాంతాలు కావడం వల్ల వీరు కర్షకుల అభివృద్ధికి కృషిచేయసాగిరి.

పెద్ద పెద్ద భూకమతాలను చిన్నవిగా విభాగించి రైతులకు పంచి ఇవ్వడం జరిగింది. రైతుల ఉపయోగార్థం పరపతి సంఘాలను, బ్యాంకులను ఏర్పాటు చేసారు. నల్లమందు ఉత్పత్తిని నిషేధించారు. వ్యవసాయానికి నీటి పారుదల సౌకర్యాలు కల్పించి, వరద నిరోధక పథకాలను చేపట్టారు. రైతులకు పన్నుల భారం తగ్గించారు. ధనవంతుల మీద ఎక్కువ పన్నులను విధించడం జరిగింది. పారిశ్రామిక కార్మికుల స్థితి గతులను కూడా మెరుగుపరచారు. కమ్యూనిస్టు ఎర్రసైన్యాలు తమ రక్షణకు సిద్ధముగా ఉన్నాయి. అదే భావం కార్మిక, కర్షకులలో కలిగించారు. ఈ ప్రాంతం ప్రజలు మావో, చూటేల నాయకత్వాన్ని అంగీకరించారు.

**11.8.3 కొమిన్ టాంగ్ - కమ్యూనిస్టుల మధ్య ఘర్షణ :** కొమిన్‌టాంగ్ ప్రభుత్వం కమ్యూనిస్టులను నాశనం చేయడానికి, వారి ఆధీనంలో ఉన్న ప్రాంతాలను తిరిగి స్వాధీన పరచుకోవడానికి నిశ్చయించింది. 1931 నుంచి 1933 వరకు నాలుగుసార్లు కొమిన్‌టాంగ్ సైన్యాలు కమ్యూనిస్టుల మీద దాడి జరిపినాయి. కొమిన్ టాంగ్ సైన్యాలు విజయం సాధించినా, కమ్యూనిస్టుల సైన్యాన్ని గాని పలుకుబడినిగాని అవి తగ్గించలేకపోయినాయి. 1933 నాటికి కియాంగ్ సీ, పశ్చిమ ఫూకిన్ రాష్ట్రాలు కమ్యూనిస్టుల ఆధీనంలోకి రావడమే గాక హూపే రాష్ట్రం వరకు వారి ప్రాబల్యం విస్తరించింది. దీనికి తోడు క్వాంగ్‌టుంగ్, హూనాన్ రాష్ట్రాలలో కూడా కమ్యూనిస్టుల పలుకుబడి పెరిగింది. మావో నాయకత్వంలో కమ్యూనిస్టులు ఈ ప్రాంతాలలో వారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకొన్నారు. 1930 లో లీలిసాన్ మరణంలో చైనా కమ్యూనిస్ట్ పార్టీకి మావో ఏకైక నాయకుడైనాడు. 1932 లో కమ్యూనిస్ట్ పార్టీ ప్రధాన కార్యాలయాన్ని షాంగ్‌హైనుంచి తన ఆధీనంలో గల ప్రాంతానికి మావో మార్చించినాడు. మంచూరియాలోగాని, షాంగ్‌హై సంఘటనలోగాని జపాన్‌కు తీవ్ర ప్రతిఘటన ఇవ్వలేక పోవడానికి దేశంలోని కమ్యూనిస్ట్ ఉపద్రవమే కారణమని చియాంగ్ భావించాడు. 19 వ కొమిన్‌టాంగ్ దళం ఫూకిన్ రాష్ట్రంలో తిరుగుబాటు చేయగా, ఆ రాష్ట్రం గుండా కమ్యూనిస్టుల ఆధీనమయ్యే ప్రమాదమేర్పడింది. కాని ఈ తిరుగుబాటును అణచివేసి చియాంగ్ కమ్యూనిస్టుల మీద దాడిని కొనసాగించాడు. ఈ దాడి కొమిన్‌టాంగ్ అవలంభించిన కొత్త విధానాల వల్ల, ముఖ్యంగా జర్మన్ సలహాదారుల సహాయంతో పాక్షికంగా విజయవంతమయింది. కొమిన్‌టాంగ్ 'నీలివస్త్రధారుల దళాన్ని' ఏర్పరచింది. వీరు ఫాసిస్ట్ భావాలున్న దౌర్జన్యవాదులు కమ్యూనిస్ట్ వ్యతిరేకులు. ప్రభుత్వ సైన్యాలలో కొమిన్‌టాంగ్ సిద్ధాంతాల బోధన జరిగింది. భూస్వాముల సంఘాలు ఏర్పాటయినాయి. త్వరితగతిన సైన్యాలు ప్రయాణించడానికి మోటారు రోడ్లను నిర్మించడం జరిగింది. కమ్యూనిస్ట్ ప్రాంతాలను ఆర్థిక దిగ్బంధనం గావించడం జరిగింది. కమ్యూనిస్ట్ స్థావరాలు బాంబులకు గురి అయినాయి. ఆ విధంగా 1934 చివరినాటికి కమ్యూనిస్టుల ప్రబల స్థావరమైన కియాంగ్ సీ రాష్ట్రం కొమిన్‌టాంగ్ వశమయింది.

**8.3.1 లాంగ్ మార్చ్ :** కమ్యూనిస్టుల ప్రబల స్థావరమైన కియాంగ్ సీ రాష్ట్రం 1934 లో కొమిగ్‌టాంగ్ వశం కావడంలో మావో 1934 అక్టోబర్ 2 న ఒక చారిత్రాత్మక నిర్ణయాన్ని తీసుకొన్నాడు. చౌ ఎన్ లే, వాంగ్, లితే మొదలైన వారితో మావో ఒక సైనిక సమితిని ఏర్పరచి, కియాంగ్‌సీని వారం రోజులలో విడిచిపెట్టాలని నిశ్చయించాడు. చివరకు 1934 అక్టోబర్ 16 న 35 మంది స్త్రీలతో 1 లక్షమంది కియాంగ్‌సీని వదలి దీర్ఘయాత్ర ప్రారంభించారు. దీనినే 'లాంగ్ మార్చ్' అని అంటారు. తమను చుట్టుముట్టిన కొమిన్ టాంగ్ సైన్యాలను ఛేదించుకొంటూ సుమారు 6 వేల మైళ్ళ దూరం ప్రయాణంచేసి అతికష్టంమీద మావో, అతని అనుచరులు సుమారు 20 వేలమంది వాయువ్య రాష్ట్రాలైన షెన్ సీని 1935 అక్టోబర్ 20 న చేరినారు. ఈ దీర్ఘయాత్ర ఆధునిక చైనాలో ఒక అపూర్వ సంఘటన ఇంతవరకు మానవ చరిత్రలో అంత దీర్ఘంగా నడిచినవారు ఎవరూలేరు. ఈ మహాసాహసం చివరకు పరాజయాన్ని పరిపూర్ణ విజయంగా మార్చిందని ఛెస్టర్స్ బౌల్స్ పేర్కొన్నాడు. ఒక సంవత్సరం తరువాత కమ్యూనిస్టులు ఏనాన్‌ను తమ ప్రధాన కేంద్రంగా చేసుకొన్నారు. ఈ దుర్భరమైన ప్రాంతాలలో వారు ఒక వైపు కమ్యూనిస్ట్ పార్టీని ప్రబలమైన విప్లవసంస్థగా రూపొందిస్తూ, వేరొకవైపు జపాన్ దురాక్రమణ ప్రతిఘటించినారు. ఈ కాలంలో సోవియట్ రష్యా నాయకులకు, చైనా కమ్యూనిస్టులకు విభేదాలు పొడసూపడం మొదలైనాయి. సోవియట్ రష్యా సహాయం ఏమీ లేకుండానే, మావో తన ప్రాబల్యాన్ని పెంపొందించుకొన్నాడు.

**8.3.2 సియాన్ సంఘటన :** షాన్‌సీ రాష్ట్రంలోని కమ్యూనిస్టుల మీద దెబ్బతీయడానికి చియాంగ్ ప్రయత్నించాడు. జాతీయ వాదులు, కమ్యూనిస్టులు పరస్పర యుద్ధాలు చేసుకొంటే చైనా జపాన్‌కు లోకువ అవుతుందని అందువల్ల జపాన్‌ను ప్రతిఘటించడానికి ఇరువురు కలిసి కృషి చేయాలని చైనాలోని విద్యార్థులు తలపోసి జాతీయ విమోచనోద్యమాన్ని ప్రారంభించినారు. ఈ ఉద్యమ వాదులలో ఏకీభవించి చియాంగ్ వారిని అణిచివేయసాగినాడు.

కమ్యూనిస్ట్ నాయకులైన మావో, చూటే, చౌ ఎన్ లైలు జపాన్ ఉపద్రవంనుంచి చైనాను రక్షించుకోవడానికి కోమింటాంగ్‌లో కలిసి ప్రజాస్వామ్య ఫ్రంట్ నిర్మాణాన్ని కాంక్షించినారు. ఇట్లాంటి ఫ్రంట్ నిర్మాణంలో గల ముఖ్య ఉద్దేశాలు మూడింటిని మావో విశదీకరించినాడు. అవి 1. విదేశీ దురాక్రమణను ప్రతిఘటించడం 2. చైనా ప్రజల హక్కులను ప్రసాదించడం 3. దేశాన్ని ఆర్థికంగా పటిష్టం చేయడం.

కొమిన్ టాంగ్ సైన్యాలలో కూడా జాతీయ ప్రభుత్వ విధానాల మీద అసంతృప్తి కలిగింది. విదేశీ ఉపద్రవాన్ని నిర్లక్ష్యంచేస్తూ కమ్యూనిస్టులను నాశనం చేయడానికి పూనుకొన్న చియాంగ్ చర్యలను వారు నిరసించినారు. ఈ కారణంగా కమ్యూనిస్టుల మీద జాతీయ సైన్యాల దాడులు ఫలించలేదు.

కొమిన్ టాంగ్ సైన్యానికి నాయకుడైన చాంగ్-హుసియె-లియాంగ్ కూడా చియాంగ్ విధానాలకు ఇష్టపడలేదు. అందువల్ల 1936 డిసెంబర్ 12 న హిసియెన్ పూ రాష్ట్రంలోని సియాన్ పట్టణానికి చియాంగ్ వెళ్ళినప్పుడు అతనిని చాంగ్ - హుసియె - లియాంగ్, అతని అనుచరులు అపహరించారు. ఈ అపహరణలో ముఖ్యోద్దేశాలు చైనాలో పూర్తి ప్రజాస్వామ్యాన్ని అమలు జరపడం, కమ్యూనిస్టులతో కలిసి జపాన్‌ను ప్రతిఘటించడం, వీటికి చియాంగ్‌ను ఒప్పింపజేయడం నాన్‌కింగ్ ప్రభుత్వం సియాన్ పట్టణాన్ని ముట్టడించి, చియాంగ్‌ను విడిపించడానికి ప్రయత్నం చేయదలిచింది కాని, చియాంగ్ ప్రాణానికి ముప్పుకలుగుతుందని ఆ ప్రయత్నం నుంచి విరమించింది. చియాంగ్ తనను అపహరించిన చాంగ్‌తో సంప్రదించడానికి చియాంగ్ నిరాకరించాడు. ఇటువంటి పరిస్థితులలో 1936 డిసెంబర్ 25 న మదామ్ చియాంగ్, టి.వి. సూంగ్‌లు సియాన్‌కు వెళ్ళి చియాంగ్ విడుదలకు కృషి చేసినారు. చివరకు చియాంగ్ విడుదలయి చాంగ్‌తో కలిసి నాన్‌కింగ్‌కు తిరిగి వెళ్ళినాడు. తరువాత చాంగ్‌మీద ప్రభుత్వ ద్రోహ నేరం మోపి విచారించి, శిక్షను వేసి చివరకు అతనిని చియాంగ్ వదిలివేసినాడు. ఈ సియాన్ సంఘటన వలన చైనీయులు ఆశించిన ఫలితం కలిగింది. కమ్యూనిస్టులు, జాతీయ వాదులు వారి విభేదాలను విస్మరించి ఒక సమైక్య ఫ్రంట్‌ను ఏర్పరచుకొని జపాన్‌ను ప్రతిఘటించదలిచినారు.

**11.8.3.3 రెండో చైనా - జపాన్ యుద్ధం :** చైనాలో వృద్ధిచెందుతున్న వ్యతిరేక ధోరణికి జపాన్ ఆందోళన చెందింది. అందువల్ల వెంటనే దానిని నిర్మూలించవలసిందని జపాన్ చైనానుకోరింది. కాని ఫలితం లేకపోయింది. ఇదే సమయంలో జపాన్‌లో ప్రభుత్వం మారి, కొనోయీ అధికారంలోకి రావడం, ప్రభుత్వానికి జపాన్ సైన్యం పూర్తి మద్దతు కలగడంవల్ల, సమర్థవంతమైన విదేశాంగ విధానాన్ని జపాన్ అవలంభించదలచింది. దీని ఫలితమే 1937 లో ప్రారంభమైన రెండో చైనా - జపాన్ యుద్ధం 1937 లో చైనా మీద జపాన్ ఏ ప్రకటన లేకుండానే యుద్ధాన్ని ఆరంభించింది. అనతికాలంలోనే చైనాలోని ప్రధాన నగరాలైన షాంగ్ హై, నాన్‌కింగ్, కాంటన్, హాంకోలు జపాన్ వశమైనాయి. చైనా సైనికులు కొమిన్‌టాంగ్ వారయినా, కమ్యూనిస్టులయినా మంచి పట్టుదల ధృఢనిశ్చయం ప్రదర్శించారు. కాని ఆయుధసామాగ్రి విషయంలో జపాన్‌కు ఉన్న సరఫరాలు చైనాకు లేవు. అందువల్ల అతికష్టం మీద చైనా సైనికులు యుద్ధం చేశారు. జపాన్ సైన్యాలు చైనా తూర్పు తీరాన్ని ఆక్రమించాయి. కాని చైనా గెరిల్లా సైన్యాలు జపాన్ సైన్యాలకు తీవ్ర ప్రతిఘటనను ఇచ్చినాయి. జపాన్ సేనలు పెద్ద నగరాలను, రైలు మార్గాలను మాత్రమే ఆధీనంలో ఉంచుకోగా దేశంలోని గ్రామీణ ప్రాంతాలన్నీ చైనా గెరిల్లాల స్వాధీనంలో ఉన్నాయి. జపాన్ యుద్ధాలను జయించింది గాని చైనాను జయించలేదు. ఈ పరిస్థితులలోనే 1939 లో రెండో ప్రపంచ యుద్ధం ఆరంభమయింది.

**11.8.3.4 రెండో ప్రపంచ యుద్ధంలో చైనా :** 1939 లో యూరప్‌లో ఆరంభమయిన రెండో ప్రపంచ యుద్ధం దూర ప్రాచ్యానికి కూడా విస్తరించింది. జపాన్ అమెరికాకు చెందిన హవాయి దీవులలోని పెరల్ హార్బర్ మీద 1941 డిసెంబర్ 7 న దాడిచేసింది. దీనితో అమెరికా జపాన్ మీద యుద్ధాన్ని ప్రకటించింది. అమెరికా మద్దతుతో చైనా కూడా రెండో ప్రపంచయుద్ధంలో ప్రవేశించింది. మిత్రమండలి రాజ్యాలు జపాన్‌కు వ్యతిరేకంగా చైనాకు ఆర్థిక, సైనిక సహాయాన్ని అందజేసినాయి. చైనాలో అమెరికా సైనిక ప్రధానాధికారి అయిన జోసెఫ్ స్టిల్‌వెల్, చియాంగ్‌కు ప్రధాన సైనిక సలహాదారుగా వ్యవహరించినాడు. 1943 లో అమెరికా బ్రిటన్‌లు తమకు చైనా మీద ఉన్న అతి ప్రాదేశిక పరిధి హక్కులన్నిటిని వదులుకొన్న కారణంగా సర్వస్వతంత్ర దేశంగా గుర్తించినట్లయింది. అమెరికాలోకి చైనీయుల వలసలను అనుమతిస్తూ అమెరికా కాంగ్రెస్ తీర్మానించింది. 1943 నవంబర్‌లో రూజ్‌వెల్ట్ చర్చిల్, చియాంగ్‌లు కైరోలో సమావేశమై జపాన్ లొంగిపోయేవరకు యుద్ధాన్ని కొనసాగించాలని నిశ్చయించాయి. ఈ సమావేశం వల్ల చైనాను అగ్రరాజ్యాలలో ఒకటిగా పరిగణించడం జరిగింది. చియాంగ్ జాతీయ ప్రభుత్వానికి బ్రిటన్, అమెరికాల పూర్తి మద్దతు లభించింది.

అయితే ఈ కాలానికే దేశంలలో ద్రవ్యోల్బణము, అధిక ధరలు ప్రభుత్వోద్యోగుల అవినీతి, లంచగొండి తనాల వల్ల చియాంగ్ ప్రభుత్వం చైనా ప్రజల ఆదరాభిమానాలను కోల్పోయింది. ఆహార ధాన్యాల సేకరణకు ప్రభుత్వం సైన్యాలను ఉపయోగించడం వల్ల కొమిన్‌టాంగ్ ప్రభుత్వాన్ని నిరంకుశ ప్రభుత్వంగా కర్షకులు భావించసాగినారు. దీనిని అవకాశంగా తీసుకొని కమ్యూనిస్టులు కర్షక వర్గాలలో తమ పలుకుబడిని వృద్ధిచేసుకొన్నారు. 1944 నాటికి చైనా వాస్తవ పరిస్థితులను గ్రహించిన అమెరికా అందోళన పడసాగింది. యుద్ధం ముగిసేవరకైనా చైనా ప్రభుత్వం నిలదొక్కుకోలేదని అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ భయపడినాడు. జాతీయ వాదులు, కమ్యూనిస్టులు కలిసి జపాన్‌ను ఎదుర్కొవలెననే సందేశాన్ని అతడు చైనాకు పంపినాడు. కొమిన్‌టాంగ్, కమ్యూనిస్టుల మధ్య సంత్సంబందాలను నెలకొల్పే ఉద్దేశంతో అమెరికా దౌత్య ప్రతినిధి హార్లీ సేనాని చేసిన ప్రయత్నాలు విఫలమయింది. ఇరువురి మధ్య అధికార విషయంలో భేదాభిప్రాయాలుండటమే దీనికి కారణం.

**11.8.3.5 కొమిన్ టాంగ్ - కమ్యూనిస్టుల మధ్య అంతర్యుద్ధము (1945-49) :** 1945 ఆగస్టు 14 న పసిఫిక్ ప్రాంతంలో యుద్ధవిరమణ జరిగింది. కాని చైనాలో మాత్రం కొమిన్ టాంగ్ - కమ్యూనిస్టుల మధ్య అంతర్యుద్ధం కొనసాగింది. జపాన్ పతనంలో ఆక్రమిత చైనాలోని ప్రాంతాలు కోసం ఇరుపక్షాలు తీవ్రంగా పోరాటం సాగించినాయి. ఈ పోరాటంలో కమ్యూనిస్టులదే పై చేయి అయింది. రెండో ప్రపంచ యుద్ధానంతరం చైనాలోని జాతీయ ప్రభుత్వానికి అమెరికా, చైనా కమ్యూనిస్టులకు సోవియట్ రష్యా మద్దతు ఇవ్వడం ఆరంభించినాయి. క్షీణిస్తున్న జాతీయ ప్రభుత్వాన్ని నిలబెట్టడానికి, చైనాలో అంతర్యుద్ధాన్ని అంతం చేయడానికి అమెరికా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కమ్యూనిస్టులు విజృంభించి చైనా ప్రధాన భూభాగమంతా స్వాధీనం చేసుకొన్నారు. జాతీయ ప్రభుత్వం ఫార్మోజా దీవికి తరలివెళ్లింది. చియాంగ్ ధనాగారాన్ని, సైనిక ఆయుధాలను ఫార్మోజాకు తరలించినాడు. 1949 అక్టోబర్‌లో చైనాలో ప్రజా రిపబ్లిక్ స్థాపన జరిగింది. నూతన ప్రభుత్వానికి దేశాధినేత మావో, ప్రధాని చౌఎన్ లై.

## 11.9. జాతీయ వాదుల పరాజయానికి, కమ్యూనిస్టుల విజయానికి కారణాలు :

మంచూ వంశ పరిపాలన అంతరించిన తరువాత చైనా రాజకీయాలలో కొమిన్ టాంగ్ పార్టీ, కమ్యూనిస్ట్ పార్టీ ప్రముఖ పాత్రవహించాయి. 1912 లో సన్‌యట్ సేన్ చే స్థాపించబడిన కొమిన్‌టాంగ్ పార్టీకి జాతీయ భావము, ప్రజాస్వామ్యం, ప్రజా జీవనోపాధి అనే మూడు సూత్రాలు ప్రాతిపదిక కాగ 1921 లో లీతావోచానో, చెన్ టు స్యూ, మావో మొదలగు వారిచే స్థాపించబడిన కమ్యూనిస్ట్ పార్టీకి రష్యాలో సంభవించిన బోల్షివిక్ విప్లవం ప్రాతిపదిక అయింది. ఈ రెండు పార్టీలు చైనా సమగ్రతకు, చైనీయుల

సంక్షేమమునకు అంకితమైనా రెంటికి ఆర్థిక, రాజకీయ రంగాలలో సిద్ధాంతపరమైన భేదాలుండుటవలన ఘర్షణ తప్పని సరి అయింది. కొమిన్ టాంగ్ లేదా జాతీయ వాదులకు, కమ్యూనిస్ట్‌లకు అంతర్యుద్ధం సంభవించి 1949 వరకు కొనసాగింది. పాశ్చాత్యరాజ్యాలు జాతీయ వాదులకు, సోవియట్ రష్యా కమ్యూనిస్ట్‌లకు సహాయం చేసి చైనా దేశపు రాజకీయాలలో నూతన పరిణామాన్ని ప్రవేశ పెట్టినాయి. 1949 నాటికి దేశంలో జాతీయ వాదుల ప్రాబల్యం క్షీణించగా, కమ్యూనిస్ట్‌లు ప్రభుత్వాన్ని హస్తగతం చేసుకొని చైనాను రిపబ్లిక్‌గా ప్రకటించినారు.

చైనాలో జాతీయవాదులు (కొమిన్ టాంగ్ పక్షం) పరాజయం చెందడానికి, కమ్యూనిస్ట్‌ల విజయానికి అనేక కారణాలున్నాయి. అవి:

**11.9.1 చియాంగ్ - కై - షేక్ అసమర్థత :** చైనా జాతీయ ప్రభుత్వనాయకుడు చియాంగ్ - కై - షేక్ అసమర్థుడై ప్రజా సంక్షేమానికి పాటు పడటానికి బదులు సామ్రాజ్య వాదులతో చేతులు కలిపి, తన పదవిని సుస్థిరం చేసుకోవడానికి ప్రయత్నించాడు. ఉత్తర చైనాలో మంచూరియాలో జపాన్ అనుసరిస్తున్న విధానం చైనా ప్రజలకు ఏవగింపు కలిగించింది. జపాన్ దురాక్రమణను చియాంగ్ సమర్థవంతంగా ప్రతిఘటించకపోవడంతో ప్రజలు అతనిని ద్వేషించినారు.

**11.9.2 ఆర్థిక దుస్థితి :** జాతీయ ప్రభుత్వంలో మొదట ఉన్న ఉత్సాహం చైతన్యం క్రమంగా దిగజారాయి. తన విప్లవ కార్యక్రమాలతో ప్రభుత్వం విమర్శలకు గురైంది కొమిన్‌టాంగ్ ఆర్థిక విధానం దేశంలో ద్రవ్యోల్బణానికి దారి తీసింది. వాటిని మెరుగుపరచడానికి ప్రభుత్వం ప్రయత్నించలేదు. దేశ సంపత్తిని, జాతీయ ఆదాయాన్ని కొమిన్‌టాంగ్ ప్రభుత్వం సద్వినియోగపరచలేక పోయింది.

**11.9.3 అవినీతి, లంచగొండితనం :** ప్రభుత్వోద్యోగులలో లంచగొండితనం అధికమయింది. సైనికాధికారులలో నీతి నియమాలు నశించాయి. ప్రభుత్వోద్యోగులు లంచగొండులై తమ ప్రభుత్వానికి అమెరికా ప్రభుత్వం పంపుతున్న ఆయుధాలను, వారి ప్రత్యర్థులైన కమ్యూనిస్టులకు అమ్మేశారు. చైనా కమ్యూనిస్ట్ పార్టీ నాయకుడు మావో అమెరికా అధ్యక్షునికి వ్రాసిన ఒక లేఖలో మీరు జాతీయ ప్రభుత్వానికి సరఫరా చేస్తున్న ఆయుధాలు మాకు చేరుతున్నాయి. అని వ్రాసాడు. అమెరికా రాజ్య కార్యదర్శి ఎచిసన్ చైనా వైట్ పేపరుకి ఇచ్చిన తొలిమాటలో చైనా ఉద్యోగుల లంచగొండితనాన్ని, అవినీతిని, అసమర్థతని అమెరికా ప్రభుత్వం అంగీకరిస్తున్నదని, కొమిన్ టాంగ్ తమ దేశ సహాయానికి, మద్దతుకి అనర్హులాలని ప్రకటించారు. ప్రభుత్వ యంత్రాంగ దుస్థితిని కొమిన్‌టాంగ్ కారకులాలు.

**11.9.4 కమ్యూనిస్ట్‌లతో కొమిన్ టాంగ్ ఘర్షణ :** కొమిన్‌టాంగ్ నాయకులకు, కమ్యూనిస్ట్‌లకు మధ్య అంతఃకలహాలు చెలరేగాయి. జపాన్ ఆక్రమిత ప్రాంతాలను స్వాధీనం చేసుకోవడంలో రెండు పార్టీల మధ్య సంఘర్షణ తలెత్తింది. దేశంలో పరిస్థితులు కమ్యూనిస్ట్‌లకే సానుకూలంగా ఉన్నాయి. ఉత్తర మధ్య చైనాలో కమ్యూనిస్ట్‌ల పలుకుబడి ఎక్కువగా ఉంది. కొమిన్‌టాంగ్‌లో మొదట సభ్యులుగా చేరిన కమ్యూనిస్ట్‌లు ఆ పార్టీలో చీలికకు కారకులయ్యారు. పార్టీలో సభ్యుల సంఖ్య పెరగసాగింది. ఎర్రసేనను కూడా ఏర్పాటు చేసుకొన్నారు. పటిష్ఠమైన సైనిక సంపత్తితో కమ్యూనిస్ట్‌లు జాతీయ ప్రభుత్వ ఉనికినే గొడ్డలిపెట్టుగా తయారయ్యారు. కమ్యూనిస్ట్‌లపై యుద్ధం ప్రకటించి వారిని ఆరునెలల్లో తరిమివేస్తానని చియాంగ్ ప్రకటించాడు. వారి రాజధాని ఎనన్‌ని కొమిన్‌టాంగ్ ముట్టడించినా అది విజయవంతం కాలేదు. ఎర్రసైన్యం టియన్ ట్సిన్, పైపింగ్ ప్రాంతాలను ఆక్రమించి, యాంగ్‌ట్సీనదివైపు పురోగమించింది. వాటిని జాతీయ సైన్యం అడ్డగించలేకపోయింది. యాంగ్‌ట్సీ నది మీద వంతెనలు నిర్మించుకోవడానికి అనుమతి కోరి తనకు లొంగిపొమ్మని కొమిన్ టాంగ్‌ను హెచ్చరించింది. దానిని కొమిన్‌టాంగ్ తిరస్కరించడం వలన కమ్యూనిస్ట్ సేనలు నాన్‌కింగ్ వైపు పురోగమించి హాంకో, కాంటన్‌లను ఆక్రమించింది.

**11.9.5 కమ్యూనిస్ట్ సంస్కరణలు :** యుద్ధం తరువాత గ్రామీణ ప్రజల పునఃవ్యవస్థాపన చేయడానికి బదులు కొమిన్‌టాంగ్ ప్రభుత్వము పారిశ్రామికీకరణకు పూనుకున్నది. కాని కమ్యూనిస్ట్‌లు మాత్రం సంఘ శ్రేయస్సుకి పాటుపడ్డారు. వారి ఆధీన ప్రాంతాలలో సామాన్యుల పరిస్థితిని మెరుగుపరచడానికి వారు ప్రయత్నించారు. భూమి యాజమాన్యాన్ని పంచి ఎక్కువ భూమిని సాగుచేయడానికి సహకరించారు. వడ్డీరేట్లను తగ్గించి, రైతుపండించే దానిలో తాను చెల్లించవలసిన భాగాన్ని నిర్ణయించారు. ఈ సంస్కరణల ద్వారా కమ్యూనిస్ట్‌లు గ్రామీణుల మన్ననలని పొందారు. గ్రామ పరిపాలనలో కమ్యూనిస్ట్‌లు స్థానికులకే అవకాశాన్ని ఇచ్చారు. సమితులలో మూడింట ఒక వంతు స్థానాలను స్థానికులకే కేటాయించారు. నిర్ణయాలు మాత్రం పార్టీ సూత్రాల పరిమితిలోనే తీసుకొని చర్చించేవారు ఈ విధంగా పార్టీ విధానాలను పరోక్షంగా కమ్యూనిస్ట్ సంస్థల మీద విధించడం జరిగింది.

**11.9.6 కొత్త ప్రజాస్వామ్యం :** ప్రజలు కొమిన్‌టాంగ్, కమ్యూనిస్ట్ సూత్రాలను పోల్చిచూడడం మొదలుపెట్టారు. ఎర్ర సైన్యంలోని ఉన్నత ప్రమాణాలను, క్రమశిక్షణను ప్రజలు గుర్తించారు. అధికారుల ఆజ్ఞలకు బద్ధులై సైనికులు గ్రామీణుల ఆస్తిహక్కులను గౌరవించి కాపాడారు. ఆహారపదార్థాలను లూటీచేయక ప్రజలను అడిగి తీసుకొనేవారు. కొమిన్‌టాంగ్‌ను వ్యతిరేకిస్తున్న వారంతా కమ్యూనిస్ట్‌లను బలపరచడం మొదలుపెట్టారు. కొత్త ప్రజాస్వామ్య ప్రచారం, గ్రామీణ సంస్కరణ కార్యక్రమాల వలన కమ్యూనిస్ట్‌లకు దేశీయ, విదేశీయ మద్దతు లభించింది. జాతీయ ప్రభుత్వం యుద్ధం ముందున్న రహదారులను నిర్మించలేకపోయింది. కమ్యూనిస్ట్‌ల రైలు మార్గాలను, రహదార్లను ధ్వంసం చేసి, జాతీయ సైన్యానికి ఆహార పదార్థాలను సరఫరాని బంధించింది. మంచూరియాలోను, ఉత్తర చైనాలో ఉన్న జాతీయ సైన్యాన్ని తొలగించడానికి కమ్యూనిస్ట్‌లు గెరిల్లా పద్ధతిని అవలంభించారు.

**11.9.7 ప్రభుత్వం మేధావుల సహకారం కోల్పోవడం :** జాతీయ ప్రభుత్వము దేశంలోని మేధావుల సహకార సంపత్తులను కోల్పోయింది. వారిలో చాలామంది కమ్యూనిస్ట్‌లు కారు. బహుశ వారిలో అధిక సంఖ్యాకులు దేశంలోని అంతర్యుద్ధానికి వ్యతిరేకులే. కమ్యూనిస్ట్‌లతో అంగీకారానికి వచ్చి, నిజమైన ప్రజాప్రాతినిధ్యమున్న ప్రభుత్వ స్థాపన జరగవలెనని వారు కాంక్షించినారు. 1947 లో అంతర్యుద్ధం తిరిగి ప్రజ్వరిల్లినప్పుడు, జాతీయ ప్రభుత్వం మేధావివర్గంలోని చాలామందిని ఉద్యోగాలనుంచి తొలగించడం గాని, నిర్బంధంలో ఉంచడం గాని, సహకరించడం గాని చేసింది. ఇటువంటి అణిచివేత విధానం వల్ల జాతీయ ప్రభుత్వం ప్రజాభిమానాన్ని కోల్పోయింది.

**11.9.8 అగ్రరాజ్యాల జోక్యం :** రెండో ప్రపంచయుద్ధంలో జపాన్ ఓడిపోయిన తరువాత రష్యా, అమెరికాదేశాలు ఆసియా ఖండంలో కొత్త ఆధిపత్యానికి పోటీ పడసాగినారు. చైనా మీద వారి ఒత్తిడి ఎక్కువ కాసాగింది. చైనా జాతీయ ప్రభుత్వానికి అమెరికా మద్దతు కమ్యూనిస్ట్‌లకు సోవియట్ రష్యా మద్దతు ఇచ్చాయి. చైనాలో స్వచ్ఛంద అంతఃకలహాలకు పరోక్షంగా అగ్రరాజ్యాలైన రష్యా, అమెరికా దేశాలు కారకులయ్యారు. ప్రజాస్వామ్య పెట్టుబడిదారి దేశానికి, సామ్యవాద కమ్యూనిస్ట్ నియంతృత్వదేశానికి మధ్య ఈ ఆశయపోరాటంలో చైనా ఒక పావుగా తయారైంది.

**11.9.9 అమెరికా పథకం :** చైనాలో కమ్యూనిస్ట్‌ల ప్రాబల్యం పెరిగిపోవడంలో, అమెరికా ప్రభుత్వం కొమిన్‌టాంగ్ ప్రభుత్వాన్ని కాపాడటానికి ఒక పథకాన్ని సూచించింది. కొమిన్‌టాంగ్ రాజ్యాంగ సంస్కరణలను ప్రజలు విమర్శించడంవల్ల, దేశంలో ప్రజాస్వామ్య బద్ధమైన ఆర్థిక పాలనా యంత్రాంగాన్ని రూపొందించి కొత్త శక్తిని పుంజుకోవచ్చునని అమెరికా సలహాఇచ్చింది. శాంతి భద్రతలు నెలకొల్పడానికి, శక్తివంతమైన పలుకుబడిగల పార్టీలతో ముఖ్యంగా కమ్యూనిస్ట్ పార్టీతో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయమని కూడా అమెరికా సలహా ఇచ్చింది. కమ్యూనిస్ట్‌లను ఎదుర్కొనడానికి అమెరికా జాతీయ ప్రభుత్వానికి ఆర్థికంగా, సైనికంగా సహాయం చేసింది. అమెరికా పథకాన్ని చైనా కమ్యూనిస్ట్‌లు గ్రహించారు. రాబోయె కొత్త ప్రభుత్వ నిర్మాణంలో తమ స్థానం ఎంత? ప్రభుత్వంలో తమని జాతీయ ప్రభుత్వం రక్షణ కల్పించగలదా? అనే రెండు ప్రధాన సమస్యలను జాతీయ

ప్రభుత్వం సరియైన సమాధానం ఇవ్వగలిగితే తమ సైన్యం మీద ఆధిపత్యాన్ని వదులుకొని, సంకీర్ణ ప్రభుత్వంలో కలుస్తామని ప్రకటించారు.

**11.9.10 మార్షల్ మిషన్ :** అమెరికా అధ్యక్షుడు ట్రుమన్ శాంతియుత ప్రజాస్వామ్య విధానంపై చైనా సమగ్రతని కాపాడాలన్న ఉద్దేశంతో, జనరల్ జార్జ్‌మార్షల్‌ను చైనాకు పంపించాడు. మార్షల్ రెండు పక్షాల ప్రతినిధులలో సంప్రదింపులు జరిపాడు. కాని మార్షల్ ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. స్టేట్ కౌన్సిల్‌లో ఎక్కువ ప్రాతినిధ్యం కావాలని కమ్యూనిస్ట్‌లు పట్టుపట్టడం వలన, మంచూరియాను ఎవరు ఏ విధంగా స్వాధీనం చేసుకోవాలన్న విషయం మీద సమాధానం కుదరక మార్షల్ ప్రయత్నాలు విఫలమయ్యాయి.

**11.9.11 కమ్యూనిస్ట్‌ల షరతులు :** కమ్యూనిస్ట్‌లు శాంతి సంప్రదింపులకు కొన్ని షరతులను పెట్టారు. అవి : 1. చియాంగ్ పదవీ విరమణ చేయాలి. 2. రెండు వైపులా కాల్పుల విరమణ చేయాలి. 3. నూతన రాజ్యాంగాన్ని చేపట్టాలి. 4. సైన్యం, రాజకీయ యంత్రాంగం, భూవ్యవస్థను పునర్నిర్మించాలి. 5. యుద్ధోన్మాదులను శిక్షించాలి. 6. ప్రతిక్రియావాదులు లేకుండ సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలి 7. అప్పటి వరకు విదేశాలలో చేసుకొన్న ఒప్పందాలను రద్దుచేయాలి.

కొమిన్‌టాంగ్ పై షరతులను అంగీకరించినట్లయితే, తనను తాను రూపు మాపుకొన్నట్లే, జాతీయ ప్రభుత్వం క్షీణిస్తున్న సమయంలో, సంప్రదింపులకు పాకులాడనవసరంలేదని కమ్యూనిస్ట్‌లు భావించారు. కమ్యూనిస్ట్ సైన్యం టియన్‌ట్సిన్, పైపింగ్ ప్రాంతాలను ఆక్రమించి, యాంగ్‌ట్సీ నది వైపుకి పురోగమించింది. అధ్యక్షుని బదులుగా ఉన్న త్సుంగ్ - జెన్‌ను అమెరికాతోను, చియాంగ్‌తోను తెగతెంపులు చేసుకొమ్మని కమ్యూనిస్ట్‌లు అడిగారు. కొమిన్‌టాంగ్ ప్రభుత్వం తిరస్కరించినందువల్ల ఎర్రసైన్యం నాన్‌కింగ్ వైపు పురోగమించి, హాంకో, కాంటన్‌లను ఆక్రమించింది.

**11.9.12 మంచూరియా ఆక్రమణ :** రెండో ప్రపంచ యుద్ధానంతరం జపాన్ మంచూరియాను చైనాకు స్వాధీనం చేసే సమయంలో అది సోవియట్ రష్యా ఆధీనంలో ఉంది. ఈ ప్రాంతాన్ని ఆక్రమించడానికి జాతీయ ప్రభుత్వం తన సైన్యాన్ని అక్కడికి పంపింది. కాని సోవియట్ రష్యా కమ్యూనిస్ట్‌లను బలపరచడంవల్ల, దానిని జాతీయ సైన్యం స్వాధీనం చేసుకోలేకపోయింది. మంచూరియాలో పెద్దపెద్ద నగరాలు, రైలుమార్గాలు జాతీయ సైన్యానికి అప్పగించి, జపాన్ దేశంనుంచి స్వాధీన పరచుకొన్న మారణాయుధాలను కమ్యూనిస్ట్‌ల పరంచేసింది. సోవియట్ రష్యా తనకు అప్పగించిన ఆయుధ సామాగ్రితో కమ్యూనిస్ట్‌లు జాతీయ ప్రభుత్వాన్ని ఎదుర్కొని 1947 నాటికి మంచూరియాను స్వాధీనం చేసుకొన్నారు.

**11.9.13 అంతర్యుద్ధం :** కమ్యూనిస్ట్‌లకు, కమ్యూనిస్టేతరులకు మధ్య తలెత్తిన వైషమ్యాల ఫలితంగా దేశంలో అంతర్యుద్ధం చెలరేగింది. కార్మికులు, కర్షకులు, సామాన్యులు జాతీయ ప్రభుత్వ విధానాలను నిశితంగా ఖండించారు. దేశమంతా లాకౌట్లు, సమ్మెలు, హర్తాళ్ళు జరిగాయి. దిగజారిపోతున్న పరిస్థితిని ఎదుర్కోడానికి జాతీయ ప్రభుత్వం దమనచర్యలను అవలంబించింది. ఇటువంటి అరాచక పరిస్థితులలో, జాతీయ ప్రభుత్వం తనని తాను రక్షించుకోడానికి కొన్ని రాజ్యాంగ బద్ధమైన సంస్కరణలను ప్రవేశపెట్టడానికి ప్రయత్నించింది. ప్రభుత్వ కుట్రలను ప్రజలు గుర్తించడంతో అది కూడా విఫలమయింది. దేశంలో ద్రవ్యోల్బణం, వలస పాలనా యంత్రాంగాన్ని సాఫీగా కొనసాగించలేకపోయింది.

**11.9.14 జాతీయ సైన్యంలో లోపాలు :** జాతీయ సైన్యం అవినీతి, లోపభూయిష్టమైన సైనిక నిర్వహణ క్రమశిక్షణా రాహిత్యం, సైనికాధికారుల అసమర్థత, సరైన యుద్ధ వ్యూహం లేకపోవడం వలన జాతీయ సైన్యం అంతర్యుద్ధంలో ఓడిపోయింది.

**11.9.15 ఎర్రసైన్యం :** మధ్య, తూర్పు చైనాలలో కమ్యూనిస్ట్ సైన్యం జాతీయ సైన్యాన్ని ఓడించింది. కాంటన్ దక్షిణ ప్రాంతాలను, చుంగ్ కింగ్ పశ్చిమ ప్రాంతాలను కూడా ఆక్రమించింది. కమ్యూనిస్ట్ సైన్యంలోని బాధ్యతాయుతమైన నాయకత్వం యుద్ధ నిర్వహణ, క్రమశిక్షణ, చక్కని వ్యూహరచన వారి విజయానికి తోడ్పడింది.

**11.9.16 చైనా ప్రజల గణతంత్ర ప్రభుత్వస్థాపన :** జాతీయ ప్రభుత్వ అసమర్థతనుంచి చైనా ప్రజలను, కమ్యూనిస్ట్‌ల సైనిక విజయం విముక్తం చేసింది. సామ్రాజ్యవాదుల సైర్యవిహారానికి ఆనకట్ట వేయబడింది. 1949 అక్టోబర్ 1 న పెకింగ్‌లో 'చైనా ప్రజల గణతంత్ర రాజ్యం' అనే పేరుతో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. దీనికి కమ్యూనిస్ట్ పార్టీ నాయకత్వం వహించింది. 1950 లో మావో కొత్త ప్రభుత్వానికి నాయకుడయ్యాడు. చైనా కమ్యూనిస్ట్ ప్రభుత్వాన్ని సోవియట్ రష్యా, భారత్, బర్మా, స్వీడన్, బ్రిటన్, ఫిన్‌లాండ్, ఇజ్రాయిల్ డెన్మార్క్, శ్రీలంక, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, ఇండోనేషియా, నెదర్లాండు, స్విట్జర్లాండ్ దేశాలు గుర్తించాయి.

**11.9.17 ఫార్మోసాలో చియాంగ్ :** జాతీయసైన్యం ఓడిపోయిన తరువాత మిగిలిన సైన్యం ఫార్మోసాకు తరలిపోయింది. అక్కడ చియాంగ్ కొత్త రాజధానిని ఏర్పాటు చేసుకొని ఫార్మోసా ప్రభుత్వానికేగాక, చైనా ప్రభుత్వాధిపతిగా ప్రకటించుకొన్నాడు.

**11.9.18 సమీక్ష :** ఈ విధంగా 1949 నాటికి చైనాలో కొమిన్‌టాంగ్ పరిపాలన అంతమొంది, కమ్యూనిస్ట్ పార్టీ అధికారంలోకి రావడం చైనా చరిత్రలో ఒక అపూర్వ ఘట్టం. సన్‌యట్‌సెన్ స్థాపించిన కొమిన్ టాంగ్ పార్టీ 30 సంవత్సరాలలో ఘోరమైన పరాజయం చెందడం ఎంతో ఆశ్చర్యకరమైన విషయం. సోవియట్ రష్యా ప్రధాని స్టాలిన్ చేత ప్రశంసలు పొందిన కొమిన్‌టాంగ్ పతనమవడం అందరికి ఎంతో దిగ్భ్రాంతిని కలిగించింది. కమ్యూనిస్ట్‌ల విజయాన్ని అమెరికా దూరప్రాచ్య విధానానికి ఒక గొప్ప అపజయంగా భావించవచ్చు. చైనా వ్యవహారాలను అమెరికా తప్పు అంచనావేసింది. అప్పటికే పతనమవుతున్న ప్రభుత్వానికి అది సైనికంగాను, ఆర్థికంగాను కూడా మద్దతునిచ్చింది. ఈ సహాయమంతా వ్యర్థమైంది.

పాఠం - 12

# రెండో ప్రపంచయుద్ధం

## లక్ష్యం :

రెండో ప్రపంచ యుద్ధానికి గల కారణాలు, యుద్ధగమనము, యుద్ధంలో అమెరికా పాత్ర మొదలగు విషయాలను గురించి వివరించడమే ఈపాఠం ముఖ్య లక్ష్యం.

## విషయ క్రమం :


12.1. **రెండో ప్రపంచయుద్ధానికి కారణాలు**

12.1.1. వర్సైసంధి

12.1.2. నానాజాతి సమితి వైఫల్యం

12.1.3. నిరాయుధీకరణ ప్రయత్నాల వైఫల్యం

12.1.4. తృప్తిపరిచే విధానం

12.1.5. అంతర్జాతీయ ఆర్థిక మాంద్యము

12.1.6. రష్యా పట్ల పాశ్చాత్య రాజ్యాల వైఖరి

12.1.7. రష్యా విధానం

12.1.8. అల్పసంఖ్యాక జాతులలో కలిగిన అసంతృప్తి

12.1.9. సామ్రాజ్య తత్వము

12.1.10. ప్రజాస్వామ్యం - నియంతృత్వాల మధ్య ఘర్షణ

12.1.11. జర్మనీలో తీవ్ర జాతీయవాదము

12.2. **రెండో ప్రపంచయుద్ధ గమనము**

12.2.1. పోలండ్ ఆక్రమణ

12.2.2. రష్యా - ఫిన్‌లాండ్ యుద్ధం

12.2.3. డెన్మార్క్ - నార్వేల పతనం

12.2.4. లగ్జంబర్గ్ - హాలండ్, బెల్జియంల పతనం

12.2.5. ఫ్రాన్స్ పతనం

12.2.6. బ్రిటన్ మీద హిట్లర్ దాడి

12.2.7. ఇటలీ, ఆఫ్రికా, బాల్కన్ రంగాలు

12.2.8. రష్యామీద హిట్లర్ దండయాత్ర

12.2.9. రెండో ప్రపంచ యుద్ధంలో అమెరికా పాత్ర

12.2.9.1. రొక్కమిచ్చి సరుకును తీసుకొనిపోవు సూత్రం

12.2.9.2 బ్రిటన్‌కు శతఘ్ని నౌకలను పంపుట

12.2.9.3. యుద్ధ సన్నాహాలు

12.2.9.4. అరువు - కౌలు చట్టము

12.2.9.5. అట్లాంటిక్ ప్రకటన పత్రం

12.2.9.6. జర్మన్ 'U' నౌకలలో ఘర్షణ

12.2.9.7. పెరల్ హార్బర్ మీద జపాన్ దాడి

12.2.9.8. పసిఫిక్ రంగం

12.2.9.9. ఉత్తర ఆఫ్రికా

12.2.9.10 స్టాలిన్ గ్రాడ్ యుద్ధం

12.2.9.11. సిసిలీ, ఇటలీ మీద మిత్రరాజ్యాల దాడి

12.2.9.12. ఫ్రాన్స్ విముక్తి

12.2.9.13. బెర్లిన్ పతనం

12.2.9.14. అణుబాంబు ప్రయోగం - జపాన్ లొంగుబాటు

12.3. మిత్రరాజ్యల విజయానికి, అక్షరాజ్యాల పతనానికి కారణాలు

12.4. రెండో ప్రపంచయుద్ధ ఫలితాలు

## 12.1. రెండో ప్రపంచ యుద్ధానికి కారణాలు:

మానవజాతి చరిత్రలోకెల్లా అత్యంత వినాశకరమైన రెండో ప్రపంచయుద్ధం 1939-1945 సంవత్సరాల మధ్య కాలంలో సంభవించింది. ప్రపంచంలోని ప్రధాన దేశాలన్ని ఈ యుద్ధంలో పాల్గొన్నాయి. యూరప్ భూభాగాలపైన సాగిన మొదటి ప్రపంచయుద్ధం వలెకాక, రెండో ప్రపంచయుద్ధం యూరప్‌తో బాటు ఆసియా, ఆఫ్రికా, పసిఫిక్, దీవులలో కూడా భీకర పోరాటాలకు దారితీసింది. ఈ యుద్ధం ప్రధానదేశాల ఆర్థిక వ్యవస్థలను తీవ్ర వత్తిడులకు గురిచేసింది. అనేక దేశాలను ఆర్థికంగా పతనావస్థకు నెట్టింది. అమెరికా, రష్యాలు ప్రపంచంలోకెల్లా అగ్రరాజ్యాలుగా రూపొందడం, వాటిమధ్య పోటీ ప్రచ్ఛన్న యుద్ధానికి దారితీయడం, ఆసియా - ఆఫ్రికాలలో వలస పాలనల ఉపసంహరణ, ప్రపంచశాంతి పరిరక్షణకు ఐక్యరాజ్య సమితి ఆవిర్భావం మొదలైన ఎన్నో పరిణామాలకు రెండోప్రపంచ యుద్ధమే మూలకారణమయింది. అటువంటి రెండోప్రపంచ యుద్ధానికి గల కారణాలను తెలుసుకొందాం.

12.1. 1. వర్సేసంధి :

మొదటి ప్రపంచ యుద్ధానంతరం జర్మనీకి మిత్రరాజ్యాలకు మధ్య జరిగిన వర్సేసంధిలోని లోపాలు రెండో ప్రపంచ యుద్ధానికి కారణమైనాయి. 1919 వర్సేసంధి ద్వారా మిత్రరాజ్యలు జర్మనీని పూర్తిగా అవమానించినాయి. జర్మనీ పరాజితమై, ఆయుధ బలాన్ని కోల్పోయి, విజేతలైన మిత్రరాజ్యల నాయకుల దయాదాక్షిణ్యాలకు లోబడి పారిస్ శాంతిసమావేశ నిర్ణయాలను ఆమోదించవలసి వచ్చింది. ఇంతకు పూర్వం జరిగిన శాంతిసమావేశాలకు, పారిస్ శాంతిసమావేశానికి తేడా ఉన్నది. వియన్నా మొదలైన సమానహోదాతో వ్యవహరించినాయి. జర్మనీ మళ్ళీ ప్రపంచశాంతికి ఉపద్రవం తెచ్చిపెట్టకుండా దానిని పూర్తిగా అణచి వేయవలెనని విజేత రాజ్యాలు భావించినాయి. ఈ భావనలోనే వర్సేసంధి షరతులను రూపొందించడం జరిగింది. వర్సేసంధి అమెరికా అధ్యక్షుడు విల్సన్ ప్రవచించిన 14 సూత్రాలమీద ఆధారపడినట్లు పైకి కన్పించినా యదార్థానికి యుద్ధనేరస్థురాలుగా జర్మనీని అవమానపరచి, దాని భూభాగాలను కబళించడం జరిగింది. జర్మనీ సైన్యాలను అతిచిన్న దేశమైన బెల్జియం దేశ సైన్యాలకంటే తక్కువగా తగ్గించడం జరిగింది. వర్సేసంధిలోని మొత్తం 440 అంశాల సారాంశము జర్మనీ తిరిగి శక్తిమంతమైన దేశంగా మారకుండా ఉండడానికి చేసిన ప్రయత్నమే. ఆగ్నేయ యూరప్‌లోని బాల్కన్ దేశాలలో ఉద్భవించిన జర్మన్ మైనారిటీల సమస్య ఆ ప్రాంతంపై జర్మనీ దురాక్రమణకు దారితీసింది. ఈ సంధిమూలంగా జర్మనీ దాదాపు 15 శాతం వ్యవసాయయోగ్యమైన భూమిని, 12 శాతం పారిశ్రామిక భూభాగాన్ని కోల్పోయింది. అంతేగాక జర్మనీ తనకుగల వలసప్రాంతాలన్నిటినీ పోగొట్టుకొన్నది. ఆ వలసలన్నీ మిత్రరాజ్యాల ఆధిష్ఠ ప్రాంతాలయినాయి. టోగోలాండ్, టాంగనీకాలు బ్రిటిష్‌వారికి, జర్మన్ నైరుతి ఆఫ్రికా దక్షిణాఫ్రికాకు, సమోవా దీవులు న్యూజీలాండ్‌కు, జర్మన్ న్యూగినీ ఆస్ట్రేలియాకు, పసిఫిక్ సముద్రంలో ఉత్తరానగల జర్మన్ వలస దీవులు, చైనాలోని షాంటుంగ్ రాష్ట్రం జపాన్‌కు ఇవ్వడం జరిగింది. దీనికితోడు అపారమైన నష్టపరిహారాన్ని జర్మనీ మిత్రరాజ్యాలకు చెల్లించవలసి వచ్చింది. అందువల్ల వర్సేసంధి అనంతరకాలంలో, జర్మనీలో మామూలు పరిస్థితులు ఏర్పడటానికి చాలా కష్టమయింది. జర్మన్ ప్రజలు వర్సేసంధిని తమమీద బలవంతాన రుద్దిన సంధిగా భావించారు. ఆధునిక కాలంలో జరిగిన సంధులన్నిటిలో విజేత రాజ్యాలు పరాజిత రాజ్యాలమీద కఠినతరమైన షరతులను బలవంతంగా రుద్దడం జరిగింది. వర్సేసంధిలోనే ఈ సంధిపట్ల జర్మన్‌లకు ద్వేషమేర్పడింది. అట్లాంటి ద్వేషపూరితమైన భావాలు ప్రజలలో వుండటం వల్ల హిట్లర్ అధికారంలోకి రాగలిగాడు. హిట్లర్ ఈసంధిలోని అంశాలను ఒక్కొక్కటి ఉల్లంఘించడం మొదలుపెట్టడం పలువురు జర్మన్లు హర్షించినారు.

12.1.2. నానాజాతిసమితి వైఫల్యము :

మొదటి ప్రపంచ యుద్ధానంతరం ప్రపంచంలో సుస్థిరశాంతి స్థాపనకు నానాజాతిసమితిని ఏర్పరచడం జరిగింది. ఈసమితి అసమర్థత, బలహీనత రెండో ప్రపంచయుద్ధానికి మరోకారణమయింది. సమితిలో చేరడానికి అమెరికా నిరాకరించడం, రష్యాకు, పరాజిత రాజ్యలకు, సమితిలో స్థానం కల్పించక పోవడంలో సహజంగా సమితి బలహీనపడింది. దూర ప్రాచ్యంలో తప్ప అమెరికా ఏకాంత విధానాన్ని అవలంభించసాగింది. సమితి సభ్యదేశాలు కూడా సమిష్టి భద్రతా విధానానికి నిర్లక్ష్యం చూపసాగినాయి. సమితి చట్టాన్ని సభ్య దేశాలే గౌరవించడం మానివేశాయి. ఈ కారణం చేత అంతర్జాతీయ శాంతిని సంరక్షించే బాధ్యతను సమితి సరిగా నిర్వహించలేకపోయింది. 1931 లో జపాన్ మంచూరియాను ఆక్రమించినపుడు సమితి ఏమీ చేయలేక పోయింది. జపాన్ దురాక్రమణకు దానిని సమితి అభిశంసించగా, జపాన్ 1933 లో సమితినుంచి వైదొలగింది. 1937 లో జపాన్ చైనామీద అప్రకటిత అనధికార యుద్ధాన్ని ఆరంభించినప్పుడు సమితి నివారించలేకపోయింది. 1935, 1936 లో ఇటలీ, ఇథియోపియా, ఆల్బేనియాలను కబళించినపుడు సమితి నిస్సహాయురాలయింది. సమితి ఇటలీమీద ఆర్థిక ఆంక్షలు విధించినా, బ్రిటన్‌వంటి అగ్రరాజ్యాలు సమితితో సహకరించకపోవడం వల్ల అదివిఫలమయింది. సమితి బలహీనతను గుర్తించి ఇటలీ కూడా దానినుంచి వైదొలగింది. 1935 నాటికి జర్మనీ వర్సే సంధిని, లొకార్నో ఒప్పందాలను ఉల్లంఘించి, రైన్‌లాండ్ ప్రాంతాన్ని సైనికీకరణ చేసినపుడు సమితి దానిమీద ఇట్లాంటి చర్య తీసుకోలేకపోయింది. దీనిని అలుసుగా తీసుకొని జర్మనీ, ఆస్ట్రియా, చెకొస్లొవాకియాలను కూడా ఆక్రమించింది. 1939 లో రష్యా ఫిన్‌లాండ్ మీద దాడి చేయగా, సమితి ఏమీచేయలేక పోయింది. అంతర్జాతీయ శాంతి సంరక్షణతో సమితి విఫలంకావడం వల్ల, యూరప్‌లోని దేశాలు సమితిలో విశ్వాసాన్ని కోల్పోయి, తమలో తాము సంధులు చేసుకోవ ఆరంభించినాయి. ఈసంధులవల్ల యుద్ధప్రమాదం పెరిగింది.

**12.1.3. నిరాయుధీకరణ ప్రయత్నాల వైఫల్యము :**

మొదటి ప్రపంచ యుద్ధానంతరం మిత్రరాజ్యాలు ఓటమి చెందిన రాజ్యాలను నిరాయుధీకరణ చేయవలెనని ఆదేశించినాయి. నిరాయుధీకరణ ప్రపంచశాంతికి ఎంతయినా అవసరమని బహిర్గతంగా మిత్రరాజ్యాలు ఉద్ఘాటించినా నిజానికి వాళ్ళు నిరాయుధీకరణ అమలుపెట్టకపోవడం జరిగింది. సమితి సభ్యదేశాలు సమిష్టి భద్రతావిధానానికి నిర్లక్ష్యం చూపసాగినాయి. దీనివల్ల నిరాయుధీకరణ విధానానికి విఘాతం కలిగింది. జర్మనీ నిరాయుధీకరణను పాటించేటంత వరకు ప్రపంచశాంతికి భంగం కలగదని ఆనాటియూరప్ దేశాలు భావించాయి. అట్లే 1934 వరకు జర్మనీ ఆయుధీకరణకు పూనుకోకపోవడంతో శాంతి నెలకొన్నది. కాని 1935 లో హిట్లర్ జర్మనీలో నిర్బంధ సైనికవిధానాన్ని ప్రవేశపెట్టడంతో పరిస్థితులు మారినాయి. జర్మనీ ఆయుధీకరణకు పూనుకోవడంతో ప్రమాదాన్ని ఊహించిన యూరప్‌లోని ఇతర రాజ్యాలు కూడా తమ తమ ఆయుధ సంపదను, సైన్యాలను పెంపొందించుకోవడం మొదలు పెట్టినాయి. నిరాయుధీకరణను అమలు చేసే ఉద్దేశంతో సమితి ఏర్పాటు చేసిన అనేక నిరాయుధీకరణ సమావేశాలు సఫలం కాలేదు. నియంతృత్వదేశాలు అనతికాలంలోనే సైనికంగా అత్యంత శక్తిమంతమైన దేశాలుగా మారి ఆహారసంపాదన కంటే ముందుగా ఫిరంగులను తయారుచేయవలసిందని నినాదాలు ఇచ్చినాయి. ఫిరంగులు ఉంటే ఆహారాన్ని అవే సంపాదిస్తాయని వారి ఉద్దేశము.

**12.1.4. తృప్తి పరిచే విధానము :**

నానాజాతి సమితి చట్టానికి విరుద్ధంగా జర్మనీ, ఇటలీ, జపాన్ దేశాలు ఎన్నో దురాక్రమణలు చేసినా అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్‌లు ఈ చర్యల పట్ల ఉదాసీనవైఖరి నవలంబించాయి. ఫలితంగా దురాక్రమణ దారులకు ప్రత్యక్షంగానూ, పరోక్షంగాను కూడా ప్రోత్సాహం కలిగింది. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్‌లు ఇటువంటి వైఖరిని అవలంభించడానికి అనేక కారణాలుగలవు. మొదటి ప్రపంచ యుద్ధానంతరం బ్రిటన్ విదేశాంగ విధానంలో మార్పుకలిగింది. ఈ విధానానికి మూలకారణం కమ్యూనిజం పట్ల, సోవియట్ రష్యా పట్ల బ్రిటన్‌కు భయసందేహాలు కలగడమే. మధ్యప్రాచ్యంలోను, యూరప్‌లోను, చైనాలోను ఉభయదేశాలు ప్రయోజనాలకు సంఘర్షణ కలగడం, కొమింటర్న్ చర్యలు, బ్రిటన్‌లో కమ్యూనిస్టుల విప్లవం వస్తుందనే భయం మొదలైనవి బ్రిటన్ రష్యాపట్ల వ్యతిరేక వైఖరిని అవలంభించడానికి కారణభూతమైనాయి. అందువల్ల అన్నివిధాలా సోవియట్ వ్యతిరేక దేశాలుగా బ్రిటన్ సహాయం చేయడానికి సిద్ధపడింది. బ్రిటన్‌కు రష్యాపట్ల గల భయసందేహాలను జర్మనీ, ఇటలీ, జపాన్ లు అవకాశంగా తీసుకొని తమ తమ దురాక్రమణ చర్యలను నిరాఘాటంగా, విజయవంతంగా కొనసాగించినాయి. అంతర్జాతీయ రాజకీయాలలో సమఉజ్జీ విధానాన్ని పరిరక్షించడానికి బ్రిటన్ ప్రయత్నించింది. రష్యాకు వ్యతిరేకంగా జర్మనీని ప్రోత్సహించింది. వర్సై సంధిని, లొకార్నో ఒప్పందాలను ఉల్లంఘించడానికి ఆస్ట్రియా చెకొస్లొవాకియాలను ఆక్రమించడానికి బ్రిటన్ జర్మనీని పరోక్షంగా ప్రోత్సాహమిచ్చింది. ఇటలీ ఇథియోపియా ఆక్రమణను కూడా బ్రిటన్ అంగీకరించింది. అలాగే జపాన్ మంచూరియాను ఆక్రమించడానికి పరోక్ష సహకారమిచ్చింది. ఈ తృప్తిపరిచే విధానంవల్ల అక్షరాజ్యాలు బలపడినాయి.

వర్సై సంధి షరతులు జర్మనీకి ప్రతికూలంగా ఉన్నాయనే భావంతో బ్రిటన్ వాటి కాఠిన్యాన్ని సడలించడానికి ప్రయత్నించింది. బ్రిటిష్ ప్రధాని చాంబర్లేన్ జర్మనీతో మ్యూనిక్ ఒప్పందాన్ని కుదుర్చుకోవడం, చెకొస్లొవాకియాను హిట్లర్‌కు పరోక్షంగా అప్పగించడం ఇందుకు తార్కాణాలు. దూరప్రాచ్యంలో రష్యా ప్రాబల్యాన్ని అరికట్టడానికి, ఆగ్నేయ ఆసియాలో జపాన్ వ్యాప్తిని నిరోధించడానికి, చైనాలోని స్వప్రయోజనాలను పరిరక్షించుకోవడంలో జపాన్ సహాయాన్ని పొందడానికి, బ్రిటన్ జపాన్‌పట్ల కూడా ఈ విధానాన్ని అనుసరించింది. అలాగే ఇటలీపట్ల కూడా బ్రిటన్ తృప్తి పరిచే విధానాన్ని అనుసరించింది.

ఫ్రాన్స్, అమెరికాలు కూడా జర్మనీ, జపాన్, ఇటలీల పట్ల తృప్తిపరిచే విధానాన్ని అవలంభించాయి. యూరప్‌లో అమెరికా తన ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలోపెట్టుకొని కమ్యూనిజం వ్యాప్తికి ఆందోళన చెంది, జర్మనీ, ఇటలీ, జపాన్‌ల పట్ల ఈ విధానాన్ని అవలంభించింది. ఇటలీ ఇథియోపియాను ఆక్రమించినపుడు దానిరాజు అమెరికా అధ్యక్షుని సహాయం కోరగా ఆతడు వివాదాన్ని శాంతియుత పద్ధతుల ద్వారా పరిష్కరించుకోవలసిందని సలహా ఇచ్చినాడు. కాని ఇటలీలోకి వ్యతిరేకంగా ఇథియోపియాకు ఎట్లాంటి సహాయం చేయలేదు. అలాగే జపాన్ చైనామీద దురాక్రమణ జరుపుతున్నప్పుడు, అమెరికా జపాన్‌మీద ఎట్లాంటి సమర్థమైన చర్యలను తీసుకోవడానికి నిరాకరించింది.

**12.1.5. అంతర్జాతీయ ఆర్థిక మాంద్యము :**

రెండో ప్రపంచయుద్ధానికి గల కారణాలలో ఒకటి అంతర్జాతీయ ఆర్థిక మాంద్యము. బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికా వంటి దేశాలు కూడా ఈ ఆర్థిక మాంద్యము నుంచి తట్టుకోలేకపోయింది. ద్రవ్యోల్బణము, నిరుద్యోగం విలయతాండవం చేసినాయి. అనేక ఆర్థిక సాంఘిక సమస్యలు ఉత్పన్నమైనాయి. వాటిని వెంటనే పరిష్కరించకపోతే ఆయా రాజ్యాలు కూలిపోయే పరిస్థితి ఏర్పడింది. ఆర్థిక మాంద్యవల్ల నిరాయుధీకరణ విధానం అంతమయింది. నిరుద్యోగులకు ఉపాధికల్పన కోసం చాలాదేశాలు ఆయుధాల ఉత్పత్తిని ఆరంభించాయి. దానివలన ఒకవైపు ఆర్థిక సమస్య తీరడమేగాక వేరొకవైపు సైనికంగా దేశాలు అభివృద్ధి చెందినాయి. అంతేగాక ఆర్థిక మాంద్యంవల్ల తమతమ సమస్యలతో సతమతమవుతున్న దేశాలు, జర్మనీ, ఇటలీలు చేస్తున్న దురాక్రమణచర్యలను పట్టించుకోలేకపోయినాయి.

**12.1.6. రష్యాపట్ల పాశ్చాత్యరాజ్యాల వైఖరి :**

పశ్చిమ రాజ్యాలు రష్యాను వెలివేసినట్లు చూడసాగింది. దానికి కారణం బోల్షివిజం అంటే భయం, ద్వేషం కలగడమే. అందువల్ల అవి రష్యా సుస్థిరతకు, వృద్ధికి వ్యతిరేకంగా ఫాసిస్ట్ అనుకూల శక్తులను ప్రోత్సాహించినాయి. కాని ఫాసిస్ట్ శక్తులు రష్యాకేగాక, తమకు కూడా ముప్పుతెస్తాయని పశ్చిమ రాజ్యాలు గ్రహించలేదు. రష్యా చాచిన స్నేహ హస్తాన్ని అవి అందుకోలేకపోవడం పెద్ద పొరపాటు. రష్యా విసుగుచెంది చివరకు జర్మనీతో చేతులు కలిపి యుద్ధవ్యతిరేకత సంధిని కుదుర్చుకొన్నది.

**12.1.7. రష్యా విధానం :**

జర్మనీ తనపై కన్నువేసిందనే సంగతి తెలిసినప్పటికీ సోవియట్ రష్యా బ్రిటన్, ఫ్రాన్స్‌లతో మైత్రి పెంపొందించుకోవడానికి గట్టిగా ప్రయత్నించలేదు. అంతేగాక 1939 లో జర్మనీతో ఒడంబడిక చేసుకోవడంతో జర్మనీకి యుద్ధం ప్రారంభించడానికి ఇంకింత ధైర్యం వచ్చింది. ఈ విధంగా యుద్ధం రావడానికి రష్యాకూడా కొంతవరకు బాధ్యురాలని చెప్పవచ్చు.

**12.1.8. అల్పసంఖ్యాక జాతులలో కలిగిన అసంతృప్తి :**

వర్సై సంధి, దాని అనుబంధసంధులు ఎన్నో అల్పసంఖ్యాక జాతులను సృష్టించినాయి. స్వయం నిర్ణయ హక్కు ప్రాతిపదికగా కొత్త రాజ్యాలను ఏర్పరచవలెనని విల్సన్ సూచించినాడు. కాని ఆర్థిక, సాంఘిక, మత, సైనిక కారణాల వల్ల వర్సై సంధి నిర్మాతలు స్వయం నిర్ణయ సూత్రాన్ని ఖచ్చితంగా అమలు చేయలేకపోయినారు. చాలా సందార్భాలలో విభిన్న జాతులను ఒకే దేశంలో ఉంచడం జరిగింది. దీని ఫలితంగా చాలా దేశాలలో అల్పసంఖ్యాక జాతులలో ద్వేషం, అసంతృప్తి ప్రబలినాయి. దీనిని అవకాశంగా తీసుకొని హిట్లర్ ఆస్ట్రియాను సుడెటన్ భూభాగాన్ని, పోలండ్‌ను కబళించినాడు.

**12.1.9. సామ్రాజ్యతత్వము :**

జర్మనీ, ఇటలీ, జపాన్‌లలోని తీవ్రజాతీయవాద ధోరణి, రెండో ప్రపంచయుద్ధానికి కారణమయింది. పారిస్ శాంతిసమావేశంలో తనకు అన్యాయం జరిగిందని ఇటలీ తలపోసింది. జర్మనీ వలెనే ఇటలీలో కూడా ముస్సోలినీ నాయకత్వంలో ఫాసిస్ట్‌ల నియంతృత్వం నెలకొన్నది. ఇటలీకి రోమన్ సామ్రాజ్య కాలంనాటి వైభవాన్ని తిరిగి సంపాదించవలెనని ఉద్దేశించినాడు. మధ్యధరా సముద్రంలో బ్రిటీష్ ప్రాబల్యాన్ని నిర్మూలించి ఇటలీ అధికారాన్ని విస్తరింపజేయవలెనని ఆతడు తలచినాడు. ఈ ఉద్దేశంలో ఇటలీ తూర్పు ఎడ్రియాటిక్ తీరాన్ని, ఫ్రెంచి ట్యునీషియాను, ఫ్రెంచి రేవు జిబూటీని ఆక్రమించదలచినాడు. ఇదే ఉద్దేశంలో ఇథియోపియాను ముస్సోలిని కబళించినాడు. మొదటి ప్రపంచ యుద్ధానంతరం జపాన్ దూరప్రాచ్యంలో శక్తివంతమైన దేశంగా రూపొందింది. వలస రాజ్యాలను సంపాదించి సామ్రాజ్య స్థాపనకు ప్రయత్నించింది. ఆనాటికి బలహీనంగా ఉన్న చైనా, జపాన్ సామ్రాజ్యతత్వధోరణికి గురిఅయింది. 1931 లో చైనా భాగమైన మంచూరియాను జపాన్ ఆక్రమించింది. అగ్రరాజ్యాలు జపాన్ దురాక్రమణను అరికట్టలేక పోయినాయి.

### 12.1.10 ప్రజాస్వామ్య - నియంతృత్వాల మధ్య సంఘర్షణ :

మొదటి ప్రపంచ యుద్ధానంతరం కొన్ని ప్రపంచ దేశాలలో నియంతృత్వ స్థాపన జరిగింది. జర్మనీలో నాజీ నియంత హిట్లర్, ఇటలీలో ఫాసిస్ట్ నియంత ముస్సోలినీ, స్పెయిన్‌లో ఫ్రాంకో సేనాని అధికారంలోకి వచ్చారు. జపాన్‌లో సైనిక నియంతృత్వము ఏర్పడింది. బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికాలు ప్రజాస్వామ్య దేశాలు. ప్రజాస్వామ్యానికి, నియంతృత్వానికి ఆదర్శాలలో సంఘర్షణ ఏర్పడింది. ప్రజాస్వామ్య దేశాలు నియంతృత్వదేశాల దురాశకు బలికాకుండా, చిన్న రాజ్యాలకు తగిన రక్షణను కల్పించలేకపోయినాయి. దీనికితోడు రష్యా, ఈ రెండు వర్గాలకు దూరంగా ఉంటూవచ్చింది. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు ప్రపంచ రాజ్యాలు రెండు కూటములుగా ఏర్పడినట్లే రెండో ప్రపంచ యుద్ధ కాలానికి కూడా ప్రంపచ రాజ్యాలు రెండు కూటాలుగా విడివడినాయి. ఒకవైపు అసంతృప్తి చెందిన దేశాలైన ఇటలీ, జర్మనీ, జపాన్‌లు రోమ్-బెర్లిన్-టోక్యో అక్షరాజ్య కూటమిగా ఏర్పడినాయి. వేరొకవైపు బ్రిటన్, ఫ్రాన్స్ వంటి ప్రజాస్వామ్య దేశాలు రెండో కూటమిలోని ప్రధాన దేశాలు.

### 12.1.11 జర్మనీలోని తీవ్ర జాతీయ వాదము :

జర్మనీలో ఉద్భవించిన తీవ్ర జాతీయవాదము రెండో ప్రపంచ యుద్ధానికి మరో కారణము. వర్సై సంధిలోని అవమానకరమైన షరతులు జర్మన్‌ల జాతీయ భావానికి, రాజకీయ ప్రతిష్ఠకు విఘాతం కలిగించినాయి. తాము పోగొట్టుకొన్న ప్రతిష్ఠను తిరిగి పొందవలెనని, తమకు జరిగిన అవమానానికి ప్రతీకారం చేయవలెనని తమ జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటవలెనని పట్టుదల జర్మన్ ప్రజలలో అధికమయింది. తాము ఆర్థికంగా దురవస్థలో ఉన్నా, మిత్రరాజ్యాలు తమకు రావలసిన యుద్ధ పరిహారాన్ని చెల్లించవలెనని పట్టుబట్టడం, జర్మన్‌లకు భరించరానిదయింది. 1924 - 1925 లో జర్మనీలో ఏర్పడిన ఆర్థిక సంక్షోభం వల్ల జర్మన్ ప్రజలకు ప్రభుత్వంమీద విశ్వాసం సనక్షగిల్లింది. ఇది నాజీ పార్టీ ఆధ్వర్యంలో తీవ్ర జాతీయవాదము, సైనికతత్త్వము విజృంభించడానికి కారణమయింది. నాజీ నియంత అయిన హిట్లర్ తన 'మెయిన్ కాఫ్' గ్రంధంలో యూరప్‌లో జర్మనీ తగిన స్థానం పొందవలెనని, జర్మన్ జాతి ప్రపంచ జాతులన్నిటిలో సర్వోత్కృష్ట జాతి అని ప్రవచించినాడు. అధికారాలన్నీ చేపట్టిన హిట్లర్ జర్మనీ యుద్ధ పరిహార ధనాన్ని చెల్లించకూడదని, జర్మనీ సాయుధ బలాలను పెంపొందించవలెనని, పోగొట్టుకొన్న వలసలనన్నిటిని, యూరప్‌లోని జర్మనీ భూభాగాలను తిరిగి సంపాదించవలెనని ఆశించినాడు. వీటిని సాధించడానికై గట్టి ప్రయత్నాలు చేయడం మొదలు పెట్టినాడు. జర్మనీ ఆయుధ బలాన్ని పునర్నిర్మించినాడు. దేశంలో నిర్బంధ సైనిక విధానాన్ని ప్రవేశపెట్టి, సైన్యాన్ని వృద్ధి చేసినాడు. విమానాలు, ఫిరంగులు, టాంకులు, యుద్ధనౌకలు, జలాంతర్గాములు, విధ్వంసక నౌకలు మొదలైన యుద్ధసామాగ్రిని జర్మనీకి సమకూర్చినాడు. ఈ ఏర్పాట్లన్నీ అతి నిగూఢంగా జరిపించి, జర్మనీని ఆయుధీకరణ చేసినాడు. దేశంలో నాజీపార్టీ తప్ప మిగిలిన రాజకీయ పార్టీలన్నిటినీ నిషేధించడం జరిగింది. యూరప్‌లోని జర్మన్ భాషను మాట్లాడే ప్రాంతాలన్నిటినీ జర్మనీలో ఏకీకరణ చేయడానికి హిట్లర్ ప్రయత్నించాడు. 1935లో తటస్థ ప్రాంతమైన రైన్ లాండ్‌ను ఆక్రమించడంతో హిట్లర్ దురాక్రమణ ప్రారంభమయింది. 1936 లో స్పెయిన్‌లో ఫాసిస్ట్ ఫ్రాంకోకు మద్దతునిచ్చినాడు. 1938 లో ఆస్ట్రియాను 1939 లో చెకొస్లొవాకియాను కబళించినాడు. 1939 సెప్టెంబర్ 1 న పోలిష్ కారిడార్‌ను ఆక్రమించడంలో హిట్లర్ రెండో ప్రపంచ యుద్ధానికి నాంది పలికినాడు.

## 12.2. రెండో ప్రపంచ యుద్ధ గమనము :

1939 సెప్టెంబర్ 1 న గొప్ప ఆత్మ విశ్వాసంతో జర్మన్ నియంత హిట్లర్ రెండో ప్రపంచ యుద్ధాన్ని ప్రారంభించాడు. జర్మనీ అధునాతనమైన విమాన బలాన్ని, సైన్యాన్ని అపారంగా సమీకరించి యుద్ధానికి సర్వసన్నద్ధమయింది. నియంతృత్వ రాజ్యాలైన ఇటలీ, జపాన్‌లతో జర్మనీ రోమ్-బెర్లిన్-టోక్యో అక్షరాజ్యాల కూటమిని ఏర్పరుచుకొన్నది. అంతేగాక రష్యాలో ఏర్పరుచుకొన్న దురాక్రమణ వ్యతిరేక ఒప్పందం మూలంగా జర్మనీలోకి తూర్పు సరిహద్దున భద్రత ఏర్పడింది. కాని ఫ్రాన్స్, బ్రిటన్‌లు యుద్ధానికి సిద్ధంగా లేవు. అమెరికా ప్రజానీకం శాంతిని వాంఛించడమువల్ల, అమెరికా తటస్థ విధానాన్ని అవలంభించింది. ఈ విధంగా అంతర్జాతీయ వాతావరణం జర్మనీకి అనుకూలమయింది.

### 12.2.1 పోలండ్ ఆక్రమణ :

సుశిక్షితమైన, సర్వసన్నద్ధమైన జర్మన్ సైన్యాలు మార్షల్ వాల్టర్ వాన్ బ్రాకెట్ష్ నాయకత్వంలో 1939 సెప్టెంబర్ 1 న పోలండ్ మీద మెరుపుదాడులు ప్రారంభించాయి. పోలాండ్ ధైర్యంగా ఎదుర్కొన్నా ఫలితం లేకపోయింది. రెండు వారాలలో పశ్చిమ పోలండ్, రాజధాని వార్సా జర్మన్‌ల ఆధీనమయింది. సెప్టెంబర్ 17 నాటికి రష్యా కూడా దండయాత్ర మొదలుపెట్టి తూర్పు పోలండ్‌ను ఆక్రమించింది. సెప్టెంబర్ 29 న దురాక్రమణ దారులైన రష్యా, జర్మనీ దేశాల విదేశాంగ మంత్రులు మోలటోవ్, రిబ్బన్ ట్రాప్‌లు పోలండ్‌ను పంచుకొన్నాయి. హిట్లర్ పోలండ్ మీద దండెత్తినపుడు, ఆ దేశపు ప్రాదేశిక సమగ్రతను పరిరక్షించడం కోసం బ్రిటన్, ఫ్రాన్స్‌లు 1939 సెప్టెంబర్ 3 న జర్మనీమీద యుద్ధాన్ని ప్రకటించాయి.

### 12.2.2. రష్యా ఫిన్‌లాండ్ యుద్ధము :

పోలెండ్ సమస్య తీరడంతో హిట్లర్ తన శక్తి యుక్తులను పాశ్చాత్య మిత్ర రాజ్యంవైపు కేంద్రీకరించగా రష్యా తన బలాన్ని బాల్టిక్ రాజ్యాల ఆక్రమణకు సన్నద్ధం చేసింది. కొద్ది కాలములోనే ఎస్తోనియా, లాట్వియా, లిధువేనియాలు రష్యాకు లొంగిపోయినాయి. రష్యాతో పరస్పర సహాయ సంధులు చేసుకొని తమతమ నౌకా, వైమానిక స్థావరాలను రష్యా స్వాధీనం చేసినాయి. తరువాత రష్యా ఫిన్‌లాండ్‌తో దాని భూభాగాన్ని కొంత తనకు అప్పగించి తనతో దురాక్రమణ వ్యతిరేక ఒప్పందం చేసుకోవలసింది అని ప్రతిపాదించింది. దానికి ఫిన్‌లాండ్ సమ్మతించలేదు. అందువల్ల రష్యా దానిమీద దండెత్తి ప్రత్యేక రక్షణ శ్రేణి మేనల్ హీయ్ శ్రేణిని భగ్నం చేసి ఆక్రమించింది. 1940 మార్చి 12న రెండు దేశాలమధ్య యుద్ధం సమాప్తమై సంధి జరిగింది. దీని ఫలితంగా ఫిన్‌లాండ్ 16 వేల చ. మై. భూభాగాన్ని విబోర్గ్ నగరాన్ని కరేలియా ద్వీపకల్పాన్ని పోగొట్టుకున్నది. పోలాండ్, ఫిన్‌లాండ్‌ల మీద దురాక్రమణను బ్రిటన్, ఫ్రాన్స్‌లు అరికట్టలేక పోయినాయి.

జర్మని పశ్చిమ యూరప్ రాజ్యాల మీద దండెత్తడానికి సర్వ సన్నాహాలు పూర్తి చేసింది. తరువాత బ్రిటిష్ నౌకా దళాన్ని వ్యాపార నౌకలను జర్మన్ జలాంతర్గాములు ముంచివేయడం ఆరంభించాయి. అందువల్ల జర్మన్ జలంతర్గాముల ఉపద్రవము నుంచి తన నౌకాదళాన్ని రక్షించుకోవడానికి బ్రిటన్ ప్రత్యేక శ్రద్ధ వహించింది. 1939 లో దక్షిణ అమెరికాలోని ఉరుగ్వే తీరములో జరిగిన నౌకా యుద్ధములో బ్రిటిష్ నౌకా దళం జర్మన్ యుద్ధ నౌక గ్రాఫ్‌స్‌ని ముంచివేసింది. 1940 నాటికి బ్రిటన్, ఫ్రాన్సులు అమెరికానుంచి డబ్బిచ్చి సరుకు తీసుకునే పద్ధతిమీద ఆయుధాలన్నీ సంపాదించుకోసాగినాయి. కాని బ్రిటిష్ ప్రధాని ఫ్రెంచ్ ప్రధాని, ధైర్యముతో వ్యవహరించలేక పోయారు.

### 12.2.3. డెన్మార్క్, నార్వేల పతనము :

1940 ఏప్రియల్‌లో జర్మని హఠాత్తుగా డెన్మార్క్‌మీద దాడిచేసి దాని రాజైన ఏదో క్రిష్టియన్ నిరసనను లెక్కచేయకుండా ఆ దేశాన్ని ఆక్రమించింది. అదే సమయంలో నార్వేమీద కూడా యుద్ధాన్ని ఆరంభించింది. నార్వేలోని ఒక దేశ ద్రోహి క్విజ్‌లింగ్ సహాయంతో ఆ దేశం సులువుగా జర్మనీ స్వాధీనం అయ్యింది. నార్వేలో క్విజ్‌లింగ్ నాయకత్వంలో జర్మనీ ఆధిపత్యం క్రింద ఒక కీలుబొమ్మ ప్రభుత్వం ఏర్పడింది. పరాజితుడు అయిన నార్వే రాజు ఏడోహారోన్ బ్రిటన్‌కు పారిపోయి అక్కడ ప్రవాస ప్రభుత్వాన్ని ఏర్పరచినాడు. డెన్మార్క్, నార్వేల పతనము వల్ల బ్రిటన్‌లో బాంబర్లీన్ మంత్రి వర్గానికి వ్యతిరేకత ప్రబలింది. 1940 మే 10 న బాంబర్లీన్ స్థానే చర్చిల్ బ్రిటిష్ ప్రధాని అయినాడు.

### 12.2.4 లగ్జంబర్గ్, హాలండ్, బెల్జియమ్‌ల పతనం :

ఫ్రెంచి సర్వసేనాని మారిస్ గామిలిన్ తన సైన్యాన్ని దేశ రక్షణ దృష్టితో మాజినో శ్రేణివద్ద కేంద్రీకరించాడు. అందువల్ల దానిని విచ్చిన్నం చేయడం కష్ట సాధ్యం అని జర్మన్‌లు గ్రహించారు. అందువల్ల దానిని తప్పించుకొని తటస్థ రాజ్యాలైన లగ్జంబర్గ్, హాలాండ్, బెల్జియమ్‌ల ద్వారా ఫ్రాన్స్‌లో ప్రవేశించడానికి జర్మన్‌లు వ్యూహం ఉన్నారు. 1940 మే 10 న లగ్జంబర్గ్‌ను జర్మన్‌లు ఆక్రమించారు. దీనితో హాలండ్, బెల్జియమ్‌లో జర్మనీమీద యుద్ధాన్ని ప్రకటించాయి. జర్మని, పోలండ్‌లలో ఉపయోగించిన యుద్ధ తంత్రాన్ని ఈ దేశాలమీద కూడా ప్రయోగించాయి. హాలండ్‌లోని రాటర్‌డాన్ నగరము జర్మన్‌ల స్వాదీనం అయ్యింది. ఒక వారం రోజులలోనే హాలండ్

పతనమయ్యింది. ఆ దేశపు రాణి విల్‌హెల్మినా బ్రిటన్‌లో తలదాచుకున్నది. జర్మన్ సైన్యాలు బెల్జియంలో కూడా ప్రవేశించాయి. బ్రిటిష్ ఫ్రెంచి సైన్యాలు బెల్జియమ్‌కు సహాయము చేసినా ఫలితము లేకపోయింది. బెల్జియమ్ రాజు మూడో లియోపోల్డ్, జర్మన్‌లకు లొంగిపోయినాడు.

ఆ తరువాత జర్మన్ సైన్యాలు మాజినో రక్షణ శ్రేణికి పశ్చిమంగా ఉన్న సేడాన్ ప్రాంతంలో ప్రవేశించాయి. దీనితో ఫ్రాన్స్‌లోను ఫ్రెంచి సైన్యాలకు బెల్జియమ్‌లోని మిత్ర రాజ్యాల సేనలకు సంబంధము లేకుండా పోయింది. బెల్జియమ్‌లో చిక్కుకొని పోయిన తన సేనలను డన్ కర్క్ నుంచి సురక్షితముగా తన దేశానికి తరలించడానికి బ్రిటన్ వారం రోజులపాటు తనకు లభ్యమైన నౌకలన్నింటి సహాయంతో నిర్విరామంగా కృషి చేసింది. జర్మన్‌లు ఎడతెగని బాంబుల వర్షాన్ని కురిపిస్తున్నా లెక్క చేయక బ్రిటన్ సుమారు 2 లక్షల 25 వేల తన సేనలను, ఒక లక్షా 10 వేల ఇతర సేనలను తన దేశానికి తరలించింది. కాని ఈ సైన్యం, తమ ఆయుధాలను మందుగుండు సామాగ్రిని పూర్తిగా పోగొట్టుకున్నవి. డన్‌కర్క్ నుంచి సురక్షితముగా సైన్యాలను తరలించడం ప్రపంచ యుద్ధ తంత్ర చరిత్రలోనే అపూర్వమైన సంఘటన.

**12.2.5. ఫ్రాన్స్ పతనము :**

హాలండ్, బెల్జియమ్‌లను ఆక్రమించిన జర్మన్ సైన్యాలు ఫ్రాన్స్‌మీద మెరుపుదాడులను ఆరంభించింది. దీనికి తోడు 1940 జూన్ 11 న ఫాసిస్టు ఇటలీ ఫ్రాన్స్‌మీద యుద్ధాన్ని ప్రకటించింది. ఇటలీ సైన్యాలు ఫ్రాన్స్ ఆగ్నేయ సరిహద్దుకు తరలి వెళ్ళినాయి. ఈలోగా జర్మన్‌లు జూన్ 14 న పారిస్‌ను ఆక్రమించాయి. ఫ్రెంచి ప్రభుత్వం బోర్డోకు తరలించడం జరిగింది. ఫ్రెంచి ప్రధాని రేనాడ్ రాజీనామా చేయగా ఫ్రెంచి అధ్యక్షుడు లెబ్రాన్ పెటియిన్‌ను ప్రధానిగా నియమించాడు. బ్రిటన్ అభీష్టానికి వ్యతిరేకముగా పెటెయిన్ జర్మనీతో 1940 జూన్ 21న యుద్ధ విరమణ ఒప్పందం చేసుకున్నాడు. ఇటలీతో కూడా ఫ్రాన్స్ యుద్ధ విరమణ సంధి చేసుకున్నది. 1918 నాటి పరాజయానికి ఈ విధముగా ఫ్రాన్స్‌మీద జర్మని ప్రతీకారం తీర్చుకున్నది. ఈ యుద్ధ విరమణ సంధుల ఫలితముగా లోయర్‌నదికి ఉత్తరముగా ఉన్న ఫ్రాన్స్ భూభాగమంత, ఫ్రాన్స్ అట్లాంటిక్ తీరమంతా జర్మన్‌ల ఆధీనం అయింది. ఫ్రాన్స్ ఆగ్నేయ భాగములోనె కొంత ప్రదేశం ఇటలీ స్వాధీనం అయ్యింది. మిగతా ఫ్రాన్సుకు కొంత స్వపరిపాలన ప్రతిపత్తిని ఇవ్వడం జరిగింది. ఫ్రెంచి యుద్ధ సామాగ్రి జర్మన్‌ల స్వాధీనం అయ్యింది. ఫ్రాన్స్‌మీద హిట్లర్ విజయం అద్భుతమైన సంఘటన.

**12.2.6. బ్రిటన్‌మీద హిట్లర్ దాడి :**

ఫ్రాన్స్ పతనముతో బ్రిటన్‌కు జర్మనీ ఉపద్రవం ఎక్కువైయింది. బ్రిటన్ యూరప్ రాజ్యాలలో ఏకాకి అయ్యింది. బ్రిటన్ యుద్ధం 1940 ఆగస్టు 8 న ఆరంభం అయ్యింది. ఆనాడు అసంఖ్యాకులైన జర్మన్ విమానాలు బ్రిటిష్ తీర పట్టణాలమీద బాంబుల వర్షం కురిపించాయి. ఒక్క లండన్ నగరంమీద సుమారు 50 వేల బాంబులను వేయడం జరిగింది. పారిశ్రామిక నకగరామైన కవింట్రీ పూర్తిగా ధ్వంసమైంది. సుమారు 40 వేల మంది ప్రాణాలు కోల్పోయినారు. అయినా బ్రిటిష్ వారు చలించలేదు. బ్రిటిష్‌వారు సుమారు 300 జర్మనీ విమానాలను కుల్చివేయడం మిగతా యూరప్ లోని జర్మనీ స్థావరాలమీద రాత్రి దాడులు జరిపి అపార నష్టాన్ని కలిగించారు. బ్రిటిష్ యుద్ధం 1941 వరకు కొనసాగినను జర్మనీ బ్రిటిష్ నౌకా వైమానిక బలాధిక్యాన్ని భగ్నం చేయలేకపోయింది. హిట్లర్ బ్రిటిష్ దీవులను ఆక్రమించే అవకాశం సన్నగిల్లింది.

**12.2.7. ఇటలీ, ఆఫ్రికా, బాల్కని రంగాలు:**

ఫ్రాన్స్ పతనం, బ్రిటిషువారు తమ దేశాన్ని రక్షించుకోవడంలో నిమగ్నులు కావడం, ఇటలీకి ఆకకాశం కల్పించాయి. ఇథియోపియాలోని సైన్యాలు బ్రిటిష్ సోమాలీలాండ్‌ను ఆక్రమించి కీన్యా సూడాన్‌లలోనికి చొచ్చుకొనిపోవడం మొదలు పెట్టాయి. ట్రిపోలీలోని ఇటలీ సైన్యాలు ఉత్తర ఈజిప్ట్‌మీద దాడి జరిపి బ్రిటిష్ సేనాని వేవెల్‌ను ఓడించాయి. గ్రీస్ రాజు రెండో జార్జిని బ్రిటన్‌తో సంబంధాలని తెంచుకోవలసింది అని ముస్సోలీని హెచ్చరించాడు. దానిని తిరస్కరించిన గ్రీస్ మీద ఇటలీ దండెత్తింది.

రష్యా లిథువేనియా, లాట్వియా, ఎస్తోనియాలను ఆక్రమించుకున్నది. అంతేగాక రష్యా రుమేనియానుంచి బెస్సరేబియా, ఉత్తర బకోవినాలనుఆక్రమించదలచింది. రుమేనియా రాజు రెండో కెరోల్, ఇటలీ జర్మనీల సహాయాన్ని, అభ్యర్థించగా అవి రష్యాకు లొంగి

పోవలసింది అని అతనికి సలహా ఇచ్చినాయి. నిస్సహాయురాలైన రుమేనియా రష్యా కోరికను అంగీకరించింది. దీనితో 21 వేల చ. మై భూభాగం రష్యా పరమైంది. రుమేనియాలోని కొంతభాగం అక్షరాజ్యాల సహకారంతో రష్యా ఆక్రమించగా, మిగిలిన దేశాన్ని బల్గేరియా, హంగరీలు ఆక్రమించదలచాయి. ఇటలీ, రష్యా, జర్మనీల జోక్యంతో రుమేనియా, బల్గేరియా, హంగరీలకు, సుమారు 19వేల చ. మై భూభాగాన్ని అప్పగించింది. రాజు రెండో కెరోల్ పదవీ త్యాగం చేసి తన కుమారుడు మైకెల్‌కు రాజ్యం అప్పగించాడు. మైకెల్ మిగిలిన రుమేనియా దేశాన్ని ఫాసిస్టులకు, అనుకూలుడైన, ఇయాన్ అంటోనెస్కో సేనాని నియంతృత్వంలో ఉంచినాడు.

అమెరికా సకాలంలో అందించిన సహాయం వల్ల బ్రిటన్ తనను తాను, రక్షించుకోవడమేగాక బాల్కన్ ప్రాంతంలోను, ఉత్తర ఆఫ్రికాలోనూ, ఇటలీమీద విజయాన్ని సాధించింది. బ్రిటన్ సేనలు ఎరిట్రియా, సోమాలీలాండ్‌ల నుంచి, ఇటలీ సైన్యాలను తరిమి వేయడమే గాక, ఇథియోపియాను విముక్తం చేసి హైలీ, సెలాసీ చక్రవర్తికీ ఆ రాజ్యాన్ని తిరిగి ఇచ్చినాయి. గ్రీస్‌లో కూడా ఇటలీకి చుక్క ఎదురైంది. గ్రీస్ సేనాని మెలాక్సాస్ ఇటలీ సైన్యాలను గ్రీస్ భూభాగం నుంచి తరిమి వేశాడు. దీనితో ఇటలీకి ఈ సహాయం చేయవలెనని హిట్లర్ నిశ్చయించినాడు. హిట్లర్ జర్మన్ సైన్యాలను ట్యాంక్ దళాలను, రోమిల్ నాయకత్వంలో ఉత్తర ఆఫ్రికాకు పంపించినాడు. రోమిల్ ట్రిపోలి, లిబియాల నుంచి బ్రిటిష్ సైన్యాలను తరిమి వేసి ఈజిప్టు మీద దాడికి ఉపక్రమించినాడు. గ్రీస్ మీద ఇటాలియన్‌ల పరాజయానికి ప్రతీకారంగా హిట్లర్. బల్గేరియా, యుగోస్లోవియాలను ఆదేశించాడు. బల్గేరియా సమ్మతించింది గాని, యుగోస్లోవియాలను హిట్లర్ అభ్యర్థనను తోసిపుచ్చింది. దీనితో హిట్లర్ యుగోస్లోవియా మీద మెరుపుదాడి జరిపి రెండు వారాల్లో ఆ దేశాన్ని ఆక్రమించాడు. యుగోస్లావియా రాజు అయిన రెండో పీటర్ అతని మంత్రి వర్గం దేశం వెలుపల ప్రవాస ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినారు. జర్మన్‌లు యుగోస్లావియాను క్రోషియా, సెర్బియాలనే రెండు భాగాలుగా విభజించినారు. యుగోస్లావియాలో టిటో జర్మన్‌ల మీద గెరిల్లా యుద్ధాన్ని కొనసాగించాడు. గ్రీస్ ఇటలీ యుద్ధంలో బలహీనమైంది. జర్మన్ సేనల దాటికీ గ్రీస్ నిలువలేక పోయింది. 1941 ఏప్రిల్ నాటికి గ్రీస్ జర్మన్‌ల ఆధీనం అయింది. ఆదేశంలోని 44 వేలమంది బ్రిటిష్ సైనికులను బ్రిటన్ అతి కష్టం మీద రక్షించుకొన్నది. గ్రీస్ రాజు రెండోజార్జి లండన్‌లో ప్రవాస ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినాడు. క్రీట్ ద్వీపాన్ని కూడా జర్మన్‌లు ఆక్రమించారు. గ్రీస్ పతనం తరువాత హిట్లర్ టర్కీతో దురాక్రమణ వ్యతిరేక ఒప్పందం చేసుకొన్నాడు.

### 12.2.8 రష్యా మీద హిట్లర్ దండయాత్ర :

హిట్లర్ 1941 జూన్ 22 న 140 డివిజన్‌ల జర్మన్ సైన్యాలను రష్యా పైకి పంపాడు. ఇటలీ, హంగరి, రుమేనియా, బల్గేరియాలు కూడా రష్యా మీద యుద్ధాన్ని ప్రకటించాయి. ఫిన్‌లాండ్ కూడా రష్యా మీద యుద్ధాన్ని ఆరంభించింది. స్పెయిన్ నియంత ఫ్రాంకో, హిట్లర్ సహాయానికి ఒక ట్యాంక్ దళాన్ని పంపినాడు. ఈ విధముగా అపారమైన శత్రు సైన్యం రష్యాలోకి చొచ్చుకొని పోయింది. తూర్పు పోలెండ్, బాల్టిక్ రాజ్యాలను ఆక్రమిస్తూ హిట్లర్ సైన్యాలు, రష్యా భూభాగంలోకి చొచ్చుకొని వచ్చాయి. జూలై నాటికి అవి స్మోలెన్స్ నగరాన్ని ఆక్రమించాయి. జర్మన్ సైన్యాలు మాస్కోకు సుమారు 30 మైళ్ల దూరం వరకు, రష్యా భూభాగాన్ని ఆక్రమించాయి. అదే సమయంలో లెనిన్ గ్రాడ్ నగరాన్ని మరికొన్ని జర్మన్ సైన్యాలు చుట్టుముట్టినాయి. డిశంబర్ 1941 నాటికి యుద్ధం ఆరంభమైన 6 మాసాలకే 5లక్షల చ.మై రష్యా భూభాగాన్ని జర్మన్ సైన్యాలు ఆక్రమించాయి. రష్యా ధాన్యాగారమైన యుక్రెయిన్ వారి స్వాధీనం అయింది. రష్యాన్‌లు తిరోగమన విధానాన్ని అనుసరించారు. జర్మన్‌లకు ఏదీదక్కకుండా నాశనం చేస్తూ, వారు దేశంలోపలికి తిరోగమించినారు. దీనికి తోడు, రష్యాలోని శీతాకాలపు చలి జర్మన్‌ల పురోగమనానికి అవరోధం అయింది. రష్యామీద జర్మన్ దండయాత్ర అంతర్జాతీయ రాజకీయాల్లో కొత్త పరిణామాన్ని కలుగజేసింది. బ్రిటన్, అమెరికాలు, జర్మనీకి వ్యతిరేకంగా, రష్యాకు సహాయపడటానికి నిశ్చయించినాయి.

### 12.2.9 రెండో ప్రపంచ యుద్ధంలో అమెరికా పాత్ర :

మొదటి ప్రపంచ యుద్ధంలో పాల్గొని తీవ్ర ఆర్థిక సంక్షోభమునకు గురి అయిన అమెరికా, మరొక యుద్ధంలో జోక్యం చేసుకొనుటకు ఇష్టం లేక ఏకాంత విధానము అనుసరింపసాగెను. ఐరోపా సంఘటనలు యుద్ధమునకు దోహదము చేయుచున్నప్పుడే కాంగ్రెస్ 1935,

1936, 1937 సంవత్సరాల్లో తటస్థ శాసనాలను ప్రవేశపెట్టి, యుద్ధంలో నిమగ్నమైన దేశాలకు, ఎటువంటి సామాగ్రిని అమ్మరాదని ఎట్టి ఋణాలను ఇవ్వరాదు అని ఆదేశ నౌకలలో ఏ అమెరికన్ పౌరుడు ప్రయాణం చేయరాదు అని పేర్కొనెను.

1939లో రెండో ప్రపంచయుద్ధం ఆరంభం కాగానే దీనిలో చేరవలెనా, చేరకూడదా అనే సమస్య మీద, అమెరికాలో రెండు వర్గాలు ఏర్పడ్డాయి. అమెరికా ఏకాంత విధానాన్ని అవలంభించవలెనని ఎటువంటి పరిస్థితులలోనూ యుద్ధ వ్యవహారాల్లో తల దూర్చరాదు అని ఒక వర్గం భావింపగా రెండో వర్గం అమెరికా మిత్ర రాజ్యాలకు, తగిన సహాయాన్ని అందించవలెనని దీని మూలంగా ప్రపంచంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించవలెనని, విశ్వసించింది. అమెరికా అధ్యక్షుడు రూజువెల్ట్ కూడా దురాక్రమణ దేశాలైన ఇటలీ, జర్మనీలకు వ్యతిరేఖంగా మిత్ర రాజ్యాలకు సహాయం చేయడమే ధర్మం అని భావించాడు. ప్రజా అభిప్రాయం కూడా అధిక భాగం అమెరికా ఏకాంత విధానాన్ని విడనాడి మిత్రరాజ్యాలకు సహాయం చేయవలెనని భావించింది. రూజువెల్ట్ దేశంలోని స్వచ్ఛంద సంస్థల ద్వారా బ్రిటన్‌కు ఆయుధాలు సరఫరా చేయడం మొదలు పెట్టినాడు. ఈ విధానానికి కారణం రాజ్యాంగ రీత్యా, కాంగ్రెస్ అనుమతిలేనిదే యుద్ధంలో పాల్గొన్నదేశాలకు, అమెరికా, ఎటువంటి ఆయుధాలను సరఫరా చేయరాదు.

### 12.2. 9. 1. రొక్కమిచ్చి సరుకును తీసుకొనుపోవు సూత్రము :

హిట్లర్ పోలెండ్‌పై దాడి, పోలెండ్ రక్షణార్థం బ్రిటన్ ఫ్రాన్స్‌లు జర్మనీపై యుద్ధ ప్రకటన చేయడం మొదలగు సంఘటనలవల్ల అమెరికా, తన తటస్త విధానమునకు స్వస్తి చెప్పవలసి వచ్చింది. నియంతృత్వపు దాడులకు, ప్రజాస్వామ్య శక్తులు బలి అగుచున్నవి అని అమెరికన్లు ఆందోళన చెందిరి. అందువల్లనే కాంగ్రెస్ 1939 నవంబర్ లో ఏకాంత విధానమునకు స్వస్తి చెప్పి, అభిక్రమ విధానమును అనుసరించెను. ఈ విధానంలోని ముఖ్య అంశం రొక్కమిచ్చి సరుకును తీసుకొనుపోవు సూత్రం దీనిప్రకారం ఐరోపాలోని ప్రజాస్వామ్య దేశాలు తమకు కావలసిన యుద్ధ సామాగ్రిని, ఆహారఉత్పత్తులను, రొక్కమిచ్చి అమెరికాలో కొనుగోలు చేసి వానిని తమ నౌకలలో తమ బాధ్యతపై తమ దేశాలకు తీసుకొని వెళ్ళవచ్చును. ఆనాడు అట్లాంటిక్ సముద్రాధిపత్యం బ్రిటన్, ఫ్రాన్స్ చేతుల్లో ఉండుట వలన, ఈ సూత్రం జర్మనీకీ, వ్యతిరేకమైన మిత్రరాజ్యాలకు ఉపకరించింది.

### 12.2.9. 2. బ్రిటన్‌కు, శతఘ్ని నౌకలను పంపుట :

1940 మధ్యకాలం నాటికి హిట్లర్ బ్రిటన్‌పై దాడి చేయుటకు సన్నాహాలు చేయచుండెను. నాటికే ఫ్రాన్స్ పతనమైయింది. అందువల్ల కలవరపడిన అమెరికన్లు బ్రిటన్, రక్షణకు ప్రయత్నాలు ప్రారంభించారు. దాని ఫలితమే చట్టాన్ని ఉల్లంఘించకుండా మిగులయుద్ధ సామాగ్రిని వ్యక్తిగత సంస్థలద్వారా అమెరికా బ్రిటన్‌కు అందజేయడం ఈ సహాయము బ్రిటన్‌కు చాలలేదు. దీనితో ధైర్యంగా రూజువెల్ట్ తటస్థ విధానానికి, అభిక్రమ విధానానికి, స్వస్తిచెప్పి, 1940 సెప్టెంబర్ 2 న 50 శతఘ్ని నౌకలను బ్రిటన్‌కు సరఫరా చేయుటకు నిర్ణయించెను. దీనికి బదులు ఇంగ్లాండ్, అట్లాంటిక్ తీరమున, న్యూఫౌండ్‌లాండ్ నుండి దక్షణ అమెరికా వరకు విస్తరించి ఉన్న 8 యుద్ధ స్థావరాలను, అమెరికాకు 99 సంవత్సరాలు కవులుకు ఇచ్చుటకు అనుమతించెను. ఈ విధముగా, జర్మనీని ఓడించుటయే అమెరికా విధానం అయ్యెను.

### 12.2. 9. 3. యుద్ధ సన్నాహాలు :

హిట్లర్ దాడులకు ఫ్రాన్స్ గురి అయిన వెంటనే రూజ్‌వెల్ట్ అమెరికా రక్షణార్థము యుద్ధసన్నద్ధుడైన అనేక చర్యలను గైకొనెను. ఎ) సైనిక, నౌకా, వైమానిక దళమును దృఢత్వం చేయుటకు పదమూడు బిలియన్ డాలర్ల ధనము సమకూర్చెను. బి) 1940 సెప్టెంబర్ ఆరవ తేదిన ప్రవేశపెట్టబడిన నిర్బంధ సైనిక శాసనం ద్వారా సంవత్సరమునకు 12 లక్షల సైనికులను 8 లక్షల రిజర్వు దళమును సమకూర్చుట జరిగెను. సి) యుద్ధ వస్తూత్పత్తి సంస్థ యుద్ధకాలిక కార్మిక సంస్థ, ధరల వ్యవస్థీకరణ సంస్థ, ఉత్పత్తి నిర్వహణ సంస్థ మొ॥ సంస్థలను నెలకొల్పి ఆంతరంగిక సంపదను అభివృద్ధి పరచెను. ఈ సంస్థల కృషివల్లన కోటిన్నర సైనికులు పోషింపబడుట్లయే గాక యుద్ధమునకు అమెరికా మూడు వందల బిలియన్ డాలర్లు వెచ్చించెను. డి) ప్రతిపక్షమైన రిపబ్లిక్‌లను రూజ్వెల్ట్ తన మంత్రి మండలిలో చేర్చుకొనెను.

ఇ) 1939 లో పనామాలో 1940 లో హవానాలో లాటిన్ అమెరికా దేశాల సమావేశం ఏర్పాటు చేసి, మన్రో సిద్ధాంతమును పరిరక్షించుట అన్ని దేశాల సమిష్టి బాధ్యత అని గుర్తింపజేసెను. ఎఫ్) అలాగే కెనడా సహకారం పొందుటకు 1940 లో ఉమ్మడి రక్షణ సంస్థను నెలకొల్పెను.

### 12. 2. 9. 4. అరువు - కౌలు చట్టము :

1940 సంవత్సరం చివరకు బ్రిటన్ ఆర్థిక దుస్థితికి గురిఅయ్యెను. పతనావస్థలో ఉన్న బ్రిటన్ ఫ్రాన్స్‌లకు సహాయంచేయుటకు, రూజ్వెల్ట్ అరువు-కౌలు పద్ధతిని 1941 మార్చిలో ప్రవేశపెట్టాడు. ఈ పద్ధతి ప్రకారం మిత్రరాజ్యాలు తమకు కావలసిన ట్యాంక్‌లను తుపాకులను, ఇతర యుద్ధ సామాగ్రిని అమెరికానుండి అరువు తీసుకొని, తమ అవసరం తీరిన తరువాత అమెరికాకు ఇచ్చి వేయవలెను. ఈ పద్ధతి వలన అమెరికా యుద్ధంలో చిక్కుకొనకుండా ఉండునని యుద్ధాన్ని ఐరోపాకే పరిమితం చేయవచ్చును అని రూజ్వెల్ట్ ప్రకటించాడు. అంతేగాక మానవుని సహజసిద్ధమైన నాలుగు స్వేచ్ఛలు - వాక్స్వాతంత్రయము, మ. స్వాతంత్రియము, దారిద్ర్యమునుండి, విముక్తి పొందు స్వాతంత్రియము భయరహిత స్వాతంత్రియము, పొందగోరు నిమిత్తం అమెరికా ప్రజాస్వామ్య ఆయుధాగారంగా, ప్రపంచంలో ప్రముఖ పాత్ర వహించవలెనని, పేర్కొన్నాడు. అనేక చర్చల అనంతరం కాంగ్రెస్ అరువు-కౌలు చట్టాన్ని ఆమోదించెను. ఈ చట్టం ద్వారా అపారమైన యుద్ధ సామాగ్రిని అమెరికా మిత్ర రాజ్యాలకు సరఫరా చేసెను.

### 12.2. 9. 5. అట్లాంటిక్ ప్రకటన పత్రం :

బ్రిటిష్ ప్రధాని చర్చిల్ అమెరికా అధ్యక్షుడు రూజ్వెల్ట్‌ను అట్లాంటిక్ మహాసముద్రంలో 1941 ఆగస్టులో రహస్యంగా కలుసుకొని ఉభయులకు సంబంధించిన పెక్కు విషయాలపై చర్చలు జరిపి, 8 అంశాలతో కూడిన అట్లాంటిక్ చార్టర్‌ను రూపొందించిరి. ఈ చార్టర్‌లోని ముఖ్య అంశాలు (1) దురాక్రమణలను అరికట్టుట (2) జాతీయ స్వయం నిర్ణయసూత్రం (3) నిరాయుధీకరణ (4) సుస్థిర శాంతిని నెలకొల్పుట (5) ప్రజాస్వామ్య వ్యవస్థల ఏర్పాటు పరిరక్షణ (6) పేదరిక నిర్మూలన (7) స్వేచ్ఛ సముద్రయాన హక్కు మొ॥నవి వీటి కొరకు కృషి చేయడమే తమ యుద్ధ లక్ష్యం అని ఉభయులు ప్రకటించిరి. ఈ చార్టర్‌ను రష్యాతో సహా 15 దేశాలు ఆమోదించాయి.

### 12.2. 9. 6. జర్మన్ "U" నౌకలతో సంఘర్షణ :

బ్రిటన్ అమెరికానుండి అరువుకౌలు పద్ధతిద్వారా యుద్ధ సామగ్రిని తీసుకోసాగింది. ఈ సామగ్రిని జర్మనీ జలాంతర్గాముల దాడులనుండి కాపాడుకొనుటకు, బ్రిటన్‌కు తగిన్ని శతఘ్ని నౌకలు లేవు. అందువల్ల రూజ్వెల్ట్ బ్రిటిష్ ఓడలకు రక్షణగా అమెరికా నౌకాదళాన్ని ఐస్‌లాండ్ వరకు పంపిరావలెనని ఆదేశించెను. ఈ చర్యలలో అమెరికన్ నౌకలు జర్మనీ, జలాంతర్గాముల దాడులకు, గురి అయ్యెను. 1941 సెప్టెంబర్‌లో గ్రీరు అను అమెరికన్ శతఘ్ని నౌకను జర్మన్ జలాంతర్గాములు విచ్ఛిన్నం చేసెను, ఈ వార్త విన్నంతనే జర్మన్ నౌకలను కనబడగానే కాల్చండి అని రూజ్వెల్ట్ ఆదేశించాడు. జర్మన్‌లు అక్టోబర్‌లో మరొరెండు అమెరికన్ యుద్ధ నౌకలను ముంచివేశారు. ఈ సంఘటనలో కాంగ్రెస్ తటస్థ శాసనం రద్దుచేసి వ్యాపార నౌకలను సైనిక సహాయాన్ని జోడించి బ్రిటన్‌కు యుద్ధ సామగ్రిని చేరవేయుటకు అవకాశం కల్పించెను. ఈ విధముగా అట్లాంటిక్ మహాసముద్రంలో అమెరికా జర్మనీపై అనధికార నౌకా యుద్ధమును ప్రారంభించెను.

### 12.2. 9. 7. పెరల్ హార్బర్ మీద జపాన్ దాడి :

రెండో ప్రపంచయుద్ధం ప్రారంభంకాగానే జపాన్ దానిని అవకాశంగా తీసుకొని తూర్పు ఆసియాలో తన ప్రాబల్యాన్ని విస్తరించడం తలపెట్టింది. 1941 జూలైలో ఫ్రెంచి ఇండోచైనా, థాయిలాండ్‌లలో జపాన్ తన సైన్యాలను దింపింది. దీనితో బ్రిటిష్ వలసలైన బర్మా, మలయాలకు, డచ్చివారి తూర్పుఇండియా దీవులకు జపాన్‌వల్ల ప్రమాదం ఏర్పడింది. ఫిలిప్పైన్స్ కూడా జపాన్ ఆక్రమిస్తుంది, అని అమెరికా భయపడ సాగింది. అందువల్ల బ్రిటన్, హాలండ్‌ల సహకారాన్ని అమెరికా జపాన్‌కు చమురు లోహాలవంటి ముఖ్యమైన ఎగుమతులమీద ఆంక్షలు విధించింది. దీనితో జపాన్ అమెరికాతో యధాస్థితి కొనసాగింపుకు చర్చలు జరిపింది. కాని అవి ఫలించలేదు. 1941 అక్టోబర్‌లో యుద్ధప్రియుడైన టోజో జపాన్ ప్రధాని అయ్యాడు. ఒకవైపు అమెరికాతో చర్చలు జరుపుతూనే వేరొకవైపు జపాన్ అమెరికాకు చెందిన పెరల్ హార్బర్‌మీద దాడి చేయాలి అని నిశ్చయించింది.

1941 డిశంబర్‌లో ఎటువంటి యుద్ధప్రకటన చేయకుండా జపాన్ పసిఫిక్ మహాసముద్రంలోని అమెరికా ముఖ్య నౌకాస్థావరం అయిన హవాయ్ దీవులలోని పెరల్ హార్బర్‌మీద ఆకస్మికంగా దాడులు జరిపింది. ఈ దాడిలో సుమారు 3 వేలమంది అమెరికన్లు మరణించారు. అనేక అమెరికన్ విమానాలు ధ్వంసమయ్యాయి. దీనితో అమెరికా 1941 డిశంబర్ 11 న జపాన్ మీద యుద్ధాన్ని ప్రకటించింది. అదేరోజు ఇటలీ, జర్మనీలు అమెరికా మీద యుద్ధాన్ని ప్రకటించాయి. జపాన్‌మీద అమెరికాతో పాటు బ్రిటన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడా, నెదర్‌లాండ్స్ మొ॥ దేశాలు యుద్ధాన్ని ప్రకటించాయి దీనితో యధార్థంగా రెండో ప్రపంచయుద్ధం ప్రపంచ యుద్ధంగా పరిణమించింది.

### 12.2. 9. 8. పసిఫిక్ రంగము :

పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో జపాన్ విజయపరంపరలు సాగించింది. అమెరికాకు చెందిన గువాయ్, వేక్ దీవులను, బ్రిటిష్‌వారి హాంకాంగ్‌ను జపాన్ స్వాధీనం చేసుకొన్నది. సింగపూర్ వద్ద బ్రిటిష్ యుద్ధ నౌకా ప్రిన్స్ ఆఫ్ వేల్స్‌ను జపాన్ జలాంతర్గాములు ముంచివేశాయి. ముఖ్యపట్నం అయిన మనీలాతో బాటు ఫిలిప్పైన్స్ దీవులు కూడా జపాన్ స్వాధీనం అయింది. తరువాత జపాన్ సేనలు సింగపూర్‌ను ఆక్రమించి బర్మా, మలయా, డచ్చి, ఇండోనేషియాలను కూడా ఆక్రమించాయి. దక్షిణ పసిఫిక్‌లోని న్యూగినీ, సాలమన్ దీవులను కూడా జపాన్ జయించింది. 1942 జూన్ నాటికి జపాన్ విజృంభణను అమెరికా అరికట్టగలిగింది.

### 12.2. 9. 9. ఉత్తర ఆఫ్రికా :

ఉత్తర ఆఫ్రికాలో అక్షరాజ్యాలు విజయాలు సాధించసాగినాయి. రోమ్మెల్ సేనాని నాయకత్వంలో జర్మనీ, ఇటలీ ట్యాంక్ దళాలు ఈజిప్టు సరిహద్దు దాటి, ఆలెగ్జాండ్రియా రేవుకు, ఎల్‌ఎలమిన్ వైపు పురోగమించాయి. కాని 1942 సంవత్సరాంతానికి అక్ష రాజ్యాల పురోగమనం ఆగిపోయింది. మిత్ర రాజ్యాలు విజృంభించి, ఉత్తర ఆఫ్రికాలో అక్షరాజ్యాల ప్రతిఘటనం అంతం చేశారు.

### 12.2. 9. 10. స్టాలిన్ గ్రాడ్ యుద్ధము :

పశ్చిమ రాజ్యాలు అందించిన సహాయంతో రష్యా జర్మనీ దురాక్రమణమ ప్రతిఘటించగలిగింది. రష్యా జర్మనీ సైన్యాల మధ్య స్టాలిన్‌గ్రాడ్‌లో భీకర పోరాటం సాగింది. ఈ పోరాటంలో చివరకు, జర్మనీ సైన్యాలు ఓడిపోయాయి. రష్యన్ ఎర్రసైన్యం విజయానికి ప్రపంచమంతా దిగ్భ్రమ చెందింది. రష్యన్లు స్టాలిన్ గ్రాడ్‌ను కాపాడుకోవడమే గాక జర్మనీమీదా ఎదురుదెబ్బ తీయడానికి పురోగమించడంతో యుద్ధంలో కొత్త మలుపు ఏర్పడింది. లెనిన్‌గ్రాడ్, మాస్కోలు కూడా జర్మనీ సైన్యాలముట్టడి నుంచి విముక్తి చెందాయి. 1944 జూన్ నాటికి జర్మన్ సైన్యాలను రష్యా భూభాగంనుంచి తరిమివేయడం జరిగింది. రష్యన్ సేనలు జర్మనీ భూభాగం వైపు పురోగమించి, వార్సా నగరాన్ని తరువాత బుడాపెస్టను ఆక్రమించాయి. ఆ తదుపరి ఎర్రసేనలు డాండీగ్, వియిన్‌ల నగరాన్ని స్వాధీనం చేసుకొని పశ్చిమ పోలెండ్ చెకోస్లావాకియాలను ఆక్రమించాయి.

### 12.2. 9. 11. సిసిలీ, ఇటలీ మీద మిత్రరాజ్యాల దాడి :

ఉత్తర ఆఫ్రికాను స్వాధీనం చేసుకొని తరువాత ఆంగ్లో అమెరికన్ సైన్యాలు సిసిలీ, ఇటలీల ఆక్రమణకు ఉపకరించాయి. మొదట మిత్ర రాజ్యాలు సిసిలీని ఆక్రమించాయి. దీనితో ఇటలీ ప్రజలలో ముస్సోలినీ మీదా వ్యతిరేఖ భావం ఏర్పడింది. ఇటలీ రాజా ముస్సోలినీని తొలగించి అధికారం హస్తగతం చేసుకొన్నాడు. ముస్సోలినీని ఖైదు చేసి, ఫాసిస్టు పార్టీని బహిష్కరించడం జరిగింది. ఇటలీని లొంగిపోవలసిందిగా, మిత్ర రాజ్యాలు కోరాయి. ఇదే సమయంలో అమెరికన్ సైన్యాలు పశ్చిమ ఇటలీలో ప్రవేశించాయి. దీనితో ఇటలీ మిత్ర రాజ్యాలతో యుద్ధ విరమణ చేసుకొన్నది. కాని ఇటలీ భూభాగం అంతా, జర్మన్ సైన్యాల ఆక్రమణలో ఉంది. జర్మన్ సైన్యాలు ముస్సోలినీని జైలునుంచి విడిపించగా అతడు కీలుబొమ్మ ప్రభుత్వాన్ని స్థాపించాడు. ఇటలీ భూభాగంలో జరిగిన భీకర పోరులో మిత్ర రాజ్యాలు జర్మన్ సేనలను, చిత్తు చేశాయి. 1944 జూన్ 4 న మిత్రరాజ్య సైన్యాలు రోమ్ నగరంలో ప్రవేశించాయి.

### 12.2. 9. 12. ఫ్రాన్స్ విముక్తి :

జర్మనీని ఓడించుటకు, తూర్పు పశ్చిమ రంగాలనుండి ఒకేసారి దాడిచేయుటకు ఒక పథకం టెహరాన్ సమావేశంలో చర్చిల్, 15) రూజ్‌వెల్ట్, స్టాలిన్‌లు రూపొందించారు. ఈ పథకం ప్రకారం 30 లక్షల మిత్ర రాజ్య సేనలు ఐసన్ హోవర్ నాయకత్వంలో బ్రిటన్‌నుండి

బయలుదేరి, జర్మనీ కబంధ హస్తాలనుండి ప్యారిస్‌ను, విముక్తి చేసిరి. ఈ లోగా ఇటలీలో మిత్రమండలి సేనలు బోలోనా నగరాన్ని ఆక్రమించి పోనదిని దాటాయి. ముస్సోలినీ స్విడ్జర్‌లాండ్‌కు పారిపోతుండగా, అతనిని ఇటాలియన్ కమ్యూనిస్టులు కాల్చివేసి, అతని శరీరాన్ని మిలాన్ నగరంలో తలక్రిందులుగా వేలాడదీశారు.

### 12.2. 9. 13 బెర్లిన్ పతనం :

బ్రిటన్, అమెరికా, ఫ్రెంచి సైన్యాలు రష్యా ఎర్రసెనలు జర్మనీలో ప్రవేశించాయి. ఎర్రసేన బెర్లిన్‌లో ప్రవేశించగానే హిట్లర్ తన ప్రియురాలితో అదృశ్యమైపోయాడు. ఈ విధముగా జర్మనీలో నాజీయుజం అంతమైంది. జర్మన్ సేనానులు మిత్ర రాజ్యాలలో ఎటువంటి షరతులు లేకుండా లొంగిపోయారు.

### 12.2. 9. 14. అణుబాంబుల ప్రయోగము - జపాన్ లొంగుబాటు :

1942 నాటికే పసిఫిక్ ప్రాంతంలో జపాన్ అనేక విజయాలు సాధించింది. జపాన్ ఉపద్రవం నుంచి రక్షించుకోడానికి బ్రిటన్, అమెరికాలు సమిష్టి పథకాలను పొందాయి. 1944 నుంచి జపాన్ మీద, మిత్ర మండలి రాజ్యాల దండయాత్రలు ఉధృతమైనాయి. తూర్పుననుంచి మెకార్థర్ సేనాని, అమెరికన్ సేనతోనూ పడమర నుంచి, మౌంట్‌బాటన్, సేనాని ఆంగ్లసేన సహాయంతో జపాన్ ఆక్రమిత ప్రాంతాలను విముక్తం చేసినారు. 1944 జూన్ నాటికి సైపాన్, గువాయ్, దీవులను స్వాధీనం చేసుకొని టోక్యోనగరం మీదా దాడులు ఆరంభించారు. 1945 జనవరి నాటికి ఫిలిప్పైన్స్ దీవులు పూర్తిగా అమెరికా స్వాధీనం అయింది. ఐ-ఓజీమా, ఒకీనావ ద్వీపాలు కూడా అమెరికా స్వాధీనం అయ్యాయి. దీనితో జపాన్ మీదా, బాంబుల వర్షం కురిపించడం మొదలుపెట్టారు. ఈలోగా బ్రిటిష్ సేనలు బర్మాను విముక్తం చేసినాయి. అమెరికా సహాయంతో చైనీయులు తమ భూభాగం నుంచి జపాన్ సేనలను తిప్పికొట్టారు. జపాన్‌ను లొంగిపోవలసింది అని వేలాది కరపత్రాలను అమెరికా విమానాలు జపాన్ భూభాగం మీద విరజిల్లినాయి. అయిన జపాన్ చలించలేదు దీనితో అమెరికా, కొత్తగా కనిపెట్టిన అణుబాంబును, జపాన్ పారిశ్రామిక నగరం అయినా, హిరోషిమా మీద, 1945 ఆగస్టు 6 న ప్రయోగించింది. ఆగస్టు 7 న రష్యా జపాన్ మీద యుద్ధాన్ని ప్రకటించి తన సైన్యాలను మంచూరియా, కొరియాల మీదకి పంపింది. అయినా జపాన్, పోరు విరమించలేదు. అందువల్ల 1945 ఆగస్టు 9 న జపాన్ మరో పారిశ్రామిక నగరమైన నాగసాకి మీద అమెరికా తిరిగి, అణుబాంబులను ప్రయోగించింది. ఆ మరుసటిరోజున జపాన్, మిత్రరాజ్యాలకు లొంగిపోయింది. 1945 సెప్టెంబర్ 2 న జపాన్‌కు మిత్ర రాజ్యాలకు మధ్య మిస్సోరీ అనే అమెరికన్ యుద్ధ నౌకమీదా యుద్ధ విరమణ సంధి జరిగింది. దీనితో అధికారికంగా రెండో ప్రపంచ యుద్ధం ముగిసింది.

## 12.3. మిత్రరాజ్యాల విజయానికి, అక్షరాజ్యల పతనానికి కారణాలు :

రెండో ప్రపంచ యుద్ధంలో అక్షరాజ్య కూటమి ఓడిపోవడానికి, మిత్రరాజ్యాలు విజయం సాధించడానికి అనేక కారణాలు గలవు.

(1) జర్మనీ పతనానికి ముఖ్య కారణము జర్మన్ సేనానులు జరిపిన కుట్ర, జర్మన్ సైన్యాన్ని ఆవరించిన నిరాశానిస్పృహలు, హిట్లర్ నిరంకుశత్వం మీద చాలా తీవ్రమైన అసంతృప్తి కలిగి ఆతనిని హతమార్చడానికి అనేక కుట్రలు జరిగాయి. జర్మన్ ప్రజలలో కూడా తీవ్ర అసంతృప్తి ప్రబలింది. హిట్లర్ కుడి భుజాలైన గోరింగ్, హిమ్లర్‌లు కూడా హిట్లర్ అణచివేతకు గురిఅయినారు: ఈ కారణంవల్ల మిత్రరాజ్యాలకు వ్యతిరేకంగా జర్మనీ సమర్థంగా యుద్ధాన్ని కొనసాగించలేక పోయింది.

(2) ప్రపంచ రాజ్యాలతో జర్మనీ దీర్ఘకాలం యుద్ధం కొనసాగించడానికి తగిన స్తోమతను సంపాదించలేకపోయింది. యుద్ధం మొదటి రోజుల్లో జర్మనీ విజయాలు సాధించడానికి ముఖ్య కారణము బ్రిటన్, అమెరికా, రష్యాలు అనాటికి యుద్ధానికి సిద్ధం కాకపోవడమే. 1943-1944 నాటికి మిత్ర రాజ్యాలు సర్వసన్నద్ధం కావడంతో అక్ష రాజ్యాల పరాజయం తప్పలేదు.

(3) జర్మనీకి తగినంత నౌకాబలం లేకపోవడం కూడా అక్షరాజ్యాలు పతనానికి కారణమయింది.

(4) యుద్ధవ్యూహారీత్యా హిట్లర్ రష్యామీద దండెత్తడం పెద్ద పొరబాటు. నెపోలియన్‌వలె హిట్లర్ కూడా రష్యామీద దండెత్తి, చివరకు సంపూర్ణంగా పరాజయం పొందాడు.

(5) జర్మనీవలెనే జపాన్‌కుకూడా యుద్ధాన్ని చాలాకాలంపాటు కొనసాగించే శక్తిసామర్థ్యాలు లేకపోయినాయి.

(6) అక్షరాజ్యాల మధ్య సహకారం లోపించడం, సిద్ధాంత రీత్యా భేదాలు కలగడం కూడా జర్మనీ పరాజయానికి ఒక ముఖ్య కారణంగా చెప్పవచ్చు. జర్మనీ విజయాలను సాధించేకాలంలో ఇతర అక్షరాజ్యాలు దానితో సహకరించాయి. కాని జర్మనీ పరాజయాలను పొందుతున్నప్పుడు, దాని మిత్రదేశాలు త్వరితగతిని ఒకదాని వెనుక మరొకటి దానిని విడిచిపెట్టినాయి.

(7) జర్మనీకి ఆప్తమిత్రమైన ఇటలీ ఒక గడ్డు సమస్యగా తయారయింది. 1945 లో ముస్సోలినీని హత్యచేయడం, హిట్లర్ ధైర్యస్థైర్యాలను క్రుంగదీసింది.

(8) జర్మనీని ఇంకోమిత్రుడైన స్పెయిన్ నియంత ఫ్రాంకోసేనాని జర్మనీని ఎన్నడూ హృదయపూర్వకముగా సమర్థించలేదు.

(9) జయించిన ప్రాంతాలలో జర్మనీ సైనికులు అమానుషంగా లక్షలాది అమాయక ప్రజలను వధించారు. వారి మరణ కాండ ప్రజలను భయభ్రాంతులను చేసినది. జర్మనీ జయించిన ప్రాంతాలలో ఒక్కచోట కూడా ప్రజాభిమానం పొందలేకపోయింది. అవకాశం రాగానే ప్రజలు కూడా జర్మన్‌లను తరమడానికి సిద్ధపడ్డారు.

(10) జపాన్ పెరల్ హార్బర్‌పైదాడిచేసి అమెరికాను అవమానపరిచింది. దానితో అమెరికా యుద్ధంలో ప్రవేశించింది. అమెరికాతో పోరాడటం ఇటలీ, జర్మనీలకు మరియొక భారమయింది. మిత్రరాజ్యాల విజయానికి ప్రధాన కారణం అమెరికా యుద్ధంలో ప్రవేశించడమేనని స్పష్టంగా చెప్పవచ్చు.

(11) మిత్రరాజ్యాలన్నీ సమైక్యమై అమెరికా సేనాధిపతి ఐసెన్ హోవర్‌ను సర్వసైన్యాధిపతిగా నియమించాయి. ఇతడు సమైక్యసైన్యాన్ని చక్కగా నడిపి ఎక్కడికక్కడే విజయం సాధించాడు.

(12) మిత్రరాజ్యాలు నాయకులు చర్చిల్, రూజ్‌వెల్ట్, స్టాలిన్‌లు ఎప్పటికప్పుడు కలసి చర్చించి యుద్ధవ్యూహాలు రచించి తమ సైన్యాలకు ఆదేశాలు ఇచ్చేవారు.

(13) బ్రిటన్ నౌకాదళం సముద్రాలపై అపూర్వ విజయాలు సాధించినది. మొదటి ప్రపంచయుద్ధంవలెనే ఈ యుద్ధంలో కూడా జర్మనీకి నష్టాలు కలుగజేసినవి.

(14) ఈ యుద్ధం నియంతృత్వానికి, ప్రజాస్వామ్యానికి జరిగే పోరాటంగా మిత్రరాజ్యాలు ప్రకటించాయి. జర్మనీ నిరంకుశత్వంనుండి బయటపడుటకు ప్రజలు మిత్రరాజ్యాలకు పూర్తి సహకారాన్ని అందించారు. ప్రజాసహకారం కూడా మిత్రరాజ్యాల విజయానికి కారణమైంది.

## 12.4. రెండోప్రపంచయుద్ధ ఫలితాలు :

రెండో ప్రపంచ యుద్ధం ప్రపంచవ్యాప్తంగా అనేక మార్పులు తెచ్చింది. ముఖ్యంగా తుల్యప్రాబల్య స్థితిలో ఊహించని మార్పుమ తెచ్చినది.

(1) మొదటి ప్రపంచ యుద్ధం కంటే రెండోప్రపంచ యుద్ధం అధిక ప్రమాదకరమైంది. మారణాయుధాల సంఖ్య ఎక్కువై అణుబాంబులవంటి నూతన సాధనాలు ఎక్కువై దేశాలను నాశనం చేసినాయి. ఈ యుద్ధంలో అపార ప్రాణనష్టం, ధననష్టం జరిగింది. ఒక కోటిమంది సైన్యం మూడుకోట్ల మంది సాధారణ ప్రజలు బలైరి. యుద్ధనష్టం నాల్గు లక్షల కోట్ల డాలర్లుగా అంచనా వేయబడింది.

(2) యుద్ధానికి ముందు ప్రపంచంలో అతిబలిష్టమైన జర్మనీ యుద్ధానంతరం రెండుభాగాలుగా చీలిపోయింది. తూర్పు జర్మనీ రష్యా పరమయింది. పశ్చిమ జర్మనీ మిత్రరాజ్యాల స్వాధీనమయింది. బిస్మార్క్ కష్టించి సాధించిన జర్మనీ ఏకీకరణ విచ్ఛిన్నమై ఈ విధంగా రెండు ముక్కలయింది.

(3) జర్మనీకి చెందిన యుద్ధసామగ్రి మిత్రమండలి స్వాధీనమయింది. యుద్ధఖైదీలు నిర్బంధ శిబిరాలనుంచి విముక్తులయినారు. యుద్ధనేరస్థులను న్యూరెంబర్గ్‌లో న్యాయవిచారణ చేసినారు.

(4) జపాన్ లొంగిపోయి జనరల్ మెకార్థర్ నియంత్రణలో కొత్తప్రభుత్వం స్థాపితమయింది.

(5) రెండో ప్రపంచయుద్ధంలో జరిగిన బీభత్సం వలన ప్రపంచశాంతిని రక్షించడం తక్షణ కర్తవ్యమని మిత్రరాజ్యాల నాయకులు గుర్తించినందున 1945 లో ఐక్యరాజ్యసమితిని ఏర్పాటుచేయడం జరిగింది.

(6) యుద్ధబాధిత దేశాల పునరుద్ధరణకు తగిన ఆర్థిక సహాయసాధనాలు తలపెట్టడమయింది.

(7) మొదటి ప్రపంచయుద్ధ ఫలితంగా తలెత్తిన జాతీయభావం ఈ యుద్ధంలో ఇంకా పెంపొంది ఆసియా, ఆఫ్రికా ఖండాలలో నూతన జాతీయ స్వతంత్రరాజ్యాలు ఆవిర్భవించడానికి కారణమయింది.

(8) మొదటి ప్రపంచయుద్ధ ఫలితంగా బ్రిటన్, ఫ్రాన్స్‌లు అగ్రశ్రేణి రాజ్యాలుగా పరిణమించినాయి. అయితే రెండో ప్రపంచయుద్ధ ఫలితంగా బ్రిటన్ ఫ్రాన్స్‌ల పలుకుబడి తగ్గి అమెరికా, రష్యాలు బలవత్తర రాజ్యాలుగా పరిణమించినాయి.

(9) రెండో ప్రపంచయుద్ధారంభంలో జపాన్ గొప్పదేశంగా అభివృద్ధి చెందింది. కాని యుద్ధ కాలాంతానికి పతనమయిపోయింది. మొదటి అణుబాంబు యుద్ధప్రయోగానికి జపాన్ రంగం అయినది.

(10) యుద్ధానికి ముందు ఏర్పడిన సిద్ధాంతపర బేధాలలో ప్రజాస్వామ్యమో లేక నియంతృత్వమో వుండాలని ఉద్ఘాటించిన ముస్సోలినీ పరాజయం చెందాడు. ఈ యుద్ధంలో నియంతృత్వాలు నశించి ప్రజాస్వామ్యం విజయం సాధించింది. క్రమేపి ప్రపంచమంతటా ప్రజాస్వామ్యమే బలపడింది.

(11) హిట్లర్ మారణకాండకు బలైపోయిన యూదులకు ప్రపంచ వ్యాప్తంగా సానుభూతి లభించినది. అందువల్ల యూదుజాతివారు పాలస్తీనా ప్రాంతంలో ఇజ్రాయిల్ అనుపేరుతో యూదురాజ్యం ఏర్పాటు చేయబడింది.

(12) ఫాసిస్ట్ నియంతృత్వపు భయంవల్ల యుద్ధంలో ఒకటిగాచేరిన కమ్యూనిస్ట్, ప్రజాస్వామ్య విధానాలకు తిరిగి స్పర్థ ఏర్పడి రెండు కూటాలుగా విడిపోయినవి. ప్రజాస్వామ్య సిద్ధాంతానికి అమెరికా, కమ్యూనిస్ట్ సిద్ధాంతానికి రష్యా నాయకత్వం వహించి ప్రపంచ రాజకీయాలలో నూతన అధ్యాయం ప్రారంభించాయి. కమ్యూనిజాన్ని అరికట్టుటకు అమెరికా నాటో కూటమి ఏర్పాటు చేయగా సోవియట్ రష్యా అందుకు ప్రతిగా వార్సాకూటమిని ఏర్పాటు చేసింది.

డా॥ వి.కె. మోహన్

పాఠం - 13

# ఐక్యరాజ్య సమితి

**లక్ష్యం :**

అట్లాంటిక్ చార్టర్, ఐక్యరాజ్యసమితి అవతరణ, ఐక్యరాజ్యసమితి అంగాలు, సమితికృషి; సమితి వైఫల్యము మొదలగు విషయాల గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

**విషయక్రమం :**

**13.1. అట్లాంటిక్ చార్టర్ - ఐక్యరాజ్యసమితి అవతరణ**
13.1.1. అట్లాంటిక్ చార్టర్
13.1.2. కాసాబ్లాంకా సమావేశం
13.1.3. మాస్కో సమావేశం
13.1.4. కైరోసమావేశం
13.1.5. టెహరాన్ సమావేశం
13.1.6. బ్రిటన్‌వుడ్స్ సమావేశం
13.1.7. డంబార్టన్ ఓక్స్ సమావేశం
13.1.8. యాల్టా సమావేశం
13.1.9. శాన్‌ఫ్రాన్సిస్కో సమావేశం
13.1.10. పాట్స్ డామ్ సమావేశం
13.1.11. ఐక్యరాజ్యసమితి అవతరణ
13.1.12. ఐక్యరాజ్యసమితి లక్ష్యాలు, నియమావళి
**13.2. ఐక్యరాజ్యసమితి ప్రధానాంగాలు**
13.2.1. సాధారణ సభ
13.2.2. భద్రతాసమితి
13.2.3. ఆర్థిక, సాంఘికమండలి, ఇతర ప్రత్యేక సంస్థలు
13.2.4. ధర్మ కర్తృత్వ మండలి
13.2.5. అంతర్జాతీయ న్యాయస్థానం
13.2.6. సచివాలయం
**13.3. ఐక్యరాజ్యసమితి కృషి - రాజకీయరంగం**
13.3.1. ఇరాన్ సమస్య
13.3.2. సిరియా - లెబనాన్‌ల ఫిర్యాదు
13.3.3. గ్రీస్ సమస్య

13.3.4. ఇండోనేషియా వివాదం
13.3.5. పాలస్తీనా వివాదము
13.3.6. హైదరాబాద్ సమస్య
13.3.7. కాశ్మీర్ సమస్య
13.3.8. బెర్లిన్ దిగ్బంధనము
13.3.9 కొరియా సమస్య
13.3.10. హంగరి సమస్య
13.3.11. సూయజ్ కాలువ సమస్య
13.3.12. కాంగో వివాదము
13.4. **ఐక్యరాజ్య సమితి కృషి - ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, విద్యారంగాలు**
13.4.1. ఆర్థిక అభివృద్ధి
13.4.2. సామాజిక అభివృద్ధి
13.4.3. విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక అభివృద్ధి
13.4.4. మానవ హక్కుల పరిరక్షణ
13.5. **ఐక్యరాజ్య సమితి వైఫల్యం**
13.6. సమీక్ష.

## 13.1. అట్లాంటిక్ చార్టర్ - ఐక్యరాజ్యసమితి అవతరణ:

నానాజాతి సమితి వ్యవస్థలోని లోపాలను చక్కదిద్ది కొత్త సంస్థను నిర్మించి, ప్రపంచ సుస్థిర శాంతి సంరక్షణకు కృషి చేయడానికి రెండో ప్రపంచయుద్ధ కాలంలోనే మిత్రరాజ్యాలు ప్రయత్నాలు ఆరంభించాయి. సుస్థిర శాంతి స్థాపన ప్రపంచంలో ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛ స్వాతంత్ర్యాలను పరిరక్షించడం, ఫాసిజం బానిసత్వాలను నిర్మూలించడం అను లక్ష్యాలలో మిత్ర రాజ్యాలు రెండో ప్రపంచ యుద్ధ కాలంలో అనేక సమావేశాలు జరిపాయి. **వీటిలో మొదటిది అట్లాంటికి చార్టర్.**

**13.1.1. అట్లాంటిక్ చార్టర్ :** అమెరికా అధ్యక్షుడు రూజ్వెల్ట్, బ్రిటీష్ ప్రధాని చర్చిల్ అట్లాంటిక్ మహాసముద్రం మీద 1941 ఆగష్టులో సమావేశం అయి ఉభయులకు సంబంధించిన అనేక విషయాల మీద సంప్రదింపులు జరిపి, 8 అంశాలలో ఒక ప్రకటనను విడుదల చేశారు. దీనిని అట్లాంటిక్ ప్రకటన పత్రము అని అంటార. ఈ పత్రంలోని అంశాలు 1. అమెరికా, బ్రిటన్ల ఇతర దేశాల భూభాగాలను ఆక్రమించడానికీ, ప్రయత్నించకూడదు. 2. స్థానిక ప్రజల ఇష్టప్రకారమే దేశాల సరిహద్దుల్లో మార్పులు చేయవలెను. 3. ప్రజలకు తమకు ఇష్టమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకొనే హక్కు ఉండాలి 4. కార్మికుల స్థితి గతులను మెరుగు పరచడానికీ, ఆర్థిక ప్రగతిని సాంఘిక భద్రతను పెంపొందించడానికీ, అన్ని దేశాల మధ్య ఆర్థిక సహకారాన్ని సాధించాలి. 5. నాజీజర్మనీ శాసనం తరువాత సుస్థిర శాంతిని స్థాపించి, ప్రపంచంలోయుద్ధ భయం లేకుండా, అన్నీ దేశాలు నివసించడానికీ, అనుకూల పరిస్థితులు కల్పించవలెను. 6. ప్రపంచంలో అన్ని దేశాలు ప్రజలకు లేమి, భయము అనేవి లేకుండా చేయవలె. 7. అన్ని దేశాలకు సముద్రయానం మీద సమాన హక్కులు ఉండవలె. 8. శాశ్వత శాంతి సాధనకు దురాక్రమణ దేశాలను నిరాయుధీకరణ చేయవలె. ఈ అట్లాంటిక్ ప్రకటన పత్రం జర్మనీతో పోరాడి దేశాల ప్రజల్లో ధైర్య స్థైర్యాలను ప్రోత్సాహించింది. 26 మిత్ర రాజ్యాలు అట్లాంటిక్ ప్రకటన అంశాలు అంగీకరిస్తూ 1942 జనవరి 1న ఒక సమిష్టి ప్రకటనను చేసినాయి. నాటినుంచి ఈ ప్రకటనకు ఐక్యరాజ్యాల ప్రకటన అని పేరు వచ్చింది.

**13.1.2. కాసా బ్లాంకా సమావేశం :** మొరాకోలోని కాసాబ్లాంకా వద్ద రూజ్‌వెల్ట్, చెర్చిల్, ఫ్రెంచి ప్రవాస ప్రభుత్వాధినేత డీగోల్‌లు 1943 జనవరిలో సమావేశం అయి, శత్రురాజ్యాలు ఎటువంటి షరతులు లేకుండా లొంగిపోవాలి అని ప్రకటన చేశారు. ఈ సమావేశంలోని ఉత్తర ఆఫ్రికా యుద్ధరంగాన్ని గురించి చర్చలు జరిపారు. సిసిలీ మీద దండయాత్రకు వ్యూహాన్ని పన్నినారు.

**13.1.3. మాస్కో సమావేశం :** అమెరికా విదేశాంగ కార్యదర్శి హాల్, బ్రిటిష్ విదేశాంగ మంత్రి ఈడెన్, రష్యాన్ విదేశాంగ మంత్రి మోలటావులు మాస్కోలో 1943 అక్టోబర్‌లో సమావేశం అయ్యారు. నాజి జర్మనీ పరాజయానంతరం మిత్రరాజ్యాలు తీసుకోవలసిన చర్యలు గురించి వీరు చర్చలు జరిపారు. జర్మనీ మీద తీసుకోవల్సిన సైనిక చర్యలు ఇటలీ, ఆస్ట్రియాల సమస్యలు యుద్ధం తరువాత ప్రపంచ భద్రత అను అంశాల మీద వీరు చర్చలు జరిపారు. ఫలితముగా రెండు వ్యవస్థలు ఏర్పాటు అయినాయి. మొదటిది యూరప్ సలహా సంఘం. మిత్ర రాజ్యాల మధ్య సన్నిహిత సహాకారాన్ని సాధించడం ఈ సంఘం లక్ష్యం. రెండోది ఇటలీ వ్యవహారాలను సమీక్షించడానికి, ఒక సలహా సంఘం ఏర్పాటు అయింది. అక్ష రాజ్యాలలో విడిగా, శాంతి సంధులు చేయకూడదని, జర్మనీలను శిక్షించాలి అని ఈ సమావేశం నిర్ణయించింది.

**13.1.4. కైరో సమావేశము :** 1943 నవంబర్‌లో రూజ్‌వెల్ట్, చర్చిల్ చైనా జాతీయ ప్రభుత్వాధి నేత ఛియాంగ్ కెషేక్‌లు కైరోలో సమావేశం అయినారు. ఈ సమావేశంలో వీరు జపాన్‌ను ఓడించడానికి పథకాన్ని రూపొందించారు. జపాన్ జయించిన రాజ్యాలన్నిటినీ విముక్తం చేయాలి అని ముఖ్యముగా స్వతంత్ర కొరియాను స్థాపించాలి అని వీరు నిర్ణయించారు.

**13.1.5. టెహరాన్ సమావేశము :** 1943 నవంబర్‌లో రూజ్‌వెల్ట్, చర్చిల్, స్టాలిన్‌లు టెహరాన్‌లో సమావేశం అయి ఒక రహస్య సైనిక సంధిని చేసుకున్నారు. నార్మండీ మీద దండయాత్రను జరపడానికి వీరు వ్యూహం పన్నినారు. ఇరాన్ స్వతంత్ర ప్రతిపత్తిని ప్రాదేశిక సమగ్రతను గుర్తించారు. టర్కి, జర్మనీ మీద యుద్ధాన్ని ప్రకటిస్తే టర్కి మీద బల్గేరియా దండెత్తితే టర్కిని రక్షిస్తాను అని రష్యా హామీ ఇచ్చింది. పోలెండ్‌లో తూర్పు పరిహద్దుగా. ఖర్జన్ శ్రేణిని ఈ సమావేశం గుర్తించింది.

**13.1.6. బ్రిటన్ వుడ్స్ సమావేశము:** 44 మిత్ర దేశాలకు చెందిన ప్రతినిధులు 1944 జూలైలో బ్రిటన్ వుడ్స్‌లో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో ద్రవ్యనిధిని ఏర్పాటు చేయడం జరిగింది. యుద్ధానంతరం ప్రపంచ దేశాల పునర్ నిర్మాణాన్ని అభివృద్ధిని ఉద్దేశించి ఈ ఏర్పాటు జరిగింది.

**13.1.7 డంబార్టన్ ఓక్స్ సమావేశము :** 1944 ఆగష్టు 21 నుంచి డిశంబర్ 7 వరకు వాషింగ్‌టన్ సమీపంలో జరిగిన డంబార్టన్ ఓక్స్ సమావేశం ఐక్యరాజ్యసమితి చరిత్రలో ముఖ్యమైనది. ఈ సమావేశంలోనే ఐక్యరాజ్యసమితి ఉద్భవించింది. ఈ సమావేశం మొదట అమెరికా, బ్రిటన్, రష్యా, ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశం ఐక్యరాజ్యసమితి నిర్మాణానికి సంబంధించిన విషయం మీద చర్చలు జరిగాయి. అగ్రరాజ్యాలు వీటో అధికారాన్ని ఇచ్చిన సమస్యమీద చర్చ జరిగింది. 11 మంది సభ్యులతో భద్రతా సమితిని నెలకొల్పడానికి, అంగీకారం కుదిరింది. యుద్ధాన్ని నివారించడానికీ, దురాక్రమణను అరికట్టడానికీ సభ్యదేశాలు సైన్యాలను సమకూర్చవలెను.

**13.1.8. యాల్టా సమావేశం :** స్టాలిన్, రూజ్‌వెల్ట్, చర్చిల్‌లు క్రిమియాలోని యాల్టాలో 1945 ఫిబ్రవరిలో సమావేశం అయ్యారు. ఈ సమావేశపు చర్చలు ముఖ్యంగా 3 సమస్యలు మీద సాగినాయి. అవి ప్రపంచ శాంతి పరిరక్షణ కోసం ఒక అంతర్జాతీయ సంస్థను ఏర్పాటుచేయడం. జర్మనీ పోలెండ్‌ల భవిష్యత్ నిర్ణయించడం. ఈ సమావేశంలో అంతర్జాతీయ సంస్థను. స్థాపించాలి, అనే ప్రతిపాదనను, ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగింది. రెండో ప్రపంచయుద్ధంలో అక్షరాజ్యాలకు వ్యతిరేఖంగా పోరాడిన దేశాలన్నిటినీ, అమెరికాలో జరపబోయే ఒక అంతర్జాతీయ సమావేశానికి ఆహ్వానించడానికి నిర్ణయం తీసుకొన్నారు. ఐక్యరాజ్యసమితి రాజ్యాంగాన్ని రూపొందించడానికీ, 1945 ఏప్రిల్ 25న సమావేశం జరపాలి అని నిర్ణయించారు. బ్రిటన్, సోవియట్ రష్యా, అమెరికా, ఫ్రాన్స్, చైనాలకు, వీటో అధికారాన్ని ఇవ్వడానికీ ఈ రాజ్యాలు భద్రతా సమితిలో శాశ్వత సభ్య దేశాలుగా ఉండటానికీ అంగీకారం కుదిరింది. జర్మనీ భవిష్యత్ గురించి, పోలెండ్ భవిష్యత్ గురించి ఈ సమావేశంలో నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. ఈ సమావేశంలో జపాన్ మీద రష్యా యుద్ధాన్ని ప్రకటిస్తాను అని హామీ ఇచ్చింది. దీనికీ ప్రతిఫలం ఇవ్వడానికీ మిత్ర రాజ్యాలు అంగీకరించాయి.

**13.1.9 శాన్ ఫ్రాన్సిస్కో సమావేశము :** యాల్టా సమావేశంలో తీసుకొన్న నిర్ణయం ప్రకారం అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో 1945 ఏప్రిల్ 25న ప్రపంచ దేశాల ప్రతినిధులు సమావేశం అయినారు. సుస్థిర శాంతి స్థాపనకు యుద్ధ నివారణకు, ఒక అంతర్జాతీయ సంస్థను నెలకొల్పాలి అని, రెండోసారి ప్రయత్నించడం జరిగింది. ఈ సమావేశంలో 51 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో అనేక సంఘాలను, సమితులను ఏర్పాటు చేయడం జరిగింది. ఐక్యరాజ్యసమితి ప్రణాళికలోని అన్ని అంశాలను, క్షుణ్ణంగా నిశితంగా పరిశీలించడం జరిగింది. నిర్ణయాలు అన్ని బహిరంగంగా 2/3 వంతు సభ్యుల ఆమోదం తీసుకోవడం జరిగింది. 1945 జూన్ 25న జరిగిన సర్వప్రతినిధి సభలో ఐక్యరాజ్యసమితి ఒడంబడిక పత్రాన్ని ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగింది. మరుసటిరోజు వివిధ దేశాల ప్రతినిధులు ఈ పత్రాల మీద సంతకాలు చేశారు.

**13.1.10 పాట్స్ డామ్ సమావేశము :** రెండో ప్రపంచయుద్ధ కాలంలో రాజ్యాల మధ్యజరిగిన సమావేశాల్లో చివరిది. పాట్స్‌డామ్ సమావేశము ఈ సమావేశము 1945 ఆగస్టులో ట్రూమన్, ఆట్లీ స్టాలిన్‌ల మధ్యజరిగింది. ఈ సమావేశంలో అగ్రరాజ్యాలు అయిన అమెరికా, బ్రిటన్, రష్యా, ఫ్రాన్స్, చైనా విదేశాంగ మంత్రులతో ఒక సంఘాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సంఘం శాంతి పరిష్కారానికీ, ఏర్పాట్లను చేయడానికి, ఏర్పాటు అయింది. ఈ సంఘం రుమేనియా, హంగరీ, ఇటలీ, బల్గేరియా, మొదలైన దేశాలకు సబంధించిన శాంతి సంధులను తయారు చేయవలెను. ఈ సమావేశంలో జర్మనీ యూరప్‌కు సంబంధించి అనేక నిర్ణయాలు తీసుకోవడం జరిగింది.

**13.1.11. ఐక్యరాజ్యసమితి అవతరణ :** శాన్‌ఫ్రాన్సిస్కో నగరంలో సమావేశం అయిన 51 రాజ్యాలు ఐక్యరాజ్యసమితి ఒడంబడిక పత్రం మీద సంతకం చేసిన వెంటనే ఐక్యరాజ్యసమితి అవతరించలేదు. ఈ పత్రాన్ని చాలా దేశాల్లో, పార్లమెంట్‌లు ధృవీకరించవలసి వచ్చింది. అందువల్ల 5 అగ్రరాజ్యాలు అధిక సంఖ్యలో ఇతరదేశాలు, దీనిని ధృవీకరించడంతో 1945 అక్టోబర్ 24న ఐక్యరాజ్యసమితి ఆవిర్భవించింది. 4 సంవత్సరాల పథకాలు తరువాత ప్రపంచంలో యుద్ధాన్ని నివారించి, సుస్థిర శాంతిని నెలకొల్పడానికి, మానవ జాతి ప్రగతిని సాధించడానికీ, ఈ అంతర్జాతీయ సంస్థ అవతరించింది. ఈ సంస్థ కార్యాలయాన్ని న్యూయార్క్ నగరంలో ఏర్పాటు చేయడం జరిగింది.

**13.1.12 ఐక్యరాజ్యసమితి లక్ష్యాలు, నియమావళి :** ఐక్యరాజ్యసమితి ( ఐ.రా.స ) పత్రంలో 111 అంశాలు ఉన్నాయి. ఈ అంశాలలో సమితి ఉద్దేశాలు దాని నియమావళి దాని అంగాల గురించి పేర్కొనడం జరిగింది. ఐక్యరాజ్య సమితి పత్రంలో ఒక ప్రవేశిక కూడా ఉన్నది. ఇందులో ఐక్యరాజ్య సమితి ప్రధాన లక్ష్యం దాని సధన ఉద్దేశాలు పేర్కొనడం జరిగింది.

ముందు తరాల వారికి యుద్ధభీతి లేకుండా చేయడం ప్రాథమిక మానవ హక్కుల్లో పూర్తి విశ్వాసాన్ని పునరుద్ధరించడం, అంతర్జాతీయ ఒప్పందాల్లో , న్యాయ గౌరవాలను పరిరక్షించడం సాంఘిక ప్రగతిని సాధించి, జీవన ప్రమాణాలను మెరుగు పరచడం, అనునవి, సమితి ముఖ్య ఉద్దేశాలలో ఈ ప్రవేశిక ప్రస్తావించింది. ఈ లక్ష్యాలను సాధించడానికి సమితి ప్రవేశిక, ప్రపంచదేశాల ప్రజలకు విజ్ఞాపన చేసింది. అందులో సహనాన్ని, అలవరుచుకోవలసింది అని ఉంచి ఇరుగు, పొరుగువారి వలె శాంతిగా, జీవించవలసింది అనీ, శాంతి భద్రతల పరిరక్షణకు ఐక్యాన్ని పాటించవలసిందని పరస్పర ప్రయోజనాల దృష్టిలో తప్ప ఇతర పరిస్థితుల్లో సైన్యాలను వినియోగించరాదు అని, ప్రజలందరి, సాంఘిక, ఆర్థిక ప్రగతిని సాధించడానికి అంతర్జాతీయ, వ్యవస్థను, ఉపయోగించుకోవలసిందని వారిని కోరింది. ఐక్యరాజ్య సమితి పత్రంలోని మొదటి అంశము దాని ఉద్దేశాల గురించి పేర్కొంటుంది. అవి 1. అంతర్జాతీయ శాంతి భద్రతలను కాపాడటం, దురాక్రమణను అరికట్టి శాంతిని పరిరక్షించడానికీ, సమితి అన్ని శాంతియుత మార్గాలు ఉపయోగించి శాంతికి భంగం కలిగితే అంతర్జాతీయ న్యాయసూత్రాలను అనుసరించి, పరిష్కరించాలి. 2. అంతర్జాతీయ సౌభ్రాతృత్వాన్ని ధృడం చేయడానికి అన్ని దేశాల ప్రజల మధ్య మైత్రి సంబంధాలను పెంపొందించవలె. దేశాల మధ్య పెంపొందే ఈ మైత్రి సమాన హక్కులు స్వయం నిర్ణయాధికారం ప్రాతిపదికన జరగాలి. 3. ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక మానవతా సంబంధమైన అంతర్జాతీయ సమస్యలను పరిష్కరించడానికి, అంతర్జాతీయ సహకారాన్ని సాధించడం. జాతి, కుల, మత, వర్గ, భాష విచక్షణ లేకుండా, మానవుల హక్కుల పట్ల ప్రాథమిక స్వాతంత్ర్యాలపట్ల గౌరవాన్ని పెంపొందించడం, ప్రోత్సహించడం. 4. పై లక్ష్యాలను సాధించడానికి ఐక్యరాజ్య సమితి అన్ని దేశాల కార్యకలాపాలను సమన్వయ పరిచే కేంద్రంగా పనిచేయాలి.

ఐక్యరాజ్య సమితి పత్రంలోని రెండో అంశంలో దాని నియమావళిని పేర్కొనడం జరిగింది. ప్రతి సభ్యదేశం పాటించవలసిన, సాధారణ మూల సూత్రాలు 7 ఉన్నాయి అవి. 1. ఐక్యరాజ్యసమితి వ్యవస్థ దాని సభ్యదేశాల సర్వసత్తాక సమానత్వం మీద ఆధారపడి ఉన్నది. 2. ప్రతి సభ్యదేశము సమితి నియమావళిలో పూర్తి విశ్వాసం ఉంచవలె. 3. సభ్య దేశాలు అన్నీ తమ మధ్యగల విభేదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలి. 4. సమితి లక్ష్యాలకు విరుద్ధంగా ఏ దేశం మరొక దేశం మీద బలాన్ని ప్రయోగించరాదు. 5. ఏ దేశంమీద కాని సమితి చర్య తీసుకొన్నప్పుడు ఆదేశానికి సభ్యదేశాలు ఎటువంటి సహాయాన్ని చేయరాదు. 6. సమితిలో సభ్యత్వంలేని దేశాలు కూడా అంతర్జాతీయ శాంతిభద్రతలను పరిరక్షించడం సమితి లక్ష్యాలకు అనుగుణంగా వ్యవహరించేటట్లు సమితి కృషి చేయాలి. 7. సభ్యదేశాల అంతరంగిక విషయాల్లో సమితి సాధారణంగా కలుగజేసుకోరాదు. ఐక్యరాజ్య సమితి లోని 50వ అంశములో దాని సాంఘిక, ఆర్థిక లక్ష్యాలను పేర్కొనడం జరిగింది. 73వ అంశం ప్రకారం వలస రాజ్యాల ప్రజలకు, స్వయం పాలనా నిర్ణయ హక్కును, ప్రసాదించడానికి తాను కృషి చేస్తాను. అని ఐక్యరాజ్య సమితి హామీ ఇచ్చింది.

శాన్‌ఫ్రాన్సిస్కో సమావేశంలో పాల్గొన్న 51 దేశాలను ఐక్యరాజ్య సమితి యొక్క మూల దేశాలుగా పరిగణించడం జరిగింది. 4వ అంశం ప్రకారం శాంతిని కాంక్షిస్తూ, ఐక్యరాజ్య సమితి నియమావళిని ఆమోదించె రాజ్యలన్నిటికి ఐక్యరాజ్య సమితి లో సభ్యత్వానికీ అర్హత ఉంటుంది. భద్రతా సమితి సిఫార్స్ మీద, సాధారణ సభ. 2/3 వంతు మెజారిటీతో కొత్త దేశాలు ఐక్యరాజ్య సమితి సభ్యత్వాన్ని పొందుతాయి. ఐక్యరాజ్య సమితికి అయ్యే ఖర్చులను సభ్య దేశాలు భరించాలి. ఐక్యరాజ్య సమితికి ప్రత్యేక జెండా ఉన్నది. అది లేత నీలిరంగు వస్త్రంమీద ఐక్యరాజ్య సమితి ప్రతీక అయిన రెండు ఆలివ్ కొమ్మల మధ్యఉన్న ప్రపంచపటం.

## 13.2. ఐక్యరాజ్యసమితి ప్రధానాంగాలు :

ప్రపంచంలో యుద్ధాన్ని నివారించి సుస్థిర శాంతిని నెలకొల్పడానికి, మానవాళి ప్రగతిని సాధించడానికీ 1945 అక్టోబర్ 24న ఐక్యరాజ్యసమితి అవతరించింది. ఈ ఐక్యరాజ్య సమితి విధులు నిర్వహించడానికి ఆరు ప్రధాన అంగాలు ఉన్నాయి. అవి 1. సాధారణ సభ 2. భద్రతాసమితి 3. ఆర్థిక, సాంఘీక మండలి 4. ధర్మకర్తృత్వ మండలి 5. అంతర్జాతీయ న్యాయస్థానం 6. సచివాలయం.

**13.2.1 సాధారణ సభ :** సాధారణ సభలో ఐక్యరాజ్యసమితి సభ్యులందరూ ఉంటారు. ప్రతి సభ్య దేశము 5 గురు వ్యక్తులను ప్రతినిధులుగా సమావేశాలకు పంపుతుంది. ఎంతమంది ప్రతినిధులు ఉన్న సభ్యత్వం ఉన్నా ప్రతిదేశానికీ, ఒకే ఓటు ఉంటుంది. సాధారణ సభ సంవత్సరానికి ఒకసారి అయినా సమావేశం జరుపవలె. ఈ సమావేశం సెప్టెంబర్ - డిశంబర్‌ల మధ్య జరుగుతుంది. సెక్రెటరీ జనరల్ కోరికపై గాని ఐక్యరాజ్య సమితి మెజారిటీ కోరికపైగాని ప్రత్యేక సమావేశాలు కూడా, జరుగవచ్చు ప్రతి సమావేశానికీ సభ్యులలో ఒకరిని అధ్యక్షునిగా, సాధారణ సభ ఎన్నుకొంటుంది. 1945 లో ఇందులో 50 మంది సభ్యులు మాత్రమే ఉండేవారు. 1971 నాటికి 132 దేశాలు సభ్యత్వం పొందినాయి.

**13.2.1.1 సాధారణ సభ విధులు :** ఐక్యరాజ్య సమితి ఒడంబడిక పత్రంలో చెప్పిన విషయాలను సాధారణసభ చర్చించవచ్చు. అంతర్జాతీయ శాంతి భద్రతలు నెలకొల్పే విషయంలో సహకార సూత్రాలను యోచించవచ్చు. అంతర్జాతీయ శాంతి భద్రతలకు భంగకరముగా వచ్చె, ఏ విషయంలోనైనా భద్రతాసమితిలోని శాశ్వత సభ్యులు ఏకగ్రీవంగా, ఒక నిర్ణయానికీ రాలేక, తగిన చర్య తీసుకోలేనప్పుడు సాధారణ సభ దానిని సమగ్రముగా చర్చించి. తగిన సమిష్టి చర్యలను, బల ప్రయోగంతోనైన సరే తీసుకొనడానికీ, సభ్యులకు సిఫార్స్ చేస్తుంది. అంతేకాక అంతర్జాతీయ న్యాయశాస్త్రవిధులు, పరిశీలించి క్రోడీకరించడానికీ, ప్రోత్సహించడం, రాజకీయంగా దేశాల మధ్య సహకారం పెంపొందేటట్లు చెయడం. ఆర్థిక, సాంఘీక విద్య సాంస్కృతిక ఆరోగ్య రంగాల్లో అభివృద్ధికి తోడ్పడటం మెదలయినవి సాధారణ సభ నిర్వహిస్తుంది. జాతి, స్త్రీ పురుష, భాషా, మత విచక్షణ లేకుండా మానవ హక్కులు ప్రాథమిక స్వాతంత్ర్యాలు మానవులందరికి లభించడానికీ పనిచేస్తుంది. ఇతర శాఖల నిర్వహణ విషయంలో వచ్చి నివేదికలను పరీక్షిస్తుంది. ప్రతి సంవత్సరం సెక్రటరీ జనరల్ నివేదికను సభకు సమర్పిస్తారు. సభా సమితి బడ్జెట్‌ను ఆమోదించవలె సభా తీర్మానాలు 2/3 వంతు మెజారిటీ సభ్యుల, ఆమోదం పొందాలి. సామాన్య విషయాల్లో సాధారణ మెజారిటీ సరిపోతుంది. సభ తన విధులను నిర్వహించడానికి, 7 చిన్న సమితులను నియమిస్తుంది. ఒక్కొక్కటి

ఒక్కొక్క విషయాన్ని చూస్తాయి. అవి రాజకీయ విషయాలు ఆర్థిక, సాంఘిక విషయాన్ని చూస్తాయి. అవి రాజకీయ విషయాలు ఆర్థిక, సాంఘిక విషయాలు సాంస్కృతిక విషయాలు ధర్మకర్తృత్వము, పరిపా...ు, బడ్జెట్ వ్యవహారాలు ప్రత్యేక రాజకీయ విషయాలు, ఒక సాధారణ సమితి వీటి విధులను సమన్వయ పరుస్తుంది. దౌత్య ప్రతిని...ల ...ధికార పత్రాలను పరిశీలించడానికీ, వేరే సమితి ఉంది. సాధారణ సభ, భద్రతా సమితిలోని అశాస్వత సభ్యులను ఎన్నుకొంటుంది. భద్రతా సమితి సిఫార్స్ ప్రకారం సెక్రటరీ జనరల్‌ను నియమిస్తుంది. భద్రతా సమితిలో కలసి, అంతర్జాతీయ న్యాయాధిపతులను, అయితే ఓటింగ్ వేరు, వేరుగా ఉంటుంది.

**13.2.1.2 సాధారణ సభ నిర్వహించిన పని :** సాధారణ సభ మామూలు సమావేశాలేగాక 1947, 1948, 1963లలో పాలస్తీనా గురించిన ప్రత్యేక సమావేశాలు, 1960 లో మధ్య ప్రాచ్యాన్ని గురించి, హంగరీ గురించి, అత్యవసర సమావేశాలు జరిగాయి. 1947 నుంచి మొత్తంమీద సభాప్రతిష్ట పెరుగుతూనే ఉన్నది. అని చెప్పవచ్చు. కొరియా, గ్రీస్, సూయజ్ విషయాల వంటివి, భద్రతా సమితి నుంచి సాధారణ సభకు మళ్ళించడం జరిగింది. భద్రతా సమితిలో శాశ్వత సభ్యులు కొన్ని 'వీటో' అధికారాల వల్ల, సాధారణ సభ చర్య చేసి, నిర్ణయించవలెననే పద్ధతి వచ్చింది. సాధారణ సభలో ప్రజాస్వామ్య ధోరణి ఉండటం వల్ల, సభాధ్యక్షుడు ఏ అగ్రరాజ్యప్రతినిధి, కాకూడదు అనే షరతువల్ల, సభకు ప్రాధాన్యం వచ్చింది. ప్రపంచ శాంతి దృష్ట్యా దీని పాత్ర ముఖ్యమైనది.

**13.2.2 భద్రతా సమితి :** భద్రతా సమితిలో 15 మంది సభ్యులు ఉన్నారు అందులో 5 గురు శాశ్వత సభ్యులు మిగతావారు తాత్కాలిక సభ్యులు శాస్వత సభ్యదేశాలు చైనా, ఫ్రాన్స్, రష్యా, బ్రిటన్, అమెరికాలు. తాత్కాలిక సభ్యులను, రెండు సంవత్సరాల కాలపరిమితికి సాధారణసభ 2/3వంతు మెజారిటీతో ఎన్నుకుంటుంది. ప్రతి రాజ్యానికి ఒకడే ప్రతినిధి. విరమించుకొన్న సభ్యులు తిరిగి ఎన్నిక కారాదు. ఏ రాజ్య ప్రతినిధి అయినా సభ్యుడు కాకపోతే ఆ రాజ్య విషయాన్ని విచారించేటప్పుడు సమితిలో హాజరు కావచ్చు. భద్రతా సమితి శాశ్వతముగా పనిచేస్తూ ఉండే విభాగం దీని అధ్యక్షుడు నెల, నెలకు మారుతూ ఉంటాడు. అధ్యక్షపదవీ సభ్యరాజ్యాల వారిగా, ఆంగ్లభాషా అక్షర క్రమంలో ఒకరి తరువాత ఒకరికి చెందుతూ ఉంటుంది.

**13.2.2.1 విధులు :** అంతర్జాతీయ శాంతి భద్రతలు నెలకొల్పే విషయంలో భద్రతా సమితి బాధ్యత వహిస్తుంది. తగాదా పడిన రాజ్యాలను సంప్రదింపుల ద్వారాగాని మధ్యవర్తిత్వం ద్వారాగాని న్యాయపద్ధతిలోగాని పరిష్కారం చేసుకొని శాంతియుతంగా ఉండమని ఆదేశిస్తుంది. అటువంటి తగాదాల్లో శాంతికి ప్రమాద పరిస్థితి ఏదైన ఉంటే దానిని గురించి దర్యాప్తు జరుపుతుంది. అంతర్జాతీయ శాంతి భద్రతల నిమిత్తం సాయుధ బలాలు అవసరం అయితే సభ్య రాజ్యాలనుండి స్వీకరిస్తుంది. దీనికి గానూ, సైనిక సిబ్బంది సమితికి సహాయపడుతుంది. దీనిలో శాశ్వత సభ్య రాజ్యాలలోని ముఖ్య సైనిక అధికారులు ముఖ్యులు. ధర్మకర్తృత్వ ప్రదేశాల పాలన విషయమై కూడా మండలి కృషి చేస్తుంది. మామూలు విషయాలు 7గురు సభ్యుల మెజారిటీ తీర్మానిస్తుంది. శాశ్వత సభ్యులందరూ ఒప్పుకోవాలి. వాటిలో ఏదైనా 'వీటో' చేస్తే తీర్మానం వీగిపోతుంది. సైనిక సిబ్బంది కమిటీ గాకుండా, నిరాయుధీకరణ, కమీషన్ ఇతర సమితులు కమీషన్లు భద్రతాసమితికి సహాయం చేస్తాయి. మండలి సమావేశం ఐక్యరాజ్య సమితిలోనే కావచ్చు లేదా ఏ ఇతర ప్రాంతంలోనైనా కావచ్చు. అంతర్జాతీయ న్యాయాధిపతులను, సాధారణ సభలో కలసి ఎన్నుకుంటుంది. భద్రతాసమితి సిఫార్స్‌పై సెక్రటరీజనరల్‌ను సభ ఎన్నుకుంటుంది. ప్రతి సంవత్సరం తాను సాధించిన పని గురించి ప్రత్యేక నివేదికలు సమర్పిస్తుంది. ఆర్థిక, సాంఘిక మండలి, ధర్మకర్తృత్వ మండలిలు సహాయం పొందవచ్చు.

**13.2.2.2 భద్రతా సమితి సాధించిన పని :** భద్రతా సమితి ప్రపంచ పోలీస్ అధికారి వలె శాంతి కోసం వివిధ దేశాలకు ఆదేశాలు ఇస్తూ ఉంటుంది. దర్యాప్తు సంభాషణలు, సంధానము. సిఫారసు, విజ్ఞప్తి మొదలయిన పద్ధతులద్వారా తన విధి నిర్వహిస్తుంది. అనుభవంలో చూస్తే రష్యా, అమెరికాలు, మండలి సభ్యులగు తమ మధ్య ఉండే స్పర్ధవల్ల సమస్యలు తెచ్చిపెట్టినాయి. అయినా దక్షిణ కొరియా దండయాత్రకు గురి అయినప్పుడు సమితి సాయుధబలాలను సేకరించచూసింది. 1956 లో హంగరీ నుంచి మీ సేనలను ఉపసంహరించమని రష్యాను మండలి కోరింది, సూయజ్ సంక్షోభ (1956-57) సమయంలో అత్యవసర అంతర్జాతీయ సైన్యాన్ని సమకూర్చింది. 1960 లో కాంగోలో చర్య తీసుకోగలిగింది. అట్లాగే ఇండియా - పాకిస్తాన్ కలహమప్పుడు 1965 లో అత్యవసర సమావేశం జరిపి యుద్ధ విరమణ జరిగేటట్లు చేసింది. అయితే భద్రతా మండలి నిర్వహణ అనుకొన్నట్లుగా సాగలేదు. దీనికి కారణాలున్నాయి. శాశ్వత సభ్యులకు

ఉన్న 'వీటో' అధికారం వల్ల అనుకొన్న తీర్మానాలు గానీ, చర్యలు గానీ, జరపడం దుర్లభమైంది. కొత్త రాజ్యమేదైన సభ్యురాలుగా రావాలంటే అగ్ర రాజ్యాల స్పర్ధ ఇబ్బంది పెట్టింది. తరువాత ప్రతి నెల అధ్యక్షుడు మారుతూ ఉండటం మండలి పనికి అంతరాయం కలిగిస్తూ ఉండేది. తాత్కాలిక సభ్యులు రెండు సంవత్సరాలే ఉంటారు. కనుక అంత శ్రద్ధ తీసుకోనేవారు కాదు. భద్రతా మండలిలో ఈ లోట్లుండటం వల్ల సాధారణ భద్రతా సమితిలో 'వీటో' హక్కు రక్షణ వంటిది. 132 మంది సభ్యులు ఉండే పెద్ద సభ మాటిమాటికి సమావేశం కావటం తేలికకాదు. ప్రపంచంలో ఎప్పుడు ఉద్రిక్తత ఏర్పడుతుందో తెలియదు. ఏర్పడినప్పుడు తక్షణం భద్రతా సమితి దృష్టి పెట్టి దానిని పరిశీలించి తగిన కార్యక్రమం నడపటం ఆలస్యమౌతుంది. అందువల్ల ఐ.రా.స ఉద్దేశించిన శాంతి యత్నాలు మొదట భద్రతా సమితి ప్రమేయంతోనే జరిగాయి.

**13.2.3 ఆర్థిక, సాంఘిక మండలి - ఇతర ప్రత్యేక సంస్థలు :** ఐక్యరాజ్య సమితి అంగాల్లో ఒకటి ఆర్థిక, సాఘిక మండలి దీనిలో 27 మంది సభ్యులు ఉంటారు. ప్రతి సంవత్సరం 6 గురు ఎన్నుకోవడం జరుగుతుంది. వారు మూడు సంవత్సరాలు సభ్యులుగా ఉంటారు. విరమించిన సభ్యులు తిరిగి ఎన్నిక కాబడటానికి అర్హులే.

**13.2.3.1 విధులు :** అర్థిక, సాంఘిక మండలి సాధారణ సభ ఆదిపత్యంలో అంతర్జాతీయ, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, విద్యా ఆరోగ్య వ్యవహారాలను నిర్వహిస్తుంది. ఇది సంవత్సరంలో 2 సార్లు ఏప్రియల్ నెలలో న్యూయార్క్‌లో జూలైలో జెనీవాలో సమావేశం అవుతుంది. అగ్రరాజ్య ప్రతినిధి కాకుండా మరొక ప్రతినిధి అధ్యక్షుడుగా ఉంటాడు. మెజారిటీని అనుసరించి ఈ మండలి తీర్మానాలు జరుగుతాయి. 4 స్థాయి సమితులు - సాంకేతిక సహాయం, అంతర్జాతీయ సంప్రదింపులు ఏజెన్సీలు, కార్యక్రమాలు, ప్రభుత్వేతర వ్యవస్థలు ఉన్నాయి. ఇవి వివిధ రకాల కార్యకాలపాలను సమన్వయిస్తాయి. ఇవేకాక విధి నిర్వహణకు, ప్రత్యేక కమీషన్‌లు 9 ఉన్నాయి. అవి రాకపోకలు, గణాంక సంబంధాలు, సాంఘిక విషయాలు, జనాభా, మానవ హక్కులు, అల్ప సంఖ్యాలు, స్త్రీలు,మత్తుపదార్థాలు, అంతర్జాతీయ వర్తకం అను విషయాల మీదా కమిషన్లు ఇవి గాక ఐరోపా దూర ప్రాంతము లాటిన్ అమెరికా, ఆఫ్రికా ప్రాంతాలకు, ప్రాంతీయ, ఆర్థిక కమీషన్లు ఉన్నాయి. ఇవి అన్ని ఐ.రా.స తలపెట్టిన విశ్వ సంక్షేమానికి, శాంతికి కృషి చేస్తున్నాయి. ఈ మండలి వల్ల ప్రతి సంవత్సరం ప్రపంచ ఆర్థిక పరిస్థితిని సమీక్షించడం జరుగుతుంది.

**13.2.3.2 ప్రత్యేక సంస్థలు :** ఐక్యరాజ్య సమితి రాజకీయ విధులను నేరవెర్చుటయే గాక, ఆర్థిక, సాంఘిక, విద్య తదితర రంగాల్లో కూడా కృషి చేస్తుంది. ఈ లక్ష్య సాధనకు ఐక్యరాజ్య సమితి అనేక ప్రత్యేక సంస్థల ద్వారా పనిచేస్తుంది. వాటిలో ముఖ్యమైనవి :

**2.3.2.1 ప్రపంచ ఆహార సంఘం:** ప్రపంచంలో ఆహార కొరత లేకుండా చేయుటకు ఈ అంగం ఏర్పాటు చేయబడింది. ఇది ప్రపంచంలో వెనుకబడిన దేశాల్లో వ్యవసాయాన్ని ప్రోత్సహించి, అధిక ఆహార ఉత్పత్తికి సాధించుటకు తగు సూచనలు ఇచ్చి, ప్రోత్సహించును. ప్రపంచంలో ఆకలి బాధ నుండి ప్రజలను రక్షించుటకు కృషి చేయును. ఆహార వ్యవసాయ రంగాల్లో, సభ్య దేశాలకు కావలసిన, సహాయం చేయును.

**13.2.3.2.2 అంతర్జాతీయ కార్మిక సంఘం :** ప్రపంచంలోని కార్మికుల స్థితిగతులను మెరుగుపరుచుట దీని ప్రధాన బాధ్యత. యజమానులు కార్మికుల మధ్య వచ్చు వివాదాలు పరిష్కరించుటకు కృషి చేసి, వారి మధ్య సత్‌సంబంధాలు నెలకొల్పును. దీని ప్రధాన కార్యాలయం జెనీవాలో కలదు.

**13.2.3.2.3 ప్రపంచ ఆరోగ్య సంస్థ :** ప్రపంచ ఆరోగ్యాన్ని రక్షించుట ఈ అంగం ప్రధాన ఆశయం, క్షయ, మలేరియా మొ॥ అంటువ్యాధుల నిర్మూలనకు ఈ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా గొప్ప కృషి చేయుచున్నది.

**13.2.3.2.4 అంతర్జాతీయ ద్రవ్యనిధి :** ఇది సమితి ఆర్థిక సంస్థ ఈ సంస్థ ప్రపంచంలో వెనుక బడిన దేశాలకు ఆర్థిక సహాయం చేయును. ఈ నిధి నుండి భారతదేశం సహాయం పొందుచున్నది.

**13.2.3.2.5 అంతర్జాతీయ బాలుర నిధి :** ఈ సంస్థ బాలబాలికలు ఆరోగ్య రక్షణకు కృషి చేయుచున్నది వారికి పుష్టికరమైన ఆహారం అందునట్లు చేయుట. ఆరోగ్య రక్షణ. వైద్య సదుపాయాలు కల్పించుట, మసూచి, పోలియో మొదలగు వ్యాధుల నుండి కాపాడుట అందుకు తగిన మందులు సరఫరా చేయుట ఈ సంస్థ ముఖ్య విధులు.

**13.2.3.2.6 అంతర్జాతీయ విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక సంఘం :** ఈ సంఘం ప్రధాన కార్యాలయం ప్యారిస్‌లో ఉంది. సభ్యదేశాల్లో, విద్యా, వైజ్ఞానిక, సాంకేతిక, సాంస్కృత రంగాల్లో అభివృద్ధిని సాధించునట్లు ఆయా దేశాలకు సహాయపడును. ప్రపంచంలో నిరక్షరాస్యతను నిర్మూలించి అజ్ఞానాన్ని ప్రారద్రోలి మానవ జాతి అభ్యున్నతికి కృషి చేయుచున్నది.

**13.2.3.2.7 ఇతర సంస్థలు :** ఇంకా అంతర్జాతీయ అభివృద్ధి సంఘం, అంతర్జాతీయ ఆర్థిక కార్పోరేషన్, అంతర్జాతీయ పోస్టల్ యూనియన్, అంతర్జాతీయ టెలీకమ్యూనికేషన్ యూనియన్, అంతర్జాతీయ అంతరిక్ష శాస్త్రీయ సంఘం, అంతర్జాతీయ నౌకాయాన సలహా సంఘం, వర్తక సుంకాల సాధారణ సంఘం. మొదలగు అనేక ఉపసంఘాలు గలవు.

పైన పేర్కొన్న సంస్థలలో ఎన్నో ప్రపంచ ఆర్థిక, సాంఘిక పరిస్థితులను మెరుగు పరచడానికి పనిచేస్తున్నాయి. ఆర్థిక సాంఘిక మండలి వాటి పనిని పర్యవేక్షిస్తుంది. పరిశోధన సర్వేల ద్వారా కావలసిన సమాచారం సేకరించి, అన్ని దేశాల వారికి తెలియజేస్తుంది. అంతర్జాతీయ సమాచార జ్ఞాన కేంద్రంగా పరిణమిస్తుంది. అనేక విధాల, ఆర్థిక, సాంఘిక సమాచారాలు సేకరించి, రాజకీయాలతో సంబంధం లేకుండా పనిచేసేది ఆర్థిక, సాంఘిక మండలి ఒక్కటే. అంతర్జాతీయ సంక్షేమమే దీని ప్రధాన లక్ష్యం.

**13.2.4 ధర్మ కర్తృత్వ మండలి :** ఐ.రా.స ఒడంబడిక పత్రం ప్రకారం ప్రపంచ యుద్ధానంతరం కొన్ని రాజ్యాలు స్వయం పాలన అనుభవించక ధర్మ కర్తృత్వ సిద్ధాతం క్రింద ఒక అగ్ర రాజ్య సంరక్షణలో ఉండటం జరిగింది. అటువంటి రాజ్యాలను ధర్మ కర్తృత్వ ప్రదేశాలు అంటారు. వీటి నిర్వహణకు, ధర్మ కర్తృత్వ ప్రదేశాలు అంటారు. వీటి నిర్వహణకు, ధర్మ కర్తృత్వ మండలి స్థాపించబడింది. ఇందులో ధర్మ కర్తృత్వ ప్రదేశాలను పాలించే రాజ్యాలు భద్రతా సమితిలోని శాశ్విత సభ్యులు సాధారణ సభ ఎన్నుకొన్న ఇతర సభ్యులు ఉంటారు. ఈ సభ్యుల్లో కొంతమంది 3 సంవత్సరాలకు ఒకసారి మారవచ్చు.

**13.2.4.1 విధులు :** కీలక ప్రాంతాలలో గాక ఇతర ధర్మ కర్తృత్వ ప్రాంతాల విషయంలో ఐ.రా.స విధులను ఈ మండలి నిర్వహిస్తుంది. కీలక ప్రాంతాల విషయాలను భద్రతా సమితి నిర్వహిస్తుంది. మండలికి ధర్మ కర్తృత్వ రాజ్యం నుంచి నివేదికలు వస్తాయి. ఆ ప్రాంతాల నుంచి ఏమైన అర్జీలు వస్తే, విచారణ పరిశీలన చేస్తుంది. ఆ ప్రాంతాలను దర్శించి, అధికార రాజ్యంపై చర్య తీసుకొనే హక్కు ఈ మండలికి ఉంది. ఇది ప్రతి సంవత్సరం సమావేశం అవుతుంది. అత్యవసర సమావేశం కూడా జరపవచ్చు. సామాన్యంగా ప్రతి సంవత్సరం జనవరిలో జూన్ సమావేశాలు జరుగుతాయి. ప్రతి జూన్ సమావేశం అప్పుడు కొత్త అధ్యక్షుడు ఉపాధ్యక్షుడు ఎన్నిక అవుతారు. మెజారిటీ తీర్మానం ప్రకారం నిర్ణయం జరుగుతుంది. ప్రతి సభ్య రాజ్యానికి, ఒకటే ఓటు ఉంటుంది.

ధర్మ కర్తృత్వ రాజ్యాల్లో ఉద్రిక్తత ఉంటూ వచ్చింది. అందుచేత, ఆ ప్రదేశాల అభ్యుదయానికి, అభివృద్ధికి కావలసిన చర్యలు తీసుకోవడం జరిగింది. వలస రాజ్య విధానం పోయి ప్రత్యక్షంగా వాటి శ్రేయోభివృద్ధికి బాధ్యత వహించి కృషి చేయడం వల్ల ఇది వరలోగల అధిష్ట రాజ్యాల పద్ధతి కంటే ఈ ధర్మ కర్తృత్వ పద్ధతి మేలు చేకూర్చింది అని చెప్పవచ్చు.

**13.2.5 అంతర్జాతీయ న్యాయ స్థానము :** ఐక్యరాజ్య సమితి ఒడంబడిక ప్రకారం అంతర్జాతీయ న్యాయ స్థానం ఏర్పడింది. ఐ.రా.స లోని సభ్యులందరూ దీనిలో సభ్యులు ఐక్యరాజ్య సమితి లో సభ్యత్వం లేని రాజ్యం ఈ న్యాయ స్థానంలో సభ్యత్వం పొందాలి అంటే భద్రతా మండలి సిఫార్స్ మీద సాధారణ సభ నిర్ణయించవలెను. ఈ న్యాయస్థానంలోని న్యాయ మూర్తులను వివిధ దేశాల్లో ఉన్న ప్రసిద్ధ న్యాయశాస్త్ర నిపుణులనుంచి నియమించడం జరుగుతుంది. 15 మంది న్యాయమూర్తులలో ఏ ఇద్దరూ కూడా ఒక దేశం వారు కాకూడదు. సాధారణ సభ భద్రతా మండలి వేరు, వేరుగా పోటి చేస్తూ, వారిని ఎన్నుకొంటాయి. వారు 9 సంవత్సరాలు పదవిలో ఉంటారు. వీరు తిరిగి ఎన్నిక కావచ్చు. ఈ కోర్టు హేగ్‌లో ఉంది.

**13.2.5.1 విధులు :** అంతర్జాతీయ న్యాయస్థానం అధ్యక్ష, ఉపాధ్యక్షుల పదవీ కాలం మూడు సంవత్సరాలు కోర్టులోని న్యాయమూర్తుల సంఖ్య కనీసం 9 అయినా ఉండాలి ముగ్గురేసి న్యాయమూర్తులు కలసి ప్రత్యేకంగా కేసుల స్వభావాలను బట్టి తీర్పులు ఇస్తుంటారు. రాజ్యాల మధ్య తగాదాలే ఈ కోర్టు కేసులు భద్రతా సమితి నిర్ణయించే నిబంధనలననుసరించి ఈ కోర్టు పని చేస్తుంది. అంతర్జాతీయ సంధులకు, ఒప్పందాలకూ, ఒడంబడికలకు, సంబంధించిన కేసులను విచారణ చేయడానికి దీనికి అధికారం ఉంది. అంతర్జాతీయ సంప్రదాయానుసారంగా సమ న్యాయపాలనా సూత్రాలు అన్ని అనుసరించి వివిధ దేశాల్లో పరిపూర్ణత చెందిన న్యాయ నిర్ణయాలను సమగ్రంగా పరిశీలించి ఈ కోర్టు తీర్పునివ్వడం జరుగుతుంది. న్యాయమూర్తులు, మెజారిటీ అభిప్రాయాన్ని అనుసరించి తీర్పులు ఇస్తారు. ఓటింగ్‌లో సమాన సంఖ్య ఉంటే అధ్యక్షుడు తన నిర్ణాయాక ఓటును ఉపయోగిస్తాడు. దీనికి అప్పీలు లేదు. సాధారణ సభగాని భద్రతా మండలి గాని, న్యాయ దృష్టిలో ఏ అంశం మీదనైనా ఈ కోర్టు సలహాను కోరవచ్చు. ఇతర ప్రత్యేక ఐక్యరాజ్య సమితి సంస్థలో కూడా దీని సలహాలను పొందవచ్చు.

అంతర్జాతీయ న్యాయస్థానం కొన్ని అంతర్జాతీయ కేసులు విచారణ జరిపి తీర్పునిచ్చింది. 1946 లో రెండు బ్రిటిష్ యుద్ధ నౌకలు అల్‌బెనియా మందు పాత్రలకు లోనై ధ్వంసమైనప్పుడు అల్బేనియా నష్టపరిహార ధనము ఇవ్వవలెనని కోర్టు తీర్పు చెప్పింది. ఇరాన్‌బావి చమురు వనరులను, ఆ దేశ ప్రభుత్వం జాతీయం చేసినప్పుడు బ్రిటన్ కేసు పెట్టుగా జాతీయం చేయడం న్యాయ సమ్మతమేననే తీర్పు చెప్పింది.

**13.2.6. సచివాలయము :** ఐక్యరాజ్య సమితిలో ఒక ప్రధాన అంగం సచివాలయం. దీని అధిపతి సెక్రటరీజనరల్ ఇతనిని 5 సంవత్సరాల కాల పరిమితికి భద్రతా మండలి సిఫార్సుపై సాధారణ సభ నియమిస్తుంది. ఇతడు ఐక్యరాజ్య సమితి పరిపాలనాధిపతి. ఇతడు ఐక్యరాజ్య సమితి సాధారణ సభ భద్రతా మండలి ఆర్థిక సాంఘిక మండలి ధర్మ కర్తృత్వ మండలి మొదలైన వాటి సమావేశాలు జరుపుతూ ఆయా శాఖలు ఆదేశించినట్లు చేస్తాడు. ఐక్యరాజ్య సమితి కార్యకలాపాల వార్షిక నివేదికను తయారు చేసి సాధారణ సభకు సమర్పిస్తాడు. ఏ పరిస్థితి అయినా అంతర్జాతీయ శాంతి భద్రతలకు భంగకరముగా ఉంటుంది అని అతనికి అనిపిస్తే భద్రతా మండలి దృష్టికి తెస్తాడు.

**13.2.6.1 సిబ్బంది :** సచివాలయము సిబ్బందిని సాధారణ సభ చేసిన, నిబంధనలను అనుసరించి, సెక్రటరీ జనరల్ నియమిస్తాడు. ఈ సచివాలయంలోని సిబ్బంది ఐక్యరాజ్యసమితికి చెందిన వివిధ కార్యక్రమాలను కూడా నిర్వహిస్తుంది. ఉద్యోగులను నియమించేటపుడు సమర్థతను ప్రావీణ్యాన్ని యోగ్యతను, ప్రమాణాలు తీసుకొంటారు. భౌగోళికంగా అన్ని ప్రాంతాలకు ప్రాతినిధ్యం ఇవ్వడం జరుగుతుంది.

**13.2.6.2 సచివాలయము స్వభావము :** సచివాలయ సిబ్బంది అంతర్జాతీయ దృష్టితో తమ విధులను నిర్వహించవలె. వారు ఏ దేశానికి చెందిన తమ దేశం నుంచి, ఏ విధమైన ఆదేశం గానీ వినకుండా తాము అంతర్జాతీయ ఉద్యోగులమని గుర్తించి. ఐక్యరాజ్య సమితి ఉద్దేశాలకు అనుగుణంగా మెలగవలెను. ఉద్యోగి ఐక్యరాజ్యసమితిలో కార్యదక్షుడు అయినా అంతర్జాతీయ సేవకుడు. ఈ సచివాలయంలో సుమారు 4 వేల మంది ఉన్నారు. ఇక్కడ ఉద్యోగులుగా ఉండకోరే వారికి, [illegible] లక్షణాలే కాక ప్రపంచ దేశాల పరిజ్ఞానం. అనేక భాషల పరిచయం కూడా అవసర

**13.2.6.3 సెక్రటరీ జనరల్ పాత్ర :** ఐక్యరాజ్య సమితి నిర్వాహక సంస్థల్లో ముఖ్యపాత్ర [illegible] జనరల్‌ది. అతడు సచివాలయ అధిపతి అయిన గొప్ప రాజకీయ పాత్ర వహించేవాడు. శాంతి భద్రతలు భంగపడే పరిస్థితి వచ్చినప్పుడు అతనికి తగిన చర్యలు తీసుకొనే అధికారం, బాధ్యత ఉన్నాయి. ఐక్యరాజ్య సమితి సభ్యులతో సమాన ప్రతిపత్తితో సంప్రదింపులు [illegible] యోగ్యత ఇతనికి ఉంది. ఒక సభ్య రాజ్యంవలె ఐక్యరాజ్య సమితి శాఖల్లో తన అభిప్రాయాలు వెలిబుచ్చి వాటిని [illegible] అతనికి యోగ్యత ఉంది. ప్రతి సభ్య రాజ్య విశ్వాసానికి ఇతడు పాత్రుడు కావలెను. అంతర్జాతీయ [illegible], సెక్రటరీ జనరల్ ఇతడు శాంతి సంరక్షకుడు అని చెప్పవచ్చు.

ట్రిగ్వేలీ (1946 - 1953 ) లో ప్రారంభమైన ఈ పదవికి హామర్‌షల్డ్ (1953 - 1961) కాలం నాటికి చాలా ప్రాధాన్య వచ్చింది. ట్రిగ్వేలీ సద్దుదేశాలతో ప్రారంభించి ఉన్నత ప్రమాణాలను అనుసరించి తన పదవినీ నిర్వహించాడు. 1950 నాటి కొరియా యుద్ధ సమయంలో అతని పాత్ర కొనియాడదగింది. కాని దూత లక్షణాలు అతనిలో తక్కువ హమర్ షల్డ్ నిరాడంబరంగా హుందాతనంతో తన కర్తవ్యం నెరవేర్చాడు. 1955లో చైనాలో బంధితులైన అమెరికన్ వైమానికుల విముక్తి విషయంలో 1956 - 57ల మధ్య ప్రాచ్యంలోని ఈజిప్టు విషయంలో సాయుధ బలాన్ని పంపి తగిన చర్య తీసుకొన్నాడు. అతని సమర్థతను గ్రహించి ఐక్యరాజ్య సమితి సభ్యులు తిరిగి అతనిని ఎన్నుకొన్నారు. అమెరికా, రష్యాల కూటాల మధ్య ఉన్న స్పర్ధను, ప్రచ్ఛన్న యుద్ధ దోరణులను సహించి లెబనాన్ విషయంలో తన కర్తవ్యాన్ని నెరవేర్చాడు. లావోస్‌లో ఐక్యరాజ్య సమితి కమీషన్ ఉంచడంలో, కాంగోలో సాయుధ బలప్రయోగం చేయడంలో గట్టి పట్టుదలతో కృషి చేశాడు. ఇతడు తన కర్తవ్యం ఉపద్రవకరమైనప్పటికీ విడిచి పెట్టక నిర్వహిస్తూ, ప్రాణాలను అర్పించి, జీవన్మృతుడైనాడు. హమరషల్డ్ తరువాత సెక్రటరీ జనరల్‌గా పనిచేసిన ఊథాంట్ తన విధిని సక్రమంగా నిర్వహించి పదవికి, గౌరవం సంపాదించినాడు.

సెక్రటరీ జనరల్‌కు సహాయంగా ఒక సలహాసమితి ఉన్నది. దీనిలో 7గురు సభ్యులు ఉంటారు. దీని సమావేశాల లాంఛన ప్రాయాలు గూఢముగా జరుగుతాయి దీనిలో ఉపయోగించే భాషా ఇంగ్లీష్ సర్వవిధాల సెక్రటరీ జనరల్ బాధ్యత నెరవేర్చడంలో ఈ సలహా సమితి తోడ్పడుతుంది. ఇన్ని రకాల శాఖలతోనూ, సచివాలయంతోనూ ఐక్యరాజ్య సమితి ప్రపంచ శాంతి క్షేమాలకు కృషి చేస్తూ ఉంది.

## 13.3. ఐక్యరాజ్యసమితి కృషి - రాజకీయరంగం :

ఐక్యరాజ్య సమితి ప్రధాన లక్ష్యం అంతర్జాతీయ శాంతి భద్రతలను పరిరక్షించడం. దీని స్థాపన నాటినుంచి ఎన్నో అంతర్జాతీయ వివాదాలను, పరిష్కరించడానికి, ఈసంస్థ కృషి చేసింది. అనేక రాజకీయ సమస్యలను, భద్రతా సమితి సాధారణసభల ముందు ఉంచడం జరిగింది. వీటిలో చాలా సమస్యలు పరిష్కారం అయినాయి. వాటిలో ముఖ్యమైనవి :

**13.3.1 ఇరాన్ సమస్య :** రెండో ప్రపంచయుద్ధకాలంలో బ్రిటన్, అమెరికా, రష్యా సేనలు ఇరాన్‌లో ప్రవేశించాయి. యుద్ధం తరువాత బ్రిటీష్ అమెరికన్ సేనలు, అక్కడనుంచి వైదొలగగా, సోవియట్ రష్యా సైన్యాలు, ఇరాన్‌కు చెందిన, అజర్ బైజాంగ్ రాష్ట్రంనుంచి మాత్రం వైదొలగలేదు. రష్యా తన అంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటుంది అని ఇరాన్ భద్రతా సమితికి, 1946 లో ఫిర్యాదు చేసింది. చివరకు రష్యా సైన్యాలను ఇరాన్‌నుంచి ఉపసంహరించడం జరిగింది. ఇది ఐక్యరాజ్య సమితి ప్రథమ విజయం.

**...రియా - లెబనాన్‌ల ఫిర్యాదు :** తమ దేశాల్లో నిలిచిపోయిన, బ్రిటీష్, ఫ్రెంచి సైన్యాల ఉనికిని గురించి, సిరియా, లెబనా... ...46 లో భద్రతా సమితికి ఫిర్యాదు చేసినాయి. అమెరికా బ్రిటీష్ ఫ్రెంచి సైన్యాలను, ఉపసంహరించాలి అనే తీర్మానాన్ని ... ...లో ప్రవేశ పెట్టగా, వాటిని వెంటనే ఉపసంహరించాలి అని రష్యా మొదట భావించినా, చివరకి 'వీటో' చేసింది. కాని చివరకు శాంతియుతంగానే పరిష్కారం అయింది. బ్రిటీష్ ఫ్రెంచి సైన్యాలు. లెబనాన్, సిరియాలనుంచి వైదొలగినాయి.

**... గ్రీస్ సమస్య :** గ్రీస్ 1946 లో తన దేశంలో కమ్యూనిస్టుల గెరిల్లా కార్యకలాపాల గురించి, భద్రతా సమితికి ఫిర్యాదు ... గెరిల్లాలు, కమ్యూనిస్టు దేశాలనుంచి సహాయం పొందుతున్నారు అని ఈ విషయాన్ని పరిశీలించడానికీ సమితి ఒక సంఘాన్ని పేర్... ...వేది ఈ సమస్యమీద రష్యా తన 'వీటో' హక్కును చాలాసార్లు ప్రయోగించగా భద్రతా సమితి ఈ సమస్యను సాధారణ సభకు ... కాని ఈ సమస్యకు పరిష్కారం లభించలేదు.

**...3.4 ఇండోనేషియా వివాదం :** హాలండ్, ఇండోనేషియాల మధ్య 1947లో వివాదం ఆరంభమైంది. డచ్చివారు ఇండోనేషియాలో సైనిక చర్యకు దిగడంతో భారతదేశం ఆస్ట్రేలియాను ఈ విషయాన్ని భద్రతా సమితి దృష్టికి తెచ్చాయి. డచ్చి ప్రభుత్వం అది తన అంతరంగిక వ్యవహారం అని వాదించిన, భద్రతా సమితి రెండు దేశాలను, వెంటనే పోరు విరమించవలసిందిగా ఆదేశించింది. ఈ యుద్ధ విరమణను అమలు పరచడానికీ, భద్రతా సమితి ఆస్ట్రేలియా బెల్జియం, అమెరికాలతో ఒక సంఘాన్ని నియమించింది. ఇండోనేషియాను సర్వ స్వతంత్ర దేశంగా పరిగణించడానికి కమిటీ గొప్ప కృషి చేసింది.

**13.3.5 పాలస్తీనా వివాదము :** మొదటి ప్రపంచ యుద్ధానంతరం పాలస్తీన బ్రిటీష్ వారి ఆధిష్ట ప్రాంతం అయింది. ఆ దేశంలోని యూదుల అరబ్బుల మధ్యగల వివాదాన్ని పరిష్కరించలేక బ్రిటన్ 1947లో పాలస్తీనా భవిష్యత్‌ను నిర్ణయించవలసింది అని సాధారణ సభను కోరింది. ఫలితంగా సాధారణ సభ పాలస్తీనామీద ప్రత్యేక సంఘాన్ని నియమించింది. ఈ సంఘం పాలస్తీనాను మూడు రాజ్యాలుగా విభజించవలసింది అని సిఫార్స్ చేసింది. అవి యూదుల రాజ్యం, ప్రభువుల రాజ్యం, అంతర్జాతీయ పర్యవేక్షణలో జెరుసలేమ్ నగరం. ఈ పథకాన్ని సాధారణ సభ ఆమోదించినా, పాలస్తీనాలో చెలరేగిన దౌర్జన్య కాండవల్ల అది అమలు కాలేదు.

**13.3.6 హైదరాబాద్ సమస్య :** భారతదేశం స్వాతంత్ర్యం పొందిన తరువాత హైదరాబాద్ సంస్థానం, స్వతంత్రంగా ఉండటానికి ప్రయత్నించింది. అది భారతదేశంనుంచి తనకు ముప్పు కలుగుతూ ఉందని, భద్రతా సమితికి 1948 లో ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదును పాకిస్థాన్ సమర్థించింది. భారతదేశం హైదరాబాద్ మీద పోలీస్ చర్యకు దిగింది. హైదరాబాద్‌ను ఇండియాలో విలీనం చేసి, అది భారత్ అంతర్భాగం అని భారతదేశం వాదించింది. చివరకు నిజామ్‌నవాబు భద్రతా సమితినుంచి తన కేసును ఉపసంహరించుకోవడం జరిగింది.

**13.3.7 కాశ్మీర్ సమస్య :** తన భూభాగంమీద పాకిస్థాన్ దురాక్రమణ జరిపింది అని భారతదేశం 1948 లో భద్రతాసమితికి ఫిర్యాదు చేసింది. దీనిని పాకిస్థాన్ తిరస్కరించడమే గాక, కాశ్మీర్ భారతదేశంలో అంతర్భాగం కాదు అని భావించింది. భద్రతా సమితి ఇరు పక్షాలను, యుద్ధ విరమణ చేయవలసింది అని కోరింది. అంతేగాక, భారత పాకిస్థాన్‌లకు ఐక్యరాజ్య సమితి ఒక కమీషన్‌ను నియమించింది. యుద్ధ విరమణ జరగవలెననీ, పాకిస్థాన్ తాను ఆక్రమించిన భూభాగం నుంచి వైదొలగాలి, అని ఆ భూభాగాలనూ స్థానికులు ఐక్యరాజ్య సమితి కమీషన్ ఆధ్వర్యంలో పాలించాలి అని ఈ షరతులకు పాకిస్థాన్ అంగీకరిస్తే, భారతదేశం తన సైన్యాలను కాశ్మీర్ నుంచి క్రమ, క్రమంగా ఉపసంహరించాలి అని ఈ కమీషన్ ఇరు పక్షాలకు ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను భారతదేశం ఆమోదించగా, పాకిస్థాన్ తిరస్కరించింది. ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ నియమించిన పర్యవేక్షకుని ఆధ్వర్యంలో కాశ్మీర్‌లో ఎన్నికలు జనవాక్య సేకరణ, నిష్పక్షపాతంగా జరగాలి అని ఈ కమీషన్ ఇరు పక్షాలకు సూచించింది. ఇరుపక్షాలు ఈ సూచనకు అంగీకరించాయి. ఫలితముగా, యుద్ధ విరమణ జరిగింది. జనవాక్య సేకరణ నిర్వాహకునిగా, ఐక్యరాజ్య సమితి అడ్మిరల్ నిమిట్జ్ ను నియమించింది. ఇతడు ఇరు పక్షాల మధ్య రాజకీయ కృషి చేశాడు. కానీ అది ఫలించలేదు.

**13.3.8 బెర్లిన్ దిగ్బంధనము :** పోట్స్ డామ్ ఒప్పందం ప్రకారం బెర్లిన్‌నగరం విభాగాలై, అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, రష్యాల ఆధీనం అయింది. బెర్లిన్ నగరం చుట్టూ ఉన్న భూభాగం రష్యా ఆధీనంలో ఉండటం వల్ల, అమెరికా బ్రిటన్ ఫ్రాన్స్‌లు, తమ బెర్లిన్ భూభాగాలకు, రష్యాభూభాగం గుండా, వెళ్ళవలసి వచ్చింది. 1948 లో ఏర్పడిన వివాదం మూలంగా రష్యా బెర్లిన్‌నగరానికి, పాశ్చాత్య రాజ్యాల రాకపోకల మీదా ఆంక్షలు విధించింది. దీనితో అవి భద్రతా సమితికి ఫిర్యాదు చేసినాయి. చర్చల్లో పాల్గొనడానికి, రష్యా నిరాకరించింది. భద్రతా సమితి ఇరుపక్షాలకు తృప్తి పరంగా సమస్యను పరిష్కరించలేక పోయింది. చివరకు ఈ నాలుగు రాజ్యాలే ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి.

**13.3.9 కొరియా సమస్య :** రెండో ప్రపంచ యుద్ధానంతరం కొరియా ఉత్తర కొరియా, దక్షిణకొరియా అని రెండు రాజ్యాలు అయినాయి రెండు రాజ్యాలకు 38 అక్షాంశరేఖ సరిహద్దుగా నిర్ణయమైంది ఉత్తరకొరియా రష్యా ప్రాబల్యం క్రింద, దక్షిణకొరియా అమెరికా ప్రాబల్యం క్రింద ఏర్పడినాయి. రెండు కొరియాలను విలీనం చేయాలి అని ప్రయత్నాలు సాగినాయి అవి ఫలించలేదు. 1947లో దక్షిణ కొరియాలో ఐక్యరాజ్య సమితి పరిశీలన సంఘం అధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. సింగ్మన్‌రీ అధ్యక్షుడు ఎన్నికైనాడు. సియోల్ నగరం దాని రాజధాని. ఈ సంవత్సరంలోనే దక్షిణకొరియా, ఐక్యరాజ్య సమితిలో సభ్యత్వాన్ని పొందింది. ఈ లోగా, రష్యా ప్రోత్సాహంతో ఉత్తరకొరియాలో ప్రజాస్వామ్య ప్రజా రిపబ్లిక్ ఏర్పడింది. రెండు దేశాల మధ్య 1949 - 50 నాటికి స్పర్థలు అధికమైనాయి 1950 లో ఉత్తర కొరియా సైన్యాలు 38 వ అక్షాంశరేఖను దాటి దక్షిణకొరియాలో ప్రవేశించాయి. అమెరికా కోరికమీద భద్రతా సమితి కొరియా సమస్యమీద చర్చలు సాగించింది. ఈ చర్చల్లో రష్యా యుగోస్లావియాలు పాల్గొనడానికి, తిరస్కరించాయి. మిగిలిన 9 మంది భద్రతా సమితి రాజ్యాల ప్రతినిధుల్లు ఉత్తర కొరియాను దురాక్రమణ దారునిగా ప్రకటించి, యుద్ధాన్ని నిలుపు చేయవలసింది అని ఉత్తర కొరియాను, ఆదేశించారు. అంతేగాక, ఈ ప్రతిపాదనను, అమలు చేయడానికి, ఐక్యరాజ్య సమితిలోని సభ్యదేశాలు అన్నీ పూర్తిగా సహకరించాలి అని ఉత్తరకొరియాకు ఎట్లాంటి

సహాయాన్ని, అందించరాదు అని కూడా వారు స్పష్టం చేశారు. తరువాత జరిగిన భద్రతా సమితి సమావేశం ఐక్యరాజ్య సమితి సభ్యదేశాలు అన్ని దక్షిణ కొరియా రక్షణకు సైన్యాలను పంపవలసింది అని తీర్మానించింది. అమెరికాతో పాటు 16 రాజ్యాలు దక్షిణ కొరియాకు సైనిక సహాయం అందజేసినాయి. మెకార్థర్ సేనాని ఈ ఐక్యరాజ్యసమితి సేనలకు నాయకత్వం వహించాడు. 1950 లో సాధారణ సభ కొరియాలో సుస్థిర శాంతి భద్రతలను నెలకొల్పవలెనని రెండు దేశాల విలీనీకరణకు ఎన్నికలు జరపవలెను అనే తీర్మానాన్ని ఆమోదించింది. కొరియా విలీనీకరణ. పునరావాస కల్పనకు ఐక్యరాజ్య సమితి ఒక సంఘాన్ని నియమించింది. కాని ఉత్తర కొరియాకు సహాయంగా కమ్యూనిస్టు చైనా దక్షిణ కొరియా మీద దాడిచేయడంతో పరిస్థితి తారుమారు అయింది. అనాటికి కమ్యూనిస్టు చైనా ఐక్యరాజ్య సమితి సభ్య దేశం కాకపోయినా దానిని దురాక్రమణ దారుణిగా ప్రకటించింది. మూడు సంవత్సరాల యుద్ధానంతరం యుద్ధవిరమణ సంధి కుదిరింది. కానీ యుద్ధ ఖైదీల మార్పిడి సమస్యమీదా తిరిగి వివాదం తలెత్తింది.

**13.3.10 హంగరి సమస్య :** హంగరి దేశంలోని ప్రజలు తమ ప్రభుత్వంమీద 1956 లో తిరుగుబాటు లేవదీశారు. హంగరి ప్రజావిప్లవాన్ని అణచడానికి రష్యా సేనలు హంగరీలో ప్రవేశించాయి. ఫ్రాన్స్ బ్రిటన్ అమెరికాలు హంగరీలో రష్యా, జోక్యాన్ని సమితి దృష్టికి తెచ్చినాయి. హంగరి సమస్య ఆ దేశపు అంతరంగిక వ్యవహారం అని రష్యా సమితితో వాదించి బ్రిటన్, అమెరికాల తీర్మానాన్ని 'వీటో' చేసింది. దీనితో సాధారణ సభ అత్యవసర సమావేశానికీ, హంగరీ సమస్యను నివేదించడం జరిగింది. రష్యా సైన్యాలను హంగరీనుంచి ఉపసంహరించవలసిందీ అని హంగరీ ప్రజలకు స్వపరిపాలన హక్కు ఉన్నది అనే పరిస్థితిని పరిశీలించవలసిందని సెక్రటరీ జనరల్‌ను కోరుతూ సాధారణ సభ తీర్మానించింది. కానీ హంగరీ, రష్యాలు ఈ ఆదేశాలను పాటించలేదు.

**13.3. 11 సూయజ్ కాలువ సమస్య :** ఈజిప్టు అధ్యక్షుడైన నాజర్ 1956 లో సూయజ్‌కాలువను, జాతీయం చేశాడు. నాజర్‌తో సంప్రదింపులు విఫలం కావడంతో సూయజ్ సమస్యను ఫ్రాన్స్, బ్రిటన్‌లు భద్రతా సమితి దృష్టికి తెచ్చినాయి. ఈ లోగ ఈజిప్టుమీద ఇజ్రాయిల్ దాడి చేసింది. దీనిని అవకాశంగా తీసుకొని బ్రిటన్, ఫ్రాన్స్‌లు కూడా ఈజిప్టుమీద దండెత్తినాయి. సాధారణ సభ అత్యవసర సమావేశం జరిపి వెంటనే కాల్పులను విరమించవలసిందని ఆదేశించింది. ఐక్యరాజ్య సమితి అత్యవసర సైన్యం 10 దేశాల సైన్యంతో ఏర్పాటు అయింది. ఈ సైన్యం యుద్ధ ప్రజ్వలనను అరికట్టింది.

**13.3.12 కాంగో వివాదము:** కాంగో మధ్య ఆఫ్రికాలోని సహజవనరులు అధికంగా ఉన్న సంపన్న దేశం. ఇది బెల్జియమ్ వలస రాజ్యంగా ఉండేది. 1960 జూన్ లో బెల్జియం ఈ దేశానికి స్వాతంత్ర్యం ఇచ్చింది. స్వతంత్ర్య కాంగో స్థాపన కాలంలో దేశం అంతటా అల్లర్లు చెలరేగినాయి. కాంగోకు తముంబా ప్రధాని అయినాడు. కటంగా రాష్ట్రము కాంగోనుంచి విడిపోయి స్వతంత్రించింది. దానికి ప్రధాని షోంబేను బెల్జియమ్ సమర్థించింది. కాంగో జాతీయ ప్రభుత్వానికీ, కటంగా రాష్ట్రానికీ పోరు ఆరంభమైయింది. దీనిని నివారించడానికి ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్‌గా డాగ్‌హామర్ షెల్డ్ భద్రతా మండలి అత్యవసర సమావేశం జరిపించి. ఐక్యరాజ్య సమితి సైన్యాన్ని కాంగోకు పంపడానికీ అధికారాన్ని పొందాడు. ఈ సైన్యంలో నానాదేశ సైన్యంతో పాటు 29 రాజ్యాల సేనలను కాంగోకు పంపడం జరిగింది. ఈ సైన్యము కాంగో అంతర్‌యుద్ధాన్ని నిలుపు చేయగలిగింది. ఈ విధంగా ఐక్యరాజ్య సమితి కాంగోను, అరాచకము, అంతర్‌యుద్ధము, రాజకీయ అశాంతి, అస్తవ్యస్త పరిస్థితులనుంచి కాపాడింది. కాంగో వివాద కాలంలోనే డాగ్ హామర్‌షెల్డ్ విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. ఇంతేగాక ట్రిస్టీ సమస్య. క్యూబా సంక్షోభము, మలేషియా, ఇండోనేషియాల వివాదము మొదలయిన వివాదాలన్నిటినీ ఐక్యరాజ్య సమితి పరిష్కరించింది. రెండో ప్రపంచ యుద్ధం అంతమైన నాటినుంచి ఇంచుమించు ప్రతిరోజూ ప్రపంచంలో ఎక్కడో ఓ చోట చెదురు ముదురుగా యుద్ధం జరుగుతూనే ఉంది. కాని యుద్ధాలేవి మూడో ప్రపంచ యుద్ధానికి దారితీయలేదు. ఇది ఐక్యరాజ్య సమితి ఘనవిజయానికి తార్కాణం. ఈ సంస్థ ఏర్పడిన నాటినుంచి క్రమక్రమంగా దీని సభ్యత్వం పెరుగుతూనే వచ్చింది. దీనిని బట్టి ప్రపంచ దేశాలు అన్ని సుస్థిర శాంతినే వాంచిస్తున్నాయి అని స్పష్టమవుతుంది. సాధారణ సభ యధార్థ ప్రపంచానికి ప్రతిబింబంగా నిలచి ఉంది. దీనిలో అన్ని సభ్య దేశాలు పాల్గొనడం జరుగుతుంది. ఇది మానవాళి కంతటికీ పార్లమెంట్‌గా ప్రగతి పథంలో పయనిస్తుంది. ఐక్యరాజ్య సమితి ఏర్పడిన నాటి నుంచి అగ్రస్థానవర్తు సమర్థులు, నిష్పాక్షికులు, నిజాయితీ పరులైన సెక్రటరీ జనరల్స్ లభించారు.

## 13.4. ఐ. రా. స కృషి - ఆర్థిక, సాంస్కృతిక, విద్యారంగాలు :

రాజకీయ పరమైన కృషేగాక ఐక్యరాజ్య సమితి ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక విద్యారంగాల్లో కూడా ఎనలేని సేవచేస్తుంది.

**13.4.1 ఆర్థిక అభివృద్ధి :** ఐక్యరాజ్య సమితి అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రపంచమంతట దాదాపు, 4 వేల ప్రాజెక్టులకు ద్రవ్య సహాయం చేస్తుంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి ద్వారా, ఇతర ఆర్థిక సంస్థలద్వారా, వెనుకబడిన దేశాల, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం. అవసరమైన ఆర్థిక సహాయాన్ని సాంకేతిక సహాయాన్ని అందిస్తుంది. ప్రపంచంలోని వివిధ దేశాలమధ్య వాణిజ్యాన్ని అభివృద్ధి పరచుటకు, ఐక్యరాజ్య సమితి సహాయ సహకారాలనూ అందించగలుగుత్నుది. ముఖ్యంగా వెనుకబడిన దేశాల ఆర్థికాభివృద్ధికీ, వాణిజ్యాభివృద్ధికి సహాయంచేయడం ద్వారా వివిధ దేశాలమధ్య ఆర్థిక సహకారాన్ని ఐక్యరాజ్య సమితి ప్రోత్సహిస్తుంది. విద్యుత్ ఉత్పత్తి, రైలు, రోడ్లు, నౌకా. విమానయానాలు, చమురు గొట్టాలు, టెలిఫోన్, టెలికాస్ట్, రేడియో మొదలయినవి అభివృద్ధి కార్యక్రమాలని అమలు చేయడానికి, వివిధ దేశాలకు ఋణాలు ఇచ్చింది.

**13.4.2 సామాజిక అభివృద్ధి :** ఐక్యరాజ్య సమితి అన్ని దేశాలలోనూ పిల్లలకు పెద్దలకు, వైద్య ఆహార సదుపాయాలు కల్పించి, వారి సాంఘీక భద్రతకు అనేక విధాల కృషి చేస్తుంది. పురుషుల స్థాయికి, స్త్రీలు పెరుగుట, ప్రత్యేక సంస్థలద్వారా వారి అభివృద్ధికి సమితి అనేక పధకాల ద్వారా పాటుపడుతుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ రోగ నివారణకుగానూ సాంకేతిక నిపుణుల సలహాలను అందజేయడం వైద్య రంగంలో పరిశోధనలు జరపడం మందులను సరఫరా చేయడంలో నిమగ్నమై ఉంటుంది. ప్రపంచంలో, సుమారు 2 కోట్ల శిశువుల సహాయార్థం ఆహారము, పాలు, మందులు, అందజేస్తున్నది. మాతా శిశు సంరక్షణాలయాలలోను. పనిచేయడానికి, నర్సులకు, మంత్రసానులకు తగిన శిక్షణ కూడా ఇస్తుంది. అంతర్జాతీయ కార్మిక సంస్థద్వారా, ఉద్యోగ వసరుల కల్పనకు, జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి, కార్మిక శిక్షణ కేంద్రాలను ఏర్పాటుకు కనీస వేతనాల కొరకు, కృషి జరుగుతున్నది. కార్మిక యాజమాన్యాల మధ్య సహకారాన్ని వృద్ధి చేయడానికి ఈ సంస్థ కృషి చేస్తుంది. అంతర్జాతీయ కార్మిక సంఘం వివిధ దేశాలలో వృత్తి సంబంధం సాంకేతిక శిక్షణ కార్యాలయాలను ఏర్పాటు చేసింది. ప్రపంచ ఆరోగ్య పరిశుభ్రతా రంగాల్లో ప్రపంచ ఆరోగ్య సంఘం నిర్వహించిన పాత్ర కొనియాడదగింది. ఈజిప్టులో కలరా వ్యాధి ప్రబలినపుడు ఈ సంఘం దానిని ఎదుర్కొని నివారించగలిగింది. మొరాకోలో కల్తీ నూనె వాడిన కారణంగా వేలాది ప్రజలు పక్షవాతానికి గురి అయినప్పుడు ఈ సంఘం అపార సేవ చేసింది. మొరాకోలో భూకంపం సంభవించినప్పుడు, బాధితులందరికి, సహాయ కార్యక్రమాలను అందజేసింది. బారత దేశం కూడా, ప్రపంచ ఆరోగ్య సంఘంనుండి ఎంతో సహాయాన్ని పొందింది. అధిక ఆహార ఉత్పత్తులను సాధించడానికి. క్రిమికీటకాదులనుంచి పరిరక్షించడానికి, మత్స్యాలు, అడవుల నుంచి ఎక్కువ రాబడిని సంపాదించడానికి ఆహార, వ్యవసాయ సంఘం వివిధ దేశాలకు సాంకేతిక సహాయాన్ని అందజేస్తుంది. ఈ సంఘం చేసిన కృషి ఫలితముగా ఎన్నో కొత్త రకపు వ్యవసాయ వంగడాలను ప్రవేశ పెట్టడం జరిగింది. ఏటివల్ల ఆహార ఉత్పత్తి జరుగుతున్నది. ప్రపంచ మానవాళిని ఆకలి బాధనుంచి రక్షించడానికి, ఈ సంఘం క్షుద్బాధా విమోచన ఉద్యమాన్ని కొనసాగిస్తున్నది.

**13.4.3 విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక అభివృద్ధి :** ప్రపంచ రాజ్యాలమధ్య విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక రంగాల్లో అభివృద్ధిని సాధించి వివిధ దేశాలమధ్య సహకారాన్ని పెంపొందించి ప్రపంచ శాంతి భద్రతలు చేకూర్చడానికి ఐక్యరాజ్య సమితి కృషి చేస్తున్నది. సామూహిక ప్రచార సాధనాల ద్వారా వివిధ ప్రాంతాల ప్రజలమధ్య విజ్ఞానాన్ని పెంపొందించడానికి, ప్రయత్నిస్తుంది. ప్రజలను అక్షరాస్యులను చేసి వారిలో సంస్కృతిని పెంపొందించడానికీ, కృషి చేస్తుంది. శాస్త్రీయ పరిశోధనలకు ప్రోత్సాహం కల్పించడానికి శాస్త్ర విజ్ఞానాన్ని సేకరించి దానిని వివిధ దేశాలకు అందజేస్తుంది. జాతి విచక్షణా విధానాన్ని, రూపుమాపటానికీ ప్రయత్నిస్తుంది. కళాకారులు, తత్వవేత్తలు మొ॥ వారి మధ్య సంబంధాలు నెలకొల్పడానికి ఈ సంస్థ కృషి చేస్తుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు కావలసిన సాంకేతిక సహాయాన్ని ఈ సంస్థ అందిస్తుంది. పురావస్తు సబంధమైన ప్రదేశాలను జాతీయ శిల్ప సంపదను పురాతన వ్రాత పద్దతులను భద్రపరచడానికి యునెస్కో కృషి చేస్తుంది. నిరక్షరాస్యత నిర్మూలనకు కూడా ప్రయత్నిస్తుంది.

6

**13.4.4 మానవ హక్కుల పరిరక్షణ :** ప్రపంచ రాజ్యాలలోని ప్రతి వ్యక్తికి ప్రాథమిక స్వేచ్ఛ ఉండవలెను అను విషయానికి ఐక్యరాజ్య సమితి ప్రాధాన్యత ఇచ్చింది. ఐక్యరాజ్య సమితి 1946 లో మానవ హక్కుల పత్రాన్ని ఆమోదించింది. స్త్రీ పురుష భేదం లేకుండా ప్రపంచంలోని మానవులందరూ ఈ హక్కులను అనుభవించేటట్లు సమితి కృషి చేస్తుంది. సర్వ ప్రతినిధి సభ 1968 సం॥రా మానవ హక్కులన్ని అంతర్జాతీయ సంవత్సరంగా ప్రకటించింది. ప్రతి సంవత్సరం డిశంబర్ 10 న మానవ హక్కుల దినంగా కూడా ప్రకటించడం జరిగింది. ప్రపంచ వ్యాప్తంగా మానవ హక్కుల పరిరక్షణకు 1961 లో లండన్‌లో ఒక సంస్థను నెలకొల్పడం జరిగింది.

ఈ విధముగా ఐక్యరాజ్య సమితి రాజకీయ రంగంలో కంటే రాజకీయేతర రంగంలో గొప్ప అభివృద్ధి సాధించి ప్రపంచ శాంతికి పరోక్షంగా కృషి చేయుచున్నది.

## 13.5. ఐక్యరాజ్య సమితి వైఫల్యము :

1945 లో శాన్ ఫ్రాన్సిస్కో సమావేశంలో ఐక్యరాజ్య సమితి ఆవిర్భవించినప్పుడు దానిలో 51 సభ్య దేశాలు ఉన్నాయి. ఈ సంఖ్య క్రమ క్రమంగా పెరిగి 1976 నాటికి 145 దేశాలకు ఐక్యరాజ్య సమితి లో సభ్యత్వం ఉన్నది. ఇది నిజంగా ఈ సంస్థ లక్ష్య సాధనలో ఒక మైలురాయిగా పేర్కొనవచ్చు. కాని మొదటి ప్రపంచ యుద్ధానంతరం జరిగిన వర్సే సంధి విషయంలో వలెనే రెండో ప్రపంచ యుద్ధం తరువాత కూడా ఓడిపోయిన రాజ్యాలపట్ల విజేత రాజ్యాల వైఖరిలో మార్పు ఏమి లేదు. సైనికంగానూ, ఆర్థికంగానూ బలహీనంగా ఉన్న చిన్న రాజ్యాలు పెద్ద రాజ్యాలు కూడా ఐక్యరాజ్య సమితిని అగ్ర రాజ్యాల చేతిలో కీలు బొమ్మగా భావిస్తున్నాయి. ఐక్యరాజ్య సమితి చరిత్ర కూడా కొంతవరకు ఈ అనుమానానికి నిదర్శనంగానే ఉంది. ఈనాటి ప్రపంచ రాజ్యాలు మూడు కూటములుగా విభాగమైనాయి. అవి అమెరికా ఆధ్వర్యంలో గల పాశ్చాత్య రాజ్యాలు, రష్యా నాయకత్వంలోని సోషలిస్ట్ రాజ్యాలు ఆఫ్రో - ఆసియన్ దేశాల నాయకత్వంలోని తటస్థ రాజ్యాలు. ఈ మూడో కూటమిని తమ వైపు తిప్పుకొనేందుకు మొదటి రెండు కూటములు ప్రయత్నం చేస్తున్నాయి. ఆఫ్రో - ఆసియన్ కూటమి రాజ్యాలు తమ స్థానాలను రక్షించుకోటానికి మాత్రమే గాక ఐక్యరాజ్య సమితి లో సభ్యత్వం విని రాజ్యాలకు సభ్యత్వం ఇప్పించడానికి కూడా ప్రయత్నిస్తున్నాయి. అందువల్ల పాశ్చాత్య సోషలిస్టు కూటములతో పాటు ఆఫ్రో - ఆసియన్ కూటమి ప్రాముఖ్యం కూడా పెరుగుతూ ఉన్నది. ఈ విధముగా ప్రపంచ శాంతిభద్రతల పరిరక్షణనే లక్ష్యంగా గల ఐక్యరాజ్య సమితి నేడు తుల్య, ప్రాబల్య రాజకీయలకు నిలయం అయింది.

అగ్ర రాజ్యాలకు భద్రతా సమితిలో గల 'వీటో' హక్కు తాము చేసే అకృత్యాలను కప్పిపుచ్చుకోడానికి, కవచం వలె ఉపయోగపడుతుంది. ఈ హక్కు ఉపయోగపడుతుంది. ఫలితంగా భద్రతా సమితి చర్యలను నిర్ణయాలను ఏ సమయంలోనైనా తిరస్కరించవచ్చు. అంతేగాక అగ్ర రాజ్యానికి మిత్ర రాజ్యం అయినా ఏ రాజ్యం అయినా కూడా భద్రతా సమితి నిర్ణయాలను నిష్ఫలం చేయవచ్చు. ఈ పరోక్ష హక్కును న్యాయాన్ని సాధించే లక్ష్యంతోగాక, అవసరం నిమిత్తం వాడుకోవడం జరుగుతున్నది. ఇటీవల బాంగ్లాదేశ్‌కు ఐక్యరాజ్య సమితి లో సభ్యత్వాన్ని వ్యతిరేకిస్తూ పాకిస్తాన్ తన మిత్ర రాజ్యమైన చైనాచే 'వీటో' ను ప్రయోగింపజేస్తాను. అని బెదిరించింది. చైనా వీటో కూడా చేసింది. అమెరికా రష్యాల వంటి అగ్ర రాజ్యాలు ఈ వీటో హక్కును తరచుగా ప్రయోగించడం వల్ల రాను రాను భద్రతా సమితి ప్రతిష్ఠ దెబ్బతిన్నది.

ఈ వ్యవస్థలోని మరొక ముఖ్యలోపం దురాక్రమణ దేశంమీద సైనిక చర్య తీసుకోవలెననే సూత్రం చిన్న రాజ్యాలకు మాత్రమే వర్తించడం. అగ్ర రాజ్యాలు చేసే తప్పిదాలనూ ఈ వ్యవస్థ ఖండించకపోగా, చిన్న రాజ్యాలమీదా చర్యలను తీసుకొంటున్నది. సూయజ్ కాలువ విషయంలో ఈజిప్టుమీద బ్రిటన్, ఫ్రాన్స్‌లు దండెత్తినప్పుడు. హంగిరిలో రష్యా సైనిక జోక్యం చేసుకొన్నప్పుడు ఐక్యరాజ్య సమితి ఏమి చేయలేకపోయింది. ఐక్యరాజ్య సమితి లోని వివిధ దేశాలకూ విభిన్న దృక్పథాలు సిద్ధాంతాలు ధోరణులు ఉన్నాయి. 5 అగ్ర రాజ్యాల మధ్య చాలా కాలంగా అసూయ ద్వేషాలు సిద్ధాంతపరమైన భేదాలు ఉన్నాయి. వీటిని సాధారణ సభ భద్రతా సమితి సమావేశాలలో చూడవచ్చు. ముఖ్యంగా రష్యా, బ్రిటన్‌ల మధ్య రష్యా, అమెరికాల మధ్య ఆర్థిక రాజకీయ భేదాలు విపరీతంగా ఉన్నాయి.

ఐక్యరాజ్య సమితి వైఫల్యాలలో ప్రధానమైనది అది నిరాయుధీకరణను సాధించలేకపోవడం, నేడు మానవాళి భవిష్యత్ అంతా ప్రపంచ నిరాయుధీకరణమీద ఆధారపడి ఉన్నది. దీనికి ముఖ్య కారణం మనం అణు యుగంలో ఉండటమే. అగ్రరాజ్యాలు అన్ని పైకి నిరాయుధీకరణ అవసరాన్ని గురించి ప్రస్తావిస్తున్నా నిజానికి అవి ఆయుధాలను అధికం చేసుకుంటున్నాయి.

అంతేగాక శాంతి మండలాలుగా ఉండవలసిన సముద్రాలమీదా కూడా తమ ఆధిపత్యాన్ని నిలుపుకోడానికి పెంపొందించుకోవడానికి, ఎన్నో స్థావరాలను ఏర్పరచుకుంటున్నాయి. హిందూ మహాసముద్ర ప్రాంతాన్ని శాంతి మండలంగా కొనసాగించాలి అని ఆ ప్రాంతంలోని దేశాలు అన్నీ కోరుకొంటున్నా అమెరికా, ఆ సముద్రంలో శక్తివంతమైన నౌకా స్థావరాన్ని స్థాపించింది.

ఐక్యరాజ్య సమితి లోని మరో లోపం ప్రపంచంలో నేటికి వృద్ధి చెందుతున్న జాతి విచక్షణా విధానాన్ని నిర్మూలించలేకపోవడం. ఐక్యరాజ్య సమితి ఒడంబడిక పత్రంలోని ముఖ్య సూత్రం ప్రపంచంలోని మానవులందరికీ, జాతి, మత, భాషా, విచక్షణ లేకుండా మానవ హక్కులను ప్రాథమిక సూత్రాలను, లభించేటట్లు చూడటమే కాని ఈ సూత్రాన్ని తన బలహీనతవల్ల అమలుచేయలేక పోతుంది. నేటికి, దక్షిణ ఆఫ్రికాలో జాతి విచక్షణా విధానం పూర్తిగా అమలు జరుగుచున్నది. సమితిలోని ఆఫ్రో - ఆసియా దేశాలు ఈ సమస్యను ఎన్నోసార్లు, సాధారణ సభ దృష్టికి తీసుకొని వచ్చిన, దక్షిణ ఆఫ్రికా మొండివైఖరివల్ల ఫలితం లేకపోయింది. దక్షిణ ఆఫ్రికాకు, అగ్రరాజ్యాల పరోక్ష అండదండలు ఉండటం దురదృష్టం, అలాగే రొడీషియో ప్రభుత్వం కూడా దేశంలోని అత్యధిక సంఖ్యాకులైన ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా పరిపాలన కొనసాగిస్తుంది. ఆ ప్రభుత్వ నాయకుడైన స్మిత్ ప్రజల అభిమతాన్ని గాని, ఐక్యరాజ్య సమితి తీర్మానాలను గానీ, ఖాతరు చేయడంలేదు. సమితి, రొడీషియామీద ఆర్థిక ఆంక్షలను విధించినా ఫలితం శూన్యం అయింది. దీనికి కారణం పరోక్షంగా బ్రిటన్ రొడీషియాకు సహాయం చేయడమే. దీనికి తోడు ఆఫ్రికా ఖండంలో పాశ్చాత్య రాజ్యాల వలస సామ్రాజ్య తత్వం నేటికీ కొనసాగుతూనే ఉంది. ముఖ్యంగా పోర్చుగల్ అంగోల మొజాంబిక్ వంటి దేశాలకు స్వాతంత్ర్యం ఇవ్వడానికి, నేటికి అంగీకరించడంలేదు.

నిన్న మొన్నటివరకు ప్రపంచంలో అత్యధిక జనాభా ఉన్న కమ్యూనిస్ట్ చైనాకు ఐక్యరాజ్య సమితి లో స్థానం కల్పించడం జరుగలేదు. దీనికి కారణం అమెరికా దృష్టిలో అది దురాక్రమణదారుడు కావడమే. సుమారు 70కోట్ల మంది ఉన్న జనాభాని ఐక్యరాజ్య సమితి నుంచి వెలివేయడంవల్ల ఆ వ్యవస్థ బలహీనమయింది. ఈనాడు కమ్యూనిస్ట్ చైనాకూడా. ఐక్యరాజ్య సమితి సభ్యత్వం లభించడం వల్ల ఐక్యరాజ్య సమితి పూర్ణ వ్యవస్థ అయింది అని చెప్పవచ్చు. కమ్యూనిస్ట్ చైనా ఐక్యరాజ్య సమితిలో స్థానాన్ని పొందాక పూర్వం అది ప్రపంచంలోని బడుగు దేశాలకు, దళిత రాజ్యాలకు నాయకత్వం వహించి అగ్రరాజ్యాలను తీవ్రంగా విమర్శిస్తూ ఉండేది. కాని ఐక్యరాజ్య సమితి సభ్యత్వం పొందిన తరువాత కమ్యూనిస్ట్ చైనా కూడా ఇతర అగ్రరాజ్యాల వైఖరిని అనుసరించడం దురదృష్టకరం.

ప్రపంచంలో నేటికి అపరిష్కృత సమస్యలు ఎన్నో ఉన్నాయి. సాధారణ సభ భద్రతా సమితులు అవిరళ కృషి జరిపినా, వీటిని పరిష్కరించలేకపోయాయి. ఇంకా ఇవి తమ ప్రయత్నాలను కొనసాగిస్తూనే ఉన్నాయి. ఇందులో ప్రధానమైనవి. 1. వియత్నామ్ సమస్య 2. మధ్యప్రాచ్యసమస్య 3. కాశ్మీర్ సమస్య 4. లావోస్ సమస్య.

రెండో ప్రపంచ యుద్ధానంతరం వియత్నామ్ ఉత్తర వియత్నామ్, దక్షిణ వియత్నామ్ అనే రెండు రాజ్యాలుగా విడిపోయింది. ఉత్తర వియత్నాం కమ్యూనిస్టుల ప్రాబల్యంలోనూ, దక్షిణ వియత్నాం అమెరికన్ల ప్రాబల్యంలోనూ ఉంటూ వచ్చాయి. వియత్నామ్ అగ్రరాజ్యాల ప్రచ్ఛన్న యుద్ధానికి రంగస్థలం అయింది. అక్కడ ప్రజలు ఎన్నో బాధలకు గురి అయినారు.

అరబ్‌దేశాలకూ, ఇజ్రాయిల్‌కు మధ్యగల వైరం మధ్య పాశ్చాత్యంలో శాశ్వతమైన సమస్య అయింది. ఇజ్రాయెల్‌ను అమెరికా, అతి శక్తి వంతమైన సైనిక దేశంగా రూపొందించింది. అరబ్బులు యూదుల నివాస స్థావరం అయిన ఇజ్రాయిల్ స్థాపనకు మొదటినుంచి వ్యతిరేకతను చూపిస్తూనే వచ్చినారు. వీరికి రష్యా అండదండలు సానుభూతి లభించినాయి. అరబ్బులకు, ఇజ్రాయెల్‌కు మధ్య జరిగిన యుద్ధాల్లో, అరబ్బు భూభాగాలను ఆక్రమించింది. ఐక్యరాజ్య సమితి ఆ భూభాగాలనుంచి ఇజ్రాయెల్‌ను వైదొలగించవలెనని విఫలయత్నం

చేసింది. అరబ్ దేశాలకు ఇజ్రాయెల్‌కు మధ్య ఉభయులకు ఆమోద యోగ్యమైన, పరిష్కారం లభించకపోతే మధ్య ప్రాంతం అంతర్జాతీయ శాంతి భద్రతలకు భంగకరంగానే ఉంటుంది.

కాశ్మీర్ విషయంలో పాకిస్తాన్ భారతదేశంపట్ల వైరభావాన్ని పెంచుకుంటూనే వచ్చింది. దీని ఫలితంగా రెండు దేశాలమధ్య మూడుసార్లు యుద్ధాలు జరిగాయి. ఈ సమస్యకు నేటికి పరిష్కారం లభించలేదు. కాశ్మీర్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేవరకు ఉపఖండంలో సుస్థిర శాంతి లేదు. అలాగే లావోస్‌లో కూడా అంతర్యుద్ధం అగ్రరాజ్యాల స్పర్ధల ఫలితంగా, జరుగుతూనే ఉంది.

ఐక్యరాజ్య సమితి సైనిక ఒప్పందాలకు వ్యతిరేకి. రెండో ప్రపంచయుద్ధానంతరం అగ్రరాజ్యాల స్పర్ధల మూలంగా అనేక సైనిక ఒప్పందాలను చేసుకున్నాయి. వాటిలో ప్రధానమైనవి ఉత్తర అట్లాంటిక్ సంధి వ్యవస్థ ఇది 14 పాశ్చాత్య రాజ్యాల సైనిక కూటమి. రష్యా బెడదనుంచి సంరక్షించుకోడానికి అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్ వంటి పాశ్చాత్య రాజ్యాలు ఈ వ్యవస్థను ఏర్పరుచుకున్నాయి. అట్లే దీనికి వ్యతిరేకంగా రష్యా తన మిత్ర రాజ్యాలలో వార్సా కూటమి ఏర్పరచింది. ఇవిగాక ఆగ్నేయాసియా రక్షణ వ్యవస్థ, బాగ్దాద్ ఒడంబడిక, వంటి ప్రాంతీయ రక్షణ ఒడంబడికలు కూడా ఉన్నాయి. ఈ విధముగా ప్రపంచ రాజ్యాలు కూటములను ఏర్పరుచుకున్నాయి. దీని ఫలితముగా ప్రపంచంలో సైనిక ఘర్షణ ఏర్పడి ప్రపంచ శాంతికి భంగమేర్పడుతుంది. ఈ కూటములు ఏర్పడకుండా ఐక్యరాజ్య సమితి ఏమీ చేయలేకపోయింది.

ఐక్యరాజ్య సమితి పై సందర్భాలలో విఫలమైనా, మానవాళి దాని సామర్థ్యంలో ఇంకా విశ్వాసాన్ని కోల్పోలేదు. 1954 సాధారణ అధ్యక్ష స్థానం నుంచి విరమిస్తున్నపుడు శ్రీమతి విజయలక్ష్మి పండిట్ చెప్పిన మాటలు గమనార్హము. " యంత్రాంగము ఉపయోగపడవలనంటే అది నడుస్తూ ఉండవలెను. అది పనిచేయకపోయినట్లయితే నశించిపోతుంది." అట్లా ఐక్యరాజ్య సమితి లో లోపాలున్నప్పటికీ, అది కృషి జరుపుతూనే ఉండవలెను. ఆ లోపాలు సవరించడానికి ప్రయత్నాలు జరపవలెను.

ఐక్యరాజ్య సమితి వైఫల్యము. " శాంతికి వైఫల్యము, నాశనానికి విజయము " అని ట్రిగ్వేలీ అభిప్రాయపడ్డాడు. ఐక్యరాజ్య సమితి శాశ్వత సంక్షోభానికి గురి అయినది అని ఉథాంట్ హెచ్చరించాడు. దాని అధికారము అనిశ్చితమైనది. శాంతి భద్రతలు నిర్వహించే దాని శక్తి అగ్రరాజ్యాల మధ్యగా పరస్పర స్పర్ధల మూలంగా నిష్ఫలమౌతున్నది. సాధారణ సభ ఇంచుమించు ఒక చర్చా వేదికగా మారింది. ఈ పరిస్థితినుంచి ఐక్యరాజ్య సమితిని కాపాడటానికి, దానిని శక్తివంతం చేయడానికి కొన్ని సూచనలు చేయడం జరిగింది. ఇందులో మొదటి సభ్య దేశాలు ఐక్యరాజ్య సమితికి విశ్వాస పాత్రులై తమతమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించవలె. రెండోది ఐక్యరాజ్య సమితి ఒడంబడిక పత్రానికి కాలదోషం పట్టింది. ఆనాడు ఈ పత్రాన్ని విభిన్న సిద్ధాంత బేధాలు ఉన్న దేశాలు - ముఖ్యంగా మిత్రరాజ్యాలు, అక్షరాజ్యాలకు వ్యతిరేకంగా, తయారు చేసినాయి. కాని ఈనాటి పరిస్థితి వేరు. మిత్రరాజ్యాలు శత్రురాజ్యాలుగానూ, శత్రురాజ్యాలు మిత్ర రాజ్యాలుగానూ మారాయి. అందువల్ల ఐక్యరాజ్య సమితి పత్రాన్ని సవరించవలసిన అవసరము ఈనాడు ఎంతగానో ఉంది. ఐక్యరాజ్య సమితి సూత్రాలకు అగ్రరాజ్యాలకు ఉన్న వీటో హక్కును తీసివేసి, దీనివల్ల శాంతియుత పరిష్కారమునకు అవకాశం ఏర్పడి సాధారణ సభ భారం తగ్గుతుంది. ఐక్యరాజ్య సమితి ప్రస్తుత యంత్రాంగాన్ని విస్తృతం చేయవలె. ఉదాహరణకు ఐక్యరాజ్య సమితి అంగాల్లో నిరాయుధీకరణను కూడా చేర్చవలెను. విశ్వాంతరంలో ఐక్యరాజ్య సమితికి మాత్రమే అధికారాలు ఉండవలె. సభ్యదేశాలకు ఉండరాదు. అట్లే సముద్రాలమీద కూడా ఐక్యరాజ్య సమితి కి సొంతంగా రాబడివచ్చే మార్గము ఉండవలెను. ప్రపంచ న్యాయస్థానానికి కనీసం కొన్ని రంగాల్లోనైనా దాని నిర్ణయాలు అమలు జరిపేటట్లు చూడవలె. సార్వత్రిక మానవ ప్రపంచం అంతా శాంతి సాధనలక్ష్యంతోనే పురోగమించాలి. పై చర్యలను అమలు పరచి ప్రపంచ శాంతి సుస్థిరం చేయవలెను. మానవుడు ఆశాజీవి. ప్రపంచ భవితవ్యం పట్ల అపార ఆశలు కల్పించుకున్నాడు. వీటిని సాధించడంలో ఐక్యరాజ్య సమితిపై ప్రగాఢ విశ్వాసాన్ని ఉంచుకున్నాడు. కానీ ఈ లక్ష్య సాధన జయాపజయాలు మానవునిలోనే ఉన్నాయి. దానిమీద అతని భవిష్యత్ ఆధారపడి ఉంది.

## 13.6. సమీక్ష :

నానాజాతి సమితి మొదటి ప్రపంచయుద్ధం ఫలితంగా ఆవిర్భవించగా, ఐక్యరాజ్య సమితి రెండో ప్రపంచయుద్ధం ఫలితంగా ఏర్పడింది. రెండూ కూడా శాశ్వత ప్రాతిపదికమీద శాంతి నెలకొనవలెననే ప్రజల వాంఛవల్ల స్థాపితమైంది. అందువల్ల సహజంగా రెండిటి మధ్య ఎన్నో పోలికలు కనిపిస్తాయి. కాని వీటితోపాటుగా కొన్ని తేడాలు కూడా కనిపిస్తాయి. మొదటి ప్రపంచయుద్ధంలో జరిగిన సంధులను అమలు చేయడానికి నవ ప్రపంచ పునర్నిర్మాణానికీ, ఆనాటి ముఖ్య రాజ్యాలు నానాజాతి సమితి ఏర్పాటు చేశాయి. అందువల్లనే నానాజాతి సమితి వర్సే సంధి షరతుల్లో ఒక భాగమయింది. కాని ఐక్యరాజ్య సమితి స్థాపనోద్దేశాలు దీనికి పూర్తిగా భిన్నమైనవి. యుద్ధాన్ని తిరిగి రాకుండా చేయడానికి దృఢ నిశ్చయంతోను పరాజిత రాజ్యాలమీదా ఎట్లాంటి కఠినమైన షరతులు విధించరాదు అనే భావంతో అనేక చిన్న, పెద్ద దేశాలు ప్రపంచంలో సుమారు అన్ని దేశాలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. నానాజాతి సమితి స్థాపనలో ప్రధాన పాత్ర వహించిన అమెరికా అధ్యక్షుడు విల్సన్ దాని స్వభావాన్ని వివరిస్తూ, " నానాజాతి సమితి సమిష్టి ప్రయోజనాల పరిరక్షణకు వివిధ దేశాలకు నేత్రము వంటిది. ఆ కన్ను ఎన్నడూ మూతబడదు అని, అన్నీ చోట్ల అది జాగరూకతతో వ్యవహరిస్తుంది" అని పేర్కొన్నాడు. కాని అట్లాంటిక్ అమెరికాయే నానాజాతి సభ్యత్వాన్ని తిరస్కరించింది. ఇంకో అగ్రరాజ్యమైన రష్యా 5 సం॥ మాత్రమే సభ్యత్వం పొందింది. చాలా దేశాలు నానాజాతి సమితినుంచి వైదొలగాయి. మంచూరియా దురాక్రమణను నానాజాతి సమితి ఖండించగా జపాన్ వైదొలిగింది. 1933 లో జర్మనీ కూడా వైదొలగి యుద్ధానికి సన్నద్ధమయింది. 1937లో అట్లే ఇటలీ కూడా వైదొలగింది.

నానాజాతి సమితి, ఐక్యరాజ్య సమితిల స్థాపనోద్దేశాలు ఏవైనా, ఆ రెండింటి ఆదర్శాల విషయాల్లో సామ్యం కనబడుతుంది. ఐక్యరాజ్య సమితి మారు వేషంలో ఉన్న నానాజాతి సమితియే అని ట్రూమన్ పేర్కొన్నాడు. ఈ రెండు ప్రపంచ వ్యవస్థలకు వాటి లక్ష్యాలలోను, సాధనా పద్ధతులలోను పోలికలు ఉన్నాయి. ఐ.రా.స లో 6 ప్రధాన అంగాలు ఉండగా నానాజాతి సమితిలో మూడు అంగాలు మాత్రమే ఉన్నాయి. అవి. సభ, సమితి, సచివాలయము. అందువల్ల నానాజాతి సమితి దాని నిర్మాణం దృష్ట్యా ప్రధానంగా రాజకీయ వ్యవస్థకాగా, ఐక్యరాజ్య సమితి రాజకీయ, ఆర్థిక, సాంఘిక సాంస్కృతిక, సంస్థగా వ్యవహరిస్తుంది. ఐక్యరాజ్య సమితి లోని సాధారణ సభ 2/3 వంతు సభ్యుల మెజారిటీతో నిర్ణయాలు తీసుకోగా, నానాజాతి సమితి సభా నిర్ణయాలనూ ఏకగ్రీవంగా ఆమోదించవలెను. నానాజాతి సమితిలోనే సమితివలెనే, ఐక్యరాజ్య సమితి లో కూడా భద్రతా సమితి ఉంది. కాని రెంటి నిర్మాణంలోనూ, విధుల్లో మార్పు కనిపిస్తుంది.

నానాజాతి సమితియొక్క సమితి దృఢమైనది కాదు. దీనిలో తాత్కాలిక సభ్యుల సంఖ్య పెరుగుతూ ఉండటంతో అగ్ర రాజ్యాల ప్రాముఖ్యం తగ్గింది. కాని ఐ.రా.స లోని భద్రతా సమితి సభ్యుల సంఖ్య దాని ఒడంబడిక పత్రంలో నిర్ణయమైంది. ప్రపంచ సమస్యలు పరిష్కరించడానికి నానాజాతి సమితి సభ, సమితులకు ఒకే అధికారాలు ఇవ్వడం జరిగింది. కాని ప్రపంచంలో శాంతి భద్రతల పరిరక్షణా భాధ్యత పూర్తిగా ఐక్యరాజ్య సమితి లో సాధారణ సభ, భద్రతా సమితుల అధికారాలు విభజించడం జరిగింది. నానాజాతి సమితి సభవలె సమితి నిర్ణయాలు కూడా ఏకగ్రీవంగా చేయవలె.

కాని భద్రతా సమితి నిర్ణయం 7గురు ఆమోదంతో జరుగుతుంది. వీరిలో 5 గురు శాశ్వత సభ్యులు. ఈ సమితులకు వీటో అధికారం లేదు. శాశ్వత సభ్యులకు వీటో అధికారం గలదు. అంతర్జాతీయ పోలీస్ దళాలకు కూడా ఏర్పాటుకు తావులేదు. కాని ఐక్యరాజ్య సమితి లోని భద్రతా సమితిలో సైనిక సిబ్బందియేగాక, పోలీస్ దళాలు కూడా ఏర్పాటుకు అవకాశం ఉంది. ప్రపంచ ప్రజల ఆర్థిక, సాంఘిక సాంస్కృతికాభివృద్ధి ఐక్యరాజ్య సమితిలో ఆర్థిక మండలి అనే ప్రత్యేకాంగము ఎన్నో ప్రత్యేక, అనుబంధ సంస్థద్వారా కృషి చేస్తుంది. కాని నానాజాతి సమితి పై విషయాల్లో చెప్పుకోదగిన కృషి చేయలేకపోయింది. నానాజాతి సమితిలో అంతర్జాతీయ కార్మిక సంఘం, అంతర్జాతీయ న్యాయస్థానాలనూ ఐక్యరాజ్య సమితి కొనసాగిస్తుంది. ఐక్యరాజ్య సమితి ఒడంబడికా పత్రము సమిష్టి భద్రతా సిద్ధాంతానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చింది. దురాక్రమణ యుద్ధ విషయంలో గాని, అంతర్జాతీయ శాంతికి భంగం వాటిల్లే పరిస్థితుల్లో గానీ, ఐక్యరాజ్య సమితి జోక్యం

చేసుకోవచ్చు. కాని నానాజాతి సమితి దురాక్రమణ సమయంలో మాత్రమే జోక్యం చేసుకోవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో దురాక్రమణ రాజ్యంమీద సైనిక చర్య తీసుకోడానికీ ఐక్యరాజ్య సమితి కు అధికారం ఉన్నది. అది సభ్య రాజ్యాలను, అందుకు కావలసిన సైన్యాలను సమకూర్చవలసిందిగా కోరవచ్చు కూడా, కానీ నానాజాతి సమితికీ, అట్లాంటి సైన్యాలు లేవు. అంతేగాక నానాజాతి నిర్ణయాలను, అమలు చేయవలసిన నైతిక బాధ్యత కూడా సభ్య దేశాలకు ఉండేది కాదు. కాని నానాజాతి సమితి సభ్య దేశాలు దురాక్రమణ రాజ్య విషయంలో స్వతంత్రంగా వ్యవహరించి చర్యలు తీసుకోవచ్చు. ఐక్యరాజ్య సమితిలో ఈ బాధ్యత భద్రతా సమితి మాత్రమే నిర్వహిస్తుంది. మానవ హక్కులను ప్రాథమిక స్వాతంత్రియాలను పరిరక్షించడం ఐక్యరాజ్య సమితి ముఖ్య లక్ష్యం కాగా నానాజాతి సమితి చట్టంలో వీటి విషయమై ఎటువంటి ప్రస్తావన లేదు. నానాజాతి సమితి ఆంగ్లో, ఫ్రెంచి ప్రాబల్యములో ఉండగా, ఐక్యరాజ్య సమితి అగ్రరాజ్యాల అదుపాజ్ఞల్లో ఉంటుంది అని విమర్శ కలదు. నానాజాతి సమితి, ఐక్యరాజ్య సమితి రెండూ కూడా ప్రపంచ శాంతి సహకారాలనూ పెంపొందించడానికి ప్రయత్నించాయి. కాని నానాజాతి సమితి విఫలమయింది ఐక్యరాజ్యసమితి సుస్థిర శాంతి స్థాపనలో తనవంతు నేటికి కృషి చేస్తూ ఉన్నది.

**Dr. V.K. Mohan**

పాఠం - 14

# ఆసియా, ఆఫ్రికా ఖండాలలో జాతీయోద్యమాలు

**లక్ష్యం:** ఆసియా, ఆఫ్రికా ఖండాలలో జాతీయోద్యమాల గురించి, బాండుంగ్ సమావేశం గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

**విషయ క్రమం :**


14.1. పరిచయం

14.2. భారతదేశం

14.3. బర్మా

14.4. మలయా

14.5. థాయిలాండ్

14.6. ఇండో-చైనా

14.7. ఆఫ్రికాలో జాతీయ భావ ఆవిర్భావం

14.8. ఆఫ్రో - ఆసియా రాజ్యాల సహకారం - బాండుంగ్ సమావేశం

14.8.1 ఫిలిప్పైన్స్

14.8.2 ఇండోనేషియా

14.8.3 బాండుంగ్ సమావేశం

14.9. Reference Books


## 14.1. పరిచయం:

రెండో ప్రపంచ యుద్ధానికి కారణమైన వలస సామ్రాజ్యవాదం నైతిక మద్దతును కోల్పోయింది. జాతుల సమానత్వం - స్వయం నిర్ణయాధికార సూత్రాలకు ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరం విశేషమైన గుర్తింపు లభించింది. దాంతో ఆసియా, ఆఫ్రికాలలోని పాశ్చాత్య రాజ్యాల వలసలలో జాతీయోద్యమాలు మొదలై భారతదేశం, ఇండోనేషియా, బర్మా, సిలోను, వియత్నాం మొదలైన దేశాలు స్వతంత్ర దేశాలుగా అవతరించాయి. మధ్య ప్రాచ్యంలో సిరియా - లెబనాన్‌లు, జోర్డాన్, పాలస్తీనాలు విమోచన పొందాయి. యూదుల జాతీయోద్యమం ఫలించి ఇజ్రాయెల్ స్వతంత్ర దేశంగా అవతరించింది.

ఆసియాలోని జాతీయోద్యమాలకు రెండో ప్రపంచ యుద్ధం స్ఫూర్తినిచ్చింది. గాఢమైన జాతీయభావంతో ఉత్తేజం పొందిన మిత్ర దేశాలు ఫాసిస్టు దేశాలతో వీరోచితంగా పోరాడాయి. చైనా, కొరియా, వియత్నాంలలో కమ్యూనిస్టు ఉద్యమాలు కూడా జాతీయవాదాన్ని ఉత్తేజపరిచాయి. ఆసియా దేశాలలో నెలకొన్న పాశ్చాత్య విద్యావిధానం వల్ల ఆధునిక రాజకీయ సిద్ధాంతాలు - ప్రపంచ చరిత్రలోని పరిణామాలు అధ్యయనం చేయబడటంతో ఆత్మ విశ్వాసం పెంపొంది. జాతీయ భావానికి దోహదపడింది.

## 14.2. భారతదేశం :

1857లో జరిగిన విప్లవాన్ని ప్రథమ భారత జాతీయ సంగ్రామంగా వర్ణించారు. కొందరు చరిత్ర కారులు. ఈ సంఘటన తరువాత భారతదేశంలో జాతీయోద్యమం - ఉధృతం కాసాగింది. భారతదేశంలోని జాతీయోద్యమానికి పాశ్చాత్య విద్యావిధానం దోహదం చేసింది. బెంథామ్, మిల్, రూసోవంటి యూరోపియన్ తాత్వికుల ప్రభావం జాతీయ భావాన్ని బలపరచింది. రాజారామమోహనరాయ్, కేశవ చంద్రసేన్, ఈశ్వర చంద్ర విద్యాసాగర్, దయానంద సరస్వతి, స్వామి వివేకానంద మొదలైన ప్రముఖులు భారతీయులలో సంస్కరణ పిపాసనూ,

సాంస్కృతిక ఏకతను కలిగించారు. వీరి బోధనలు, ఉద్యమాలతో కలిగిన సంచలనాన్ని భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవనం అని వ్యవహరించడం కద్దు. ఇదే వరవడిలో ముస్లిం ప్రజల సమగ్ర అభివృద్ధికి సర్ సయ్యద్అహ్మద్‌ఖాన్ కృషి చేశారు.

బ్రిటీషువారు తమదేశ ప్రయోజనాలకోసం భారతీయ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారు. ముడిపదార్థాల గిడ్డంగిలా, లాభాలార్జించి పెట్టే అంగడిగా భారతదేశాన్ని వాడుకొన్నారు. ఉన్నతోద్యోగాలన్నీ తమ దేశీయులకే యిచ్చి కేవలం గుమస్తా తరహా ఉద్యోగాలను మాత్రమే భారతీయులకిచ్చేవారు.

1885 లో భారతీయుల సాధక బాధకాలను గురించి వైస్రాయికి తెలిపి వాటి నివారణోపాయాలను సూచించడానికిగాను విద్యావంతులైన భారతీయులతో గూడిన ఒక సంఘాన్ని ఎలన్ ఆక్టేవియన్ హ్యూమ్ అనే ఉద్యోగ విరమణ చేసిన బ్రిటీషు ఉద్యోగి వ్యవస్థాపించాడు. దీనికి వైస్రాయి ప్రోద్బలం కూడా ఉంది. క్రమంగా తిలక్, గోఖలే, గాంధీ మొదలైన నాయకుల ప్రవేశంతో భారతీయ జాతీయ కాంగ్రెస్ నిజమైన జాతీయ స్వభావాన్ని సంతరించుకొన్నది.

బ్రిటీషువారినుంచి విమోచన సాధించి స్వరాజ్యం స్థాపించాలని కాంగ్రెసులోని కొందరు నాయకులు కోరారు. వీరికి తిలక్ నాయకుడు, వీరికి భిన్నంగా - బ్రిటీషు వారి పాలనలోనే ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేస్తూ భారతీయ సంఘాన్ని సంస్కరిస్తూ భారతీయులకు స్వపరిపాలనా ప్రతిపత్తినిస్తే చాలని వాదించే మితవాదులకు గోఖలే నాయకుడు.

1905 లో పరిపాలనా సౌలభ్యం నెపంమీద బెంగాల్ రాష్ట్రాన్ని రెండు భాగాలుగా విభజించింది బ్రిటీషు ప్రభుత్వం. విభజనను దేశవ్యాప్తంగా ప్రజలు వ్యతిరేకించారు. ఈ వ్యతిరేకత స్వదేశీ వస్తు వినియోగం - విదేశీ వస్తు బహిష్కారంతో గూడిన వందేమాతరం ఉద్యమంగా పేరు పొందింది. అనేకమంది దేశభక్తులు అరెస్టై జైళ్ళపాలయ్యారు. హిందూ, ముస్లిం, అనైక్యతను పెంచి 'విభజించిపాలించే' విధానాన్ని బ్రిటీషు ప్రభుత్వం అవలంబించసాగింది. 1906 లో ముస్లింలీగు ఏర్పడి బెంగాల్ విభజనను సమర్థించింది.

భారత రాజకీయాలలో గాంధీ ప్రవేశంతో జాతీయోద్యమం ఉధృతం అయ్యింది. అంతకు పూర్వమే గాంధీ దక్షిణాఫ్రికాలోని భారతీయులపట్ల తెల్లజాతివారు అవలంబిస్తూండిన జాతివివక్ష - దమన నీతులను ప్రతిఘటిస్తూ ఉద్యమాల్ని నిర్వహించాడు. 1914 లో ఆయన భారతదేశం వచ్చాడు. 1920 లో గాంధీ జాతీయోద్యమంలో ప్రధాన నాయకుడైనాడు. సంస్కరణల ద్వారా దేశ పాలనలో భారతీయులకు పాత్ర కల్పిస్తున్నట్లు బ్రిటీషు ప్రభుత్వం ప్రకటించిందిగానీ ఆ సంస్కరణలు భారతీయులను సంతృప్తి పరచలేక పోయాయి. అప్పటికే అసంతృప్తితో వచ్చిన అలజడిని అణచివేయడానికి అవమానకరమైన రౌలట్ చట్టాన్ని చేసింది బ్రిటీషు ప్రభుత్వం. దీనికి వ్యతిరేకంగా జలియన్‌వాలాబాగ్‌లో జరిగిన ఒక సభలో పాల్గొన్న భారతీయులపై అనూనుషంగా కాల్పులు జరిపించి మారణకాండ నిర్వహించాడు డయర్ అనే సేనాని. 1920 - 22 లలో గాంధీ సహాయ నిరాకరణోద్యమం నడిపాడు.

1928 లో రాజ్యాంగ సంస్కరణల అమలు గురించి విచారించడానికి సైమన్ కమీషన్ అనే బృందం భారతదేశానికి వచ్చింది. ఇందులో భారతీయులెవరికి ప్రాతినిధ్యం కల్పించడం జరగలేదు. సైమన్ విచారణ బృందం ఎక్కడికిపోయినా నల్లజెండాలెదురైనాయి.

1929 లో లాహోర్ కాంగ్రెసులో సంపూర్ణ స్వాతంత్ర్యం భారత జాతీయ కాంగ్రెసు ధ్యేయమని చెప్పేదానికోసం ఉద్యమాన్ని నిర్దేశించవలసిందిగా గాంధీని కోరుతూ తీర్మానం జరిగింది. తరువాత గాంధీజీ ఉప్పు తయారీపై ప్రభుత్వచట్టాన్ని ఉల్లంఘించే చరిత్రాత్మక 'ఉప్పు సత్యాగ్రహోద్యమాన్ని నిర్వహించాడు. ఇందులో పాల్గొన్న ప్రముఖ నాయకులను బ్రిటీషు ప్రభుత్వం హింసించింది. అరెస్టు చేసింది.

1930 లో భారతీయుల సమస్యలను చర్చించడానికి రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఏర్పరచింది. బ్రిటీషు ప్రభుత్వం ప్రముఖ నాయకులందరూ జైళ్ళలోనే ఉండడంతో ఈ సమావేశాన్ని కాంగ్రెస్ బహిష్కరించింది. రెండో సమావేశానికి గాంధీ వెళ్ళాడుగానీ పరిష్కారం కుదరలేదు. కాంగ్రెసు ప్రతినిధులెవరూ లేకుండానే జరిగిన మూడో సమావేశంలో జరిగిన నిర్ణయాలననుసరించి 1935 చట్టాన్ని జారీ చేసింది బ్రిటీషు ప్రభుత్వం. ఈ చట్టాననుసరించి భారత దేశంలో సమాఖ్య (Federation) ఏర్పాటు జరిగింది. అయితే స్వదేశీ సంస్థానాధీశులు సహకరించకపోవడం వల్ల ఇది బ్రిటీషు ఇండియా రాష్ట్రాలకే పరిమితమైనది.

1939లో మొదలైన రెండో ప్రపంచయుద్ధంలో భారత దేశాన్ని కూడా ప్రవేశపెట్టింది బ్రిటీషు ప్రభుత్వం. కాంగ్రెసును సంప్రదించకుండా ఏకపక్షంగా తీసుకున్న ఈ నిర్ణయానికి నిరసనగా కాంగ్రెసు మంత్రి వర్గాలు రాజీనామా చేశాయి. అనేకమంది నాయకులను బ్రిటీషు ప్రభుత్వం నిర్బంధించింది.

1942లో గాంధీజీ 'క్విట్ఇండియా' ఉద్యమానికి పిలుపునిచ్చాడు. దేశవ్యాప్తంగా జరిగిన ఈ ఆందోళనలో అనేకులు జైళ్ళకు వెళ్ళారు, హింసాకాండకు గురైనారు. బ్రిటీషువారి దమనకాండకు నిరసనగా దేశవ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు నిర్వహించబడ్డాయి. 1946 లో బ్రిటీషు ప్రభుత్వం భారతదేశ సమస్యకొక పరిష్కారాన్ని కనుగొనడానికి ప్రయత్నం చేసినప్పుడు ముస్లింలీగ్ నాయకుడు జిన్నా ముస్లింలకు ప్రత్యేకరాజ్యం కావాలని పట్టుబట్టాడు. కాంగ్రెసు, లీగ్‌లతో సుదీర్ఘ సంప్రదింపులు జరిపిన మీదట మౌంట్‌బాటన్ భారతదేశాన్ని ఇండియా, పాకిస్తాన్‌లుగా విభజించడమే మార్గమని సూచించాడు. లీగ్ - కాంగ్రెస్‌లు అంగీకరించిన మీదట 1947 జులై భారతదేశ స్వాతంత్ర్య ప్రకటన బిల్లును బ్రిటీషు పార్లమెంట్ ఆమోదించింది. 1947 ఆగష్టు 15 నాడు భారతదేశం స్వాతంత్ర్యదేశంగా అవతరించింది.

## 14.3. బర్మా:

భారతదేశానికి - చైనా థాయ్‌లాండ్‌ల మధ్యన గల బర్మాదేశం 1886 నాటికే బ్రిటీషు వారి ఆధిపత్యంలోకి వచ్చింది. ఈ దేశంలో గల విదేశీయులలో చైనీయులు, యురోపియన్లు, ఇండియన్లు ఉండేవారు. 1897 నుంచి 1937 వరకు బ్రిటీషువారు బర్మాను పాలనా సౌలభ్యంకోసం భారతదేశంలో ఒక రాష్ట్రంగా వ్యవహరించారు. 1919లో వచ్చిన రాజ్యాంగ సంస్కరణలను బర్మాలో ప్రవేశపెట్టే వరకు పాలనలో బర్మీయులకు ప్రవేశం ఇవ్వడం జరగలేదు. బర్మా వ్యవసాయికంగా వాణిజ్యపరంగా బ్రిటీషువారి ప్రయోజనాల పరిరక్షణకు ఉపయోగించే వలసగా ఉండేది. దేశంలో ఉత్పత్తి అయ్యే వరిలో సగం వరకూ బ్రిటీషు ఇండియాకే ఎగుమతి అయ్యేది. బర్మా పెట్రోలు కంపెనీ బ్రిటీషు వర్తకుల అధీనంలోనే ఉండేది. బ్రిటీషువారు ప్రవేశపెట్టిన చట్టబద్ధపాలన వైయక్తిక స్వేచ్ఛ మొదలైన విధానాల వల్ల బర్మా వారికి పెద్దగా ఒనగూరిందేమీలేదు.

బర్మాలోని వ్యవసాయదారుల కబంధహస్తాలలో చిక్కుకు పోవడంతో వరి పండించే రాష్ట్రాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో నాలుగోవంతు ఈ వడ్డీ వ్యాపారుల చేతుల్లోకే పోయింది. థాయ్‌లాండ్, అస్సాంలోని ప్రజల్లాగా బర్మీయులకు పరిశ్రమల పట్ల ఆసక్తిలేదు. ఇతర ఆగ్నేయాసియాదేశాల్లో చైనావారు, యూరోపియన్లు పెట్టుబడిదారీ వర్గంగా వ్యవహరిస్తే బర్మాలో వడ్డీవ్యాపారులైన చెట్టియార్లు బర్మీయులకు అసంతృప్తికి కారకులైనారు. బర్మీయులలో జాతీయభావాన్ని ప్రేరేపించిన అంశాలలో ఇది ఒకటి. 1935 లో వచ్చిన బర్మా చట్టాన్ననుసరించి బర్మాను భారతదేశం నుంచి వేరుచేయటం జరిగింది. అక్కడ ద్విసభ శాసన సభను వ్యవస్థాపించడం జరిగింది. దేశరక్షణ, విదేశీ వ్యవహారాలు, చర్చి వ్యవహారాలు, ద్రవ్య ముద్రణ వంటి ముఖ్యాంశాలపై మాత్రం గవర్నర్‌కే సంపూర్ణాధికారం ఉండేది. దీనితో బర్మావారు స్వయంపాలన పట్ల ఆకర్షితులైనారు. బర్మాలో జాతీయవాదాన్ని సంఘటితం చేసిన మరొక అంశం ద్వితీయ ప్రపంచ యుద్ధ పరిణామాలు. జపాను బర్మాను ఆక్రమించుకొన్న కాలంలో జపానుకు వ్యతిరేకంగా ఉద్యమం నిర్వహించని బర్మీయ నాయకులు బర్మాలోని జాతీయవాదాన్ని ఉధృతం చేశారు. నూతన నాయకత్వాన్ని యిచ్చారు.

బ్రిటీషు పాలనను వ్యతిరేకంగా కొందరు బర్మీయులు బర్మా స్వాతంత్ర్య సైన్యం ఒకదాన్ని ఏర్పరచి జపానువారి ఆక్రమణకు సాయపడ్డారు. ఆక్రమణ కాలంలో వీరు దౌర్జన్యచర్యలకు పాల్పడటంతో వీరిననచివేసి పాలనాధికారాన్ని డా॥ బామా అనే బర్మా నాయకునికి అప్పగించాయి జపానువారు. అయితే ఆయనకు స్వేచ్ఛ ఉండేది కాదు. క్రమక్రమంగా బలపడిన జపాను వ్యతిరేకంగా ప్రజావిప్లవసమితి, మేజర్ జనరల్ ఆంగ్‌సన్ నాయకత్వంలోని బర్మారక్షణ సైన్యం, కమ్యూనిస్టు వర్గం మొదలైన సంఘాలుగా రూపొందింది. ఇవన్నీ కలిసి 1944 ఆగస్టు నాటికి 'ఫాసిస్టు వ్యతిరేక ప్రజాస్వాతంత్ర్య సంఘం' ఏర్పడింది.

1945 మేలో తిరిగి బర్మాను ఆక్రమించిన బ్రిటను బర్మాలో యధాపూర్వస్థితిని పునరుద్ధరించే చర్యలను సూచిస్తూ ఒక శ్వేత పత్రాన్ని విడుదల చేసింది. దీని ప్రకారం మొదటి గవర్నరు ప్రత్యేక పాలనను ప్రవేశపెట్టి క్రమంగా స్వయంపాలన ఇవ్వడం జరుగుతుంది. తరువాత రాజకీయ పక్షాల ఆమోదం పొందిన రాజ్యాంగానొకదాన్ని ఏర్పరచి అది నివేశ ప్రతిపత్తిని బర్మాకు ఇవ్వడం జరుగుతుంది.

అయితే ఈ విధాన నిర్ణయంలో ఆక్రమణ కాలంలో దేశం విడిచి పారిపోయినవారికి ప్రాతినిధ్యం ఇచ్చేవారికేగాని ఫాసిస్టు వ్యతిరేక ప్రజాస్వాతంత్ర్య సంఘాన్ని మాత్రం సంప్రదించలేదు. బ్రిటీషు ప్రభుత్వం ప్రకటించిన విధానం అసంతృప్తిని కలిగించింది. ఫాసిస్టు వ్యతిరేక ప్రజాస్వారతంత్ర్య సంఘం బ్రిటీషు ప్రభుత్వంతో సహకరించ నిరాకరించింది. ఈ సంఘానికి ప్రజామద్దతు ఉండటమేగాక తలచుకుంటే ప్రభుత్వాన్నెదిరించే సామర్థ్యమూ సైనిక బలము ఉన్నాయి. అందువల్ల ఈ సంఘంలోని ఆరుగురు సభ్యులను తదితర సంఘాలనుంచి మరికొందరు సభ్యులను తీసుకొని ఒక కార్యనిర్వాహక మార్గాన్నేర్పరిచింది బ్రిటీషు ప్రభుత్వం. ఆంగ్‌సన్-బ్రిటీషు ప్రభుత్వాలకు జరిగిన సంప్రదింపుల ఫలితంగా ఆగస్టు 1946లో లండన్ సమావేశం జరిగింది. బర్మాకు కామన్వెల్త్ ప్రతిపత్తిగానీ స్వాతంత్ర్యాన్ని గాని ఇవ్వటం జరుగుతుందని బ్రిటీషు ప్రధాని ప్రకటించాడు. 1947 లో రాజ్యాంగ పరిషత్తుకు ఎన్నికలు జరపాలని అది సమావేశం అయ్యేవరకు తాత్కాలిక శాసనసభ-గవర్నరు కార్యనిర్వాహక మండలి కలసి పాలనా వ్యవహారాలను చూడాలని నిర్ణయం జరిగింది.

ఈ నిర్ణయాలు సత్వర స్వాతంత్ర్యాన్ని కోరిన జాతీయ వాదులకు సంతృప్తిని కలిగించకపోయినా ఆంగ్‌సన్ ఆమోదించడంతో ఏప్రిల్ 1947లో ఎన్నికలు జరిగాయి. ఫాసిస్టు వ్యతిరేక ప్రజాస్వాతంత్ర్య సంఘం పెద్ద మెజారిటీ సంపాదించింది. సెప్టెంబరు 1947లో నూతన రాజ్యాంగాన్ని ఆమోదించడం జనవరి 1948 నుంచి బర్మాను స్వతంత్ర్య దేశంగా బ్రిటను గుర్తించటం జరిగింది.

## 14.4. మలయా (మలేషియా) :-

తూర్పు ఆసియాలో బర్మా, థాయిలాండ్‌లకు దక్షిణంగా ఇండోనేషియా వరకు చొచ్చుకొని ఉన్న ద్వీపకల్పమే మలయా.

రెండో ప్రపంచ యుద్ధకాలంలో జపాను మలయాను ఆక్రమించుకోవడానికి పూర్వం మలయాలో స్ట్రెయిట్స్, సెటల్‌మెంట్స్ అనే ప్రాంతాల రాజ్యాధికార వలసలుగా ప్రత్యక్ష బ్రిటీషు పాలనలోనూ మరొక తొమ్మిది రాష్ట్రాలు బ్రిటీషు అధికారుల సంప్రదింపులలోన ఉండేవి.

మలయా ఆర్థిక సంపదకు మూలం తగరపు, గనులు, రబ్బరు తోటలు, తగరపు - గనుల్లో బ్రిటీషువారి పెట్టుబడి విస్తృతంగా ఉండగా ఫ్రాన్సు, అమెరికా, చైనాల పెట్టుబడులు కూడా ఉండేవి. రబ్బరు తోటల్లో యూరోపియన్లదే ఎక్కువ పెట్టుబడి.

జనాభాలో దేశీయులైన మలయన్లతో బాటు చైనీయులు. భారతీయులు కూడా ఉండేవారు. వరి సాగుబడి, జాలరిపని మలయన్ల ప్రధాన వృత్తులు.

మొదట ప్రపంచం యుద్ధానంతరం మలయాలోరోడ్లు, రహదారులు, రవాణా, విద్యావైద్య సౌకర్యాలు వృద్ధి చెందసాగాయి. మలయన్ యువకులు విద్యార్జనకై విదేశాలకు పోసాగారు. ఈ అభివృద్ధి మలయన్లలో చైతన్యాన్ని కలిగించింది.

రెండో ప్రపంచయుద్ధం మలయాలో విపరిణామాలను తెచ్చిపెట్టింది. ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నది. యుద్ధకాలంలో మలయాను ఆక్రమించిన జపానువారికి బ్రిటీషువారికి మధ్య జరిగిన యుద్ధాలవల్ల గనులు, రహదారులు, వంతెనలు దెబ్బతిన్నాయి. జపానువారు మలయాను ఆక్రమించిన కాలంలో మలయన్లలో రాజకీయ చైతన్యం అభివృద్ధి పొందింది. జపాను వారిని నిరోధించడానికి జరిగిన ఉద్యమాల వల్ల మలయాలో వివిధ ప్రాంతాల వారి మధ్య గల భేదాలు సమసిపోయి జాతీయభావం బలపడింది. ఆక్రమణ కాలంలో జపాను వారు స్వపరిపాలనా సంస్థలను ప్రవేశపెట్టడం వల్ల మలయన్లలో స్వయం పాలనాశక్తి బలపడింది.

యుద్ధానంతరం మలయాను తిరిగి స్వాధీనం చేసుకున్న బ్రిటీషువారు మలయాలోని వివిధ వర్గాల వారికి హక్కులిచ్చి తృప్తిపరచడానికి యత్నించారు. రాష్ట్రాలలోని సుల్తానులకు పాలనాధికారానిచ్చి రక్షణ - విదేశీ విధానాలను మాత్రం తమ చేతుల్లో ఉంచుకొన్నారు. అయితే ఈ పథకాన్ని వ్యతిరేకిస్తూ "ఐక్యమలయన్ జాతీయ సంస్థ" అవతరించింది. లోగడ బ్రిటీషువారికి - పూర్వ మలయా సుల్తానులకు మధ్య జరిగిన సంధులు, ఒప్పందాలను తిరగదోడటాన్ని ఈ సంస్థ వ్యతిరేకించింది. మలయన్ యూనియన్ పౌరసత్వానికి సంబంధించిన నిబంధనలు మలయా జాతీయుల ప్రయోజనాలకు విరుద్ధమని వీరు వాదించారు. బ్రిటీష్ - మలయన్ల సంప్రదింపుల అనంతరం మలయన్ యూనియన్ను సమాఖ్యగా మార్చారు. ఈ పరిణామాన్ని 'అఖిల మలయా సంయుక్త కార్యాచరణ సంఘం వ్యతిరేకించింది. మలయా, సింగపూర్‌తో సహా యూనియన్‌గా ఏర్పడాలని ఒకే కేంద్ర శాసనసభ ఉండాలని, చిరకాలంగా నివశిస్తున్న వారందరికీ పౌరసత్వం లభించాలి

వీరు వాదించారు. అయితే మలయా సమాఖ్యగానే కొనసాగింది. బ్రిటీషు వారు స్థాపించిన ఫెడరేషన్ 1956 లో సమావేశమై 1957 ఆగస్టు 31 నాటికి అధికారాన్ని మలయన్లకు అప్పగించాలని తీర్మానించింది. అయితే 1959 లో సింగపూర్ విడిపోయి స్వతంత్ర్య రాజ్యంగా ఏర్పడింది. 1961 లో టుంకు అబ్దుల్ రెహ్మాన్ మలయా, సింగపూర్, ఇండోనేషియాలోని కొన్ని ప్రాంతాలు కలసి సమాఖ్య ఏర్పడాలని క్రొత్త ప్రతిపాదన చేశాడుగానీ ప్రతిపాదనను ఇండోనేషియా, ఫిలిప్పైన్స్‌లు వ్యతిరేకించాయి. ఐక్యరాజ్యసమితి సారధ్యంలో ప్రజాభిప్రాయసేకరణ జరిగి సాబా, సారవాక్‌లు మలేషియన్ సమాఖ్యలో చేరిపోయినాయి. సింగపూర్ మాత్రం స్వతంత్రంగా ఉండిపోయింది.

## 14.5. థాయిలాండ్ :-

ప్రత్యక్షంగా పాశ్చాత్యదేశాల వలస పాలనలోకి రాకపోయినా థాయిలాండ్‌లో బ్రిటను, ఫ్రాన్సులు అతి ప్రాదేశిక పరిధిని సంపాదించుకున్నాయి. 1933 లో సైనిక తిరుగుబాటు జరిగి 1935 లో రాజు ప్రజాధిపక్ పదవీ పరిత్యాగం చేశాడు. యువరాజు ఆనంద్ మహీదల్ స్విట్జర్లండులో విద్యాభ్యాసంలో ఉండగా థాయిలాండ్‌లో సైనిక నియంతృత్వ వ్యవస్థ నెలకొంది. భావ ప్రకటన హక్కు పత్రికా స్వేచ్ఛ పరిమితం చేయబడ్డాయి. అయితే విద్యారంగంలో గణణీయమైన అభివృద్ధి జరిగి సాక్షరత ముప్పై శాతానికి పెరిగింది. ప్రజారోగ్యం, రహదారులు, వార్తా ప్రసార సాధనాలు వృద్ధి పొందాయి. థాయ్ భాషనూ, సంస్కృతిని దేశంలో వ్యాప్తిచేసి జాతీయభావాన్ని పెంపొందింపచేయటం జరిగింది. చక్కెర, కాగితం పరిశ్రమలు ప్రభుత్వ ఆధ్వర్యంలో నెలకొల్పబడ్డాయి. దేశభాషల్లో మతాచార సాంప్రదాయాలు, ఏకరూపకత తెచ్చే సంస్కరణలు ప్రవేశపెట్టడం జరిగింది. బౌద్ధమతం జాతీయ మతం అయినది.

థాయిలాండ్‌ను తమ రక్షిత ప్రాంతంగా చేయడానికి బ్రిటన్ యత్నించినది గానీ అమెరికా ఆ ప్రయత్నాన్ని నిరోధించింది. 1946 డిశెంబర్‌లో ఐక్యరాజ్యసమితిలో సభ్యదేశమయినది థాయిలాండ్.

## 14.6 . ఇండోచైనా :-

దక్షిణచైనాలో గల ఇండోచైనా ద్వీపకల్పంలోకి 17వ శతాబ్దిలో వర్తకులుగా ప్రవేశించిన ఫ్రెంచివారు పందొమ్మిదో శతాబ్దినాటికి అక్కడ పూర్తి ప్రాబల్యాన్ని సంపాదించారు. గనుల త్రవ్వకం వ్యతిరేకంగా అన్నాం రాష్ట్రంలోని కొద్దిమంది ప్రారంభించిన ఉద్యమంతో ఇండోచైనాలో జాతీయోద్యమం ప్రారంభమయింది. 1925 లో మొదలైన 'యువఅన్నాం, 1929 లో మొదలైన మరొక విప్లవ సంస్థ అణచివేయబడ్డాయి.

1903 లో 'థాన్-నిమోన్' అనే పేరుతో వియత్నాం కమ్యూనిస్టుపార్టీని హోచియన్ స్థాపించాడు. ఇందులో కర్షక కార్మికులు పెద్ద సంఖ్యలో చేరారు. దీనిని అణచివేయడానికి ఫ్రెంచి ప్రభుత్వం ప్రయత్నించింది. తాత్కాలికంగా అణగిపోయినా తిరిగి 1935-36 లో కమ్యూనిస్టు ఉద్యమం తలెత్తింది. 1941 లో ఫ్రెంచివారు దేశం విడిచి పారిపోగా జపాన్ ఆక్రమణ నుంచి వియత్నాం విమోచనకై హోచిమెన్ అవిశ్రామంగా పోరాటం జరిపాడు. రెండో ప్రపంచ యుద్ధానంతరం తిరిగి అధికారం సంపాదించిన ఫ్రెంచి వారితో తిరిగి కొనసాగింది. ఈ ఉద్యమాన్ని అణచివేయడానికి ఫ్రెంచి ప్రభుత్వం చేసిన యత్నాలు ఫలించలేదు. 1945 లో జపాన్ పతనానంతరం గెరిల్లా దళాలకు తమ ప్రాబల్యాన్ని పెంచుకొని వియత్నాం ప్రజాస్వామిక రిపబ్లిక్‌ను స్వతంత్రదేశంగా ప్రకటించింది. వియెతేమిన్ పక్షం (హోచ్‌మిన్ పక్షం) అయితే దీనికి వ్యతిరేకంగా అన్నాం రాజైన బానొదాయ్ ఆధిపత్యాన తనకనుకూలంగా ఒక కీలుబొమ్మ ప్రభుత్వాన్ని నిలిపింది ఫ్రాన్సు. ఈ ప్రభుత్వానికి ప్రజల మద్దతు పూర్తిగాలేదు. రాజు బానొదాయ్ దక్షిణప్రాంతంలో సహజీవనం చేస్తుండేవాడు. ఆయన మిత్రబృందం పరిపాలనా వ్యవహారాలను చూస్తుండేది. 1949 లో చైనాలో కమ్యూనిస్టు విప్లవం విజయవంతమై ప్రజారిపబ్లిక్ ఏర్పడింది. ఈ నూతన కమ్యూనిస్టు ప్రభుత్వం సోవియట్ రష్యాలో రెండు హోచిమిన్ నాయకత్వంలోని ప్రభుత్వానికి గుర్తింపునిచ్చి సైనికంగా సాయపడసాగాయి. వియత్‌మిన్ సైన్యాన్ని ఫ్రెంచి సైన్యాలపై డీన్‌బీన్‌పు వద్ద ఘన విజయాన్ని సాధించాయి.

1954 మే నెలలో జెనీవాలో ఫ్రెంచివారికి కమ్యూనిస్టులకు ఒక ఒప్పందం కుదిరింది. దీనిప్రకారం 17 ఉత్తర అక్షాంశరేఖకు ఉత్తరంగా ఉన్న ప్రాంతం హోచిమిన్ నేతృత్వంలోని రిపబ్లిక్ పరమైంది. దక్షిణంగా ఉన్న ప్రాంతం దక్షిణ వియత్నాం అనే పేరుతో బావొదాయె

ప్రభుత్వాధీనంలోకి వచ్చింది. ఇక అప్పటినుండి అమెరికా సంయుక్త రాష్ట్రాలకు కమ్యూనిస్టులకు పోరాటం పునఃప్రారంభమైందన వచ్చు.

ఉత్తర వియత్నాంలో హోచిమిన్ నాయకత్వంలో ఆర్థికాభివృద్ధి రైల్వేల స్థాపన విస్తృతంగా జరిగింది. దక్షిణ వియత్నాంలో అధికారం కోసం కావ్‌దాయిస్ట్, హోహావో, కాథలిక్ వర్గాల మధ్య పోటీ ప్రారంభమైంది. ఈ పోరాటంలో అమెరికా సహాయంతో రోమన్ కాథలిక్ వర్గానికి చెందిన ఎన్‌గోడిన్ దిమెం విజయం సాధించి దక్షిణ వియత్నాం అధ్యక్ష పదవిని నిర్వహించారు. ఆయన నిరంకుశాధికారాన్ని చేపట్టి అనేక దురంతాలు చేసి చివరకు 1963 లో హత్యకు గురైనాడు. వియెత్‌కాంగ్ అనే కమ్యూనిస్టు సంస్థ దక్షిణ వియత్నాంలో జాతీయ విమోచన కార్యక్రమాన్ని ముమ్మరం చేసింది. దక్షిణ వియత్నాం పక్షాన అమెరికా భారీఎత్తున సైనిక సహాయం చేసి యుద్ధంలో పాల్గొన్నది. అయినా వియత్నాం వారు పట్టుదలతో తమ ఉద్యమాన్ని కొనసాగించారు. క్రమంగా అమెరికాలో ప్రజాభిప్రాయం వియత్నాంలో అమెరికా పోరాటానికి వ్యతిరేకంగా మారింది. 1973 లో పారిస్‌లో సంప్రదింపులు జరిపి అమెరికా యుద్ధంనుంచి విరమించటానికి నిర్ణయం జరిగింది. ఉత్తర, దక్షిణ వియత్నాంల ఏకీకరణ జరిగింది.

## 14.7. ఆఫ్రికాలో జాతీయతా భావ ఆవిర్భావం :-

ఆఫ్రికా రాజకీయరంగం త్వరతగతిలో మారింది. "ఆఫ్రికాలోని మార్పుల వేగము, ప్రాధాన్యత మరెక్కడా కన్పించదు" అని రోనాల్డ్ సీగల్ వ్యాఖ్యానించారు. జాతీయతత్వం ఊపిరిగా ఈ ఖండంలో పెల్లుబికిన స్వాతంత్ర్య ఉద్యమాలు, ఊహించిన రీతిలో సమైక్యమై చావో, బ్రతుకో తేల్చుకుందామనే దృఢసంకల్పంతో విదేశీ రాజ్యపాలనకు విరుద్ధంగా మహా ఆఫ్రికన్ ఉద్యమంగా రూపుదాల్చాయి. అయితే విముక్తమయిన ఈ ఆఫ్రికా రాజ్యం తటస్థంగా ఉంటాయా లేక ఏదైనా కూటమిలో భాగస్వామ్యం అవుతాయా అన్నది ప్రధమంలో ఏర్పడిన సమస్య. "పశ్చిమ రాజ్యాలపై ఆసియా తిరుగుబాటు నేటితరపు ప్రధాన అంతర్జాతీయ పరిణామం కాగా, ఆఫ్రికా భవితవ్యం వచ్చేతరం వారి ముఖ్య సమస్య" కాగలదని ఫ్రీడ్‌మాన్ 1970 లో చేసిన వ్యాఖ్యానం సముచితం.

5 శతాబ్దాల క్రితం వర్తకం వలసలు దోపిడికై పోర్చుగీసువారు ఆఫ్రికాలో అడుగుపెట్టి ఆఫ్రికాపై పశ్చిమరాజ్యాం ఆధిపత్యానికి నాంది పలికారు. ఆ తరువాత డచ్చి, ఇంగ్లీషు, ఫ్రెంచి వారు 16 శతాబ్దంలో ఆఫ్రికాలో ప్రవేశించారు. పశ్చిమ ఆఫ్రికానుండి పోర్చుగీసువారు ఆ ఖండంలో ప్రవేశించి అనతికాలంలోనే మిగతా ప్రాంతాలను ఆక్రమించారు. పశ్చిమరాజ్యాల ప్రవేశంకు ఆఫ్రికా ఆచార వ్యవహారాలు, వ్యవస్థలు భస్మమయ్యాయి. మాంగోపార్క్, డేవిడ్ లెవింగ్‌టన్, హెచ్. ఎన్. స్టాన్‌లీ మొదలైన అన్వేషకులు ఆఫ్రికా లోని మారుమూల ప్రదేశాలను పశ్చిమరాజ్యాల వర్తక నాగరికత ప్రభావానికి లోను చేశారు. మతము, వర్తకము, వలసవిధానము, సామ్రాజ్యవాదము ఒకదాని తరువాత ఒకటి ఈ 'చీకటి ఖండం' లోనికి ప్రవేశించి ఆఫ్రికన్‌ల స్వాతంత్ర్యాన్ని, ఆర్థిక వ్యవస్థను సమూలంగా పశ్చిమరాజ్యాలు తమ ప్రాబల్యంలోనికి తీసుకువచ్చారు.

1880-90 ల మధ్య 20 కోట్ల జనాభా కలిగిన ఆఫ్రికా ఖండం ఐరోపా రాజ్యాల మధ్య అమానుషంగా, అనాగరికంగా పంచుకోబడింది. ఫ్రాన్స్, బ్రిటన్, ఇటలీ, స్పెయిన్, బెల్జియం, పోర్చుగల్ రాజ్యాలు ఆఫ్రికాను తమ వలస రాజ్యాలుగా విభజించుకున్నారు. 1884 బెర్లిన్ లో జరిగిన సమావేశంలో 'ప్రాబల్య ప్రాంతాలు' గా తమ విభజిత ప్రాంతాలను సర్దుబాటు చేసుకున్నారు. 4 వందల సంవత్సరాలు ఆఫ్రికన్ల రక్తమాంసాలు ఐరోపా రాజ్యాల ఆర్థికాభివృద్ధికై తర్పణం చేయబడ్డాయి. స్వార్థము, దుర్మార్గము, అమానుషమైన విధానాలతో వారు ఆఫ్రికాను దోచుకోవటమేకాక ఆఫ్రికాలోని నీగ్రోలతో బానిస వ్యాపారం చేశారు. ఈ దౌష్ట్యాన్ని ఎదిరించిన ఆఫ్రికా జాతీయులు తుపాకులకు బలయ్యారు. ఆఫ్రికాలోని మొజాంబిక్, కాంగో, రోడేషియా, పశ్చిమ ఆఫ్రికా తదితర ప్రాంతాలలోని పెద్దల, పిన్నల రక్తం ఆఫ్రికా స్వాతంత్ర్యోద్యమానికి నీరుపోసింది. 1952 లో ఒక్క కీన్యాలోనే 11 వేలమంది ఆఫ్రికన్లను బ్రిటీషువారు చంపారంటే, ఆఫ్రికా స్వాతంత్ర్యోమ బలిదానం మనకు తెలియగలదు. మడగాస్కర్‌లో 40 వేలమంది చంపబడ్డారు. అంగోలా, మొజాంబిక్‌లలో లక్షలాదిమంది పోర్చుగీసువారి దమన విధానానికి పైశాచిక ప్రవర్తనకు బలయ్యారు.

మొదటి ప్రపంచ యుద్ధానంతరము ఆఫ్రికా జాతీయోద్యమములో క్రొత్త పద్ధతులు ప్రవేశపెట్టబడ్డాయి. బలమైన ఆఫ్రికా కార్మికోద్యమము స్థాపింపబడింది. రైతులు కూడా సంఘాలుగా ఏర్పడ్డారు. పశ్చిమరాజ్యాల సంబంధాల మూలంగా ఆఫ్రికాలో కూడ ఆసియాలో వలే జాతీయతత్వం చదువుకున్న యువకుల ద్వారా విస్తృత ప్రచారాన్ని పొందింది. మొదటి ప్రపంచ యుద్ధంలో ఇంగ్లాండు, ఫ్రాన్సులు ఆఫ్రికానుండి 6 లక్షల సైన్యాన్ని, రెండులక్షల కార్మికులను ఐరోపా యుద్ధాలలో వినియోగించారు. అంతేకాక యుద్ధకాలములోని అత్యవసర పరిస్థితుల మూలంగా వారికి కొన్ని ఆర్థిక రాయితీలు కూడా ఇవ్వబడ్డాయి. రెండవ ప్రపంచ యుద్ధం ఆఫ్రికా జాతీయతత్వాన్ని అభివృద్ధిపరచింది. యుద్ధంలో మిత్రరాజ్యాలు వారిపై ముడిసరుకులకు ఆహారానికి కూడా ఆధారపడి ఆఫ్రికా సహకారాన్ని వాంఛించారు. ఈ యుద్ధకాలములోనే ఆఫ్రికాలో మానవ హక్కుల ప్రచారము విస్తృతమైంది. ఆఫ్రికాపై ఐరోపా పట్టు సడలింది. ఆఫ్రికా స్వాతంత్ర్యోద్యమాలు బలపడ్డాయి. విప్లవాత్మక ఆఫ్రికా నాయకత్వం అవతరించింది. దీనినే "అఖండ ఆఫ్రికా ఉద్యమం" (Pan Africanism) అని పిలుస్తారు. ఆఫ్రికాలోని స్వాతంత్ర్యోద్యమ అభివృద్ధి ప్రతి దేశములోను ఒక జాతీయోద్యమానికి పునాదులు వేసింది. మార్కస్ ఆరిలన్‌గ్రవి, విలియమ్ డ్యూమెథ్యుస్ అనే ప్రముఖ ఆఫ్రికన్లు ప్రప్రథమ అఖండా ఆఫ్రికా సమావేశాన్ని 1900 లో లండన్‌లో ఏర్పాటు చేశారు. 1909 లో విలియమ్ డ్యూబొథ్యుస్ నల్ల జాతీయుల పురోభివృద్ధికై ఒక సంస్థను స్థాపిస్తూ "ప్రపంచంలో అత్యధికులు నల్లజాతివారే" నని ఉద్ఘాటించారు మార్కస్ ఆరిలన్‌గ్రవి "ప్రపంచ నీగ్రోల అభివృద్ధి, ఆఫ్రికా జాతీయుల మండలిని స్థాపించి ఆఫ్రికా చైతన్యానికి కారకుడయ్యాడు. మొదట ప్రపంచయుద్ధకాలములో ఈ ఉద్యమం బలపడింది. "ప్రపంచ నీగ్రోల హక్కుల పత్రం" రూపొందించబడింది.

రెండవ ప్రపంచ యుద్ధానంతరము ఆఫ్రికా రాజ్యాలు స్వాతంత్ర్య పథములో అడుగిడాయి. సామ్రాజ్యవాదానికి రోజులు చెల్లాయని పశ్చిమ రాజ్యాలు గుర్తించాయి. 1919 తరువాత దక్షిణాఫ్రికా ఇథియోపియా, లిబేరియాలు మాత్రమే స్వతంత్ర్య రాజ్యాలు. కాని రెండవ ప్రపంచ యుద్ధానంతరము ఆఫ్రికా రాజ్యాలలో ఎక్కువ శాతం విముక్తమయ్యాయి. ఈజిప్టు, సూడాన్, ఇథియోపియా, లిబేరియా, మొరాకో, టూనీషియా, ఘనా, లిబియాలు స్వాతంత్ర్యాన్ని పొందాయి. 1960 సంవత్సరాన్ని ఆఫ్రికా సంవత్సరంగా పిలుస్తారు. అప్పటికి ఆఫ్రికా ఖండంలో 25 రాజ్యాలు స్వతంత్రం కాగా 1960-65 మధ్య మరికొన్ని రాజ్యాలు విముక్తమయ్యాయి. ఈ మధ్యనే నమీబియాకు కూడా స్వాతంత్ర్యము వచ్చుటతో ఒక్క దక్షిణాఫ్రికా శ్వేత జాతీయ అహంకార ప్రభుత్వం మినహ మిగతా ఆఫ్రికా అంతా జాతీయ స్వాతంత్ర్యాన్ని సంపాదించుకున్నట్లే అయ్యింది.

ఈ ఆఫ్రికా జాతీయోద్యమాల సమైక్యత, అఖండ ఆఫ్రికాభావన కొన్ని ఒడిదుడుకులకు లోనైనా, మొత్తంమీద నేడు ఒక పటిష్టమైన శక్తిగా అంతర్జాతీయ పరిణామాలను ప్రభావితం చేస్తుంది. 1955 లో బాండుంగ్ సమావేశంలో ప్రప్రథమంగా ఆఫ్రికా రాజ్యాలు ఒక అంతర్జాతీయ సమావేశంలో సమాన హోదాలో పాల్గొన్నాయి. విముక్తి ఆఫ్రికా, స్వతంత్ర్య ఆసియాతో చేతులు కలిపిన చరిత్రాత్మక సంఘటన. అది 1958లో ఆఫ్రికాలో స్వతంత్ర ఆఫ్రికా రాజ్యాల సమావేశమై సంయుక్తంగా తమ సమస్యలను ప్రపంచ రాజకీయములలో తాము నిర్వహించవలసిన పాత్రను చర్చించాయి. ఇది వారి సమైక్యతకు తదితర అవిముక్త ఆఫ్రికా రాజ్యాలకు వారి మద్దతుకు నిదర్శంగా భావించింది. అన్ని జాతులు సమానమేనని ఇతరుల విషయంలో ఎవరూ జోక్యం చేసుకోరాదని ఆఫ్రికా సమావేశం ఉద్ఘాటించింది. ఆఫ్రికా రాజ్యాల మధ్య ఆర్థిక సహకారం పెంపొందాలని, తమ ఖండంలో విదేశీ పెట్టుబడులు ఎట్టి షరతులు లేకుండా ఉండాలని, సమైక్య కృషికై వివిధ రాజ్యాల అధినేతలు తరచు సమావేశం కావాలని ఆఫ్రికా సమావేశం తీర్మానాలు చేసింది. 1963 లో జరిగిన అడిస్ అబాబా సమావేశంలో ఆఫ్రికా సమావేశ తీర్మానాలు మరింత స్థిరత్వాన్ని పొంది ఆఫ్రికా వలస విధానికి, సామ్రాజ్యవాదానికి, జాతి విచక్షణకు విరుద్ధంగా సమైక్య ఆఫ్రికా సాధనకు దోహదం చేసింది. అడిస్ అబాబా సమావేశంలో ఆఫ్రికా సమైక్యతా సాధనకు ఆఫ్రికా రాజ్యాల సార్వభౌమాధికారాల పరిరక్షణకు, వలస విధానాన్ని రూపుమాపడానికి, అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందింప చేయడానికి, ఆఫ్రికా రాజ్యాలమధ్య సమన్వయ సహకారాలు పెంపొందించి ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరచడానికిక దృఢ సంకల్పంతో కృషి చేయాలని తీర్మానించారు. దక్షిణాఫ్రికా జాతి విచక్షణా విధానాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశం ఆఫ్రికా ప్రజల విశ్వాసాన్ని, సహకార భావాన్ని, సమైక్యతను చాటిచెప్పింది.

## 14.8. ఆఫ్రో - ఆసియా రాజ్యాల సహకారం - బాండుంగ్ సమావేశం .

20 వ శతాబ్దపు ప్రముఖ ఘట్టాలలో ఆసియా జనాభాలో సగం విస్తీర్ణతలో మూడవ భాగమున్న ఆసియా ఉత్తేజితం కావడం ప్రపంచ రాజకీయాలలో ఎన్నో పరిణామాలకు కారణమైంది. ఆసియా ప్రాదుర్భావము ప్రపంచంలో వలస విధానానికి సామ్రాజ్యవాదానికిక గొడ్డలిపెట్టుగా మారి అనతి కాలంలోనే ఆఫ్రికా విజృంభణకు, లాటిన్ అమెరికా స్వాంతత్ర్యానికి దారి తీసింది. "రాజకీయ, జాతీయ పరిధిలో ఆసియా విప్లవము పూర్తి అయింది. క్రొత్తగా ఆర్జించిన స్వాతంత్ర్యము పెద్దగా ప్రమాదంలో పడలేదని సూయజ్ సంఘటన నిరాకరిస్తుంది". "పశ్చిమ రాజ్యాల రాజకీయ అధికారం ఇక కొనసాగదు. ఎన్నో శతాబ్దాల నిర్వీర్యత పిదప ఆసియా తనను తాను పాలించుకుంటుంది." అని ప్రొఫెసర్ రోమీన్ వ్యాఖ్యానించారు.

ఆసియా దేశాలలోని ఈ రాజకీయ విప్లవము మరో రెండు విప్లవాలకు దారితీసింది. ఈ దేశాలు శాస్త్ర సాంకేతిక రంగాలలో పురోగమించి, ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు వేస్తూ, సామాజికంగా కూడా పెద్ద మార్పులకు లోనగుచున్నారు. రాజకీయ విప్లవంతోపాటు ఆర్థిక, సాంఘిక విప్లవాలు కూడా ఆసియా ప్రజలను ఉత్తేజితులను చేశాయి. ఆసియా, ఆఫ్రికా దేశాలలో ఒక్క జపాన్ మినహా మిగతా రాజ్యాలన్నీ పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, అనారోగ్యబాధలతో సతమత మయ్యాయి. పేదరికం రాజకీయ అసంతృప్తికి, పెక్కు తిరుగుబాట్లకు దారితీసింది. "20 వ శతాబ్దపు చరిత్రను లిఖించినపుడు ప్రపంచ యుద్ధాలు, అణుశక్తి కనుగొనడం, మానవుడు అనంత విశ్వంలో అడుగుపెట్టడం, చంద్రమండలం పరిశోధించడం ముఖ్యసంఘటనలుగా చెప్పబడవు. ప్రపంచం లోని మూడింట రెండువంతుల జనాభా నిద్రనుండి మేల్కొని మెరుగైన జీవనం సాగించడానికి వీలున్నది అనే విషయాన్ని తెలుసుకోవడం అతి ప్రధానమైన సంఘటన. ఈ శతాబ్దంలో పేదరికము, నిరక్షరాస్యత, అనారోగ్యాలను ప్రపంచంనుండి వీలైనంత వరకు రూపుమాపగలిగితే 20 వ శతాబ్దపు చరిత్రలోని యుగాలలోఅన్నింటికన్నా అపురూపంగ మిగిలి పోతుంది" "అని ప్రొఫెసర్ హన్‌మాన్ పలికారు.

మహోన్నత ఆసియా 20 వ శతాబ్దం వరకు పశ్చిమ రాజ్యాల పాలనలోనే వుండిపోయింది. పశ్చిమ రాజ్యాల ఆధిక్యతను కె. ఎమ్. పణిక్కర్ ఆసియా భూభాగ వాసులపై నావికాబల దేశాల ఆధిక్యతగా వ్యవసాయం, కుటీర పరిశ్రమలపై వ్యాపారం, పారిశ్రామిక విప్లవ అధికారంగా అభివర్ణించాడు. 20 వ శతాబ్దంలో ఆసియా రాజ్యలు విదేశ పాలననుండి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఆకాంక్షించారు. మొదటి ప్రపంచ యుద్ధం, 1917 రష్యావిప్లవం ఆసియాపై తిరుగులేని ప్రభావాన్ని చూపాయి. యుద్ధం తరువాత ఇంగ్లాండ్ ప్రపంచ రాజకీయాలలో తమ ప్రముఖ స్థానాన్ని కోల్పోయి, ఆసియా ప్రజల జాతీయ భావన కూడా దీనికి తోడయింది. రష్యాలోని కమ్యూనిష్టు విప్లవం సామ్రాజ్యవాద విరుద్ధశక్తిగా వారికి తోచింది. 1930 తరువాత జపాన్ విజృంభణ "ఆసియా ఆసియావారికే" అనే నినాదం రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ పతనం తరువాత కూడా ఘంటానాదంగా మ్రోగింది.

రెండో ప్రపంచ యుద్ధానంతరం బ్రిటన్, ఫ్రాన్స్, నెదర్లాండ్‌ల పాలనలోని సామ్రాజ్యాలు కూలిపోయి పెక్కు ఆసియా రాజ్యాలు స్వతంత్రమైనవి. భారతదేశ స్వాతంత్ర్యము మరో అధ్యాయంలో వివరింపబడింది. ఎన్నో దేశాలు స్వతంత్రమయ్యాయి. చైనాలో విదేశీ జోక్యం తొలగిపోయి, కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో ప్రజాప్రభుత్వ మేర్పడింది. బర్మా, పాకిస్తాన్, ఫార్మోజా, ఫిలిప్పైన్స్‌లు స్వాతంత్ర్యాన్ని సాధించుకున్నాయి. ఈ దేశాలన్నింటిలోను ఆర్థికశాఖ వృద్ధికై ప్రయత్నాలు కొనసాగాయి.

అంతర్జాతీయ సంబంధాలలో ఈ దేశాలు చాలావరకు శాంతియుత సహజీవన సిద్ధాంతాన్ని అనుసరించాయి. తమకున్న పరిమిత వనరులను ఆర్థిక పునర్నిర్మాణానికే వెచ్చించాలని తలచాయి. ప్రపంచశాంతిలో వాటికి నమ్మకమేకాక ఆవశ్యకత కూడా ఉన్నది. దీనివల్ల కొంతవరకు ప్రపంచంలో శాంతి సుస్థిరతలకు అవకాశమేర్పడింది. ఐక్యరాజ్యసమితిని ఆసియా దేశాలు పూర్తిగా సమర్థించాయి. ఈ సమితి ఆర్థిక, సంక్షేమ కార్యక్రమాలు ఈ దేశాలకు ఎంతో ఉపయోగపడ్డాయి. ఆసియా ఆఫ్రికా దేశాల స్వాతంత్ర్యోద్యమాలు సామ్రాజ్యవాదాన్ని జాతి వివక్షతను చావుదెబ్బ తీసాయి. ఈ రాజ్యాలు ఐక్యరాజ్య సమితిలో జాతి వివక్షణపై ఉమ్మడి పోరాటం నెరపాయి. అంతేకాక ఆసియా దేశాలలో చైతన్యం మూలంగా అఖిల ఆసియా ఉద్యమం ఊపిరి పోసుకున్నది. ఆసియా రాజ్యాలను సంఘటిత పరచడానికి 1947, 1949 లలో న్యూఢిల్లీలో సమావేశాలు జరిగాయి. ఆ తరువాత బాండుంగ్‌లో జరిగిన సమావేశం చారిత్రాత్మకమైనది. ఆ సమావేశాన్ని గురించి చదివేముందు సక్షిప్తంగా ఫిలిప్పైన్స్, ఇండోనేషియాలలో స్వాతంత్ర్య సాధనను గూర్చి ప్రస్తావిద్దాము.

**14.8.1 ఫిలిఫ్ఫైన్స్ :** 1946 జూలై నాలుగవ తేదీన ఫిలఫ్ఫైన్స్ స్వాతంత్ర్య రాజ్యమయింది. నాలుగువందల సంవత్సరాలపాటు స్పానిష్ పాలనలో ఉన్న ఈ దేశం 50 సంవత్సరాల పాటు అమెరికా, జపాన్‌ల దూరప్రాచ్యపోటీలో అంతర్భాగమైంది. రెండో ప్రపంచ యుద్ధకాలంలో ఈ ద్వీపాలను జపాను ఆక్రమించుకుంది. జపాను పతనం తరువాత ఫిలిఫ్ఫైన్స్ స్వతంత్ర్య రాజ్యమైంది. అమెరికా పాలనా కాలంలో ఈ రాజ్యంలో గణనీయమైన అభివృద్ధి సాధింపబడింది. ఫిలిఫ్ఫైన్స్ స్వతంత్రరాజ్యమైనా అమెరికా వర్తక ప్రయోజనాలకు హామీలు ఇవ్వబడ్డాయి.

1946 లో రిపబ్లిక్‌గా మారిన ఫిలిఫ్ఫైన్స్ ఎన్నో ఆర్థిక సమస్యలను ఎదుర్కొన్నది. ఆహారము కొరత ఏర్పడింది. వైద్య, ఆరోగ్య సదుపాయలు లోపించాయి. జనాభాకు తగిన వనరులు లేకపోయాయి. 1946 లో భూస్వాములు ధనికుల మద్దతుకై అమెరికా ఆశీర్వాదం కల లిబరల్‌పార్టీ అధికారంలోనికి వచ్చింది. కాని తీవ్ర ఆర్థిక అసంతృప్తి మూలంగా కమ్యూనిస్టు సిద్ధాంతాలచే ప్రభావితమైన ఉగ్రవాదులు ప్రభుత్వానికి ఎన్నో బెడదలు కల్పించారు. 1953 లో అధికారానికి వచ్చిన రైమండ్‌మెగస్సే ఎన్నో సంస్కరణలు చేసి కొంత సుస్థిరతను స్థాపించారు. అతడు విమానప్రమాదంలో మరణించగా కార్లోగ్రాసియా అధ్యక్షుడయ్యాడు. 1961 లో అతడు పడిపోయి మెకపాగల్ అధ్యక్షుడయ్యాడు. 1965 లో అధ్యక్షుడైన ఫెర్డినాండ్ అమెరికాతో పరస్పర రక్షణ సంధి చేసుకున్నాడు. అంతేకాక అన్ని విషయాలలోను అమెరికాపై ఆధారపడ్డాడు.

ఆ తరువాత ఫిలిఫ్ఫైన్స్ అధ్యక్షుడైన మార్కోస్ నియంతగా మారి ఇటీవల కాలం వరకు పదవిలో కొనసాగాడు. ఇతని కాలంలో ప్రజాస్వామ్య వ్యవస్థలు భగ్నమయ్యాయి. అమెరికా సాయంపైన పూర్తిగా ఆధారపడ్డాడు. వారి సైనిక బలంతోనే పాలన సాగించాడు. ప్రజాస్వామ్య పునరుద్ధరణకై ఎన్నో ఉద్యమాలు బయలుదేరాయి. ఎందరో ప్రాణాలు పోగొట్టుకున్నారు. సుమారు రెండు దశాబ్దాలు అవినీతి ఆశ్రిత పక్షపాతం నియంతృత్వంతో పాలన సాగించారు. మార్కోస్ చివరకు దేశం వదిలి అమెరికా వెళ్ళవలసి వచ్చింది. శ్రీమతి అక్వినో నాయకత్వంలో తిరుగుబాటు విజయవంతమై ప్రజాస్వామ్యం పునరుద్ధరింపబడింది. నేడు ఫిలిఫ్ఫైన్స్ తటస్థరాజ్యంగా తన సమస్యలను ఇతరుల ప్రమేయం లేకుండా పరిష్కరించుకోవడానిక ప్రయత్నాలు ప్రారంభించింది

**14.8. 2. ఇండోనేషియా:** ఇండోనేషియా విస్తృత ప్రాంతంలో విసిరివేయబడ్డ పెక్కు ద్వీపాల సముదాయము. వీటిలో ముఖ్యమైన విజావా, సుమత్రా దక్షిణ బోర్నియా, బాలి, సెలిబిస్, లోంబెక్, మొలుకా, పశ్చిమ ఇరియన్ ద్వీపాలు. 17వ శతాబ్దంలో ఆంగ్లేయులను ఓడించి డచ్చివారు ద్వీపాలను ఆక్రమించుకున్నారు. రెండో ప్రపంచ యుద్ధకాలంలో ఈ ద్వీపాలు జపాన్ వశమయ్యాయి. 1945 లో జపాన్ ఓడిపోయిన పిదప డచ్చివారు స్వీకరించాలని ప్రయత్నించారు. ఆగ్నేయాసియాలో జపాన్ ఆధిక్యత కాలంలో స్వాతంత్ర్యాన్ని సంపాదించుకొన్న ఇండోనేషియా రిపబ్లిక్ డచ్చివారిని ఎదిరించింది. 1946 తాత్కాలిక యుద్ధ విరమణ జరిగింది. భద్రతా సమితి జోక్యం చేసుకొన్నది. 1948 డిసెంబర్ 19 వ తేదీన తిరిగి డచ్చి, ఇండోనేషియాల మధ్య పోరాటం ప్రారంభమైంది. యుద్ధ విరమణ చేయమని భద్రతా సమితి కోరింది. అమెరికా, ఇంగ్లాండులు డచ్చివారిపై దౌత్యపరంగా ఒత్తిడి తీసుకువచ్చారు. న్యూఢిల్లీలో జరిగిన 15 రాజ్యాల సమావేశంలో డచ్చివారు వెంటనే ఇండోనేషియానుండి వెళ్ళిపోవాలని కోరారు. సంప్రదింపులు జరిగి చివరకు 1949 డిసెంబరు 27వ తేదీన ఇండోనేషియా స్వతంత్ర రాజ్యంగా అవతరించింది.

సుకర్నో ఊహించినట్లుగా ఇండోనేషియా కష్టాలు స్వాతంత్ర్యం రాగానే ప్రారంభమయ్యాయి. అతివాద ముసల్మానులు, కమ్యూనిస్టులు తిరుగుబాట్లు చేశారు. దక్షిణ మొలకాస్ ద్వీపాలు 1950 లో స్వతంత్ర్యం ప్రకటించుకున్నాయి. పశ్చిమ ఇరయాన్‌లో తమ ఆధిక్యతను నిలబెట్టుకోవడానిక డచ్చివారు తిరుగుబాట్లను ప్రోత్సహించారు. చివరకు ఆఫ్రో-ఆసియా రాజ్యాల సంఘటిత కృషివల్ల, అంతర్జాతీయ కమ్యూనిజం ప్రమాదంవల్ల డచ్చివారు పశ్చిమ ఇరియాన్‌ను, ఇండోనేషియాకు ఇచ్చివేశారు.

ఇండోనేషియా ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని అమలుపరచింది. కాని జాతీయ సమైఖ్యత గడ్డు సమస్యగా మిగిలిపోయింది. 42 రాజకీయ పక్షాలు ఏర్పడ్డాయి. సైనిక నాయకుల సుమత్రా, సెలిబస్ ద్వీపాలలో తిరుగుబాట్లు చేసి మరింత గందరగోళం సృష్టించారు. ప్రజాస్వామ్యం విఫలమై 1955 లో సుకర్నో సైనిక సహాయంతో పార్లమెంటు అధికారాలను తగ్గించి నియంతృత్వాధికారాలను స్వీకరించాడు. 1958 నాటికి కొంత సుస్థిరత ఏర్పడింది. సైన్యం ప్రభుత్వాధికారాలను చేపట్టింది. 1978 లో సుకర్నో స్థానంలోజనరల్ సుహార్తో అధికారానికి

వచ్చి కొన్నాళ్ళు అత్యవసర అధికారాలతో పాలించి ఐదేళ్ళపాటు అధ్యక్షునిగా, కాంగ్రెసుచే ఎన్నుకోబడ్డాడు. సుహార్తో ఇండోనేషియా రాజకీయాలలో చాలావరకు మధ్యే మార్గాన్ని ఎన్నుకున్నాడు. మలేషియా ఏర్పాటువల్ల ఇండోనేషియా, మలేషియాలు సంఘర్షణ పడ్డాయి. ఇండోనేషియా భారతదేశంలో పశ్చిమ రాజ్యాలతో సత్సంబంధాలు నెలకొల్పుకుంది. చైనా, రష్యాలతో సంబంధాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. "వలస పాలన నుండి విముక్తమైన పశ్చిమాసియా రాజ్యాలలో ఇండోనేషియా భవితవ్యము అనిశ్చితముగా నున్నదని" ఫ్రీడ్‌మన్ వ్యాఖ్యానించాడు.

**14.8. 3. బాండుంగ్ సమావేశము (1955) :** "బాండుంగ్ సమావేశము ఆసియాపై ఐరోపా ఆధిపత్యానికి ముగింపు పలికింది. "బాండుంగ్ ప్రాచీన ఆసియాకు వీడ్కోలు చెప్పి నూతన శకానికి నాంది పలికింది" అని ప్రొఫెసర్ రోమీన్ వ్యాఖ్యానించారు. ఈ సమావేశం ఆఫ్రికా, ఆసియా రాజ్యాల అంతర్జాతీయ సహకార భావానికి ప్రతీక. ప్రపంచ ఉద్రిక్తలను తగ్గించడానికి శాంతిని సుస్థిరం చేయడానికి ఆసియా, ఆఫ్రికా, ప్రజల ప్రతిస్పందనమే ఈ సమావేశ నిర్వహణ కారణం. ఇట్టి సమావేశానికి కొంత నేపథ్యం మనకు చరిత్రలో కన్పిస్తుంది. ఆసియా, ఆఫ్రికా ఖండాలలో నూతనంగా విముక్తమైన రాజ్యాలు రెండో ప్రపంచ యుద్ధానంతరం ఐక్యరాజ్యసమితికి లోన బయటా తమ ఐకమత్యాన్ని పెక్కుసార్లు ప్రకటించారు. ఆసియా- ఆఫ్రికా దేశాలు తరచూ సమావేశం కావాలని నిర్ణయించుకున్నారు. 1947 ప్రప్రథమ ఆసియా మహాసభలు న్యూఢిల్లీలో జరిగాయి. 28 రాజ్యాల ప్రతినిధులే కాక కొందరు పరిశీలకులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. 1949 లో డచ్చివారు ఇండోనేషియాపై సైనిక చర్యకు తలపడగా, 15 రాజ్యాలు న్యూఢిల్లీలో సమావేశమై డచ్ నూతన వలస విధానాన్ని తీవ్రంగా ప్రతిఘటించడమే గాక, ట్యునీసియా, మొరాకోలకు స్వాతంత్ర్యం ఇవ్వాలన్న ఐక్యరాజ్యసమితి తీర్మానాన్ని బలపరచారు. కొరియా యుద్ధంలో శాంతి స్థాపనకై ఈ రాజ్యాలు నిరంతర కృషి సలిపాయి.

**14.8. 3. 1 బాండుంగ్ సమావేశ లక్ష్యాలు :** ఇండియా, పాకిస్తాన్ ఇండోనేషియా, బర్మా, శ్రీలంక, ఈ ఐదు రాజ్యాలు కొలంబో ప్రణాళికను అంగీకరించడంతో వీటిని కొలంబో రాజ్యాలంటాము. వీరు 1954 డిసెంబరులో ఇండోనేషియా బోగోర్‌లో సమావేశమై 1955 ఏప్రియల్‌లో ఆఫ్రికా, ఆసియా రాజ్యాల విస్తృత సమావేశాన్ని ఏర్పాటు చేయాలని, బాండుంగ్‌ను సమావేశ స్థలిగా నిర్ణయించారు. ఈ సమావేశానికి ఏ ఐరోపా రాజ్యాన్ని ఆహ్వానించలేదు. ఆసియాలో కొన్ని ప్రాంతాలున్న రష్యాను కూడా వారు పిలవలేదు. ఫార్మోజాలోని నేషనలిస్టు చైనాను ఆహ్వానించలేదు. చైనా ప్రజలకు నిజ ప్రాతినిధ్యం వహించిన కమ్యూనిస్టు చైనాను ఆహ్వానించారు. అరబ్ రాజ్యాల అభ్యర్ధన మేరకు ఇశ్రాయేల్‌ను ఆహ్వానించలేదు. దక్షిణాఫ్రికా పిలవలేదు.

ఈ సమావేశ లక్ష్యాలు :

1. ఆసియా, ఆఫ్రికా, రాజ్యాల మధ్య సుహృద్భావం, సహకారం పెంపొందించి వారి మధ్య స్నేహ సంబంధాలను, ఇరుగు పొరుగు సంబంధాలను పటిష్టంగా చేసి అందరి ప్రయోజనాలను వృద్ధి చేయడం.
2. సమావేశ రాజ్యాల మధ్య సాంఘిక, సాంస్కృతిక సమస్యలను పరిష్కరించుకోవడం.
3. ఆసియా, ఆఫ్రికా, ప్రజలకున్న ప్రయోజనాలను, వారి సార్వభౌమాధికారానికి అడ్డుగా నిలుస్తున్న సమస్యలను, జాతి వివక్షణ వలస విధానములను చర్చించడం.
4. ప్రపంచంలో ఆసియా, ఆఫ్రికా దేశాల, ప్రజల స్థితిని గణింపుచేసి ఈ రాజ్యాలు ప్రపంచ శాంతికి, సహకారానికి తోడ్పడుటలో ఎదుర్కొనే సమస్యలను పరిశీలించడం.

బాండుంగ్ సమావేశము 1955 ఏప్రిల్ 18వ తేదీనుండి 24 వరకు జరిగింది. డాక్టర్ ఆలిశాస్త్రో మిదోజా సమావేశ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఏ విషయం మీద ఓటింగ్ జరగలేదు. సమావేశ అనంతరము అందరికీ అంగీకారమై సంయుక్త ప్రకటన జరిగింది. సమావేశంలో చర్చలు స్వేచ్ఛగా, నిర్మొహమాటంగా జరిగాయి. "ఆఫ్రో ఆసియా కూటమి అనేది లేదు. తూర్పు, పశ్చిమం అనే వివాదం రాలేదు. ప్రతి విషయం మీద బాండుంగ్‌లో సమావేశమైన ప్రతినిధుల వివిధ దృక్పథాలను, అభిప్రాయాలను, ప్రాముఖ్యతలను ప్రదర్శించారు" (అని ప్రొఫెసర్ పామర్, పెర్కిన్స్‌లు వ్యాఖ్యానించారు).

**14.8.3.2 సమావేశ నిర్ణయాలు :** ఈ సమావేశంలో భిన్న ధోరణులు వ్యక్తమయ్యాయి. పశ్చిమ రాజ్యాల తరఫున వకాల్తాపుచ్చుకొని శ్రీలంక ప్రధాని సర్ జాన్‌కోటిన్ ఎలా కమ్యూనిస్టు చైనాను తీవ్రంగా విమర్శించాడు. పాకిస్తాన్, థాయ్‌లాండ్, ఫిలిప్పైన్స్ టర్కీ, ఇరాన్, ఇరాక్‌లు కూడా అమెరికా కూటమిపట్ల సానుభూతిగా ప్రసంగాలు చేశారు. ఈ సమావేశానికి చైనా ప్రతినిధిగా వచ్చిన ఆ దేశ ప్రధానమంత్రి చౌ-ఎన్-లై శాంతిపై తమకు నమ్మకం గలగని అమెరికా, ఇండోనేషియాలతోతమ వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోగలమని చెప్పాడు.

సమావేశంలో అందరినీ ఆకర్షించి, ఆకట్టుకొన్న మహోన్నత రాజనీతిజ్ఞుడు, భారతదేశ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అందరి మన్ననలకు , ప్రశంసలకు పాత్రుడయ్యాడు. శాంతియుత సహజీవన సిద్ధాంతాన్ని, పంచశీలను ఆమోదింపచేయండంతో నెహ్రూ ఆదర్శం బాండుంగ్ సమావేశంలో ప్రతిబింబించింది.

బాండుంగ్ సమావేశంలో పెక్కునిర్ణయాలు చేయబడ్డాయి. సమావేశ రాజ్యాలు ఒకరినొకరు సాంకేతిక సహకారాన్ని అందించుకోవాలని, వివిధ రంగాలలో నిష్ణాతులను ఇచ్చిపుచ్చుకోవాలని, శిక్షణకు అవకాశాలు కల్పించాలని అంగీకరించారు. ఆర్థిక రంగంలో పెక్కుసిఫార్సులు చేశారు. ఐక్యరాజ్యసమితి ఆర్థిక సంఘాలనుండి ఆఫ్రో, ఆసియా దేశాలకు విస్తారంగా సాయం అందించాలని, అంతర్జాతీయంగా అవసరమైన వస్తువుల ధరలను స్థిరీకరించాలని, నౌకావాణిజ్య సదుపాయాలు పెపొందించాలని కోరారు. సమావేశ దేశాలలో అభిప్రాయాలను, విషయాలను తెలుసుకోవడానికి అధికారులను నియమించుకోవాలని తలచారు.

అంతర్జాతీయ రంగంలో ఈ సమావేశం పెక్కు అభిప్రాయాలను ప్రకటించింది. అణుశక్తి శాంతియుత ప్రయోజనాలకే వినియోగించాలని కోరారు. జాతి విచక్షణ విధానాన్ని, జాత్యంహకార విధానాన్ని నిరంసించారు. ఆఫ్రికా, ఆసియా ప్రజల హక్కులు పరిరక్షింపబడాలని ఉద్ఘాటించారు. వలస విధానం ఏ రూపంలో ఉన్నా దాన్ని తుదముట్టించాలని చెప్పారు. పాలస్తీనాలోని అరబ్బులకు మద్దత్తు తెలుపుతూ ఈ విషయంలో ఐక్యరాజ్య సమితి తీర్మానాన్ని అమలు పరిచి పాలస్తీనా సమస్యకు శాంతియుత పరిష్కారం సాధించాలని ఆశించారు. సాంస్కృతిక రంగంలో ఈ రాజ్యాలన్నీ సహకరించుకోవాలని, ద్వైపాక్షిక ఒడంబడికలు చేసుకోవాలని ఆకాంక్షించారు. ఐక్యరాజ్యసమితి లక్ష్య ప్రకటనలో తమకు విశ్వాసం కలదని, ప్రపంచ మానవ హక్కుల ప్రకటన అన్ని రాజ్యాలకు, జాతులకు వర్తించాలని చెప్పారు. కంబోడియా, శ్రీలంక, జపాన్ జోర్డాన్, లిబియా, నేపాల్, వియత్నాంలను ఐక్యరాజ్యసమితిలో చేర్చుకోవాలని సిఫారసు చేశారు. నిరాయుధీకరణ అణ్వస్త్రాల నిషేధం మానవ జాతి మనుగడకు ఆవశ్యకమని అభిప్రాయపడ్డారు.

**14.8. 3. 3. సమీక్ష :** స్వతంత్ర్య ఆఫ్రో, ఆసియా రాజ్యాల చరిత్రలో బాండుంగ్ సమావేశం అతి ముఖ్యమైనది. వారికి ఉమ్మడి ఆసక్తులను, ఆదర్శాలను వెల్లడించడానికి ఈ సమావేశం తోడ్పడింది. ఈ సమావేశం ఆసియాలో ఐరోపా తిరోగమనాన్ని సూచించింది. "ఆధునిక చరిత్రలో బాండుంగ్ ఒక మహోన్నత కీలకమైన మలుపు. అది ఐరోపా శృంఖలాల నుండి విముక్తమైన రాజ్యాల సార్వభౌమాధికార ప్రకటన జరిగిన విషయాలపై శల్య పరీక్షలు కాక, ఆసియా, ఉత్తర ఆఫ్రికా రాజ్యాల నూతన ఉత్సాహ ఉద్వేగ ప్రదర్శనగా నిలిచింది". "జాతి విచక్షణపై విరుచుకపడ్డ విముక్తజాతుల సంఘటిత శక్తి" అని ఈ సమావేశాన్ని ప్రొఫెసర్ ఇయాన్ థామ్‌సన్ శ్లాఘించారు.

అయితే ఈ బాండుంగ్ ఆదర్శము స్ఫూర్తి ఎక్కువకాలం నిలువలేదు. 1962 చైనా భారతదేశంపై దండయాత్ర చేయడంతో ఆసియా ఐక్యత భగ్నమైంది. 1961 లో బెల్‌గ్రేడ్‌లో జరిగిన తటస్థ రాజ్యాల సమావేశం 1964 లో కైరోలో జరిగిన అలీన రాజ్యాల సమావేశం, బాండుంగ్ ఆశయాలకు కొంతవరకు ఊపిరిపోశాయి. 1965 లో అల్జీర్స్‌లో జరుగవలసిన రెండో ఆఫ్రో, ఆసియా రాజ్యాల సమావేశం జరుపలేదు. అప్పటికే చైనా, రష్యాల మధ్య సంబంధాలుకూడా కొంత దెబ్బతిన్నాయి. ఈ నాటికి కూడా అలీన విధానానికి, ఐక్యరాజ్యసమితిలో ఆఫ్రికా, ఆసియా దేశాల సామూహిక శాంతి కృషికి బాండుంగ్ సమావేశం నాటి స్ఫూర్తి, ప్రేరణయని చెప్పదగును.

17

## 14.9. Reference Books : (Lessons 7 to15)


1. E.H Carr - Twenty years of crisis, 1919-1939
2. E.H Carr - International Relations between the Two World Wars
3. C.D.M Ketelbey - A History of Modern Times from 1789
4. Thomson, David - World History 1914 - 1968
5. Stewarat C.Easton - World Since 1918
6. R. Storry - A History of Modern Japan
7. D.M Brown - Nationalism in Japan .
8. F.C Jones - Japanís New Order in Asia : Its Rise and Fall
9. C. C. Bayley - This age of Conflict : A Contemporary World History 1914 to Present
10. A. D Barnelt- Communist China and Asia
11. S. D Baily - The United Nations
12. G. P. Gooch - A History of Modern Times
13. A.J.P. Taylor - The Struggle for Mastery in Europe
14. Jawaharlal Nehru Glimpses of World History
15. H.A.L. Fisher - A History of Europe, Vol. II
16. C.J. H. Hayes - Modern Europe to 1870
17. C.J. H. Hayes - Contemporary Europe Since 1870
18. Thomson, David - Europe Since Napoleon
19. E. Lipson - Europe in the 19th and 20th centuries
20. Grant and Temperly - Europe in the 19th and 20th centuries
21. Horold M.Vinacke - History of For East in Modern Times
22. H.B.Parkes - The United States of America : A History
23. H.W. Elson - History of the United States of America
24. Nevins and Commager - A short History of the United States
25. K. Rajyyan - History of the United States
26. P.H Clyde - The Far East
27. Samson - The Western World and Japan
28. R. storm - History of Modern Japan
29. Schwarta Benjimen - Chinese Communism and the rise of Mao
30. Lattimore - Making of Modern China


**Dr. V.K. Mohan**

పాఠం - 15

# ప్రచ్ఛన్న యుద్ధం

**లక్ష్యం:**

రెండో ప్రపంచ యుద్ధం తరువాత అమెరికా విదేశాంగ విధానం, మార్షల్ ప్రణాళిక, ట్రూమన్ సిద్ధాంతం, సైనిక కూటములు, వార్సా ఒప్పందం గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

**విషయ సంగ్రహం:**


15.1. పరిచయం

15.2. పుట్టుక-వృద్ధి

15.3. ప్రచ్ఛన్న యుద్ధం. మొదటిదశ

15.4. ప్రచ్ఛన్న యుద్ధం. రెండోదశ

15.5. ప్రచ్ఛన్న యుద్ధం- మూడోదశ

15.6. ప్రచ్ఛన్న యుద్ధం - నాల్గోదశ

15.7. ట్రూమన్ సిద్ధాంతం

15.8. మార్షల్ ప్రణాళిక

15.9. సైనిక కూటములు

15.9.1. అంజుస్

15.9.2. సెంటో

15.9.3. సియటో

15.9.4. రియో

15.9.5. నాటో

15.9.6. వార్సా ఒప్పందం


## 15.1. పరిచయం:

రెండో ప్రపంచ యుద్ధం తరువాత పాశ్చాత్య దేశాలకూ, తూర్పు యూరప్ కమ్యూనిస్టు కూటమికీ మధ్య ఏర్పడిన విపరీతమైన ఉద్రిక్తత పరిస్థితి, వైరుధ్యమే ప్రచ్ఛన్న యుద్ధం. రాజకీయంగా యుక్తులు పన్నడం, దౌత్యపరమైన కలహాలు, మానసిక యుద్ధం, ఆదర్శ పరమైన వైరుధ్యం, ఆర్థిక పరమైన పోరాటం, ఆయుధ పోటీ, సరిహద్దుల్లో యుద్ధాలు అనేవి ప్రచ్ఛన్న యుద్ధకాలపు లక్షణాలుగా ఉన్నాయి. సంక్షిప్తంగా చెప్పాలంటే ప్రత్యక్షంగా యుద్ధం చేయడం తప్ప, ఆ యుద్ధ లక్షణాలు అన్నీ ప్రచ్ఛన్న యుద్ధ లక్షణాలుగా ఉన్నాయి. రెండో ప్రపంచ యుద్ధం తరువాత నూతన అధికార సమతౌల్యానికి సంబంధించిన పునర్నిర్మాణంలో భాగంగా జర్మనీని విభజించే సందర్భంలో తలెత్తిన సంఘర్షణల్లోనే ప్రచ్ఛన్న యుద్ధానికి బీజాలు పడ్డాయి. తూర్పు యూరప్ రాజ్యాలను కమ్యూనిస్టు దేశాలుగా మార్చడంతో పాటు వాటిని సోవియట్ ప్రాబల్యంలోకి తీసుకురావడం, అమెరికా సంయుక్త రాష్ట్రాలలో క్రియాశీలమైన కమ్యూనిస్టు వ్యతిరేక తత్వం, విధానాలు వృద్ధి చెందడం, మిత్రకూటములు వ్యతిరేక మిత్రకూటములు, ఏర్పాటు చేయడం వంటి ప్రయత్నాల వల్ల యుద్ధ కాంక్ష మిత్రుల మధ్య భయాందోళనలతో కూడిన వాతావరణం విస్తరించింది.

పరాజిత విభజిత రాజ్యాలు, అధికారశూన్యం, ఆదర్శాల మధ్య వైరుధ్యం, భారీ పునర్నిర్మాణ కార్యక్రమాలు, అణ్వాయుధాలు, రెండు అగ్ర రాజ్యాల మధ్య రాజకీయ అధికార పరమైన శతృత్వం నెలకొన్న యుద్ధానంతర కాలంలో ప్రచ్ఛన్న యుద్ధం అనివార్యమైన పరిణామంగా రూపొందింది. ప్రచ్ఛన్న యుద్ధం ప్రారంభంలోనే వైరుధ్యం ద్వారా వర్గాలు తెంచుకొన్న శక్తులు, స్వయం ఉత్పాదక ప్రేరణ కల్పించాయి. ఈ తీవ్రత 15 సంవత్సరాల పాటు కొనసాగింది.

అయితే 1960లో ప్రచ్ఛన్న యుద్ధం తీవ్రత క్రమంగా తగ్గుముఖం పట్టడం ప్రారంభమైంది. సోవియట్ రష్యా తన 'ఇనుపతెర' ఆంక్షలను సడలించింది. తూర్పు యూరప్ రాజ్యాలలో పెరుగుతున్న బహు కేంద్రీయ జాతీయతావాదం వల్ల సోవియట్ ప్రాభల్యం బలహీనమైంది. సోవియట్‌లకూ, కమ్యూనిస్టు చైనాకు మధ్య కమ్యూనిస్టు శిబిరంలోనే తీవ్రమైన వైరుధ్యం ఏర్పడటం వల్ల సోవియట్ దృష్టి ప్రచ్ఛన్న యుద్ధం నుంచి పక్కకు మళ్ళింది. దీంతో అంతర్జాతీయ సామరస్య యుగం ఆరంభమైంది. అదే సమయంలో పాశ్చాత్యా శిబిరంలో అమెరికా నాయకత్వం క్రమంగా తగ్గుముఖం పట్టడం, నాటో దేశాలలో ఐక్యతా సంబంధాలు బలహీనం కావడం,ఆసియా సమస్యల పట్ల అమెరికా ఆసక్తి చూపడం అనేవి ప్రచ్ఛన్న యుద్ధానికి చెందిన పాత కక్షలను తుడిచి పెట్టడంలో తోడ్పడ్డాయి. అయితే 1970లో చివరి సంవత్సరాలలో ఆయుధ పోటీ తీవ్రతరం కావడం, తీవ్రమైన మానవ హక్కుల సంఘర్షణ వంటివి మళ్ళీ ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణాన్ని పునరుద్ధరింప జేస్తాయేమోనని భయపడటం జరిగింది. 1980ల ప్రారంభ సంవత్సరాలలో ఆఫ్ఘనిస్థాన్‌లో సోవియట్ దురాక్రమణ ఫలితంగా అంతర్జాతీయ సామరస్యం అంతరించిపోయింది. దాని స్థానంలో ఆయుధ పోటీ తీవ్రతరం కావడం, మాస్కోలోనూ, ఆ తరువాత లాస్ ఏంజిల్స్‌లోనూ జరిగిన ఒలంపిక్ క్రీడలను బహిష్కరించడం వంటి సంఘటనల పరంపర చోటుచేసుకొంది. అగ్ర రాజ్యాల మధ్య అవిశ్వాసం శతృత్వం ప్రభలిపోయాయి. 1881లోనూ, 1882లోనూ పోలెండ్‌లో చెలరేగిన ఆంతరంగిక సంక్షోభం అంతర్జాతీయ ఉద్రిక్త పరిస్థితిని మరింతగా పెంచింది.

## 15.2. పుట్టుక వృద్ధి:-

అధికారం కోసం పోరాటం, ఆదర్శాల మధ్య సంఘర్షణ, జీవన విధానాలు, ఆలోచనా విధానాలు, జాతీయ ప్రయోజనాల సంఘర్షణ వంటి అంశాల ఫలితమే ప్రచ్ఛన్న యుద్ధం. ఆ అంశాల తీవ్రత కాలానుగుణంగా మారుతూవచ్చింది. నెహ్రూ అభిప్రాయంలో ప్రచ్ఛన్న యుద్ధం అనేది కేవలం, పాత అధికార సమతౌల్య భావనకు కొత్త వ్యక్తీకరణ మాత్రమే. ఈ యుద్ధం రెండు గొప్ప శక్తుల మధ్య సంఘర్షణే కాని రెండు ఆదర్శాల మధ్య సాగిన పోరాటం కాదు " కమ్యూనిజం" "సామ్రాజ్యవాదం" అనే నినాదాలను సంఘర్షణను విస్తరించడానికి లేవనెత్తడం జరిగింది. కానీ సంఘర్షణకు అవి మూలకారణం కాదు. ఈ ప్రచ్ఛన్న యుద్ధం అనేది రెండో ప్రపంచ యుద్ధానంతరం చరిత్ర స్వభావాన్ని, దిశనూ ఎక్కువగా దెబ్బతీసింది.

1945లో అణ్వస్త్రాల తయారీతోనూ, మొట్టమొదటి సారిగా వాటిని ఉపయోగించడంతోనూ దాదాపు కలసిపోయిన ప్రచ్ఛన్న యుద్ధం ఆరంభమైనప్పటి నుంచీ, అణుయుద్ధం సంభవించే అవకాశం ఉందనే భయం అంతర్జాతీయంగా అలుముకుపోయింది. ప్రపంచ దేశాలు 1945 నుంచి (సాధారణంగా అందరూ విశ్వసించింది) 1962 అక్టోబర్ క్యూబన్ (క్షిపణి) సంక్షోభం (కొంత మంది అభిప్రాయంలో ఇదొక నాటకం మాత్రమే) వరకూ ప్రపంచదేశాలు ఈ అగ్నిపరీక్షకు తట్టుకొని నిలిచాయి. ఈ అణుయుద్ధ భయం సహం గానే, సంప్రదాయ పరమైన అంతర్జాతీయ సంబంధాల నిర్వహణను అన్ని విధాలుగా దెబ్బతీసింది. మూడో ప్రపంచ యుద్ధం అనివార్యమని ప్రతి ఒక్కరు విశ్వసించారు. నెహ్రు పేర్కొన్నట్లుగా వారు " తాత్కాలికంగా రద్దయిన మరణదండన"లో జీవించారు. ప్రచ్ఛన్న యుద్ధం అనేది ఆలోచనలనూ, అనుభూతులనూ, మానసిక భావనలనూ పతనం చేయడంతో పాటు అనాగరికంగా రూపొందిస్తుంది. కాబట్టి ఇది ప్రత్యక్ష యుద్ధం కంటే ప్రమాదకరమని నెహ్రూ పేర్కొన్నాడు. యుద్ధం సంభవిస్తుందనే ఆలోచన నుంచి జనించిన 'హింస,' 'మనస్తత్వం' కారణంగా ప్రజలు 'మొరటుగానూ నీచులుగాను' రూపొందడం జరుగుతుంది.

కమ్యూనికేషన్ సాంకేతిక పరిజ్ఞానం విస్తృతంగా అభివృద్ధి చెందిన యుగంలో ప్రచ్ఛన్న యుద్ధం అనేది ప్రజలకూ, ప్రభుత్వానికి మధ్య కమ్యూనికేషన్‌ల పరంగా అవరోధం కల్పించింది. ఈ అవరోధాలు ఇనుప తెరల ఇటుక గోడల కంటె పెద్దవయిన మానసిక అవరోధాలు" (నెహ్రూ).

ప్రతి అధికార కూటమి 'ఒక ప్రాధాన్యాన్ని' సంతరించుకోవడంతో పాటు వ్యతిరేక కూటమికి చెందిన ప్రజలు, ప్రభుత్వాలు తప్పుదారిన నడుస్తున్నాయని విశ్వసించడం వల్ల కూడా స్వీయ కల్పిత అవరోధాలు. భిన్నాభిప్రాయాలు అవగాహన చేసుకొక ప్రయత్నాన్ని సైతం బుద్ధి పూర్వకంగా తిరస్కరించే విధానానికి దారి తీశాయి. వివేచన, జ్ఞానం వంటి విషయాల్లో తనకే మాత్రము గుత్తాధిపత్యం ఉందని ప్రతి కూటమీ భావించింది. ప్రచ్ఛన్న యుద్ధం మానసిక దృక్కోణం-రాక్షస గణంగానూ, తెల్ల గొర్రె-నల్ల గొర్రెల సమూదాయంగానూ ప్రపంచం విడిపోయింది. ఈ సముదాయాల మధ్య మరేలాంటి అనుసంధానమూ లేదు. కాబట్టి మనతో లేనివారంతా మనకు వ్యతిరేకులనే దృష్టిని ఏర్పరుచుకోవడం సులభతరమైంది. ఈ పరిస్థితి సహజంగానే అంతర్జాతీయ సంబంధాలకు సంబంధించి యాంత్రిక దృక్పధాన్ని అలవర్చుకోవడానికి దారి తీసింది.

ప్రచ్ఛన్న యుద్ధం అనేది అంతర్జాతీయ సంబంధాలలో 'సైనిక దృక్పధం' ఏర్పాటు చేసింది. ఒక సందర్భంలో నెహ్రూ "ప్రస్తుతం కొన్ని దేశాలలో (బహుశ పాశ్చాత్య కూటమి దేశాలు కావచ్చు) శాంతి అనేదాన్ని ప్రమాదకరమైన పదంగా పరిగణించడం జరుగుతూ ఉంది. శాంతిని గురించి పేర్కొన్నట్లయితే ఆ వ్యక్తి విధేయతను శంకించడం జరుగుతుంది. మరొక వైపు శాంతిని గురించి అత్యంత తీవ్రంగా, దాదాపు యుద్ధాన్ని ధ్వనింపజేసే స్వరంతో మాట్లాడే దేశాలు (బహుశా కమ్యూనిస్టు దేశాలు కావచ్చు) ఉన్నాయి. ప్రస్తుతం శాంతి అంటే యుద్ధం అని అర్థం". అని చాలా కటువుగా చెప్పారు. యుద్ధ కాలంలో సైతం ఇట్లాంటి దృక్పథం అంత మంచిది కాదు. అయితే, శాంతి కాలంలోనే అంతర్జాతీయ సంబంధాల నిర్వహణకు ఇది పూర్తిగా సరిపోదు. అంతర్జాతీయ సమస్యం పరిష్కారంకోసం ఆయుధశక్తికీ, యుద్ధ భయానికి ఇది అత్యంత ప్రాముఖ్యం ఇచ్చింది.

ఈ సైనిక దృక్పథం సహజంగానే, విదేశీ స్థావరాల ఏర్పాటుకూ ఒక దేశం, ఇతర దేశాలకు (ముఖ్యంగా స్వీయరక్షణ నిమిత్తం బలహీనమైన ఆసియా ఆఫ్రికా దేశాలకు) ఆయుధాలను బహూకరించడానికి ప్రమాదకరమైన లేదా నిరర్థకమైన సైనిక కూటములు, మిత్ర కూటములు ఏర్పాటుకు ప్రత్యక్షంగా దారి తీసింది. ఈ కూటములలో దేనిలోనూ చేరడానికి తిరస్కరించిన దేశాలను రెండు కూటములూ నిరంతరం వత్తిడికి గురిచేసేవి. పూర్తిగా తనతో చేరక పోయినప్పటికీ కనీసం తనపట్ల సానుభూతి పూర్వకంగా వర్తించమని ప్రతి కూటమీ ఈ దేశాలను కోరుతూ వచ్చింది.

## 15.3. ప్రచ్ఛన్న యుద్ధం - మొదటిదశ

**1946-1949** మధ్య కాలాన్ని ప్రచ్ఛన్న యుద్ధానికి చెందిన ప్రథమ దశగా పేర్కొనవచ్చు. పరస్పర అవిశ్వాసం అనుమానాలు పెచ్చరిల్లిన వాతావరణంలో సోవియట్ యూనియన్ మీద గట్టిగా ఒత్తిడి తెచ్చినట్లయితే కమ్యూనిస్టు పాలన పేకమేడలా కూలి పోతుందనే భావనను పాశ్చాత్య కూటమి పెంపొందించింది. కాబట్టి పాశ్చాత్య కూటమి ఈ భావనతో కృషి చేస్తూ వచ్చింది. సైనిక పరంగా సోవియట్ యూనియన్‌కంటే ఉన్నత స్థితిలో ఉ్న అమెరికా, ప్రపంచానికి ఆధిపత్యం వహించడమే కాకుండా సోవియట్ యూనియన్ దేశీయ వ్యవహారాలను కూడా ప్రభావితం చేస్తుందని భావించడమైంది. అమెరికా కూటమిలోని ఇతర భాగస్వాములు, సైనిక పరంగా అమెరికా మాదిరిగా పటిష్ఠమైన స్థితిలో లేకపోవడమే కాకుండా రెండో ప్రపంచ యుద్ధం జ్ఞాపకాలు ఇంకా వారి మనస్సుల్లో తాజాగా మెదులుతూ, మరో యుద్ధానికి వారు సిద్ధంగా ఉండక పోవడం వల్ల కూడా రష్యాను దండించాలనే అమెరికా విధానాన్ని అమలు చేయడం సాధ్యం కాలేదు. **1947** మార్చి ట్రూమన్ సిద్ధాంతం ద్వారా, **1947**జూన్ మార్షల్ ప్రణాళికలో భావించినట్లుగా పశ్చిమ యూరోప్ దేశాల ఆర్థిక సమన్వయం ద్వారా ఈ దశలో అమెరికా ప్రత్యక్ష చర్యను ఆశ్రయించింది. ఈ దశలో అమెరికా జోక్యం సహిత విధానాన్ని యధాతథస్థితి రక్షకుడి పాత్రయే అవలంబించింది. కమ్యూనిస్టు వ్యతిరేక భావనలు ఈ కాలంలో గుర్తుంచుకోదగ్గివి. ప్రపంచ మొత్తం మీద ఈ భావనలను వ్యాపింపజేయడానికి అమెరికా ఎంతగానో కృషి చేసింది. **1946** ఫిబ్రవరిలో చేసిన తన ప్రసంగంలో ఆయన "పెట్టుబడిదారీ శక్తులతో సంఘర్షణకు సంబంధించిన అనివార్యత"ను ప్రస్తావించాడు. యుద్ధం ముగిసినందంటే దేశం విశ్రాంతి తీసుకోవచ్చునని భ్రమపడవద్దని ఆయన సోవియట్ ప్రజలను కోరుతూ యుద్ధం తరవాతనే మరిన్ని తీవ్రమైన ప్రయత్నాలు అవసరమవుతాయని కూడా ఆయన నొక్కి చెప్పారు.

## 15.4. ప్రచ్ఛన్న యుద్ధం - రెండోదశ

ప్రచ్ఛన్న యుద్ధం రెండోదశ (1949-53)లో ప్రథమ దశలోని అమెరికా విధానం కొనసాగింది. సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా సైనిక, ఆర్థిక సహాయ విధానం కూడా కొనసాగింది. అమెరికా 1951లో జపాన్‌తో శాంతి ఒప్పందాన్ని; ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌తో భద్రత ఒప్పందాన్ని కుదుర్చుకొంది. కొరియా యుద్ధం కూడా ఇదే కాలంలో సంభవించింది. ఈ యుద్ధం అమెరికా, రష్యాల మధ్యగల ప్రధానమైన సంఘర్షణలను ప్రస్ఫుటం చేసింది. 1945 డిసెంబర్‌లో జరిగిన మాస్కో సమావేశంలో రష్యా, అమెరికా, బ్రిటన్ దేశాల మంత్రులు, అమెరికా మద్దతు ఇస్తున్న దక్షిణ కొరియా సైనికపాలనకూ, రష్యా అనుకూలంగా ఉన్న ఉత్తర కొరియా సైనిక పాలనకూ చెందిన ప్రతినిధులతో ఒక సంయుక్త కమిషన్‌ను ఏర్పాటు చేయడానికి అంగీకరించారు. కొరియన్‌లలో అధిక సంఖ్యాకులు సంపూర్ణ స్వాతంత్ర్యానికి అనుగుణమైన నిర్ణయాన్ని అంగీకరించే వర్గాలతో లేదా పార్టీలతో సంప్రదింపులు జరపాలని రష్యా ప్రతిపాదించింది. అయితే ఈ ప్రతిపాదనను అమెరికా వ్యతిరేకించింది.1946 మార్చిలో ఏర్పాటైన ఈ ప్రతిపాదనను అమెరికా, సోవియట్ యూనియన్‌ల సంయుక్త కమిషన్ విజయవంతంగా కాకాపోగా ఈ దశ అలాగే కొనసాగింది. చివరికి కొరియా సమస్యను ఐక్యరాజ్య సమితి పరిశీలనకు అప్పగించడమైంది. అయితే 1959 జూన్‌లో ఉత్తర కొరియా ఆకస్మికంగా దక్షిణ కొరియాపై దాడి చేసింది. అయినప్పటికి 1953జులైలో కుదురిన యుద్ధ విరమణ సంధిద్వారా ఈ యుద్ధం అంతమైంది. కమ్యూనిజంకు వ్యతిరేకంగా అమెరికా తీవ్రమైన ప్రచారం ప్రారంభించి, అందుకోసం మిలియన్‌ల కొద్దీ డాలర్లను ఖర్చు పెట్టింది. ఈ కాలంలో సైనిక రాజ్యాకూటములు పరస్పర విద్రోహక కార్యకలాపాలకు పాల్పడ్డాయి. సోవియట్ యూనియన్ కూడా అణుబాంబును పేల్చి, అణ్వాస్త్రాల విషయంలో అమెరికాతో పోటి పడడం ప్రారంభించింది. అమెరికా, రష్యా దేశాలు కొరియాకు రెండు వైపులా మోహరించే ఉన్నాయి. యుద్ధ విరమణ సంధి మీద సంతకాలు చేసినప్పటికీ శత్రుత్వం కొనసాగుతూనే ఉంది. ఈ దశలో సోవియట్ యూనియన్, అమెరికాలు రెండూ పరస్పరం ప్రతికారంతో అధికార రాజకీయ క్రీడను కొనసాగించాయి. రెండు దేశాలు విరోధిప్రాబల్యాన్ని నిరోధించడానికీ ప్రపంచాన్ని జయించాలని ప్రయత్నాన్ని నిలువరించడానికి ప్రయత్నించాయి. ఈ కాలంలో పరస్పరం సహకరించుకొన్న క్షణాలు ( ఉదా: బెర్లిన్ దిగ్బంధనాన్ని ఎత్తివేయడం) కూడా ఉన్నాయి. అయితే ఈసహకార చర్యలు చాలా స్వల్పమైనవి. సంఘర్షణను కొనసాగించడానికి విరోధులకవసరమైన కమ్యూనికేషన్‌ల వరకే పరిమితమైంది.

## 15.5. ప్రచ్ఛన్న యుద్ధం - మూడో దశ

మూడో దశ (1953-1957) కాలంలో సోవియట్ కూటమికి వ్యతిరేకంగా తన సైనిక, ఆర్థిక పరంగా హానికరమైన విధానాన్ని అమెరికా కొనసాగించింది. అమెరికా ప్రతిపాదించిన నూతన ఒప్పందాలు ఆవిర్భంచాయి. ఆగ్నేయాసియా సంధి వ్యవస్థ (SEATO) మధ్య ప్రాచ్య రక్షణ వ్యవస్థ (MEDO) లను ఏర్పాటు చేయడమైంది. ఈ రెండు నూతన ఒప్పందాల అవతరణ వల్ల నాటోతో నూతన రక్షణ సంబంధాలు ఏర్పాడ్డాయి. ట్రూమన్ సిద్ధాంతాన్ని మధ్య ప్రాచ్యానికి విస్తరింపజేయడం, ద్వారా అమెరికా కూడా మధ్య ప్రాచ్యానికి తన ప్రాబల్యాన్ని పెంచుకోవడానికి ప్రయత్నించింది. సోవియట్ యూనియన్ చుట్టూ అనేక సైనిక స్థావరాలు ఏర్పాటు చేయడంలో అమెరికా విజయం సాధించింది. అంతే కాకుండా 43 దేశాలతో రక్షణ ఒప్పందాలు కుదుర్చుకొంది. ఈ కాలంలోనే అమెరికా ప్రచ్ఛన్న యుద్ధానికి పరాకాష్టంగా పరిణమించిన వియత్నాం యుద్ధంలో చిక్కుకొంది. సోవియట్ యూనియన్ కూడా వెనకబడలేదు. నాటోకు వ్యతిరేకచర్యగా తూర్పు యూరప్ దేశాలతో రష్యా వార్సా ఒప్పందం కుదుర్చుకుంది. అంతేకాకుండా 12 దేశాలతో ఒడి రక్షణ ఒప్పందాలు చేసుకొంది. హంగరీలో అమెరికా ప్రతిపాదిత ప్రతి విప్లవం చెదిరిపోయింది.

ఈ కాలంలోనే జర్మనీ శాశ్వత విభజన సంభవించింది. సోవియట్ కూటమిలో జర్మన్ డెమోక్రాటిక్ రిపబ్లిక్ (GUR) గానూ, అమెరికా కూటమిలో ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీ (FRG) గానూ జర్మనీ రెండుగా విడిపోయింది. ఈ కాలంలో సోవియట్ యూనియన్ అమెరికాలు రెండు ఒకే సమయంలో హైడ్రోజన్ బాంబు పేల్చారు. రెండూ దేశాలు యుద్ధం సమీపిస్తున్న రీతిలో ప్రసంగించాయి. కానీ చేతల్లో మాత్రం అతిజాగ్రత్తగా సహనంతో వ్యవహరించాయి. అయితే ఈ కాలంలో మరోక ఆరోగ్యకరమై ధోరణి వ్యక్తమైంది. ఇరుదేశాలు మధ్య సంప్రదింపులు ప్రారంభమయ్యాయి. సంప్రదింపుల స్ఫూర్తి లక్షణంగాగల మరొక నూతన దశకు ఇది నాంది పలికింది. ఈ

దశలోనే జెనీవాలో జరిగిన శిఖరాగ్ర సమావేశం రూపంలో అంతర్జాతీయ సామరస్యాన్ని పెంపొందించే దశలో తొలిఅడుగు వేయడమైంది. ఈ శిఖరాగ్ర సమావేశంలో విరోధులిద్దరూ ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలకు సంబంధించి పరస్పరం చర్చించుకోవడం జరిగింది.

## 15.6. ప్రచ్ఛన్న యుద్ధం - నాలుగోదశ

నాలుగో దశ (1957-1962)లో రెండు విభిన్న వైఖరిలు కనిపిస్తాయి. ఒకవైపు సహజీవన సూత్రాలను ప్రకటించడమైయింది. మరొక వైపు మొత్తం మానవ జాతినే మూడో ప్రపంచ యుద్ధం అంచుకు తీసుకుపోయిన, ప్రమాదకరమైన క్యూబన్ క్షిపణి సంక్షోభాన్ని ప్రపంచం ఎదుర్కొంది. ఈ కాలం ప్రారంభ సంవత్సరాలలో అమెరికా, రష్యాల మధ్య సహజీవన స్ఫూర్తి ఉన్నట్లు కనిపిస్తుంది. ఈ రెండు దేశాలూ పరస్పరం తమ సాంస్కృతిక రాజకీయ ప్రతినిధులను పంపుకొన్నాయి. ఇరుదేశాల ప్రభుత్వాధినేతలు సైతం ఒకరి దేశాన్ని మరొకరు సందర్శించారు. ఇరు దేశాలూ పారిస్ శిఖరాగ్ర సమావేశానికి అంగీకరించడం అనేది ప్రచ్ఛన్న యుద్ధం వైఖరి సమసిపోయిందనటానికి సూచన అయింది. అయితే యు-2 సంఘటనతో ఆ దేశాల అసలు స్వరూపం బయటపడింది. అయితే యు-2 సంఘటన వల్ల సంభవించిన నష్టాన్ని 1960 జెనీవా శిఖరాగ్ర సమావేశం ద్వారా 1961లో కృశ్చేవ్, అధ్యక్షుడు కెన్నెడీల మధ్య జరిగిన వియాత్నాం సమావేశం ద్వారా కొంతవరకూ పూడ్చడం జరిగింది. క్యూబన్ సంక్షోభం రెండు అగ్ర రాజ్యాలనూ మళ్ళీ యుద్ధం ముంగిట్లోకి నెట్టింది. అయితే కృశ్చేవ్, కెన్నెడీల మధ్య ఒక ఒప్పందం కుదరడంతో అణు యుద్ధ విధ్వంసం నుంచి మానవ జాతి రక్షింపబడింది. ఈ ఒప్పందం ప్రకారం క్యూబా మీద దాడి చేయమని అమెరికా హామీ ఇచ్చినందుకు బదులుగా క్షిపణి స్థావరాన్ని ఉప సంహరించుకోవడానికి రష్యా అంగీకరించింది.

## 15.7. ట్రూమన్ సిద్ధాంతం:-

రెండో ప్రపంచ యుద్ధం యూరోపియన్ వలస పాలనల హోదాలో ప్రధానమైన మార్పులు తీసుకొచ్చింది. మిత్ర దేశాలలో ఇటలీ బలవంతంగా సంధి చేసుకోవలసి వచ్చింది. దీంతో ఆదేశం తన సామ్రాజ్యాన్నే కాకుండా తన అధికార హోదాను కూడా అత్యధిక స్థాయిలో కోల్పోవలసి వచ్చింది. రెండో ప్రపంచ యుద్ధం తరువాత కూడా బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు వలస పాలకులుగా ఉన్నప్పటికీ వలస పాలన నిర్మూలనా విధానం ఫలితంగా, అనేకమైన బ్రిటిష్, ఫ్రెంచి వలసలకు స్వపరిపాలనను ఆమోదించడమైంది. ఆ తరువాత స్వాతంత్ర్యం పొందిన ఈ దేశాలు తృతీయ ప్రపంచ దేశాలుగా అవతరించాయి. తృతీయ ప్రపంచ దేశాలలో అమెరికా ఆర్థికపరంగా జోక్యం చేసుకోవడమనేది చాలా ముందుగానే ప్రారంభమైనప్పటికీ వలస పాలనను ఉపసంహరించుకోవడం ద్వారా ఏర్పడిన రాజకీయ వాతావరణం జోక్యం వృద్ధి చెందడానికి మరింతగా దోహదం చేసింది. అమెరికా నిర్వహించిన విస్తృతమైన రాజకీయ పాత్రను మొట్ట మొదటి సారిగా గ్రీసు విషయంలో చూడవచ్చు. యుద్ధం చివరి దశలో జర్మన్‌లు గ్రీసునుంచి వెళ్ళిపోయి తరువాత బ్రిటీష్ సైన్యం గ్రీసును ఆశ్రయించింది. బ్రిటన్‌తో ఒక ఒప్పందం మీద సంతకం చేయడం ద్వారా గ్రీస్‌లో బ్రిటీష్ ఉనికిని సోవియట్ యూనియన్ గుర్తించింది. ఇంతలో గ్రీసులోని రాజపక్ష వాదులకూ, వారు పక్షవాదులకూ మధ్య సంఘర్షణ ప్రారంభమైంది. రాజపక్ష వాదులకు బ్రిటీష్ మద్దతు ఇవ్వగా వామపక్ష వాదులకు పోయిన ఉన్న కమ్యూనిస్టులు సహాయమందించారు. బ్రిటిష్ బల ప్రయోగంవల్ల కమ్యూనిస్టులు దేశం విడిచి పారిపోవడం గానీ, పర్వతాలను ఆశ్రయించడం గానీ జరిగింది. బల్గేరియా, ఆల్బేనియా, యుగోస్లావియా కమ్యూనిస్టు ప్రభుత్వం నుంచి లభించే సహాయంతో కమ్యూనిస్టుల పోరాటం కొనసాగుతున్నప్పటికీ 1997లో ప్రజాభిప్రాయం సేకరణ నిర్వహించి గ్రీస్‌లో రాచరికాన్ని పునరుద్ధరించడమైంది. ఉగ్రవాద కార్యకలాపాలను అణచడం సాధ్యమని భావించిన బ్రిటీష్ నేరుగా అమెరికా సహాయాన్ని అర్థించింది.

గ్రీసులోనూ, పొరుగు దేశాలైన టర్కీలోనూ కమ్యూనిస్టుల ప్రాబల్యం పెరిగిపోతుందని భావించిన అమెరికా అధ్యక్షుడు ట్రూమన్ గ్రీసు, టర్కీ దేశాలను కమ్యూనిస్టు ప్రాబల్యం నుంచి తప్పించి స్వేచ్ఛగా ఉంచడానికి 400 మిలియన్ డాలర్‌లను మంజూరు చేయమని కాంగ్రెసుకు విజ్ఞప్తి చేశాడు. "సాయుధులైన అల్ప సంఖ్యాకుల ద్వారా లేదా బయట ఒత్తిడి ద్వారా తమను. స్వాధీనం చేసుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలను ప్రతిఘటిస్తున్న స్వతంత్ర ప్రజలకు సహాయం చేయడం అమెరికా విధానంగా ఉండాలి" ని ట్రూమన్ ప్రకటించాడు. ఆ ప్రకటన తరువాత ట్రూమన్ సిద్ధాంతంగా ప్రసిద్ధికెక్కింది. ఆ విధంగా ట్రూమన్ సిద్ధాంతం అమెరికా ప్రధక్కంగా వాదానికి స్వస్తిపలికి, ప్రపంచం మొత్తం మీద కమ్యూనిజంకు వ్యతిరేకంగా పోరాడుతున్న లేదా కమ్యూనిస్టు ప్రాబల్యం నుంచి రక్షణ కోరుతున్న ప్రజల రాజకీయ, ఆర్థిక, సైనిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి నాంది పలికింది.

దాదాపు అదే సమయంలో సోవియట్ యూనియన్ నాయకత్వంలో విస్తరిస్తున్న కమ్యూనిజం ప్రాబల్యాన్ని నిరోధించడానికి అమెరికా మరొక కొత్త వైఖరిని అనుసరించింది. సోవియట్ రాజనీతిని విస్తరణవాదంగా వ్యాఖ్యానిస్తూ, డాట్ డిపార్ట్‌మెంటులోని అప్పటి పాలసీ ప్లానింగ్ స్టాఫ్ డైరెక్టర్ అయిన జార్జి కెన్నన్. సోవియట్ ప్రాబల్యాన్ని అదుపు చేయడానికి గల ఏకైక శక్తి వంతమైన చర్యగా నిరోధక విధానాన్ని సిఫార్సు చేశాడు.

ఆ తరువాత, సాపేక్షంగా మారుమూల ప్రాంతాలైన వియత్నాం, లావోస్ మొదలైన ప్రాంతాలలో అమెరికా విస్తరణను. ఈ నిరోధక భావన రూపంలోనే వివరించ వలసి ఉంది. అమెరికా ఉనికి ద్వారా కమ్యూనిస్టు కూటమిని భౌతికంగా చుట్టుముట్టి, ఆ విధంగా ఇతర ప్రాంతాల్లోకి కమ్యూనిజం వ్యాపించకుండా నిరోధించడమే ఈ విధానంలోని అంతరార్థం.

## 15.8. మార్షల్ ప్రణాళిక:-

యూరప్‌లో యుద్ధం వల్ల దెబ్బతిన్న ప్రాంతానికి రాజకీయ పరమైన మద్దతు అందించడానికి పటిష్టమైన ఆర్థిక చర్యలు చేపట్టవలసి వచ్చింది. తదనుగుణంగా, 1947లో మార్షల్ ప్రణాళిక రూపంలో అమెరికా, 'ఐరోపా పునరుద్ధరణ కార్యక్రమం' ను ప్రారంభించింది. యుద్ధం తరువాత యూరప్ మొత్తం తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంది. బ్రిటన్, బెల్జియం. ఇటలీ, తూర్పు జర్మనీలలోని ఆర్థిక సంక్షోభంవల్ల మరో విధంగా 'స్వతంత్ర' ప్రపంచంలో కమ్యూనిజం విస్తరించే అవకాశం ఉందని అమెరికా భావించింది. పశ్చిమ యూరోప్‌లో ఆర్థిక మాంద్యం, ఆహార పదార్థాల కొరత కొనసాగినంత కాలం " ప్రతిచోట క్రమంగా సామాజిక పరమైన ఆందోళన, రాజకీయ పరమైన గందరగోళం ఏర్పడుతుందనే మన (అమెరికా) జాతీయ భద్రతకు తీవ్రమైన ప్రమాదం ఏర్పడవచ్చుననే అంగీకరించడమైంది. అయితే ప్రస్తుతం స్పష్టంగా రూపుదిద్దుకొంటున్న యూరోప్ ఆశకు మద్దతుగా మనం తగినంత సహాయం అందించగలిగేతే పరిస్థితి క్రమంగా మారిపోతుంది".

ఆ విధంగా ఆర్థిక మాంద్యంలో చిక్కుకొన్న యూరప్‌లో కమ్యూనిజం విస్తరించి, ఆ ప్రాంతంలో తన పలుకుబడికి ప్రమాదం ఏర్పడుతుందనే అమెరికా భయంలోంచి మార్షల్ ప్రణాళిక పుట్టుకొచ్చింది. ఆర్థిక పునరుద్ధణా కార్యక్రమాన్ని ఆయా దేశాలే స్వయంగా ప్రారంభించుకోవాలనేది మార్షల్ ప్రణాళికలోని ప్రధానమైన నిబంధనల్లో ఒకటి, ఈ ప్రణాళికను అంగీకరించమని సోవియట్ యూనియన్‌నూ. కమ్యూనిస్టు దేశాలనూ, కమ్యూనిస్టేతర దేశాలను ఆహ్వానించడమైంది. వైయక్తిక దేశాలకు కాకుండా యూరోప్ మొత్తానికి ఆర్థిక సహాయ మందించడానికి ఈ ప్రణాళికను ఉద్దేశించడం జరిగిందనే కారణం మీద సోవియట్ యూనియన్ దీన్ని తిరస్కరించింది. అంతేకాకుండా "ఇది ఐక్యరాజ్య సమితి మౌలిక సూత్రాలను వ్యతిరేకించింది. యూరప్‌లోని ఆర్థిక పరిస్థితులను ఉపయోగించుకొని, ఆర్థిక పరమైన సామ్రాజ్యం ఏర్పాటు చేసుకోవడానికి అమెరికా ఆడుతున్న నాటకమే ఇది" అని సోవియట్ యూనియన్ అభిప్రాయపడింది.

ఈ ప్రణాళిక అమలు ఈ దేశంలో గణనీయమైన ఆర్థిక పునరుద్ధరణకు దారితీసింది. పారిశ్రామిక ఉత్పత్తుల రంగంలోనూ. జలవిద్యుచ్ఛక్తి రంగంలోనూ విప్లవాత్మకమైన అభివృద్ధి సాధించడమైంది. పారిశ్రామిక వికాసం, ఆర్థిక పరమైన స్వయం, సమృద్ధి, సైనికపరమైన భద్రతల వల్ల పశ్చిమ యూరప్ దేశాలకు తిరిగి స్థిరత్వం సిద్ధించింది. ఈ విధమైన రూపాంతరీకరణవల్ల యూరప్ విధేయతనూ, స్నేహాన్ని అమెరికా సంపాదించుకొంది. ఆ విధంగా ఆ దేశాలు పటిష్టతనూ స్థిరత్వాన్ని సాధించడ మనేది అమెరికా సాధించిన విజయంగా పరిగణించడం జరిగింది.

యూరప్ మధ్య ప్రాచ్యం, ఆగ్నేయాసియా, పసిఫిక్ ప్రాంతం అంతటా ఏర్పడిన సైనిక కూటములు, అంతర్జాతీయ రాజకీయాలలో ఈ రెండు అగ్రరాజ్యాల ఆధిపత్యానికి మరో రూపం సంతరించి పెట్టాయి. సోవియట్ యూనియన్ ప్రతిపాదిత వార్సా ఒప్పందం, నాటోకు ప్రతి రక్షణకు సమకూర్చింది. అయితే , బహు పక్షీయ, ద్వైపాక్షిక ఒప్పందాల పరంపర ద్వారా అమెరికా ప్రాబల్యం కొనసాగింది.

## 15.9. సైనిక కూటములు

**15.9.1 అంజూస్ :** పసిఫిక్ ప్రాంత భద్రతను పరిరక్షించడానికి ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, అమెరికా దేశాలు 1951 లో కుదుర్చుకొన్న త్రైపాక్షిక మైత్రి ఒడంబడికయే అంజూస్ ఒప్పందం, నిరవధికంగా అమలులో ఉండే ఈ ఒప్పందం ..దీని మీద సంతకాలు చేసిన మూడు దేశాలలో దీని మీదయనా దాడి జరిగితే ఆ దాడి అందరికి ప్రమాదకరమని తన రాజ్యాంగ బద్ధమైన విధానాల ప్రకారం , ఈ ఉమ్మడి ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి ప్రతి దేశమూ కృషి చేయాలనే పేర్కొంటుంది. స్వీయ సహాయం ద్వారా పరస్పర సహాయం ద్వారా తమ శిక్షణ సామర్థ్యాలనూ పెంచుకోవడానిక కూడా ఈ పార్టీలు అంగీకరించాయి. జపాన్ శాంతి ఒప్పందానికి సంబంధించి ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ల అభ్యంతరాలను అధిగమించడానికి 'అంజూన్ ఒప్పందాన్ని ' రూపొందించడమైంది. ఆస్ట్రేలియ, న్యూజిలాండ్లతో అమెకికాకు గల సంబంధాలలో కొన్ని తీవ్రమైన ఇబ్బందులున్నప్పటికీ అంజూన్ ఒప్పందం అమల్లో ఉంది. రెండు కామన్వెల్త్ దేశాలకూ భద్రత సమకూర్చడంలో బ్రిటనుకు గల ప్రాతను అమెరికా స్వీకరించడానికీ ఈ ఒప్పందం ఒక గుర్తింపుగా కూడా ఉంది.

**15.9.2 సెంటో :** కమ్యూనిస్టు దురాక్రమణకు వ్యతిరేకంగా మధ్య ప్రాచ్యంలో భద్రత సమకూర్చడానికి, తన సభ్యదేశాల మధ్య ఆర్థిక, సామాజిక సహకారాన్ని పెంపొందించడానికి 1955లో అమెరికా చొరవతో ఏర్పాటయిన మిత్ర కూటమే సెంట్రల్ ట్రీటీ ఆర్గనైజేషన్ (Central Treaty Organisation). తన పాశ్చాత్య అనుకూల ప్రభుత్వాన్ని విప్లవాత్మకంగా కూలదోసి తరవాత 1959 లో ఇరాక్ ఉపసంహరించుకోనంత వరకూ అది బాగ్దాద్ ఒప్పందంగా ప్రసిద్ధమైంది. 1959 తరువాత బ్రిటన్, ఇరాన్. పాకిస్తాన్, టర్కీలు సభ్యత్వం తీసుకొన్నాయి. ఇందులో అమెరికా ఎప్పుడు లాంఛన ప్రాయమైన సభ్యదేశం కావప్పటికీ ఒక అసోసియేటివ్గా వ్యవహరించింది. ఈ ఒప్పందల వల్ల కమ్యూనిస్టు దాడిని ప్రతిఘటించడానికి ఒప్పందం మీద సంతకాలు చేసిన దేశాలకు సహాయం అందించే చర్య చేపట్టడానికి అమెరికాకు అవకాశం ఏర్పాడింది.

'సెంటో' ప్రాథమికంగా భద్రతకు సంబంధించిన మిత్ర కూటమిగా పని చేసింది. సభ్యదేశాల ఆర్థిక, సామాజిక వ్యవహారాలో యాదృచ్ఛికంగా మాత్రమే జోక్య చేసుకొంది. అయితే తన సభ్య దేశాల మధ్య తలెత్తిన అభిప్రాయ భేధాలు, సభ్యత్వం తీసుకొనే విధంగా అరబ్ దేశాలను ఆకర్షించడంలో విఫలమవడం, కమ్యూనిస్టు దేశాల నుంచి ప్రత్యేకమైన దురాక్రమణ భయం లేకపోవడం వంటి అంశాల వల్ల సభ్యదేశాల మధ్య సంబంధాలు బలహీనమయ్యాయి. 1979 లో ఇరాన్ విప్లవం అమెరికా బందీలను బలవంతంగా విడిపించడం వంటి అంశాలు మిత్రకూటమి నుంచి ఇరాన్ ఉపసంహరణకు దారి తీయడంతో ఈ సంస్థ భవిష్యత్తుకు సంబంధించి అనుమానాలు తలెత్తాయి.

**15.9.3 సియటో :** ఆగ్నేయాసియా సామూహిక రక్షణ ఒప్పందానికి చెందిన షరతులను అమలు చేయడానికి 1955 లో ఏర్పాటైన ఒక ప్రాంతీయ కూటమే ఆగ్నేయాసియా ట్రీటీ ఆర్గనైజేషన్ (South East Asia Treaty Organisation SEATO) 1954 లో మనీలలో ఈ ఒప్పందం మీద సంతకాలు చేయడమైంది. ఆ ఒప్పందం సభ్యదేశాల రాజ్యాంగ బద్ధమైన విధానాల కనుగుణంగా సంప్రదించుకోవాలనే, ఉమ్మడి ప్రమాదాన్ని ఎదుర్కోవాలనే సభ్యదేశాలకు పిలుస్తుంది. ఈఆగ్నేయాసియాలోనూ. నైఋతి పసిఫిక్లోనూ సంభవించే బాహ్యామైన దురాక్రమణకు అంతరంగిక విద్రోహానికీ కూడా ఈ ఒప్పందం వర్తిస్తుంది. ఈ ఒప్పందంలో ఆస్ట్రేలియా, బ్రిటన్ ఫ్రాన్స్, న్యూజిలాండ్, పాకిస్తాన్ పిలిప్పైన్స్, థాయ్లాండ్, అమెరికా దేశాలకు సభ్యత్వం ఉంది, తరువాతి కాలంలో ఈ సంస్థను రద్దు చేయడమైంది. కాని ఒప్పందం మాత్రం క్రియాశీలంగానే ఉంది.

**15.9.4 రియొ :** అంతర - అమెరికన్ పరస్పర సహాయ ఒప్పందం (RIO) అనేది ఒక ప్రాంతీయమైన రక్షణ ఒప్పందం ఈ ఒప్పందం మీద 1947 సెప్టెంబర్లో రియొ - డి - జెనిరాలో సంతకాలు చేయడమైంది. ఈ ఒప్పందం ద్వారా పశ్చిమార్ధ గోళంలో సంభవించే దురాక్రమణలను ప్రతిఘటించడానికి ఒక పరస్పర భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేసికోవడమయింది. 21 అమెరికన్ రిపబ్లిక్లు ఈ ఒప్పందం

మీద సంతకాలు చేసాయి. అయితే క్యూబా (1962 నుంచి) . నెకరాగువా (1979) మొ॥న రిపబ్లిక్‌లను ఒప్పందం నుంచి తొలగించడమైంది. ఒప్పందలోని నిబంధనలను అమలు చేసే పనిని బి.వి. యన్ కౌన్సిల్ నిర్వహిస్తుంది. పశ్చిమార్థ గోళంలో రక్షణ విషయాలకు సంబంధించి సహకారం సమకూర్చడానికి 'రియొ ఒప్పందం' అర్ధ శతాబ్దం పాటు విశేషంగా కృషిచేసింది. ప్రప్రథమంగా 1823 మన్రో సిద్ధాంతంలో ప్రకటించిన, విదేశీజోక్యం పట్ల అమెరికా వ్యతిరేకతను బహుళజాతీయం చేయడానికి కృషి చేసింది, రియో ఒప్పందం అమెరికా కుదుర్చుకొన్న మొట్ట మొదటి సాధరణ భద్రత ఒప్పందం " ఒక అమెరికా రాజ్యం మీద ఏదయినా రాజ్యం చేసే సాయుధ దాడిని అందరి మీద చేసే దాడిగా పరిగటణించడం" అనేది దీని మౌలిక నిబద్ధత ఈ నిబద్ధతే తరువాత నాటో, సియాట్ ఒప్పందాలకు ఆదర్శమైంది. అయితే ఈ ఒప్పందం మీద సంతకాలు చేసిన దేశాలలోని విప్లవాలు, అంతర్యుద్ధాలు, విద్రోహం వంటివాటి విషయంలో రియొ ఒప్పందాన్ని వర్తింప జేయడంలో గల ప్రధానమైన సమస్య ఏమంటే, యాంకీ జోక్యం సహిత వాదానికి సంబంధించిన పాత సమస్యను ఇది తిరగ దోడవచ్చు. అంతేకాకుండా, అధునికరణకు అవసరమైన సామాజిక విప్లవాలకు అవరోధం కావచ్చు.

**15.9.5 నాటో :** ఉత్తర అట్లాంటిక్ ప్రాంతంలోని తన సభ్యులకు పరస్పర భద్రత సమకూర్చడానికి 1949 లో ఏర్పాటయిన ప్రాంతీయ సంస్థ ' నార్త్ అట్లాంటిక్ ట్రీటి అర్గనైజేషన్ (North Atlantic Treaty Organisation - NATO) ఉత్తర అట్లాంటిక్ ఒప్పందానికి చెందిన సామాజిక చర్య నిబంధనల ద్వారా రూపొందించిన భద్రత లక్ష్యాలను సాధించే సాధనంగా నాటో పని చేస్తుంది. దీనిలో 14 సభ్య దేశాలు (బెల్జియం, బ్రిటన్, కెనడా, డెన్మార్క్, పశ్చిమ జర్మనీ, గ్రీసు, ఐస్‌లండ్, ఇటలీ, లగ్జంబర్గ్, హాలండ్, నార్వే, పోర్చుటల్, టర్కీ, అమెరికా) సైనిక, రాజకీయ, అర్థిక, సామాజిక విషయాలలో సహకారానికి ఒక కార్యచట్రం (frame work) గా నాటోను ఉపయోగించుకొంటాయి. సమైఖ్య సంప్రదాయ బద్ధ శక్తుల ద్వారా పశ్చిమ యూరప్ దేశాలకు అమెరికా అణు నిరోధక రక్షణ కల్పించడం ద్వారా సోవియట్ సైనిక దురాక్రమణ భయాన్ని తొలగించడం ఈ మిత్ర కూటమి ప్రధాన లక్ష్యం.

ఉత్తర అట్లాంటిక్ ప్రాంతంలో కమ్యూనిస్టు దురాక్రమణకు వ్యతిరేకమైన పాశ్చాత్య రక్షణ వ్యవస్థకు నాటో మూల స్తంభంగా పని చేసింది. దీని రాజకీయ సైనిక వ్యవస్థ, మిత్ర కూటమిలో తలెత్తిన అనేక సమస్యలను పరిష్కరించే సాధనంగా పని చేసింది. 14 స్వతంత్ర దేశాల విదేశీ, రక్షణ విధానాలను పరిష్కరించడంలో తోడ్పాటునందించింది. అయితే, బహు కేంద్రవాదం ప్రబలడం, అమెరికా మధ్య ప్రాచ్య వ్యవహారాలలో నిమగ్నం లేవడం, అణువ్యూహం, విధానాల పట్ల వివాదాలు చెలరేగడం, పశ్చిమ యూరప్‌లో స్వాతంత్ర్య స్ఫూర్తి ప్రబలిపోవడం వంటి అంశాల కారణంగా ఈ మిత్ర కూటమి బలహీన పడిపోయింది. 1960లలో సంఘంటిత నాటో కమాండ్ నుంచి తన దేశాలలను ఫ్రాన్స్ ఉపసంహరించుకొంది. అంతేకాకుండా నాటో ఆపరేషనల్ కంట్రోల్ నుంచి తన నౌకా దళాలను కూడా ఫ్రాన్స్ ఉపసంహరించుకొంది. 1966లో నాటో ప్రధాన కార్యాలయాలను, సదుపాయాలను ఫ్రెంచి భూభాగం నుంచి ఉపసంహరించుకోవాలి లేదా ఫ్రెంచి ఆధీనంలోనైనా ఉంచాలి. అని చార్లెస్ డిగార్లి కోరాడు. నాటో కింద దురాక్రమణ దారుకు వ్యతిరేకంగా ఉమ్మడి చర్య తీసుకొనే విషయంలో ఫ్రాన్స్ తన నిబద్ధతలను కొనసాగించినప్పటికీ దాని చర్యలు మాత్రం దాన్ని నాటో సభ్యత్వం నుంచి తొలగించాయి. పశ్చిమ యూరప్‌కు సోవియట్ యూనియన్ నుంచి ప్రమాదం ఉందని పశ్చిమ యూరప్ ప్రజలు విశ్వసించడం మీదనే నాటో భవితవ్యం ఎక్కువగా ఆధారపడి ఉంది.

### 15.9.6. వార్సా ఒప్పందం:

వార్సా ఒప్పదాన్ని (1955 వార్సాలో కుదుర్చుకొన్న స్నేహం, సహకారం, పరస్పర సహాయ ఒప్పందం అమలు చేయడానికి ఏర్పాటైన తూర్పు యూరప్ కమ్యూనిస్టు దేశాల ప్రాంతీయ సైనిక కూటమి వార్సా ట్రీటీ ఆర్గనైజేషన్, యుగోస్లేవియా, అల్బేనియాలు తప్ప తూర్పు యూరప్‌లో కమ్యూనిస్టు దేశాలన్నీ ఇందులో సభ్య దేశాలుగా ఉన్నాయి. ఆ దేశాలు బల్గేరియా, బెల్‌స్లొవియా, తూర్పు జర్మనీ, హంగరీ, పోలండ్, రొమేనియా, సోవియట్ యూనియన్ (7 రాజ్యాలు) 1943- 48 మధ్య కాలంలో సోవియట్ యూనియన్‌కు, వివిధ కమ్యూనిస్టు దేశాలకు మధ్య కుదిరిన వివిధ ద్వైపాక్షిక పరస్పర సహాయ ఒప్పందాలను ఇది అమలు చేస్తుంది. వార్సా ట్రీటీ ఆర్గనైజేషన్‌లో సభ్యత్వం

అనేది, సాయుధ దాడికి లోనయిన దేశానికి తక్షణ సైనిక సహాయం అందించడంతో పాటు దురాక్రమణలను ఎదుర్కోవడానికి అవసరమైన ఉమ్మడి చర్యలను గురించి వేంటనే సంప్రదించవలసిన బాధ్యతను కూడా విధిస్తుంది.

వార్సా ట్రీటి ఆర్గనైజేషన్ అనేది నాటో ఏర్పాటుకు ముఖ్యంగా, ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీ (Federal Republic of Germany- F.R.G) నాటో సభ్యదేశంగా అంగీకరించిన 1954 పారిస్ ఒప్పందానికి ప్రతిస్పందనగా ఏర్పాటైన కమ్యూనిస్టు కూటమిని, ప్రతిబింబిస్తుంది. ఒక సైనిక మిత్ర కూటమిగా వార్సా ట్రీటి ఆర్గనైజేషన్, జర్మనీ తిరిగి యుద్ధ సామాగ్రిని కూర్చుకొన్న తరవాత, ఫ్రాన్స్ - పశ్చిమ సమతౌల్యాన్ని పునరుద్ధరించడానికి తోడ్పడింది. అయితే 1970లలోను, 80లలోను తూర్పు యూరప్‌లో ప్రభలుతూ వచ్చిన బహు కేంద్ర వాదం సఘటిత సైనిక కూటమిగా సంపూర్ణ స్వరూపాన్ని సంతరించుకోవడంతో పాటు ఆసించిన పాత్రను నిర్వహించకుండా నిరోధించడం ద్వారా ఈ ఆర్గనైజేషన్‌ను బలహీనపరచింది. ఉదాహరణకు, 1962 తరవాత ఈ ఆర్గనైజేషన్‌లో పాల్గొనడానికి ఆల్బేనియా తిరస్కరించడమే కాకుండా 1968 లో సభ్యత్వాన్ని ఉపసంహరించుకొంది. ఒకప్పుడు శాశ్వత పరిశీలక దేశంగా ఉన్న చైనా పీపుల్స్ రిపబ్లిక్ తన అనుబంధాన్ని తెంచుకొంది. మిత్ర కూటమిలో సోవియట్ ప్రాభల్యం పట్ల తూర్పు, పశ్చిమ యూరప్ దేశాల మధ్య వర్తక సంబధాలు పెరగడంతో యుద్ధ భయం తగ్గిపోవడం వల్ల కూడా ఈ సంధి పాత్ర సన్నగిల్లింది. సోవియట్ విదేశీ విధాన ప్రయత్నాలను లాంఛన ప్రాయంగా ఆమోదించే వేదికగా ఉండుటయే దీని ప్రధానమైన విధిగా తోస్తుంది. 1968 లో సభ్యదేశమైన జెకొస్లావేకియాలో సరళీకరణ పట్ల మొగ్గు చూపే ధోరణిని తల్ల కిందులు చేయడానికి వార్సా ట్రీటి ఆర్గనైజేషన్ దేశాలు ఆ దేశం మీద దాడిచేశాయి. ఈ సంస్థ దళాలు చేపట్టిన చివరి ఉమ్మడి సైనికచర్య ఇదే.

ఎం. దాసు

పాఠం - 16

# 1. అలీనోద్యమము

# 2. యూరప్ ఆర్థిక సంఘము

**లక్ష్యం:**

పాశ్చాత్య కూటమితో గాని, సోవియట్ రష్యా కూటమితో గానీ రాజకీయంగా, లేదా సైనిక పరంగా సంబంధాల పెట్టుకోవడానికి తిరస్కరించిన దేశాల ఉద్యమమైన అలీనోద్యమము గురించి, యూరప్ ఆర్థిక సంఘము గూర్చి వివరించడమే ఈ పాఠం ముఖ్య లక్ష్యం.

**విషయ సంగ్రహం:**


16.1. అలీనోద్యమము

16.1.1. పరిచయం

16.1.2. అలీనోద్యమానికి దోహదం చేసిన అంశాలు

16.1.3 అలీనోద్యమమనగా

16.1.4 అలీనోద్యమ ప్రధాన లక్షణాలు

16.1.5 అలీనోద్యమంలో నెహ్రూ పాత్ర

16.1.6 అలీనోద్యమం ఎందుకు

16.1.7 అలీనోద్యమ సమావేశాలు

16.1.7.1. బెల్ గ్రేడ్ సమావేశం

16.1.7.2. కైరో సమావేశం

16.1.7.3. లుసాకా సమావేశం

16.1.7.4. అల్జీర్స్ సమావేశం

16.1.7.5. కొలొంబో సమావేశం

16.1.7.6. హవానా సమావేశం

16.1.7.7. ఢిల్లీ సమావేశం

16.1.7.8. హరారే సమావేశం

16.1.7.9. బెల్ గ్రేడ్ సమావేశం

16.1.8. ప్రపంచ రాజకీయాలలో అలీనోద్యమ పాత్ర

16.1.9. పరిశీలన

16.2. యూరప్ ఆర్థిక సంఘము

16.2.1. పరిచయం

16.2.2. యూరప్ ఆర్థిక సహకార సంస్థ

16.2.3. బెనలక్స్, బ్రస్సెల్స్ సంధులు

16.2.4. యూరప్ మండలి

16.2.5. యూరప్ బొగ్గు, ఉక్కుసంఘం

16.2.6. యూరప్ ఆర్థిక సంఘము

16.2.6.1. యూరప్ ఆర్థిక సంఘ లక్ష్యాలు

16.2.6.2. యూరప్ ఆర్థిక సంఘ కార్యాచరణ

16.2.6.3. యూరప్ ఆర్థికసంఘ విజయాలు

16.2.6.4. విమర్శ

## 1. అలీనోద్యమము

### 16.1 పరిచయం :

రెండవ ప్రపంచ యుద్ధానంతరం అమెరికా, సోవియట్ రష్యాలు, ఆసియా, ఆఫ్రికా దేశాలకి తమ ప్రాభల్యాన్ని పెంచుకోవటానికి విశేషముగా కృషి చేశాయి. కమ్యూనిష్ట్ , కమ్యూనిష్టేతర దేశాలు చేసిన ఈ ప్రయత్నాలు తీవ్రమైన స్పర్ధగా మారి ప్రచ్ఛన్న యుద్ధముగా వ్యవహృతమయినాయి. 1954 నాటికి ఈ ప్రచ్ఛన్న యుద్ధము పరాకాష్టకు చేరి మరొక పెద్ద సంఘర్షణ జరిగె పరిస్థితులు ఏర్పడినాయి. ఇదే కాలంలోనే ఈ రెండు రాజ్య కూటాలలో దేనిలోను చేరకుండా స్వతంత్ర విధానాన్ని అనుసరించే దోరణి ఆసియా, ఆఫ్రికా దేశాలలో మొదలైనది. ఇదే అలీన రాజ్య విధానముగా రూపొందింది. అదే విధముగా నూతనముగా స్వతంత్ర్యము సంపాదించుకున్న ఆసియా, ఆఫ్రికా దేశాలు పరస్పర సహకారం, సాన్నిహిత్యాలను పెంపొందించు కోవటానికి కృషి చేశాయి. ఈ కృషి ఫలితంగానే ఆసియా, ఆఫ్రికా దేశాల సమావేశం 1955లో ఇండోనేషియాలోని బాండుంగ్‌లో జరిగింది. ఆ తదుపరి 1956లో భారత ప్రధాని నెహ్రూ, యుగొస్లావియా అధ్యక్షుడు టిటో, ఈజిప్టు అధ్యక్షుడు నాజర్, యుగొస్లావియా లోని బ్రిజోనే దీవులలో సమావేశమై అలీన ఉద్యమాన్ని ఆఫ్రికా, ఆసియా ఖండ దేశాలకి పరిమితం కాకుండా అంతర్జాతీయంగా విస్తృత పరుచుటకు నిర్ణయించారు. ఐతే అలీన ఉద్యమం అనే పదాన్ని తొలిసారిగా నెహ్రూ 1956లో శ్రీలంక పర్యటనలో ప్రయోగించాడు. టిటో, నెహ్రు, నాజర్ వంటి వారు ఈ నూతన ఉద్యమ నాయకులుగా అవతరించారు. దీని ప్రథమ సమావేశం 1961లో బెల్‌గ్రేడ్ లో జరిగింది. బెల్‌గ్రేడ్‌లో కుదిరిన ఒప్పందం ప్రకారం ప్రతి మూడు సంవత్సరములకు ఒక సారి అలీనోద్యమ శిఖరాగ్ర సమావేశాలు జరగాల్సి ఉంటుంది. మూడో ప్రపంచ దేశాలలో చాలా దేశాలు ప్రాక్ - పశ్చిమ సంఘర్షణలకు దూరముగా ఉండాలని కోరుకోవటం వల్ల ఈ ఉద్యమానికి మంచి ఊపు వచ్చింది.

**16.1.2. అలీనోద్యమానికి దోహదం చేసిన అంశాలు :** అలీన ఉద్యమానికి దోహదం చేసిన అంశాలు 1) పాశ్చాత్య రాజ్యాల జాతి దురహంకార విధానానికి గురి అయిన ఆఫ్రికా, ఆసియా రాజ్యాలు ఐక్యమగుటకు సంసిద్ధమగుట. 2) నూతనంగా స్వాతంత్ర్యం పొందిన ఆఫ్రికా, ఆసియా రాజ్యాలు శీగ్రగతిని ఆర్థికాభివృద్ధిని సాధించాలి అనుకోవటం. 3) ప్రశ్చన్నయుద్ధ చాయలు తమ దేశాలకు వ్యాపించకుండా నిరోధించటం. 4) తమ ప్రాంతాలలో తలెత్తె సమస్యలపై సమిష్ఠి వ్యూహ రచనకు పాల్పడుట మొదలగునవి.

**16.1. 3. అలీనోద్యమం అనగా :** అలీనోద్యమం పట్ల సరిఅయిన అవగాహన లేనివారు 'అలీన' అనే పదానికి 'తాటస్థ్యము' అనే అర్థాన్ని చెప్పినారు. ఐతే అది సరికాదు. అలీన ఉద్యమం అంటే అంతర్జాతీయ వ్యవహారాలతో ముఖ్యంగా రెండు అగ్రరాజ్యాల విధానాలు వైఖరులకు సంభందించిన వ్యవహారాలలో విధాన పరమైన చర్య పరమైన, స్వేచ్ఛను నిలుపుకోవటం అని అర్థం. అంతర్జాతీయ ప్రాధాన్యము ఉన్న ఒక సమస్య లేదా పరిస్థితి అలీన దేశానికి ఎదురైనపుడు ఆ సమస్య లేదా పరిస్థితి తీవ్రతను బట్టి తాత్కాలిక నిర్ణయం తీసుకోవటానికి తనకు గల హక్కు పట్ల పట్టుబట్టడం, నిర్ధారించుకోవటం ద్వారా ఈ స్వేచ్ఛను వ్యక్తీకరించటం జరుగుతుంది. అదనంగా అలీన, అలీనం కాని దేశాలన్నింటి మధ్య శాంతియుత సహజీవనం కోసం క్రియా శీలమైన అంతర్జాతీయ సహకారం కోసం అధికార

రాజకీయాల నుంచి వైదొలగటాన్ని అలీనోద్యమం ప్రతిబింబిస్తుంది. వ్యతిరేఖ అర్థంలో అలీన ఉద్యమం అంటే ఏదైన అగ్రరాజ్యాల లేదా, వాటికి అనుబంధమైన అధికార కూటములలో సైనిక లేదా రాజకీయ పరమైన నిబద్ధతను కుదుర్చుకోవటాన్ని ఏదేశ భూభాగంలోనైన విదేశి సైనిక స్థావరాలను అనుమతించటాన్ని తిరస్కరించటం అని అర్థం. ఇది ఒక క్రొత్త విదేశీ విధానాన్ని ప్రపంచ వ్యవహారాలలో విలక్షణమైన దృక్పధాన్ని ప్రతిబింబిస్తుంది. అలీన ఉద్యమం అంటే ప్రపంచ వ్యవహారాల పట్ల వ్యతిరేఖ విధానం కాని వైఖరి కాని కాదు. అన్ని దేశాల మధ్య శాంతిని సహకారాన్ని పెంపొందించటం లక్ష్యంగా గల సానుకూల విధానాన్ని వైఖరిని ఇది ప్రతిబింబిస్తుంది.

**16.1.4. అలీనోద్యమం ప్రధాన లక్షణాలు :** ప్రపంచములో ఏసైనిక కూటమిలో చేరకుండుట, ప్రపంచములో యుద్ధాన్ని నివారించి శాంతిని నెలకొల్పుటకు కృషి చేయుట, ఇతర దేశాల వ్యవహారాలలో జోక్యం చేసుకొనకుండుట, అంతర్జాతీయ సమస్యలపై నిర్ణయాలు తీసుకొనుట, జాతి విచక్షణను ఖండించి జాతీయ ఉద్యమాలను బలపరుచుట, మూడోవ కూటమిని ఏర్పాటు చేయకుండుట, అగ్రరాజ్యాల మధ్య సంఘర్షణ తలెత్తినప్పుడు తమ దేశంలో వానికి ఎటువంటి సైనిక స్థావరాలను నెలకొల్పుటకు అనుమతించకుండా ఉండుట, సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక పురోగతికి పరస్పరం సహకరించుకొనుట.

**16.1.5. అలీనోద్యమంలో నెహ్రు పాత్ర :** భారత దేశం అలీన విధానాన్ని అనుసరించటానికి కారణాలైన పరిస్థితులను వివరిస్తు 1948లో రాజ్యాంగ సభలో ప్రసంగిస్తు భారత దేశం అగ్రరాజ్యాల విధానాలకు అనుగుణముగా ఉండజాలదని ప్రకటించాడు. తిరిగి 1957 లో నెహ్రు రాజ్య సభలో ప్రసంగిస్తు భారత దేశం ఎటువంటి వివాదాలలోను ప్రమేయము లేకుండా స్వంత విదేశాంగ విధానాన్ని అవలంభిస్తుందని చెప్పినాడు. భారత దేశపు భౌగోళిక పరిస్థితులు ఈ విధానానికి అనుగుణంగా ఉన్నాయి అని చెప్పినాడు. ఈ విధానం భారత దేశపు నైతిక వారసత్వం వల్ల రూపొందించబడిందని వివరించాడు. ఈ విధానం ప్రకారం భారత దేశం ఎలాంటి సైనిక కూటాలలోను సభ్యతం స్వీకరించకుండా స్వతంత్రమైన విదేశాంగ విధానాన్ని అవలంభిస్తుంది. ఆసియా దేశాలు కొన్ని పరిస్థితుల ప్రభావం వల్ల అగ్రరాజ్యాలకు దాసోహమై ఆదేశాలు అందించె సహాయాన్ని స్వీకరించి అగ్రరాజ్యాల విధానాలకు అనుగుణముగా మసలుకోవటం జరుగుతుంది. భారతదేశం అలాంటి వత్తిడిలకు తల వగ్గదని తన స్వంత విదేశి విధానాన్ని అవలంభించి అంతర్జాతీయ రంగంలో తన సార్వభౌమాధికారానికి భంగము కలగని విధముగా వ్యవహరిస్తుందని ఆయన పలుసందర్భాలలో ఈ అలీన విదానాన్ని వివరించాడు. నెహ్రుకు ఐరోపా చరిత్ర అధ్యయనాన్ని పురస్కరించుకొని విభిన్న ఐరోపా దేశాల మధ్య జరిగిన దేశాలను పురస్కరించుకొని సైనిక పరమైన సంధులను గురించి సందేహాలు ఉత్పన్నమైనాయి. 1956 లో లోక్ సభలో ప్రసంగిస్తూ బాగ్దాద్ వడంబడిక సీటోలాంటి సైనిక కూటముల దృక్పధం పొరబాటని ఆయన చెప్పినాడు. అలీన విధానం శాంతిని నెలకొల్పటానికి చక్కని మార్గమని తద్వార ఆయుధాల సేకరణలో పోటి నివారించ వచ్చునని ఆయన వివరించాడు. అలీన విధానం పరిస్థితులకు అనుగుణముగా అనుసరింపబడిన విధానం కాని వ్యూహాత్మకముగా లాభకరమైయింది కాని అంతర్జాతీయ సంబంధాలలో ఇది వివాదాలకు అలీనమైన విధానమని ఆయన వివరించాడు. భారత దేశం అలీనముగా ఉండటం ద్వారా రెండు పక్షములుగా విడిపోయి సైనిక కూటాలతో కూడిన ప్రపంచంలో అను సంధానకర్తగా వ్యవహరించి ప్రపంచ శాంతికి దోహదకారి అవుతుందని నెహ్రు వివరించాడు. మొదటిలో అమెరికా, సోవియట్ రష్యాలు భారత దేశం రూపొందించిన అలీన విదానం పట్ల సందేహాస్పద ప్రకృతిని ప్రదర్శించినప్పటికి క్రమముగా అలీన విధానం ప్రస్తుత ప్రపంచంలో వాస్తవమని అంగీకరించాయి. భారత దేశం అలీన విధానం ద్వారా సాధించాలనుకున్న లక్ష్యాలు ఐక్యరాజ్య సమితి లక్ష్యాలు సారూప్యత కలిగి ఉన్నాయని నెహ్రు విశ్వసించాడు. అలీన విధానానికి మద్దతు నివ్వడం ద్వారా ప్రపంచ శాంతికి దోహదం చేయుటానికి అవకాశం ఉందని ఆయన విశ్వశించాడు.

అలీనోద్యమం ఇతర దేశాలు హామి ఇచ్చిన స్విస్, ఆస్ట్రియన్ తరహా తాటస్థ్యము కాదు. అలీన మంటే పృథకరణ వాదము కాదు. బెల్‌గ్రేడ్ సమావేశంలో సిహనేక్ ఈ విధముగా పేర్కొన్నాడు. "అలీనం అనేది క్రియాశీలమైన అంతర్జాతీయ జీవనాన్ని ప్రతిబింబిస్తుంది, అనారోగ్య కరమైన నిష్క్రియాత్మకమైన అంతర్ముక జీవనాన్ని ప్రతిబింబించదు. అలీనం అనేది గోడమీద పిల్లివాటము కాదు, అలీనం అనేది క్షనీస ప్రతిఘటన మ్మార్గము కాదు. ఇది సమకాలినానికి చెందిన అత్యంత కటినమైన సవాలు పూర్వకమైన సానుకూల విధానం అని బండారు నాయకె అంటారు. అలీనం అనేది ఇరు వర్గాలతో ఎల్లాంటి సంబందం వద్దు అనే ధోరణిని ప్రతిబింబించదు. దానికి విరుద్ధముగా రెండు కూటాల నుంచి సమానముగా సహకారాన్ని స్నేహాన్ని పొందటానికి ప్రయత్నిస్తుంది. ప్రతి సమస్య లేదా పరిస్థితి యోగ్యతలను బట్టి

ఈ ఉద్యమం నిష్పక్షముగా నిర్ణయం తీసుకొంటుంది. నెహ్రు అభిప్రాయంలో అలీన విధానం అనేది మౌళిక విధానం అయినప్పటికి ఒక నిర్ణీత పరిస్థితిని లేదా తీర్మానానికి దీనిని వర్తింప చేయటం అనేది నిర్ణయానికి లోబడి ఉంటుంది. అలీన ఉద్యమానికి నైతికత లేదా నైతిక సూత్రాలతో ఏ విధమైన సంబంధం లేదు. ఇది నైతికముగా తటస్థమైనది. అలీన విధానం అనేది ఒక ప్రత్యేకమైన విధానం కాదు. ఏదైన దేశంతో కాని దేశాల సముదాయంతో కాని స్నేహానికి లేదా సహకారానికి ఇది నిరోధకం కాదు. వ్యతిరేక కూటమికి చెందిన దేశాలలో ఒక దేశం కల్పించుకొనే సన్నిహిత స్నేహ సంబంధాలకు ఇది అవకాశంకల్పిస్తుంది. రాజకీయ, సైద్ధాంతిక భేదాలతో నిమిత్తము లేకుండా అన్ని దేశాలతోను స్నేహము పెంపొందించుకోవటానికి ఇది కృషి చేస్తుంది.

**16.1.6. అలీన ఉద్యమం ఎందుకు :** పాశ్చాత్య కూటమితో కాని, సోవియట్ కూటమితో కాని, రాజకీయముగా లేక సైనిక పరముగా సంబందాలు పెట్టుకోవటానికి తిరస్కరించిన రాజ్యాల సముదాయ ఉద్యమమే అలీన ఉద్యమం. రెండు కూటాల మధ్య తలెత్తిన ప్రఛ్ఛన్న యుద్ధం తమ జాతీయ ప్రయోజనాలకు గాని, ప్రపంచ సమాజానికి గాని శ్రేయస్కరంకాదని ఆఫ్రికా, ఆసియా దేశాలు భావించాయి. ప్రపంచం రెండు కూటాలుగా విడిపోవటం శాంతి పరిరక్షణకు ప్రమాధకరమని ఆదేశాలు భావించాయి. రెండు కూటాలకు దూరముగా ఉండటం ద్వారా ప్రపంచం మొత్తం ధృవీకరణ చెందితే సంభవించే అణుయుద్ధ విధ్వంసాన్ని ఈ దేశాలు నిరవధికముగా వాయిదా వేశాయి. రెండు కూటాల మధ్య అవగాహన వారధులుగా కమ్యూనికేషన్ మార్గాలుగా రూపొందటం ద్వారా అగ్రరాజ్యాల మధ్య ఉన్న అనుమానాలను అపార్థాలను తొలగించి ఆ రాజ్యాల చేత శాంతియుత సహజీవనానికి సహకారానికి సంబంధించిన విధానాలను అవలంబింప చేసి ప్రపంచ శాంతికి పాటు పడవచ్చునని ఈ దేశాలు భావించాయి. అలీన దేశాలకు సైనిక లేదా ఆర్థిక శక్తి లేకపోయినప్పటికి నైతిక శక్తి ఉంది.

కేవలం స్వేచ్ఛగా ఉండటమే కాకుండా అగ్రరాజ్యాల ప్రాబల్యం లేదా ప్రభావ చిహ్నాలేవి లేని రీతిలో స్వతంత్రముగా ఉండాలనే ఉద్రేకపూరితమైన మానసికమైన వత్తిడి వల్ల సంబందించినదే అలీన ఉద్యమం. తమ రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక వ్యవస్థల ప్రత్యేకతను నిలుపు కోవాలని అగ్రరాజ్య ప్రాభల్యానికి లోనైన దేశాలు సముదాయములో చేరి అనామకముగా ఉండకూడదని ఆఫ్రికా, ఆసియా దేశాలు భావించాయి. ప్రయోగదోష జ్ఞాన పద్ధతి ద్వార తమ చారిత్రక, మత లేదా తాత్విక విలువలు భారతదేశంలోనే సామ్యవాద తరహా సమాజం యుండోనేషియా సామ్యవాదం, అరబ్ సామ్యవాదం వంటి విశ్వాసాల వెలుగులో తమకొక ప్రత్యేక అభివృద్ధి నమూనా రూపొందించుకోవాలని ఈ దేశాలు వాంఛించాయి. విభిన్న విశ్వాసాల పట్ల సహనం వహించటం లోను, సాధారణంగా ప్రపంచములో గాని ఏదో ఒక కూటమి గుత్తాధిపత్యం వహించే విధముగా గాని సత్యం, న్యాయం, మంచి తనం ఉన్నాయి అనటాన్ని తిరస్కరించటంలో ఈ దేశాలు విశ్వాసం ప్రకటించాయి. వీరి ఉద్దేశ్యంలో అగ్రరాజ్యం పేర్కొనే దానితో కాకుండా సత్యం మరెక్కడో ఉంది. అంతర్జాతీయ సమస్యలకు పరిస్థితులకు సంబందించి అనుబంధ రహితమైన దృక్పధాన్ని చేపట్టటానికి తమకు అర్హత ఉందని వీరు భావించారు. ఈ వైఖరిలో అభిప్రాయ స్వేచ్ఛ ప్రజాస్వామ్య దృక్పధం ఇమిడి ఉన్నాయి. వలస దేశాలుగా ఉన్నందువల్ల పాశ్చాత్య ప్రాభల్యం పట్ల విముకత ఉన్నందువల్ల పాశ్చాత్య వ్యవస్థలాంటి వ్యవస్థను అంగీకరించే విషయంలో తమకు గల సందిగ్ధతకు ఒక ఆదర్శపరమైన పరిష్కారాన్ని వీరు అలీన ఉద్యమంలో కనుగొన్నారు.

అలీన విధానాన్ని అనుసరించటానికి ఆర్థిక కారణాలు కూడా కలవు. అబివృద్ధి చెందిన దేశాలైన అలీన దేశాలకు అనుబంధాలు లేకుండా రెండు కూటాల నుంచి ఆర్థిక సహాయం అవసరమైనది. అగ్రరాజ్యాల నుంచి ఆర్థిక సహాయం ఎంత అవసరమో రాజకీయ స్వాతంత్ర్యం కూడా అంతే అవసరమని వీరు భావించారు. ఆర్థిక స్వాతంత్ర్యం లేని రాజకీయ స్వాతంత్ర్యయం అర్థరహితమవుతుంది. ఆర్థికముగా ఇతరుల మీద ఆధార పడటం అనేది దీర్ఘకాలంగా రాజకీయ స్వాతంత్ర్యానికి భంగకరమౌతుంది. అందువల్ల తమ రాజకీయ స్వాతంత్ర్యానికి మరింత బలం చేకూర్చటానికి ఈ దేశాలు ఇతర దేశాలతో వివిద రకాల ఆర్థిక సంబంధాలను ఏర్పరుచుకునే విధానాన్ని ఎన్నుకొన్నాయి.

ఈ దేశాలు అలీన విధానాన్ని అనుసరించడానికి ఊహాత్మక భద్రతా పరమైన అంశాలు కూడా దోహదము చేశాయి. అగ్రరాజ్యాల కూటాలలో చేరి, భద్రత కోసం చూడటం, నిరర్ధకమని, చిన్న చిన్న దేశాల అనుభవాల వల్ల స్పష్టమౌతుంది. దక్షిణ కొరియా, దక్షిణ వియత్నాంను మొ॥ వ్యవహారాలను, ఇందుకు సాక్ష్యంగా చూపవచ్చు. ఏ అలీన దేశము శాశ్వితముగా లేదా పూర్తిగా భద్రత చేకూరిందా అని

భావించలేదు. ఏదైన కూటమిలో చేరిన దేశం, పొందె సాపేక్ష భద్రతనే ఇది పొందుతుంది. అయితే దీని అలీన విధానం తన పొరుగున ఉన్న శక్తివంతమైన దేశాల్లో దీనిని కూడా రెచ్చగొట్టదు.

ఈ దేశాలు అలీన విధానాన్ని అనుసరించడంలో దేశీయమైన రాజకీయ అవసరాలు కూడా ప్రముఖ పాత్ర వహించాయి. ఈ దేశాలకు రాజకీయ స్థిరత్వం ఏర్పరచుకోవలసిన అవస్యకత ఏర్పడింది. ధ్రువీకృత ప్రపంచంలో ఏకూటమిలోనూ చేరకూడదు అనే ఒప్పందాలు విభిన్న రాజకీయ, సైద్ధాంతిక పార్టీలు వ్యవహారాలు ఒకటై, ఏర్పరచుకొన్న విస్తృతమైన ఉమ్మడి వేదిక ద్వారా ఈ స్థిరత్వాన్ని పాక్షికంగా సాధించడమైయింది. పాశ్చాత్య కూటమిలో ఉన్న ఏదో ఒక దేశములో పోరాటం సాగించిన తరువాతనే ఈ దేశాలు స్వాతంత్ర్యము సంపాదించుకున్నాయి. కాబట్టి ఏదైన పాశ్చాత్య కూటమితో కలవడం వల్ల తమ పలుకుబడికి, భంగం కలుగుతుంది అనీ సహజంగానే, ఆ దేశాల నాయకులు భావించారు. వారి విద్యా సంస్కృతి కారణంగా కమ్యూనిస్టు కూటమిలో చేరడానికీ కూడా, వీరు వ్యతిరేకించారు. ప్రతి క్రొత్త దేశము తమ రాజకీయ లేదా సైద్ధాంతిక అనుబంధాలతో నిమిత్తం లేకుండా, బహుముఖ జాతీయ వికాసం కోసం తన ప్రజలను సమీకరించుకోవలసి వచ్చింది. అలీన విధానం ద్వారానే ఈ సమీకరణ సాధ్యం అని ప్రతి క్రొత్త దేశము భావించింది. అలీన విధానం ద్వారా తన జాతీయ వికాసానికీ అవసరమైన సహాయాన్ని, సహకారాన్ని ఇరు కూటాల నుంచి ఈ దేశం సంపాదించుకోగలిగింది.

**16.1.7. అలీనోద్యమ సమావేశాలు :** అలీన ఉద్యమానికి బీజాలు 1955లో ఇండోనేషియాలోని బాండుంగ్‌లో పడ్డాయి. వలస వాదాన్ని ఎదుర్కొనే సాధనాన్ని రూపొందించుకోడానికీ, ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశానికీ, 29 దేశాల పక్షాన ప్రధాన మంత్రులు లేదా విదేశాంగ మంత్రులు లేదా అనుభవజ్ఞులైన, రాజనీతిజ్ఞులు హాజరయ్యారు. నెహ్రూ, సుకర్నో, చౌ-ఎన్-లై నాసర్ మొ॥ ప్రముఖ నేతలు పాల్గొన్నారు. 1955 ఏప్రిల్ 18 నుండి 24 వరకు 7 రోజుల పాటు సమావేశం జరిగింది. ఇండోనేషియా అధ్యక్షుడు సుకర్నో సమావేశాన్ని ప్రారంభిస్తూ, శతాబ్దాలుగా పీడుస్తున్న పేదరికం నుంచి మానవాళికీ విమోచన ప్రసాదించడమే గొప్ప ఆదర్శం అని, ఈ ఆదర్శ సిద్ధి కోరి ఆసియా, ఆఫ్రికా ప్రజలు సంఘటితం కావాలి అని ఉద్ఘాటించారు. ఆసియా, ఆఫ్రికా దేశాల మధ్య ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలు పెంపొందడం ఎంతో అవసరం అని సమావేశంలో పాల్గొన్న ప్రతి నిధులందరూ గుర్తించారు. ఆర్థిక రంగంలో సాంకేతిక సహాయాన్ని గురించి, ఆర్థికాభివృద్ధికి ఐక్యరాజ్య సమితి ప్రత్యేక నిధి ఏర్పాటు ఆవశ్యకతను గురించి, ముడిపదార్థాలు, రవాణా, బ్యాంకింగ్, మొ॥ అంశాలపైన శాంతియుత ప్రయోజనాలకై అణుశక్తి సాధన గురించి చర్చలు జరిగాయి. మానవ హక్కులు, జాతుల స్వయం నిర్ణయాధికారం దక్షిణ ఆఫ్రికా, పాలస్తీన సమస్య మొ॥ విషయాలను సమావేశంలో చర్చించిరి. వలస సామ్రాజ్య వాదాన్ని ఖండిస్తూ స్వాతంత్ర్యం సముపార్జనకు పోరాడుతున్న దేశాలకు మద్దతును ప్రకటించింది. మారణాయుధాల తయారి వినియోగాలను ఖండిస్తు, నిరాయుధీకరణకు అంతర్జాతీయ చర్యలు తీసుకొవల్సిన ఆవశ్యకతను చెప్పింది.

**బాండుంగ్ సమావేశం ప్రకటించిన 10 సుత్రాలు:**

1) ఐక్య రాజ్య సమితి ఆదర్శాలను గౌరవించాలి, ప్రాథమిక మానవ హక్కులను గౌరవించాలి.

2) దేశాలు పరస్పరం ప్రాదేశిక సమగ్రతను సార్వభౌమాధికారాన్ని గౌరవించుకోవాలి.

3) తక్కువ, ఎక్కువ భేదము లేకుండా అన్ని జాతుల సమానత్వాన్ని గుర్తించాలి.

4) ఒక దేశపు అంతరంగిక వ్యవహారాల్లో మరొక దేశం జోక్యం చేసుకోరాదు.

5) దేశాలు తమ రక్షణకై ఒంటరిగా కాని, ఇతర దేశాల సహాయంతోగాని రక్షణ యుద్ధం చేసుకోనే హక్కును గౌరవించాలి.

6) ఉమ్మడి రక్షణకై చేసుకోన్న ఏర్పాట్లను ఏదో ఒక దేశం ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేయరాదు. ఏదేశం కూడా మరో దేశం పై వత్తిడి తేరాదు,

7) ఒక దేశం ప్రాదేశిక సమగ్రతనుగాని రాజకీయ స్వాతంత్ర్యానికి గాని, భంగం కలిగించె బలప్రయోగం కాని, బెదిరింపులుగాని చేయరాదు.

8) అంతర్జాతీయ సమస్యలను రాజ, మధ్య వర్తిత్వం, న్యాయమైన నిర్ణయం మొ॥ ఐక్యరాజ్య సమితి సూత్రాలను అనుగుణంగా పరిరక్షించుకోవాలి.

9) పరస్పర సహకారాన్ని, పరస్పర ప్రయోజన దోరణి పెంపొందించుకోవాలి.

10) న్యాయాన్ని గౌరవించాలి అంతర్జాతీయ బాధ్యతలను నెరవేర్చాలి

బాండుంగ్ సమావేశం చరిత్రాత్మకమైనది. ప్రపంచ జనాభాల్లో, సగానికి పైగా గల, ఆసియా, ఆఫ్రికా దేశాలు తొలిసారిగా, ప్రపంచ రాజకీయాల్లో తమ స్థానాన్ని, చాటుకోవడమేకాక, ఆచరణ సాధ్యమైన ఆదర్శ వాదాన్ని బాండుంగ్ సమావేశం ద్వారా రూపొందించారు అని నెహ్రూ వర్ణించాడు. "బాండుంగ్ సమావేశం ఆసియాపై ఐరోపా ఆదిపత్యం శకానికి ముగింపు పలికింది, బాండుంగ్ ప్రాచీన ఆసియాకు వీడ్కోలు చెప్పి నూతన శకానికి నాంది పలికింది". అని రోమన్ పండితుడు పెర్కొన్నాడు. "జాతి విచక్షణపై విరుచుకుపడ్డ విముక్త జాతుల సంఘటిత శక్తి". అని ఈ సమావేశాన్ని ఇయాన్ థామ్సన్ శ్లాగించాడు.

**16.1.7.1 బెల్‌గ్రేడ్ సమావేశం :** అలీనోద్యమానికి బాండుంగ్‌లో బీజాలు పడ్డ, దీని ప్రదమ సమావేశం 1961లో బెల్‌గ్రేడ్‌లో జరిగింది. ఈ సమావేశంలో 25 ఆఫ్రికా, ఆసియా దేశాలు ఒక యూరప్ దేశం పాల్గొన్నాయి. ఈ దేశాలకు తోడు 3 లాటిన్ అమెరికా దేశాలు పరిశీలక దేశాలుగా పాల్గొన్నాయి. ఈ సమావేశంలో అలీనోద్యమం అంటే ఏమిటో నిర్వచించడమైయింది. ఈ నిర్వచనం ప్రకారం అలీన దేశం ఈ క్రింది 4 అంశాలను పాటించాలి.

1) శాంతియుత సహజీవనం ప్రాతిపదికగా స్వతంత్ర విధానాన్ని అనుసరించాలి.

2) ఏవిధమైన బహు పాక్షిక సైనిక మిత్ర కూటమిలో పాల్గొనకూడదు.

3) విముక్తి స్వాతంత్ర్య ఉద్యమాలకు మద్దతు ఇవ్వాలి.

4) అగ్ర రాజ్యాలతో ద్విపాక్షిక సైనిక ఒప్పందాలు కుదుర్చుకో కూడదు.

బెల్‌గ్రేడ్ సమావేశం 27 అంశాల ప్రకటనను రూపొందించింది. ఈ ప్రకటనలోని లక్షణాల్లో 1) అంతర్జాతీయ శాంతిని పరిరక్షించమని, అగ్ర రాజ్యాలకు విజ్ఞప్తి చేయడం. 2)వలసవాద, సామ్రాజ్య వాద ధోరణులను ఖండించడం అనేవి ముఖ్యమైనవి వలస పాలనలో ఉన్న ప్రజలందరికీ, స్వాతంత్ర్యం కావాలి అని ఇది డిమాండ్ చేసింది. ఇది జాతి విచక్షణను ఖండించింది. అల్‌జీరియా, ట్యునేషియా, అంగోల, కాంగో మొ॥ దేశాలు సాగిస్తున్న స్వాతంత్ర్య పోరాటాలను ప్రశంసించింది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు న్యాయమైన వర్తకపు షరతుల కోసం ఇది పిలుపు ఇచ్చింది. అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక ప్రగతికి ఇది ప్రాధాన్యత ఇచ్చింది. సంపూర్ణ నిరాయుధీకరణకు ఈ సమావేశం పిలుపు ఇచ్చింది. ఆసియా, ఆఫ్రికా ఖండంలో కొత్తగా అవతరించిన దేశాలను, ఈ అంశాలు ఆకర్షించాయి. అందువల్ల ఆ దేశాలు అలీనోద్యమంలో చేరాయి.

**16.1. 7. 2 కైరో సమావేశము :** అలీన దేశాల రెండో సమావేశం 1964 లో కైరోలో జరిగింది. ఈ సమావేశానికి, 47 దేశాలు హాజరు అయ్యాయి. ప్రపంచ మొత్త మీద 11 మంది పరిశీలకులు హాజరు అయ్యారు. మొదటి సమావేశ అనంతరం అనేక పరిణామాలు సంభవించడంతో రెండో సమావేశానికి ప్రాముఖ్యం ఏర్పడింది. ప్రపంచం క్యూబా, క్షిపణి సంక్షోభాన్ని అధిగమించింది. భారత్, చైనాలమధ్య పోరాటం సంభవించింది. అలీనోద్యమానికి అగ్రగామి అయిన నెహ్రూ మరణించాడు.

కైరో సమావేశం శాంతి, అంతర్జాతీయ సహకార కార్యక్రమం అనే ప్రకటనను రూపొందించింది. ప్రపంచ వ్యాప్తమైన స్వేచ్ఛ, సమానత్వం న్యాయసూత్రాలను పాటించడంతో పాటు సామ్రాజ్యవాదం వలసవాదం అనేవాటిని కూడా రద్దు చేసినట్లు అయితే శాంతిని పటిష్ఠం చేయడం జరుగుతుంది అని ఈ ప్రకటన నొక్కి చెప్పింది. శాంతియుత సహజీవనం మీద ఇది ప్రాధాన్యం ఉంచింది. అంతర్జాతీయ వివాదాల అన్నింటినీ. శాంతియుత విధానాల ద్వారా పరిరక్షించుకోవాలి అని ఈ ప్రకటన పట్టుబట్టింది. సంపూర్ణ నిరాయుధీకరణ మీద

18

ప్రాధాన్యం ఉంచడమే కాకుండా, అణ్వాస్త్రాలను తయారు చేయడం నుంచి సహనం కూడా పాటించాలి అని అణ్వస్త్ర దేశాలకు విజ్ఞప్తి చేసింది. విదేశీ సైనిక స్థావరాలను, ఎత్తి వేయాలి అని డిమాండ్ చేసింది. ఇతర దేశాలు అంతరంగిక వ్యవహారాల్లో, జోక్యం చేసుకోకపోవడం వలసపాలకులకు వ్యతిరేకంగా వలస ప్రజలు సాగించే సాయుధ పోరాటానికి, సహాయం చేయడం ఆర్థిక రంగంలో అభివృద్ధి చెందిన దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలకు సంపూర్ణ సహకారం అందించడం అనేవి కైరో ప్రకటనలో ప్రధానమైన సూత్రాలు.

**16.1. 7. 3 లుసాకా సమావేశము :** అలీనదేశాల మూడో సమావేశం 1970లో జాంబియాలోని లుసాకాలో జరిగింది. ఈ సమావేశానికి 54 దేశాలు హాజరు అయ్యాయి. 9 దేశాలు తమ పరిశీలకులను పంపాయి. శాంతి అంతర్జాతీయ సహకారానికి వీలుగా అధికారానికి వీలుగా సమతుల్యం సమకూరేటట్లు ప్రభావం చూపాలి అని ఈ సమావేశం పేర్కొంది. మానవ జీవన విలువలను, సుసంపన్నం చేయడానికి అలీనదేశాలు ముందు ఉండాలి అని, సమావేశం పేర్కొన్నది. ఉద్రిక్తతను తగ్గించే దృష్టిలో సైనిక మిత్ర కూటాలను రద్దు చేయాలి అని సమావేశం విజ్ఞప్తి చేసింది. అన్నీ దేశాలమధ్య ఆర్థిక సహకార విధానాన్ని శీఘ్రతరం చేయవలసిన అవసరాన్ని నొక్కి చెప్పింది. ఈ సమావేశం జరిగిన కొద్ది రోజులకే ఈజిప్టు అధ్యక్షుడు నాసర్ మరణించాడు.

**16.1. 7. 4 అల్జీర్స్ సమావేశము :** నాలుగో అలీన దేశాల సమావేశం 1973 లో అల్జీర్స్‌లో జరిగింది. ఈ సమావేశానికి 76 మంది సభ్యులు 9 దేశాల పరిశీలకులు హాజరయ్యారు. ప్రపంచం మొత్తం మీదా స్వాతంత్రీయ పోరాటాన్ని శాంతిని పటిష్టం చేయాలి అని, ఈ సమావేశం పేర్కొన్నది. అంతర్జాతీయంగా వృద్ధి చెందుతున్న సామరస్యం, మరింత పటిష్టమై, మొత్తం ప్రపంచానికి విస్తరించాలి అని కోరింది. వలస వాదాన్ని. జాతి విచక్షణ విధానాన్ని ఖండించి, అంతర్జాతీయ శాంతిని సమకూర్చే దృష్టితో అన్నీ విభాగాలనూ, శాంతియుతంగా పరిష్కరించుకోవాలి అని పిలుపు నిచ్చింది. ఆర్థిక రంగంలో ఆర్థిక పరమైన దోపిడిని అంతంచేయాలి అని, అంతర్జాతీయ ఆర్థిక సంబంధాలు నెలకొనాలి అని పేర్కొన్నది.

**16.1. 7. 5. కొలంబో సమావేశము :** అలీన దేశాల ఐదో సమావేశం 1976 లో కొలంబోలో జరిగింది. ఈ సమావేశానికి 86 దేశాలు హాజరు అయ్యాయి. మొదటి సారిగా అలీనోద్యమ సమావేశం ఆసియా ఖండంలో జరగడం, ఆఫ్రికా లాటిన్ అమెరికా సమస్యలు ఈ సమావేశంలో ప్రాధాన్యం వహించడం ఈ సమావేశ ప్రత్యేకత. అంతర్జాతీయ లావా దేవీలలో తమ న్యాయ బద్ధమైన ఆర్థిక పాత్రను సాధించుకోడానికి, అభివృద్ధి చెందుతున్న దేశాలకు గల హక్కులకు ఈ సమావేశం ప్రాధాన్యమిచ్చింది. ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను సవరించడం ద్వారా, భద్రతా మండలిలో వీటో పద్ధతిని రద్దు చేయాలి అని సమావేశం కోరింది నూతన న్యాయమైన అంతర్జాతీయ వ్యవస్థ ఏర్పాడాలి అని కోరింది.

**16.1. 7 .6. హవానా సమావేశము :** అలీనోద్యమ 6 వ సమావేశం 1979 లో క్యూబాలోని హవానాలో జరిగింది. ఈ సమావేశానికి 94 దేశాలు హాజరు అయ్యాయి. ఈ సమావేశంలో మొదటిసారిగా అలీన దేశాల్లో చీలికలు ఏర్పడ్డాయి. క్యూబా వియత్నాం వంటి కొన్ని విప్లవ ధోరణిగల సభ్యదేశాలు సామ్యావాద కూటమితో మైత్రీ బంధం పెట్టకోవాలి అని వాదించింది. మరొకవైపు సింగపూర్ లాంటి దేశాలు పాశ్చాత్య కూటమికి సన్నిహితం కావాలి అని పట్టబట్టాయి. అయితే అలీన ఉద్యమం తన స్వతంత్ర ప్రతిపత్తిని నిలుపుకోవాలి అనే అభిప్రాయాన్ని మెజారిటి సభ్యులు ఆమోదించారు. అరబ్బుల సమస్యకు సంబంధించి కూడా రాజీ కుదిరింది. ఈ సమావేశం చివర జారీచేసిన ప్రకటనలో అగ్రరాజ్యాల ఆధిపత్య రాజకీయాలను ఖండించి, సైనిక పరమైన మిత్రకూటాలను సైనిక స్థావరాలను రద్దు చేయూలి అని కోరింది. సంపన్న దేశాల మధ్య ఉన్న అఖాతాన్ని పూడ్చడానికి, మరింత తీవ్రమైన చర్యలు చేపట్టాలి అని ఈ ప్రకటనల్లో కోరడం జరిగింది.

**16.1. 7. 7. ఢిల్లీ సమావేశము :** అలీనోద్యమ 7 వ సమావేశం 1983 లో కొత్త ఢిల్లీలో జరిగింది. ఇందులో 99 దేశాలు పాల్గొన్నాయి. పరిశీలకులుగా, 20 దేశాలను ఆహ్వానించడం జరిగింది. 19 దేశాలను, అతిధులుగా ఆహ్వానించడమైనది. ఈ సమావేశంలో వినాశకరమైన అణు యుద్ధం దిశగా ఎటువంటి చర్యలు చేపట్టవద్దని అగ్ర రాజ్యాలకు విజ్ఞప్తి చేయడమైంది. ఈ సమావేశం తొలిసారిగా ఒక లాంచన ప్రాయమైన సందేశం ద్వారా ఆయుధ పోటీని నిలిపివేయమని అగ్ర రాజ్యాలను కోరింది. ఈ సమావేశం సాధించిన ఒక ముఖ్య

అంశం కంపూచియాకు సంబంధించి వివాదాలు ఉన్నప్పటికీ కంపూచియా స్థానాన్ని ఖాళీగా వుంచాలి అనే నిర్ణయం తీసుకోవడం ద్వారా ఐక్యతను నిలుపుకోవడంలో విజయం సాధించడం.

**16.1. 7. 8. హరారే సమావేశము :** 8 వ అలీనోద్యమ సమావేశం 1986 లో జింబాబ్వే రాజధాని హరారేలో జరిగింది. ఈ సమావేశ కాలంలో దక్షిణాఫ్రికా లోని శ్వేత జాతి ప్రభుత్వ దురహంకారాన్ని ఖండించడం జరిగింది. అంతరిక్షాన్ని అశాంతి మండలంగా మార్చవద్దు అన్న ఆకాంక్షను ఈ సమావేశం వ్యక్తం చేసింది.

**16.1. 7. 9. బెల్‌గ్రేడ్ సమావేశము :** 9 వ అలీన దేశాల సమావేశం ఇగోస్లావియా రాజధాని బెల్‌గ్రేడ్‌లో జరిగింది. ఈ సమావేశంలో తృతీయరాజ్యాలు, ఎదుర్కొనుచున్న ఋణసమస్య దక్షిణ ఆఫ్రికా, పాలస్తీనా, ఆఫ్ఘనిస్తాన్ సమస్యల గురించి చర్చించారు.

పై పరిశీలన వల్ల అలీన ఉద్యమం పరిమాణంలోనూ సాధించిన అంశాలలోనూ క్రమముగా వృద్ధి చెందుతూ వచ్చింది. అనే విషయం స్పష్టమౌతుంది. తొలి సమావేశంలో ప్రపంచ శాంతి ప్రయోజనాల దృష్ట్యా అణుపరీక్షల పట్ల సంయమనం పాటించమని అమెరికాకు సోవియట్ రష్యాకు విజ్ఞప్తి చేయడం జరిగింది. రెండో సమావేశంలో శాంతియుత సహజీవన సూత్రానికే ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. 3వ సమావేశంలో అలీనోద్యమం సైనిక కూటాలను విమర్శించింది. ఆర్థిక సహకారానికి సంబంధించిన, అవశ్యకతను కూడా పేర్కొన్నది. 4వ సమావేశం ఉద్రిక్తతలను తొలగించి శాంతియుత వాతావరణాన్ని కల్పించడానికి ప్రాముఖ్యం ఇచ్చింది. కొలంబో సమావేశం అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక పరమైన విముక్తికి నూతన అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ ఏర్పాటుకు ప్రాధాన్యం ఇచ్చింది. 6, 7 సమావేశాల్లో అలీనోద్యమ పరిధి మరింత విస్తరించింది. క్లుప్తంగా చెప్పాలి అంటే సంవత్సరాలు గడచిన కొద్దీ అలీనోద్యమ పరిధి విస్తృతమౌతూ వచ్చింది.

**16.1 .8. ప్రపంచ రాజకీయాల్లో అలీనోద్యమ పాత్ర :** అంతర్జాతీయ రాజకీయాల్లో అలీనోద్యమం పటిష్ఠమైన నిర్మాణాత్మకమైన శక్తిగా రూపొందింది. ఇందులో ఇప్పటికీ 110 దేశాలు సభ్యులుగానో, అనుబంధ సభ్యులుగానో పరిశీలకులుగానో చేరినవి. అలీనోద్యమ రాజ్యాలు ప్రపంచ రాజ్యాల్లో సగం భౌగోళిక విస్తీర్ణంలో 50 నుండి 60 శాతం, ప్రపంచ జనభాలో 30 శాతం ఈ ఉద్యమంలో యుగోస్లావియా క్యూబావంటి కమ్యూనిస్టు దేశాలు చేరుట ఒక ప్రత్యేకత. అంతేగాక కెనడి కృశ్చేవ్‌లు అలీనోద్యమాన్ని ప్రశంసించుట మరొక విశిష్టత. నాసర్ నాయకత్వంలో ఈజిప్టు, టిటో ఆధ్వర్యంలో యుగోస్లావియా సుకర్నో నాయకత్వంలో ఇండోనేషియా, ఇంకా ఘనా, శ్రీలంక మారిషస్ మాల్‌దీవులు, ఆఫ్నిస్థాన్ లాంటి దేశాలు ఈ విధానాన్ని స్వీకరించి అలీన విధానాన్ని, విజయవంతం చేసి ప్రపంచ శాంతికి దోహదకారులు అయ్యారు. ఈ అలీన విధానం ప్రాముఖ్యాన్ని ఇతర దేశాలు గుర్తించి, అవి కూడా ఈ విధానాన్ని అవలంబించేందుకు, నెహ్రూ గొప్ప కృషి చేశాడు. దీనివల్ల భారతదేశం శాంతి కాముక దేశంగా పేరుపొంది, అలీన విధానానికి ప్రతినిధిగా ప్రఖ్యాతి వహించింది.

ప్రపంచ రాజకీయాలను ప్రభావితం చేయడంలో అలీనోద్యమం అనూహ్యమైన పాత్రను నిర్వహించింది. ప్రపంచంలో ఏర్పడిన ప్రచ్ఛన్న యుద్ధాన్ని సడలింపజేసి, మరొక ప్రపంచ యుద్ధం జరగకుండా నివారించింది. అనేక రాజ్యాలు, వలస పాలననుండి విముక్తి చెంది. సర్వ స్వతంత్ర్య దేశాలుగా ఆవిర్భవించుటకు అలీనోద్యమం దోహదము చేసింది. పరస్పర అవగాహన సహకారాలలో అగ్ర రాజ్యాల సామ్రాజ్య వాదాలనూ తీవ్రంగా ప్రతిఘటించింది. అధిక సంఖ్యా బలం ఉండటం వల్ల ప్రపంచ శాంతి స్థాపనంలో అలీనోద్యమం కీలక పాత్ర వహించుచున్నది.

**16.1.9 పరిశీలన :** అలీన విధానం ప్రపంచ రాజ్యాల్లో ఒక దేశ స్వాతంత్ర్యాన్ని నిలుపుకొనే పద్ధతి. ఈ విధానం ప్రపంచ రాజకీయాల్లో పాల్గొనడానికి సంబంధించి ఒక దేశం తన విధానాన్ని స్వేచ్ఛగా ఎన్నుకోడానికి, అవకాశం కల్పించె ఒక నూతనమైన శాశ్వతమైన వ్యవస్థ. ధృవీకరణ ప్రమాదాలను. ప్రచ్ఛన్న యుద్ధానికి చెందిన ఉద్రిక్తతలను తొలగించె ఏకైక సాధ్యముగా ఇది కనిపిసుంది. నేటికి ఈ ఉద్యమ అంతిమ లక్ష్యం సైద్ధాంతిక, సైనిక కూటాలను నిర్మూలించడమే. ఐక్యరాజ్యసమితి సభ్యదేశాల్లో అత్యధిక దేశాలు, ఏదో ఒక కూటమితో కలసిన దేశాలతో సహా, కొత్త దేశాలు కూడా ఈ విధానాన్ని అంగీకరిస్తున్నాయి. అలీన దేశంగా ఉండటం వల్ల ఒక దేశం

రెండు కూటాలలో ఏదో ఒక కూటమిలో చెరిన దేశాలతో కూడిన స్నేహ సంబంధాలు కలిగి ఉండవచ్చు. ప్రపంచంలో ఈ దేశం అధిక స్వేచ్ఛాయుతంగా వ్యవహరించవచ్చు. వర్తక విషయంలో కూడా అలీన దేశాలు ఏకూటమిపట్ల పక్షపాతం లేకుండా రెండు కూటాలలోని దేశాలతో వర్తకం సాగించవచ్చు. రెండవ ప్రపంచ యుద్ధానంతరం అంతర్జాతీయ సమాజంలో అణ్వాస్త్ర భీతి అలీన విధానం అనేవి రెండు ముఖ్యమైన లక్షణాలు ఈ రెండిటిలో స్వతంత్రముగా ఉండాలి అనే కాంక్ష, ప్రతి దేశానికి ఉంటుంది. అందువల్ల, అలీన విధానం, దీర్ఘకాలం కొనసాగవచ్చు. అలీన విధానం అనుసరించే వారందరి, సమానమైన సామర్ధ్యం లేకపోయినప్పటికీ, సమానమైన పాత్ర నిర్వహిస్తారు. అందువల్ల అలీన ఉద్యమాన్ని పటిష్టం చేయడానికి పరస్పర సహకారం ఏంతైన అవసరం. అలీన ఉద్యమం సమిష్టి ప్రయోజనాలను, కాపాడుతున్నవి. అంతేగాక, ప్రపంచంలోని కొన్ని పాత కొత్త దేశాల స్వాతంత్ర్యానికీ అదనపు బలం చేకూర్చింది. ప్రస్తుత సర్వసత్తాక జాతి రాజ్య వ్యవస్థ కొనసాగినంత కాలం అలీనోద్యమం కొనసాగుతూనే ఉంటుంది.

అలీన దేశాల సమావేశాలలో ఏదో ఒక రూపంలో అభిప్రాయభేదాలు తలెత్తడం పరిపాటి అయింది. వలస పాలనా నిర్మూలన, జాతి విచక్షణా విధానాల వ్యతిరేఖత వంటి సమస్యలపై, ఏకాభిప్రాయ ప్రకటనలు చేయడం, సులభమే కాని, ఇతర సమస్యలపై తీర్మానాలను, రూపొందించే సమయంలో ఈ రాజ్యాల మధ్య బేదాభిప్రాయాలు తలెత్తుతున్నాయి. అలీన ఉద్యమాన్ని, ఏదోఒక అగ్రరాజ్యం వైపు మొగ్గుచూపేటట్లు చేయడానికి, కొన్ని వత్తిడులు చోటు చేసుకుంటున్నాయి. సమావేశాలకూ, ఆతిధ్యమిచ్చే దేశం, తన విధానాలకు అనుగుణంగా, తీర్మానాలు చేయడానికి, ప్రయత్నాలు చేస్తున్నాయి. అలాగే, అలీనోద్యమ సూత్రాలను కొన్ని దేశాలు ఉల్లంఘిస్తున్నాయి. అలీన ఉద్యమంలో రష్యా వర్గానికి, సన్నిహితంగా ఉన్న దేశాలకు, పాశ్చాత్య దేశాలకూ, సన్నిహితంగా ఉన్న దేశాలకు మధ్య వివాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఆఫ్ఘనిస్థాన్, కంపూచియావంటి విషయాలపై అలీన రాజ్యాలు అగ్రరాజ్యాల పాత్రను సంయుక్తంగా, ఖండించలేక పోతున్నాయి. అలీన రాజ్యాలు అయిన, ఇరాన్, ఇరాక్ దేశాల సంఘర్షణను, నివారించడంలో అలీన ఉద్యమం విఫలమైంది. నిరాయుధీకరణ విషయంలో కూడా అలీన దేశాల విధానం సోవియట్, అనుకూల వైఖరులకు, మద్దతిస్తున్నాయి అని, పాశ్చాత్య దేశాలు భావిస్తూ ఉంటాయి. అలీన రాజ్యాల నిర్ణయాలు అన్ని పరస్పర వ్యతిరేఖ భావాలతో నిండి ఉంటున్నాయి. అలీన రాజ్యాల నిర్ణయాలను, వాటి మౌళిక సూత్రాలకు భిన్నంగా కొన్ని సందర్భాల్లో రూపొందుతున్నాయి. అందువల్లన అలీన సమావేశాల నిర్ణయాలు నిష్ఫలమౌతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో, అలీనత అనేది గోడమీద పిల్లి వాటం వంటిది అని అభిప్రాయానికి ఈ ఉద్యమ వ్యతిరేఖత రావటం జరిగింది. అలీన రాజ్యాలు ప్రదర్శించే వైఖరి ఐక్యత, ఏకాభిప్రాయం, ఎండమావిలో నీటి వంటిది అని పలువురి భావన. ఈ సమస్యలను అధిగమిస్తే గాని, అలీన ఉద్యమానికి ఉజ్వల భవిష్యత్ ఉండదు. ఏదిఏమైనప్పటికీ ప్రపంచ రాజకీయాలకూ భారతదేశం అందించిన విన్నూత్నమైన శాంతియుత ఉద్యమం అలీనోద్యమం. దీని నిర్మాత మన తొలి ప్రధాన మంత్రి ఆయిన జవహర్‌లాల్ నెహ్రూ.

డా. వి. కె. మోహన్

# 2) యూరప్ ఆర్థిక సంఘము

**16.2.1. పరిచయం :** యూరప్ దేశాల సమైక్యత భావం అత్యంత ప్రాచీన కాలంనుంచి ప్రచారంలో ఉంది. ఈ ఐక్యత భావం గ్రీకు, రోమన్ సామ్రాజ్యాలకాలంలో అంకురించి క్రిసెండంలో రూపు సంతరించుకొన్నది. యూరప్ ఐక్యత మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో విచ్ఛిన్నమైనది. అయితే యుద్ధానంతరం తిరిగి ఐక్యతా భావాలు వ్యాప్తికాసాగాయి. యూరప్ ప్రతి నిధులతో ఒక జాతీయ పార్లమెంట్ ఎన్నుకోబడాలి అని, ఒక ఉన్నత న్యాయస్థానం ఏర్పాటు చేయాలి అని ఫ్రెంచి రాజనీతి వేత్త బ్రియాండ్ ప్రతి పాదించాడు. ఈ ప్రతిపాదనలను, రెండో ప్రపంచ యుద్ధ కాలంలో యూరప్ తీవ్రంగా పరిశీలించింది. అనేక సమైఖ్య ప్రణాళికలు రూపొందించబడినాయి. కొందరు ప్రపంచ సమాఖ్య ప్రణాళికలను తయారు చేశారు. జీన్ మానెట్, పాల్ హెన్రీస్పాక్, మొ॥ మేధావులు ఐక్య ప్రతి పాదనలు చేశారు. చర్చిల్, డీగాల్ వంటి రాజకీయ వేత్తలు ఈ ప్రతి పాదనలను ఆమోదించారు.

రెండో ప్రపంచయుద్ధానంతరం యూరప్ ఆర్థిక, రాజకీయ, సైనిక, సామాజిక సమస్యలకై పెద్ద ఎత్తున ప్రయత్నాలు సాగాయి. దీనికి అనేక కారణాలు గలవు సుదీర్ఘకాలం పాటు జరిగిన, రెండో ప్రపంచ యుద్ధంలో అన్ని యూరప్ దేశాలు ఆర్థికముగా దెబ్బతిన్నాయి.

ఈ యుద్ధంలో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. యుద్ధం అంటే ప్రజలకు భయమేర్పడింది. మరో యుద్ధం రాకుండా నివారించాలి అంటే ఐరోపా ఐక్యత అవసరం అని చాలా మంది అభిప్రాయ పడ్డారు. యుద్ధ కారణంగా యూరప్ రాజ్యాల్లో ఏర్పడిన ఆర్థిక దుస్థితి వల్ల అమెరికా, రష్యాలో వ్యాపార వాణిజ్య రంగాల్లో ఏర్పడిన భర్తీని పూర్తి చేయడానికి కుతూహలం ప్రదర్శించడంతో బాహ్య శక్తుల నుండి తమ ఆర్థిక స్వేచ్ఛను వ్యాపార రంగాన్ని రక్షించుకోవడానికి ఐక్యముగా కృషి చేయడం అవసరం అని యూరప్ వారు భావించారు. అమెరికా సోవియట్ రష్యాలు రెండు విభిన్న కూటాలకు నాయకులుగా ఎదిగి ప్రచ్ఛన్న యుద్ధం ప్రారంభించడంతో పశ్చిమ ఐరోపా రాజ్యాలు పరస్పర సహకారానికీ రక్షణకు ఐక్యము కావాలనే అభిప్రాయం బలపడింది. ఒక వైపు తమ దేశాల్లో కమ్యూనిస్టుల ప్రభావం పెరుగుతున్నదేమోనన్న భయం, మరోవైపు అగ్రరాజ్యాలుగా తమ హోదా తగ్గి పోతుందోనన్న బాధ, యూరప్ రాజ్యాలను, దగ్గరికి చేర్చింది. అంతేగాక అమెరికా సోవియట్ రష్యాల మధ్య యుద్ధం సంభవిస్తే దాని ప్రభావం తమపై పడుతుంది అని అటువంటి పరిస్థితుల్లో ఉమ్మడి వ్యూహం అవసరం అని యూరప్ వారు భావించారు.

సమైఖ్యత ప్రయత్నాలు కేవలం పశ్చిమ ఐరోపా రాజ్యాలకే పరిమితమయ్యాయి. సోవియట్ రష్యా ప్రాబల్యంలోని తూర్పు యూరప్ రాజ్యాలకు ఇందులో ప్రమేయం లేదు. పశ్చిమ యూరప్ రాజ్యాల ప్రయత్నాల ఫలితంగా అనేక నూతన యూరప్ వ్యవస్థలు ఏర్పడ్డాయి.

**16.2.2 యూరప్ ఆర్థిక సహకార సంస్థ** : రెండో ప్రపంచ యుద్ధం వల్ల కుంటుపడిన యూరప్ ఆర్థిక వ్యవస్థ పునర్ నిర్మాణానికి అమెరికా మార్షల్ పథకం ప్రవేశ పెట్టింది. ఈ పథకం క్రింద ఇచ్చే ఆర్థిక సహాయం దేశ ప్రాతిపదిక మీద కాక ఖండ ప్రాతిపదిక మీదుగా ఉంటే మంచిది అని అట్టి సంస్థను ఒక దానిని ఏర్పాటు చేసుకోవల్సిందిగా అమెరికా సలహా ఇచ్చింది. ఫలితంగా పారిస్‌లో 1946లో 16 యూరప్ రాజ్యాలు సమావేశమై ఆర్థిక సహకార ఒప్పందం పై సంతకాలు చేశాయి. ఇందులో తూర్పు ఐరోపా రాజ్యాలు స్పెయిన్ పాల్గొనలేదు. ఆ తరువాత ఈ ఒప్పందంపై మరో రెండు దేశాలు సంతకాలు చేశాయి. ఈ యూరప్ ఆర్థిక సహకార సంఘానికి, ఒక మండలి కార్యవర్గ సంఘము సచివాలయంలో ఒక వ్యవస్థను ఏర్పాటుచేశారు. ఈ సంఘంలో అనేక ఉప సంఘాలు గలవు సంఘ లక్ష్యాలను, సభ్యదేశాలు అనుసరించవలసిన ఆదేశాలను, ఒప్పందంలో, పొందుపరచడం జరిగింది.

**సంఘ ముఖ్య లక్ష్యాలు:** 1) దేశ వనరుల సక్రమ వినియోగం ద్వారా ఉత్పాదకశక్తిని పెంచడం 2) వస్తువుల, సేవల మార్పిడిలో డబ్బు చెల్లింపుల్లో పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవడం. 3) వీలున్నంత వరకు స్వేచ్ఛా వ్యాపార ప్రాంతాల ఏర్పాటు, వ్యాపార విస్తరణ, కరెన్సీల స్థిరత్వం సాధించడం మానవ శక్తిని పూర్తిగా ప్రయోజనకరంగా ఉపయోగించడం.

ఐరోపా ఆర్థిక సహకార సంస్థ ఏర్పాటు రాజకీయ ఐక్యతను, దారి తీయగలదనే ఆశలు ఫలించలేదు. వ్యాపార రంగంలో వ్యాపార విస్తరణకు అడ్డుగా ఉన్న ఆంక్షలను తొలిగించడంలో, రాజ్యాల మధ్య చెల్లింపుల్లో గొప్ప ప్రగతి కనిపెంచిన రాజకీయ ఐక్యత సాధింపబడలేదు ఆర్థిక రంగంలో కూడా యూరప్ ఆర్థిక ఏకీకరణ అనే లక్ష్యాన్ని చేరుకోలేక పోయింది.

**16.2.3. బెనలక్స్, బ్రస్సెల్స్ సంధులు** : బ్రిటన్, ఫ్రాన్స్, బెల్జియం, నెదర్‌లాండ్స్, లగ్జెంబర్గ్ దేశాలు 1948 లో బ్రసెల్స్ సంధిపై సంతకాలు చేశాయి. ఇది రక్షణ రంగంలో ఐక్య కార్యాచరణ జరిగిన ఒక గొప్ప ప్రయత్నం. బ్రస్సెల్స్ సంధి సంస్థ, స్వేచ్ఛా, ప్రపంచ పరిరక్షణలో గొప్ప సేవ చేసింది. ఇది ఉత్తర అట్లాంటిక్, వ్యవస్థలో అంతర్ భాగమైంది.

యూరప్ ఆర్థిక సహకారంతో మరొక ప్రయత్నం 1948 బెనలక్స్ ఒప్పందము ఇందులో బెల్జియం, నెదర్‌లాండ్స్, లగ్జింబర్గ్, రాజ్యాలు కలవు. ఈ దేశాలు తమ మధ్య వ్యాపారంలో ఒకరి మీద మరొకరు ఎటువంటి సుంకాలు విధించరాదు. అని ఇతర దేశాల నుండి తీసుకొనే దిగుమతులపై కూడా ఒకే విధమైన సుంకాలు విధించాలి అని నిర్ణయించుకున్నారు. ఈ ఒప్పందాన్ని 1954 లో విస్తరింప జేస్తూ, తృతీయ పక్షాల దేశాలతో వ్యాపారానికీ, చెల్లింపులకు ఒకే పద్ధతిని అమలు చేశారు. తమ దేశాల మధ్య పెట్టుబడులు, స్వేచ్ఛగా కొనసాగాలి అని అంగీకరించారు.

**16.2.4. యూరప్ మండలి :** బెల్జియం, ఫ్రాన్స్, లక్షంబర్గ్, నెదర్‌లాండ్స్, బ్రిటన్, డెన్మార్క్' ఐర్‌లాండ్, ఇటలీ, స్వీడన్ దేశాలు కలసి, **1949 లో** యూరప్ మండలిని స్థాపించుకొన్నారు. ఆర్థిక, సాంస్కృతిక, వైజ్ఞానిక చట్ట, పరిపాలనా విషయాల్లో ఐక్యతా సాధనకు ఈ ఐరోపా మండలి, ఉద్దేశింప బడింది. సామూహిక సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవడం, సభ్య రాజ్యాల మధ్య ఆర్థిక, సాంస్కృతిక, వైజ్ఞానిక, తదితర విషయాల్లో సహాయ సహకారాలు అందించుకొని సమైఖ్యముగా కృషి చేయడం లక్ష్యముగా చేసుకొన్న ఈ మండలి, రాజకీయాలనూ ప్రస్తావించలేదు. ఈ మండలి మంత్రుల సంఘం, సంప్రదింపుల సభ అను అంగాలనూ వాటికి అనుబంధంగా, అనేక చిన్న సంఘాలనూ, ఏర్పాటు చేసుకొన్నది. తన కార్యక్రమాలు, ఈ మండలి కొంత ఘర్షణపడిన, విభేదాలు వచ్చిన, మొత్తం మీద యూరప్ సభ్య దేశాలు తమ అభిప్రాయాల ప్రకటనకు, వైజ్ఞానిక శాస్త్రీయ రంగాల్లో సహకరించుకోడానికి దోహదం చేసింది.

**16.2.5 యూరప్ బొగ్గు ఉక్కు సంఘము :** ఫ్రాన్స్, పశ్చిమ జర్మని, ఇటలీ, హాలెండ్, బెల్జియం, లక్షంబర్గ్‌లతో కూడిన, 6దేశాలు, 1952లో యూరప్ ఉక్కు బొగ్గు సంఘాన్ని ఏర్పాటు చేసుకొన్నాయి. బొగ్గు, ఇనుము ఉత్పత్తులపై అమ్మకాల మీద ధర నిర్ణయంలో పరిశోధనలో పెట్టుబడులలో కార్మిక స్థితిగతులపై ఒకే పద్ధతిని అవలంభించాలి, సహకరించుకోవాలి అని, ఈ 6 దేశాలు నిర్ణయించుకున్నాయి. సభ్య దేశాల్లో ప్రజల జీవన స్థాయిని పెంచడం ఉద్యోగ అవకాశాల అభివృద్ధి ఆర్థిక వ్యవస్థల విస్తరణ ఈ సంఘ లక్ష్యాలు. ఈ సంఘానికి ఒక నిర్వహణ సంస్థ అనుబంధ అంగాలు సమకూర్చబడ్డాయి. దీనికి ఒక సాధారణ సభ, ఒక న్యాయ స్థానం ఏర్పాటు చేయబడింది. ఈ సంస్థలకు అతీతమైన అధికారాలు ఇవ్వబడ్డాయి. ఐరోపా ఆర్థిక సమైఖ్యతలో ఈ సంఘాన్ని ఒక నిర్దిష్ట ప్రయత్నంగా కొన్ని విషయాల్లో సభ్యదేశాల కార్యచరణ స్వాతంత్రీయాన్ని కూడా నియంత్రించగల అంతర్జాతీయ సహకార సంస్థగా వర్ణించవచ్చు.

**16.2.6 యూరప్ ఆర్థిక సంఘము :** పైన పేర్కొనబడిన ఐరోపా సమైఖ్యత ప్రయత్నాలకు ఐరోపా ఆర్థిక సంఘం పరాకష్టగా భావించవచ్చు. యూరప్ ఆర్థిక సంఘాన్ని సర్వ సాధారణంగా ఉమ్మడి మార్కెట్ అని కూడా వ్యవహరిస్తారు. యూరప్‌లో తొలిసారిగా ఏకీకృత ఆర్థిక వ్యవస్థను ఏర్పరిచి ఆర్థిక సహాయ సహకారాలు ప్రాతిపదికగా భవిష్యత్‌లో రాజకీయ సమైఖ్యతను సాధించడం ఈ సంస్థ లక్ష్యంగా పేర్కొనబడింది. 1955 లో బెల్జియం, నెదర్‌లాండ్స్, లక్షంబర్గ్ దేశాలు పశ్చిమ జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీలు కలసి రోమ్‌లో 1958 లో ఈ ఒప్పందం పై సంతకాలు చేశాయి. 1958 లో ఉమ్మడి మార్కెట్ రూపం దాల్చింది. మొదట్లో ఇంగ్లాండ్ ఇందులో చేరలేదు. సుదీర్ఘ చర్చల అనంతరం ఇంగ్లాండ్ 1973 లో ఈ సంస్థలో చేరింది. దీనితో ఐరోపా ఆర్థిక సంఘం పటిష్టమైంది. ఆ తరువాత ఈ సంఘంలో ఐర్లాండ్, డెన్మార్క్, గ్రీస్‌లు సభ్య రాజ్యాలుగా చేరాయి.

**16.2.6.1 యూరప్ ఆర్థిక సంఘ లక్ష్యాలు :** యూరప్ రాజ్యాల సాంఘిక, ఆర్థిక పురోగతిని సాధించుట ప్రజల జీవన పరిస్థితులను అభివృద్ధి చేయడం, సభ్యరాజ్యాల ప్రజల మధ్య ఐక్యతా భావనకు తొలి బీజాలు నాటడం, సంఘ లక్ష్యాలుగా పేర్కొన్నారు. సభ్య దేశాల భిన్న ఆర్థిక వ్యవస్థలను క్రమేణ సన్నిహితంగా తీసుకు రావడం ద్వారా ఈ సంస్థ లక్ష్యాలను సాధించాలి అని భావించారు. ఇది ఒక సమగ్ర ఆర్థిక సంఘం సభ్యదేశాల మధ్య స్వేచ్ఛ వ్యాపార నిర్వహణకు వ్యక్తులు తమ పెట్టుబడులను ఒక చోటనుండి మరో చోటుకి మార్చుకొనేందుకు, ఒకే రకమైన పన్నులను విధించడానికీ, కరెన్సీ క్రెడిట్ బ్యాంకింగ్ పద్ధతుల్లో సారూప్యత సాధించేందుకు సభ్యదేశాల ఆర్థిక విధానాలను ఆచరణలను ఏకీకృతం చేయడం యూరప్ ఆర్థిక సంఘ లక్ష్యం.

**2.6.2. యూరప్ ఆర్థిక సంఘ కార్యాచరణ :** యూరప్ ఆర్థిక సంఘ లక్ష్యాల సాధనకు అనుగుణంగా, ఉమ్మడి మార్కెట్ కార్యకలపాలనూ సంస్థలనూ రూపొందించారు. సభ్య దేశాల మధ్య పోటిని నివారించుటకై, ప్రతి దేశము తనకు నిర్దేశించిన వస్తువులను మాత్రమే ఉత్పత్తి చేయాలి. దీనిలో దేశానికి సంబంధిత ఉత్పత్తులలో ప్రావీణ్యము, నాణ్యత పెరుగుతుంది. తయారీ ఖర్చుతగ్గుతుంది ఐతే ప్రధమంలో కొన్ని దేశాలు ఆర్థిక సంఘ స్థాపన పట్ల ఆర్థిక ఇబ్బందులకు గురికావచ్చు. దీని నుండి తట్టుకొడానికై సభ్యదేశాలు చందాలతో ఒక ఉమ్మడి మార్కెట్ బాంక్ స్థాపించారు. ఈ బ్యాంక్ పారిశ్రామిక విస్తరణకు ఋణాలిస్తుంది. కామన్ విల్తు దేశాలలో తనకు

ప్రత్యేక ఆర్థిక సంబంధాలు ఉన్నందున, ఉమ్మడి మార్కెట్టులో చేరితే వాటికి ప్రమాదం రాగలదని చెప్పిన ఇంగ్లాండ్ దూరంగా వుండిపోయింది.

ఉమ్మడి మార్కెట్ కార్యకలాపాల నిర్వహణ సంస్థలను, సంఘ సభ్యులు జాగ్రత్తగా రూపొందించారు. వారు విదేశాంగ విధానం, రక్షణ వంటి సున్నిత విషయాల జోలికిపోలేదు ఒక వైపున దేశ సార్వభౌమాధికారాని భంగం కల్గకుండా ప్రయాత్నాలు జరిగినవి. ఐరోపా ఆర్థిక సంఘంలో ముఖ్య సంస్థలు యూరప్ కమిషన్, మంత్రులసభ, శాసనసభ, ఆర్థిక సాంఘిక వ్యవహారాల సంఘం, న్యాయస్థానం యూరప్ కమిషన్‌లో ఫ్రాన్స్, ఇటలీ, ఇంగ్లాండ్, పశ్చిమజర్మనీల తరపున ఇద్దరు మిగతా దేశాల నుండి ఒకరు చొప్పున మొత్తం 14 మంది సభ్యులుంటారు. ఈ సభ్యుల పదవీ కాలం 4 సం॥రాలు వీరు తమ దేశాల తరుపున కాక మొత్తం సంఘం తరుపున పని చేస్తారు. విధానాలను రూపొందించడం వాటిని అమలు పరచడం విదేశీ విధానాల ఉమ్మడి విధానాలకూ వ్యతిరేఖం కాకుండా చూడటం ఈ కమిషన్ విధులు. ఉమ్మడి మార్కెట్ విధానాలను నిర్ణయించింది మంత్రుల సభ, సభ్యదేశాల మంత్రులు కనీసం నెలకొకసారి సమావేశం అయి కమీషన్ ప్రతిపాదనలు చర్చించి అమోదించడమో తిరస్కరించడమో చేస్తారు. మెజారిటి నిర్ణయాలను అనేక సందర్భాల్లో సభ్యదేశాలు అన్ని ఏకగ్రీవంగా అమోదించడం ఆనందించ దగ్గ విషయం. శాసనసభలో 434 మంది సభ్యులుంటారు. 4 పెద్ద దేశాలు ఒక్కొక్కటీ 81 మంది చొప్పున 324 మందిని సభ్యులను పంపగా మిగతా రాజ్యాలు తక్కిన సభ్యలను పంపుతారు. సభ్యదేశాల శాసన సభ్యులను నియమించెవారు వీరు నెలకొకసారి కలుస్తారు. శాసన సభకు అధికారంకన్నా పలుకుబడి ఎక్కువ సంఘ ఆర్థిక పద్ధతులను అమోదించడం కమిషన్‌కు ప్రశ్నలు పంపే అధికారం శాసనసభ సభ్యులకు కలదు. న్యాయస్థానంలో 7గురు న్యాయమూర్తులు ఉంటారు. వీరికి ఇద్దరు అడ్వకేట్ జనరల్స్ సహాయం చేస్తారు. రోమ్ ఒప్పందాన్ని అనుసరించి చేయబడిన నిర్ణయాలను సూత్రాలను సభ్య రాజ్యాలు సరిగా పాటిస్తాయో లేదో పరిశీలించడం, తీర్పు ఇవ్వడం న్యాయస్థాన కర్తవ్యము. న్యాయస్థాన నిర్ణయాలకు అన్ని ప్రభుత్వాలు కట్టుబడి ఉండాలి దానిపై అప్పీలు లేదు. జాతీయ చట్టాలకు అతీతంగా న్యాయస్థానం రూపొందించబడింది. ఆర్థిక సాంఘిక వ్యవహారాల సంఘంలో మూడోవ వంతు కార్మిక సంఘాలకు, మూడోవంతు యాజమాన్య వర్గానికి మిగిలిన వారు అనేక రంగాలకూ ప్రాతినిద్యం వహిస్తారు. యూరప్ ఆర్థిక సంఘానికే సభ్యదేశాలు వ్యక్తిగత చందాల నుండి వనరులు సమకూర్చుతారు. పారిశ్రామిక వస్తువుల దిగుమతులపై టారీఫ్ సుంకాల ద్వారా సభ్య దేశాలు గానీ ఇతర దేశాల నుండి దిగుమతులపై లేవి విధించడం ద్వారా వనరులు సమకూర్చుకుంటారు. ఈ సంఘం సాలిసరి ఆదాయం సుమారు 23 బిలియన్ డాలర్లు దీనిని బట్టి ఈ సంఘం ఆర్థిక స్థోమతను మనం గ్రహించవచ్చు.

**16.2.6.3 యూరప్ ఆర్థిక సంఘ విజయాలు :** ఇతర యూరప్, ఐరోపా ప్రయత్నాల కన్నా ఉమ్మడి మార్కెట్ గొప్ప విజయాలను సాధించింది. గతంలోని ఎగుమతి సుంకాలను రద్దు చేసి వాటి స్థానంలో కొత్త టారిఫ్‌ను ప్రవేశ పెట్టింది. సభ్యత్వం లేని దేశాల నుంచి ఉమ్మడి మార్కెట్‌లో ఏ సభ్యరాజ్యం ఎటు వంటి దిగుమతులు చేసుకొన్న ఒకే రేటుతో టారీఫ్ చెల్లిస్తుంది. దీనితో పోటీ నివారించబడింది. వ్యవసాయ ఉత్పత్తుల్లో ఒక సామూహిక విపణిని ఏర్పడింది. దీనితో వ్యవసాయ వస్తువులను, అన్ని సభ్యదేశాలకు స్వేచ్ఛగా పంపవచ్చు. సభ్యదేశాల్లో కార్మికులు ఎటువంటి అడ్డంకులు లేకుండా ఒక దేశం నుండి మరొక దేశానికి వెళ్లవచ్చు. సభ్యదేశాల మధ్య పెట్టుబడులు సెక్యూరిటీల కొనుగోలు పెట్టుబడుల మార్పిడి సులభకరమైయింది. ఉద్యోగ అవకాశాలు విస్తృతమయ్యాయి. ఈ రాజ్యాలలో వివిధ వృత్తి శిక్షణా సంస్థలు ఏర్పడ్డాయి. సాంఘిక భద్రతా, విద్యా, వైద్య రంగాల్లో పరస్పర చర్యల వల్ల సామూహిక కృషివల్ల గొప్ప అభివృద్ధి సాధింపబడింది. పన్నుల విధింపులో ఉన్న అంతరాలను వివక్షతలను తొలగించడానికి ప్రయత్నాలు చేసారు. ఆర్థికాభివృద్ధికై యూరప్ పెట్టుబడి బ్యాంక్ స్థాపించబడింది. సభ్య దేశాలు ఈ బ్యాంకుకు నిధిని సమకూర్చగా ఉమ్మడి మార్కెట్‌లోని, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి, ఆర్థిక సహాయం చేయబడింది. విద్యుచ్ఛక్తి ఉత్పత్తి వాడకంలో అవగాహన పెరుగుతున్న చమురు ధరలను అదుపు చేయడానికి ఉమ్మడి వ్యూహం మొ॥ విషయాల్లో వీరి సహకారం గుర్తించ దగ్గది. కమీషన్ ద్వారా వివిధ రాజ్యాల వ్యాపార విధానాలు, కరెన్సీ, క్రెడిట్ పద్ధతులు నియమ బద్ధం చేయబడ్డాయి. ఈ విజయాలు నిజముగా హర్షించ దగినవి.

**16.2.6.4. విమర్శ :** యూరప్ ఉమ్మడి మార్కెట్‌లో మొదటి నుండి ఫ్రాన్స్, ఆధిక్యతను చూపింది. యూరప్ రాజ్యాలతో పాటు పెక్కుమంది ఇందులో చేరడం బ్రిటన్‌కు కష్టంగా తయారుఅయింది. బ్రిటన్ అందులో చేరగా ఏకాంత విధానాన్నే అనుసరించింది. ఒకప్పటి అగ్ర రాజ్యమైన బ్రిటన్ రెండో ప్రపంచయుద్ధం తరువాత బలహీన పడినది. ఉమ్మడి మార్కెట్‌లో బ్రిటన్ చేరక పోవడంతో మిగతా పశ్చిమ యూరప్ దేశాలలో సంబంధాలు క్షీణించాయి. 1957 లో రోమన్ స్వేచ్ఛ వ్యాపార ఒడంబడికకు 6 రాజ్యాలు అంగీకరించగా ఫ్రాన్స్ నిరాకరించింది ఉమ్మడి మార్కెట్‌కు, స్వేచ్ఛా వ్యాపార ఒడంబడికకు, సంబందం లేదని తలచిన ఇంగ్లాండ్ అందులో చేరింది. దీనితో ఫ్రాన్స్, ఇంగ్లాండ్‌ల మధ్య పోటి ఏర్పడింది. ఫ్రాన్స వైఖరి వల్ల ఇంగ్లాండ్ స్వేచ్ఛా వ్యాపార ఒడంబడిక ప్రతిపాదన చర్చలు విఫలమైనాయి. ఫ్రెంచి అధ్యక్షుడు డీగాల్ వైఖరి ఇంగ్లాండ్‌కు అవమానకరం అయింది. 1961 లో ఇంగ్లాండ్ ఉమ్మడి మార్కెట్‌లో చేరడానికి ప్రయత్నించింది. 6 నెలల పాటు సంప్రదింపులు జరిగాయి. బ్రిటన్‌కు కామన్‌వెల్త్‌తో ఉన్న సంబంధాలు వల్ల అమెరికాలో ఉన్న సన్నిహిత్వం వల్ల ఆ ధేశం ఉమ్మడి మార్కెట్‌లో చేరడం అమెరికాకు పరోక్షముగా ఆధిక్యత కల్పిస్తుంది అనీ డీగాల్ వ్యతిరేకించాడు. 1967 లో తిరిగి ఇంగ్లాండ్ ఉమ్మడి మార్కెట్‌లో చేరటానికి చేసిన ధరఖాస్తును ఫ్రాన్స్ నిరాకరించింది. ఆ తదుపరి 1973 లో బ్రిటన్‌కు ఉమ్మడి మార్కెట్‌లో సభ్యత్వం లభించిన ఈ విభేదాలు దాని కార్యక్రమంలో కొన్ని అవరోధాలను కల్పించాయి. ఉమ్మడి మార్కెట్ సభ్యదేశాల పౌరుల అభిమానాన్ని, విశ్వసాన్ని పెంపొందించె సంస్థగా ఎదగలేదు. ఇది ఆర్థిక సంస్థగానే మిగిలిపోయింది. ఈ సంస్థ ఎందుకు ఆవిర్భవించిందో అందుకే కృషి చేసింది. సభ్యదేశాల ప్రజలలో ఐక్యతకు ప్రతి స్పందించ లేదు. అంతేగాక ఉమ్మడి మార్కెట్‌లో ఆర్థికంగా ఫ్రాన్స్ లాభం పొందింది. ఫ్రాన్స్, ఇంగ్లాండ్ ఆర్థిక పోటి అట్లాంటిక్ వ్యవస్థను బలహీన పరచింది. దీనివల్ల రాజకీయ అంగీకారాల ప్రాధాన్యత సన్నగిల్లింది.

పైన పేర్కొనబడిన సంస్థలే గాక ఐరోపా అను శక్తి సంఘము, యూరప్ స్వేచ్ఛా వ్యాపార సంఘము కూడా స్థాపించబడ్డాయి. ఈ రెండు సంస్థలు ఉమ్మడి మార్కెట్‌ను పోలి ఉండటంతో కొంత గందరగోళ పరిస్థితిని కల్పించింది. ఐనా ఐరోపా ఐక్యత ప్రయత్నాలు శతాబ్దాల తరబడి జరిగింది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఈ ఐక్యత ప్రయత్నాలు వివిధ రూపాలను సంతరించు కున్నాయి. ఐతే జాతీయ, ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలు అంతర్జాతీయ సహకారానికి కొంత అవరోధం కల్పిస్తాయి. వాటిని అధిగమించిననాడు ప్రపంచ శాంతికి సర్వజన సౌభాగ్యానికి నూతన ఆశలు చిగురించగలవు.

డా. వి. కె. మోహన్

పాఠం - 17

# 2. ప్రపంచీకరణ - ఆర్థికం, అంతర్జాతీయ శాంతి సహకారాల్లో దాని పాత్ర

**లక్ష్యము:**

ప్రపంచీకరణలో ఆర్థికం, అంతర్జాతీయ శాంతి సహకారాల స్థాపనలో దాని పాత్ర అను విషయాలను గురించి పరిశీలించడమే ఈ పాఠం ముఖ్య లక్ష్యం.

**విషయ సంగ్రహము**


17.1. పరిచయం.

17.2. ప్రపంచీకరణ అనగా.

17.3. ప్రపంచీకరణ లక్షణాలు.

17.4. చారిత్రక నేపథ్యము.

17.5. ప్రపంచీకరణ స్థాయిలు.

17.5.1. అంతర్జాతీయ స్థాయిలో ప్రపంచీకరణ.

17.5.2. నిర్దిష్ట దేశ స్థాయిలో ప్రపంచీకరణ.

17.5.3. నిర్దిష్ట పరిశ్రమ స్థాయిలో ప్రపంచీకరణ.

17.5.4. నిర్దిష్ట కంపెనీ స్థాయిలో ప్రపంచీకరణ.

17.6. భారతదేశంలో ప్రపంచీకరణ.

17.6.1. ప్రపంచీకరణమే భారత ప్రభుత్వం తీసుకొన్న చర్యలు.

17.7. ప్రపంచీకరణ పట్ల వ్యతిరేకత.

17.8. ఆగ్నేయసియా దేశాల సంక్షోభానికి కారణాలు.

17.9. ప్రపంచీకరణ ఫలితాలు.

17.10. అంతర్జాతీయ శాంతి సహకారాల్లో ప్రపంచీకరణ పాత్ర.

17.11. భారత్ ముందు ఉన్న మార్గము.

17.12. ముగింపు.


## 17.1. పరిచయం:

ప్రపంచంలో ఏదేశము ఏకాకిగా మన జాలదు. శతబ్దాల పరియంతం ప్రపంచ దేశాలు అన్ని ఉత్పత్తి కోసం, వాణిజ్యం కోసం, సాంకేతిక విజ్ఞానం కోసం, కొత్త ఆలోచనల కోసం. ఇతర దేశాలపై ఆధారపడుతూనే ఉన్నాయి. క్రీ. పూ. నుంచి భారత్‌కు

యూరప్‌తో ఆఫ్రికాతో మధ్య ప్రాచ్యముతో బలమైన వాణిజ్య సంబంధాలు ఉండేవి. అలాగే చైనా నుంచి యూరప్‌కు వెళ్లి 'సిల్క్‌రహదారి' ప్రపంచ చరిత్రలో కీలక పాత్ర వహించింది. కాబట్టి ప్రపంచీకరణ. ఇప్పుడేదో కొత్తగా వస్తుంది అనుకోటం పొరబాటు. అయితే శరవేగంతో పెరుగుతున్న సాంకేతిక విజ్ఞానం వల్ల అందరికి అందుబాటులోకి వస్తున్న కమ్యూనికేషన్ సౌకర్యాల వల్ల, ముందు ఎన్నడు లేనంతగా విమానాల ద్వారా విదేశీయానం, ఓడల ద్వారా విదేశీ రవాణా జరగడం వల్ల ప్రపంచ దేశాల మధ్య సాంకేతిక, రవాణా, వాణిజ్య, సాంస్కృతిక సంబంధాలు బాగా బలపడుతున్నాయి. నేటి ప్రపంచంలో మిగిలిన దేశాల ఉనికిని విస్మరించి ఏకాకిగా మిగలాలి అని, ఏ దేశం ప్రయత్నించినా అది వెనకబాటుతనానికి, దగ్గర దారి అవుతుంది. అయితే ప్రపంచీకరణ అనగానే వస్తువులు, సేవల ఉత్పత్తి ఎక్కడ చౌకగా, ఎక్కువ నాణ్యతతో సాధ్యము. అక్కడ బాగా జరుగుతుంది. అలా ఉత్పత్తి జరిగిన చోట, ఉపాధి పెరుగుతుంది. కాబట్టి ఆయా దేశ పరిస్థితులను బట్టి కొన్ని దేశాలు కొన్ని రంగాల్లో బలపడటం మరికొన్ని రంగాల్లో నష్టపోవడం జరుగుతాయి. అందువల్ల, ముందు జాగ్రత్తలు తీసుకొని ప్రతిదేశం ఈ పోటికి నిలబడేటట్లు ఏర్పాట్లు చేసుకోవడం అవసరం.

ప్రపంచీకరణను సంపన్న దేశాలు సమర్థిస్తున్నాయి, బీద దేశాలు వ్యతిరేకిస్తున్నాయి అని భావించడం పొరబాటు. అమెరికాలో కార్మికుల నుంచి, ఫ్రాన్స్‌లో రైతుల నుంచి ప్రపంచీకరణకు బాగా ప్రతిఘటన ఎదురౌతుంది. అంటే ప్రతి దేశంలో విదేశీ పోటికి నిలబడలేని రంగాలలో ప్రపంచీకరణ వల్ల సమస్యలు తలెత్తుతాయి. ప్రపంచీకరణను ఆపడం అసాధ్యం కాబట్టి దానికి తట్టుకొని పోటీకి నిలబడేలా ఆర్థిక వ్యవస్థ సౌష్టవాన్ని పెంచడం, కేవలం. వస్తువుల వాణిజ్యంలో మాత్రమేగాక కార్మికులు కూడా తమ సేవలకు ఎక్కడ గిరాకి ఉంటే అక్కడికి వెళ్ళే అవకాశాలు కల్పించడం కోసం ప్రతి దేశం కృషి చేయవలసి ఉంది. అప్పుడే ప్రపంచీకరణ వల్ల సత్ఫలితాలు పొందవచ్చు.

ఒక దశబ్దం పైగా ప్రపంచీకరణపై ప్రపంచ వ్యాప్తంగా చర్చ సాగుతుంది. భారతదేశంలో ముఖ్యంగా 1991 తరువాత మొదలైన ఈ చర్య నేటికి కొనసాగుతూనేవుంది. ప్రపంచీకరణ వల్ల అన్ని దేశాలు లాభపడతాయి అని దాని వలన ప్రజల జీవన వసతులు అభివృద్ధి చెంది, సుఖసంతోషాలకు దారితీస్తుంది అని ప్రపంచీకరణను బలపరుస్తున్న కొందరి అభివృద్ధి చెందిన కొన్ని దేశాలు వెనుకబడిన దేశాల దోపిడికి, పాల్పడతాయి అని ఈ దేశాలు సార్వభౌమాధికారంతో పాటు ఆర్థిక వ్యవస్థలు అస్తవ్యస్తం అవుతాయి అని ప్రపంచీకరణకు వ్యతిరేకంగా వాదిస్తున్న కొందరి అభిప్రాయం మరి కొందరు అయితే భారతదేశాన్ని, సామ్రాజ్య దేశాలకు తాకట్టు పెట్టడమేనని చెబుతున్నారు. నిజానికి వీరందరూ ప్రపంచీకరణ అనే భావనపై సరైన అవగాహన లేక మాట్లాడుతున్నారు అని చెప్పవచ్చు.

## 17.2. ప్రపంచీకరణ అనగా:

గత దశాబ్దము నుండి నేటి వరకు సామాన్య మానవుని మొదలు దేశ ప్రధాన మంత్రి వరకు, పరిశోధకుల నుండి ప్రపంచ బ్యాంక్ అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచవర్తక సంస్థ ఐక్యరాజ్య సమితి అధ్యక్షుని వరకు ప్రతి ఒక్కరు ఉపయోగిస్తున్న ఊతపదమే ప్రపంచీకరణ.

దురదృష్టవశాత్తు ప్రపంచీకరణ అను పదం విభిన్నవర్గాలకు, విభిన్న అర్థాలలో స్ఫురిస్తున్నది. ఈ పదం వినగానే కొందరికి హద్దులు ఎరుగని నూతన ప్రపంచం కనిపిస్తే, మరికొందరికి వినాశనకరమైన ప్రపంచం సాక్షాత్కరిస్తుంది. విశాల దృక్పథంతో ఆలోచిస్తే, ప్రపంచీకరణ అంటే, దేశాల మధ్య సమాచారం ఆలోచనలు సాకేతిక పరిజ్ఞానం వస్తు, సేవలు పెట్టుబడులు ప్రజలు తిరుగాడ గలిగే విధముగా ఆయా ఆర్థిక వ్యవస్థలు సమాజాలు సమీకృతం కావడంగా చెప్పుకోవచ్చు. ప్రపంచీకరణలో అనుసంధానం అత్యంత కీలకమైనంత సూత్రముగా పేర్కొంటారు. సరిహద్దులకు అతీతమైన ఈ సమీకృత, వ్యవస్థకు విభిన్న పార్శ్వాలు ఉంటాయి.

అవి సంస్కృతి, సమాచారం, రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థలు. చాలా మంది ఆర్థిక వ్యవస్థలో సమీకృతం కావడంవల్ల, ఎక్కువగా కలవడం వ్యక్తం చేస్తుంటారు. ఏదైన ఇక్కడ ప్రపంచీకరణ అన్న పదాన్ని ఆర్థిక వ్యవస్థలు సమీకృతం కావడానికి పరిమితం చేస్తూ ప్రయోగిస్తున్నారు. ఈ ఆర్థిక వ్యవస్థలో సమీకృతం కావడం అన్నది ప్రధానముగా 3 మార్గాల్లో సంభవిస్తుంది. అవి వస్తు, సేవల వర్తకము, పెట్టుబడుల ప్రవాహం, ఆర్థిక సహాయం అందజేయడం, ఇవేగాక ప్రజలు వలస వెళ్ళడం వల్ల కూడా ఆర్థిక వ్యవస్థలో సమీకృతం అవుతాయి.

థియోడర్ లెవిట్ మాటలలో ప్రపంచీకరణ అంటే మార్కెట్‌ను ప్రపంచీకరించడము, వ్యాపారాన్ని అంతర్జాతీయంగా చూచే దృక్పథమే ప్రపంచీకరణ. దేశ రాజకీయ హద్దులను దాటి ఆర్థిక వ్యవహారాలను విస్తరింపడము, ప్రపంచీకరణ అని దీపక్ నయ్యార్ అభిప్రాయపడెను. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోని వివిధ దేశాల మధ్య ఆర్థిక ఏకీకృత ప్రక్రియలు విస్తరింపచేయడం ఆర్థిక విషయాలను బహిరంగపరచడం, ఆర్థిక స్వావలంబనను పెంపొందింపడం ప్రపంచీకరణలోని భాగాలు అని చెప్పవచ్చు. జాతీయ పరిహద్దులను ఆర్థికపరంగా కుంచింపుకొనేటట్లు చేసే అన్ని రకాల ఆర్థిక వ్యవహారాలను అత్యంత ఎక్కువగా విస్తృత పరచే ఆర్థిక వ్యవహారాల పరిమాణాలను పెంచడమే ప్రపంచీకరణ లక్ష్యాలు అని చెప్పవచ్చు.

## 17.3. ప్రపంచీకరణ లక్ష్యాలు:

వివిధ సంస్కృతులు, సంప్రదాయాలు, జాతి, మత, భాషా సామాజిక భేదాలు ఉన్న ప్రపంచాన్ని అంతటిని ఒకటిగా చేయడమే ప్రపంచీకరణ అని దాని రూపకర్తలు అని అంటున్నారు. ప్రపంచమంతా వ్యాపారం, వాణిజ్యం, సంస్కృతి, మొ॥ అంశాల్లో తేడాలు లేకుండా చేసి, తద్వారా అన్ని దేశాలను సమానంగా అభివృద్ధి చెందించడమే దీని లక్ష్యం అని వారు అంటున్నారు. సోవియట్ యూనియన్ పతనానంతరమే ఈ ప్రపంచీకరణ ప్రచారంలోకి రావడం గమనార్హం. రాజకీయ సమీకరణల నేపథ్యాన్ని పరిశీలిస్తే, దీనికి కారణం అవగతమౌతుంది. ప్రపంచీకరణ ప్రచారాన్ని ప్రారంభించింది అమెరికాయే. సోవియట్ యూనియన్ బలంగా ఉన్న సమయంలో ఈ వాదాన్ని లేవనెత్తితే దాన్ని కమ్యూనిస్టులు, సొంతం చేసుకొనే అవకాశం ఉంది. దాని వల్ల తన పలుకుబడి పెత్తనం తగ్గుతుంది. అందుకే, సోవియట్ చరిత్ర ముగిసేవంత వరకు అమెరికా దాని జోలికే పోలేదు. ఇప్పుడు అమెరికా ప్రపంచాధిపతిగా తనకు తానే ప్రకటించుకొని పెత్తనం చెలాయిస్తూ, ప్రపంచీకరణ పేరుతో తన సంస్కృతిని ప్రపంచమంతా వ్యాప్తిచేయడానికి ప్రయత్నిస్తుంది. ఇప్పటికే ఆర్థికంగా రాజకీయంగా ప్రపంచంలో మూడింట రెండు వంతుల దేశాలపై పట్టు సాధించిన అమెరికా, సంస్కృతి సంప్రదాయాలపై కూడా తన ముద్ర వేయడానికి ప్రయత్నిస్తుంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్ మీడియా, ప్రసార ప్రచార సాధనాల ద్వారా అమెరికా సంస్కృతిని జీవన విధానాన్ని ప్రపంచ వ్యాప్తం చేయడానికి కృషి జరుగుతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే గ్లోబలైజేషన్ పేరుతో అమెరికనైజేషన్ జరుగుతుంది. ఈ సాంస్కృతిక దాడికి అమెరికా ప్రధానంగా భారత్ వంటి వర్ధమాన దేశాలనే లక్ష్యముగా పెట్టుకుంది. ఇప్పుడిప్పుడే ఆర్థికంగా, సైనిక పరంగా, శక్తిమంతమౌతున్నాయి. వర్ధమాన దేశాలు, భవిష్యత్‌లో వ్యూహాత్మకంగా కీలకమౌతాయి అని వాటిని తన పిడిలోకి లాక్కోగలిగితే తన అధికారాన్ని శాశ్వతం చేసుకోవచ్చు అని అమెరికా ఆలోచన.

నేడు కాలము దూరము కుదించుకుపోయి సువిశాల భూగోళము ఒక చిన్న గ్రామముగా మారింది. ప్రపంచీకరణ అంటేనే ప్రపంచ దేశాలు అన్నీ ఒక గ్రామముగా మారడం, ప్రపంచ దేశాల మధ్య వాణిజ్యము గరిష్ఠ స్థాయికి పెరగడం, సాంకేతిక విప్లవం పుణ్యమా అని నేడు రవాణా కమ్యూనికేషన్‌లకు సమయమే పట్టడం లేదు. అన్నీ క్షణాల్లో జరిగిపోతున్నాయి. భూగోళములో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి క్షణాల్లో సందేశాలు అందిపోతున్నాయి. దూరం కాలం తగ్గడమే కాక, రవాణా కమ్యూనికేషన్ వల్ల వ్యయం కూడా బాగా తగ్గింది. నేడు ప్రపంచ దేశాలు అన్నీ పరస్పర సంబంధాలను, సన్నిహితంగా పెంపొందించుకుంటున్నాయి. బాంధవ్యం పెరగడమే, ఈ ప్రపంచీకరణ యొక్క ప్రధాన లక్ష్యం.

ప్రపంచీకరణలో కొన్ని ముఖ్య లక్షణాలు ప్రపంచం మొత్తం ఒకే మార్కెట్‌గా భావించాలి. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందరూ సర్వసాధారణంగా ఉపయోగించాలి. వస్తువులు వాటిని తయారు చేసే ప్రక్రియలు గుణాత్మకమైన పద్ధతులు, అంతర్జాతీయ స్థాయిలో సరిపోయేవిగా ఉండాలి. సంస్థలు స్థానికంగా పని చేస్తున్న వ్యాపార అవగాహన అంతర్జాతీయ స్థాయిలో ఉండాలి. సంస్థలకు ఎన్ని దేశాలలోనైన వ్యాపారం నిర్వహించుకొనేందుకు స్వేచ్ఛ ఉండాలి. అన్నిటికి మించి, ప్రపంచీకరణను సమర్థించే రాజకీయ వ్యవస్థ అంతర్జాతీయ వ్యాపార వ్యవస్థకు అండదండగా ఉండాలి.

## 17.4. చారిత్రక నేపథ్యము:

ప్రపంచీకరణ అనేది కొత్త దృక్పధంకాదు. చరిత్ర ఎంత పురాతనమైనదో ప్రపంచీకరణ కూడా అంత పాతది. ప్రజలు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలస పోవడం ప్రారంభించిన నాడు దీనికి అంకురార్పణ జరిగింది. చారిత్రక ప్రక్రియలో భాగముగా ముందుకొచ్చిన ఈ ప్రపంచీకరణ అనేక ఆటు, పోట్లు ఎదుర్కొన్నది. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు కాలమైన 1870-1914 మధ్య ప్రపంచదేశాల ఆర్థిక వ్యవస్థలు శరవేగంగా సమీకృతం కావడం ప్రారంభించాయి. వర్తకం పెట్టుబడుల ప్రవాహం ప్రజల వలసల ద్వారా ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలు, సమీకృతం కావడం ప్రారంభమైంది. అయితే యుద్ధ కాలంలో వస్తు, సేవల స్వేచ్ఛ ప్రసరణను నిరోధిస్తూ, అనేక, అనేక అవరోధాలు పొడుచుకొచ్చాయి. 1945 తరువాత ఆర్థిక వ్యవస్థలను సమీకృతం చేసే చర్యలు ముమ్మరం అయినప్పటికే వర్తకం, పెట్టుబడుల మార్కెట్ 19 వ శతాబ్దం ఆఖరి నాటికి పొందిన ప్రపంచీకరణ స్థాయికి నేటికి మనం వాటిని తీసుకెళ్ళలేక పోయాము అన్నది వాస్తవం అయినప్పటికి ప్రపంచీకరణ పట్ల మునుపటికంటే ఇప్పుడే ఎక్కువ కలవరము వ్యక్తమౌతుంది. ఇందుకు కారణాలు లేకపోలేదు. అప్పటితో పోల్చుకుంటే ఇప్పుడు మార్పులు అత్యంత వేగముగా సంభవిస్తున్నాయి. మార్పులు శరవేగంగా జరగడమేగాక మార్కెట్‌లు సమీకృతం కావడంపైన పారిశ్రామిక సంస్థల సామర్థ్యంపైన ప్రపంచీకరణ ప్రక్రియ ప్రభావం విస్తారంగా ఉండడం కూడా ఈ కలవరానికి ప్రధాన కారణం.

## 17.5. ప్రపంచీకరణ స్థాయిలు:

ప్రపంచీకరణను మనం 4స్థాయిలో చూడవచ్చు అవి అంతర్జాతీయ స్థాయిలో, నిర్దిష్ట దేశ స్థాయిలో, నిర్దిష్ట పరిశ్రమల స్థాయిలో, నిర్దిష్ట కంపెనీ స్థాయిలో ప్రపంచీకరణ.

**17.5.1 అంతర్జాతీయ స్థాయిలో ప్రపంచీకరణ:** అంతర్జాతీయ స్థాయిలో దేశాల మధ్య పరస్పరం ఆర్థికంగా, ఆధారపడి వ్యవస్థలు దేశ సరిహద్దుల మధ్య ప్రవాహంలా బదిలీ జరుగుచున్న వస్తు, సేవలు మూలధనం, సాంకేతిక పరిజ్ఞానం మొ॥లగు అంశాల ద్వారా ప్రపంచీకరణ ప్రక్రియను గమనించవచ్చు. ప్రపంచీకరణ క్రమంలో అంతర్జాతీయ వాణిజ్య పరిమాణం బాగా పెరిగి, ముందెన్నడులేని స్థాయికి చేరింది. మొత్తం ప్రపంచ ఎగుమతుల విలువ 1951లో 61 బిలియన్ డాలర్లు మాత్రమే ఉండగా ఆ మొత్తం 1970లో 315 బిలియన్ డాలర్లకు, 1990లో 3,447 బిలియన్ డాలర్లకు 1999 నాటికి 10వేల బిలియన్ డాలర్లకు, పెరగడం జరిగింది. ప్రపంచ స్థూల దేశాల ఉత్పత్తిలో ఈ మొత్తం 6%కాగా ప్రస్తుతం ఈ మొత్తం 15%నికి పెరిగింది. మరొక ముఖ్యమైన విషయం ఏమిటంటే ప్రపంచ దేశాల ఎగుమతులతో బాటు అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడుల ప్రవాహంకూడా, గణనీయంగా పెరిగింది. 1960లో 68 బిలియన్ డాలర్లు మాత్రమే ఉన్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి 1990 నాటికి 1,948 బిలియన్ డాలర్లు 2000 నాటికి 5వేల బిలియన్ డాలర్లకు పెరిగింది. ప్రపంచస్థూల దేశీయ ఉత్పత్తిలో 1960లో 4.4%గా ఉన్న ఈ పెట్టుబడి 1999నాటికి 12%నికి పెరిగింది. నిజానికి ఈ ప్రపంచీకరణ క్రమం పెరగడానికి, ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీ పెట్టుబడుల ప్రవాహం విస్తరించిన బ్యాంకింగ్ వాణిజ్యం ఎంతో దోహదపడ్డాయి. దేశాల మధ్య మార్పిడి అయ్యే విదేశీ కరెన్సీ వర్తకంలో పెరుగుదల అనూహ్యంగా ఉంది. 1973లో విదేశీ మారకం మార్కెట్‌లో వర్తకం రోజుకు 15 బిలియన్ డాలర్లు ఉండగా 1998 నాటికి అది

దాదాపు 1,990 బులియన్ డాలర్లకు పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా పెడుతున్న పెట్టుబడులలో బాండ్లు, ఈక్విటీలు మొత్తాల్లో పెట్టుబడి బాగా పెరిగింది. రెండు దశబ్దాల క్రితం స్టాక్ జరుగుతుండగా, నేడు ఈ స్టాక్ ఎక్సేంజ్‌లలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న సెక్యూరిటీలలో వర్తకం జరుగుతుంది. న్యూయార్క్, లండన్, ఫ్రాంక్‌ఫర్ట్, హాంకాంగ్, సింగపూర్, టోక్యో, ముంబాయి మొ॥ ముఖ్యమైన స్టాక్ ఎక్సేంజ్‌లలో వివిధ దేశాల సెక్యూరిటీల టర్నోవర్ ఎంతో ఎక్కువగా పెరుగుతుంది.

### 17.5.2 నిర్దిష్ట దేశ స్థాయిలో ప్రపంచీకరణ:

ఒక దేశ ఆర్థిక వ్యవస్థ మిగతా ప్రపంచ దేశాల, ఆర్థిక వ్యవస్థలలో ముడిపడిన సంబంధం ద్వారా ఆ దేశ ప్రపంచీకరణ స్థాయిని నిర్ణయించవచ్చు. స్థూల దేశీయ ఉత్పత్తితో ఎగుమతులు, దిగుమతుల శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడితో బడటకు, లోపలకు వస్తున్న మొత్తాలు పోర్టు పోలియో పెట్టుబడిలో వస్తున్న మార్పులు సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, మొదలగు అంశాల ద్వారా నిర్దిష్ట దేశం యొక్క, ప్రపంచీకరణ స్థాయి నిర్ణయించవచ్చు.

### 17.5.3 నిర్దిష్ట పరిశ్రమ స్థాయిలో ప్రపంచీకరణ:

కంపెనీలకు సంబంధించిన పరిశ్రమలో ఏ స్థాయిలో దేశీయంగా, అంతర్జాతీయంగా పోటీపడుతున్నవి అనే అంశం ఆధారంగా, పరిశ్రమ స్థాయిలో ప్రపంచీకరణను తెలుసుకోవచ్చు. ఉదా: ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్స్, ఆటో మొబైల్స్, మందులు మొదలగు పరిశ్రమలలో ప్రపంచీకరణ ఎక్కువగా ఉంది. వ్యవసాయి ఉత్పత్తులు బ్యాంకింగ్, భీమా సిమెంట్, ఇనుము, ఉక్కు, హోటల్స్, హాస్పిటల్స్, విద్యా మొదలగు రంగాల్లో ఇంకా అనుకొన్న స్థాయిలో ప్రపంచీకరణ జరుగలేదు.

### 17.5.4 నిర్దిష్ట కంపెనీ స్థాయిలో ప్రపంచీకరణ:

ఒక కంపెనీ ఏ స్థాయిలో ప్రపంచీకరణను సాధించగలదు అనేది ఆ కంపెనీ యొక్క అమ్మకాలు, ఆస్థులు, మూలధనం స్రవంతి, సాంకేతిక పరిజ్ఞానం వివిధ దేశాలకు ఎంత వరకు విస్తరించి ఉన్నది అనే దానిపై ఆధారపడి ఉంటుంది. . ఉదాహరణకు ప్రపంచంలోనే అన్ని కంపెనీలలో జపాన్‌కు చెందిన టయోటా అనే కంపెనీని, అత్యంత ప్రపంచీకరణ సాధించిన కంపెనీగా ఈ మధ్య కాలంలో అంతర్జాతీయంగా నిర్వహించిన సర్వేవల్ల తెలుస్తుంది. ఈ కంపెనీ యొక్క మొత్తం ఉత్పత్తి 1/3 వంతు ఉత్పత్తి అమెరికా, యూరప్, ఆసియా ఖండాలలోని 25 దేశాల నుండి రావడం జరిగింది. ఈ కంపెనీ జపాన్‌లో చేసిన ఉత్పత్తిలో 38%న్ని వివిధ దేశాలకు ఎగుమతి చేయడం జరిగింది.

## 17.6. భారతదేశంలో ప్రపంచీకరణ:

భారతదేశం అంతర్జాతీయ స్థాయిలో పోటి పడలేదు అని భయపడుతున్న వారు ఉన్నారు. అయితే ఇది వారి నెగిటివ్ మనస్తత్వాన్ని, పరాజయ మనస్తత్వాన్ని మాత్రమే సూచిస్తుంది. భారతదేశానికి స్వాతంత్ర్యం ఇచ్చిన వారు సక్రమంగా తమను తాము పాలించుకోలేరు. అని 1940 ప్రాంతంలో సైతం కొందరు భావించేవారు. అది అవాస్తవం అని బుజువైంది. ఇది అంటే పశ్చిమ దేశాలలో పోటిపడగల సత్తా భారత్‌కు ఉంది. భారత్‌లో విస్తారమైన భౌతిక వనరులు, మానవ వనరులు ఉన్నాయి. గొప్ప, గొప్ప శాస్త్ర వేత్తలు ఉన్నారు. తాము పోటీలో గెలవవలెను. అని భావించడానికి కొన్ని చారిత్రక కారణాలు ఉన్నాయి. స్వాతంత్ర్యం రాగానే 4 దశబ్దాల పాటు లైసెన్స్‌ల రాజ్యం సాగింది. ఈ రాజ్యంలో పరిశ్రమలకు విపరీతమైన రక్షణ కల్పించారు. అనేక రంగాలను విచక్షణారహితంగా సబ్సిడీలు ఇచ్చారు. ప్రభుత్వం కొన్ని సరకుల ధరలను, నియంత్రిస్తూ, స్వేచ్ఛ మార్కెట్ లేకుండా చేసింది. ఈ పరిస్థితులకు అలవాటు పడిన మనస్తత్వమే, భారతీయుల్లో భయాలన్నూ, అపోహలను సృష్టిస్తుంది. దేశంలోని కొన్ని

పెద్ద సంస్థల పనితీరును పరిశీలిస్తే, భారత్ శక్తి, సామర్థ్యాలు ఏమిటో తెలుస్తుంది. రిలయన్స్, టాటా, బిర్లా, విప్రో, ఇన్ఫోసిస్, రెడ్డీస్‌ల్యాబ్ లాంటివి అంతర్జాతీయ మార్కెట్‌లో విజయవంతంగా, పోటీపడగలుగుతున్నాయి. పశ్చిమ ఆసియా దేశాలతో కాంట్రాక్టులు కుదుర్చుకున్న జపాన్ సంస్థలు, ఈ ప్రాజెక్టుల నిర్వహణకు, భారతీయులనే ఉపయోగించుకుంటారు.

సాఫ్ట్‌వేర్ నిపుణుల విషయానికి వస్తే, అమెరికాలోని పెద్ద, పెద్ద కంపెనీలు భారత నిపుణులకే, ఉద్యోగాలు ఇస్తున్నాయి. స్వాతంత్ర్యము లభించిన తొలి సంవత్సరాల్లో మన మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లు సవ్యంగా పనిచేసేవి కావు. అవి తయారు చేసిన సరుకుల్లో నాణ్యత లోపించింది. ఇది నిజమే. అయితే ఇందుకు ప్రధాన కారణం ఆనాటి ప్రభుత్వ విధానమే మన మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లు విదేశీ టెక్నాలజీ దిగుమతి చేసుకోడానికి ప్రభుత్వ విధానాలే ప్రతిబంధకంగా ఉండేవి. నిజానికి ఆర్థిక సంస్కరణలు అమలు ప్రారంభం కావడానికి ఏడెనిమిదేళ్ళ ముందే ప్రభుత్వ విధానాల్లో మార్పు రాసాగింది. మనం ఈ విషయంలో రాజీవ్ గాంధీ, శ్యామ్ పిట్రోడాల ప్రారంభకృషిని మరచిపోలేము.

ప్రపంచ దేశాలతో ఆర్థిక, వాణిజ్య రంగాలలో పొత్తు కుదుర్చుకుని ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భాగం కావాలనే భారతదేశం గత శతాబ్దము నుండి ఎంతగానో ప్రయత్నిస్తుంది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి 1990 వరకు భారత దేశం ఇతర దేశాలతో ఆర్థిక, వర్తక, వాణిజ్య రంగాలలో ఒప్పందాలు కుదుర్చుకున్నప్పటికి అవి పరిమితమైన ఒప్పందాలే. ప్రపంచ రాజకీయ వ్యవస్థలకు అనుగుణముగా భారతదేశం 1990 వరకు విదేశీ వర్తక విధానాన్ని అనుసరించింది. 1984 తరువాత కమ్యూనిస్ట్ వ్యవస్థ కుప్పకూలటం ఆగ్నేయ, ఆసియా దేశాల పురోభివృద్ధి ప్రపంచ వర్తక సంస్థ స్థాపన, వీటి అన్నింటికి మించి దేశ ఆర్థిక, రాజకీయ వ్యవస్థలో వచ్చిన మార్పుల వలన భారత ప్రభుత్వం ప్రపంచీకరణకు మొగ్గుచూపింది.

## 17.6.1 ప్రపంచీకరణకు భారత ప్రభుత్వం తీసుకున్న చర్యలు:

ప్రపంచీకరణవైపు ప్రయాణించటానికి భారత ప్రభుత్వం ముందుగా ఆర్థిక విధానాలను మార్చి వ్యవస్థలో ఉన్న నియంత్రణలను తొలగించటానికి అనేక ఆర్థిక సంస్కరణలు చేపట్టింది. 1991 జూలైలో తెచ్చిన కొత్త ఆర్థిక విధానము ద్వారా ఆర్థిక సంస్కరణలు చేపట్టి దేశ ఆర్థిక వ్యవస్థ సరళీకృతము చేసింది. ప్రభుత్వము చేపట్టిన ఆర్థిక సంస్కరణలు కొత్త పారిశ్రామికీకరణ విధాన ప్రకటన, పరిశ్రమ క్రమబద్ధీకరణ, విదేశీమారక చట్టం, నిర్బంధ గుత్త వర్తక విధానాల చట్టములోనే అంక్షలను పూర్తిగా ఎత్తివేయుటం. విదేశీ మారక ద్రవ్యాన్ని సరళీకరణముగా మార్చటం. విదేశీ పెట్టుబడులను పరిమితముగా ఆహ్వానించటం, ద్రవ్య మూలధన మార్కెట్లను పూర్తిగా సంస్కరించటం, ప్రపంచ ఆర్థిక సంస్థతో ఒప్పందాలకు విధానాలను మార్చటం ప్రత్యక్ష, పరోక్ష పన్నుల విధింపు, వడ్డీలు, [illegible] సరళీకృతము చేయుటం.

దేశ కరెన్సీని ప్రపంచ దేశాల కరెన్సీతో పూర్తిగా మార్చుకోగల వీలున్నప్పుడే అంతర్జాతీయ వ్యవస్థతో కలిసి పోవటానికి వీలవుతుంది. అనగా రూపాయి విలువను ఇతర కరెన్సీతో అంతర్జాతీయ మార్కెట్‌లో మార్కెట్ శక్తులద్వారా నిర్ణయము కావలసివుంది. దీనికోసం రిజర్వు బ్యాంక్ రూపాయి విలువ తగ్గిస్తూ 1991లో అపమూల్యం చేసింది. తరువాత కాలంలో రూపాయి పూర్తిగా మార్పు చేసుకోవటానికి ప్రయత్నిస్తూ 1993-1994 బడ్జెట్ ద్వారా కరెంటు ఖాతాలో రూపాయి పూర్తి మారకానికి బాట వేసింది. ఐతే మూలధన ఖాతాలో పూర్తిగా ఇంకా తీసుకు రావలసి ఉంది.

ప్రపంచీకరణ బాటలో మూసివేయబడిన ద్వారాలను తెరచి దిగుమతులను సరళీకరించటం ముఖ్యమైన ఘట్టము. 1991కు ముందు భారత ఆర్థిక వ్యవస్థ నాణ్యతలేని మూసివున్న వ్యవస్థ. దీనికి కారణం, దిగుమతి సుంకం రేటులు 255% వరకు ఉండటమే. నూతన ఆర్థిక విధానాన్ని ప్రవేశ పెట్టిన తరువాత దిగుమతి సుంకము రేట్లను తగ్గిస్తూ 2000-2001 నాటికి 35% శాతానికి తీసుకు రావటం జరిగింది. 1995లో కొత్తగా ఏర్పడిన ప్రపంచ వర్తక సంస్థలో భారతదేశం కూడా సభ్యురాలుగా చేరింది.

ఈ సంస్థ విధానాలకు అనుగుణంగా దిగుమతులపై ఉన్న పరిమాణాత్మక నిబంధనలను 1997 మొదలు '6' సంవత్సరాలకు పూర్తిగా తొలగించటానికి ఒప్పందం కుదుర్చుకోవటం జరిగింది. దీని ప్రకారమే 2001 నుండి దిగుమతిపై అన్ని రకాల పరిమాణాత్మక నిబంధనలను తొలగించటం జరిగింది.

అంతర్జాతీయంగా దేశ ఆర్థిక వ్యవస్థను విలీనము చేసే భాగముగా ఆర్థిక వ్యవస్థ తలుపులను పూర్తిగా తెరవటానికి భారతదేశం పూర్తి స్థాయిలో ప్రయత్నాలు మొదలుపెట్టింది. మొదటిగా విదేశీ మారక చట్టం (1993) సమూలముగా మార్చి దానిస్థాయిలో విదేశీ మారక నిర్వహణ చట్టాన్ని తీసుకు రావటం జరిగింది. ఈ నిబంధన ప్రకారం చాలా పరిశ్రమలలో విదేశీ సంస్థలు 74 నుండి 100 శాతం వరకు పెట్టుబడులు పెట్టవచ్చు. ప్రవాస భారతీయుల విషయములో కూడా అది వరకు ఉన్న నిబంధనలను తొలగించి భారత దేశములో పెట్టుబడి పెట్టటానికి మూలధనాన్ని లాభాలను వెనుకకు తీసుకు వెళ్ళటానికి అనుమతించటం జరిగింది.

## 17.7. ప్రపంచీకరణ పట్ల వ్యతిరేఖత :

చిత్రమేమిటంటే ప్రపంచీకరణను వర్ధమాన దేశాలలోనే వారేకాక అభివృద్ధి చెందిన దేశాలలోని వారు కూడా వ్యతిరేకిస్తున్నారు. పోటిలో పాల్గొని గెలవలేము కనుక మనకు ప్రపంచీకరణ వల్ల లాభము లేదని వర్ధమాన దేశాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. కాగా అమెరికా, జపాన్, జర్మనీలాంటి దేశాలలోని ప్రజలు ప్రపంచీకరణను విమర్శిస్తున్నారు. ఈ ప్రపంచీకరణ మూలంగా విదేశీ నిపుణులు, కార్మికులు తమ దేశాలలోని ఉపాధి సౌకర్యాలను కాజేస్తున్నారని వారు దీనిని విమర్శిస్తున్నారు. ఈ మధ్య ప్రపంచీకరణకు వ్యతిరేకంగా అమెరికాలోనే సియోటిల్ లాంటి నగరాలలో నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఈ సందర్భముగా ఒక ప్రత్యేక విషయం వివరించాలి. కొంత మంది పశ్చిమ మేధావులు ఇటీవల వర్ధమాన దేశాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రపంచీకరణను వ్యతిరేకిస్తున్నారు. పెద్ద, పెద్ద కంపెనీల కోరికలు తీర్చటానికి ప్రపంచములోని ప్రభుత్వాలు ప్రజల అవసరాలను పట్టించుకోవటం లేదని, క్లిన్ అనే మహిళా మేధావి తన పుస్తకములో వ్రాసింది. చైనా లాంటి దేశాలే ప్రపంచ వాణిజ్య సంస్థలో చేరుతున్నాయి. కాకపోతే ప్రపంచ బ్యాంకు అంతర్జాతీయ ద్రవ్యనిధిలాంటి సంస్థలు చేసే వాగ్దానాలపట్ల జాగరూకతతో మెలగాలి. ప్రపంచీకరణ క్రమంలో పాల్గొంటూనే అబీద్ హుసేన్ చూచించి నట్లు భారతదేశం వర్ధమాన దేశాలను కూడ కట్టుకొని ధనిక దేశాల పన్నాగాలకు దుష్టపతకాలకు వ్యతిరేకముగ్గా నిరంతరం పోరాటం నిర్వహించాలి. అమెరికాలో ఇటీవల కొంత మంది అమెరికన్లు ఉద్యోగాలు కోల్పోయారు. అందుకు కారణం ప్రపంచీకరణ కాదు. వారు మారిన పరిస్థితులకు అనుగుణంగా తమ నైపుణ్యాన్ని పెంచుకోక పోవటమే ప్రధాన కారణం.

## 17.8. ఆగ్నేయ, ఆసియా దేశాల సంక్షోభానికి కారణం:

ఆరు సంవత్సరముల క్రితం కొన్ని ఆగ్నేయ, ఆసియా దేశాలు తీవ్ర ఆర్థిక సంక్షోభానికి గురయ్యాయి. దానికి కారణం, ప్రపంచీరణ అని అన్నారు. కాని అసలు కారణం అదికాదు. అబీద్ హుసేన్ లాంటి వారు కూడా ఈ సంక్షోభముతో ప్రపంచీకరణను ముడిపెట్టటం సముచితము కాదన్నారు. నిజానికి ఆగ్నేయ, ఆసియా దేశాలు ప్రపంచీకరణ క్రమముతో ఎంతో విలువైన ఉపయోగకరమైన కొత్త టెక్నాలజీని దిగుమతి చేసుకొని లాభపడ్డాయి. మలేషియా లాంటి దేశాలు పశ్చిమ దేశాల టెక్నాలజీతో తమ వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించుకున్నాయి. ఆగ్నేయ, ఆసియా దేశాలలో రెండు దశాబ్దాల క్రితం అవినీతి విపరీతముగా పెరిగింది. ఈ అవినీతి బ్యాంకులకు ఇతర పరపతి సంస్థలకు అంటుకుంది. దానితో బ్యాంకింగ్ వ్యవస్థల పనితీరు క్షీణించింది. లంచమిచ్చిన ప్రతి బినామికి ఋణాలు ఇచ్చారు. ఇచ్చిన ఋణాలు తిరిగి వసూలు చేయలేదు. అడిగిన వారికెల్లా ఋణం తేలికగా రావటంతో పెట్టుబడి దారులు అనుత్పాదక రంగాలపై పెట్టుబడులు పెట్టినారు. ఆ దేశాల ఆర్థిక సంక్షోభానికి మూలాలు

ఆ దేశములోనే ఉన్నాయి. మల్టినేషనల్ కంపెనీలు ఇచ్చిన ఋణాలను, బ్యాంకులు ఇచ్చిన ఋణాలను ముఖ్యముగా రియల్ ఎస్టేట్ వ్యాపార రంగములో వినియోగించారు. స్థలాల కొనుగోలు, గృహ నిర్మాణాలు అవసరమే ఐనప్పటికి వీటికి ఉత్పాదక పరిశ్రమలుగా పరిగణించకూడదు.

## 17.9. ప్రపంచీకరణ ఫలితాలు:

ప్రపంచీకరణ మిశ్రమ ఫలితాలను ఇస్తుంది. ప్రపంచీకరణ వలన లాభాలు కలవు, అనర్థాలు కలవు. అంతర్జాతీయ వర్తకము వలన నిధులు కేటాయింపులు పెరుగుతాయి తద్వాదా ఉత్పాదకత పెరుగుతుంది. ఇది ప్రామాణిక సిద్ధాంతం మొత్తం మీదా అంతర్జాతీయ వర్తకం ప్రయోజనకరం అని చెప్పుకోవచ్చు. నియంత్రిక వర్తకం ప్రగతికి ప్రతిభందకం వస్తు సేవల వర్తకములో కూడా కలవరము కలిగించే అంశాలు ఉన్నాయి. వర్థమాన దేశాలు అంతర్జాతీయ వర్తకం ఫలాలను గరిష్ఠముగా ఆస్వాదించాలంటే అందుబాటులో ఉన్న వనరులన్నింటికి సంపూర్ణ స్థాయిలో వినియోగించుకోగలగాలి. అందుకు సమయం పడుతుంది. ఈ కారణం వల్లనే పలు అంతర్జాతీయ వర్తక ఒప్పందాలు , సుంకాలుకాని అవరోధాలు తొలగించటంలో వర్థమాన దేశాలకు దీర్ఘకాలిక వ్యవధిని ఇస్తున్నాయి. ఈ సాంప్రదాయానికి సర్వత్రా ఆమోదం లభించింది.

దేశాల మధ్య జరిగే పెట్టుబడులు ప్రవాహం ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచటములో కీలక పాత్ర పోషిస్తుంది. 19, 20శతాబ్దాలలో ఈ వాస్తవం నిరూపితమైనది. ప్రపంచ దేశాల పొదుపు మొత్తాలన్ని పెట్టుబడులకు గరిష్ఠముగా అవకాశాలుగల దేశాలలో పంపిణి కావటంలో పెట్టుబడుల చలనత్వం ఎంతగానో సహకరిస్తుంది. ఈ పరిస్థితులు నేపధ్యంలో ఒక దేశం అభివృద్ధి కేవలం ఆ దేశపు పొదుపు మొత్తాల మీదనే ఆధారపడి ఉన్నధి. ఇటీవల కాలంలో తూర్పు ఆసియా దేశాలు, అభివృద్ధి సాధించటంలో విదేశీ పెట్టుబడులు ప్రధాన కారణం. వివరాలలోకి వెళితే 1993లో మలేషియాలోకి వెళ్ళిన విదేశీ పెట్టుబడులు దాని స్థూల దేశీయ ఉత్పత్తిలో 17.4% వరకు ఉన్నాయి. 1995లో లాండ్‌లోకి వచ్చిన విదేశీ పెట్టుబడులు దాని స్థూల దేశీయ ఉత్పత్తిలో 12.7% వరకు ఉన్నాయి.

పెట్టుబడుల మార్కెట్ శరవేగముగా అభివృద్ధి చెందటాన్ని ప్రస్తుత ప్రపంచీకరణ ముఖ్య లక్షణముగా చెప్పుకోవచ్చు. అంతర్జాతీయంగా పెట్టుబడుల బదలాయింపులు జరగాలంటే మొదట విదేశీ మారకం మార్కెట్లు పెట్టుబడుల మార్కెట్లు బాగా విస్తరించాలి. ఐతే అనిచ్చితమైన విదేశీ మారకం మార్కెట్లు, ఒక దేశం నుంచి సులభముగా పెట్టుబడులను ఉపసంహరించుకొనే వెసులుబాటు కలవరం కలిగిస్తున్నాయి. ప్రపంచీకరణ వలన పోటి పెరిగి సామర్థ్యము ఉన్న వ్యక్తులు, సంస్థలు ముందుకు రావటం వల్ల ఆర్థిక వ్యవస్థ పటిష్టమౌతుంది. ప్రపంచీకరణ వలన ముఖ్యముగా వినియోగదారునికి మేలు చేకూరుతుంది. ప్రపంచములో ఉత్పత్తి అయ్యే ఏ రకమైన వస్తు సేవలనైనా నాణ్యతతో సరసమైన ధరలలో పొందవచ్చు.

ప్రపంచీకరణ వలన అనేక లాభాలు పొందటానికి వివిధ అవకాశం ఉన్నప్పటికి ఆచరణలో వెనుకబడిన దేశాలు కొన్ని అనర్థాలను ఎదుర్కొన వలసిన అవసరం ఉంది. బాగా అభివృద్ధి చెందిన దేశాలు మన లాంటి దేశాలను పీల్చి పిప్పి చేయటానికి అవకాశం వుంది. ప్రపంచీకరణ వలన స్వదేశీ పరిశ్రమల నాశనమయ్యే అవకాశం ఉంది. స్వదేశీ వస్తువులు, విదేశీ వస్తువుల ముందు పోటి పడటం సాధ్యంకాని పని ఈ మధ్య కాలములో మార్కెట్‌ను ముంచెత్తుతున్న చైనా వస్తువులతో దీనికి ఉదాహరణ. అలాగే చిన్న పరిశ్రమలు, చేతి పరిశ్రమలు పోటి తట్టుకోలేక మూసివేత దిశగా ప్రయాణిస్తున్నాయి. స్వదేశీ పరిశ్రమలు మూత పడటంతో నిరుద్యోగ సమస్యల అధికమౌతుంది. స్వేచ్ఛాయుత మార్కెట్ విధానంలో ధనిక, పేదలమధ్య ఉన్న అంతరాలు ఇంకా పెరగటానికి అవకాశం ఉంది. ప్రపంచీకరణ వల్ల కొన్ని దేశాలకు గొప్ప లాభాలు చేకూరాయి. మరి కొన్ని దేశాలకు చాలా తక్కువ లాభాలు చేకూరాయి. ప్రపంచీకరణ వల్ల వ్యవసాయ రంగానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉంది. భారత దేశం ముఖ్యముగా

వ్యవసాయ దేశం. ప్రపంచీకరణ వల్ల విదేశీ వ్యవసాయ రంగ ఉత్పత్తులతో దేశీయ వ్యవసాయ రంగం పోటీ పడటం సాధ్యం కాని పని. ప్రపంచీకరణ వలన దేశ మాచక సాంప్రదాయ రంగాలు ఆటు పోట్లకు గురికానున్నాయి. సరిహద్దులు లేని సామాజిక వ్యవస్థ మన లాంటి దేశాలకు పెద్ద సమస్య కావచ్చు. టి.వి., మ్యూజిక్, మేగజైన్లు, దుస్తులు మొదలగు విదేశీ వస్తు సేవల ఫలితం. భారత సామాజిక రంగంపై అధికముగా ఉండటం వల్ల సమాజ వర్గాలలో కల కలం మొదలైనది.

## 17.10. అంతర్జాతీయ శాంతి సహకారాల్లో ప్రపంచీకరణ పాత్ర:

ప్రపంచీకరణను ఒకే ఒక వాక్యంలో ఇలా నిర్వచించవచ్చు. "ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అను రైలుకు ఒక దేశ ఆర్థిక వ్యవస్థ అనే బోగిని తగిలించడమే ప్రపంచీకరణ అనే భావనానికి నాలుగు స్తంభాలు ఉన్నాయి. అవి. 1) అన్నిదేశాల మధ్య సరుకులు స్వేచ్ఛగా పంపిణీ కావడానికి అవసరమైన వాణిజ్య అవరోధాల అన్నింటిని పూర్తిగా తొలగించాలి. 2) ఏదేశంలోనైన పెట్టుబడి పెట్టడానికి అనుకూలమైన వాతావరణాన్ని నెలకోల్పాలి. 3) ఒక దేశం నుంచి మరో దేశానికి టెక్నాలజీ స్వేచ్ఛగా ప్రవహించడానికి అవసరమైన అంతర్జా తీయ పరిస్థితిని సృష్టించాలి. 4) ఏ దేశపు కార్మికుడైన, వృత్తి నిపుణుడైన, నచ్చిన దేశానికి వెళ్లగలిగే పరిస్థితిని సృష్టించాలి.

ప్రపంచీకరణ ప్రభావాలపై కొన్ని ఆందోళనలు వినిపిస్తున్నాయి. ఈ ఆందోళనలను, భయాలు అని కూడా అభివర్ణించవచ్చు. ఒక్కొక్క ఆందోళన వెనుక అనేకమైన భయాలు ఉన్నాయి. వీటిలో అన్నింటి కన్నా ప్రధానమైనది "ప్రపంచీకరణ వల్ల దేశాల మధ్య, ఒక దేశంలోని ప్రజల మధ్య ఆదాయం పంపిణీలో అసమానతలు చాలా హెచ్చు స్థాయిలో ఉంటాయి అన్నది." అయితే ఈ ప్రపంచీకరణ అనేది అసమానతలకు దారితీస్తుంది అని ఖచ్చితంగా ఋజువుచేసే ఆధారాలేవి ఇంతవరకు స్పష్టముగా కనిపించలేదు. ఆ మాట కొస్తే, ప్రపంచ సగటు ఎగుమతుల్లో ప్రపంచ ఉత్పత్తుల్లో వర్థమాన దేశాల వాటా పెరుగుతున్నది. 1988-1990 సంవత్సరాలలోని ప్రపంచ సగటు ఎగుమతుల్లో వర్ధమాన దేశాల వాటా 20.6% ఉండగా 2000 సం॥ నాటికి ఇది 29.9%నికి పెరిగింది. ఒక కాలానికి సంబంధించి వర్ధమాన దేశాల వాటాను సరిపోల్చేటప్పుడు ఆ మొత్తం కాలంలో ఆ దేశాల ఎగుమతులను పరిగణలోకి తీసుకోవాలి. అయితే ఒకప్పుడు వర్ధమాన దేశాలు అయిన వాటిని ఇప్పుడు కొత్తగా పారిశ్రామికీకరణ సాధించిన ఆసియా దేశాలుగా పరిగణిస్తున్నారు. అదే విధంగా 1988-1990 సం॥రాల్లో మొత్తం ప్రపంచ ఉత్పత్తిల్లో వర్థమాన దేశాల వాటా 17.9% ఉండగా, 2000 సం॥రంలో 40.4%నికి చేరుకుంది. వర్ధమాన దేశాల అభివృద్ధి రేటు పారిశ్రామిక దేశాల అభివృద్ధి రేటుకన్నా ఎక్కువగా ఉంటున్నది. ఈ అభివృద్ధి రేట్లు 1980 దశకంలో కన్నా 1990లో దశకంలోనే అత్యధికంగా ఉన్నాయి. ప్రపంచీకరణ వల్ల వర్థమాన దేశాలు ఇబ్బందులను ఎదుర్కోవడం లేదని ఈ లెక్కలు ఋజువు చేస్తున్నాయి. వాస్తవానికి అవి ప్రయోజనాలు పొందాయి. వర్ధమాన దేశాల ఆఫ్రికా దేశాలు అనుకున్న ఫలితాలు సాధించలేదు. దక్షిణ ఆసియా దేశాలు మాత్రం 1990వ దశకంలో మంచి ఫలితాలు సాధించాయి. 1990 దశకంలో వర్థమాన దేశాల తలసరి ఆదాయం వృద్ధిరేటు సంపన్న దేశాల తలసరి ఆదాయం వృద్ధిరేటు కన్నా రెట్టింపు ఉంది. అయితే వాస్తవిక పరిభాషలో తలసరి ఆదాయంలో అంతరాలు పెరిగాయి. దేశ ప్రజల మధ్య ఆదాయ పంపిణి విషయానికి వస్తే ఈ పంపిణీలో ఏర్పడే అంతరాలకు ప్రపంచీకరణే, మూలకారణం అని చెప్పడం అంత తేలిక కాదు. 1990వ దశకంలో ద్వితీయార్థానికి సంబంధించిన పేదరికం నిష్పత్తిపై ఉత్పన్నమైన విభాగం మన అందరికీ తెలిసిందే. 1990వ దశకంలో పేదరికం నిష్పత్తి తగ్గిపోయింది అని చాలా మంది అంగీకరిస్తున్నారు. అయితే అది ఏ రేటులో పడిపోయింది అన్నదే వివాదంగా మారింది. అందువల్ల అది ఇండియా అయిన లేదా మరే దేశం అయిన ఆదాయం పంపిణీలో సంభవించే మార్పులకు ప్రపంచీకరణకు మధ్య ప్రత్యక్ష సంబంధం ఉన్నది అని ఖచ్చితంగా చెప్పలేము. ఏమైన పేదరిక నిర్మూలన కార్యక్రమం అమలులో వాణిజ్య సరళీకరణ ఏనాడు అవరోధాలు కల్పించజాలదు అన్నది వాస్తవం.

19

ప్రపంచీకరణ ప్రభావం భారతదేశంలో అన్ని రంగాలపై ప్రసరిస్తున్నది. కుటుంబ వ్యవస్థ నుంచి కార్పొరేట్ సంస్థల వరకు, ప్రతిదానిలోనూ అమెరికా సంస్కృతి జీవన శైలి చొరబడుతుంది. ప్రసార సాధనాలు ప్రకటనా రంగాలు దీనికి మరింత ఊపునిస్తున్నాయి. మనదైన సంస్కృతి, సాంప్రదాయం కుటుంబ సామాజిక వ్యవస్థలు ఈ హైటెక్‌దాడిని తట్టుకోలేక తిరగమరుగవుతున్నాయి. ముఖ్యంగా 18-30సం॥ మధ్య వయస్సు వారు అమెరికా సాంస్కృతిక దాడికి, సులభంగా లొంగి పోతున్నారు. పబ్‌లు, థెక్‌లు, పిజ్జాలు, ఇంటర్‌నెట్‌కేఫులు, సెల్‌ఫోన్‌లు, బర్గర్‌లు, ఫ్రెండ్‌షిప్‌డేలు, వాలెంటైన్‌డేలు, ఎంటీలీలు, ఎడ్వర్‌టైజ్‌మెంట్‌లు, రోడ్‌షోలు అన్ని ప్రపంచీకరణ పేరుతో భారతీయ సాంస్కృతిక, సామాజిక, సాంప్రదాయ వ్యవస్థను నాశనం చేయడానికి అమెరికా సంస్కృతిని జీవన శైలిని రుద్దడానికి జరుగుతున్న ప్రయత్నాల్లో భాగమే. అయితే పైకి మాత్రం వీటికి అభివృద్ధి ఆధునీకరణ వంటి తీపి రంగు పూస్తున్నారు. తిండిలో, చదువులో, దుస్తుల్లో, బాషలో, జీవన సరళిలో భారతీయత మరుగు పడి పాశ్చాత్య సంస్కృతి, పాదుకొంటుంది. ఈ సాంస్కృతిక సామ్రాజ్యవాదం కలిగించే దుష్ ప్రభావం ముందుతరాలపై బాగా పడుతుంది. భారతీయ వినియోగదారుడు మానసికంగా, భౌతికంగా కూడా, అమెరికా సంస్కృతిక బానిస అవుతున్నాడు. ఈ ధోరణి నచ్చని సాంప్రదాయవాదులు నిరాశ, నిస్పృహలతో హింసా మార్గాన్ని అవలంభిస్తున్నారు. సెప్టెంబర్ 2001లో అమెరికాపై జరిగిన దాడి ఇలాంటిదే. ప్రపంచీకరణ దుష్ప్రభావం మతంపై కూడా పడుతుంది.

మతాన్ని సాంప్రదాయాన్ని కూడా వ్యాపార ప్రయోజనాల కోసం, ఉపయోగించుకుంటున్నారు. కంప్యూటర్ జాతకాలు, సంక్రాంతి బహుమానాలు ఆషాడం తగ్గింపు ఇందులో భాగాలే. మరోవైపు నుంచి టెలివిజన్, పరాయి సంస్కృతిని ప్రకటనలు కార్యక్రమాల రూపంలో భారతీయుల నరనరాల్లోకి ఎక్కిస్తున్నాయి. ఈ సాంస్కృతిక సామ్రాజ్యవాదం నగరాలతో పాటు మారుమూల పల్లెలకు కూడా వ్యాపిస్తుంది. పగలు 10 గంటలు దాటితే పాలు దొరకని గ్రామాల్లో కూడా రాత్రింబవళ్ళు పెప్సీలు, కోక్‌లు దొరుకుతున్నాయి అంటే ప్రపంచీకరణ ప్రభావం ఎంత బలముగా ఉన్నదో తెలుస్తుంది. విదేశీ వస్తు వ్యామోహం కారణంగా, దేశీయ పరిశ్రమలు ఎన్నో మూతబడ్డాయి. ఫలితంగా వేల కొలది నిరుద్యోగులుగా మారి రోడ్డున పడుతున్నారు. ఫలితంగా సమాజంలో భద్రతా కరువు అవుతుంది. ఆరోగ్య రంగంలో కూడా ఈ కార్పొరేట్ సంస్కృతి ప్రవేశించింది. దానితో వైద్యము కూడా డిమాండ్ లేక ఆయా సంస్థలు కేంద్రాలు, మూతపడుతున్నాయి. దానితో ప్రతిదానికీ పరాయిపై ఆధారపడటం అనివార్యమైంది. ఈ పరాధీనత ముందు ముందు బానిసత్వానికి దారి తీస్తుంది.

ప్రజలను సన్మార్గంలో నడిపించాల్సిన ప్రభుత్వాలు, ప్రతికలు కూడా ప్రపంచీకరణ పేరుతో జరిగే సాంస్కృతిక దాడిలో చిక్కుకు పోవడం విశేషం. పరాయి దేశపు వ్యాపార వేత్త ఇండియాకు వస్తే, అతనికి పత్రికలు ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తున్నాయి. అభివృద్ధికరమైన ప్రజోద్యోగ సంక్షేమ వార్తల కంటే వ్యాపార విలువలున్న ఘటనలకే పత్రికలు ఎలక్ట్రానిక్ మీడియా విస్తృత ప్రచారం కల్పిస్తున్నాయి. మన దేశంలో మానవ సంబంధాల్లో కూడా ప్రపంచీకరణ విపరీతమైన మార్పులను తెస్తుంది. ప్రేమికుల రోజు, స్నేహితుల రోజు, తల్లి రోజు, తండ్రి రోజు వంటి రకరకాలు 'డే'లు దేశ వ్యాప్తంగా ఇప్పుడు ప్రాచుర్యం పొందుతున్నాయి. మీడియా కూడా వాటికి విస్తృత ప్రచారం ఇస్తుంది. అనాదిగా సమిష్ఠి కుటుంబ వ్యవస్థ అమలులో ఉన్న మనదేశంలో ఇలాంటివి అవసరంలేదు. పాశ్చాత్య దేశాల్లో తల్లిదండ్రులు పిల్లలు భార్య భర్తల మధ్య సంబంధాలు, ఇక్కడ ఉన్నంత పటిష్ఠంగా ఉండవు. అందువల్ల అక్కడి వారు కనీసం ఏడాదిలో ఒకరోజు అయిన వాటిని పొందడం కోసం ఇలాంటి 'డే'లు జరుపుకుంటారు.

ప్రపంచీకరణ తెచ్చిన మరో ఉపద్రవం సులభంగా సంపాదన ప్లేవిన్ వంటి ఆన్‌లైన్ లాటరీలు, కౌన్ బనేగా కరోర్‌పతి వంటి వాటి ద్వారా ఆకస్మిక సులభ సంపాదనకు జనం పరుగులు తీసేలా చేస్తున్నారు. పేదలు, మధ్యతరగతి వారు అధికంగా ఉన్న మనదేశంలో ఇలాంటి వాటికుండే డిమాండ్ ఏమిటో అందరికి తెలిసిందే. ఈ ప్రపంచీకరణ క్రింద జరిగే సాంస్కృతిక దాడి ఫలితంగా దేశంలో ధనిక, పేద అంతరం పెరిగిపోతుంది. ధనవంతులు, మరింత ధనవంతులు అవుతున్నారు, పేదలు కటికదరిద్రులు

అవుతున్నారు. మొత్తం మీదా ప్రపంచీకరణ పేరుతో జరుగుతున్న ఈ కార్యక్రమం భారతదేశం లాంటి వర్ధమాన దేశాల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలను చిన్నాభిన్నం చేస్తుంది అనడం నిర్వివాదము.

## 17.11. భారత్ ముందు ఉన్న మార్గం:

ప్రపంచీకరణ విస్తరిస్తున్న ప్రస్తుత తరుణంలో భారత్ అనుసరించాల్సిన వైఖరి ఏమిటన్నది ప్రధానమైన ప్రశ్న ఏమైన ప్రపంచీకరణ మార్గం నుంచి వైదొలగడం అన్నది సరైన ప్రత్యామ్నాయం కాదు అని స్పష్టం చేయవచ్చు. నేడు ప్రపంచ వాణిజ్య సంస్థలో 144 సభ్య దేశాలు ఉన్నాయి. మరో 30దేశాలు ఇందులో చేరాడానికి నిరీక్షిస్తున్నాయి. అంతర్జాతీయ వర్తకం పెట్టుబడుల నుంచి గరిష్ఠముగా ప్రయోజనాలు పొందేందుకు వీలుగా, తగిన కార్యాచరణను రూపొందించు కోవడమే ఇండియా ముందు ఉన్న తక్షణ కర్తవ్యం. ఈ కార్యచరణలో '3' అంశాలు తప్పనిసరిగా ఉండాలి. అవి:

1) బహుళపక్ష వాణిజ్య వ్యవస్థనుంచి ఆసిస్తున్న అంశాలతో కూడిన డిమాండ్ల చిట్టాను స్పష్టంగా రూపొందించాలి.

2) అంతర్జాతీయ వర్తకం నుంచి వర్ధమాన దేశాలు మరిన్ని ప్రయోజనాలు పొందడానికి వీలుగా సంపన్న దేశాలచే ప్రభావితం చేసే చర్యలను స్పష్టముగా పేర్కొనాలి.

3) ప్రపంచీకరణ ఫలాలు సంపూర్ణంగా పొందడానికి ఇండియా చెప్పవల్సిన చర్యలు నిర్దేశించాలి.

భారత్‌లో సహ వర్ధమాన దేశాలు అన్ని తమతమ అభిప్రాయాలను విస్పష్టముగా నిక్కచ్చిగా చెప్పాలి. బహుళపక్ష వాణిజ్య వ్యవస్థ నుంచి ఆశిస్తున్న అంశాలతో కూడిన డిమాండ్ల విషయంలో ఎక్కడా రాజీపడకూడదు. ఆ డిమాండ్లు 1) ఒక దేశం నుంచి మరో దేశానికి పెట్టుబడులు తరళడాన్ని వ్యక్తుల వలసలను ఏకరీతిగా సంభావించడం. 2) వాణిజ్య చర్యల నుంచి పర్యావరణ ప్రమాణాలను కార్మిక ప్రమాణాలను తొలగించడం. 3) కార్మిక శక్తిమీద అత్యధికంగా ఆధారపడి తయారుచేసిన, వర్ధమాన దేశాల వస్తుసేవల ఎగుమతులపై సంపన్న దేశాలు ఎటువంటి సుంకాలు విధించరాదు. 4) వర్ధమాన దేశాలకు సాంప్రదాయంగా వస్తున్న పరిజ్ఞానానికి జీవ జనవ సామాగ్రికి తగు రక్షణ కల్పించాలి. 5) ఏకపక్ష వాణిజ్య చర్యలను జాతీయ చట్టాలు నిబంధనలను ఇతర దేశాలపై రుద్దడానికి ప్రయత్నించడాన్ని నిషేధించాలి. 6) వర్ధమాన దేశాల ఎగుమతులపై పారిశ్రామిక సంపన్న దేశాలు యాంటిడంపింగ్ డ్యూటీ విధించడాన్ని లేదా ఆ ఎగుమతులను నిరుత్సాహ పరిచే చర్యలు తీసుకోవడాన్ని నిరోధించాలి. ఏమైన ఈ చర్యలు అనేవి అంతతేలికైన వేవికావు. కొన్ని సాధించడం కోసం కొన్నింటిని వదులుకోక తప్పదు.

## 17.12. ముగింపు:

స్వేచ్ఛ ఆర్థిక వ్యవస్థ వల్ల ఉత్పన్నమయే సమస్యలు అన్ని తెలిసినవే అయితే ప్రపంచీకరణ అందించె అవకాశాలనూ మనం భారవిడువకూడదు. ఇతర వర్ధమాన దేశాలతో పోల్చుకుంటే ప్రపంచీకరణ వల్ల ఎక్కువ ప్రయోజనాలు పొందగలిగే స్థితిలో భారత్ ఉన్నది. అయినప్పటికి మన ఆందోళనలను, వెల్లడి చేయక తప్పదు. ఇతర వర్ధమాన దేశాలతో కలసి వాటి ప్రత్యేక అవసరాలు తీర్చు విధంగా అంతర్జాతీయ వాణిజ్య సూత్రాల్లో మార్పులు తీసుకు రావడానికి గళం విప్పాలి. అదే సమయంలో మన ప్రయోజనాలు పరిరక్షణకు పాటు పడాలి. నూతన సహస్రాబ్దిలో అనివార్యంగా మారిన ప్రపంచీకరణ సవాళ్ళను ఎదుర్కోవడానికి ఇండియా ఈ ద్విముఖ వ్యూహం అనుసరించక తప్పదు.

**Dr. V. K. Mohan.**

పాఠం - 18

# యూనియన్ ఆఫ్ సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్ (యు.ఎస్.ఎస్.ఆర్) విచ్ఛిన్నం

**లక్ష్యం :**

సోవియట్ రష్యా అధ్యక్షుడు గోర్బచెవ్ అనుసరించిన నూతన విధానం, పెరిస్ట్రోయికా, గ్లాస్‌నోస్త్, సోవియట్ రష్యా విచ్ఛిన్నం, తూర్పు యూరప్‌పై దాని ప్రభావం, ఇండియా స్పందన, ఫలితాలు గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

**విషయ సంగ్రహం :**

- **18.1.** పరిచయం
- **18.2.** తొలి సంస్కరణ యత్నాలు
- **18.3.** గోర్బచెవ్ అనుసరించిన విధానం
- **18.4.** గ్లాస్‌నోస్త్, పెరిస్ట్రోయికా
- **18.5.** సోవియట్ విచ్ఛిన్నం
- **18.6.** గోర్బచెవ్ సంస్కరణల ప్రభావం
- **18.7.** తూర్పు యూరప్‌పై ప్రభావం
- **18.8.** భారత్ స్పందన
- **18.9.** సమీక్ష

## 18.1. పరిచయం :

1917లో వచ్చిన రష్యన్ విప్లవం మానవ చరిత్రలో కొత్త అధ్యయనానికి, మనిషి యొక్క ఆర్థిక, మానసిక, వైజ్ఞానిక సాంఘిక సర్వతోముఖాభివృద్ధికి నాంది పలికింది అన్న విషయం అందరికి తెలిసినదే. 1789 ఫ్రెంచి విప్లవం తరువాత రెండు శతాబ్దాలకు రష్యాలో గోర్బచెవ్ ప్రవేశ పెట్టిన సంస్కరణలు సంచలనాత్మకమై మేథోపరముగాను, రాజకీయం గానూ, నూతన ఆలోచనలకు పునాధులు వేసింది.

సోవియట్ యూనియన్ అనుసరించిన సిద్ధాంతాలు త్వరలోనే కాలం చెల్లిపోతాయి అని కొంతమంది మేధావులు భావించారు. ఆర్థర్ కోస్లర్, కారల్ పాపర్, జోసెఫ్ షూమ్ పెటర్ లాంటి మేధావులు మరియు రాజకీయ కారణాల కోసం వలస పోయినటువంటి మిలోవన్ డిస్ మరియు అలెగ్జాండర్ సోల్జి నిట్సిన్ వంటి విమర్శకులు కూడా అసంబద్ధులు కాకపోయినప్పటికీ కాలం చెల్లిన వారిగా మిగిలారు. సోవియట్ యొక్క దీర్ఘకాలిక విధాన నిర్ణేతలు త్వరితగతిని ప్రవేశపెట్టిన సంస్కరణలు వారియొక్క సుదీర్ఘ వివరణకు తార్కాణాలు. పశ్చిమ దేశాలలోనూ, తృతీయ ప్రపంచ దేశాలలోను ఉన్న సోవియట్ వాదులు గోర్బచెవ్ విధానాలకు సమానంగా చలించారు. సోవియట్ యూనియన్ యొక్క ప్రచ్ఛన్నయుద్ధ వ్యతిరేకులకు అధికారంలో ఉన్న నాయకుడు, మార్క్స్ యొక్క ఆశయాలకు సామ్యవాద వారసత్వానికి వ్యతిరేక నిర్ణయాలు చేయడం నమ్మశక్యం కాలేదు.

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో భాగస్వాములకు, మార్క్సిస్టు పిడివాదులకు ఈ నిర్ణయం రుచించలేదు. ఈ పునఃనిర్మాణ చర్యలకు వారు వ్యతిరేకులయ్యారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న స్వచ్ఛమైన కమ్యూనిస్టులు చాలా అసహనానికి గురి అయి, గోర్బచెవ్ రష్యా కమ్యూనిజంను హత్య చేయడమే గాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని సుడిగుండంలోనికి నెట్టి వేసినట్లుగా భావించారు.

కొద్దిగా, నెమ్మదిగానైన భారతదేశంలో కూడా దీని ప్రతిస్పందన అనుకూలంగానూ, ప్రతికూలంగానూ, పెద్ద మొత్తంలోనే ప్రతిబింబించింది. స్వేచ్ఛ ప్రజాస్వామ్యవాదులకు గోర్బచెవ్ ఒక మెస్సయ్య గానూ, శాంతి కాముడుగానూ అగుపించగా, వ్యతిరేకులకు, అభివృద్ధి వినాశకుడుగానూ, భస్మాసురుడు గానూ గోచరించాడు.

## 18.2. తొలి సంస్కరణ యత్నాలు

గోర్బచెవ్‌కంటే ముందె సంస్కరణ ఉద్యమాలు మొదలైనాయి. పార్టీలో సంస్కరణలు, ఆర్థిక సంస్థల్లో మార్పులు, కొన్ని దశాబ్దాలకు పూర్వమే ప్రారంభమైనవి అని చెప్పవచ్చు. వీటిలో ముఖ్యమైనవి కృశ్చేవ్ యొక్క వ్యక్తి పూజా విధానం రూపుమాపుట, 1950 లో అధికార కేంద్రీకృత ఉద్యోగస్వామ్య పద్ధతులు, 1960 లో వచ్చిన లిబర్‌మేన్ మరియు కోసిగిన్‌ల యొక్క సాహస చట్టాల రద్దు, మరియు 1970 లో పారిశ్రామిక సంస్థల్లో వచ్చిన మార్పులు, ఆర్థిక పుష్టికి తీసుకొన్న చర్యలు. అయితే ఇవన్నీ ఆర్థిక వ్యవస్థపై ఎటువంటి ప్రభావాన్ని చూపలేదు. హెవిట్ చెప్పినట్లుగా పరిపాలనా వ్యవస్థల పోటిలో వచ్చిన ప్రత్యామ్నాయాల వలన సంస్కరణలు వాటి లక్ష్యాలను సాధించలేకపోయాయి. ఉద్యోగ స్వామ్యంలో వచ్చిన మార్పులు అసలు వ్యవస్థలో కూడా ఎటువంటి అభివృద్ధిని కనపరచలేదు. గోర్బచెవ్ కూడా దీనితో ఏకీభవిస్తూ ఈ సంస్కరణలు విజయవంతం కాకపోవటానికి కారణం ప్రజాస్వామ్య పద్ధతిలో విశాల దృక్పదం యొక్క దన్ను లేకపోవడమేనన్నారు.

## 18.3. గోర్బచెవ్ అనుసరించిన విధానం

గోర్బచెవ్ యొక్క నూతన ఆలోచన తత్వవిధానం కమ్యూనిస్టు పార్టీయొక్క వేగవంతమైన పునర్‌నిర్మాణానికి పునాదులు వేసింది. ముఖ్యంగా అతడు 1985 అక్టోబర్ ప్లీనరీ సమావేశంలో సామ్యవాద పునరుద్ధరణ గురించి మరియు అప్పుడు అమలౌతున్న పరిపాలనా విధానం గురించి ప్రసంగించారు. ప్రతి ఒక్కరు దీనిని సాధారణంగా ప్రతి సి.పి.యస్.యు. ప్రధాన కార్యదర్శి తన మనుగడకొసం చేసే స్వచ్ఛత నిరూపణగానూ, తన స్థానాన్ని కాపాడుకొనుటకు గానూ, చేసిందిగా భావించారు. అయితే ఇది సరికాదు. 1986 పార్టీ కాంగ్రెస్‌లో విప్లవాత్మక సంస్కరణల ఆవశ్యకతను గురించి గోర్బచెవ్ నొక్కి చెప్పాడు. 1987 నాటికి విషయం ఆర్థిక పునర్‌నిర్మాణ దశనుంచి రాజకీయ పునర్‌నిర్మాణ దశగా పురోగమించింది. 1988 నాటికి ప్రధానముగా ప్రసార మాధ్యమాల స్వాతంత్ర్యం లక్ష్యమైంది. ఖచ్చితంగా ఈ స్థాయివద్ద గోర్బచెవ్ విమర్శకులు, బహిరంగ విమర్శలను క్రిందిస్థాయి నుంచి, పార్టీ నాయకులకు పరిపాలనా అధికారులకు వ్యతిరేకంగా ఆహ్వానించడమైయింది. ఇది గోర్బచెవ్ యొక్క నాయకత్వాన్ని సుస్థిరం చేసుకొనే దిశగా చేసిందేనని భావించారు. ప్రజాస్వామ్య అతివాదులనుంచి మరియు కమ్యూనిస్టు పిడివాదులనుంచి వచ్చే విమర్శలను లక్ష్యపెట్టక చాలా వేగంగా, సంస్కరణలనే కలలకు వాస్తవ రూపాన్ని సాకరింపచేశారు.

## 18.4. గ్లాస్‌నోస్త్, పెరిస్త్రోయికాలు

జార్ ప్రభుత్వం అధికాన్యానికి నిరసనగా రష్యా ప్రజానీకం జరిపిన సమ్మె 1917 అక్టోబర్ విప్లవం పేరుతో కీర్తి ప్రతిష్ఠలను పొందింది. మార్క్స్ సిద్ధాంతాలతో ప్రభావితుడైన లెనిన్ ఈ తిరుగుబాటు నాయకత్వం వహించాడు. మార్క్స్ దారిలో రష్యాను లెనిన్ నడిపించాలి అని అనుకున్నాడు. కమ్యూనిస్టు విప్లవం తరువాత జరిగిన అంతర్ యుద్ధం తరువాత 1922లో 15 రిపబ్లిక్‌లు కలయికతో యూనియన్ ఆఫ్ సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్ (యు.యస్.యస్.ఆర్) ఆవిర్భవించింది. 1929లో ప్రపంచ ఆర్థిక మాంద్యం వల్ల ప్రపంచ దేశాలు అన్నీ ఘోర సంక్షోభంలో పడినప్పటికీ, సోవియట్ యూనియన్ మాత్రం తన ప్రణాళికా బద్ధ ఆర్థిక వ్యవస్థతో ముందుకు పురోగమించడంతో

యూరప్‌లోని ఇతర దేశాలకు కమ్యూనిజం వ్యాపించింది. లెనిన్ తరువాత స్టాలిన్, బ్రెజ్నేవ్, కృశ్చేవ్, చెర్నంకోవ్, ఆంద్రోపోవ్, గోర్బచెవ్‌లు పాలించారు. అయితే సోవియట్ సామ్రాజ్యంలో వ్యక్తి స్వేచ్ఛా మానవ హక్కులు మృగ్యమైనాయన్న విమర్శలు వెలువడినాయి. 1945లో రెండోవ ప్రపంచ యుద్ధానంతరం అమెరికాకు ధీటుగా యు.యస్.యస్.ఆర్ అగ్ర రాజ్యంగా ఆవిర్భవించింది.

ప్రచ్ఛన్న యుద్ధ సమయంలో మరో అగ్రరాజ్యం అమెరికాతొ సరిపోయేటట్లు ఆయుధ సంపత్తిని, సైనిక కూటాలను సోవియట్ రష్యా ఏర్పాట చేసుకుంది.

1985లో అధికారాన్ని చేపట్టిన మిఖాయిల్ గోర్బచెవ్ దేశంలో రాజకీయ సంస్కరణల కోసం యత్నించాడు. ఈ నేపథ్యంలో గ్లాస్‌నోస్త్, పెరిస్త్రోయికాలు రూపొందాయి. ఇవి సోవియట్ యూనియన్ అధ్యక్షులు అయిన గోర్బచెవ్ చేసిన ప్రతిపాదనలు. పెరిస్త్రోయికా అంటే పునర్ నిర్మాణము. దీని ప్రధాన ఉద్దేశం ఆర్థిక సంస్కరణలు అయితే ఇది రాజకీయ సామాజిక సాంస్కృతిక రంగాలకు కూడా విస్తరించింది. అంతేగాక సామాజిక సంబంధమైన అన్ని సమస్యలను ఇది స్పృశించింది. ఈ సందర్భంగా 1978 నుండి సోవియట్ యూనియన్ నుంచి పెరిస్త్రోయికా అను పేరుతో మాసపత్రిక వెలువడటం అయింది. గ్లాస్‌నాస్త్ అంటే నిష్కాపట్యత అని అర్థం. ఇది ప్రధానంగా రాజకీయ పరమైన సంస్కరణ. ఏదో ఒక లక్ష్యాన్ని లేదా తన వంతు కృషి చేయడానికి వ్యక్తికి మాట్లాడే వీలుకల్పిస్తుంది ఇది. గోర్బచెవ్ మాటల్లో చెప్పాలి అంటే ప్రజల మనస్సును నిరంతరం ఆలోచింపజేయడం. ఇది ప్రజాస్వామ్యంయొక్క అవశ్యకతను తెలియజేస్తుంది. సోవియట్ యూనియన్ సమాజాన్ని పునర్‌నిర్మించాలి అని సమాచారం అందజేసే విషయంలో ప్రభుత్వం మరింత పారదర్శిక వైఖరి అవలంభించాలి అని గోర్బచెవ్ కోరాడు. కమ్యూనిస్టులు ఈ రెండు పదాల అర్థాన్ని సరిగా అర్థం చేసుకోలేకపోయారు. ఆయన చేసిన ఈ రెండు ప్రతిపాదనలు ఉత్తమమైనవే. కమ్యూనిస్టు పాలన దేశాన్ని భ్రష్టుపట్టించింది కనుక సమాజాన్ని పునర్‌నిర్మించాలి అన్నాడు. విప్లవం వచ్చి 70సం॥ దాటినా సోషలిస్ట్ సమాజం ఇనుప తెరగానే కొనసాగింది. కనుక గ్లాస్‌నోస్త్ అవసరమన్నాడు. గోర్బచెవ్ ప్రధాన ఉద్దేశాలు సోవియట్‌లో మార్కెట్ ఎకానమీకి స్వాగతం పలకడం, ప్రజాస్వామ్య పాలనను ప్రవేశపెట్టడం. 1946 లో అమెరికాలోని ఫల్టన్ నగరంలో విన్‌స్టన్ చర్చిల్ చేసిన ప్రసంగంలో మొదటిసారిగా ఇనుపతెర పదం వాడాడు. ముఖ్యంగా సోవియట్ ప్రజలకు బయట ప్రపంచ వ్యవహారాలనూ, తెలుపకుండా ఉంచే సమాచార స్వేచ్ఛరహిత పద్ధతిని ఇలా పేర్కొంటారు. సోవియట్ యూనియన్ దాని తూర్పు యూరప్ మిత్రదేశాల ప్రభుత్వ స్వభావాన్ని వివరించడానికి పశ్చిమదేశాల వారు ఈ పదజాలం వాడేవారు.

## 18.5. సోవియట్ విచ్ఛిన్నం :

1988లో గ్లాస్‌నోస్త్, పెరిస్త్రోయికాలు బాగా వ్యాప్తిలోకి వచ్చాయి. అయితే సోవియట్‌ను ప్రజాస్వామ్య పంథాలోకి తీసుకొని రావాలనుకొన్న గోర్బచెవ్ దానికి తగిన ప్రాతిపదికలను తయారు చేయలేకపోయాడు. దీనితో 1991లో సోవియట్ రష్యా ముక్క చెక్కలై 15 రిపబ్లిక్‌లుగా విడిపోయింది. గోర్బచెవ్ అర్థాంతరంగా రాజకీయాలకు దూరమయ్యాడు. అమెరికాతో, రక్షణ అంతరిక్ష రంగాల్లో పోటిపడటం వల్ల యు.యస్.యస్.ఆర్ ఆర్థికంగా చితికిపోవడం దాని పతనానికి దారితీసింది. 15 రిపబ్లిక్‌ల వివరాలు క్రింది విధముగా ఉన్నాయి.

| రిపబ్లిక్ | రాజధాని | విస్తీర్ణం | భాష | మతం |
|---|---|---|---|---|
| రష్యా | మాస్కో | 1,70,75,000 | రష్యన్ | క్రిస్టియన్ |
| ఉక్రెయిన్ | కీవ్ | 6,03,700 చ.కీ.మీ | ఉక్రేయియన్ | క్రిస్టియన్, ఇస్లాం |
| కజకిస్తాన్ | ఆక్‌మోలా | 27[illegible]0 చ.కీ.మీ. | కజక్ | క్రిస్టియన్, ఇస్లాం |
| ఉజ్బెకిస్తాన్ | తాష్కెంట్ | 4,47,[illegible]00 | ఉజ్బేక్ | ఇస్లాం |
| బెలారస్ | మిన్ స్కి | 2,07,600 | బెలోరుస్సియన్ | క్రిస్టియానిటి |
| అజర్‌బైజాన్ | బాకు | 86,000 | అజెరి | ఇస్లాం |
| జార్జియా | ట్బిలిసి | 69,700 | జార్జియన్ | క్రిస్టియన్ |

| | | | | |
|---|---|---|---|---|
| మోల్డావియా | వికభియన్ | | | |
| కిర్గిజియా | బిష్కెక్ | | | |
| తజకిస్తాన్ | దుషాంబె | 1,43,000 | తాజ్విక్ | ఇస్లాం |
| ఆర్మేనియా | యెరెవాన్ | 29,800 | ఆర్మేనియన్ | క్రిస్టియన్ |
| లాట్వియా | రిగా | 63,700 | లాట్వియన్ | క్రిస్టియన్ |
| టర్క్మెనిస్తాన్ | అష్కాబాద్ | 4,83,100 | తుర్క్మెన్ | ఇస్లాం |
| ఎస్టానియా | టల్లినిన్ | 45,100 | ఈస్టోనియన్ | క్రిస్టియన్ |

1991లో సోవియట్ పతనం తరువాత ఏర్పడిన స్వతంత్ర రాజ్యాల్లో రష్యాయే అతిపెద్దది. ఇప్పటికీ భూభాగ విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకుంటే రష్యాయే అతి పెద్ద రాజ్యం. జనాభా రీత్యా ప్రపంచంలో 5వ పెద్ద దేశం. సోవియట్ పతనం రష్యాను బాగా క్రుంగదీసింది. ప్రపంచంలో అగ్రరాజ్యం అనే గౌరవం పోయింది. ఈ దశలో దేశాన్ని ముందుకు తీసుకెళ్ళేందుకు, ఎల్సిన్ ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టాడు. అయితే ఎన్నో సంవత్సరాలుగా కమ్యూనిస్టు పంథాకు అలవాటుపడిన దేశ రాజకీయ వ్యవస్థ సంస్కరణలను జీర్ణించుకోలేకపోయింది. అయినా 1996 అధ్యక్ష ఎన్నికల్లో కమ్యూనిస్టు అభ్యర్థిని ఓడించి, ఎల్సిన్ విజయభేరి మోగించాడు. సోవియట్ యూనియన్ రూపంలో ఉన్నప్పుడు ఉన్న భద్రతామండలి శాశ్వత సభ్యత్వాన్ని రష్యా కాపాడుకుంది. బెలారస్, ఉక్రెయిన్, రష్యా తదితర ప్రాంతాలు కామన్‌వెల్త్ ఆఫ్ ఇండిపెండెంట్ స్టేట్‌గా ఏర్పడ్డాయి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాల కూటమి జి-8 లో రష్యాకు సభ్యత్వం ఉంది.

ఆగ్నేయ సోవియట్ ప్రాంతంగా ఉన్న ఉక్రెయిన్ 1991లో స్వాతంత్ర్యాన్ని పొందింది. నల్లసముద్రం రుమేనియా హంగరి, పోలెండ్, చెకోస్లావేకియా, ఈ దేశ సరిహద్దులు. మిగతా హద్దుల్లో బెలారస్, రష్యాలు ఉన్నాయి. కామన్‌వెల్త్ ఆఫ్ ఇండిపెండెంట్ స్టేట్ వ్యవస్థాపక సభ్యదేశాల్లో ఉక్రెయిన్ ఒకటి. మాజీ సోవియట్ రిపబ్లిక్‌లన్నిటికన్నా ఎక్కువ జన సాంద్రత ఇక్కడే ఉండేది. అలాగే సోవియట్ మాజీ రిపబ్లిక్‌లలో ఇది ధనవంతమైయింది. గతంలో సోవియట్ వ్యవసాయ ఉత్పత్తుల్లో అధిక భాగం ఇక్కడినుండే వచ్చేది. 1986లో జరిగిన చెర్నోబిల్ అను దుర్ఘటన అందరికి గుర్తుండే ఉంటుంది. భౌగోళికంగా చెర్నోబిల్ ఉక్రెయిన్ పరిధిలోకి వస్తుంది.

కజకిస్థాన్ 1991 డిసెంబర్‌లో స్వతంత్ర్యాన్ని పొందింది. ఈ దేశానికి రష్యా, ఉజ్బెకిస్థాన్, చైనా, కిర్గిజియాలు సరిహద్దులు. మాజీ సోయవిట్ రిపబ్లిక్లలో వైశాల్యము రీత్యా రెండవ స్థానం కజకిస్థాన్‌కే దక్కుతుంది. దేశములోని కార్మిక వర్గములో ఎక్కువ శాతం రష్యా లేదా ఉక్రెయిన్‌కు చెందినవారు. ఉజ్బెకిస్థాన్ 1991 డిసెంబర్‌లో స్వతంత్ర్యం పొందింది. ఈ దేశ సరిహద్దులు తజికిస్థాన్, కిర్గిజియా, తజకిస్థాన్, అఫ్ఘనిస్థాన్, తుర్క్‌మెనిస్థాన్‌లు. ప్రత్తి పంటలను అధిక దిగుబడులతొ పండించే ప్రాంతముగా ఉజ్బకిస్తాన్ పేరు తెచ్చుకొంది. బెలారస్‌ను పూర్వం బైలొ రష్యా అని వ్యవహరించేవారు. బైలొ రష్యా 1991 డిసెంబర్ తరువాత స్వతంత్ర్యాన్ని ప్రకటించుకొని బెలారస్‌గా మారింది. నేడు బెలారస్ కామన్‌వెల్త్ ఆఫ్ ఇండిపెండెంట్ స్టేట్స్‌లో సభ్యురాలు. పోలేండ్, లాట్‌వియా, లిథుపనియా, రష్యా, ఉక్రెయిన్‌లు ఈ దేశ సరిహద్దులు. ఈ దేశములో ఎక్కువమంది తెల్లజాతి రష్యన్లు. ఇరాన్, టర్కీలు సరిహద్దులుగా ఉన్న అజర్‌బైజాన్ పూర్వపు సోవియట్ రిపబ్లిక్. ఇది 1991 డిసెంబర్‌లో స్వతంత్రియాన్ని పొందింది. అంతకు ఏడాది ముందు అజర్‌బైజాన్‌లో ముస్లింలకు ఆర్మీనియన్ - క్రిస్టియన్‌లకు మధ్య గొడవలు జరిగాయి. ఆర్మేనియాలోని ఒక ప్రాంతం ప్రతేక ముస్లిం రిపబ్లిక్‌గా మారటంతో అల్లరులు సర్దుమనిగాయి. సోయవిట్ పతనము కావటంతో 1991 డిసెంబర్‌లో జార్జియా స్వతంత్ర్యాన్ని ప్రకటించుకొన్నది. 1992లో ఐక్యరాజ్య సమితిలో సభ్యత్వాన్ని తీసుకొన్నది. 1994లో కామన్ వెల్త్ ఆఫ్ ఇండిపెండెంట్ స్టేట్స్‌లో జార్జియా చేరింది. తజకిస్తాన్ మాజీ సోవియట్ రిపబ్లిక్‌లలో ఉంది. ఇది 1991 డిసెంబర్‌లొ స్వతంత్ర్యాన్ని ప్రకటించుకొన్నది. ఇచ్చట 1992లో పార్లమెంటరీ రిపబ్లిక్ మొదలైనది. 1993లో ఇచ్చట కమ్యూనిస్టు అనుకూల ప్రభుత్వం ఏర్పడింది. సోవియట్ పతనముతో 1991 డిసెంబర్‌లొ ఆర్మీనియా స్వతంత్ర్య రాజ్యముగా రూపొందింది. ఈ దేశ సరిహద్దులు జార్జియా, అజర్ బైజాన్, అంటార్కి, ఇరాన్‌లు, దీని గత చరిత్ర ఎంతో గణమైనది. 1990 లోనే లాట్వియా స్వతంత్ర్యాన్ని ప్రకటియుకున్నది. బాల్టిక్ సముద్రము, ఎస్టానియా, లిథుపనియా, రష్యాలు ఈ దేశ సరిహద్దులు. ఈ దేశంపై పాశ్చాత్యప్రభావం ఎక్కువ.

ఉజ్బెక్, ఆఫ్ఘన్, ఇరాన్‌ల మధ్య ఉండే తుర్క్‌మెనిస్తాన్ మాజీ సోవియట్ రిపబ్లిక్‌లలో ఒకటి. ఇది 1991లో స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకుంది. కామన్ వెల్త్ ఆఫ్ ఇండిపెండెంట్ స్టేట్స్‌లో ఇది సభ్యత్వాన్ని పొందింది. సోవియట్ నియంత స్టాలిన్ ఆక్రమించుకున్న మూడు బాల్టిక్ రాజ్యాలలో ఒకటి ఎస్టోనియా. సోవియట్ పతనానంతరం 1991లో ఎస్టోనియా స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకొంది. బాల్టిక్, రష్యా, మాటావిలాలు ఈ దేశ సరిహద్దులు.

## 18.6. గోర్బచెవ్ సంస్కరణల ప్రభావం

లెగచెవ్ లాంటి కన్సర్వేటివ్స్ గోర్బచెవ్ సంస్కరణలు చాలా దూరం తీసుకెళ్ళాయని, తద్వారా పార్టీ అస్థిత్వానికి మరియు మార్కిస్ట్ పార్టీ ప్రాథమిక సిద్ధాంతాల విషయంలో గోర్బచెవ్ రాజీపడ్డారని భావించారు. ఎల్సిన్ నాయకత్వంలో విప్లవవాదులు శీఘ్రగతిని భిన్న పార్టీ వ్యవస్థ, రాజకీయ వికేంద్రీకరణ, స్వేచ్ఛ మార్కెట్ విధానాల మార్గంలో తీసుకువెళ్ళలేదని విమర్శించారు. వీటన్నింటికి భిన్నంగా తన సంస్కరణలకు గోర్బచెవ్ సుప్రీం సోవియట్‌యొక్క న్యాయపరమైన అనుమతిని పొందగలిగాడు. బహుళార్థసాధకమైన తన ప్రణాళికను గోర్బచెవ్ 1990 నవంబర్ 7న తయారు చేశాడు. ఆ ప్రణాళికలో "మనం నిర్ణయాత్మకముగా అబద్ధాలతోను, అన్యాయముతోనుకాక, విషయాలను సత్యమనే వెలుతురులో చూడటానికి మరియు విప్లవాత్మకముగా ప్రజలచేత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి ఆర్థిక స్వేచ్ఛను ఏర్పాటు చేసుకొనటానికి ప్రాకులాడెదము. రాజ్యము సమన్వయానికి, పౌర సమాజానికి స్వతంత్ర్యం మరియు ప్రజాస్వామ్య వాదానికి, పౌర హక్కులను కాపాడటానికి సార్వభౌమత్వం మరియు ప్రజా ప్రభుత్వానికి కావలసిన సమాచారం అంతా వ్యక్తిగత శ్రమమీద ఆధారపడి ఉంది. ఈ విషయాలన్ని సామ్యవాద విధానాలతో ముడిపడి ఉన్నవనే విషయాన్ని మనం ఇప్పుడు అర్థం చేసుకుంటున్నాం."

ఈ సామ్యవాదం మానవత్వముతో కూడినటువంటిదైనా అసలైన మానవ జీవితంయొక్క గౌరవాన్ని వ్యక్తిత్వాన్ని పెంచింది. ప్రధానమైన విషయం ఏమిటనగా యస్.జి. దేశాయ్ వ్యక్తీకరించినట్లుగా వర్గపోరాటం కాదు, అవసరమైనది మాత్రం శాంతి మానవత్వమే. మార్గాలకూడా లక్ష్యాలవలే ఉన్నతమైనవిగా ఉండవలెను. ఈ ఆర్థిక పునఃనిర్మాణానికి కారణాలు కూడా అందరికి బాగా సుపరిచితమైనవే. గోర్బచెవ్ మాటలలో చెప్పాలంటే అవి అసలైన ఆర్థిక స్థితినుంచి వచ్చినవి. సామాజిక పరిధిలో నీతివంతమై రాజకీయ మరియు సాంస్కృతిక రంగాలలో. వ్యక్తిగత జీవితం ఎదుర్కొన్న సామాజిక కష్టాలనుండి మాత్రమే వచ్చినవి. ప్రజలలో మందకొడిగా ఉన్న సోమరితనాన్ని అణచివేయటానికి పార్టీలయొక్క కార్యక్రమాలను ప్రజల సమస్యలను పరిష్కరించటానికి శాస్త్ర, సాంకేతిక రంగాలలో వచ్చినటువంటి మార్పులయొక్క ఫలాలను అనుభవించటం మరియు పార్టీలో చేరిన కొత్త తరముయొక్క ఆధునిక ధోరణలు కారణం కావచ్చు.

గోర్బచెవ్ సంస్కరణల ప్రభావం సోవియట్ రష్యాలోనే గాక మిగతా అన్ని ప్రాంతాలలోను ముఖ్యముగా తూర్పు యూరప్‌లోని దేశాలలో కూడా పడింది. వేగముగా కొనసాగుతున్న ఈ కమ్యూనిస్టు వ్యతిరేక సంస్కరణల వలన అక్కడ కమ్యూనిస్టు పార్టీల మనుగడ ప్రశ్నార్థకమైనది. మిగిలిన సామ్యవాద దేశాలైనటువంటి చైనా, వియత్నామ్, క్యూబా కూడా దీని ప్రభావానికి లోనై ప్రజాస్వామ్య దిశగా ప్రయాణిస్తున్నాయి.

ఈ విధముగా గోర్బచెవ్ ఏ విధమైన హామీ లేకుండా 1985లో ప్రవేశపెట్టిన సంస్కరణలు తుఫానై మొత్తం సామ్యవాద ప్రపంచాన్ని సుడిగుండంలో పడవేసింది. పైకి కనిపించే రూపం తూర్పు యూరప్‌లో ఉపందుకొంటుండగా ఒకవైపు వ్యతిరేకులు ఆనందోత్సవాలు జరుపుకుంటే, మరొకవైపు సామ్యవాదులు తీవ్రమైన అసంతృప్తికి గురైనారు. ప్రజలలో వచ్చిన ఈ బలమైన మార్పుకు ఎదురు నిలిచిన కొంతమంది పాలకులు అధికారంనుండి తొలగింపబడ్డారు. అధికారంలో ఉన్న కొన్ని పార్టీలు ఈ ఏక పార్టీ పరిపాలనను అంతం చేయటానికి అవసరమైన సమాలోచనలు జరపటానికి ధైర్యము చేయలేదు. కొన్ని సంవత్సరాల పాటు పాఠశాలలలో కళాశాలలలో బోధనలలో ప్రధమ స్థానములో నిలిచిన లెనిన్, మార్క్స్ సిద్ధాంతాలు ఆశ్చర్యముగా మరుగున పడ్డాయి. చాలా తూర్పు యూరప్ దేశాలలో వాటి రాజ్యాంగము నుండి సామ్యవాదము అనే పదాన్ని తొలగించటమైనది. కొన్ని కమ్యూనిస్టు పార్టీలు నిష్క్రమించాయి. మరికొన్ని వాటి పేరు, స్వరూపాన్ని మార్చుకొన్నాయి.

## 18.7. తూర్పు యూరప్‌పై ప్రభావము

తూర్పు యూరప్ దేశాలలో వచ్చిన అభివృద్ధి మనకు వివిధ కోణాలలో కన్పిస్తుంది. ఈ అభివృద్ధి ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. సోవియట్ యూనియన్‌లోవలె తూర్పు యూరప్ దేశాలలో కూడా సంస్కరణలు అధినాయకత్వం చేతనే ప్రారంభించబడినవి. గోర్బచెవ్ సంస్కరణలను అనుకరించడం వలన హంగేరి లాంటి దేశాలలో అధికారాన్ని కోల్పోయింది. తూర్పు జర్మనీ, రుమేనియా లాంటి దేశాలలో గోర్బచెవ్ యొక్క స్వేచ్ఛావాదాన్ని వ్యతిరేకించినందుకు గాను అధికారాన్ని పోగొట్టుకోవాల్సి వచ్చింది. పెల్లుబికిన జాతీయవాదం, బెర్లిన్‌గోడ పతనంవంటి ఈ కారణాలు కూడా అగ్నికి ఆజ్యం పోసాయి. సోవియట్‌యొక్క పరిపాలనా విధానాలకు వ్యతిరేకంగా, కమ్యూనిస్టు పార్టీకి వ్యతిరేకంగా ఇంతకు మునుపే విప్లవాలు చెలరేగాయి. జి.డి.ఆర్.లో 1953లో, 1556లో హంగరీలో 1968లో చెకొస్లవేకియాలోను విప్లవాలు వచ్చాయి. కాని ఆయా దేశాలలో తిష్టవేసియున్న సోవియట్ సైన్యం విప్లవాలను ఉక్కుపాదముతో అణచివేయగలిగినాయి. పోలెండ్‌లో వచ్చిన ఉద్యమం ఇందుకు మరొక ఉదాహరణగా పేర్కొనవచ్చును. సోవియట్‌లో వచ్చిన పునఃనిర్మాణ కార్యక్రమాన్ని ఆసరాగా చేసుకొని కొంతమంది కమ్యూనిస్టు పార్టీ వ్యతిరేకులు కొన్నిచోట్ల హింసా విధానం ద్వారా వారియొక్క లక్ష్యాలను సాధించగలిగినారు.

పెరిస్త్రోయికా తో సంబంధించిన మార్పులు తూర్పు జర్మనీ మొదలగు చోట్ల మేధావుల సదస్సుకు దారితీసింది. వాస్తవానికి ఈ సంస్కరణలు విప్లవాత్మకమైనవి. అంతేగాక మార్పులు రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక పరంగా క్లిష్టమైనవి. చాలామంది విశ్లేషకులు దీనిని కమ్యూనిస్టు సిద్ధాంతాలకు గొడ్డలి పెట్టుగాను, నియంతృత్వ రాజ్యముయొక్క పునాదులు కదిలించేవి గాను భావించారు. మిగతా వారు సామ్యవాద సిద్ధాంతం కనుమరుగైపోతుందని, స్వేచ్ఛా మార్కెట్ మరియు ప్రజాస్వామ్యవాదనికి తొలిమెట్టుగా భావించారు. ఫ్రాన్సిస్ పుకుయామా మాటలలో చెప్పాలంటే దూరదృష్టి లోపించిన ఈ ఆలోచన ప్రచ్ఛన్న యుద్ధానికి ముగింపు పలుకుతుందని తద్వారా చరిత్ర ఉండదని, అరాచకత్వానికి దారితీస్తుందని భావించారు. స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్యం చివరకు సోవియట్‌యొక్క సామ్యవాద సిద్ధాంతముపై విజయం సాధించింది. చరిత్ర గతి ఆర్థిక అంచనాలలో మాత్రమే నిర్దేశింపబడుతుంది. అనంతమైన సాంకేతిక సమస్యల నివారణ, పరిసరాల ప్రభావం సగటు వినియోగదారునియొక్క అవసరాలను తీర్చటం ధ్యేయముగా పెట్టుకొంది.

కమ్యూనిస్టు వ్యతిరేకులు కొంతమంది అసలు సోవియట్ ప్రభుత్వం అనుసరించిన సిద్ధాంతాలు సంస్కరింపబడదగినవేనా అని ప్రశ్నించారు. కొంతమందికి సామ్యవాదం అసంబద్ధమైనదిగా అగుపించింది. కొన్ని దేశాలలొ అధికారులకు అడ్డంకిగా మారింది. కొంతమంది ఆలోచనలో సోవియట్ సామ్రాజ్యంయొక్క మార్పుతోను, బెర్లిన్ గోడ పతనంతోను కొత్త యుగానికి నాంది పలికినట్లయింది. కొంతమంది విశ్లేషకుల పరిశీలనల ప్రకారం కమ్యూనిజం విఫలం కాలేదు. అశోక మిత్ర అనే మార్క్సిట్ మేధావి మాట్లాడుతూ తూర్పు యూరప్‌లో కమ్యూనిజం కొద్దికాలంపాటు వాయిదా వేయబడింది అన్నాడు. సోవియట్‌లో వచ్చిన సంస్కరణలు అస్థిరమైనవి గాను, రాజకీయ సుస్థిరతను దెబ్బతీసేవి గాను కొంతమంది భావించారు. శ్రామికులకు ఈ అసమానతలు రుచించలేదు. ఈ రుగ్మతలు ఇంతకు క్రితమే తూర్పు యూరోపు దేశాలలో కన్పిస్తూనే ఉన్నాయి. ఈ ప్రజాస్వామ్య విప్లవం ఒక మంచి పౌర సమాజాన్ని ఏర్పరుస్తుందని కమ్యూనిజం మానవ స్ఫూర్తితో ఉండగలుగుతుందని కొంతమంది పేర్కొన్నారు. గోర్బచెవ్ సమస్యలను వారు రెండవ విప్లవముగా పరిగణించారు. ఏది ఏమైనప్పటికి దీని ఫలితాలను మార్క్సిస్టువాదులు చాలా సునిశిత దృష్టితో గమనిస్తున్నారు.

## 18.8. భారత్ స్పందన

కాలానుగుణంగా సోవియట్ యూనియన్‌లోను మరియు తూర్పు యూరప్ దేశాలలోను వచ్చిన మార్పులను భారత దేశంలోని అన్ని తరగతుల వారిని ఆలోచింపచేసింది. భారత్‌లోని ప్రసార మాధ్యమాలు దీనికి పెద్దపీట వేశాయి. గోర్బచెవ్ సంస్కరణల వలన 1987-88లో వచ్చిన మార్పులు భారత్ ప్రసార మాధ్యమాలను ఆలోచింపచేశాయి. 1989, 1990 సంవత్సరాలలో ఒక్కరోజు కూడా ఈ సామ్యవాద విషయాలను ప్రచురించకుండా ఉండలేదంటే అతిశయోక్తి కాదు. ఈ విషయంలో మీడియాలో సింహభాగం టెలివిజన్‌దేనని చెప్పవచ్చును. ప్రపంచములో వివిధ కమ్యూనిస్టు దేశాలలో జరిగిన మార్పులను సంఘటనలను, వ్యాఖ్యానాలతో సహా ప్రజలముందు ఉంచగలిగింది. టెలివిజన్ ద్వారానే పార్టీ కేడర్ ఆలోచనా వాదుల, ముఖ్యముగా లెఫ్ట్ పార్టీల వారిని కూడా వారి అభిప్రాయాన్ని కూడా ప్రసారం

చేయగలిగింది. 'ది మెయిన్ స్ట్రీమ్' అను వార పత్రికలో పెరిస్ట్రోయికామీద వాదోపవాదాలను 1988, 1989లలో నిరాఘాటముగా ప్రచురించినది. కమ్యూనిస్టు ఉద్యమకారుల ఆలోచనలను, జర్నలిస్టుల ఆలోచనలను మేధావుల అభిప్రాయాలను ఒక వేదికమీదకు తేగలిగింది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కొద్దిగా ఆటోఇటుగా గోర్బచెవ్ సంస్కరణలకు ఆమోదముద్ర వేసింది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ఒక ఎడిటోరియల్ పెరిస్ట్రోయికా విప్లవాత్మకమైన అభివృద్ధికి చిహ్నమని కొనియాడింది. హిందూస్థాన్ టైమ్స్ రాస్తు ఉద్యోగిస్వామ్య అధికారాన్ని కూకటి వేళ్ళలో సహా పెకలించి నిర్ణయాధికార వికేంద్రీకరణ దిశగా పరిణమించిందని కొనియాడింది. గోర్బచెవ్ సరళీకరణకు నిలువెత్తు నిదర్శనముగా నిలిచారు. సోవియట్ పిలుపుకు విశాల దృక్పథం అపాదింపచేశారు. ఇంకా మిగిలిన ముఖ్య పత్రికలు రాస్తూ సరళీకరణ ప్రజాస్వామ్య దిశగా పరిణిస్తుందని శ్లాఘించారు. 1988 నవంబర్‌లో గోర్బచెవ్ భారత్ సందర్శన సందర్భముగా గతములో స్వదేశములో అతను సాధించిన ఘనతను పేర్కొంటూ 'ది ఎకనమిక్ టైమ్స్' శ్లాఘించింది. సోయవిట్ యూనియన్‌యొక్క ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమవటం మిగతా తూర్పు యూరోప్ దేశాలను పునరాలోచింపచేసిందని మొత్తం సామ్యవాద సిద్ధాంతమే సుడిగుండములో చిక్కుకుందని ప్రజాస్వామీకరణ, స్వేచ్ఛా విపణి మార్కెట్ వ్యవస్థ క్రొత్త ప్రయోగాలకు దారితీసినాయని 'సెమినార్' అను మాస పత్రికలో సంపాదకీయంలో పేర్కొనబడింది.

భారత దేశములో ఉన్న రాజకీయ పార్టీలు ముఖ్యముగా లెఫ్ట్ పార్టీలు సహజంగానే ఈ మార్పులను పరిశీలించాయి. వీరియొక్క స్పందన విషయంలో చెప్పేదానికి చేసేదానికి తేడా కన్పిస్తుంది. కొంతమంది వాటిని అవసరమైనవిగా ఆహ్వానిస్తుంటే మరి కొంతమంది వీటిని మార్క్సిస్టు, లెనినిస్ట్ సిద్ధాంతాలకు విరుద్ధముగా కొట్టిపారేస్తున్నారు. సిద్ధాంత పరముగా అవగాహన దృక్పథంలోను, వైవిధ్యం కన్పిస్తుంది.

ప్రథమముగా కమ్యూనిస్టు పార్టీల స్పందనను గమనించాలి. భారత దేశంలో కమ్యూనిస్టు పార్టీ తొలినుండి ప్రపంచంలోని పార్టీలచే ప్రభావితమవుతూవచ్చింది. ముఖ్యముగా సోవియట్ యూనియన్ ప్రభావం బాగా ఉంది. మాస్కోనుండి వచ్చే సూచనలకు అనుగుణముగా వీరు సిద్ధాంతాలను నిర్దేశిస్తారు. 1994లో, 1967లో ఇండియా కమ్యూనిస్టు ఉద్యమములో వచ్చిన చీలికలు ముఖ్యముగా రష్యా ప్రభావంతోను మరియు చైనా ప్రభావంతోను వచ్చినవే. ప్రథమములో సి.పి.ఐ. మరియు సి.పి.ఐ. యమ్ నాయకులు గోర్బచెవ్ అనుసరించే మార్గాన్ని గురించి గొప్పగా మెచ్చుకొన్నారు. 1986 ఫిబ్రవరి, మార్చిలలో సి.పి.యస్.యు 27వ కాంగ్రెస్‌లో తీసుకున్న నిర్ణయాలను ఇరుపక్షాలు స్వాగతించాయి. ఐతే సి.పి.యస్.యు అనుసరించిన కొన్ని విధానాల విషయంలో సి.పి.ఐ.యమ్. నాయకత్వం భయపడింది. 1988 నుండి విమర్శించటం అధికం చేసింది. ప్రపంచ రాజకీయ పరిస్థితిపై గోర్బచెవ్ చేసిన సిద్ధాంతపరమైన నిర్ణయాలు, విశ్లేషణలను ఇది ఆమోదించలేదు. కొన్ని సమస్యల పరిష్కారానికి సోషలిస్టు దేశాలలో కొన్ని సంస్కరణలు తప్పనిసరి అని భావించినప్పటికి సి.పి.యస్.యు విధానాలు మార్గనిర్దేశం సోషలిస్టు వ్యవస్థ విచ్ఛిన్నానికి దారి తీస్తుందని కమ్యూనిస్టు పార్టీ భావించింది. తూర్పు యూరప్‌లోని సోషలిస్టు దేశాలలోని మార్పులు సోషలిజానికి ఒక ఎదురు దెబ్బ అని భావించింది. శ్రామిక వర్గ ప్రయోజనాలకు ఈ సిద్ధాంతాలు విఘాతమని పేర్కొంటూ, సావియట్ రష్యాలోని పరిణామాలు శ్రామిక వర్గంయొక్క మరియు, పార్టీయొక్క కీలకపాత్రను రక్షించాలని సి.పి.ఐ.యమ్ తన రాజకీయ తీర్మానంలో పేర్కొంది. ఈ పరిణామాలు భారత్‌లోని కమ్యూనిస్టులకు పెద్ద దెబ్బ అని అంగీకరించింది. కొన్ని సోషలిస్టుదేశాలు సామ్యవాద నిర్మాణంలో లెనిన్, మార్క్స్ సిద్ధాంతాలనుండి కొద్దిగా దారి మళ్ళాయని అభిప్రాయపడ్డాయి. ఈ దేశాలలో కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వం రెండు ప్రజాస్వామ్యయుత హక్కులను ఉల్లంఘించి ఉద్యోగస్వామ్య విధానాన్ని అనుసరించాయి. నిత్యావసర వస్తువుల కొరత ఈ దేశాలలో రాజకీయ వ్యవస్థకు ప్రమాదముగా పరిణమించింది. ఈ సమస్యమీద 1990లో జ్యోతిబసు మాట్లాడుతూ మొదటగా ఈ మార్పులు నాకు ఆమోదయోగ్యం కాదు. అయితే తూర్పు యూరప్ అనిశ్చిత పరిస్థితి గురించి మనం ఆలోచించవలసిన సమయం ఆసన్నమైయింది. వాటి నుంచి మనం పాఠాలు నేర్చుకోవాలి అని పేర్కొన్నారు. ఏమైనప్పటికీ మారుతున్న పరిస్థితుల్లో నాయకత్వం తమ బలాన్ని కాపాడుకొని మార్క్స్ ఆలోచనా విధానాన్ని అడ్డుకట్టవేయ గలిగింది.

సోవియట్ రష్యాలోని సంస్కరణలకు సి.పి.ఐ. తేలికగానే ఆమోదముద్ర వేసింది. పెరిస్ట్రోయికా అంతరంగిక వ్యవహారం అని సి.పి.ఐ. తొలుత భావించింది. తరువాత సంస్కరణలకు ఆమోదముద్ర వేసింది. తరువాత దశలో పూర్తి అనుకూలంగా స్పందించింది. వాస్తవానికి గోర్బచెవ్ సంస్కరణలను ఇది ఆహ్వానించింది. సి.పి.యస్.యు. ఆదేశాలకు అనుగుణంగా సోషలిస్టు వ్యవస్థలో మార్పులు చేసి పటిష్టం చేయడాన్ని ఎటువంటి ఇబ్బంది లేకుండా స్వాగతించింది. ఒక అడుగు ముందుకు వేసి తమ పార్టీ వ్యవస్థలో అటువంటి సంస్కరణలు

కావాలి అని సి.పి.ఐ. నాయకులు కోరారు. సోషలిస్టు రాజ్యాల్లో పరిణామాలను గురించి బహిరంగంగా చర్చించడానికి పార్టీ పత్రాలను పంచిపెట్టారు.

భారత కమ్యూనిస్టు ఉద్యమంలో మరోభాగం సి.పి.ఐ. (యమ్.యల్) నక్సలైట్‌లుగా పిలువబడ్డ వీరు సోవియట్ రష్యా తూర్పు యూరప్‌లోని పరిణామాలను గురించి ప్రత్యేక శ్రద్ధ చూపారు. గత మూడు దశాబ్దాలుగా ఆ దేశాల్లో తీసుకు వస్తున్న రివిజనిస్టు విధానాల ఫలితమే నేటి పరిణామాలు అని ఇది భావించింది. ఈ పార్టీ 1968లో స్థాపించబడిన నాటి నుండి సోవియట్ పార్టీ మార్పు కోరుకునేది అని వాటి విధానాలు పెట్టుబడిదారీ వ్యవస్థ పునరుద్ధరణకు మార్గం సుగమం చేస్తుంది అని భావించింది. ఈ పార్టీవారు సోవియట్ యూనియన్‌ను "సోషల్ ఇంపీరియలిస్టిక్" అని తూర్పు యూరప్ దేశాలను 'సాటిలైట్స్ ఆఫ్ సోషల్ ఇంపీరియలిజం' అని ముద్రవేశారు. ఈ దేశాల ప్రజలు కమ్యూనిస్టు సిద్ధాంతలను, వ్యవస్థను తిరస్కరిస్తున్నారు అని అందుకు కారణం పాలక కమ్యూనిస్టు పార్టీలు మార్క్స్ వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ అసమానతల పెంపుకు దోహదము చేస్తు పెట్టుబడిదారి వ్యవస్థవైపు ఆకర్షింపబడునట్లు చేస్తున్నారు అని వీరి అభిప్రాయం. తూర్పు యూరప్, సోవియట్ పరిణామాలు మార్క్స్, ఎంగిల్స్, లెనిన్, మావో సిద్ధాంతాలను సరిగా అర్థం చేసుకొని అవలంభించడానికి కమ్యూనిస్టులకు దోహదం చేస్తాయి అని వారు భావించారు.

సోవియట్, తూర్పు యూరప్ పరిణామాలను ప్రజాస్వామ్య పార్టీలు ఆహ్వానించాయి. ఈ సంస్కరణలు మార్పులు ఆ దేశాల్లో మరింత స్వేచ్ఛకు ప్రజాస్వామ్యానికి దారితీస్తాయి అని భావించారు. భారత రాజ్య వ్యవస్థలో పార్టి నిర్మాణంలో పెరిస్త్రోయికా గ్లాస్‌నాస్త్ అవసరాన్ని గురించి వీరిలో కొందరు తెలియజేశారు. ఇండియా కమ్యూనిష్టులతో విరోధం ఉన్న కాంగ్రెస్ పార్టి సోవియట్ రష్యాను నమ్మకమైన మిత్ర దేశంగా భావించింది. సోవియట్ రష్యా, తూర్పు యూరప్ కమ్యూనిస్టు పార్టి నాయకులతో ఈ పార్టి స్నేహసంబంధాలను కొనసాగించింది. 1987లో రాజీవ్ గాంధీ సోవియట్ యూనియన్ సందర్శన సందర్భంగా మాట్లాడుతూ, సోవియట్ తీసుకొచ్చిన సాహసోపేతమైన మార్పులు మానవ వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయి అని పేర్కొన్నాడు. ఇతడు అధికారంలో ఉండగా ఐదుసార్లు సోవియట్ యూనియన్‌ను దర్శించి గోర్బచెవ్ నూతన విధానాల అభిమానిగా మారాడు.

## 18.9. సమీక్ష

సోవియట్ రష్యాలో ప్రవేశపెట్టబడిన సంస్కరణల్లో స్వేచ్ఛా సమస్య ప్రధానమైనది కాగా, తూర్పు యూరప్‌లో పార్టీ నియంతృత్వం నుంచి ప్రజలు స్వేచ్ఛకావాలి అని వాంఛించడం ప్రధాన సమస్య. సోవియట్ రష్యాలో గోర్బచెవ్ యొక్కయత్నం సంస్కరణలకు ప్రధాన కారణం కాగా, ఇతని విధానం, సిద్ధాంతాల ప్రభావం, అసంతృప్తి చెందిన తూర్పు యూరప్ ప్రజలకు అవసరమైన పరిస్థితులు వాతావరణం కల్పించి వీధులలోకి నెట్టింది. ప్రధానంగా తూర్పు యూరప్‌లో పార్టీ నియంతృత్వానికి వ్యతిరేకతలే ప్రజల అసంతృప్తికి తిరుగుబాటుకు కారణం అయింది. రాజకీయ ఆర్థిక రంగాలను ఆధునీకరించవలసిన అవసరం జీవన స్థితిగతుల్లో అసంతృప్తి, పాశ్చాత్య ప్రచారం ప్రభుత్వ వ్యతిరేక పోరాటాలకు పాశ్చాత్యుల మద్దతు, ఈ పరిణామాలకు దారితీసింది. మరో ప్రధాన సమస్య సోషలిస్ట్ దేశాల్లో భిన్న పార్టీ వ్యవస్థ లేకపోవటం. ప్రతిపక్షం అవసరమే గాని భిన్నపార్టీ వ్యవస్థ అవసరం లేదు అని పెక్కుమంది భావించారు. కమ్యూనిజం సమాజానికి ఒక పెద్ద అవరోధం అని అందువల్లనే దానిని సోషలిస్టు దేశాల ప్రజలు తిరస్కరించారు అని కొందరు భావించగా, ఈ పరిణామాలు సోషలిస్టు వ్యతిరేకమైనవి అని, కీడుచేస్తాయని మరికొందరు భావించారు. సోషలిస్టు దేశాల్లో ప్రజాస్వామ్యం అవసరం అని ఈ సంస్కరణలు, ఆ లక్ష్య సాధనకోసం అని పెక్కుమంది భావించారు. కమ్యూనిజంతోటి పోరులో ఉదారవాద ప్రజాస్వామ్యం తప్పక విజయం సాధిస్తుంది అని దానిని ప్రజలు స్వాగతిస్తారు అని మరికొందరి భావం. వీరి ప్రకారం కమ్యూనిజం అనవసరమైనది కాన దానిని తిరస్కరించాలి. స్వేచ్ఛకోసం ప్రజాస్వామ్యం కోసం ప్రజలు ఎంతగా, అర్రులు చాచారో ఈ మార్పులే తెలియజేస్తాయి. ప్రచ్ఛన్నయుద్ధ ఉద్రిక్తతలను తగ్గించడంవల్లన అందరూ దీనిని స్వాగతించారు. 350 మిలియన్ల ప్రజలతో కూడి 7 సోషలిస్టు దేశాల్లో శీఘ్రగతిని సంస్కరణలు బాహ్య ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తాయి. సంస్కరణల ఫలితంగా తలెత్తిన జాతిపరమైన విద్వేషాలను చల్లార్చడం గోర్బచెవ్‌కు కష్టంలో కూడుకొన్న పని అని ఆర్.సి. దత్. అభిప్రాయపడ్డాడు. జాతిపరమైన సమస్యలు వస్తాయి అని గాని విడిపోవాలి అనే డిమాండ్ వస్తుంది అని గాని గోర్బచెవ్ ఊహించలేదు. అలాగే తన పార్టీలో ముఠాలు వస్తాయి అని ఆలోచించలేదు. అతి తక్కువ కాలంలో ప్రవేశపెట్టబడిన అనేక రకాలైన

సంస్కరణలు సోవియట్ సమాజం జీర్ణించుకొంటుందా లేదా అని విశ్లేషకులు తమ దృష్టిని పూర్తిగా సారించలేదు. సంస్కరణల అనంతరం గోర్బచెవ్ విదేశాంగ విధానాన్ని పరిశీలిస్తే, ప్రచ్ఛన్నయుద్ధ ఉద్రిక్తతలను తగ్గింపజేసి, పరస్పర సహకారంతో ఏకీకృత ప్రపంచ వ్యవస్థకు పూనుకొన్నట్లు తెలుస్తుంది. వాస్తవానికి ఇతడు సిద్ధాంతాలకంటే నైతిక విలువలకు ప్రాముఖ్యం ఇవ్వడానికి ప్రయత్నించాడు.

ఐరోపా చరిత్రలో 1990 దశాబ్దానికి అత్యంత ప్రాముఖ్యం ఉన్నది. ఎందుకంటే ఈ దశాబ్దంలోనే ఐరోపా ఖండంలోని అనేక దేశాల్లో జాతి విద్వేషాలు చెలరేగడము, భౌగోళిక పరిస్థితుల్లో మార్పులు జరగడము, దేశాల ఏకీకరణ ఉమ్మడి కరెన్సీ అవతరణ ప్రయత్నము, దేశాల విచ్ఛిన్నతి, వంటి పలు సంఘటనలు జరిగాయి. అలాగే సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం, తూర్పు యూరప్ దేశాల్లో వామపక్ష ప్రభుత్వాలకు ప్రజాదరణ తగ్గడం వంటివి చోటు చేసుకున్నాయి. థాచరిజం, గోర్బచేవిజం, కోల్‌బ్రాండ్ ప్రజాస్వామ్యం, గాలిజం వంటి నూతన భావాల ఉత్థాన పతనాలకు ఈ దశాబ్దం మౌనసాక్షిగా మిగిలింది. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం తరువాత అమెరికా ప్రాబల్యానికి ఎదురులేదు అనుకుంటున్న తరుణంలో యూరప్‌లోని బ్రిటన్, జర్మని, ఫ్రాన్స్‌లాంటి దేశాలు తమదైన ప్రత్యేక ఒరవడిని సంతరించుకోవాలి అనుకున్నాయి. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, స్వీడన్, ఆస్ట్రియా, ఫిన్‌లాండ్, ఐర్లాండ్, స్పెయిన్, ఇటలీ, డెన్మార్క్, నెదర్లండ్స్, బెల్జియం, లగ్జంబర్గ్, పోర్చుగల్, గ్రీస్ దేశాలు శక్తివంతమైన ఐరోపా అనే నినాదంతో ప్రపంచదేశాల దృష్టిని ఆకర్షించాయి. ఇవి అమెరికా ఆధిపత్యానికి అడ్డుతగలసాగాయి.

1989-1991 సంవత్సరాల్లో మధ్య, తూర్పు యూరప్ దేశాల్లో సామ్యవాద వ్యవస్థ కుప్పకూలి, పెట్టుబడిదారి వ్యవస్థ అవతరించింది. సోవియట్ యూనియన్ పూర్తిగా అంతరించి దాని స్థానంలో 15 స్వతంత్ర రాజ్యాలు ప్రపంచ రాజకీయ పటంలో చేరాయి. విచ్ఛిన్నం కావడానికి ముందు సోవియట్ యూనియన్ అంతర్జాతీయ ఆర్థిక మార్కెట్‌లో చాలా ప్రధాన భూమికను నిర్వహించింది. సోషలిస్టు వ్యవస్థ విచ్ఛిన్నం కావడానికి ముందే 1990 జూలైలో జి-7 దేశాలు, ఐరోపా కమ్యూనిటీలు రష్యాన్ ఆర్థిక వ్యవస్థను అధ్యయనం చేసి మరింత సమర్థమైన సంస్కరణల విధానాన్ని సూచించాలి అని ఐ.యమ్.యఫ్. ను, ఇతర ఐక్యరాజ్యసమితి ఆర్థిక ఏజన్సీలను కోరాయి. దరిమిలా సోషలిస్టు ఆర్థిక వ్యవస్థపై ఒక అధ్యయనం పేరుతో 1990 డిసెంబర్‌లో పరిశీలన జరిపి ఒక నివేదిక విడుదల అయింది. అందులో అంతర్జాతీయ సంస్థలకు, రష్యన్ ప్రభుత్వానికి కొన్ని సిఫార్సులు చేయబడినాయి. అవి : 1) రష్యాలో తక్షణం అన్ని వస్తువులపై ధరల నియంత్రణ విధానాన్ని తొలగించాలి. 2) ప్రజలు పెట్టుబడిదారీ విధానం గురించి ముందుగా తెలుసుకొనేందుకు స్వేచ్ఛా మార్కెట్‌ను ఏర్పాటు చేయాలి. 3) అన్ని ప్రభుత్వ కార్పొరేషన్‌లను వేలం వేయాలి. 4) విదేశీ వాణిజ్యంపై ఉన్న ఆంక్షలను తొలగించాలి. 5) ప్రైవేటు యాజమాన్యం పై ఉన్న ఆంక్షలను తొలగించాలి. పై సిఫార్సుల్లో అనేకం 1996లో అమలు చేయబడినాయి. రష్యాలో 1995లో విదేశీ రుణం మొత్తం 120, 461 మిలియన్ డాలర్లకు పెరిగింది. రూబుల్ విలువ అదఃపాతాళానికి పడిపోయింది. రష్యన్ సమాజం పెట్టుబడిదారి వ్యవస్థగా మారేముందు ఒక అమెరికన్ డాలర్ అధికార విలువ రూబుల్‌లో మూడింట రెండు వంతులు ఉండేది. 1993 నాటికి డాలర్‌కు వేయి రూబులు చెల్లించవలసి వచ్చేది. అదే 1997 నాటికి డాలర్ విలువ 5,919 రూబులుకు చేరింది. వార్షిక ద్రవ్యోల్బణం రేటు 3,50 శాతంగా పెరిగింది. 1980-1990 మధ్యకాలంలో జి.డి.పి.లో సరాసరి అభివృద్ధిరేటు + 1.9 శాతం ఉండగా అది 1990-1995 నాటికి - 9.8 శాతానికి పడిపోయింది. ప్రజల ఆదాయంలో అసమానతలు బాగా పెరిగిపోయాయి. ఆర్థిక వ్యవస్థ సరళీకరణకు అంతవరకు దేశ సాంకేతిక రంగం అభివృద్ధికి స్వావలంభనకు దోహదం చేసిన అనేక ఆధునిక పారిశ్రామిక సంస్థలు పతనం అయిపోయి విచ్ఛిన్నం అయ్యాయి. రష్యాలో వినిమయ వస్తువుల తయారీ పరిశ్రమ మొదలుకొని యంత్రపరికరాలు ఉత్పత్తి అయ్యే పరిశ్రమలదాకా అన్ని పరిశ్రమలలో పనులు స్థంభించి పోయాయి. కార్మికులు ఉపాధి కోల్పోయారు. ప్రజల జీవన ప్రమాణాలు గణనీయంగా దిగజారిపోయాయి. దరిద్ర్యరేఖకు దిగువన నివసించే ప్రజల సంఖ్య క్రమేపి పెరిగింది. రష్యా ప్రజల్లో 10 శాతం మంది కనీస అవసరాల కంటే తక్కువ స్థాయిలో ఆదాయం పొందుతున్నారు అని 1990 దశకం ప్రారంభంలో ప్రపంచ బ్యాంక్ నిపుణుడు జనీ క్లుగ్‌మన్ చెప్పాడు. హంగరీలో కూడా పరిస్థితి ఇలాగే ఉంది. ప్రపంచ బ్యాంక్ వర్గాల ప్రకారం ఇచ్చట దారిద్ర్యరేఖకు దిగువున ఉన్నవారి సంఖ్య 31% ఉన్నది. వ్యక్తి రోజూ తీసుకొనే క్యాలరీల ఆహారం గణనీయంగా తగ్గిపోయింది. యనిసెఫ్ వర్గాల ప్రకారం 1989-1994 మధ్య కాలంలో రష్యాలో తలసరిగ తీసుకొనే క్యాలరీల ఆహారం 2.603 నుంచి 2.47 క్యాలరీలకు పడిపోగా, ఉక్రెయిన్‌లో 3.517 నుంచి 2.895 క్యాలరీలకు, బల్గేరియాలో 3.3 నుంచి 2.7

క్యాలరీలకు హాంగరీలో 3.5 నుంచి 3.1 క్యాలరీలకు స్లొవేకియాలో 3.2 నుంచి 3.1 క్యాలరీలకు పడిపోయింది. రష్యాలో ఉక్రెయిన్ మొదలగు దేశాల్లో ఉద్యోగ హక్కు కొనసాగుచున్నప్పటికీ వేతనాలు సక్రమంగా అందలేదు. పూర్వపు సోషలిస్టు దేశాల్లో మరణాల రేటు విపరీతంగా పెరిగిపోయింది.

నిరుద్యోగం, పేదరికం లాంటి అవలక్షణాలే కాకుండా శాంతిభద్రతల పరిస్థితి దిగజారిపోయింది. ప్రజారోగ్య వ్యవస్థ దెబ్బతింది. కార్మిక రక్షణ సమస్య తలెత్తింది. రష్యా, ఉక్రెయిన్‌లలో ప్రజలు జీవనం సాగించడం కొసం నేరాలకు పాల్పడ్డారు. రష్యాలో 1990లో 73వేలమంది చనిపోగా అది 1993 నాటికి 5,45,000 కు చేరింది. ఉక్రెయిన్‌లో 1990లో 28,800 మంది మరణించగా 1993 నాటికి 1,29,700కు చేరింది. ప్రపంచీకరణను పాటించిన పూర్వపు సోషలిస్టు దేశాలుఅన్నీ సమస్యల సుడిగుండంలో చిక్కుకున్నాయి. ఎందుకంటే అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో ప్రధాన భూమిక వహించి తృతీయ ప్రపంచ దేశాలకూ ఎనలేని సహాయ సహకారాలు అందించిన ఒకనాటి సోవియట్ రష్యా నేడు మనుగడ కోసం అంతర్జాతీయ ఏజన్సీలపై ఆధారపడుతున్నది. ఇతర పూర్వపు సోషలిస్టు దేశాల పరిస్థితి కూడా ఇట్లాగే ఉన్నది. అన్ని ఆర్థిక సమస్యలకు పరిష్కారం కేవలం ప్రపంచీకరణ మాత్రమేననీ నమ్మింపజేస్తున్న వారికి పూర్వపు సోషలిస్టు దేశాల అనుభవం ఒక గుణపాఠం కావాలి.

1991లో సోవియట్ యూనియన్ పతనం తరువాత ఏర్పడిన స్వతంత్ర రాజ్యాల్లో రష్యాయే అతిపెద్దది. జనాభా రీత్యా ప్రపంచంలో 5వ పెద్ద దేశం కాని ఆర్థికాభివృద్ధి, తలసరి ఆదాయం, జీవన ప్రమాణాలపరంగా రష్యా నేడు ప్రపంచ రాజ్యాలన్నిటికంటే తక్కువ స్థాయిలో ఉన్నది. పెరిస్ట్రోయికా గ్లోస్‌నాస్త్‌ల పేరుతో రష్యన్‌లకు వ్యక్తిగత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ప్రసాదించే లక్ష్యంతో గోర్బచెవ్ కమ్యూనిజం మరణానికీ సోవియట్ యూనియన్ రద్దుకు స్వయంగా చొరవ తీసుకున్నాడు. పెట్టుబడిదారీ మార్కెట్ శక్తులకు ఊతం ఇచ్చిన ప్రయత్నంలో అతడు ఎల్సిన్ చేతుల్లో భంగపడి పదవీచ్యుతుడైనాడు

1992 జనవరినుండి ఎల్సిన్ అధికారంలో ఉంటూ రష్యా పాలన వ్యవస్థలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని పొందేందుకు, ప్రజల యొక్క శ్రేయస్సుకై కృషిచేసే ఏకైక వ్యక్తిగా అమెరికా వంటి అగ్రరాజ్యాల గుర్తింపుకై వాటి ఆర్థిక సహాయానికై అర్రులు చాచాడు. 1993లో రష్యాకు ఒక నూతన రాజ్యాంగాన్ని ప్రకటించి అధికారాలన్నిటినీ అధ్యక్షునికీ సంక్రమింపజేసే ఏర్పాట్లు చేశాడు. ప్రైవేటీకరణ, భౌగోళికీకరణ, ప్రపంచీకరణ సరళీకరణ వంటి విధానాలు అమెరికా ప్రోద్భలంతో అనుసరించి దేశ ప్రజలను వంచించాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ వైపుకు ఒకేసారి రష్యన్ ఆర్థిక వ్యవస్థను మళ్లించే దిశలో మౌలిక సదుపాయాలు, వ్యవస్థలను ముందుగా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది అనే విషయాన్ని విస్మరించాడు. ఎల్సిన్‌యొక్క స్వార్థపూరిత అహంకార ధోరణులచే సామాన్య ప్రజలు విసిగిపోయారు. నిత్యావసర వస్తువుల ఉత్పత్తి గణనీయంగా తగ్గి ధరలు వింగికెగిసాయి. ఆర్థిక సంస్కరణల వేగం తగ్గి ప్రతికూల ఫలితాలు ఇవ్వసాగాయి. ఆర్థిక సంక్షోభానికీ, రాజకీయ సంక్షోభం కూడా తోడై రష్యాలో ప్రభుత్వం అనేది లేకుండా పోయింది.

## References :


1. Hemitt, Ed., Reforming the Soviet Economy : Equality versus Efficiency, Washington, 1988.
2. Mikhail Gorbachev, October and Perestroika, The Revolution Continues, Moscow, 1987.
3. Rammath Narayanaswamy, Soviet Union : Restructuring Socialist Ownership, Economic and Political Weekly, Vol. 24, No. 18.
4. Braun, Awrel and Day, Richard B., Gorbachevian Controdictions, Problems of communison, Vol. 39, 1990.

5. Michail Gorbachev, The success of Perestroika is in the hands of the people, Moscow, 1988.
6. Saral Patra (ed), Socialist world : Trends and Perspectives, New Delhi, 1989.
7. Nirmal Bose, East Europe in Tumoil : Its Nature and Fallout, Indian Journal of Political Science, Vol. 51, No. 3, 1990.
8. Francis Fukuyama, The End of History, The National Interest, No. 16, Summer, 1989.
9. Asok Mitra, Perestroika and After, Sept. 1990
10. R.C. Dutt, Socialism in Transition - Role of the Soviet Union in V.D. Chopra (eds), Socio-Economic Reforms in the USSR, Patriot Publishers, New Delhi, 1989.
11. Sen Gupta, in the Statesman, New Delhi, Nov. 12, 1988.
12. Chandram and Satyam, Developments in East Europe, some lessons, Guntur, 1990
13. A.G. Noorani, Will Indian Communists Rethink, The Indian Express, Dec. 25, 1990.
14. The Times of India, Editorial, Bombay, Nov. 4, 1988.
15. The Economic Times, Editorial, Nov. 22, 1988
16. The Hindustan Times, Editorial, Bombay, Jan. 2, 1987.

**Dr. V.K. Mohan**

(కత్తిరించి పంపవలెను)

## అధ్యాపకుల, విద్యార్థుల సలహాలు, సూచనలు :

అధ్యాపకులు, విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌కు సంబంధించిన సలహాలు, సూచనలు, ముద్రణ దోషాలు తెలియపరచినచో, పునర్ముద్రణలో తగు చర్యలు తీసుకొనగలము. తెలియపరచవలసిన చిరునామా : డిప్యూటీ డైరెక్టర్, దూరవిద్యా కేంద్రం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్ - 522 510.

| **Course** | **Year** | **Paper No. & Title** |
| --- | --- | --- |
| M.A. History | IInd Year | Paper - IV : History of Contemporary World |

(కత్తిరించి పంపవలెను)